ఎమెస్కో

తిరుమల చరితామృతం



అదివో అల్లదివో
శ్రీహరివాసము
పదివేలు శేషుల
పడగల మయము

పి.వి.ఆర్.కె. ప్రసాద్

బ్రహ్మోత్సవాలలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాసుడు



1950 కి ముందు తిరుమలకు మెట్లదారి, బస్సుల ఘాట్‌రోడ్ ప్రవేశద్వారం



కపిలేశ్వరుడి పాదాలు కడుగుతున్న జలపాతం



1980 కి ముందుండే క్యూ షెడ్లు, భక్తుల నిరీక్షణలు

1980 దశకంలో వచ్చిన ఆధునిక 'వైకుంఠం' క్యూ కాంప్లెక్స్


TIRUPATI LIVE DARSHAN

షెల్టర్లు కట్టక ముందు మెట్లదారి



విమాన వేంకటేశ్వరుడు - ఇదిగో ఇక్కడ!

ఒక అన్నమయ్య శకం ఆరంభానికి కారణమైన తాళపత్రాల భాండాగారం

బ్రహ్మోత్సవాలలో భక్తుల భక్త్యావేశాలు

కూల్చివేతకు ముందు వెయ్యికాళ్ల మంటపం ఇలా ఉండేది



వెయ్యికాళ్ల మంటపం కూల్చి వేశాక ఆలయం ముందు ఇలా కనిపిస్తోంది



స్వర్ణ కవచం లేనప్పుడు 'ఆనందనిలయం' ఇలా కనిపిస్తుంది

‘తిరుపతి లడ్డు’ తయారయ్యేది ఇలాగే...



షెల్టర్లు కట్టకముందు మోకాలి మెట్లపై భక్తులు

శ్రీవారి నిత్యాన్నదాన ప్రసాదాన్ని ఆరగిస్తున్న భక్తులు

ప్రపంచంలో రెండవ ఏకరాతి శిలాతోరణం - తిరుమలలో

తిరుమల చరితామృతం

పి.వి.ఆర్.కె. ప్రసాద్

ఎమెస్కో

Tirumala Charitaamrutam

P.V.R.K. Prasad
pvrkprasadias@yahoo.co.in

తిరుమల చరితామృతం

పి.వి.ఆర్.కె. ప్రసాద్

ఎడిటర్ : **జి. వల్లీశ్వర్**

ప్రథమ ముద్రణ : ఆగస్టు, 2013
పంచమ ముద్రణ : **జూలై, 2020**

మూల్యం: రూ. **400/-**

ISBN : 978-93-90091-30-0

టైటిల్ డిజైన్: **జి. పురుషోత్త్ కుమార్**

ప్రింటర్స్: **రైతునేస్తం ప్రెస్**, హైదరాబాద్.

ప్రచురణ
ఎమెస్కో బుక్స్
1-2-7, బానూకాలనీ,
గగన్‌మహల్ రోడ్, దోమలగూడ,
హైదరాబాద్-500029, తెలంగాణ.
e-mail : emescobooks@yahoo.com,
www.emescobooks.com

బ్రాంచ్ ఆఫీసు
ఎమెస్కో బుక్స్
33-22-2, చంద్రం బిల్డింగ్స్
సి.ఆర్. రోడ్, చుట్టుగుంట
విజయవాడ-520004, ఆంధ్రప్రదేశ్.
ఫోన్ : 0866-2436643
e-mail : emescovja@gmail.com

అర్పణ

కలియుగ దైవం

శ్రీశ్రీనివాసునికి

భక్తితో..



స్వరూపోద్ధారక గురువు
శ్రీ సత్య ప్రమోద తీర్థస్వామీజీ
(ఉత్తరాదిమఠం)



ఉత్తరాదిమఠ పీఠాధిపతి
శ్రీ సత్యాత్మ తీర్థ స్వామీజీ

ॐ

SRI DIGVIJAYARAMO VIJAYATE

SRIMAJJAGADGURU MADHWACHARYA MOOLAMAHASAMSTHANA

UTTARADI MATH

Head Office :
HALBHAVI PLOT, 2nd Cross,
Kalyana Nagar, (Behind Railway Station)
DHARWAD - 580 007. Ph. : 447708

Correspondence Office :
5th Cross, Shankarpuram,
Basavanagudi, BANGALORE-560004.
Phone : 6678726

Camp : BANGALORE.

Date : 28-08-2013

అనుగ్రహ సందేశం

జగద్గురు శ్రీమన్మధ్వాచార్య మహాసంస్థాన ఉత్తారాదిమఠాధీశులైన మా స్వరూపోద్ధారక గురువులైన శ్రీశ్రీ 1008 శ్రీ సత్యప్రమోద తీర్థ శ్రీపాదుల వారికి ప్రియశిష్యుడు శ్రీ పి.వి.ఆర్.కె.ప్రసాద్.

ఈయన తిరుమల-తిరుపతి దేవస్థానాల కార్యనిర్వహణాధికారిగా శ్రీనివాసుని (తిమ్మప్ప) భక్తులకు విశేష సౌకర్యాలు చేసి, స్వామి వారికి ఉత్తమ సేవలందించారు.

భగవంతుని పూజా కైంకర్యాల విషయంలో, భక్తులకు దర్శనం, ఇతర సౌకర్యాలు కలిగించే విషయంలో అత్యంత శ్రద్ధ తీసుకోవడమే కాక, దాససాహిత్య ప్రాజెక్టు స్థాపించటం లాంటి ఎన్నో ధార్మిక కార్యక్రమాలు ప్రారంభించి, ఎన్నో ధార్మిక గ్రంథాల ప్రచురణకు శ్రీకారం చుట్టి ధర్మప్రచారానికి ఎనలేని సేవ చేశారు.

ఇవేకాక, తన సొంత జీవితంలో తాను అనుభవించిన శ్రీనివాసుని అద్భుత మాహాత్మ్యాలను 'నాహంకర్తా' అన్న గ్రంథంలో రాశారు. ఈనాటికీ ఈ రచన శ్రీనివాసుని అశేష భక్త జనావళికి ఉత్తేజాన్నిస్తోంది.

తర్వాత, వేంకటేశ్వర దేవుని మహిమలు తెలిపే పౌరాణిక గాథలను 12 వేర్వేరు పురాణాల నుండి సంగ్రహించి వేంకటాచల మాహాత్మ్యాన్ని తెలిపే '**తిరుమల లీలామృతం**' అనే పుస్తకం రచించి ప్రచురించారు.

ఇప్పుడు శ్రీవేంకటాచల దేవస్థానాల చరిత్రను తెలిపే 'తిరుమల చరితామృతం' అనే రచన చేశారు. ఈ పుస్తకంలో "తిరుమలలోని మూల విరాట్ శ్రీమహావిష్ణువుదా, లేక మరే ఇతర దైవానిదా?" వంటి అనేక సందేహాలకు సమాధానం లభిస్తుంది.

ఇంతేకాక, తిరుమల తిరుపతి దేవస్థానం ద్వారా జరుగుతున్న ధర్మప్రచార కార్యక్రమం వంటి అనేక ఇతర అంశాలను గురించి కూడా సవివరంగా ఇందులో రాయబడింది. ఇంతటి విశిష్టమైన రచనను శ్రీప్రసాద్ ఆ తిరుమల శ్రీనివాసుడికే అర్పణ చేశారు.

శ్రీ పి.వి.ఆర్.కె. ప్రసాద్‌కి పుష్కలంగా జ్ఞాన, భక్తి, వైరాగ్యాలు లభించాలని మా ఆరాధ్యదైవమైన శ్రీ మూలసీతాసమేత శ్రీమూలరామ-దిగ్విజయరామ - వేదవ్యాస - వంశరామ - ప్రసన్న విఠల దైవాన్ని ప్రార్థిస్తున్నాము.



మాటల్లో వ్యక్తం చేయలేను...!!

'తిరుమల చరితామృతం' శీర్షికన నేను రాసిన వ్యాసాలకు పఠనాసక్తి పెంచేలా మెరుగులు దిద్దిన ఆత్మీయుడు, 'ఆంధ్రప్రదేశ్' మాసపత్రిక సంపాదకుడు జి.వల్లీశ్వర్‌కి...

'స్వాతి' వారపత్రికలో రెండు సంవత్సరాల పాటు ఈ శీర్షిక క్రింద నా వ్యాసాలను ప్రచురించిన సంపాదకుడు వేమూరి బలరామ్ గారికి...

చరిత్రపరంగా గణాంక దోషాలుంటే వెంటవెంటనే నా దృష్టికి తెస్తూ, సహాయపడిన చరిత్ర ప్రొఫెసర్ కామేశ్వరరావు గారికి...

గతంలో నేను రాసిన 'నాహంకర్తా...' (సర్వసంభవామ్) వ్యాసాలను, 'అసలేం జరిగిందంటే...' వ్యాసాలను, 'తిరుమల లీలామృతం' వ్యాసాలను ప్రచురించినట్లే, ఇప్పుడీ 'తిరుమల చరితామృతం' కూడా ప్రచురించేందుకు చొరవ తీసుకున్న 'ఎమెస్కో' అధినేత దూపాటి విజయకుమార్ గారికి...

కొన్ని అంశాలలో నాకు సందేహనివృత్తి చేయటంలో సహాయపడిన వి.ఏ.కె. రంగారావు (చెన్నై) గారికి...

రచన స్థాయి నుంచి ప్రచురణ వరకూ వివిధ స్థాయిలలో అవసరమైన సహాయ సహకారాలు అందిస్తూ వచ్చిన చి॥ మేడూరి రవికిరణ్‌కీ...

అమెరికాలో నేనీ రచనావ్యాసంగంలో మునిగి వున్నప్పుడు నన్ను భరించిన నా భార్య శ్రీమతి గోపిక, పిల్లలు మాధవి, సంజీవ్‌ల కుటుంబాలకు...

మాటల్లో వ్యక్తం చేయలేనన్ని ధన్యవాదాలు తెలుపుకొంటున్నాను.

(పి.వి.ఆర్.కె. ప్రసాద్)

ముందుమాట

'**అ**సలేం జరిగిందంటే' శీర్షికన అసిస్టెంట్ కలెక్టర్ ట్రైనింగు నుంచి ప్రధానమంత్రి కార్యాలయంలో నిర్వహించిన కీలక పాత్ర వరకూ నేను చూసిన, పాల్గొన్న అనేక చరిత్రాత్మక సంఘటనల గురించి రాసిన వ్యాసాలను చదివిన వాళ్లకి నేను అకస్మాత్తుగా 'తిరుమల లీలామృతం' (ద్వాదశ పురాణాలలో తిరుమల ప్రస్తావన విషయాల సమాహారం), 'తిరుమల చరితామృతం' రాయటం విచిత్రంగా అనిపించి ఉండవచ్చు.

పైగా నేను తిరుమల-తిరుపతి దేవస్థానాలకు ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా పనిచేసింది 1978-82 కాలంలో. అంటే 30 ఏళ్లు గడిచిపోయాయి. 'ఇప్పుడెందుకు ఈ రచనలు చేశారు?' అని సందేహం కలగడం సహజం. ప్రభుత్వంలో సుమారు 35 ఏళ్లు పనిచేసి, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి హోదాలో పదవీ విరమణ చేశాక, ఆరు సంవత్సరాల పాటు తి.తి.దేవస్థానాలకు సలహాదారుగాను, మరికొన్ని ఇతర బాధ్యతలలోనూ పనిచేయటం జరిగింది.

వెయ్యికాళ్ల మండపం కూల్చివేత, దేవస్థానాల నగల భద్రత, పాత నగలకు జవాబుదారీతనం, స్వామివారి కళ్యాణాల నిర్వహణ స్థలం మార్పిడి గురించిన వివాదం, మరో ప్రాకారం నిర్మాణ వివాదం... ఇలాంటి అనేకాంశాలను నేను అధ్యయనం చేసే అవకాశం లభించింది.

నిజానికి ఈ అంశాలలో చాలా వాటికి గతంలో - అంటే కొన్ని దశాబ్దాల క్రితమే పాలకవర్గాలు తీసుకున్న నిర్ణయాలు ఇప్పటికీ ఆచరణ యోగ్యమే. అయినా ఎందుకు ఈ వివాదాలకు అవకాశం ఏర్పడుతోందంటే ఇప్పటి పాలకవర్గాలకి గానీ, అధికారులకి గానీ ఆ నిర్ణయాల గురించి, ప్రామాణికమైన (రికార్డులలో పొందుపరచ బడిన) విధానాల గురించి తగిన అవగాహన లేకపోవటం వల్ల.

చరిత్రకారులు ఈ దేవాలయం గురించి చరిత్రలో ఏముందో చెప్పగలరు. పుస్తకాలు కూడా రాసి వున్నారు.

కాని, దేవస్థానాల వివిధ నిర్వహణ అంశాలకు సంబంధించి ఎప్పుడెప్పుడు ఎలాంటి నిర్ణయాలను ఆలయ నిర్వాహకులు తీసుకున్నారు? వాటికి గల కారణాలు, లేదా వాటి వెనకాల స్ఫూర్తి ఏమిటి? ఆలయ నిర్వహణలో - ఆగమశాస్త్రం ఏమని చెపుతోంది? పాలనాసౌలభ్య సూత్రాలు ఏం చెబుతాయి? భక్తులు దర్శనాల విషయంలో గాని, ఆర్జితసేవల విషయంలో గాని ఎలాంటి సదుపాయాలు ఆశిస్తున్నారు? ఆ దిశగా ఏం చేయగలం?... ఇలాంటి విషయాలు చరిత్రగ్రంథాలలో లభించేవి కావు.

ఈ కారణంగానే నేను ఈ రచన చేసే సాహసం చేశాను.

చరిత్రలో అనేకమంది రాజులు, సామంతరాజులు, ఆర్కాటు నవాబులు, ఈస్టిండియా కంపెనీవారు, బ్రిటిష ప్రభుత్వంవారు, మహంతులు ఈ ఆలయవ్యవస్థని నిర్వహించే ప్రయత్నం ఎలా చేస్తూ వచ్చారు? ఆలయ వ్యవస్థ లక్ష్యం ఏమిటో (హిందూ ధర్మ ప్రచారం, భక్తి ప్రబోధం వగైరా) వాళ్లు ఎలా అర్థం చేసుకున్నారు? ఏ మేరకు వాళ్లు ఆలయ వ్యవస్థ స్ఫూర్తికి లోబడి ఎలాంటి సువిధానాలను ప్రవేశపెట్టారు? అవన్నీ ఇవాళ ఏమైనాయి?

రాజకుమారి సమవాయి కాలం నుండి, అంటే వేయి సంవత్సరాల ముందుకాలం నుండీ, స్వామికి, ఆలయానికి సమర్పించబడిన ఆభరణాలూ, కానుకలూ, మడులూ, మాన్యాలూ ఉన్నాయా? లేకపోతే ఏమైనాయి? ముఖ్యంగా విజయనగర రాజుల కాలంలో ఆలయానికి వచ్చిన నగలు ఇప్పుడు వున్నాయా? లేకపోతే ఎప్పుడు పోయాయి? ఆలయం హుండీలో భక్తులు వేసే నగలు ఎంత భద్రం... వంటి విషయాలను అధ్యయనం చేసే అవకాశం నాకు వచ్చింది. ఆ వివరాలు కూడా ఇందులో పొందుపరిచాను.

తరతరాలుగా, పురాణకాలం నుండీ ఆధ్యాత్మిక సాధనకు నిలయమైన ఈ కర్మభూమిని భోగభూమిగా మారుస్తున్నామా? ఇప్పుడైనా తిరుమల ఆలయ వ్యవస్థ స్ఫూర్తికి అనుగుణంగా భక్తుల మనోభావాలకు తగిన విధంగా పాలనాసౌలభ్యం దెబ్బ తినకుండా ఆలయాన్ని, ఆలయాన్ని అంటిపెట్టుకుని ఉన్న వివిధ పథకాలు, సేవలు, కార్యక్రమాలని మెరుగు పరచాలంటే ఏం చేయాలి? ఎలా చేయాలి?

...ఈ దిశగా ఆలోచించి ఈ ప్రయత్నం చేశాను. ఇందుకోసం అనేక పాత రికార్డులను, దస్త్రాలను, గ్రంథాలను కూడా నేను అధ్యయనం చేశాను. సామాన్యభక్తులకు అవసరం అని నేననుకున్నమేరకు చరిత్ర విషయాలు వివరించాను. నా రచనే సమగ్రమైనదని నేను భావించటం లేదు. కాని, నాకున్న పరిజ్ఞానంతో ఒక దిశా నిర్దేశం చేసే ప్రయత్నమే ఈ **'తిరుమల చరితామృతం'**. ఇది ప్రభుత్వానికీ, పాలకవర్గానికీ, అధికారులకూ, కొన్ని అంశాలలో భక్తులకూ కూడా మార్గదర్శకంగా వుండాలన్నది నా ఆకాంక్ష.

మీ శ్రీనివాసదాసుడు

పి వి ఆర్ కె ప్రసాద్

(పి.వి.ఆర్.కె. ప్రసాద్)

తిరుమల చరిత్రపై ఇది సమగ్ర గ్రంథం

కలియుగంలో శ్రీవేంకటేశ్వరస్వామిని మించిన దైవం లేదని పండితులు చెబుతుంటారు.

ఈ దైవం వెలిసింది - తిరుమల కొండల్లో.

ఈ దైవం ఉనికి మొదటిసారిగా ప్రపంచానికి తెలిసింది పదవశతాబ్దంలో కాని, అనేక చారిత్రిక ఆధారాల ప్రకారం క్రీ.పూ. మూడవ శతాబ్దం నుంచి తిరుమల కొండపై ఈ స్వామికి సేవలు జరిగేవి.

ఆనాటి నుంచి ఈనాటివరకు తిరుమలేశుడి ఆలయం, సేవలు, సదుపాయాలు, రాజకీయాల ప్రభావం, వివాదాలు, పాలకులముందు పంచాయతీలు, ఆదాయంపై అంతర్యుద్ధాలు, ఆలయవాస్తు, శిల్పకళ, రామానుజాచార్యులవంటి కారణజన్ములు చేసిన ఏర్పాటు, సుల్తాన్‌ల పాలనలోఆలయం నడిచిన తీరు, బ్రిటీష్ పాలనలో ఆలయ మనుగడ.... ఇలాంటి అనేక కోణాలలో తిరుమల ఆలయ చరిత్రని నిశితంగా అధ్యయనం చేసి, తిరుమల తిరుపతి దేవస్థానాల ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (1978-82) శ్రీ పి.వి.ఆర్. కె.ప్రసాద్, IAS(రి)., 2013లో రచించిన సమగ్ర గ్రంథం ఈ 'తిరుమల చరితామృతం'.

కొన్ని దశాబ్దాల క్రితం -

తమిళంలో, ఆంగ్లంలో, ఇతర భాషలలో కొందరు పరిశోధకులు రాసిన గ్రంథాలను, బ్రిటీషు కాలం నాటి గెజిటీర్‌లను (అధికారిక చరిత్రపత్రాలు), అనేక శాసనాలను విస్తృతంగా అధ్యయనం చేసి పత్రి వేంకట రామకృష్ణ ప్రసాద్ ఈ గ్రంథాన్ని రచించారు.

ఈ గ్రంథం మన చరిత్రకి శ్రీనివాసుడి ఉనికి తెలిసిన నాటి నుంచి ఈనాటివరకు శ్రీనివాసుడి ఆలయాన్ని అంటిపెట్టుకుని నడుస్తూ వచ్చిన అన్ని అంశాలను విస్తృతంగా ప్రస్తావించి, సామాన్య ప్రజలలో కలిగే అనేక ప్రశ్నలు, సందేహాలకు సమాధానాలు కూడా ఇచ్చింది. కొందరు చరిత్రకారుల కుశంకలను త్రిప్పికొడుతూ వాస్తవాల్ని బయటికి తెచ్చింది.

అందుకే, తిరుమలచరిత్రమీద ఇది ఒక్కటే - ఇప్పటికి - సమగ్ర గ్రంథం. 2017 ఆగష్టులో ప్రసాద్‌గారు కాలం చేసినా, ఇప్పటికీ ఈ **'తిరుమల చరితామృతం'** గ్రంథాన్ని ఖండఖండాతరాల్లో తెలుగువారు సేకరించడం - ఈ గ్రంథ ప్రాశస్త్యానికి అద్దం పడుతుంది.

ఈ గ్రంథాన్ని సుసంపన్నం చేయటంలో ప్రసాద్‌గారితో కలిసిపనిచేయటం నా అదృష్టం.

- జి.వల్లీశ్వర్
సీనియర్ పాత్రికేయులు, రచయిత
9440446444

విషయసూచిక

1.	తొండమానుడు కట్టించింది కాదు!	....	1
2.	శంఖచక్రాలు ఎప్పుడు వచ్చాయంటే...	....	10
3.	ఆ కుమారుడే ఈ శ్రీనివాసుడా?	....	14
4.	శివుడు, కాదు విష్ణువు, కాదు...	....	18
5.	శరవణుడే అయితే ఆయుధాలు ఏవీ?	....	24
6.	శివుణ్ణి పూజించే బిల్వపత్రాలతో శ్రీనివాసుడికి పూజలా?	....	30
7.	విష్ణువైతే, నాగాభరణాలెలా వున్నాయి?	....	33
8.	శ్రీనివాసుడి కళ్లకి కాటుక!	....	40
9.	ఇంతకీ తిరుమల విగ్రహం విష్ణువుదా? శివునిదా? కుమారస్వామిదా?	....	45
10.	తిరుమలకు నాంది	....	52
11.	అసలు మోకాళ్లమీదే ఎక్కాలా?	....	55
12.	కొండమీద బావుల రహస్యం	....	58
13.	బాణంతో కొండకి రంధ్రం	....	60
14.	తిరుమలలో పూలు ధరించరాదు	....	62
15.	బంగారు బావి	....	64
16.	నిద్రపోని చింత చెట్టు – సంపంగి చెట్టు	....	67
17.	మొండిగోపురం కూల్చి తప్పు చేశానా?	....	69
18.	అదే శ్రీనివాసుని కొట్టిన గునపం!	....	73
19.	అప్పటి విజిలెన్స్ వ్యవస్థ ఇలా కుప్పకూలింది!	....	76
20.	ఒక గొప్ప వ్యవస్థ – నీరు గారిపోయింది	....	82
21.	తిరుమల ఆలయంలో రామానుజుల విగ్రహం	....	84

22.	తిరుమల ఆలయనిర్మాణం	....	86
23.	ఆళ్వారులు – తిరుమల ఆలయం	....	92
24.	వైష్ణవక్షేత్రంలో పెద్ద శివాలయం	....	100
25.	దీపాలు తగ్గించి, నూనె తాగేశారు!	....	107
26.	గంగాళం హుండీ	....	123
27.	స్వామివారి కొలువు ఆస్థానం	....	127
28.	యోగనరసింహస్వామి	....	132
29.	తిరుమలలో తమిళ ప్రబంధాలు	....	134
30.	తిరుమలేశుడి అసలు రూపం	....	140
31.	శ్రీనివాసుని గుళ్లో సీతారాములు!	....	147
32.	ఆలయం ఎలాంటిది?	....	149
33.	సుప్రభాతంలో తెర వెనకాల ఏం చేస్తారు?	....	152
34.	హక్కులకోసం 150 సంవత్సరాల పోరు	....	156
35.	అలా స్వామివారిని నిద్రపుచ్చుతారు	....	161
36.	శ్రీవారి అభిషేకసేవలో విచిత్రం!	....	163
37.	సానులు హారతిస్తేనే స్వామి కదిలేది!	....	168
38.	విజయనగర రాజులు – స్వర్ణయుగ ఆరంభం	....	175
39.	జియ్యర్ల నియామకంలోని మర్మం	....	182
40.	రహస్యంగా తిరుమలకొచ్చిన రంగనాథుడు	....	184
41.	పల్లెల్లోకి శ్రీవైష్ణవం	....	189
42.	గుడిమాన్యాన్ని కాపాడిన 'సుదర్శనచక్రం'	....	194
43.	తన గ్రామాల్ని తనే బాగుచేసుకున్న తిరుమలేశుడు!	....	198
44.	108 నుండి 12 కి దిగిన 'పాలన'	....	200
45.	తిరుమలలో ప్రసాదాలు	....	203
46.	ప్రసాదాలతో 'భక్తివ్యాపారం'	....	205
47.	తిరుమల కొండమీద స్థలం కొనుక్కోవచ్చు!	....	210
48.	ఐదు శతాబ్దాలు గడిచినా, అతనే ఆదర్శం	....	215

49.	అసలు తొమ్మిది బ్రహ్మోత్సవాలు జరిగేవి	....	220
50.	కృష్ణదేవరాయల కొడుకుపేరు తిరుమలరాయ!	....	225
51.	దుష్టగ్రహకూటమిలో రాజ్యం దానం	....	230
52.	భక్తుల కోసం గజ్జె కట్టిన ముద్దుకుప్పాయి	....	237
53.	ఆ కీర్తనలన్నీ అన్నమయ్య రాయలేదా?	....	242
54.	అలమేలు మంగ వంశీయులు పద్మశాలీలు!	....	248
55.	ఆలయమే ఆళ్వారు అయితే...	....	254
56.	వందల ఏళ్లు నిలిచిన ధ్వజస్తంభం	....	261
57.	విజయనగర పతనం – తిరుమలకు గ్రహణం	....	265
58.	దేవుణ్ణి తిట్టిపోసిన మహాభక్తుడు!	....	271
59.	సైనిక, రాజకీయ కేంద్రం తిరుపతి	....	277
60.	తిరుమల గుడిపై తురుష్కుల దాడి జరగలేదు!	....	283
61.	కొండ ఎక్కాలంటే, పన్ను కట్టాలి!	....	290
62.	శ్రీనివాసుణ్ణి 'తాకట్టుపెట్టిన' నవాబు	....	295
63.	ఆనంద రంగపిళ్ళై డైరీ	....	298
64.	స్వామి 'చేజారిన' వందలాది గ్రామాలు	....	302
65.	స్వామివారి వంటిమీద నగలే మిగిలాయి!	....	314
66.	ఈస్టిండియా కంపెనీ – హిందూమతపు 'దయ్యం'	....	320
67.	కంపెనీ వదిలేసిన 'బంగారు బాతులు'!	....	333
68.	కంపెనీ వదిలితే బాధ్యత ఎవరికివ్వాలి?	....	337
69.	ధ్వజస్తంభం కింద గుప్తనిధులు! జైలుకెళ్లిన మహంతు	....	345
70.	1933 నాడున్న నగలకే జవాబుదారీ!	....	353
71.	తిరుమలలో బ్రిటిషు కుతంత్రం	....	360
72.	వెంగమాంబ పట్టుకున్న పీతాంబరం చెప్పిన రహస్యం	....	367
73.	స్వామి అలంకారాన్ని వర్ణించిన అంధభక్తుడు	....	372
74.	మలుపులు తిరుగుతూ వచ్చిన ఆలయ చట్టాలు	....	381
75.	ఆ చట్టం ఒక చరిత్రాత్మక ఘట్టం	....	387
76.	తిరుమల మిరాశీలు	....	394

77.	700 ఏళ్లు గోడ వెనక దాక్కున్న దేవుడు	....	405
78.	క్రిమినల్ కేసులు పెట్టించిన కల్యాణ వేంకటేశ్వరుడు!	....	411
79.	అతి వివాదాస్పద ఘట్టం : వెయ్యి కాళ్ల మండపం కూల్చివేత	....	417
80.	త్రిసభ్య కమిటీలో కమిటీలు	....	433
81.	ఆగమ సదస్సు	....	439
82.	దోచుకున్న వాళ్లు 'అలా బాగుపడ్డారు!'	....	482
83.	అన్నదాన పథకంలో తప్పు జరిగింది	....	457
84.	ఏటా మూడు లక్షల కిలోలు వస్తున్నాయ్!	....	467
85.	తిరుమల ఆలయంలో బూతుబొమ్మలు!	....	475
86.	తిరుమలేశుడి ఆభరణాలు భద్రమేనా?	....	485
87.	శ్రీనివాసుడు ధనికుల దేవుడు!	....	496
88.	హనీమూన్‌కి తిరుమల!	....	509
89.	వేదాలు బ్రాహ్మణుల కోసమా? సమాజం కోసమా?	....	518
90.	వెయ్యేళ్లలో చేయలేనిది అరవయ్యేళ్లల్లో చేశాం. ఎంతధర్మం!	....	532
91.	మతమార్పిడుల నిరోధం లక్ష్యమైన సదస్సుకి చుక్కెదురు!	....	541
92.	శరణాగతి–ముగింపు	....	556

1. తొండమానుడు కట్టించింది కాదు!

తొండమాను చక్రవర్తి కట్టించిన శ్రీవారి ఆలయం కాలగర్భంలో కలిసిపోయింది. అదీ 28వ కలియుగంలో కట్టబడినా ఇప్పుడు లభ్యంకాలేదు కాబట్టి అది కూడా పురాణ కట్టడంగానే ఉండిపోయింది.

ప్రస్తుతం తిరుమలలో ఉన్న దేవాలయాలు, స్వామివారి విగ్రహం, దానితో కలిపి ఇంకా గర్భగృహంలో ఉన్న ఇతర బేరాలు, విగ్రహాలు-వాటి చరిత్ర తెలుసుకోవాలంటే, పురాణాలను వదిలేస్తే రెండే ఆధారాలున్నాయి. మనకిప్పుడు దొరుకుతున్న ప్రాచీనసాహిత్యం, ఆ తర్వాతకాలంలో ఆలయంలో రాళ్లపై చెక్కబడిన శిలాశాసనాలు - ఆ తర్వాత పొందుపరచబడిన సాహిత్య, చారిత్రక నిదర్శనాలు.

పురాణకాలంలో 12 పురాణాలలో విపులీకరించబడిన వేంకటాచల మాహాత్మ్యం, తీర్థాలు, వేంకటేశ్వరుని మహిమల గురించి 'తిరుమల లీలామృతం'లో చెప్పుకున్నాం. అది మొదటిభాగమయితే, సాహిత్య, చరిత్రాత్మక ఆధారాలతో తెలియవస్తున్న విశేషాలను ఈ రెండవభాగంలో (చరిత్ర ఆధారంగా) తెలుసుకుందాం.

పురాణకాలం తర్వాత మనకు అందుబాటులో ఉన్న తమిళసాహిత్యంలో 'వేంగడ'మనే శబ్దం ప్రాచీనకాలంలో వాడుకలో ఉంది. సంస్కృత 'వేంకట' శబ్దానికి తమిళం వేంగడమే అయితే, 'శ్రీ' అన్న శబ్దం 'తిరు' అని తమిళంలో పలుకుతుంది. కనుక 'తిరువేంగడం' అని వేంకటాచలాన్ని పిలిచేవారు. శ్రీనివాసుడు తిరువేంకటనాథుడు - తమిళంలో 'తిరువేంగడముడైయవర్'. వైష్ణవం తమిళంలో పుట్టింది. ప్రాచీనకాలంగా తమిళులు వేంకటేశ్వరభక్తులు. తమిళ ప్రాచీన సాహిత్యమే దీనికి నిదర్శనం. సాహిత్య, చారిత్రక ఆధారాలను బట్టి తిరుమలపై స్వామి ఉనికి మనకు తెలిసింది క్రీ.పూ. 3వ శతాబ్దం నుంచి. ఆలయనిర్మాణానికి ముందు, ఆరుబయట చెట్టుకింద వుండి ఆటవికులచే పూజించబడేవాడు. వసువనే నిషాదుని వంశపురాజుకు ఈ విగ్రహం ఉనికి తెలిసిందని పురాణం ఉండనే ఉంది. ఆటవికులు

పాలు, తేనె, కొర్రలు, అన్నం నివేదన చేసేవారట. తరువాత జానపదులు మట్టి మూకుళ్లలో స్వామికి ఆరగింపు చేసేవారట. ఇదే కుమ్మరి భీముని అర్చావిధానం. సగం పగలకొట్టిన కొత్త మట్టికుండలో నైవేద్యం చేసేవారట. దానికి ప్రతీకగా ఈనాటికీ తిరుమల ఆలయంలో ఓడు (పగిలిన కొత్తకుండ మూకుళ్ల) లో నైవేద్యం శ్రీనివాసునికి ఆచారం.

★ ★ ★

దీనికొక కథ పురాణంలో వుంది. తొండమాను చక్రవర్తి ప్రతిరోజూ తిరుమలలో బంగారు పూలతో స్వామివారికి స్వయంగా పూజచేసి అర్చన చేసేవాడట. కొంతకాలానికి ఈ ఆంతరంగిక మహాభక్తునికి కూడా కొంత గర్వం వచ్చింది. తనంతటి భక్తుడే లేడని, తానుకట్టిన స్వామివారి ఆలయానికి తలలు వంచుకొని బ్రహ్మాది దేవతలు కూడా రాత్రి వచ్చి పూజలు చేసి వెళ్తారని భావించేవాడట.

ఒకనాడు తొండమాను చక్రవర్తి అలా కొత్తగా తెచ్చిన బంగారుపూలతో అర్చన చేయడానికి ఆలయానికి ఉదయమే వచ్చి, క్రితంరోజు పుష్ప నిర్మాల్యం శుభ్రం చేస్తుంటే, అతనికి తను అర్చన చేసిన బంగారం పూలు పక్కకు జరుపబడి, మట్టితో చేసిన పూలు స్వామివారి పాదాలపైన వుండటం కన్పించిందట. బంకమట్టి అంటుకొన్న తులసీదళాలు కూడా ఉన్నాయట. చక్రవర్తికి ఆశ్చర్యం, తన తర్వాత ఎవరూ పూజ చేయడానికి అవకాశం లేదే! ఈ మట్టిపూలేమిటి, బంక అంటుకున్న తులసి ఏమిటి? ఎలా వచ్చాయి? ఆంతరంగిక భక్తుడు కనక స్వామివారినే ప్రశ్నించాడట.

దానికి స్వామి చిరునవ్వుతో “అవి యిక్కడ అర్పించిన పూలు కాని, తులసి కాని కావు. నా ఆప్తభక్తుడు భీమ అనే కురవరపునంబి తన గుడిసెలో సమర్పించిన తులసి” అని చెప్పాడు. చక్రవర్తికి చాలా ఆశ్చర్యం కలుగుతుంది. ఎక్కడ వుంటాడో కనుక్కొని వెతుక్కుంటూ ఆ గ్రామానికి వెళ్తాడు. చిన్న పూరిగుడిసె, బయట కుమ్మరి సారె. చేసి ఎండ పెట్టిన మట్టికుండలు, మూకుళ్లు. ఎవ్వరూ లేక పోవడం చూసి గుడిసెకున్న చిన్న తలుపు తీసుకొని వంగి గుడిసెలోకి ప్రవేశిస్తుంటే చూరుకి తగిలి అతని రత్నకిరీటం పడిపోయింది. ఆ అలికిడి విన్న భీమ పూజ, చేస్తున్నవాడల్లా లేచి రాజుని చూచి ఆదరంగా ఆహ్వానించాడు. కుమ్మరి భీమ ఒక చిన్న చెక్క వేంకటేశ్వరునికి మట్టిపూలతోనూ, తులసితోనూ అర్చన చేస్తున్నాడని చక్రవర్తి గ్రహిస్తాడు. రాకకు కారణమడిగిన భీమకు, చక్రవర్తి, తిరుమల ఆలయంలో జరిగిన సంగతి చెప్పి, భీమ చేసిన పూజను కొండపై స్వామి స్వయంగా అందుకుంటున్నాడని, స్వామివారే భీమని

గురించి చెప్పారని తెలియజేస్తాడు. స్వామివారి దృష్టిలో పడ్డానన్న భీమ ఆనందానికి అవధులు లేవు. "తండ్రీ, నా మీద అంత అనుగ్రహమా? నీ దర్శన భాగ్యం లేదే...! కొండకు వచ్చి చూసే స్తోమత లేదు" అనుకొంటుండగానే స్వామి ప్రత్యక్షమైనాడు. భీమ, స్వామికి సంభ్రమాశ్చర్యాలతో సాష్టాంగం చేశాడు.

స్వామి ప్రత్యక్షమై "భీమా, ఆకలిగా వుందయ్యా, తింటానికేమైనా పెట్టు" అన్నాడు. వెంటనే భార్యను పిలిచి భీమ వేడివేడిగా జొన్న సంకటి చేయించి కొత్త కుండ పగలగొట్టి సగం చేసి ఆ ఓడు స్వామికి సమర్పించాడు. ఆరగించిన స్వామి సంతుష్టుడై మోక్షానికి వెళ్లమని విమానం తెప్పించి ఆ దంపతులను పైలోకాలకు పంపి సాయుజ్యమోక్ష సద్గతి కల్గించాడు.

ఇదంతా ప్రత్యక్షంగా చూస్తున్న తొండమాను చక్రవర్తి భగవంతునితో 'నా విషయం ఏమిటి?' అని అడిగాడు. దానికి స్వామి చిరునవ్వు నవ్వి "నీ సాధన ఇంకా పూర్తి కాలేదు. అభిమానం, మాత్సర్యం, గర్వం నీవింకా జయించాలి. నీకు విముక్తి వచ్చే జన్మలోనే" అని అంతర్ధానమయ్యాడు శ్రీనివాసుడు... దానితో తప్పు తెలుసుకొన్న రాజు పశ్చాత్తాపంతో తన నివాసానికి తిరిగివెళ్లి భక్తిశ్రద్ధలతో స్వామివారిని, వారి భక్తులను సేవించడం మొదలుపెట్టాడు. బ్రహ్మాదిదేవతలు తాము కట్టించిన గుడికి తలలు వంచుకు వస్తారన్న ఆలోచన రావడమే, భీమగుడిసెలో తన కిరీటం చూరుకి తగిలిపడటం, తాను పూర్తిగా ఆ భక్తుడి గుమ్మంలో తల వంచడానికి కారణాలుగా గుర్తించి, తనకు పాఠం నేర్పడానికి స్వామి ఈ లీల చేశాడని అర్థం చేసుకొన్నాడు. అందుకు తొండమానుడి వృద్ధాప్యంలో, తిరుమల వెళ్లి స్వామి దర్శనం చేసుకొనే శక్తి లేనప్పుడు, అతని ఇంటికి స్వామి దేవేరులతో వచ్చి, కూర్చొని అతని సేవలందుకుని అనుగ్రహించాడు. కాళహస్తి, ఏర్పేడు మధ్య వున్న తొండమనాడు గ్రామంలో ఆ స్వామివారిని దేవేరులతో చూడవచ్చు. భీమ స్వామి వారికి సమర్పించిన నైవేద్యం చిహ్నంగా ఈనాటికీ ప్రతిరోజూ తిరుమల ఆలయంలో కొత్తకుండ సగంగా పగులకొట్టి, అందులో 'ఓడు నైవేద్యం' ఈనాటికీ సమర్పించడం సంప్రదాయం. మిగతా నైవేద్యాలన్నీ కులశేఖరపడి అవతల శయనమందిరంలో ఉంచి నైవేద్యం చేస్తే- ఈ ఓడు నైవేద్యం మాత్రం గర్భాలయంలో స్వామివారికి నేరుగా అర్చకులు సమర్పించడం విశేషం.

అన్నమాచార్య వారి ప్రయోగం 'తోమని పళ్లాలవాడ' అన్నది ఈ ఓడు నైవేద్యాన్ని దృష్టిలో పెట్టుకునే.

★ ★ ★

రెండవ శతాబ్దంలోని గ్రంథమైన 'తొల్కాప్పియం'లో తమిళ దేశానికి ఉత్తర సరిహద్దుగా, 'వేంగడం' అని చెప్పబడింది. ఇది కాక అగనామూరు, పురనానూరు, కురుందొగై, ఐంగరునూరు మొదలైన ప్రాచీన గ్రంథాలలో వేంగడం పవిత్రపర్వతంగా, పుణ్యక్షేత్రంగా చెప్పబడింది. కాని ఈ గ్రంథాలు కొండపై ఉన్న ఆలయం గురించిగాని, విగ్రహం గురించికాని, దేవుని గురించి కాని ప్రస్తావన చేయలేదు.

కాని 'శిలప్పధికారం (శిలప్పదిగారం) అనేది ఇళ్లంగో అడిగళ్ అనే జైన తమిళుడు రచించిన ఇతిహాసగ్రంథం. శిలప్పదిగారం క్రీ.శ. రెండవ శతాబ్దంలో రచించబడింది. ఆ గ్రంథంలో 'తిరువేంగడముడైయాన్' - అని తిరుమలదేవుని ప్రస్తావన ఉంది. 'ఎన్నో సెలయేళ్లు, తీర్థాలతో అలరారుచున్న ఆ వేంగడమనే కొండపై చక్రాన్ని, శంఖాన్ని వక్షఃస్థలమున కౌస్తుభంతో, పట్టు పీతాంబరం ధరించిన పుండరీకాక్షుడైన శ్రీమహావిష్ణువు (శంగణ్ నెడియాన్) నిలువుగా పొడవుగా నిలిచివున్నాడని ఉంది. ఈ శిలప్పదిగారంలో స్వామివారి వర్ణన, సంస్కృతేతర భాషలలో, ముఖ్యంగా దక్షిణాది భాషలలో, శ్రీవేంకటేశ్వర అర్చామూర్తిని వైభవంగా వర్ణించిన మొదటి సందర్భంగా ప్రసిద్ధి చెందింది. అందులో ఆ మూర్తిని సూర్యచంద్రులు సేవించుతూ ఉన్నా'రన్న వర్ణన వలన, అప్పటికి ఆలయం లేదనీ, మంటపంలోనో లేక ఆరుబయట పీఠంపైనో వెలసివున్నాడని భావించవచ్చు.

అలాగే ఇంకొక జైన కవి 'అయినారుదనారు' రాసిన 'పురుప్పారు వెణ్ణామాలై'లో కూడా శ్రీవేంకటాచలంపైన ఉన్నది లక్ష్మీనాథుడైన శ్రీమహావిష్ణువే అని చెప్పబడింది.

ప్రాచీన శాసనాలలో వేంకటాచలం ప్రాంతాన్ని 'తిరువేంగడకొట్టం' అన్న పేరుతో పిలిచేవారని కూడా ఉంది.

తిరుమల-తిరుపతి దేవస్థానాల వారు దేవస్థానంలో, తిరుమల-తిరుపతి తిరుచానూరులలో ఉన్న అన్ని శిలాశాసనాలూ పరిశోధన చేయించి, వాటిని గ్రంథాలుగా ప్రకటించారు. ఆ సేవ ముఖ్యంగా శ్రీ సాధు సుబ్రమణ్యశాస్త్రి ద్వారా మహంతుల కాలంలో మొదలుపెట్టబడి, వాటిని ప్రచురించే అవకాశం నేను దేవస్థానాల కార్యనిర్వహణాధికారిగా ఉన్న (1978-82) సమయంలో జరగడం నా భాగ్యం.

మొత్తం 1252 శాసనాలు - అందులో 1150 తమిళంలోనూ, మిగతావాటిలో 70 శాసనాలు సంస్కృతంలోనూ, కన్నడంలోనూ ఉన్నాయి. తాళ్లపాక వారివి 25 శాసనాలున్నా, అందులో తెలుగువి ఆరు మాత్రమే. మిగతావన్నీ తమిళంలోనే ఉన్నాయి. ఆ రోజుల్లో ఈ దేవాలయంలో దాదాపు పూర్తిగా తమిళ ప్రభావమే.

ఈ శాసనాలలో మొదటిది తమిళంలో క్రీ.శ. 800 సంవత్సరానిది. దాని సారాంశం: "పల్లవరాజైన కోవిజయదంతి కాలంలో కొండమీద శ్రీవేంకటేశ్వరుని ఉత్సవమూర్తి దగ్గర దీపం పెట్టేందుకు 'ఉలగప్పెరుమానారు' అనే భక్తుడు 30 కళంజుల బంగారాన్ని తిరుచానూరులో ఉన్న వైష్ణవసభ వారికి సమర్పించాడు" అని.

దీన్ని బట్టి అప్పటికే తిరుమలలో ఆలయం వైభవంగా ఉండేదనీ, ఆలయ నిర్వహణ బాధ్యత చూసేందుకు ఒక వైష్ణవ సభ ఉండేదనీ, అది కొండమీద కాక, తిరుచానూరులో ఉండేదనీ, ఆలయానికి భక్తులు కానుకలు నివేదనలు చేయాలంటే ఈ సభకే వారి కైంకర్యాలు తిరుచానూరులోనే అప్పగించే ఏర్పాటు వాడుకలో ఉందనీ తెలుస్తోంది.

అది చాలాకాలం నుంచీ జరిగే వ్యవస్థ అయి ఉండి ఉండాలి. తిరుమల కొండపైన శిలాశాసనం చెక్కించి గుళ్లో స్థాపించే ఏర్పాటు క్రీ.శ. 800 లో మొదటిసారి జరిగినట్లుగా తెలుస్తోంది. ఆ కాలంలో వైష్ణవ సభ రికార్డులు మనకు లభ్యంలోలేవు. ఇంకా ఎందరో ఎన్నో రకాల దానధర్మాలు చేసి ఉండవచ్చు. కాని శిలాఫలకంపై చెక్కి మనకు లభ్యమైన మొదటి శాసనం క్రీ.శ. 800 నాటిది.

లభ్యమైన రెండవ శిలాశాసనం తమిళంలో క్రీ.శ. 935 నాటిది. తిరుమల ఆలయంలో అఖండదీపం కోసం మలైనాడుకు చెందిన కొడుంగోలూరన్ అనే భక్తుడు చోళరాజైన పరాంతకుని కాలంలో 40 కళంజుల బంగారాన్ని తిరుచానూరు వైష్ణవ సభకు ఇచ్చినట్లుగా ఉంది. చివరలో 'ఎంబెరుమానడియార్ రక్షై'– అన్న తమిళవాక్యం ఉంది. దాని అర్థం, 'విష్ణుసేవకుల రక్ష' అని. ఆ కాలంలో లభ్యమైన ఇతర ఆలయాల శిలా శాసనాలు పరిశీలిస్తే – విష్ణువుఆలయాలలో 'విష్ణుసేవకుల రక్షై' అనీ, శివాలయాలలో 'మహేశ్వర రక్ష' అని చెక్కబడేదని తెలుస్తుంది. అంటే ఆనాటికే ఈ ఆలయం వైష్ణవ ఆలయంగా ప్రసిద్ధిలో ఉండేది. అందుకే దాని యాజమాన్యం కూడా తిరుచానూరులో వైష్ణవసభకే ఉండేది. మరో విశేషం – క్రీ.శ. 800 నుండి క్రీ.శ. 935 వరకూ తిరుచానూరు వైష్ణవసభ నిర్విఘ్నంగా తిరుమల ఆలయ పర్యవేక్షణ చేస్తున్నట్లు భావించవచ్చు. ఈ ఆధారాల వలన ప్రాచీనకాలం నుండి తిరుమల ఆలయం వైష్ణవ ఆలయంగానే ప్రసిద్ధిలో ఉండేది.

తరువాతి ముఖ్యశాసనం – క్రీ.శ. 966 జూన్ 8, శుక్రవారం నాడు పల్లవరాణి శక్తివిటంకన్ భార్య సామవైపెరుందేవి తిరుమల యాత్ర చేసినప్పుడు ఒక వెండి 'భోగశ్రీనివాస' (మనవాళ పెరుమాళ్) విగ్రహాన్ని ఆలయానికి బహూకరించి, స్నపన

మంటపం (ఇప్పటి రాములవారి మేడ - జయవిజయుల మధ్యవున్న మంటపం) లో అదే రోజు సంప్రోక్షణ చేయించిందని... ఇప్పటికీ ఈ భోగశ్రీనివాస విగ్రహం తిరుమలలో ఉంది.

ఈ శాసనంలో చోళరాజైన కొప్పాత్ర పార్థివేంద్రవర్మ 14వ పరిపాలన సంవత్సరంలో ఈ ప్రతిష్ఠ జరిగినట్లు ఉంది. కాని తారీఖు (8-6-966) మాత్రం స్పష్టంగా ప్రతిష్ఠదినంగా మలచబడి ఉంది. సాధు సుబ్రమణ్యశాస్త్రిగారు -కొప్పాత్ర పార్థివేంద్ర వర్మ పాలనాకాలం క్రీ.శ. 600 నుండి 630 వరకు అని నిర్ణయించి, అతని 14వ పరిపాలనా వత్సరం క్రీ.శ. 614 అవుతుంది. కాబట్టి, భోగ శ్రీనివాసమూర్తి ప్రతిష్ఠ క్రీ.శ. 614లో జరిగి ఉండవచ్చుని నిర్ధారణ చేశారు. ఎలా చూసినా చారిత్రిక ఆధారాల ప్రకారం క్రీ.శ. రెండవ శతాబ్దం నుండి తిరుమల గిరుల్లో దేవాలయం మహావిష్ణువు వేంకటేశ్వరునిదిగా ఉన్నట్లు తెలుస్తుంది.

ఈ ఏర్పాట్లు శ్రీరామానుజుల వారి కాలానికి ముందుగా జరగటం వలన, శ్రీ భోగశ్రీనివాసుని వెండి విగ్రహానికి శంఖచక్రాలుండటంవలన, శ్రీరామానుజులకు పూర్వం నుండే ఇది వైష్ణవక్షేత్రంగా స్వామివారు విష్ణుస్వరూపంగా ఉండి భక్తుల ఆరాధనలు వైఖానస ఆగమోక్తంగా పొందుతున్నట్లు చారిత్రక ఆధారాలు కన్పిస్తున్నాయి.

వేంకటేశ్వరుని ప్రథమ అర్చకుడు గోపీనాథుడనే వైఖానసుడు. అతని ప్రసక్తి పురాణకాలం నుండి ఉంది. ఆయన ప్రారంభించిన వైఖానస పూజావిధానం అవిచ్ఛిన్నంగా ఈనాటికీ సాగుతోంది. రామానుజులవారు తర్వాతికాలంలో ఆలయనిర్వహణ/పూజావిధానాలలో కొన్ని ఏర్పాట్లు చేసినా, వైఖానస సంప్రదాయాన్నే కొనసాగించారు.

శ్రీవైష్ణవ మత సిద్ధాంత స్థాపన, ప్రచారాలకు కారకుడైన శ్రీయామునాచార్యులు (క్రీ.శ. 916-1042) ఆళవందారు తిరుమలలో శ్రీభోగ శ్రీనివాసమూర్తి విగ్రహ ప్రతిష్ఠాపనకు కారకులు - రాజకుమారి సమవై దానాలు చేసి విగ్రహం తయారుచేసినా, ఆమెను ప్రేరేపించి, వైఖానస శాస్త్రోక్తంగా విగ్రహసంప్రోక్షణకు, తర్వాతి పూజావిధానాలకు సంప్రదాయానుగుణంగా ఏర్పాటు చేసినది శ్రీయమునాచార్యులు. ఈయన చాలాకాలం తిరుమలలో నివసించి, స్వామికి పుష్పకైంకర్యం చేసినట్లు ఆధారాలు ఉన్నాయి. ఇప్పటికీ ఆలయానికి పూలు వచ్చాక వాటిని తోమాలసేవ సమయానికి మాలలుగా కట్టడానికి, పూలను ఉంచడానికి ఒక

అర తిరుమల ఆలయంలో ఉంది. ఆ పుష్పమంటపాన్ని 'యామునాచార్య అర' అని ఇప్పటికీ పిలుస్తారు. ఈయన మనుమడే శ్రీశైలపూర్ణుడు (తిరుమల నంబి). ఆయనను తిరుమల రప్పించి తన తర్వాత పుష్పకైంకర్యం బాధ్యత ఆయనకు అప్పగించింది యామునాచార్యులే. చాలాకాలం ఈ తిరుమలనంబి స్వామివారికి పుష్పకైంకర్యం - పాపనాశనతీర్థం తెచ్చే సేవ చేశారు. భగవంతుడు ఈయనకే బోయవాని రూపంలో సాక్షాత్కరించి, పాపనాశనం నీరు తాగి వేసిన తర్వాత ఆకాశగంగ తీర్థాన్ని సృష్టించాడు. ఈయన చిన్నమందిరం దక్షిణమాడవీథి మఠంలో ఉండేది. 1980లో దక్షిణమాడవీథిని వెడల్పు చేసి, ప్రైవేటు ఇళ్లనన్నిటినీ దేవస్థానం వారు తీసుకొన్నప్పుడు మఠంవారి అభ్యర్థన మేరకు ఒక కొత్త తిరుమలనంబి ఆలయాన్ని ఆ దక్షిణ మాడవీథిలో (క్యూ కాంప్లెక్స్ నుండి లైను మాడవీథిని దాటే దగ్గర) కట్టించే భాగ్యం నాకు దక్కింది.

ఈ సందర్భంగా కులశేఖర ఆళ్వారు గురించి కూడా చెప్పుకోవాలి. ఈయన కేరళ ప్రాంతానికి చెందిన విష్ణు భక్తాగ్రేసరుడు. రాజైనప్పటికీ స్వామివారికి దాసానదాసుడు. క్రీ.శ. 7వ శతాబ్దంలో ముకుందమాల అనే గ్రంథం రచించి భగవంతునికి సమర్పించిన మహాభక్తుడు. అందులో ఆయన కోరిక తిరుమల దేవునికి విన్నవించుకొంటాడు: "నీ సన్నిధికి దేవతలు, అప్సరసలు, మహాభక్తులు ఎందరో వస్తారు. అటువంటి భక్తుల పాదధూళి తగిలే నీ సన్నిధిలో గడపగా ఉన్నా నా జన్మ తరించినట్లే" అని. అందుకే ఇప్పటికీ తిరుమల ఆలయంలోని గర్భాలయం గడపకు 'కులశేఖరపడి' అని పేరు. ఇది వైష్ణవ క్షేత్రమని, క్రీ.శ. 7వ శతాబ్దం నాటికే కేరళ ప్రాంతం వారికీ తిరుమలలో శ్రీమహావిష్ణువు శ్రీనివాసుడుగా వేంచేసి భక్తుల సేవలు గ్రహించి అనుగ్రహిస్తున్నాడని చెప్పేందుకు ఈయన గాథే తార్కాణం.

ఇలా ఎందరో మహా విష్ణుభక్తులు - నమ్మాళ్వారు, కులశేఖర ఆళ్వారు, యామునాచార్యులు, తిరుమల నంబి వీరందరూ రామానుజులకు పూర్వమే, తిరుమల దేవుని విష్ణువుగా సేవించి, ఆరాధించి, స్తోత్రాలు చేసి, పుష్పాది కైంకర్యాలు చేసిన పరమ భాగవతోత్తములు.

రామానుజులు పాంచరాత్ర ఆగమం పాటించేవారు. అయినా ఈ తిరుమల ఆలయంలో సంప్రదాయంగా సాగే వైఖానస ఆగమోక్త పూజావిధానాన్నే కొనసాగించే వ్యవస్థ చేశారు. ఈ పూజావిధానంతోపాటు, శ్రీరంగంలోని రంగనాథ ఆలయంలో పాంచరాత్ర పద్ధతిలో జరిగే కొన్ని కొత్త సంప్రదాయాలు ప్రవేశపెట్టారు. ఇప్పటికీ

జరుగుతున్న శాత్తుమొరై, ఆరుళుప్పాడు, తిరుప్పళి ఎళుచ్చి, అధ్యయనోత్సవాలు, ఆళ్వారుల తిరునక్షత్ర ఉత్సవాలు, దివ్యప్రబంధ పారాయణ వంటి వాటికి నాంది పలికారు. అంతకుముందు ఆలయంలో వైదికమంత్రాలతో మాత్రమే వైఖానస ఆగమ పూజాక్రమాలు జరిగేవి. వాటితోపాటు తమిళపాశురాలు పాడే సంప్రదాయం మొదలయింది అప్పుడే. పూజావిధానాలు, నైవేద్యవిధానాలు వాటికి కావలసిన దిట్టం వగైరాలు ఏర్పాటుచేసి, ఈ విధానాలన్నీ సక్రమంగా అమలు జరగడానికి ఏకాంగి (జియ్యంగార్) వ్యవస్థని ప్రవేశపెట్టి, ఆ వ్యవస్థకు ఆధికారిక హోదా రాజశాసనం ద్వారా కల్పించి, కట్టుదిట్టంగా జరిగే వ్యవస్థ చేశాడు. అంతా యాదవరాజు ఆధికారికంగా ఆమోదించేట్లు చేశారు. అది ఎలా జరిగింది?

అంతా విపులంగా 'శ్రీవేంకటాచల యితిహాసమాల' అనే గ్రంథంలో అనంతాచార్యులు వివరించారు. సంస్కృతంలో ఉన్న ఈ గ్రంథం పండితులకు మాత్రమే లభ్యం. తిరుమల దేవస్థానం వారు కీ.శే. ఎన్.సి.వి. నరసింహాచార్యుల వారిచే తెనిగింపజేసి, 1987లో ప్రకటించారు. నేను వెయ్యికాళ్ల మంటపం/తిరుమల మాస్టరుప్లాను త్రిసభ్యకమిటీ అధ్యక్షుడుగా ఉన్నప్పుడు, శ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ చినజియ్యరుగారిని కలిసినప్పుడు వారు ఈ గ్రంథాన్ని మా దృష్టికి తెచ్చారు. తర్వాతికాలంలో అంటే, ఈ మధ్య రెండు సంవత్సరాల క్రితం శ్రీమన్నారాయణ పెద్దజియ్యరు గారి శతజయంతి సందర్భాల సమయంలో జె.ఇ.టి. వారు ఈ గ్రంథాన్ని ఇంకా సరళమైన భాషలో కొంత వ్యాఖ్యానంతో ప్రచురించారు. అది ఇప్పుడు లభ్యం.

తిరుమల శాసనాల ద్వారా మనం తెలుసుకొనేది, ఆ రోజుల్లో తిరుమల దేవాలయంలో రోజూ జరిగే పూజాకైంకర్యాలు, ప్రసాద వినియోగాలూ, యాత్రికులకు ఏర్పాట్ల వరకు కొండమీద ఆలయ అధికారులు జరిపినా, ఆలయం ఆస్తులు, పరిపాలన, వగైరాలు చూడటానికి తిరుచానూరు (తిరుచుక్కనూరు)లో 108 సభ్యులు గల వైష్ణవ సభ, దాని వ్యవహారాలు చూడడానికి 'సభాయ్యార్' ఉండే వారని. దేవస్థానానికి ఇచ్చేదానాలు, శాశ్వత పూజలకు, నిధులుగా ఇచ్చినా, నగలరూపంలో ఇచ్చినా, భూములరూపంలో ఇచ్చినా ఆ విరాళాలను ఇక్కడే అంటే తిరుచానూరు సభలోనే ఇవ్వాలని తెలుస్తోంది. అలా భూములు దానాలుగా ఇవ్వదలచినవారికి కావలసిన సహాయసహకారాలు సభాయ్యార్ చేస్తాడనీ, భూముల లావాదేవీలు, అమ్మకం

కొనడం వంటివి సభాయ్యార్ ద్వారానే జరుగుతాయనీ, ఆ రోజుల్లో దేవాలయాలకు దానమిచ్చే భూములకు శిస్తులు మాఫీచేసే సంప్రదాయం ఉందనీ, ఆ భూములపై రాజుకు కట్టవలసిన పన్నులు కట్టనక్కరలేదనీ, ఆ వ్యవహారం కూడా సభాయ్యారు చూసుకుంటాడనీ తెలుస్తోంది. దానాలమీద వచ్చే ఆదాయాన్నిబట్టి, శాశ్వత సేవలు ఖాయం చేస్తారనీ తెలుసుకోవచ్చు.

★ ★ ★

2. శంఖచక్రాలు ఎప్పుడు వచ్చాయంటే...

తిరుమల ఆలయంలో పంచమూర్తులు శ్రీనివాసునివి ఉన్నాయి. మూల విరాట్, సాలగ్రామ శిలారూపంలో ఉన్న 8 అడుగుల శ్రీనివాసుడు – తర్వాత ప్రతిరోజూ అభిషేకాది నిత్య సేవలందుకొనే భోగ శ్రీనివాసుడు, మాడ వీథుల్లో ఊరేగింపులకు, కళ్యాణోత్సవాది ఇతర ఆర్జిత సేవలందుకొనే మలయప్పస్వామి (శ్రీదేవి, భూదేవులు సహా) – ఉత్సవవిగ్రహం, ప్రతిరోజూ ఉదయం తోమాల అర్చన సేవల మధ్య జరిగే 'కొలువు' సేవలో అర్చించబడి, వెనుకటిరోజు వచ్చిన కానుకలు, ఆదాయ వివరాలు, పంచాంగం చెప్పించుకొని వినే కొలువు శ్రీనివాసుడు – సంవత్సరానికొకసారి మాత్రమే బయటకు వచ్చే ఉగ్ర శ్రీనివాసుడు–వీటినే పంచబేరాలు అంటారు – భోగ శ్రీనివాసుని విషయంలోనే శిలాశాసనాలన్నిటికన్నా ప్రాచీనమైన క్రీ.శ. 966 (సాధు సుబ్రహ్మణ్యశాస్త్రిగారి నిర్ణయం క్రీ.శ. 614) సంవత్సరంలోని శాసనం ఉంది. మలయప్ప స్వామిని గురించి తర్వాత చర్చిద్దాం.

మిగతా మూర్తులు అంతకంటే ప్రాచీనాలని తెలుసుకోవాలి. మూలబేరం విగ్రహం కాదని, శ్రీనివాసుడే, అంటే సాక్షాత్తూ శ్రీమహావిష్ణువే ఆ రూపంలో అలా నిలబడి ఉన్నాడనీ, ముక్తులకు, బ్రహ్మాదిదేవతలకు, మహాభక్తులకు చైతన్యరూపంలో కన్పిస్తాడని, మిగతా వారందరికీ బ్రహ్మ దేవుని కోరిక ప్రకారం విగ్రహరూపంలో దర్శనమిచ్చి, పాప ప్రక్షాళన చేస్తాడని మనం విన్నాం. చోళరాజు కట్టించిన ఆలయం, తర్వాత తొండమాను చక్రవర్తి కట్టించిన ఆలయం కాలగర్భంలో కలిసిపోయాయి. తరతరాలుగా వస్తున్న అనేక భక్తులకు అవకాశమీయడానికి శ్రీమన్నారాయణుడు ఇలా చేశాడని తెలుసుకోవాలి.

ఇప్పుడు మనం చూసే గర్భాలయం క్రీ.శ. 900 సంవత్సరం ముందు కాలం నాటిదని తెలుస్తోంది. దీని తర్వాత వచ్చినవి వైకుంఠ ప్రదక్షిణప్రాకారం, తర్వాత శయన మండపం, రాముల వారి మేడ, ఆ తర్వాత స్నపన మండపం, ఆ తర్వాత

ఇప్పుడు ద్వారపాలకులున్న బంగారు తాపడం చేయబడిన బంగారు వాకిలి మండపం. వాటి బయట విమాన ప్రాకారం - అందులోనే యోగ నరసింహస్వామి, వరదరాజస్వామి ఆలయాలు, (రామానుజుల సన్నిధి) వకుళమాల సన్నిధిలో ఉన్న వంటశాల (అన్న ప్రసాదాలు తయారుచేసే పోటు (వంటశాల), సబేరా (శ్రీవారి ఆభరణాలు వస్త్రాలు పరిమళద్రవ్యాలు ఉంచే గదులు - (ఇప్పుడు శ్రీవారి నగలను - బంగారువాకిలి లోపలున్న స్నపనమందిరంలో భద్రత కోసం లాకర్లు తయారుచేసి అందులోకి తరలించడం జరిగింది) కూడా అలాగే వచ్చాయి. అన్నమాచార్యుల వారు రచించిన 32,000 సంకీర్తనలను రాగిరేకులమీద చెక్కించి భద్రపరచిన అర కూడా ఈ ప్రాకారంలోనే ఉంది... స్వామివారి కైంకర్యానికి నీళ్లు సమకూర్చే బంగారు బావి కూడా ఈ ప్రాకారంలోనే ఉంది. ఇవన్నీ క్రమేపీ వచ్చాయి.

ఈ ప్రాకారంలోని ద్వారానికి వెండిద్వారం అని పేరు. అది దాటితే సంపంగి ప్రాకారం. నాలుగు మూలలా నాలుగు చిన్న మండపాలు - ఈశాన్యంలో పూలబావి, అద్దాల మండపాలు, ఆగ్నేయంలో రంగనాథ మండపం, దక్షిణ ప్రాకారం అంతా కళ్యాణాలు జరపడానికి ఇప్పుడు వాడుతున్నారు - మిగతా ప్రాకారమంతా పడిపోటు (లడ్లు వడలు ఇతర భక్ష్యాలు నైవేద్యాలు చేసే వంటశాలగా) వాడుతున్నారు... తూర్పువైపు ధ్వజస్తంభం, బలిపీఠం, మహాద్వారం - ఈ ప్రాకారంలోనే మహాద్వారానికి పక్కన కృష్ణదేవరాయల విగ్రహాలు, అతని ఇద్దరు దేవేరులతో సహా చూస్తాము...

గర్భాలయం తప్ప మిగతా మండపాలు, ప్రాకారాలు వెయ్యి సంవత్సరాల క్రితంలోపు వనే తెలుస్తోంది.. పురాణాల్లో కట్టిన కట్టడాలు - ఇప్పుడు కనిపించవు. ఇతిహాస దృష్టితో శాసనాల ఆధారంగా పరిశీలిస్తే ఇవన్నీ 11వ శతాబ్దం తర్వాతి కట్టడాలే.

క్రీ.శ. 966 లో తయారు చేయబడిన శాసనం ప్రకారం ఒక రాజకుమారి 'సమవాయ్' అనే ఆమె కైంకర్య సౌలభ్యం కోసం ఒక చిన్న భోగ శ్రీనివాసుని విగ్రహాన్ని చేయించి సమర్పించినదనీ... అప్పటినుండి మూలవరులకు అంటే శిలావిగ్రహానికి రోజూ అభిషేక అలంకారాలు లేకుండా, ఆ భోగమంతా ఈ భోగ శ్రీనివాసునికి జరిపించడం ప్రారంభం చేశారనీ- మూల విగ్రహాన్ని ఈ భోగ శ్రీనివాస విగ్రహాన్ని పట్టుదారంతో అనుసంధానం కల్పించే ఏర్పాటు చేశారనీ శాసనం-

ఇప్పటికీ అదే పద్ధతి అమలులో ఉంది. దీన్నిబట్టి, ఈ భోగ శ్రీనివాసుని విగ్రహం రావడానికి పూర్వం ప్రతిరోజూ అభిషేక అలంకారాలు మూలవిరాట్టుకు జరిగేవని-

అంత పెద్ద విగ్రహానికి, ఏ సౌకర్యాలు లేని దట్టమైన అటవీ ప్రదేశంలో ఉన్న ఆ మందిరంలో రోజూ అభిషేకాలంకారాలు చేయడం కష్టంగా భావించి, ఈ ఏర్పాటు చేసినట్లు గమనించాలి. వారానికి ఒకసారి అంటే శుక్రవారం ఉదయం మూలవరులకు అభిషేకం చేసే ఏర్పాటు; దానికి అనుసంధానంగా, గురువారం నాడు సడలింపు. స్వామివారి అలంకారాలు తీసేసి- సాయంత్రానికి పూలతో మాత్రం అలంకారం చేసే సంప్రదాయం. దానినే పూలంగిసేవ, పూలంగి దర్శనం అంటారు. స్వామివారి కళ్లను కప్పేసే కర్పూరనామం కూడా చాలా వరకూ తీసేసి చిన్ననామం మాత్రం ఉంచి నేత్రదర్శనానికి సానుకూలం చేస్తారు. ఇదంతా మరుసటి రోజు శుక్రవారం ఉదయం జరిగే స్వామివారి అభిషేకానికి చేసే ముందు ఏర్పాట్లు - సరే శుక్రవారంనాడు, ఆ చిన్న నామం, పూల అలంకారం, వస్త్రాలంకారాలు కూడా తీసేస్తారు. ...తర్వాత అభిషేకం- మొదట చిన్న లంగోటి వస్త్రం మాత్రం స్వామివారు ధరిస్తారు. క్షీరాభిషేకం తర్వాత మొలకు కట్టిన ఆ చిన్నవస్త్రం కూడా తీసేస్తారు. అప్పుడు స్వామివారి నిజరూపదర్శనం, నిజపాదదర్శనం-

పూర్వదేవ గురోర్వారః సమ్ప్రాప్తస్తు గతే దినే
తద్దినే వేఙ్కటేశస్య ప్రశస్త మభిషేచమే!
తద్దర్శనార్థంఉ యోః కన్యాః సర్వా జగ్ముర్మహేసుర!"

ఆ రోజున శ్రీనివాసునికి అభిషేకం జరుగుతుంది... అన్న విషయ ప్రస్తావన జరిగింది:

అలా శుక్రవారంనాడు జరుగుతుందని పురాణకాలం నుంచి ప్రసిద్ధి. కాని రామానుజుల వారు తిరుమలలో చేసిన సంస్కరణలలో ఈ సంస్కరణ ఒకటిగా పేర్కొనటం జరిగింది. కాని దానికి సరైన ఆధారాలు కన్పడటం లేదు - భోగ శ్రీనివాస విగ్రహ సంప్రోక్షణతో ఈ సంస్కరణ జరిగినట్లు అనిపిస్తుంది.

ఈ భోగ శ్రీనివాసుని ప్రతిమకు శంఖచక్రాలు, కటి వరద హస్తాలు ఉన్నాయి. అంటే ఆ విగ్రహం వచ్చిన కాలానికి అది విష్ణువే అన్న దృఢ విశ్వాసం ఉన్నట్లు మనం గమనించాలి. మూల విగ్రహానికి శంఖచక్రాలున్నాయా లేవా? అన్న ప్రసంగం అక్కడెక్కడా కనపడలేదు. తొండమాను చక్రవర్తికి భగవంతుడు అనుగ్రహించి శంఖచక్రాలు ధరించకుండా ఉండే విషయం అప్పుడు సర్వులకు విదితమే అని తెలియాలి. శంఖచక్రాల ప్రమేయం లేకుండానే, ఆ విగ్రహం శ్రీనివాసుడు, శ్రీమన్నారాయణుని ప్రతిరూపం అన్న నమ్మకం చాలా ప్రగాఢంగా ఉండి ఉండాలి.

విగ్రహం విష్ణువుదా? మరే ఇతర దేవతదా అన్న సంశయం - విగ్రహాన్ని ఇతర దేవతావిగ్రహంగా కొందరు ఆపాదించడమే కాక, వారి వారి సంప్రదాయానుసారం పూజలు చేసుకోవడం, బలులివ్వడం వంటివి యాదవరాజుల కాలానికి తారస్థాయికి చేరుకొన్నాయి. రామానుజాచార్యులవారి శాస్త్రవాదన, పాండిత్య పటిమ, పురాణ ప్రమాణశక్తితో - ఇతడు నారాయణుడే కాని ఏ ఇతర దేవత కాదని స్పష్టంగా నిరూపింపబడి, ముందుముందు ఇటువంటి ప్రసంగవాదనలు పడకుండా విగ్రహానికి బంగారు శంఖచక్రాలు అమరించడం జరిగింది.

★ ★ ★

3. ఆ కుమారుడే ఈ శ్రీనివాసుడా?

ఈ సందేహం కొంతమంది భక్తులలో వెయ్యి సంవత్సరాల క్రితం వచ్చింది. ఆ రోజుల్లో శైవమత ప్రచారం చాలా ఊపందుకొంటున్న సమయం. ఎంతవరకూ పరిస్థితులు వెళ్లాయంటే, కులోత్తుంగచోళుడు అనే చోళరాజు శైవమతం పట్ల విపరీతమైన అభిమానంతో అనేక విష్ణుక్షేత్రాలకు కీడు చేశాడు.

కావేరీతీరంలోని చిత్రకూటం (చిదంబరం) లో గోవిందరాజుల (శ్రీమహావిష్ణువు) ఆలయ విగ్రహాలకు హాని తలపెట్టాడు – ఆకారణంగా ఆ స్వామి ఉత్సవమూర్తిని శ్రీవైష్ణవులు రక్షించి శ్రీపదపురి (తిరుపతి)కి తీసుకువచ్చి కాపాడారు.

కాని ఆ చిత్రకూట క్షేత్ర మూలమూర్తి అయిన క్షీరసాగరశయన గోవిందరాజ స్వామి విగ్రహాన్ని సముద్రంలో పారవేయించాడు ఆ చోళరాజు. తర్వాతి కాలంలో భగవద్రామానుజులు శ్రీపదపురి (తిరుపతి) లో ఈ గోవిందరాజస్వామి ప్రతిష్ఠ చేయించారు... మూలవరులు శ్రీ రామానుజులు తయారుచేయించినది – ఉత్సవవరులు మాత్రం చిదంబరం (చిత్రకూటం) నుండి తీసుకురాబడినది...

వేంకటాచలంపై ఉన్నది కూడా విష్ణువుకాదు, శివుడైనా కావాలి లేదా కుమారస్వామి అయినా కావాలన్న వాదమునకు నాంది పలికారు శైవులు – ఈ విషయాలు, వాదనలు, తిరుపతి ప్రాంతాన్ని పరిపాలిస్తున్న యాదవరాజుకు విన్నవించే దాకా వచ్చాయి. శైవులు వారి వాదనలు, ఆధారాలను, ప్రమాణాలతో సహా యాదవరాజు ముందుంచారు.

భక్తులలో సందేహం రావటానికి కొన్ని ముఖ్యకారణాలు:

1. తిరుమలలోని విగ్రహానికి విష్ణుచిహ్నాలైన ఆయుధాలేమీ లేవు – శంఖంగానీ, చక్రంగానీ, ధనుస్సు (శార్ఙ్గం) గాని, గద కాని, పద్మంకానీ ఆ విగ్రహానికి లేవు.

2. లేకపోగా, ఆ విగ్రహానికి జటాజూటాలు ఉండటం విశేషం – జటాజూటాలు శివుని చిహ్నం కదా!

3. ఆ విగ్రహం భుజాలపై నాగాభరణాలు ఉన్నాయి. నాగాభరణాలు శివుని భూషణాలు కాని, విష్ణువివి కాదే!

4. సంవత్సరంలో ఒక నెల ప్రత్యేకంగా ఈ విగ్రహానికి బిల్వపత్రపూజ జరుగుతోంది– బిల్వంతో పూజ శివునికి కాని, విష్ణువుకు కాదు కదా!

5. చేతిలో పద్మం విష్ణువుకి కాని, ఇక్కడ విగ్రహంలో పద్మం లేదుకాని, విగ్రహం పద్మపీఠం పై ఉంది– కనుక విష్ణువుది కాదు... బ్రహ్మదై ఉండొచ్చుకదా!

6. పుష్కరిణి స్వామిపుష్కరిణిగా ప్రసిద్ధి చెందింది – శివసంతానమైన కుమారస్వామికి స్వామిగా ప్రసిద్ధి. ఈ విగ్రహం కుమారస్వామిది ఎందుకై ఉండకూడదు?

7. ఈ పర్వతంపై శివుడు ఎంతోకాలం తపస్సు చేసినట్లు పురాణాలు చెప్తున్నాయి కదా! కనుక శివుని విగ్రహం కాకూడదా?

8. శివునిది కాకపోతే కుమారస్వామిది కావచ్చు – ఎందుకంటే కుమారస్వామి ఈ పర్వతానికి వచ్చినట్లు, సంచరించినట్లు పురాణాల్లో ఎన్నో ఆధారాలున్నాయి. నాగాభరణాలు, జటాజూటాలు అతనికీ వర్తిస్తాయి. పైగా అక్కడ ఉన్నది ఆయన పేరు మీదే 'స్వామి పుష్కరిణి' అని...

ఇలా సాక్ష్యాధారాలతో యాదవరాజు ముందు వాదన... శ్రీవైష్ణవులు మొదటినుండీ ఇది విష్ణువు విగ్రహం అని మభ్యపెట్టి – ఏవో కొన్ని పురాణాల ఆధారాలు చూపించి వైఖానస సంప్రదాయంతో పూజలు చేస్తూ, ఈ విగ్రహాన్ని విష్ణువిగ్రహంగా చూపించారేకాని, ఇది విష్ణు విగ్రహం కాదని వారి వాదన...

దానికి శ్రీవైష్ణవులు పురాణ ఇతిహాసాల ఆధారాలతో, సాంప్రదాయికంగా ఎంతోకాలం నుండీ జరుగుతున్న పూజావిధానాలదృష్ట్యా ఇది విష్ణు విగ్రహమేనని వాదనలు యాదవరాజు ముందుంచారు.

యాదవరాజు ధార్మికుడు – కాని అంత శాస్త్రజ్ఞానం కలవాడు కాదు – సందిగ్ధంలో పడిపోయాడు. పూజావిధానం తిరుమల ఆలయంలో మార్చాలని ఆయనపై పెద్ద వత్తిడి శైవులనుండి– ఎంతోకాలంగా జరుగుతున్న పూజావిధానం మార్చడమా? మరి వైష్ణవుల ఆధారాలు త్రోసిపుచ్చడం ఎలా...?

ఈ సందిగ్ధ పరిస్థితులు – ఆలయ ఆచార వ్యవహారాల్లో కొంత మార్పునకు అవకాశమిచ్చాయి. శ్రీవైష్ణవ వైఖానస అర్చకులు, వైఖానస సంప్రదాయ పద్ధతిలో కైంకర్యాలు చేస్తున్నా– కొందరు భక్తులు వారివారి నమ్మకాల కనుగుణంగా పూజలు చేసుకోవడం ప్రారంభించారు. అలా ఎంతవరకూ వచ్చిందంటే – వైష్ణవులు విష్ణురూపమని కొలిస్తే – శైవులు ఆ విగ్రహాన్ని శివుడనీ, శాక్తేయులు శక్తి రూపమని (ఆలయ ప్రాకారంపై సింహాలున్నాయి. అటువంటి సింహచిహ్నాలు శక్తిపీఠం పైనే ఉంటాయన్నది వారి వాదన – ఇప్పటికీ బంగారు వాకిలి మండపంపై బంగారు తాపడం చేసిన సింహాలు మనం చూడవచ్చు) – కుమారస్వామి అని, కాల భైరవుడని – ఇలా ఎవరికి తోచినట్లు వారు ఆరాధించడం మొదలుపెట్టారు. అప్పట్నుంచే బలిపీఠం, ధ్వజస్తంభాల దగ్గర జంతుబలులు మొదలయ్యాయని అంటారు.

శ్రీమద్రామానుజులు క్రీ.శ. 1017 లో బూతపూరి (ఇప్పటి శ్రీ పెరుంబుదూరు) లో కేశవ సోమయాజి అనే ఆస్తికునికి కుమారుడుగా జన్మించారు. ఈయన ఆదిశేషుని/ అనంతుని అవతారమని ప్రతీతి – సంస్కృత, ద్రవిడ వేదాలు కూలంకషంగా పఠించి– బ్రహ్మసూత్రాలకు భాష్యం రచించి, సామాన్యులకు సైతము తత్త్వజ్ఞానం అర్థమయ్యే సులభరీతిలో స్పష్టంగా తెలియచేస్తూ, మంచివైష్ణవ తత్త్వవేత్తగా ప్రసిద్ధిచెందారు.

యాదవరాజుపై శైవులు తెస్తున్న ఒత్తిడి రోజురోజుకూ ప్రబలమై, తీవ్రంగా, మారే పరిస్థితి వచ్చింది. అన్ని ఇతర వేదాంత విషయాలు వదలి తిరుమలలోని స్వామిని, కుమారస్వామిగా నిర్ణయించవలసినదిగా ప్రమాణాలు చూపించసాగారు.

వామనపురాణంలో 21వ అధ్యాయంలో స్కంద శివుల సంభాషణ విపులంగా ఇవ్వబడింది. శివుని, స్కందుడు "ఏ ఆటంకమూ లేక తపస్సు చేసుకొనుటకు తగిన ప్రదేశమేది? సకల శుభములు ఇచ్చే ఫలము ఎక్కడ?" అని అడుగుతాడు.

శివుడు వృషభాచలము (వేంకటాచలము) ను సూచిస్తాడు – స్కందుడు ఆ పర్వతానికి వచ్చి, ఒక సరస్సు ఒడ్డున వాయుమూర్తి తపస్సు చేసుకొనుట చూసి, తపస్సుకు, నిత్యానుష్ఠానానికి అనుకూల ప్రదేశంగా ఎంచి, అక్కడ తపస్సు చేశాడని వామన పురాణం.

స్కాందపురాణంలో తారకాసుర సంహారం చేసిన కుమారస్వామి, తన బ్రహ్మహత్యా దోషపరిహారం కొరకు తండ్రి శివుని సూచన మేరకు వేంకటాచలానికి

వచ్చినట్లు – అక్కడ ఒక తీర్థంలో స్నానం చేసి, బ్రహ్మహత్యా దోషం పోగొట్టుకొన్నట్లు, తర్వాత అక్కడ తపస్సు చేసుకొన్నట్లు పురాణం చెపుతుంది.

అలా అక్కడకు వచ్చి ఆయుధాలు వదలి తపస్సుచేసిన కుమారస్వామి విగ్రహం, అది – విష్ణువుది కాదు– కుయుక్తితో కొందరు వైష్ణవులు ప్రజలకు ఈ విగ్రహం 'విష్ణు'వని నమ్మబలికి వైష్ణవక్షేత్రంగా ప్రచారం చేశారు. ఇది నిజంగా కుమారస్వామి విగ్రహం – శైవక్షేత్రం. కనుక ఆ దేవాలయంలో వైఖానస ఆగమపద్ధతి ఆపి, పూజావిధానం శైవాగమానికి మార్చవలసిందని యాదవరాజుపై వత్తిడి తెచ్చారు.

కాని యాదవరాజు నిజానిజాల విచారం చేయక ఎటువంటి మార్పు చేయటానికీ సిద్ధపడలేదు.

ఇక్కడ వృత్తాంతమంతా శ్రీరంగక్షేత్రంలో ఉన్న శ్రీరామానుజులకు కొందరు వైష్ణవులు చెప్పి, పరిస్థితులు చక్కదిద్దవలసిందిగా ప్రార్థించారు.

వెంటనే శ్రీరామానుజులు శ్రీపదపురి (తిరుపతి) కి వచ్చి యాదవరాజు సభకు వెళ్లి – తన స్వపరిచయం చేసుకొని, తన శాస్త్ర పాండిత్యం నిరూపించి శైవులను సభకు పిలిపించి వారికి తనకు మధ్య వాదమునకు అవకాశం కల్పించి, ఇద్దరి వాదనలు విన్న తరువాత నిష్పక్షపాతంగా రాజు నిర్ణయం చేయవచ్చని సూచించారు.

అలా ఆ వృషభాచలమనే, (శేషాచలం, అంజనాచలం, వేంకటాచలం) అని వివిధ నామాలతో పిలువబడే కొండపైనున్న ఆలయంలోని మూర్తి విష్ణువా, కుమారస్వామియా, శివుడా, శక్తియా, కాల భైరవుడా...? ఎవరు అనే నిర్ణయ చర్చకు యాదవరాజు సమక్షంలో విద్వత్ గోష్ఠి ప్రారంభమయ్యింది...

★ ★ ★

4. శివుడు, కాదు విష్ణువు, కాదు...

యాదవరాజు శైవ పండితులకు, వైష్ణవ పండితులకు ఆహ్వానాలు పంపి, సభలో యిరు వర్గాల వారికి సమాన అవకాశం కల్పించి వారి వారి వాదనలు ప్రమాణాలతో సహా సభకు నివేదించమని ఆదేశించాడు...

శైవులు, ఇది వరకు సూచించిన పద్ధతిలో వామన, స్కాందపురాణాల్లోని కుమారస్వామి వృత్తాంతాన్ని, ప్రత్యేకంగా వామనపురాణ 21వ అధ్యాయం ప్రమాణంగా చూపుతూ, ఈ విగ్రహం ఆయుధాలు వదలి ఇక్కడ తపస్సుకు వచ్చిన కుమారస్వామిదే నని, అందువల్లనే ఆ తీరానికి స్వామిపుష్కరిణి అని ప్రసిద్ధి అని, విష్ణు ఆయుధములు కాని, చిహ్నాములు లేనందున అది విష్ణువు విగ్రహము కాదని, నాగాభరణాలు, జటలు, బిల్వపత్రపూజలు, కుమారస్వామిగా నిరూపించటానికి తగిన సాక్ష్యాలని - వాదించి... పూర్వపురాజులు విష్ణుభక్తులు కనుక, వైష్ణవులు - ఈ విగ్రహమును రాజుల అనుగ్రహముతో 'విష్ణువు'గా నిర్ణయము చేసి వైఖానస పూజలు చేస్తున్నారు. అది తగదు. ఇది శివక్షేత్రం. కనుక పూజాపద్ధతులు శైవాగమము ప్రకారము జరుగవలెనని వాదించిరి.

దానికి రామానుజులవారు సుదీర్ఘ సమాధానము చెప్పారు. వారు ప్రమాణాలుగా చూపించిన వామన, స్కాంద పురాణాలే కాక భవిష్యోత్తర, బ్రహ్మ, బ్రహ్మాండ, కూర్మ, వరాహ పురాణాలతో వారి ప్రతివాదన ఖండన చేసి ఈ శైలం శ్రీనివాసుని నిలయమని, శ్రీవైకుంఠము నుండి శ్రీమహావిష్ణువే విచ్చేసినాడని సప్రమాణముగా తన వాదన చేశారు.

ముఖ్యంగా, శైవుల వాదనలు, పురాణప్రమాణముల ముందు వెనుక వృత్తాంతం, సందర్భం పరిశీలిస్తే - ఈ పర్వతానికి ఎవరొచ్చినా, శ్రీనివాసుని దర్శనానికి, శ్రీనివాసుని గురించి తపస్సుకో లేదా వారివారి పాపప్రక్షాళన కొరకు శ్రీనివాసుని అనుగ్రహం పొందడానికే అన్న సంగతి పురాణమే చెప్తుందన్న సంగతి జ్ఞాపకం చేశారు.

వామన పురాణంలోని వాల్మీకి నారద సంవాదనతో వేంకటాచలం విష్ణుక్షేత్రాలలో శ్రేష్ఠమైనదని - అక్కడ పురుషోత్తముడైన భగవంతుడు శ్రీభూదేవులతో నివసిస్తున్న విషయం సభ ముందుంచారు శ్రీరామానుజులు-

వామన పురాణం 21వ అధ్యాయంలోనే - "అక్కడ ఎంతోమంది మునులు, సిద్ధులు ఎల్లప్పుడూ తపస్సు చేస్తుంటారు. శుకుడు మొదలగు మునులు, భృగుమహర్షి మొదలగు తపస్సంపన్నులు, ప్రహ్లాదుడు మొదలగు పరమ భాగవతులు పుణ్యప్రదమైన ఆ పర్వతమును శ్రీమహావిష్ణువు మరొక శరీరంగా తలచి, దానిని పాదములతో తొక్కుటకు భయపడి, ఆ పర్వత సమీపమున నివసిస్తూ ఆ కొండనుండి పారే తీర్థధారలలో స్నానాలు చేస్తూ తర్పణములు ఆచరిస్తూ శ్రీమన్నారాయణుని సాక్షాత్కారం చేసుకొనుటకు తపస్సు చేస్తున్నారు".

ఈ పర్వతం మొదటినుండి విష్ణుక్షేత్రమే. శ్రీవరాహ భగవానుడు భూదేవిని ఉద్ధరించి, ఈ వేంకటాచలమందే భూదేవిని తన తొడపై కూర్చుండపెట్టుకొని మునులచే మూడువేళల శ్రద్ధతో పూజింపబడుతున్నాడు.

ఈ విషయాలన్నీ శివుడు స్కందునకు చెప్పి, "తారకాసురుని వధతో నీకు వచ్చిన బ్రహ్మహత్యాదోషం పోగొట్టుకోవడానికి వేంకటాచలం వెళ్లమని" అన్నాడని నారదుడు వాల్మీకితో చెప్పాడు. దీన్ని వామనపురాణ 21వ అధ్యాయంలో చూస్తాం-

నారద:

ఇత్యుక్తో గురుణాస్కన్దః ప్రపచ్ఛ పితరం పునః।
మమాపి వైష్ణవం మన్త్రం వైష్ణవేష్వపి చోత్తమమ్॥

మన్త్రేషు వరదం శమ్భో! బ్రూహి తత్ప్రాప్తిసాధనమ్।
లబ్ధ్వామంత్రం మహదేవాత్ స్కందః ప్రీతోऽభవత్పితుః॥

'శంభో! వైష్ణవమంత్రములకల్లా ఉత్తమమైనది వరములు నీయగలదియగు వైష్ణవమంత్రమును నాకు ఉపదేశింపు'మని ప్రార్థించగ శివుడు స్కందునకు తారక మంత్రముతో సంపుటితమైన మంత్రాన్ని వుపదేశించాడు - వెంటనే తన వాహనము నెమలిపై ఎక్కి స్కందుడు వేంకటాచలానికి వెళ్లాడని పురాణం చెబుతుంది.

అలా ఆ క్షేత్రంలో తపస్సు చేసిన ఎందరో దేవతలు, మునులు సిద్ధులు - బ్రహ్మాది దేవతలంతా అక్కడ సాధన చేసినట్లు పురాణాలు చెబుతున్నాయి - వాయుదేవులు శ్రీమన్నారాయణుని గురించి తపస్సు చేసి, జీవోత్తమత్వాన్ని భగవంతుని

నుండి వరంగా పొందింది యిక్కడే - ఆదిశేషుడు తపస్సు చేసి విష్ణువును తనపై స్థిరవాసరముండే వరం పొందిందీ యిక్కడే -

స్కందుడు యిక్కడ తపస్సు చేసినంత మాత్రాన యిది స్కంద క్షేత్రమే అయినట్లైతే, వాయుక్షేత్రం ఎందుకు కారాదు? శేషుని క్షేత్రం ఎందుకు కారాదు?

వామనపురాణం 33వ అధ్యాయంలో అగస్త్యుడు, ఇతర మునులు, ఉపరిచరవసువుతో స్వామి పుష్కరిణికి వేంకటాచలానికి వెళ్తూ - యిది శ్రీమన్నారాయణునికి మిక్కిలి ప్రీతి పాత్రమైన విష్ణుక్షేత్రమని కొనియాడినట్లు రామానుజులు సభకు విన్నవిస్తారు.

వరాహపురాణంలో సూతుని వాక్యాలు, ధరణీ వరాహస్వాముల సంవాదము-

"శ్రీవేంకటాచలనామ వాసుదేవాలయో" విష్ణు క్షేత్రమహిమ స్పష్టం చేయడం కాదా? అలాగే పద్మ పురాణంలో శుకుడు యిది గొప్ప విష్ణు క్షేత్రమని తెలిసే కదా యిక్కడకు వచ్చి - ఆశ్రమము నిర్మించుకొని తపస్సు చేసింది!

గరుడపురాణంలో అరుంధతి వశిష్ఠుని నుండి ఈ విష్ణుక్షేత్ర మహిమ తెలుసుకొనలేదా?

సువర్ణముఖరీతీరే! కశ్చిదస్తి మహీధరః।
వేంకటాచలనామా సౌ సర్వ భూ భృత్కులోత్తమః ॥

అతి ప్రీతి ర్మహావిష్ణోః తత్ర వేఙ్కటభూధరే ।
శ్వేతద్వీపాచ్చ వైకుణ్ఠాత్ భానుమణ్డల మధ్యతః॥

అని విష్ణువుకు ఈ క్షేత్రం శ్వేతద్వీపం కన్నా, వైకుంఠం కన్నా, సూర్యమండల మధ్య భాగం కన్నా మిక్కిలి ప్రీతికరమైనది - ఇది విష్ణుక్షేత్రం కాదా?

భృగుమహర్షికి బ్రహ్మాండపురాణంలో నారదుడు చెప్పినది వుంది కదా "భక్తులయందు వాత్సల్యము కల శ్రీమన్నారాయణుడు తన వైకుంఠము విడిచి, లక్ష్మీదేవితో ఈ పర్వతముపైన విహరిస్తున్నాడు"

అలానే - భవిష్యోత్తర పురాణం... ఇంకా... ఇంకా.

ఇలా పురాణ ప్రమాణాలతో, శ్రీరామానుజులు ఇది విష్ణుక్షేత్రమే గాని శైవక్షేత్రము కాదన్న విషయం యాదవరాజుకు స్పష్టం చేసి - అతని అనుమాన నివృత్తి చేశారు.

★ ★ ★

శైవ పండితులు, రామానుజులవారి వాదమునకు ప్రతివాదనగా – 'స్వామి పుష్కరిణిలోని 'స్వామి' శబ్దం కుమారస్వామి'కి చెందిందిగా – ఆ తీర్థం పక్కగా స్కందుడు తపస్సు చేశాడు కనుక స్వామి పుష్కరిణి అని ప్రసిద్ధికొచ్చిందని వాదించారు.

దానికి రామానుజులు పద్మ, వామన, వరాహ, మార్కండేయ, బ్రహ్మాండ పురాణాలు ఆధారంగా – స్వామి శబ్దానికి – 'తీర్థాలన్నిటిలో 'స్వామి'ని – శ్రేష్ఠమయినది అందుకే స్వామి పుష్కరిణి' అని నిరూపిస్తూ వరాహదేవుని, అగస్త్యుని, మార్కండేయుని మాటల్లో పురాణాలు ఈ పుష్కరిణి స్వామిత్వం గురించి శ్లాఘించిన విషయం సభ దృష్టికి తెచ్చి – బ్రహ్మాండ పురాణంలోని సరస్వతీ దేవి తపస్సు (మనం ఇదివరకు 'తిరుమల లీలామృతం'లో చెప్పుకొన్న విషయం) వృత్తాంతం సభకు చెప్తాడు – 'తీర్థములకు స్వామి పుష్కరిణి సార్వభౌమమని' – దానికి అభిమాని సరస్వతీ దేవి అని భగవంతుడు సరస్వతీదేవికి యిచ్చిన వరం జ్ఞాపకం చేసి – స్వామి శబ్దం – స్వామిత్వం వలన కాని, కుమారస్వామి తపస్సు చేసినందువలన కాదని నిరూపిస్తాడు.

ఈ వాదోపవాదనలు విన్న తర్వాత యాదవరాజు యిది విష్ణుక్షేత్రమని – స్వామి పుష్కరిణి కూడా శ్రీమహావిష్ణువుకే చెందిందని అంగీకరించాడు.

కాని... స్వామి పుష్కరిణి దక్షిణ తీరంలో వున్న దేవుడు శ్రీమహావిష్ణువా? మరే ఇతర దేవతా? అనే సంశయనివృత్తి కాలేదు – దాని నిరూపణ చేయాలంటాడు.

దానికి శ్రీరామానుజులు పురాణాలు చదివిన వారికి సంశయానికి తావులేని విషయమనీ, అన్ని పురాణాలలో శ్రీమన్నారాయణుడు శ్రీనివాసుడుగా ఈ పర్వతానికి వచ్చిన విషయం స్పష్టంగా వివరించబడిందని – భూ వరాహ, శ్రీనివాస ఇద్దరూ శ్రీమన్నారాయణుడేనని – వరాహస్వామి, భూదేవిని రక్షించాక సువర్ణముఖీ నదీసమీపాన – ఈ శేషాచలం పై వాసమున్నారన్న ప్రసక్తి చాలా పురాణాల్లో వున్నదని – శ్రీనివాసుడు ఈ పర్వతానికి ఎలా వచ్చాడో భవిష్యోత్తర పురాణం చాలా వివరంగా చెప్తుంటే – ఇతర 10 పైగా పురాణాల్లో కూడా వుందన్న విషయం సభ దృష్టికి తెచ్చారు–

హరివంశపురాణంలో భీష్ముడు, ధర్మరాజుకు శ్రీనివాసుడు వేంకటాచలానికి ఎలా వచ్చినదీ సవివరంగా చెప్తాడు. అందులో నారదులు వైకుంఠంలోని వార్త... అదే భగవంతుడు శ్రీమన్నారాయణుడు వైకుంఠాన్ని వదలి – వేంకటాచలానికి

వెళ్లిపోయాడన్న వార్త అగస్త్యుడు, వ్యాసుడు మొదలగు ఋషులకు చెప్పిన వృత్తాంతం ధర్మరాజుకు భీష్ముడు చెబుతాడు. అంతేకాదు- భీష్ముడు, నారదుడు కూడా వేంకటాచలానికి వెళ్లి స్వామిని దర్శించిన విషయం కూడా హరివంశంలో విపులంగా చెప్తారు. 'స్వామి పుష్కరిణీ తీరములో సూర్యమండలమువంటి విమానంలో శ్రీనివాస ప్రభువు వేంచేసి వున్నారని - స్వామిపుష్కరిణి పక్కన శ్రీనివాసుని సాక్షాత్కారాన్ని వర్ణించారు.

రాక్షసుల బాధలు తట్టుకోలేని దేవతలు వైకుంఠానికి వెళ్తే, "భగవంతుడిక్కడ లేడు - భూలోకంలో ఒక పర్వతం మీద వున్నారు. అక్కడికే వెళ్లండి" అని భగవంతుని సేవకుడు చెప్పడం, వరాహ పురాణంలో చూస్తాం కదా! అలాగే నారదుని విషయంలోనూ జరిగింది.. ఇలా భగవంతుడు రెండురూపాల్లో పుష్కరిణి సమీపాన వున్నట్లు అన్ని పురాణాలూ చెప్తుంటే తపస్సు చేయడానికి వచ్చిన కుమారస్వామి అని అనటం ఎలా సమంజసం?

వరాహపురాణంలో భూదేవి, వరాహస్వాముల సంభాషణ చాలా స్పష్టం -

సముద్రం నుండి భూదేవిని రక్షించిన వరాహుడు, ఆమెను ఎడమతొడపై కూర్చుండపెట్టుకొని గరుడుని పై ఎక్కి వృషభాచలానికి వెళ్తాడు. స్వామి పుష్కరిణీతీరంలో స్థిరపడి నారదాది మునుల సేవలందుకుంటున్న సమయంలో భూదేవి వరాహమూర్తిని ప్రశ్నిస్తుంది- "సర్వేశ్వరుడైన శ్రీనివాసుడు శ్రీభూదేవులతో వేంకటాచలానికి ఎప్పుడు వేం చేస్తారు? ఆయన కల్పాంతం వరకూ ఇక్కడ ఎలా నివసిస్తారు?" అని.

దానికి వరాహమూర్తి సమాధానం:

"కృతయుగంలో వాయుమూర్తి తపస్సుకు మెచ్చి శ్రీభూసమేతుడై స్వామి పుష్కరిణీ తీరంలో తపస్సు చేస్తున్న వాయుమూర్తికి ప్రత్యక్షమవుతాడు - అప్పటినుండి పుష్కరిణి దక్షిణాన 'ఆనందము' అనే పేరుగల పుణ్యవిమానములో నివసిస్తాడు" అలా చెప్తూ యింకా... అప్పటినుండి శ్రీనివాసుడు సేనానాయకుడు అయిన కుమారస్వామిచే ఆరాధింపబడుతూ కల్పము ముగిసేవరకు - ఆ ఆనంద నిలయంలో వుంటాడు"... అని.

ఇలా స్వామి పుష్కరిణికి పశ్చిమంగా, వరాహస్వామికి దక్షిణంగా, శ్రీనివాసుడు ఉండటాన్ని అన్ని పురాణాలు చెప్తున్నాయి. పద్మపురాణంలో చాలా విపులంగా చెప్పబడింది. మార్కండేయ స్కంద, భవిష్యోత్తర పురాణాల్లో - పుష్కరిణికి

దక్షిణాన చింతచెట్టు- దగ్గరవున్న పుట్టలో తన స్థానాన్ని శ్రీనివాసుడు ఎంచుకున్నట్లు స్పష్టం చేస్తాయి.

స్కాందపురాణంలో పద్మనాభుడనే బ్రాహ్మణుడు తన పాపిదుర్మార్గుడైన కేశవుడు అనే కొడుకుని తీసుకొని అతని వుద్ధారం కోసం వేంకటాచలానికి వెళ్లి నియమంగా స్వామి పుష్కరిణిలో స్నానం చేసి, వరాహస్వామికి నమస్కరించి, శ్రీనివాసుని ఆలయానికి వెళ్లి ప్రదక్షిణము చేసి, విమానమునకు సాష్టాంగనమస్కారము చేసి బ్రహ్మా హత్య అనే పాపాన్ని నాశనం చేసే "కటహ తీర్థజలమును త్రాగాడు" అని చెప్పబడింది.

అలా పుష్కరిణి తీరంలో వున్నది వరాహ, శ్రీనివాసరూపాలతో నారాయణుడే నన్నది స్పష్టం -

బ్రహ్మోత్తర ఖండంలో

స్వామితీర్థమితిఖ్యాతం సర్వతీర్థోత్తమోత్తమ్।
తత్తీరే దక్షిణే విష్ణుః లక్ష్మ్యా సహవిమోదతే॥

అలాగే వామన పురాణంలో

మునయస్తేథభూపాల! తద్వాక్య సమన్తరమ్
దదృశుర్విమాలం దివ్యం విమానం భాస్కరోపమమ్
స్వామి పుష్కరిణీ తీరే దక్షిణేలోకవిరశ్రుతీ.

నారాయణ శ్రితం దివ్యం నిత్యఇఛ్చమహదద్భుతమ్
పాండురాభ్రఘనప్రఖ్యం నానా శృఙ్గైరలంకృతమ్

- పుష్కరిణి దక్షిణాన నారాయణుని చూచినట్లు, నారాయణుని నివాసమైన దివ్యవిమానాన్ని చూచినట్లు స్పష్టంగా వుంది.

ఇది శ్రీరామానుజులవారి వాదం.

★ ★ ★

5. శరవణుడే అయితే ఆయుధాలు ఏవీ?

తపస్సు చేయడానికి వచ్చిన కుమారస్వామి తన ఆయుధాలను వదిలేశాడు కనుక - ఈ విగ్రహాన్ని ఆయుధాలు లేని కుమారస్వామిగా తలచాలి అన్నది శైవుల వాదన.

దానికి సమాధానంగా శ్రీరామానుజులు వామన పురాణంలో 22 అధ్యాయంలో స్కందుడు తపస్సు చేయడానికి వేంకటాచలానికి వెళ్లినప్పుడు ధనుస్సును, శక్త్యాయుధాన్ని ధరించే వెళ్లాడన్నది నిరూపిస్తారు.

"తపసోర్థే ప్రయాతేతు స్కన్దే కాఞ్చనతేజసి
దేవసేనాసమాయుక్తే ధనుః శక్తిధరే ద్విజాః"

"బంగారు రంగు కల్గిన కుమారస్వామి ధనుస్సును, శక్తిని ధరించి దేవసేనతో కలిసి తపమునకు బయలుదేరగా"

ఈ పురాణంలో ప్రత్యేకంగా ఆయుధాలని తీసుకువెళ్లాడని చెప్పారు కాని, ఆయుధాలను వదిలివేసినట్లు చెప్పలేదు, ఎక్కడా.

శ్రీవారి ఆలయంలోని విగ్రహం చూస్తే చతుర్బాహుడు - నాలుగు చేతులు, ఒక చేయి కటిహస్తం - ఒక కుడిచేయి, తన పాదాలను చూపుతున్నది. తన పాదాలను ఆశ్రయించిన వారికి సంసార సాగరం దాటడం సులభం - తొడల దాకానే, కాని పైకి మునిగే అవకాశం లేదు అని చూపించే ఎడమహస్తం- మిగతా రెండు హస్తాలూ పైకెత్తి వుంటాయి- రెండు చేతులూ ఆయుధాలు పట్టుకొనడానికి ఎత్తినట్లు వుంటాయి కాని, ఆయుధాలు లేవు. ఇప్పటి విషయం కాదు, రామానుజుల కాలంలో - మరి ఆయుధాలు ఏమైనట్లు?

కుమారస్వామి ఆయుధాలు వదిలాడనుకుంటే అందులో ఒకటి ధనుస్సు- ధనుస్సును అలా చెయ్యి ఎత్తిపట్టుకోరు కదా? - పైగా కుమారస్వామి ఆయుధాలు వదిలినట్లు ఎక్కడా ఏ పురాణంలో చెప్పబడలేదు.

మరి విష్ణువు విషయానికొస్తే- పురాణాలు రెండు సన్నివేశాలు వివరించాయి. ఒకటి చోళరాజు శత్రువులచేతిలో ఓడి, స్వామిని శరణుకోరినప్పుడు తన అయిదు ఆయుధాలు ఆయనకిచ్చాడనీ, తర్వాత ఆ ఆయుధాలు స్వామి దగ్గరకు వాపసు వచ్చాయనీ- కృతజ్ఞత తెలుపుకోడానికి వచ్చిన చోళరాజుకు తన ఆయుధాలు ఎప్పుడూ అతన్ని రక్షిస్తూ ఉంటాయని అనుగ్రహిస్తాడు, అంతేకానీ, చోళరాజుకి మరల తన ఆయుధాలన్నీ తిరిగియిచ్చినట్లు స్పష్టంగా తెలియటం లేదు. కాని ఆ ఆయుధాలు ఇప్పుడు విగ్రహంలో వ్యక్తంగా లేవు.

'రెండవ సంఘటన సింహాదుడనే రాక్షసుని సంహారానికి భగవంతుడే తొండమాను చక్రవర్తికి తన శంఖచక్రాలు ఇచ్చినట్లు - వాటి సహాయంతో దేవతల తరఫున ఈ చక్రవర్తి కోట్లాదిసైన్యంతో వచ్చిన సింహాదుని సంహరించినట్లు - ఆ తరువాత భగవంతుని దగ్గరకు వచ్చిన తొండమానుని అనుగ్రహించిన శ్రీనివాసుడు 'వరం కోరుకో'మంటాడు. "తనకు సహాయంగా శ్రీనివాసుడు శంఖచక్రాలు యిచ్చిన విషయం తరతరాల భక్తులకు తెలిపే విధంగా, ఆ ఆయుధాలు ధరించకుండా వుండమని ప్రార్థన... ఆ ఆయుధాలు తొండమానునికే ఇచ్చి - తాను ఆయుధాలు వ్యక్తం కాకుండా వుండిపోతాడు - భగవంతునికి, అతని శక్తులకు, ఆయుధాలకూ ఏమీ భేదం లేదు- అంశావతారుడైన భగవంతునిలా ఆ ఆయుధాలూ అంశావతారులే - అవి అప్రాకృతాలు- ఒక ఆయుధ చక్రం తొండమానునికి యిస్తే భగవంతుని దగ్గర యింకా చక్రాయుధం లేదని తలచరాదు. బలి సంరక్షణకు చక్రం యిచ్చాడు - అంబరీషునికి చక్రం ఇస్తాడు. యిలా భగవంతునికి అనంత చక్రాలు ఆయుధాలుగా వుండగల శక్తి వుందని తెలియాలి. తొండమానుని కోరిక తీర్చడానికి శంఖచక్రాలు తిరుమల విగ్రహంలో అవ్యక్తం చేశాడు భగవంతుడు. చేతులు మాత్రం ఆ ఆయుధాలు యింకా ధరించివున్నట్లు వుంటాయి... ఆ ఖాళీ చేతులే ముందు ముందు ఎన్నో సందేహాలకు నాంది పలుకుతాయి.

అదే విషయం శ్రీరామానుజులు యాదవరాజు సభలో తేటతెల్లం చేసి- విష్ణువు విషయంలో ఆయుధాలు ధరించకుండా వుండటానికి కారణం స్పష్టంగా చాలా పురాణాలు చెప్పాయని - కనుక ఆ మూర్తి విష్ణువేనన్న దానికి సందేహం లేదని వాదించారు.

లక్ష్మీవక్షఃస్థలం

అదికాక ఆ విగ్రహవక్షఃస్థలంలో లక్ష్మీదేవి వుంది. లక్ష్మీసమేతంగా అరుంధతీదేవికి వేంకటాచలంలో ప్రత్యక్షమయినట్లు గరుడపురాణం చెబుతుంది.

బ్రహ్మాండ పురాణంలో చక్రవర్తికి వేంకటాచలంలో శంఖచక్రాలతో, కటి, వరద హస్తాలతో, పద్మపీఠంమీద నిలబడిన వాడు. వక్షఃస్థలంలో లక్ష్మీశ్రీవత్సములు కల శ్రీనివాసుడు ప్రత్యక్షమైనట్లు చెప్పబడింది.

అంతేకాదు. బ్రహ్మాండ పురాణము తీర్థఖండములో ఆ చక్రవర్తి భగవంతుని ప్రార్థించాడట "తాను ఎటువంటి రూపము గల శ్రీనివాస భగవానుని చూచాడో అటువంటి రూపముతోనే అందరికీ కూడా కనిపిస్తుండమని ఇక్కడే నివసించమని". అటువంటి రూపంలోనే భగవంతుడు అర్చారూపుడైనాడని పురాణం.

'యత్తద్రూపం దుర్లభం యోగివర్యైః రమ్యం భూయాదీదృశం సర్వదృశ్యమ్।
అత్రైవ త్వం సర్వదా వాసమీయాః సర్వేషాంవై మానవానాం హితాయ॥'

'ఓ మిత్యుక్త్వాఽథాపరం ప్రాహవాక్యం మద్భక్తస్త్వం నాస్తి తుల్య స్త్వయాఽన్యః।
సన్తుష్టోఽహం మత్సఖిత్త్వం ప్రధాస్యే వేత్థత్వం సుహృదం భక్తవశ్యమ్॥'

అట్లే అగుకాక - అని శ్రీనివాసుడు అనుగ్రహించాడు.

ఇదే రూపంతో కుమారస్వామికి కూడా దర్శనమిచ్చినట్లు మార్కండేయపురాణం చెబుతుంది.

తరువాతి కాలంలో - భవిష్యోత్తరపురాణం 13వ అధ్యాయంలో యిదే శ్రీనివాసుని రూపం - కాని శంఖచక్రాలు కావు - కాని కుడిచెయ్యి తన పాదములు చూపుచూ, ఎడమచెయ్యి కటిపై పెట్టుకొని, వక్షఃస్థలంలో లక్ష్మీదేవి కల వేంకటేశ్వరుని రూపం వర్ణిస్తారు. అంటే ఒకే రూపం- మధ్యకాలంలో శంఖచక్రాలు అదృశ్యమయ్యాయి. మిగతా రూపం అదే- అంటే మొదట ఆయుధాలతోవున్న ఆ రూపమే తరువాత కాలంలో శంఖచక్రాలు లేకుండా వ్యక్తమవుతుంది. ఆ రూపం శ్రీమహావిష్ణువుదే కదా!

ఈ విగ్రహం శివునిది కాదని చెప్పడానికి వరాహ పురాణ ప్రథమ భాగం తొమ్మిదవ అధ్యాయం సూచిస్తుంది.

ఇత్యుక్త్వా కమలనాథః ప్రాహశానంశుచిస్మితమ్।
'కిమాగమన కార్యంతే వద శఙ్కర సత్వరమ్'॥

ఇతి పృష్టః శివః ప్రాహ 'స్వామిన్' ఇత్యచ్యుతం వచః
స్వామిం స్త్వయా సదాయత్ర స్థేయతే వేంకటేశ్వర।

తద్దైవ దేవ స్థాతవ్యం మయా వృషగిరీశ్వర
ఇతి పృష్ఠ పునః ప్రాహ నీలమేఘ సమద్యుతిః॥

కల్పం చ తవసామీహ వేఙ్కటాహ్వాయ భూధరే।
త్వమప్యత్ర మృదానీశ! మహదేవ ! వస ప్రభో।
ఉపత్స కాయ మస్యాద్రేః శోచిష్కళదశీశ్వరః॥

కమలనాథుడు శ్రీనివాసుడు "శంకరా! నీవు వచ్చిన పని ఏమి? త్వరగా తెలుపు" అనగా శివుడు వేంకటేశ్వరునితో "స్వామీ, నీవు ఎక్కడ వుండిన ఎల్లప్పుడూ నేనూ అక్కడే వుండాలి" అని కోరాడు. 'మహాదేవా! నేను వేంకటాచలం పై కల్పాంతము వరకు నివసిస్తాను. నీవు ఇక్కడ కొండకు దిగువన ఆగ్నేయంగా నివసించు'. అందుకే శివుడు కపిలతీర్థం నివాసం చేసుకొన్నాడు. అలా శివుని విషయంలోనే కొండపైన ఆరాధ్యదేవతగా అవకాశం లేనప్పుడు ఇక సుబ్రహ్మణ్యుని (స్కందుని) విషయం చెప్పాలా?

ఇప్పటి అర్చావిగ్రహము- బ్రహ్మాదులకోరికపై స్వయంభువుగా వెలసినదని పురాణాలు చెప్తున్నాయి. కాని బ్రహ్మాండపురాణంలో ఈ అర్చా విగ్రహవిషయం మూడవ అధ్యాయంలో యింకా స్పష్టంగా చెప్పబడింది - శ్రీనివాసుని ఆజ్ఞతోనే శంఖరాజు తాను చూచిన విధంగానే - అంటే ఏ రూపంలో తాను శ్రీనివాసుని చూచాడో ఆ ఆకారంలోనే విమానాన్ని అందులోని శ్రీనివాస విగ్రహాన్ని నిర్మాణం చేశాడని.

ఇలా మహావిష్ణువైన శ్రీనివాసునికి పుష్కరిణికి దక్షిణ భాగాన నాలుగు చేతులూ శంఖ, చక్ర, కటి వరద హస్తాల్తో, వక్షఃస్థలంలో శ్రీమహాలక్ష్మి కౌస్తుభాలతో వున్నట్లు చాలామందికి ప్రత్యక్షమైనట్లు, శంఖచక్రాలు తొండమాన్ చక్రవర్తికి యిచ్చి అవ్యక్తం చేసినట్లు. విమాన/విగ్రహ నిర్మాణాలు జరిగినట్లు- యిన్ని నిదర్శనలు వున్నప్పుడు - ఇక్కడ కొండపై వున్న అర్చామూర్తి శ్రీనివాసుడే కాని ఇతరదైవం- శివుడుకాని, కుమారస్కందుడు కాని కాదు. విగ్రహం పురుషునిది కనుక శక్తి విగ్రహమనటానికి అవకాశమే లేదు. కాలభైరవుని ప్రసక్తి ఎక్కడా రాలేదు అని ప్రమాణ పూర్వకంగా శ్రీరామానుజులు యాదవరాజు ముందు వాదించి ఇంతేకాదు- ఆళ్వారులందరూ ఆయనను విష్ణువుగా కీర్తించారు అన్నారు.

ఆళ్వారులు

పురాతనంగా ఈ ఆలయంలోని అర్చామూర్తి దివ్యసూరులు, భక్తాగ్రేసరులైన నమ్మాళ్వారు, తిరుమంగై ఆళ్వారులు శ్రీమహావిష్ణువుగానే కొలిచి ద్రావిడ వేదంలోనూ, వారి దివ్యప్రబంధాలలోనూ స్తోత్రం చేశారు. వారి స్తోత్రాలలో వరాహస్వామిని, శ్రీనివాసుని, వారివారి విగ్రహరూపాలను కొనియాడుతూ చేసిన స్తోత్రాలను బట్టి- వారు చేసిన స్తోత్రం ఒక్క వరాహస్వామికి మాత్రమే (విష్ణుపరంగా) చేసిందనటానికి అవకాశం లేదు- శ్రీనివాసుని పరంగా కూడా చేశారు.

నమ్మాళ్వారు రచించిన బ్రహ్మసంహిత (తిరువాయిమొళి)లో ఇక్కడ స్వామి కుడి ఎడమ చేతుల ముద్రలను- భగవంతుడు భక్తులకు తన పాదాలు ఆశ్రయించమనీ, ఆ విధంగా ఆశ్రయించిన వారికి సంసార సాగరం మోకాలుబంటిలోతే అని సంకేతంగా తన అభిప్రాయాన్ని తెలియచేస్తున్నట్లు భావించారు. అలా ఆళ్వారులు చేసిన స్తోత్రాలు ప్రమాణాలే. ఆ స్తోత్రాలన్నీ విష్ణుపరంగానే వున్నాయి.

బ్రహ్మాండపురాణం ఏడవ అధ్యాయంలో "చక్రవర్తి (తొండమాను) కి భక్తవాత్సల్యంతో శ్రీనివాసుడు శంఖచక్రాలు ఇచ్చినట్లూ, అందువలన అర్చారూపంలోని భగవానుని రెండు చేతులూ శంఖచక్రములు లేక కన్పిస్తున్నవి.

ఆ విగ్రహానికి మొదట వున్న శంఖచక్రములు ఏమైనాయో, ఇప్పుడు ఎందుకు లేవో స్పష్టంగా చెప్పబడింది.

శంఖచక్రాలు తొండమానునికి అనుగ్రహించి శత్రుసంహారానికి భగవంతుడు అతనికి ఇచ్చినట్లు - శత్రు సంహారం చేసి ఆ శంఖచక్రాలు శ్రీనివాసుని వద్దకు తిరిగివస్తాయి.

ఆ చక్రవర్తి భగవంతుడు చేసిన సహాయానికి భక్తితో స్తోత్రం చేస్తాడు. సంతోషించి భగవంతుడు రాజును 'వరం కోరుకో' మంటాడు.

ఆ చక్రవర్తి కోరిక వరం:

"మమాఽయుధప్రదానస్య ఖ్యాత్యైదేవోత్తమ ప్రభో।
అర్చాబిమ్బే శిలాబిమ్బే- చక్రశఙ్ఖ నధారయ॥

"ప్రభూ! నాకు నీ ఆయుధాలు చేసిన ఉపకారం కీర్తి శాశ్వతంగా నిలిచేందుకు నీవు అర్చావిగ్రహమైన శిలావిగ్రహంలో శంఖచక్రములు ధరించవద్దు" అని ప్రార్థించాడు.

ఆ ప్రార్థనను అనుసరించి స్వామి శంఖచక్రాలు ధరించలేదు. కాని ఆ శంఖచక్రాలు స్వామికి రెండు చేతులలో భక్తుల కన్నులకు కన్పించకుండా వుంటాయని పురాణం చెబుతుంది.

"ఇతి సమ్ప్రార్థితోదేవోనధారయ పునశ్చతే।
అదృశేతిష్వతశ్చేఛే పార్శ్వతః శార్ఙధన్విపుః॥

అని శ్రీరామానుజులు శంఖచక్రాలు లేకుండుటకు కారణం విపులంగా పురాణాల్లో వివరించబడినదనీ, పురాణకాలం నుండీ ఆ ఆళ్వారుల కాలంవరకూ ముందు శంఖచక్రాలతో, ఆ తర్వాత అవి లేకుండా దర్శనమిచ్చారనీ, అలా దర్శనమిచ్చినప్పుడు రెండు కాలాల్లో కటి వరద హస్తాలు కన్పించేవనీ, ఆ కటి వరద హస్తాలు ఈనాటికీ వున్నాయి కదా. అలా చతుర్భుజుడై కటి వరద హస్తాలతో, మిగతా రెండు హస్తాలలో ముందు శంఖచక్రాలు వుండి తరువాత అదృశ్యం అయిన ఆ విగ్రహాన్ని అన్ని తరాల్లో విష్ణువుగానే కొలవడం జరుగుతున్నదనీ... అటువంటప్పుడు– ఆ విగ్రహము శివునిదో, కుమారస్వామిదో, మరి ఏ ఇతర దేవతదో అని తలవటానికి ఆస్కారమే లేదని రాజు ముందు వాదించారు.

సింహాదుడనే రాక్షసుని చంపడానికి చోళరాజుకు యిచ్చిన పంచాయుధాల ప్రసక్తి కూడా బ్రహ్మాండపురాణం పదకొండవ అధ్యాయంలో వస్తుంది. సింహాదుని సంహరించి రాజు శ్రీనివాసునికి సంగతి విన్నవించి శంఖ, చక్ర, గద శార్ఙ్గ, నందకాలను మరల స్వామికి అప్పగిస్తే, రాజుతో "వీటిని నీకు సహాయంగా వుంచుతానూ – అందరికీ కన్పించకుండా పూజకు మాత్రం సాన్నిధ్యం వుండేలాగ పంచాయుధాల వ్యవస్థ" చేస్తాడు శ్రీనివాసుడు. అంతేకాదు, "తరువాత కాలంలో భక్తులచేత కల్పింపబడిన వివానం మొదలైన వాటివలె దివ్యమైన ఆయుధాల్ని కూడా భక్తుల తృప్తి కొరకు స్వీకరిస్తాను" అని చక్రవర్తికి భగవంతుడే చెప్పినట్లు పురాణం.

★ ★ ★

6. శివుణ్ణి పూజించే బిల్వపత్రాలతో శ్రీనివాసుడికి పూజలా?

రామానుజుల వాదన విన్న ప్రతిపక్ష వాదులు "ఈ విగ్రహానికి వైష్ణవుల ద్వారా ఆరాధన జరుగుతున్నప్పటికీ ప్రతిసంవత్సరము ధనుర్మాసములో ఒక నెలరోజులు స్వామికి బిల్వపత్ర పూజ జరగటము చూస్తున్నాము. ఇది ఈ దేవుడు విష్ణువు కాదనటానికి ప్రమాణమే కదా?

"ఈ దేవునిది విష్ణురూపమే అయితే ఆయనకు వుండవలసిన దివ్యాయుధాలూ లేక, ఇతర దేవతలకు మాత్రమే వుండే జటలు, నాగాభరణమే ధరించడము, బిల్వపత్ర పూజలందుకోడము - ప్రత్యక్షముగా చూస్తున్న మనము - విష్ణువని ఎలా ఒప్పుకోగల"మని వాదించారు.

ఆయుధాల గురించి పురాణాల్లో యుక్తియుక్తంగా చెప్పబడినా, ఇతరవిషయాలు, జటలు, నాగాభరణధారణ, బిల్వపత్రపూజ విషయం ఎలా సమర్థిస్తారని యాదవరాజు శ్రీరామానుజులను ప్రశ్నించాడు...

దానికి సమాధానముగా శ్రీరామానుజులు 'బిల్వపత్రపూజ ఇతర దేవతలకే కాని, శ్రీమహావిష్ణువుకు కాదనటానికి ప్రమాణాలు లేవు. పైగా బిల్వము లక్ష్మీదేవికి చాలా ఇష్టము.

> "ఆదిత్యవర్ణే తపసోధిజాతో వనస్పతిః
> తవవృక్షోదబిల్వః" అని వేదం కదా!

పైగా ధనుర్మాసపూజ గురించి హారీతస్మృతిలో

"శుక్రవారము రాత్రి ఒడిలో ఎడమభాగమున లక్ష్మీదేవితో వున్న శ్రీలక్ష్మీనారాయణునకు తునగని బిల్వపత్రాలతోనూ, తులసీదళాలతోనూ -

శ్రీసూక్తపురుష సూక్తముతో పూజించాలి”. ‘గోపాల రూపములోవున్న కృష్ణుని - ‘గన్నేరు, కాంచనపుష్పాలు, బిల్వములతో శ్రీమతే వేంకటేశాయనమః’ అని పురుషోత్తముని పూజించాలని స్పష్టంగా వుంది.

నృసింహాకారవిష్ణువుని కూడా నృసింహ అనుష్టుప్ మంత్రంతో, గాయత్రీ మంత్రంతో తునగని బిళ్వపత్రాలతో, జాజి, మల్లెలతో పూజించాలని ప్రమాణాలు యిచ్చారు శ్రీరామానుజులు.

అంతేకాక శ్రీవేంకటాచల మాహాత్మ్యము గురించి వరాహపురాణంలో చెప్తూ:-

“యోగులు జగన్నాథుని బిల్వదళములు, నల్లని, తెల్లని మంచి తులసీ దళములతో అర్చన చేస్తున్నారని వర్ణించే ప్రమాణం వుంది.

“అర్చయన్తి జగన్నాథం తథా బిల్వదళైరపి।
తులస్యాః సుదళైశ్చాపి కృష్ణశ్వేతైశ్చయోగినా॥”

ఆ పురాణ రెండోభాగంలో

“బిల్వవనములో నివసించు విష్ణుపత్నికి నమస్కారము - అని దేవతలు స్తోత్రం చేశారనీ దానికి లక్ష్మీదేవి ప్రసన్నురాలై,

“ఏ మానవులు భూలోకంలో అఖండబిల్వపత్రములతో నన్ను అర్చిస్తారో, ఏ దేవతలూ, మానవులూ, మీరు చేసిన ఈ స్తోత్రంతో నన్ను ఆరాధిస్తారో వారు ధర్మ, అర్థ, కామ, మోక్షాలనే పురుషార్థములు విశేషంగా పొందుతారు.

అలా శ్రీమహాలక్ష్మికి బిల్వంపై ప్రీతి. శ్రీనివాసుని వక్షస్థలమే ఆమెనివాసము.. కనుక బిల్వపత్రార్చన శ్రీనివాసునికి తగినదే... యుక్తమే.

జటాధారణ

జటాధారణ ఇతరదేవతలకే కాని శ్రీనివాసునికి కాదనటం కూడా యుక్తంగాలేదు. విష్ణుమూర్తికి వివిధ అవతారాల్లో జటాధారణ ప్రసక్తి వుంది.

సృష్టిలోని అన్ని రూపాలూ భగవంతునివే... భాగవతంలో భగవంతుడు, వివిధ యుగాల్లో, వివిధ అవతారాల్లో వివిధ వర్ణాలలో, వివిధ అలంకారాలలో వుంటాడని ప్రత్యేకంగా చెప్పబడింది. జటాధారణ అందులో ఒకటి.

సాత్వత సంహితలోని శ్రీనివాసుని వర్ణన – అనంతుని రూపంలో యిలా వుంది.

"ఫుల్లరక్తాంబుజాభాసం శ్వేతపద్మకరాంకితం
శ్రుతీరగాద్యావక్త్రైభ్యాం ప్రోద్గిరంతమనుస్మరేత్

సద్గురుసంపన్నుడు, నాలుగు ముఖములు, నాలుగు భుజములు, నిడుపైన గడ్డము, జడలు దండము కమండలము, జపమాల కలవానిని ... ధ్యానించవలెను.

నాలుగు రూపాల్లో – నర, నారాయణ, హరి, కృష్ణ- కృష్ణావతారాన్ని వర్ణిస్తూ – జడలు ధరించినవాడని ప్రత్యేకంగా వర్ణించబడినది.

సాత్వత సంహితలో ప్రత్యేకంగా భగవంతుడు జడలు ధరించిన అవతారాల గురించి వివరించబడినది. అక్కడ వర్ణించిన చరమరూపం – శ్రీనివాసుని రూపానికి చాలా దగ్గర పోలికలతో వున్నది.

శ్రీవరాహపురాణంలో వేటకు వెళ్తున్న శ్రీనివాసుని వర్ణిస్తూ, 'ఎక్కువ పొడవు లేని జడలు' కలవాడనీ తెల్లని తలపాగాతో చుట్టబడిన జడలు కలవాడనీ చెప్పబడింది.

అలాగే వామన పురాణంలో విష్ణువైన శ్రీనివాసుని వర్ణిస్తూ "అందమైన కిరీటానికి వెనుక భాగాన దీర్ఘముగ వ్రేలాడు జడలు" కలవాడని వర్ణించబడింది.

శుకమహర్షికి శ్రీనివాసుని దివ్య దర్శనం ఎలా కలిగిందో పద్మపురాణం చెబుతూ విష్ణువు రూపాన్ని, ఆయుధాలను (శంఖచక్రాలను వర్ణించి) బంగారు కేశముల ప్రశక్తి చేశారు.

ఇలా పురాణాల్లో శ్రీమహావిష్ణువు వర్ణన, ప్రత్యేకంగా వేంకటాచలంపై విరాజమానుడైన శ్రీనివాసునికి, ఇతర విష్ణు చిహ్నాలతో పాటు 'జడల' ప్రస్తావన పలుమార్లు చేయబడటం వలన – శ్రీమహావిష్ణువుకు జడలుంటాయా అన్న ప్రశ్నకు తావులేదు. జటలు, జడలు, విష్ణు ధర్మమే అని రామానుజులు వాదించి యాదవరాజు సందేహాన్ని తీర్చారు.

★ ★ ★

7. విష్ణువైతే, నాగాభరణాలెలా వున్నాయి?

శైవుల వాదన, 'నాగాభరణాలు' విష్ణుచిహ్నాలు ఆభరణాలు కావనీ, కనుక వేంకటాచలంపై వున్న అర్చామూర్తి విష్ణురూపం కాదనీ, నాగాభరణం - శివునికి, కుమారస్వామికి ముఖ్యంగా చెప్పబడినందున ఈ విగ్రహం శివునిది లేదా శివ కుటుంబ సంబంధమైనది...

దానికి రామానుజుల సమాధానం - భవిష్యోత్తర పురాణంలో పదకొండవ అధ్యాయంలో పద్మావతీ పరిణయ సందర్భంగా ఆకాశరాజు కానుకలిస్తూ- ఆదిశేషునిపై పరుండే విష్ణువుకు శేషుని చిహ్నంగా ఆభరణం యిస్తే బాగుంటుందని తలచి రెండు నాగాభరణాలను బహూకరించినట్లు స్పష్టంగా చెప్పబడింది.

'నాగభూషణయుగ్మం చ బాహుపూరాదికాంసథా' అదే పురాణంలో పార్వతిని ఉద్దేశించి పరమశివుడు వేంకటాద్రి మీద వెలసిన శ్రీనివాసుని వర్ణిస్తూ - రమ్యమైన నాగాభరణాలు కలవాడని కీర్తించాడు.

సాత్వత సంహితలో -శ్రీమహావిష్ణువు అనంతుని (శేషుని) శయ్యగానే కాక ఆభరణముగా కూడా కలవాడని చెప్పబడినది.

కనుక మారేడు (బిల్వ) దళములతో పూజింపబడుట, శంఖచక్రములు లేకుండుట, జటాజూటములు కల్గివుండుట. నాగాభరణములు ధరించి వుండుట మొదలైన చిహ్నములను బట్టి ఈ మూర్తి శ్రీమహావిష్ణువుది కాదని చెప్పుట సమంజసముగా లేదని శ్రీరామానుజులు యాదవరాజుకు సప్రమాణముగా నిరూపించి - అతని మనస్సులోని సంశయాలు తొలగించారు.

జటాజూటములు, నాగాభరణములు శివుని యందు ప్రసిద్ధముకాని, స్కందుని యందు కాదు కనుక ఇది స్కందుని విగ్రహము కాదని నిరూపించాడు.

స్వామి హృదయంలో లక్ష్మీనివాసము, శ్రీవత్సచిహ్నము. శంఖచక్రములు లేకుండుటకు సప్రమాణబలవత్తర కారణము. బహుపురాణములలో విశేషముగా

శ్రీనివాసుని విష్ణురూపంగా వర్ణింపబడిన కారణంగా ఇచ్చటి అర్చామూర్తి శ్రీనివాసుడు – ఆ శ్రీమన్నారాయణుడే కాని మరే ఇతర దేవతకాదని చెప్తూ పద్మపురాణంలో ఈ నారాయణునికి బ్రహ్మశక్తులు శంకరశక్తులచే సేవింపబడుచున్నాడు" అని చెప్పబడినందు వలన – స్వతహాగా అన్ని శక్తులూ శ్రీమన్నారాయణునివే... అతని అనుగ్రహంతోనే బ్రహ్మకు శివునికి కొన్ని లభించినవని...

రామానుజుల ప్రమాణములతో సంశయ నివృత్తి కలిగి – ఇచ్చటి అర్చామూర్తి శ్రీమన్నారాయణుడే అని ఇది వైష్ణవ క్షేత్రమేననీ, ఇప్పుడు జరుగుతున్న పూజావిధానము శాస్త్రసమ్మతమని, శైవులవాదనలో సత్యంలేదని నిర్ణయానికొచ్చి ఆ విషయం సభలో వెల్లడించాడు యాదవరాజు. కాని శైవులు తమ వాదన ఇంకా వుందని, మరుసటిరోజు విశదపరచెదమని చెప్పగా ఆనాటి సభ ముగించారు.

మరుసటిరోజు చాలా ఆలోచించుకొని వచ్చిన శైవులు "ఈ అర్చామూర్తి కుమారస్వామి ఐనా కావాలి, లేదా మహాదేవుడన్నా కావాలి లేదా 'హరిహర' రూపుడన్నా కావాలి కాని కేవలం 'విష్ణువు' మాత్రం కాడు – విష్ణువు గుర్తులున్నంత మాత్రాన స్కందుడు కాదనటానికి లేదు. ఎందుకంటే – ఆయనలో కూడా విష్ణుగుర్తులున్నాయి కనుక. వామనపురాణం 21 వ అధ్యాయంలో బృహస్పతి స్కందుని జన్మ వృత్తాంతం చెపుతూ స్కందునితో "నీవు శాశ్వత వైష్ణవ తేజోరూపుడవని మరచితివా?" అంటాడు కదా!.

"విష్ణుకళ అంశతో అవతరించిన భగవంతుడైన స్కందుడు మనకందరకు సుఖమునిచ్చువాడు కాగలడు" స్కందుని స్తోత్రం చేస్తూ బృహస్పతి యిలా అంటాడు.

"త్వం విష్ణుస్త్వం విధాతా చ త్వంరుద్రఃకాలరూపధృక్
శిఖి వాహన షడ్వక్త్ర, కుమారస్తారకాన్తకః"

"నీవు విష్ణుమూర్తివి, నీవు బ్రహ్మవు, నీవు రుద్రుడవు... నీవు కాల స్వరూపుడవు"...

కనక ఈ అర్చామూర్తి సుబ్రమణ్యుడు తప్పక కావచ్చు కదా?

లేదా, ఇతడు శివుడే అవ్వచ్చు కూడా – శివుడు జటలు ధరించడము నాగాభరణాలతో శోభిల్లడము లోక ప్రసిద్ధి కదా?

ఈ వైష్ణవులు చెప్పినట్లు– విష్ణువులో సర్వలక్షణత్వమున్నట్లే, మేము కూడా శివునిలో సర్వలక్షణాలున్నాయని చెప్తున్నాము. ఇతనిలో విష్ణువు, శివుని యిద్దరి లక్షణాలు

వున్నప్పుడు, వారు చెప్పినట్లు విష్ణువే అని ఎందుకు అనుకోవాలి, మేము చెప్పినట్లు శివుడనుకొనవచ్చు కదా?

అలాకాకపోతే... ఏ ఆధారాలతో - వైష్ణవుల దివ్యప్రబంధ ఆధారాలతో సహా చూచినా ఈ దేవుడు 'హరిహరుడ'నవచ్చు కదా?

స్కాందపురాణం మొదటిభాగంలో 8వ అధ్యాయంలో

"యే స్మరన్తి మహాదేవం శ్రీనివాసం విముక్తి దయే।
కీర్తయన్త్యథవా విప్రాః తే ముక్తాః పాపపంజరాత్"

మోక్ష మిచ్చువాడైన మహాదేవుని శ్రీనివాసుని ఎవరు తలచెదరో, కీర్తించెదరో, వారు పాప పంజరం నుండి బయటపడుదురు.

"ఏ నరులు, శ్రీనివాసుని, మహదేవుని ఒక్కసారైనా పూజిస్తారో, వారికి దానములతో తపస్సులతో పనిలేదు".

"కిందానైః కిం వ్రతైస్తేషాం కిం తపోభిః కిమధ్వరైః
వేఙ్కటేశం పరం దేవం యేన చిన్తయతి క్షణమ్"

ఇలా కొన్నిచోట్ల ఈ దేవుని శ్రీనివాస, మహాదేవ అని రెండు పదాలతో పిలిచిన సందర్భమున్నప్పుడు - ఒక్క విష్ణువుగానే ఎందుకు తలచాలి. మేం మహదేవుడంటాం!"

'హరిహరుడు' అంటే ఒప్పుకొంటామేకాని కేవలం విష్ణువంటే ఎలా ఒప్పుకోగలం...

యాదవరాజు రామానుజులవాదనతో పూర్తిగా ఏకీభవిస్తున్నా - తాను విష్ణువుని సర్వశబ్దవాచ్యుడని తెలుసుకొని మహాదేవ శబ్దం కూడా విష్ణువుదే. శివునిదని తలచినా తాను నిర్ణేతస్థానంలో వున్నాడు కనుక రామానుజమునినే - ఈ వాదమునకు సమాధానం చెప్పమంటాడు.

రామానుజులు 'స్కందునిలో విష్ణ్వంశవున్నది. కామరూపుడు కనుక 6 చేతులుండవచ్చు. చతుర్భుజుడు కావచ్చు అంటున్న వీరు భగవద్గీత శ్లోకమును జ్ఞప్తికి తెచ్చుకొనవలెను.

యద్యద్విభూతిమత్ సత్త్వం శ్రీమదూర్జితమేవవా।
తత్తదేవావగచ్ఛ త్వం మమ తేజోంశ సంభవమ్॥

"ఏ ప్రాణికి ఏ వైభవమున్నా, సిరిగాని బలంగాని, శక్తికాని వున్నా అది నా తేజముతో ఒక అంశము నుండి పుట్టినదే"...

'సేనాపతులలో నేను స్కందుడను' - అనటంలో కుమారస్వామిలో విష్ణు అంశ వుండవచ్చు. కాని విష్ణువుకే ప్రత్యేకంగా చెందిన శంఖచక్రాలతో కూడిన రూపం వుండి తీరాలి అంతే. వృక్షాలలో అశ్వత్థవృక్ష అనీ - విష్ణు అంశలేనిదే రాజుకాలేడు - కాని అలా అంశవున్నా వారందరిలో శంఖచక్రాలు లేవు కదా? అదీకాక వామన పురాణంలో కుమారస్వామి, పుష్కరిణి వద్ద తపస్సు చేస్తున్న వాయుమూర్తిని చూచి ఆయన చెంతనే తాను కూడా శంఖచక్రములు ధరించినవాడూ, బ్రహ్మరుద్రాదుల కంటే అధికుడూ అయిన నారాయణుని గురించి తపస్సు చేశాడనీ,... ఆ తపస్సు, తారకాసురవధ వలన తనకు కల్గిన బ్రహ్మహత్యాపాప పరిహారార్థం చేశాడని చెపుతూ- వాయుదేవునికి శంఖచక్రాలు ధరించిన శ్రీనివాసుడు ప్రత్యక్షమయిన వృత్తాంతం వర్ణిస్తారు.

అదేవిధముగా స్కందుని తపస్సు ఫలించి అతని ఎదుట శ్రీమన్నారాయణుడు ప్రత్యక్షమయి కల్పాంతము వరకు ఎల్లవేళలా తనను ఆరాధిస్తూ తనవద్దే వుండే వరాన్ని యివ్వడం సూచిస్తారు. దీనివలన పూజించేవాడు స్కందుడు పూజించబడేవాడు శ్రీమన్నారాయణుడు అని - నారాయణుని కొరకు తపస్సు చేయడానికి ఆ నారాయణుడున్న స్థలానికి స్కందుడు వచ్చాడనీ తెలుస్తుంది. అంతేకాని వారిద్దరూ ఒక్కరే అనే అవకాశం లేదు. ఈ స్కందునికే కాదు, ఇక్కడ తపస్సు చేయడానికి వచ్చిన బ్రహ్మ, వాయు, రుద్ర, ఇంద్ర, మరి ఇతర దేవతలకు శ్రీమన్నారాయణుడు యిక్కడ ప్రత్యక్షమయినట్లు అన్ని పురాణాలూ చెప్తున్నాయి. పురాణం ఇంకొక విషయం కూడా స్పష్టంగా చెపుతోంది. స్కందుడు కుమారధార వద్ద నివసించాడు. స్వామి పుష్కరిణికి దక్షిణాన కాదు... అక్కడ శ్రీమన్నారాయణుడు శ్రీనివాసుడుగా వుండటం, ప్రతిష్ఠింపబడటం - అర్చారూపంలో అక్కడ వుండి భక్తులను అనుగ్రహించి వారి పాప పరిహారం చేయమని బ్రహ్మ కోరగా నారాయణుడు అంగీకరించడం, ఎందరికో శంఖచక్రాలతో, కటివరదహస్తాలతో ప్రత్యక్షమవడం, శంఖరాజును, చోళరాజును, తొండమానుని తనకు ఆలయనిర్మాణం చేయమనడం, వారు నిర్మించడం, పూజలు జరపడం, అలా జరిగినవన్నీ స్వామిపుష్కరిణి దక్షిణప్రాంతంలోనే జరగడం... యిలా అన్ని నిదర్శనాలూ విష్ణుపరంగా వుండగా... అక్కడ స్కందుని ప్రతిష్ఠ చేసినట్లు ఒక్క ఆధారమైనా వుందా?

మహాదేవుని ప్రస్తావన అదివరకే చేయబడింది కదా. ఆయనకు కొండదిగువన ఆగ్నేయంగా నివాసం ఇవ్వబడింది. మిగతా దేవతలలాగే మహాదేవుడుకూడా అక్కడ తపస్సు చేయడానికి వచ్చాడు. మహాదేవ శబ్దం ముఖ్యంగా విష్ణువుకే వర్తిస్తుంది. కాని వాడుకలో శివునకు చెప్పబడినా, విష్ణువుదే మహాదేవత్వ గుణాలు. శివునికి కూడా మహాదేవుడు విష్ణువు. ఆయన గురించి తపస్సు చేసి ఆయన అనుగ్రహం పొందడానికే శివుడు కూడా వెంకటాచలానికి వచ్చినది.

కల్పాంతమువరకూ ఆ వెంకటాచలంపై వుంటానని శివునికి శ్రీమహావిష్ణువు చెప్పిన విషయం జ్ఞాపకం చేసుకోవాలి. విష్ణు ఆవిర్భావం తరువాత శివుడు కైలాసానికి వెళ్లిన వృత్తాంతం కూడా వామన, వరాహ, స్కాందపురాణాల్లో చెప్పారు గదా? ఇంకొక విషయము శివునికి అర్చావతారంగా భూలోకంలో పూజలేదు- లింగాకారంగానే ఆయనకు ఆరాధన. కనుక ఈ అర్చావిగ్రహం శివుడు కాదు.

అలా హరుడు కానేకాదన్నప్పుడు, 'హరి' అన్ని ఆధారాలున్నప్పుడు - "హరిహరుడు కావచ్చన్న వాదన నిరాధారము - ఏదో వాదించడానికి వుపయోగించిన యుక్తిగా భావించవలసిందే. మహాదేవశబ్దం శివపదంకాదని చెప్పాం గదా- శ్రీనివాస మహాదేవ పదాలతో అక్కడ చెప్పబడినది నారాయణుణ్నే. "దేవతలందరికన్నా అధికుడన్న అర్థంతో - ఆ స్కాందపురాణంలోనే చెప్పింది చూద్దాం"

యే స్మరంతి మహాదేవం శ్రీనివాసం విముక్తిదయే

"ముక్తినిచ్చేవాడునూ మహదేవుడునూ అయిన శ్రీనివాసుని ఎవరు తలుస్తారో కీర్తిస్తారో వారు పాప పంజరాలనుండి బయటపడతారు" అని. దాని తరువాత పరదేవ పదం కూడా శ్రీనివాసుని పరంగా వుపయోగించబడింది. అలా శ్రీనివాసునే 'మహాదేవ' పదంతో ఒకచోట 'పరదేవ'పదంతో ఇంకొకచోట చెప్పబడింది.

స్కాందపురాణంలోనే - వేంకటాచలంలోని దేవుని గురించి చెప్తూ...

"వేలకొలది బ్రహ్మహత్యలు, అయుతముల కొలదీ (పదివేలు) మద్యము త్రాగుటవలన కలిగిన పాపములు దేవుడైన శ్రీనివాసుని దర్శించితే పూర్తిగా నశించిపోతాయి. ...దేవేశుడైన వేంకటేశ్వరుని భక్తితో ఎవరు పూజిస్తారో, వారు కోటివంశములవారితో హరిమందిరానికి మోక్షానికి - వైకుంఠానికి వెళ్లెదరు."

"బ్రహ్మహత్యాసహస్రాణి సురాపానాయితాని చ।
దృష్టే నారాయణేదేవే విలయం యాన్తి కృత్యం॥

వేంకటాచలదేవేశం కీర్తయేన్నర్చయన్నపి।
అవశ్యం విష్ణుసారూప్యం లభతే నాత్రసంశయః॥

వేంకటేశ్వరదేవేశా యః పూజయతి భక్తితః।
సకోటి వంశసంయుక్తః ప్రయాతి హరిమన్దిరే॥"

ఇలా స్పష్టంగా వేంకటాచలంలో వున్నది మహావిష్ణువు నారాయణుడు హరి అని చెప్తూ, ఆయనను భక్తితో ఆరాధిస్తే "విష్ణు సాయుజ్యమేనని చెపుతుంటే – యిది 'హరిహర' రూపమనే సావకాశం లేదు. హరిహరరూపుడైతే విష్ణువు ఒక్కనితోనే సాయుజ్యమును పొందడం ఫలముగా చెప్పడం సమంజసం కాదుకదా? కనుక యితడు 'హరిహరుడు కాదు' విష్ణువే.

ఊర్ధ్వపుండ్రకుడు

ఇంతేకాక పద్మపురాణంలో "అష్టమందు కలాధారలలాట ఊర్ధ్వపుండ్రకుడు అని స్వామివారి నామాన్ని వర్ణించాడు. భవిష్యోత్తరపురాణంలో కూడా ఈ నామప్రసక్తి వస్తుంది. ఈ నామము గురించి 'నొసట' పెట్టుకొన్నదని చెప్పబడింది.... అష్టమిచంద్రుడన్నారని శివుని తలపై చంద్రుడున్నాడని శివునితో సమన్వయం చేయవీలులేదు. చెప్పిన విషయం నామం (పుండ్రం) గురించి, ధరించేది నొసట – ఆకారం మాత్రం – అష్టమి చంద్రునిది – మృత్తికతో – అని చెప్పారు. శివునికి నొసటిపైన కాక తలపై చంద్రుడుంటాడు. కనుక యిది 'హరిహర' రూపమనడానికి వీలులేదు.

ఇలా వాదించిన రామానుజులు పూర్వమీమాంసలోని ప్రమాణపద్ధతిలో చెప్పబడిన ఆరు ప్రమాణాలు 1. శ్రుతి, 2. లింగ, 3. వాక్య, 4. ప్రకరణ, 5. స్థాన, 6. సమాఖ్యలు...

ఈ ఆరు విధములైన ప్రమాణములు "శ్రీవేంకటేశ్వరుడు శ్రీమన్నారాయణుడే" అని నిరూపిస్తున్నవని చెప్తూ:-

'శంఖచక్రాలు ధరించడం, వక్షఃస్థల లక్ష్మి, గరుడుని ఆరోహించి విమానమెక్కడం, బ్రహ్మరుద్రాది దేవతలచే ఆరాధించబడడం, లక్ష్మీపతిత్వం, ఇతర పురాణగాథల

సమన్వయం – యశోదకు పెండ్లి చూపిస్తానన్న వాగ్దానం, వకుళగా పూర్తిచేయడం, సీతాదేవికి, తనకు బదులు లంకలో 'సీతాకృతిగా' గడిపిన అగ్నిపుత్రికను తర్వాతి కాలంలో వివాహం చేసుకొంటానన్న ప్రతిజ్ఞ, ఈ శ్రీనివాసుడుగా పద్మావతీ వివాహంతో పూర్తి చేయడం...

ఇలా అన్ని విషయాలూ, సందర్భాలూ ప్రమాణపద్ధతిలో చూపి, అన్ని ప్రమాణాలు ఈ వేంకటాచలంలోని పుష్కరిణి దక్షిణభాగాన వెలసిన స్వామి నారాయణుడే అని అర్థమిస్తున్నాయి.

అన్ని ప్రమాణాలకన్నా శ్రుతిప్రమాణం ముఖ్యం. అన్ని శ్రుతి ప్రమాణాలూ విష్ణుపరంగానే వున్నాయి.

★ ★ ★

8. శ్రీనివాసుడి కళ్లకి కాటుక!

అలా ప్రమాణయుక్తంగా తన వాదనలు వినిపించి యాదవరాజు సందేహ నివృత్తి చేసి రామానుజులు తన వాదన ముగించారు.

యాదవరాజు శైవులతో "ఇంత యుక్తియుక్తంగా, శ్రుతి ప్రమాణాలతో నిస్సందేహంగా ఈ అర్చామూర్తి నారాయణుడే" అని నిరూపించిన రామానుజులవాదన విన్న మీరు యింకా చెప్పేదేమైనా వుందా? అని ప్రశ్నిస్తాడు.

దానికి శైవులు "ఈ రామానుజులు ఏదో మంత్ర మహిమ, వాగ్ధాటితో మిమ్ములను కట్టివేశాడు. కాని మాకింకా నమ్మకం కల్గడం లేదు. వాదించడానికి సమర్థులము కాకపోయినా కాని పూర్వమునుండి సంప్రదాయముగా మాకు వచ్చిన సమాచారము పై మాకు గట్టి నమ్మకము. కనుక రామానుజుని వాదాన్ని ఒప్పుకొన యిచ్ఛకలుగుట లేదు. ఈ రామానుజుడు తనవాదాన్ని భగవంతుడు నమ్మాడని చూపగలిగితే, మేము నమ్మగలమేమో? మీరు దేశానికి అధిపతి, రాజు. కనుక ఏమి చేయడానికైన సమర్థులు. ఆయన వాదన మీరు ఒప్పుకుంటే మేం చేయగలిగిన దేముంది? శక్తిలేనివారము అదృష్టహీనులమని సరిపెట్టుకోవలసి వస్తుంది. కాని అందరికీ సమ్మతము కల్గేటట్లు, ఏదైనా ప్రత్యక్ష నిదర్శనముతో భగవంతుని సమ్మతము చూపగలిగితే, నిస్సంశయంగా నమ్మడానికి సిద్ధం" అన్నారు.

శైవుల కుతంత్రము రాజునకు అర్థమయింది. తనకు రామానుజుల వాదన, ప్రమాణ బద్ధమని నమ్మకం ఏర్పడింది. అదివరకు శైవులు కల్గించిన సంశయాల నివృత్తి కలిగి, ఈ అర్చామూర్తి నారాయణుడే అన్న నమ్మకం కలిగింది. కాని ఈ శైవులు వాదించలేక ప్రత్యక్ష ప్రమాణమడుగుట న్యాయముకాదు. అయినను తాను వారిని తిరస్కరిస్తే, యింకా కొందరిలో పూర్తి సంశయ నివృత్తి కాకపోవచ్చును. ఈ రామానుజముని అసాధారణుడు. మానవమాత్రులు చేయలేని మహిమలు చేయగల సమర్థుడు. భగవంతుని సమ్మతము చూసే కార్యమేదైనా చేస్తే, ఈ శైవులే కాదు, పండితలోకం, పామరులు కూడా నిస్సంశయంగా కొండపైని ఇలవేల్పు

శ్రీమన్నారాయణుడే అని నమ్మకం కలుగుతుంది. ముందు ముందు విపరీత ఆలోచనలకు తావులేని పరిస్థితిని శాశ్వతంగా కల్పించవచ్చు కదా అని తలచి.. రామానుజులతో అదే విన్నవిస్తాడు...

తనకు నమ్మకం కలిగిందని, రామానుజులు ప్రత్యక్ష నిదర్శనం చూపినా చూపకపోయినా, ఈ అర్చామూర్తి మహావిష్ణువే అని నిర్ణయం చేయడానికి సిద్ధమని, – కాని ప్రత్యక్ష నిదర్శనం చూపగలిగితే– వాదులు తమకు తామే ఓడిపోయినట్లయి అందరి చేత తిరస్కరించబడతారు. కనుక అటుల చేయగలరా? అని రాజు మునిని ప్రార్థిస్తాడు.

రామానుజులవారికి బ్రహ్మాండపురాణంలో పదకొండో అధ్యాయం జ్ఞప్తికి వస్తుంది.

"కలౌ కశ్చిన్మహాభాగః శంఖ చక్రే తు కృత్రిమే।
కారయిత్వా స్థాపయితా విమానాదీంశ్చ మే పునః॥
తతస్తద్భక్తివశగః సర్వప్రత్యక్షగోచరః।
ఆకల్పం నివసిష్యామి వరాభయదహస్తకః

ఊర్ధ్వా భ్యామపి చాన్యాభ్యాం హస్తాభ్యామతిసున్దరే।
దధానః శంఖ చక్రేచ కల్పితే లోకతుష్టయే॥"

"కలియుగములో విమానము మొదలయిన వాని వలెనే భక్తులు కల్పించిన శంఖము, చక్రము మొదలైన దివ్య ఆయుధాలను తాను స్వీకరిస్తానని భగవంతునిచే ముందే ప్రతిజ్ఞ చేయబడి ఉంది. నేను చేయించి సమర్పించిన దివ్యాయుధాలను ఆ స్వామి స్వీకరింపవలెను అని నిర్బంధించటమూ లేదు. కాబట్టి బలవంతంగా వేడుకొని ఐనా ఇప్పుడు జరగకబోతే 'ఇతర దేవత' అనే మహా అనర్థాన్ని నశింపచేసేందుకు భగవంతుడు శంఖచక్రములు ధరించేటట్లు చేస్తాను. తనను ఆశ్రయించిన వారి యెడల సముద్రమంత వాత్సల్యంతో పొంగేవాడు, తన భక్తుల వశములో వుండేవాడు అయిన భగవంతుడు మన ప్రార్థనతో మనము సమర్పించిన శంఖ చక్రములు తప్పక స్వీకరిస్తాడు. కాబట్టి శంఖచక్రములు చేయించి సమర్పిస్తాను" అన్న నిర్ణయానికి వస్తాడు శ్రీరామానుజులు.

యాదవరాజుతో "రాజా! నేను ఈ అర్చామూర్తిని శ్రీ మహావిష్ణువు, శ్రీమన్నారాయణుడు అని నిరూపించాను – కాని ఈ శైవులు యింకా నమ్మటం లేదు

– కనుక శ్రీమన్నారాయణుని అసాధారణ చిహ్నలైన సుదర్శన చక్రం, పాంచజన్యం అనే శంఖం వంటి దివ్యాయుధాలను చేయించి భగవంతుని సన్నిధిలో వుంచుతాను. అలాగే ఈ శైవులు కూడా వారు చెప్పే ఇతర దేవతల చిహ్నలైన త్రిశూలం, పాశం, అంకుశం లాంటి ఆయుధాలను స్వామి సన్నిధిలో వుంచమనండి. అలా వుంచి ఆలయం తలుపులు మూసి అందరం భగవంతుని ప్రార్థిద్దాం– భగవంతుడు ఏ ఆయుధాలు తీసుకొని ధరిస్తాడో దాన్ని బట్టి ఈ అర్చామూర్తి, ఏ దేవతో స్పష్టమవుతుంది... వారు చెప్పినట్లు భగవంతుని సమ్మతి కూడా సర్వులకు – తెలియవస్తుంది. ఈ సమస్యను భగవంతుడే పరిష్కరించి నట్లవుతుంది...” అంటాడు.

యాదవరాజు సంతోషించి తృప్తితో “అలా జరిగితే యిక ఎవరూ ఆక్షేపణ చేయలేరు – కాదనలేరు” అన్నాడు. అలా రెండు పక్షాలూ చేయడానికి సమ్మతించారు.

రెండు పక్షములవారు – వారి వారి దేవతల అసాధారణ చిహ్నములైన ఆయుధాలను బంగారంతో తయారుచేయించి నిర్ణయించిన రోజు అందరూ వేంకటాచలానికి వెళ్లి – స్వామివారి గర్భాలయంలో ఆ ఆయుధాల నుంచి, ఆలయద్వారములు బంధించి, రాజముద్రలు వేయించి, రాత్రంతా ఆలయము చుట్టూ మెలకువగా ప్రదక్షిణలు చేస్తూ ఎవరూ ఆలయప్రవేశం చేయకుండా జాగ్రత్తగా గడిపారు. రాత్రంతా వారి వారి దేవతలను, వారి వాదమే గెలవాలని, వారి ఆయుధములే ఆ అర్చామూర్తి ధరించాలనీ ప్రార్థిస్తూ రాత్రి గడిపారు.

రామానుజులు శ్రీనివాసుని తన యోగమహిమతో సమీపించి స్వామిని సాక్షాత్కారం చేసుకొని “స్వామీ నీవు యిదివరకు చేసిన ప్రతిజ్ఞ ప్రకారము నీ దివ్యాయుధాలైన శంఖ చక్రములు ధరించి మమ్ములను కాపాడి, ఇతరులకు జ్ఞానోదయముకల్గేట్టు చేసి – నీవు ఎవరో అందరికీ స్పష్టంగా తెలిసేటట్లు అనుగ్రహించు” అని కోరాడు.

మరుసటి దినం, రాజు యిరుపక్షములవారితో కలిసి ఆలయం తలుపులు తెరిపించి చూడగా భగవంతుడు శంఖచక్రములు ధరించి యుండెను. ఇతర ఆయుధములను తిరస్కరించినట్లు వ్యక్తమయ్యెను. రాజు సంతసించి రామానుజులపట్ల భక్తితో సేవించెను...

యాదవరాజు శ్రీరామానుజుల సలహాతో శ్రీనివాస భగవానుని మహా సంప్రోక్షణలు చేసి ఈ దేవుడు శ్రీమహావిష్ణువే అని నిశ్చిత అభిప్రాయాన్ని దేశమంతా

ప్రచారం చేయించాడు. రామానుజులు భవిష్యోత్తర పురాణంలో స్వామివారి ఆదేశాల ప్రకారం - ఈ ఆలయంలో వైఖానస ఆగమ సంప్రదాయం ప్రకారం జరగవలెనన్న నియమాన్ని నిశ్చయంగా జరిగేట్లు కట్టడి చేసి, నిత్యారాధనా విధాన వ్యవస్థను ఏర్పాటుచేశారు.

యాదవరాజు చివరి వరకు మొండిగా వాదించిన శైవులను అబద్ధాలు చెప్పి వాదించినట్లు నిర్ణయించి తన దేశము నుండి తరిమివేశాడు.. కాని వారు రహస్యముగా కొంత ప్రచారం చేశారు. యాదవరాజు సారథ్యంలో యిరుపక్షాలవారు దివ్యాయుధాలను గర్భాలయంలో విడిచి తలుపులు బిగించి రాజముద్రలు వేయించినంతవరకూ బాగానే వుంది. కాని శ్రీరామానుజులకు అష్టసిద్ధులు, మంత్రసిద్ధులున్నందువలన, పరకాయ ప్రవేశ విద్యతో, శేషుని అంశ అంటారు కనుక సర్పాకారంగా గర్భాలయ ప్రవేశం చేసి, రాత్రికి రాత్రి స్వామివారికి వైష్ణవ చిహ్నాలైన శంఖచక్రాలు ధరింపచేసి వుండవచ్చునన్న సంశయ బీజాలు కొందరిలో నాటారు. ఈ సంగతి బహుళ ప్రచారం కాకపోయినా, కొంతమంది శుద్ధ ఛాందస శైవుల మనస్సులలో కొంత అనుమానానికి ఆస్కారమైంది.

భగవదనుగ్రహం సంపూర్ణంగా కల్గిన రామానుజులు తిరుమల దేవాలయంలో చాలా సంస్కరణలు చేసినట్లు ఆధారాలున్నాయి.

శిథిలమవుతున్న ఆనంద నిలయవిమానాన్ని జీర్ణోద్ధరణ చేయించారు. తాను పాంచరాత్ర ఆగమానికి సంబంధించిన వాడైనా - పురాణాల్లో శ్రీనివాసుడు వైఖానసమునికి ఇచ్చిన ఆజ్ఞ ప్రకారం భగవదిచ్ఛగా భావించి తిరుమల ఆలయంలో వైఖానస అగమ ప్రకారం శ్రీవారి పూజాపద్ధతి కొనసాగేట్లు నిత్యారాధన సంస్కరణలు చేశాడు.

భగవంతునికి మిక్కిలి ప్రీతిపాత్రురాలు ఐశ్వర్యసిద్ధికి కారకురాలైన వ్యూహలక్ష్మి దేహ మధ్యస్థముననుండునట్లు - స్వామి వక్షస్థలమున ఏర్పాటు చేసినాడు.

యాదవరాజు శ్రీరామానుజులవారికి శిష్యుడై ముని సూచనల ప్రకారం ఎన్నో ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేసి ధన్యుడైనాడు.

ఇదంతా విపులంగా శ్రీ అనంతాచార్యులు దాదాపు 900 సంవత్సరాల క్రితం "వేంకటాచల ఇతిహాసమాల" అనే గ్రంథంలో రచించారు. శ్రీ అనంతాచార్యులు తిరుమలలో బహుకాలం వుండి స్వామికి ప్రత్యక్ష కైంకర్యం చేసినవారు.

ఇతర దేవత అనే సందేహం భగవంతుడైన శ్రీనివాసుని విషయంలో కొందరు కల్గించడం వలన, తరువాతి తరాలవారికి అటువంటి శంక లేకుండా చేసేందుకు – అంతకు పూర్వం వాడుకలో వున్న స్వామివారి రేఖామాత్రాలైన ఊర్ధ్వ పుండ్రాలను దట్టమైన పచ్చకర్పూరపు చూర్ణంతో దిద్ది, స్పష్టమైన ఊర్ధ్వపుండ్రం ఎల్లవేళలా ధరింపచేయాలన్న కట్టడి చేశారు. శుక్రవారం అభిషేకానికి అనుకూలంగా వుండటానికి స్వామివారి అలంకారాలన్నీ సడలింపు (తీసివేసి) చేసి పూలతో అలంకారం గురువారం సాయంత్రం చేసే పద్ధతినీ, అలా చేస్తున్నప్పుడు నేత్రదర్శనానికి వీలుగా ఊర్ధ్వపుండ్రనామాన్ని చిన్నది చేసే విధానాన్ని కూడా శ్రీరామానుజులే ప్రవేశపెట్టారని – శుక్రవారం అభిషేకం తర్వాత మరల నామము అలంకరణ చేయవలసిన విధిని కూడా నిర్దుష్టం చేశారని వేంకటాచల యితిహాసమాలలో చెప్పబడింది... మోహినీ అవతార సూచనగా అర్ధచంద్రాకార నామం, కళ్లకు కాటుక దిద్దే సంప్రదాయం వారానికి మూడు రోజులు శ్రీరామానుజులు ఏర్పాటు చేసినట్లుగా చెప్పబడినా, తర్వాతి కాలంలో ఈ సంప్రదాయంలో మార్పు వచ్చి శుక్రవారం అభిషేకానంతర అలంకరణలో పెట్టిన ఊర్ధ్వపుండ్రమే మరుసటి గురువారం వరకూ వుండే ఇప్పటి పద్ధతి వాడుకలోకి వచ్చింది. ఈ మార్పు ఏ విధంగా, ఎప్పుడు వచ్చిందీ స్పష్టంగా తెలియుట లేదు.

★ ★ ★

9. ఇంతకీ తిరుమల విగ్రహం విష్ణువుదా? శివునిదా? కుమారస్వామిదా?

ఇంత వరకు రామానుజుల కాలంలో పురాణాల ఆధారంగా శైవులు, వైష్ణవులు (రామానుజులు) వాదనలు విని, ప్రత్యక్ష నిదర్శనం ద్వారా యాదవరాజు తిరుమలనాథుడు శ్రీనివాసుడైన మహావిష్ణువే అన్న నిర్ణయం తీసుకొన్న విషయం తెలుసుకొన్నాం. ఇందులో చాలా భాగం 'వేంకటేశ్వర ఇతిహాసముల' ఆధారంగా గ్రంథరూపంలో మనకు లభ్యమయ్యింది. కాని అనంతాచార్యులు రచించిన ఈ ఇతిహాసమాల పూర్తి సత్యం కాదనే వారూ, కొంత రామానుజుల శిష్యుడైనందున ఆయన మీద భక్త్యావేశంతో కల్పించి రాసినదనేవారూ లేకపోలేదు.

అయినా రెండు వైపులా వాదనలు చాలా రోజులు ఓపికతో విన్న రాజు నిర్ణయం చేయడం, అది వరకు లాగానే అంటే ఆ స్వామి విష్ణువుగానే జరుగుతున్న వైఖానస పూజా విధానం కొనసాగించడం, ఆలయ అర్చన, పరిపాలనా విభాగాల్లో రామానుజులు కొన్ని మార్పులు చేయడం, అందులో బహుకొద్ది మార్పులతో ఈనాటికీ ఆ సంప్రదాయమే తిరుమల ఆలయంలో కొనసాగింపబడటం చారిత్రక సత్యాలు...

ఆళ్వారుల రచనలు గాని, శిలప్పదిగారంలో చెప్పిన విషయాలుగాని, రామానుజుల కాలానికి ముందు లభ్యమవుతున్న శిలాశాసనాలు, రచనలు ఆలయంలోని ఆచార వ్యవహారాలు, ఆలయపు కట్టడాలు, ఆగమనిర్దేశాలను దృష్టిలో ఉంచుకొని తర్వాతికాలంలో పరిశోధనలు చేసిన చరిత్రకారులు, పండితులు, రచయితలు ఏం చెప్పారు, ఏ ఆధారాలతో చెప్పారన్నది ఆసక్తికరమైన విషయం.

కాని రచయితలైనా ఇతరులైనా చాలామంది తాము నమ్మిన మత సిద్ధాంతాలను అనుసరిస్తూ అటు వైష్ణవవాదమో, శైవవాదమో సమర్థించడానికి ప్రయత్నించారు. ఇది నమ్మకానికి సంబంధించిన విషయం. ప్రతి పండితుడూ, ప్రతి రచయితా, తన నమ్మకాలను దృష్టిలో పెట్టుకొనో, తన మత గురువుల, మనోభీష్టాన్ని బట్టి రాసినవో,

వాస్తవాలు తెలుసుకోకుండా, తమ ఉద్దేశ్యాలు ఏ సాక్ష్యాధారాల వల్ల నిర్ధారణ చేసుకొన్నారో చెప్పకుండా రాసిన విషయాలు పట్టించుకోననవసరం లేదు.

అయినా విష్ణువని నిర్ణయం చేసింతర్వాత, వైఖానస సంప్రదాయాలు కొనసాగిస్తున్న తర్వాత, తత్వాన్ని అర్థం చేసుకొని, అద్వైతి అయిన అన్నమాచార్యులు వైష్ణవుడై, వైష్ణవ సిద్ధాంత ప్రచారానికి, తిరుమలనాథుని వైభవం, గ్రామగ్రామాల తీసుకువెళ్లడానికి కంకణం కట్టుకుని శ్రమించిన వాడు కూడా "ఎంతమాత్రమున ఎవ్వరు తలచిన అంతమాత్రమే నీవు" అన్నాడు. నీవు పరబ్రహ్మ అని కొందరు, విష్ణువని కొందరు, శివుడవని, శక్తి అని, కాపాలికుడవని – ఎవరు నమ్మిన విధంగా వారు పూజించే దేవుడని ఎందుకన్నారు... అలా నమ్మేవారు అన్నమాచార్యుల కాలంలోనే కాదు – ఈ కాలంలోనూ ఉన్నారు. విశిష్టాద్వైతులు, అద్వైతులు, ద్వైతులు, శాక్తేయులు, శైవులు అందరూ నమ్మే దేవుడితడు. వర్గభేదం లేకుండా హిందువులందరూ ప్రార్థించే దేవుడితడు... అలా జరగడానికి కారణాలేమిటి?

ఈ విషయంలో అన్ని ఆధారాలు పరిశీలించిన చరిత్రకారులేమంటున్నారు –తిరుమల చరిత్రకు సంబంధించి, పరిశోధనలు జరిపినవారు, ఆధారాలు పరిశీలించిన వారు, పురాతత్వశాస్త్రవేత్తలు, చరిత్రకారులు, శాసనాలను అధ్యయనం చేసినవారిలో ముఖ్యులు- సాధు సుబ్రహ్మణ్యశాస్త్రి, కృష్ణస్వామి అయ్యంగార్, టి.కె.టి. వీరరాఘవాచారి, రామచంద్రరావు, ఎన్. రమేశన్ ప్రభృతులు. ఇతరులు కొందరు ఈ విషయాలపై ప్రస్తావన చేసినా ముఖ్యంగా వారు కూడా వీరి గ్రంథాల ఆధారంగానే-

ఇందులో చాలా ప్రచురణలు నేను తిరుమల-తిరుపతి దేవస్థానాల కార్యనిర్వహణాధికారిగా ఉన్న కాలంలోనే ప్రచురించటం నా అదృష్టం. అప్పుడు పూర్తిగా చదివినా, చదవకపోయినా ఈ గ్రంథాలన్నిటికీ ముందుమాట నేనే వ్రాశాను (పండితులు రాస్తే సంతకం చేసిన సందర్భాలు లేకపోలేదు). కాని తర్వాతికాలంలో ఎన్నో సందర్భాలలో తిరుమల-తిరుపతి గురించి తెలుసుకోవాలన్న ఆకాంక్ష వలన అనండీ, లేదా కొన్ని కొన్ని సందర్భాలలో వివాదనలు వచ్చినప్పుడు, విషయ నిర్ణయం జరిపే వాళ్లలో ఒకడుగా ఉండే అవకాశం ప్రభుత్వం, దేవస్థానాలు కల్పించినప్పుడు ఈ గ్రంథాలన్నీ క్షుణ్ణంగా చదివే అవకాశం ఒక్కసారికాదు, అనేకసార్లు కలిగింది. దేవాలయంలో ఆగమపద్ధతులలోనే పూజలు జరుగుతున్నాయా, విరుద్ధంగా ఏమైనా జరుగుతున్నాయా? వెయ్యికాళ్ల మంటపం యాత్రికుల సదుపాయానికి కట్టిందా లేక

మతపరమైన కైంకర్యాలకోసం కట్టిందా? ఇంకో ప్రాకారం కట్టవచ్చా లేదా? ఇప్పుడు తిరుమలలో ఉన్నవి ఎన్ని ప్రాకారాలు? కళ్యాణాలు బయట చేయవచ్చా? గుడిలోపలే చెయ్యాలా? ప్రసాదాలు గుడిలోపలే చెయ్యాలా బయటకూడా చెయ్యవచ్చా? కృష్ణదేవరాయలు, ఇతర రాజులిచ్చిన నగలూ, ఆభరణాలు ఇప్పుడున్నాయా లేకపోతే ఏమయ్యాయి - కొండపై గుండు చేసే వారిలో స్త్రీ క్షురకులు ఉండవచ్చా, లేదా? యాత్రికుల సదుపాయానికి కొండపైకి రోప్‌వే ఆగమ సమ్మతమా? కాదా? గొల్లమంటపం అనే మంటపం గొల్లమంటపమేనా? అక్కడే ఉంచాలా, ఇంకొక చోటికి మార్చవచ్చా? కొత్తప్రాకారం కడితే ప్రాకారం గోడ పుష్కరిణి పైగా కట్టవచ్చా? దర్శనం చేసుకోవాలంటే దేవాలయప్రాకారం కిందనుండి సొరంగం చేసి లోపలికి భక్తులను తీసుకువెళ్లవచ్చా లేదా? తిరుమలలో లడ్డూలు కట్టెలపొయ్యిపైనే చేయాలా, గ్యాసుపొయ్యిమీద చెయ్యవచ్చా - బయటచేసిన లడ్డూలు లోపల నైవేద్యానికి పనికివస్తాయా? తిరుమల ఆలయం రాత్రి ఒంటిగంట వరకు తెరిచి ఉంచడం ఆగమసమ్మతమా? సుప్రభాతం ఉదయం మూడు గంటలకే చేయవచ్చా? మధ్యాహ్నం కొంతసేపైనా గుడిమూయాలన్నది శాస్త్ర విధా? భక్తులదర్శనకాలం రోజులో పెంచాలంటే, ఏ పూజలు మూలవరులకే చేయాలి, ఆ పూజలు ఉత్సవవరులకు చేయవచ్చా? కపిలతీర్థంలో పితృకర్మలు చేసే కార్యక్రమం ఇప్పుడు ఎందుకు జరగడం లేదు? పునరుద్ధరించాలంటే ఏం చేయాలి? హిందూధర్మ ప్రచారంలో తిరుమల-తిరుపతి దేవస్థానాల బాధ్యత ఏమిటి? వారే సొంతంగా చేయాలా? అందరు మతాధిపతులు, పీఠాధిపతులని సమన్వయం చేసి ధర్మప్రచారం చేయవలసిన బాధ్యత దేవస్థానానికెంత...?

హిందూమతం నుండి పెద్దఎత్తున జరుగుతున్న మతంమార్పిడులను అరికట్టే విషయంలో తిరుమల-తిరుపతి దేవస్థానాల బాధ్యత ఏమిటి? అదివరకు చరిత్రలో ఇటువంటి కార్యక్రమాలు దేవస్థానం చేపట్టిందా? పుస్తకప్రచురణలు దేవస్థానం ఎలా చేయాలి? ఎటువంటి పుస్తకాలు, ఎవరికోసం చేయాలి? లడ్డూ నాణ్యత పడిపోయిందా? పెంచడానికి ఏం చేయాలి? లడ్డూ విషయంలో దేవస్థానం ఖరీదుకే అమ్మాలా? ఊరికే ఇవ్వాలా? దేవాలయంలో సంప్రదాయ రక్షణ ఎలా జరగాలి, అర్చకులకు సంప్రదాయం ఆచార, వ్యవహార విషయాల్లో శిక్షణ అవసరమా? వాటికి తగిన ఏర్పాట్లు ఎలా చేయాలి?

1982 సంవత్సరంలో నేను కార్యనిర్వహణాధికారిగా పదవీవిరమణ చేసినప్పటి నుండి గత 30 సంవత్సరాలుగా ఎన్నో సందర్భాలలో పై విషయాలపై, అవికాక

ఇంకా ఎన్నో విషయాలపై చర్చించేందుకు, అధ్యయనం చేసేందుకు, సూచనలిచ్చేందుకు, ఆచరణ ప్రణాళికలు తయారుచేసేందుకు, ఆచరించేటప్పుడు వచ్చిన సమస్యలు పరిష్కరించేందుకు ఎన్నో అవకాశాలు దేవస్థానం, ప్రభుత్వం నాకు కల్పించాయి. రిటైర్ అయిన తర్వాత దేవస్థానాల సలహాదారుగా, కేంద్రధార్మిక సలహామండలి అధ్యక్షుడుగా మఠాధిపతుల, పీఠాధిపతుల ధార్మికసంస్థల సదస్సుకు కన్వీనర్‌గా, దేవస్థానాల ధర్మప్రచారానికి సంబంధించిన అన్ని ప్రాజెక్టుల సమన్వయకర్తగా – చాలా – తిరుమల చరిత్ర, తిరుమల ఆలయంలోని శాసనాలు, ఇతర పరిశోధన గ్రంథాలన్నీ చదవాల్సిన అవసరం చాలాసార్లు వచ్చింది.

వేంకటేశ్వరుని విషయంలో ఎవరి నమ్మకాలు వారివి. ప్రతి వారివీ గట్టి నమ్మకాలే. ఇంకొకరు చెబితే మార్చుకునే అవకాశం తక్కువ. అందరికీ ఆమోదయోగ్యుడైన దేవుడై నిలిచాడు. చరిత్రకారులైనా, శిలాశాసనాలు పరిశీలించిన నిపుణులైనా, పురాతత్త్వశాఖ ప్రవీణులైనా, ఈ తిరుమల ఆలయ విషయంలో వారు పరిశోధనలు చేసిన చాలామంది చాలావరకు దొరికిన సాక్ష్యాలను తమ నమ్మకాలను సమర్థించడం కోసం వాడినట్లు తెలుస్తుందేకాని నిష్పక్షపాతంగా దొరికిన సాక్ష్యాధారాలను బట్టి, వాటిమీదే ఆధారపడి నిర్ణయాలు చేసినట్లుగా కనిపించలేదు – ఒక్క డా. ఎన్. రమేశన్ గారి లాంటివారు తప్ప.

అనంతాచారి గురించి అదివరకే ప్రస్తావించాం. కృష్ణస్వామి అయ్యంగారు, టి.కె.వి. వీరరాఘవాచారి ఇద్దరూ మంచి కృషి చేసి వేంకటేశ్వరునియందు భక్తితోనే వారి గ్రంథాలు రాశారు. కాని వారు నిజాలను పునాదిగా చేసి చాలా విషయాలు ఊహించి కొన్ని నిర్ణయాలకొచ్చినట్లు వుంది. వారి ఊహలకు వారి వైష్ణవ సంప్రదాయాల ప్రభావం కనిపిస్తుంది. అలానే సాధు సుబ్రమణ్య శాస్త్రిగారి విషయంలో– తిరుమల శాసనాలను గురించి ఆయన చేసినంత శ్రమ ఇంకెవరూ చేయలేదనే చెప్పాలి. జీవితమంతా ఆ కార్యక్రమానికే అంకితం చేశారు. తిరుమల చరిత్ర విషయంలో శాసనాల ద్వారా మనం ఈనాడు తెలుసుకోగలుతున్నామంటే ఆయన కృషి ఫలితమే. మొత్తం ఏడు గ్రంథాలుగా రూపొందించారు. వాటిని ప్రచురించే అవకాశం నాకు భగవంతుడు కల్పించాడు. ఆరు భాగాలుగా శాసనాలు, వాటి పూర్వపరాలు, ఇతర వివరాలు ఇవ్వడం జరిగింది. చివరి భాగం (7వ భాగం) వాటిని ఆధారంగా, తీసుకొని ఆయన వ్యాఖ్యానం – మనం ఏమి ఊహించవచ్చు– రామానుజులకు ముందు కాలంలో ఇది శివక్షేత్రమని ఆయన నిరూపించడానికి చేసిన ప్రయత్నం, ఆధారాలు లేకుండా,

శంకరాచార్యులు ఇది శివక్షేత్రం కనుక, ఇక్కడకు వచ్చారని, యంత్రప్రతిష్ఠ చేశారనీ చెప్పిన సందర్భాలలో, ఆళ్వారులు వేంకటేశ్వరునిలో శివుని విష్ణువుని చూశారని చెప్తూ, విష్ణు-బ్రహ్మ-శివుల మధ్య సంబంధం వారు చెప్పిన రీతిని విశ్లేషించినప్పుడు కొంత వారి మతం మీద అభిమానం ఆయా వ్యాఖ్యానాలు చేసేటప్పుడు వారిని ప్రభావితం చేసిందేమోనని చదువరులకు అనిపిస్తుంది. వీరందరి పరిశోధనలూ పరిశీలించాక రాసిన గ్రంథం డా. రమేశన్ గారి *'History of Tirumala'*. దేవస్థానం ఈ గ్రంథాన్ని, సుబ్రమణ్య శాస్త్రి గారి గ్రంథం కంటే ముందే ప్రచురించినా, నాకు బాగా జ్ఞాపకం రమేశన్‌గారు, సుబ్రమణ్యశాస్త్రిగారి వ్రాతప్రతులను తీసుకొని పూర్తిగా చదివాకే వారి గ్రంథంరాశారని– ఆ ప్రతులు తిరిగి ఇవ్వటం ఆలస్యం అయినందువల్లే రమేశన్ గారి పుస్తకం ప్రచురించిన తర్వాతే సాధు సుబ్రమణ్యశాస్త్రిగారి గ్రంథముద్రణ దేవస్థానం చేసింది – అప్పుడు నేనే దేవస్థానం కార్యనిర్వహణాధికారిని – అప్పుడు రమేశన్‌గారు పర్సన్ ఇన్‌చార్జి (కార్యనిర్వాహక మండలికి). (అప్పట్లో అన్నారావుగారి అధ్యక్షతన ఉన్న పాలకమండలిని రద్దుచేసి ముఖ్యమంత్రి డా. చెన్నారెడ్డిగారు ముగ్గురు అధికారులతో ఈ కమిటీ వేశారు. రమేశన్‌గారు అధ్యక్షులు, దేవదేయ ధర్మాదాయ కమిషనరు చంద్రమౌళిరెడ్డిగారు సభ్యులు – కార్యనిర్వహణాధికారి అయిన నేను కార్యనిర్వహణ సభ్యుడను).

ఆ రోజుల్లో రమేశన్ గారితో చాలా సన్నిహితంగా ఉండే అవకాశం – చాలా ప్రతిభాశాలి – పరిశోధనంటే చాలా ఇష్టం. పురావస్తుశాఖలో పనిచేసి ఉండటం వల్ల ఆ విషయాలలో మంచి అవగాహన, అనుభవం, అభిలాష – అయిన తిరుమల చరిత్ర గురించి చాలాకాలంగా కృషిచేసి గ్రంథరూపంలో తయారుచేశారు. సాధు సుబ్రమణ్యశాస్త్రిగారి పరిశోధనల గురించి ఆయనకు క్షుణ్ణంగా తెలుసుకాని, చివరి గ్రంథంలో శాస్త్రిగారు ఎటువంటి నిర్ణయాలు చేశారో తెలుసుకోవాలని రమేశన్‌గారు, అచ్చుకు వెళ్లిన ప్రతి కావాలని నన్ను కోరారు. ఈయన అదే విషయంపై పుస్తకం రాస్తున్నప్పుడు, ఇంకొకరు రాసిన ప్రచురణలో ఉన్నది, ఇస్తే బాగుంటుందా లేదా అన్న ఆలోచన నన్ను కొంత కలవర పరిచింది. ఆయన ఐ.ఎ.ఎస్.లో నాకంటే చాలా సీనియరు. పైగా పాలకమండలి అధ్యక్షులు కూడా. కాదని చెప్పే ధైర్యం లేకపోయింది. సుబ్రమణ్యశాస్త్రిగారికి అన్యాయం చేస్తున్నానన్న అనుమానం కలిగినా, ఎదురుచెప్పే ధైర్యం లేక రాతప్రతిని రమేశన్‌గారికి అందజేశాను. కొన్నిరోజులు ఉంచుకుని ఆయన ఆ రాతప్రతిని తిరిగి ఇచ్చారు. కాని దానికి ముందు ఆయన రాసిన పుస్తకాన్ని ప్రచురించమని కోరడం, ఆ పనిని దేవస్థానం చేపట్టడం జరిగింది...

నేనే వెంటబడి దాదాపు రెండు పుస్తకాలు ఒకే సమయానికి ముద్రించే విధంగా చేశాననుకోండి. నా మనసులో సందేహం, సాధు సుబ్రమణ్యశాస్త్రి గారి పరిశీలన విషయాల్ని, రమేశన్‌గారు తమ గ్రంథంలో పొందుపరచుకొన్నారేమోనని...

కాని రెండు పుస్తకాలు ప్రచురించాక, వాటిని చదివితే నాకు తెలిసిన సారాంశం - శాస్త్రిగారి అభిప్రాయాలు తెలుసుకొని, విశ్లేషించి తన గ్రంథంలో చాలా విపులంగా వివరణలు ఇవ్వడానికే రమేశన్‌గారు ముందుగా గ్రంథం చదివారనీ.. ఆయనకు అలా ఇవ్వడమే చాలా మంచిదయిందని నాకు అనిపించింది. రమేశన్‌గారు ఆ పుస్తకంలోని పరిశోధన విషయాలు కాపీ చేయడానికి కాదని - తన పరిశోధనలో తాను చేసుకొన్న నిర్ణయాలను బేరీజు వేసుకోవడానికేనని.

చాలా కీలక విషయాలలో రమేశన్ గారు శాస్త్రిగారితో ఏకీభవించలేదు. సమవాయ్ భోగ శ్రీనివాసుని ప్రతిష్ఠ క్రీ.శ. 614 అని శాస్త్రిగారు నిర్ణయం చేసినా - రమేశన్ గారు - దానిని క్రీ.శ. 966గా నిర్ణయం చేశారు. ముఖ్యంగా తిరుమలలో ఉన్న విగ్రహం విష్ణువుదా, శివునిదా, కుమారస్వామిదా, శక్తిదా? అన్న విషయంలో రమేశన్‌గారు చేసిన విశ్లేషణ పరిశోధకుడుగా పూర్తిగా సాక్ష్యాధారాల మీద మాత్రమే నిర్ధారణ చేశారుగాని, తన మతపరమైన సంప్రదాయాలుకాని, నమ్మకాలు కానీ ఆయన నిర్ణయాల మీద ఎటువంటి ప్రభావం చూపలేదని తెలుస్తుంది.

నాకు రమేశన్‌గారి గురించి బాగా తెలుసు, వారికి అద్వైతం పైన అభిమానం గురించి తెలుసు. వారికీ, కంచి కామకోటి పీఠానికీ ఉన్న దగ్గర సంబంధమేమిటో నాకు తెలుసు. కంచి పరమాచార్యులంటే ఆయనకెంత గౌరవమో, గురుభావమో కూడా నాకు తెలుసు. అయినా సాధు సుబ్రమణ్యశాస్త్రిగారి పరిశోధన గ్రంథాలు, ఆయన అభిప్రాయం - రామానుజులకు ముందు, ఇది శివక్షేత్రంగా శాస్త్రిగారి నిర్ధారణ చేసే ప్రయత్నం- దాన్ని నిరూపించడానికి శాస్త్రిగారు చేసిన వాదనలు తెలిసీ కూడా, స్వతహాగా అవితన సంప్రదాయాలకు, మతపరమైన నమ్మకాలకూ, ఆలోచనలకూ అనుకూలంగా ఉన్నాయని తెలిసినా - రమేశన్‌గారిలోని పరిశోధకుడు సాక్ష్యాధారాల మీదనే ఆధారపడ్డారు కాని తన నమ్మకాలమీద కాదు.

రామానుజుల ముందుకాలంలోనూ, తర్వాతికాలంలోనూ, తిరువేంగడం పైన ఉన్న విగ్రహం విష్ణువుదేకాని ఇతర ఏ దేవతది కాదని స్పష్టంగా ప్రతి వాదానికీ తగిన సాక్ష్యాధారాలు చూపిస్తూ నిర్ణయాలు చేశారు. రామానుజుల కాలంలో తర్వాత

చెప్పబడిన వాదాలే కాక, ఇంకా కొందరి మనస్సులలో ఈ కారణం వలన శివుడేమో ఈ కారణం వల్ల శక్తి ఏమో, ఈ కారణం వలన కుమారస్వామి ఏమో అనే విషయాలన్నీ కూలంకషంగా పరిశీలించి, విశ్లేషించి సాక్ష్యాధారాలతో ఎవరికీ సందేహం లేకుండా విషయ నిర్ణయం చేశారు మెల్బాత్ - 18 మూరల చీర కడతారు కాబట్టి, శక్తి రూపమేమో, పసుపుతో అభిషేకం చేస్తారు కనుక స్త్రీమూర్తి 'శక్తి' అయి ఉండాలనో, నాగాభరణాలు, బిల్వపత్ర పూజ, విమానంపై సింహ విగ్రహాలు, వక్షఃస్థలంలో లక్ష్మి, మెడలో శ్రీవత్సం- కిరీట విషయం, 'స్వామి పుష్కరిణి'లో స్వామికి అర్థం ఆళ్వారుల ప్రబంధాలలో వారు తిరువేంగడస్వామిలో శివుడిని, బ్రహ్మను చూడమనడం లేదా ఆయనే విష్ణువు ఆయనే శివుడు అన్న భావం వచ్చేట్లు ఆళ్వారులు ఎందుకు చెప్పారు - అన్న విషయాలన్నీ చాలా నిశితంగా పరిశీలించి విషయనిర్ణయాలు చేశారు.

అయినా చాలామంది భక్తులు తిరుమల శ్రీనివాసుని ఇతర దేవతగా ఎందుకు భావించే అవకాశం కూడా ఉందో, ఆళ్వారులు విష్ణు-శివులకి భేదం లేదని చెప్పారా, ఇంకేమైనా ఉద్దేశ్యంతో చెప్పారా అన్నది వివరించారు.

విష్ణువు 'సర్వభూతహృదయు'డని, సర్వాంతర్యామి కనుక ఆయనలో తమతమ ఇష్ట దైవాలను భక్తులు చూసే అవకాశం ఉందనీ, అదే ఇతర దేవాలయాలకు లేని ప్రత్యేకతలు తిరుమల వేంకటేశ్వరునికి ఉందని - ఆ భావం ఇప్పటిదికాదని, ఆళ్వారుల కాలంనుండీ ఉన్న భావమని- అందుకే హిందూ సమాజంలో అన్నివర్గాలవారు, ఆలోచనాసరళులు గలవారు తిరుమల వేంకటేశుని తమ దైవంగా భావించి భక్తి చూపే సంప్రదాయం వచ్చిందనీ స్పష్టం చేశారు. ఆసక్తికలవారు రమేశన్‌గారి '*The Tirumala Temple*' అన్న ఆంగ్లగ్రంథం చదివి తెలుసుకోగలరు.

★ ★ ★

10. తిరుమలకు నాంది

పురాణకాలంలో శ్రీనివాసుడు శంఖరాజుకు దర్శనం యిచ్చినట్లు శంఖ చక్ర, వరద కటి హస్తాలతో చతుర్భుజుడై, వజ్ర, నవరత్న కిరీటధారిగా, నాగాభరణాలు భుజాలకు అలంకారం కాగా వక్షఃస్థలంతో లక్ష్మీసన్నిధానం (చిన్న ప్రతిమాచిహ్నం)తో, పీతాంబరధారిగా, రత్నఖచితపు ఒడ్డాణంతో, చిన్ని పిడిబాకు నడుమ పై ఆభరణంలో పొదిగినవాడై, పద్మపీఠంమీద వున్న స్వామి, వైకుంఠం నుండి దిగి వచ్చిన విమానంతో సహా దర్శన మిచ్చాడని బ్రహ్మాండపురాణం మూడవ అధ్యాయం చెబుతుంది...

అలా దర్శనమిచ్చిన స్వామి శంఖరాజుకు తను ఎటువంటి ఆకారంతో దర్శనమిచ్చాడో అలానే తన అర్చామూర్తిని (విగ్రహాన్ని) తయారుచేయమని, చూపించి విమానంలాంటి విమానాన్ని గోపురంగా నిర్మించి ఆలయం కట్టించమని ఆజ్ఞాపించాడు. శంఖరాజు ఎంతో భక్తితో విమానగోపురం, అర్చామూర్తులను తయారుచేసి - నిత్యపూజలు మొదలుపెట్టాడని బ్రహ్మాండపురాణం.

"యథాదృష్టం విమానంతే మద్రూపం పురుషర్షభ।
తథాహ మిహ భాగం తే నతే భావితా గతిః"

ఇంతకుముందు శ్రీనివాస కళ్యాణం తర్వాత పద్మావతీ సహితంగా వేంకటాచలానికి బయలుదేరి, దారిలో అగస్త్యముని ఆశ్రమంలో 6 నెలలు గడిపాడనీ ఆ సమయంలో తొండమానుకి కొండపై మూడు ప్రాకారాలు ఏడు ద్వారాలతో తనకు నివాసం కట్టించమని ఆజ్ఞాపిస్తే ఆయన అలానే చేశాడనీ భవిష్యోత్తర, ఇతర పురాణాలు చెప్తున్నాయి. ఇలా భగవంతుడు ఒక్కొక్క కాలంలో ఒక్కొక్క భక్తునికి తన సేవాభాగ్యం కలుగచేశాడు.

వెయ్యిసంవత్సరాల క్రితం శ్రీరామానుజులకు ముందు కాలంలో తిరుమల దట్టమైన అడవులతో, వన్యమృగాలతో వుండి ఆలయం మాత్రమే వుండి, చుట్టూ రాళ్లు, రప్పలూ, వృక్షాలతో నివాసయోగ్యంగా లేకుండెను. అర్చకస్వాములు కూడా

భక్తులలాగే వుదయము కొండకు వెళ్లి, సేవాదులు, నిత్య పూజలు చేసి సాయంత్రానికి ఆలయ ద్వారాలు మూసి, కిందికి వచ్చేవారట.

బ్రహ్మోత్సవాలు, ఇతర మహోత్సవాలు కూడా తిరుమల ఆలయంలో చేసేవారు కారట. అంకురార్పణ, ధ్వజారోహణ కార్యక్రమాలు మాత్రం కొండమీద ఆలయంలో చేసి మిగతా వాహనోత్సవాలు, స్నపన తిరుమంజనాలు యిత్యాదులు - కింద 'శుకపురి' (తిరుచ్చుకనూరు- అంటే ఈనాటి తిరుచానూరు)లో చేసేవారు. స్వామివారి ఉత్సవ మూర్తులను ధ్వజారోహణానంతరం ఊరేగింపుగా తిరుచానూరు తెచ్చి - అన్ని వైభవాలు కింద చేసేవారట. 9వ రోజు అవభృథస్నానానంతరం మరల స్వామివారిని తిరుమలకు తీసుకువెళ్లి అక్కడ ధ్వజఅవరోహణం, ప్రాయశ్చిత్తంగా పుష్పయాగం చేసేవారట...

కాని పురాణ కాలంలో బ్రహ్మదేవుడే ఇతర దేవతలతో సహా బ్రహ్మోత్సవాలు తిరుమలలోనే చేసేవారని ప్రతీతి...

ఆలయం చుట్టూ వున్న ప్రదేశాన్ని కొంత బాగు చేసే కార్యక్రమం మొదట 'ద్రుమికుమారుడు' అనే భక్తుడు మొదలుపెట్టి ఒక చిన్న వీథిని నిర్మించి, చుట్టూ రాళ్లూ, రప్పలు, చెట్లు తొలగించి, కొంత ప్రదేశం చదును చేసినట్లు చరిత్రా, శాసనాలు చెపుతున్నాయి.

శ్రీరామానుజులు పురాణకాల వైభవం తిరిగి తేవాలన్న ప్రయత్నంతో తిరుమల దివ్యనగరానికి పునాదులు వేశారు. ప్రాకారానికి నాలుగు వైపులా వాహన సేవలకు అనుకూలంగా మాడ వీథుల నిర్మాణం, గుడిముందు - సన్నిధి వీథి - దానికి అనుగుణంగా మరో పెద్ద వీథి నిర్మాణం చేసి, అర్చకస్వాములకు, ఆచార్య పురుషులకు, ఆలయ అధికారులకు ఆవాస సౌకర్యాలు కల్గించి - బ్రహ్మోత్సవ, ఇతర మహోత్సవాలు తిరుమలలోనే జరగడానికి ఏర్పాటు చేశారని, రామానుజుల తర్వాత ఒక శతాబ్ది కాలానికి రచించబడిన అనంతాచార్యుల వేంకటాచల ఇతిహాసమాలలో చెప్పబడింది. పాపనాశన - ఆకాశగంగలకు వెళ్లే మార్గంలో స్వామివారి పారువేట మహోత్సవానికి అనుకూలంగా వుండే వ్యవస్థ గూడా శ్రీరామానుజులే చేసినట్లు ఈ యితిహాసమాల వర్ణిస్తుంది.

ఇంకో ఆసక్తికర విషయం... 'వేంకటవాసి' అని పిలువబడే ఇప్పటి కౌతుకబేరం - ఆరోజుల్లో ఉత్సవమూర్తులుగా వుండేవని - ఆ 'వేంకటవాసి'నే తిరుచానూరు వుత్సవాలకు తీసుకువెళ్లేవారనీ... ఉత్తరోత్తరాభివృద్ధికి ఆటంకమని భావించిన

శ్రీరామానుజులు 'కేతకి' బేరాన్ని ఉత్సవవరులుగా, ఉత్సవవరులను (వేంకటవాసిని) కౌతుక బేరంగా మార్చి పునః స్నానాభిషేకాలను, ప్రౌఢధారణాది పూర్వకంగ శాస్త్ర ప్రకారం యథావిధిగా చేయించారని వేంకటాచల ఇతిహాసం చెబుతుంది...

900 సంవత్సరాల క్రితం రాసిన 'ఇతిహాసమాల'లో వైఖానససాగమశాస్త్ర, తంత్రశాస్త్ర పారంగతుడైన బింబాధరుని ఆరాధనకు శ్రీరామానుజులే నియమించారని – అతనికి తన సన్నిధిలోనే పంచ సంస్కారాలు చేయించి సమాశ్రయణం లభింపచేసిన తర్వాతే అర్చకస్వామిగా ఆరాధనబాధ్యతలు అప్పగించినట్లు చెప్పబడింది. తర్వాతి కాలంలో కూడా ఆయన వంశస్థులే – భగవంతుని అర్చనాది సేవలు వంశ పారంపర్యంగా చేయాలన్న కట్టడి కూడా శ్రీరామానుజులే చేసినట్లు చెప్పబడింది. దీనికి వైఖానసుల నుండి అభ్యంతరాలున్నాయి. ఎందుకంటే, రామానుజులకు పూర్వం నుండే ఆలయంలో వైఖానస ఆగమోక్త పూజావిధానం అర్చించే అర్చకులుండేవారు.

★ ★ ★

11. అసలు మోకాళ్లమీదే ఎక్కాలా?

జీవాత్మ, పరమాత్మ తత్త్వముల గురించి తెలిసిన వారిలో శ్రేష్ఠులైన శుకుని వంటి పరమయోగులు, ప్రహ్లాదుని వంటి పరమ విష్ణుభక్తులు, అంబరీషుని వంటి మహాభాగవతులైన రాజర్షులు, భృగువు వంటి మహర్షులు - ఈ పర్వతము శ్రీమహావిష్ణువు యొక్క ఇంకొక దేహము - పాదాలతో దివ్యమైన ఈ పర్వతాన్ని తాకటాన్ని సహించలేక, కొండ దిగువననే సమీప ప్రదేశాల్లో తపస్సు చేసుకుంటూ వున్నారని వామన పురాణం చెపుతోంది.

ఈ విషయాన్ని దృష్టిలో వుంచుకొనే శ్రీరామానుజులు పాదాలతో తొక్కకుండా మోకాళ్లపై పర్వతం ఎక్కారని ప్రతీతి. ఆ కారణంగానే ఆళ్వారులను (దివ్యనారులను) కొండపై కాకుండా తిరుపతిలో ప్రతిష్ఠింపచేశారు.

అదివరకు చెప్పినట్లు ఆరోజుల్లో దక్షిణాదిన శైవమత ప్రాబల్యం ఎక్కువగా వుండేది. ముఖ్యంగా చోళరాజైన కులోత్తుంగ చోళుని కాలంలో అది విష్ణుద్వేషంగా మారి, అతడు చాలా విష్ణుక్షేత్రాలకు కీడు చేశాడు. అన్నిటికన్నా ముఖ్యంగా కావేరీ తీరంలో చిత్రకూటం (ఇప్పటి చిదంబరం)గా ప్రసిద్ధి చెందిన గోవిందరాజస్వామి దేవాలయంలో మూల విగ్రహాన్ని పెకలించింది, ఈ క్రిమికంఠుడు (కులోత్తుంగ చోళుడు సముద్రంలో పారవేఇస్తాడు. ఈ క్షేత్రం కణ్వమహర్షి తపస్సు చేసి, విష్ణుమూర్తిని దర్శనం చేసుకొన్న స్థలం. అలా ప్రత్యక్షమైన సమయంలో ఆవిర్భవించిన ప్రతిమే గోవిందరాజుల విగ్రహం. ఈ రాజుకు భయపడి వైష్ణవులు ఆ ప్రదేశం వదలి పారిపోయారు. అలా వెళ్లేటప్పుడు, ఆలయంలోని ఉత్సవవిగ్రహాన్ని తీసుకొని వెళ్లి, వారు తిరుపతి క్షేత్రానికి చేరారు. తిరుపతిలో ఆ ఉత్సవ గోవిందరాజుల వుత్సవ విగ్రహాన్ని పదిలపరిచారు. (ఈ వృత్తాంతాన్నే ఆధారంగా చేసుకొనే కమలహాసన్ 'దశావతారాలు' సినిమా తీసింది). అందుకే ఈనాటికీ చిదంబరం దేవాలయంలో విగ్రహం కనబడదు. జ్యోతి మాత్రం ఉంటుంది. విష్ణుక్షేత్రాన్ని కులోత్తుంగచోళుడు శివక్షేత్రంగా మార్చివేశాడు.

శ్రీరామానుజులకు ఈ వృత్తాంతము తెలిసి చాలా బాధపడి తిరుపతిలో, చిదంబరంలోని గోవిందరాజస్వామి విగ్రహ ప్రతిరూపాన్ని తయారుచేయించి, ప్రతిష్ఠ చేసి, చిదంబరం నుండి తెచ్చిన ఉత్సవిగ్రహ సహితంగా ఆరాధన, నిత్యపూజలకు కట్టుబాటు చేశాడు. తిరుపతిలోని ప్రసిద్ధిచెందిన శ్రీగోవిందరాజుల గుడి ఇలా శ్రీరామానుజులచే స్థాపించబడినదే. తనకు శిష్యుడైన యాదవరాజును ప్రోత్సహించి ఆ దేవాలయ నిర్మాణం అప్పటికే వున్న తటాకానికి ప్రక్కన ఏర్పాటు చేశారు. ఇప్పుడున్న విగ్రహం అదేనా అన్నవిషయం తర్వాత ప్రస్తావిద్దాం.

తిరుపతి శ్రీవేంకటేశ్వరుని దర్శనానికి వెళ్లిన భక్తులు ఈ మధ్యకాలం వరకూ తిరుపతిలోని గోవిందరాజస్వామి దర్శనం చేసుకొనే కొండ ఎక్కడానికి బయలుదేరే వారు – ఈ స్వామి శేషశాయి క్షీరాబ్ధినాథుడు – ఉత్తరదిక్కుకు పాదాలు, దక్షిణ దిశకు తల పెట్టుకొని శంఖ చక్రాది ఆయుధాలు గల చతుర్భుజుడై, నాభి కమలంలో బ్రహ్మతో, తలపై కిరీటం, దివ్యాభరణాలతో వెలసిన స్వామి పాదాల దగ్గర శ్రీదేవి భూదేవులు వారి కింద పాదాల దగ్గరే మధు కైటభులుంటారు. ఇలాంటి దేవాలయ నిర్మాణం తర్వాత శ్రీయాదవరాజు ఆలయం చుట్టూ ఒక అగ్రహారం నిర్మించి దానికి తన గురువు పేరు 'రామానుజపురం' అని పెట్టాడు.

శ్రీవైకుంఠనాథుడు, శ్రీక్షీరాబ్ధిశాయి ఒక్కడే అయినట్లు – తిరుమల శ్రీనివాసుడూ, తిరుపతి గోవిందరాజులు ఇద్దరూ విష్ణువే. ఆ కాలంలో కొండలెక్కలేని భక్తులకు దర్శనమివ్వడానికి తిరుపతి గోవిందరాజులు– అందుకే ఈ ఆలయంలో కూడా రామానుజులు, కొండపై ఆలయంలో లాగా వైఖానస ఆగమోక్త ప్రకారంగా పూజావిధిని నిర్ణయించి – ఆ వంశపు అర్చకులతోనే స్వామి ఆరాధనకు ఏర్పాట్లు చేశారు. రామానుజులు చేసిన ఇంకొక నియమం – కొండమీద, గోవింద రాజుల చిత్రకూట మహోత్సవం – వివరించే దివ్య ప్రబంధ భాగాలు పఠించే ఏర్పాటు.

గోవిందరాజుల ఆలయంలో ప్రత్యేకంగా లక్ష్మి అవతారమైన గోదాదేవిని ప్రధానమహిషిగా ప్రతిష్ఠచేశారు శ్రీరామానుజులు.

శ్రీగోవిందరాజుల, శ్రీవేంకటేశ్వరుని సంబంధాన్ని సూచించే కథ ఒకటి ప్రాచుర్యంలో వుంది.

కాశీరాజుకు సంతానం లేదు. కుటుంబ సమేతంగా రాజు, శ్రీనివాసుని సేవించి సంతాన భిక్ష కోరాలని యాత్రకు బయలుదేరి తిరుమలకు వస్తాడు. భక్తితో స్వామిని

సేవిస్తాడు. స్వామి కరుణతో, రాజు భార్యకు కలలో ప్రత్యక్షమై "నేను నీకు సంతానాన్ని ప్రసాదిస్తాను. నీ ముక్కున వున్న నీనాసామణిని నాకివ్వు" అంటాడు.

ఏ దేవతకైనా వేదంలో చెప్పినట్లు వారికి సమర్పించవలసినది సమర్పిస్తే, మనం కోరినది వారిస్తారు. లౌకికంగానూ శాస్త్ర పరంగానూ అది నియమం. అందుకే "దేహిమే దదామితే" – "నాకు యిమ్ము నీకు యిచ్చెదను" అన్నది నానుడి. అందుకే చెప్తారు. భగవంతుని ఆలయానికి దర్శనానికి వెళ్తున్నప్పుడు ఖాళీచేతులతో వెళ్లవద్దు అని. నీ శక్తి కొలది, ఫలమో పుష్పమో తీసుకెళ్లి భక్తితో సమర్పించాలి.

అలాగే శ్రీనివాసుడు రాణిని నత్తు యివ్వమింటాడు. దానికి ఆమె "స్వామీ! నేను భర్త ఆజ్ఞకు లోబడి వుండేదానిని. నా భర్త అనుమతిస్తే అప్పుడు ఇస్తాను" అని బదులు చెప్పింది. దానికి స్వామి "అలా అయితే సరే– నేను నా అన్న గోవిందరాజుకు అధీనుడను – అతడు నీకు సంతానమివ్వమని నాకు అనుమతిస్తే అప్పుడు నీకు నేను సంతానాన్ని ఇస్తాను. అంతేకాని యింకే విధంగానూ వీలుపడదు" అంటాడు. సంబంధం తెలిసింది కదా?

యాదవరాజు – రామానుజపురమే కాక గుడి చుట్టూ చాలా గృహాలు నిర్మించి శ్రీశైలపూర్ణుడు, అనంతాచార్యులవంటి భాగవతులకు, వైష్ణవభక్తులకు నివాసాలు ఏర్పాటు చేసి దేవునికి తూర్పు దిక్కున ధాన్యాగారం, వాయవ్యంగా అంగడి వీథిని నిర్మించి – ఈనాటి తిరుపతి పట్టణానికి ఆనాడు పునాది వేసి రూపురేఖలు దిద్దాడు.

★ ★ ★

12. కొండమీద బావుల రహస్యం

తిరుమల శ్రీనివాసుని ఆలయంలో ఈనాటికీ రెండు బావులు వున్నాయి. ఒకటి విమాన ప్రాకారంలోవున్న బంగారుబావి. రెండవది సంపంగి ప్రాకారంలో వున్న పూలబావి.

పూలబావి వృత్తాంతం వరాహపురాణం రెండవ భాగంలో వస్తుంది. ఈ కథకు, భగవంతుడు శంఖచక్రాలు ధరించకుండా వుండే కథకు దగ్గర సంబంధం.

కలియుగారంభంలో తొండమానుచక్రవర్తి శేషాచలం ఆ చుట్టుప్రక్కల వున్న తొండదేశాన్ని పరిపాలిస్తూ వుండేవాడు. ఈయన పరమ భాగవతుడు, శ్రీనివాసుని ఆంతరంగిక భక్తుడు. శ్రీనివాసునికి ఆలయంకట్టించి, చాలా మహోత్సవాలు ప్రారంభించి సక్రమంగా జరిపించిన వాడు ఇతడే. ప్రతిరోజూ స్వామిని వేంకటాచలంలో దర్శించుకోవాలన్న ఆకాంక్ష తీర్చడానికి స్వామి అతనికి అహోబిలం నుండి వేంకటాచలానికి వున్న సొరంగమార్గ (బిలం) రహస్యం చెప్పి తొండమానునికి రోజూ తన దర్శనం చేసుకోవడానికి సావకాశం కల్పిస్తాడు.

బ్రహ్మపురాణంలో ఈ తొండమానుని సామంత రాజులు అతనిపై వ్యతిరేకించి, అందరూ కలిసి అతనిపై యుద్ధానికివచ్చి, అతని సైన్యాన్ని జయించినట్లు, అప్పుడు తొండమానుడు బలముచాలక భయంతో తన రాజ్యానికి వచ్చి నృసింహబిలాన్ని చేరి నరసింహునిపూజించి సొరంగమార్గం ద్వారా దేవేరులతో కలిసి విహరిస్తున్న శ్రీనివాసుని వద్దకు - అది, వెళ్లకూడని సమయమైనా వెళ్తాడు.

సమయంకాని సమయంలో అలావచ్చిన రాజుని, భగవంతునితో విహరిస్తున్న యిద్దరు దేవేరులు చూచి, శ్రీదేవి శ్రీనివాసుని వక్షఃస్థలంలో వున్న వైజయంతిమాల వెనుక సూక్ష్మరూపియై దాక్కొంది. భూదేవి దగ్గరలోవున్న బావిలోకి దూకింది. భూదేవి కదా కనుక ఆమె భూమిలోకి బావిద్వారా వెళ్లిందని తెలియాలి. రామానుజుల కాలంలో ఈ కథ చాలా ప్రసిద్ధిలోవుండేదట. ఇతర పురాణాలలో కూడా ఈ కథ చెప్పబడింది. కాని, కల్ప భేదం వలన కథలో కొంచెం మార్పు కనపడుతుంది.

బ్రహ్మాండ పురాణంలో శత్రువులచేతిలో పరాభవం జరిగి తొండమానుడు వచ్చినట్లు చెప్పబడింది. కాని వరాహ పురాణంలో వీరశర్మ అనే బ్రాహ్మణుడి వృత్తాంతం చెప్పేటప్పుడు ఈ కథ చెప్పబడింది.

వీరశర్మ తన భార్యను రాజు సంరక్షణలో వదలి తీర్థయాత్రకు వెళ్లాడు. ఆ బ్రాహ్మణుడు తిరిగి వచ్చిన సమయానికి అతని భార్య మరణించింది. ఆ వృత్తాంతం, బ్రాహ్మణునికి చెప్పకుండా రాజు కలతతో శ్రీనివాసుని కలవడానికి సొరంగం ద్వారా రాకూడని సమయంలో వస్తాడు. అలా ఎందుకు రాకూడని సమయంలో వచ్చావని శ్రీనివాసుడు రాజుని ప్రశ్నిస్తే, భయంతో బ్రాహ్మణుడి భార్య చనిపోయిన వృత్తాంతంచెప్పి, ఆమెను బ్రతికించి అనుగ్రహించమని వేడుకుంటాడు. అలా అసందర్భంగా వచ్చిన రాజుని చూచి దేవేరులు దాక్కొంటారు.

పురాణాలలో భూతీర్థంగా చ్పెబడే ఈబావిలోకి భూదేవి వెళ్లిన కారణంగా, శ్రీరామానుజులు ఆ బావిలో భగవంతుడిని అర్చారూపిగా వుంచి. శ్రీనివాసునికి సమర్పించిన తులసి, పూమాలలు, భూదేవి కొరకు బావిలో వుంచాలని నియమంచేశారని వేంకటేశ్వర యితిహాసమాలలో చెప్పబడింది. అలా ప్రతిరోజూ శ్రీనివాసుని పుష్పమాలలు అందులోవేస్తారు కనుక ఆ బావికి 'పూలబావి' అని పేరు.

ఈ బావి తిరుమల ఆలయంలో సంపంగి ప్రదక్షిణలో ఈశాన్యం మూల పోటు మండపానికి దగ్గర పిండివంటలు (లడ్డూ, వడ వగైరా) చేసే వంటశాల దగ్గర వుంది దీనికి భూ తీర్థమని పేరుకూడా వుంది. ఇంకొక బావి విమానప్రాకారంలోని బంగారుబావి.

అందుకే తిరుమల కొండపై మానవులెవ్వరూ పూలు ధరించే సంప్రదాయంలేదు. భగవంతుని నిర్మాల్యమైన పూలుకూడా బావిలోనే వేస్తారుకాని స్త్రీలకు యివ్వడంకాని, ఎవరైనా ధరించే సంప్రదాయంకాని లేదు. ఈ మధ్య ఒక దశాబ్ద కాలంవరకు ఈ నియమం పాటించబడుతూ వుండేది. ఈ మధ్య కాలంలో తిరుమల వీథులలో పూలమ్మడం చూస్తున్నాము. అమ్ముతారు కనక, కొనేవారుంటారు. తెలియదు కనుక వాటిని అలంకరించుకొనే స్త్రీలుంటారు. దేవస్థానం వారు ఈ విషయంలో కట్టడిచేస్తే బాగుంటుంది. విషయం తెలుసుకొని స్త్రీలు పురుషులు (పూలు దొరికినా) వాటిని అలంకరించుకోకుండా వుండటం కొండపైన మంచిది.

★ ★ ★

13. బాణంతో కొండకి రంధ్రం

ఆళవందారుగా పిలువబడే యామునముని శ్రీరంగంలో రంగనాథుని సేవిస్తూ నమ్మాళ్వార్ రచించిన 'ద్రావిడ బ్రహ్మ సంహిత తిరువాయ్ మొళి' చే ప్రభావితుడై తిరుమల శ్రీనివాసునికి శరణాగతుడౌతారు... శిష్యులతో వేంకటాచలానికి చేరుకొని సేవ చేస్తుంటారు... స్వామివారి కైంకర్యానికి పాపనాశనం నుండి అభిషేక తీర్థం వయస్సు మళ్లిన తాను తేలేక కైంకర్యం ఎలా జరుగుతుందా అని బాధపడుతుంటే, తాను ఆ కైంకర్యం రోజూ చేస్తానని ముందుకొస్తాడు అతని శిష్యుడు శ్రీశైలపూర్ణుడు. అతనే తర్వాత కాలంలో తిరుమలనంబిగా ప్రసిద్ధిపొందుతాడు.

అలా శ్రీశైలపూర్ణుడు చాలా శ్రద్ధాభక్తులతో 'పాపవినాశతీర్థం' ప్రతిరోజూ తెల్లవారకుండానే తిరువాయిమొళి పారాయణ చేస్తూ తెచ్చేవాడట. భగవంతునికి అతని సేవ చాలా సంతోషాన్ని కల్గించి, అతనిని అనుగ్రహించదలచి, ఒక బోయవాని రూపంలో వచ్చి 'తాతా, దాహంవేస్తూంది, కొంచెం నీరు ఇవ్వ"మని శ్రీశైల పూర్ణుని అర్థిస్తాడు.

"ఈ తీర్థం భగవంతుని అభిషేకానికి. మానవులకిచ్చేదికాదు. ఇది దివ్యతీర్థం" అని నీరు ఇవ్వకుండా తనధ్యాసలో తిరువాయిమొళి పారాయణచేస్తూ కుండనెత్తిన పెట్టుకుని తిరుమల వైపు వెళ్లసాగాడు.

బోయరూపంలో వున్న శ్రీనివాసుడు తన బాణంతో శ్రీశైలపూర్ణుని తలపైని కుండకు రంధ్రంచేసి కారుతున్న జలధారను సేవిస్తూ శ్రీశైలపూర్ణుని వెనకే వస్తుంటాడు. కొద్దిసేపటికి బరువైన కుండ తేలికపడటం గమనించిన శ్రీశైలపూర్ణుడు వెనుదిరిగి చూస్తే నీరుతాగుతున్న బోయవాడు కన్పిస్తాడు.

బోయవానిని నిందిస్తూ "భగవంతుని కైంకర్యానికి తెచ్చే జలాన్ని ఎలా త్రాగావు?" అని కోపగించుకుంటాడు. అప్పుడు బోయవాడు. "తాతా, నీవుకలత చెందకు. యిక్కడే దగ్గరలో ఒక దివ్యతీర్థం వుంది - ఇక్కడి నుండే నీవు తీర్థం తీసుకు వెళ్లవచ్చు.

పాపవినాశనం వరకూ వెళ్లవలసిన పనిలే"దని చెప్పి - ఒక ప్రదేశాన్ని చూపిస్తాడు. కాని అక్కడ నీరు లేదు... నిస్పృహతో చూస్తున్న శ్రీశైలపూర్ణునికి ఆ బోయవాడు బాణంవేసి కొండకు రంధ్రం చేయడం కన్పడుతుంది. ఆ కొండలో నుండి స్వచ్ఛమైన, నిర్మలమైన జలధార బయటకు వస్తుంది. ఆ బోయవాడు శ్రీశైలపూర్ణుని వుద్దేశించి "తాతా - ఈ దివ్యజలం ఆకాశగంగ, చాలా పవిత్రమైనది - భగవంతునికి చాలా ప్రియమైనది. రోజూ యిక్కడి నుండే అభిషేకానికి జలంతీసుకువెళ్లు" అని చెప్తూ ఒక కొత్తకుండనిచ్చి అదృశ్యమవుతాడు.

ఆ జలంతో కుండనింపి ఆలయానికి తీర్థం తీసుకువస్తాడు శ్రీశైలపూర్ణుడు - స్వామివారికి ఆ జలంతో అభిషేకం - నైవేద్యం చేస్తున్నప్పుడు ఆ లీలామానుష విగ్రహుడైన భగవంతుడు, అర్చకునిలో ఆవహించి శ్రీశైలపూర్ణునితో, "నీవు తెచ్చిన జలంతో దారిలోనే నా దప్పిక తీరినది" అని చెప్పి శ్రీశైలపూర్ణునికి, తానే బోయవాడుగా వచ్చి అనుగ్రహించిన విషయం తెలియచెప్తాడు.

అలా తన భక్తునికి శ్రమ తగ్గించడానికి స్వామి సృష్టించిన తీర్థమే ఆకాశగంగ. పరమపావనమైనది. అప్పటినుండి... యిప్పటివరకూ ఆకాశగంగ జలాన్నే స్వామివారి కైంకర్యానికి తెచ్చే సంప్రదాయం కొనసాగుతుంది.

అలా కైంకర్యం చేస్తూనే శ్రీశైలపూర్ణుడు పరమ పదానికి చేరాడు... ఇప్పటికీ అధ్యయనోత్సవం చివరినాడు శ్రీనివాసుని వూరేగిస్తూ శ్రీశైలపూర్ణుని జ్ఞాపకంగా 'ఆకాశ 'గంగోత్సవం' జరుగుతుంది. దానినే పూర్వం "శీతల తీర్థామృతాభిగమన యాత్రోత్సవం"గా జరిపేవారు.

తిరుమలలో దక్షిణమాడవీథిలో తిరుమలనంబి ఆలయం ఉంది. 1980లో మాస్టర్ ప్లాన్‌లో మాడవీథిని వెడల్పు చేసేటప్పుడు తిరుమలనంబి నివసించిన గృహం కూడా శిథిలావస్థలో ప్రథమ ఆచార్య పురుషుల అధీనంలో ఉండేది. వారి కోరికమేరకు అక్కడ తిరుమలనంబి ఆలయనిర్మాణం కొత్తగా చేసే భాగ్యం నాకు కలిగింది. ప్రతిరోజూ సాయంత్రం సహస్ర దీపాలంకార సేవ తర్వాత జరిగే స్వామివారి మాడవీథి ఉత్సవంలో, ఆ ఆలయం ముందు స్వామివారికి హారతి ఇచ్చే సంప్రదాయం ఇప్పటికీ కొనసాగుతూనే ఉంది.

★ ★ ★

14. తిరుమలలో పూలు ధరించరాదు

రామానుజుల కాలంలో శ్రీవేంకటాచలం పవిత్రత కాపాడడానికి కొన్ని నియమాలు చేశారు. అందులో- తిరుమలలో పాదరక్షలు వేసుకోకుండా వుండటం, ముఖ్యంగా కొండపై స్త్రీపురుషులు పూలధారణ చేయరాదని నియమం. ఈ సంప్రదాయం రెండు-మూడు దశాబ్దాలక్రితం వరకూ పాటింపబడుతూండేది. నేను కార్యనిర్వహణాధికారిగా వున్న కాలంలో కూడా యాత్రికులు కొండపై పూలు పెట్టుకొనే సంప్రదాయంలేదు. అలంకరణ అంతా స్వామికే. మొదట్లో కొన్ని శతాబ్దాలు స్వామివారి నిర్మాల్య పుష్పాలు భక్తులకివ్వడం, భక్తులు వాటిని స్వామి ప్రసాదంగా స్వీకరించి వాటితో తమ తమ గృహాల్లో, మఠాల్లో తాము పూజ చేసే విగ్రహాలకు ఈ నిర్మాల్యంతో కైంకర్యం చేసేవారట. వారి వారి యిండ్లలోని భగవత్ మూర్తులకు కూడా కొండమీద 'స్వామివారికి నివేదించని' పుష్పాలతో కైంకర్యం చేసే సంప్రదాయంలేదు. అలా తమ యిండ్లలోని మూర్తులకు సమర్పించాకే ఆ నిర్మాల్య ప్రసాదాన్ని తీసుకొనే సంప్రదాయం వుండేది.

ఈ సందర్భంలో ఒక సంఘటన గురించి వేంకటాచల యితిహాసమాలలో ప్రస్తావనవుంది.

ఒకరోజు శ్రీశైలపూర్ణుని శిష్యుడొకడు శ్రీనివాసునికి సమర్పించని పుష్పమాలను తన తలపై ధరించి చపలచిత్తంతో ఆనందించాడట. ఆరాత్రి స్వామివారు శ్రీశైలపూర్ణుని కలలోవచ్చి నీ శిష్యుడు 'పరిమళద్రోహం' చేశాడని చెప్పారట. అప్పటినుండి స్వామివారి నిర్మాల్యం కూడా భక్తులకివ్వకుండా - వాటిని పూలబావిలోనూ, తీర్థాల్లోనూ వదిలే సంప్రదాయం ప్రవేశపెట్టారు. కారణం - కొందరు చపలచిత్తంతో, కలి ఆవేశంతో, స్వామివారికి నివేదించినవి అని చెప్పి నివేదించని పుష్పాలు ధరించే అవకాశం వుంది. కొండమీద అసలు పుష్పాలే ధరించరాదని కట్టడిచేస్తే ఇటువంటి సంఘటన జరగదు- అలా చాలా శతాబ్దాలు ఈ నియమపాలన జరిగింది.

ఈ మధ్యకాలంలోనే ఉల్లంఘున జరగడం ప్రారంభమైంది. కొండకు వెళ్లే భక్తులు, తిరుమలలో వున్నన్ని రోజులూ, పుష్పాలంకరణ చేసుకోకుండా వుండటం వుత్తమం.

అంతేకాదు. నైవేద్యానికి పనికివచ్చే ప్రతిపదార్థము స్వామివారికి కొండపై నైవేద్యంగా అర్పించి – ఆ ప్రసాదాన్నే కొండపై అందరూ భుజించే సంప్రదాయం – స్వామివారి ప్రసాదం దొరకకపోతే... (అన్ని వేళలలో అందరికీ ప్రసాదం దొరకడం అప్పుడప్పుడు సాధ్యం కాదు కనుక) నైవేద్యానికి తగిన పదార్థాలతో వంట చేసుకొని స్వామికి నివేదించి ప్రసాదంగా తీసుకొనే సంప్రదాయం వుంది.

– కొండపై శవదహనం / పూడ్చిపెట్టడం నిషిద్ధం.

★ ★ ★

15. బంగారు బావి

శ్రీనివాసునికి జరిగే సేవలన్నిటిలో వాడే తీర్థాన్ని (నీరు) ప్రతిరోజూ అర్చకులూ, ఏకాంగులూ పాపనాశనం నుండిగానీ, ఆకాశ గంగ తీర్థం నుండి కానీ తెచ్చేవారు. శుక్రవారం శ్రీనివాసుని అభిషేకం, ప్రతిరోజూ భోగశ్రీనివాసునికి జరిగే అభిషేకం, స్వామివారి ఉపచరానాలకు – అర్ఘ్యపాద్యాదులకు, ఆచమనానికి, నైవేద్యమప్పుడు సమర్పించే పానీయంగానూ ఈ తీర్థాన్నే వాడతారు. భక్తులకు స్వామివారి తీర్థంగా ఇవ్వబడేది కూడా ఈ ఆకాశగంగ పాపనాశన తీర్థమే – మరి ఏ ఇతర తీర్థాల నీరు వాడే సంప్రదాయం లేదు.

భక్తుడు రంగదాసు విమానప్రాకారంలోని 'పోటు' పాకశాల దగ్గర ఒక బావి వంటకోసం నిర్మించాడని పురాణం చెబుతుంది. దీనికి శ్రీతీర్థమని పేరు.

యామునాచార్యులు (ఆళవందారు) వేంకటగిరి యాత్రకు వచ్చిన సమయంలో, ఒక ఘటన జరిగింది. ఆ రోజుల్లో స్వామివారి సేవలకు 'తిరుమలనంబి' ఆకాశగంగనుండి కాని, పాపనాశనం నుండిగాని ప్రతిరోజూ నీరు తెచ్చేవారు. ఒకనాడు కుంభవృష్టి కురుస్తున్న కారణంగా తిరుమలనంబి నీరు తేవడానికి వెళ్లలేకపోయాడు. మరి స్వామివారి కార్యక్రమం జరగాలికదా? అప్పుడు తిరుమలలో వున్న యామనాచార్యులు శ్రీదేవిని ప్రార్థించి అన్న ప్రసాదాలు చేసే ఈ వంటశాల దగ్గరున్న బావిలో ఆకాశగంగ, పాపనాశన తీర్థాల సన్నిధానం వుండేట్లుగా చేయమనిప్రార్థించాడు. ఈ బావిలోని నీటిని స్వామివారి కైంకర్యానికి వాడినట్లు – సుందరుడైన స్వామివారికి ఉపయోగపడే నీరు ఇస్తుంది కనుక – దీనికి 'సుందరస్వామి కూపం' లేదా 'సుందరస్వామి బావి'గా నామకరణం జరిగింది. ఆ రోజుల్లో స్వామివారిని సుందరస్వామిగా కూడా కొలిచేవారు. స్వామివారి ప్రతిరూపంగా భావించబడి, ఆ కాలంలో స్వామివారి ప్రతినిధిగా తిరుచానూరులో అన్ని ఉత్సవాలూ జరిపించుకొనే సుందరస్వామి, ఇప్పటికీ పద్మావతీదేవి ఆలయంలో శ్రీదేవి, భూదేవులతో వెలసి

ఉన్నారు. కృష్ణస్వామి ఆలయానికి, అమ్మవారి ఆలయాలకు దక్షిణంగా ప్రాకారంలో ఉన్న ఆలయం సుందరస్వామిదే. ఈ సారి తిరుచానూరు వెళ్లినప్పుడు తప్పక చూడండి.

ఆ తర్వాతి కాలంలో శ్రీరామానుజులు కొండపై సేవావిధానం కట్టడి చేసినప్పుడు – ఈ యామునాచార్యుల వృత్తాంతం విని... స్వామివారి సేవలకు పాపనాశన తీర్థం లేదా ఆకాశగంగ తీర్థం లేదా ఈ సుందరస్వామి బావి తీర్థాలలో ఏదో దానిని మాత్రమే వాడాలని కట్టడి చేశారు.

తర్వాత కాలంలో స్వామివారి విమానానికి బంగారు తాపడం చేసిన తర్వాత, ఈ బావికికూడా బంగారు తాపడం చేయించారు. ఆ తర్వాత ఈ బావిని బంగారు బావిగా పిలవడం వాడుకలోకి వచ్చింది.

1978-82 కాలంలో నేను కార్యనిర్వహణాధికారిగా వున్న సమయంలో కూడా ఈ బావిలో నీళ్లు వుండేవి. ఎండాకాలంలో కొన్ని రోజులు, వర్షాభావంవున్న సంవత్సరాలలో కొన్ని రోజులు ఈ బావి ఎండిపోతూ వుండేది... కొండపై గుడి చుట్టూ చాలా నివాసగృహాలు రావడంతో, నీరు కలుషితమయ్యే సందర్భాలు కూడా వుండటంతో, బావిని పూడ్చివేయాలన్న ప్రతిపాదన వచ్చినప్పుడు – అలా చరిత్రాత్మక బావిని పూడ్చకుండా, లోపల తాపడంచేసి, కలుషితమైన ఊటనీరు లోపలికి వచ్చే అవకాశం లేకుండా చేసి, పాపనాశనం నీటితో ఈ బావిని నింపుతుంటారు. శుక్రవారం స్వామివారి అభిషేకానికి ఈ నీరు వాడతారు.

పుష్కరిణి నీరు కూడా కలుషితం అయ్యేది. అలా నీరు కలుషితం కాకుండా ఉండటానికే మాస్టరు ప్లాన్‌లో గుడి చుట్టూ మురుగు సౌకర్యాలు లేకుండా ఉన్న వందలాది గృహాలను, మాడవీథులలో నివసించేవారి సత్రాలు, గృహాలనూ తొలగించి మురుగును మళ్లించి, పుష్కరిణీ బంగారుబావులను పరిశుభ్రం గావించే కార్యక్రమం చేపట్టే అదృష్టం నాకు కలిగింది.

ఇతర సేవలన్నింటికీ ఇప్పటికీ ప్రతిరోజూ ఆకాశగంగ నుండి బ్రాహ్మణులు మడిగా నీరు తెచ్చి ఆ నీటితోనే కైంకర్యాలన్నీ జరిపే సంప్రదాయం కొనసాగుతోంది. నైవేద్యానికి – వంటశాలలో మాత్రం పాపనాశన జలాలను పంపింగు చేసి బంగారు బావిలో పోసి వాటిని ఉపయోగిస్తుంటారు.

రంగదాసే తర్వాతి కాలంలో తొండమానుడుగా జన్మ నెత్తినట్టు, అప్పుడు అతను మొదట రంగదాసుగా తవ్విన ఈ బావులను మరల నిర్మించినట్లు పురాణం చెపుతోంది.

భవిష్యోత్తర పురాణం, వరాహ పురాణం - రంగదాసు ఈ రెండు బావులను శ్రీనివాసుని పూతోటలకుగాను నిర్మించినట్లు చెపుతాయి. తర్వాతి కాలంలో తొండమానుడుగా అవే బావులను, ఆలయనిర్మాణం చేపట్టినప్పుడు పునర్నిర్మించాడని కూడా పురాణం. అలా నిర్మించడం కూడా శ్రీనివాసుని ఆజ్ఞతోనే. శ్రీనివాసుడే తొండమానునితో "నీవు వెనుకటి జన్మలో రంగదాసుగా చేసిన సేవలలో ఈ బావుల నిర్మాణం ఒకటి. వీటిని రాతితో పకడ్బందీగా ఇప్పుడు కట్టించ"మని శ్రీనివాసుడే తొండమానుని ఆజ్ఞాపిస్తాడు.

బ్రహ్మపురాణంలో - శ్రీనివాసుడే తొండమానునికి "చింతచెట్టు మొదట్లో పుట్టలోపల శ్రీమహావిష్ణువు విగ్రహం వుంది. దానిని భగవంతుని (తన) ఆజ్ఞతో శంఖడనే రాజు తయారుచేశాడని - దానికి దగ్గరలోనే భూతీర్థం... దానికి పుష్కరిణికి మధ్య రంగదాసు నిర్మించిన పూలతోటలుండేవని కనుక ఆలయం మొదటి శంఖరాజు కట్టాడనీ - అది శిథిలమై - విగ్రహం భూమిలో పూడి వున్నది. దానిని తీయించి, గుడులు, ప్రాకారాలు కట్టించి తరించ"మని తొండమానునికి శ్రీనివాసుడు ఆదేశిస్తాడు. ఆ ఆదేశం మేరకే తొండమాను గుడి నిర్మించాడని పురాణం. ఈ బావులను కూడా అప్పుడే పునర్నిర్మాణం చేయడం జరిగింది.

★ ★ ★

16. నిద్రపోని చింత చెట్టు - సంపంగి చెట్టు

భగవంతుడు శ్రీ వైకుంఠాన్ని వదలి, వేంకటాచలానికి వచ్చినప్పుడు, ఒక వల్మీకంలో (పుట్టలో నివసించాడు కదా). ఆ పుట్ట ఒక పెద్ద చింతచెట్టు నీడలో వుందని భవిష్యోత్తర పురాణం చెబుతుంది.

అది స్వామి పుష్కరిణికి నైరుతి దిక్కులో వుంది... భగవంతుడు పుట్టలోంచి ఎలా బయటకు వచ్చిందీ, పద్మావతిని పరిణయం చేసుకున్నదీ 'తిరుమల లీలామృతం'లో తెలుసుకొన్నాం. బ్రహ్మదేవుడు భగవంతుని అర్చారూపిగా కలికాలం అంతంవరకూ వుండి పాపులను వుద్ధారం చేయమని ప్రార్థించినప్పుడు, భగవంతుడు శంఖుడనే రాజుకు ప్రత్యక్షమై తనకే ఒక ఆలయం నిర్మించమనీ, తానెలా దర్శనమిచ్చాడో అలాగే ఒక విగ్రహం చేయించమనీ, ఆలయం కూడా అప్రాకృత వైకుంఠ విమానంగా (భగవంతుడు శంఖునికి ఎలా చూపించాడో) అలాగే నిర్మాణం చేయమనీ ఆదేశిస్తాడు. అలాగే శంఖరాజు శ్రీనివాసుని విగ్రహం, ఆలయ నిర్మాణం చేయిస్తాడు.

ఆ ఆలయం కాలగర్భంలో కలిసి జీర్ణమయినదనీ, కాని స్వామివారి విగ్రహం మాత్రం పుట్టలోని మట్టిలో మోకాలి లోతులో కప్పబడిపోయిందనీ, ఇంతకాలం ఆ చింతచెట్టు స్వామివారికి పడగలా అన్నివైపులా వ్యాపించివున్నదనీ, అలసటలేకుండా, అలుపెరుగకుండా లోకానికి ఉపకారంచేస్తూ, నిద్రేలేనట్టి ఈ చెట్టు ఎవరైవుంటారనే ప్రశ్న చోళరాజుకు వచ్చింది. ఆదిశేషుడే ఈ చింతచెట్టుగా వున్నాడని నిర్ణయానికి వస్తాడు. అందుకే వృక్షం అంతగా అంతకాలంపాటు భగవంతునికి తెల్లనిగొడుగులా వుండి సేవ చేయగలిగింది.

ఈ చింతచెట్టు కిందనే రంగదాసుకి, గోపీనాథుడనే వైఖానస పూజారికి శ్రీనివాసుడు దర్శనం ఇచ్చి, వారిని తనకు ఉద్యానవనంలో నీటివసతికి బావులు ఏర్పాటుచేసేట్లు ప్రేరణచేస్తాడు. తొండమానునికి ఈ చెట్టు గురించే భగవంతుడు

చెప్పి, తనకు ప్రియమైనట్టి చెట్టును ముట్టుకోవద్దు (గుడి ప్రాకారానికి అడ్డంవస్తే కొట్టవద్దు) అని చెప్తాడు. ప్రాకారాన్నే చెట్టుకు అడ్డం లేకుండా కట్టమనీ, మార్చమనీ భగవంతుని ఆదేశం. ఈ చెట్టే శేషుడని భగవంతుడు తొండమానునికి చెప్పలేదట.. ఈ చెట్టు అనంతుడే (ఆదిశేషుడే) అనే నిర్ణయానికి చోళరాజు వచ్చినట్లు పురాణ ఆధారం కన్పడడం లేదు. ఆ చింతచెట్టు ఇప్పుడు ఆలయంలో కనిపించదు. తర్వాత ఎలా కనుమరుగయిందో తెలియదు.

సంపంగి చెట్టు

వరాహ పురాణంలో ఈ చింతచెట్టు, దానికి దగ్గరలోనే వున్న సంపంగి చెట్టుని గురించి ప్రస్తావన వుంది. ప్రాకారం/ఆలయం కట్టించమని భగవంతుడు రాజుకు ఆదేశం ఇచ్చినప్పుడు – “ఈ ప్రాకారాలు కట్టడాలు కట్టేటప్పుడు, మిగతా చెట్లను కొట్టవచ్చుకాని, ఈ చింతచెట్టును, సంపంగి చెట్టును ముట్టుకోవద్దు, ఈ వృక్షాలను కాపాడుతూ కట్టడాల ప్రణాళికానిర్ధారణ జరగాలి. చింతచెట్టు నా ఆస్థానం. సంపంగి చెట్టు లక్ష్మీదేవికి ఆస్థానం. ఈ రెండు వృక్షాలూ, ఋషులు, దేవతలు, నరులు ఎల్లప్పుడూ ఆరాధించదగినవి – ఈ రెండు చెట్లూ ధ్వజస్తంభానికి ఉత్తర దక్షిణాలలో వుండేవట. రామానుజులు వాటికి నిత్య ఆరాధనవ్యవస్థ చేసినట్లు వేంకటాచల ఇతిహాసమాలలో తిరుమల అనంతాచార్యులు చెపుతారు.

రెండవ ప్రాకారంలో వున్న సంపంగి చెట్టు వలననే ఆ ప్రాకారానికి సంపంగి ప్రాకారం అని ఇప్పటికీ పేరు ప్రసిద్ధిలో వుంది... ఆ సంపంగి చెట్టైతే ఇప్పుడు లేదు.

★ ★ ★

17. మొండిగోపురం కూల్చి తప్పు చేశానా?

1980 కన్నా ముందు తిరుమల చూసిన వారికి దేవాలయం ఎదురుగా ఎత్తుగా మెట్లు, ఈశాన్యభాగంలో వెయ్యికాళ్ల మంటపం, 5/6 అడుగుల వెడల్పుగల సన్నిధి వీథి గొల్లమండపం దగ్గర మొదలయ్యేది. ఈ వీథికి ఉత్తరాన పెద్ద జియ్యంగారి మఠం - దానికి ఎదురుగుండా చిన్న పాడుపడిపోయిన ఆంజనేయస్వామి మందిరం, దాని చుట్టూ అనధికార క్షురకులు, నడవడానికి వీలులేని ఇరుకైన వీథి - ఆ వీథిలో ఈ ఆంజనేయస్వామి గుడి (ఇప్పటి బేడీ ఆంజనేయస్వామి మందిరం) దగ్గర దక్షిణంగా తిరిగి ముందుకు వెళ్తే - ఒక పాడుపడిపోయిన మొండి (మొదటి అంతస్తు మాత్రమే పూర్తిచేయబడి, మధ్యలో ఆపేయబడిన) ప్రాచీన గోపురం దర్శనమిచ్చేవి.

ఈ మొండిగోపురం గురించి ఒక వృత్తాంతం వేంకటాచల ఇతిహాసమాలలో చెప్పబడింది. అప్పటికి తిరుమల ఆలయాలకు ఆనందనిలయ విమానమేకాని, ఇప్పుడు వున్నట్లు రెండు గోపురాలు లేవు.

ఆ రోజుల్లో వీరనరసింహుడనే రాజు రామేశ్వరందాకా తీర్థయాత్రకని బయలుదేరి దారిలో వేంకటాచలానికి వస్తాడు. మంచి సాత్త్వికుడు, భక్తుడైన ఈ గజపతి రాజు స్వామి పుష్కరిణిస్నానం, వరాహ దర్శనం చేశాడు. ఆ రోజుల్లో శ్రీనివాసుని ఆలయానికి బయట, వరాహ స్వామి ఆలయానికి వెనుక ఒక నృసింహుని దేవాలయం వుండేదట. (ఈ నరసింహుడినే పరమశివుడు వేంకటాచలంలో తపస్సు చేసే కాలంలో కొలిచేవాడని పురాణం చెబుతుంది. తర్వాత రామానుజుల కాలంలో ఈ నృసింహస్వామినే విమానప్రాకారంలో ఈశాన్యంగా ప్రతిష్ఠ చేయించడం జరిగిందని తెలుస్తోంది) వీరనరసింహరాజు ఆ నృసింహ దర్శనం తర్వాత శ్రీనివాసుని దర్శనం చేసి, భక్తి పారవశ్యంతో శాశ్వతంగా వుండేటట్లు స్వామికి ఏదైనా కైంకర్యంచేయాలని తలచి పండితులనడిగాడట... "ఏం సేవచేస్తే బాగుంటుంది" అని.

వారు ఆగమ ప్రమాణం చెప్తారు... "నగ యివ్వాలంటే కిరీటం శ్రేష్ఠం, వాహనం ఇవ్వాలంటే రథం ఉత్తమం. కట్టడాలలో గోపురం ప్రధానం, రత్నాలిస్తే వజ్రాలు ముఖ్యం, వర్ణాలలో బ్రాహ్మణులు, ఆశ్రమాలలో సన్న్యాస ఆశ్రమం శ్రేష్ఠం" - అని చెప్పి "నీమనస్సుకి ఏదితోస్తే ఆ కైంకర్యం చేయి" అంటారు పండితులు.

శ్రీనివాసుని వైభవానికి తగిన గోపురం లేదు కాబట్టి, మంచి పెద్ద గోపురం కట్టించాలని సంకల్పించాడు ఆ రాజు. ఆలయానికి కొంచెం దూరంగా సన్నిధివీథికి, బేడీ ఆంజనేయస్వామికి దక్షిణంగా స్థలనిర్ణయం చేస్తాడు. ఆ కాలంలో తిరుమలలో ఆవాసాలు అక్కడివరకే ఉండేవి. తిరుమలలో ప్రవేశగోపురంగా వుండాలని ఉద్దేశం కావచ్చు. అది ప్రాకారంలో భాగం కాదు. మాడవీథులతో సంబంధం కూడా లేదు. ఆలయంతో సంబంధం లేని విడి గోపురం - ఆగమసమ్మతం కాదేమో అనిపిస్తుంది. కావలసిన ధనం, కట్టడానికి కావల్సినంత మందీ మార్బలం ఏర్పాటుచేసి, గోపురం పని ప్రారంభించి తను, సేతుదర్శనానికి రామేశ్వరయాత్రకు బయలుదేరాడు.

దక్షిణ దేశ యాత్ర పూర్తి చేసుకొని తిరుగు ప్రయాణంలో మరల వేంకటాచలానికి వచ్చి కొంత - అంటే మొదటి అంతస్తు గోపురం పనిచూసి చాలా సంతోషించి కొంతకాలం తిరుమలలో వుండి పని పర్యవేక్షణ, దానధర్మాదులలో గడిపారు.

అలా వున్నప్పుడు ఒకరాత్రి రాజుకు కలలో ఒకపెద్ద సర్పం కన్పించి, "నా శరీరమే ఈ పర్వతం. నీవు కడుతున్న ఈ పెద్ద గోపురం నాకు భారం అవుతుంది. బాధగా వుంది. ఈ బాధ పోవాలంటే స్వామి సన్నిధిలోనే సాధ్యం" అని చెప్పి, ఆ సర్పం స్వామి సన్నిధికి చేరి వైకుంఠ (వరద) హస్తాన్ని చుట్టుకున్నది.

ఈ కలగన్న రాజు భయపడి, పండితులను 'దీని అర్థమే'మని ప్రశ్నించాడు.

పండితులు, "రాజా, అన్ని పురాణాల్లోనూ ఈ పర్వతశ్రేణి, ఈ పర్వతం శేషునిగా చెప్పబడింది. నీవు గోపురం నిర్మించడం ఆదిశేషునికి ఇష్టమున్నట్లులేదు. (గోపురం బరువు శేషునికి భారమా - బ్రహ్మాండాన్ని మోయగలిగిన శేషునికి ఈ గోపుర భారమెంత?) అది భగవదిచ్ఛ కాదని శేషుని భావనగా తెలుసుకొని ఎత్తైన గోపుర నిర్మాణం చేయవద్దని ఈ కలకు అర్థం" అని చెపుతారు... శ్రీనివాసునికి తన గోపురకైంకర్యం ఇష్టంలేదని తలచి, కట్టడం కార్యక్రమాన్ని అంతటితో ఆపి, అపరాధ పరిహారంగా, శేషుని రూపంతో ఒక నాగాభరణం (బంగారంతో) స్వామి వైకుంఠ

(వరద) హస్తానికి సమర్పిస్తాడు. శ్రీమహావిష్ణువుకు నాగాభరణం చేతికి సహజంకాదు. అందునా ఒక్కచేతికి ఆభరణమేమిటి- అని ఆలయాధికారులు సందేహిస్తుంటే, భగవంతుడే ఒక భక్తుని ఆవహించి...

"పూర్వం వాయువుకు, శేషునికి ఎవరు శ్రేష్ఠుడన్న వివాదంలో శేషుని గర్వభంగమయింది. తర్వాత శేషుడు వేయి సంవత్సరాలు నా గురించి ఘోరతపస్సు చేసి నాకు పడకరూపంలో ఈ కొండలో ఆవిష్టుడై సేవచేస్తున్నాడు. అతని భక్తికి మెచ్చి ఈ ఆభరణాన్ని నా చేతికి ధరిస్తాను. అతని ఆకారంలో వున్న నగ నా చేతిపై చూసిన వారికి, శేషునిపై నాకున్న ప్రీతి తెలుస్తుంది" అని ప్రకటిస్తాడు. అలాగే ఆ నగను ధరింపచేశాడని - ఈ కథ తెలిసిన శ్రీరామానుజులు, తర్వాతి కాలంలో అటువంటిదే ఇంకో నాగాభరణం చేయించి రెండు చేతులకూ రెండు నాగాభరణాలు వుండేట్లు ఏర్పాటుచేశారని వేంకటాచల ఇతిహాసమాలలో అనంతాచార్యులు చెప్పారు. అంతేకాని మూల విగ్రహానికి చేతులపై చెక్కబడిన నాగాభరణాలు లేవు. అంతకుముందు వివాహ సమయంలో శ్రీనివాసునికి మామ ఆకాశరాజు రెండు చేతులకు రెండు నాగాభరణాలు ఇచ్చినట్లు పురాణం చూశాం కదా! అవి ఇప్పుడు లేవు.

ఈ వృత్తాంతం చెబుతున్నప్పుడు వాయుమూర్తికి, శేషునికి జరిగిన ఘర్షణ విషయంలో భగవంతుడు తానే కొంత పక్షపాతం చూపించాడు. వాయుమూర్తిని అధికుడుగా ప్రకటించి శేషునికి అన్యాయం చేసినట్లు అనంతాచార్యులచే చెప్పబడినట్లు ప్రచురించ బడిన గ్రంథాల్లో వుంది. భగవంతుడు అనంత కళ్యాణ గుణపరిపూర్ణుడేకాక దోషరహితుడు. వైషమ్య నైర్ఘుణ్యాలు, పక్షపాతబుద్ధి వుండటం దోషం. వారి వారి కర్మఫలం బట్టే అందరినీ సమంగా వారివారి యోగ్యత ప్రకారం చూసేవాడు కాబట్టే భగవంతునికి 'సమ' అని పేరు. అటువంటి దోషదూరుణ్ని 'పక్షపాత బుద్ధి' అనే దోషాన్ని చెప్పటం సమంజసం కాదు.

ఆ వీరనరసింహుడు ఆ కాలంలో కట్టించిన మొండి గోపురం - అసలే సగం మాత్రమే వుండేది - పైభాగం చాలా శిథిలమైపోయింది. వందల సంవత్సరాలు అలా వుండటంతో శిథిలావస్థలో వున్నట్లు వుండేది. అదీ మంచి రద్దీ ప్రదేశంలో. సన్నిధి వీథి 6 అడుగులు ఉండేది కాదు. సన్నిధివీథినుండి దక్షిణానికి వెళ్లే మార్గమధ్యంలో ఈ మొండి గోపురం ఉండేది. ఈ గోపురం దగ్గర ఆ ఆరడుగుల దారి నాలుగడుగులై

యాత్రికులకు చాలా ఇబ్బంది కలిగించేది. శిల్పచాతుర్యం కాని, ఇతర ప్రాచుర్యం కాని లేని ఈ కట్టడానికి ఆనుకొని చిన్న చిన్న ఇండ్లు వుండేవి. యాత్రికులంతా ఆ గోపురం కిందనించే వెళ్లాలి. అప్పుడప్పుడు పైనుండి రాళ్లుపడిపోతూ ఉండేవి. 1980లో నేను కార్య నిర్వహణాధికారిగా వుండగా తిరుమల మాస్టరు ప్లానులో భాగంగా సన్నిధివీథిని 6 అడుగుల నుండి 100 అడుగులకు వెడల్పు చేయడం, బేడీ ఆంజనేయస్వామి గుడి పునరుద్ధరణలో భాగంగా ఇప్పటి కళ్యాణకట్ట, ఆస్థాన మంటపాలు కడుతూ, మధ్య భాగంలో వున్న 6 అడుగుల రోడ్డుని 100 అడుగులకు వెడల్పుచేసే కార్యక్రమంలో భాగంగా యాత్రికులకు సురక్షితం కాని ఆ మొండి గోపురాన్ని కూడా తీసివేయవలసివచ్చింది.

అలా అప్పుడు చేయటం నా తొందరపాటుతనమేమో అని ఇప్పుడు అనిపిస్తూంటుంది. ఇటువంటి ఇతిహాసప్రభావం గల కట్టడాన్ని కూల్చడంపై కొంత ఆలోచించి ఉండాల్సింది. వీథి ఆరడుగులే అయితే, ఆ గోపురం తీసివేయాల్సిందే కాని అలా తీసివేశాక, వీథిని 100 అడుగుల వెడల్పు చేశాను కదా. అక్కడకు వాహనాలు ఎలాగూ రావు కాబట్టి, ఆ మొండి గోపురాన్ని అలాగే ఉంచి, చుట్టూ రక్షణకు ఏర్పాటు చేసి యాత్రికులు ఆ కట్టడం చూస్తూ పక్కగా గుడికి వెళ్లే సావకాశం కల్పించి ఉండాల్సింది! కాని భగవదిచ్ఛ నన్నలా ప్రేరణ చేసింది. అది పుణ్యమో, పాపమో నాకే.

★ ★ ★

18. అదే శ్రీనివాసుని కొట్టిన గునపం!

తిరుమల వేంకటాద్రికి 'పుష్ప మండపం' అనే పేరు ప్రాచీనకాలంలో వుండేది. భగవంతుడు పుష్పప్రియుడు, మంచి సువాసన ఇచ్చే రంగురంగుల పూలతో చేసిన దండలతో అలంకారం ఆయనకు ఇష్టం. ఈనాటికీ స్వామి వారి అలంకారంలో పుష్పాల ప్రాధాన్యం చూస్తూనేవున్నాం. ఆయన అలంకార ప్రియుడు.

శ్రీరామానుజుల కాలంలో కొండమీద పూలతోటలు చాలా తక్కువగా ఉండేవి. ఆ లోటు తీర్చాలన్న వుద్దేశంతో తన శిష్యులనుద్దేశించి "కొండమీద వాసంచేస్తూ నందనవనాన్ని పెంచే స్వామివారి కైంకర్యానికి ఎవరు సిద్ధ" మని ప్రశ్నించారు. కొండమీద ఆరోజుల్లో ఆవాసం చాలా కష్టాలతో కూడినపని. వసతులు లేవు, బాగా చలి, దోమలూ, విషజ్వరాల బాధ. ఎవరూ ముందుకు రాలేదు. కాని అనంతాచార్యులనే శిష్యుడు ఈసేవ మహాభాగ్యంగా భావించి కొండకు పోవడానికి సిద్ధపడ్డాడు.

అలా కొండమీద కొచ్చిన అనంతాచార్యులు నందనవనం పెంచడానికి నీరు కావాలి కనుక సరోవరం లాంటి ఒక పెద్ద బావి తవ్వాలని సంకల్పించాడు. స్వామివారి కైంకర్యం తామే స్వయంగా చేసి, ఇతరుల సహాయం తీసుకోకుండా స్వామివారి అనుగ్రహం పొందాలన్న సంకల్పంతో వారి కుటుంబ సభ్యులు ముగ్గురూ, అంటే తాను, తన భార్య, పుత్రుడు కలిసి ఈ కార్యక్రమంలో నిమగ్నులయ్యారు.

ఆయన భార్య గర్భవతి. ఆచార్యులు మట్టి తవ్వుతుంటే, తట్టలతో మోసి ఆమె బయటవేస్తుండేది. వారికి వారి చిన్న పుత్రుడు చిన్నబాలుడైనా అన్ని పనుల్లో సాయంచేసేవాడు. ఇలా కైంకర్యం చేస్తున్న వారి కుటుంబాన్ని, ప్రత్యేకంగా గర్భిణిగా అవస్థపడుతూ పనిచేస్తున్న అనంతాచార్యులవారి భార్యనుచూచి, జాలితో స్వామివారు సహాయం చేద్దామని ఒక బాలుని వేషంలో వచ్చి, అనంతాచార్యులను తనను కూడా పనిచేయనివ్వమని ప్రార్థిస్తాడు. దానికి అనంతాచార్యులు ఒప్పుకోడు.

అయినప్పటికీ స్వామి, తట్టతో మట్టి మోస్తున్న అనంతాచార్యుల భార్యనుండి తట్టను తీసుకొని బయట పారబోసి సహాయంచేస్తాడు. వద్దన్నా చేస్తున్న సాయానికి

కోపంవచ్చి అనంతాచార్యులు స్వామి వారిని మందలించడానికి ప్రయత్నంచేస్తాడు. అంతే, స్వామివారు గుడివైపు పరుగుతీస్తారు. అలా వెళ్తున్న స్వామివారిపైకి తన చేతిలోని గునపాన్ని విసురుతాడు అనంతాచార్యులు. ఆ గునపం స్వామివారి చుబుకానికి తగిలి రక్తం కారడం మొదలైంది. గడ్డంపట్టుకొని స్వామివారు గుడిలోకి పరుగుతీస్తారు. వారి వెనుక అనంతాచార్యులు కూడా పరుగెత్తి గుళ్లోకి వచ్చి చూస్తే ఆ బాలుడు కనబడలేదు. కలతతో స్వామివారి సన్నిధికి చేరుకుంటాడు అనంతాచార్యుడు.

ఆశ్చర్యం!

స్వామివారి చుబుకానికి గాయం... గాయంనుండి ధారగా కారుతున్న రక్తంచూసి, తాను గునపంతో ఎవరిని కొట్టాడో గ్రహించి పశ్చాత్తాపంతో విలపిస్తాడు. వెంటనే గాయానికి పుప్పొడి అద్ది వుపశమనం చేయడానికి ప్రయత్నిస్తారు అర్చకులు. అనంతాచార్యుని అవస్థ చూసి భగవంతుడు అతనిని బుజ్జగించాడని, ఆ గాయపు గుర్తును శ్రీవత్స చిహ్నంలా (Beauty Spot) చూసుకొంటానని, ఈ అనంతాచార్యుల సేవకి, స్వామివారి అనుగ్రహానికి గుర్తుగా తనకు గాయమైన ప్రదేశంలో పచ్చకర్పూరం దిద్ది చూసినవారికి అనంతాచార్యుల భక్తిగాథ తెలియవచ్చేట్లు జరగాలని స్వామివారు శాసించారని చెబుతారు.

ఈ నాటికీ స్వామివారి చుబుకంపై కర్పూరంతో గుండ్రంగా చిన్న చిహ్నంపెట్టే ఆనవాయితీ కొనసాగుతూనే వుంది. అనంతాచార్యులు తయారుచేసిన నందనవనం, బావి, చిన్న సరోవరం తిరుమల శ్రీవారి ఆలయానికి నైఋతి దిశలో ఇప్పటికీ వున్నాయి. ఈ మధ్యకాలంలోనే అనంతాచార్యుల వారసులనుండి దేవస్థానం ఈ పూదోటను తీసుకొని అభివృద్ధి చేశారు. దీనినే ఆనందాళ్వార్ తోటగా పిలుస్తారు. ఆలయ మహాద్వారంలో ప్రవేశించేటప్పుడు మహాద్వారం ఉత్తరం గోడపైన ఆనందాళ్వారు స్వామిపై విసిరిన గునపం యాత్రికుల దర్శనార్థం ఉంచబడింది. ఈసారి తిరుమలయాత్రకు వెళ్లినప్పుడు చూడవచ్చు.

భగవంతుడైన శ్రీనివాసునికి ఈ ఆనందాళ్వారుపై ఎంతటి అనుగ్రహమో చూపించే ఒక కథ వాడుకలో వుంది. తన భక్తుడైన ఆనందాళ్వారు కీర్తిని అందరికీ తెలిసేటట్లు చేయడానికి భగవంతుడు ఒక సన్నివేశాన్ని సృష్టించాడు.

శ్రీనివాసుడే పద్మావతీదేవితో కలిసి, రాజకుమారుడు, రాకుమారి వేషాల్లో, అనంతాచార్యులు పెంచుతున్న పూదోటకు వెళ్లి వనాన్ని చిందరవందరచేసేవాడట. ఖిన్నుడైన అనంతాచార్యులు ఎవరు అలా తోట పాడుచేస్తున్నారో తెలుసుకోలేక

పొదరింట్లో ఒకనాడు కాపువేశాడు. తోట పాడుచేస్తున్న ఆ రాజదంపతులను పట్టుకొని సంపెంగ చెట్టుకు కట్టివేయడానికి ప్రయత్నిస్తాడు అనంతాచార్యులు. శ్రీనివాసుడు పట్టువిడిపించుకొని పారిపోతాడు. కాని పద్మావతీ దేవి దొరికిపోతుంది. ఆమెను చెట్టుకు కడుతుంటే "నేను స్త్రీని, నీ కూతురులాంటి దానిని, నన్ను విడిచిపెట్టు నాయనా" అని కోరుతుంది. అయినా అమ్మవారిని ఒక సంపంగి చెట్టుకు కట్టివేశాడు అనంతాచార్యుడు, ఆమెను కట్టివేస్తే రాకుమారుడు ఆమెకోసం వస్తాడు కదా అన్న భావనతో. అలా కట్టబడిన అమ్మవారు సంపంగిచెట్టు దగ్గరే ఉండిపోయింది.

ఉదయం ఆలయం తలుపులు తెరిచిన అర్చకులు స్వామివారి వక్షఃస్థలంలో వుండాల్సిన దేవి లేకపోవడం గమనిస్తారు. వారిలో ఒక పురుషునిలో ఆవహించి స్వామివారు అందరికీ జరిగిన వృత్తాంతం చెబుతారు. వెంటనే వారంతా అనంతాచార్యుని తోటకు వస్తారు. జరిగినది తెలుసుకొని మహాపచారం చేశానని బాధపడి, అమ్మవారిని పెద్ద పూలబుట్టలో కూర్చోపెట్టి, బుట్టను నెత్తినపెట్టుకొని పెండ్లి మండపానికి పెండ్లి కుమార్తెను తెచ్చినట్లుగా మోసుకొని ఆలయంలో భగవంతుని వద్దకు తెచ్చాడు అనంతాచార్యులు. నమస్కరించి, క్షమాపణ చెప్తున్న అనంతాచార్యునితో "నీ పుత్రికను నాకు ఇవ్వు" అని చెప్తూ తన కంఠంలోని ఒక పూమాలను అనంతాచార్యుని మెడలోవేసి అనుగ్రహించారు స్వామివారు. పద్మావతీదేవి స్వామి వక్షఃస్థలం చేరుకుంటుంది.

అలా అనంతాచార్యులు స్వామివారి మామగా కీర్తింపబడతాడు. ఆయన వారసులు ఇప్పటికీ తిరుమల ఆనందాన్ పిళ్లై (టి.ఎ.పి.) వంశస్థులుగా ఉండి, ఆచార్య పురుషులుగా స్వామివారి మర్యాదలు పొందే ఆనవాయితీ ఉంది.

స్వామివారు రాకుమారుడుగా తోటలో పద్మావతీదేవిని వదిలి అప్రదక్షిణంగా ఆలయానికి పారిపోయాడట...

ఆ వృత్తాంతాన్ని ఆధారం చేసుకొనే బ్రహ్మోత్సవాల చివరలో స్వామివారిని అప్రదక్షిణంగా ఆనందాళ్వార్ తోట వరకు తీసుకువెళ్లి హడావుడిగా ఎక్కడా ఆగకుండా మళ్లీ ఆలయానికి తెచ్చే సంప్రదాయం ఈనాటికీ కొనసాగుతున్నది.

★ ★ ★

అనంతాచార్యులు విసిరిన (శ్రీవారి చుబుకానికి తగిలిన) గునపం ఇప్పటికీ తిరుమల ఆలయంలో మహాద్వారం గడపకి కుడివైపున గోడకి వేలాడదీసి ఉంటుంది. ఈసారి తిరుమలదర్శనానికి వెళ్లినప్పుడు మహాద్వారం దగ్గర ఆగి ఆ గోడమీద చూడండి. వివరాలు తెల్పుతూ ఒక బోర్డు కూడా ఉంది.

19. అప్పటి విజిలెన్స్ వ్యవస్థ ఇలా కుప్పకూలింది!

శ్రీశైలపూర్ణుని శిష్యుని పరిమళద్రోహ వృత్తాంతం రామానుజులకు తెలుస్తుంది. ఎన్ని నియమాలు, కట్టుదిట్టాలు చేసినా ఆచరణలో పెట్టడానికి తగిన వ్యవస్థ లేకపోతే, కలికాలంలో నియమనిబంధనలు ఉల్లంఘించేవారుంటారు కదా!

ఏం చేయాలన్న ఆలోచనలో పడ్డారు రామానుజులు.

ఆలయంలో ఆలయ వ్యవహారాలు చూడటానికి, ఆలయం ఆస్తుల యాజమాన్యానికి, కైంకర్యానికి కావలసిన ఏర్పాట్లు చేయటానికి ఆలయాధికారుల వ్యవస్థ వుండనే ఉంది. రాజశాసనానికి అధీనులుగా వారు కర్తవ్య నిర్వహణ చేయాల్సి వుంది. స్వామివారి అర్చనాది కైంకర్యాలు ఆగమపద్ధతిలో సంప్రదాయపు కట్టుబాట్లతో చేయడానికి వైఖానస అర్చకవ్యవస్థ ఉంది.

కాని ఏ కాలంలోనైనా, అధికారులు అధికారులే, అర్చకులూ మానవమాత్రులే... వారూ కక్కుర్తి పడే అవకాశం ఉంది.

స్వామివారి కైంకర్యానికి కావలసిన ఏర్పాట్లు అన్నీ చేయించడం ఆలయ అధికారి బాధ్యత. పూలు, ఫలాలు, కైంకర్యానికి గంధం, తులసి, దీపారాధనకు కావలసిన నెయ్యి, నైవేద్యానికి కావలసిన అన్ని పదార్థాలు, కావలసిన మోతాదులో, సకాలంలో అందించవలసిన బాధ్యత అధికారులది. అవి కైంకర్యానికి యోగ్యమా లేక నాసిరకమా అని సరిచూసేదెవరు? ఇవ్వాల్సిన మోతాదులో ఇస్తున్నారా అన్నది నిర్ణయం చేసేదెవరు?

అర్చకులు చేయవచ్చు. కాని అలాచేసే స్తోమత కావాలి. వారు చెప్పినా, అధికారులు వినే అవకాశం వుండాలి.

ఇంకో విషయం, అధికారులు ఇచ్చిన వస్తువులన్నీ సక్రమంగా కైంకర్యంలో అర్చకులు వాడుతున్నారన్న భరోసా ఎక్కడ?

సకాలానికి కైంకర్యం జరుగుతోందా? సక్రమంగా జరుగుతోందా? పని ఒత్తిడిలోనో లేదా, యాత్రికుల హడావుడిలోనో, స్వామివారి కైంకర్యంలో లోపం లేకుండా ఎప్పటికప్పుడు నియమాలు, సంప్రదాయాలు గుర్తు చేస్తూ, ఆచార నియమాలు జరిగేట్లు చూడటానికి వ్యవస్థ ఉంటే బాగుంటుందన్న ఆలోచన రామానుజులకు వచ్చింది.

ఆ వ్యవస్థ ఎలా వుండాలి? ఆచార వ్యవహారాలు తెలిసినవాడై వుండాలి. స్వతహాగా నియమనిష్ఠలు కలిగినవాడై ఉండాలి. మిగతావారికన్నా శాస్త్రంలోనూ పాండిత్యంలో వైరాగ్యంలో అధికుడైతేనే, వానిమాటపై గౌరవం ఉండే అవకాశం. ప్రతి సేవాసమయంలో అక్కడే వుండాలి.

ఇంతేకాక, తరతరాలుగా వచ్చిన భక్తులు ఎన్నో ఆస్తుల్ని వారివారి మొక్కులు తీర్చుకోవడానికి ఇవ్వడం జరిగింది. నైవేద్యాలు సంవత్సరంలో ప్రత్యేకరోజుల్లో ఏర్పాటు చేయాలని భూములిచ్చిన వారున్నారు. ప్రత్యేక ఆర్జితసేవలు సంవత్సరంలో చేయించమని మడిమాన్యాలు ఇచ్చిన రాజులు, భక్తులు ఉన్నారు. నందాదీపం పెట్టమని, కార్తీకదీపాలు పెట్టమని, పుష్పకైంకర్యం చేయించమనీ, వాహనసేవ చేయించమని, కళ్యాణమని, బ్రహ్మోత్సవమని, తిరుమంజనం అని... ఇలా వారికి తోచిన కైంకర్యం చేయించడం కోసం ధనం ఇచ్చిన వారున్నారు. భూమి ఇచ్చిన వారున్నారు. గ్రామాలకి గ్రామాలు ఇచ్చిన రాజులున్నారు. కొందరు ఈ వివరాలు గుడిలో శిలాశాసనాలుగా చెక్కించినా, వారిచ్చిన ఆస్తులనుండి ఆదాయం వస్తున్నా, చేయాల్సిన ప్రతి సేవా చేస్తున్నారో లేదో సరిచూసే వ్యవస్థ ఏదీ? చేస్తున్నామని అధికారులు చెప్తున్నా, సరిగా జరగడం లేదన్న ఆరోపణలున్నాయి. అధికారులు కావల్సిన సదుపాయాలు చేసినా, అర్చకులు సరిగా చేస్తున్నారో లేదో చూసేవారెవరు? అర్చకుల ప్రవర్తన, కైంకర్యపద్ధతులు, ఆగమ నియమాలు అధికారులకు తెలియవు కదా?

అర్చకులు, ఆలయఅధికారులు కాకుండా వేరొక ప్రత్యేక వ్యవస్థ ఉంటేనేకాని, కైంకర్యం సక్రమంగా జరిగే అవకాశం లేదనీ, భక్తులకూ, ఆర్జిత సేవకులకూ తగిన తృప్తి కలిగే అవకాశం లేదనీ నిర్ణయానికొస్తారు శ్రీ రామానుజులు.

ఈ దివ్యక్షేత్రంలో శ్రీనివాసుని దివ్యవైభవ పరిపాలన కొరకు, లోకులు అపచారాలు చేయకుండా నివారించేందుకు ఆలయం బాగా అభివృద్ధి పరిచే శ్రద్ధకలవాడై వుండి, విశేషమైన నియమ వ్యవస్థను చెడకుండా కాపాడేందుకు

భగవంతుని ఆలయంలోని అన్ని భోగాలకు సారథిగా గొప్ప వైరాగ్యం, ఉత్తమమైన లక్షణాలు గల ఒక అధికారి ఎల్లప్పుడూ, ఇక్కడనే నివసించి స్థిరంగా ఉండే వ్యవస్థ ఏర్పాట్లుచేశారు శ్రీరామానుజులు.

అదే ఏకాంగి వ్యవస్థ. తర్వాతికాలంలో జియ్యంగారి మఠం అయింది.

ఆ వ్యవస్థకు అధికారిగా ఒక వైరాగ్యం, పాండిత్యం, ప్రతిభ, ఆసక్తి గల అధికారిని నియమించమని శ్రీశైలపూర్ణుడు శ్రీ అనంతాచార్యులను ఆదేశించాడు. వారు నియమించిన అధికారి "ఏ పొరపాటు చేయనివాడుగా ఉండాలంటే, ఏమి చేయాలో ఆ విధంగా 'మీరు' నడిపించా"లని శ్రీరామానుజులు శ్రీశైలపూర్ణులను, అనంతాచార్యులను ఆదేశించారు. అలా మూడు కాక నాలుగు వ్యవస్థలు - వారి వారి పరిధిలో వారికి స్వాతంత్ర్యం గల వ్యవస్థ స్థాపించారు శ్రీ రామానుజులు.

శ్రీశైలపూర్ణులు, శ్రీ అనంతాచార్యులు మొదలైన పాండిత్యప్రతిభ గలవారు తర్వాత కాలంలో ఆచార్య పురుషులుగా ప్రసిద్ధికెక్కారు. ఆలయసంప్రదాయాలు, కట్టుబాట్లు, కైంకర్యనియమాలు, మిగతా మూడు విభాగాలూ సక్రమంగా చేస్తున్నాయో లేదో చూసే అనధికారపు పెద్దలు వారు... ఆగమ సంప్రదాయాల విషయంలో వచ్చే సందేహ నివృత్తి చేయడం వీరి బాధ్యత.

దేవదేయాలు, ధర్మాదాయాలు, ఆర్జిత సేవల విషయాల్లో, స్వామివారి కైంకర్యం విషయంలో, యాత్రికుల భక్తుల విషయంలో కావల్సిన సదుపాయాలు అన్నీ ఏర్పాట్లు చేసే బాధ్యత ఆలయ అధికారిది.

ఆలయ అధికారులు అందించే పదార్థాలు ఆమోదయోగ్యాలా, కావా; కైంకర్యానికి దిట్టం ప్రకారం ఇస్తున్నారా, లేదా; సమయపాలన చేస్తున్నారా, లేదా చూసే అధికారం ఏకాంగిది/జియ్యంగారిది. ఆలయంలో కైంకర్యసామగ్రి అంతా జియ్యంగారి/ఏకాంగి ద్వారానే అర్చకులకు అందచేయడం జరుగుతుంది.

అలా ఏకాంగి/జియ్యంగారు అందజేసిన సామగ్రితో ఆరాధన/అర్చన చేయడం అర్చకుల బాధ్యత.

మూలవరులకు కాని, ఉత్సవవరులకు కాని, ఆలయంలో జరిగే ప్రతి స్వామివారి సేవాకార్యక్రమాలలో ఈ మూడు వ్యవస్థల ప్రతినిధులు తప్పనిసరిగా ఉండాల్సిందే. అలా లేకుండా ఏ కార్యక్రమం జరగడానికి అవకాశం లేనట్లు కట్టుదిట్టమైన వ్యవస్థ ఏర్పాటు చేయబడింది.

ఇలా ఏకాంగి (విష్వక్సేనయతిని) ఏర్పాటు చేసిన రామానుజులు, తర్వాత తన తిరుమలయాత్రలో, పనిభారం గ్రహించి, ఇంకా నలుగురు ఏకాంగులు ఉండాలన్న నిర్ణయాన్ని చేశారు. విష్వక్సేన ఏకాంగికి సన్న్యాసదీక్షనిచ్చి 'శఠగోపులు' అని పేరు పెట్టారు. నియనిబంధనలు పాటించడానికి, వారి అధికారాలు, ఆదేశాలూ ఆలయాధికారులు పాటించేట్లు యాదవరాజుచే ఒక శాసనం చేయించారు. ఈ శఠగోపులు (జియ్యంగారు) అధికారదుర్వినియోగం చేయడం జరిగితే, వారిని తీసేసి ఇంకొకరిని నియమించే కట్టుదిట్టం కూడా చేశారు.

తన 102వ ఏట రామానుజులు చివరిసారి తిరుమలకు వచ్చినప్పుడు యాదవరాజు ద్వారా "శ్రీవేంకటనాథుని ఆదాయం, ఖర్చు, దివ్య ఆభరణాలు మొదలైన వాటి విషయంలో శఠగోపయతీంద్రునికి సంబంధం గల జనులచేత ఒక జవాబుదారీ పత్రం లేక పూచీకత్తు వ్రాయించాలి" అని నియమం చేయించారు. ఆలయ అధికారులచే భగవంతుని ద్రవ్యం దొంగిలింపబడకుండా కట్టుదిట్టం చేశారు.

కాలక్రమంలో ఆ అధికారం జియ్యంగార్లకు లేకుండా పోయింది. నామమాత్ర అధికారమే మిగిలి, దేవస్థానం వారు తయారుచేసి ఇచ్చిన స్వామివారి కిందటి దినపు ఆదాయ విశేషాలు కొలువులో శ్రీనివాసునికి సమర్పించే లాంఛనం మాత్రం మిగిలింది.

ఆలయాధికారులకు ఆలయ నిధులనుండి జీతభత్యాలు వస్తే, జియ్యంగారు/ అర్చకులకు స్వామివారికి చేసే నైవేద్యంలో భాగం వచ్చేది. వారి జీవనోపాధి అలా గడిచేది. వారి అవసరాలకు తప్పక సరిపోయేదిగా వుండేది. ఆ భాగం ఆలయ అధికారుల దయాదాక్షిణ్యాల మీద కాక పారంపర్యపు హక్కుగా వారికి సంక్రమించే పద్ధతిని ఏర్పాటుచేయడం జరిగింది...

ఆచార్య పురుషులకు తీర్థప్రసాదాలు గౌరవసూచకమేకాని, పెద్ద ఆదాయంకాదు...

శ్రీ అనంతాచార్యుల శిష్యుడైన ఒక పండితునికి సన్న్యాసదీక్ష నిచ్చి, త్రిదండ కాషాయాలు ధరింపచేసి, 'విష్వక్సేనఏకాంగి', లేదా 'సేనాపతియతి' అని పేరు పెట్టి అతనికి పై చెప్పిన బాధ్యతలు అప్పగించారు (ఆ రోజుల్లో ఒక రకంగా చూస్తే ఇది చీఫ్ విజిలెన్సు ఆఫీసరు ఉద్యోగం లాంటిది).

భగవంతుని కైంకర్యం చేయడమే జీవనవిధి, ఆదర్శంగా చేసి, స్వామివారి ఆలయం ముందువున్న 'బేడీ ఆంజనేయస్వామి'గా పిలువబడే ఆలయం పక్కన జియ్యంగారికి నివాసం ఏర్పరచారు. ఇది 'బేడీ ఆంజనేయులు కారనీ-'భేటీ

ఆంజనేయులు' అని చెప్తారు. జియ్యంగారి మఠంలో రాములవారిని ప్రతిష్ఠ చేసి, నిత్యం రాములవారి ఆరాధన చేసే నియమం పెట్టి- పూర్వం హనుమంతుడు చేసిన సేవ గుర్తు తెచ్చుకుంటూ భగవంతునికీ, భక్తునికీ భేటీ - కలయిక ఏర్పాటుచేసే హనుమంతులా స్వామికి, భక్తులకు ఈ జియ్యంగారు సేవ చేయాలన్న విషయం సూచించడానికే ఈ 'భేటీ ఆంజనేయస్వామి'. ఈ విషయం నాకు స్పష్టం చేసింది శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ చినజియ్యరుగారు.

అందుకే జియ్యంగారికి ఇచ్చిన ఐదు చిహ్నాలు - హనుమంతుని ముద్ర గల ఉంగరం. హనుమంతుని ముద్రగుర్తు గల భగవంతుని ఆలయ తలుపు గడియ తెరిచేందుకు తాళపుచెవి, హనుమంతుని ముద్ర గల ఒక గంట, హనుమంతుని ముద్ర (చిత్రపటం) కల ఒక పరివ్రాజక ధ్వజం జెండా. హనుమంతుని విగ్రహం చిహ్నాలుగా చేసి స్వామివారి సన్నిధిలో ఈ సేనాపతియతికి ఇచ్చారు. దేవాలయం మూసినపుడు సీలువేసేది అంగుళీయకం తోనే. గంట, జెండా యాత్ర చేసేటప్పుడు దేవాలయ తలుపులు మూసేటప్పుడు వేసే తాళంపై సీలు ఈ జియ్యంగారివే.

మొదటినుండి ఇటువంటి అధికారాలు జియ్యంగారికి ఎలా వచ్చాయి? రామానుజుల వారి కాలంలో ఈ వ్యవస్థకు ఇటువంటి అధికారాలు ఇప్పించబడ్డాయి. ఇలా వ్యవస్థను ఏర్పాటుచేసి, తనపై గట్టి నమ్మకమున్న ఆ దేశపు యాదవరాజుకు ఈ విషయంపై అవగాహన కలుగజేసి, జియ్యంగారి నిర్ణయాలు అమలుపరిచి తప్పక పాటించాలన్న నియమాన్ని రాజ శాసనంగా చేయించారు.

రోజూ వచ్చే ఆదాయం కూడా ఏ రోజుకారోజు లెక్కలు తేల్చి, మరుసటిరోజు ఉదయం స్వామివారి కొలువు సమయానికి దేవాలయ అధికారులు జియ్యంగారికి అందజేయాలి. ఆ వివరాలు జియ్యంగారు స్వయంగాకాని, తన గుమాస్తా ద్వారా గాని స్వామివారి కొలువులో అందరిముందూ బాహ్యప్రకటన రూపంలో లెక్కలు స్వామివారికి సమర్పించే విధానం మొదలుపెట్టారు.

ఇప్పటికీ ప్రతిరోజూ స్వామివారి అర్చనకు ముందు అంటే తోమాలసేవ తర్వాత స్వామివారి కొలువు ఆలయంలో జరుగుతుంది. ఆ కొలువులో పంచాంగ శ్రవణం-ఈ రోజు, మరుసటిరోజు పంచాంగ విషయాలు దేవస్థానం ఆలయాల్లో జరుగవలసిన ప్రత్యేక వివరాలు (ఎవరూ సేవ విషయం మర్చిపోకుండా) చెప్పిన తర్వాత జియ్యంగారి గుమాస్తా క్రితంరోజు స్వామి వారికి వచ్చిన ఆదాయం, ఉదయం హుండీ (కొప్పెర) కానుక, ఆర్జిత సేవలద్వారా వచ్చింది, నగదు, బంగారం, వెండి, ఇతరములు,

సాయంత్రం హుండీలో వచ్చిన కానుక వివరాలు - మొత్తం రోజు ఆదాయం స్వామి వారికి ప్రకటించి, ఆ ఆదాయం స్వామివారి ఖజానాకు పంపిన వివరం కూడా ప్రకటిస్తారు. ఆ బాధ్యత జియ్యంగారిదే.

ఏకాంగిగా ఒక్క అధికారిగా మొదలైన వ్యవస్థ ఒక మఠంగా రూపురేఖలు దిద్దుకొని ఇప్పుడు రెండు మఠాలుగా ఏర్పడి, (పెద్ద జియ్యంగారి మఠం, చిన్న జియ్యంగారి మఠం) ఆయా మఠాల్లో, కొందరు ఏకాంగులు స్వామివారి సేవాకార్య క్రమాలలో దివ్యప్రబంధం, ద్రవిడ వేదం ఇత్యాదులు పారాయణ చేయడం సాగుతోంది. ఆలయం తలుపులు తీసినప్పటినుండి, ఆలయం మూసివేసే వరకూ, స్వామివారికి, ఆలయంలో జరిగే ప్రతి నిత్యనైమిత్తిక సేవాసమయంలో జియ్యంగారు కాని ఆయన ప్రతినిధి కాని తప్పనిసరిగా ఉండాలి.

ఈ జియ్యంగార్లు సన్న్యాసులు. స్వామివారి కైంకర్యంలో ఏ ఒక్కరోజూ అంతరాయం ఉండకూడదని ఇద్దరు జియ్యర్లు ఉండే సంప్రదాయం- పెద్ద జియ్యరు పరమపదం పొందితే, చిన్న జియ్యరు పెద్ద జియ్యరై, వెంటనే ఇంకొక యోగ్యుడైన వ్యక్తిని చిన్న జియ్యరుగా నియమించడం జరుగుతుంది. వీరు వంశపారంపర్యంగా వచ్చే మిరాశీదార్లు కారు. కాని దురదృష్టవశాత్తూ, వారిని కూడా వంశపారంపర్యపు మిరాశీదార్లుగా పరిగణించి, వీరి నైవేద్యంలో భాగంగా వచ్చే ఆదాయం పోయేట్లు చేసి, వారి స్వతంత్ర ప్రతిపత్తి కోల్పోయేటట్లు చేశారు. వీరు దేవస్థానం యాజమాన్య దయాదాక్షిణ్యాల మీద ఆధారపడ వలసిన దౌర్భాగ్యస్థితి వచ్చింది.

సుప్రీం కోర్టు మిరాశీదారుల విషయంలో ఇచ్చిన తీర్పుతో అర్చకులకు మిరాశీలు పోవడం, దానితో వారి స్వతంత్ర ప్రతిపత్తి పోయి- వీరు కూడా దేవదేయ ఉద్యోగులుగా మారడం, జియ్యంగార్ల నైవేద్యభాగం పోయి, వీరు కూడా దేవస్థాన యాజమాన్యంపై ఆధారపడటంతో - ఒకరిపై ఒకరు నిఘా ఉన్నట్లు ఏర్పాట్లు చేయబడిన వ్యవస్థలు, పూర్తిగా ఛిన్నాభిన్నమై, ఆలయ వ్యవహారాలలో దేవస్థాన పాలకమండలి, అధికారులకే సర్వాధికారాలు కట్టబెట్టడం జరిగింది.

దీనివల్ల చాలా ఇబ్బందులు...!

★ ★ ★

20. ఒక గొప్ప వ్యవస్థ - నీరు గారిపోయింది

ఏకాంగి వ్యవస్థను, యతీంద్రవ్యవస్థగా మార్చి శఠగోపమునికి నలుగురు ఏకాంగులను సకల కైంకర్యభారం మోసేందుకు ఏర్పాటుచేసినా, రామానుజులు అంతగా తృప్తి పొందలేదు. ఈ యతులు, ఏకాంగులు పాండిత్యం కలవారైనా– ఆలయాధికారులకు, అర్చకస్వాములకు, ఈ యతీంద్ర ఏకాంగులవల్ల, ఎప్పుడైనా, శాస్త్రీయ ధర్మమర్యాదలలో, స్వామివారి కైంకర్య విషయాలలో లోపం రాకుండా వుండాలని వేరొక వ్యవస్థను కూడా ఏర్పాటుచేశారు. అదే ఆచార్యపురుష వ్యవస్థ.

మొదటి ఆచార్యపురుషుడుగా శ్రీ అనంతాచార్యుని నియమించి 'శాస్త్రీయ ధర్మ మర్యాద స్థాపనకు' నాంది పలికారు.

ఆచార్యుడంటే– వేదసంపన్నుడు, విష్ణుభక్తుడు, మాత్సర్యం లేనివాడు, మంత్రములు తెలిసినవాడు, మంత్రములపై శ్రద్ధ గలవాడు, ఎల్లప్పుడు మంత్రమును ఆశ్రయించినవాడు, శుచిగలవాడు, మంచి సంప్రదాయం కలవాడు, బ్రహ్మవిద్యలో పరిపూర్ణ సామర్థ్యం కలవాడు, సాధనానంతరం, ప్రయోజనానంతరం లేనివాడు (అంటే కామ్యకర్మ చేయక శ్రీమన్నారాయణుడే ధ్యేయమైనవాడు). బ్రాహ్మణుడు, కోరిక లేనివాడు. క్రోధము, లోభము లేనివాడు, మంచి నడవడిక కలవాడు, శాసించేవాడు, మోక్షమును కోరువాడు, పరమాత్మను తెలిసినవాడు. అటువంటి వాడిని ఎంచి అనంతాచార్యుని ఆచార్య పురుషుడుగా నియమించారు.. అన్ని ఆలయ మర్యాదలలో వారికి ముందు మర్యాద జరిగేలా చేశారు. మొదటి తీర్థం, మొదటి శఠారి మొదట వారికే ఇచ్చే మర్యాద ఏర్పాటుచేశారు. వారిమాట మేరకు ఆలయంలోని ఆచార్య అర్చకపరమైన సేవలకు వ్యక్తులను నియమించాలి.. వారికి సంతృప్తి లేకపోతే, ఆలయసేవలకును తీసివేయాలి...

ఈ ఆచార్య పురుషవ్యవస్థ విస్తరించి దాదాపు ఏడుగురు ఆచార్య పురుషులు ఉండే సంప్రదాయం వచ్చింది. దీనిని వంశపారంపర్య మర్యాదగా మొదటినుంచి

గుర్తించడం ఒక పొరపాటు. తండ్రి పండితుడైతే కొడుకు కూడా పండితుడే అన్న గ్యారంటీ ఎక్కడ? పాండిత్యం, ప్రతిభ ఉన్నా లేకపోయినా మర్యాదలు, గౌరవాలు, ప్రథమతీర్థాల కోసం వెంపరాలు - వ్యవస్థను బలహీనం చేశాయి. ఈ ఆచార్య పురుషులలో పాండిత్యం తగ్గినకొద్దీ, ఈ వ్యవస్థ బలహీనపడిపోయింది. కాని వారిలో కొందరు మహాపండితులు లేకపోలేదు.

నిజమైన పండితుడికి ఎప్పుడైనా, ఎక్కడైనా గౌరవమే. అటువంటి ఆచార్యపురుషులను ఆలయ అధికారులు, అర్చకులు, జియ్యంగార్లు తప్పక గౌరవిస్తుండేవారు. ఆలయ సంప్రదాయాల్లో మార్పులు తేవాలనీ, కొత్తసేవలు ప్రవేశపెట్టాలనీ ప్రతిపాదించినప్పుడు, పాత సేవల్లో మార్పులు తలపెట్టినప్పుడు, సేవలు, నైవేద్యాలు, ఉత్సవాల విషయంలో వివాదాలు వస్తే, వీరి అభిప్రాయం తీసుకోవడం జరిగేది.

ఈ ఆచార్య పురుషులకు శతాబ్దాల క్రితం రాజులు, ధనికులైన భక్తులు మాన్యాలు ఇచ్చారు. కాని ఆలయ నిధులనుండి వారికేమీ వచ్చేదికాదు. తర్వాత వారి ఈనాం భూములు పోవడంతో ఆదాయాలు లేక ఇతరవృత్తులు చూసుకుంటూ, మర్యాదలకు మాత్రం ఆలయానికి రావడం జరిగేది.

మిరాశీలను తీసివేసినపుడు వీరిని కూడా తీసివేసినట్లు వ్యవహరింపబడింది.

★ ★ ★

21. తిరుమల ఆలయంలో రామానుజుల విగ్రహం

తిరుమల ఆలయంలో శ్రీరామానుజుల వారి విగ్రహం వెలసింది. ఇది ఎప్పుడు వచ్చింది? ఎలా వచ్చింది? ...ఇదంతా ఉత్కంఠ కలిగించే విషయం.

అనంతాచార్యులు రచించిన వేంకటాచల ఇతిహాసమాలలో, శ్రీవారి ఆలయంలో శ్రీరామానుజుల విగ్రహ ప్రసక్తి ఉంది.

అనంతాచార్యులు శ్రీరామానుజముని పరమశిష్యులు. రామానుజుల అనుగ్రహంతోనే తిరుమలలో కొలువు, విశేషమర్యాద గల ఆచార్య పురుషస్థానం జియ్యంగార్లపైన, అర్చకులపైన, ఆలయ అధికారులపైన నియంత్రణ చేసే అధికారాన్ని యాదవరాజు శ్రీరామానుజుల సూచనతో అనంతాచార్యులకు ఇస్తాడు.

అలా స్వామివారి కైంకర్యం చేస్తున్న తరుణంలో అనంతాచార్యులు శ్రీరామానుజుల అవతార సమాప్తి వార్త వింటాడు. దుఃఖంతో, నిస్పృహతో కైంకర్యం మానివేస్తాడు. అలా సంవత్సరం గడిచిపోయింది. స్వామి వారే శ్రీ అనంతాచార్యుని పిలిపించి, ఊరడించి తిరిగి యథాతథంగా కైంకర్యం చేసుకోమని సెలవిస్తాడు. రామానుజులపై అపరిమితమైన భక్తి గల శ్రీ అనంతాచార్యులు స్వామివారికి - రామానుజులకు స్వామి వారియందు ఉన్న భక్తిశ్రద్ధలను నివేదన చేసి, స్వామి వారి ఆలయంలో రామానుజుల అర్చాప్రతిమ స్థాపించడానికి అనుమతి కోరతాడు. భగవంతుడనుమతించాకనే అలా రామానుజుల విగ్రహం (ఇప్పుడు హుండీకి ఎదురుగా) ప్రతిష్ఠించబడిందని అనంతాచార్యులు తమ గ్రంథంలో స్పష్టం చేస్తారు.

విగ్రహ ప్రతిష్ఠ మాత్రమేకాక అనంతాచార్యులు స్వామి వారిని ఇంకో కోరిక కూడా కోరాడు. "నీ అధ్యయనోత్సవ సమయంలో ఒకరోజు ప్రత్యేకంగా శ్రీ రంగామృతసూరి (తిరువరంగత్తముదనూరు) రచించిన 'రామానుజ సూత్తందాది' అనే ప్రబంధాన్ని నీ ముందు పారాయణం చేస్తే నీవు వినాలి" అని ప్రార్థించాడట శ్రీనివాసుని.

స్వామివారు తన కోరికను మన్నించి అలా చేయడానికి ఆనతిచ్చాడని అనంతాచార్యులు తన 'వేంకటాచల ఇతిహాసమాల'లో రాశాడు. రామానుజుల వారి విగ్రహం ఇప్పటికీ శ్రీవారి ఆలయంలో మనం చూస్తున్నాం. రామానుజుల భక్తివిశేషాలు కీర్తించే 'రామానుజ సూత్తం దాది' అధ్యయనం కూడా స్వామివారి అధ్యయనోత్సవాలలో స్వామివారి ముందు పారాయణం జరిగే సంప్రదాయం తిరుమలలో ఈనాటికీ కొనసాగుతూ ఉంది.

స్వామివారితో సంభాషణ, స్వామివారు కొన్ని కొత్త సంప్రదాయాలకు అనుమతివ్వడం వంటి కొన్ని ఘటనలు - నమ్మినవారు ప్రగాఢంగా నమ్ముతారు. లేనివారు గురుభక్తితో చేసినవి స్వామికి ఆపాదించి అనంతాచార్యులు కొత్త సంప్రదాయం ప్రవేశపెట్టాడని అంటారు. తరువాత వచ్చిన చరిత్రకారులు కొంతమంది వేంకటాచల ఇతిహాసమాలను పూర్తిగా ప్రమాణంగా తీసుకోరు. కొందరు ఈ ఇతిహాసమాలలో కొన్ని విషయాలు అనంతాచార్యులవారు రచించినవి కావనీ, తర్వాతికాలంలో కొందరు సంప్రదాయకారులు అందులో చొప్పించారనీ భావిస్తారు. ఇదమిత్థంగా ఈ విషయంలో నిర్ణయం చేయలేం.

చారిత్రిక ఆధారాలతో చూస్తే శ్రీరామానుజుల విగ్రహం తిరుమల ఆలయంలో అనంతాచార్యుల జీవితకాలంలో ప్రతిష్ఠించబడలేదేమో అనిపిస్తుంది. ఆ కాలంలో, గోవిందరాజస్వామి ఆలయంలో మాత్రమే తిరుపతిలో శ్రీరామానుజుల విగ్రహప్రతిష్ఠ జరిగిఉండవచ్చుననిపిస్తుంది. రామానుజుల విగ్రహం విమానప్రాకారంలో, నరసింహస్వామి ఆలయానికి వాయవ్యంగా ఇప్పటిహుండీకి ఎదురుగా ఉంది. అనంతాచార్యుల కాలానికి విమాన ప్రాకారం గోడలు లేవు. ఆ ప్రాకారం గోడలు తర్వాత కాలంలో కట్టబడినట్లు చరిత్ర తెలుపుతోంది. రామానుజుల విగ్రహం ఆలయంలోకాక తిరుమలలో ఇంకోచోటైనా ఉండి ఉండాలి. లేదా తర్వాత విమానప్రాకారం కట్టినప్పుడు ఈ విగ్రహప్రతిష్ఠ ఇప్పుడున్న చోట జరిగివుండాలి. ఈ విషయంలో కొంత పరిశోధన జరగాల్సిన అవసరం ఉంది.

★ ★ ★

22. తిరుమల ఆలయనిర్మాణం

పౌరాణిక భాగంలో చూశాం, కృత/త్రేతా యుగాల్లోనే ఈ కొండమీద శ్రీమహావిష్ణువు కొలువున్నాడనీ, ఆ రోజుల్లో 'శంఖ' మహారాజుకు పుష్కరిణిలోనే స్వామి తన విమానగోపురంతో సహా దర్శనమిచ్చాడనీ... శంఖరాజుకి రాజ్యాన్ని తిరిగి ఇచ్చి అనుగ్రహిస్తూ తనను రాజు ఎలా చూశాడో అలాగే విగ్రహంగా చేయించి విమానంతోసహా ఆలయం నిర్మించమన్నాడనీ- అలా మొదట ఆలయనిర్మాణం జరిగిందనీ చదివాం.

ఆకాశరాజు తొండమానుచక్రవర్తికి అతని అన్నకొడుకు వసుదానునితో సంధి చేయించిన తర్వాత, శ్రీనివాసుడు తొండమానుని వేంకటాచలానికి తీసుకువెళ్లి, పుష్కరిణికి దక్షిణాన ఆలయం కట్టమని ఆదేశించడం, అప్పుడు శంఖరాజు కట్టిన ఆలయం కాలగర్భంలో కలిసి శిథిలమైందని శ్రీనివాసుడే చెప్పడం తెలుసుకొన్నాం.

వరాహపురాణంలో ఆలయ నిర్మాణం గురించి ఇంకొక కథకూడా ఉంది. వరాహదేవుడే భూదేవికి ఈ వేంకటాచలవృత్తాంతం చెబుతూ, ఆటవికుల నాయకుడైన నిషాదుని కథ చెప్తాడు.

తన ధాన్యంపంటను నాశనం చేస్తున్న వరాహాన్ని పట్టుకోవాలని ఒక రాత్రి ఈ నిషాదుడు కాపలాకాచాడు. పంటను తింటున్న వరాహాన్ని చూసి పట్టుకోవడానికి వెంటబడ్డాడు. ఆ వరాహం దగ్గరలో ఉన్న పుట్టలోకి దూరింది. పుట్టను తవ్వడం ప్రారంభించాడు నిషాదుడు. అప్పుడు ఆ పుట్టలోంచి చాలా పెద్ద అందమైన వరాహం బయటకు వచ్చి తాను వరాహ అవతారుడైన శ్రీ మహావిష్ణువునని, ఆ పుట్టలో ఇంకొంచెం తవ్వితే ఒక శిలాఫలకం దొరుకుతుందనీ, ఆ ఫలకంతో తన విగ్రహాన్ని తన తొడపై భూదేవితో సహా చెక్కించి తనకొక ఆలయం నిర్మించమనీ, ఆ పక్కనే చింతచెట్టు కింద పుట్టలో శ్రీనివాసుని విగ్రహం వుందనీ ఆ విగ్రహానికి క్షీరాభిషేకంతో పుట్టంతా కరిగేటట్టు చేసి ఆలయం కట్టించాలనీ, దానికి ఆ ప్రాంతపు తొండమాన్

రాజు సహాయం తీసుకొని ఆ రాజు చేత ఆలయం పూర్తి అయ్యేట్లు చూడాలనీ నిషాదునికి చెప్పి, వరాహస్వామి అంతర్ధానమయ్యాడు.

నిషాదుడు తొండమాన్‌రాజు వద్దకు వెళ్లి వృత్తాంతమంతా చెప్పి రాజును కొండకు తీసుకువెళ్తాడు. అలా తొండమానురాజు నిషాదులవల్ల, వరాహస్వామి దేవస్థానం, శ్రీనివాసుని ఆలయాలు కట్టబడ్డాయని ఈ పురాణం చెబుతుంది. ఈ తొండమానుడు, ఆకాశరాజు తమ్ముడు, తొండమానుడా? లేదా కల్పభేదం వల్ల పురాణ కథ మారిందా? ఆకాశరాజు తమ్ముడు కట్టిన ఆలయం కూడా కాలగర్భంలో శిథిలమయి ఉండాలి.

కొంతమంది చరిత్రకారులు ఈ తొండమానురాజు, నిషాదులు క్రీ.శ. ఒకటవ శతాబ్దానికి చెందినవారని, ఆ సమయంలోనే దేవాలయాలు కట్టి వుండవచ్చునీ వాదిస్తారు. ఆ దేవాలయాలు చెక్కిన రాతితో కట్టారా, సున్నం ఇటుకలతో కట్టారా, మట్టి ఇటుకలతో కట్టారా అన్న విషయం స్పష్టంగా లేదనీ, ఆ కట్టడాలు కూడా శిథిలమయ్యాయనీ తలచవలసివస్తుంది. ఎందుకంటే, ఇప్పుడు మనం చూస్తున్న తిరుమల ఆలయం ఆనాటిది కాదు. తర్వాతికాలంలో కట్టినట్లు చారిత్రక ఆధారాలున్నాయి.

కాబట్టి శిలప్పదిగారం నాటికి స్వామివిగ్రహం విష్ణువుగా కొండమీద ఉన్నదనీ, సూర్యచంద్రులు ఆరాధిస్తూ ఉన్నారనీ, అంటే ఆచ్ఛాదన లేక ఒక దిమ్మమీద కాని శిలాఫలకాల మీద కాని వుండాలి. లేదా పైన ఆచ్ఛాదన ఉన్నా చుట్టూ గోడలు లేని మండపంలో సూర్యచంద్రుల వెలుతురు పడేట్లుగానైనా ఉండాలి. దీనికి టి.కె.టి. వీరరాఘవాచారి ఇంకొక విషయాన్ని కూడా చెప్పారు.

శిలప్పదిగారం తర్వాత కాలంలో తిరుమల కొండపై ఒక శాసనం చెక్కించబడింది. అది గుడిముందు రాయిపై చెక్కబడింది. మావలి బానరాయి అనే ఆ ప్రాంతపు రాజుకు లేక లేక పుట్టిన 'విజయాదిత్య' అనే కొడుకు జననం సందర్భంగా ఈ రాయి చెక్కబడింది. అది క్రీ.శ. 8వ శతాబ్దం చివర చివర్లలో. అప్పటికే గోడలుగల గర్భగృహం ఉండి ఉంటే, రాజు ఈ శాసనాన్ని గోడపైనే చెక్కించి ఉండేవాడు కదా!? గోడలతో ఉన్న గర్భగృహం ఉండి ఉండకపోవచ్చు అని వీరరాఘవాచారిగారి వాదన. ఏది ఏమైతేనేం, 8వ శతాబ్దం చివరి వరకు మండపంలోనే దేవుడుండేవాడనీ, గర్భాలయం, స్నపనమండపాల వంటివి ఆనాటికి ఇంకా లేవని అనుకోవడానికి నిదర్శనాలు కన్పిస్తున్నాయి.

అందుకే ఆ రోజుల్లో తిరుచానూరులో కొండమీద దేవుని బదులుగా ఒక విగ్రహం ఉండేదనీ, దానికి కిందనే భోగాలన్నీ జరిగేవనీ తెలుస్తోంది. ఇది నిర్ధారించడానికి తిరుచానూరు ఆలయంలో క్రీ.శ. 826 లోని శాసనం ఆధారం. కొండమీద దేవునికి ప్రతినిధిగా ఒక విగ్రహం, ఉత్సవాలు చెయ్యడానికి ఒక ఉత్సవిగ్రహం తిరుచానూరులో ఉంచినట్లు ఈ శాసనం ద్వారా తెలుస్తోంది. దొరికిన శాసనాల్లోని 12వ శాసనం, అంటే క్రీ.శ. 935లో చేసినది. దాన్నిబట్టి తెలిసేది క్రీ.శ. 935 నాటికి కొండపై ఒక ఆలయం ఉన్నదని, అందులో గాలికి ఆరిపోయే ఆధారం లేకుండా ఎల్లప్పుడూ వెలిగే అఖండదీపం వెలిగించడానికి సావకాశం ఉందని ఆ శాసనం తెల్పుతోంది. అంటే ఆలయకట్టడం 9వ శతాబ్దంలో గర్భాలయం వరకు కట్టబడి ఉండాలి. తర్వాత 966లో రాజకుమారి సమవాయి భోగ శ్రీనివాసవిగ్రహం ప్రతిష్ఠించేనాటికి గర్భాలయం ముందు ఒక స్నపన మండపం కూడా నిర్మింపబడి ఉంది.

చారిత్రక ఆధారాలను బట్టి క్రీ.శ. 1160లో తిరుమల గోపురద్వారం లోపల శాసనాన్ని బట్టి (క్రీ.శ. 1180 కూడా కావచ్చు) నారాయణవనం పాలించే యాదవరాజులు తిరుమల దేవాలయానికి చాలా సేవ చేసిన మొట్టమొదటి రాజవంశం. అందులో వీరనరసింగ యాదవరాయలు గర్భాలయం మరమ్మత్తులు చేయించి, విమానగోపురం కట్టించి దానికి బంగారుతాపడం చేశాడు. ఇది దాదాపు క్రీ.శ. 1250 ప్రాంతంలో జరిగి ఉండవచ్చు. ఈ రోజులలోనే తిరుమల వైభవం దశదిశల ప్రచారంలోకి వచ్చింది. కొండమీద ఉత్సవాలు కూడా పెద్దఎత్తున ప్రారంభమయ్యాయి. ఈయనే నాలుగు ముఖాలు కల్గిన పెద్ద రథాన్ని చేయించి, దానిపై బంగారుకలశ ప్రతిష్ఠ చేయించి, శ్రీనివాసుని రథోత్సవానికి నాంది వేశాడు.

...అలా వైభవంగా అభివృద్ధి జరుగుతున్న సమయంలో మాలిక్కాఫర్ దండయాత్రలు మొదలయ్యాయి. హిందూ దేవాలయాలూ, విగ్రహాల నాశనం పెద్దఎత్తున జరిగింది. ఇదంతా క్రీ.శ. 1300 నుండి 1360 వరకూ. ఆ రోజుల్లో తిరుమలలో కొండపైన సంవత్సరానికి 7 బ్రహ్మోత్సవాలు, కింద తిరుపతిలో సంవత్సరానికి రెండు బ్రహ్మోత్సవాలు వైభవంగా జరిగేవి. అవికాక ఎన్నో పండుగలు, తిరునక్షత్రాలు, కొత్తకొత్త ఉత్సవాలు ప్రారంభించడం జరిగాయి. పారువేట ఉత్సవం, తెప్పఉత్సవం, ఊంజల్ సేవ, పవిత్రోత్సవం, అధ్యయనోత్సవం, కళ్యాణోత్సవం- ఇలా ఎన్నో ఉత్సవాలు ప్రారంభించారు. దీనికి మరో కారణం, విపరీతంగా కొండకు భక్తులరాక. ముసల్మానుల దండయాత్ర వల్ల హిందూ దేవాలయాలు, విగ్రహాలతో

సహా దెబ్బతిని పోయినప్పుడు, ఏ హానీ జరుగకుండా ఉన్నది కొండమీది శ్రీవేంకటేశ్వరాలయంలోనే. అది స్వామివారి మహిమ వల్ల అన్న నమ్మకం ప్రజల్లో బాగా పాకిపోయింది. వేలాదిభక్తులు ప్రతిరోజూ కొండకు రావడం మొదలైంది. ఇలా భక్తులరాక పెరిగిన కొద్దీ కొత్తకొత్త సేవలు ప్రారంభించబడ్డాయి. సహస్రకలశాభిషేకం, తిరుప్పావడ, సహస్రనామోత్సవం, పౌర్ణమికి, అమావాస్యకు, ఏకాదశి, ద్వాదశి, శ్రవణ నక్షత్రం ఉత్సవాలూ, పుష్పాభిషేకాలు, అర్చనలు... ఇలా ఎన్నో.

పాంచరాత్ర ఆగమప్రభావంతో ఇతర ఆలయాల్లో ఆళ్వారుల ప్రతిష్ఠలు జరిగేవి. ఇతర పాంచరాత్ర ఆలయాలలో చేసినట్లు ఇక్కడ విగ్రహప్రతిష్ఠలు చేయలేదు. కాని ఆచార్యుల, ఆళ్వారుల జయంతి, వర్ధంతి ఉత్సవాలు, శాత్తుమొర పెద్దఎత్తున జరిపించేవారు. 17వ శతాబ్దం మొదలు అయ్యేనాటికి శ్రీవారి ఆలయంలో 365 రోజులకు 429 ఉత్సవాలు జరుగుతుండేవి. ఆ రోజుల్లోనే అంతవరకూ సరిగ్గా శ్రద్ధగా జరగని వేదపారాయణకూడా ప్రవేశపెట్టబడింది.

అలా జరుగుతున్న సమయంలోనే ముసల్మానుల దండయాత్రల ఫలితంగా యాదవరాజులు, పాండ్యరాజులు కనుమరుగయిపోయారు. విజయనగర సామ్రాజ్యం వృద్ధిలోకి రాసాగింది. క్రీ.శ. 1365లో బుక్కరాయలు వేంకటాచలానికి వచ్చి స్వామివారిని సేవించి ఒక బ్రహ్మోత్సవాన్ని నిర్దేశించి, సంధి నైవేద్యానికి దానాలు చేసి వెళ్లాడు. క్రీ.శ. 1409 నాటికి చంద్రగిరి పాలకుడు సాళువమంగిదేవ దేవాలయ విమానానికి మరల రెండవసారి బంగారుపూత పూయించాడు. వచ్చే యాత్రికులకు అన్నసదుపాయానికి క్రీ.శ. 1429లో దేవదేయాలు పెద్దఎత్తున ఏర్పాటుచేశాడు. దేవాలయ అభివృద్ధికి చాలా దోహదం చేసినవారిలో సాళువనరసింహుడు ముఖ్యుడు. అతడు విజయనగర రాజులకు మంత్రిగా, సేనాపతిగా క్రీ.శ. 1485 వరకూ పనిచేశాడు. ఈయన ఆధ్వర్యంలోనే తమిళదేశంలోని ఆలయ సంప్రదాయాలు కొండమీదకొచ్చాయి. అందులో భాగంగానే అంతవరకూ లేని నాట్యసానులు తిరుమల ఉత్సవాలలో ప్రవేశించారు.

కృష్ణదేవరాయలు

అలా తిరుమల ఆలయం విజయనగర సామ్రాజ్యంలో దినదినాభివృద్ధి చెందుతోంది. వీరప్రతాప, వీరకృష్ణరాయల కాలంలో ఈ వైభవం పరాకాష్ఠకు చేరింది. ఏడుసార్లు శ్రీకృష్ణదేవరాయలు శ్రీనివాసుని దర్శనానికి వచ్చాడు. వచ్చినప్పుడల్లా ఎన్నో నగలు,

గ్రామాలు, దానాలు, ధర్మాలు చేశాడు. మరల స్వామివారి విమానానికి బంగారుపూత పూయించాడు. అతనికి ఒకడే ఒక్క కొడుకు. దక్కలేదు. ఆ ఒక్క కొడుకూ చనిపోయినా, భగవంతుని మీద భక్తి తగ్గలేదు. వైష్ణవదేవాలయాలకే కాదు, శైవ ఆలయాలకు కూడా ఎంతో సహాయం, సేవ చేసి ఖ్యాతి తెచ్చుకున్నాడు. అతను వచ్చిన ప్రతిసారి శిలాశాసనాల్లో అతను తిరుమల స్వామికి చేసిన కైంకర్యం విశదంగా చెక్కించాడు.

విజయనగర సామ్రాజ్యకాలంలో ఇంకా సదాశివరాయ, అళియ రామరాయలు కూడా ఎంతో సేవ చేశారు. సేనానులు, పాలెగార్లు, అధికారులు, రాణులు.. ఇలా అందరూ ఎన్నో దానధర్మాలు చేశాడు. అవన్నీ ఏమయిపోయాయి? వందలకొద్దీ గ్రామాలు, దేవదేయాలుగా పన్నులభారం లేకుండా ఏర్పాటుచేయబడ్డాయి, ఎన్నో నగలు, ఎంతో ధనం... ముఖ్యంగా కొండమీదకొచ్చిన భక్తుడు, కానీ ఖర్చు పెట్టకుండా భోజన, వసతి, దర్శన సదుపాయాలు కలుగజేయాలన్న ఆకాంక్షతో చేసినదానాలు.

కొండమీద దేవుని దర్శనానికి కాని, సేవకు గాని యాత్రికుడు ఏమీ ఖర్చు పెట్టనక్కర్లేదు. దేవస్థానంవారు ఎవరినీ దేనికీ డబ్బివ్వమని అడిగే వీలులేదు. అందరికీ అన్ని సదుపాయాలకు దాతలు విరాళాలు ఇచ్చి ఏర్పాట్లు చేశారు. ఖరీదులు ఎంత పెరిగినా పెరిగిన ఖర్చునుబట్టి మళ్లీ దానాలు చేశారు...

తళ్లికోట యుద్ధంతో అంతా నాశనం అయిపోయింది. దేవస్థానం ముస్లింల అధీనంలోకి వచ్చింది. ఆదాయం వచ్చే దేవస్థానం కనుక దేవాలయం నాశనం చేసి సంవత్సరానికి రెండు లక్షల రూపాయలకు పైగా ఆదాయం పోగొట్టుకొనటానికి ముస్లిం రాజులు సిద్ధపడలేదు. దేవాలయం నడపడం, ఆదాయం, ఖర్చుల పరిపాలన అంతా ఎక్కువ డబ్బు ఎవరు ఇస్తే వారికి అద్దెకు (లీజుకు) ఇచ్చే ఏర్పాటు మొదలైంది. రాజుకు ఆదాయం చూపించే సంస్థగా మారిపోయింది. తిరుమల ఆర్కాటు నవాబు, ఈస్టిండియా కంపెనీ వారికి దేవస్థానం ఆదాయాన్ని తనఖా పెట్టే పరిస్థితి... మరాఠాలనుండి, ఫ్రెంచివారినుండి రక్షించుకోవడానికి అలా అద్దెకు తీసుకొన్నవాడు ఆదాయం పెంచుకోవాలి. రాబడి పెరగాలని, కొత్త కొత్త పద్ధతులలో యాత్రికులనుండి సొమ్ము వసూలు చేయించారు ...అలా మొదలైన కొత్త పంథా ఈనాటికీ అమలులో ఉంది.

అలా విజయనగర రాజుల తర్వాత, ముస్లింల పాలన, మరాఠాల పాలన తర్వాత మళ్లీ ముస్లింలు, ఈస్టిండియా కంపెనీ పాలన తర్వాత మహంతుల పాలన...

ఈ మధ్యకాలంలో జరిగిన దేవదేయాల పూర్తి వివరాలు సరిగా రికార్డుల్లో లేవు. తగిన పరిశోధన జరగలేదు. చేయించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

మరాఠాలకాలంలో దేవాలయ రికార్డులన్నీ మోడీ భాషలో ఉండేవి. దాదాపు 80 సంవత్సరాల చరిత్ర. ఆ భాష ఇప్పుడు మాట్లాడేవారు (దేశస్థ మరాఠీ) ఉన్నారుకానీ, లిపి గాని రాసి చదివేవారుగాని మిగలకుండా పోయారు. నేను దేవస్థానంలో కార్యనిర్వహణాధికారిగా ఉన్నప్పుడు, రఘోత్తమరావు అనే ఒకాయన తారసపడ్డారు. మద్రాసు ప్రభుత్వంలో ఏదో చిన్న ఉద్యోగం చేసి అప్పటికే పదవీవిరమణ చేశాడు. ఆయనకు 'మోడీ' స్క్రిప్టు చదవడం, రాయడం వచ్చునని తెలిసి, అతనికి ఇంగ్లీషు భాష కూడా వచ్చి ఉండడంవల్ల, దేవస్థానం మోడీ రికార్డులన్ని ఇంగ్లీషులోకి తర్జుమా చేసే కార్యక్రమం మొదలుపెట్టించాం. దాదాపు అన్ని రికార్డులు ఇంగ్లీషులోకి తర్జుమా చేయించాలని తలపెట్టాం. అతను నేను తిరుపతి వదిలిన ఆరు, ఏడు సంవత్సరాల వరకూ దేవస్థానంలో వుండి, అన్ని రికార్డులూ ఇంగ్లీషులోకి తర్జుమా చేసి కాలధర్మం చెందాడు. ఆ రికార్డులన్నీ దేవస్థానంలో తప్పక ఉండి ఉండాలి. ఒకరిద్దరు పరిశోధకులను నియమించి అప్పటి విషయాలు, విశేషాలు ప్రకటించవలసిన బాధ్యత తి.తి.దేవస్థానాల వారు చేపట్టాలి.

★ ★ ★

23. ఆళ్వారులు - తిరుమల ఆలయం

తిరుమల ఆలయంలో మిగతా వైష్ణవ ఆలయాలలో మనం చూసే ఆళ్వారుల విగ్రహాలు కనిపించవు. యామునాచార్యులు, తిరుమల నంబి, రామానుజులు ఆ తర్వాత వచ్చిన (ఆనందన్‌పిళ్లై) అనంతాచార్యులు, జియ్యర్లు, ఏకాంగుల ప్రభావం తిరుమల ఆలయంపైన చాలా ఉన్నా, చాలా తమిళదేశంలోని వైష్ణవ ఆలయ సంప్రదాయాలు తిరుమలలో ప్రవేశపెట్టబడినా, ఆళ్వారుల విగ్రహాలు మాత్రం కొండమీద ఆలయంలో లేవు. ఒక్క రామానుజుల వారి విగ్రహం మాత్రమే మొదటి ప్రాకారంలో హుండీకి ఎదురుగా రామానుజుల తర్వాతికాలంలో అనంతాచార్యుల చేత(?) ప్రతిష్ఠించబడింది.

శైవం, వైష్ణవం రెండూ వైదికమతాలే. వేదాలలో నమ్మకం ఉన్నవారే. వాటినే ప్రమాణంగా తీసుకొనేవారే. శైవం వేళ్లు నాటుకొన్న రోజుల్లో, శైవమతంలో కొందరు వామాచారం, వీరాచారం అవలంబించడం ఆరంభించారు. ఆ ఆచారంలో మద్యమాంసాలూ, మత్స్య, మైథునాల బాటలో వెళ్లి సాధకులు దిగజారిపోయిన సందర్భాలున్నాయి. ఆస్తికులు కొందరిలో ఈ మతాచారాల పట్ల విముఖత, దీనికి తోడు జంతుబలులు - వాటికి ప్రతిఘటనగా వైష్ణవం మొదలైంది. యజ్ఞ యాగాదులలో జంతుబలులు మాని, పిండితో జంతువుల బొమ్మలు చేసి సాత్త్వికకర్మలు చేయడం మొదలైంది. వర్ణాశ్రమ ధర్మాలకు విరుద్ధంగా చెప్పకుండా, భక్తిమార్గానికి, తాత్త్విక చింతనకు, సాధన చేయడానికి వర్ణాశ్రమాలతో పని లేదని - భక్తితో ఎవరైనా సాధన చేయవచ్చున్న ప్రాతిపదికమీద ఆళ్వారులవారి చింతన మొదలైంది.

8వ శతాబ్దం ముందు రెండు దశాబ్దాలలో మొదటి ముగ్గురు ఆళ్వార్లు, పొయ్‌గై, భూదత్తాళ్వార్, పేయాళ్వార్, తమిళదేశం-మహాబలిపురం, కంచి, మైలాపూర్లలో వారి భక్తిభావన ప్రభావం చూపడం ప్రారంభించారు. వారు ముగ్గురూ ఏ కులానికి చెందినవారో ఎక్కడా చెప్పబడలేదు.

తరువాత వచ్చిన తిరుమళిశై ఆళ్వారు, తాను తెలిసిన ఏ కులానికీ చెందినవాణ్ణి కాదని ఆయనే చెప్పారు. ఒక వేటగానిచే పెంచబడి, ఆగమాలను కూలంకషంగా చదివి, చివరకు తనకు నచ్చిన వైష్ణవమతం అవలంబించి భక్తితత్త్వ ప్రచారానికి పూనుకున్నాడు. ఇలా మొదటి నలుగురు ఆళ్వారులు ఆ రోజు ప్రాముఖ్యంలో ఉన్న అగ్రకులాలకు చెందినవారు కాదు.

తర్వాత వచ్చిన నమ్మాళ్వారు 8వ శతాబ్దం చివర 9వ శతాబ్దిలో ఉండి ఆళ్వారులందరిలో ప్రసిద్ధుడుగా నిలిచారు. ఈయన శూద్రకులంలో జన్మించినవారు.

తర్వాతికాలంలో వచ్చిన మధురకవి ఆళ్వారు, బ్రాహ్మణుడు. అటు తర్వాత పెరి యాళ్వార్ (విష్ణుచిత్తుడు) బ్రాహ్మణుడే. ఆయనకు తోటలో దొరికిన ఆండాళ్ - వివాహం చేసుకోకుండా రంగనాథునే భర్తగా భావించి భక్తితత్త్వంలో పరాకాష్ఠకు చేరిన మహిళా ఆళ్వార్. ఈమె ఆలయమే శ్రీవిల్లిపుత్తూరులో వున్నది.

తర్వాత కులశేఖర ఆళ్వారు -కేరళకు చెందిన క్షత్రియుడు, మంచి శాస్త్రపండితుడు, భక్తుడు.

తర్వాత వచ్చిన తొండరడిప్పొడి ఆళ్వారు బ్రాహ్మణుడు. ఈయుననే విప్రనారాయణుడని కూడా అనేవారు. స్వామికి పరమ భక్తుడు.

తరువాత తిరుప్పాన్ ఆళ్వారు ఎవరికి పుట్టాడో తెలియదు. ఒక చండాలుడు పెంచి పెద్దచేశాడు. ఈ మహాభక్తుని శ్రీరంగనాథుని ఆలయం గర్భగృహంలోకి సారంగముని మోసుకొని తీసికెళ్లి దర్శనం చేయించాడని ప్రతీతి. తర్వాత తిరుమంగై ఆళ్వారు శూద్రకులానికి చెందినవాడు. కాని ఆ ప్రాంతాన్ని పరిపాలించే వంశం వారిది. దొంగతనాలు, శృంగారచేష్టలతో మొదలైన ఈయన జీవితం, చివరకు పరమభక్తుడైన ఆళ్వారుగా మారింది.

దాదాపు ఒకటిన్నర శతాబ్దాల కాలంలో వీరందరూ జన్మించి, సాధన చేసి, భక్తిమార్గంచూపి, ఈ మార్గానికి కులవివక్ష లేదనీ, భక్తి వల్ల ఎలాంటి కులంలో పుట్టినా, భగవంతుని అనుగ్రహానికి పాత్రులవుతారనీ జనానికి చాటిచెప్పడమే కాక, తమ జీవితాలనే సాక్ష్యంగా చూపించగల్గిన మహాత్ములు.

ఇలా వీరందరూ, కులవివక్ష లేక, ఆడ-మగ భేదం లేక భగవంతుని యందు భక్తి, మానవులపట్ల ప్రేమ, సూత్రాలుగా ఆధ్యాత్మిక ప్రపంచంలో కొత్త ఒరవడి తెచ్చారు. వీరందరిలో నాయకుడుగా లేదా ముఖ్యుడుగా నమ్మాళ్వారును అందరూ అంగీకరిస్తారు.

ఆయన శూద్రుడు- బ్రాహ్మణుడు కాదు. ఆయన అనుంగు శిష్యుడు, మధురకవి ఆళ్వారు -శ్రోత్రియ బ్రాహ్మణుడు.

ఈ కొత్త (వైష్ణవ) మతం అన్ని కులాలవారికీ తమతమ పాపప్రక్షాళన చేసుకోవడానికీ, తమ తమ సాధనతో వృద్ధికి రావడానికీ, సమాన అవకాశాలు అందిస్తూండటంతో, అందరికీ ఆమోదయోగ్యమైనది. కొంత బౌద్ధులనుండి సర్వసమభావాలు తీసుకొని, సమాజంలో ఆడవారికి కూడా సాధనకి ఆధ్యాత్మిక రంగంలో సమాన అవకాశం కల్పించడంతో అందరినీ బాగా ఆకర్షించింది.

భక్తితో, ప్రేమతో వారు రచించిన కీర్తనలు ప్రజలలో చాలా ప్రచారంలోకి వచ్చి, వాటిని దేవాలయాల్లో పాడే సంప్రదాయం కూడా మొదలైంది. అందరికీ అందుబాటులో వుండి అర్థమయ్యే మంచి తమిళంలో వుండటం, చెప్తున్న ధర్మాలూ, ఆధ్యాత్మిక తత్త్వాలూ, మనస్సుకు హత్తుకునేట్లు, నమ్మశక్యంగా ఉన్నవి కనుక ప్రజాదరణ విశేషంగా లభించింది. నెమ్మదిగా వారు ప్రచారం చేసిన భక్తితత్త్వం శ్రీవైష్ణవమతంగా రూపుదిద్దుకుని ప్రచారంలోకి వచ్చింది. అయినా ఈ ఆళ్వారులు వారివారి కాలంలో తమిళ దేశం అంతటా, ఆధ్యాత్మిక గురువులుగానో, నాయకులుగానో చలామణి కూడా కాలేదు...

నాథముని కాలానికి ఈ ఆళ్వార్లందరి ప్రభావం కన్పించడం మొదలైంది. వీరందరి ఆలోచనాధోరణిలోనూ, ఆధ్యాత్మికచింతన విధానంలోనూ, వీరు రచించిన తాత్త్వికతలోనూ ఒకే భావం, ఒకే సరళి, ఒకే గమ్యం కన్పించి వీరందరినీ ఆధ్యాత్మిక గురువులుగా ఒప్పుకొనే ధోరణి మొదలైంది. ఈ నాథముని - యామునాచార్యులు (ఆళవందారు) గా ప్రసిద్ధుడు. యామునాచార్యుల ఆధ్వర్యంలోనే ఈనాడు మనం చూస్తున్న శ్రీవైష్ణవమతం అనే ఆలోచనాపరంపరకు ఒక మార్గదర్శకత ఏర్పడింది. వీరి సంప్రదాయంలో నామం పెట్టుకోవడం, మొదట సాష్టాంగం తమ ప్రత్యక్ష గురువులకు - తర్వాత వారి గురువులకు చేయడం - అలా ఆళవందార్ నాథముని, నమ్మాళ్వార్ దాకా సాగే సంప్రదాయం వచ్చింది. మొదట నమ్మాళ్వారు భగవంతుని నుండి జ్ఞానం సాధించాడని ఈ వైష్ణవుల నమ్మకం.

కాని ఈ పరంపర శ్రీరామానుజులు వ్రాసిన బ్రహ్మసూత్ర భాష్యంలో కన్పించదు. 'బ్రహ్మణి శ్రీనివాస' అని మొదట భగవంతుని, తర్వాత బ్రహ్మసూత్రాలు రచించిన వేద వ్యాసులవారిని స్మరించే... అలా ప్రాచీనకాలంగా వచ్చే సంస్కృత శాస్త్ర సంప్రదాయాన్నే శ్రీరామానుజులు పాటించారు.

ఆ తర్వాత కాలంలో వచ్చిన అన్ని దేవాలయాల్లో నమ్మాళ్వార్ ప్రతిపాదించిన ఆధ్యాత్మిక చింతన భావ ప్రభావం కన్పిస్తుంది.

ఇదంతా ఎందుకు ఇంత విపులంగా చెప్పాల్సివచ్చిందంటే, ఈ ఆలోచనావిధానం తిరుమల ఆలయంలో అర్చన విధానాలపై ప్రభావం చూపింది కనుక.

తిరుమలలో స్వామి స్వయంభువు. వైఖానసుల ద్వారా ఎప్పటినుండో సంప్రదాయ పూజాపద్ధతి నడుస్తోంది. ఆ సంప్రదాయంలో మార్పులు తేవడం సమంజసమూ కాదు, అక్కడ కైంకర్యం చేసే వారికి ఆమోదయోగ్యం కూడా కాకపోవచ్చు.

అందుకే - సమావై ద్వారా వెండి ప్రత్యామ్నాయ విగ్రహం తిరుమల ఆలయంలో ప్రతిష్ఠింపచేయటం జరిగింది. అది చేయించింది యామునాచార్యులు (ఆళవందార్).

దీనికి ఇంకో ముఖ్య కారణం, ఆనాటి రాజకీయ ఆధ్యాత్మిక పరిస్థితులు. 8, 9, 10 వ శతాబ్దాలలో తిరుపతి, దక్షిణ భారతదేశం, రాజకీయ అల్లకల్లోలాలకు నిలయం. పల్లవులకు, చోళులకు, పాండ్యులకు పరస్పర విరోధాలు, ఎప్పుడూ యుద్ధాలూ, కొట్లాటలూ. వీరి మధ్య చాళుక్యులు, రాష్ట్రకూటులు. వీరిలో కొందరు శైవులు, కొందరు వైష్ణవులు, కొందరు జైనులు. 10వ శతాబ్దంలో చోళ పరిపాలన రావడంతో తమిళదేశంలో శైవుల ప్రాభవం పెరగడం మొదలైంది.

అందుకే ఆ రోజుల్లో అందరికీ ఆమోదయోగ్యమైనది, వైష్ణవాన్ని ప్రధానంగా ఒప్పుకొని ఇతరులను వ్యతిరేకించని, అనవసరపు ఆధ్యాత్మిక రగడ లేని ప్రదేశం కావాల్సివచ్చింది. అదే తిరుమల ఆలయం. ప్రాచీనకాలం నుండి వైష్ణవసంప్రదాయం. పురాణకాలం నుండి విష్ణువు, విష్ణుమహిమలు అణువణువునా కనపరచిన వేంకటాచలం- శ్రీనివాసమూర్తి ఆలయం.

శ్రీవేంకటాచలనాథుని గురించి ఈ ఆళ్వారులు ఏమన్నారో చూస్తే విషయం అర్థమవుతుంది. ఆయన విష్ణుమూర్తే అని చెపుతూ మొదటి ముగ్గురు ఆళ్వార్లు- తిరువేంకటముడియన్‌లో విష్ణువు, శివుడు కూడా చాలా ఆనందంగా కలిసి వున్నారంటారు. పేయాళ్వారులు చెప్పింది - 'శివుడు, త్రివిక్రముడు విడివిడిగా ఉన్నా, ఒకరిలో ఒకరున్నారు' అని.

నమ్మాళ్వార్ మాటల్లో - "తిరువేంకట ముడియన్ తనలో రుద్రుని, బ్రహ్మని, లక్ష్మీదేవిని లీనం చేసుకుని వారి వారి ప్రత్యేకరూపాలు లేకుండా ఐక్యం చేసుకొన్నాడు. విష్ణువు బ్రహ్మను సృష్టిస్తే, బ్రహ్మ శివుని సృష్టించాడు. ఆ విష్ణువే తిరువేంగడముడియన్.

ఆయన నుండి వచ్చినవారే బ్రహ్మశివులు. ఈ తిరుమలస్వామి మిగతా విష్ణు అవతారాలలా కాదు, స్వయంగా నారాయణుడే". వారి ఆలోచన ప్రకారం తిరుమలలో ఇంకే ఇతర దేవతా దేవస్థానం లేకపోవడానికి అదే కారణం. లక్ష్మీసన్నిధి కూడా శ్రీనివాసుని వక్షఃస్థలంలోనే కాని, విడిగా ఆలయం లేదు (ఈ మధ్యకాలంలో కొత్తఆలయాలు పుట్టుకొస్తున్నాయి).

విష్ణువుగా పూజలు వైఖానసుల ద్వారా జరుపుకుంటున్నా – తిరుమలలో ఈ విగ్రహం అన్ని సంప్రదాయాలవారిని (శివ, శక్తి, కాలభైరవాది) ఆకట్టుకుంటోంది. ఇంకోచోట నమ్మాళ్వార్ చెప్పింది– "అక్కడ నీ ఇష్టదేవతగా ఎవరిని ప్రార్థించినా అది తిరుమల విష్ణువుకే చెందుతుంది" (ఆకాశాత్ పతితం తోయం, యథాగచ్ఛతి సాగరం, సర్వదేవనమస్కారః కేశవం ప్రతిగచ్ఛతి).

మానవులుగా మనకెన్నో వాంఛలు, కోరికలు. ఒక్కో దేవత ఒక్కో కోరిక తీర్చగలదు. ఒక్కోకోరిక తీరడానికి ఒక్కో ప్రక్రియ. కాని అన్ని కోర్కెలు తీర్చగల శక్తి తిరుమల శ్రీనివాసుడిది. అన్నీ ఇవ్వగల శ్రీనివాసుడుండగా ఇంకొకరిని కొలిచే పని ఏమి?

కాని ఫలాపేక్షతో శ్రీనివాసుని కొలవవద్దు. అకామ్య కైంకర్యం చేస్తే, కోరిక లేకుండా ఆయనను ఆరాధిస్తే, ప్రేమిస్తే, భక్తి చూపితే, మనకేమి కావాలో ఆయనకు తెలుసుకాబట్టి అవి ఎలాగూ ఇస్తాడు. వాటికన్నా ముఖ్యమైన మోక్షాన్నే ఇస్తాడు. కనుక కామ్యకర్మలు వదలిపెట్టు. శాస్త్రంలో మనకు విధిగా చెప్పిన కర్మలు మనం చేస్తే చాలు. ఆ విధికర్మలు కూడా భగవదర్పణబుద్ధితో చెయ్యాలి.

యజ్ఞయాగాదులు చేయడం కంటే భగవంతుని యందు భక్తి చూపడం గొప్ప. భగవద్భక్తుడు ఎవరైనా సరే, ఏ కులంవాడైనా సరే, భక్తుడైతే చాలు, వానికి తాను దాసుణ్ణంటారు నమ్మాళ్వార్. ఈ భావన ప్రతి వైష్ణవుని మనసులో నిశ్చలంగా నిలవటానికి ప్రతి ఉత్థాన ద్వాదశినాడు తప్పక కౌశిక పురాణం చదవాలనే నియమం పెడతారు. విధి నిషేధాలు సక్రమంగా పాటించే శ్రోత్రియుడైన ఒక బ్రాహ్మణుడు తాను చేసిన కర్మలలో కొన్ని దోషాల వల్ల బ్రహ్మరాక్షసుడు అవుతాడు. అతని శాపవిమోచనం కల్గేది కొన్ని సంవత్సరాల తర్వాత ఒక భక్తుని ద్వారా అని తెలుస్తాంది..

కొన్ని సంవత్సరాల తర్వాత నాంపడువనే చండాలుడు, గొప్ప విష్ణుభక్తుడు, 12 సంవత్సరాలుగా ప్రతి ఏకాదశి నాడు ఉపవాసం చేసి ద్వాదశి పారణ చేసేవాడు.

అలా ఒక ఏకాదశి ఉపవాసం చేసి ఆలయానికి పోతున్న ఆ భక్తునికి ఈ బ్రహ్మరాక్షసుడు అడ్డు తగిలి భక్షించడానికి ప్రయత్నిస్తాడు. అప్పుడు ఆ భక్తుడు 'నీకు తప్పక నేను ఆహారం అవుతానుకాని, కొంచెం వ్యవధి కావాలి. మందిరానికి వెళ్లి భగవంతుని ప్రార్థించి రావా'లని కోరతాడు. బ్రహ్మరాక్షసుడికి మళ్లీ ఈ భక్తుడొస్తాడని నమ్మకం కలగలేదు. కాని భక్తుడు ఎన్నో వాగ్దానాలు చేశాక, ఆ బ్రహ్మరాక్షసుడు సరేనని అతన్ని విడుస్తాడు. ఇచ్చిన మాట ప్రకారం మరల తిరిగి వచ్చిన నాంపడువన్‌ని చూసి బ్రహ్మరాక్షసుడు ఆశ్చర్యపోయి తన శాపవిమోచనం ఈయన ద్వారానే కావాలని తెలుసుకొని, ఆ భక్తుని పుణ్యాన్ని కొంత ధారపోసి తనను ఉద్ధారం చేయమంటాడు. కాని ఆ భక్తుడు "నాకేమీ పుణ్యం లేదు. నేనేం చేసినా, వచ్చిన పుణ్యాన్ని భగవంతునికే కృష్ణార్పణమస్తు చేసేస్తాను. కనుక నేనేమీ ఇవ్వలేను, నా దగ్గర ఏమీ లేదు. నేనో చండాలుడను. నేనేమీ చేయలేను... అయినా నేను ఇంకొక జీవిని ఉద్ధారం చేయగలిగితే అంతకంటే ఇంకేమి భాగ్యం కావాలి?" అని భగవంతుని ప్రార్థిస్తాడు. దాంతో బ్రహ్మరాక్షసుడికి శాపవిమోచనం అవుతుంది.

ఈ పురాణ కథనం ఆళవందారు (యామునాచార్యులు) తన కుటుంబ సభ్యులతో, శిష్యులతో తమిళనాడులోని వైష్ణవ ఆలయాల్లో పారాయణ చేయించే ఏర్పాటు చేశారు. దీని ముఖ్య ఉద్దేశ్యం నమ్మాళ్వార్‌వారికి నిజమైన భక్తుల ఎడగల అభిప్రాయం సూచించడమే. భక్తులకు ప్రధానం - కులం కాదు గుణం, భక్తి అన్నది తెల్పడానికి.

ప్రతి వైష్ణవ ఆలయంలో భక్తులందరికీ సాధనను సానుకూలం చేసే ఆళ్వారులు ఏ ఏ కులాల వారో చూస్తేనే తెలుస్తుంది. కులంతో పనిలేదని - ఆలయంలో కూడా అదే పద్ధతి. భక్తులందరికీ దర్శన అవకాశం, ప్రసాదవినియోగం. ఆలయానికి అందరూ కలసిపోతారు. కులాల ప్రసక్తి లేదు. శఠారి దళితులకిచ్చిన తర్వాత బ్రాహ్మణునికివ్వవచ్చు. తీర్థవిషయమూ అంతే. ప్రసాదం విషయం అంతే. దేవుని ఆలయంలో కాని, దేవుని ఉత్సవాల్లో కాని అస్పృశ్యత, అంటరానితనం సమస్యే లేదు.

అటువంటి భావన ఎవరికైనా అక్కడ కలిగితే అతనికి కుక్క జన్మకానీ, గాడిద జన్మకానీ వస్తుంది. అలాగే తిరుమల ఆలయంలో సాత్తాద శ్రీవైష్ణవులు (బ్రాహ్మణేతర వైష్ణవులు) స్వామివారి అభిషేకానికి కావల్సిన పదార్థాలు గుడి చుట్టూ ఊరేగింపుగా తెచ్చి అందించే సంప్రదాయం ఉంది. వారు కూడా దివ్యప్రబంధాన్ని వైష్ణవ బ్రాహ్మణులతో పాటు చదివేవారు. వారికి బ్రాహ్మణ పండితులతో పాటు సంభావన

ఇచ్చే సంప్రదాయం ఉండేది. అది తర్వాత కాలంలో ఆపివేయబడింది, ఎందుకో తెలియదు. ఇప్పుడది లేదు.

అందుకే ఆ రోజుల్లో కులవిచక్షణ లేకుండా అన్ని హిందూ కులాలవారికీ ఈ తిరుమల శ్రీనివాసునితో భక్తితో అనుబంధం. అన్ని కులాలవారికీ ఈయన కులదైవం. అన్ని కులాలవారూ తమపేరులో 'వేంకట' చేర్చుకుంటారు. ఇది తమిళదేశంలోనే కాదు, తెలుగు కర్ణాటక ప్రాంతాలతో కూడా ఈ సంప్రదాయాన్ని చూడవచ్చు.

ఇలా అన్ని వర్గాలవారు, కులాలవారు శ్రీనివాసుని తమ కులదైవంగా ఆమోదించడం, ఆళ్వారులు తిరుమల శ్రీనివాసుని కొలిచిన, భావించిన, ఆరాధించిన పద్ధతి అని కొందరి భావన.

అదేమిటి అలా చెప్తారు? నైవేద్యం తర్వాత శ్రీవైష్ణవుల 'శాత్తుమొర' జరుగుతుంది కదా! ప్రబంధం చదివేది, ప్రథమ దర్శనానికి పంపేది, శ్రీవైష్ణవ బ్రాహ్మణులను కదా? మరి భగవంతుని ముందు ఈ శ్రీవైష్ణవులతో అందరూ సమానమేనని ఎట్లా చెప్పగలరు? అని సందేహం రావచ్చు.

శాత్తుమొర వైఖానస ఆగమ పద్ధతిలోని పూజావిధానం కాదు. ఆగమ నియమాల పద్ధతిలో వైదిక పూజానైవేద్యాల తరువాత వైఖానస పాంచరాత్ర ఆగమాల కలగలపు ఇది. పూర్వకాలంలో ప్రబంధం చదవగలిగిన అందరినీ కులాల వ్యత్యాసం లేకుండా పంపేవారట. ఈ ఆచారం 1933 ప్రాంతంలో మహంతుల నుండి ప్రభుత్వం ఆలయపాలనా వ్యవహారాల మార్పిడి జరిగినప్పుడు కూడా జరిగేదట. కాని ప్రబంధం చదవగలిగిన వారికంటే సిఫార్సులతో వచ్చే పెద్దవారు లోపలికి వెళ్లి, సరైన స్థలం అంతా ఆక్రమించుకొనేవారట. నిజంగా ప్రబంధం చదవగలిగినవారు మిగిలిపోయే వారట. అలాకాకుండా కట్టుదిట్టం చేసి, జియ్యంగారే ప్రబంధం చదివే శ్రీవైష్ణవులను తీసుకువచ్చి శాత్తుమొర జరిపించే ఏర్పాటు చేశారట. ఇతరకులాలవారు ప్రబంధం చదవడం తక్కువ కావడం వల్ల లేదా వారిని కూడా ఈ కార్యక్రమానికి వదులుతారని తెలియకపోవడం వలన, రానురాను శ్రీవైష్ణవ బ్రాహ్మణులకు మాత్రమే పరిమితమయింది. ఇప్పటికీ ఈ విషయంలో, కొంత కట్టుబాటు చేయాల్సిన అవసరం ఉంది. శ్రీవైష్ణవ సంప్రదాయానుసారం కట్టు, బొట్టు, శిఖ, నిజంగా ప్రబంధ పారాయణ చెయ్యగలిగిన వారినే ఈ కార్యక్రమానికి పంపితే బాగుంటుంది. లేకపోతే ఇది తమకు కావాల్సినవారికి దర్శనభాగ్యం కల్గించడానికి జియ్యంగార్లు వాడుకొనే అవకాశం ఉంది.

అలా ప్రాచీనకాలంలో ఈ ఆలయ వైభవం నలుదిశలా పాకటానికి, కులవర్గ విచక్షణ లేకుండా అందరూ ఈ స్వామిని ఆరాధించడానికి, సామాజిక పైశాచికపు కట్టుబాట్లు లేకుండా భక్తులైన వారందరికీ సమాన అవకాశం కల్గించడానికి, ఎందరో ఆళ్వారులు, వారి అడుగుజాడలలో నడిచిన పుణ్యాత్ములు పడిన శ్రమ కన్పిస్తుంది. అందుకే తిరుమల శ్రీనివాసుని గురించి-

'వేంకటేశ సమో దేవో న భూతో న భవిష్యతి' అని చెప్తారు (ఇలాంటి దైవం గతంలో లేదు, భవిష్యత్తులో వుండడు).

★ ★ ★

24. వైష్ణవక్షేత్రంలో పెద్ద శివాలయం

వైఖానసులు, పాంచరాత్రులు - ఇద్దరూ శ్రీవైష్ణవులైనా, వైఖానసులు బ్రాహ్మణులలో ఒక తెగ. ఆయా వైఖానస సంప్రదాయ బ్రాహ్మణవంశాల్లో జన్మిస్తేనే వారు దేవాలయాల్లో అర్చకులుగా పనిచేయగలుగుతారు.

పాంచరాత్ర ఆగమంలో అలాకాదు, బ్రాహ్మణకులంలో ఏ సంప్రదాయంలో పుట్టినా, ఆళ్వారులు ప్రతిపాదించిన శ్రీవైష్ణవ భక్తితత్త్వాన్ని ఆమోదించి, సమాశ్రయణం అయి, తప్త ముద్రధారణ అయితే - వారు అర్చనాది దేవాలయపు కొలువులకు అర్హులే. తమిళదేశంలో క్రీ.శ. 6, 7 శతాబ్దాలలో ఆళ్వారుల ప్రభావం సమాజంమీద, దేవాలయాల మీద, ఆచారవ్యవహారాలమీద చాలా ఉండేది.

టి.కె.టి. రాఘవాచారిగారు తమ 'తిరుమల చరిత్ర' ఇంగ్లీషు గ్రంథంలో ఈ విషయాన్ని కూలంకషంగా చర్చించడం జరిగింది. ఆయన వెలువరించిన అన్ని అభిప్రాయాలతో మనం ఏకీభవించినా లేకపోయినా, కొన్ని కొన్ని విషయాలలో ఆయన విశ్లేషణ ఆమోదయోగ్యంగా ఉంటుంది.

కొండమీద దేవాలయంలో మిగతా దేవాలయాల్లో వలె కాక - వైఖానసాన్నే ఆచరణలో నడుపుతూ, పాంచరాత్రవిధానాలు కొన్ని ప్రవేశపెట్టి, యామునాచార్యులు, తిరుమల నంబి, రామానుజులు, అనందాళ్వారు లాంటి శ్రీవైష్ణవ భక్తాగ్రేసరులు, తిరుమల దేవాలయానికి ఒక కొత్త ఒరవడి చూపించారంటారు వీరరాఘవాచారి. పూర్తిగా అర్థం కావాలంటే ఆనాటి సామాజికపరిస్థితులు కొంచెం తెలుసుకోవాలి.

శైవమతం పెద్ద ఎత్తున స్థాపించబడే రోజుల్లో - శ్రీవైష్ణవులు, విష్ణువే ప్రధాన దేవత అని ఒప్పుకొన్నా, కొందరు ఆళ్వారులు విష్ణువుకి, శివునికి భేదం లేదని ఒప్పుకొన్నట్లుగా భావించే పాశురాలు రాశారంటారు. కొండమీద దేవుడు శ్రీమహావిష్ణువుగా ఆరాధించబడుతున్నా - అప్పట్లో బ్రహ్మోత్సవాలతో సహా ఇతరపూజలు, ఉత్సవాలు, స్వామివారి ప్రతినిధిగా ఉండే విగ్రహాలకు తిరుచానూరులో

జరిపే సంప్రదాయం ఉండేది. అంకురార్పణ, ధ్వజారోహణం పైన చేసి, మిగతా ఉత్సవాలన్నీ తిరుచానూరులో చేసి, మళ్లీ చక్రస్నానానికి అవభృథస్నానం, ధ్వజావరోహణ తిరుమలలో జరిగేవి.

అలా తిరుచానూరులో తిరుమలస్వామి తరఫున జరిగే బ్రహ్మోత్సవాలు ఏ ఆలయంలో జరిగేవి, ఊరేగింపు చేసేటప్పుడు కొండమీద నుండి ఉత్సవవిగ్రహం తెచ్చేవారా? తెస్తే ఏ విగ్రహం అన్న ప్రశ్నలకు సమాధానాలు స్పష్టంగా కావాలి.

ఈ విషయంలో నేను స్వాతిలో రాసిన విషయాలు చదివి మద్రాసులోని శ్రీ వి.ఎ.కె. రంగారావు (ప్రముఖ సంగీత, సాహిత్య, నాట్యవిమర్శకులు. చరిత్ర విషయాల మీద చాలా పరిశోధన చేసినవారు. స్వామివారి భక్తులు. నేను టి.టి.డి. కార్యనిర్వహణాధికారిగా ఉన్న కాలంలో శ్రీ కళ్యాణ వేంకటేశ్వరునికి బ్రహ్మోత్సవాలు ప్రారంభించి, సాక్షాత్కార వైభవోత్సవాలు ఘనంగా కొనసాగించినప్పుడు, ఈయన సాక్షాత్కార వైభవోత్సవాలలో నాట్యసేవ చేయడం మొదలుపెట్టి, ఇప్పటికీ ప్రతి సంవత్సరం కొనసాగిస్తున్నారు.) నాతో కొన్ని విషయాలు చర్చించారు. తిరుచానూరులో ఒక ప్రాచీన 'శ్రీనివాస' దేవాలయం పద్మావతీ అమ్మవారికి నైరుతిలో తోట బయట (ఇప్పుడు స్కూలు భవనం వెనుక) ఉందని చెప్తూ... ఆ ఆలయంలో కొండ తరఫున తిరుచానూరులో బ్రహ్మోత్సవాలు జరిగేవా? - అన్న విషయాలు పరిశీలిస్తే బాగుంటుందన్న సూచన చేశారు.

ఈ ఆలయ విషయం పరిశీలించడానికి ప్రత్యేకంగా తిరుచానూరులో ఈ మధ్య కొంత విచారణ చేశాను, ఆలయం చూశాను. తిరుచానూరులో ఉన్న కొన్ని శ్రీవైష్ణవ కుటుంబాలతో చర్చించాను. ఈ విషయంతో పరిచయాలున్న కొందరు చరిత్రకారుల తోనూ, పురావస్తు శాఖ వారితోనూ చర్చించడం కూడా చేశాను. ఆ చర్చల ఆధారంగా నాకు తెలిసింది, ఈ ప్రాచీన 'శ్రీనివాస ఆలయం'- అంత (1000 సంవత్సరాల) ప్రాచీనం కాదని.

ఈ మధ్యకాలంలోనే, అంటే రెండు శతాబ్దాల కాలం క్రితం ఈ ఆలయం నిర్మింపబడినదని, ఈ ఆలయంలో కూడా ఒక శతాబ్దం క్రితం విగ్రహం ఛిన్నం కాగా, పునఃప్రతిష్ఠ కూడా జరిగిందని. ఈ నాలుగు అడుగుల శ్రీనివాస విగ్రహం/ ఆలయం ప్రసక్తి తిరుచానూరు శాసనాలలో కానీ, తిరుమల శాసనాలలో కానీ, మరే ఇతర చరిత్రకారుల దృష్టికి కాని రాలేదనీ స్పష్టమైంది. ఈ ఆలయ పురావస్తుశాఖ

పరిధిలోకి కూడా రాలేదు. కాని దశాబ్దాలుగా అనంతశయనం అయ్యంగారి కుటుంబ పర్యవేక్షణలో ఉండేదనీ, ఈ మధ్య కొన్ని దశాబ్దాలుగా పూజాపునస్కారాలు లేక ఆలయం పాడుబడిపోయిన పరిస్థితులు ఏర్పడి, ఈ ఆలయ భూములే పాఠశాలకోసం ఇప్పించడం, ఇతరుల ఆక్రమణ పాలవటం జరిగిందని, కొందరు తిరుచానూరు శ్రీవైష్ణవులు పునరుద్ధరించే ప్రయత్నం చేసినా, కొంత పూజానైవేద్యాలు ప్రారంభించినా, అంత ఫలితం లేక, అందరి సహాయసహకారాలతో ఆలయాన్ని టి.టి.డి వారికి దత్తతగా రెండు సంవత్సరాల క్రితం ఇవ్వడం జరిగిందనీ తెలుస్తోంది. ఇప్పుడు ఆలయం పునరుద్ధరింపబడి, నిత్యనైవేద్యాలు జరుగుతున్నాయి... ఇదే ఆలయంలో వెయ్యి సంవత్సరాల క్రితం తిరుమల తరఫున బ్రహ్మోత్సవ, ఇతర ఉత్సవాలు జరిగాయన్న దానికి ఎటువంటి ఆధారాలు లేవు.

మరి ఏ ఆలయంలో జరిగేవి – అన్న విషయానికి, తిరుచానూరులోని ఆలయాల విషయం పరిశోధన జరిపి 'Temples of Tirumala' అన్న పరిశోధన వ్యాసాన్ని రాసిన డా॥ వి. కామేశ్వరరావు గారి నిర్ణయాలు ఆమోదయోగ్యంగా కనిపిస్తున్నాయి. డా॥ కామేశ్వరరావుగారు శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో హిస్టరీ (చరిత్ర) అధ్యాపకులుగా కొన్ని దశాబ్దాలు పనిచేసి, ఈ మధ్యకాలంలోనే పదవీవిరమణ చేశారు. తిరుమల ఆలయం, తిరుపతి ఆలయాలు, తిరుచానూరు, చంద్రగిరి ఆలయాల, ఆ ప్రాంతాల చరిత్ర విషయంలో ఎంతో పరిశోధనలు చేసి, ప్రచురణలు చేశారు.

ఆయన వ్యాసంలో తిరుచానూరులోని మూడు ముఖ్య దేవాలయాల ప్రసక్తి, కృష్ణ (అలగియ పెరుమాళ్), వరదరాజస్వామి ఆలయం, పద్మావతీ అమ్మవారి ఆలయాల గురించి వివరాలున్నాయి. ఇవికాక, జోగి మల్లవరంలోని పరాశరేశ్వర ఆలయప్రసక్తి ఉంది. ఈ ఆలయాలన్నిటికన్నా ముందు తిరుచానూరులో 'తిరువిలన్ కోయిల్' అనే ఆలయం ఉండేదనీ, కొండమీద శ్రీవారిని పోలిన విగ్రహం ఆ ఆలయంలో ఉండేదనీ, 9వ శతాబ్దంలోనే ఈ ఆలయ ప్రసక్తి శాసనాలలో ఉన్నదనీ, పల్లవరాజు దంతివర్మ చెక్కించిన శాసనంలోఈ ఆలయప్రస్తావన ఉన్నదనీ రాశారు.

9వ శతాబ్దంలో వెంగడం (తిరుమల) వెళ్లడం కష్టంగా ఉండటంతో యాత్రికుల సౌకర్యార్థం తిరుచానూరులో ఈ ఆలయనిర్మాణం జరిగింది. అది కూడా ఇప్పుడు ఉన్న కృష్ణ ఆలయప్రాంతంలో. అది తర్వాత తర్వాత చాలా అభివృద్ధికి వచ్చి, తిరుమలలో జరిగే బ్రహ్మోత్సవాలను ధ్వజారోహణ తర్వాత ఇక్కడ జరపటానికి నిర్ణయం జరిగి, ఇక్కడే వైభవంగా చేసేవారు.

తర్వాత రామానుజుల కాలం వచ్చేటప్పటికి ఈ సంప్రదాయానికి స్వస్తి చెప్పి, మళ్లీ ఉత్సవాలన్నీ కొండమీదనే జరపడం మొదలైంది. ఈ ఆలయ విషయంలో దాదాపు 32 శాసనాలు ఉన్నాయనీ, పల్లవరాజుల, చోళుల శాసనాలు, ఇతర శాసనాలు క్రీ.శ. 898తో మొదలుపెట్టి, క్రీ.శ. 1547 వరకు శాసనాలు ఉన్నాయి. ఈ శాసనాలను బట్టి తిరువిలన్ కోయిల్‌లోని స్వామిని 'తిరువెంకటత్తు పెరుమనాడిగళ్' అని పిలిచేవారని, ఈ ఆలయానికి వచ్చిన దేవమాన్యాలను ఉత్సవాలకు, నైవేద్యాలకు ఎవరెవరిచ్చారో తెలుస్తుంది. 9, 10వ శతాబ్దాలలో ఈ ఆలయం చాలా ప్రాముఖ్యం గలదని, వైభవంగా ఉత్సవాలు చేసేవారని, కొండమీద దేవునికి ప్రతినిధిగా సేవలందుకుంటున్నాడని ఈ శాసనాల వల్ల తెలుస్తుంది.

తర్వాతకాలంలో ఈ ఆలయ ప్రాముఖ్యం తగ్గిపోయింది. కారణాలు నిర్దిష్టంగా తెలియవు. రానురాను ఆలయం శిథిలమైపోయిందని, ఈ ఆలయశిథిలాలలోని రాళ్లను తరువాత తిరుచానూరు అలగియ పెరుమాళ్ (కృష్ణ) వరదరాజ పద్మావతీ ఆలయాల నిర్మాణంలో వాడారని కామేశ్వరరావుగారి పరిశోధనలో తేలింది. మొదట కృష్ణుని ఆలయం క్రీ.శ. 1221కి పూర్వమే కట్టారనీ, తర్వాత వరదరాజస్వామి ఆలయాన్ని క్రీ.శ. 1541 కి ముందు కట్టారనీ, తర్వాత పద్మావతీదేవి ఆలయాన్ని 17 శతాబ్దంలో కట్టారనీ నిర్ణయానికొచ్చారు కామేశ్వరరావుగారు.

ఈ తిరువిలన్ కోయిల్‌లో ఉత్సవవిగ్రహాలు ఉండేవా? లేక కొండ ప్రతినిధిగా చూసేవారు కాబట్టి, కొండనుండి ఉత్సవిగ్రహాలు తెచ్చేవారా అన్న ప్రశ్నకు సరైన సమాధానం దొరకలేదు. ఈ ఆలయంలో వేరే ఉత్సవవిగ్రహాలున్నట్లు ఎక్కడా ప్రస్తావనలేదు. ఉత్సవాల ప్రస్తావన, ఊరేగింపు వాహనాల ప్రస్తావన వుంది కనుక ఏదో ఒక ఉత్సవవిగ్రహం ఉండి ఉండాలి. కొండనుండి ఉత్సవాల సందర్భంలో తెచ్చే పద్ధతి అయితే, అప్పటి కొండమీద ఉత్సవవిగ్రహంగా ఉన్న 'ఉగ్ర శ్రీనివాసుని మూర్తి'ని తెస్తూ ఉండి ఉండాలి. ఎందుకంటే అప్పుడు కొండమీద ఆలయంలో మలయప్పస్వామి, శ్రీదేవి, భూదేవి విగ్రహాలు లేవు. అవి కొన్ని శతాబ్దాల తర్వాత మలయప్ప కోనలో దొరికినవి. సమవాయి 10వ శతాబ్దంలో ప్రతిష్ఠ చేసిన 'భోగ శ్రీనివాసు'ని తిరుచానూరు తెచ్చే అవకాశం లేదు. కొండమీదే మూలవరులకు ప్రతినిధిగా అన్ని రోజు సేవలూ అందుకునే ఆ స్వామిని విమాన ప్రాకారం దాటి బయటకు తెచ్చే సంప్రదాయం లేదు. ఆయన్ని మూలవరులతో పట్టుదారంతో సంధించి ఉంచుతారు. ఇకపోతే మిగిలినది కొలువు శ్రీనివాసవిగ్రహం. ఈ విగ్రహాన్ని

ఉత్సవవిగ్రహంగా ఏనాడూ వాడిన దాఖలా లేదు. కొలువు వరకే పరిమితం. అంటే బ్రహ్మోత్సవాలలో కొండమీద అంకురార్పణ, ధ్వజారోహణ తర్వాత – ఉగ్రశ్రీనివాస ఉత్సవరులతో తిరుమల నుండి తిరుచానూరు వచ్చి, అన్ని ఉత్సవాలూ జరిపి మరల అవభృథానికి, ధ్వజావరోహణకు కొండకు ఉత్సవరులను తీసుకువెళ్లి ఆలయానికి చేర్చే సంప్రదాయం ఉండి ఉండాలి...

శైవమతప్రభావం రానురాను తిరుపతి, తిరుచానూరులకు రావడం, పల్లవులు రాజ్యభ్రష్టులై చోళుల ప్రాబల్యం పెరగడంతో, శ్రీపరాశరేశ్వర దేవాలయమొకటి తిరుచానూరులో పరమేశ్వరాలయంగా ప్రసిద్ధికి వచ్చింది. తిరుచానూరు శివారులలో ఉన్న యోగిమల్లారంలోని శివాలయం ఇదే. దానికి అప్పటి రాజుల ఆదరణ ఉండేది. అప్పుడే, "తిరుచానూరులోని దేవుడు విష్ణువే, కాని కొండమీద మాత్రం కుమారస్వామి" అన్న వాదన మొదలైన రోజులు. ఈ పరిస్థితులు చూసి, కొండమీద అన్ని భోగాలూ, ఉత్సవాలూ జరగాలనీ, ఆలయపరిసరాల్లో నందనవనాలు, అర్చకగృహాలు ఉండి, సంప్రదాయ పరిరక్షణ జరిగి, తిరుమల వైభవాన్ని పెంచాలన్న ఆలోచన మొదలైంది. అలా యామునాచార్యులతో మొదలై, తిరుమల నంబి, రామానుజుల కాలంలోనూ, ఆ తర్వాత కాలం వరకు కొండపై ఎన్నో సంస్కరణలు జరిగాయి. తిరుమల ఆలయంలో, మిగతా తమిళదేశంలో లాగా పాంచరాత్రానికి మార్చకుండా, వైఖానససంప్రదాయం నడుపుతూ శాత్తుమురై, అధ్యయనోత్సవాలు, వేదపారాయణ, సాత్తాడి (బ్రాహ్మణేతర, శ్రీవైష్ణవుల ఆలయ సేవావిధానాలు) క్రమేపీ ఆచరణలో పెట్టే సంప్రదాయం కొనసాగించారు.

కొండమీద దేవుడు శ్రీమహావిష్ణువని నిర్ధారణ చేసినా, వైఖానస ఆగమ విధానాలే కొనసాగించబడినా, శ్రీవైష్ణవతమిళ సంప్రదాయాలు ప్రవేశపెట్టబడినా, ఈ దేవుడు, ఎవరు ఎలా తలిస్తే అలా అనుగ్రహించే దేవుడని ఆలోచించే వారికి ఆటంకం కలగకుండా వ్యవహరించి, అన్ని వర్గాల వారికీ వైష్ణవులకు, శైవులకు, శాక్తేయులకు, ఇతరులకు అందరకూ ఆమోదయోగ్యమైన దేవుడుగా పరిగణింపచేసే విధానాలు కొనసాగించారు.

దీనికి మరో అవసరం – హిందూమతానికి వచ్చిన ఇంకొక పెద్ద ప్రమాదం. మాలిక్కాఫుర్, ఇతర ముసల్మానుల దండయాత్రలతో విష్ణు, శివాలయాల భేదం లేకుండా అన్ని ఆలయాల ధ్వంసం జరిగింది – దాదాపు ఒక్క తిరుమల ఆలయం తప్ప!

అది ఆ దేవుని మహిమగా చెప్పి, హైందవులందరికీ దేవుడుగా భావింపజేసి, కొండపైన సంవత్సరానికి ఏడు బ్రహ్మోత్సవాలు, కొండకింద రెండు అనుబంధ బ్రహ్మోత్సవాలు ప్రవేశపెట్టి, గోవిందరాజు స్వామివారి ఆలయాన్ని ప్రసిద్ధికి తెచ్చి, అలా తేవడానికి కొండ నుండి చందనం, పూలమాలలు, నైవేద్యాలు, చాలా అట్టహాసంగా ఏనుగుల అంబారీలు వేసి అధ్యయనం, వేదపారాయణంతో పెద్దపెద్ద ఉత్సవాలు – ఊరేగింపులతో తిరుమల–తిరుపతికి తెప్పించే సంప్రదాయం ఏర్పడింది. యాత్రికులకు, తిరుపతివాసులకు ఈ ఉత్సవాలు చాలా వైభవంగా, గర్వంగా చెప్పుకోగల ఉత్సవాలుగా రూపుదిద్దుకొని, వాటి ఖ్యాతి నలుదిశలా పాకేలా చేయించి, తిరుమల ఆలయానికి మంచి పరపతి చేకూర్చడం జరిగింది.

ఈ కాలంలోనే అర్చకులకేకాక, ఇతరకులాల ఆలయసేవకులకు కూడా స్వామివారి నైవేద్యాలలో భాగం కల్పించటం, కొండమీద ఏ సేవకూ రుసుము లేకుండా – వచ్చిన యాత్రికులందరకూ ఉచితవసతి, ఉచిత భోజనసదుపాయాలు చేయడానికి సత్రాలు, అన్నదానసమాజాలు స్థాపించి ప్రోత్సహించారు. వైఖానసులు – ఇతరకులాల శ్రీవైష్ణవు (సాత్తాడి) ల విషయంలో అంత వివక్ష చూపలేదుకాని, వేదపారాయణల విషయంలో కొంత వివక్ష చూపారని ఒక వాదన ఉంది. శ్రీవైష్ణవులు ప్రవేశపెట్టిన అధ్యయనాలు, శాత్తుమొర ప్రబంధ పఠనానికి ఎక్కువ ప్రాముఖ్యం ఇచ్చేవారట. వైఖానసులు శ్రీవైష్ణవ బ్రాహ్మణులకు మాత్రమే ఎక్కువ ప్రాముఖ్యం ఇచ్చి, తమిళ ప్రబంధ పాశురాల పఠనానికిచ్చిన ప్రాముఖ్యాన్ని వేదపారాయణదారులకు ఇచ్చేవారు కాదట! వేదపారాయణ దారులున్నా, అవకాశం ఇచ్చేవారు కాదట! ఇచ్చినా తగిన సంభావనా సత్కారాలు చేసేవారు కాదట! శ్రీవైష్ణవులకన్నా వీరిని చాలా చులకనగా చూసేవారట. దీనికి ముఖ్యకారణం యాదవరాయల కాలంలో శైవులకు, వైష్ణవులకు జరిగిన వాదమే. ఆలయంలోని విగ్రహం కుమారస్వామిది, తిరుమలను శైవక్షేత్రంగా ప్రకటించాలని శైవుల వాదన... రాజు సమక్షంలోన విష్ణువుగా నిర్ణయం జరిగాక కొంతకాలం శైవులను/అద్వైతులను కొంతదూరంగా పెట్టినట్లు తెలుస్తుంది. వేదపారాయణదారులు దాదాపు అందరూ శైవులే. ఈ విధానం దాదాపు 1443 A.D. వరకూ కొనసాగిందట. అప్పటి రాజు దేవరాయ మహారాయ–II వేదపారాయణకు దేవస్థానంలో ప్రాముఖ్యం ఇవ్వటంలేదని తలచి ప్రత్యేకంగా వేదపారాయణ జరపాలని కట్టుదిట్టం చేశాడట.

అంతవరకూ సంభావన కోసం వేదపారాయణ చేసే సంప్రదాయం లేదు. పారాయణ చేస్తే, సంభావన ఇవ్వవచ్చు. కాని సంభావన కోసం వేదపారాయణ చేసే సంప్రదాయం లేదు. సంభావనతో వేదపఠనం మొదలయిందప్పుడే!

ఈనాటికీ వేదపారాయణను ముఖ్యంగా శైవులు/అద్వైతులు చేస్తుంటారు. ద్రవిడ ప్రబంధాలు, విశిష్టాద్వైత వేదాంతాలు శ్రీవైష్ణవులకు ముఖ్యం. శాస్త్రపఠనం, వేదాంతం మాధ్వులు ముఖ్యంగా చేస్తుంటారు. స్వాధ్యాయం చేసి తమతమ వేదాన్ని అధ్యయనం చేసే సంప్రదాయం ఎంతకూ ఆచరణలోకి రాలేదు. ఈ మధ్యనే శ్రీవైష్ణవ, మధ్వ సంప్రదాయాల వారు కూడా వేదపారాయణలో కొంత శ్రద్ధ చూపుతున్నారు.

★ ★ ★

25. దీపాలు తగ్గించి, నూనె తాగేశారు!

తిరుమల ఆలయ నిర్వహణలో అవకతవకలు జరుగుతున్నాయంటూ అప్పుడప్పుడు పత్రికల్లో వార్తలు వస్తూంటాయి. నేను ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా వుండగా కూడా వచ్చాయి. ఇప్పుడు పత్రికల్లో, టెలివిజన్‌లలో పోటీ పెరిగింది కాబట్టి ఒక్కోసారి అత్యంత అల్పమైన విషయం కూడా చాలా పెద్దదిగా మీడియాలో వస్తూంటుంది.

ఆలయ నిర్వహణలో అవకతవకలనేవి కొన్ని శతాబ్దాల క్రితం కూడా జరిగేవనీ, అయితే వాటిని అరికట్టడం కోసం నిర్దిష్టమైన నియంత్రణ వ్యవస్థని అప్పటి పాలకులు రూపొందించారనీ ఆలయంలో దొరికిన శాసనాలు చెబుతున్నాయి.

★ ★ ★

తిరుమల కొండమీద శ్రీరామానుజుల కాలంలోనూ, ఆతరువాత కొంతకాలంవరకూ అంత పెద్దగా ఉత్సవాలు జరిగేవి కావట. సంవత్సరానికొకసారి బ్రహ్మోత్సవాలు, రెండు సంక్రమణాలు - ముక్కోటి ఏకాదశి, ఉద్ధాన ద్వాదశి లాంటి పండుగలు జరిగేవి.

దక్షిణాదిన 1310 తర్వాత - ముసల్మానుల దండయాత్ర మొదలైన తర్వాత, గ్రామాల్లో దేవాలయాలూ, విగ్రహాలూ నాశనం చేయబడిన తర్వాత, ఇంతకుముందు మనం చెప్పుకున్నట్లు, యాత్రికులు కొండకు దర్శనానికి విపరీతంగా రావడం మొదలైంది. అప్పటికే తిరుచానూరులో ప్రతినిధిగా క్రింద ఉత్సవాలు చేయడమాని, ఉత్సవాలు పైనచేసే సంప్రదాయం మొదలైంది. పాండ్యుల ప్రాబల్యం తగ్గాక, యాదవ రాజుల రాజకీయ సంరక్షణకు మైసూరు ప్రాంతంనుండి వీరబల్లడు అనే హొయసలరాజు - సింగయ్య ధన్నాయికా అనే సైన్యాధిపతిని తిరుపతికి పంపాడట. ఈ సింగయ్య మంచి నిష్ఠాపరుడైన శ్రీవైష్ణవుడు. తురుష్కులకాలంలో తమిళ దేశం నుండి కర్ణాటకకు వలసపోయి కొంతకాలం అక్కడ రామానుజులవారి ప్రభావంతో

శ్రీవైష్ణవదీక్ష తీసుకొన్న కుటుంబంవారిది. అతను తిరుమలలో కొన్ని సదుపాయాలు, సంస్కరణలూ చేయడానికి సిద్ధమయ్యాడు. దొరికిన శాసనాన్నిబట్టి, 1328 AD లో యాదవ రాయల చేత స్వామివారికి అన్ననైవేద్యం నివేదించడానికి, తనపేర ఒక గ్రామం రాయించుకొన్నాడు. కొండపైన మఠాలు, నందనవనం ఏర్పాటుకు దోహదం చేశాడు.

అప్పటివరకు తిరుమల ఆలయంలో ఉత్సవ విగ్రహాలు - మలయప్పస్వామి, శ్రీదేవి భూదేవుల ప్రసక్తి ఏ శాసనంలోనూ కనబడలేదు. 1339 AD లోని శాసనంలో మొదటిసారి ఈ విగ్రహాల ప్రసక్తి వస్తుంది. తర్వాత చాలాసార్లు శాసనాల్లో కనబడతాయి. ఇప్పుడు మనం చూసే మలయప్ప స్వామిని అప్పుడు 'మలైకునియ నిన్ర పెరుమాళ్' అని పిలిచేవారు.

అదే రోజులలో చాలా మంది శ్రీవైష్ణవులు, ముస్లింల బారినుండి పారిపోయి తిరుమల చేరడం జరిగింది. శ్రీరంగం నుండి ఉత్సవవిగ్రహాలను కూడా అప్పుడే కొండకు తెచ్చారు. వాటిని ఇప్పటి రంగ మండపంలో ఉంచిన దాఖలా వుంది. అలావచ్చిన శ్రీవైష్ణవ ఆచార్యులతో పాటు వారి కట్టుబాట్లు, తిరుప్పావై పాడటం మొదలయ్యాయి. అరిశనాలయ నందనవనంగా మొదలై తర్వాతి కాలంలో జియ్యంగారి మఠంగా రూపుదిద్దుకుంది. వాన్ శఠగోపన్ నందనవనం తర్వాతి కాలంలో అహోబిలమఠానికి నాంది పల్కింది.

1200 నుండి 1300 సంవత్సరాలలోనే గర్భగృహం మరమ్మత్తులు, గోపుర నిర్మాణాలూ. ముక్కోటి ప్రదక్షిణ హడావుడిగా మూసివేయడం - అన్నీ ఈ కాలంలో జరిగినవే.

రోజురోజుకూ పెరుగుతున్న భక్తులరద్దీ, దానితోపాటు పెరిగే ఆదాయం - వీటిని అనుసరిస్తూ ప్రవేశపెట్టిన కొత్త సేవలూ - తిరుమల వైభవమే వైభవం! ప్రతిరోజూ ఉత్సవమే, ప్రతిరోజూ దాన ధర్మాలే... వీటన్నిటి ప్రభావం దేవస్థానం పరిపాలన వ్యవస్థమీద పడింది.

ఆ కాలంలో తిరుమల ఆలయంలోని మొదటి ప్రాకారం ఉత్తరపు గోడమీద ఉన్న శిలా శాసనం No 20 TT ద్వారా ఆనాటి పరిపాలనా వ్యవస్థ గురించి కొంత తెలుసుకోవచ్చు. ప్రత్యేకంగా రెండు శాసనాలు.

ఈ శాసనాలలో - తిరుమల ఆలయంలో దీపాలు వెలిగించడానికి, కొన్ని సేవలు చేయించడానికి దాతలు ఇచ్చిన దానాలు, విరాళాలు, వారికి తిరుచానూరు సభవారు ఆలయం తరఫున సేవలు చేయడానికి చేసిన వాగ్దానాలు, అదివరకు పొందుపరచిన శిలాశాసనం ఆధారంగా సక్రమంగా జరుగుతున్నాయా లేదా అని జరిపిన విచారణ, ఆ విచారణలో తీసుకొన్న నిర్ణయాల గురించి ఉంది.

మొదటిది- రాజేంద్ర చోళుల కాలంలో రాజుగారి అధికారి కొర్రమంగళ ముగియన్ చేసిన విచారణ. ఈ అధికారి ఆ తొండమండలానికంతటికీ అధిపతి (దాదాపు ఇప్పటి గవర్నరులాగ). రాజ్యాన్ని కొన్ని మండలాలుగా, ప్రతి మండలం కొన్ని కొట్టాలుగా, ప్రతి కొట్టంలో కొన్ని నాడులు, ప్రతి నాడిలో కొన్ని కొర్రాలు (కొన్ని గ్రామాలు) ...అలా గ్రామాధికారిదాకా ప్రతి విభాగానికి ఒక రాజ్యాధికారి, అతనిపైన ఇంకొకరు. అలా మండలానికి గల అధికారి చేసిన విచారణ అది.

విచారణస్థలం తిరుచానూరు మందిరంలోని సభామందిరం. దాతలను, ఆలయ అధికారులను, సభాసభ్యులను, ఇతర భక్తులను ప్రశ్నించి విచారణ జరిపి, అక్కడికక్కడే నిర్ణయాలు ఇచ్చే అధికారం ఈయనకుంది... అలా చేసిన విచారణ ఇది. దాతలు ఇచ్చిన సొమ్ముతో సక్రమంగా, వాగ్దానంచేసిన రీతిలో సేవలు జరిపించలేదని తీర్పు, అధికారులనుండి డబ్బు వసూలు చేయాలని ఆదేశం. వెంటనే నెయ్యిపంపి నందా దీపాలు దాతలు కోరినట్లు వెలిగించాలని ఆదేశం. అధికారులనుండి వసూలుచేసిన మూలధనాన్ని దేవస్థానానికి జమకట్టాలని ఆదేశాలు. అధికారుల అలసత్వంపై చర్య...

అలాగే ఇంకో శాసనం ఏం చెబుతోందంటే- కొడుపూర్‌నాడు (తిరువేంగడ కొట్టంలో భాగం) లోని దేవదేయం విషయంలో ఒక కేసు విచారణకు వచ్చింది.

గర్భాలయంలో ప్రతిరోజూ 24 చమురుదీపాలు వెలిగించడానికి పాలకులు ఏర్పాటుచేస్తే, అర్చకులు రెండేసి దీపాలు మాత్రమే వెలిగిస్తూండేవారుట. మిగతా 22 దీపాల చమురు ఏమవుతోంది?

ఈ విషయం బయటపడగానే మండల విచారణాధికారి స్వయంగా విచారణకు పూనుకున్నాడు. కొట్టం అధికారిని, గ్రామాధికారుల్ని, రైతుల్ని, సభాయార్లను, దేవస్థాన అధికారుల్నీ సమావేశపరిచాడు. నిశితంగా విచారణ జరిపాడు. వాస్తవం బయట

పడడంతో - దాతకు వాగ్దానం చేసినవిధంగానే గుడిలో చమురు దీపాలు వెలిగించి తీరాలని ఆదేశాలిచ్చాడు. ఇందుకోసం తిరుచానూరు సభకి చెందిన శ్రీవైష్ణవ సభాసభ్యుల నుండి, పరిహారం సొమ్ము వసూలు చేయాలని కూడా ఆదేశించాడు.

అంటే, దేవస్థానం తరఫున తిరుచానూరు సభవారు దానాలు తీసుకొని వాగ్దానాలు చేసినా, దేవస్థానం అధికారుల అలసత్వం వలననో, లేదా, దేవదేయం నుండి అనుకున్నంత ఆదాయం రాకపోవడం చేతనో, లేక ఆదాయంవచ్చినా రైతులు డబ్బు చెల్లించనందుకో, సభవారికీ, దేవస్థానం అధికారులకూ సమన్వయంలేకపోవడం వల్లనో లేదా దేవదేయం మీదవచ్చే ఆదాయాన్ని దిగమింగే అధికారులు ఉండటంవలననో జరపవలసిన సేవలు సరిగ్గా జరిగేవికావని తెలుస్తోంది.

ఈ పరిస్థితిని దృష్టిలో ఉంచుకొనే ఏకాంగులనూ, జియ్యంగార్లను ఈ విషయాల మీద శ్రద్ధ పెట్టడానికి నియమించి, వారికి రాజు నుండి శాసనం ద్వారా అధికారికంగా పనులుచేసే వెసులుబాటు కలిగించారు. కాని దానాలు, దేవదేయాలు విపరీతంగా పెరుగుతున్న దృష్ట్యా - 15వ శతాబ్దం వచ్చేటప్పటికి దేవస్థానం అధికారులు స్థానత్తారు (ఇప్పుడు కార్యనిర్వహణాధికారిలా), ఒక్కడే ఈ విషయాలు చూడటానికి సాధ్యంకాదని తలచి ఆ నాటికి దేవదేయంగా ఇవ్వబడి దేవస్థానం / వైష్ణవ సభ అధీనంలో ఉన్న దాదాపు 200 గ్రామాలు, ఇతర గ్రామాల్లో దేవస్థానానికి దానంగా ఇవ్వబడిన భూముల వ్యవహారాన్ని చూడడానికి ఒక ప్రత్యేక విభాగాన్ని 'తిరుప్పని భండారం' అన్నపేరుతో ప్రారంభించారు. ఇప్పటి భాషలో చెప్పాలంటే భూసంబంధ, నీటిపారుదల, ప్రజలపనుల శాఖగా చెప్పుకోవచ్చు.

దేవస్థానానికి చెందిన గ్రామాలలో శిస్తులు వసూలు, నీటికాల్వల చెరువుల మరమ్మత్తులు - రాజ్యాధికారులతో పన్నుల మినహాయింపు విషయాలు - వచ్చిన ఆదాయాన్ని దాతల కోర్కెలు తీర్చడానికి దేవస్థానానికి అందజేసే బాధ్యతలు ఈ విభాగానివి. అదేకాక ఇంకో విభాగం, దేవస్థానానికి వచ్చే అన్ని రకాల ఆదాయాలు, ఖర్చులు బేరీజువేసే (Finance) విభాగం. ఏ రోజు ఆదాయం, ఆరోజు లెఖ్ఖలు వేయడానికి వీలుగా ఏర్పాటుచేయడం జరిగింది. ఇది జియ్యంగారి అధీనంలో వుండాలని మొదట సంప్రదాయం, కాని నిశితంగా చూస్తే అలా లేదేమో అనిపిస్తుంది. కొలువులో లెక్కలు చదివే వరకే జియ్యంగారి బాధ్యత.

మనకు లభ్యమైన ఆధారాలను బట్టి, ఈశాఖలలో అధికారులు మాత్రమేకాక ఈశాఖా విషయాలు చూడటానికి సమాజంలో పలుకుబడి, ఆధ్యాత్మిక చింతన, ధార్మిక ప్రవృత్తి, సిరిసంపదలుగల ఆస్తికులను ఒక సభగా నియమించి, ఈ విషయాలన్నీ ఆ సభ ఆధ్వర్యంలో జరిగే ఏర్పాటుచేయడం జరిగింది.

తర్వాత తర్వాత, స్వామివారికి హుండీలో వస్తున్న స్వామివారికి సమర్పింపబడే ఆభరణాల సంరక్షణకు, విడిగావచ్చే బంగారం, వెండి ఇతర నాణాలు, డబ్బు సంరక్షణకు ఇంకొక విభాగం స్థాపించబడింది. ఇలా డబ్బు, ఆస్తులు, పరిపాలనా వ్యవహారాలలో జోక్యం జరిగినా ఆలయ పూజ, ఆగమవిధానాలలో, సంప్రదాయ పరిరక్షణ విషయంలో ఇతరుల జోక్యం లేకుండా చూసేవారు.

గర్భాలయం గోడ రహస్యం!

మహాభక్తులు, శంఖరాజు, తొండమానుడు కట్టించినట్లు పురాణాల్లో చెప్పబడిన ఆలయాలు, ఆ గోపురాలు శిథిలమై కాలగర్భంలో కలిసిపోయాయి.

మనకు లభ్యమవుతున్న చారిత్రక ఆధారాలనుబట్టి ఇప్పుడు తిరుమలలో ఉన్న ఆలయం క్రీ.శ. 8/9 శతాబ్దకాలంలో గర్భాలయంతో మొదలయి వుండవచ్చని తెలుస్తోంది. అంతకు ముందు కాలనిర్ణయం చేయలేని సమయం. ఈ కాలం కన్నా ముందునుండే స్వామివారి విగ్రహంవున్నా 8వ శతాబ్ది నాటికి ఆచ్ఛాదనమంటపం మాత్రం వుండివుండవచ్చు. ఆ తర్వాత తొమ్మిది, పదోశతాబ్దాలలో గర్భాలయం తయారయి వుండవచ్చనీ తెలుస్తోంది.

క్రీ.శ. 966 నాటి శిలాశాసనంలో (ఆళవందారు) ప్రేరణతో రాజకుమారి సమావాయి పేరుందేవి వెండి భోగశ్రీనివాస విగ్రహ ప్రతిష్ఠ చేసే నాటికి గర్భాలయం శయన మండపం ఉండి, ఇప్పుడు రాములవారి మేడ ఉన్న ప్రదేశం, గర్భాలయం చుట్టూ ప్రదక్షిణం చేయడానికి అనుకూలంగా ఒక ప్రాకారం వుండేవి. వాన, ఎండలకు ఇబ్బంది లేకుండా పైనకప్పబడి ఉన్న ప్రాకారం ఉండేదని తెలుస్తోంది... అంటే ఇప్పుడు గుడిలోపల మనం చూసే రాములవారిమేడ ప్రదేశంలో అటూ ఇటూ గోడలుకట్టి ఆ ప్రదక్షిణ ప్రాకారాన్ని మూసివేసినట్లు తెలుస్తోంది. ఇటువంటి ప్రదక్షిణలు ఆలయంలో వుండి పైన కప్పు వుండే ఆలయాలు ఈనాటికే చాలా ప్రాచీన దేవాలయాలలో చూడవచ్చు.

కులశేఖరపడిదాకా ఈనాటికీ చాలా మంది భక్తులకు వెళ్లి దర్శనం చేసుకొనే అవకాశం ఉంది. సుప్రభాతం, తోమాల, అర్చన, అభిషేకం, తిరుప్పావడ, సహస్ర కలశాభిషేకం, ఉదయాస్తమాన సేవలలాంటి సేవలు చేయించిన వాళ్లకు, కులశేఖరపడిదాకా వెళ్లే అవకాశం వుంది. స్నపన మండపం దాటాక 5 అడుగులు మాత్రమే వెడల్పు ఉండి, అటుఇటు 6 అడుగులు గల రాములవారి మేడ గుండా శయన మండపంలోకి వెళ్లాలి. ఈ సారి రాములవారిమేడలో నుండి వెళ్తున్నప్పుడు గమనించండి. అటూ ఇటూ గోడలు కట్టి ప్రాకారం మూసివేసినట్లు తెలుస్తుంది. గోడలపై చెక్కిన రాతి అలంకారపు కట్టడాలపైనే మూసివేయడానికి గోడలు కట్టినట్లు తెలుస్తుంది.

మరి ప్రదక్షిణ ప్రాకారం ఎందుకు మూసినట్లు? ఎవరు మూసినట్లు? ఎప్పుడు మూసినట్లు? ఈ ప్రశ్నల సమాధానాలే - ఈ తిరుమల ప్రస్తుత ఆలయనిర్మాణంలో ఒక కీలకమైన ఘట్టం... చాలాకాలం క్రిందటివరకూ అందరికీ కాకపోయినా కొందరికైనా ఈ విషయాలు తెలుసు. అన్ని విషయాలు కాలక్రమంలో మరచిపోయే అవకాశం ఉంది... కాని కొన్ని సంప్రదాయాలు మాత్రం అలానే మిగిలిపోయాయి. ప్రదక్షిణం కాని ప్రదక్షిణ ప్రాకారం అంటే మూడువేపులా మాత్రమే ప్రదక్షిణకు అవకాశం వుండి తూర్పువేపున మూసివేయబడ్డ ప్రాకారంలో మనం ప్రతి సంవత్సరం - ముక్కోటి ప్రదక్షిణలు (పూర్తి ప్రదక్షణం కాదు) చేస్తున్నాం. అదీ ఏకాదశీ, ద్వాదశి రెండు రోజులు మాత్రమే.

ఇప్పుడు గర్భాలయంలో వున్న రాములవారు, సీతాదేవి, లక్ష్మణ విగ్రహాలు, ఆంజనేయులు, జాంబవంతుడు, అంగదుడూ, సుగ్రీవుడుతో సహా రాములవారి మేడలో అరుగులపై వుండేవి. అందుకే ఆ గదికి రాములవారిమేడ అని పేరు. రాముల వారు గర్భాలయం లోపలికి వెళ్లినా, రాములవారి మేడ పేరు సంప్రదాయంగా మిగిలిపోయింది. ఆంజనేయ స్వామిని, ఇతర వానర నాయకులనూ రాములవారి నుండి వేరు చేసి, విమానప్రాకారంలో వేరే గదిలో ఉంచినట్లు తెలుస్తోంది.

గర్భాలయం అసలు పరిస్థితి ఏమిటి? చుట్టూ ఉన్న గోడ ఒక్కటేనా? రెండా? రెండోది ఉంటే ఎందుకు వచ్చింది? రెండు గోడల మధ్యా ఖాళీ ఉందా? లేక గోడలు కలిపి కట్టారా? మరి మొదటి గోడమీద శాసనాలు వుండేవా? ఉంటే వాటినేమిచేశారు? ఆ గోడను ఇంకో గోడతో మూసివేసే అవసరం ఎందుకొచ్చింది? ఇవన్నీ ప్రశ్నలే.

ఆలయంలో ఎంతో కాలంనుండీ పనిచేస్తున్నా, అక్కడే రోజూ చూస్తున్నా, ఆలయ అధికారులుగా ఎంతకాలంగానో ఆలయ ప్రతిరాయితో పరిచయమున్న వారికి కూడా చాలామందికి తెలియని విషయాలు ఈ ఆలయంలో దాగివున్నాయి. శిలాశాసనాల నుండి సమన్వయం చేసుకోవచ్చు. గోడల మందాన్ని, చుట్టుకొలతల్నీ కొలిచినప్పుడు గర్భాలయం విషయంలో ప్రశ్నలు తలెత్తుతాయి. ఈ దేవాలయంలో కొలతలు తీసుకోవాలన్నా చాలా ఇబ్బందులే. యాత్రికుల రద్దీతో సమయం దొరకడం కష్టం. ఏదో విధంగా దాన్ని సాధించినా, కొన్ని ప్రదేశాలలోకి – ముఖ్యంగా గర్భ గృహంలోకి అందరూ వెళ్లలేరుకదా?

ప్రాకారాల రహస్యం

ఈ విషయాలమీద కొంత ప్రయత్నం చేసి అవగాహన చేసుకోవడానికి నాకు అవకాశం కల్గింది. వెయ్యికాళ్ల మండపం పడగొట్టి ఇంకో మహాప్రాకారం కట్టాలనే ప్రతిపాదన వచ్చి, అది చాలా పెద్ద వివాదమునకు దారి తీసినప్పుడు, నేను అధ్యక్షుడుగా ఇంకొక ఇద్దరు అధికారులతో ఒక త్రిసభ్య కమిటీని ప్రభుత్వం నియమించింది.

కొత్తగా ప్రాకారం కట్టాలంటే, ఆగమం ప్రకారం ఇంకో ప్రాకారం కట్టవచ్చా? ఇప్పుడు ఎన్ని ప్రాకారాలున్నాయి? అన్న ప్రశ్న తలెత్తింది. అప్పుడు ముఖ్యంగా వివాదనగా వచ్చిన ప్రశ్న – ముక్కోటి ప్రదక్షిణ చేసేది మొదటి ప్రాకారమా? కాదా? ప్రదక్షిణ అంటే గుడి చుట్టూ చేయాలి కదా? మరి మూడు వేపులా ప్రదక్షిణం వుండి తూర్పు వేపున మూసివేశారు కదా? ప్రాకారం నాలుగువేపులా లేకుండా ప్రదక్షిణం మూడువేపుల మాత్రం వుంటే అది ప్రాకారం ఎలా అవుతుంది? అలా చేస్తే ప్రదక్షిణ అవుతుందా? మొదట అలాగే వుండేదా? దేవాలయంలో మూడు ప్రాకారాలున్నాయని పురాణకాలం నుండి చెప్పబడింది. చారిత్రక ఆధారాలున్నాయి కదా? మరి ఈ మార్పులు ఎందుకు, ఎప్పుడు ఎలా వచ్చాయి?... అన్న ప్రశ్నలు మా ముందుకువచ్చాయి. అప్పుడు లభ్యమైన, గ్రంథాలు, శిలాశాసనాలు, తిరుమల చరిత్రపై దొరికిన గ్రంథాల ఆధారంగా కొలతలు తీయించాము.

మనకు తెలిసేదేమిటంటే గర్భగృహం, దానిని ఆనుకొని ఉన్న ముఖమండపం, (అంటే గర్భగృహం కులశేఖరపడి) ముందువున్న శయనమండపం – రాములవారి మేడ దాకా వున్న మండపం... ఒక నిర్మాణం కాదు, రెండు నిర్మాణాలు అని. గర్భగృహం గోడలు, ముఖ మండపం గోడలుకాక, వాటిని ఆనుకొని ఇంకో గోడ

కట్టారని తెలియవచ్చింది. రెండు గోడలూ అతికించికట్టారా? అంటే అదీ కాదు - రెండింటిమధ్య అతకకుండా, గాలి ఉండేట్లు ఆరు అంగుళాల స్థలం వదిలి (దానిని అంతరాళం అంటారు) కట్టారని తెలుస్తోంది.

క్రీ.శ.1244-50 సంవత్సరాలమధ్య కాలంలో ఈ నిర్మాణం జరిగినట్లు తెలుస్తోంది. అప్పటికి గర్భగృహం గోడకు బయటివేపు, కనీసం నాలుగు ప్రాచీన శిలాశాసనాలు వున్నట్లు తెలుస్తోంది. అవి క్రీ.శ.966 నుండి 1013 ప్రాంతపు తమిళ శాసనాలు. ఇంకొక గోడతో ఆ శాసనాలున్న గర్భగృహంగోడను మూసివేసేప్పుడు ఆ శాసనాల నకళ్లను తీసుకొన్నారు. వాటివలన - పూర్వం గర్భాలయం ముఖమండపం చుట్టూ ఒక ప్రదక్షిణ ప్రాకారం వుండేదనీ, ఆ ప్రాకారం 'పైన మూయబడి' ఉన్న ప్రాకారం అనీ, ఆ ప్రాకారంలో ఎప్పుడూ 20 పెద్ద దీపాలు అఖండాలుగా వెలుగుతూండేవనీ, దానికి దాతలు విరాళాలు, భూమి నిత్యకైంకర్యం కోసం ఇచ్చారనీ తెలుస్తోంది.

కొత్తగా గర్భాలయపు గోడకు ఆనించి ఇంకో గోడ కట్టటానికి బయటి ప్రాకారం గోడను పడగొట్టారనీ, ఆ ప్రాకారం గోడమీద - లోపలా, బయటి వేపునా ఇంకా శిలాశాసనాలు ఉండేవనీ, ఆ గోడ కొట్టేటప్పుడు - ఆ శాసనాలున్న రాళ్లను భద్రపరిచే ప్రయత్నం చేసినా కొన్ని పగిలిపోయాయనీ తెలుస్తోంది. పాత ప్రాకారం గోడను పడగొట్టి కొంచెం ప్రాకారం వెడల్పుచేసి కొత్త ప్రాకారం గోడలు కట్టినట్లు తెలుస్తోంది. కొత్తగా కట్టిన గోడలలో గర్భాలయం బయటి గోడనుండి కాపీ చేసిన నాలుగు ప్రాచీన శాసనాలు తప్ప ఇంకే ఇతర శాసనాలు చెక్కకుండా గోడలను కట్టారు. ఆ నిర్మాణాల్లో చోళరాజులు, వారికాలంలోని ముఖ్య అధికారులు ఇచ్చిన విరాళాలు, దేవదేయాలకు సంబంధించిన శాసనాలు కొంతవరకు రాళ్లు పగిలిపోయి, అందుబాటులో లేకుండా పోయినట్లు కూడా తెలుస్తోంది.

రాజంత బంగారంతో మలాం

ఈ కొత్త నిర్మాణ కార్యక్రమం చేపట్టింది అక్కడి స్థానిక ప్రభువు వీరనరసింహ యాదవరాయలు. అతను పాండ్య దేశపు సుందర పాండ్య చక్రవర్తికి సామంతుడని తెలుస్తోంది... స్వర్గాన్ని తలదన్నేట్లు తిరుమలను రూపుదిద్దాలన్న అభిలాషతో, తనే తులాభారంలోకూర్చుని, తన బరువు బంగారాన్ని తూచి, ఈ వీరనరసింహ

యాదవరాయలు ఆ బంగారంతో (కొత్తగా కట్టిన విమానగోపురానికి రాగి తాపడం చేయించి దానిపై) మలాం పూయించి మొదటిసారిగా శ్రీవారికి బంగారు విమానం చేయించాడని తెలుస్తోంది. ఆ విమానప్రతిష్ఠకు తన చక్రవర్తి సుందర పాండ్యుని పిలిపించి, ఆ చక్రవర్తి చేత ఈ విమానంపై బంగారు కలశాల ప్రతిష్ఠకూడా ఈసామంత యాదవరాజు చేశాడని తెలుస్తోంది. అది 1262 AD లో...

అలా కొత్తగా కట్టి తయారుచేసిన ప్రదక్షిణ ప్రాకారంలో కొన్ని సంవత్సరాలు యాత్రికులు ప్రదక్షిణ చేశారనీ, కాని కొంతకాలానికి ఆ ప్రదక్షిణ ప్రాకారంలో తూర్పువైపున అటూ ఇటూ రెండు గోడలు కట్టి ప్రదక్షిణం మూసివేసి, రాములవారి మేడ చేశారనీ తెలుస్తోంది. దొరికిన శాసనాలవల్ల - ఈ ప్రదక్షిణ మూసివేయడం 1265-1285ల మధ్య కాలంలో జరిగిందని భావించవచ్చు. అదే సమయంలో మిగతా మూడువైపులా, వున్న ప్రదక్షిణం - (ఇప్పుడు మనం ముక్కోటి ప్రదక్షిణంగా చెప్పుకొని ముక్కోటి ఏకాదశి, ద్వాదశినాడు ప్రదక్షిణం చేసేది కూడా) యాత్రికులు వెళ్లకుండా మూసివేశారని కూడా తెలుస్తోంది. ఆ తర్వాత ఈ ప్రదక్షిణానికి తలుపులు - ఈశాన్యంలో, ఆగ్నేయంలో ఇప్పుడు మనం లోపలికి, బయటకు వెళ్లడానికి, రావడానికి వాడే తలుపులు - అమర్చారు. ఈ ప్రదక్షిణం కూడా అన్నివేపులా సమానంగా లేదు. దక్షిణ, పశ్చిమంవేపు తక్కువ - ఉత్తరంవేపు - మిగతావైపు కంటే రెండింతలు ఉన్నట్లు చూడవచ్చు. ఈసారి ముక్కోటికి వెళ్లినప్పుడు గమనించండి. అలా పెంచిన ఉత్తరప్రకారానికి పై కప్పు వేయాలంటే మధ్యలో స్తంభాలు లేపవలసివచ్చింది. గర్భగృహంలో అభిషేకం, ఇత్యాదులు చేస్తున్నప్పటి నీరు బయటకు పోవడానికి, ఆగమంలో చెప్పినట్లు ఉత్తర ప్రదక్షిణంలోకి ఒక గోముఖం ఏర్పాటుచేశారు. సామాన్యంగా గర్భగృహం ఉత్తరం గోడకు చిన్న కన్నంచేసి. ఆ కన్నం గుండా అభిషేకం నీరుకాని లేదా గర్భగృహం కడిగిన నీరుగాని పోవడానికి ఏర్పాటుచేసి, ఆ నీరు ఒక తొట్టిలోకి ఉత్తరప్రాకారంలోకి బయటకు వచ్చేట్లు చేస్తారు. అలా వచ్చేనీరు తీర్థంతో సమానం కనుక దాని పవిత్రత కాపాడటం కోసం నీరు బయటకు వచ్చేచోట ఒక గోముఖం ఏర్పాటుచేసి అందులోంచి నీరు బయటకు వచ్చేలా చేస్తారు. కాని ఇక్కడ గోముఖం ఏర్పాటుచేసినా - దానిని వాడేవారుకారు. దానిని మూసి వేశారు. ఎందుకంటే దానిని సక్రమంగా పనిచేయించడం కష్టమయిందని. దానికి ముఖ్యకారణం - గర్భగృహానికి, ఉత్తర ప్రాకారానికి మధ్యఉన్న గోడ చాలా మందం. పైగా రెండుగోడలు, మధ్యఅంతరాళం - అంతా కలిపితే 7 అడుగుల రెండంగుళాలు ఉంటుంది.

స్వామివారి ఆలయంలో గర్భగృహం 12 అడుగుల 9 అంగుళాల చదరం - చతురస్రం. అంటే పాతకాల లెఖ్ఖల ప్రకారం - 9 హస్తాలు. లేదా, పైన ఉన్న విమానం కొలతలు. క్రిందనున్న గోడల కొలతలతోచూస్తే - పురాతనమైన లోపలిగోడ రెండు హస్తాల లోపు, బయట కొత్తగా కట్టిన గోడ మూడున్నర హస్తాలు, మధ్య అంతరాళం. ఇలా గోడల మందం 7 అడుగుల రెండంగుళాలుగా తేల్చారు. ఇవన్నీ చూస్తుంటే ఈ మరమ్మత్తులకు ముందు ఈ ఆలయంలో గోపురం వుండేది కాదని తెలుస్తోంది. మార్పులు చేస్తున్నప్పుడు ప్రాచీనకాలపు గర్భగృహం జోలికి పోలేక, గర్భగృహం గోడలను అలానే ఉంచి దానికి 6" ఖాళీ వదిలి తర్వాత మూడున్నర హస్తాల గోడ కట్టి, ఆ గోడపై విమాన నిర్మాణం చేశారు. అంటే ఇప్పుడు మనం చూస్తున్న విమానం నిజంగా గర్భాలయం గోడల మీద లేదు.

ఇక్కడ తిరుమలలో ప్రపంచంలోకెల్లా పవిత్ర స్థలంగా భావించేచోట, స్వామివారే స్వయంభువుగా ప్రత్యేకంగా నిలిచారని చెప్పే ఈ తిరుమల ఆలయంలో ఆలోచనా రహితంగా, హడావుడిగా కొట్టడాలు, కట్టడాలు - ఆరోజుల్లో జరగడం దురదృష్టకరం. అప్పటిదాకా పైకప్పు, నాలుగు గోడలు, ఒక తలుపుతో ఉన్నదే గర్భాలయం. విమానంలేదు. అప్పటి వరకు ఆలయ అర్చన బాధ్యత అంతా వైఖానసులదే. అప్పటికింకా తమిళ ప్రబంధాలు రాలేదు. మిగతా వైఖానస ఆలయాల్లోలా, ఇతర దేవతలు కూడా లేరు. ఆళ్వార్ల విషయంచెప్పుకొన్నా - కొండమీద పాంచరాత్రపద్ధతిలో ఉండే ఆళ్వార్లను తెద్దామనే ప్రశ్నే రాలేదు. అర్చన చేసే వైఖానసులుకాక, తిరుమల నంబి కుటుంబ సభ్యులు కూడా సంస్కృతంలో వేదం, స్తోత్రాలు జరిపే సంప్రదాయమే. కాని 1259వ సంవత్సరంతో మొదలైంది తమిళ ప్రబంధపారాయణం. ఇవన్నీచూస్తే - ఆ రోజుల్లో జరిగిన నిర్మాణాలు, మరమ్మత్తులు, వైఖానస ఆచార్యుల 'మరీచి సంహిత' ఆధారంగానే జరిగినట్లు తెలుస్తోంది.

గోముఖంతో కలిపి తూర్పువైపు గోడలో కన్నం - 96 అంగుళాలు పొడవు. వ్యర్థపదార్థాలు, అభిషేకతీర్థం, గర్భగృహం కడిగిన నీరు - 96 అంగుళాలు పొడవుగల సన్నని కన్నంలోంచి వెళ్లాలంటే దాన్ని శుభ్రంగా వుంచడం కష్టమయిపోతుంది. గర్భగృహంలో 9 అడుగులు లేదా 10 అడుగులకు తక్కువకాని కర్రతో రంధ్రాన్ని శుభ్రం చేయడం కష్టం. అలాగే ఉత్తరంవైపు గోడబయట గోముఖం లోంచి కర్రపెట్టి శుభ్రం చెయ్యాలంటే 10 అడుగులకర్ర కావాలి. ఆ ప్రాకారం అంత పెద్దగా లేదు. పట్టినా బయటవైపు నుండి తోస్తే వ్యర్థపదార్థాలు గర్భగృహంలోకి వెళ్తాయిగదా!

ఆ రోజుల్లో ఈ రోజుల్లోలా వంకర తిరిగే గట్టి పదార్థాలు లేవు. ఏం చేయాలో తెలియక కొంత కాలానికి గోముఖం కన్నమే మూసేశారు. ఇవన్నీ ఎందుకు చెప్పడం అంటే ఆలోచించకుండా తొందరపాటుగాచేసిన పనులవలన అనర్థం. అంటే కొంత కాలం లోపల గర్భగృహంలో ప్రతిరోజూ చేసే అభిషేకం చిన్న భోగశ్రీనివాసమూర్తి విగ్రహానికే కనుక - పానవట్టం నీరు నేరుగా గంగాళంలోకే పట్టవచ్చు. కాని శుక్రవారం మూలవరులకు అభిషేకంలో చాలా ఇబ్బంది అయ్యేది. తర్వాతికాలంలో కన్నం పెద్దదిచేసి నీరు బయటకు వదిలేవారు. దాన్ని ఒక తొట్టిలోపట్టి దాన్నే 'తొట్టి తీర్థం'గా భావించేవారు. పురాణంలో చెప్పే గొప్ప తీర్థాల్లో ఈ తొట్టి తీర్థమొకటి.

కావాలని కట్టిన ప్రదక్షిణమార్గాన్ని కొద్ది కాలానికే మూసి చేయడం జరిగింది. అది రాములవారి మేడ దగ్గర ఉన్న దక్షిణపుగోడలోని శాసనం ద్వారా 1262 AD లో జరిగినట్లుగా తెలుస్తుంది. సుందర పాండ్యన్ బంగారు కలశాన్ని గోపురంపై ప్రతిష్ఠించినప్పుడే ఈ శాసనం తెలుగు పల్లవ సామంతుడైన విజయగండుని దేవదేయం గురించి చెబుతుంది. వీర నరసింగునిలాగే ఈ విజయగండుడూ సుందరపాండ్యుని ఇంకొక సామంతుడు. శ్రీవారి భక్తుడు. ఇతని గురించి శాసనం చాలా గొప్పగా చెబుతుంది. ఇతనిసహాయం పొందనివాడే లేడంటుంది. ఈ శాసనాలు పూర్తిగా లేవు. కొత్తగోడపై పగిలిన పాత శాసనం నుండి అర్థం చేసుకోవాల్సివుంది, ఆశాసనం వేరేచోట వుండేదని, రాములవారి మేడ కోసం గోడ బద్దలు కొట్టినప్పుడు, శాసనాలు దెబ్బతినకుండా చేయాలన్న ప్రయత్నం ఫలించలేదు. ప్రాచీన శాసనాల్ని వదలదలచలేదు. కనుక పగలనివి, పగిలినవి అన్ని శాసనాల్నీ మళ్లీ గోడలకు అతికించారు.

వైఖానసఆగమం ప్రకారం - ఈ ప్రదక్షిణంలో 4 మూర్తులను ప్రతిష్ఠించాలని చేసిన ప్రయత్నం ఇదంతా. అది సఫలీకృతం కాలేదు. తూర్పుభాగం మూసివేయబడింది కనుక ఇది ప్రదక్షిణం కాకుండా పోయింది. అప్పటి పరిస్థితులలో పాంచరాత్రులు వారి సంప్రదాయాల ప్రకారం విగ్రహాల్ని ఈ ప్రదక్షిణలో పెడతారేమో అన్న భయంతో మూడువైపులా వున్న ప్రదక్షిణాన్ని కూడా, తలుపులు కూడా లేకుండా మూసివేయడం జరిగింది.

విమాన గోపురం కట్టడం, గోపురంపై వున్న మూర్తులన్నీ వైఖానస ఆగమప్రకారమే వున్నాయి. అలాగే క్రింద ప్రదక్షిణంలో కూడా గర్భగృహం గోడలో నాలుగు అరలు

నిర్మించబడి కన్పిస్తాయి. కాని అందులో విగ్రహాల ప్రతిష్ఠ జరుగలేదు. ఈ విషయాలు ఈనాటికీ వైకుంఠ ప్రదక్షిణ సమయంలో గమనించవచ్చు. పూర్తిగా వైఖానస ఆగమ సంప్రదాయమైతే మొత్తం తొమ్మిది విగ్రహాలు కావాలి. అదీ జరగలేదు. ఇదే పాంచరాత్ర ఆగమంలో అయితే వారూ 5 విగ్రహాలు ప్రతిష్ఠచేస్తారు. విష్ణుమూర్తి వ్యూహావతారాలు - అంటే సంకర్షణ, ప్రద్యుమ్న, అనిరుద్ధ, వ్యూహవాసుదేవ రూపాలు. పాంచరాత్ర వైఖానస రెండు సంప్రదాయాల్లోనూ బ్రహ్మ, శివుడు, మార్కండేయుడు, భృగుఋషి విగ్రహాలు కూడా గర్భాలయంలో ప్రతిష్ఠచేసే సానుకూలం వుంది. వైఖానస ఋషి విగ్రహం ఆలయం రెండో ద్వారం దగ్గర ప్రతిష్ఠ చేస్తారు. వైఖానసంలో ఇవన్నీ కాక గణేశ, దుర్గామూర్తులను కూడా ఆలయంలో ఉంచే సానుకూలం వుంది. పాంచరాత్రంలో వీటిని వొప్పుకోరు. ఈ గొడవ లెందుకని, ఎవరి విగ్రహాలూ వద్దని ప్రదక్షిణం మూసివేశారని చరిత్రకారులు కొందరి భావన.

మొదటి నుండి తిరుమల ఆలయంలో 'ఏకమూర్తి' పూజే అమలులో వుండింది. మొదట వైఖానసులు, వారి సంప్రదాయం ప్రకారం ఇంకో నాలుగు మూర్తులు ప్రవేశపెడతామన్నా గర్భగృహంలో అసలు కుదరలేదు. పోనీ వైకుంఠ ప్రదక్షిణంగా చెప్పుకొనే మొదటి ప్రాకారంలో చేద్దామన్నా అదీ వీలుపడలేదు. పాంచరాత్రులు వారి కొన్ని సంప్రదాయాల్ని ఈ గుళ్లో ప్రవేశపెట్టినా వారి పద్ధతిలో వ్యూహరూపాల ప్రతిష్ఠ కూడా జరగలేదు.

అలా తిరుమలలో ఏకమూర్తి పూజే ఇప్పటికీ. ఆలయం విమాన ప్రాకారంలో నరసింహస్వామి, వరదరాజస్వామి ఆలయాలు వున్నా, వారికి విడిగా పూజ లేదు. రోజూ పూజ, నైవేద్యం శ్రీనివాసునికే.

శ్రీనివాసునివే మొత్తం ఐదు మూర్తులు - మూలవిగ్రహం (శిలావిగ్రహం), భోగ శ్రీనివాస, ఉగ్రశ్రీనివాస, కొలువు శ్రీనివాస, మలయప్పస్వామి (ఉత్సవవిగ్రహాలు). ఇవన్నీ ఏకమూర్తి ప్రతిరూపాలే. నైవేద్యం ఎవరికి చేసినా మూలమూర్తికి చేసినట్లే. కాని ఇంకెవరికీ నైవేద్యం చేయరు. అందరి తరఫునా శ్రీనివాసునికే.

ఇంకా ఆలయంలో రాములవారి విగ్రహం, కృష్ణస్వామి విగ్రహం - ఇలా ఎన్నివున్నా - అన్నీ శ్రీనివాసుని క్రిందే లెక్కే. పూజానైవేద్యాలు అందరి తరఫునా శ్రీనివాసునికే.

అలా ఏకమూర్తి పూజ కొండపై సంప్రదాయంగా శతాబ్దాల కాలంగా జరుగుతూవచ్చింది. అంతేకాదు. 12, 13 శతాబ్దాల నుండి మఠాల్లో విగ్రహాలు పెట్టుకొన్నా, విడిగా పీఠాధిపతులు, మఠాధిపతులు, సాధకులు ఎవరు పూజచేసినా స్వామివారికి కైంకర్యం చేసి సమర్పింపబడిన తులసి, నిర్మాల్యాలతోనే. ఒక్క వరాహస్వామి ఆలయంలో మాత్రం ప్రత్యేకపూజ. మొదటి అభిషేకం - మొదటి నైవేద్యం. తర్వాతనే శ్రీనివాసుని పూజ. దానికి కారణం పురాణ భాగంలో చెప్పుకొన్నాం కదా! శ్రీనివాసునికి, వరాహునికి జరిగిన భూమి లావాదేవీ సమయంలో కుదిరిన ఒప్పందం దీనికి కారణం.

పుష్కరిణి వెనకాల విడిగా వున్న నారసింహుని విగ్రహాన్ని కూడా విమాన ప్రాకారానికి శ్రీరామానుజుల కాలంలో (స్వామికి ఈశాన్యంగా గట్టుమీద) ప్రతిష్ఠచేయటం కూడా కొండమీద 'ఏకమూర్తి' పూజా విధానం కొనసాగించడానికే.

కాని ఈ మధ్యకాలంలో నాలుగు మాడవీథులలో నాలుగు ఆలయాలు అన్న భావనతో కొత్త ఆలయాల నిర్మాణం కొండమీద జరగడం చూస్తున్నాం! ఆ ఆలయంలో పూజలు, నైవేద్యాలు విడిగా జరగడం మొదలైంది. ఆ ఆలయాలు కూడా తిరుమల-తిరుపతి దేవస్థానాల ఆధ్వర్యంలోకాక, మఠాల అధీనంలో నడుస్తున్నట్లు తెలుస్తోంది.

ఈ విషయం తిరుమల-తిరుపతి దేవస్థానం పునఃపరిశీలన చేసి 'ఏకమూర్తి పూజావిధానం' (వరాహమూర్తిని మినహాయించి) కొనసాగించేలా చూడాలి. శతాబ్దాలుగా తిరుమలలోని ఏకమూర్తి పూజని అలాగే కొనసాగించాల్సిన బాధ్యత వుంది. తిరుమలలోని అన్ని ఆలయాలు దేవస్థానం అధీనంలోనే వుండాలి అన్న నియమం, ఇతర ఆలయాలు వున్నా, అవి ఇతరుల అధీనంలోనూ, కొండమీద ఉండకూడదు అన్న విషయం గుర్తుంచుకోవాలి.

అనాలోచితంగా కొట్టడం, కట్టడం అనర్థమా?

మొదటి ప్రాకారం వైకుంఠప్రదక్షిణం బయటి గోడలపై 1250 నుండి 1380 వరకు దాదాపు 130 సంవత్సరాలు ఏ శాసనాలు చెక్కబడలేదు. అంటే చెప్పుకోదగ్గ లేదా చెక్కదగ్గ దేవదేయాలు ఇవ్వబడలేదని కాదు. ఆ రోజుల్లో ముసల్మానుల దాడుల నుండి హిందూమతాన్ని రక్షించాలని ప్రయత్నం చేసిన ఎందరో భక్తులు ఇక్కడ దానాలు,

దేవదేయాలు ఇచ్చారు. బుక్కరాయలు, సుందరపాండ్యన్, యాదవరాయ రాజు, మహిదేవ మహారాజు, వీరకుమారకంపన్న ఆలయానికి వచ్చినట్లు, దానాలు, దేవదేయాలు ఇచ్చినట్లు శాసనాలున్నాయి. అవి బాగా కనబడే గర్భాలయం కొత్త గోడలపైకాక అక్కడ ఇక్కడ మూలలలో ముఖ్యంగా వెండిద్వారం దగ్గర గోడల చివర, ప్రాముఖ్యం లేని ప్రదేశాల్లో చెక్కబడ్డాయి. గర్భగృహం బయటి గోడపై ఖాళీగా కొత్తశాసనాలు చెక్కకుండా వుంచేశారు. ఎందుకు?

ఏదో పెద్ద ఘనకార్యంచేసి దేవతలతో పోటీ పడదామనే ఆశయంతో మొదలుపెట్టాడు వీరనరసింహ యాదవరాయలు, పాతప్రాకారం పడగొట్టడాన్ని. గర్భగృహానికి కొత్త గోడలు, కొత్త ప్రాకారం - పైన విమాన గోపురం - రాగి తాపడం - బంగారు పూత... కాని పాత ప్రాకారం కొట్టడం, కొత్తవి కట్టడంలో, చేసిన పని గాని, పద్ధతి కాని అతనికే నచ్చినట్లు లేదు. అదివరకు గోడలపై ఉన్న శాసనాలు దెబ్బతినడం, విరిగిన పాతశాసనపు రాళ్లు కొంత అస్తవ్యస్తంగా ముక్కోటి ప్రదక్షిణంలో అతికించడం, పాతవి పడగొట్టినందుకు అతనిపై పండితుల నుండి, పెద్దల నుండి తట్టుకోలేని విమర్శలు రావడం - ఇంతా చేశాక, తాను నిర్మించిన కట్టడాలు, 'ఏకమూర్తి' సంప్రదాయానికి దోహదంగా లేకపోవడం, బహుమూర్తులను ప్రతిష్ఠించలేక పోవడం, చేతకాక ప్రదక్షిణాన్నే మూసివేయడం, ప్రదక్షిణం మూసి రాములవారి మేడ తయారుచేయడం... అంతా అతని జీవిత కాలంలోనే జరిగింది. ఎందుకు మొదలుపెట్టాడో, చేసి ఏమి సాధించాడో తెలియని పరిస్థితి.

ఆ తర్వాత వెంటనే మొదలైనాయి ముసల్మానుల దండయాత్రలు, హిందూ దేవాలయాల విధ్వంసం, ఇత్యాదులు. కొండపై ఆలోచనారహితంగా తొందరపాటులో చేసిన కొట్టడాలు, కట్టడాలే ఈ విధ్వంస పరిస్థితులకు, అనిశ్చిత వాతావరణానికి కారణం అన్న నమ్మకం ప్రజలలో కల్గింది... తిరుమలకు వచ్చిన ఇతర రాజులు, సామంతులు ధనికులు - ఈ వీరనరసింగుడు కట్టిన గోడలపై తమ దేవదేయాలు చెక్కించడానికి కూడా ఇష్టపడలేదు. అలా మొదటి ప్రాకారం (అంటే ఇప్పటి విమాన ప్రాకారం గోడలు ఏ శాసనం లేకుండా 130 సంవత్సరాలు పైగా వుండిపోయాయి.)

అప్పుడు ఆ ప్రాంతానికి శ్రీనివాసుని మహాభక్తుడు తిరువేంకటనాథ యాదవరాయలు సామంతుడుగా రాజ్యానికొచ్చాడు. అదే సమయంలో ఢిల్లీ సుల్తాన్ ముబారక్ 1316లో దక్షిణ భారతంపై ఇంకో దాడి చేయించాడు. తనపై జరగబోయే దాడి గురించి యాదవరాయలు జాగ్రత్తపడ్డాడు. ఆనాటి రాజు వీరబల్లాల తన

మహాప్రధాని సింగయ్యధన్నాయకుని సైన్యంతో, తన సామంతుడు తిరువేంకటనాథ యాదవరాయలకు సహాయంగానూ, సలహాదారుగానూ తిరుపతికి పంపుతాడు. ఈ ఇద్దరూ స్వామివారికి దేవదేయాలు, దానాలు సమకూర్చినా మొదటి ప్రాకారం గోడలమీద మాత్రం శాసనాలు చెక్కించలేదు.

ఈ ముస్లిం దండయాత్రలు జరుగుతుంటేనే, శ్రీరంగంనుండి శ్రీరంగనాథస్వామి ఉత్సవబేరాన్ని శ్రీవైష్ణవులు మోసుకొని నేరుగా కాకుండా, చుట్టూ తిరుగుతూ, ముస్లిముల కంటబడకుండా తిరుమల చేర్చారు. అక్కడ భద్రంగా ఉంచి రోజూ శ్రీరంగ ఆలయసంప్రదాయ బద్ధంగా పాంచరాత్ర ఆగమసేవలు అందుకుంటూ 1360 వరకు అక్కడే వున్నాడు శ్రీరంగనాథుడు... విజయనగర యువరాజు వీర కంపన్న ఆధ్వర్యంలో హిందూ రాజులూ, సామంతులూ కలిసి సుల్తానులను తరిమికొట్టారు. ధన్యవాద పూర్వకంగా ఆ హిందూ నాయకులందరూ స్వామివారికి దేవదేయాలు ఏర్పరచినా, వాటిని మొదటి ప్రాకారం గోడలమీద చెక్కించలేదు. ఖాళీ లేకపోయినా ఇతర ప్రదేశాలలో ఇరికించి చెక్కించారు. ఆ మొదటి ప్రదక్షిణం ఆ రోజుల్లో మూసివేశారు కనుక, ఆ లోపలికి వెళ్లే ప్రసక్తి లేదు. ఆ తర్వాత కాలంలో మూసివేసిన ఈ ప్రదక్షిణానికి ఆగ్నేయం, ఈశాన్యంలో ఇప్పుడున్న ద్వారాలు అమర్చి, ముక్కోటి ప్రదక్షిణంగా మార్చటం జరిగింది. ఈ మార్పుల వలననే అంతకు ముందు ప్రముఖంగా ఉండే విష్వక్సేనుడు బందిఖానాలో ఉన్నట్టుగా అయింది.

చివరి యాదవరాయలు శ్రీరంగనాథ యాదవరాయలు. అతనికి పిల్లలు లేరు. ఈ తిరుపతి ప్రాంతం విజయనగర రాజుల పాలనలోకి వచ్చింది. ఈ తొండ మండలానికి మంగిదేవ మహారాయలును మండలాధికారిగా నియమించారు. ఆ రాజకీయ పరిణామాలతోపాటు తిరుమల ఆలయం పరిపాలనా వ్యవహారాలలో కూడా మార్పులు వచ్చాయి. కొత్త స్థానత్తారు (ఆలయ ధర్మాధికారులు) నియమింప బడ్డారు. వారు తిరుపతి ప్రాంతంవారు. వారికి అక్కడ పరిస్థితులు తెలుసు కనుక మొదటి ప్రదక్షిణం గోడలలో ఏమీ తప్పులేదని, వాటిని వాడినందున హాని కలగదన్న భావనకొచ్చారు.

ఆలా దాదాపు 130 సంవత్సరాల తర్వాత, తిరుపతికి చెందిన 'అలగప్పిరానారే తిరుక్కలి కన్రి దాసర్' అనే మొదలియార్ల నాయకుడు, తన దేవదేయాన్ని 1380లో మొదటి ప్రాకారం దక్షిణపు గోడమీద శాసనంగా చెక్కించుకున్నాడు (1184).

ఆ తర్వాత శాసనం ములె తిరువేంకటజియ్యరు 1390 చెక్కించిన శాసనం. ఈ జియ్యరు అర్శినాలయం నందనవనానికి ముఖ్యకర్త, కార్యనిర్వాహక ధర్మకర్త. జియ్యంగారుగా అధికారంలోకి రావడమేకాక, తిరుమల ఆలయానికి స్థానత్తారు (ధర్మకర్తగా) కూడా నియమింపబడ్డారు. తర్వాత ఇతరశాసనాలు చాలావచ్చాయి. ఉత్తరపు గోడమీద మాత్రం మనకు దొరికే మొదటి శాసనం 1446 నాటిది. పెరియమల్లయ దేవమహారాజు చేసినది. ఆ తర్వాత సాలువ నరసింహరాయలు, కృష్ణ దేవరాయలు చేసిన శాసనాలు కన్పిస్తాయి. శాసనాలకు స్థలం చాలక ఆకాలంలోనే మొదటి ప్రాకారం ఉత్తరపు గోడను పొడిగించారు. విమాన ప్రదక్షిణంలో మనం ఈ విషయాన్ని చూడవచ్చు. ప్రాకారపు గోడను మాత్రమే పొడిగించారు. ఆ పొడిగించిన గోడ మీదే కనకమహాలక్ష్మి విగ్రహం ఉంటుంది.

★ ★ ★

26. గంగాళం హుండీ

ఈ మధ్య శ్రీనివాసుడి ఆలయానికి ఎదురుగావున్న వెయ్యికాళ్ల మంటపాన్ని దేవస్థానంవారు తొలగించినప్పుడు, కొన్ని వర్గాలనుంచి విమర్శలు వెల్లువెత్తాయి.

నిజానికి ఆలయంలో గానీ, ఆలయం చుట్టుపక్కల గానీ కట్టడాల్ని కూల్చడం లేదా కొత్తగా కట్టడం అనేది ఇప్పుడు కొత్తగా జరిగిన విషయంకాదు. గడచిన కొన్ని శతాబ్దాలలో చాలాసార్లు ఆలయం లోపల కట్టడాలను మార్పుచేశారు. నేను ఇలా చెప్తున్నది కొట్టడాలను గాని, కట్టడాలను గాని సమర్థించడానికో, విమర్శించడానికో కాదు. చారిత్రకంగా జరిగినవి చెప్తున్నాను. అది మంచిదా, చెడ్డదా - అన్నది వేరే పరిశీలిద్దాం.

★ ★ ★

మనం జయవిజయులను దాటి బంగారు వాకిలి గుండా స్వామి వారి దర్శనానికి వెళ్తుంటే ముందు ఒక చీకటి గది లాంటి దాంట్లో ప్రవేశిస్తాం. బంగారు వాకిలికి, రాములవారి మేడకు మధ్య వున్న ఈ గదిని స్నపన మండపం అంటారు.

ఇది ప్రాచీన కాలంలో గోడలు లేని మండపం. క్రీ.శ.966లో రాజకుమారి సమావాయి పేరిందేవి భోగశ్రీనివాసమూర్తి వెండి విగ్రహాన్ని ప్రతిష్ఠ చేసినప్పుడు, ఆ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలూ, అభిషేకాదులు ఈ మండపంలోనే జరిగాయని శాసనం చెబుతోంది. మనకున్న శాసనాల ఆధారంగా చూస్తే మొదట్లో ఈ మండపం గుండ్రని స్తంభాలతో వుండేదని తెలుస్తోంది. అంటే ఈ మండపానికి, శయన మండపానికి మధ్య అదివరకు మొదటి ప్రాకారం, ప్రదక్షిణం ఉండేవి. ఆ ప్రదక్షిణం బయట ఈ మండపం.

మొదటి ప్రాకారాన్ని కొట్టివేసి, గర్భగృహపు గోడలను పెంచి కొత్త ప్రాకారం కట్టి, ఆ ప్రాకారాన్ని కూడా మూసివేసి, రాములవారి మేడ కట్టినప్పుడు ఈ స్నపన

మండపం పశ్చిమ దిక్కున రాములవారిమేడకు గల ద్వారానికి (ఇప్పుడు ఉన్నది) ఇరువైపులా గోడలు కట్టించారు. అయినా దక్షిణ, ఉత్తర, తూర్పు వైపున స్తంభాలతో మండపం మాత్రం ఉండేది. గోడలుండేవి కావు.

తర్వాత భక్తులు ఎక్కువగా రావడం, కానుకలు పెరగడం, నగలను, ఇతర విలువైన వస్తువులను ఏరోజుకారోజు క్రింద తిరుచానూరు సభకు తీసుకువెళ్లడం కష్టం అనిపించి, వీటిని భద్రంగా దాచడానికి ఒక స్థలం కావలసివచ్చినప్పుడు - ఈ మండపాన్ని గదిగా మార్చే ప్రయత్నం జరిగింది. ఇది 15వ శతాబ్దపు మొదట్లో జరిగినట్లు శాసనాల ద్వారా తెలుస్తోంది. అప్పుడు మిగతా మూడువైపుల కూడా గోడలు కట్టడం, పాత గుండ్రటి స్తంభాల స్థానంలో పలకల స్తంభాలు, తూర్పు దిక్కున ద్వారం (ఈనాటి బంగారు వాకిలి) ఏర్పాటు చేయడం జరిగింది.

ఆ కాలంనుండీ, ఈనాటి వరకూ ఇది నగల భద్రతా గదిగానే వాడబడుతోంది. ఈ రోజుల్లో కూడా ఈ గదిలో దక్షిణపు గోడకు భద్రతా లాకర్లు, ప్రత్యేకంగా చేయించిన భద్రతా అలమారులు వున్నాయి. ఆ ప్రదేశంలోకి వెళ్లటానికి ఉన్న స్తంభాలను భద్రతకోసం ఇనుపకడ్డీలతో బందోబస్తు చేశారు.

ఈ గదిలోకి వెళ్లినప్పుడు మనం 4 స్తంభాలు చూస్తాం. ఎడంవైపు రెండు స్తంభాలు, కుడివైపు రెండు స్తంభాలు - దక్షిణం వైపు గోడకు ఈ స్తంభాలకు మధ్యప్రదేశాన్ని భద్రతాలాకర్లకు వాడటం జరుగుతోంది. కుడివైపు ఉన్న స్తంభాలకు ఉత్తరపు గోడకు మధ్య స్థలాన్ని, నిండిపోయిన హుండీలు, పరకామణి (లెక్కపెట్టడానికి తీసుకు వెళ్లేదాకా భద్రపరిచే) గదిగా వాడతారు. ఇందులోనే స్వామివారు రాత్రి పవ్వళించే బంగారు మంచాన్ని కొలువు శ్రీనివాసుని సింహాసనాన్ని కూడా భద్ర పరుస్తారు.

యాత్రికులు స్వామివారి దర్శనానికి ఎడమ కుడి స్తంభాల మధ్య దారిలో స్వామివారిని చూస్తూనే రాములవారి మేడ, ఆ తర్వాత శయన మండపం, కులశేఖరపడి (గర్భగృహం గడప) వరకూ వెళ్తారు.

1831లో ఏషియాటిక్ జర్నల్‌లో తిరుమల ఆలయపరిస్థితి గురించి ఆ నాటి కలెక్టరు రాసిన ఒక ప్రత్యేక వ్యాసం ప్రచురించబడింది. దానిలో ఈ స్నపన మండపం ప్రసక్తి ఉంది. అప్పటికే మూసివేసి, భద్రతాగదిగా వాడబడుతున్న ఈ గది మధ్యలో

అంటే నాలుగు స్తంభాలకు మధ్యలో యాత్రికులు, ముడుపులు, కానుకలు, కొప్పెర సమర్పించుకోడానికి వీలుగా ఒక పెద్ద గంగాళం (అంటే ఈ రోజుల్లో మనం హుండీ అనే గంగాళం) ఈ గదిలో ఉండేదట. దర్శనానికి వెళ్లేటప్పుడు ఈ గంగాళం పక్కగానే వెళ్లాలి. దర్శనం చేసుకొని వచ్చేటప్పుడూ ఈ గంగాళానికి ఇంకోవైపు నుండి రావాలి. అలాంటి గంగాళం - స్వామివారికి ఎదురుగా, వారి దృష్టి పడేట్లుగా వుండేదని ఆ వ్యాసంలో ప్రత్యేకంగా చెప్పబడింది.

ఈ స్నపన మండపాన్ని భద్రతాగదిగా మార్చిన రోజుల్లోనే - ఇప్పుడు ముఖమండపమని, తిరుమామ మండపమని, మణి మండపమని, ఆస్థానమండపమని, ఘంటామండపమని వేరు వేరు పేర్లతో పిలిచే మండపం నిర్మాణం చేయబడింది. అదే ఇప్పుడు బంగారు వాకిలికి, గరుడాళ్వార్‌కు మధ్యన ఉన్న మండపం. అందులోనే సహస్ర కలశాభిషేకం, తిరుప్పావడ, సుప్రభాతసేవ, ఆనివారి ఆస్థానం, ఉగాది ఆస్థానం అన్నీ జరుగుతాయి.

ఆ రోజుల్లో స్నపన మండపం చివర గరుడాళ్వారు ఉండేవారు. గరుడాళ్వారు ఇప్పుడున్నచోట ధ్వజస్తంభం, బలిపీఠాలుండేవి. ఈ స్నపన మండపాన్ని మూసివేసి గదిగా చేయడం జరిగింది. తర్వాత ముఖ ఆస్థానమండపం కట్టాల్సివచ్చినప్పుడు గరుడుని ఆస్థానమండపం చివరకు తూర్పుగా జరిపి, అక్కడవున్న ధ్వజస్తంభాన్ని, బలిపీఠాన్ని వెండివాకిలి బయటకు అంటే విమాన ప్రాకారాన్నుంచి బయటకు సంపంగి ప్రాకారానికి మార్చారు. ఇప్పుడు మనం చూస్తున్న ధ్వజస్తంభం - బలిపీఠం స్థలం. ఆ రోజుల్లో ప్రతిష్ఠ చేసిన ధ్వజస్తంభం శిథిలమైపోతే, 1982లో కొత్త ధ్వజస్తంభం, కొత్త బలిపీఠాల్ని ప్రతిష్ఠ చేయడం జరిగింది. ఆ అవకాశం భగవంతుడు నాకిచ్చి ప్రతిష్ఠ పూర్తిచేసేవరకు కైంకర్యానికి అవకాశం కల్పించాడు (అది పూర్తిఅయిన వారం రోజులకు నాకు తిరుమల నుండి బదిలీ అయింది).

స్వామివారి సుప్రభాత సేవ జరిగేది ఈ ఆస్థాన (ముఖ) మండపంలోనే. వేదపండితులు, భక్తులు చూస్తుండగా బంగారు వాకిలి తాళాలు తీస్తాడు గొల్ల మిరాశీదారు. జియ్యంగారుగాని వారి ఏకాంగి కాని, అర్చకులు, ఆలయ అధికారుల సమక్షంతో బంగారువాకిలికి వేసిన లక్క ముద్ర సీలు తీసి బంగారువాకిలి తలుపు తెరవడంతో సుప్రభాత సేవ మొదలవుతుంది. సుప్రభాతం చదివి స్తోత్రం చేస్తున్న సమయంలో తెరవెనుక ఆలయంలో, అర్చకులు, భోగశ్రీనివాసుని శయన

మండపంలోని ఉయ్యాల మంచం నుండి నిద్రలేపి, గర్భాలయంలోకి తీసుకువెళ్తారు. బంగారు ఉయ్యాల మంచం బయటకు పంపి, ఆలయంలోని దీపాలు సరిచేసి, శుద్ధి చేసి తర్వాత సుప్రభాతదర్శనం – ఆస్థానమండపం లేనప్పుడు ఈ కార్యక్రమం స్నపన మండపంలో జరుగుతూ ఉండాలి.

ఈ మధ్య కాలం వరకు ప్రతిరోజూ జరిగే స్వామి వారి కొలువు కూడా ఈ ఆస్థాన మండపంలోనే జరిగేది.

★ ★ ★

26. స్వామివారి కొలువు ఆస్థానం

స్వామి వారికి ప్రతిరోజూ ఉదయం తోమాలసేవ చేసి పూలు అలంకారం చేసిన తర్వాత, సహస్రనామ అర్చన చేసేముందు జరిగే సేవ కొలువు ఆస్థానం. ఇది చాలా విశేషమైనసేవ.

ఈసేవ గర్భగృహంలో ఉండే 5 బేరాలలోని, (విగ్రహాలలో) కొలువు శ్రీనివాసుడనబడే చిన్న శ్రీనివాస విగ్రహానికి చేస్తారు. సింహాసనం, అలంకారం, దీపాలు, ఇత్యాదులు ఏర్పాటుచేసి కొలువు శ్రీనివాసుని అర్చకులు తెచ్చి, సింహాసనంపై ఉంచుతారు.

స్వామివారిని స్తోత్రం చేశాక, పంచాంగశ్రవణం జరుగుతుంది. ఆ రోజు, తిథి, వారం, నక్షత్రం, యోగం, కరణం, అన్నీ చాంద్రమాన పంచాంగం ప్రకారం, తర్వాత ఇంగ్లీషు క్యాలెండరు ప్రకారం చెప్పే సంప్రదాయం వుంది. ఆ రోజు గురించేకాక, మరుసటి దినం వివరాలు కూడా చెప్పడం సంప్రదాయం... తిరుమల-తిరుపతి దేవస్థానాల అధీనంలో ఉన్న అన్ని ఆలయాలలో ఆ రోజుకానీ, మరుసటి దినంకాని జరిగే, జరగవలసిన అన్ని విశేషపూజలు, ఉత్సవాలు, తిరునక్షత్రాల వివరాలు చదవబడతాయి. మరుసటిరోజు పంచాంగం కూడా చదవడం ముఖ్య ఉద్దేశ్యం, ఆలయ అధికారులు మర్చిపోకుండా సేవలకు చేయాల్సిన ఏర్పాట్లు జ్ఞాపకం తెచ్చుకోవడానికి, ఏకారణాన్నైనా మర్చిపోయినా, ఒకరోజు ముందుగా జ్ఞాపకం చేసుకోవడానికి వీలుగా ఏర్పాటుచేశారు.

అర్చకులు స్వామివారికి పూజ చేస్తుంటే పురోహితులు, పండితులు పంచాంగశ్రవణం చేస్తారు.

దాని తరవాత జియ్యంగారు గాని, ఆయన గుమాస్తాగానీ క్రిందటి రోజు స్వామి వారికి వచ్చిన ఆదాయపు లెక్కల్ని – ఈ దర్బారులో చదివి స్వామివారికి సమర్పిస్తారు.

ముందు రోజు ఎన్ని హుండీలు నిండినవి? ఎన్ని లెక్కపెట్టారు? అలా లెక్కపెట్టిన వాటిలో వచ్చిన కొప్పెర (హుండీ) కానుక ఎంత? ధనరూపంలో ఎంత? నగలరూపంలో ఎంత? బంగారం ఎంత? వెండి ఎంత? అదికాక, ఆర్జితసేవలో వచ్చినది ఎంత? ప్రసాదం అమ్మకాల నుండి పోటు ద్వారా వచ్చిన ఆదాయం ఎంత? ఇలా అన్ని ఆదాయ వివరాలూ వ్రాసి ఆయా అధికారులు – అంటే దేవాలయ పేష్కారు, పోటు పేష్కారు, పరకామణి పేష్కారు అందరూ లెక్కలు తేల్చి పూర్తివివరాలు జియ్యంగారికి లిఖిత రూపంలో అందజేయాలి. అలా అందజేసిన వివరాలతో స్వామి వారికి ఈ ఆస్థాన సమయంలో చిట్టా సమర్పించి – వివరాలన్నీ చెప్పి ఆదాయమంతా స్వామివారి ఖజానాకు పంపడమైనదని లెక్కచెప్పాలి.

అలా ఏ రోజు ఆదాయానికి ఆరోజే రాత్రికి రాత్రి లెక్కలు పూర్తిచేసి, ఉదయం స్వామివారికి ఆస్థానం దర్బారులో అప్పచెప్పే సంప్రదాయం అనాదికాలంగా శ్రీవారి ఆలయంలో జరుగుతూవస్తూంది. అప్పుడు స్వామివారు 'మాత్రాదానం' చేస్తారు... ఆరోజు నైవేద్యాలకు కావల్సిన బియ్యం స్వామివారు లాంఛనప్రాయంగా అందచేస్తారు.

ఆ తర్వాత స్వామివారికి వేయించిన నువ్వులు, ఎండిన అల్లం, దేశీయ పంచదారతో నైవేద్యం పెడతారు. తర్వాత, వెన్న, తాంబూలం సమర్పించి కొలువుకు వచ్చిన అందరికీ ఆ ప్రసాదవితరణ చేసి, కొలువు శ్రీనివాసుని ఆశీర్వాదం అక్కడవున్న ఆలయ ముఖ్య అధికారికి అందించి, కొలువు శ్రీనివాసుని మరల శ్రీవారి గర్భాలయానికి తీసుకువెళ్తారు.

ఇది చాలా శోభాయమానమైన, ఆలయ కార్యనిర్వహణలలో చాలా ముఖ్యమైన సేవ. ఈ మధ్యకాలం వరకు బంగారు వాకిలి ముందు ఆస్థానమండపంలో పదినిమిషాలే ఐనా వైభవంగా జరిగేది ఈసేవ. ఈ సేవ తరువాత వెంటనే సహస్రనామ అర్చన మొదలౌతుంది.

ఈ రోజుల్లో యాత్రికుల దర్శనానికి ఏర్పాట్లు చేయాలి, క్యూ లైన్లు, ఎత్తుడు చెక్కలు, ఇతరక్షేమములు – ఇతర దర్శనం ఏర్పాట్లు చేసుకోవడానికి ఆస్థాన మండపంలో ఏర్పాట్లు జరగాలి కనుక ఈ ఆస్థానాన్ని లోపల స్నపనమండపంలో ఇప్పుడు చేస్తున్నారు.

ఈ ఆస్థాన మండపలోనే తిరుప్పావడ సేవ ప్రతి గురువారం జరుగుతుంది. బండెడు అన్నం పులిహోరలా చేసి నైవేద్యం-బలి చేస్తారు. భోగశ్రీనివాసుని జయవిజయులకు ఇవతలిదాక తీసుకువచ్చి, మూలవర్లు చూస్తుండగా అన్ని తలుపులూ

తీసి, నైవేద్యం చేసి హారతి ఇచ్చి, ఆ తర్వాత ఆ బలిని పేదలకు పంచేవాళ్లు. ఇప్పుడు యాత్రికులకు ప్రసాదాలుగా ఉచితంగా పంచుతారు.

అలానే ప్రతి బుధవారం సహస్ర కలశాభిషేకం కూడా ఈ మండపంలోనే. భోగశ్రీనివాసుని, మలయప్పస్వామిని శ్రీదేవి భూదేవితో సహా, విష్వక్సేనుని ఈ మండపంలోనికి తెచ్చి, మంత్రించిన జలాలు వెయ్యికలశాలలో ఉంచి అభిషేకం చేస్తారు.

ప్రతి పండుగనాడు- దీపావళి, ఉగాదికి, మకర సంక్రమణానికి జరిగే ఆస్థానాలు ఉత్థాన ద్వాదశికి జరిగే కౌశికపురాణ పఠనం కడా ఈ మండపంలోనే.

ఆనివారి ఆస్థానం కూడా - ఈ మండపంలోనే జరుగుతుంది. ప్రాచీనంగా వచ్చే సంప్రదాయం. చాలా నాటకీయంగా ఆ రోజు స్వామివారి ముందు జరుగుతుంది. ఆ రోజు తిరుమల-తిరుపతి దేవస్థానాలకు సంబంధించిన పై అధికారులందరూ (పూర్వం మిరాశీదార్లు కూడా) ఈ ఆస్థానానికి హాజరు అవుతారు. వారివారి అధికారపు సీళ్లను, లేదా వారి అధీనంలో ఉంచిన తాళం చెవులను స్వామికి సమర్పణ చేస్తారు. స్వామివారి సేవలలో వారు మరలా పునరంకితం అయినట్లు భావించి, వారివారి బాధ్యతాచిహ్నాలు వారికి మరల అందజేయబడతాయి. కార్యనిర్వహణాధికారి, ఇతర సీనియర్ అధికారులు, జియ్యంగారు, అర్చకులు, ఆచార్యపురుషులు అందరూ పాల్గొనే చక్కని ఆస్థానం ఇది.

ప్రాచీన కాలంలో ప్రతి సంవత్సరం జరిగే స్వామివారి కళ్యాణోత్సవం ఇక్కడే జరిగేది. తర్వాతికాలంలో కళ్యాణోత్సవాన్ని ఆర్జితసేవగా మార్చినప్పుడు కూడా కళ్యాణం ఇక్కడే జరిగేది. తర్వాత, కళ్యాణోత్సవ మండపం - విమాన ప్రాకారం నైఋతిదిక్కులో కట్టినప్పుడు (ఇప్పుడు అభిషేకం వూరేగింపు బయలుదేరే చోటు) అక్కడకు మార్చడం జరిగింది. పది నుండి 15 మందికి మాత్రమే ఈ స్థలం సరిపోయేది. అక్కడనుండి మహాద్వారం దగ్గర దక్షిణంగా ఉన్న రంగమంటపానికి మార్చబడింది. అక్కడ 20నుండి 25 కళ్యాణోత్సవాలకు మాత్రమే అవకాశముండేది. 1980లో సంపంగి ప్రాకారంలోనే దక్షిణ ప్రదక్షిణ భాగమంతా శుభ్రం చేయించి (వంటకోసం, వంటచెరకు, నేతి డబ్బాలతో నిండి ఉండేది). ప్రస్తుత కళ్యాణాలు జరిగే కళ్యాణ మండపాన్ని కట్టించి, వందల మందికి ఒకేసారి కళ్యాణోత్సవంలో పాల్గొనేలా చేసే అవకాశాన్ని భగవంతుడు నాకు కల్గించాడు.

తర్వాత కాలంలో కళ్యాణోత్సవాన్ని గుడిబయట చేయాలని దేవస్థానం తీర్మానం చేసి, గుడి బయట ఈశాన్యంగా పుష్కరిణి ఎదురుగా వైభవోత్సవ మండపం కట్టినా, అక్కడికి ఇంకా మార్చలేదు. ఆగమ అభ్యంతరాలు చూపి మార్చడానికి అర్చకులు ఒప్పుకోవడం లేదు. ఇదే అర్చకులు, ఇదే ఆగమ సలహాదారులు వ్రాతపూర్వకంగా కళ్యాణోత్సవం బయట చేయడం ఆగమ విరుద్ధం కాదని ఇచ్చిన సలహామేరకే ఈ వైభవ మండపం కట్టడం జరిగింది. తర్వాత ఆ అర్చకులూ, ఆగమ సలహాదారులే వారి అభిప్రాయం మార్చుకొని ఇతర ఆర్జితసేవలు - అంటే బ్రహ్మోత్సవం, వసంతోత్సవం, సహస్రదీపాలంకారసేవ/ఊంజల్ సేవలు, పద్మావతీ పరిణయం చేయవచ్చునీ, ప్రతిరోజూ స్వామివారికే చేసే ఆగమోక్త కళ్యాణంలో వైదిక హోమం జరుగుతోందని, ఆ హోమంతో చేసే కళ్యాణోత్సవం గుడి ప్రాకారాల్లోనే జరగాలన్నది వారి వాదన... ఇది తర్వాత కాలంలో వెయ్యికాళ్ల మండపం కూల్చడానికి, ఈ కళ్యాణోత్సవాల కోసం పెద్ద కళ్యాణ మండపం ప్రాకారంలోకి వచ్చేటట్లు చేయడానికి ఇంకో మహాప్రాకారం నిర్మించాలన్నంత వరకూ వెళ్లి, అది పెద్ద వివాదంగా మారి, ఆ వివాద పరిష్కారానికి ఒక త్రిసభ్య కమిటీని నా అధ్యక్షతనే నియమించడం జరిగింది. ఆ విషయాలు తర్వాత చర్చించుకొందాం.

ఈ మధ్యకాలం 1970/80 ల వరకూ ఈ మండపంలోనే, ఉదయం తిరుప్పావడ / సహస్రకలశాభిషేకం వంటి సేవలయినతర్వాత పరకామణి (అంటే హుండీలో వచ్చిన కానుకలు వేరుచేసి, లెక్కించే కార్యక్రమం) జరిగేది. ఆ రోజుల్లో హుండీ రోజుకు ఒకసారి లేదా రెండు సార్లు నిండుతుండేది. తర్వాత కాలంలో ఈ పరకామణిని విమాన ప్రాకారంలోని కళ్యాణ మండపానికి మార్చడం జరిగింది. ఆ తర్వాత అక్కడ స్థలం సరిపోక - విమాన ప్రాకారం, పశ్చిమ భాగాన్నంతా కట్టుదిట్టంగా భద్రతా ఏర్పాట్లు చేసి, అది వరకు ఉన్న పరిమళ గంధం అరలను, దేవస్థానాల ప్రచురణలు, కాలెండర్లు, డాలర్లు అమ్మే విభాగాన్ని అక్కడి నుంచి తీసేసి ఇప్పుడు ఆ ప్రదేశాన్ని పరకామణికి ఉపయోగిస్తున్నాం. పరకామణి విషయాలు వేరేచోట ప్రత్యేకంగా చర్చించుకొందాం.

ఇదే ఆస్థాన మండపంలోనే ఆ బంగారు వాకిలికి అటు ఇటు జయ విజయుల విగ్రహాలు ఉంటాయి. వాటికిరువైపులా ఒక్కొక్క పెద్ద గంట ఉండేది. స్వామివారి నైవేద్య సమయంలో ఇద్దరు శ్రీవైష్ణవులు నైవేద్యం అయ్యేంత వరకూ ఆ గంటలు

మ్రోగిస్తూనే వుండటం సంప్రదాయం. అందుకే ఈ మండపాన్ని మణి (ఘంటా) మండపం అని కూడా అంటారు.

కాని ఇప్పుడు చూస్తే ప్రస్తుతం రెండు గంటలూ ఒకే చోట - అంటే ఉత్తర భాగాన ఉన్న గంటను కూడా దక్షిణ భాగాన ఉన్న గంట ప్రక్కకు మార్చి, ఒకే వైష్ణవుడు రెండు చేతులతో రెండు గంటలు మ్రోగించే పద్ధతి 1801 - 1831 మధ్యకాలంలో మొదలైంది. ఆ రోజుల్లో దేవస్థానం ఈస్ట్ ఇండియాకంపెనీ వారి పరిపాలనలో ఉండేది. స్నపన మండపంలోని కానుకల గంగాళాన్ని అక్కడ మధ్యగా అడ్డంగా ఉందని ఎక్కడకి మార్చాలి అని యోచనచేసి, ఇప్పుడు హుండీ ఉన్న స్థానానికి మార్చడం జరిగింది. ఆ ప్రక్కనే గంట ఉండేది. అక్కడ హుండీ, భద్రతా సిబ్బందికే స్థలం చాలదు, యాత్రికులు హుండీకి ప్రదక్షిణగా తిరగాలి. అందుకు అక్కడి నుండి గంటను తీసి ఆ గంటను కూడా దక్షిణ భాగాన ఉన్న గంట దగ్గరకు మార్చడం జరిగింది. అలా ప్రస్తుతం ఉన్న హుండీ స్థాపన జరిగింది. హుండీ పక్కన భద్రతా సిబ్బంది నిలబడేచోట పాతకాలంలో గంట ఉండేది. ఆ కాలానికే ఆస్థానమండపం బయటి స్తంభాలకు కటకటాలు పెట్టి తలుపులు అమర్చడం కూడా జరిగింది.

★ ★ ★

28. యోగనరసింహస్వామి

విమాన ప్రాకారంలో ఈశాన్యంగా అరుగుమీద ఈ యోగనరసింహస్వామి ఆలయాన్ని చూస్తాం.

ఈ దేవాలయం 1330-31 సంవత్సరాల మధ్య కట్టబడి ఉండాలి. కొంచెం హడావుడిగా కట్టినట్లు అనిపిస్తుంది. ముస్లింల దాడి నుండి రక్షించేందుకు అహోబిల నరసింహుని లేదా షోలింగపురం నారసింహుని విగ్రహాలు భద్రపరచడానికి కట్టి ఉండవచ్చని కొందరు చరిత్రకారుల అభిప్రాయం. కాని ఆ దేవాలయాల నుండి విగ్రహాలు ఇక్కడికి వచ్చినట్లులేవు.

పురాణకాలంలో పుష్కరిణికి వెనుక భాగాన ఒక నారసింహ ఆలయం ఉండేదనీ, మహారుద్రుడు ఈ నారసింహుని గురించే తపస్సు చేశాడనీ ఐతిహ్యం ఉంది. ఆ నారసింహుని విగ్రహాన్నే సంపంగి విమాన ప్రాకారాలు కడుతున్నప్పుడు ఇక్కడికి మార్చి ఉండవచ్చని ఒక వాదన. ఇప్పుడు పుష్కరిణి వెనుక నరసింహదేవాలయం లేదు. లోపలవున్న ఈ యోగనారసింహుడు ఆ నారసింహుడై ఉండవచ్చు. తిరుమల దేవాలయంలోని అన్ని ఆలయాలు, విగ్రహాలతో పోలిస్తే అన్నిటికన్నా ఎత్తులో ప్రతిష్ఠ చేయబడిన మూర్తి ఇదే.

కందాడై రామానుజ అయ్యంగారు 1469లో ఈ విగ్రహానికని నైవేద్యానికి దేవదేయం ఏర్పాటుచేశారు. కాని అదివరకు మనం చెప్పుకొన్నట్లు ఈ ఆలయంలో ఎవరి పేరున చేసినా అది వేంకటేశ్వరునికే. ఈ నరసింహుని పేరున శ్రీనివాసునికే లోపల నైవేద్యాలు - అలానే ఉత్థాన ద్వాదశినాడు ఈ నారసింహునికి అవతలివైపున ఉన్న వరదరాజ స్వామికి నైవేద్యానికని ఆలయ గుమాస్తాలు చేసిన దేవదేయం ప్రస్తావన కూడా ఒక శాసనంలో ఉంది. ఆ నైవేద్యాలూ లోపలి శ్రీనివాసునికే.

ఈ విమాన ప్రాకారంలో ఆగ్నేయం మూలలో ఉన్న వరదరాజస్వామి ఆలయం ఎందుకు కట్టారో తెలియదు. 14వ శతాబ్దంలో కట్టినదై ఉండవచ్చు. కంచి వరదరాజ స్వామిని ఉంచడానికి (ముస్లింల బారి నుండి రక్షించడానికి తీసుకురాబడితే) కట్టి ఉంటారని కొందరు చరిత్రకారుల ఉద్దేశ్యం. కంచి విగ్రహాలు రానందున తర్వాతికాలంలో వరదరాజ ప్రతిష్ఠచేసి ఉంటారని తెలుస్తోంది.

★ ★ ★

29. తిరుమలలో తమిళ ప్రబంధాలు

తిరుమల ఆలయంలో మొదటి నుండీ వైఖానస, ఆగమ ప్రకారమే పూజావిధానం. పురాణకాలంలో భగవంతుడు గోపాలకృష్ణుడు గోపీనాథుని ఆదేశించి పంపినప్పటినుండీ కొనసాగుతున్న అర్చనావిధానం ఇదే.

వైఖానస అర్చనావిధానం మరీచి సంహిత ఆధారంగా శాస్త్రోక్తమైన పూజావిధానం. వైఖానసముని ప్రతిపాదించిన సంస్కృత శాస్త్ర మంత్ర యుక్తమైనదీ పూజావిధానం. అందులో మార్పు చేయడానికి వీలులేదు. మార్పులు చేసే ప్రయత్నమూ ఎవరూ చేయలేదు. యామునముని గాని, తిరుమల నంబి గాని తరువాత వచ్చిన రామానుజులు గాని, ఆతర్వాత వచ్చిన ఆనంతాచార్యులు కాని, వారు ప్రోత్సహించిన ఏకాంగులు, జియ్యంగార్లు, ఆచార్య పురుషులు ఎవరూ ఈ పూజావిధానం మార్చడానికి ప్రయత్నించలేదు. ఈ నాటికీ ఆ పూజావిధానమే కొనసాగుతూంది.

మరి సంస్కృత శాస్త్ర మంత్ర సంబంధమైన విధానంలో, ద్రవిడ ప్రబంధాలు, అధ్యయనోత్సవాలు, అందులో ఆళ్వారుల రచనలు లేదా అళ్వారుల జీవిత విశేషాలు లేదా కొందరు అళ్వారులను దైవత్వంకల మునులుగా పేర్కొనే రచనలు తిరుమలలో పారాయణచేయడం వైఖానస ఆగమసమ్మతమా? వైఖానస ఆగమం – ద్రవిడ భాషలోని స్తోత్రాలు కాని ప్రబంధాలను సమ్మతించదు. మరి ఈ సంప్రదాయం ఎలా వచ్చింది? ఎప్పుడు వచ్చింది? అన్న ప్రశ్నలు వస్తాయి. రామానుజుల కాలంలో ప్రవేశపెట్టిందా? అంతకు ముందు ఉందా? లేదా రామానుజుల కాలం తర్వాత వచ్చిందా? వీటికి సమాధానాలు చారిత్రక ఆధారాలపై లేదా దేవాలయంలో దొరికిన శిలాశాసనాలపై ఆధారపడే సేకరించాలి.

తిరుమల ఆలయంలో ఆళ్వారుల విగ్రహాలు లేవు. కాని రామానుజుల విగ్రహం విమాన ప్రాకారంలో ఉంది. దాని ప్రతిష్ఠకు, ఈ ద్రవిడ ప్రబంధపారాయణకి సంబంధం ఉందా? రామానుజుల విగ్రహ ప్రతిష్ఠ ఎప్పుడు జరిగింది? దానికి వైఖానసులు

ఒప్పుకొన్నారా? ఒప్పుకోకపోతే విగ్రహప్రతిష్ఠ ఎలా జరిగింది? ద్రవిడ పారాయణ సంప్రదాయం ఎలా వచ్చింది?

రామానుజులు తిరుమలలో శ్రీనివాసునికి చేసిన సేవ అందరూ ఒప్పుకొనేదే. వైఖానసులు, పాంచరాత్రులు, ఇతర వైష్ణవులు భేదం లేకుండా ఒప్పుకొంటారు. తిరుమలలో దేవుడు శ్రీమహావిష్ణువే అని ఇదమిత్థమైన నిర్ణయం చేయడానికి శ్రీరామానుజులే కారణం. విగ్రహానికి శంఖచక్రాలు అమర్చడం కూడా శ్రీరామానుజుల ద్వారానే జరిగింది. తిరుమలనంబి వేంకటాచలంలో శ్రీనివాససేవ చేసేవాడు. అతని కాలంలో కూడా అతను ఆకాశగంగ తీర్థం స్వామివారికి తెచ్చి సేవచేసే సరిపెట్టుకున్నాడు. కానీ, తాము నమ్మిన ఆళ్వారుల తమిళపాశురాలు తిరుమల దేవాలయంలో చదివే ప్రసంగం కాని, ప్రయత్నం గాని చేయలేదు. ఆకాశగంగ, పాపనాశనం తీర్థాలనుండి తీర్థం తెచ్చేటప్పుడు, దారిలో తిరుప్పావై పారాయణ చేసేవాడని తెలుస్తోంది. ఆలయంలో గాని, మాడవీథుల ఉత్సవాల్లో కాని కాదు. రామానుజులు మొదట అద్వైతగురువు యాదవ ప్రకాశులవద్ద సంస్కృత శాస్త్రం అభ్యసిస్తున్నప్పుడు, గురుశిష్యులకు భేదాభిప్రాయంవచ్చి, రామానుజులు వేరే గురువును వెతుక్కోవాల్సిన పరిస్థితి. తన మేనమామ తిరుమలనంబి దగ్గర తిరుమలలో రామాయణాది శాస్త్ర గ్రంథపఠనం చేశారు... తర్వాత తర్వాత రామానుజులు మంచి పాండిత్య ప్రతిభ సంపాదించి, బ్రహ్మసూత్రాలకు భాష్యం రచించి శ్రీవైష్ణవ సంప్రదాయ నాయకుడుగా ఎదిగారు. అలా గొప్పవాడైనాక తిరుమలకు వచ్చిన రామానుజులకు మోకాళ్ల పర్వతం దగ్గర కొండమీద నుండి ఆలయమర్యాదలతో తిరుమలనంబి, ఇతరులు వచ్చి ఆహ్వానించినట్లు ఆధారాలున్నాయి. అక్కడే నడిచే దారిలో ఇప్పటికీ త్రోవ 'భాష్యకారుల సన్నిధి'గా పిలువబడే రామానుజుల గుడి ఉన్నది.

రామానుజుల కాలంలో కూడా పూజావిధానాలలో సంస్కరణలు చేసినా, తమిళ ప్రబంధ పారాయణం వంటివి ప్రవేశపెట్టలేదు. తిరుమలలో ఆళ్వారుల విగ్రహాలు పెట్టడానికి ప్రయత్నించలేదు. పాంచరాత్రులు, శ్రీవైష్ణవుల పద్ధతిలో తమ గురువులు, వారి గురువులు అలా నమ్మాళ్వార్ దాకా గురుపరంపర చెప్పుకొని స్తుతిచేయడం సంప్రదాయం. తన సూత్రభాష్యానికి అలాంటి సంప్రదాయం పాటించలేదు శ్రీరామానుజులు. పరబ్రహ్మ శ్రీనివాసుని మాత్రమే తలవడం విశేషం. తిరుపతిలో గోవిందరాజస్వామి ఆలయనిర్మాణం, విగ్రహప్రతిష్ఠ, రామానుజపురం నిర్మాణం, తిరుమలలో ఏకాంగి పద్ధతి ప్రవేశం – ఇత్యాది చాలా విషయాలలో సంస్కరణలు

ఆయన చేశారు. రాజు యాదవ రాయలు శిష్యుడై, రామానుజుని గురువుగా భావిస్తాడు. అయినా మిగతా అన్ని దేవాలయాలలో పాంచరాత్రం ప్రవేశపెట్టిన రామానుజులు, కొండమీద తిరుమలలో వైఖానసం మార్చే ప్రయత్నం చేయలేదు సరికదా, తాను తిరుపతిలో కట్టించిన గోవింద రాజస్వామి ఆలయంలో కూడా కొండమీద లాగా వైఖానస ఆగమ పద్ధతి ప్రవేశపెట్టారు. ఆ కాలంలో తమిళ ప్రబంధం చదివే పద్ధతి తిరుమలలో లేదు.

రామానుజులు పరమపదం చేరాక 1200 ప్రాంతంలో తిరుపతిలో రామానుజుల విగ్రహప్రతిష్ఠ జరిగినట్లు శాసనాలున్నాయి. కొండకు వెళ్లే దారిలో మోకాళ్ల పర్వతం దగ్గర భాష్యకారుల సన్నిధి కూడా ఆకాలంలో వచ్చినట్లుగానే భావిస్తారు శ్రీవైష్ణవులు. – తిరుమల కొండ మీద కూడా రామానుజుల విగ్రహం అదే సమయంలో ప్రతిష్ఠింపబడినట్లు భావిస్తారు.

కాని రామానుజుల సన్నిధి విమాన ప్రాకారంలో ఉంది. అది ప్రాకారంలో ఉత్తరపు గోడకు చేర్చి ఉన్న మండపంలో ఉంది. తిరుమామణి మండపానికి (ఇప్పటి హుండీకి) ఎదురుగా ఉన్న ఈ సన్నిధికి, మణిమండపానికి మధ్య విమాన ప్రదక్షిణం ఉంది. ఉత్తరపు గోడవెంబడే కట్టబడిన మండపంలో చిన్న గది ఏర్పాటుచేసి, రామానుజ విగ్రహప్రతిష్ఠ చేశారు. ముందు ఉన్న మండపం తర్వాతి కాలంలో కట్టబడింది. అంటే విగ్రహప్రతిష్ఠ రెండవ ప్రాకారం గోడ, దానితోపాటు కట్టిన మండపానికి ముందు కాలంలోది మాత్రం కాదు కదా (ఇంకో చోట ప్రతిష్ఠ చేసిన విగ్రహాన్ని తర్వాత కాలంలో ఇక్కడికి మార్చివుంటే తప్ప)?

ఈ ఉత్తర ప్రాకార గోడ మంటపాలు – 15వ శతాబ్దం మధ్య భాగంలో కట్టబడినట్లు ఆధారాలున్నాయి. రామానుజుల సన్నిధి గురించి మనకు తిరుమల ఆలయంలో దొరికిన శాసనాలు అన్నీ 1469 నుండే లభ్యంగా ఉన్నాయి. తిరుపతి ఆలయంలో 1220 నుండి రామానుజ సన్నిధి ఉన్నట్లు తెలుస్తున్నా – కొండమీద ఈ సన్నిధి ఉన్నట్లు ఏ శాసనం – 1469కి ముందు లేదు. కందాడై రామానుజ అయ్యంగారు చేసిన దేవదేయంలో దీని ప్రసక్తి ఉంది. 1476లో రామానుజ సన్నిధిలో మూడు అధ్యయనోత్సవాలు చేయడానికి ఏర్పాటు జరిగింది. అది కూడా అప్పటి ఆలయ అర్చకుల పూర్తి ఆమోదం ఈ ఉత్సవానికున్నట్లు తెలియడంలేదు. ఈ దేవదేయం కందాడై రామానుజ అయ్యంగారు పేరున చేసినా అసలు దాత ఆయన శిష్యుడు మొదలియార్ల నాయకుడు, శ్రీవైష్ణవుడైన – శఠగోపదాసర్ నరసింహాచారి

(రాయ–మొదలియార్). ఆ శాసనంలో మొదటిసారి గుళ్లో ఇప్పుడున్న శ్రీరాముల విగ్రహాల ప్రసక్తి వస్తుంది. ఈ విగ్రహం మొదటి ప్రాకారం మూసివేసిన గట్టుపై పెట్టబడి, తర్వాతి కాలంలో రాములవారి మేడగా ప్రసిద్ధి కొచ్చింది. ఆ రాముల వారికి నైవేద్యం కోసం చేసిన దేవదేయం అందులోనే రామానుజుల సన్నిధిలో 12 రోజులపాటు అధ్యయనోత్సవం చేయడానికి, నైవేద్యాలకు... దానితోపాటు 12 మంది ఆళ్వారుల తిరునక్షత్రంనాడు ఉత్సవాలు చేయడానికి, వారి పాశురాలు, తమిళస్తోత్రాలు రామానుజ సన్నిధిలో చదవడానికి ఏర్పాటు చేసిన దాన పత్రం. ఆ శాసనంలో – బ్రాహ్మణ శ్రీవైష్ణవులతోపాటు, చాత్తాద శ్రీవైష్ణవులు (బ్రాహ్మణేతరులు) కూడా ఈ అధ్యయనోత్సవంలో 12 రోజులూ ప్రబంధం పాడేవారని ఉంది. ఈ కొత్త సంప్రదాయం ప్రవేశపెట్టడానికి ప్రధానకారకుడు కందాడై రామానుజ అయ్యంగారు. అంటే అంతకుముందు ఈ సంప్రదాయం తిరుమల ఆలయంలో లేదని తెలుస్తోంది. ఇప్పుడు కూడా స్వామి సన్నిధిలో కాక బయట విమాన ప్రాకారంలో ఉన్న రామానుజ సన్నిధిలోనే అని తెలుస్తోంది.

వైఖానసంలో సంస్కృత స్తోత్రాలు తప్ప తమిళ పారాయణ ఒప్పుకొనేది లేదు. వైఖానస బ్రాహ్మణులే తప్ప ఇతర బ్రాహ్మణులు శ్రీవైష్ణవులుగా మారినా, వారికి వైఖానస అర్చనార్హత లేదు. అంటే వైఖానసుడుగా పుడితేనే, ఆ అర్హత అని వైఖానసుల సంప్రదాయం. ఇక్కడ ఆళ్వారుల ప్రభావంతో బ్రాహ్మణేతర చాత్తాద శ్రీవైష్ణవులు కూడా ద్రవిడ ప్రబంధ పారాయణాధికారులుగా రామానుజుల సన్నిధిలో అధ్యయనోత్సవం చేయడం వైఖానసులకు సమ్మతం కాదు.

ఈ కొత్త సంప్రదాయమైన అధ్యయనోత్సవాలు, ఇతర పాంచరాత్ర ఆలయాలలో వారు కూడా శ్రీవైష్ణవులు, పాంచరాత్రులైనా – తమిళ ప్రబంధ పారాయణకు చాలాచోట్ల ఆలయాలలో వ్యతిరేకత వచ్చింది. సంస్కృతం మాత్రమే దేవాలయాల అర్చనలకు యోగ్యమనే సాంప్రదాయికులకు – ద్రవిడం కూడా యోగ్యమని వాదించే శ్రీవైష్ణవ భక్తి వాదులకు మధ్యనే ఈ వివాదం. జ్ఞానం కన్నా భక్తి ముఖ్యమన్నది వాదన. సంస్కృతం జ్ఞానానికి చిహ్నమైతే, అందరికీ అందుబాటులో ఉండి అర్థమయ్యే తమిళం భక్తికి చిహ్నంగా మారింది. ఆరోజుల్లో తమిళంలో దేవాలయంలో పారాయణం చేస్తే ఆలయం మైలపడినట్లు భావించే రోజులు. వేదాంత దేశికులు (13–14 శ.) శ్రీవైష్ణవాన్ని పునఃప్రతిష్ఠ చేసిన మహామహులు. ఆయన సంస్కృతానికి వున్న విలువ ద్రవిడ ప్రబంధాలకూ వుందని చాటిచెప్పిన భక్తి మార్గ పండితుడు.

రంగనాథస్వామి విగ్రహాన్ని తీసుకొని ముస్లింల బారినపడకుండా పారిపోయి, తిరుమలలో ఉండి మరల తిరిగి శ్రీరంగానికి విగ్రహాలు తెచ్చినప్పుడు 1348లో అధ్యయనోత్సవాలు చెయ్యాలని సంకల్పించినపుడు – శ్రీరంగం దేవాలయంలో తమిళ ప్రబంధ పారాయణానికి వ్యతిరేకత వచ్చింది. అప్పటి సేనాధిపతి గోపన్న ఒక సభ ఏర్పాటుచేశారనీ, వేదాంత దేశికులు ఆయనను తన వాదనతో తృప్తిపరిచి అధ్యయనోత్సవాలు తమిళంలో చేయించారనీ చరిత్ర చెబుతోంది. ఇది పాంచరాత్ర ఆలయాల విషయం. శ్రీవైష్ణవులు అర్చకులుగా ఉన్నచోట జరిగినది. అక్కడే అంత వ్యతిరేకత వస్తే కొండమీద వైఖానసులు ఉన్నచోట – వ్యతిరేకత రాదా? – మరి ఈ సంప్రదాయం అమలులోకి ఎలా వచ్చింది? అది ఈ నాటికీ ఎలా కొనసాగుతోంది? తిరుమల నంబి వంటి భక్తుడు కూడా సంస్కృతంలో మంత్రపుష్పం పఠించగలిగాడే కాని తిరుమల ఆలయంలో తమిళ ప్రబంధం చదివే, పాడే యత్నం చేయలేదు కదా! తర్వాత రామానుజులూ చేయలేదు. అనందాళ్వారు కూడా చేయలేదు. ఆయన రచించిన వేంకటేశ ఇతిహాస మాల కూడా సంస్కృతంలోనే.

మనకు లభ్యమవుతున్న శాసనాల ప్రకారం, 1360కి ముందు తమిళ ప్రబంధం తిరుమల ఆలయం లోపల చదివినట్లు దాఖలాలు లేకపోగా, తిరుమలలోనే ఎక్కడా చదివినట్లు దాఖలాలు లేవు.

ఆ సంవత్సరం మొట్టమొదటి సారి స్వామివారి బ్రహ్మోత్సవాలలో స్వామివారి ఆలయ గోపురానికి ముందు, స్వామివారిని ఆలయంలోనికి తీసుకువెళ్లడానికి ముందు నమ్మాళ్వార్ రచించిన తిరువాయ్‌మొళి స్వామివారి ఉత్సవ విగ్రహాల ముందు పారాయణ చేసినట్లు తెలుస్తూంది. అది జరిగింది తూర్పు మాడవీథిలో ఆలయం బయట.

దీని తర్వాత ప్రయత్నం ఆలయం లోపల పారాయణ చేయడానికి 1475లోనో, అంతకు కొద్ది ముందుగానో చేసిన ప్రయత్నం. అదీ విమాన ప్రాకారంలో రామానుజ సన్నిధిలోనే. ఆలయం లోపల కాదు. ఆనాటి శాసనాలు కూడా నైవేద్య విషయాలు దేవదేయాల ప్రసక్తి చేశాయి. 1476లో మాత్రం బ్రాహ్మణేతర శ్రీవైష్ణవులు కూడా రామానుజ సన్నిధిలో ప్రబంధపారాయణం చేశారని ఉంది. దీనికి వ్యతిరేకత వైఖానసఅర్చకుల నుండి వుండేది. ఈ ప్రబంధపారాయణం దేవుని సన్నిధిలో కాదు కదా, బయట ప్రాకారంలో. వారి సంప్రదాయం ప్రకారం రామానుజుల సన్నిధిలో కదా అని సర్దుకుపోయి ఉండవచ్చని ఒక భావన.

చరిత్ర అంతకంటే ముఖ్యమైన ఇంకొక కారణం చెబుతుంది. అదే రోజుల్లో తిరుమల ఆలయ వైఖానస అర్చకులు స్వామివారి ఆభరణాలు దొంగిలించారనో (లేదా తమ ఆడవారికి, ఆలయ సానులకు అలంకరింపచేశారనో) పెద్ద ఆరోపణవచ్చి, రాజు వారిని దండించి, కొండమీద వారికి అర్చకత్వం చేసే అధికారమే కోల్పోయే పరిస్థితి వచ్చింది. అలా వైఖానసులు చాలా బలహీన పరిస్థితులలో ఉన్నప్పుడు, శ్రీవైష్ణవులు చూచి ఈ సంప్రదాయాన్ని రామానుజుల సన్నిధిలో ప్రవేశపెట్టినట్లు ఒక వాదన.

ఏదైతేనేం, యాదవ రాజులు పరిపాలించే కాలంలో రాజుల ఆదరణ శ్రీవైష్ణవులకే వుండేది. దీని ప్రభావం ఆలయంలోకి కూడా ప్రవేశించింది. విజయనగర రాజుల కాలంలో శ్రీవైష్ణవ జియ్యంగార్లు దేవాలయ ధర్మకర్తలలో ఒకరుగా ఉండి ముఖ్యపాత్ర నిర్వహించేవారు. 1500 సంవత్సరం దాటేనాటికి ఆలయంలో పంచరాత్ర పద్ధతులు, సంప్రదాయాలు కొద్దికొద్దిగా మొదలై, తరువాతి కాలంలో అందరి ఆమోదం పొందినవై – ఈ నాటికీ ఎవ్వరు ఆక్షేపించలేని సంప్రదాయంగా మారాయి.

తెలుగుమీద అభిమానంవున్నవారు, తమిళ ప్రబంధ పారాయణ జరుగుతోంది కనుక, తెలుగులో కూడా శ్రీనివాస సంకీర్తనలు తిరుమల ఆలయంలో పాడే అవకాశం కల్పించాలని ఆనాటి రాజుల పై వొత్తిడి తేవడం జరిగింది. అదే కాలంలో తాళ్లపాక అన్నమాచార్యులు తిరుమలకొండకు వచ్చి స్వామి వారి అనుగ్రహం పొంది స్వామివారిపై సంకీర్తనలు రాసి పాడటం ప్రారంభం అయ్యింది. విజయనగర రాజు సాళువ నరసింహరాజు అన్నమయ్యను ఆలయంలో 'సంగీతాచార్యుడుగా' నియోగించి, స్వామివారి ముందు గానం చేసే విధానం ఏర్పరిచారు. ఆరోజుల్లో అన్నమాచార్యులే – సుప్రభాత సమయంలో, స్వామి కళ్యాణోత్సవం సందర్భాలలో ఏకాంత సేవలో తెలుగుకీర్తనలు గానంచేసే సంప్రదాయం మొదలైంది. తర్వాత కాలంలో అదికూడా ఒక మిరాశీగా (వంశపారంపర్యహక్కుగా తయారై) ఈనాటికీ, అన్నమాచార్యవంశీయులు తిరుమల ఆలయంలో ఈ సేవాసమయాల్లో కైంకర్యం చేయడం మనం చూస్తున్నాం. విపులంగా అన్నమయ్య వారి వంశీకుల గురించి తర్వాత చెప్పుకొందాం.

★ ★ ★

30. తిరుమలేశుడి అసలు రూపం

తిరుమలలోని శ్రీనివాసుడి విగ్రహం ఏ ఆగమ శాస్త్రానుసారంగా (చెక్కబడింది) వెలసింది?

అసలు ఏదైనా ఒక ఆగమ శాస్త్రానికి అనుగుణంగా వుందా? ఎలాంటి ఆగమ ప్రమాణాలు పాటించబడలేదా? ఆ విగ్రహం వర్ణన ఎలా వుంటుంది?

★ ★ ★

శ్రీవారి తిరుమల ఆలయంలోని గర్భగృహంలో ఈనాడు మనం చాలా విగ్రహాలు చూస్తాం. లోపల ఎన్ని విగ్రహాలున్నా, అక్కడ జరిగేది ఏకమూర్తి పూజే. అంటే జరిగే పూజానైవేద్యం కైంకర్యాలన్నీ ధ్రువబేరానికే. ధ్రువబేరం అంటే మూలమూర్తి – శిలా విగ్రహం. ఎవరూ ప్రతిష్ఠించింది కాదు – పద్మపీఠంపై ఉన్న అచల ప్రతిమ... పురాణ భాగంలో ఈ విగ్రహం గురించి మొదట శంఖరాజు భగవంతుని ఆజ్ఞగా తాను భగవంతుని ఎలా చూశాడో అలాగే విగ్రహం చేయించాడని, తర్వాత కాలంలో నిషాదునికి వరాహస్వామి శ్రీనివాసుని వృత్తాంతం తెల్పి తొండమానుని సాయంతో ఈ విగ్రహాన్ని పుట్టలోనుండి తీయించి ఆలయం కట్టించమన్నాడనీ..., పద్మావతీ శ్రీనివాసుల కళ్యాణం తర్వాత తొండమానుడు కట్టించిన 3 ప్రాకారాల రెండుగోపురాల 7 ద్వారాల ఆలయంలో శ్రీనివాసుడుండేవాడనీ... యోగులకు, దేవతలకు, తపస్సంపన్నులకే కన్పడేవాడనీ... అప్పుడే బ్రహ్మదేవుడు భగవంతుని అర్చామూర్తిగా కలియుగాంతం వరకూ ఇక్కడ ఉండి, పాపులను ఉద్ధరించి వారి పాపాలు నాశనం చేసి, లోకాలను రక్షించమని కోరాడనీ... బ్రహ్మ ప్రార్థన మన్నించి స్వామి అర్చామూర్తిగా శ్రీవేంకటాచలంపై ఉన్నాడనీ చెప్పుకొన్నాం. శంఖరాజు, తొండమాను కట్టించిన దేవాలయాలు శిథిలమైనాయి. ఇప్పుడున్నవి వారు కట్టించినవి కావు... ఇప్పుడున్న విగ్రహం ఎవరో ప్రతిష్ఠించినట్లుగా ఇతిహాసమూ లేదు, శాసనాలూ లేవు.

ఇది స్వయంభూ... స్వయంవ్యక్తం. స్వామివారి ఇచ్ఛానుసారం శిలారూపిగా నిల్చిన చోటు, ఇక్కడ మహాభారత చివరిపర్వంలోని ఘట్టం - స్మరణచేయాలి.

బోయవాని (వాలి ఇంకొక అవతారం అని - భృగు ఆవేశమనీ చెప్తారు) బాణం శ్రీకృష్ణుని పాదానికి తగిలిందనీ, ఆ బాణానికి ముక్కు భాగంలో, యాదవ వంశానికి దుర్వాసుని శాపంతో పుట్టిన ముసలాన్ని అరగతీయగా మిగిలిన చిన్నముక్కను తగిలించి ఈ నిషాదుడు బాణంతో శ్రీకృష్ణుని కొట్టాడనీ, మునిశాపంతో చివరి యాదవుడైన శ్రీకృష్ణుడు అవతారం చాలించాడనీ, అలా చేసేముందు ఆ వేటగాడిని ఉద్ధరించాడనీ, ఈ విశేషం చూడడానికి బ్రహ్మాదిదేవతలు అక్కడకు వచ్చి స్వామిని స్తోత్రంచేసి "స్వామీ, నీవు వైకుంఠానికి వెళ్తే నీ దర్శన భాగ్యం దుర్లభం అవుతుంది. ఎందుకంటే మేము ఈ ముక్త జీవులుగా ఆముక్త స్థానానికి వచ్చి నీదర్శనం చేసుకోలేం. మాకు అందుబాటులో ఉండేలా అనుగ్రహంచేయ ప్రార్థించారనీ", శ్రీకృష్ణుడు అనుగ్రహించి సూర్యమండలాన్ని ప్రవేశించి, తాను అర్చావతారిగా తన రూపాన్ని బ్రహ్మాది దేవతలను చూడమని చెప్పి తాను వేంకటాచలంలో కలియుగాంతం వరకూ ఉంటాననీ, అలా తనను అర్చారూపిగా ఆరాధించాల్సిందిగా ఆదేశించాడనీ భారతం చెబుతుంది. ఆనాటి నుండి తిరుమలపై ఈ విగ్రహారాధన (ఈ అర్చారూపానికి) మొదలైందనీ, ఆ విగ్రహమే తిరుమలలోని శ్రీనివాసుని దివ్యవిగ్రహమనీ - తనే కృష్ణుడు, తనే రాముడు, తనే మహావిష్ణువు కనుక... తర్వాతి కాలంలో అనేక రూపాలతో, అనేక ఆలయాలలో అర్చామూర్తిగా ఆ స్వామికి విగ్రహారాధనలు జరుగుతున్నాయని భారతం ద్వారా తెలుస్తోంది.

ఈ తిరుమల వేంకటేశ్వరుని విగ్రహం ఆగమాతీతం. వైఖానస, పాంచరాత్ర, శైవ శాక్తేయ ఆగమాలలో ఏ దేవతామూర్తి ఎలా ఉండాలి? నిల్చున్న మూర్తి ఎలా ఉండాలి? కూర్చున్నమూర్తి ఎలా ఉండాలి? శయనమూర్తి ఎలా ఉండాలి? విష్ణు విగ్రహాలు ఎలా ఉండాలి? అవతార రూపాలు ఎలా ఉండాలి? వాటి పరిమాణాలు, ఆయుధాలు, అలంకారాలు ఎలా ఉండాలన్న నిర్ణయం చేయబడింది.

ఈ శ్రీనివాస విగ్రహం అలా ఏ ఆగమాల్లో చెప్పిన ఏ విగ్రహంలాగానూ లేదు. ఈ విగ్రహం ఆగమాలు పుట్టక ముందు నుండి వుందని గ్రహించాలి. పూజావిధానం జరగాలి కనుక, తన పూజ వైఖానస ఆగమం ప్రకారం జరగాలని భగవంతుడే ఆదేశించినట్లు పురాణం చెబుతుంది. అలాగే ప్రాచీన కాలం నుండి ఈనాటి వరకూ వైఖానస పూజావిధానమే కొనసాగుతోంది.

శ్రీనివాసుని కుడి వక్షఃస్థలంలో శ్రీదేవి ఉంది. నాలుగు చేతులతో, రెండు పైకెత్తినట్లు (ఆయుధాలు పట్టుకోవడానికన్నట్లు) మూడవది వరదహస్తం, నాలుగవది కటి హస్తం – అతికించిన బంగారు శంఖచక్రాలు పైకెత్తిన చేతులకుంటాయి. పాదాలు ఆశ్రయించమని చూపుతున్న వరదహస్తం, అలా ఆశ్రయించిన వారికి, ఈ సంసార సాగరం కటిలోతే అని సూచించే కటిహస్తం. శ్రీకృష్ణుడు సూర్య మండలంలో తన అర్చారూపాన్ని చూపినపుడు దేవతలు శంఖచక్రాలు, ధనుస్సు (శార్ఙ్గ) ధరించిన మూర్తిని చూశారన్న వర్ణనా ఉంది.

మరి ఈ మూర్తికి ధనుస్సు ఏదీ? శిలప్పదిగారంలో ఈ మూర్తి వర్ణన ఇస్తూ – భుజాల దగ్గర అమ్ములపొది, ధనుస్సు ఎల్లప్పుడూ ధరిస్తూండడంవలన కలిగిన ఒరిపిడికి పడిన చారలు విగ్రహానికున్నాయని చెప్పబడింది. పురాణకాలంలో చోళ చక్రవర్తికి తన ఆయుధాలు అయిదూ ఇచ్చినట్లు చెప్పబడింది. ఈ ధనుస్సు ధరించే సూచన కృష్ణావతారానికి ముందు తన రామావతారాన్ని సూచించేదిగా ఉంది. కనుకనే, గర్భాలయంలో శ్రీవేంకటేశ్వరుని 5 మూర్తులుకాక రామకృష్ణుల విగ్రహాలు కూడా ఉంటాయి.

ఈ స్వామికి జరిగే సుప్రభాతం మేల్కొలుపు నుండి అర్చనలు, సహస్రనామార్చనలు, మంత్రపుష్పములు అన్నిటిలో విష్ణుపరంగానేకాక అవతారరూపాలలో రామ, కృష్ణావతార విశేష ఘటనాప్రశస్తి చాలా ఉంది. ఇది రామావతారానికి, కృష్ణావతారానికి, ఈ అర్చారూపానికి పూర్తి సంబంధం ఉందని, భేదం లేదని చూపడానికి నిదర్శనం.

ఈ ధ్రువబేరం (మూలవిగ్రహానికి) మెడలో ఎప్పుడూ తీయని కౌస్తుభ హారం ఉంటుంది. చేతులకు విగ్రహంలో నాగాభరణాల చిహ్నాలు లేవు. బంగారు నాగాభరణాలే అలంకారంగా వేస్తారు. పురాణకాలంలో శ్రీనివాసుని వివాహసమయంలో రెండు నాగాభరణాలు ఆకాశరాజు అల్లునికి బహూకరించినట్లు భవిష్యోత్తర పురాణం చెబుతుంది. కాని ఇప్పుడున్న నాగాభరణాలు అవి కావు. ఒక నాగాభరణాన్ని గజపతి వీరనరసింహ రాయలు చేయిస్తే, రెండవది రామానుజులు చేయించారని చారిత్రక ఆధారాలు.

ఆగమప్రకారం ధ్రువబేరానికి అనుబంధంగా ఉండే విగ్రహాలు కౌతుక బేరం, స్నపన బేరం, ఉత్సవ బేరం, చివరిగా బలిబేరం విగ్రహాలు ఆగమాల్లో చెప్పినట్లు

లేకపోయినా, గర్భగృహంలో ఉన్నాయి. అవి భోగ శ్రీనివాస విగ్రహం - కౌతుక బేరం.

ఈ వెండి శ్రీనివాస విగ్రహం గురించి అది వరకే చెప్పుకొన్నాం. 966లో రాజకుమారి సమావాయిచే ప్రతిష్ఠింపబడిన ఈ విగ్రహం ధ్రువబేరానికి ప్రతీక. శుక్రవారం అభిషేకం తప్ప ప్రతి రోజూ జరిగే అన్ని భోగాలూ ఈ విగ్రహానికే. సహస్ర కలశాభిషేకం, తిరుప్పావడ వంటి సేవలు కూడా ఈ బేరానికే జరుగుతాయి. శంఖచక్రాలు విగ్రహానికే ఉంటాయి. విగ్రహం క్రింద షట్కోణ/షాడ్గుణ్య చక్రం ఉంది. దీన్నే కౌతుక బేరం అంటారు. నమ్మాళ్వార్ చేసిన ధ్రువబేర వర్ణన ప్రకారం. ధ్రువ బేరం నాలుగు పలకల రాళ్లమీద ఉన్న పద్మం పై ఉంది. ఆ పద్మంపై యంత్రం ఉందనీ వర్ణన. ఈ నమ్మాళ్వార్ భోగశ్రీనివాసుని ప్రతిష్ఠకు ముందు 2 శతాబ్దాల క్రింద చేసిన వర్ణన. అప్పుడు పీఠం, పద్మం చూడడానికి వీలువుండివుండవచ్చు. కాని తర్వాతకాలంలో గర్భాలయం ఆవరణ బాగుచేసి ఎత్తు లేపివుండాలి. ఎందుకంటే ఇప్పుడు పద్మం పూర్తిగా కనపడదు. అర్చకులకు కొంత చూసే అవకాశం. ప్రతి 12 సంవత్సరాలకు ధ్రువబేరానికి అష్టబంధనం చేసే సంప్రదాయం. ఈషాడ్గుణ్యాచక్రాలు వ్యూహావాసుదేవుని ఆరుగుణాలు - జ్ఞానం, ఐశ్వర్యం, శక్తి, బలం, తేజస్సు, వీర్యం. ఈ విగ్రహం వీటి ప్రతీక అని ఆగమం చెబుతుంది.

ప్రతిరోజూ స్నపన మండపంలో రాత్రి ఏకాంతసేవ - అంటే పవ్వళింపు సేవ జరిగేది భోగశ్రీనివాసునికే. బంగారు ఊయల పరుపు మీద స్వామికి నేతితో వేయించిన జీడిపప్పు నైవేద్యం చేసి, అన్నమయ్య వంశంవారు లాలిపాడుతుండగా, తరిగొండ వెంగమాంబ ముత్యాలహారతి ఇస్తుండగా స్వామివారు శయనిస్తారు. ఉదయం జరిగే సుప్రభాతమూ ఈ మూర్తికే. మూలవరులతో బంగారుతీగతో కాని, పట్టు దారంతో కాని ఈ భోగ శ్రీనివాస విగ్రహం కలిసి వుండేలా చూస్తారు. శయనానికి స్నపన మండపానికి తెచ్చినా, సహస్ర కలశాభిషేకానికి, తిరుప్పావడకు బంగారు వాకిలికి బయటకు తెచ్చినా ఈ దారంతో మూలబేరంతో సంబంధం ఉండేట్లు చూస్తారు.

ఉగ్రశ్రీనివాసుడు : ఈ విగ్రహాన్ని మొదట 'వెంకటంత్తురైవారు' అని పిలిచేవారు. చారిత్రక ఆధారాలను బట్టి ఈ విగ్రహం భోగశ్రీనివాసుని కంటె ముందుగానే ఆలయంలో ఉండి ఉండాలి. అంతకు ముందు బయట వుత్సవాల కన్నిటికీ ఈ మూర్తినే వాడేవారట - అంటే ఇప్పుడు మనం చూచే మలయప్పస్వామి, శ్రీదేవి,

భూదేవి విగ్రహాలు ఆలయంలోనికి రాక పూర్వం - ఊరేగింపు అప్పుడు ఒక్క ఈ ఉగ్రశ్రీనివాసునికే జరిగేది. ఆయనే అప్పుడు ఉత్సవమూర్తి.

ఇప్పుడు కూడా ఈ విగ్రహాన్ని మూడు సందర్భాల్లో బయటకు తెస్తారు. ఉత్థాన ద్వాదశి అంటే క్షీరాబ్ధి ద్వాదశిరోజు, ముక్కోటి ద్వాదశి, ద్వాదశి ఆరాధనకు.

ఈ స్వామికి ఉగ్ర శ్రీనివాసుడని పేరు రావడానికి ఒక కారణం చెబుతారు. ఒకసారి బ్రహ్మోత్సవాలలో ఈ స్వామి వూరేగుతుండగా తిరుమలలో పెద్ద అగ్ని ప్రమాదం జరిగిందట. చాలా ఇళ్లు దగ్ధమైనాయట. అర్చకులకు, ఆలయ అధికారులకు, ప్రమాద కారణం తెలియలేదు. స్వామికి ఏదైనా లోపం జరిగి ఉండాలి. కనుకనే ఇటువంటి అనర్థం జరిగిందని అందరూ క్షమించమని ప్రార్థిస్తే - అక్కడ ఉన్న యాత్రికులలో ఒకనిపైకి స్వామి పూనకంగా వచ్చి చెప్పారట. "ఇకపై నన్ను (ఈ విగ్రహాన్ని) ఉత్సవమూర్తిగా వాడవద్దు. అలా చేస్తే అగ్ని ప్రమాదం లాంటి అనర్థాలే జరుగుతాయి." తిరుమలలోయలో తానే ఇంకొక మూర్తిగా శ్రీదేవి భూదేవులతో సహా ఉన్నానని, ఎక్కడ వెదకాలో గుర్తులు చెప్పారనీ, ఆ విగ్రహాలను ఉత్సవమూర్తులుగా వాడమనీ స్వామి ఆదేశించారట. అప్పటి నుండీ వారికి ఉగ్రశ్రీనివాసుడని పేరు వచ్చింది.

మలయప్ప స్వామి : అలా తిరుమల కోనలో దొరికిన విగ్రహాలే ఈనాడు అన్ని ఉత్సవాలకూ, కళ్యాణోత్సవం, వసంతోత్సవం, సహస్ర దీపాలంకారసేవ, వాహనసేవలు, బ్రహ్మోత్సవాలు, పుష్పయాగం - ఇలా అన్ని ఉత్సవాలు జరిపించుకొనే శ్రీనివాస విగ్రహం - శ్రీదేవి, భూదేవులతో సహా... మొదట మొదట ఈ విగ్రహానికి మలైకునియ నిన్ర పెరుమాళ్ అని పిలిచేవారు. ఈ విగ్రహం మలయప్ప కోనలో క్రీ.శ. 1339 ప్రాంతంలో దొరికి ఉండాలి. అప్పటివరకు ఉగ్రశ్రీనివాసుడే ఉత్సవమూర్తి.

యాత్రికుని పైకి ఆవేశం వచ్చి స్వామి చెప్పిఉండకపోతే, అలా కోనలో దొరికిన విగ్రహాలు ఉత్సవమూర్తులవడానికి ఈ ఆలయంలో ఆస్కారంలేదు. అర్చకులు, ఆలయ అధికారులు ఒప్పుకొనే సావకాశం లేదు. ఈ సంఘటన ముస్లిం దండయాత్రలు జరిగిన కాలంలో, శ్రీరంగనాథుని విగ్రహాలు కూడా తిరుమల రంగ మండపంలో ఉండి పూజలందుకొంటుండగా, జరిగివుండవచ్చని చరిత్రకారుల అంచనా.

ఈ కొండపై ఏకమూర్తి పూజ, ఉగ్రశ్రీనివాసుడూ, కొలువు శ్రీనివాసుడూ, భోగ శ్రీనివాసుడూ అందరూ ఏకమూర్తులే. కొందరు పరిశోధకులు, ఈ కోనలో

దొరికిన మలయప్పస్వామి మూర్తులు, తిరుచుక్కనూరులో (తిరుచానూరులో) తిరువలన్ కోయిల్ పెరుమాళ్ అన్న పేరుతో కొండపై స్వామికి ప్రతినిధిగా అన్ని ఉత్సవాలూ, సేవలూ తిరుచానూరులోనే జరిపించుకొనే పాంచరాత్ర విగ్రహాలనీ వాదిస్తారు. పాంచరాత్రంలో శ్రీదేవి, భూదేవీసహిత ఉత్సవబేరాల సంప్రదాయం ఉందనీ, మూలవిగ్రహం ఒక్క స్వామివారిదైనా, ఉత్సవ విగ్రహాలలో శ్రీదేవి, భూదేవులతో గల స్వామి ఉండవచ్చనీ తెలుస్తుంది.

తిరుచానూరు పై ముస్లింల దండయాత్ర జరుగుతుందన్న భయంతో ఈ విగ్రహాలను తిరుమల కోనకు చేర్చి ఉండవచ్చని ఒక భావన. అలా కాకపోతే, అప్పటిదాకా లేని అమ్మవార్ల విగ్రహాలు తిరుమల ఆలయంలోకి వచ్చే అవకాశమే ఉండేది కాదు.

కొలువు శ్రీనివాసుడు : మూలవిగ్రహానికి (ధ్రువబేరానికి) ప్రతినిధిగా సేవలందుకునే చలమూర్తులలో ఈ మలయప్పస్వామి కాకుండా ఇంకొకటి కొలువు శ్రీనివాసుడు. చిన్న మకరతోరణంతో సహా ఉండే ఈ శ్రీనివాసుని విగ్రహానికి రోజూ కొలువు చేసి పంచాంగ శ్రవణం / స్వామివారి ఆదాయపు లెక్కలు చెప్పడం - అర్చకులకు - ఆరోజు వంటలకు ఇచ్చే గ్రాసం కూడా ఈ స్వామి ఇస్తారు. ఈ విషయాలు అది వరకే విపులంగా చెప్పుకొన్నాం.

తిరుమల ఆలయంలోని ఈ విగ్రహాలు, ఆగమాల ఆధారంగా వున్నట్లు కన్పించినా, ఆగమపద్ధతులలో ప్రతిష్ఠ జరగలేదు. మూలవరులకు ప్రతిష్ఠే లేదుకదా? ఉగ్రశ్రీనివాసుడు మూలవరులకు ప్రతీక కాడనే భోగశ్రీనివాసుని తయారుచేయించింది. ఒక రకంగా ఈ ఆలయంలో ఆగమోక్త పూజలు భోగశ్రీనివాసుని ప్రతిష్ఠ తర్వాతే మొదలైనాయి. అప్పటికే ఆలయంలో రెండు బేరాలున్నాయి కదా? అందుకే, ఈ విగ్రహాలు కౌతుక, స్నపన, బలి బేరాలుగా పేర్లున్నా, ఆయా కార్యక్రమాలకు వాటిని వాడిన సంప్రదాయం కనబడటం లేదు.

భవిష్యోత్తర పురాణం ఉత్తరభాగంలో బ్రహ్మోత్సవాలు ప్రారంభం చేస్తున్నప్పుడు, ఈ విగ్రహాలు (4) బ్రహ్మ తయారుచేశాడని వుంది. తొండమానుని ఆదేశించి, బ్రహ్మదేవుడు విశ్వకర్మ సహాయంతో వాహనాలు చేయించాడట. బ్రహ్మ మొదలుపెట్టిన తిరువీధి ఉత్సవాలలో స్వామివారిని ప్రత్యక్షంగా కూర్చోపెట్టాలనుకున్న బ్రహ్మకు, స్వామి వేదాలలో పరీక్ష పెట్టాడట. పరీక్షలో బ్రహ్మదేవుడు కొంచెం తడబడ్డాడనీ, తర్వాత స్వామి

అనుగ్రహంతో నిష్ణాతుడయ్యాడనీ పురాణం. అప్పుడు ఒక్కొక్క వేదానికీ ఒక్కొక్క ప్రతీకగా నాలుగు వేదాలతో నాలుగు విగ్రహాలుగా బ్రహ్మ చేశాడనీ, ఆ విగ్రహాలే మూలమూర్తితో కలిసి పంచ బేరాలుగా పిలవబడతాయనీ పురాణం...

ఇప్పుడు ఆలయంలోని విగ్రహాలు అవేనా? ఏమో? భోగశ్రీనివాసుడు, మలయప్పస్వామివి మాత్రం తప్పకుండా కావు. ఒకటి సమవాయి చేయించినట్లుంది. మలప్పయస్వామి ఏకబేరం కాదు. శ్రీదేవి భూదేవి సహితుడు. బ్రహ్మ, శ్రీదేవి, భూదేవి సహిత శ్రీనివాసుని విగ్రహాలు చేసినట్లు పురాణంలో లేదు. కొలువు శ్రీనివాసుని, ఉగ్రశ్రీనివాసుని విషయంలో ఇదమిత్థంగా చెప్పడానికి చారిత్రక ఆధారాలు లేవు.

సుదర్శన చక్రం : ఈ ఐదు బేరాలుకాక 'చక్రత్తాళ్వార్'గా పిలువబడే సుదర్శన చక్రం గర్భ గృహంలో ఉంటుంది. బ్రహ్మోత్సవాలలో అంకురార్పణ, చివర తీర్థవారి రోజు స్నపన తిరుమంజనంలో వరాహస్వామి సన్నిధిలో అభిషేకానంతరం పుష్కరిణిలో చక్రస్నానం జరుగుతుంది. ఈ సుదర్శన చక్రంతోనే స్వామిపుష్కరిణిలో స్నానం.

★ ★ ★

31. శ్రీనివాసుని గుళ్లో సీతారాములు!

ముందు చెప్పిన విగ్రహాలేకాక, గర్భగృహంలో సీతా రామలక్ష్మణ విగ్రహాలు, కృష్ణమూర్తి రుక్మిణి విగ్రహాలు కూడా వుంటాయి? అవి ఎక్కడివి? వాటి చరిత్ర ఏమిటి?

ఆగమ పద్ధతిలో చూసినా, ఈ తిరుమల ఆలయ సంప్రదాయ పద్ధతిలో చూసినా, ఈ విగ్రహాలు తిరుమల ఆలయంలో గర్భాలయంలో ఉండే అవకాశం లేదు. తర్వాతి కాలంలో ప్రవేశపెట్టబడిన విగ్రహాలే. శాసనాల ఆధారాలతోనే అవి ఈ ఆలయంలోకి ఎలా వచ్చాయన్న విషయం తెలియాలి.

కృష్ణుని విగ్రహం గురించి ఆలయంలో ఒక సగం విరిగిన శాసనం ఉంది. 'ఆవని ములుదుదైవాలో' అనే ఒకటవ కులోత్తుంగ చోళుని భార్య తిరువేంగడం కొండమీద కృష్ణునికి పాలు, పెరుగు నైవేద్యానికి చేసిన దేవదేయం ఉంది. అది క్రీ.శ.1100ల ప్రాంతంలోని శాసనం. కులోత్తుంగ చోళుడు శైవుడైనా, భార్య శ్రీకృష్ణునికి చేసిన దేవదేయం - తిరుమల ఆలయంలో ధనుర్మాసం నెలరోజులూ ఈ శ్రీకృష్ణుని విగ్రహానికి రాత్రిపూట ఏకాంతసేవ చేస్తారు. మిగతా నెలల్లో భోగ శ్రీనివాసునికి చేస్తారు. అలా ఈ విగ్రహం క్రీ.శ.1100 సంవత్సరానికి ముందే ఆలయంలో ఉన్నట్లు తెలుస్తోంది. ఈ విగ్రహంతో పాటు రుక్మిణీదేవి విగ్రహంకూడా ఉండి వుండాలి..

రఘునాథుల విగ్రహం (రాములవారి) గురించి అలాకాదు. 1476 క్రీ.శ. వరకూ ఈ విగ్రహ ప్రసక్తి ఏ ఆలయ శాసనంలోనూ లేదు. క్రింద తిరుపతిలో రాములవారి ఆలయం ప్రత్యేకంగా కట్టించబడింది క్రీ.శ.1480 తర్వాత ఆ కొండపై రాములవారు ఉన్నట్లు ఎక్కడాలేదు.

మొదటి ప్రాకారం మూసివేసి క్రీ.శ.1245-50లలో రాములవారి మేడగా ఆలయంలోని అరుగులగది వచ్చిందని అదివరకు చెప్పుకొన్నాం. 1250 ప్రాంతంలో రాములవారి విగ్రహాలు ఆ గది అరుగులపై ఉన్నట్లులేదు. 1476 తర్వాత

ఈ రాములవారి విగ్రహాలు ఆలయంలోనికి వచ్చినప్పుడు, గర్భగృహంలోనికి తీసుకువెళ్లకుండా, ఈ ప్రాకారం మూసినప్పుడు తయారైన గదిలో అరుగులు కట్టి, వాటిపై ఉంచి ఉండాలి. ఆ తర్వాత ఆ గదికి రాములవారి మేడగా పేరొచ్చింది. శఠగోపదాసర్ నరసింహరాయ మొదలియారు (29-1-1481) లో ఈ రాములవారి విగ్రహాన్ని గుడిలోకి ప్రవేశపెట్టినట్లు శాసనం. అది రామానుజులవారి 12 రోజుల అధ్యయనోత్సవం జరుగుతున్న సందర్భంగా. ఇవి పంచలోహ చల ప్రతిమలు అని ఆ శాసనంలో ఒక అంశం. ఈ రఘునాథులకు నైవేద్య సమర్పణ. తిరుమల ఆలయ సంప్రదాయం తెలుసుకదా – ఏకమూర్తి పూజ. ఆ మూర్తి వరదరాజస్వామి అయినా, నరసింహుడైనా, కృష్ణుడైనా, రఘురాముడైనా, ఎవరికి నైవేద్యం చేయాలని దేవదేయం ఉన్నా, నైవేద్యం చేసేది మూల శ్రీనివాసునికే. రామానుజులకీ, 'తళిగ' నైవేద్యానికి ఈ శాసనంలో దేవదేయం ఉంది. అది కూడా లోపలి మూలస్వామికి నైవేద్యం చేశాకే రామానుజులకూ ఆరగింపు చేస్తారు.

పాంచరాత్ర వైష్ణవులు ఎక్కడ రామానుజుల విగ్రహం ప్రతిష్ఠింపచేసినా, అక్కడ ముందు రాములవారి విగ్రహ ప్రతిష్ఠ చేసేవారు. రాములవారికి నివేదన చేసిన నైవేద్యాన్నే రామానుజులకు నివేదించడం. ఆ సంప్రదాయం అనుసరించడానికే కొండ మీద కూడా ఆనాటి శ్రీవైష్ణవులు ప్రతిష్ఠించిన రాములవారి, రామానుజుల విగ్రహాలు. వైఖానస అర్చకులకు ఈ మార్పులు ఇష్టంలేకపోయినా, ఆనాటి రాజకీయ పరిస్థితులవల్ల వారు గట్టిగా ప్రతిఘటించే స్థితిలో లేరు. అదివరకు చెప్పుకొన్నట్లు, అర్చకులు ఒకరు చేసిన తప్పువలన వారి మనుగడకే ఆలయంలోంచి వెళ్లిపోయే పరిస్థితులు వారిని ఇంకా బలహీనం చేశాయి. శ్రీవైష్ణవులు చేస్తున్నారన్న కారణం తప్ప – రాములవారికి, కృష్ణునికి, తిరుమల శ్రీనివాసునికి తేడాలేదన్నది అందరూ – వైఖానసులు, శ్రీవైష్ణవులు, ద్వైతులు, ఇతరులు అద్వైతులతో సహా ఒప్పుకొన్న విషయం. ఆయనే, శ్రీమన్నారాయణుడే వేర్వేరు కాలాల్లో వేర్వేరు అవతారాలలో వచ్చాడన్నది నిర్వివాదం.

ఈ విగ్రహాలు చల ప్రతిమలు కనుక, బయట ఉత్సవాలకు తీసుకువస్తే, ఆలయం బయట నైవేద్యం ఈ విగ్రహాలకే చేస్తారు.

★ ★ ★

32. ఆలయం ఎలాంటిది?

వైఖానస ఆలయంలో ఆగమం ప్రకారం దేవతలు, దిక్పాలకులు ఉండాలి. ఇంకా చాలా విగ్రహాలు ఉండాలి. ఒక్క విష్వక్సేన గరుడుల విగ్రహాలు తప్ప ఏ ఇతర విగ్రహాలూ వైఖానస సంప్రదాయం ప్రకారం ఉండాల్సినవి లేవు. అలాగని ఆ పాంచరాత్ర ఆగమ పద్ధతిలో ఉండాల్సినవీ లేవు.

రెండో ఆవరణలో ఉండాల్సిన వైఖానస ముని విగ్రహంలేదు. బంగారు వాకిలి దగ్గర రెండు పేర్లు రాసిన ద్వారపాలక విగ్రహాలు ఉంటాయి. వైఖానస సంప్రదాయంలో ఈ జయవిజయులకు స్థానంలేదు.

అంటే పూజా విధానం – ఈ ఆలయంలో సంప్రదాయమే కాని, ఈ ఆలయం ఏ ఆగమ సంప్రదాయానికీ చెందినది కాదు. వైఖానస ఆగమం ప్రకారం ఉండాలంటే, ఈ తిరుమల ఆలయంలో ధాత్రి, విధాత్రి, భువంగ, పతంగ, మానికం, సంధ్య, విఖానస, తపస, కిష్కింధం, తీర్థ, వక్రదంత (వినాయక) నాగరాజు, విష్వక్సేన, గరుడ, శ్రీభూతం, న్యక్ష, భూతపీఠం- ఇవన్నీ ఉండాలి.

గరుడ, విష్వక్సేనులు తప్ప ఇంకెవరూ లేరు. జయవిజయులు ఉన్నారు. కాని వైఖానసంలో వారికి చోటులేదు. మండపంపై సింహాలున్నాయి. వైఖానస, పాంచరాత్రాలలో వాటికి అవకాశం లేదు.

బలిపీఠం – ధ్వజస్తంభం అన్ని ఆగమాలలో ఉండాల్సినవి. అవి ఈ ఆలయంలో ఉన్నాయి.

వైఖాసన ఆగమ సంప్రదాయ ప్రకారం పరివార, ఆవరణ దేవతలకు స్వామికి నైవేద్యం అయినతర్వాత, బలి (నైవేద్యం ఇవ్వాలి). దానికి పల్లకిలో స్వామివారి బలిబేరంతో బయలుదేరి, మేళతాళాలతో అందరు దేవతలకు బలిఇవ్వాలి. ఆ సంప్రదాయాన్నే నిత్యోత్సవం అంటారు. ఈ ఆలయంలో ఈ సంప్రదాయం

నామమాత్రమే. ఆ విగ్రహాలే లేవు కదా. ఉన్న విగ్రహాలకు బలివేసే సంప్రదాయమే నడుస్తోంది.

ఈ ఆలయంలో చేసే మంత్రపుష్పం ప్రత్యేకమైంది. ఇతర ఆగమ సంప్రదాయాల మాదిరి కాదు. ఈ ఆలయంలో వైఖానస ఆగమం ప్రకారం అన్ని పూజలూ శాస్త్రంలో చెప్పినట్లు చేస్తే - యాత్రికుల దర్శనానికి కేటాయించగలిగిన సమయం చాలా తక్కువ ఉంటుంది. అందుకే చాలా శతాబ్దాల నుండీ పూజావిధానం కొంత సంక్షిప్తంచేసి దర్శనానికి ప్రాముఖ్యం ఈ ఆలయంలో ఇవ్వడం జరుగుతోంది.

ఈ ఆలయంలో స్వామివారి ఏకాంతసేవ అయి గుడి తలుపులు మూశాక, బ్రహ్మాది దేవతలు వచ్చి స్వామిని రోజూ కొలుస్తారని ఒక గట్టి నమ్మకం. ఇప్పటికీ ప్రతిరోజూ గుడి తలుపులు మూసేటప్పుడు 5 బంగారు గిన్నెలలో శుభ్రమైన ఆకాశగంగ జలం నింపి ఉంచుతారు. వాటితో పాటు ఇతర పూజాద్రవ్యాలు (వాడనివి) అందుబాటులో ఉంచుతారు.

ఉదయం సుప్రభాతం తర్వాత విశ్వరూప దర్శనానికి వచ్చే భక్తులకు తీర్థంగా ఇచ్చేది ఈ జలాలనే. బ్రహ్మ పూజ చేసిన స్వామివారి నిర్మాల్యం. అలా శ్రీవైఖానసం చేసేది బ్రహ్మ పూజించాకే. అందుకే కొందరు శ్రీవైష్ణవులు సుప్రభాత సేవకు వచ్చి, ఈ తీర్థం బ్రహ్మ కడిగిన విష్ణు పాదోదకంగా భావిస్తారు. వైఖానసులు చేసే పూజలలో ఎక్కడైనా చిన్న చిన్న లోపాలున్నా ఈ బ్రహ్మార్చనతో ఈ ఆలయంలో సర్దుకుపోతాయి. భగవంతుడే అర్చారూపుడై తనంతట తానే నిలిచినప్పుడు, వైఖానస అర్చకులు మరీచి సంహితను పాటించలేదు. ఇది ఎవరూ ఆగమోక్తంగా ప్రతిష్ఠచేసిన ఆలయం కాదు కనుక ఈ ఆలయానికి ఇతర ఆలయాలకు ముఖ్యమైన తేడా ఇక్కడే...

వైఖానస ఆగమం ప్రకారం పూజ చేయాలంటే రోజుకు 6 సార్లు (1) ప్రత్యూషం (2) ప్రభాతం (3) మధ్యాహ్నం (4) అపరాహ్ణం (5) సాయంకాలం (6) నిశీథికాలం - ప్రాచీనకాలంలో తిరుమలలో ఒక పూజ మాత్రమే జరిగేది. మొదట మొదట వండిన అన్న నైవేద్యం రోజులో ఒకసారే జరిగేది. తర్వాత కాలంలో రోజుకు మూడుసార్లు. మధ్యాహ్న సమయంలో నైవేద్యం తర్వాత ఆలయం కొంతసేపు మూసివేసి, స్వామికి విశ్రాంతి నివ్వాలన్న సంప్రదాయం పాటించేవారు. ఈ విషయాల్లోనే శ్రీమన్నారాయణ చినజియ్యరుగారు తిరుమలలో జరిగే విధానం గురించి కొంత అసంతృప్తి అప్పుడప్పుడు వ్యక్తం చేయడం జరిగేది. ఈ విషయాలన్నీ తిరుమల వెయ్యికాళ్ల

మండప వివాద సమయంలో క్షుణ్ణంగా పరిశీలించి, నేను అధ్యక్షత వహించిన త్రిసభ్య కమిటీ నివేదికలో చాలా సూచనలు తిరుమల–తిరుపతి దేవస్థానం వారికి, ప్రభుత్వానికి చేయడం జరిగింది. ఈ శీర్షిక చివరిలో, భగవంతుడు అనుగ్రహిస్తే, ఆ విషయాలూ చర్చించుకొందాం!

★ ★ ★

33. సుప్రభాతంలో తెర వెనకాల ఏం చేస్తారు?

సుప్రభాతసేవ సమయంలో భక్తుల్ని బంగారువాకిలి ముందు నిలబెట్టి, ఆ వాకిలికి తెరవేసేసి, అలా కొంతసేపు వుంచేస్తారు. ఆ సమయంలో తెరవెనకాల గర్భాలయంలో ఏం జరుగుతుందీ- అన్నది భక్తులకి ఉత్కంఠ కలిగించే విషయం. అక్కడ ఏం జరుగుతుందంటే...

★ ★ ★

సుప్రభాతసేవను విశ్వరూపసేవ అనికూడా అంటారు.

తెల్లవారు జామున సుప్రభాత సేవ జరగడానికి ముందు గొల్ల మిరాశీదారు వెళ్లి అర్చకులను లేపడం, తర్వాత జియ్యంగారిని లేపడం, దివిటీలతో వారిని ఆలయానికి తీసుకురావడం సంప్రదాయం. ఆలయ అధికారులు, పూర్వకాలంలో పారుపత్తేదారు, ఇప్పుడు ఆలయం పేష్కారు (సహాయకార్యనిర్వహణాధికారి) అయినా ఈ సమయానికి ఆలయానికి రావాలి.

అర్చకులు, ముఖ్యంగా గుడికి రాకముందే స్నానాదులు ముగించి, తమ కర్మానుష్ఠానం చేసిన తర్వాతే, ఆలయానికి రావాలన్నది నియమం. అదే నియమం జియ్యంగార్ల విషయంలో కూడా. ఎందుకంటే వీరిద్దరూ గర్భాలయంలోకి వెళ్లే అవసరం వుంది. వారిలో అర్చకునికే స్వామివారిని ముట్టే అవకాశం ఉంటుంది.

జియ్యంగారు లేదా వారి తరఫున ఏకాంగులకు గర్భాలయంలోకి వెళ్లే అధికారమున్నా, వారికి స్వామి వారిని తాకే హక్కులేదు. ఆలయ అధికారులు, కావల్సిన దిట్టం (పూజకుకావాల్సిన సరంజామా) లెక్కప్రకారం ఇచ్చారా లేదా? దాని నాణ్యత ఉండాల్సిన రీతిగా ఉందా లేదా? అన్నది చూడాల్సిన బాధ్యత జియ్యంగారిది. ఆ పూజాద్రవ్యాలను తమ చేతుల మీదుగా అర్చకులకు అందజేయడం, అలా అందజేసిన వాటిని అర్చకులు సక్రమంగా వాడుతున్నారా లేదా చూడటం కూడా వారి బాధ్యతే.

ఈనాడు మనం సుప్రభాత సేవకు వెళ్తే, అందరినీ బంగారు వాకిలివద్ద ఆస్థాన మండపంలో ముందు ఉంచుతారు. పూర్వకాలంలో ముందు అర్చకులు, జియ్యంగారు గాని ఆయన ఏకాంగికాని, గొల్ల మిరాశీదారు, ఆలయ అధికారులు, బయట మహాద్వారం తలుపుల సీళ్లు పరిశీలించి తీయించడం, తరువాత వెండివాకిలి తెరిపించడం, ఆ తర్వాత ఆస్థాన మండపం తలుపులు తీయించడం జరుగుతాయి. ప్రస్తుత కాలంలో మహాద్వారం, వెండి వాకిలి మూసే సంప్రదాయం జరగడంలేదు. సీళ్లు వేసి మూసేది బంగారు వాకిలి మాత్రమే.

వేదపండితులు, ఇతర ఆలయ అధికారులు, భద్రతా సిబ్బంది వారివారి స్థానాలలో చేరిన తర్వాత, సుప్రభాతసేవాదారులను గుడిలోపలికి ప్రవేశింపచేస్తారు. అప్పటికే వేదపండితులు, అన్నమయ్య వారసులు, అర్చకులు బంగారు వాకిలి దగ్గర చేరి ఉంటారు. తాళాలతో గొల్ల సిద్ధంగా ఉంటాడు. అలా భక్తులు గుమిగూడిన తర్వాత అందరి సమక్షంలో రాత్రివేసిన సీళ్లను పరిశీలించి, తాళాలతో ఆలయం తలుపులు తీసి లోనికి అర్చకులు, జియ్యంగారు, గొల్ల వెళతారు.

పూర్వకాలంలో భక్తులను, వేదపండితులను కూడా లోపలికి పంపేవారట. కొన్ని శతాబ్దాల క్రితం ఇలా పంపడం ఆపివేశారు. అన్నమయ్య వంశస్థులు లోపలికి వెళ్లి పాటలు పాడుతుంటే నృత్యం చేసేవారు నృత్యం, వేదం చదివేవారు వేదం చదువుతుంటే స్వామి వారికి మేల్కొలుపు జరిగేదట. ఆ సంప్రదాయంలో మార్పువచ్చింది.

ఇప్పుడు బంగారు వాకిలి తలుపులు తీసి, గొల్ల, అర్చకులు, జియ్యంగార్లు లోపలికి వెళ్లాక తలుపులు మూసేస్తారు. వేదపండితులు స్వామివారి సంస్కృత సుప్రభాతం గానం చేస్తారు. అప్పుడే అన్నమయ్య వారసులు కూడా బంగారు వాకిలివద్ద అన్నమయ్య కీర్తనలు గానం చేసే విధానం కూడా ఉంది. అందరూ బంగారు వాకిలి బయటనే ఉంటారు.

ఇలా సుప్రభాత గానం జరుగుతున్నప్పుడు, లోపల అర్చకులు, జియ్యంగార్లు దీపాలు సరిచేసి, కొత్త దీపాలు వెలిగించి, స్వామివారి దోమతెర తొలగించి, తూగుటుయ్యాలపై పవ్వళించిన స్వామిని మేల్కొల్పి, ఆ భోగశ్రీనివాసుని స్నపన మండపం నుండి గర్భగృహంలోని జీవస్థానానికి చేరుస్తారు. స్వామివారి పరుపు, మంచాలను గొల్ల బయటకు తెచ్చేస్తాడు.

స్వామివారికి ఆవు పాలు, వెన్న నైవేద్యం చేసి, కర్పూర హారతి ఇచ్చిన తర్వాత బంగారు వాకిలి తలుపులు తెరుస్తారు. అప్పటికి సుప్రభాతగానం పూర్తయి ఉంటుంది.

అప్పుడు భక్తులందరినీ దర్శనానికి పంపుతారు. ఇక్కడ జరిగేవి రెండు సేవలు. మొదటిది, మేలుకొలుపు సేవ, రెండవది విశ్వరూప సేవ. ఈ విశ్వరూప సేవ - బ్రహ్మ దేవుడు రాత్రి సమయంలో స్వామిని అర్చించి వెళ్లిన తర్వాత, భక్తులు చేసే దర్శన సేవ. అప్పుడు ఇచ్చే తీర్థం బ్రహ్మచేసిన స్వామివారి పాదోదక అభిషేక తీర్థం. కొంత కాలం క్రితం వరకు ఇలా ఉదయం ఈ దర్శనానికి వచ్చే భక్తులకు స్వామివారి తీర్థం, చందనం కొంచెం ఇచ్చే సంప్రదాయం ఉండేది. రాత్రి ఏకాంత సేవకు ముందు ఒక గంధంముద్ద భోగశ్రీనివాసుని వక్షఃస్థలంలోనూ, కొంచెం గంధం ధ్రువబేరంపైన ఉన్న అమ్మవారిపైన పెడతారు. ఇంకొంచెం గంధం పూజాద్రవ్యాలతోపాటు ఒక పళ్లెంలోనూ, ఐదు బంగారు పాత్రలలో శుద్ధమైన నీరూ, బ్రహ్మదేవుడు అర్చించడానికి వీలుగా ఉంచుతారు. ఇవికాక స్వామివారి పాదాలపై బంగారు తొడుగులు తీసి రెండు పాదాలపై రెండు గంధం ముద్దలు ఉంచి, వాటిపై చిన్న పాద వస్త్రాలు ఉంచుతారు. విశ్వరూప దర్శనానికి వచ్చిన భక్తులకు, ఈ రాత్రి బ్రహ్మదేవుడు నివేదించిన గంధం కొంచెం కొంచెం ఇచ్చి, స్వామివారి పాదవస్త్రాలను కంటికి అద్దుకోవడానికి ఇచ్చేవారు. ఇప్పుడు చాలా అరుదుగా పెద్ద వి.ఐ.పి. లు వస్తే ఇస్తారేమోగాని, అందరికీ ఇచ్చే అవకాశం లేదు.

మనకు దొరికిన చారిత్రక ఆధారాలను బట్టి చూస్తే, ఈ సుప్రభాత సేవాపద్ధతి ప్రాచీనకాలం నుండి ఉన్నట్లుగా అనిపించడంలేదు.

15వ శతాబ్దం మధ్యలో మొదలైనట్లు తెలుస్తోంది. ఇప్పుడు గానం చేస్తున్న సుప్రభాతం రచించిన ప్రతివాది భయంకర అణ్ణన్ అనే ఆయన దీనిని 14వ శతాబ్దం చివరలో గానీ, 15వ శతాబ్దం మొదటలోగాని రచించినట్లు తెలుస్తోంది. అన్నమయ్య కాలంలో అన్నమయ్య స్వామివారి ముందు సుప్రభాత సమయంలో, ఏకాంత సమయంలో గానం చేసేవాడని చెప్పవచ్చు.

ఈ 15 వ శతాబ్దానికి ముందు కాలంలో సుప్రభాత సేవ ఎలా జరిగేదో తెలిపే ఆధారాలు కనపడటం లేదు. సుప్రభాతం 15వ శతాబ్దంలో రచించి గానం చేయడానికి ముందు వేదపారాయణం జరిగేదేమో అనుకుందామంటే, వీర ప్రతాపదేవరాయ మహారాయలు 1430 ADలోనే, అది వరకు వుండి తర్వాతకాలంలో ఆగిపోయిన

వేదపారాయణానికి మళ్లీ ఏర్పాటు చేశాడు. దానికి దేవదేయంగా శ్రీనివాస మంగాపురం (ఇప్పుడు కళ్యాణవేంకటేశ్వర ఆలయం వున్న చంద్రగిరి దగ్గరి ఊరు) లోని సగం ఆదాయాన్ని, నెలకు ఇద్దరు వేదపండితుల లెక్కన 12 నెలలూ పారాయణానికిగాను చేశాడు.

శ్రీరంగంలోని శ్రీరంగనాథుల విగ్రహాలు ముస్లిం దండయాత్ర కాలంలో, తిరుమల ఆలయంలో ఉన్న సమయంలో శ్రీరంగనాథునికి 'తిరుపళ్లి ఎళుచ్చి' (స్వామివారిని పొగడుతూ పాడే సంప్రదాయం) ఉండి ఉండాలి. దాన్ని చూచి తర్వాత కాలంలో శ్రీనివాసునికి ఈ సుప్రభాతం సంస్కృతంలో రాయించే ఏర్పాట్లు జరిగిఉండాలి. అలా సుప్రభాతగానంతో కొంత కాలం జరిగాక, 16వ శతాబ్దంలో అన్నమయ్య కీర్తనలు కూడా తెలుగులో పాడే సంప్రదాయం ప్రవేశపెట్టబడింది. ఆ పద్ధతే ఇప్పటికీ కొనసాగుతోంది.

★ ★ ★

34. హక్కులకోసం 150 సంవత్సరాల పోరు

విశ్వరూప దర్శనం తర్వాత యాత్రికులను బయటకు పంపివేసి అర్చకులు తెరవేస్తారు. లోపల శుద్ధి జరుగుతుంది.

శుద్ధిలో భాగంగా రాత్రి వాడిన నీటిని తీసివేసి పాత్రలు శుద్ధి చేస్తారు. గర్భాలయాన్ని శుభ్రంగా తుడిచి నీటితో కడిగి శుచిగా చేయడం, రాత్రి అలంకరించిన మూలవిరాట్టుకు, ఇతర బేరాలమీద ఉన్న పూలమాలలన్నీ తీసి నిర్మాల్యవిసర్జ కార్యక్రమం, స్వామివారి పాదాలమీద ఉన్న తులసి తీసి శుభ్రం చేయడం, వక్షఃస్థల లక్ష్మీదేవికి చేసిన అలంకార మాలలు తీసివేయడం జరుగుతాయి.

తీసివేసిన పూలమాల నిర్మాల్యంలో కొన్నింటిని విష్వక్సేనునికి అలంకరించే సంప్రదాయం ఉండేది. ప్రాచీన కాలంలో మొదటి ప్రాకారం మూయనప్పుడు, విష్వక్సేనుని ఆలయానికి గుడిలోపలి నుండే దారి ఉండేది. కాని ప్రథమ ఆవరణం మూసి రాములవారి మేడ కట్టి, ఈనాటి మూడువైపుల ఉన్న, ముక్కోటి ప్రదక్షిణ మాత్రమే 1250 తర్వాత వచ్చాక, విష్వక్సేనుణ్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసినట్లు అయింది. ఆయనను చూడాలంటే గుడిలోంచి బయటకు వచ్చి సంపంగి ప్రాకారంలో ప్రదక్షిణంగా వచ్చి, హుండీకి వెళ్లబోయే ముందు చూడాలి. ముక్కోటి ప్రదక్షిణ పూర్తి అయ్యేచోట మూలగా ఒక తలుపు, ఆ తలుపు తెరవగానే ఇరుకుగా ఆలయానికి ఉత్తరదిశగా ఆలయం గోడకు 2 అడుగుల దూరంలో చిన్న మందిరం, ఆ మందిరంలో విష్వక్సేనుడు. ఇది ముక్కోటి ప్రదక్షిణంలో కాక బయటకు ఉంటుంది. పూర్వ ఆలయపు ఉత్తరపు గోడలపై శాసనాలు చెక్కడానికి స్థలం చాలక ఆ గోడను పొడిగించినప్పుడు ఈ విష్వక్సేనుని ఆలయం లోపలగా ఉండిపోయింది. తర్వాతకాలంలో, ఈ పొడిగించిన గోడకు ఆలయం గోడల మధ్య కూడా తలుపు పెట్టడంతో, విష్వక్సేనుడు అక్కడ ఉన్నట్లే ఏదో కొద్దిమంది ఆలయ అర్చకులకు, అధికారులకు తప్ప, ఇతరులెవ్వరికీ తెలీదు. తెలిసినా, వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. ఆ నిర్మాల్యం విష్వక్సేనునికి సమర్పిస్తున్నారో లేదో కూడా అనుమానమే.

ప్రాచీనంగా వస్తున్న సంప్రదాయం ప్రకారం స్వామివారి నిర్మాల్య పుష్పాలు, మాలలు సంపంగి ప్రాకారంలో ఈశాన్యంగా వున్న దిగుడుబావిలో వేస్తారు. ఈ నిర్మాల్యం ఎవరూ అలంకారంగా వాడరాదని నియమం. అలా పూలమాలలు వేస్తారు కనుక ఆ బావికి పూలబావిగా పేరువచ్చింది. ఇలా నిర్మాల్యం పూలు విసర్జించే పద్ధతిని 'నిర్మాల్యశోధన' అని పిలుస్తారు.

ఈలోగా బ్రాహ్మణులు ఆకాశగంగ నుండి వెండి బిందెలలో పవిత్ర జలాలు తెస్తారు. వైఖానస ఆగమం ప్రకారం ఈ జలాలు ఏనుగుపై తేవాలి. పూర్వకాలంలో అంటే తిరుమలనంబి కాలంలో కూడా ఆయనే తలపై మోసుకొని వచ్చేవారని తెలుస్తోంది. తర్వాత కాలంలో బ్రహ్మోత్సవాల సమయంలో ఏనుగుపై నీరుతెచ్చే సంప్రదాయం ఉండేది. అలా తెచ్చినా ఆ నీరు గర్భాలయంలో స్వామి వారికి వాడే ఆచారం లేదు. బ్రాహ్మణులు మడిగా తలపై మోసుకువచ్చిన జలాలనే, స్వామివారి అభిషేకానికి, అర్చన, ఆచమనాది అవసరాలకు వాడేవారు. వైఖానస సంహితలో చెప్పినట్లు ప్రతిరోజూ ఆకాశగంగ జలాలను ఉత్సవంగా ఏనుగుపై ఊరేగిస్తూ తెచ్చే సంప్రదాయం ఇప్పుడు జరగడంలేదు. కాని మరీచి సంహిత విమానార్చన కల్పంలో మాత్రం ఏనుగు మీద ఊరేగింపుగా నీరు తేవాలని చెప్పబడలేదు.

శుద్ధి, నిర్మాల్య విసర్జన తర్వాత నిత్యార్చన జరుగుతుంది. దీనినే ఈ రోజుల్లో తోమాల సేవ అంటారు. అదివరకు అమంత్రణోత్సవమని కూడా పిలిచేవారు. నిత్యార్చన క్రమం విపులంగా చెప్తే అందరికీ ఆసక్తిగా ఉండకపోవచ్చు. కాని శ్రీవారికి చేసే పూజా విధానంలో ...

1. మంత్రాసనము - పండ్లు తోమడం, ముఖం కడగడం
2. స్నానాసనం - అభిషేక స్నానం చేయించడం.
3. అలంకారాసనం - వస్త్ర సమర్పణం, తోమాల పూలదండలతో విగ్రహాలను అలంకరింప జేయడం (స్వామివారికి రకరకాల పూలు ఆలయంలోని యామున మండపానికి తెచ్చి అక్కడ రకరకాల మాలలు, చిన్నవి, పెద్దవి అన్నీ విగ్రహాలకు అలంకరణకు అవసరమైన రీతిలో కడతారు. వాటిని తోమాల సమయంలో గంటకొడుతూ పవిత్రంగా యామున మండపాన్నుండి గర్భాలయానికి మడిగా తీసుకువెళ్తారు. ఊర్ధ్వపుండ్ర నామం కూడా సరిచేస్తారు. చివరగా కొలువు, సహస్రనామార్చన).

4. భోజ్యాసనం - నైవేద్యం - వండిన ఆహారాలు, భక్ష్యాలు నివేదన చేసేసేవ.

5. యాత్రాసనం - బలిహోమం చేయడం - బలి బేరంతో సహా గంట కొట్టుకుంటూ ఆలయంలోని ఇతర విగ్రహాలకు, పరివార దేవతలకు బలి, స్వామివారికి నైవేద్యం చేయబడిన అన్న నైవేద్య సమర్పణ జరుగుతుంది.

6. శయనం - రాత్రిపూట ఏకాంత సేవ చేసేటప్పుడు స్వామివారిని శయనింప చేయడం - అలా అలంకారాసనంలో జరిగేవే - తోమాల, కొలువు అర్చనలు.

తోమాల తర్వాత కొలువు

కొలువు సమయంలో అర్చకులకు మాత్రాదానం - అంటే వారి రోజు భత్యం బియ్యం రూపంలో ఇచ్చే సంప్రదాయం 1801 నుండి 1830 మధ్యలో మొదలయింది. కారణం ఈస్ట్ ఇండియా కంపెనీవారు ఆలయానికి సంబంధించిన భూములన్నీ అర్చకుల ఆధీనం నుండి తీసివేసుకొని రోజు భత్యంగా అర్చకులకు కొలువు సమయంలో మాత్రాదానం చేయడం మొదలుపెట్టారట. కొలువు సమయంలో క్రిందటి రోజు స్వామివారి ఆదాయం చదివే సంప్రదాయం కూడా ఈ కాలంలోనే మొదలయినట్లు తెలుస్తోంది.

అన్ని విష్ణు ఆలయాలలో అర్చన సమయంలో విష్ణు సహస్రనామం చదివే అలవాటు ఉంది. తిరుమల ఆలయంలో మాత్రం శ్రీవేంకటేశ్వర సహస్రనామార్చన జరుగుతుంది. ఈ సహస్రనామార్చన ఎప్పుడు మొదలయిందో తెలియడంలేదు. అర్చన గురించిన ఒక్క శాసనం మాత్రమే లభ్యంగా ఉంది. అది క్రీ.శ. 1518లో అప్పటి మహారాజు శ్రీవీరప్రతాప వీర అచ్యుతరాయలు తానే స్వయంగా స్వామివారికి అర్చన చేసినట్లుగా - అర్చకుడిని పక్కన నిలబడి సహస్రనామాలు చదవమని అడిగి, తాను అర్చన చేసినట్లు చెక్కబడిన శిలాశాసనం ఉంది.

స్వామివారికి నైవేద్యానికి పోటు (వంటగది) నుండి పోటు బ్రాహ్మణులు గంగాళాలలో ఆనాటి నైవేద్యాలను తీసుకువెళ్ళి, శుద్ధిచేసిన శయన మండపంలో ఉంచుతారు. ఆ గంగాళాలన్నీ ఒకటే కొలతతో ఉంటాయి. అన్న నైవేద్యాలు విమాన ప్రాకారంలోని పోటు నుండి, అన్ని భక్ష్య భోజ్యాలు, సంపంగి ప్రాకారంలోని పడి పోటు నుండి శయన మండపానికి తెస్తారు. తెచ్చిన బ్రాహ్మణులు, ఇతర ఆలయ అధికారులందరు బంగారు వాకిలి బయటకు వచ్చేస్తారు. ఒక్క ఆలయ అర్చకులు

మాత్రమే లోపల ఉండి స్వామివారికి నివేదన చేస్తారు. నివేదన జరుగుతున్నంతసేపూ, బంగారు వాకిలి దగ్గర ఉన్న మణి మంటపంలో రెండు పెద్ద గంటలను మ్రోగిస్తూ ఉంటారు. శ్రీవేంకటేశ్వర భక్తి ఛానల్‌వారు స్వామివారికి నైవేద్యం జరుగుతున్నప్పుడు మోగింపబడే ఘంటానాదాన్ని ఈ మధ్య కాలంలో ప్రసారం చేయడం పాఠకులు గమనించి ఉంటారు.

వైఖానస ఆగమ సంప్రదాయం ప్రకారం విష్ణ్వాలయాల్లో గర్భాలయంలోనూ, ప్రతి ఆవరణలోనూ, కొందరు దేవతలకు స్థానం ఉంది. స్వామికి నైవేద్యం అయ్యాక ఈ దేవతలందరికీ నైవేద్యం/బలిచేయడం ఆగమ విధి. కాని వైఖానస సంప్రదాయం ప్రకారం తిరుమల ఆలయంలో పూజావిధానమే కాని, తిరుమల ఆలయం వైఖానస సంప్రదాయం ప్రకారం కట్టబడలేదు. ఇక్కడ జరిగేది 'ఏకమూర్తిపూజ' మాత్రమే. ఏ పూజ, ఏ నైవేద్యం అయినా శ్రీనివాసునికే... గర్భగృహంలో వైఖానస ఆగమంలో చెప్పిన విగ్రహాలు లేవు. మొదటి ప్రాకారంలో వైఖానస ఆగమం ప్రకారం పెడదామనుకున్నా విగ్రహాలు పెట్టడానికి అవలేదు. కాకపోగా ప్రథమ ఆవరణమే మూసివేయాల్సివచ్చింది. ఇక మిగిలింది విష్వక్సేనుడు, గరుడుడు, ధ్వజస్తంభం, బలిపీఠం. నైవేద్యానంతరం అర్చకులు బంగారు వాకిలి దగ్గర బలివేసి విష్వక్సేనుడికి, గరుడనికి బలి ఇచ్చి, ధ్వజస్తంభం, బలి పీఠాలకు బలిఇచ్చి, మిగిలినది ధ్వజస్తంభం బలిపీఠం మధ్య వదిలేస్తారు. ఆగమంలో చెప్పినట్లు చేయడానికి అవకాశం లేదు కనుక వాళ్లు చేయగలిగింది ఇలానే... వైఖానసంలో ద్వారపాలకులు జయవిజయులకు స్థానం లేదు. ఇక్కడ మాత్రం బంగారువాకిలిలో వారు వున్నారు కనుక వారికి కూడా బలి ఇస్తుంటారు.

నైవేద్యం తర్వాత జరిగేది శాత్తుమొర – అంటే తమిళంలో ఆళ్వారుల ప్రబంధాలు గానం చేయడం. వీటికి ముందు చివర కొన్ని స్తోత్రాలు చదవడం కొంత కాలం క్రితం మొదలైంది. ఈ స్తోత్రాలు ప్రబంధంలో భాగం కాదు. ఈ సంప్రదాయం తిరుమల ఆలయంలో ప్రబంధ పారాయణంగా 1476లో మొదలయిననట్లు శాసనం ద్వారా తెలుస్తోంది. అది కూడా రామానుజుల సన్నిధి ముందే – అంటే విమానప్రాకారంలోనే. కాని గుడిలో కాదు. తర్వాత కాలంలో గుడిలో చెయ్యడం మొదలైంది. దీనిలో శ్రీవైష్ణవులు మాత్రమే పాల్గొనే అవకాశం. తర్వాత కాలంలో శ్రీవైష్ణవులు వడగలై, తెంగలైలుగా విడిపోయి, వారివారి సంప్రదాయాలు పెంచుకొని, ఒకరిపై ఒకరు అభియోగాలు చేసుకొంటూ దాదాపు 150 సంవత్సరాలు వారివారి

హక్కుల కోసం, సంప్రదాయ మర్యాదల కోసం ఇంగ్లండులోని ప్రీవీ కౌన్సిలు దాకా పోట్లాడుకోవడం అందరికీ తెలిసినదే. నామం ఏ రూపంలో ఉండాలి. U నా, Y నా అనేదానిపై, ఎవరికి ఎంత మర్యాద ఇవ్వాలన్న దానిపై రకరకాల తగాదాలు - ఈ కారణంగానే స్వామివారికి తిరుమలలో నామం ఇద్దరికీ సంబంధించినదిగాకాక, ఇద్దరినీ తృప్తిపరిచేదిగా తయారవ్వడం మనం చూస్తాం.

ఇలా శాత్తుమొర క్రింద తమిళ ప్రబంధాలు, ఇతర, ముందు వెనుక గురువులను ఉద్దేశించి చేసే స్తోత్రాలు, ఒక పద్ధతిలో ఆలయం లోపల అంటే బంగారువాకిలి దాటి స్వామివారి ముందు జరిగే సంప్రదాయం, 18వ శతాబ్దంలోనే మొదలయినట్టు కొందరు చరిత్రకారుల అభిప్రాయం. రామానుజుల సన్నిధిలో ముందు మొదలయిన ప్రబంధ పారాయణ కొంత కాలానికి ఆస్థానమండపానికి వచ్చి, ఆ తర్వాత విమానప్రాకారంలోని కళ్యాణమండపానికి వెళ్లినట్లు ఆధారాలు కన్పడుతున్నాయి. ఆ తర్వాత రాములవారి మేడవరకు, తర్వాత కొంత కాలానికి రాములవారు గర్భాలయంలోకి వెళ్లినప్పుడు గర్భాలయానికి చేరినట్లు తెలుస్తుంది.

★ ★ ★

35. అలా స్వామివారిని నిద్రపుచ్చుతారు

సాయంత్రం కూడా స్వామివారికి తోమాల, అర్చన, నైవేద్యాలు జరుగుతాయి. తర్వాత ధర్మదర్శనం, రాత్రి స్వామివారికి చివరగా జరిగే సేవ ఏకాంతసేవ, శయనసేవ.

అది శయనమండపంలో - అంటే గర్భాలయానికి ముందు గదిలో జరుగుతుంది. ఆ గదిలో పై నుండి వెండి గొలుసులు వేలాడతీసి, వాటికి తూగుటుయ్యాలలో వెండి బంగారు మంచం, మఖమల్ పట్టు పరుపువేసి, భోగశ్రీనివాసుని పరుండబెట్టి, అన్నమాచార్యుల కీర్తనలతో వారి వంశంవారి ద్వారా సంగీత సేవ చేయించి, పాలు, పండ్లు, వేయించిన జీడిపప్పు, బాదంపప్పు, తాజాగా తీసిన గంధం ముక్కలు ఉంచి స్వామివారిని నిద్రపుచ్చుతారు.

ఈ సేవ కోసం శ్రీకృష్ణదేవరాయల భార్యలు చిన్నాజీదేవి, తిరుమలదేవి 1513లో చెరొక బంగారు కప్పును (ఒక్కొక్కటి 374 తూకాల బరువు కలవి) ఇచ్చారని శాసనం. ఈ సేవకు కావల్సిన పాలు, పాలకోవా మీగడల కోసం, జియ్యనాయకర్ రామనాయకర్ అనే కృష్ణదేవరాయల సేనానులలో ఒకరు, 1514లో 200 గోవులను దేవస్థానానికి దానం చేసినట్లు శాసనం ఉంది. తరిగొండ వెంగమాంబగారి ముత్యాలహారతి చేస్తారు.

ఇలా ప్రతిరోజూ పూజలు కాక మూలవరులకు గురువారం నాడు పూలంగిసేవ, శుక్రవారంనాడు చేసే అభిషేకం చాలా విశేషమైనవి.

పూలంగి సేవ

గురువారం నాడు తిరుమామని మండపం - అంటే ఆస్థాన మండపంలో తిరుప్పావడసేవ జరుగుతున్నప్పుడు లోపల మూలవరులకు సడలింపు జరుగుతుంది. స్వామివారికి వేసిన నగలు, ఆభరణాలు అన్నీ తీసివేసి, అంతవరకు అలంకరించిన పూమాలలు తీసివేస్తారు.

గత శుక్రవారంనాడు నుదుటిపై కళ్లను పూర్తిగా కప్పేసినట్లు పెట్టిన స్వామివారి నామాన్ని కూడా కర్పూరం చాలావరకు తీసివేసి సన్నటి నామంగా చేయడం, స్వామివారికి వస్త్ర అలంకారం మాత్రం చేయడం జరుగుతాయి. తర్వాత నైవేద్యం, దర్శనం, సాయంత్రం శుద్ధి జరిగిన తర్వాత, యామునత్తురై (యామున మండపం) నుండి మంగళవాద్యాలతో పూలదండలు స్వామివారి సమర్పణకు తెస్తారు. స్వామివారికి ఇప్పుడు చేసే అలంకారం ఒక్క పూలతోనే. ఆభరణాలేవీ ఉండవు. అందుక ఈ సేవను పూలంగి సేవ అంటారు. ఇదంతా మరుసటి రోజు అంటే శుక్రవారం ఉదయం మూలవరుల అభిషేకానికి తయారీగా భావించాలి.

క్రీ.శ.756 ప్రాంతంలో కూడా ఈ పూలంగి సేవ జరిగేదన్న ఆధారాలున్నాయి. శిలప్పదిగారంలో ఈ సేవ తిరుమలలో జరుగుతున్నట్లు చెప్పబడింది. ఆకాలంలో ప్రతిరోజూ జరిగేదా లేక ఒక్క గురువారం మాత్రమా అనేది స్పష్టంగా లేదు. ప్రతిరోజూ మూలవరులకు అభిషేకం కష్టం అని గదా తర్వాత భోగ శ్రీనివాసుని ప్రతిమచేసి, ఆ తర్వాత ప్రతిరోజు అభిషేకం భోగశ్రీనివాసునికి, శుక్రవారం అభిషేకం మూలబేరానికి జరగడం గమనించాం. అంటే 966 ముందుకాలంలో ప్రతిరోజూ మూలబేరానికి అభిషేకం జరుగుతూవుండి ఉండాలి. అంటే ప్రతి సాయంత్రం పూలంగి జరుగుతూ ఉండాలి అని ఊహించవచ్చు.

★ ★ ★

36. శ్రీవారి అభిషేకసేవలో విచిత్రం!

పరమాత్మ సృష్టిలో అప్రధానమైన ప్రాణి అంటూ వుంటుందా? అలా వుంటే, మాంసాహార జంతువైన పునుగు పిల్లి శరీరం నుంచి జనించే చిక్కటి ద్రవాన్ని స్వామివారు తన విగ్రహానికి పరిమళం కోసం వాడుకొంటారా?

తిరుమలలో మాత్రమే మనం చూడగలిగే అపురూప ప్రక్రియ – పునుగు పిల్లి విసర్జించే పునుగుతో శ్రీవారి విగ్రహానికి అభిషేకం చేయటం.

★ ★ ★

మూలమూర్తికి వారంలో శుక్రవారం మాత్రమే అభిషేకం జరుగుతుంది. ఉదయం శుద్ధి, తోమాల సేవ, అర్చన తర్వాత జరిగే ఈ సేవకు పులుక్కాపుసేవ అని కూడా పూర్వం అనేవారు. స్వామివారి విగ్రహానికి పునుగు నూనెను పూర్తిగా రాసేవారు. అలా పూర్తిగా విగ్రహానికి రాసేది ఈ మధ్యకాలంలోనే అని శాసనాలు చూస్తే తెలుస్తోంది. పునుగు నూనె సంగతి ఎలా ఉన్నా శుక్రవారం అభిషేకం పురాణకాలంలో కూడా జరిగేదని తెలుస్తోంది. తర్వాత కాలంలో ప్రతిరోజూ అభిషేకం జరిగినట్లు ఊహించవచ్చు. భోగశ్రీనివాస ప్రతిష్ఠ తర్వాత ప్రతి శుక్రవారం మాత్రమే మూల విగ్రహానికి అభిషేకం అన్నట్లు ఆధారాలు బాగావున్నాయి. రామానుజుల కాలం నుండి ప్రతి శుక్రవారం తప్పక అభిషేకం చేయాలని, కట్టుబాటు జరిగినట్లు, అలా అప్పటి నుండి జరుగుతున్నట్లు సాహిత్య, చారిత్రక ఆధారాలున్నాయి.

మూలమూర్తికి పునుగునూనె పూసి అభిషేకం చేయడం గురించి మనకు లభ్యమైన మొదటి శాసనం మొదలియార్ తిరుక్కలి కన్రదాసరు చేసిన దేవదేయం. అదికూడా పునుగు నూనె అనకుండా, 'వాసన నూనె' రాయాలనీ, అదీ సంవత్సరానికి 6 నెలలు దక్షిణాయనంలో అనీ, విగ్రహానికంతా కాకుండా ముఖానికి మాత్రమే చేయాలనీ ఆ దేవదేయ శాసనంలో వుంది.

ఇప్పుడు చేసే పద్ధతి - ప్రతిరోజూ స్వామివారి పాదాలకు పునుగు నూనె రాయడం. పునుగు పిల్లి నుండి వచ్చిన పునుగుతో అభిషేకం చేసే సంప్రదాయం 1429లో దేవరాయ మహారాజు చేసిన దేవదేయం నుండి మొదలై ఉండవచ్చని తెలుస్తోంది. పునుగు నూనె వేరు, పునుగు (సుగంధం) వేరూ. పునుగు పిల్లిని కట్టేస్తే, అది దురదతో గాటకి వృషణాలను రుద్దినప్పుడు వాటి నుండి ఊరే చిక్కటి ద్రవాన్ని పునుగు అంటారు. దీన్ని నువ్వులనూనెతో శుభ్రపరచి, మూలవిరాట్టుకు రాస్తారు. కొన్ని దేవాలయాలలో గంధ తైలం మూలమూర్తులకు వాడతారు. ఈ గంధపు నూనెని విగ్రహం పాడవకుండా ఉండటానికి, పురుగులు, బొద్దింకలు రాకుండా ఉండటానికి వాడతారు. కాని ఈ ప్రక్రియను సంవత్సరానికి ఒకసారో రెండుసార్లో చేస్తారు.

1496 AD నాటి కందాడై అప్పచ్చి అనే అయ్యంగారి దేవదేయ శాసనం ద్వారా తెలిసేదేమిటంటే, ప్రతి రెండు వారాల కొకసారి శుక్రవారం నాడు - అంటే 15 రోజుల కొకసారి ఈ పునుగు కాపు తిరుమలలో విగ్రహానికి వాడేవారు అని. ప్రతివారం పునుగు నూనె రాయడం ఎప్పుడు మొదలయిందో తెలిపే ఆధారాలేమీ కనపడటంలేదు. 1434–1496 మధ్య మొదలై ఉండాలి. 1506 సంవత్సర శాసనం ద్వారా ఈ సుగంధం స్వామివారికే కాని, అమ్మ వారికి కాదని తెలుస్తోంది.

కృష్ణదేవరాయల కాలానికి–1517 AD నాటికి - ప్రతివారం ఈ పునుగు కాపు జరిగేదని తెలుస్తోంది. వెయ్యి వరహాలకు దేవదేయం చెక్కించారు.

స్వామివారి శుక్రవార అభిషేకంలో ఏమి వాడేవారో 1583 A శాసనం - ఎట్టూరు తిరుమలై కుమారతాతాచారి దేవదేయం ద్వారా తెలుస్తుంది.

గంబుర (కర్పూరం)	=	4 కుడిరం (1 కుడిరం - 210 వరహా)
పునుగు మూటలు	=	200
గులాబీ నీరు	=	12 గంగాళాలు
కుంకుమపువ్వు	=	30 పనాల బరువు
తెల్లవస్త్రం	=	1

ఈ రోజుల్లో అభిషేకానికి వాడే కస్తూరి, అమ్మవారి అభిషేకానికి వాడే పసుపును గురించి ఆ రోజుల్లో వాడే విధానం లేదన్నట్లు తెలుస్తోంది. ఇప్పటి దిట్టం ఈస్టిండియా కంపెనీవారి కాలంలో మొదలైంది.

ఈ రోజుల్లో మనం అభిషేకానికి వాడే దిట్టం ఇలాగుంది.

పచ్చకర్పూరం (గంబుర)	=	84 తులాలు
పునుగు	=	1½ చటాకులు
కుంకుమపువ్వు	=	36 తులాలు
కస్తూరి	=	3 వరహాల బరువు
పసుపు	=	¼ సేరు

పసుపుతో అమ్మవారికి అభిషేకం చేస్తారు. స్వామివారి అభిషేకం పూర్తికాబోయే ముందు చేస్తారు. పూర్వం అభిషేకం నిత్యనైమిత్తికం. ఈ రోజుల్లో దాన్ని ఆర్జితసేవ చేశారు. అభిషేక ఆర్జితసేవాదారులందరికీ తలో వెండి గిన్నె, చెంబు కొంచెం సుగంధ ద్రవ్యం వేసిఇస్తారు. కార్యనిర్వహణాధికారి, జియ్యంగారు ముందుండగా, ఊరేగింపుగా ఆర్జిత సేవదారులందరూ తమతమ గిన్నెల్లో సుగంధద్రవ్యాలతో బయలుదేరి విమానప్రాకారం చుట్టి, వెండి వాకిలి బయటకు వచ్చి, ధ్వజస్తంభానికీ, బలిపీఠానికీ ప్రదక్షిణ చేసి మళ్లీ విమాన ప్రాకారంలోకి వెళ్లి, బంగారువాకిలి ద్వారా లోపలికి వెళ్తారు. బంగారువాకిలి దగ్గర ఈ సుగంధ ద్రవ్యాల గిన్నెల్ని, చెంబుల్ని ఆలయఅధికారులు వాపసు తీసుకొంటారు. అందులో ఉన్న సుగంధద్రవ్యాల్ని లోపలికి పంపి స్వామివారికి అభిషేకంలో వాడాలి. కాని ఈ మధ్యకాలంలో అదికూడా చేయడంలేదు. సేవాదారులకిచ్చిన గిన్నెలలో సుగంధాన్ని అభిషేకంలో వాడకుండానే గిన్నెలు కడిగేస్తారు (నీటితో తడవడం వలన ఇతరులు ముట్టడంతో శుద్ధికాదన్న ఉద్దేశంతో). స్వామి వారికి మొదట క్షీరాభిషేకం గంగాళాలతో, బంగారు శంఖంతో 10 నిమిషాలపాటు జరుగుతుంది. ఆలయం సమర్పించే పాలే కాక, భక్తులు కూడా పాలను అభిషేకం కోసం ఇచ్చే సదుపాయం కూడా ఉంది.

మూలవిగ్రహానికి పచ్చకర్పూరంతో కస్తూరితో నామం పెడతారు. కర్పూర హారతి ఇస్తారు. ఇవన్నీ క్రీ.శ.1000 సంవత్సరాల నుండి ఆలయంలో వాడేవారా? పచ్చకర్పూరం, కుంకుమ పువ్వు వాడకాలు – 15/16వ శతాబ్దాలలోనే మొదలయినట్లు తెలుస్తోంది. పూర్వకాలంలో పునుగు పిల్లులను చంపి తీసిన నూనె వాడేవారని ఆధారాలున్నా, ఈ రోజుల్లో జంతువులను చంపి తీసే పదార్థాలు వాడలేంకదా?

కస్తూరి విషయంకూడా అంతే. రెండు రకాల కస్తూరి. ఒకటి జంతువుల శరీరం నుండి వచ్చేది. ఇంకోటి కస్తూరి చెట్టు (పంజాబు, హిమాలయ ప్రాంతాలలో

ఉంటాయి). వాటి ఆకులు కస్తూరి వాసనతో ఉంటాయి. స్వామివారికి వాటినే వాడతారు. పచ్చకర్పూరాన్ని కూడా అభిషేక జలాల్లో కలిపి, కుంకుమపువ్వు, గంధపుపొడి కలిపిన సుగంధ జలాలతో స్వామివారికి అభిషేకం చేస్తారు. పూర్వం మిరాశీలున్నప్పుడు ఈ అభిషేక జలాలు, గంధం, అమ్మవారికి అభిషేకం చేసిన పసుపు, స్వామివారి నామానికి వాడిన పచ్చకర్పూరం - వీటన్నింటినీ, అర్చకులు, జియ్యంగారు, ఆచార్యపురుషులు, కొంత ఆలయానికని పంచుకొనేవారు. వీటిని బయట యాత్రికులకు రహస్యంగా అమ్ముకొని డబ్బుచేసుకొనే వారని చెప్పుకొనేవారు. ఇప్పుడు ఆర్జిత సేవాదారులకు, వి.ఐ.పి.లకు స్వామివారి గంధం, పచ్చకర్పూరం, అభిషేక తీర్థం ఇచ్చే సంప్రదాయం ఉంది. స్వామివారికి అభిషేకం చేసిన క్షీరం - రామానుజుల సన్నిధి ముందే, భక్తులందరికీ క్షీరతీర్థంగా ఇచ్చే సంప్రదాయం ఉంది.

అభిషేకానికి వచ్చిన ఆర్జిత సేవాదారులకు తీర్థం, పసుపు, పచ్చకర్పూరం, అభిషేక తీర్థం ఇచ్చే అలవాటు ఇప్పటికీ కొనసాగుతోంది.

అభిషేకం గురించి చెప్పుకొనేటప్పుడు అభిషేకానంతరం స్వామివారికి కట్టే వస్త్రం గురించి ఒక మాట చెప్పుకోవాలి. పూర్వకాలంలో రాజులు, జమీందారులూ స్వామివారి దర్శనానికి వచ్చేప్పుడు వస్త్రాలు బహూకరించే సంప్రదాయం ఉంది. ఆ వస్త్రం స్వామివారికి కట్టాలంటే 'వర్తన' - అంటే ఆ వస్తువు ఎంత ఖరీదో అంత నగదు రూపంలో ఆలయానికి కడితే, స్వామివారి అలంకారానికి ఉపయోగించడం రివాజు. రాజులు పోయారు, జమీందారులు పోయారు. దానితోపాటు, అటువంటి విలువైన వాటిని ఇచ్చే దాతలూ కనుమరుగయినారంటానికి లేదు! కాని...

నేను తిరుమల-తిరుపతి దేవస్థానాల కార్యనిర్వహణాధికారిగా 1978లో వచ్చినప్పుడు నాకు ఆశ్చర్యం కలిగిన విషయమేమిటంటే, స్వామివారికి సంవత్సరంలో నాలుగుసార్లు పెద్ద పండుగలకు మాత్రమే కొత్త వస్త్రం కట్టేవారు. మిగతా వారాల్లో ఆ వస్త్రాలనే వుతికి మళ్లీ కట్టేవారు. 'అదేమి'టని నేనడిగితే వస్త్రం ఖరీదు 8000 రూపాయలు పైగా ఉంటుందని చెప్పారు (ఇప్పుడు దాదాపు 20 వేలు ఉంటుంది). ప్రతి వారం కొత్త వస్త్రమంటే చాలా ఖర్చు అవుతుందనీ, అందుకే కట్టడం లేదనీ అధికారులు అన్నారు. ఈ తిరుమల స్వామి వారికి డబ్బు ఖర్చవుతుందని కొత్తబట్ట కట్టకపోవడమా? - అని వెంటనే ప్రతివారం స్వామివారికి కొత్త వస్త్రం కట్టాలని ఉత్తర్వులిచ్చి, ఎవరైనా దాతలు వస్త్రం ఇస్తే, వారి దంపతులను అభిషేకానికి ముందు కూర్చుని చూసే అవకాశం కల్పిస్తామని ఒక స్కీము ప్రవేశపెట్టాను. ఆ రోజుల్లో

అభిషేకం టిక్కెట్టు - రూ. 200. ఈ దంపతులు 8000 రూపాయలతో వస్త్రం ఇస్తున్నారని అలా చేయడం జరిగింది.

ఆ పథకానికి ఎంత ఆదరణ వచ్చిందంటే, ఈ రోజుల్లో ప్రతి శుక్రవారం 15 నుండి 20 వస్త్రాలకు దేవస్థానానికి ఆదాయం వస్తోంది. కట్టేది ఒక వస్త్రమే. దానికి రుసుము 12500. అలాకాక విడిగా వస్త్రం ఆఖరి నిమిషంలో విఐపిగా వచ్చి ఇవ్వాలంటే 50 వేల రూపాయలుకట్టాలి. అలా ఇవ్వాలనుకున్నవారే వచ్చే 30/40 సంవత్సరాలకు అన్ని శుక్రవారాలకూ ముందే రిజర్వు చేసుకోవడం జరుగుతుంది. ఇది వస్త్రాలకోసం కాదు, అభిషేకానికి ముందు కూర్చొని చూసే అవకాశం ఉందని. రూ. 50 వేలు కట్టడానికి కూడా ప్రతివారం చాలామంది సిద్ధం!

సుగంధాల గురించి చెప్పుకొనేటప్పుడు. అర్ఘ్యానికి, పాద్యానికి, ఆచమనానికి, స్నానానికి, ఇతరాలకు వాడే గిన్నెలలో ఏయే సుగంధాలు వాడాలో వైఖానస ఆగమంలోనూ, మరీచి సంహితలోనూ వివరంగా చెప్పబడింది. రామానుజుల కాలంలో పూజాక్రమాన్ని కట్టుదిట్టం చేసినప్పుడు, ఏమేమి వాడాలో చాలా స్పష్టంగా సూచించారు. కాని ఇప్పుడు పూజాక్రమంలో వాడే సుగంధాలు చూస్తే వాటికీ వీటికీ సంబంధమే లేదు. ఈ ఆలయ సంప్రదాయం ఏ ఆగమానికి కట్టుబడకుండా సాగుతోందని చెప్పడానికి ఇదొక నిదర్శనం... ఏ ఆగమంలోనూ పచ్చకర్పూరం గాని, కుంకుమ పువ్వు గాని చెప్పబడలేదు. ఆలయంలో ముఖ్యంగా వాడేవి ఈ రెండే. ఈ రెండు పదార్థాలు - 15/16వ శతాబ్దాలలో ఇతర దేశాలతో వ్యాపారాలు పెంపొందిన తర్వాత దేశానికి వచ్చిన వస్తువులు. కాశ్మీరులో కుంకుమ పువ్వు పండించినా ఆ పండించడం ఈ తర్వాత కాలంలోనే... ఆగమంలో చెప్పిన లవంగం, ఏలకులు, గసగసాలు, వట్టివేళ్ల వంటివి కూడా వాడుతుంటారు.

★ ★ ★

37. సానులు హారతిస్తేనే స్వామి కదిలేది!

తిరుమల శ్రీనివాసుడికి నాట్యసానులు హారతులిచ్చేవారు.

భక్తి ఉట్టిపడే ముఖారవిందం, నిత్య నృత్యసాధనతో తీర్చిదిద్దినట్లుండే అంగసౌష్ఠవం, ఆభరణాల అలంకారం వల్ల ఇనుమడించిన అందంతో – స్వామివారు నిజంగా వీరివంకే కన్నార్పకుండా చూస్తున్నారా – అనిపించే ఆకర్షణ మూర్తీభవించిన సానులు నాట్యం చేస్తేనేకాని స్వామివారి ఉత్సవమూర్తులు ఊరేగింపులకి బయటకు వచ్చేవి కాదు.

'తిరువీథిసానులు' అని పిలవబడే ఆ నాట్యసానులకి స్వామివారి అనుగ్రహం ఎంతగా వుండేదంటే, ఉత్సవాలలో భాగంగా స్వామివారు తిరుమల మాడవీథులలో ఊరేగేటప్పుడు, ఈ తిరువీథిసానుల చేత కుంభహారతి ఇప్పించేవారు అర్చకులు. ఉత్సవాలలో వాళ్ల నృత్యాలు ప్రధాన ఆకర్షణగా వుండేది.

జరిగిందేమిటంటే...

★ ★ ★

అది 15వ శతాబ్దంలోని మాట.

ఆ రోజుల్లో కందాడై రామానుజ అయ్యంగార్ అనే పరమ భక్తుడు దేశంలోని 108 దివ్య వైష్ణవ క్షేత్రాలను సందర్శించాలని బయల్దేరాడు. దక్షిణాదిన వున్న దివ్యక్షేత్రాలన్నీ చూసుకుని, చిట్టచివరి మజిలీగా తిరుమల క్షేత్రం చేరుకున్నాడు.

అప్పటికి ఈ ప్రాంతాన్ని సాళువ నరసింహరాయలు పాలిస్తున్నాడు. ఈ రాజుకి దైవభక్తి చాలా వుంది. అతనికి కందాడై రామానుజ అయ్యంగార్‌ని తిరుమలలో చూసిన దగ్గర్నుంచి అవ్యక్తమైన గౌరవప్రపత్తులు ఏర్పడ్డాయి. దానికి తగినట్లుగా కందాడై రామానుజ అయ్యంగార్ స్వామివారి సన్నిధిలోనే ఎక్కువకాలం గడుపుతూ,

ఆయన వైభవాన్ని ఇనుమడింపజేసేలా కొత్త కొత్త ఉత్సవాలకు, సేవలకు రూపకల్పన చేయడం ప్రారంభించాడు.

రామానుజ అయ్యంగార్ శ్రీవైష్ణవుడే. పాంచరాత్ర ఆగమం పాటించేవాడే అయినా, ఆలయ పూజాపద్ధతిలో అప్పటికి ఆచరణలోవున్న వైఖానస సంప్రదాయంలో మార్పులు తేవడానికి ప్రయత్నం చేయకుండానే, కొత్త ఉత్సవాల్ని, కార్యక్రమాల్ని ప్రతిపాదించాడు. ఇవన్నీ సాళువ నరసింహరాజుకి నచ్చాయి. క్రమంగా ఆ రాజుకి రామానుజ అయ్యంగారిలో ఒక ఆధ్యాత్మిక గురువు కనిపించసాగాడు.

దాంతో తిరుమలకొండ మీద వున్న రామానుజ కూటాన్ని కూడా రామానుజ అయ్యంగార్ అధీనంలోకి తీసుకువచ్చాడు. తిరుమల ఆలయంలో స్వామికిచ్చే నైవేద్యం ద్వారా ప్రసాదాలలో దాత వాటాగా వచ్చే నాల్గవ వంతుని ఈ రామానుజ కూటానికి చెందేలా కూడా రాజు చేశాడు. ఆ ప్రసాదాన్ని రామానుజ అయ్యంగార్ వైష్ణవులకు పంచి పెట్టేవాడు.

కాని...

★ ★ ★

ఒక శాసనంలో బయటపడిన విషయం ఏమిటంటే- శ్రీవైష్ణవులకు పంచిపెట్టగా మిగిలిన ప్రసాదాన్ని కందాడై అయ్యంగార్ యాత్రికులకు అమ్మేసేవాడు. అలా ప్రసాదాలు అమ్మగా వచ్చిన సొమ్ము 3000 పణాలు అయ్యాక, ఆ డబ్బుతో స్వామివారి నగలు మరమ్మతు చేయించాలనుకుంటాడు. అందుకోసం స్థానత్తారుల (ఆలయ అధికారుల) అనుమతి కోరాడు.

కందాడై అయ్యంగార్ ప్రతిపాదనతో స్థానత్తార్‌లు విభేదించారు. పైగా తమపైన వుండే పాలనాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారం రాజైన సాళువ నరసింహరాయల దాకా వెళ్లింది.

అయితే అప్పటికే కందాడై అయ్యంగారిలో ఒక ఆధ్యాత్మిక గురువుని చూసుకొంటున్న మహారాజుకి, ఈ ప్రతిపాదనలో తప్పు కనిపించలేదు. వెంటనే రాజుగారి అనుమతి మంజూరైంది. 1495 జూలై 1న రాజప్రాసాదం నుంచి వెలువడిన ఈ ఆదేశాల ప్రకారం – తిరుమల శ్రీనివాసుడి స్వర్ణాభరణాలతో పాటు ఆలయంలోని బంగారు, వెండి పాత్రలను కూడా మరమ్మతు చేయించడానికి కందాడై అయ్యంగార్‌ని అనుమతించారు.

ఈ మరమ్మత్తులన్నీ స్థానత్తార్ల సమక్షంలోనే జరగాలనీ, మరమ్మత్తులన్నీ జరిగాక లెక్కలు చూసి, మిగులు తరుగుల వివరాలతో శ్రీవారి భండారానికి (కోశాగారానికి) అందజేయాలని కూడా ఆ ఆదేశాలలో పేర్కొని వుంది. ఆలయ కోశాగారానికి కందాడై రామానుజ అయ్యంగార్‌నే అధికారిగా నియమిస్తూ మరో రాజశాసనం కూడా వెలువడింది.

ఈ రాజశాసనానికి అనుగుణంగా స్థానత్తార్‌లు ఒక శిలాశాసనం కూడా చేయించి పెట్టారు:

"ప్రతి సంవత్సరం కందాడై రామానుజ అయ్యంగార్ తనకున్న మూడు రామానుజ కూటాల నుండి వెయ్యి పణాల దాకా కూడబెట్టి ఏటా మూడు వేల పణాలతో ఆభరణాల మరమ్మత్తులు చేయించాల్సి వుంటుంది. ఇంకా ఏమైనా సొమ్ము మిగిలితే, దానిని కోశాగారానికి జమచేసి, మరుసటి సంవత్సరం అవే పనులకు వాడాల్సి వుంటుంది..."

★ ★ ★

కందాడై అయ్యంగార్‌కి కొత్త అధికారం వచ్చాక కొత్త ఆలోచనలు కూడా వచ్చాయి. అందులో భాగమే - నాట్యసానుల నృత్యగానాలు.

ప్రతి రెండవ శుక్రవారం నాడు శ్రీవారి అభిషేకానికి పునుగు నూనెని ఈయనే సమకూర్చేవాడు. అభిషేకం జరిగాక శ్రీవారికి అరిసెలు నైవేద్యం పెట్టించేవాడు. అప్పుడు నాట్యసానులు రంగప్రవేశం చేసేవారు. నలుగురు వచ్చేవారు. ఆ నలుగురికీ పరివట్టం (శ్రీనివాసుడి సమక్షంలో ఆయన సేవలో పాల్గొనేటప్పుడు తలకి కట్టుకునే వస్త్రం) కట్టేవారు.

అలా నాట్యసానులు శ్రీనివాసుడి సమక్షంలో గానం చేస్తూ, నృత్యం చేస్తూ వుంటే, భక్తులు తన్మయత్వంలో మునిగిపోయేవారు. చెవులకీ, నేత్రాలకీ విందు చేస్తున్నట్లు సాగేవి ఆ నాట్యాలు. అయితే వాటిల్లో శ్రీనివాసుడి పట్ల భక్తిభావ ప్రకటన ఎంత వుండేదో తెలీదుకాని, కందాడై రామానుజ అయ్యంగారి భక్తిప్రపత్తులు, సేవల గురించి ప్రశంస మాత్రం పొంగి పొర్లుతూండేదని శాసనాలు చెబుతున్నాయి.

ఆ రోజుల్లో ఈ నాట్యసానుల నృత్యగానాలు తిరుమల ఆలయంలో భక్తులకు ఒక ప్రత్యేక ఆకర్షణగా వుండేవి. నాట్యసానులు శ్రీనివాసుడి ఆలయంలో నర్తిస్తారు

కనుక శ్రీవారి సేవకే అంకితమై, వివాహం చేసుకోకుండా కన్యలుగా వుండిపోవాలన్న నియమంతో వారి పాత్ర ప్రారంభమైంది. అలా చాలా సంవత్సరాలు నడచింది.

కాని ఈ నియమాన్ని అమలుచేయడం ఎవరికి సాధ్యం?

క్రమంగా – దేవుడిముందు పలుకుబడిగల వాళ్లుగా చలామణి అయ్యేవాళ్లూ, సంపన్నులూ ఈ నాట్యసానుల పొందుకోసం వెంపరలాడటం మొదలై, మానవ సహజమైన బలహీనతవల్ల నాట్యసానులు తమ కన్యత్వానికి నీళ్లు వదిలేశారు. రోజులు గడుస్తున్నకొద్దీ వీళ్ల శృంగారగాథలు కూడా ప్రచారంలోకి రావడం మొదలైంది.

సదాశివదేవ మహారాయలు పాలించే నాటికి పరిస్థితులు ఇలా మారడంతో, ఆయన తిరుమలకొండ మీద దేవదాసీలు గానీ, తిరువీథి నాట్యసానులు గానీ వుండరాదన్న నియమాన్ని విధిస్తూ ఆదేశాలు జారీ చేశాడు. అప్పటికే ఆ సేవలో ఉన్న వారందరినీ తొలగించివేశాడు.

★ ★ ★

కొన్ని సంప్రదాయాలు, అభ్యాసాల విషయంలో తిరుమల ఆలయం మిగతా విష్ణాలయాలకి భిన్నంగా వుంటుంది.

ఉదాహరణకి, అనేక దేవాలయాల్లో వేదపఠనం చేసేవారు, భజనలు చేసేవాళ్లూ, నృత్యం చేసేవాళ్లూ... ఇలా వివిధ సేవలందించేవాళ్లు తమ కులదేవతలకు సేవ చేస్తున్న భావనతో స్వచ్ఛందంగా చేస్తూంటారు. కాని తిరుమలలో అలాకాదు.

తిరుమల ఆలయానికి వచ్చి సేవ చేసేవారికి సంభావనలివ్వటం సంప్రదాయం. నాద స్వరమైనా, వేదపఠనమైనా, ప్రబంధాల పారాయణ అయినా, కోలాటాలయినా... సంభావన ఇచ్చి చేయించుకునే అభ్యాసమే నడుస్తోంది.

అలాగే 966వ సంవత్సరంలో భోగశ్రీనివాసుని ప్రతిష్ఠ సమయంలో ప్రవేశపెట్టిన నాలుగు నాలీల (వండిన) బియ్యపు నైవేద్యం – సగం పగలగొట్టిన కొత్తకుండ (ఓడు) లో వండినది – మాత్రమే కులశేఖర పడి దాటి గర్భాలయంలోకి వెళ్లి శ్రీవారికి నివేదింప బడుతుంది. ఇప్పటికీ అదే సంప్రదాయం. అదికాక, పళ్లు, పూలు, కర్పూర హారతి కూడా గర్భాలయంలోకి వెళ్తాయి. అంతే!

ఇంతకుమించి ఎంత గొప్పవారు ఎంత గొప్ప నైవేద్యాన్ని స్వామికి అర్పించాలనుకున్నా, అవన్నీ స్నపన మందిరం వరకే పరిమితం. కులశేఖరపడి దాటి గర్భాలయంలోకి ప్రవేశించటానికి వీల్లేదు.

ఇంకొక వైఖానస ప్రత్యేకత ఏమిటంటే - తిరుమలలో ఏ ఉత్సవం, ఎంత గొప్పదైనా చేస్తున్నప్పుడు, మూలవరుల పూజలో మార్పుగాని, అశ్రద్ధగాని, లోపంగాని జరిగే అవకాశం లేదు. ఏమిచేసినా, మూలవరుల సేవలు సక్రమంగా చేశాకే. ఉత్సవం తెల్లవారుజామున చేయాలంటే, ఆలయంలో కార్యక్రమాలు మామూలు కంటె ముందుగా మొదలుపెట్టి, అన్నీ సక్రమంగా చేసి, అప్పుడు ఉత్సవం చేస్తారు. పంచమి తీర్థానికి కాని, ముక్కోటి ఏకాదశికి, ద్వాదశికికాని, బ్రహ్మోత్సవాలలో కాని, ధర్మదర్శనం ముందుగా మొదలు పెట్టాలన్నా, ఆలయం త్వరగా తెరిచి, అన్ని సేవలూ - తిరువారాధనం, నైవేద్యం, శాత్తుమొర పూర్తిచేశాకే ఉత్సవాలకు కాని ధర్మదర్శనానికి కాని అవకాశం కల్పిస్తారు.

దక్షిణాదిన ఈ విషయంలో కొంత అలసత్వం ఉన్నట్లు కన్పిస్తుంది. ఉత్సవాలకు ఎక్కువ ప్రాధాన్యం, మూలమూర్తి పూజలు సంక్షిప్తం చేసే సంప్రదాయం చాలా చోట్ల ఉంది. ఆ ఆలయాలలో బ్రహ్మోత్సవాల తీర్థవారి అయింతర్వాత ద్వాదశ ఆరాధన చేసే సంప్రదాయం ఉంది. అంటే ఉత్సవసమయంలో ఏదైనా మూలవరుల ఆరాధనలో లోటుపాట్లు ఉంటే ప్రాయశ్చిత్తంగా ఈ ద్వాదశ ఆరాధన చేస్తారు. ఆ పద్ధతి తిరుమలలో లేదు.

పైగా కొన్ని ఉత్సవ సమయాల్లో, ఉత్సవమూర్తులను గర్భగృహంలోకి తేకుండా, కళ్యాణ మండపంలోనే ఉంచే సంప్రదాయం తిరుమలలో ఉంది. మూలమూర్తులకు ఉత్సవాలతో సంబంధం లేదేమో అన్నట్లుగా జరుగుతాయి.

వైఖానస సంప్రదాయపూజ కనుక ఈ ఆలయంలో ఆళ్వారులుకాని, ఆచార్యులుకాని (రామానుజులు తప్ప) లేరు. ఈ ఆలయంలో అర్చకులు ఆరాధన చేస్తున్నన్ని రోజులూ భార్యాసంగమం లేకుండా ఉండాలనే నియమం ఉంది. పూర్వపు మిరాశీదార్లు అర్చకులుగా ఉన్నప్పుడు, వారికూటాలలో కుటుంబాలు లేకుండా అర్చకులను ఉంచి, అన్నివసతులు కల్పించే ఏర్పాటు ఉండేది. రెండు నెలలకొకసారి వారికి సెలవులు ఇప్పించి వారివారి కుటుంబాలను సందర్శించే వెసులుబాటు ఉండేది.

మిరాశీ వ్యవస్థ సుప్రీం కోర్టు తీర్పుతో పోయాక, జీతాలు తీసుకొని దేవస్థానం తరఫున పనిచేసే అర్చకులు ఇప్పుడు కొండమీద ఉన్నారు. ఈ నియమాలను పద్ధతి ప్రకారం పాటించాలి. దానిపై కొన్ని కట్టుదిట్టమైన ఏర్పాట్లు జరగాలి.

ఆచార్య పురుషుల గౌరవమర్యాదల విషయంలోనూ, నామం ఎలా ఉండాలి అన్న విషయంలోనూ. శ్రీవైష్ణవులలోనే చాలా తగాదాలు వచ్చి, కోర్టులకెక్కి చివరి విషయ నిర్ణయం క్రైస్తవ, మహమ్మదీయ న్యాయాధికారుల చేతులకు వెళ్లి వాళ్ల నిర్ణయాలు మనకు శిరోధార్యం అయ్యాయి!

గమనించదగ్గ విషయం ఏమిటంటే, 966కు పూర్వం నుండి తిరుమల ఆలయంలో అర్చకత్వం చేస్తున్న వైఖానస అర్చకులంతా తెలుగు మాట్లాడేవారు. వారు సంప్రదాయ పరిరక్షణలో చాలా శ్రద్ధ చూపినవారు. చాంద్రమాన పంచాంగం పాటించేవారు. ఇప్పటికీ అదే సంప్రదాయం కొనసాగుతోంది. కాని ఆలయంలోని ఉత్సవాలు సూర్యమాన సిద్ధాంత పంచాంగం ప్రకారం ఉంటాయి.

★ ★ ★

ఈ సంప్రదాయాలన్నీ ఒక ఎత్తు అయితే, ప్రసాదాల పంపిణీ మరో ఎత్తు. తిరుమల ఆలయంలో ప్రసాదాలు పంపకానికి చాలా పెద్ద చరిత్ర వుంది.

కందాడై రామానుజ అయ్యంగార్ కాలంలో - ఆలయ అధికారుల నుంచి కాపలాదారుల వరకూ అందరికీ జీతాలు ఆయనే ఇచ్చేవాడు. అయితే ఆలయ సేవలలో పాల్గొనే కొంతమందికి జీతాలను నగదుగానూ, కొంతమందికి ప్రసాదాల రూపంలోనూ ఇచ్చేవాడు. ఆలయాన్ని శుభ్రం చేసే వాళ్లకీ ప్రసాదాలే, ఏనుగుల్ని చూసుకునే మావటీలకూ ప్రసాదమే.

ఆలయంలోనూ, బయటా కూడా ప్రసాదాలు అమ్ముకునే సంప్రదాయం ఆ రోజుల్లోనే వుండేది. అంటే - దాతల భాగంగా వచ్చిన ప్రసాదాలు మిగిలిపోతే, వాటిని కందాడై అయ్యంగార్ విక్రయిస్తే, అర్చకులు, జియ్యంగార్లు, స్థానత్తార్‌లు వాళ్లవాళ్ల భాగాల్ని అమ్ముకునే వాళ్లన్నమాట.

1978-82 కాలంలో నేను తిరుమల-తిరుపతి దేవస్థానాల ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా వున్నప్పుడు - ఆలయ సంపంగి ప్రాకారంలో అర్చకులు, జియ్యంగారు, పోటు మిరాశీదార్లు వారివారి వాటాలుగా వచ్చిన ప్రసాదాన్ని యాత్రికులకు అమ్ముతుండేవారు. 15వ శతాబ్దం నాటి నుండీ ఈ అభ్యాసం సాగుతూ వుండేదని తెలుస్తోంది.

శ్రీనివాసుడికి నైవేద్యం పెట్టిన అన్న ప్రసాదాల్ని భక్తులకు విక్రయించడ మేమిటి? - అన్న ప్రశ్న నాలో ఉదయించింది. అప్పట్నుంచి దేవస్థానం వాటాగా

వచ్చే నైవేద్య ప్రసాదాన్ని (చక్రపొంగలి, పులిహోర, దధ్యోదనం, కట్టెపొంగలి) శ్రీవారి దర్శనం చేసుకుని వస్తున్న భక్తులకు ఉచితంగా పంచాలని ఆదేశాలిచ్చాను... అమలు చేశారు. కాని ఆ ప్రసాదం ఎక్కువమంది భక్తులకు పంచడానికి సరిపోయేది కాదు.

అప్పుడు మిరాశీదారులందరినీ పిలిపించాను. "మీమీ వాటాల నైవేద్య ప్రసాదాన్ని దేవస్థానానికి విక్రయించండి. దానిని మేం భక్తులకు ఉచితంగా పంచిపెడతాం" అన్నాను.

కాని, మిరాశీదార్లు ఒప్పుకోలేదు. "మాకు అమ్ముకునే హక్కుపోతుంది కదా!" అన్నారు.

"పోతే ఏమయిందయ్యా! కేవలం ప్రసాదాలు అమ్మటంకోసం బ్రాహ్మల్ని కౌంటర్‌లో కూర్చోపెట్టి జీతాలిస్తున్నారు. ఆ ఖర్చు మీకు మిగులుతుంది కదా!" అన్నాను.

నేను ఎన్నో రకాలుగా చెప్పి చూశాను. వాళ్లు ఒప్పుకోలేదు. తన భక్తులకి తన నైవేద్య ప్రసాదాన్ని ఉచితంగా పంచలేనంత నిస్సహాయస్థితిలో శ్రీనివాసుడు పడిపోయాడు... నేను విడివిడిగా మిరాశీదారులతో మాట్లాడి ఒప్పించే ప్రయత్నం చేశాను.

చివరికి వాళ్లు లోపాయికారీగా బయటపెట్టిన 'రహస్యం' ఏమిటంటే-

"అయ్యా, మేం దేవస్థానానికి ఈ ప్రసాదాల్ని అమ్మితే మీరు చెక్కురూపంలో మాకు చెల్లిస్తారు. ఒకవేళ నగదుగా చెల్లించినా అది మీ రికార్డుల్లో నమోదు అవుతుంది. అందువల్ల ఆ ఆదాయం మీద మేం ఆదాయపు పన్ను కట్టాల్సి వస్తుంది కదా! అందుకే ఇలా చేస్తున్నాం. ఇప్పుడైతే ఆ ప్రసాదాన్ని మేం మా సిబ్బంది అవసరాలకి వాడినట్లు చూపించుకోవచ్చు..."

అందుకే, అప్పుడే- దర్శనం చేసుకున్న ప్రతి యాత్రికుడికి ఒక చిన్నలడ్డు ప్రసాదం ఉచితంగా పంచిపెట్టే పథకాన్ని ప్రవేశపెట్టడం జరిగింది (ఈ విషయాలన్నీ నా తిరుమల అనుభవాల మాలిక 'నాహంకర్తా...'లో రాశాను).

★ ★ ★

38. విజయనగర రాజులు - స్వర్ణయుగ ఆరంభం

తిరుమల ఆలయచరిత్రలో విజయనగర రాజుల పరిపాలన కాలం ఒక స్వర్ణయుగంగా చెప్పుకోవాలి.

అన్నిరంగాలలో ఆలయ అభివృద్ధి జరిగింది. ఆలయ పరిపాలన విషయంలో మంచి మార్పులు, తిరుమల కట్టడాలలో గణనీయమైన ప్రగతి, యాత్రికులకు వసతి, భోజన సదుపాయాలు ఏర్పాటు చేయడంలో ఎక్కడ లేని శ్రద్ధ, స్వామివారికి సమర్పించిన విలువైన కానుకలు, నగలు, వస్త్రాలు, వజ్ర వైడూర్యాలు, గ్రామాలు, భూములు, దేవదేయాలుగా ఇవ్వడంలో అపరిమితమైన ఆసక్తి, కొత్త కొత్త సేవలు, తిరునాళ్లు, ఉత్సవాలు ప్రవేశపెట్టడం, వీలయినప్పుడల్లా రాజులు, మంత్రులు తమ కుటుంబాలతో కొండకు వచ్చి, స్వామివారిని తమకు లభించిన ప్రతి విజయానికీ కృతజ్ఞతాభావంతో సేవించడం, వారిని చూసి, వారి అధికారులు, సామంతులు, సైన్యాధిపతులూ ప్రత్యేకంగా భక్తి చూపడం, కొండపై జరిగే కార్యక్రమాల తీరుపై ఆలయ అధికారుల ప్రవర్తనపై ప్రాంతీయ రాజ్యాధికారులు ప్రత్యేక నిఘా పెట్టడం... ఇవన్నీ తిరుమల వైభవాన్ని వేనోళ్ల చాటి దక్షిణాది దేశాలన్నిటిలో - ముఖ్యంగా తెలుగు, కన్నడ ప్రాంతాల్లో స్వామివారి మహిమ ఊరూరా పాకే అవకాశాన్ని కల్పించారు.

ఈ ఆలయ విషయాల్లో వారు ఎలా చొరవ తీసుకొన్నారో తెలియాలంటే, అప్పటి రాజకీయ పరిస్థితుల అవగాహన కొంత కావాలి.

తిరుమల - మధుర సుల్తానుల పరిపాలనలో ఉంది. ఉత్కళదేశ (ఒరిస్సా) రాజు వీరబల్లాల తన సేనానాయకుడు మంత్రి అయిన సింగయ్యధన్నాయకుని తిరుపతి సామంతరాజైన యాదవరాజు వద్దకు పంపినట్లు ఇదివరకే చెప్పుకొన్నాం. ముస్లింల దండయాత్రలతో యాదవరాజుల ప్రాబల్యం తగ్గడం మొదలైంది. తమ ప్రాపకం నిలుపుకోవడానికి హోయసల రాజు వీరబల్లాల-III మధుర సుల్తాను మీదకు దండయాత్రకు బయలుదేరి తిరుచునాపల్లి దగ్గర యుద్ధంలో మరణించాడు.

సింగయ్య తిరుపతి వచ్చి తిరుమల ఆలయ విషయాల్లో చాలా శ్రద్ధ చూపి, కొండపై నందనవనాలు స్థాపించి, 1336 ప్రాంతంలో తన రాజు సుల్తానులతో యుద్ధానికి బయలుదేరాడని తెలిసి, అతనికి సహాయంగా ఉండటానికి తాను తిరుపతి వదలి దక్షిణాదికి బయలుదేరాడు.

తాను కొండపై ఏర్పాటుచేసిన అరిసనాలయ నందనవనాన్ని కొండమీద జియ్యర్‌కు అప్పగించి వెళ్లాడు సింగయ్య. అలా అప్పగించిన అరిసనాలయ నందన వనమే ఇప్పటి పెద్ద జియ్యంగారి మఠంగా తర్వాత స్థిరపడింది. అదే సమయంలో వీరకుమార కెంపన్న వడయారు అనే బుక్కరాయల కొడుకు ఒకవైపు, అతనికి సహాయంగా సాళువ మంగరాయలు మరోవైపు - అందరూ కలసి మధుర సుల్తానును అణచివేశారు.

ఈ సంఘటనల ప్రభావం తిరుమల మీద పడింది. అంతవరకూ తిరుమల ఆలయం విషయంలో తమిళప్రభావం చాలా ఉండేది. ఆలయంలో ఉన్న అన్ని శాసనాలు తమిళంలోనే... తమిళ దేశానికి సంబంధించినవే. ఏవో కొన్ని తప్ప - కన్నడంలో కానీ, తెలుగులో కాని శాసనాలు లేవు. మరి భక్తులు ఆ ప్రాంతాలనుండి పెద్దఎత్తున వస్తున్న దాఖలా కూడా కనబడటంలేదు. ఉత్తరాది నుండి వచ్చిన కొందరు రాజులు, 10వ శతాబ్దంలో వచ్చిన గజపతి రాజుల ప్రసక్తి తప్ప, దాదాపు 250 నుంచి మూడువందల సంవత్సరాలపాటు తిరుమల ఆలయంతో సంబంధబాంధవ్యాలు తగ్గిపోయినట్లు, ఆలయంలో పూర్తిగా తమిళ శ్రీవైష్ణవుల ప్రాభవం ఎక్కువైనట్లు తెలుస్తోంది.

కొండమీద తమిళేతరుడు చేసిన మొదటి పెద్దసేవ సింగయ్యధన్నాయకుడిదే. రెండు మఠాలు స్థాపించి, నందనవనాలు ఏర్పాటుచేసి, వాటికి కావల్సిన దేవదేయాలు ఏర్పాటుచేశాడు. కాని అతను తిరుమల/తిరుపతి వదలి వెళ్లినప్పుడు వాటి యాజమాన్యం తమిళ సన్యాసులకే అప్పగించవలసి వచ్చింది. ఆ కాలంలో వాటిని బాగా చూసుకోగలిగిన వారు తమిళులే. ఈయన చెక్కించిన శిలాశాసనం కూడా తమిళంలో ఉంది.

ఆ తర్వాత మొదటి బుక్కరాయలు స్వామివారికి ప్రతిరోజూ తిరుప్పోనకం (అన్న నైవేద్యం) చేయడానికి దేవదేయ భూములు, సంవత్సరంలో ఒక్కసారి బ్రహ్మోత్సవం చేయడానికి తగిన నిధులు ఏర్పాటు చేశాడు. దానినే ఇప్పటికీ బుక్కరాయన్ సంధి

అని చెప్తారు. ఇది 1365 ప్రాంతంలో అతను ముద్గల్ కోటను జయించిన తర్వాత చేసిన దేవదేయం.

సరగండ మంగిదేవ కూడా యుద్ధంలో గెలిచిన తర్వాత తిరుమల వచ్చి, స్వామివారి విమాన గోపురానికి బంగారుపూత రెండవసారి పూయించాడు. తిరుమల దేవాలయ శిఖరాన్ని నిర్మించి, 1359 లో ఈ దేవదేయాల గురించి శాసనాలను తెలుగులోనూ, తమిళంలోనూ (రెండు భాషల్లో) చెక్కించాడు. అంతకుముందు వాడుకలోవున్న పాండ్యరాజుల, యాదవరాజుల రాజ్యకాలాన్ని కాకుండా శక సంవత్సరం వాడటం జరిగింది. అంతకుముందు ఈ 'శక' వాడినది 1002 శాసనంలో. అంటే మధ్యలో మూడున్నర శతాబ్దాలు అప్పుడు పాలించే వారి పరిపాలనా సమయం చెప్పబడిందికాని 'శక' సంవత్సరాలు ఇవ్వబడలేదు. 1002 శాసనం ప్రకారం - ఆ కాలంలో పల్లవులు రాజ్యభ్రష్టులైనారు. కాని చోళుల ఆధిపత్యం పూర్తిగా సిద్ధించలేదు. రాజుల ఆధిపత్య విషయాల్లో సందేహం వున్నందువల్ల శాసనాలలో 'శక' సంవత్సరాలు వాడేవారనిపిస్తుంది.

అలాగే 1359 నాటికి పాండ్యులు, యాదవరాజులు రాజ్యభ్రష్టులైనారు. కాని విజయనగర సామ్రాజ్యం ఇంకా ప్రతిష్ఠించబడలేదు. మంగిదేవుడు కూడా పూర్తిగా అధికారంలోకి రాలేదు. అందుకే ఈ 'శక' సంవత్సరాలను శాసనాలలో వాడడం జరిగింది. తెలుగు, కన్నడ నాయకులు కూడా తిరుమలస్వామి అనుగ్రహం కోసం రావడం మొదలుపెట్టారు. ఈ కాలంలో ఆలయ పరిపాలనలో కూడా మార్పులు వచ్చాయి.

1387-1390 నాటికి హరిహరరాయల ప్రతినిధిగా ముల్లై తిరువేంకటజియ్యర్ తిరుమల ఆలయంలో 'మూసి తిరునాళ్' స్థాపనకు నాంది పలికాడు. ఈ శిలాశాసనం ఆనాటి పరిస్థితులకు కొంతవరకు అద్దం పడుతుంది. హరిహరరాయల పేరుతో శాసనం వున్నా, ఆయన హోదా, అధికారం ప్రస్తావన లేదు. ఈ దేవదేయ విషయంలో తిరుమల ఆలయంలో ఎవరికి బాధ్యత అప్పగించారో చెప్పలేదు. పూర్వం, తిరుచానూరు వైష్ణవులసభ, ఆ తర్వాత ఆలయంలో కార్యనిర్వహణాధికారులు ఈ దేవదేయాలు తీసుకొనేవారు. దేవదేయం అమలుపరచడం కూడా వీరి బాధ్యతే. ఈ హరిహర రాయల శాసనంలో ఈ నిర్వహణాధికారుల ప్రస్తావన లేదు. ఈ శాసనాలు ఆలయంలోని 'తిరునివు-ఉర్ -ఉడయార్లే'కు ఇచ్చినట్లు (అంతా ఆలయం లెక్కలు

చూసేవారు) పేర్కొన్నాయి. 1390 నాటికి హరిహరరాయలు ఇచ్చిన దేవదేయం 'స్థానత్తార్' (ఈ ఆలయ ధర్మాధికారులు) పేరునలేదు. అంతేకాక 1390 నాటికి హరిహరరాయలు రాజుగా పదవిలోకి వచ్చాడు. ఆ విషయం ఆలయాధికారులకు (ఈశాసనం చూస్తే) తెలిసినట్లు లేదు. లేకపోతే ఆయన పేరుకిముందు 'ప్రశస్తి' ఉండేది.

966లో రాజకుమారి సమవాయి ఆలయ సంస్కరణ చేపట్టిన సమయంలో ఆలయ నిర్వహణకు కొందరు కార్యనిర్వాహకులతో ఒక కమిటీ ఏర్పాటయింది. వారిని 'మఠపత్యం' చేసేవారని పిలిచేవారు. కాని వారి వారి బాధ్యతలు, అధికారాలు స్పష్టంగా ఉండేవి కావు.

తర్వాత రామానుజుల వారి కాలంలో సంస్కరణలు జరిగినప్పుడు, ముగ్గురు సభ్యులతో కమిటీ ఏర్పాటు చేయడం జరిగింది. ప్రధాన అర్చకుడు, తిరుమలనంబి, ఆనందాళ్వార్ ఈ కమిటీలో సభ్యులుగా ఉండేవారు. కాని వీరు సంప్రదాయ అర్చక పూజావిషయాలు మాత్రమే చూసేవారు . ఆలయ నిర్వహణ బాధ్యతలు చూడడానికి కార్యనిర్వహణాధికారి ఉండేవాడు. దేవదేయాలు, ఆలయ విధులు నిర్వహించాల్సిన బాధ్యత అతనిది. కాని అసలు అధికారం రాజప్రతినిధులైన అధికారులదే. రాజుగారు దేవదేయాలు ఇస్తే, గ్రామపెద్దలు ఈ దేవదేయాల నిర్వహణ గ్రామంలో చూసి, ఆలయానికి ఆదాయాలు పంపేవారు. కొన్ని కొన్ని శాసనాలను బట్టి - ఆలయంలో ఈ అధికారులే కాక, 'స్థానత్తార్' (స్థానికులు - అంటే స్థానికులైన పెద్దలతో ఒక బాధ్యత గల ధర్మకర్తల మండలి) లాంటిది ఉండేదని తెలుస్తోంది. తిరుక్కలట్టి దేవయాదవరాయల కాలానికి ఈ స్థానత్తారుల ధర్మకర్తల మండలి రాజు ఆమోదంతో పనిచేస్తూండేదని భావించాలి.

శాసనాన్ని బట్టి చూస్తే సింగయ్య ధన్నాయకునికి ఈ స్థానత్తారులపట్ల చాలా గౌరవాదరణలు ఉన్నట్లు తెలుస్తోంది (స్థానత్తారుల పాదపద్మములకు ఈ దేవదేయ సమర్పణ). కాని వీరితర్వాత కుమార కెంపన్న, పెర్మాడై ఉడయార్, బుక్కరాయలు చేసిన దేవదేయాలలో స్థానత్తారు ప్రసక్తే లేదు. అంటే అర్థమయ్యేది - 'ధన్నాయకరు తిరుపతి/ తిరుమలలో ఉండి మఠాలు స్థాపించి నందనవనాలు నిర్వహించాడు కనుక ఆలయంతో సంబంధం, ఆలయ స్థానత్తారులతో సంబంధం ఉండి ఉండవచ్చు. అందుకే అతని శాసనాల్లో స్థానత్తారు ప్రస్తావన ఉంది. ఇతరుల విషయానికొస్తే -

గ్రామాలుగాని, భూములుగాని దేవదేయాలుగా ఇస్తే, వాటి నిర్వహణ, వాటి ఆదాయాలు ఆలయాలకు అందజేయడం ప్రభుత్వ బాధ్యతేకాని, ఆలయస్థానత్తారుకు ఈ విషయాలలో అధికారాలు లేవని తెలుస్తోంది. ఆలయ ప్రతినిధులుగా ఆదాయం మాత్రం అందుకునేవారు.

1387 నాటికి పరిస్థితులలో మార్పు వచ్చినట్లు కన్పిస్తోంది. ఈ శాసనం ద్వారా స్థానత్తారులకు ప్రతినిధులుగా మాత్రమే కాదు, ఆలయ కార్యనిర్వహణ చేసే ధర్మకర్తల మండలిగా గుర్తింపు వచ్చినట్లు తెలుస్తోంది. 1390 నాటికి శిలాశాసనాలు కూడా స్థానత్తారు ద్వారానే అమలు జరిగేపద్ధతి అమలులోకి వచ్చింది. అప్పటినుండి 'స్థానత్తారులకు' ఆలయానికి వచ్చే దేవదేయాలు, నిధులు, బహుమానాలు తీసుకుని, పెద్ద దేవదేయాలైతే శిలాశాసనాలు చెక్కించే అధికారం కూడా సంక్రమించింది. ఆలయ కార్యనిర్వహణాధికారులు, ఆలయ లెక్కలు చూసే లెక్కాధికారులు అందరూ ఈ స్థానత్తారుల పర్యవేక్షణలో పనిచేస్తున్నట్లు తెలుస్తోంది. కాని ఆలయ పూజా అర్చనావిధానాల్లో అర్చకులది, శ్రీవైష్ణవులదే అధికారం, స్థానత్తారులది కాదు.

క్రీ.శ. 1360 వరకూ ఈ స్థానత్తారులు ఆనాటిరాజు యాదవరాయల అధీనంలో పనిచేసినట్లు తెలుస్తోంది. ఒక శాసనం ప్రకారం - శ్రీశ్రీరంగనాథ యాదవరాయలు కొండపై తనకోసం ఒక రాజమహలు నిర్మాణం చేయించుకొన్నాడు. అయితే 1360 తర్వాత యాదవరాజుల ప్రసక్తి ఏ శాసనంలోనూ కనబడదు.

తిరుపతి ప్రాంతం విజయనగర సామ్రాజ్యంలో భాగం అయింది. హరిహర-బుక్కరాయలకు సామంతుడుగా మంగిదేవుడు యాదవరాజుల స్థానంలో వచ్చాడని తెలుస్తోంది. ఈ మంగిదేవుడే స్వామివారి విమానానికి, కలశాలకు రెండవసారి బంగారుపూత పూయించింది. శిలాశాసనాలు మొదటిసారిగా తెలుగులో చెక్కించింది ఇతనే.

యాదవరాజుల పాలన అంతమై, మంగిదేవుడు ఆ తర్వాత విజయనగర రాజుల పాలన బలపడే సంధికాలంలో తిరుమల ఆలయంలో 'స్థానత్తారులు' పూర్తి అధికారాలతో ధర్మకర్తల మండలిగా వ్యవహరించడం మొదలుపెట్టినట్లు, ఆలయంలో లెక్కలు చూడడానికి ప్రత్యేక అధికారిని 1380 ప్రాంతంలో నియమించినట్లు తెలుస్తోంది.

అలా క్రీ.శ. 1100 నుండి 1360 వరకు తిరుమల ఆలయ పరిపాలన యాదవరాజుల అధీనంలో ఉండి – ఆ తర్వాత 'స్థానత్తారులు' – ధర్మకర్తల మండలి చేతులలోకి వచ్చినట్లు తెలుస్తోంది. ఈ స్థానత్తారులు ఆ రోజుల్లో సమాజంలో మంచి పేరు ప్రతిష్ఠలు, నీతినిజాయతీలు గల సంపన్నులు.

ఇలా స్థానత్తారులు అధికారులైనా, వీరప్రతాప దేవరాయలు, ఇతర రాజులు వచ్చినప్పుడు, వారికి దేశంపై అధికారం ఉంది కనక, స్థానత్తారు ప్రసక్తి లేకుండానే ధర్మాసనాలు చెక్కించేవారు. అలానే సిరిగిరేశ్వరుడు బంగారు పట్టం ఇచ్చినప్పుడు సంస్కృతంలో శాసనం స్థానత్తారు ప్రసక్తి లేకుండా జరిగింది. నాగయ్య నాయకరు మూడు బంగారు పళ్లాలు ఇచ్చినప్పుడు స్థానత్తారు ప్రసక్తి లేకుండా కన్నడంలో శాసనం చెక్కించబడింది.

1330 నుండి 1390 వరకూ ఆలయనిర్వహణలో కొంత అస్పష్టత కన్పించినా, రానురాను 'స్థానత్తారులు' బలపడి, 1390 నాటికి వారే ధర్మకర్తల కార్యనిర్వహణ మండలిగా స్థిరపడ్డారు. వారి ఆధ్వర్యంలోనే దేవస్థానం నిధులు, ఆస్తులు, ఆదాయం, ఖర్చు విషయంలో స్పష్టత తేవడానికి గణాంక విభాగం ప్రత్యేకంగా ఏర్పాటు చేయబడి, పరిపాలనకు ఒక నిర్దుష్టమైన రూపం వచ్చింది.

ఎవరు ఈ స్థానత్తారులుగా ఉన్నారన్నది ఒక శాసనాన్ని బట్టి స్పష్టమవుతోంది. ఆ శాసనం (187) లో ప్రసాద వితరణ ఎలా జరిగేదో వివరిస్తూ, ప్రసాదాన్ని అందుకునే వారిలో స్థానత్తారులకు ఒక వంతు వస్తుందని చెబుతూ – ఆ స్థానత్తారుల భాగం 12 మంది స్థానత్తారులు పంచుకోవాలని ఉంది.

ఆ పన్నెండుమంది స్థానత్తారులు:

తిరుపతి శ్రీవైష్ణవులు	-	4
తిరుచానూరు సభాయ్యార్	-	3
నంబియార్ అర్చకులు	-	1
కోయిల్‌కెల్కుమో జియ్యర్	-	2
ఉడయార్	-	2
మొత్తం	-	12

పూర్వం తిరుచానూరు శ్రీవైష్ణవుల సభ తిరుపతి ఆలయవ్యవహారాలు, దేవదేయాలు చూచేది. ఆ సభ తరపున ముగ్గురు స్థానత్తారులు వుండేవారు. అప్పటికి రామానుజులు స్థాపించిన తిరుపతి పెద్ద పట్టణమై, శ్రీవైష్ణవుల పండితస్థానంగా తయారయ్యింది. ఆచార్య పురుషులు, శ్రీవైష్ణవ పండితులు, సంపన్న శ్రీవైష్ణవుల నుండి నలుగురు సభ్యులు, ఇద్దరు జియ్యర్లు, ఇద్దరు ఆచార్య పురుషుల తరఫున కాక ఒక నంబియార్ అంటే ఆలయ అర్చకులు (వైఖానసదాసులు) అందులో వుండేవారు.

★ ★ ★

39. జియ్యర్ల నియామకంలోని మర్మం

రామానుజుల కాలంలో ఏకాంగిగా మొదలై తర్వాత తర్వాత ఆలయంలో దేవదేయాలు సక్రమంగా నిర్వహించబడుతున్నాయా, భక్తులు కానుకలిచ్చి, వారు కోరుకున్న సేవలు చేయమన్నప్పుడు, ఆలయ అధికారులు ఆ సేవలు సక్రమంగా చేస్తున్నారా లేదా అన్న విషయం చూడడానికి, ఆలయంలో పూజావిధానం క్రమంతప్పకుండా జరిగేట్లుగా చూడడానికి ఏర్పడిన వ్యవస్థకి ఒక ఏకాంగి చాలదని, ఇద్దరూ, ఇంకొందరూ అండగా పెరిగింది. ఈ వ్యవస్థ శ్రీవైష్ణవ సన్న్యాసదీక్ష తీసుకున్న జియ్యర్లుగా రూపుదిద్దుకుంది.

ఈ తిరుమల దేవుని ఆలయ నిర్వహణ సక్రమంగా జరగాలంటే లౌకికవ్యవహార వ్యామోహాలు లేకుండా స్వామి కైంకర్యమే పరమావధిగా భావించి, స్వామి సేవకే జీవితాన్ని ధారపోసే సన్న్యాసులైతేనే ఈ విధులు జరగడానికి న్యాయం చేయగలరన్న ఆలోచనతో ఏర్పడ్డ వ్యవస్థ ఇది.

సింగయ్య ధన్నాయకుడు రెండు మఠాలు ఆరంభించి, రెండు నందనవనాలు స్వామివారి పుష్పకైంకర్యానికి నిర్వహించి, వాటి ఖర్చులకు యాదవరాయలచే మడిమాన్యాలు, గ్రామాలు దేవదేయాలుగా ఇప్పించి, ఒకరకంగా రాజుగారి ఖర్చుతో – ఈ వ్యవస్థలు నడిచేటట్లు ఏర్పాటుచేశాడు. ఆయన తన సామంతరాజులతో మధురసుల్తానులపై యుద్ధానికి వెళ్లేటప్పుడు రెండు మఠాలు, అరిసనిలయ నందనవనాలు ఒక తమిళజియ్యర్‌కు అప్పగించి వెళ్లాడు. ఈ వనాలు చూసుకోవడం, మఠాలు నిర్వహించడం, ఆలయంలో కొన్ని కైంకర్యాలు చేయించాల్సిన బాధ్యత ఈ జియ్యర్‌ది. ఆ జియ్యర్ జీవితకాలం వరకూ ఆ బాధ్యత నిర్వహించాలి. జియ్యర్ మరణానంతరం కొత్త జియ్యర్‌ను నియమించే అధికారం ధన్నాయకుడే ఉంచుకుంటాడు. ఆ కొత్త జియ్యర్ స్థానికుడు కాకూడదు – దేశాంతరుల నుండి నియమించబడాలన్న షరతు కూడా ఉంది.

ఇలా అధికారంలో సింగయ్యధన్నాయకుడు నియమించిన జియ్యర్ ఎప్పుడు పరమపదించాడో తెలియదు. కాని 1388లో, 1390లో రెండు శాసనాల ఆధారంగా మనకు తెలిసేది - తిరువేంకటజియ్యర్ అనే ఆయన రాజు హరిహరరాయల ప్రతినిధిగా 'మూసి తిరునాళ్లు' ఆలయంలో చేయడానికి 100 పణాలు దేవదేయానికి ఇచ్చినట్లు, తర్వాత అతను తాను అరిసనిలయం తిరుచందనవనానికి కార్యాధికారినని 1200 పణాలతో ఆలయాలలో కొన్ని సేవలకు దేవదేయం చేసినట్లు చెక్కించారు. ఆయన 'సన్న్యాసి'. కాని శాసనంలో తన గురువు గురించి కాని, తన సన్న్యాస పరంపర గురించి కాని వివరాలేమీ ఇవ్వలేదు.

ఈయన హరిహరరాయల ప్రతినిధిగా కొండకు వచ్చి ఈ మఠాల్ని, నందనవనాల నిర్వహణని చేపడతాడు. ధన్నాయకుడు నియమించిన జియ్యర్ కాలం చేశాక, ఇంకొకరిని నియమించేందుకు ధన్నాయకుడు లేనందున, ధన్నాయకుడు రాజప్రతినిధి కనుక, హరిహరరాయలు, ఈ ముల్లై తిరువేంకట జియ్యర్‌ను ఈ మఠాలకు, అరిసనందనవనాలకు యజమానిగా నియమించినట్లు భావించాలి. అరిసన్ - అంటే రాజు. అలా చూస్తే ఇది రాజు స్వామివారి సేవకై స్థాపించిన నందనవనం.

రాజైన హరిహర రాయలు నియమించిన జియ్యర్ వ్యవస్థ తమిళజియ్యర్‌తో అలా మొదలై ఈనాటి తిరుమల-తిరుపతి పెద్ద, చిన్న జియ్యంగార్ల మఠాలుగా రూపాంతరం చెందింది.

★ ★ ★

40. రహస్యంగా తిరుమలకొచ్చిన రంగనాథుడు

ముస్లిం దండయాత్రలకు ముందు కాలంలో దక్షిణ భారతంలో ఎన్నో శ్రీవైష్ణవ క్షేత్రాలున్నా, శ్రీరంగం చాలా ప్రసిద్ధి చెందింది. శ్రీవైష్ణవ సిద్ధాంత ప్రచారానికి కేంద్రస్థానం. తర్వాత కాంచీపురాన్ని చెప్పుకోవచ్చు.

ముస్లిం దండయాత్రలు మొదలైన తర్వాత, వైష్ణవ ఆలయాల విధ్వంసం, విగ్రహాల నాశనం, బలవంతపు మతం మార్పిడి, హిందూ మహిళలపై అత్యాచారాలు ఎక్కువై, హిందువులు ఏమి చేయాలో పాలుపోని పరిస్థితులు ఏర్పడ్డాయి. శ్రీరంగనాథుడే శ్రీరంగం వదలి తిరుమలకు రావల్సిన పరిస్థితి వచ్చింది. కాంచీపురం కూడా హిందువులకు - ముఖ్యంగా శ్రీవైష్ణవులకు దివ్యక్షేత్రమైనా, అక్కడా పరిస్థితులు బాగాలేవు.

శ్రీరంగనాథుడు శ్రీరంగం వదలి తిరుపతి ఎలా, ఎప్పుడు వచ్చాడో, తిరుమల రంగమండపంలో ఎంత కాలం వున్నాడో, ఆ తర్వాత తిరుమల వదిలి మళ్లీ శ్రీరంగం ఎప్పుడు తిరిగి వెళ్లాడో తెలియాలంటే- శ్రీరంగనాథ దేవాలయ రికార్డుల్ని పరిశీలించాలి.

'శ్రీరంగ ఒలుహు' అంటే శ్రీరంగ ఆలయ చరిత్ర అని ఒకవిధంగా చెప్పవచ్చు. ఆలయంలో ప్రాచీన కాలంనుండి జరుగుతున్న విషయాలన్నీ రాసిపెట్టి, భద్రంగా పదిలపరిచిన పత్రాలే 'ఒలుహు'.

వాటి ఆధారంగా మనకి తెలిసేదేమిటంటే 14వ శతాబ్దంలో (1328) ముస్లింల దండయాత్ర శ్రీరంగంపై జరిగింది. ఆ సమయంలో స్వామివారి సాంవత్సరిక మహోత్సవాలు జరుగుతున్నాయి. స్వామివారిని (ఉత్సవవిగ్రహాలను) ఆ ఉత్సవాలలో ఉదయమే కావేరి (కోలెరూన్) నదికి తీసుకువెళ్లి, నదిమధ్యలో వుంచి, తిరుమంజనాది సేవలను, మహాభక్త సమూహం చూస్తూ వుండగా చేసేవారు. అలా సాయంత్రం వరకు స్వామివారు నదిమధ్య ఇసుక పర్రెలమీదనే సేవలందుకుని, ఊరేగింపుగా ఆలయానికి వెళతారు.

ఇట్లా ఉత్సవం జరుగుతున్న సమయంలో స్వామివారు కావేరిలో వున్నప్పుడే, మహమ్మద్ తుగ్లక్ ఆశ్విక సేనలు అకస్మాత్తుగా కన్ననూరు వైపు నుండి కావేరి ఒడ్డుకు చేరుకొన్నాయి.

సైన్యం వీరి దగ్గరకు వచ్చేలోపున, అక్కడ వున్న భక్తులు స్వామివారి విగ్రహాన్ని రక్షించాలన్న నిర్ణయానికొచ్చి మంచి బలిష్ఠుడైన లోకాచారి అనే యువకుడి సారథ్యంలో ఒక బృందానికి చిన్నపల్లకి యిచ్చి, రహదారిగుండా కాక, అడ్డదారుల్లో పుదుక్కోట్టైకు పంపారు... కాని, లోకాచారి దారిలో "ఎక్కడికి వెళితే మంచిదో" ఆలోచించి, తిరుపతి మాత్రమే భద్రమైన ప్రదేశంగా నిర్ణయంచేసి, అక్కడకు బయలుదేరతాడు. నేరుగా తిరుపతికి వెళ్తే ముస్లింల బారిన పడతామన్న భయంతో, తెరుకనంబి, మైసూరుమీదుగా చుట్టూ తిరిగి, ముఖ్యరహదారులలో వెళ్లకుండా, అడ్డదారులలో ప్రయాణం చేస్తూ, తిరుపతి చేరుకొంటాడు. ఆ రోజుల్లో తిరుపతి ప్రాంతాన్ని యింకా సింగననాయకుడు పాలిస్తూ వుండేవాడు. అక్కడికి ముస్లింపాలకుల ఛాయలు ఇంకా సోకలేదు.

అలా తిరుమల చేరిన శ్రీరంగనాథుడు, కొండమీద ఆలయ ఆవరణలో ఆగ్నేయంగా వున్న మండపంలో విడిదిచేసి, సేవలందుకుంటూ శ్రీనివాసుని అతిథిగా వున్నాడు. శ్రీనివాసునికి వైఖానస పూజలైతే, శ్రీరంగనాథునికి పాంచరాత్ర పూజలు జరిగేవి. సంప్రదాయ పద్ధతిలో శ్రీరంగంలో లాగానే రంగనాథునికి వైభవంగా పూజలు జరిగాయట. విగ్రహాలతో వచ్చిన శ్రీవైష్ణవులే కాక, వార్త విన్న దక్షిణాది భక్తులందరూ శ్రీనివాసుని, శ్రీరంగనాథుని దర్శనానికి పెద్దసంఖ్యలో తిరుమల రావడం మొదలుపెట్టారు.

అదే రోజులలో హిందూరాజులు, సామంతులు చేతులు కలిపి, మథుర సుల్తానులపై దండెత్తి వారిని ఓడించడం జరిగింది. అప్పుడే హరిహర-బుక్కరాయల నాయకత్వంలో విజయనగర సామ్రాజ్యానికి పునాదులు మొదలైనాయి. క్రీ.శ. 1336 నాటికి ఈ సామ్రాజ్య స్థాపన జరిగినా, వారు నిలదొక్కుకోవటానికి, వారిని ఇతర సామంతులు గుర్తించి, ఆమోదించడానికి కొన్ని దశాబ్దాల కాలం పట్టింది.

క్రీ.శ. 1370 ప్రాంతానికి తిరుమల-తిరుపతి ప్రాంతాలలో విజయనగర సామ్రాజ్యపు ఊడలు బలంగా నాటుకున్నాయి. దక్షిణ దేశమంతా వీరి పరిపాలనలో సుభిక్షం, సురక్షితం అయింది.

హిందువులలో ధైర్యం, శాంతిభద్రతలపై నమ్మకం ఏర్పడడంతో, క్రీ.శ. 1371లో- అంటే 43 సంవత్సరాల తరువాత తిరుమల నుండి శ్రీరంగానికి శ్రీరంగనాథుని తిరుగు ప్రయాణం వైభవంగా జరిగింది.

అంత గొడవల్లో ముస్లింల విధ్వంసానికి గురికాని దేవాలయం తిరుమల ఆలయమే. అంతేకాదు. ముస్లిములు కొండ వైపుగా కూడా రాలేదు.

ఇలా అన్ని దేవాలయాలూ నాశనమయిన సమయంలో తిరుమలపై ఆలయానికి ఏమీ జరగక పోవడానికి కారణం ఈ స్వామి మహిమే అన్న భావన హిందువులందరిలో కలిగింది. తమిళ ప్రాంతాన్నంతటినుండీ విపరీతంగా యాత్రికులు రావడం – దెబ్బతిన్న వారి ఆధ్యాత్మిక భావాలకు ఈ తిరుమల ఒక ఆసరాగా నిలవడం జరిగాయి.

ముస్లిం దండయాత్రల తర్వాత ఆలయ పరిస్థితిలో, హిందువుల ఆలోచనా పద్ధతులలో చాలా మార్పులు వచ్చాయి.

తిరుమలకు తమిళవైష్ణవులేకాక, అప్పుడప్పుడే పెద్ద సంఖ్యలో కన్నడ హొయసలులు, తెలుగు చాళుక్యులు, తెలుగు పల్లవులు రాసాగారు. విజయనగర రాజ్యాధికారులతో పరిచయాలు పెరిగాయి. అప్పటి వరకు తిరువేంగడం (తిరుమల) ఆలయం తమిళ అభిమానులైన చోళులు, పాండ్యులు, యాదవరాజులు, గండ గోపాలుర సంరక్షణలో ఒక రకంగా వారి పోషణలో వుండేది. ఈ ముస్లిం దండయాత్రలలో ఈ రాజవంశాలన్నీ దెబ్బతిని పోయాయి. అలా ఆయా రాజుల ఆదరణ లభించే అవకాశం ఆలయానికి పోయింది. అయినప్పటికి ఆ హిందూ రాజులంతా కలిసి ముస్లింల ధాటిని తట్టుకోడానికి ప్రయత్నం చేసి కొంత సఫలీకృతులైనా – ఎవరు ముఖ్యహిందూ పరిపాలకులుగా స్థిరపడతారో తేలని పరిస్థితి. యాదవ శ్రీరంగనాథ మరణంతో అప్పటిదాకా ఎంతో శ్రద్ధతో దేవాలయానికి సహాయసహకార రక్షణ కల్పిస్తున్న యాదవరాజుల వంశం అంతరించింది. దేవస్థానానికి ఆ ఆసరా కూడా పోయింది.

అలా వున్న రాజకీయ పరిస్థితులలో – ఆలయ పరిపాలనలో మార్పులు చోటు చేసుకున్నాయి. ఆలయంలో నిత్యపూజలు, ఉత్సవాలు జరుగుతూనే ఉన్నా, ఈ ఆలయ బాధ్యత అంత తేలిక కాదన్న విషయం ఆలయ ధర్మకర్తలకు, అధికారులకు తెలియడం మొదలైంది. ఛిన్నాభిన్నమై అల్లకల్లోలంలో ఉన్న హిందూ సమాజాన్ని పునరుద్ధరించాల్సిన బాధ్యత ఈ ఆలయానిదే అన్నది భక్తుల భావన. దానికి ఏదైనా తప్పక చేయాల్సిందే

అన్న ఒత్తిడి కూడా మొదలైంది. ఆ రోజుల్లో తమిళ వైష్ణవుల విషయంలో వేదాంత దేశికులు, పిళ్లై లోకాచార్యుల వంటి దిగ్గజాలు వుండి, తమిళులను ఉత్సాహపరిచి హిందూ సమాజ సంఘటితానికి పాటుపడేవారు.

కొండ మీద పరిస్థితి వేరు. కొండ మీద శ్రీవైష్ణవులు - ముఖ్యంగా ఆచార్య పురుషులు, ఎందరో జియ్యర్లు, తిరుచానూరు సభాయ్యారులు వున్నారు. వీరందరికి తిరుమల ఆలయం మీద భక్తిశ్రద్ధలు, ఏదో చేద్దామన్న తహతహ వున్నాయి. కాని అదివరకులాగా రాజుల నుండి ఆదరణ లభిస్తుందన్న నమ్మకం పూర్తిగా లేదు. తిరుమల ఆలయం విషయంలో ఒక్క తమిళ దేశం పైనే ఆధారపడటమా, లేదా ఇతర ప్రాంతాలలో కూడా తిరుమల శ్రీనివాసుని ప్రచారం జరిగేలా చూడటమా? చివరికి, దక్షిణాది ప్రాంతాలంతటా స్వామివారి భక్తులను విస్తరింపచేసి, ఆలయ వైభవాన్ని, ఆదాయాన్ని పెంచడానికి ప్రయత్నాలు మొదలయినాయి.

తిరుమల ఆలయంలో వున్న వైష్ణవమత పెద్దలందరూ ఈ విషయంపై చాలా తర్జన భర్జనలు చేసి, తిరుమల నుండి ఆచార్యపురుషులు, ఆచార్యులు, జియ్యర్లు, ఇతర వైష్ణవ పండితులు ఆంధ్ర, కర్ణాటక ప్రాంతాలకు ప్రచారానికి వెళ్లాలని తీర్మానించి, ఒక ప్రణాళిక ప్రకారం కార్యక్రమం చేపట్టారు.

తమిళనాడులో బాగా నాటుకుపోయిన శ్రీవైష్ణవ మతసిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకువెళ్లడానికి ప్రయత్నం చేశారు. ముఖ్యంగా ముస్లింల దండయాత్ర అనుభవం దృష్ట్యా, హిందూ మత పునరుద్ధరణ ధ్యేయంగా చూపిస్తూ, తాము అవలంబిస్తున్న శ్రీవైష్ణవంలో కులాలకు ప్రాధ్యానం లేదనీ, భక్తి కలిగిన ఎవరైనా భగవంతుని కరుణకు పాత్రులనీ, అన్ని కులాలవారు సమానంగా మతపర విషయాలలో, ఆలయ పూజాసంప్రదాయాలలో పాలుపంచుకోవడానికి అవకాశమున్నదనీ, అంటూ ఈ విషయాన్ని పెద్దఎత్తున ప్రజలలోకి తీసుకువెళ్లారు. అంతేకాక, వారు చేసే ఈ కార్యక్రమం అంతా, తాముగా చేయటం లేదని, తిరుమల శ్రీనివాసుని సేవగా చేస్తున్నట్లూ, శ్రీనివాసదాసులుగా మాత్రమే చేస్తున్నట్లూ ప్రచారం చేయడంతో, ప్రజలలో వారికి మంచి ప్రోత్సాహం, స్పందన లభించాయి.

ఇలా ప్రచారం చేస్తూ శ్రీవైష్ణవ మతగురువులు కోస్తా జిల్లాలన్నీ తిరుగుతూ, ఒరిస్సాలో గంజాం వరకూ తమ ప్రభావం చూపారు. ముఖ్యంగా అన్ని కులాల వారికి ఈ మతంలో తరతమ భేదం లేకుండా చూసే సంప్రదాయం సామాన్య ప్రజలను

ఆచార్యుల దగ్గరకు ఆకర్షింప చేసే విషయమయింది. ఆచార్యులు, ఆచార్య పురుషులు, సాంఘిక సంప్రదాయాల విషయంలో వెనుకబడిన జాతుల వారిని ప్రోత్సహించడం, హోమాదులలో వారు పాల్గొనే అవకాశాలు కల్గించడం, స్త్రీలకు కూడా ఆచార విషయాల్లో ప్రాధాన్యం కల్పించటం సమాజంలో హిందూ మతంలోని అన్ని కులాల వారు కలిసికట్టుగా ఉండటానికి దోహదకారి అయింది....

రాజులు, రాజ్యాధికారులు, వ్యాపారులు యిచ్చిన దానధర్మాలు, దేవదేయాలను ఈ ఆచార్యులు, ఆచార్యపురుషులు తమ కోసం తీసుకోకుండా, వాటిని తిరుమల శ్రీనివాసునికి అందజేసే సంప్రదాయం మొదలైంది. అంటే తిరుమల ఆలయం పేరు చెప్పుకొని డబ్బు చేసుకొనే వ్యవహారం కాదు, తిరుమల స్వామికి సేవగా, హిందూమత ప్రచారానికి దోహదకారిగా ఉండటానికి చూసేవారు.

విజయనగర రాజు సదాశివ మహరాయ సొట్టు - తిరుమల నంబి శ్రీనివాస అయ్యంగారికి ఇచ్చిన పెద్ద ఎక్కలురు. గ్రామాల మాన్యాలు, ఆదాయాలు తిరుమల ఆలయానికి దేవదేయంగా ఇచ్చివేయడం జరిగింది. ప్రతి ఆచార్యుడు, ఆచార్యపురుషుడు తమ పేరు ముందు గర్వంగా 'తిరుమల' అని నామం చేర్చుకొని ప్రజల దగ్గరకు వెళ్లేవారు. తమ శిష్యులకు, దగ్గరకు వచ్చిన భక్తులకు తిరుమల వేంకటేశ/శ్రీనివాస నామాలు పెట్టుకొనే సంప్రదాయాన్ని ప్రోత్సహించారు.

★ ★ ★

41. పల్లెల్లోకి శ్రీవైష్ణవం

తిరుమల శ్రీనివాసుని పేరుని, తిరుమల ఆలయం తరఫున ఆచార్యులు, ఆచార్య పురుషులు గంజాం నుండి తిరుమల వరకు తెలుగుదేశంలో, మైసూరు మంగుళూరువరకు కన్నడ దేశంలో శ్రీవైష్ణవ ప్రచారం - ముఖ్యంగా తిరువేంకట నాథుని ప్రచారంగా చేశారు. ఇలా జరుగుతున్న కాలంలోనే విజయనగర సామ్రాజ్యం వేళ్లు నాటుకొని తమిళ, కర్ణాటక, తెలుగు రాజ్యాల్లో బలపడటం - వారు ఈ మాధ్యమానికి ఆదరణ చూపించడం జరిగాయి. అలా మొదలై గ్రామ గ్రామాల్లో తిరుమల వేంకటేశ్వరుని ఆలయాలు కట్టించడం, ప్రతిష్ఠలు చేయించడం మొదలైంది. పశ్చిమ గోదావరి జిల్లాలో ద్వారకా తిరుమల అలా మొదలైన ఆలయమే. అలాగే శఠగోపం జియ్యరు వారి తర్వాత అహోబిల మఠాధిపతుల ప్రోత్సాహంతో వేంకటేశ్వర ఆలయాలు, నరసింహస్వామి ఆలయాలు చాలా గ్రామాల్లో కొత్తగా కట్టించారు. సింహాచల వరాహ నరసింహ, మంగళగిరి నరసింహ, అంతర్వేది నరసింహ ఆలయాలు ఈ కోవకు చెందినవే.

వీరి హిందూమత ప్రచార ఉద్యమంలో ముఖ్యభాగం - అన్ని కులాలవారికి, ప్రత్యేకంగా, అంతవరకు వీరు హిందూమతానికి దూరంగా పెట్టిన వారిని దగ్గరకు తెచ్చే కార్యక్రమం చాత్తాద శ్రీవైష్ణవులను, బ్రాహ్మణేతరులను ప్రోత్సహించి వారికి తప్తముద్రాధారణ, ఊర్ధ్వపుండ్ర ధారణ అవకాశాలు కల్పించి, వారికి బ్రాహ్మణులతో సమానంగా దేవాలయాల్లో సమాన గౌరవం కల్గించి, ప్రబంధ పారాయణ, ఇతర మత సంబంధ కార్యక్రమాల్లో గౌరవంగా పాల్గొనే అవకాశం కల్గించారు.

అంతేకాదు. అంత్యజాతులుగా చూడబడుతున్న మాలమాదిగ కులాలవారిని, ప్రోత్సహించి, వారి మాలవాడలకు వెళ్లి, వారిలో కొందరికి దాసరి దీక్ష లిప్పించి, వారిని కుల గురువులుగా ప్రతిష్ఠించి, ఇతరులతో సమానంగా ఆదరించి, దళితులలో ఆధ్యాత్మిక చైతన్యమే కాక హిందూ మతంలో వారికి గౌరవ మర్యాదలు కల్పించి, హిందూ సమాజం విచ్ఛిన్నం కాకుండా చూశారు.

అదే విధంగా గిరిజనుల విషయంలోనూ – కొందరు దాసరులను నియమించి, వారికి ప్రార్థన స్థలాలు ఏర్పాటు చేసి, ఇతర వైష్ణవులతో సమాన ప్రతిపత్తి కల్గేలా చూశారు. ఇదంతా జరిగింది తిరువేంకటనాథుని ఆశీస్సులతో అంటూ, అందరికీ తిరుమలతో ఆధ్యాత్మిక అనుబంధం కల్గేలా చేశారు.

ఈ మాలదాసరి/కొండదాసరి వ్యవస్థ ఈనాటికీ ఆయా కులాలలో పటిష్ఠంగా ఉంది. వారిని ప్రోత్సహించి, తర్వాత కాలంలో జరిగిన పొరపాట్లు సరిదిద్దుకోవల్సిన అవసరం ఇప్పుడు ఎంతైనా వుంది. ఈ ఆచార్యులు, ఆచార్య పురుషులు నిష్ఠ, నీతి, నిజాయతీలు కలవారు అని ప్రజలకు పూర్తి నమ్మకం. ఎంతవరకంటే – గ్రామాల్లో ఆస్తి, ఇతర తగాదాలను ఈ ఆచార్యుల ముందుకు తెచ్చి వారి నిర్ణయాలు శిరోధార్యంగా పాటించే సంప్రదాయం మొదలైంది. ఇతర న్యాయస్థానాలకు పోకుండా వీరి ముందు సమస్యలు పరిష్కారం చేసుకొనే పద్ధతికి నాంది పలికారు.

కొన్ని కొన్ని దేవాలయాలలో బ్రాహ్మణేతర చాత్తాద శ్రీవైష్ణవులను అర్చకులుగా నియమించడం, మాలవాడల్లో ఆలయాలు కట్టించి, లేదా భజన మండళ్లు ఏర్పాటు చేసి, మాలదాసరులనే పూజారులుగా ఏర్పాటుచేసి, ఆయా కులాలవారి ఆధ్యాత్మిక పరంపర అవసరాలన్నీ వారి ద్వారా తీరే అవకాశం కల్పించారు.

వారి వారి స్థాయిలో అర్థమయ్యేలాగా, కావలసిన గ్రంథరచనలు చేయించటం, లేదా పాటల ద్వారా, భజనల ద్వారా తత్త్వ బోధ జరిగే సంప్రదాయం మొదలు పెట్టారు. ఈ మాల – కొండదాసరులకు పాటలు నేర్పి, ఒక చేతిలో దీపం, ఇంకొక చేతిలో గంట ఏర్పాటు చేసి, ప్రచారకులుగా తయారుచేసి సులభమైన భాషలో అందరికీ తత్త్వం అర్థమయ్యేట్లు, అందరికీ అందుబాటులో వుండేటట్లు ఏర్పాటు చేశారు. ఉత్సవాలలో, పండగలలో ఈనాటికీ మనం చూసే హరిదాసులు ఈ కోవకు చెందినవారే. వీరిని బిచ్చగాళ్లుగా చూడక, హరిభక్తులుగా గౌరవించి, ఆదరించే సంప్రదాయం సమాజంలో నాటుకుపోయేట్లు చేశారు.

ఈనాటికీ మనం తెలుగు దేశంలో చాలా మందిని తిరుమల తాతాచార్యులని, ప్రతివాది భయంకరులనీ, నల్లాన్ చక్రవర్తుల వారనీ, మాడభూషులను... ఇలా ఎందరినో ఒక్క తమిళ అక్షరం తెలియని వారిని చూస్తాం. కాని వారందరికీ తెలుగులో చదివి నేర్చుకొన్న తమిళ 'తిరువాయిమొళి' కంఠస్థంగా వచ్చు. వీరందరూ 14వ శతాబ్దంలో తిరుమల నుండి బయలుదేరి మత ప్రచారానికి వచ్చి, తెలుగు దేశంలో

స్థిరపడి పోయిన శ్రీవైష్ణవులు. వీరందరూ 'మేము తిరుమల వార'మని చెప్పుకొని గర్వపడతారు.

ఇలా శ్రీవైష్ణవ మత ప్రచారం చేసింది ఒక్కరు కాదు. ఆచార్యపురుషులే కాదు. వాన్‌శఠగోపన్ జియ్యర్ గురించి చెప్పుకొన్నాం. తిరుమలలోని ఆయన నందనవన మఠం తర్వాత అహోబిల మఠంగా స్థిరపడి, తెలుగునాట శ్రీవైష్ణ మత ప్రచారంలో ముఖ్యభూమిక వహించింది. తెలుగు కవి దిగ్గజం అల్లసాని పెద్దనకు ఆధ్యాత్మిక గురువులు శ్రీవాన్ శఠగోప జియ్యరే. తాళ్లపాక అన్నమాచార్యులు, వారి సంతతివారు కూడా ప్రభావితులయి శ్రీవైష్ణవులుగా మారి, మత ప్రచారకులు కావడానికి ఈ అహోబిల మఠజియ్యర్‌లే ప్రధాన కారణం.

అలాగే కన్నడ దేశంలో విజయనగర సామ్రాజ్య కాలంలో ఇటువంటి వైష్ణవాన్ని పెద్దఎత్తున ప్రచారం చేసింది శ్రీవ్యాసరాయలు. ఇది శ్రీరామానుజుల శ్రీవైష్ణవ సంప్రదాయం కాదు. ఇది మధ్వాచార్యులు స్థాపించిన ద్వైతసిద్ధాంత వైష్ణవం. విష్ణు సర్వోత్తమత్వాన్ని ప్రతిపాదించే ఈ సంప్రదాయం కన్నడ దేశంలో వైష్ణవమత ప్రచారానికి ఎంతో దోహదకారయింది. బ్రాహ్మణులకు, అందునా పండితులకు మాత్రమే పరిమితమైన సంస్కృత శాస్త్రజ్ఞానం ప్రజాబాహుళ్యానికంతటికి కుల విచక్షణ లేకుండా అందుబాటులో ఉండాలన్న ఉన్నత ఆశయంతో, వైష్ణవదాసులు, వారి సాహిత్యం కన్నడ దేశంలో అన్ని కులాల హిందువులను సంఘటితం చేసింది. వీరందరూ శ్రీతిరుమల శ్రీనివాసభక్తులు. శ్రీనివాసుణ్ణి ఇలవేల్పుగా తలచేవారు. ఈ మఠాల వారందరూ తిరుమలతో సంబంధం కావాలని కోరుకొనేవారు. వీరందరికీ తిరుమల ఆలయంలో ప్రాచీన కాలంగా ఆలయ మర్యాదలు అందే ఏర్పాట్లు వున్నాయి.

తిరుమల శ్రీవైష్ణవులు ఆంధ్రదేశంలో సాధించిన ప్రగతిని కన్నడ ప్రాంతంలో సాధించలేక పోయారనవచ్చు. మైసూరులాంటి కొన్నిప్రదేశాల్లో కొంత ప్రభావం కనబడినా అనుకున్న స్థాయిలో జరగలేదు. దానికి ఇంకో కారణం, అప్పటికే ఇటువంటి ఆశయాలతో, దాదాపు ఇదే పంథాలో మొదలైన మధ్వ సంప్రదాయ వైష్ణవభక్తి ఉద్యమం.

వాదిరాజస్వామి, శ్రీపాదరాజస్వామి, శ్రీవ్యాసరాయలవంటి మఠాధిపతులు, అంతవరకూ కొద్దిమందికి మాత్రమే అందుబాటులో వున్న సంస్కృత శాస్త్రవిజ్ఞానాన్ని అందరికీ సులభంగా అర్థమయ్యే సంకీర్తనల రూపంలో ప్రజలలోకి తీసుకువెళ్లడం జరిగింది.

అన్ని కులాలవారికి వర్గాలవారికి తర తమ భేదం లేకుండా, ఈ జ్ఞానం అందేట్లు వారిని కూడా దాసపంథాలో చేర్చుకొని, అంకితనామాలు యిచ్చి, సాదరంగా సమాజంలో సహజీవనం చేసుకొనే అవకాశం కల్గించారు. కనకదాసులు అంత్యకులంలో పుట్టినా, ఆయన్ను శిష్యుడుగా స్వీకరించి, సంస్కృత పాండిత్య ప్రతిభ కలిగిన నిష్ఠాపరులైన బ్రాహ్మణులకంటే ఎక్కువ ఆదరించిన విషయం శ్రీవ్యాసరాయల జీవితంలో చూస్తాం.

ఆ తర్వాత కాలంలో పురందరదాసు, కనకదాసు, విజయదాసు, గోపాలదాసు, జగన్నాథదాసు మున్నగువారు ఎందరో దాసులు – అందరూ పెద్దపెద్ద సంస్కృత పండితులైనా, పామరులకోసం సరళమైన కన్నడంలో శాస్త్రసూక్ష్మాలన్నీ సుళాదులు, సంకీర్తనలుగా రచించి, ప్రతినోటా, ప్రతిచోటా తత్త్వాలు పాడుకునేలా చేసి, హిందూమత పునరుద్ధరణ కోసం శ్రమించారు.

వీరి ప్రభావం కర్ణాటక తీరప్రాంతాలైన మహబూబ్‌నగర్, కర్నూలు జిల్లాల గ్రామాలలో కూడా చూడవచ్చు. విజయదాసు, గోపాలదాసు, శ్రీనివాసదాసు ఇలా ఎందరో గొప్పదాస సంకీర్తనాచార్యులు, మహబూబ్‌నగర్‌జిల్లాలో గద్వాల, ఐజ, మొదలుకల్లుకు సంబంధించినవారే. తమిళంలో 'తిరువాయి మొళి'లాగా, కన్నడంలో జగన్నాథదాసుల 'హరికథామృతసారం' కర్ణాటక రాష్ట్రాన్నంతా ప్రభావితం చేసింది. మోక్షసాధనకు సంస్కృత జ్ఞానం అక్కర లేదు. శాస్త్రం చెప్పిన సారాన్ని సాధనకు అనుకూలంగా ఏ కులం వారైనా పారాయణ చేసుకొని ఆచరించడానికి వీలుగా ఈ గ్రంథం రాయబడింది. కర్ణాటకలో ముఖ్యంగా, అప్పటివరకు ఆధ్యాత్మిక రంగంలో చిన్నచూపు చూడబడే స్త్రీలందరికీ ఇది వేదంతో సమానమయిన గ్రంథంగా తయారయింది. ఈ దాసపంథాలో గురువును ఆశ్రయించిన శిష్యులకు గురువుల అనుగ్రహంతో జ్ఞాన సముపార్జన సాధ్యమన్న విషయం, సాధనకు పాండిత్యం కాదు – భక్తి ముఖ్యం అన్న భావం ప్రజలలో నాటుకుపోయింది.

ఈ భక్తి ఉద్యమాలు దాదాపు 19వ శతాబ్దం వరకూ చాలా ప్రచారంలో వుండేవి.

నేను 1979లో తిరుమల–తిరుపతి దేవస్థానాల కార్యనిర్వహణాధికారిగా చేరాక, మీనాక్షిపురంలో మతం మార్పిడుల సంఘటన, ఆ తర్వాత దక్షిణాదిన పెద్దఎత్తున మతం మార్పిడులు జరుగుతున్న దృష్ట్యా, ఈ విషయంలో తిరుమల–తిరుపతి దేవస్థానాల బాధ్యత ఏమిటి, హిందూమతం సంఘటితం కావటానికి, ప్రచారం

జరగడానికి, మతంమార్పిడుల్ని నివారించడానికి ఏం చేయాలి అని మఠాధిపతులు, పీఠాధిపతులు, ఇతర హిందూ మతప్రచార సంస్థలతో విస్తృతచర్చలు జరిపాను. పూర్వం రెండు పర్యాయాలు ముస్లిం దండయాత్రల కాలంలో తిరుమల ఆలయం చేపట్టిన కార్యక్రమాలలాంటివి తప్పక చేయాలన్న ఉద్దేశ్యంతోనే, 'హిందూధర్మ రక్షణ సంస్థ'ను టి.టి.డి.లో స్థాపించడం జరిగింది.

గ్రామ గ్రామాల్లో వీరికందుబాటులో వుండే భజనలు, సంకీర్తనలు పిల్లలూ, పెద్దలూ అందరూ పాడుకొని సాధన చేసే సంప్రదాయాలు పునరుద్ధరించాలనే తెలుగులో 'అన్నమాచార్య ప్రాజెక్టు', కన్నడులకు 'దాససాహిత్య ప్రాజెక్టు', తమిళులకు 'దివ్యప్రబంద ఆళ్వార్ ప్రాజెక్టు'లను ఏర్పాటు చేయడం జరిగింది. వాటి స్థాపన ముఖ్యోద్దేశ్యం - దేశంలో భక్తి ఉద్యమం స్థిరపడాలనీ, కుల, వర్గ, జాతి, విచక్షణ లేకుండా హిందూ సమాజం అంతా సంఘటితమై, మధ్యకాలాల్లో వచ్చిన దురదృష్టకర పరిణామాల ప్రభావం పోవాలనీ. అన్నమాచార్య ప్రాజెక్టు, దాస సాహిత్యప్రాజెక్టు కార్యక్రమాలు నేనుండగానే మొదలై వేర్లునాటుకొన్నాయి. కాని రకరకాల కారణాల వల్ల 'ఆళ్వార్ దివ్యప్రబంధ ప్రాజెక్టు' పని మొదలు కాలేదు. ఆ తర్వాతి కాలంలో ప్రారంభమైంది.

కాని, క్రమంగా ఈ ప్రాజెక్టులకు సంగీత సాహిత్యపరంగా ప్రాధాన్యం ఇవ్వడంతో, ముఖ్యోద్దేశ్యం మరుగున పడినట్లుగా వుంది. భక్తి ఉద్యమాలుగా పెరగగల సామర్థ్యం వీటికుంది... వీటిని ప్రజా భక్తి ఉద్యమం దిశగా తీసుకువెళ్లవలసిన బాధ్యత తిరుమల-తిరుపతి దేవస్థానాల మీద వుంది.

★ ★ ★

42. గుడిమాన్యాన్ని కాపాడిన 'సుదర్శనచక్రం'

తిరుమల ఆలయానికి ఏయే గ్రామాలను దేవదేయంగా రాజులు లేదా సంస్థానాధీశులు ఇస్తారో, ఆయా గ్రామాల్ని, మాన్యాల్ని శ్రీనివాసుడి 'సుదర్శనచక్రం' కాపాడుతుండేది.

అదెలా జరిగిందంటే...

★ ★ ★

ప్రాచీన కాలంనుంచీ - అంటే మనకు తిరుమల ఆలయచరిత్ర శాసనాల ద్వారా తెలుస్తున్నప్పటి నుంచీ చూస్తే, ఆలయానికి వస్తున్న ఆదాయం పైన, ఆలయానికి దేవదేయాలుగా దానాలు చేసిన భూములపైన, గ్రామాలపైన ఆయాకాలపు రాజులు - వారికి కట్టవలసిన సుంకాలు, పన్నులలో మినహాయింపు ఇచ్చే సంప్రదాయం ఉన్నట్లు తెలుస్తోంది. దాదాపు 1801 సంవత్సరంలో ఆలయం ఈస్టిండియా కంపెనీవారి యాజమాన్యంలోకి వచ్చే వరకూ అదే కొనసాగింది (ఆతర్వాత ఏమయిందో కంపెనీ విషయాలు చర్చించినప్పుడు చూద్దాం).

మాలిక్కాఫరు దండయాత్రల వరకూ తిరుమల ఆలయం యాదవరాజుల పాలనలో ఉండేది. ఆలయ అవసరాలకు, నైవేద్యాలకు నిధులు చాలకపోతే, యాదవరాజులు ఆలయ కార్యక్రమాల్లో లోపం లేకుండా నిధులు సమకూర్చేవారు.

మొదట ముస్లిం దండయాత్రలతో రాజకీయ కల్లోలం దక్షిణభారతంలో మొదలై, మళ్లీ విజయనగర సామ్రాజ్యం స్థిరపడేవరకూ (అంటే విజయనగర స్థాపన జరిగిన తర్వాత కూడా 5/6 దశాబ్దాల వరకూ) అనిశ్చిత పరిస్థితులు సాగాయి. అంటే- ఇంచుమించుగా 1350 నుంచి 1568 వరకూ ఈ పరిస్థితులు కొనసాగాయని చెప్పుకోవచ్చు.

అది తెలుసుకొనేముందు ఆ కాలంలో గ్రామాలలో వ్యవసాయ పరిస్థితి, రైతులు పన్ను ఎంత కట్టాలి, గ్రామం నుండి ఎటువంటి పన్నులు వసూలు చేసేవారు, దేవదేయంగా భూములు గాని, గ్రామాలు గాని ఆలయానికి ఇస్తే- పంటలో రాజుకెంత, రైతుకెంత, ఆలయానికెంత భాగం వెళ్లేది... అన్నవి ఆసక్తికరమైన విషయాలు.

ఆ కాలంలో నాలుగురకాల వారికి భూముల మీద హక్కులుండేవి.

1. భండారవాడ : ఇవి రాజుగారి భూములు. వాటి ఆదాయాలు రాజుగారి ఖజానాకు నేరుగా వెళ్తాయి.

2. అమరం : నాయకులు లేదా పాలెగాళ్ల చేతుల్లో ఉన్న భూములు. వీరి అధీనంలో ఉన్న భూములు, గ్రామాలపై వచ్చే ఆదాయాన్ని ఈ నాయకులు తీసుకొని, రాజు తరఫున, ఈ ఆదాయంతో కొంత సైన్యాన్ని ఏర్పాటుచేసి, రాజు అవసరాలను బట్టి, సహాయానికి పంపాలి. వీటిలో రకరకాలున్నాయి. పూర్తి ఆదాయం సైన్యం మీద ఖర్చు పెట్టడం లేదా కొంత సైన్యానికి, కొంత నాయకునికి, కొంత రాజుకు ఇలా... భాగాలుగా ఖర్చులు పెట్టడం చేసేవాళ్లు. ముఖ్యంగా వచ్చే ఆదాయం వెచ్చించడంలో తయారుగా ఉంచాల్సిన సైనికుల సంఖ్యను బట్టి మార్పులుంటాయి.

3. ఎలిమోసనరీ లేదా దేవదేయాలు : ఆలయాలకు దానాలుగా ఇచ్చిన భూములు, గ్రామాలు, బ్రాహ్మణులకు ఈనాములుగా ఇచ్చినవి, వేద పాఠశాలలకు, శాస్త్రపాఠశాలలకు ఇచ్చినవి, మఠాలకు, సన్న్యాసుల అధీనంలోని భూములు.

4. రైతుల అధీనంలోని భూములు : దీనిమీద చాలా చర్చ ఉంది. భూమి ఎవరిదైనా భూమి మీద వచ్చే పంటను ఆ రోజుల్లో రెండు భాగాలు చేసేవారు. 'మేలవరం' అంటే భూమి హక్కుదారు భాగం, 'కుడివరం' అంటే భూమి సాగుచేసే రైతు భాగం.

రాజుకు వెళ్లినా, నాయకునికి వెళ్లినా, ఆలయానికి వెళ్లినా, వేద పాఠశాలలకు వెళ్లినా, మఠాధిపతులకు వెళ్లినా, భూమి సొంతదారులకు వెళ్లినా, అది 'మేలవరం' భాగం మాత్రమే. ఎటువంటి భూమిఖాతా అయినా, దున్ని పండించే వాడి 'కుడివరం' భాగంలో మార్పు లేదు. అది ఆ పండించిన రైతుకు చెందాల్సిందే. 'మేలవరం' భాగంలోనే భూకామందులకు, రాజుకు, ఆలయాలకు భాగాలు. మిగతావారి విషయంలో ఎలావున్నా తిరుమల ఆలయానికి సంబంధించినంతవరకూ రాజులు దానాలిచ్చినా, ఇతర దాతలిచ్చినా, వాటిని దేవదేయాలుగా భావించి, మేలవరం భాగమంతా గ్రామాధికారులే వసూళ్లు చేసి, ఆలయానికి అందచేసే సంప్రదాయం ఉండేది.

గ్రామాలనుండి, ఈ 'మేలవరం' భాగంలోని పన్నులే కాక, ఇతర పన్నులు కూడా వసూలు చేసేవారు. బంగారం కొనుగోలు - అమ్మకాల మీద పన్ను, ధాన్యం కొనుగోలు-అమ్మకాలపై పన్ను, భూమి అమ్మకం/కొనుగోలు పన్ను, ఉచితంగా సేవలందించడానికి పన్ను, జంతువుల మీద పన్ను, రాకపోకల పన్ను, వర్తకదారులమీద పన్ను, నూనె తీసేవారి మీద పన్ను, బట్టలు నేసేవారి మీద పన్ను, తోటలు పెంపకంపై పన్ను, చేపల చెరువులపై పన్ను, బందెలదొడ్ల పన్ను - తప్పిపోయిన జంతువులు... ఇలా రకరకాల పన్నులు- కొన్ని సందర్భాలలో 'యువరాజు పెంపకానికి', 'రాజమాత ఖర్చులకు' విడిగా పన్నులు వసూలు చేశారు. రాజుగారిని శత్రువులు ఎత్తుకుపోతే చెరవిడిపించడానికి శత్రువులకు కట్టడానికి గ్రామానికింత అని వసూలు చేసే పన్ను...!

తిరుమల ఆలయం విషయంలో గ్రామాన్ని దేవదేయంగా రాజు ఇచ్చినా, ఇతర దాతలు ఇచ్చినా ఆ గ్రామం విషయంలో పై చెప్పిన పన్నులన్నీ రద్దయినట్లే. అంటే ఆ గ్రామం నుండి వచ్చే అన్నిరకాల ఆదాయాలూ ఆలయానికి చెందుతాయి.

గ్రామాన్ని ఏ దాతైనా దానంగా ఇవ్వాలనుకుంటే, ఆ గ్రామంపై రాజుకు వచ్చే ఆదాయం, ఇతరులకు వచ్చే ఆదాయం, అంతా కలుపుకొని, ఆ గ్రామానికి ఒక ధర నిర్ణయించి, అంత ధనం కట్టినవారికి, దేవదేయం చేయిస్తారు. అందులో కొంత భూకామందులకు వారి భాగం, ఇతరులకు వారి భాగం, మిగతాది రాజుకు వెళతాయి. ఈ మార్పు వలన భూమిని నిజంగా సాగు చేసేవారి భాగంలో ఎటువంటి మార్పు లేదు.

'తిరుపతి' గ్రామాన్ని దేవదేయంగా తిరువేంకటనాథ యాదవరాయరు (అప్పటి సామంతరాజు) చేసినప్పుడు, చెక్కించిన శిలాశాసనంలో ఈ విషయాలు చాలా విపులంగా ఉన్నాయి.

ఇటువంటి దేవదేయాలు - గ్రామాల పరిధిలో కాని, లేదా ఆలయ అధికారుల సమక్షంలో కాని జరగవచ్చు. గ్రామాల పరిధిలో జరిగితే, ఇచ్చిన దేవదేయాల గురించి ఆలయ స్థానత్తారులకు (అధికారులకు) గ్రామాధికారులు తెలియజేస్తారు.

తిరుమల ఆలయ భూముల్ని, దేవదేయంగా వచ్చిన గ్రామాల్ని కాపాడుకోవడం ఒక పెద్ద సమస్య.

అయితే ప్రజలలో దైవభక్తి, పాపభీతి బాగా ఉండటంవల్ల తిరుమల శ్రీనివాసుడి భూముల, గ్రామాల సరిహద్దుల్ని సూచిస్తూ సర్వే రాళ్లన్నింటిమీద సుదర్శనచక్రాన్ని చెక్కించేవారు. ప్రజలు ఆ సుదర్శనచక్రాన్ని చూస్తూనే "దేవుడి మాన్యం" అనుకుంటూ భక్తితో పక్కకి తప్పుకునేవారు. అలా 'సుదర్శనచక్రం' ఆ స్వామివారి దేవదేయాన్ని కాపాడుతూ ఉండేది.

★ ★ ★

43. తన గ్రామాల్ని తనే బాగుచేసుకున్న తిరుమలేశుడు!

దేవదేయ భూముల్ని, భవనాల్ని అక్రమంగా ఆక్రమించి, స్వాహా చేస్తున్న స్వార్థశక్తులు ఇప్పుడు మనకి ప్రతి ఊళ్లోనూ కనిపిస్తుంటారు. ఒకవేళ ఆక్రమించకుండా ఉన్నా, మానవ సహజమైన నిర్లక్ష్యం కారణంగా అవి ఎవరికీ ఉపయోగపడకుండా పోవడం కూడా చూస్తూంటాం.

కాని తిరుమల ఆలయానికి చెందిన గ్రామాల్ని మాత్రం, తిరుమలేశుడి భక్తులు ఆ కాలంలో జాగ్రత్తగా 'చూసుకునేవారు'. ఆ గ్రామాల్ని బాగు చేసుకున్నారు; ఆ భూముల్ని బాగా దున్నించి పండించుకున్నారు; ఆ గ్రామాల్లో ప్రజలు సుభిక్షంగా ఉండేలా చూసుకున్నారు.

★ ★ ★

తిరుమల ఆలయం అధీనంలో ఎన్నో గ్రామాలుండేవి. కొన్ని గ్రామాలు దేవదేయాలుగా వుండేవి. రాజుగారి అజమాయిషీలో ఈ ఆలయాల ఆదాయాలను సక్రమంగా వసూలు చేసి ఆలయానికి అందచేసే బాధ్యత గ్రామాధికారులది.

తిరుమల ఆలయంలో లభించిన శిలాశాసనాలు అప్పట్లో దేవదేయ గ్రామాల అభివృద్ధికి 'తిరుమల శ్రీనివాసుడి' భక్తులు ఎలా కృషి చేశారో వెల్లడిస్తున్నాయి.

ఆలయానికి భూముల రూపంలోనే కాకుండా, ధనంగానూ, బంగారం రూపంలో కూడా కానుకలు వస్తాయి కదా! అవికాక, భక్తులు నైవేద్యాలు చేయమని, ఉత్సవాలు చేయించమని, నందాదీపాలు ఏర్పాటు చేయమని, పుష్పవనాలు పెంచడానికి, గోశాలలు, గోవుల పెంపకానికని ఆర్జితం (రుసుం) కట్టేవారు. భూములిచ్చి, గ్రామాలిచ్చి వాటిపై ప్రతి సంవత్సరం వచ్చే ఆదాయంతో వారు కోరిన సేవ చేయమనడం ఒక రకం. ధనమో బంగారమో ఇచ్చి, దానిమీద వచ్చే వడ్డీతోనో ఆదాయంతోనో ప్రతి సంవత్సరం వారు కోరిన సేవ చేయించమనడం ఇంకో రకం.

ఇలా వచ్చిన ధనాన్ని ఆలయ స్థానత్తారులు (ధర్మకర్తలు) ఏం చేసేవారు?

ఆలయ భూములు, దేవదేయ గ్రామాల్లో నీటివసతి పెంచి, చెరువులు-కాలువలు, బావులు, ఆనకట్టలు కట్టి, పంటలు దిగుబడి పెంచి, తద్వారా ఆలయ ఆదాయం పెంచే పథకాలు వేసేవారు. దేవదేయాలు అలా పెరిగే కొద్దీ తిరుమల ఆలయంలో ఈ నీటిపారుదల పథకాలు, వాటిపై పెట్టుబడులు, మరమ్మత్తులు చూడడానికి ప్రత్యేక విభాగం తయారయ్యింది. దీనివలన అందరికీ అభివృద్ధి. సాగుచేసే రైతుకిది వరం. ఆదాయం పెరిగి రైతు బాగుపడతాడు. గ్రామాభివృద్ధి, ఆలయ అభివృద్ధి. అలా తిరుమల ఆలయానికి వచ్చిన నిధుల్లో ప్రతి సంవత్సరం, ఇలా నీటి వనరుల అభివృద్ధికే ముఖ్య భాగం ఖర్చు అయ్యేదని శాసనాల ద్వారా తెలుస్తోంది.

నీటి పారుదల చేయాలంటే, భూములు చదును చేయాలి. కాలువలు తీయాలి. తూములు నిర్మించాలి. అప్పటివరకు సాగులోలేని బంజరుభూములు సాగులోకి తేవాలి. ఈ పద్ధతి వలన, గ్రామాల, ఆయా ప్రాంతాల అభివృద్ధి, దానితోపాటు ఆధ్యాత్మిక అభివృద్ధి జరుగుతుంది. ఆ రకంగానే తిరుమల ఆలయగ్రామాల్లో జరిగేది. ఫలితంగా, మిగతా గ్రామాల కన్నా తిరుమల ఆలయ అధీనంలోని గ్రామాలు, భూములు, ఆలయ నిధుల పెట్టుబడి వలన బాగుపడుతుండేవి. దాంతో గ్రామాల్లో ఆలయంపై అభిమానం, తమను ఆదుకున్న భగవంతుడు శ్రీనివాసునిపై భక్తి, వాటితో ఆధ్యాత్మిక చింతన, తిరుమలతో అవినాభావసంబంధం పెరిగాయి.

ఆలయానికి వచ్చే ఆదాయం కూడా ప్రభుత్వానిది కాదు. దానిపై ప్రభుత్వానికి హక్కు లేదు. రాజు ఇచ్చిన దానాల విషయంలో చెప్పడం కొంత కష్టమయినా, ఇతరులు మంత్రులైనా, సామంతులైనా, సైన్యాధికారులైనా, వర్తకులైనా, ఇంకెవరైనా, వారిచ్చిన దానాలన్నీ వారివారి సంపదల నుండే ఇచ్చేవారు. అంటే అలా వ్యక్తుల నుండి వచ్చిన ఆదాయం శ్రీవారి ఆదాయంగా పరిగణింపబడి, ప్రాంతీయ అభివృద్ధికి వాడబడి, అటు రైతుకూ, గ్రామానికీ, ప్రాంతానికీ, ఆలయానికీ, అందరికీ మేలుచేసే కార్యక్రమం అయింది. ఇచ్చిన దాతకు ఆధ్యాత్మిక తృప్తి మాత్రమే కాక సమాజసేవ చేయించిన పుణ్యం కూడా దక్కేది.

ఒకరకంగా చెప్పాలంటే శ్రీనివాసుడు తన మాన్యాన్ని తానే అభివృద్ధి చేసుకున్నాడు. పంటలు పండేలా, ఆయాగ్రామాల్లో ప్రజలు సుభిక్షంగా ఉండేలా చూశాడు.

★ ★ ★

44. 108 నుండి 12 కి దిగిన 'పాలన'

తిరుమల ఆలయం నిర్వహణ 108 మంది శ్రీవైష్ణవులతో కూడిన తిరుచానూరు శ్రీవైష్ణవ సభ అధీనంలోంచి 12 మంది స్థానత్తారుల అధీనంలోకి వచ్చింది.

ఇక్కడనుంచే ఆలయ పాలనావ్యవస్థ క్రమంగా రకరకాలుగా రూపాంతరం చెందుతూ వచ్చింది.

★ ★ ★

పల్లవరాణి పదో శతాబ్దంలో చెక్కించిన శిలాశాసనం వల్ల ఆనాటి తిరుమల ఆలయ నిర్వహణ తిరుచానూరులోని వైష్ణవసభవారి అధీనంలో ఉండేదనీ, ఆలయ రోజువారీ బాధ్యతలు నిర్వహించడానికి 'మాడాపత్యంసేవ్యార్' ఉండేవాడని తెలుస్తుంది. ఈయన్ని ఆలయవిధులు నిర్వహించే మేనేజరు అని చెప్పవచ్చు.

తర్వాత చోళుల కాలంలో రాజరాజ చోళుడు చెక్కించిన శాసనం ఆధారంగా, ఈ మాడాపత్య సేన్యార్ ఒక్కరే కాకుండా, సంఖ్య పెరిగి ఉండవచ్చనీ, అంతేకాక, ఆలయ నిధులు మాత్రమే కాక, ఆలయానికి వచ్చే ఆదాయం, ఖర్చులు, దేవదేయాలు, వాటిని జాగ్రత్తగా భక్తుల అభీష్టాల మేరకు నెరవేర్చే బాధ్యతలు కూడా వారికి సంక్రమించినట్లు తెలుస్తోంది. వీరే నెమ్మదిగా, స్థానికులు లేదా స్థానత్తారులుగా మారారు. యాదవరాయల కాలానికి ఈ స్థానికుల (స్థానత్తారుల) ప్రస్తావన శిలాశాసనాలలో స్పష్టంగా చూస్తాం. ఈ స్థానత్తారుల వ్యవస్థ, విజయనగర పాలన ముగిసే వరకూ ఉండేది.

ఆ తర్వాత కాలంలో ఆర్కాటు నవాబుకు ఆలయం ధారాదత్తం కావడం, ఆలయాన్ని ఎక్కువ ధనం ఇచ్చే కౌలుదారుకి (లీజుదారుకు) అప్పచెప్పడం మొదలైంది... ఆ తర్వాత కంపెనీ వారి పాలనలో తిరుపతి తాసీల్దారు అధీనంలో ఉండేది. ఆ తర్వాత విచారణ కర్తలు, మహంతులు, అటు తర్వాత 1933 నుండి ప్రభుత్వం నియమించిన ధర్మకర్తల మండళ్లు, కార్యనిర్వహణాధికారుల పాలన సాగుతూ వచ్చింది.

విజయనగర రాజుల పాలనకు ముందు ఈ స్థానత్తారుల పాలన ఆలయంపై చాలా ప్రభావం చూపించింది.

స్థానత్తారులు అంటే- స్థానికులైన నైతిక విలువలు, సమాజంలో పేరుప్రతిష్ఠలు కలిగి సంపన్నులైన వారిని రాజుగారి తరఫున ఆలయ వ్యవహారాలు నిర్వహించడానికి నియమింపబడిన ధర్మకర్తల మండలిగా చెప్పుకోవచ్చు. మొదట వారు కార్యకర్తలుగా కాక, అప్పుడప్పుడు వచ్చి ఆలయ వ్యవహారాలు చూసే పర్యవేక్షకులుగానూ, ఆలయ అభివృద్ధి, ఆదాయ వినియోగం ఇతర కీలక నిర్ణయాలు తీసుకొనే అధికారమండలి గానూ ఉండేవారు. మొదట్లో వీరందరూ ఆలయ పూజా, ఆధ్యాత్మిక, మతపర విషయాల కంటే - ఆలయం సిబ్బంది, ఆదాయ, వ్యయాలు, ఆస్తులు నిర్వహణ, యాత్రికుల సదుపాయాలు, ఆలయం కొనుగోళ్లు, దేవదేయాలు చూసేవారు. రానురాను ఇందులో ఆలయంలో పనిచేసే ఆధ్యాత్మిక, మతపరమైన వ్యక్తులు కూడా చేర్చబడడంతో కొంతకాలం కొందరు మతపరమైన ఆలయ నిర్వాహకులు, కొందరు లౌకికులు ఉండేవారు.

తర్వాత తర్వాత ఆలయానికి దేవదేయాలు పెరగడం, నైవేద్యాలు, పూజలు పెరగడం, ఒక బ్రహ్మోత్సవంగా మొదలై, ఆ కాలానికే సంవత్సరంలో కొండపై ఏడు బ్రహ్మోత్సవాలు, తిరుపతిలో రెండు బ్రహ్మోత్సవాలు నిర్వహించబడడం, వందలాది గ్రామాలు దేవదేయం కావడం, ఆ గ్రామాల్లో, భూముల్లో, నీటిపారుదల అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం, అదే సమయంలో ఆలయాలమీద రాజుల ఆధిపత్యం సడలడం వంటి కారణాల వలన, 14వ శతాబ్దం రెండవభాగంలో ఈ స్థానత్తారు కార్యనిర్వహణాధికారుల మండలి ధర్మకర్తల మండలిగా పరివర్తన చెందింది. అంతవరకు తిరుచానూరు వైష్ణవ సభవారు (108 మంది శ్రీవైష్ణవులు) ఒక రకంగా ధర్మకర్తలుగా వ్యవహరిస్తూ దేవదేయ విషయాలు, ఆలయ పరిపాలన నిర్వహణ చూసేవారు. ఉత్సవాలు ఇతర వ్యవహారాలు కొండమీదకు తరలించబడటం, అటుతర్వాత రామానుజుల కాలంలో తిరుపతిలో గోవిందరాజుల గుడి, దానిచుట్టూ ఏకాంగులకు, జియ్యంగార్లకు, ఆచార్య పురుషులకు ఆవాసాలు ఏర్పరచి, రామానుజపురం స్థాపించి, ధాన్యాగారం, అంగడివీథులు ఏర్పాటుచేసి, తిరుమల కొండకు వెళ్లడానికి తిరుచానూరు కాకుండా, తిరుపతి నుండి వెళ్లే ఏర్పాటు జరగడంతో తిరుచానూరు ప్రాబల్యం తగ్గింది. దానితోపాటే అక్కడి వైష్ణవ సభ ప్రభావం కూడా తగ్గడం మొదలైంది. తిరుచానూరులో ఉండే వైష్ణవ పండితులు, తిరుపతి, తిరుమలలకు వెళ్లిపోవడం కూడా ఇందుకు మరో కారణం.

అలా తిరుచానూరు సభలోని 108 మంది నుండి తిరుమల ఆలయ యాజమాన్యం తిరుమల ఆలయ స్థానత్తారుల హోదా కలిగిన 12 మందికి మిగిలింది (సంక్రమించింది). ఈ మార్పులు జరగడానికి దాదాపు 30 సంవత్సరాల కాలం పట్టి ఉండవచ్చని శాసనాలు పరిశీలించిన పరిశోధకుల అభిప్రాయం.

1360 సంవత్సరం నాటికి ఈ స్థానత్తారులు మొదలై 1390 సంవత్సరం నాటికి అందరూ ఆలయ బాధ్యతలు నిర్వహించే ధర్మకర్తలుగానే కాక, ఆలయంలో వారు నిర్వహించే బాధ్యతలకు వారికి ప్రసాదంలో భాగం కూడా ఇచ్చే సంప్రదాయం వేళ్లూనుకుంది. 1390 శిలాశాసనంలో - 12మంది స్థానత్తారులుండేవారని వారి వివరాలు, వారికి ప్రసాదంలో ఎంత భాగం ఇవ్వాలో కూడా వివరించబడింది. ఇది ఒకరకంగా వారే నియమించుకున్న ధర్మకర్తల మండలి అనుకోవచ్చు. ఆదాయవ్యయాల లెక్కలు ప్రత్యేకంగా చూపడానికి లేఖకులతో ఒక కొత్త విభాగాన్ని కూడా వీరు మొదలుపెట్టారు.

తిరుమల ఆలయంలో స్థానత్తారులు ఎవరెవరు అంటే...

తిరుపతి శ్రీవైష్ణవులు	- 4
తిరుచానూరు సభాయ్యారులు	- 3
నంబినూరు (అర్చకులు)	- 1
కోయిల్ కెల్కుం జియ్యర్లు (జియ్యంగార్లు)	- 2
కోయిల్ కానుక్కు తిరుచినిన్ర ఉడయార్ (లేఖకులు)	- 2
	12

1390 నాటికి వీరందరికీ ఆలయ నైవేద్యాలలో కొంతభాగం సంక్రమించేది. వీరికే కాక ఆలయంలోని ఇతరులకు కూడా భాగాలుండేవి.

★ ★ ★

44. తిరుమలలో ప్రసాదాలు

తిరుమల ఆలయంలో రకరకాల ప్రసాదాలు నైవేద్యంగా సమర్పిస్తారు. చాలావరకు తమిళపేర్లే ఉంటాయి.

సంధి	అన్న నైవేద్యం
సంధి తిరుప్పానకం	”
తిరుప్పానకం	”
రజన తిరుప్పానకం	”
వెళ్లై తిరుప్పానకం	”
అర్ధనాయకతళిగ	”
నాయికతళిగ	”
దధ్యోదనం	”
మట్టిరాయ్ తళిగ	”
తిరుప్పావడ	” (పులిహోరలాంటిది)
తిరువలక్కం	”
తిలాన్నం	”
అక్కలిమంష్టై	”
అప్పపడి	అప్పాలు - భక్ష్యాలు
అతిరసపడి	అరిసెలు
వడైపడి	వడ
గోధిపడి	వడ ”
సుఖియాన్‌పడి	” ”

ఇడ్డిలీపడి	ఇడ్లి	”
సిడై పడి		”
ప్రోదిలింగైపడి		
పోరిపడి	అటుకులు	
తిరుక్కనమడై (మనోహరపడి)	మినపలడ్డు	
పారుప్పువియలు	సుండలు (గుగ్గిళ్లు)	
తిరుప్పయ్యారం (పణ్యారం)	పొట్టుతో మినపవడ	
అవల్ పడి	గట్టి అటుకులు	
తెరకు లాల్		
పంచవాహి	పవిత్ర అన్నం	

ఇవేకాక, మాత్ర, బెల్లం, పంచదార, పళ్లు, వేయించిన జీడిపప్పు, బాదం, మినపసున్ని, జిలేబి, దోసె, కొలువులో నైవేద్యం చేసే వేయించిన నువ్వుల పొడి, కజ్జాయం పాలు, పెరుగు, వెన్న, తాంబూలం... ఇలా ఎన్నోరకాల ప్రసాదాలు ఆలయంలో నైవేద్యం చేయించబడతాయి.

ఇందులో కొన్ని ప్రసాదాలు ముఖ్యంగా అన్నప్రసాదాలు, పణ్యారాలు (భక్ష్యాలు) చాలా పెద్ద ఎత్తున, వందల గంగాళాలలో తయారుచేసి ఆ రోజుల్లో నైవేద్యాలు చేసేవారు. ఈ ప్రక్రియ విజయనగర సామ్రాజ్యస్థాపనకు ముందు ఒక శతాబ్దంగా మొదలై, విజయనగర పాలకుల సమయానికి రోజుకు 100 సార్లు నైవేద్యం చేసే స్థాయికి వెళ్లింది.

★ ★ ★

45. ప్రసాదాలతో 'భక్తివ్యాపారం'

అసలు 'రిస్క్' లేని వ్యాపారం అంటూ ఏదన్నా ఉందంటే అది – తిరుమలలో నైవేద్య ప్రసాదాల పేరు మీద దేవదేయాలు సమకూర్చడమే. ఈ 'భక్తివ్యాపారం' తిరుమల ఆలయం ఆధారంగా కొన్ని శతాబ్దాలపాటు కొనసాగింది.

ఈ ప్రసాదాల వితరణ చక్రం ఆలయ అధికారులనే కాక, తిరుపతిలో వ్యాపారుల్ని కూడా ఉత్తుత్తి వదాన్యులుగా మార్చేసింది.

యాత్రికులకు ఊహకందనంత వ్యూహాత్మకంగా సాగిన ఈ తిరుమల ప్రసాదాల చరిత్ర ఇంతింత కాదు.

★ ★ ★

ఆలయంలో ప్రసాదాల వినియోగం ఎట్లా జరిగి ఉండేదో తెలియాలంటే మనకు ఆధారాలు – ఆలయంలోని శిలాశాసనాలు, లేదా ఆ కాలంనాటి రచనలు... ఈ విషయం శిలాశాసనాల ద్వారానే తెలియాలి. ఎందుకంటే రచనలలో ఈ విషయ ప్రస్తావన లేదు. దాదాపు 14వ శతాబ్దం మొదటి వరకు ఆలయంలో నైవేద్యాల మీదకన్నా, దాతలదృష్టి – నందాదీపాలు, ఆలయంలో నేతిదీపాల మీద, అఖండ దీపాల మీద ఉండేది.

1209, 1332 శిలాశాసనాల ద్వారా – ఆలయంలో నైవేద్యం కోసం చేసిన దేవదేయాలు, ఆలయం సిబ్బంది భోజన అవసరాల కోసం చేసిందిగానే కనిపిస్తుంది. యాత్రికులకు వితరణ చేయాలన్న విషయప్రస్తావన లేదు. ఆ రోజుల్లో స్థానత్తార్లకు (ఆలయ ధర్మకర్తలకు) భాగంలేదు.

1390 నాటి శాసనంతో ఆలయ నైవేద్యప్రసాద వితరణలో చాలా మార్పులు వచ్చినట్లు తెలుస్తోంది. స్థానత్తార్ల ప్రభావం పెరిగి, ఆలయ సిబ్బందితోపాటు, స్థానత్తారులకు కూడా ప్రసాదంలో భాగం ఇవ్వబడింది. ముఖ్యంగా గమనించాల్సింది

- అంతకు ముందు కాలంలో, సిబ్బంది అవసరాలకే ప్రసాద వినియోగం జరిగేది. అంటే అక్కడ పనిచేసే వారికి ప్రసాదమే భోజనంగా భావించవచ్చు.

కాని తర్వాతికాలంలో అలా కాదు, ప్రసాదంలో భాగాలు, వాటాలు ఇవ్వబడేవి. వారు తినడానికి మాత్రమేకాదు, అంతకంటే ఎక్కువగా ప్రసాదాలు ఆలయ అధికారులకు, స్థానత్తారులకు వచ్చేవి. తళిగ (గంగాళం) నైవేద్యంలో నాలుగవ వంతు దానంచేసిన వారికి వెళ్లేది. మిగతాది స్థానత్తారులు, అధికారులు పంచుకొనేవారు.

అరిశ నిలయం మొల్లై తిరువేంకటజియ్యరు చేసిన 1390 నాటి దేవదేయంలో మొదటిసారి స్థానత్తారులకు (చేసిన దాత కూడా స్థానత్తారులలో ఒకడు) దాత భాగం 12 విభాగాలు చేసి, 12 మంది స్థానత్తారులకు పంచాలని మొదలైన ప్రసాద వితరణ తర్వాత కాలంలో, దాతల భాగం నుండేకాక, మిగతా 75 శాతం ప్రసాదంలో కూడా ఎక్కువ భాగం వీరికే చెందేట్లు ఏర్పాట్లు జరిగాయి. అంటే ఆలయ ధర్మకర్తలు - ఆలయ అభివృద్ధితోపాటు, తమ వ్యక్తిగత అభివృద్ధిని కూడా మర్చిపోలేదని తెలుస్తోంది. ఎంతవరకు వెళ్లిందంటే - తర్వాతికాలంలో నైవేద్యంలో భాగాలేకాక, బ్రహ్మోత్సవాలలో వారికి కొంత నగదురూపంలో కూడా ఆలయం నుండి ఇవ్వడం, దాత భాగంలో కొంత ప్రసాదాన్ని విధిగా వీరికి కేటాయించడం కూడా ఒక సంప్రదాయమైపోయింది.

వచ్చిన యాత్రికులకు ప్రసాదం ఉచితంగా పంచేవారా అన్న విషయ ప్రస్తావన ఆ రోజుల్లో అంతగా కనపడదు. ఇలా ఆలయ అధికారులకు వారి అవసరాల కన్నా ఎక్కువ ప్రసాదం భాగంగా రావడంతో, ఆలయంలో ప్రసాదం అమ్మే సంప్రదాయం మొదలైంది. యాత్రికులకు ప్రసాదం కావాలంటే, ఆలయంలోనే, ఆలయ అధికారుల నుండి లేదా దాత భాగం నుండి లేదా స్థానత్తారుల భాగం నుండి కొనుక్కొనేవారు. కొన్నికొన్ని దేవదేయాలు, ముఖ్యంగా, దూరంనుండి వచ్చిన రాజులు, ధనికులు నైవేద్యానికి చేసిన దేవదేయాల్లో వారి భాగం - అంటే నాల్గవ వంతు, యాత్రికులకు ఉచితంగా వితరణ చేయాలనే కోరిక కనబడుతుంది. అలా యాత్రికులకు వితరణ చేసినా, ఇంకా చాలామంది యాత్రికులకు ప్రసాదం అవసరం ఉండేది. కొని తీసుకోవడానికి యాత్రికులు సిద్ధం. అలా ఆలయాధికారులు, స్థానత్తారులు, వారి సేవలకు నైవేద్యం రూపంలో ఆదాయం (భోజనం మాత్రం కాకుండా) పొందే అవకాశం మొదలైంది.

ఎంత తళిగ (గంగాళం) నైవేద్యం, ఏ నైవేద్యం, దానికి వాడవల్సిన పదార్థాలు - అన్ని ఏర్పాట్లు పద్ధతిగా ఆ రోజుల్లోనే చేయడం జరిగింది. యాత్రికుల సంఖ్య

పెరుగుతున్న కొద్దీ ప్రసాదాలకు గిరాకీ పెరగడం మొదలైంది. అదీకాక, దేవునికి నైవేద్యం చేసినది తిరుమలలో తిన్నా చాలా పుణ్యం. కొని తీసుకొని వెళ్ళి, వారి బంధుమిత్రులతో పంచుకోవడం కూడా పుణ్యంగా భావించేవారు.

1547 సంవత్సరంలో చెక్కించబడిన శాసనం ద్వారా ఆలయంలో ప్రసాదం అమ్మే హక్కు 11 మందికి ఉన్నట్లు స్పష్టంగా తెలుస్తోంది. వారివారి భాగాలేకాక, దాతల భాగంకాని, ఇతర భాగస్వాముల భాగంకాని, వీరిలో ఎవరైనా కొని, వాటిని యాత్రికులకు అమ్మే అధికారం కూడా ఉన్నట్లు శాసనం చెబుతుంది. అలాగేకాక, ఇతరుల ప్రసాదం భాగాలను కూడా వారి తరఫున ఆలయంలో అమ్మే అధికారం ఈ పదకొండు మందికి ఉండేది. ఈ ప్రసాదాలు అమ్మేవారిని 'ప్రసాదక్కార్' అని పిలిచేవారు. అలా మొదలై, కొన్ని శాసనాల్లో ఈ వెసులుబాటు, దాతల నాలుగో వంతు భాగం కూడా వారు ఈ ప్రసాదక్కారులకు గాని, వారి ద్వారా గాని అమ్ముకొనే హక్కు వచ్చిందని తెలుస్తోంది.

ఇవన్నీ దొంగతనంగా జరిగేవి కావు. అధికారికంగా జరిగిన ఏర్పాట్లే. అలా ప్రసాదాన్ని యాత్రికులకు నేరుగా అమ్మడానికి లేదా ఇతర ప్రసాదక్కార్లకు అమ్మివేయడానికి, లేదా వారు వీరి తరఫున అమ్మడానికి అధికారం ఉండడంతో, ఆలయంలో ఈ ప్రసాదాల అమ్మకంతో పెద్దపెద్ద కౌలుదార్లు (lease holders) తయారయ్యారు.

అలా నైవేద్య దేవదేయం చేయడం కొందరికి లాభసాటి పెట్టుబడిగా మారింది. దీనితో నైవేద్యాల కోసం గ్రామాలు, భూములు దానాలు ఇచ్చేదానికన్నా, ధనరూపంలో నైవేద్యం కోసం దేవదేయాలు పెరిగినట్లు తెలుస్తోంది.

1510 నుండి 1570 వరకు తిరుమల ఆలయానికి ధనరూపంలో వచ్చిన దేవదేయాలు పరిశీలిస్తే కొన్ని ఆసక్తికర విషయాలు తెలుస్తున్నాయి.

ఆలయానికి వచ్చిన రాజులు, సామంతులు, మంత్రులు, సేనానులు, వర్తకులు, ధనికులు దేవదేయాలు చేయడం మొదటినుంచీ ఉంది, ఇప్పుడూ ఉంది. కాని ఆ కాలంలో బయటివారి కంటే, ఆలయ అధికారులు, సిబ్బంది, తిరుపతిలోని వ్యాపారులు, స్థానికులు, ధనరూపంలో నైవేద్యానికి చేసిన దేవదేయాలు ఎక్కువ. దాదాపు అన్ని దేవదేయాలలో నాల్గవ భాగంపైగా ఆలయఅధికారులు, ఇంకొక 40 శాతం తిరుపతి వాస్తవ్యులు చేసిన దేవదేయాలే.

చాలా సంవత్సరాలుగా ప్రతి సంవత్సరం ఆలయ అధికారులు, స్థానికులు, ఈ నైవేద్య ప్రసాదాలకీ - అందునా ధనరూపంలో దానాలు చేస్తున్నారంటే ఏదో కారణం ఉండి ఉండాలని, కొంత పరిశోధన చేయడం జరిగింది. అంతా దేవునిమీద భక్తితో చేసిన దేవదేయాలేనా?

ఈ దేవదేయాలు ముఖ్యంగా ఎవరు చేస్తున్నారు? ఆలయ అర్చకులు, ఆలయ అధికారులు, స్థానత్తారులు, లేఖకులు, ఆస్థాన విద్వాంసులు, ఆచార్య పురుషులు, గాయకులు, నాట్యసానులు మొదలైనవారు. వీరందరికీ ప్రసాదాల్లో భాగాలున్నాయి... వాటిని అమ్ముకొనే, అమ్మించే హక్కులున్నాయి. ప్రసాదాలకు మంచి ధర ఉంది. కొనేవారున్నారు. మంచి గిరాకీ ఉంది. అమ్మేవరకూ ధనం రాదనే దిగులులేదు. ముందుగానే మన భాగం ప్రసాదం కొని, ధనం కూడా ముందే ఇచ్చే గుత్తేదార్లు ఉన్నారు.

ప్రసాదాలకు యాత్రికుల నుంచి మంచి గిరాకీ ఉండటంతో మంచి ధర వచ్చేది. ప్రసాదాలకు దేవదేయం చేస్తే అందులో దాతగా నాలుగోభాగం వస్తుంది. అదికాక ఆలయ అధికారిగా తన వంతు భాగం ఎలాగూ ఉంది. కనుక పోయిన సంవత్సరం ఆలయం నుండి ప్రసాదాల ద్వారా తనకు వచ్చిన ఆదాయం, ఇంకెవ్వరికైనా వడ్డీగా ఇచ్చేదానికన్నా, ప్రసాద దేవదేయంగా ఆలయానికే కడ్తే వచ్చే ఆదాయం ఎక్కువ. భూమి మీద కాని, ఇతర వ్యాపారాల్లో కాని ఇతరులకు వడ్డీకి ఇచ్చినా, పెట్టుబడి తిరిగి వస్తుందన్న గ్యారంటీ లేకపోగా, ఇంత ఆదాయం రాదు!

అందుకని, ఆలయ అధికారులు, వారి సంపాదనంతా దాదాపుగా మళ్లీ ఆలయంలో నైవేద్య దేవదేయాలకే పెట్టుబడి పెట్టేవారు. ఇందులో డబ్బు పోతుందని భయంలేదు, ఆదాయం రాదని సంశయంలేదు. అమ్ముకోవడం కష్టంకాదు. ప్రతి సంవత్సరం నికర ఆదాయం! పైగా దానం చేసిన పుణ్యం కూడా!

వీరిని చూసి, చాలా గిట్టుబాటు వ్యవహారం అని తిరుపతి వర్తకులు, స్థానికులు కూడా ఈ ఆలయ ప్రసాద దేవదేయాలలో పెట్టుబడులు పెట్టడం పెద్ద ఎత్తున మొదలైంది.

1500 సంవత్సరం ప్రాంతంలో మొదలైన ఈ ప్రక్రియ 1550/60 ల నాటికి ప్రసాదాల కోసం నగదు రూపంలో వీరినుండి వచ్చే దేవదేయాలు మొత్తం దేవదేయాలలో 75/80 శాతంగా ఉండేదంటే ఈ ప్రసాదాల వితరణ చక్రం ఏ స్థాయిలో ఉండేదో మనం అర్థం చేసుకోవచ్చు.

ఆ ఆదాయాలు ఏడాదికేడాదికి పెరుగుతూండటంతో దేవదేయాలను ధనం రూపంలోనే కాక, భూములు, గ్రామాలుగా కూడా ఆలయాధికారులు కొని, నైవేద్య ప్రసాద దేవదేయాలుగా పెట్టుబడులు పెట్టేవరకూ వెళ్లింది! ఆ రోజుల్లో ఆలయానికి దేవదేయాలుగా ఉన్న 114 గ్రామాల్లో దాదాపు 42 గ్రామాలు ఈ ఆలయ అధికారులు చేసిన దేవదేయాలే!

1535 వ సంవత్సరంలోని శిలాశాసనం (278 T.T.) ఆలయ పశ్చిమపు గోడ మీద ఉంది. అందులో సాళువ గోవిందరాజు తనకు దాత భాగంగా వచ్చిన నాలుగవ వంతు ప్రసాదం, తిరుమల అయ్యంగారు అనే ఆయనకు సర్వహక్కులతో అమ్ముతున్నట్లు చేసిన శాసనం అది.

అంటే– ఆ కాలానికి దేవదేయాలు అన్ని హక్కులతో కొనుగోలు, అమ్మకాలు జరుగుతుండేవని స్పష్టంగా తెలుస్తోంది. అమ్మినవారి తరఫున ఆలయం నుండి వారి ప్రసాదం భాగం తీసుకొని, 'ప్రసాదక్కార్' ఆలయంలోనే అమ్ముకొనేవారు. అటువంటి ఒప్పందాలు, ఏ ఒక్క సంవత్సరానికో కాకుండా, పూర్తి హక్కులు తరతరాల వరకు అమ్ముకొనే అవకాశం ఉండటంతో, తిరుపతిలోని స్థానికులు, ధనికులు, వ్యాపారులే కాకుండా, దేశాంతరులు (బయటినుండి వచ్చినవారు) కూడా ఇటువంటి దేవదేయాలు చేసి, వారి భాగం ప్రసాదం, ప్రసాదక్కారులకు అమ్మివేసి వెళ్లేవారు.

ఇదే పుణ్యం, పురుషార్థం అంటే!

★ ★ ★

47. తిరుమల కొండమీద స్థలం కొనుక్కోవచ్చు!

ఇప్పుడంటే తిరుమల కొండమీద హక్కులన్నీ తిరుమల-తిరుపతి దేవస్థానాల ఆధిపత్యంలో ఉన్న పంచాయతీకి సంక్రమించాయికానీ, ఒకప్పుడు ఇలా లేదు. ముఖ్యంగా విజయనగర రాజుల కాలంలో పరిస్థితులు ఇంకా విభిన్నంగా ఉండేవి.

తిరుమల కొండమీద స్థలాలు క్రయవిక్రయాలు చేసుకోవచ్చు. అలా అమ్ముకున్న, కొనుక్కున్న సంఘటనలకు అద్దంపట్టే శాసనాలు అందుబాటులో ఉన్నాయి.

అలాగే కొన్ని ఉత్సవాలు కూడా ఆ కాలంలోనే ప్రవేశపెట్టబడ్డాయి. తిరుమల ఆలయంలో వేద పారాయణ కూడా అప్పుడే ప్రవేశపెట్టబడింది. అయితే ఈ వేదపారాయణ సేవని ప్రవేశపెట్టడం అంత సులభంగా జరగలేదు. దానికి చాలా పెద్ద గ్రంథమే నడిచింది.

★ ★ ★

హరిహరరాయలు-బుక్క రాయలతో మొదలైన సంగమవంశ విజయనగర సామ్రాజ్య కాలంలో తిరుమల ఆలయం చాలా అభివృద్ధి చెందిందనే చెప్పాలి. బుక్కరాయలు చేసిన శాసనాలు, జియ్యరు ద్వారా హరిహరరాయలు చేసిన దేవదేయాలు వున్నాయి. వీరి కాలంలో ప్రతిరోజూ స్వామివారికి సమర్పించే అన్ని ప్రసాదాలలో చాలా అభివృద్ధి వుంది. రాజులు, సామంతులు, సేనాధిపతులు ముఖ్యంగా శ్రీయాత్రశేఖర మల్లన్న చేసిన దేవదేయాలు శ్లాఘనీయం.

ప్రతి రోజూ నైవేద్యానికి ఈ సంగమ వంశ కాలంలో గ్రామాలు, పంట కాలువ ఖర్చులు, బంగారం, భూములు, ఎన్నో దానాలు చేశారు. వారిలో ముఖ్యులు - బుక్కరాయలు, హరిహరరాయలు ముళ్లైతిరు వేంకట జియ్యరు, రెండవ దేవరాయలు, సేనానాయకుడు తెప్పాడ నాగయ్య నాయకుడు, ముఖ్యమంత్రి మల్లన్న, వెంపరమిన్నార్ జియ్యరు.

ఈ రోజుల్లోనే నైవేద్య వితరణకు ఒక క్రమబద్ధత వచ్చింది. అంతకు ముందు దానం ఇచ్చిన దాతలకు నాలుగవ వంతు ప్రసాదం ఇవ్వాలన్నదే స్పష్టంగా వుంది. మిగతా మూడు భాగాల విషయం ప్రస్తావనకు రాలేదు. దాతలు దానాలిచ్చి వెళ్లేవారే చాలామంది. కొండ మీద వుండి ప్రసాదాలు తీసుకొనే దాతలు చాలా తక్కువ. అందరు దాతలు తమ భాగం యాత్రికులకు వినియోగం చేయాలి అని చెప్పినట్లు అదివరకు కనపడదు. చాలామంది వారి భాగాలను ప్రసాదక్కార్‌లకు అమ్ముకోవడమూ చూశాం.

ఈ కాలం నుండి శాసనాలలో ఈ ప్రసాదాలు ఎవరెవరికి ఎంతెంత చెందుతాయో విపులంగా చెబుతాయి. దాతలకు నాలుగోవంతు పోను, మిగిలిన ప్రసాదం 24 భాగాలు చేసి, నాలుగు భాగాలు ఏకాంగి శ్రీవైష్ణవులకు పంకయిచెల్లి నందనవనం (జియ్యంగారి) మఠానికి ఇవ్వాలి. 12 మంది స్థానత్తార్లకు (ఆలయ ధర్మకర్తలకు - ఈ ఆలయ ధర్మకర్తలు తిరుమలలోనే వుండి, ఒక్కొక్కరు ఒక్కొక్క విధి నిర్వహిస్తునట్లు భావించాలి) ఇవ్వాలి. మిగతా 8 భాగాలలో ఇతర పడిప్రసాదాలతో సహా, మండపంలో తిరువాయ్‌మొళి చదివే శ్రీవైష్ణవులకు పంచాలి. ఒక శాసనంలో దాత భాగంలో కొంత వెంపరమన్నార్ జియ్యరుకు, దేవాలయ నాట్యకత్తెలకు, ఇంకొంత భాగం ఆలయంలో పనిచేసే సాలెగాళ్లకు ఇవ్వాలి. మిగిలింది దాత తీసుకోవచ్చు. ఈ కాలంలోనే మళ్లీ వేదపారాయణం మొదలైంది. కాని ఆ పారాయణ చేసేవారికి ప్రసాదంలో భాగం కనపడదు.

వీరి కాలంలోనే ధ్వజారోహణతో చేసే 9 రోజుల ఉత్సవాలు (బ్రహ్మోత్సవాలు) - మూడు నుండి ఏడాదికి 7కి పెరిగాయి. తిరుమలలో 7 నెలలు బ్రహ్మోత్సవాలు తిరుపతిలో రెండు నెలలలో రెండు బ్రహ్మోత్సవాలు జరిగేట్టు దాతలు దేవదేయాలు చేశారు. ఆ ఉత్సవ రోజుల్లో మూలవరులకు, ఉత్సవమూర్తులకు ఉత్సవం జరిగేటప్పుడు ప్రతి రోజూ నైవేద్యాలకు ఎవరో ఒకరు దానాలు చేసేవారు.

ఈ బ్రహ్మోత్సవాలే కాకుండా 'కొడై తిరునాళ్లు' అని, అధ్యయనోత్సవాలని కొత్త ఉత్సవాలను ప్రారంభం చేశారు. ఏ ఉత్సవం మొదలైనా దాని ఖర్చులో భాగంగా కొత్త నైవేద్యాలకు కూడా దేవదేయాలు చేయటం నియమం.

ఈ రోజుల్లో స్వామివారి పాలు, పెరుగు, నెయ్యి, ఇతర అవసరాలకు చాలా గోదానాలు చేసినట్లు శాసనాలు వున్నాయి. వాటి ఖర్చులకు కావలసిన మొత్తం దేవదేయాలు చేశారు. చాలామంది దాతలు, దేవదేయగ్రామాల్లో నీటి పారుదల సౌకర్యాలను సొంత ఖర్చులతో కల్గించి, ఆలయ ఆదాయం పెరగటానికి తోడ్పడ్డారు.

బంగారు నగలు, ఆభరణాలు చాలా కానుకలు స్వామికి సమర్పించడం జరిగింది. ఈ కాలంలో దేవాలయంలో అన్న ప్రసాదాలకు కావల్సిన ధాన్యం దేవదేయ భూముల నుండి వచ్చేది.

తిరుపతిలో పాత హుజూరు ఆఫీసుకు ముందు ఒక పెద్దరాతి మండపం ధాన్యాగారంగా ఉపయోగించేవారు. అందుకే ఆ మండపం వున్న తోటని కనిజంతోట (ధాన్యాగారంతోట) అని పిలిచేవారు. ఇవి గోవిందరాజ స్వామి గుడి వెనుక భాగంలో వుండేది.

దాతలు శ్రీ భండారానికి ఇచ్చే విరాళాలు, ధనం గాని, బంగారు నాణాలు గాని - వాటిని దేవస్థానం స్థానత్తారులు దేవదేయ గ్రామాలలో నీటిపారుదల అభివృద్ధికి పెట్టుబడిగా పెట్టి, ఆలయానికి వచ్చే ఆదాయం పెంచేవారు.

ఈ కాలంలో వేదపారాయణం గురించి విపులంగా కొన్ని శాసనాల్లో వుంది: తొమ్మిది-పదో శతాబ్దాలలో పూర్తి సంస్కృత మంత్రాలతోనే స్వామివారి ఆలయంలో అన్ని సేవలూ జరుగుతుండేవి. ఆ రోజుల్లో వేద పఠనానికి ప్రాముఖ్యం వుండేది. తర్వాత తర్వాత తమిళ ప్రబంధ పారాయణ సంప్రదాయం మొదలై దేవాలయంలో అసలు వేదపారాయణే లేని స్థితి కొంతకాలం వుండేది. ఈ సంగమ రాజుల కాలంలోనే ఆలయంలో మొదలియార్ తిరుక్కనికన్రదాసరు అలగప్పరినార్ అనే స్థానత్తారు ఈ విషయాల్లో అభివృద్ధి చెందుతున్న ఈ ఆలయంలో వేదపారాయణం లేకపోవడం చాలా శోచనీయమని తలచి చంద్రగిరి మండలాధిపతి (Governor) దేవన్న ఉడయార్‌కు విషయం విన్నవించి, విజయనగర రాజుల సేవగా వేదపారాయణం మళ్లీ మొదలుపెట్టమని అర్థించాడు. రెండవ దేవరాయలు అప్పటిరాజు. ఆయన పేరు మీద శ్రీనివాసపురం అనే చంద్రగిరి దగ్గరలో వున్న గ్రామంలో సగం - 'శ్రోత్రియం' (వేదపారాయణం చేసేవారికి ఈనాము)గా ఇచ్చి, 24 మంది మహాజనాన్ని (వేదపారాయణ దారులను) నియమించారు.

కాని వేదపారాయణదారులకు, ఆ సగం గ్రామం నుండి వచ్చే ఆదాయం చాలటం లేదని, మిగతా సగం గ్రామం కూడా శ్రోత్రియంగా వారి కిప్పించమని ప్రార్థిస్తారు. కాని మిగతా సగం గ్రామాన్ని అప్పటికే రాజు దేవదేయంగా తిరుమల ఆలయానికి ఇచ్చేసివున్నాడు. దాని నుండి సంవత్సరానికి 200 పణం ఆదాయం వస్తుండేది. దాన్ని వదులుకోవడానికి దేవాలయ స్థానత్తారులు సిద్ధంగా లేరు. ఆలయానికి ఏదో

విధంగా 200 పణాలు ఇవ్వగలిగితేనే మిగతా సగం వేద పారాయణదారులకు దొరికేది. ఈ విషయంలో శ్రద్ధ తీసుకొన్న కనికన్రదాసరే - ఆ అర్థభాగాన్ని శ్రీభండారం దగ్గర కౌలుకి తీసుకొని, దేవదేయాలుగా వున్న ఇతర గ్రామాల రైతులతో తలా కొంచెం వేయించి, ఇంకొక రెండువందలు ఆదాయం వచ్చే ఏర్పాటుచేసి, ఆ ధనం తిరుమల ఆలయానికి వచ్చేటట్లు, దానిని తాను తీసుకొన్న కౌలు కింద జమకట్టేట్లు, శ్రీభండారం తనకు కౌలుకిచ్చిన సగం గ్రామం వేదపారాయణం చేసేవాళ్లకు చెందేటట్లు శ్రీభండారంలో ఒప్పందాలు కుదిర్చి, ఇందులో సంబంధం వున్న అందరిచేతా ఒప్పందాలపై సంతకాలు చేయించి, ఈ చేసిన ఒప్పందాలను శిలాశాసనాలుగా చెక్కించాడు. ఈ ఒప్పందంలో రైతులు, ఆయా (16) గ్రామాల అధికారులూ, ఆ గ్రామాల రెండు నాడులు (గ్రూపులో వున్నందున), ఆ సంబంధిత అధికారులూ, ఆలయ స్థానత్తారులు, వేదపారాయణచేసేవారు అందరూ భాగస్వాములు.

ప్రతినెలా ఇద్దరు మహాజనులు (ఆలయంలో వేదపారాయణం చేసేవారు) తిరుమల ఆలయంలో వుండి వేద పారాయణం చేయాలని, అలా సంవత్సరంలో 12 నెలల్లో నెలకు ఇద్దరు చొప్పున 24 మంది ఆలయంలో పారాయణం చేయాలన్న ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందాలన్నింటినీ విపులంగా వివరిస్తూ నాలుగు శిలాశాసనాల్లో (నం. 199-203) చెక్కించారు.

అలా తిరుక్కనికన్రదాసరు తీసుకొన్న శ్రద్ధ, శ్రమ, కృషి- వీటి ఫలితమే తిరుమల ఆలయంలో వేద పారాయణం మళ్లీ ప్రారంభించబడటం.

కొండపై స్థలాలు - క్రయవిక్రయాలు

ఈ శాసనాల్లో ఇంకో ఆసక్తికరమైన విషయం ఆ రోజుల్లో తిరుమల కొండ మీద చాలామందికి ఇళ్ల స్థలాలు ఉండేవట. రెండు శాసనాలు ఈ ఇళ్ల స్థలాలు అమ్మే విషయాలలో చెక్కించినవి. ఈ శాసనాల్లో కొంత భాగం విరిగిపోయాయి. నాలుగు ముక్కలుగా వున్న రెండు శాసనాలను దేవస్థానం వారు భద్రపరిచారు. ఈ శాసనాల వల్ల ఆ కాలంలో భూములుకాని, ఇళ్ల స్థలాలు క్రయవిక్రయాలు చేసినప్పుడు ప్రభుత్వ కార్యాలయంలో మార్పు నమోదు చేయించుకోవాలనీ, దానికి ప్రభుత్వానికి రుసుములు చెల్లించాలనీ తెలుస్తోంది.

15వ శతాబ్దంలో రాసిన దస్తావేజుల గురించి నం. 204/205 శిలాశాసనాల్లో చూడవచ్చు. ఉదాహరణకి, తిరుమలలో నాలుగు స్థలాలు 700, 1000, 1000,

2,000 పణాలకు మార్పు ఖర్చు (Registration Fees) తో సహా, తిరుపతిలో నాలుగు స్థలాలు (మార్పు ఖర్చుతో సహా) 2,000, 450, 1500, 4200 పణాలు (మార్పు ఖర్చుతో సహా) కొన్నవారు అమ్మిన వారికిచ్చి, 'ఆవనక్కలారి' (Registration Office)లో మార్పులు ఖరారు చేసుకొన్నట్లు - విక్రయదారుడు క్రయదారునకు ఈ హామీలు ఇచ్చినట్లు ఆ శాసనాలు పేర్కొంటున్నాయి.

కొండమీద పేరుమందేవియార్ అనే స్త్రీకి చెందిన స్థలాలున్నాయి. ఆమెకు పిల్లలు లేరు. దేవాలయానికి ఆ స్థలాలు అమ్మదలుచుకొంది. మరి స్త్రీలు స్థలం అమ్మే హక్కు లేదేమో? లేదా అమ్మితే చెల్లదేమో! మరే కారణమో కాని దేవస్థానం ఆమె వద్ద కొనకుండా - చంద్రగిరి మండలాధికారి శఠకోపనంబి గోవిందన్ అనే ఆయనకు, ఆ స్థలం ఆమె నుండి కొని దేవస్థానానికి అమ్మమని ఆజ్ఞాపిస్తే, ఆ ఆజ్ఞానుసారం ఇలా చేశానని - ఆ గోవిందన్ క్రయపత్రాలు రాసి ఈ స్థలాలు దేవస్థానం కొనడానికి దోహదకారి అవుతాడు... ఇది ఒక ఉదాహరణ మాత్రమే.

ఈ సంగమకాలంలో అమాత్యశేఖరుడు చంద్రగిరి మండలాధికారి (గవర్నర్) మల్లిందయ్యార్ (మాధవదాసరు) తిరుమల ఆలయానికి చేసే సేవల గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాలి.

ఇతడు దాదాపు నలుగురు సంగమ రాజుల కాలంలో చంద్రగిరి మండలాధిపతి గానూ, తర్వాత మంత్రిగానూ, ముఖ్యమంత్రిగాను పనిచేశారు. నలభై సంవత్సరాల కాలంలో ఈయన ఇచ్చిన దేవదేయాలు, గుడిలో కట్టించిన కట్టడాలు, చేయించిన సేవలు వివిధ శిలాశాసనాల్లో వున్నాయి.

ముఖ్యంగా అతడు తిరుమామని మండపాన్ని, సన్నిధికి ఎదురుగా వున్న చుట్టూ గోడలేని మండపాన్ని కట్టించినట్లు (ఆగస్టు 25, 1417లో చెక్కబడిన) శాసనం నం. 196 చెప్తోంది. ఇంకా విరిగిపోయిన శాసనం ఆనంద నిలయ విమానానికి ఏదో చేసినట్లు (కొంత భాగం శాసనం దొరకలేదు) చెబుతోంది. మరమ్మత్తులైనా చేసుండాలి. లేదా బంగారుపూతకు సంబంధించైనా వుండాలి. ఈ విమానానికి 'ఆనంద' శబ్దం మొదటిసారి ఈ శాసనంలో చూస్తాం. ఇంతవరకు విమానమనే వారుకాని. ఈ శాసనంలో 'ఆనందవిమాన' మని ప్రత్యేకంగా చెప్పబడింది. ఇవి కాక చాలా చెరువులకు మరమ్మత్తులు, కొత్త పంటకాలవలు, తీయించి దేవదేయం పెంచి ఆ డబ్బుతో స్వామివారి నైవేద్యాలకు, దీపాలకు ఆవునెయ్యికి వెసులుబాటు చేశారు.

★ ★ ★

48. ఐదు శతాబ్దాలు గడిచినా, అతనే ఆదర్శం

తిరుమల-తిరుపతి దేవస్థానాల కార్యనిర్వహణాధికారులందరికీ ఆదర్శప్రాయుడు సాళువ నరసింహరాయలు!

తిరుమలకు వచ్చే భక్తుల అవసరాలు ఎలాంటివి? వాళ్లకి ఎలాంటి వసతి సదుపాయాలు కల్పించటం అధికారుల బాధ్యత? దాతలిచ్చే దేవదేయాలను ఏ రకంగా స్వామి సేవలో వినియోగించాలి?...

ఇలాంటి అంశాల విషయంలో 570 సంవత్సరాల క్రితంనాటి సాళువ నరసింహరాయలే ఇప్పటికీ స్ఫూర్తిప్రదాతగా నిలుస్తాడు. ఆయన నా చేత కూడా ఒక పని చేయించాడు!

★ ★ ★

క్రీ. శ. 1440 నుండి దాదాపు 15వ శతాబ్ద చివరి భాగం వరకు 60 సంవత్సరాలలో మల్లికార్జున, విరూపాక్షులు విజయనగర రాజులైనా, సైన్యాధికారి సాళువ నరసింహ ఆలయానికి సేవచేసిన ప్రముఖ వ్యక్తిగా శాసనాల్లో కనబడుతుంది. ఈయన శక్తి సామర్థ్యాల వల్లే రాజ్యం విడిపోకుండా పటిష్ఠమైంది. ఈయన జీవితం "సాళువాభ్యుదయం"లో విపులంగా చెప్పబడింది.

మొదట ఇతను మైసూరు ప్రాంతానికి మండలాధిపతి (Governor) గా వున్న రోజుల్లోనే తిరుమల వేంకటేశ్వరునికి రెండు గ్రామాలు దేవదేయంగా ఇచ్చాడు. తరువాత చంద్రగిరి మండలాధీశునిగా బదిలీపై వచ్చాడు. ఆ కాలంలోనే ఇతని దగ్గర బంధువు సాళువ మల్లయ్య దేవుడు చంద్రగిరి రాజ్యంలో ఒక గ్రామం దేవదేయం చేశాడు. ఇతను ఈ దేవస్థానానికి తన మండలంలోనే కాక తర్వాతి కాలంలో ఇతర మండలాలలో గ్రామాలను కూడా ఇచ్చినట్లు శాసనాలు వున్నాయి. అంటే ఇతను రాజ్యమంతా అధికారం చలాయించే పదవిలో వుండి వుండాలని తెలుస్తోంది. ఇతని పేరు మీద ఇతని అధీనంలోని అధికారి నాగమ నాయకుడు కొండమీద ఒక నందన

వనం తయారు చేయించాడు (1487). ఇంకా రెండు దీపాలు స్వామివారికి నిత్యకైంకర్యంగా దేవదేయంగా ఏర్పాటు చేశాడు.

కొండదారిలో నరసింహస్వామికి, దక్షిణంగా యాత్రికులకు మంచి నీటికి ఒక దిగుడు బావి (1490)లో తవ్వించాడు. అలిపిరి మెట్లదారి మొదట్లో ఒక పెద్ద గోపురం కూడా ఇతడే కట్టించినట్లు శాసనం (1490) వుంది. అప్పటికి ఇతను సాళువ నరసింహ మహారాయర్‌గా పేర్కొనబడటంతో ఆ కాలానికి ఇతను విజయనగర సామ్రాజ్యానికి రాజయినాడని తెలుస్తోంది. ఇతను 1492లో చనిపోగా ఇతని కొడుకు ఇమ్మడి నరసింహ రాజుగా వచ్చి క్రీ.శ. 1505 వరకూ సామ్రాజ్యాన్ని తుళువ నరసనాయకుని (అంటే కృష్ణదేవరాయల తండ్రి) సహాయంతో పాలించాడని తెలుస్తుంది.

సాళువ నరసింహ దాదాపు 44 సంవత్సరాలు మండల రాజ్యాధికారిగా కళ్యాణపుర, చంద్రగిరి, సురవీరుల్లలో సైన్యాధికారిగా విజయనగర సామ్రాజ్యమంతా వుండి, చివరగా రాజ్యానికే మహారాజైనాడు.

అతని కాలంలో దాదాపు 18 గ్రామాలు దేవదేయాలుగా తిరుమల శ్రీనివాసునికి ఇచ్చినట్లు శాసనాలున్నాయి. ఇతని కాలంలోనే తిరుమలలో ఉయ్యాల మంటపం - ఉయ్యాల సేవ ప్రారంభించబడ్డాయి. హంస ఆకారంలో ఉయ్యాల చేయించి అందులో స్వామివారికి సేవ చేస్తారు. ఆ సేవాసమయాన విశేష భోగ నైవేద్యాలు తన తల్లి మల్లాంబిక పేర ఏర్పాటు చేశాడు. (నం. 50) ఇవికాక ఏడు బ్రహ్మోత్సవాలలో విశేష నైవేద్యాలకు ఏర్పాటు చేశారు.

పుష్కరిణి మధ్యలో ఈనాడు మనంచూసే మండపాన్ని వసంతమండపంగా ఈయనే కట్టించాడు. స్వామివారికి తెప్పోత్సవం వివిధ ఉత్సవాల సమయాలలో ఏర్పాట్లు చేసి, ఆ సమయంలో నైవేద్యాలకు దేవదేయాలు ఇచ్చాడు. ఆనాటి అర్చకుల దగ్గర నుండి తీర్థవారి మండపం పుష్కరిణి దగ్గరలో కొని, ఇంకొక మూడు మండపాలు పుష్కరిణి గట్టు మీద కట్టించాడు.

తిరుమల ఆలయంలోని సంపంగి ప్రాకారంలో నాలుగు వైపులా నాలుగు మండపాలు (ప్రదక్షిణం మధ్యలో) కట్టించి, ఉత్సవంలో సంపంగి ప్రాకారంలో ఉత్సవ మూర్తులను తెచ్చేటప్పుడు ఈ మండపాలపై స్వామిని వేంచేయించి, తన పేర, తన భార్యపేర, తన ఇద్దరు కొడుకుల పేర - నాలుగు మండపాలలో విశేషంగా నైవేద్యాల

కొరకు దేవదేయం చేశాడు. ఈ మండపాలు ఇప్పటికీ ఉన్నాయి. కళ్యాణోత్సవ సమయంలో ఈ మండపంపైనే మంగళవాద్యాలు వాయించే వారుంటారు.

స్వామివారి అభిషేకానికి పునుగునూనె వాడాలని స్థానత్తారులను ఆదేశించి 'నీ యోగం' (అంటే రాజశాసనం) ఇచ్చాడనీ - అవి తిరుమల-తిరుపతులలో రామానుజ కూటంవారు కావల్సిన అన్ని సుగంధాలూ సరఫరా చేస్తారనీ, దానికి కావాల్సిన ఏర్పాట్లు తాను చేశాననీ ఆదేశాలిచ్చాడు. దానికే 'గుండిపుండి' అనే గ్రామాన్ని దేవదేయంగా ఇచ్చాడు.

అలిపిరి మొదట్లో వున్న లక్ష్మీనారసింహ విగ్రహాలు ప్రతిష్ఠ చేయించింది ఇతనే.

కాలి బాటలో తిరుమల చేరగానే మొదట్లో కన్పించే పూర్తికాని గోపురం కూడా ఇతను కట్టించడం ప్రారంభించినదే. తిరుపతి గోవింద రాజస్వామి గుడిలో ఒక గోపురం కట్టించింది ఇతనే.

తిరుమల ఉత్తర మాడవీథులలో రామానుజకూటాలను యాత్రికులకు ఉచితంగా భోజనం పెట్టడానికి ఏర్పాటుచేసి, తన ఆధ్యాత్మిక గురువుగా భావించే కందాడై రామానుజ అయ్యంగారికి వాటి యాజమాన్య బాధ్యతలు అప్పగిస్తాడు. తాను ఎన్నో నైవేద్య సేవలకు దానాలు చేశాడు గదా, అందులో దాతల వంతుకు వచ్చే ప్రసాదాన్నంతా ఈ రామానుజ కూటాలకు అందించాలని ఆలయ స్థానత్తారులకు ఆదేశాలిచ్చి, ఆ ప్రసాదాలనంతా ఉచితంగా శ్రీవైష్ణవులకు భోజనంగా పంచిపెట్టే ఏర్పాటు చేశాడు.

అలాగే తాను (కాలి నడకన తిరుమల రాగానే) కట్టడం మొదలు పెట్టిన గోపురం ప్రక్కన ఇంకొక సత్రం కట్టించి, ఆ సత్రం యాజమాన్యానికి హస్తిగిరి అయ్యనీ అనే వానిని నియమించి, ఇక్కడ అన్నదానానికి నాలుగు గ్రామాలు దేవదేయం చేసి, వచ్చిన ఆదాయంతో ప్రసాదాలు వేంకటేశ్వరునికి అర్పించి, అందులో వచ్చే దాత వంతును ఈ సత్రానికి ఇచ్చే ఏర్పాటు, దానిని సత్రంలో వుండే యాత్రికులకు ఉచితంగా పెట్టే ఏర్పాటు చేశాడు. ఇంతేకాదు, ఆలయం నుంచి ఈ సత్రం దూరంలో వుంది కనక ప్రసాదాలు మోసుకొచ్చే బ్రాహ్మణులకు జీతాలివ్వడానికి, ఒక వేళ ప్రసాదాలు చాలకపోతే, భోజనాలు వండిపెట్టడానికి కావల్సిన సదుపాయాలకు కూడా ఏర్పాటు చేశాడు. ఇలా ఇతని పేరుమీద ఇంకా కొందరు కూడా దేవదేయాలు చేసినట్లు శాసనాలున్నాయి.

ఇవేకాక పుష్కరిణికి పశ్చిమ భాగాన ఇంకొక సత్రం కూడా ఇతడే కట్టించాడు. దానితో పాటు ఇంకొక కోనేరు కూడా - నరసింగరాయ కోనేరు అని పుష్కరిణికి పశ్చిమంలో- ఇతను తవ్వించాడు (తర్వాతి కాలంలో ఈ కోనేరు పూడ్చి వేయబడింది). ఈ మూడో సత్రంలో బ్రహ్మోత్సవాలలో మాత్రం 10 రోజులు ఉచిత అన్నదానం ఏర్పాట్లు చేశాడు.

ఇతని కాలంలో ఇతని బంధువులు సాళువ మల్ల దేవ తిమ్మయదేవ, వల్లభయ్యదేవ, కొనేరి రాజులు కూడా పలు గ్రామాలను దేవదేయాలుగా ఇచ్చారు. ఇతరులు గంధబేరుండ వడయారు వంటివారుకూడా గ్రామాలు, భూములు దేవదేయంగా చేశారు.

అలా 15వ శతాబ్దం రెండవ భాగంలో మొత్తం 30 గ్రామాలు తిరుమల ఆలయానికి దేవదేయంగా వచ్చినట్లు తెలుస్తోంది. అంతకు ముందు వున్న 20 గ్రామాలతో కలిపి మొత్తం దేవదేయ భూముల్లో నుంచి స్థానత్తారులు ధాన్యం వసూళ్ల చేసేవారు. ధాన్యంతోపాటు, ధాన్యపుసుంకం, బంగారు సుంకం, ఇతర సుంకాలు కూడా దేవాలయ అధికారులే వసూలు చేసేవారు. శాసనాల్లో దేవదేయాలు చేసేటప్పుడు ఈ అధికారాలు కూడా దేవస్థానానికి ఇస్తూ రాజశాసనాలు వేయబడేవి.

తిరుపతికి రెండు మైళ్లలో దూరంలో వున్న 'దుర్గా సముద్ర'మనే పెద్ద గ్రామాన్ని ఈ సాళువ నరసింహుడు దేవదేయంగా ఇస్తూ, ఈ గ్రామం నుండి వచ్చే ఆదాయమంతా, గోపుర నిర్మాణానికి, మండపాల నిర్మాణానికి వాడాలని కట్టడిచేశాడు. ధ్వజస్తంభానికి ఎదురుగా వున్న 'నరసింహరాయ ఆస్థాన మండపం' కూడా ఈ నిధుల నుండే కట్టబడింది.

ఈయన ఇచ్చినవి, ఇతరులిచ్చిన వాటితో కలిపి నూటికి పైగా నైవేద్యాలు ఇచ్చే ఏర్పాట్లు, 57 సంధి నైవేద్యాలకు ఏర్పాట్లు ఈ కాలంలో జరిగాయి. అన్న నైవేద్యాలు - ఉప్పుపొంగల్, చక్కెర పొంగల్, దధ్యోజనం, పులిహోర, కదంబం కాక, పాయసం, పానకం, అప్పడి, దోశ, వడ వంటి భక్ష్యాలు కూడా నైవేద్యంగా ఈ సంధినైవేద్యాలలో ఏర్పాటు చేయడం జరిగింది. ఇదేవిధంగా తిరుపతి గోవిందరాజస్వామి గుడిలో కూడా మండపాలు, నైవేద్యాల ఏర్పాటు ఈ కాలంలో విశేషంగా జరిగింది.

అలిపిరి కాలిబాట మొదట్లో సాళువ నరసింహ మొదలుపెట్టిన పెద్దగోపురం మొదటి అంతస్తుతోనే ఆగిపోయింది. అలా మొండి గోపురంగా 5 శతాబ్దాలు గడిచిపోయింది. నేను కార్యనిర్వహణాధికారిగా వున్నప్పుడు నాకు ప్రతినెల కాలిబాటన కొండకు వెళ్లే అలవాటు. అలా వెళ్లే ఒక సందర్భంలో ఈ మొండి గోపురం దగ్గర గోపుర ప్రసక్తి వచ్చింది. పూర్తి చేయాలన్న తలంపు రావడం, భగవంతుడు అనుగ్రహించి నేను కార్యనిర్వహణాధికారిగా వున్న సమయంలోనే ఈ గోపురాన్ని కట్టించి పూర్తి చేయడం జరిగింది.

నాకీ ప్రాప్తం కలిగించటానికే 540 ఏళ్లపాటు ఆ గోపురం అలా వుండిపోయిందని చెప్పలేను కానీ, తిరుమలకు వచ్చే భక్తులకు సదుపాయాలు కల్పించడం విషయంలో దేవస్థానం కార్యనిర్వహణాధికారులందరికీ సాళువ నరసింహరాయలు ఆదర్శంగా నిలిచాడని చెప్పగలను.

★ ★ ★

49. అసలు తొమ్మిది బ్రహ్మోత్సవాలు జరిగేవి

కృష్ణదేవరాయలకు ముందు కాలంలో సంవత్సరానికి ఏడు బ్రహ్మోత్సవాలు జరిగేవని చెప్పుకొన్నాం. ఇవికాక మిగిలిన నెలల్లో రెండు నెలలు గోవిందరాజస్వామి వారి ఆలయం తిరుపతిలో బ్రహ్మోత్సవాలు జరిగేవి. మొత్తం 9 బ్రహ్మోత్సవాలు జరిగేవి.

ఆ రోజుల్లో కీలకమైన కొత్త సంప్రదాయాన్ని ప్రవేశపెట్టడం చూస్తాం. ప్రతి బ్రహ్మోత్సవంలో 9వ రోజున ఉత్సవిగ్రహాలు ఆలయ ఉగ్రాణము/ధాన్యాగారానికి ఎదురుగా వచ్చినప్పుడు, గడచిన 8 రోజులలో వచ్చిన ఆదాయపు లెక్కల్ని ఆలయ గణాంక శాఖ సిబ్బంది స్వామివారికి చదివి వినిపించేవారట. అర్చకులు, ఆచార్య పురుషులు, ఆలయ అధికారులు, స్థానత్తారులు, ఇతర భక్తుల సమక్షంలో ఈ కార్యక్రమం జరిగేదట.

దీనితోపాటు ఈ ధాన్యాగారం నుండి గత ఎనిమిది రోజులలో వాడకానికి ఇవ్వబడిన ధాన్యం, పప్పులు, ఇతర పదార్థాల వివరాలు కూడా అందరి సమక్షంలో స్వామివారికి సమర్పింబడేది.

ఒకటి రెండు వాహనాల విషయాలలోనూ, కొన్ని చిన్న విషయాలలోనూ తప్ప, అన్ని బ్రహ్మోత్సవాలలో చక్రత్తాళ్వారు తిరుమల బయటకు వెళ్లి పుట్టమన్ను తెచ్చే దగ్గర నుంచి నవధాన్యాలతో అంకురార్పణ, ధ్వజారోహణం, ప్రతిరోజు రెండు వాహన సేవలు, స్నపన తిరుమంజనాలు... అన్నీ ఈనాడు శ్రీవేంకటేశ్వర బ్రహ్మోత్సవాల్లో మనం చూస్తున్న విధంగానే ఆ రోజుల్లోనూ జరిగేవి. ఇప్పుడు విద్యుద్దీపాలున్నాయి, కెమెరాలు, ప్రత్యక్ష ప్రసారాలున్నాయి. ఆ రోజుల్లో అవి లేవు. కాగడాల కాంతుల్లో జరిగేవి. ఆ రోజుల్లో నాట్యసానుల నర్తనలు, వారిచే కుంభ హారతులుండేవి. ఈనాడు అవి లేవు. కాని ఈనాడు వైభవంగా ధర్మప్రచార పరిషత్తువారు, దాస సాహిత్య ప్రాజెక్టువారు, అన్నమాచార్య ప్రాజెక్టువారు, ఇతర దేవస్థానం విభాగాలవారు ఏర్పాటు చేసే భజన మండళ్లు, నాట్యాలూ, కోలాటాలు, చిడతలు, చిందులు జానపదాలు,

విచిత్ర వేషధారులతో వైభవంగా జరుగుతున్నాయి. విశేష అలంకరణ ఈ రోజుల్లో ప్రత్యేక ఆకర్షణ. విద్యుత్‌శాఖ, పుష్పాలంకరణాది విభాగాల ఆలయం సిబ్బంది పోటీలు పడి, ప్రతి సంవత్సరం కొత్త కొత్త మార్పులు తెస్తూ వైకుంఠమే ఇక్కడ ఉన్నది నిజమని నిరూపించడానికి ప్రయత్నం చేస్తాయి.

వీరి కృషికి సమానంగా లక్షల మంది వచ్చినా, తిరుమల పరిశుభ్రతను కాపాడే వైద్య, పరిశుభ్రతా విభాగాలు చేసేపని అంతా ఇంతా కాదు.

పూర్వకాలంలో - స్వామివారు ఉత్సవాలలో పుర వీథులలో మండపాలలో ఆగితే, హారతులు, నైవేద్యాలు విశేషంగా జరిగేవి. వాహనసేవకు చాలా సమయం పట్టేది. ప్రస్తుత కాలంలో మాడవీథులలో, అక్కడక్కడ ఆపే సంప్రదాయమే వుంది. అదివరకు పురవీథులలో మఠాలు, సత్రాలు, ఇతర యాత్రికుల వ్యవస్థల తరఫున అన్నదాన సత్రాలు ఉండేవి. అవికాక ఆచార్య పురుషులు, జియ్యంగార్లు, అర్చకుల విడుదులు కూడా పురవీథులలోనే వుండేవి. వీటన్నిటి దగ్గర ఆపి, వారిచ్చిన హారతులు, స్వామివారికి వారిచ్చిన నైవేద్యాలు సమర్పించడం, ఆనాటి మండపాల్లో, ఆలయం నుండి, సంధిప్రసాదం, దేవదేయం చేసిన వారి ప్రసాదాలను, వారు నిర్దేశించిన మండపాలకు తెచ్చి స్వామివారికి నివేదన చేసే సంప్రదాయం ఉండేది. ఈ రోజులలో అలా ఆలయం నుండి నైవేద్యం తేవడం - వాహన సేవ ముగింపు సమయంలో మాత్రమే.

నేను తిరుమల-తిరుపతి దేవస్థానాల కార్యనిర్వహణాధికారిగా ఉన్న కాలంలో తిరుమల మాస్టర్‌ప్లాను అమలు చేయడంకోసం నాలుగు మాడవీథుల్లో వున్న మఠాలు, సత్రాలు అన్నిటినీ తీసుకొని, మఠాల వారికి ప్రత్యేకంగా మఠం వీథి ఏర్పాటు చేసి అక్కడికి మార్పించాను. మాడవీథులను బాగా వెడల్పుచేసి, ఇతర మండపాలు, అన్న సత్రాలు, దుకాణాలు, ఫలహార శాలలు, అతిథి గృహాలన్నిటినీ మాడవీథుల నుండి పూర్తిగా తొలగించి, మాడవీథులలో రెండు వైపులా యాత్రికులు నిలబడి ఉత్సవసేవలు, వాహనసేవలు చూసేందుకు మెట్ల గ్యాలరీలు, మధ్య మధ్యన యాత్రికులకు కావాల్సిన సౌకర్యాలు కట్టించడం జరిగింది.

తర్వాత కాలంలో గుడి వెనుక సంగీత ఫౌంటెన్ ఏర్పాటు చేయడం జరిగింది.

వారి మఠాలు మాడవీథుల్లో లేకపోయినా అదివరకు వారి మఠాలున్న ప్రదేశాలలో ఆనవాయితీగా ఆయా మఠాలవారు స్వామివారికి హారతి, నైవేద్యం చేసే సంప్రదాయం ఇంకా కొనసాగుతూనే ఉంది.

అయితే పూర్వకాలంలోలాగా మండపాలలో, మఠాల వద్ద దేవదేయాన్ని బట్టి నైవేద్యం (వండిన) ఆలయం నుంచి తెచ్చి నివేదన చేసే సంప్రదాయం ఇప్పుడు లేదు. ఈస్టిండియా కంపెనీవారి కాలంలో, ఈ నైవేద్యాలన్నీ రద్దయినాయి. వాటికోసం ఇచ్చిన దేవదేయాలను కంపెనీవారు జప్తు చేయడంతో, ఉత్సవాలే కాక, నైవేద్యాలూ ఆపివేయబడ్డాయి. చివరి నైవేద్యం తప్ప మిగతా అన్ని నైవేద్యాలు - ఫలాలు, పటిక బెల్లాలు, జీడిపప్పు, బాదం, ఖర్జూరం, కిస్‌మిస్ వంటి వండని నైవేద్యాలే. అవీ యాత్రికులు, మఠాలవారు ఇచ్చేవి.

ఈ మధ్యకాలంలో దేవస్థానం వారు, వాహన సేవ ముగించేముందు వాహనంలో వేంకటేశ్వరుడు ఒంటరిగా వచ్చినా, దేవేరులతో వచ్చినా, పుష్కరిణివద్ద స్వామి కిచ్చిన హారతిని పుష్కరిణికిచ్చే సంప్రదాయం మొదలుపెట్టారు – హరిద్వార్‌లో గంగాదేవికి హారతి చేసినట్టు. నేను ఈ మధ్య ఈ సేవలో పాల్గొనప్పుడు ఆలయ అధికారులు ఈ 'గంగ' హారతి గురించి చెప్పారు. కాని పురాణ భాగంలో మనం చూశాం. ఈ పుష్కరిణి స్వామివారు వైకుంఠంనుండి తెచ్చి, ఇక్కడ ప్రత్యేకంగా ఏర్పాటు చేసింది. సరస్వతీదేవి అన్ని నదులలో కన్నా శ్రేష్ఠత్వం కావాలి అని శ్రీమహావిష్ణువును గురించి తపస్సు చేస్తే, స్వామి ప్రత్యక్షమై నదులలో శ్రేష్ఠత్వం విష్ణుపాదోద్భవి అయిన గంగకు అదివరకే ఇవ్వడం జరిగింది కనుక, బ్రహ్మాండంలో వున్న అన్ని సరోవరాలు, సరస్సుల కన్నా మిన్నగా స్వామిత్వం (పోయిన అధికారం తిరిగి ప్రాప్తించటం) ఈ స్వామి పుష్కరిణికిచ్చి, సరస్వతీదేవిని దానికి అభిమాన దేవతను చేసి, అలా ఆమెకు శ్రేష్ఠత్వం ప్రసాదించాడు.

కనుక దీనిని 'సరస్వతీ' హారతిగా గుర్తించి, ఆమెను స్మరిస్తే అలా చేసినవారికి, చూసినవారికి, స్మరించినవారికీ సరస్వతీ కటాక్షం కలుగుతుంది. శ్రీవేంకటేశ్వర భక్తిఛానల్ వారు కూడా దీనిని 'గంగాహారతి' అనకుండా 'సరస్వతి హారతి' అంటేనే బాగుంటుంది.

ఇప్పుడు మనం తిరుమలలో సంవత్సరానికి ఒకసారి, అధికమాసం వచ్చిన సంవత్సరంలో రెండుసార్లు ఈ బ్రహ్మోత్సవాలు చేస్తున్నాం. మిగతా బ్రహ్మోత్సవాలన్నీ ఈస్టిండియా కంపెనీవారి కాలంలో రద్దుచేయబడ్డాయి. ఎందుకంటే, వాటికోసం ఇచ్చిన గ్రామాల దేవదేయాలన్నీ కంపెనీవారు పరం చేసుకొని ఆదాయం లేకుండా చేశారు కనుక.

ఇంకొక తేడా పుష్పయాగం విషయంలో – పురాణంలో పుష్పయాగం బ్రహ్మోత్సవాలలో 10వ రోజు చేస్తారని వుంది. కాని రెండు వందల సంవత్సరాల

క్రితం ఈస్టిండియా కంపెనీవారిచే ఈ తిరుమల ఆలయంలో పుష్పయాగం చేసే సంప్రదాయం రద్దయింది.

నేను తిరుమల-తిరుపతి కార్యనిర్వహణాధికారిగా ఉన్నప్పుడు ఆస్థాన విద్వాంసులు పండితులు జగన్నాథాచార్యులుగారు, శ్రీమాడంబాకం ఆచార్యులు పుష్పయాగ ప్రస్తావన నా దగ్గర తెచ్చారు. నాకు చెప్పింది పూర్వకాలంలో ఆలయంలో పుష్పయాగం జరిగేదని, రెండు శతాబ్దాల పైగా జరగడం లేదనీ.

"అయితే మనం ఎందుకు ప్రారంభించకూడదు?" అని నేను అర్చకులతో, పండితులతో, ఆస్థాన విద్వాంసులతో చర్చించి మళ్లీ ప్రారంభించాను. అప్పుడు బ్రహ్మోత్సవాలలో 10వ రోజున పుష్పయాగం చేయమని చెప్పినట్లు గుర్తు లేదు. వారే స్వామివారి శ్రవణ నక్షత్రం అని చూసి 14-11-1980 తేదీని నిర్ణయించారు. ఆ రోజున వైభవంగా జరిపాం. ఆనాటి నుంచి అదే సంప్రదాయం పాటించడం తిరుమలలో జరుగుతోంది. పురాణం ప్రకారం బ్రహ్మోత్సవాలు 10వ రోజు చెయ్యాలి అని తెలిసి వుంటే, నేను 1980లో అదేరోజున చేయించి వుండేవాడిని. భగవదిచ్ఛ! ఇప్పటికైనా పురాణ సంప్రదాయం దృష్టిలో పెట్టుకొని పుష్పయాగాన్ని బ్రహ్మోత్సవాల 10వ రోజుకు మార్చాలంటే మార్చవచ్చు.

ఈ బ్రహ్మోత్సవాలలో ముందుగా ఒక ఖాళీ రథాన్ని బాగా అలంకరించి తీసుకువెళ్తారు. దాన్ని బ్రహ్మరథం అంటారు. ఇది బ్రహ్మదేవుడు మొదలుపెట్టిన ఉత్సవం అయినందున ఆయన దగ్గర వుండి జరిపిస్తారని అందరి నమ్మకం. ఈ రథంపైన ముందుగా ఉండి బ్రహ్మదేవుడు ఈ ఉత్సవాలు నిర్వహిస్తున్నాడన్న సంకేతంగా బ్రహ్మరథాన్ని ఉత్సవానికి ముందు తీసుకు వెళ్తారు.

తొండమానుడు గుడి కట్టించాక స్వామివారి ఆజ్ఞతో, బ్రహ్మదేవుడు తొండమానునితో వాహనాలు, ఈ బ్రహ్మోత్సవాలు ప్రారంభిస్తాడు. వాహనంపై స్వామివారిని స్వయంగా కూర్చోమని బ్రహ్మదేవుడు ప్రార్థిస్తే, స్వామివారు ఆయనకు వేదాలలో పరీక్ష పెట్టాడనీ... బ్రహ్మదేవులు అక్కడక్కడా తడబడితే, మళ్లీ స్వామి శిక్షణ ఇచ్చాడనీ, స్వామి ఆజ్ఞతో, నాలుగు వేదాలకు ప్రతీకగా, ఆయావేద మంత్రాలతో ఒక్కొక్క విగ్రహం చేసి, అలా నాలుగు విగ్రహాలను ఆలయంలో బ్రహ్మదేవుడుంచాడనీ, ఆ విగ్రహాలలో ఒక విగ్రహంతో బ్రహ్మ ఈ బ్రహ్మోత్సవాలలో తిరువీథి ప్రదక్షిణ వాహనాలు మొదలుపెట్టారనీ తెలుస్తోంది.

14, 15 శతాబ్దాల కాలంలో తిరుమల ఆలయంలో వసంతోత్సవాలు, పవిత్రోత్సవాలూ కూడా ప్రారంభించబడ్డాయి. 3 రోజులు వసంతోత్సవం 5 రోజులు పవిత్రోత్సవం. పవిత్రోత్సవాలు ప్రారంభించింది సాళువ నరసింహ దగ్గరి బంధువు సాళువ మల్లదేవ మహారాయలు. కొంతకాలం జరిగిన తర్వాత కంపెనీవారి కాలంలో పవిత్రోత్సవాలు ఆగిపోయాయి. 20వ శతాబ్దంలో మళ్లీ ఉత్సవాలు ప్రారంభింపబడి ఇప్పుడు ప్రతి సంవత్సరం జరుగుతున్నాయి.

★ ★ ★

50. కృష్ణదేవరాయల కొడుకుపేరు తిరుమలరాయ!

కృష్ణదేవరాయలు చాలా ధార్మికుడు. శ్రీనివాసుని గొప్పభక్తుడు. తిరుమల శ్రీవేంకటేశ్వరుని దర్శనానికి ఏడుసార్లు వచ్చాడు. వచ్చినప్పుడల్లా, ఎన్నో దేవదేయాలు, ఎన్నో నగలు, ఎంతో ధనం, దేవస్థానానికి ఇచ్చాడు. ఈయన దక్షిణాదిన ఎన్నో దేవాలయాలకు దానాలు, ధర్మాలు చేసినా, తిరుమల వేంకటేశ్వరుని పట్ల తన కులదైవంగా ప్రగాఢ భక్తిని చూపాడు. తాను రాసిన తెలుగు కావ్యం 'ఆముక్త మాల్యద'ను శ్రీనివాసునికే అంకితం చేశాడు.

తన ఇద్దరు దేవేరులతో (భార్యలు తిరుమల దేవి, చిన్నాదేవి) ఆలయానికి రావటమే కాకుండా, ఈ ఆలయంతో తన, తన భార్యల సంబంధం చూపించడానికి, రాగితో స్వయంగా తమ విగ్రహాలు చేయించి తీసుకువచ్చి, ఆలయానికి ఈశాన్యంలో, అందరు భక్తులకూ కనపడేలా పడికావలిదగ్గర వాటిని స్థాపింపజేశాడు. తన సమ్ముఖంలో ఈ విగ్రహాల ముందు మలయప్ప స్వామిని, శ్రీదేవి, భూదేవి సహితంగా ఉత్సవంగా తెప్పించి, స్వామివారికి తమ విగ్రహాల ముందు పూజలు జరిపి తరతరాలవారు తనను చూసి, శ్రీనివాసుని భక్తుడుగా గుర్తించాలని కోరుకొన్నట్లు తెలుస్తుంది. తరువాత విగ్రహాలు ఎవరివో అని అనుమానం రాకుండా, విగ్రహాలమీద తమ పేర్లు కూడా చెక్కించుకొన్నాడు. ఆలయంలో దర్శనం చేసుకొని, ప్రసాదం తీసుకొన్నాక. బయటకు వెళ్లబోయే ముందు పడి కావలిలో ఇప్పటికీ ఈ విగ్రహాలను చూడవచ్చు.

1513 ఫిబ్రవరి 10వ తారీఖున శ్రీకృష్ణదేవరాయలు మొదటిసారి కొండకు వేంకటేశ్వరుని దర్శనానికి తన ఇద్దరు భార్యలతో వచ్చాడు. నాలుగు సంవత్సరాల క్రితం రాజ్యానికి పట్టాభిషేకం చేసుకొన్న ఆయన, తన ముందు పరిపాలించిన సంగమ సాళువ రాజుల కాలంలో ఛిన్నాభిన్నమైన విజయనగర సామ్రాజ్యాన్ని గజపతుల నుంచి జయించి, తమ నుండి వారు సంపాదించుకొన్న రాజ్యాన్ని దక్షిణాన మైసూరు

వరకు మళ్లీ గెల్చుకొన్నాడు. స్వతంత్రాన్ని ప్రకటించిన పెనుగొండ సామంత రాజులను ఓడించి మళ్లీ విజయనగర అధికారాన్ని ప్రతిష్ఠించాడు. శివసముద్రం, ఉమ్మత్తూరులో గంగరాజును ఓడించి. ఇక్కేరి రాజులతో యుద్ధం చేయకుండానే వారిని స్వాధీనంలోకి తెచ్చుకొని, దక్షిణ భారతమంతా సామ్రాజ్యం సుస్థిరం చేసుకొని స్వామివారికి కృతజ్ఞతలు చెప్పడానికి తిరుమలకు వచ్చాడు.

తన రాజ్యం పటిష్ఠం చేసినందుకు స్వామివారికి ఒక నవ రత్నకిరీటం, మూడు పేటల ముత్యాల హారం. ఖరీదైన వజ్రాలు, ఇతర రత్నాలు పొదిగిన 15 కంఠాభరణాలు, 5 రకాల మణిమాణిక్యాలు పొదిగిన పతకం, 25 వెండి పళ్లాలు, హారతులకోసం సమర్పించు కొన్నాడు. అతనితో వచ్చిన భార్యలిద్దరూ, బంగారు గిన్నెలు, బంగారు పళ్లాలు స్వామివారికి సమర్పించారు.

తర్వాత మూడు నెలలకు మళ్లీ తనొక్కడే (భార్యలు లేకుండా 2 మే, 1513న) కొండకు వచ్చి స్వామివారి దర్శనం చేసుకొని, మలయప్పస్వామి, శ్రీదేవి, భూదేవులకు మూడు రత్నఖచిత కిరీటాలు సమర్పించాడు. ఇవికాక మూలవరులకు కొన్ని నగలు సమర్పించాడు. అలా ఇచ్చిన నగలు:

1. ఒక ఉడుధార నగ, 5 వజ్రాలు, 17 అడ్డికలు, ఇంకా ఇతర మణిమాణిక్యాలు పొదిగినవి.
2. వజ్రాలు, మాణిక్యాలు, కెంపులు పొదిగిన ఒక ఒరలో కత్తి.
3. ఇంకొక నిశ్చల కటారి (కత్తి) కెంపుల ఒరతో.
4. ఇంకొక కత్తి - ముత్యాల ఒరతో.
5. ఒక పతకం - 87 క్యారెట్ల వజ్రాలు పొదిగినవి.
6. రెండు బరువైన బంగారు భుజకీర్తులు. వజ్రాలు, రత్నాలు, కెంపులు పొదిగినవి.
7. రోజూ వాడకానికి భుజకీర్తి ఒకటి.
8. రోజూ వాడకానికి ఇంకో రెండు భుజకీర్తులు.
9. ఒక బరువైన బంగారు గొలుసు.
10. ఇంకొక 375 క్యారెట్ల గొలుసు.
11. ఉత్సవమూర్తులకు, స్వామివారికి, దేవేరులకు మూడు నవరత్న ఖచిత కిరీటాలు.

మళ్లీ ఒకటిరెండు మాసాల్లోనే - 13 జూన్, 1513న తన తల్లిదండ్రుల పేర ప్రత్యేకంగా నవరత్నాలతో చేసిన ఆభరణాలను వేంకటేశ్వరునికి బంగారు కప్పు తాంబూలాలతో సమర్పించుకొని, అప్పుడే స్వామివారి సంవత్సర ఉత్సవాల కోసం కరకంబాడి, చత్రవాడి, తురూరు గ్రామాలను దేవదేయంగా ఇచ్చాడు. అప్పటికి సంవత్సరానికి ఏడు బ్రహ్మోత్సవాలు జరిగేవి. అలా ఇతను 8వ బ్రహ్మోత్సవం తిరుమలలో మొదలుపెట్టాడు. తాను తిరుమల రాకుండానే ఈ దేవదేయాలను శాసనాల ద్వారా చేయించాడు.

ఇంకొక సంవత్సర కాలంలో ఉదయగిరి కోట అధీనం చేసుకొన్న వెంటనే, తిరుమలకు జూన్ 6, 1514న వచ్చి 30,000 బంగారు వరహాలతో ప్రత్యేకంగా కనకాభిషేకం చేశాడు. అవికాక మూడు పేటల ముత్యాలు, కెంపులు, పచ్చలతో హారాలు, రెండు బంగారు వజ్రాలు, కెంపులు పొదిగిన కడియాలు సమర్పించాడు. తాళ్లపాక గ్రామాన్ని దేవదేయంగా ఇచ్చి, ఆ ఆదాయంతో స్వామివారికి ప్రత్యేక నైవేద్యం చేయడానికి ఏర్పాటుచేశాడు. ఈ యాత్రలో తన భార్యలను కూడా తీసుకువచ్చాడు. చిన్నాజీ దేవమ్మ భగవంతునికి ఒక వజ్రాలు, కెంపులు, ముత్యాలతో పొదిగిన కంఠమాలను పెద్దకెంపుతో చేసిన పతకంతో సహా సమర్పించింది. అదేకాక ముదియారు గ్రామాన్ని దేవదేయం చేసి, రోజూ నైవేద్యానికి ఏర్పాటుచేసింది.

తిరుమల దేవమ్మ ఒక బంగారు చక్ర పతకం - వజ్రాలు, ముత్యాలు, కెంపులతో పొదిగినది - బహూకరించి, పిరాట్టి-కూలత్తూరు అనే గ్రామాన్ని నైవేద్యం కోసం దేవదేయం చేస్తుంది.

వీటితోపాటు, తిరుమలలో ఒక సత్రం కట్టించడానికి ఏర్పాటుచేసి, స్వామికి నైవేద్యానికి ఇచ్చిన దాంట్లో దాతభాగాన్ని ఈ సత్రానికి అందేట్లు ఏర్పాటుచేశాడు. అందులో కొంత, అర్చకులకు అందేట్లు ఏర్పాటుచేశాడు.

తర్వాత 15 నెలలూ అద్దంకి, వినుకొండ, ఇతరకోటలను ముట్టడించి గెలిచి, తర్వాత కొండవీడు కోటను ముట్టడి చేసి, కోటగోడలు కొట్టి లోపల ఉన్న ప్రతాపరుద్ర గజపతి కొడుకు వీరభద్రరాయ గజపతిని, నరహరిదేవుని, వారి సైన్యానికి సహాయం చేస్తున్న ముసల్మానులు రాచూరి మిల్లూఖాన్, అద్దండ ఖానులతో సహా బందీలుచేసి, తర్వాత ధరణికోట (అమరావతి) కి వెళ్లి తన రాణులతో సహా తులాభారం చేసి, ముగ్గురూ దేవదేయాలు దానాలు చేసి, తర్వాత 25 అక్టోబరు 1515న తిరుమల

వేంకటనాథునికి ఒక నవరత్న ప్రభావళిని, మకరకంటిని (31124 బంగారు వరహాలది - నవరత్నాలు పొదిగినదానిని) పంపించారట.

తర్వాత రెండు నెలలకు తూర్పున ప్రతాపరుద్ర గజపతిపై దండయాత్రకు బయలుదేరాడు. దారిలో అహోబిలంలో దర్శనం చేసుకొని అక్కడి నుండి ఇప్పటి తెలంగాణలోని అనంతగిరి, ఉస్ట్రకొండ, ఉర్లకొండ, ఇతర కోటలు ముట్టడించి, జయించి తర్వాత కొండపల్లి దుర్గాన్ని జయించి, అక్కడినుండి బెజవాడ, రాజమహేంద్రవరం వరకూ వెళ్లి, తిరిగి తన హంపీ విజయనగరం ద్వారా 2 జూలై, 1517న తిరుమలకు వస్తాడు. ఈసారి ఒక కంఠమాల, ఒక పతకం, 30,000 వరహాలు, స్వామివారి విమానానికి బంగారు పూత పూయడానికి ఇచ్చాడు. గొడగరనాడు గ్రామం శిస్తుల నుండి 1000 వరహాలు స్వామివారికి అభిషేక తైలాలకు, 500 వరహాలు ఉదయపు నైవేద్యానికి ఏర్పాటుచేశాడు. ఇది ఈయన 5వ సారి తిరుమల యాత్ర (ఈసారి రాణులు రాలేదు) చేయటం. ఇక్కడ నుండి కృష్ణదేవరాయలు కుంభకోణంలోని మహామాకం ఉత్సవాలకెళ్లాడు.

విమానానికి బంగారు పూత (09-09-1518) లో పూర్తయింది. పూర్తయిన నలభై రోజులలోనే ఆరవసారి తిరుమలలో 16-10-1518న కృష్ణదేవరాయలు తన భార్య తిరుమల దేవమ్మతో (అప్పటికి రెండవ భార్య చనిపోయింది), నెలల కొడుకుతో వస్తాడు. తన కుమారుని పేరుమీద కొన్ని భూములు దేవదేయం చేస్తాడు. ఆయన భార్యపేరు తిరుమల దేవమ్మ. వాళ్లు తమ కుమారునికి పెట్టుకొన్నపేరు తిరుమలరాయ. తిరుమల శ్రీనివాసుడిపట్ల కృష్ణదేవరాయలకు గల భక్తిప్రపత్తులకి ఇది నిదర్శనం.

తర్వాత ఏడవసారి తిరుమలకు తన భార్య తిరుమలదేవమ్మతో సహా 17 ఫిబ్రవరి, 1521న వచ్చినట్లు శాసనాలు చెబుతున్నాయి. నవరత్నాలు పొదిగిన, పసుపు పీతాంబరం, ముత్యాలు, కెంపులు, ఇతర రాళ్లతో పొదిగిన తలపాగా, నవరత్నాలు పొదిగిన బంగారు చామరాలు రెండు సమర్పించాడు. భార్య తిరుమలదేవమ్మ నవరత్న పతకం బహూకర్తించింది. ఇవికాక ఇంకొక పతకం, 10,000 బంగారు వరహాలు కూడా భగవంతునికి సమర్పించాడు.

శ్రీకృష్ణదేవరాయల ప్రధానమంత్రి తిమ్మరుసు (అప్పాజీ) 13-01-1512న పరాంతలూరు గ్రామాన్ని స్వామివారికి సంవత్సరంలోని ప్రతి విశాఖ నక్షత్రం రోజు నైవేద్యాలకు దేవదేయం చేశాడు (తిమ్మరుసు జన్మ నక్షత్రం విశాఖ). తన భార్యపేర

కూడా నైవేద్యాలకు దేవదేయం చేశాడు. తనవంతు ప్రసాదంలో కొంత ఒక సాతాని వైష్ణవునకు ఏర్పాటుచేసి అతని ద్వారా ఒక నందనవనాన్ని వృద్ధి చేయించాడు.

తిమ్మరుసు మంత్రి సోదరుడు సాళువ గోవింద రాజు కూడా తిరుమల శ్రీనివాసునికి, తిరుపతి గోవిందరాజస్వామికి ఎన్నో దేవదేయాలు చేశాడు.

కృష్ణదేవరాయల కాలంలో అతని మంత్రులు సామంతులు, సైన్యాధికారులు ఎందరో దేవాలయానికి దేవదేయాలు, కానుకలు సమర్పించారు.

కృష్ణదేవరాయలకు శ్రీనివాసుడు కులదైవమైనా, తన రాజ్యంలోని ఎన్నో శివాలయాలకు కూడా దేవదేయాలు చేసి, గోపురాలు కట్టించాడు. ఎందరో మఠాధిపతులు, పీఠాధిపతులు ఆ కాలంలో ఉన్నా, బ్రహ్మణ్యతీర్థ శ్రీపాదరాజుల వారి శిష్యుడైన మాధ్వగురువులు శ్రీమాన్ వ్యాసరాయతీర్థులను తన గురువుగా భావించి ప్రత్యేక గౌరవమర్యాదలు చేసినట్లు శాసనాలు, చారిత్రక ఆధారాలు చెప్తున్నాయి.

★ ★ ★

51. దుష్టగ్రహకూటమిలో రాజ్యం దానం

శ్రీకృష్ణదేవరాయలు తన ప్రత్యేకగురువుగా భావించిన శ్రీమధ్వముని వ్యాసరాయలకు ఇచ్చిన గౌరవం ఈ బిరుదులతో తెలుస్తుంది:

శ్రీమత్ పరమహంస పరివ్రాజకాచార్య,

పదవాక్య ప్రమాణజ్ఞ,

దుర్వారి గర్వ సర్వస్యాపహార,

శ్రీమత్ వైష్ణవ సిద్ధాంత ప్రతిష్ఠాపకాచార్య,

సకలవిద్వజ్జన మనఃపద్మవనసౌపాసిక

...ఇత్యాది విశేష బిరుదులు. వ్యాసరాయ మఠ ప్రతిష్ఠాపకులు శ్రీవ్యాసతీర్థులు.

1524 జనవరి 12న శ్రీకృష్ణదేవరాయలు తిరుమలలో చేసిన శాసనం ప్రకారం- తిరుమల ఉత్తరమాడ వీథిలోని 2 ఇళ్ల స్థలాలు ఇళ్లతోసహా ఈ మధ్వయతీంద్రులు శ్రీవ్యాసరాయ శ్రీపాద ఉడయారు గారికి దానంగా ఇచ్చారు. అలాగే గోవిందరాజస్వామి ఉత్తరమాడవీథిలోని ఒక ఇల్లు కూడా ఆయనకు ఇచ్చినట్లు శాసనం. తను దేవస్థానానికి చేసిన నైవేద్యాలలో దాతకు వచ్చే భాగంలో కొంత శ్రీవ్యాసరాయలు స్థాపించబోయే మఠాలకు రాసి ఇచ్చాడు కృష్ణదేవరాయలు.

కృష్ణదేవరాయలు రాజ్యం చేస్తున్నప్పుడు ఒకసారి గ్రహ కూటమి బాగాలేని సంఘటన జరిగింది. అటువంటి గ్రహకూటమి జ్యోతిశ్శాస్త్రరీత్యా రాజ్యాన్ని పరిపాలించే రాజు అకాలమరణానికి దారి తీస్తుందట. దానికి పరిష్కారాన్ని ఈ మధ్వయతీంద్రులు శ్రీవ్యాస తీర్థులు కృష్ణదేవరాయలకు సూచించారు.

ఈ గ్రహదోషం రాజుని దెబ్బతీయకుండా, ఆ దుష్టగ్రహకూటమి దాటిపోయేదాకా రాజ్యాన్ని తన చేతుల్లో పెట్టమని యతీంద్రులు సూచించారు. కృష్ణదేవరాయలు ఈ సలహాను పాటించి, తన రాజ్యాన్ని తాత్కాలికంగా శ్రీవ్యాసతీర్థులకు దానం చేశాడు.

వ్యాసతీర్థులు ఆ దుష్టగ్రహకూటమి సమయంలో తాను రాజుగా ఉండి, తన మంత్రశక్తితో తనకూ, రాజ్యానికీ హాని కలగకుండా చూస్తాడు. ఆ యోగం పూర్తి అయిన తరువాత మళ్లీ శ్రీకృష్ణదేవరాయలను రాజుగా సింహాసనారూఢుణ్ణి చేస్తాడు.

ఈయనను కృష్ణదేవరాయలు చాలా గురుభక్తితో చూసేవాడు. వ్యాసరాయలు మంచి శాస్త్రపండితుడు, తపఃసంపన్నుడు, వాయుమూర్తి. హనుమ, భీమ అవతారాలు చేసిన తర్వాత కలికాలంలో మధ్వాచార్యులుగా అవతరించి, సూత్ర భాష్యం, భారత భాగవత తాత్పర్య నిర్ణయాలు చేసి, ఋగ్వేద భాష్యం, గీతాతాత్పర్యం, ఇత్యాది 37 సర్వ మూలగ్రంథాలు వ్రాశారు. ఆయన పరంపరలో వచ్చిన పీఠాధిపతి బ్రహ్మణ్యతీర్థుల వారి శిష్యుడు శ్రీవ్యాసరాజస్వామి. చాలా తత్త్వశాస్త్ర గ్రంథాలు రచించిన ఈయన హంపి (విజయనగరం)లో యంత్రోద్ధారక హనుమంతుని తుంగాతీరంలో ప్రతిష్ఠించి ఆ రాజ్యానికి రక్షగా ఉంచారు.

ఈ వ్యాసతీర్థులు 1008 ఆంజనేయ విగ్రహాలు ప్రతిష్ఠ చేసినట్లు చెప్పుకొంటారు. తిరుమల పుష్కరిణి ఉత్తరగట్టు మీద ఈయన ప్రతిష్ఠచేసిన ఆంజనేయ విగ్రహం చిన్నగుడిలో ఇప్పటికీ ఉంది. దీన్ని వ్యాసరాయ అనుష్ఠాన మండపంగా చెప్పుకుంటారు. ఈ ఆలయానికి ఎదురుగుండానే ఉత్తరమాడావీథిలో వ్యాసరాయమఠం ఉండేది. అది శ్రీకృష్ణదేవరాయలు ఇచ్చిన స్థలమే... మాడవీథుల విస్తరణ, మాస్టరు ప్లానులో ఈ మఠం, మఠాలవీథికి తరలించబడింది.

ఈయనకిచ్చిన స్థలాలు మొదట ఆలయంలో పనిచేసే వైఖానస అర్చకుడివి. 'శ్రీరప్పాయనీ' అనే ఈ అర్చకుడు ఆలయంలో కొలువు నుండి తీసివేయబడి, అతని ఆస్తులన్నీ రాజు సాళువ నరసింహరాయలు జప్తుచేసుకొన్నారు. కారణం గురించిన వివరాలు స్పష్టంగాలేవు. అందరూ ఒప్పుకొనేది - స్వామివారి నగలను ఈ అర్చకుడు అపహరించాడని, అందుకు శిక్షగా ఈ ఆస్తులు జప్తుచేయడం జరిగిందని. అలా జరిగినప్పుడు, ఇతనే వంశపారంపర్య వైఖానస అర్చకుడు. అతనికి శిరచ్ఛేదం చేశారని కొందరూ, అతనిని దేశబహిష్కరణ చేశారని కొందరూ చరిత్రకారుల అభిప్రాయం. అనాదిగా వస్తున్న సంప్రదాయం మార్చే ఉద్దేశ్యం లేక వెంటనే అర్చకుడుగా పనిచేయడానికి వైఖానస వారసుడు ఉన్నా అతడు పసిబాలుడైనందువలన - ఆలయ అర్చనబాధ్యతలను శ్రీవ్యాసరాయలుకు అప్పచెప్పారని, అలా ఈ మధ్వసన్యాసి 12 సంవత్సరాలపాటు ఆలయ అర్చన బాధ్యతలు నిర్వహించారని తెలుస్తోంది. ఈయనే ఆ వైఖానస బాలుని సంరక్షణ బాధ్యతలు స్వీకరించి, అతనికి శాస్త్ర, ఆగమ, అర్చన

విధానాలను వైఖానస సంప్రదాయ పద్ధతిలో నేర్పించి, తరువాత ఆలయంలోని అర్చన బాధ్యతలు యుక్తవయస్సు వచ్చాక అతనికి ఇప్పించి వైఖానస సంప్రదాయం పూర్వంలా కొనసాగేట్టు చేశారని తెలుస్తోంది.

ఆలయంలోని సంపంగి ప్రాకారంలో దక్షిణభాగాన (అంటే ఇప్పుడు కళ్యాణాలు జరుగుతున్న ప్రదేశంలో) ఒక శిలాశాసనం వుంది. అందులో ఈ వ్యాసరాయలకు ఆలయంతో సంబంధం గురించి ఉంది. ఇప్పటికీ అది ఉన్నా చూడటానికి వీల్లేకుండా కళ్యాణం చేయడానికి పెద్ద దిమ్మకట్టినప్పుడు దాని కిందకు వెళ్లిపోయింది. ఆ కళ్యాణ మంటపం కట్టించి రంగ మండపం నుండి కళ్యాణాలను ఇక్కడకు మార్చింది నేనే కనుక ఈ విషయం నాకు బాగా తెలుసు.

శ్రీవ్యాసరాయల కాలంలోనే 108 పెద్ద సాలగ్రామాలకు బంగారు తొడుగులు వేయించి, బంగారు మాలగా తయారుచేసి స్వామివారికి నివేదన చేశారట.

ఆనందనిలయ విమానంలో వాయవ్య మూల ఒక చిన్న శ్రీనివాస శిల్పం ఉంది. దానికి ప్రాణప్రతిష్ఠ చేసి, విమాన వేంకటేశ్వరుడుగా ప్రసిద్ధి చేసింది ఈ వ్యాసరాయలే. ఇప్పటికీ భక్తులందరూ దర్శనమై విమాన ప్రాకారంలో ప్రదక్షిణగా వచ్చేటప్పుడు ఉత్తర భాగంలో మెట్లు ఎక్కి, గట్టు మీద నుండి ఈ విమాన వేంకటేశ్వరుని దర్శనం చేసుకొంటారు. పూర్వకాలంలో ఏ కారణం వల్లనయినా భక్తులకు మూలవరుల దర్శనం కాకపోతే, ఈ విమాన వేంకటేశ్వరుని దర్శనంతో తృప్తి చెందేవారట.

1982లో నేను కార్యనిర్వహణాధికారిగా ఉన్నప్పుడు, మహా సంప్రోక్షణతో విమాన కలశాలకు మళ్లీ బంగారు పూత, ధ్వజస్తంభ ప్రతిష్ఠ, అష్టబంధనం చేసినప్పుడు, యాత్రికులకు ఈ విమాన వేంకటేశ్వరుడు సులభంగా కనిపించడానికి అనువుగా, ఆ శిల్పం చుట్టూ వెండితో ఒక మకరతోరణం, ప్రాకారం మీద ఈ విమాన వేంకటేశ్వరుని వైపు చూపుతూ బాణం గుర్తులు పెట్టించడం జరిగింది.

ఆ కాలం నుండీ ఈ నాటి వరకూ దేవాలయంలో వేదపారాయణ నిత్యం ఈ విమాన వేంకటేశ్వరుని ముందే జరుగుతుంది. మధ్వపండితులు అనేకులు ఈ విమాన వేంకటేశ్వరుని ముందు కూర్చుని వేంకటాచల మాహాత్మ్యం, శ్రీనివాస కళ్యాణం పారాయణ, సర్వమూలగ్రంథ పారాయణ చేయడం అనేది సంప్రదాయం.

ఈ వ్యాసతీర్థులు 12 సంవత్సరాలు పూజ/అర్చన చేసినందుకు నిదర్శనంగా 20వ శతాబ్దం మొదటి భాగం వరకూ, ఈ వ్యాసరాయమఠం స్వామీజీలు తిరుమల

దర్శనానికి వచ్చినప్పుడు, అర్చన స్వయంగా గర్భగృహంలో చేయడానికి అనుమతించే వారని చెప్పుకొనేవారు. కాని తర్వాతికాలంలో ఈ వ్యాసమఠం స్వాములవారు తిరుమల చాలా కాలం రానందువలన ఈ సంప్రదాయం నిలిచిపోయిందంటారు. తర్వాత కాలంలో ఈ మఠాధిపతులు మళ్లా ఈ సంప్రదాయ పునరుద్ధరణకు ప్రయత్నించినా, దిట్టం పుస్తకంలో ఈ మఠానికి మర్యాదలున్నాయికాని, అర్చనాధికారం గురించి వివరణ లేదు కనుక, ఈ సంప్రదాయం ఇప్పుడు జరగడంలేదు.

ఈ వ్యాసరాయలు తాను తిరుమలలో ఉన్నప్పుడు చాలా దేవదేయాలు చేశారని శాసనాలున్నాయి. శ్రీవేంకటేశ్వరునికి సంవత్సరానికి చేసే 8 బ్రహ్మోత్సవాల సమయంలో నైవేద్యాలు చేయడానికి, ఇతర ఉత్సవాల సమయంలో నైవేద్య కైంకర్యానికి 14,000 నర్పణాలు దానంగా ఇచ్చారట. క్రింద గోవిందరాజ స్వామికి ఆలయపుండూరు గ్రామాన్ని దేవదేయంగా ఇచ్చారట (08-11-1524 AC-No.165).

మళ్లీ 1528 ఏప్రిల్ రెండున ప్రతి పౌర్ణమినాడు నైవేద్యానికీ, సంవత్సరమంతా నైవేద్యం చేయడానికి 'బద్దంపైట్ట' గ్రామాన్ని దేవదేయం చేశారు.

ఈయన సాళువ నరసింహరాయల కాలంలో కొండమీద తిరుమలలో 12 సంవత్సరాలు అర్చకత్వం చేశారు.

★ ★ ★

తిమ్మరుసు-తాళ్లపాక కవులు

శ్రీఅచ్యుతరాయల రాజ్యకాలంలో మూడు శాసనాలు చాలా ఆసక్తి కరమైనవి కన్పిస్తాయి.

తిమ్మరుసు తన తమ్ముడు సాళువ గోవిందరాజు చేసిన నైవేద్య దేవదేయాలవలన దాతకు రావల్సిన ప్రసాదభాగం తాళ్లపాక తిరుమల అయ్యంగారికి 26-02-1536లో 4600 పణాలకు అమ్మారట. ఈ తిరుమల అయ్యంగారు తాళ్లపాక అన్నమాచార్యుల కొడుకు. అలాగే తిమ్మరుసు, అతని సోదరుడు గోవిందరాజు ఇద్దరూ తాము తిరుపతి గోవిందరాజ స్వామికి చేసిన నైవేద్య కైంకర్యం వలన వచ్చే ప్రసాదం భాగం తాళ్లపాక తిరుమలయ్యగారికి 5203 పణాలకు అమ్మినట్లు తెలుస్తుంది.

మళ్లా 1536 డిసెంబరు 28న సాళువ తిమ్మరుసు తాను ఇచ్చిన ఇంకొక ప్రసాద నైవేద్య దేవదేయం నుండి, తిరుమల శ్రీనివాసుని సన్నిధి నుండి దాతకు

వచ్చే 4వ వంతు ప్రసాద భాగం తాళ్ళపాక తిరుమల అయ్యంగారికి 1900 పణాలకు అమ్మారట. ఆసక్తికరమైన విషయం - వారి ఒప్పందంలో కొన్నవారు ఆ ప్రసాద భాగాలను, ఇతరులకు అమ్మడానికి, దానంగా ఇవ్వడానికి, ఇంకొకరికి మార్చడానికి అధికారం ఉంటుంది. కాని ఇవన్నీ ఒక్క షరతు మీదే.

అది - ఈ తాళ్లపాక తిరుమల అయ్యంగారు కొండమీదే వాసంచేస్తూ, రోజూ తిరుమల ఆలయంలో స్వామివారి సేవల్లో తాళ్లపాక అన్నమాచార్యుల సంకీర్తనలు పాడుతూ ఉండాలన్న నిబంధన.

ఈ తాళ్లపాక తిరుమల అయ్యంగారు తాళ్లపాక అన్నమాచార్యుల వారి రెండవ కొడుకు. నరసింగయ్య అనే పెద్ద కొడుకు ఒక కవి - చిన్నతనంలోనే ఇల్లు విడిచి వెళ్లిపోయాడు. అన్నమాచార్యులు తిరుమలలో 16వ ఏటినుండే, స్వామివారి ముందు ఉత్సవాలలో సంకీర్తనలు పాడి సేవచేసేవారట. అదీ క్రీ.శ.1424 లో. ఆయనకు అప్పటికే శ్రీవేంకటేశ్వరుని సాక్షాత్కారం లభించినట్లు తెలుస్తూంది. అలా ఆయన కొండమీద స్వామివారి సన్నిధిలో సంకీర్తనలు రచిస్తూ, పాడుతూ స్వామివారి ఆలయంలో సంకీర్తన సేవకు నాంది పలికారు. అలా శ్రీఅన్నమాచార్యులు 23 ఫిబ్రవరి, 1503 ద్వాదశినాడు పరమపదం చేరేవరకూ కొనసాగింది. తాను చనిపోతూ, అన్నమాచార్యుల వారు తాను ప్రారంభించిన సంకీర్తనసేవ ఆలయంలో కొనసాగించాలని తనకొడుకు తిరుమల అయ్యంగారి నుంచి వాగ్దానం తీసుకొన్నారు. అలా పెద్ద తిరుమల అయ్యంగారి సంకీర్తన సేవ మొదలైంది. సంకీర్తన యజ్ఞం అంటే రోజుకొక కొత్త సంకీర్తన రచించి, స్వామివారి ముందు పాడాలి. ఇతరులు రచించినవి పాడడం మాత్రమేకాదు, ప్రతిరోజూ ఒక్క సంకీర్తననైనా రచించవలసిన బాధ్యతకూడా ఉంది.

ఇలాంటి సేవచేసే భాగ్యం తాళ్లపాక అన్నమాచార్యులవారికి సాళువ నరసింహరాయలు కల్పించాడు. ఆయన ఆదేశాలతోనే తిరుమల ఆలయంలో అన్నమాచార్యులు సంగీతసేవకు నియమించబడినట్లు తెలుస్తూంది. ఆయన తరవాత ఆయన కొడుకు పెద్ద తిరుమల అయ్యంగారు, ఆ తర్వాత అన్నమాచార్యుల మనవడు చిన తిరుమలాచార్య (తిరుమల అయ్యంగారి పెద్దకొడుకు) ఈ సేవకు ఆలయంలో నియమించబడి ఈ సంగీత సేవ కొనసాగించేవారట.

మొత్తంమీద అన్నమయ్య రాసిన సంకీర్తనల విషయంలో కొంత అస్పష్టత వలన, రాగిరేకుల్ని రాగికోసం కరిగించారనీ, దానితో అన్నమయ్య రచించిన వేల సంకీర్తనలు

ఆ కరిగిన రేకులతో పోయాయనీ కొంత ప్రచారంలో ఉంది. కానీ అలా ఏమీ పోలేదు. దేవస్థానానికి 1922లో అన్నమయ్య అరలో దొరికినవి 2,590 రాగిరేకులు. వీటి భద్రత సాధు సుబ్రహ్మణ్య శాస్త్రి గారే చూశారు. ఆ రాగిరేకులన్నీ ఇప్పుడు దేవస్థానంలో భద్రంగానే ఉన్నాయి.

అన్నమాచార్యులు 1503లో చనిపోయారు. తర్వాత పెద్ద తిరుమల అయ్యంగారు-కృష్ణదేవరాయలు, అచ్యుతరాయలు, సదాశివరాయల కాలంలో ఆలయంలో సంకీర్తనాచార్యులుగా పనిచేసేవారు.

కాని అచ్యుతరాయలు, సదాశివరాయలు తాళ్లపాక వారిని గుర్తించి వారికి కొన్ని గ్రామాలు ఈనాములుగా ఇచ్చినట్లు తెలుస్తోంది.

కృష్ణదేవరాయల కాలంలో తాళ్లపాక పెద్దతిరుమలాచార్య తిరుమలలో ఉన్నట్లు తెలిపే శాసనం ఉంది. 30-11-1517లో ప్రతిరోజూ వేంకటేశ్వరునికి తిరుప్పొనకం (అన్ననైవేద్యం) చేయించడానికి పెద్ద తిరుమలాచార్య 1500 నర్పణాలు తిరుమల ఆలయంలో దేవదేయాలుగా కట్టినట్లు ఉంది. తాళ్లపాక గ్రామాన్ని శ్రీకృష్ణదేవరాయలే తిరుమల ఆలయానికి దేవదేయం చేశాడని చెప్పుకొన్నాం కదా!

కృష్ణదేవరాయల కాలంలో చాలా మంది అధికారులు, సేనానులు చాలా దేవదేయాలు చేసినట్లు శాసనాలున్నాయి. మహానాయకాచార్య ఓబలనాయకర్ - కడతారు గ్రామం ఇచ్చాడనీ, తర్వాత నీటిపారుదల సౌకర్యాల కోసం ఇంకో దేవదేయం చేశాడనీ శాసనం చెప్తోంది.

ఈ కాలంలోనే శ్రీనివాస కణ్ణన్ అనే భక్తుడు తిరుచానూరులో సరోవరానికి నాలుగు వైపుల రాతితో మెట్లు కట్టించాడట. చాలామంది ధనరూపంలో కూడా దేవదేయాలు చేశారు.

ప్రసాదాల విషయానికొస్తే - అన్నప్రసాదాలేకాక పడిప్రసాదాలలో అతిరసాల (అరిసెలు) నైవేద్యం ఈ కాలంలో ఎక్కువగా జరుగుతుండేది. తర్వాత దోశపడి కూడా ఉండేదని తెలుస్తోంది. లడ్డుపడి ప్రస్తావనేలేదు. ఆ రోజుల్లో లడ్డు ప్రసాదంగానే లేదని తెలుస్తోంది.

అప్పటి వరకు ఉన్న సంవత్సరానికి ఏడు బ్రహ్మోత్సవాలు, కృష్ణదేవరాయల కాలంలో సంవత్సరానికి 8 బ్రహ్మోత్సవాలకు చేరింది.

అదివరకు ఒక్క తిరుప్పొనకం ప్రసాదం నైవేద్యం చేయడానికి 1000 నర్పణాలు మూలధనంగా ఆలయానికి ఇవ్వవలసి ఉండేది. కృష్ణదేవరాయల కాలంలో ఆ మూలధనం 1500 నర్పణాలకు పెరిగింది.

★ ★ ★

వ్యాసతీర్థులు మఠాధిపతి ఐనా, గొప్ప సంస్కృత శాస్త్ర పండితుడైనా, చాలా గొప్ప విశాల ఆధునిక దృక్పథం కలవాడు.

ఆధ్యాత్మికశాస్త్రం, మోక్షసాధన పండితులకే పరిమితమైన ఆ కాలంలో శాస్త్రజ్ఞానం అందరి పరిధిలోకి రావాలనీ, స్త్రీలు కూడా శాస్త్రజ్ఞాన సముపార్జనకు అర్హులనీ తెలియచెప్పి, సంస్కృతంలో వున్న శాస్త్రసారం పామరులకు కూడా అందుబాటులో ఉండేటట్లుగా దాససాహిత్యాన్ని ప్రోత్సహించి, కన్నడంలో అందరూ అర్థం చేసుకొనే సులభసాధన మార్గాలు ప్రవేశపెట్టిన ప్రథములలో ఒకరు శ్రీవ్యాసతీర్థులు.

బ్రాహ్మణేతరులకు కూడా అంకిత నామాలుంచి సాధనకు తోడ్పడేలా - దాసపంథాను ప్రోత్సహించి, హిందూధర్మ ప్రచారానికి పునాదులు వేశారు. కనక దాసు అనే అంత్యజుని శిష్యుడుగా స్వీకరించి, తన ఇతర బ్రాహ్మణ శిష్యులకన్నా పండితులకన్నా అమితంగా గౌరవమర్యాదలు ఇచ్చిన మహనీయ సంఘసంస్కర్త.

★ ★ ★

52. భక్తుల కోసం గజ్జె కట్టిన ముద్దుకుప్పాయి

కృష్ణదేవరాయల అనంతరం అతని సోదరుడు అచ్యుతరాయలు రాజు అయ్యాడు. కృష్ణదేవరాయలచే బంధింపబడి ఖైదీగా చంద్రగిరి కోటలో ఉన్న ఈయన విడుదలైన వెంటనే, తిరుమల కొండకు చేరి, వేంకటేశ్వరుని ఆలయంలో, ఆలయశంఖంతో సంప్రోక్షణ చేయించుకొని రాజ్యాభిషేకం కావించుకొని, రాజయ్యాడు. తర్వాత కాళహస్తిలోనూ, ఆ తర్వాత విజయనగరిలోనూ కూడా రాజ్యాభిషేక ఉత్సవం చేశారు. అతను రాజ్యానికి వచ్చిన వెంటనే చేసిన ధార్మికకార్యక్రమం - కపిలతీర్థం జీర్ణోద్ధరణ. తీర్థానికి రాతితో మెట్లు కట్టించి పక్కన సంధ్యావందన మండపాలు రెండు కట్టించాడు. దీనికి పురాణకాలంలో చక్రతీర్థమని/ఆళ్వార్ తీర్థమని పేరుండటం చేత చక్రచిహ్నాలు నాలుగువేపులా చెక్కించాడు.

ఇతను తిరుమలకు మూడుసార్లు వచ్చాడు. మొదటిసారి 31 జనవరి, 1533 బంగారు కపిల గోవులు దానం చేశాడు. స్వామివారికి స్వర్ణ వర్షం కురిపించాడు (బంగారు నాణాలతో కనకాభిషేకం). ఎన్నో ఆభరణాలు, ఖరీదైన దుస్తులూ స్వామివారికి సమర్పించాడు. చేతులకు నాలుగు బాహువలయాలు, ఒక హారం, ఇతర నగలు - స్వామివారికి సమర్పించి. అర్చన స్వయంగా చేసినట్లు శాసనం. అంటే అర్చకులు సహస్రనామాలు చదువుతుంటే, స్వయంగా రాజే (అర్చకులచే కాకుండా) తానే అర్చన చేసినట్లు తెలుస్తోంది.

రెండవసారి 26 డిసెంబర్, 1535లో తిరుమలకి వచ్చినప్పుడు కొత్తగా లక్ష్మీ ఉత్సవం పద్మావతి (అలమేలుమంగ) ఆలయంలో 5 రోజులు జరిగేటట్లు, దీని ఖర్చులకుగాను కొండవీటి సీమలోని ఆదాయం నుండి 300 రేఖాపణాలు ఇచ్చేటట్లు ఏర్పాటుచేశాడు. ఐదు రకాల పణ్యారాలతో 40 నైవేద్యాలు, తాను కట్టించిన 7 మండపాలలో మలయప్పస్వామికి జరిగేలా ఏర్పాటుచేశాడు. ఆలయంలోఉన్న రామ లక్ష్మణ సీతా విగ్రహాలకు ప్రతి పునర్వసు నక్షత్ర దినంలో (సంవత్సరానికి 13 సార్లు) అభిషేకాలకు నైవేద్యాలకు ఏర్పాటు చేశాడు.

మూడవసారి 12 జనవరి, 1537లో తిరుమలకు తన దగ్గరి బంధువులు, ప్రధాన అధికారులతో వచ్చాడు. ప్రతి ఒక్కరిచేత 15000 నర్పణాలు దేవాలయానికి ఇప్పించి సంవత్సరానికి 300 అప్పపడి నైవేద్యాలకు ఏర్పాటుచేశాడు. మల్లాపురం గ్రామం తన తరఫున బ్రహ్మోత్సవాలలో 7వ రోజు నైవేద్యానికి దేవదేయం చేశాడు. తన రాణి చేత 6 గ్రామాలు దేవదేయం ఇప్పించాడు. దాన్ని రోజూ 5 రకాల పణ్యారాలతో 20 నైవేద్యాలకు ఏర్పాటుచేశాడు. తిరుపతి గోవిందరాజస్వామికి, అమ్మవారికి కూడా చాలా నైవేద్య సేవలు ఏర్పాటుచేశాడు.

కపిలతీర్థంలో ఆలయం కట్టించి, దగ్గరి కొత్తూరు గ్రామంలో అచ్యుత పెరుమాళ్లు ఆలయం కట్టించి (తన పేరుతో), ఆ ఆలయం చుట్టూ 120 ఇళ్లు కట్టి, బ్రాహ్మణులకు సర్వహక్కులతో దానం ఇచ్చి, ఆ గ్రామం కట్టడానికి స్వామివారి భూమి తీసుకొన్నాడు. కనుక, వేంకటేశ్వరుని బొక్కసానికి 2400 నర్పణాలు వెలకింద సమర్పించాడు. ఈ ఆలయ నిర్వహణ ఖర్చుల నిమిత్తం - పుత్తూరు దగ్గర 'పరిట్టి పుత్తూరు' గ్రామాన్ని దేవదేయం చేశారు. ఈ 'అచ్యుత పెరుమాళ్లు' ఆలయం తిరుపతిలో ఇప్పుడు కన్పడటం లేదు. దానిచుట్టూ ఉన్న ప్రదేశాన్ని అచ్యుతరాయపురం అని పిలిచేవారట. ఒక పాడుబడిన బావి, గోపురం తప్ప ఇంకేవీ ఆ ప్రాంతంలో ఇప్పుడు లేవు. మహమ్మదీయ దండయాత్రలలో 16, 17 శతాబ్దాలలో ఈ ఆలయం, చుట్టుప్రక్కల గృహాలు కూడా ధ్వంసం అయినట్లు తెలుస్తోంది.

ఇతని కాలంలోనే కొండమీద ఉత్సవాలు, ఊరేగింపులూ వైభవంగా చేసి ప్రజలను, యాత్రికులను, భక్తులను ఎక్కువ సంఖ్యలో వచ్చేలా చేయడానికి నర్తకీమణులను ఆలయంలో ప్రవేశపెట్టాడు. నర్తనసేవ కూడా శ్రీనివాసుడికి చేయాల్సిన సేవలలో ఒకటి కావటంవల్ల తన రాజధాని హంపి విజయనగరంలోని నాట్యశాలనుండి ఈ నర్తకీమణులను పంపాడు. కృష్ణదేవరాయల కాలంలో కుప్పసాని అనే నర్తకీమణి అత్యంతప్రతిభ కలిగిన నర్తకిగా పేరు పొందింది. ఆమె నృత్యప్రదర్శన ఉందంటే చాలు, అష్టదిగ్గజాలు కూడా హాజరయ్యేవారట.

ఆమె కూతురు ముద్దుకుప్పాయి చాలా అందగత్తె. అందానికి తోడు నృత్యంలో ఆమెది అందె వేసిన చెయ్యి. అందుకని ఆమెను శ్రీనివాసుడికి నర్తనసేవ చేయడానికి ప్రత్యేకంగా వేంకటాచలానికి పంపాడట. ఆమెకు 'విద్వత్ సభారాయరంజకం' అనే బిరుదుకూడా ఉండేదట. వారి పోషణకు దేవాలయం నుండి, అచ్యుతరాయలు చేసిన నైవేద్యాలలో, దాత భాగం నుండి కొంత ప్రసాద భాగం కూడా ఇచ్చినట్లు

శాసనాలున్నాయి. అచ్యుతరాయలు పంపిన ఇంకొక నాట్యసాని 'హనుమసాని' చాలా ధనవంతురాలు. ఆమె కొండమీద ఒక నందనవనం ఏర్పాటుచేసి ఒక మండపం కట్టి దేవదేయం చేసింది. దేవుడు అక్కడకు వచ్చినప్పుడు నైవేద్యానికి 840 నర్పణాలు దేవస్థానం ఖజానాకు ఆమె చెల్లించిందని శాసనం ఉంది.

వీళ్లేకాక ఇంకా చాలామంది నాట్యకత్తెలు కొండపై ఉండేవారని తెలుస్తూంది. వారిలో కొందరు స్వామివారికి వసంతోత్సవాలలో గులాబి రేకుల అత్తరు చల్లిన పన్నీటి గంగాళాలు, నీటి గంగాళాలు మలయప్పస్వామి తిరుమంజనానికి సమర్పించే సేవకు దేవదేయాలుగా చేసినట్లు 1540 ఏప్రిల్ 30 నాటి శాసనం తెలుపుతోంది. అలాగే 'నక్కి' అనే నాట్యసాని స్వామివారి కొన్ని సేవలకు దేవదేయాలు ఏర్పాటుచేసినట్లు శాసనాలున్నాయి.

ఈ శాసనాల ఆధారంగా ఒక ఆసక్తికరమైన విషయం తెలుస్తోంది.

1535 డిసెంబరు 26 లో స్వామివారి దర్శనానికి అచ్యుతరాయలు వచ్చినప్పుడు, ఆయనతో ఇద్దరు స్త్రీలు వచ్చారు. వారిపేర్లు అడియాప్పం పర్మాదమ్మ, అడియాప్పం రుక్మిణమ్మ. వారిపేర్లమీద అప్పపడి నైవేద్యాలు, అతిరస నైవేద్యాలు, ఒక నందనవనానికి కావల్సిన స్థలం, అందులో మొక్కలు కొనడానికి ఖర్చు, ఆ వనంలో ఒక మండపం నిర్మించడానికి, ఆ వనాన్ని చూసుకోవడానికి తోటమాలుల ఖర్చు, ఆ వనానికి ఒక ప్రహరీ గోడకు ఖర్చు... ఇలా మొత్తం 518 రేఖాపణాలను ఆలయధర్మకర్తలు ఆలయనిధుల నుండి ఖర్చుపెట్టినట్లు తెలుస్తోంది. ఆ ఇద్దరు స్త్రీలుకాని, వారితరఫున అచ్యుతరాయలు కాని, ఈ పనులు చేయడానికి ఆలయానికి నిధులు ఇచ్చినట్లు ఆధారాలులేవు.

ఇదే విధంగా ఆలయ ధర్మకర్తలు, అచ్యుతరాయలు దగ్గర ఉండే ఇంకొక స్త్రీ- అరవీడు లక్ష్మి అమ్మ అనే ఆవిడ - పేరకూడా ఆమె వేంకటేశ్వరుని దర్శనానికి వచ్చినప్పుడు ఆమె పేరుమీద ఒక నందనవనానికి స్థలం, మండపం కట్టడానికి ఖర్చు, మొక్కలు కొనే ఖర్చు, ఆ వనం బాగోగులు చూడడానికి తోటమాలులకు జీతబత్తేలు - అంతా ఆలయనిధుల నుండే ఏర్పాటు చేసినట్లు శాసనం.

ఈ అచ్యుతరాయల గురించి చరిత్రకారులు చెప్పింది చూస్తే మంచి అభిప్రాయం కలగదు. వ్యసనపరుడు, చండశాసనుడు. భార్య, ఇద్దరు బావమరదుల చేతిలో కీలుబొమ్మగా వర్ణించబడతాడు. పేరుకోసం బలవంతంగా తన అధికారులతో,

సామంతులతో తన పేరుమీద దేవదేయాలు చేయించినట్లు తెలుస్తుంది. ఇతడిని రాజుగా చేయడానికి, ఇతని బావమరుదులే కృష్ణదేవరాయల కొడుకుకు విషం పెట్టించి ఉండవచ్చని దానిని, మంత్రి తిమ్మరుసు మీదకునెట్టి, రాయలకు తిమ్మరుసును దూరంచేశారనీ... తర్వాత వారసులు లేనికారణంగా, కృష్ణదేవరాయలు, ఇతనికే రాజ్యం ఇవ్వాల్సివచ్చేటట్లు చేశారనీ కొందరు చరిత్రకారుల అభిప్రాయం.

ఈయన కాలంలో తిరుమలలో వరదాజి అమ్మ వీథిని తన భార్యపేర నిర్మించాడు. లక్ష్మీదేవి మహోత్సవాన్ని 1535 డిసెంబరు 26న ఈయన మొదలుపెట్టినట్లు తెలుస్తోంది. ఈ కళ్యాణ మహోత్సవం మొదట 5 రోజులుగా మొదలై తర్వాత కాలంలో 7 రోజులు జరిగేదనీ, దానికి కావలసిన దేవదేయాలు ఇచ్చి, సంపంగి ప్రాకారంలో తాను కట్టించిన మండపాలలో, రోజూ మలయప్పస్వామి వారిని దేవేరులతో వేంచేపుచేసి, నైవేద్యాలను ఏర్పాటు చేశాడనీ శాసనాలు.

ఈయన కాలంలో దేవదేయంగా 35 గ్రామాలు ఇచ్చినట్లు శాసనాలు ఉన్నాయి. అందులో ఈయన ఇచ్చింది చాలాతక్కువ. దాదాపు 12 గ్రామాలు తాళ్లపాక పెద్ద తిరుమల అయ్యంగారు ఇచ్చినవీ (అన్నమయ్య కొడుకు) రాయసం తిమ్మరసయ్య (అచ్యుతరాయల కార్యదర్శి) 3 గ్రామాలు, భూతనాథుడు 2 గ్రామాలు, పెనుగొండ వీరప్పన్ రాయకం, రామచంద్ర దీక్షితార్... ఇలా చాలామంది చాలా గ్రామాలు ఇచ్చారు. అచ్యుతరాయలు భార్య 6 గ్రామాలు ఇచ్చినట్లు ఉంది. మొత్తం అచ్యుతరాయలు, అతని కుటుంబం అంతా కలిపి 10 గ్రామాల దాకా అంటే పెద్ద తిరుమలాచార్యుల కంటే తక్కువే ఇచ్చినట్లు తెలుస్తుంది.

తాళ్లపాక పెద్ద తిరుమలాచార్యులు ఒక కొత్త బ్రహ్మోత్సవం, అచ్యుతరాయలు ఒక కొత్త బ్రహ్మోత్సవం మొదలుపెట్టి, వేంకటేశ్వరునికి కొండపై సంవత్సరానికి అది వరకు ఉన్నదానితో కలిసి 10 బ్రహ్మోత్సవాలు 10 నెలలు జరిగేట్లు ఈ కాలంలో ఏర్పాట్లు జరిగాయి. మిగతా రెండు నెలలూ తిరుపతి గోవిందరాజస్వామి వారి బ్రహ్మోత్సవాలు జరిగేవి.

129 నంబరు శిలాశాసనం స్వామివారి బ్రహ్మోత్సవాలు ఎవరెవరు మొదలు పెట్టారో నెలవారీగా వివరిస్తుంది.

1)	ఆలయ గణాంక శాఖ తిరుమల	– ఆవణి నెల
2)	కాడవన్ పేరుందేవి (ఆదిబ్రహ్మా పేరున)	– పురట్టాసి

3)	దేవరాయమహారాయ	-	అర్పశి
4)	బుక్కరాయమహారాయ	-	కార్తీక
5)	కృష్ణదేవరాయమహారాయ	-	తై
6)	అరియన (హరిహరరాయలు)	-	మాని
7)	వీరనరసింహయాదవరాయ	-	పంగుని
8)	ఆలయ గణాంకశాఖలో పనిచేసే ఉద్యోగి	-	చిత్తిరై
9)	తాళ్లపాక పెద్ద తిరుమలాచార్య	-	ఆని
10)	రామరాజ చన్న తిమ్మరాజ అయ్యర్ తిరుమలరాజ	-	ఆని నెలలో రెండవ బ్రహ్మోత్సవం

ఇందులో అచ్యుత రాయలు మొదలుపెట్టిన లక్ష్మీదేవి మహోత్సవాలు చూపించలేదు. ఎందుకంటే, వాటిని బ్రహ్మోత్సవాలుగా పరిగణించలేదు కనుక.

వివిధ రకాల నైవేద్యాలు ఆలయంలో మొదలైనాయి. మొదట మొదట అన్న ప్రసాదాలు మాత్రమే ఉండేవి. తరువాత అప్పపడి (51 అప్పాలు) తో మొదలై, అతిరసపడి (అరిసెలు) దోశపడి, వడపడి, గోధిపడి, సుగియపడి- ఇలా పణ్యారాల ప్రసాదాలు మొదలయినాయి. ఈనాడు మనం తిరుమల లడ్డుగా ప్రసిద్ధికెక్కిన ప్రసాదం ఆరోజుల్లో ఆలయంలో లేదు.

తర్వాత కాలంలో 'మధురం' (బెల్లం, మినుపపిండితో) ఒకరకమైన లడ్డుగా ఆలయానికి వచ్చిన ముఖ్యమైన భక్తులకు ఇవ్వడానికి మొదలై, తర్వాత సెనగపిండి, బెల్లంతో చేసిన లడ్డూగా తయారై, ఆ తర్వాత - అంటే 20వ శతాబ్దంలో పంచదారతో చేసిన ఈనాటి లడ్డు ప్రసాదం చంద్రమౌళి రెడ్డిగారు ఇ.ఒ. గా ఉండగా, అన్నారావుగారు పాలకమండలి అధ్యక్షుడుగా ఉండగా మొదలైంది.

వేంకటేశ్వర దేవస్థానంలో కొన్ని శతాబ్దాలపాటు - అంటే 15వ శతాబ్దం నుండీ 20వ శతాబ్దంవరకూ - తిరుపతి-తిరుమల ప్రసాదం అంటే వడ ప్రసాదం చాలా ప్రసిద్ధిలో ఉండేది. ఆ స్థానాన్ని ఇప్పుడు తిరుపతి లడ్డు తీసుకొంది.

★ ★ ★

53. ఆ కీర్తనలన్నీ అన్నమయ్య రాయలేదా?

శ్రీనివాసుడిమీద భక్తితో అన్నమాచార్య చేసిన ఆరాధన అంతా మొత్తం రాగి రేకుల్లో నిక్షిప్తం.

దాదాపు 3000 రాగిరేకుల్లో 30 వేలకు పైగా కీర్తనలు!!

తిరుమల కొండమీద శ్రీనివాసుడి ఆలయంలో దొరికిన రాగిరేకులకి దుమ్ము దులిపి, మెరుగుపెట్టి, శతాబ్దాలక్రితం నాటి తెలుగు లిపిలో ఉన్న కీర్తనల్ని పట్టిపట్టి చదివి, అర్థం చేసుకుని, సంవత్సరాలపాటు శ్రమించి వాటినన్నింటినీ కాగితాల మీదకి సాధు సుబ్రహ్మణ్యశాస్త్రి ఎక్కించి, మూడు టేకు పెట్టెలలో దాచి పెడితే...

...అప్పటి తిరుమల దేవస్థాన ముద్రణాలయం మేనేజరు ఆ పెట్టెలు తెరిచి చూసి, అవన్నీ చిత్తు కాగితాలనుకుని తగలబెట్టేశాడు!!

★ ★ ★

తిరుమల ఆలయంలో దొరికిన శిలాశాసనాల్లో ఆరవ శాసనం 31-10-1530 తేదీన తాళ్లపాక పెద్ద తిరుమల అయ్యంగారు చేసింది. ఈయన తాళ్లపాక అన్నమాచార్యుల కొడుకు. ఈ శాసనంలో ఆలయంలోని విమానప్రాకారంలో రామానుజుల సన్నిధికి ప్రక్కగా ఉన్న సంకీర్తన భాండాగారం (ఇప్పటి హుండీకి దాదాపు ఎదురుగా) ముందు ఉత్సవరులు మలయప్ప స్వామిని నిలిపి, స్వామివారికి ఒక అతిరస (అరిశ) పడి (పడి అంటే 51 అరిసెలు) నైవేద్యం చేయడానికి చేసిన ధర్మాదాయం.

తర్వాత కాలంలో ఇదే పెద్దతిరుమలాచార్య, అతని కొడుకు చిన తిరుమలాచార్య (N0.155) ఈ సంకీర్తన భాండాగారం గదిముందు స్వామివారిని తెచ్చి, ఇంకా కొన్ని సందర్భాలలో నైవేద్యాలు చేయించడానికి దేవస్థానానికి రుసుము చెల్లించి ధర్మాదాయం చేసినట్టు శాసనాలున్నాయి.

సాధు సుబ్రహ్మణ్యశాస్త్రిగారు – మహంతుల కాలంలో, తిరుమల ఆలయంలోని శాసనాలపై పరిశోధన జరిపి శిలాశాసనాలలోని సారాంశాన్ని సేకరించి, పరిశీలన జరిపి, పుస్తకాలుగా ముద్రించాలన్న సంకల్పంతో ప్రవేశపెట్టిన దేవస్థాన కార్యక్రమానికి నిర్వాహకులుగా ఉండేవారు. ఈ శాసనాల ద్వారానే సంపంగి ప్రాకారంలో ఒక సంకీర్తన భాండాగారం ఉండేదన్న సంగతి బయటపడింది. శాసనాలలో ఉన్నట్లు, ఉత్సవాల కాలంలో ఆ సంకీర్తన భాండాగారం ముందు స్వామివారిని నిలిపి, హారతులిచ్చి నైవేద్యాలిచ్చే (పెద్ద తిరుమలాచార్యులు, చిన తిరుమలాచార్యుల) ధర్మాదాయం కొనసాగుతున్నట్లయితే, అక్కడ సంకీర్తన భాండాగారం గురించి అందరికీ తెలిసే ఉండేది. కాని 1800 సంవత్సరం నుండి 1831 సంవత్సరం వరకు ఆలయ నిర్వహణ ఈస్ట్ఇండియా కంపెనీవారి ప్రత్యక్ష పరిపాలనలోకి వచ్చినప్పుడు ధర్మకర్తలు ఉండేవారు కాదు. ఆలయ నిర్వహణని చంద్రగిరి తహసీల్దారు గారి ఆధ్వర్యంలో ఒక పారుపత్తేదారు నిర్వహించేవారు. ఆరోజుల్లో, దేవస్థానానికి దేవదేయంగా వచ్చిన అన్ని 200 గ్రామాల్ని కంపెనీవారు తీసివేసుకొని, వాటి నుండి వచ్చే ఆదాయం వారే తీసుకొని, ఆయాదాతలు ప్రవేశపెట్టిన ధర్మకార్యాలు – అంటే ప్రత్యేక ఉత్సవాలు, నైవేద్యాలు, నందాదీపాలు మొదలైనవన్నీ రద్దుచేశారు. అప్పుడు ఈ తాళ్లపాక వారు చేసిన ధర్మాదాయాలు కూడా రద్దయి, అచ్యుతరాయలు, కృష్ణదేవరాయలు, అధికారులు, వణికులు ప్రవేశపెట్టిన అన్ని ఉత్సవాలు కూడా రద్దవడంతో, స్వామివారిని ఆ సంకీర్తన భాండాగారం ముందు ఆపి హారతి చేసే సంప్రదాయం పోయింది.

తర్వాత కాలంలో సంకీర్తన భాండాగారం అక్కడ ఉందన్న విషయం కూడా మరుగున పడిపోయింది. ఆ భాండాగారం ఉందనిగాని, అందులో ఏవో ఉన్నాయి అన్న విషయంగానీ ఎవ్వరికీ – అంటే ఆలయ అధికారులకు గాని, పరిపాలకులకు కాని. యాత్రికులకు కాని, తాళ్లపాక వంశంవారికీ కానీ ఎరుకలేని పరిస్థితి ఏర్పడింది.

శిలాశాసనాల పరిశీలనలో ఇక్కడ ఏదో సంకీర్తన భాండాగారం ఉండేదన్న విషయం బయటపడి, మహంతు ప్రయాగదాసుగారు ఆ భాండాగారాన్ని 1922లో తెరిపించేవరకూ అందులో ఏముందో ఎవ్వరికీ తెలిసినట్టు లేదు.

దొరికిన ఆధారాల ప్రకారం 1860లో ఒకసారి క్యాంప్ బెల్ (Campbell) అనే ఆయన Grammar of Telugu అనే పుస్తకం రాయడానికి కావల్సిన పరిశోధనలు చేసినప్పుడు అతనికి తిరుమల కొండపైన ఆలయంలో ఏదో భాండాగారం ఉందన్న సంగతి వినికిడికివచ్చి, (ఆ రోజుల్లో కొండపైకి ఆంగ్లేయులు వెళ్లే సంప్రదాయంలేదు

కాబట్టి) ఒక తెలుగు పండితుడిని కొండకు పంపినట్లు, ఈ భాండాగారం తెరిచి లోపల వున్న వాటిని పరిశీలించినట్లు, ఆ పండితుడు అవేవో ఆధ్యాత్మిక కీర్తనలే కాని, ఆ ఆంగ్లేయుని పుస్తకానికి గాని, పరిశోధనకు గాని పనికివచ్చేవి కావని చెప్పినట్లు తెలుస్తోంది.

1915లో ఇంకొకసారి, ఒక ఆంగ్ల పురావస్తు శాఖాధికారికి ఈ సంకీర్తన భాండాగారం ఒకటి తిరుమలలో ఉందన్న విషయం తెలిసి, తలుపులు తెరిపించినట్లు తెలుస్తోంది. అప్పుడు పరిశీలనలో ఏమి తెలిసిందో వివరాలులేవు. మళ్లా భాండాగారాన్ని యథాతథంగా మూసివేశారు.

1922 తర్వాత, సాధు సుబ్రహ్మణ్యశాస్త్రి గారు ఈ మూడువేల రాగిరేకుల్ని తిరుపతిలో దేవస్థానం కచేరీకి చేర్చిన తర్వాత ఆ రాగిరేకుల్ని శుభ్రం చేసి, వాటిలోని సంకీర్తనలను కాగితాలపైకి కాపీ చేసి, చాలా సంవత్సరాలు కృషిచేసి, మూడుపెద్ద టేకు పెట్టెలలో భద్రం చేశాడు. అందులోని కొన్ని సంకీర్తనలు, మూడు చిన్న పుస్తకాలుగా కూడా– 'Mind Worth', 'ఆధ్యాత్మ సంకీర్తనలు' 'శృంగార సంకీర్తనలు' – తయారుచేసి, దేవస్థానం పాఠశాలలో తెలుగు పండితులుగా పనిచేస్తున్న శ్రీకళాబారి వెంకటరమణ కవిగారితో పరిశోధన చేయించి, ఆ సంకీర్తనల క్రింద Foot Notes గా పదాలకు అర్థాలు, కొంత వ్యాఖ్యానంతో తయారు చేయించాడు.

తర్వాతి కాలంలో ఈ మూడు చిన్న పుస్తకాలను దేవస్థానం ముద్రణాలయం వారు చాలా Foot Notes తీసివేసి ప్రచురించారు. ఇవి చాలా చాలా కొద్ది సంకీర్తనలు.

చాలా సంకీర్తనలు ఆ మూడు టేకుపెట్టెలలోనే ఉండిపోయాయి. శాస్త్రిగారు పనిచేసే శిలాశాసనాల విభాగం మద్రాసుకు తరలించబడటంతో ఈ పెట్టెలు కూడా వారితో మద్రాసుకు తరలించబడ్డాయి. తర్వాత శాస్త్రిగారిని మూలవరులకు కిరీటం తయారుచేసే పనికి బదిలీ చేయడంతో, శాసనాలు, ఈ పెట్టెల సంరక్షణ పండిత విజయ రాఘవాచారిగారి బాధ్యత అయింది. ఆ తర్వాత మహంతులనుండి దేవస్థానాల కార్యనిర్వహణ 1933లో మద్రాసు ప్రభుత్వానికి మారడం. దేవస్థానానికి కమీషనరును కార్యనిర్వహణాధికారిగా వేసి ధర్మకర్తల మండలిని స్థాపించడం జరిగింది.

రెండవ కమీషనరు రంగస్వామి మొదలియారు కాలంలో ఆనాటి దేవస్థానపు ముద్రణాలయం మద్రాసు ఆండర్సన్ వీధిలో ఉండేది. దాన్ని సెకండ్ లైన్ బీచ్‌లోని థియోసాఫికల్ సొసైటీ భవనానికి మార్చడం జరిగింది. అప్పటి ముద్రణాలయం మేనేజరు, శాస్త్రిగారు సంవత్సరాల శ్రమ చేసి రాగిరేకుల నుండి కాగితాలపై పొందుపరచి

3 పెట్టెలలో భద్రపరిచిన వాటిని, పనికిరాని చిత్తు కాగితాలుగా భావించి, కాగితాలు తగలపెట్టించి, మూడు పెట్టెలను భద్రంగా కొత్త భవనానికి తీసుకువెళ్లారట. అలా శాస్త్రిగారి శ్రమ అంతా బూడిదలో పోసిన పన్నీరైంది.

తిరుమల ఆలయంలో దొరికిన శిలాశాసనాల పరిశోధనతో ఆ గ్రంథాలూ, వాటి ఆధారంగా తిరుమల ఆలయ విశేషాలతో ఇంకొక గ్రంథాన్ని సాధు సుబ్రహ్మణ్యశాస్త్రిగారే తయారుచేశారు. ఆయన 1944 సంవత్సరంలో దేవస్థానం కొలువునుండి పదవీవిరమణ చేశారు. కాని ఆ పుస్తకాలు 1971 నాటికిగాని తయారుకాలేదు. ఆ పుస్తక ప్రచురణ అప్పటినుండి జరగనేలేదు. ఆయన ప్రైవేటుగా ప్రచురించాలన్న ప్రయత్నాలూ ఫలించలేదు. దేవస్థానంవారిని ప్రచురణకు వారు అభ్యర్థించినా, 'సరే' అన్నారేకాని, ప్రచురించే కార్యక్రమం జరుగలేదు... నేను దేవస్థానం కార్యనిర్వహణాధికారిగా 1978లో చేరిన తర్వాత కామిశెట్టి శ్రీనివాసులు (అన్నమాచార్య ప్రాజెక్టు) Special Officer ద్వారా నా దృష్టికి శ్రీ సాధు సుబ్రహ్మణ్యశాస్త్రిగారి శాసనాలు, 'తిరుపతి శ్రీవేంకటేశ్వరుని' గురించి వారి పరిశోధన గ్రంథం వచ్చి, వెంటనే వాటిని ప్రచురించే ఏర్పాటు చేయడం జరిగింది.

కాని, సాధు సుబ్రహ్మణ్యశాస్త్రిగారి కోరిక నెరవేరలేదు. తాను బతికి ఉండగా ఈ పుస్తకం ప్రచురింపబడాలని వారికోరిక. ఈ పుస్తకం దేవస్థానం తరఫున 26 సెప్టెంబరు 1981లో ప్రచురించడం జరిగింది. ఈ ప్రచురణకు 15 రోజుల ముందు - అంటే 1981 సెప్టెంబరు 10న వామన జయంతినాడు ఆయన తన రచనను పుస్తకరూపంలో చూడకుండానే మరణించారు.

రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ, వేటూరి ప్రభాకరశాస్త్రిగారి ద్వారా పరిశోధనలు జరుపబడి తాళ్లపాక వారి సంకీర్తనలు వెలుగులోకి వచ్చాయి. అందులో మొత్తం తాళ్లపాకవారి మూడు తరాల సంకీర్తనలు ఉండేవట. అన్నమాచార్యులు దేవాలయానికి సంకీర్తనాచార్యుని పదవిలో నియమింపబడి, రోజుకో కొత్త సంకీర్తన రచించి, స్వామి ముందు పాడేవారట. ఆయన తర్వాత, అదే ఉద్యోగంలో ఆయన కొడుకు పెద్ద తిరుమల అయ్యంగారు రోజుకొక కీర్తన రాసి పాడే సంప్రదాయం కొనసాగించారు. ఆ తర్వాత ఆయన కొడుకు చిన తిరుమల అయ్యంగారు కూడా రోజుకొక సంకీర్తన రచించి పాడే ప్రతిభ చూపి కొనసాగించారు. వారి తాళ్లపాక కుటుంబం ఆచంద్రార్కం స్వామివారి ఆలయంలో సంకీర్తన సేవ చేయాలన్నది అన్నమాచార్యులవారి కోరికే.

సాధు సుబ్రహ్మణ్య శాస్త్రిగారి అభిప్రాయంలో - స్వామివారి ఆలయంలో అన్నమయ్య సంకీర్తన భండారంలో దొరికిన రాగిరేకులలో ఉన్న సంకీర్తనలలో, అన్నమాచార్యులు రచించినవి 10000 నుండి 12000 వేల వరకూ ఉండవచ్చు. మిగతావి వారి ఇతర వంశీయులు రాసినవి అయివుండవచ్చు.

కాని చిన్న తిరుమలాచార్యులు (అన్నమాచార్యుల మనవడు) రాసిన అన్నమయ్య చరిత్రలో మాత్రం అన్నమాచార్యులవారే 32,000 సంకీర్తనలు రచించినట్లు చెప్పబడింది. ఈ సంకీర్తనలలో కొన్ని తర్వాతకాలంలో 3000 రాగిరేకుల మీద చెక్కించి, తిరుమల ఆలయంలోని సంకీర్తన భండారంలో దాచి పెట్టారు. అలా దాచిపెట్టిన సంకీర్తనలు ఒక్క అన్నమయ్యవే కావు, పెద్ద తిరుమల అయ్యంగారు, చిన తిరుమలాచార్యులు రచించినవి కూడా ఉన్నాయి.

ప్రతి రేకుమీదా ఒక్కోవైపు మూడు కీర్తనలు చెక్కారు. అంటే రెండువైపులా కలిపితే రేకుకి ఆరుకీర్తనలు. అలా లెక్కవేస్తే - 15,540 కీర్తనలు ఉండాలి. కాని రేకులపై ఉన్న మొత్తం కీర్తనలు 16,582 (అంటే కొన్ని రేకులులో 6 కంటే ఎక్కువ కూడా ఉన్నాయి). అందులో అన్నమయ్యవి 14,400, పెద్ద తిరుమలాచార్యవి 1,062, మనుమడు చిన తిరుమలయ్యవి 1,120. దీన్నిబట్టి మనకు తెలిసేది - అన్నమాచార్యుల మనవడు చెప్పినట్లు, అన్నమాచార్యుడు 32,000 సంకీర్తనలు రాసినా, రాగిరేకుల మీద చెక్కబడినవి 14,400 మాత్రమే. అలాగే మిగతా వారి విషయంలో కూడా. వారి రచనలన్నీ రాగిరేకుల మీద చెక్కబడలేదు.

తర్వాతి కాలంలో వీరి వంశంవారు ఈ ముగ్గురూ రాసిన సంకీర్తనలు పాడేవారేకాని, కొత్తగా ప్రతిరోజూ సంకీర్తన రచించే ప్రతిభ కోల్పోయారు. ఆ తర్వాతి కాలంలో ఈ సంకీర్తన సేవ తాళ్లపాకం మిరాశీగా స్థిరపడింది. తర్వాతి తరాల వాళ్లలో సంగీత జ్ఞానం కూడా లేని పరిస్థితి కొన్ని సందర్భాలలో కల్గింది. నేను కార్యనిర్వహణాధికారిగా ఉన్నప్పటి పరిస్థితి అదే. తాళ్లపాక వంశం వారికి సంగీత కళాశాలలో ప్రత్యేక శిక్షణను ఏర్పాటుచేసి, సంకీర్తనలు నేర్పించి సుప్రభాతసేవ/ఏకాంతసేవ సమయాల్లో వారు సంకీర్తన సేవ కొంత ఇంపుగా చేసే ఏర్పాటు జరిగింది.

తాళ్లపాక పెద్ద తిరుమలాచార్య స్వామివారికి (అప్పటికే ఉన్న 9 బ్రహ్మోత్సవాలు కాక) 10వ బ్రహ్మోత్సవానికి 1539 మార్చి 17న దేవదేయం చేసినట్లు శాసనం ఉంది. దానికి కావల్సిన ఖర్చులకు గ్రామాలు, నైవేద్యాలకు ఊరేగింపులోని

వాహనాలకు, ఆ సమయంలో నందాదీపాలకు, ముఖ్యంగా, పుష్కరిణి గట్టుమీద నందా దీపానికి తగిన వ్యవస్థ చేశారు.

1532 సంవత్సరంలో ఈ తాళ్లపాక పెద్ద తిరుమల అయ్యంగారు (అన్నమయ్య కొడుకు) స్వామివారి పుష్కరిణి శుభ్రం చేయించి, చుట్టూ రాతితో మెట్లు కట్టించాడట. కోనేటి పక్కన ఒక అంకణ మండపం కట్టించాడట. వరాహస్వామి దేవాలయం బాగుచేయించి దానికి ఇప్పుడున్న మహాప్రాకారాలు అతనే కట్టించాడట. ఇప్పుడు బ్రహ్మోత్సవాలచివర చక్రస్నానంనాడు స్నపన తిరుమంజనం జరిగే మండపం కూడా వరాహస్వామి దేవాలయానికీ, పుష్కరిణికి మధ్యన ఉన్నది. దాన్నీ ఆయనే కట్టించాడట.

1535లో పుష్కరిణి మధ్యలో ఉన్న నీరాలి మండపాన్ని పునర్నిర్మించింది ఈ తాళ్లపాక పెద్ద తిరుమల అయ్యంగారే. పుష్కరిణికి చుట్టూ పెద్ద చప్టా (Platform) కూడా కట్టించాడట. ఇవి ఇతను, ఇతని కుమారులూ కలిసి చేసిన కైంకర్యంగా శాసనం చెబుతుంది.

తిరుమల ఆలయం ముఖద్వారానికి తలుపు పక్కన చెక్కబడిన మూడు శాసనాలు ఈ తాళ్లపాక కుటుంబం చేసిన కైంకర్యం గురించి వివరిస్తాయి. మహాద్వారం బాగుచేసినప్పుడు ఈ శాసనంలో ఒకటి దెబ్బతిని పోయింది. కాని ఈ విషయాలు విపులంగా 'అన్నమయ్య చరిత్ర' అన్న ఆ కాలంనాటి అన్నమయ్య మనుమడు వ్రాసిన పుస్తకంలో విపులంగా చెప్పబడింది. ఈ పెద్ద తిరుమల అయ్యంగారు - స్వామివారి పులుగుకాపు (Civet Oil bath) కి, పన్నీటి అభిషేకానికి, నైవేద్యాలకు, తాంబూలాలకు ఎన్నో దేవదేయాలు చేసినట్లు చారిత్రక ఆధారాలున్నాయి.

ఈ పెద్ద తిరుమల అయ్యంగారికి ప్రతిభావంతులైన 5 గురు కొడుకులు. ఒక కొడుకు చిన తిరుమల అయ్యంగారు, శ్రీవారి ఆలయంలోనే సంకీర్తనాచార్యులుగా ఉండేవారు. మిగతావారు పండితులు, కవులు. ఇంకొక కొడుకు చిన్నన్న, అన్నమయ్య చరిత్ర రాసినవాడు.

★ ★ ★

54. అలమేలు మంగ వంశీయులు పద్మశాలీలు!

చిన తిరుమలాచార్య పాడుబడిన మంగాపురం గ్రామంలోని కళ్యాణ వేంకటేశ్వర ఆలయాన్ని పునర్నిర్మించాడట. ఈ ఆలయమే శ్రీనివాసమంగాపురంలోని కళ్యాణ వేంకటేశ్వర దేవాలయం. ఇది చంద్రగిరికి ఉత్తరంగా 2 కిలో మీటర్ల దూరంలో కొండకి వెళ్లే రెండో కాలిబాట దారిలో ఉంది. ఇక్కడే పద్మావతీ కళ్యాణం తర్వాత పద్మావతీ శ్రీనివాసులు 6 నెలలు వాసం చేసిన చోటు. అగస్త్యముని ఆశ్రమం ఆ దగ్గరలోనే ఉండేది. అగస్త్యుడు ప్రతిష్ఠచేసిన అగస్త్యేశ్వర ఆలయం కూడా ఈ ఆశ్రమానికి ఆగ్నేయంగా తొండవాడలో 3 కిలోమీటర్ల దూరంలో ఉంది. లభించిన ఆధారాల ప్రకారం ఈ ఆలయ పునఃప్రతిష్ఠ 22 మార్చి 1540 లో జరిగింది.

అదివరకు ఆలయం శిథిలావస్థలో ఉందని దాదాపు కొత్త ఆలయంలా కట్టి శ్రీనివాసుని కొత్త విగ్రహప్రతిష్ఠ చేసినట్లు తెలుస్తోంది. మొదటి ఆలయం ఎవరు కట్టారో ఆధారాలు లేవు. ఈ ఆలయం శ్రీవైష్ణవ సంప్రదాయం - అంటే పాంచరాత్ర ఆగమసంప్రదాయంతో చేయించినట్లు తెలుస్తోంది. ఆళ్వారుల దివ్యప్రబంధ పారాయణ, పూర్వాచార్యుల ఆళ్వారుల జన్మతిథుల పండగలు ఏర్పాటుచేశారు. భూరినైవేద్యాలు ఏర్పాటుచేసి, ఆ ప్రసాదాలు జియ్యర్లకు, ఆచార్య పురుషులకు వితరణ చేసే ఏర్పాటుకూడా చేశారట. దేవదేయాలు చేసి, ఆ ఆలయంలో ఉభయదారులుగా తమ వంశంవారు ఆచంద్రార్కం కొనసాగాలని చిన తిరుమల అయ్యంగారి కోరిక - అన్నమాచార్యులవారి వంశీయుల కీర్తనలు అన్ని సేవాసమయాల్లో పాడే సంప్రదాయం కూడా ఈ ఆలయంలో ఏర్పాటుచేశారట. ఈ గ్రామం తాళ్లపాకవారి సర్వమాన్య అగ్రహారం కావటం మరో విశేషం - ఈ వివరాలన్నీ 144 నం. శాసనంలో రాయించినవారు యతిరాజయ్యంగారని కూడా శాసనం చెబుతుంది. ఇంకొక శాసనంలో, ప్రతినెలలో 2 దశమిదినాలు, 2 ఏకాదశులు, ఒక పూర్ణిమ, ఒక అమావాస్యనాడు, స్వామివారికి ఉత్సవాలు జరపాలనీ, నైవేద్యాలు చేయించాలనీ, వాటికి కావల్సిన నిధులు ఏర్పాటుచేయించారు తాళ్లపాక వారు.

సాధు సుబ్రహ్మణ్యశాస్త్రి గారి 'తిరుపతి వేంకటేశ్వర' పుస్తకంలో 253 పేజీలో క్రింద Foot Note లో గోపీ కృష్ణగారు ఈ ఆలయం గురించి ఇచ్చిన సమాచారం ఉంది. 199 నుండి 203 శాసనాల ఆధారంగా ఈ కళ్యాణవేంకటేశ్వర ఆలయాన్నే మొదట అలమేలు మంగాపురం అనేవారట. రెండవ దేవరాయ కాలంలో ఈ గ్రామం శ్రోత్రియంగా గుర్తింపబడింది. 1433లో ఈ గ్రామాన్ని వేదపారాయణ చేసేవారి శ్రీనివాసపురం అనేవారట. తర్వాత 1540 నాటికి అది తాళ్లపాక వారి అలమేలు మంగాపురంగా ప్రసిద్ధికివచ్చింది.

ముస్లింలు ఈ ప్రాంతం మీద దండయాత్ర చేసినప్పుడు ఈ ఆలయంలో అయ్యవారి ఇతర చిన్న ఆలయాలు ధ్వంసం చేయబడ్డాయని, స్వామివారి మకరతోరణం విరగగొట్టారని, ఆళ్వారులు, ఇతర గరుడ, శేష, విష్వక్సేన ఆలయాలు, విగ్రహాలు నాశనం అయ్యాయనీ తెలుస్తోంది. అన్నమయ్య విగ్రహం కూడా అప్పుడే నాశనం చేయబడి ఉండాలి. అలా శిథిలమైన ఆలయంలో పూజావిధానం ఆగిపోయి... తర్వాత తర్వాత తిరుచానూరులో అమ్మవారి విగ్రహప్రతిష్ఠ జరిగి తిరుచానూరు అలమేలు మంగాపురంగా ప్రసిద్ధికి వచ్చిందనీ, కళ్యాణ మంగాపురం వైభవం పోయిందనీ తెలుస్తోంది.

(కొండమీద నుండి దేవస్థానం వారి వేదపాఠశాలని క్రిందికి తేవాలని నేను కార్యనిర్వహణాధికారిగా నిర్ణయం చేసినప్పుడు, చంద్రగిరి సబ్-కలెక్టరు బంగళా, ఆఫీసు భవనాలు, తోటలు, దేవస్థానం తీసుకోవడానికీ, దాన్ని వేదపాఠశాల చేయటానికి ఒక యాదృచ్ఛిక కారణం - ఈ భవనాలు వేదపారాయణుల శ్రీనివాస మంగాపురంలో ఉండడమే. ఈ విషయం కూడా సాధు సుబ్రహ్మణ్యశాస్త్రిగారి పుస్తకంలో గోపీ కృష్ణగారు వ్రాసిన Foot Note లో ఉంది. ఈ కళ్యాణ వేంకటేశ్వర వైభవం తిరిగి తేవటానికే తిరుమల-తిరుపతి దేవస్థానంవారు 14-02-1981లో ఈ శ్రీనివాస మంగాపురం గ్రామం పొలిమేరల్లోని తోటలోకి దేవల తీర్థం దగ్గరకు వేదపాఠశాలను తరలించారని గోపీకృష్ణగారు రాశారు).

ఇంత వైభవంగా పూజలు జరిగే ఈ కళ్యాణ వేంకటేశ్వర ఆలయం, పూజా పునస్కారాలు లేక మూతబడిపోయింది. ఈ తాళ్లపాక వారు చేసిన దేవదేయాలను, ఇచ్చిన గ్రామాలను ఈస్ట్ ఇండియావారి పరిపాలన కాలంలో దేవుని మాన్యాలన్నీ కంపెనీ తీసుకొన్నప్పుడు వస్తున్న ఆదాయాలన్నీ పోయి, ఈ ఆలయం మళ్లా బాగుపడే అవకాశం కూడా లేకుండా పోయింది.

20వ శతాబ్దం మొదటి భాగంలో ఒక భక్తురాలు, ఈ ఆలయాన్ని శుభ్రపరిచి, దీపం పెట్టిందని, ఆ తర్వాత సుందర రాజస్వామి అనే మధ్వబ్రాహ్మణుని కలలో స్వామి కన్పించి పూజచేయమన్నారనీ, అతను అలా తన ఖర్చుతోతానే పూజచేయడం మొదలుపెట్టాడనీ... అలా కొంత కాలం జరిగాక, అతనికి సంతానం లేకపోవడంతో ఒక స్మార్త బ్రాహ్మణ బాలుని చేరదీసి రాఘవేంద్ర నామకరణం చేసి మధ్వసంప్రదాయం తంత్రసార ప్రకారం అతనికి పూజాపద్ధతి నేర్పి, తనతోపాటు అతనినీ ఆలయంలో అర్చకుడుగా తీర్చిదిద్దాడనీ తెలుస్తోంది.

ఈ సుందరరాజస్వామి తణుకు వాస్తవ్యుడని ఆయనకు కలలో స్వామి కనపడింది ఆషాఢ శుద్ధ సప్తమి నాడు కనుక, "స్వప్న సాక్షాత్కార వైభవం ప్రారంభించి, రెండేళ్ల తర్వాత నిలిచిపోయిందని మద్రాసులోని చరిత్రకారుడు, సుప్రసిద్ధ సంగీత విమర్శకులు, వి.ఎ.కె. రంగారావు నాకు వివరంగా తెలిపారు. 1967 సంవత్సరంలో తొండవాడ మొగిలి సుందరరామిరెడ్డి గారి ప్రోత్సాహంతో ఈ వైభవోత్సవాలు మరలా ప్రారంభించబడినాయి. వాటిని ఇప్పటికీ 'సాక్షాత్కారవైభవం'గా ప్రతి సంవత్సరం జరుపుతారు. ఇలా పునఃప్రారంభానికి నాంది పల్కింది రంగారావు గారే. రంగారావుగారి తల్లి రావు సరస్వతీదేవి గారు, వారి స్నేహితులతో కలిసి స్వామివారికి, వెండి కటారి, భుజకీర్తులు, మొలతాడు వంటి కొన్ని నగలు చేయించే కైంకర్యం చేశారు. ఈ ఉత్సవం నాడు ఈ రంగారావుగారు ఆలయంలో నాట్యసేవ చేస్తారు. ఇప్పటికీ ఆ సంప్రదాయం కొనసాగుతూనే ఉంది. ఈ విషయాలన్నీ ఆలయ రికార్డులలో నేను బదిలీ అయి వెళ్తున్న సందర్భంలో వ్రాసి భద్రపరచడం జరిగింది.

స్థానికుల పట్టుదలవల్ల 1967 ఏప్రిల్ 29న ఈ దేవాలయ పరిపాలన బాధ్యతలను తిరుమల-తిరుపతి దేవస్థానంవారు చేపట్టడం జరిగింది. కాని మొదటి నుండీ ఈ ఆలయం కేంద్ర పురావస్తుశాఖ పరిధిలో ఉండటంతో ఏమి మరమ్మత్తు చేయాలన్నా చాలా ఇబ్బందిగా ఉండేది. అలాగే అర్చకులు పూజలు చేసేవారు. 1981 ఫిబ్రవరి 22 నాడు నేను కార్యనిర్వహణాధికారిగా ఉండగానే బ్రహ్మోత్సవాలు ప్రారంభించబడ్డాయి.

★ ★ ★

తాళ్లపాక చిన్నన్న - అంటే చిన్న తిరుమలాచార్యులు కట్టిన తొండవాడ శ్రీనివాసుని ఆలయం (తిమ్మపాలెం) కూడా మహమ్మదీయుల దండయాత్రలో పూర్తిగా

నాశనమయింది. ఈ రెండు శ్రీనివాస ఆలయాలను చిన్న తిరుమల అయ్యంగారు ఎలా కట్టించారో, బాగుచేశారో అన్న కథ ఒకటి సాధు సుబ్రహ్మణ్యశాస్త్రిగారు, శాసనాల ఆధారంగా వారి పుస్తకంలో వ్రాశారు.

20వ శతాబ్దం మధ్యభాగంలో తిరుపతికి తాళ్లపాక చిన్నన్న వారసులలో ఒకడైన సూర్య నారాయణయ్య వచ్చి స్థిరపడ్డాడట. అతనితో పాటు వారి వంశంలో సంప్రదాయంగా అన్నమయ్య పూజించిన రాగి వేంకటేశ్వర విగ్రహం ఒకదానిని ఈ శ్రీనివాస మంగాపురం ఆలయానికి బహూకరించాడట. ఆలయంలో ఈ విగ్రహం ఇంకా ఉంది. దీనితోపాటు తాళ్లపాక చిన్నన్న 'అన్నమయ్య చరిత్ర' రాసే కాలంలో వ్రాయబడినట్టు చెప్పుకొనే ఒక తాళపత్రం నుండి 1940లో తాను కాపీ చేసిన విషయాన్ని, శ్రీనివాస మంగాపురం గురించి చంద్రగిరి ప్రాంతంలో వ్రాసి ఇచ్చిన ఒక తామ్రశాసనం కాపీని ఈ సూర్యనారాయణ తనతో తీసుకువచ్చాడట.

ఈ తామ్రపత్రంలో తిరుపతి చంద్రగిరి రహదారికి ఉత్తరంగా చిన్నన్న కట్టించిన వేంకటేశ్వర ఆలయాన్ని (తిరుపతికి 4 మైళ్లు పశ్చిమంగా) గురించి, ఆ ప్రాంతపు పద్మశాలీలు చిన్నన్నకు ఇచ్చిన నగదు, ఇతర హామీల గురించి ప్రసక్తి ఉంది. వీటిని తాళ్లపాక సూర్యనారాయణయ్య దేవస్థానంవారి ప్రాచీనపరిశోధనాలయం (Oriental Manuscript Library) కి అందచేసినట్లు తెలుస్తోంది.

ఆ తాళపత్రంలో వివరించిన విషయం - నేతనేసే రెండు వర్గాలవారి మధ్య ఒక తగాదా ఉండేదట. ఆ రెండు వర్గాలు - శాలీలు, జాంద్రాలు. రెండు కులాలూ బట్టలునేసే వృత్తిలోనే ఉండేవారు. ఆ కాలంలో ఈ నేతలు నేసేవారు, తాము అలమేలు మంగకు వారసులుగా చెప్పుకొనేవారట. ఇక్కడ తగాదా - ఎవరు పద్మావతీదేవికి నిజమైన వారసులు? అని. సాలీలా లేక జాంద్రాలా?

ఈ రెండు కులాలవారు తీర్పు చెప్పమని పండితుడైన తాళ్లపాక చిన్నన్నను కోరారట. చిన్నన్న అమ్మవారిని ప్రార్థించి, అమ్మవారి ఆదేశాలతోనే తను నిర్ణయాన్ని ప్రకటిస్తున్నట్లు చెప్పి, సాలీలు మాత్రమే అమ్మవారి వంశీకులని నిర్ణయించాడు. ఆనాటి నుండీ వీరిని 'పద్మశాలీ'లుగా పిలవడం మొదలైంది.

ఈ తీర్పుకు చాలా సంతోషించిన పద్మశాలీలు, చిన్నన్నకు 20,000 వరహాలు కానుకగా ఇచ్చి, ఆ డబ్బుతో ఆళ్లగట్టులో ఒక స్థలం 'బాలపాపుగని' కొని, ఆ స్థలంలో

ఒక ఆలయ నిర్మాణం చిన్నన్నతో చేయించారు. అంతేకాదు. ఆ ఆలయం ఖర్చు నిమిత్తం ప్రతి మగ్గానికి సంవత్సరానికి ఒక బంగారు రూక (నాణం) కులంపెద్దలు వసూలు చేసి ఇచ్చేట్టు హామీ ఇస్తారు.

అంతేకాకుండా, వారికులాలలో ఎవరికి వివాహమైనా, వివాహ సమయంలో ఆ కుటుంబంవారు ఒక బంగారు రూకను చిన్నన్నకు ఇచ్చేట్లు, చిన్నన్నను వారి ఆధ్యాత్మిక గురువుగా ఒప్పుకొని, ఆ గురువుగారు ప్రతిష్ఠించిన ఆలయంలోని శ్రీనివాసునికి ఖర్చు నిమిత్తం ఈ సొమ్ము ప్రతి సంవత్సరం కులపెద్దలు వసూలు చేసి ఇచ్చేట్లు, ఆచంద్రార్కం ఈ ఒప్పందం కులపెద్దల - చిన్నన్న వారసుల మధ్య ఉండేట్లు వ్రాసిన ప్రత్యేక తామ్రపత్రం నవంబర్ 1543 లో రూపొందింది. 1565 తళ్లికోట యుద్ధం తర్వాత ఈ ఆలయాన్ని ముస్లింలు నాశనం చేశారు. ఇప్పటికీ రహదారి పక్కన దేవాలయ అవశేషాలను గుట్టగా చూడవచ్చు.

★ ★ ★

ఒక శాసనం - 1539 జూన్ 9 న అనంతాళ్వార్ కుప్పయ్యన్ అనే దేవాలయంలో గణాంక శాఖలోపనిచేసే ఉద్యోగి గోవిందరాజస్వామివారి ఉత్సవాల్లో భాగంగా చేసిన గజేంద్రమోక్ష ఉత్సవం గురించి తెల్పుతుంది.

కటక సంక్రమణ దక్షిణాయన పుణ్యకాలంలో జరిగే ఈ ఉత్సవం (15 జులై ప్రాంతంలో) లో స్వామివారిని గరుడవాహనంలో ఊరేగించి, ఆలయం ముందు ప్రత్యేకంగా తయారుచేసిన పెద్దనీటి గుంటవద్దకు తెస్తారు. ఆ గుంటలో నీరునింపి, అందులో ఒక పెద్ద మొసలి బొమ్మను ఏర్పాటుచేసి, ఆలయ గజాన్ని ఆ గుంట దగ్గరకు తెచ్చి మొసలి ఆ గజం కాలుపట్టుకొన్నట్లు, ఆ గజేంద్రుడు స్వామివారిని ప్రార్థించినట్లు, గరుడారూఢుడైన స్వామి అక్కడికి వచ్చి, చక్రంతో ఆ మొసలితల నరికివేసి, గజేంద్రుని రక్షించినట్లు ఈ ఉత్సవం సాగుతుంది. ఈ గజేంద్రమోక్ష ఘట్టాన్ని కన్నులపండువుగా, వైభవంగా ప్రతి సంవత్సరం చేయించడానికి అయ్యే ఖర్చు ఈ అనంతాళ్వార్ ఇచ్చినట్లు శాసనం (No.135). ఇది చూడడానికి వేలాది భక్తులు వచ్చేవారట.

★ ★ ★

ఇంకో శాసనం - 1538 అక్టోబరు 9న తొండమండలం, పూరమండలం, ఊల్మండలం లోని పద్మశాలీల తరఫున చేసిన శిలాశాసనం. హంపీ విజయనగరం, మగధ పట్టణం, మధురపట్టణం, పురాణపురం ప్రాంతంలో ఉండే పద్మశాలీలు తమతమ మగ్గాలపై ఒక పద్ధతిలో నేత గుడ్డలు తయారుచేస్తామనీ, మార్పులు, కల్తీలు లేకుండా చేస్తామనీ, ఎవరైనా పొరపాటుచేస్తే కులపెద్దలు అతని నుండి 12 పోను వరహాల (Fine) నగదు జరిమానాగా వసూలు చేస్తామని, తిరుపతి నుండి కంచీపురం వరకు ఆపై దక్షిణ ప్రాంతం వరకు ఈ ఒప్పందం అమలుచేసి, జరిమానాగా వసూలు చేసిన నగదుని శ్రీవేంకటేశ్వరుని శ్రీభాండాగారానికి చెల్లిస్తామని చేసిన ఒప్పందమే ఈ శిలాశాసనం. (112).

★ ★ ★

55. ఆలయమే ఆళ్వారు అయితే...

వేలాది భక్తులు ప్రతిరోజూ వచ్చే ఆలయం శుభ్రంగా ఉంచడంకోసం ఆలయాన్ని మొత్తం ఆళ్వార్‌గా భావించి, అభిషేకం (తిరుమంజనం) తో ఆలయాన్ని శుభ్రపరచటమే ఆళ్వార్ తిరుమంజనం.

దీనిని 19-10-1544లో మొదటిసారి జరిపించినట్లు శాసనం ఉంది. వంగపురం నారాయణశెట్టి అనే తిరుపతి వర్తకుడు బ్రహ్మోత్సవానికి ముందు, తన ఖర్చుతో గర్భాలయం, శయన మండపం, స్నపన మండపం మొత్తం గోడలు కప్పుతోసహా గోకించి శుభ్రంచేసి కడిగించి, దానిపై గంధం, కర్పూరం ముద్దలు గోడలకు పూశాడు. దీనివలన ఆలయంలోపల గాలి పరిశుభ్రంగా, క్రిమికీటకాలు రాకుండా ఉండి శుభ్రతకు సానుకూలమవుతుంది.

ఈ కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం ఇప్పుడు కూడా ప్రతి పెద్ద ఉత్సవానికి ముందు, బ్రహ్మోత్సవాల ముందు జరుపుతారు. సంవత్సరానికి కనీసం నాలుగుసార్లు అయినా చేసే ఈ కార్యక్రమంలో ఆలయంలోని విగ్రహాలనన్నిటినీ వస్త్రాలతో కప్పి, గర్భాలయంలో మాత్రం ఆలయ అర్చకులు శుభ్రం చేస్తారు. మిగతా ఆలయం అంతా కార్యనిర్వహణాధికారి నుండి చిన్న ఉద్యోగి దాకా అందరూ పాల్గొని, స్వామివారి కైంకర్యంగా ఈ ఊడిగం చేస్తారు. ఈ సమయంలో దర్శనం ఉండదు.

అదే సమయంలో ఆలయంలో వాడే అన్ని దీపాలూ, గంగాళాలూ, గిన్నెలు, పీఠాలు, సహస్రకలశాభిషేకపు చెంబులు, స్వామివారి వాహనాలు, తిరుచ్చులు... అన్నీ శుభ్రం చేసే సంప్రదాయం వుంది. ఈ మధ్య కాలంలో ఈ సేవను ఆర్జిత సేవగా మార్చి, సేవాదారులు కూడా ఈ కైంకర్యంచేసి తర్వాత దర్శనం చేసుకొనే ఏర్పాట్లు చేశారు.

వివాహ మహోత్సవం / కళ్యాణోత్సవం

తిరుమల శ్రీవారి ఆలయంలో స్వామివారికి నిత్య కళ్యాణోత్సవం జరుగుతుంది. ప్రాచీన కాలంలో ఈ నిత్య కళ్యాణోత్సవ సంప్రదాయం ఉన్నట్లు కన్పడదు. బ్రహ్మోత్సవాలనే స్వామివారి కళ్యాణోత్సవాలుగా భావించేవారని తెలుస్తోంది.

కాని బ్రహ్మోత్సవాలలో స్వామివారికి అమ్మవారికి కళ్యాణం చేసే ఉత్సవం ఏమీలేదు.

ప్రత్యేకంగా స్వామివారి వివాహోత్సవాన్ని మొదటిసారి 1546 జూలై 17 నాడు తాళ్లపాక పెద్ద తిరుమల అయ్యంగారు మొదలు పెట్టినట్లు శాసనం ఉంది. ఇది ఆనాటి సంప్రదాయంగా 5 రోజుల వివాహ కార్యక్రమం. అనూరాధ నక్షత్రం నుండి ఉత్తరాషాఢ వరకు 5 దినాల ఈ వివాహ ఉత్సవం మార్చి-ఏప్రిల్ నెలల్లో మొదలయ్యేది. ఆరోజుల్లో 5 రోజుల వివాహాల్లో జరిగే అన్ని తతంగాలూ, లాంఛనాలూ ఈ వివాహంలో జరిపించేవారు. అభ్యంగనస్నానం, తిరుమంజనం, నూతన వస్త్రధారణ, తిరువీథి ఉత్సవం, నైవేద్యం, ఆ స్వామివారిని, దేవేరులను ఉయ్యాలపై ఉంచి చేసే ఊయలసేవ (హంస, చటక పక్షివాహనాలపై అమ్మవార్లు) ఉండడం, పెండ్లికొడుకు కాళ్లని పాలతో కడగటం - ధ్రువనక్షత్ర దర్శనం - చందన వసంతోత్సవం. కళ్యాణహోమం - మంగళసూత్రధారణ - తలంబ్రాలు - పూలబంతి ఆట... ఇలా అన్ని వేడుకలూ ఈ 5 రోజుల వివాహోత్సవంలో ఏర్పాటు చేశారు. తాళ్లపాక వారు ఏర్పాటుచేసిన ఈ ఉత్సవంలో తాళ్లపాక వంశీయులు ప్రధాన పాత్ర వహించి స్వామివారికి కన్యాదానం చేసే సంప్రదాయం మొదలైంది.

ఈనాటికీ జరిగే నిత్య కళ్యాణోత్సవంలో కన్యల తరఫున తాళ్లపాక వంశం వారు ఉండి కన్యాదానం చేస్తున్నట్లు కార్యక్రమం జరుగుతుంది. వారికి దేవస్థానం తరఫున సంభావన, ప్రసాదం కూడా దొరుకుతాయి.

ఈ కళ్యాణం ఖర్చుల నిమిత్తం. తాళ్లపాక పెద్ద తిరుమల అయ్యంగారు కొండవీడు సీమలోని శెందలూరు అనే గ్రామాన్ని (ఆదాయం 500 గట్టి వరహాలు - బంగారు వరహాలు), మల్లవరం (ఆదాయం 120 గట్టి బంగారు వరహాలు) దేవదేయం చేశాడట.

ఈ సమయంలో మలయప్ప స్వామికి దేవేరులకేకాక, ఆలయంలోని కృష్ణునికి, అలమేలు మంగకు, వరాహ స్వామికి కూడా నైవేద్యాలకు ఏర్పాటు చేశారు.

'మనోహరం'పడి - మొదటిసారి ఈ శాసనంలోనే కన్పడుతుంది. కొండమీదకాని, తిరుపతిలోకాని మనోహరం నైవేద్య ప్రస్తావన అదివరకు లేదు. ఇది ఒక రకమైన బెల్లపులడ్డు. సున్నుండలాంటిది. 16వ శతాబ్దం మధ్య భాగంలో మొదలయిన ఈ ప్రసాదం, 20వ శతాబ్దం మధ్య భాగంవరకు చాలా ప్రాచుర్యంలో ఉండి, వచ్చిన ముఖ్యభక్తులకు దేవస్థానం ఇచ్చే ప్రధానప్రసాదంగా పేరు తెచ్చుకొంది. తర్వాత ఇప్పుడు మనం తిరుపతి లడ్డూగా చెప్పుకొనే పంచదారలడ్డూ, (సెనగపిండితో చేసేది) ప్రాముఖ్యానికొచ్చింది.

తిరుమల ఆలయంలో రథసప్తమి ఈ నాటికీ వాహనసేవలతో వైభవంగా జరుగుతుంది. ఈ సేవ 1550 ప్రాంతంలో కరనిక అప్పలయ్య అనే ఆయన మొదలుపెట్టినట్లు తెలుస్తుంది. ఆ కాలంలో ఉత్సవంలో భాగంగా అంకురార్పణం, హోమం, తిరుమంజనం - ఉత్సవంలాగ చేసి సూర్యోదయం వేళకు స్వామిని సూర్యప్రభ వాహనంలో ఊరేగించేవారు. తర్వాత వరాహస్వామి మండపంలో మళ్లా తిరుమంజనం, సుదర్శన ఆళ్వారుకు మాడవీధి ఉత్సవం, తిరుమంజనం, రాత్రి మళ్లీ మాడ వీథుల్లో ఉత్సవం.

పోటు మిరాశీదారులు

రోజుకు వందల గంగాళాల ప్రసాదం - రకరకాల పణ్యారాలు, అప్పపడి, అడిశ (అతిరసపడి) పడి, దోశపడులు స్వామివారికి రోజూ ఎన్నో సార్లు నైవేద్యం చేయడానికి దేవదేయాలు శాసనాలలో వందలకొద్దీ ఉండేవి. అవికాక చిన్న చిన్న దాతలు చేసిన వేలకొలది నైవేద్య సేవలకు ఎన్నో రకాల భక్ష్యాలు, భోజ్యాలు చేయాల్సివచ్చేది. అన్న నైవేద్యాలు కూడా చాలా రకాలు - ఉప్పుపొంగలి, చక్కెర పొంగలి, పులిహోర, దద్ధోజనం, కదంబం... ఇలా ఎన్నో రకాలు వందలకొద్దీ గంగాళాల నైవేద్యం ప్రతిరోజూ ఎన్నో సందర్భాలలో జరిగేది. యాదవరాజుల కాలంలో మొదలై 1801 సంవత్సరంలో కంపెనీవారి ఆధ్వర్యంలోకి ఆలయ పరిపాలన వచ్చేవరకు - ఈ నైవేద్య సేవ మహోన్నతికి చేరింది. పూజాసమయాల్లోనేకాక, దాతలు విపరీతంగా పెరగడంతో పూజల మధ్య సంధి కాలంలో నైవేద్యాలూ, అవకాశం ఉన్నప్పుడల్లా స్వామివారికి రకరకాల నైవేద్యాలు భారీ ఎత్తున చేయాల్సిన అవసరం ఏర్పడింది.

ఆలయ పాలకులకు ఈ ప్రసాదాలు తయారుచేసే కార్యక్రమం తలకు మించిన భారం అవడంతో, వారి తరఫున గుత్తేదారుగా కావల్సిన నైవేద్యాలు రోజూ వండి ఇవ్వడానికి ఒక పోటు గుత్తేదారు అవసరమయ్యాడు. ఆయన శ్రీవైష్ణవ బ్రాహ్మణుడే. అలా రంగంలోకి వచ్చాడు.

శ్రీవైష్ణవ వంట బ్రాహ్మణులను వందలకొద్దీ ఏర్పాటుచేసి, దేవస్థానం ఉగ్రానం (Store Room) నుండి ఆనాటి నైవేద్యాలకు కావల్సిన అన్ని సరకులూ (వంట చెరుకుతో సహా) తీసుకొని కావల్సిన నైవేద్యాలు సకాలంలో చేసి ఇవ్వడం వీరి బాధ్యత. వారికి చేసినందుకు నగదు రూపంలోకాక ప్రసాదరూపంలో భాగంగా ఇచ్చేవారు. ఈ ప్రసాద భాగాలు ఆలయంలో యాత్రికులకు అమ్ముకొని వారి ఖర్చులకు పోగా, బాగానే మిగుల్చుకొనేవాళ్లు. ఇలా అన్ని ప్రసాదాలలో తగినంత భాగం ప్రతిరోజూ రావడం, వారి వంట బ్రాహ్మణులకు పెట్టగా చాలా ప్రసాదాలు మిగలడంతో అందరికంటే వీరికి ప్రసాదాలు అమ్మకానికి ఎక్కువగా వుండేవి. మెల్లగా వారి ప్రసాదాలేకాక ఇతరుల ప్రసాద భాగాలు కూడా వీరే వారిదగ్గర కొనుక్కొని అందరి తరఫున ప్రసాదాలు అమ్మే గుత్తేదారులుగా తయారయారు. తర్వాత కాలంలో వీరే పోటు మిరాశీదారులు. కొంతకాలం గుత్తేదారులుగా పనిచేసినా తర్వాత అర్చకులు, ఆచార్యపురుషులు, గొల్ల, తాళ్లపాక వారిలాగా ఈ పోటు నిర్వాహకులుకూడా దేవాలయంలో వంశపారంపర్య హక్కులతో మిరాశీదారులయ్యారు.

ప్రతి ప్రసాదంలో ఎవరెవరికి ఎంత భాగమో చూశాం. ఇది అన్న ప్రసాదాలకూ వర్తిస్తుంది, పడి (పణ్యారాల) ప్రసాదాలకూ వర్తిస్తుంది.

ఒక పడి అంటే 51. వడలు, దోశలు, మనోహరం, తర్వాత కాలంలో లడ్డూలు, అప్పాలు, జిలేబీలు ఇలా అందులో అందరికీ భాగం వుంది.

నేను 1978లో కార్యనిర్వాహణాధికారిగా చేరినప్పుడు, అందరు మిరాశీదారుల కంటే అధిక ఆదాయం ఆలయంలో సంపాదించే మిరాశీదారులు పోటు మిరాశీదారులే. గౌరవానికి అర్చకులు, ఆచార్య పురుషులైనా, అర్థికస్తోమత ఆసరాగా వీరి పరపతి చాలా గొప్పగా ఉండేది. దాదాపు 400 మంది వంట బ్రాహ్మణులు వీరి క్రింద ఆలయంలో రెండు షిఫ్టుల్లో పనిచేసేవారు. చాలా మంది ఆలయ అధికారులు కూడా వీరి చెప్పుచేతల్లో ఉండేవారని అనుకునేవారు. ఎవరికి ఉచితంగా ప్రసాదాలు ఇవ్వాలన్నా లోపాయికారీగా, ఆలయం లోపల ఏవైనా ధంధాలు చేయాలన్నా చేయగల సమర్థత, స్తోమత వీరికి కాలక్రమేణ వచ్చాయి.

మిగతా మిరాశీలతోపాటు, ఈ మిరాశీ కూడా సుప్రీం కోర్టు తీర్పువలన రద్దు అయింది. అయినప్పటికీ ఈనాటికీ ఆలయంపోటులో ఆలయాధికారులు నైవేద్యాల్ని – ముఖ్యంగా లడ్డూలు కావల్సినన్ని తయారుచేయించలేక, వందే బ్రాహ్మణులు ఆలయం సిబ్బందిగా మారి ఖర్చు విపరీతంగా పెరుగుతుండడం వలన, మళ్లా పోటు గుత్తేదారుల ద్వారా ప్రసాదాలు తయారుచేయించడం జరుగుతోంది.

★ ★ ★

1550 ప్రాంతంలో తిరుమల ఆలయంలో నిర్వహించబడే ముఖ్య ఉత్సవాలు.

1) 10 బ్రహ్మోత్సవాలు - నెలకొకటి చొప్పున పది నెలలు.

2) అన్న ఊంజల్ తిరునాళ్ - 5 రోజులు - హంసతూలికాతల్పంపై - సాళువ నరసింహ మొదలుపెట్టింది (1473).

3) పవిత్రోత్సవం - 5 రోజులు - సాళువ మల్లదేవ మహారాయ మొదలుపెట్టింది (1464).

4) సహస్రనామ అర్చన మహోత్సవాలు - 5 రోజులు - (ఇప్పుడు రోజూ చేస్తున్నారు. అది వరకు అలా కాదేమో).

5) సహస్ర కలశ అభిషేకము - ఒక రోజు - ఆర్జిత మహోత్సవము.

6) అధ్యయనోత్సవము - 25 రోజులు - తమిళ ప్రబంధం పారాయణ.

7) వసంతోత్సవము - 5 రోజులు - తిరుమల రాజయ్య మొదలుపెట్టింది.

8) దమనారోహణ వసంతోత్సవము - 5 రోజులు - ఉత్సవ వరులను 'దమనం' ఆకులతో పూర్తిగా అలంకరించి ఆరాధన అర్చన చేయడం.

9) ఊంజల్ మహోత్సవము - 9 రోజులు.

10) పెండ్లి తిరునాళ్ల - వివాహోత్సవము - 5 రోజులు - 17-07-1546లో తాళ్లపాక చిన్నన్న ప్రవేశపెట్టినది.

11) లక్ష్మీదేవి మహోత్సవాలు - 5 రోజులు.

12) కోడై తిరునాళ్లు (వేసవి ఉత్సవాలు) - 20 రోజులు.

13) తెప్పఉత్సవాలు - 9 రోజులు.

14) పల్లవోత్సవం - 5 రోజులు.

15) ఫలోత్సవము - 3 రోజులు.

16) అధ్యయనోత్సవం - ఉడయవరులకు (రామానుజులకు) - 6 రోజులు.

పది బ్రహ్మోత్సవాలు కాక చేసే మిగతా పదిహేను ఉత్సవాలను విశేష ఉత్సవాలుగా పరిగణించేవారు.

ఈ సంవత్సర ఉత్సవాలు కాక ప్రతినెలా జరిగే ఉత్సవాలు ఆ రోజు ప్రత్యేక పూజలు నైవేద్యాలతో ఇలా ఉన్నాయి.

12 మాస సంక్రమణాలు (తమిళ పంచాంగం ప్రకారం ప్రతినెల మొదటిరోజు).

13 అమావాస్యలు.

13 పౌర్ణములు.

25 దశమి దినాలు

25 ఏకాదశులు

25 ద్వాదశులు

13 రోహిణి, మృగశిర, పునర్వసు, పుష్యమి, ఉత్తరఫల్గుని, మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ, శ్రవణం - ప్రతి నక్షత్రానికి సంవత్సరంలో 13 రోజులు.

ఇలా సంవత్సర, మాససేవలు కాక విశేషదినాలలో కూడా ప్రత్యేకపూజలు ఉండేవి.

శ్రీజయంతి

ఊరి - ఆడి

ఉత్థాన ద్వాదశి

అర్వాసి పూర్వాషాఢ

దీపావళి

కార్తీకం

మకరసంక్రమణం

పారువేట

తాంపూసము

తన్నీరు - అముడు

ఉగాది

శ్రీరామనవమి

వైకాశి విశాఖ

మాసిమఖ

ఇవికాక చాలామంది భక్తులు వారివారి జన్మదినాలలో లేదా వివాహ దినాల్లో, పితృ వర్ధంతి దినాల్లో, ప్రత్యేక పూజలకు దేవదేయాలు చేసి జరిపించే పూజలు. తాళ్లపాక చిన్నన్న తన కుటుంబసభ్యులు తండ్రి, తాత అన్నమయ్య పేర్లన డబ్బు కట్టి ఉత్సవాలు ప్రతి సంవత్సరం నైవేద్యాలతో సహా ఏర్పాటు చేసినట్లు, శాసనాలున్నాయి. ఇక రాజుల విషయం చెప్పనక్కరలేదు.

★ ★ ★

56. వందల ఏళ్లు నిలిచిన ధ్వజస్తంభం

1552 జూలై 27 నాటి ఒక శాసనంలో రామరాజు కొడుకు తిరుమలయ్యరాజు చంద్రగిరి నుండి 21 మందిని దేవాలయానికి నెయ్యి సరఫరా చేయడానికి నియమించాడు (వీరు అంత వరకు రాజుగారికి నెయ్యి సరఫరా చేసేవారు). ఈయనే తిరుమలలో డోలోత్సవం, వసంతోత్సవాలకు దేవదేయం చేశాడు.

ఈ రోజుల్లోనే తిరుపతిలో గోవిందరాజ స్వామి ఉత్సవవిగ్రహాలను చుట్టుపక్కల గ్రామాలకు తీసుకువెళ్లి ఉత్సవం చేసి, నైవేద్యాలు చేసే సంప్రదాయం మొదలైంది. అవిలాల, కూపుచంద్రపేటల గ్రామస్థులు ఆగ్రామాలలో మండపాలు కట్టి స్వామివారిని ఉత్సవంగా తెచ్చి నైవేద్యాలు చేసేవారని శాసనం.

1614లో శ్రీరామనవమి తర్వాత రోజు - శ్రీరామాయణ పట్టాభిషేక మహోత్సవము వేంకటేశ్వర ఆలయంలో నోటక్కర వేంకటయ్యన్ అనే ఆయన దేవదేయంచేసి ఈ సేవ ప్రారంభించాడు. ఆనాడు ఆలయంలో ఉన్న మలయప్పస్వామి దేవేరులు, శ్రీరామసీతాలక్ష్మణులు, విష్వక్సేనుడు, హనుమ, సుగ్రీవ, అంగద, రామానుజుల విగ్రహాలు తిరుమల మణిమండపానికి తెచ్చి, అన్ని విగ్రహాలకు అభిషేకం చేసి - రామాయణం, వాయుపురాణాలలోని రామపట్టాభిషేక పారాయణ చేసి, భూరినైవేద్యాలు సమర్పించేవారు. అన్న నైవేద్యాలుకాక 6 రకాల పడి నైవేద్యాలు - అతిరసం (అరిసె) అప్పం, దోశ, వడ, ఇడ్లీ, జిలేబీలు చేసేవారు.

ఈ కాలంలో తెలుగులో చెక్కబడిన శిలాశాసనాల్లో ముఖ్యమైనవి - 25, 26 నెంబర్లు గల 1628 సంవత్సరానికి చెందిన మట్లకుమార అనంత రాయలకు చెందినవి. ఈయన వేంకటాచలం నుండి అహోబిలం వరకు ఉన్న రాజ్యాన్ని పాలించేవాడు. ఇతర బిరుదులతోపాటు వేంకటేశ్వర సేవాధురంధర అని కూడా చెక్కించుకున్నాడు.

ఈయన తిరుమల వేంకటేశ్వరునికి స్వర్ణ అశ్వం (బంగారు అశ్వవాహనం), స్వర్ణ సింధూరం (బంగారు ఏనుగు వాహనం), స్వర్ణ సర్వ భూపాల వాహనం, స్వర్ణ

పద్మ పీఠం, రత్నాఢ్యమకుటం (రత్నాలకిరీటం), నైవేద్య భాజన (నైవేద్యానికి బంగారు కంచం) చేయించి సమర్పించాడు.

ఇవికాక ఒక ఉన్నత కేళీమండపం, సోపాన మార్గం – కాలిబాటలో కట్టించాడు. మొదటి కొండపైన ఉన్న గాలిగోపురం కట్టించింది ఇతడే.

ఈ శాసనాల్లో అతను చేసిన ఇతర ధర్మకార్యాలు కూడా వివరంగా చెప్పబడ్డాయి.

1) గోవింద రాజస్వామి ఆలయంలో కూడా బంగారు వాహనాలు.

2) కాళహస్తీశ్వరునికి "కనకమోహన మయూరవాహనం".

3) తిరుమల కాలిబాటలో వేంకటేశ్వరుని విగ్రహం.

4) నందలూరు (కడపజిల్లాలో) నాలుగు గోపురాలు, పుష్కరిణి మధ్య 'సరసిమండపం'.

5) కడపలోని ఒంటమిట్ట రామాలయంలో మండపాలు ప్రాకారాలు, రెండు పెద్ద గోపురాలు.

6) చిన్నమాంబపుర, చెన్నమాంబ సముద్ర అనే రెండు బ్రాహ్మణ అగ్రహారాలు.

7) చెన్న కేశవ స్వామి ఆలయాన్ని సిద్ధవట్టంలో ప్రాకారాలు గోపురాలు కట్టి ఆభరణాలు సమర్పించాడు.

8) అక్కడేవున్న సిద్ధవటీశ్వరునికి - బంగారు నంది వాహనం చేయించాడు.

9) అనంతరాజపురంలోని చక్రధరునికి గోపురం.

10) చంద్రగిరిలోని శివునికి (కపర్ది) ఒక పెద్ద గోపురం.

11) పుష్పగిరిలోని ప్రసవాచలేశ్వరునికి ప్రాకారాలు, గోపురాలు.

12) దేవుని కడపలోని వేంకటేశ్వరునికి గోపురం, ప్రాకారాలు.

13) రాయచోటిలోని వీరభద్రునికి రెండు గోపురాలు.

14) రామేశ్వరం - బదరి యాత్రలు చేసే భక్తులకు రెండు అన్న సత్రాలు.

15) కపిలతీర్థంలో ఒక అన్నసత్రం.

16) తిరుమల కాలి దారిలో అన్నసత్రం.

17) సిద్ధవటంలో, ఒంటిమిట్టలో, పుష్పగిరిలో, ఓరంపాడదువ్వూరు, గుండ్లూరు, పోరుమామిళ్ల, నెలవనూరు ఊర్మిళ్ల, అనంతరాజపురం గ్రామాల్లో కూడా అన్న సత్రాలు కట్టించారు.

18) బంగారు, వెండితో తాను తులాభారం తూగి, పేదలకు ఆ బంగారు, వెండి దానం చేశాడట.

19) భూదానాలు, గోదానాలు వేలాది మందికి పెళ్లిళ్లు తన ఖర్చులతో చేయించి కన్యాదానాలు చేశాడు.

20) యజ్ఞయాగాలు చేసి బ్రాహ్మణులకు భూరిదక్షిణలు ఇచ్చాడు.

21) తిరువళ్లూరు వీర రాఘవస్వామికి ఒక వసంత మండపం కట్టించాడు.

22) శేషాచలంలో శ్రీపాద మండపం - స్వామివారి పాదాల మండపం - కొండకు వెళ్లేదారి మొదట్లో

23) ఆ మండపానికిపైన - కొత్త గోపురం. ఈమండపానికి పైన ఉన్నది సాళువ నరసింహుడు కట్టించిన శిథిలమైన గోపురం. 1980 సంవత్సరంలో నేను కార్యనిర్వహణాధికారిగా ఉన్నప్పుడు పునర్నిర్మాణం చేసింది. ఈ గోపురం తర్వాత ఇంకొక చిన్న గోపురం ఉంది. దీనినే కొత్త గోపురం అని పిలుస్తారు. ఆ గోపురమే ఈ మట్ల కుమార అనంతరాయలు కట్టించింది.

24) గోవింద రాజస్వామి వారి ఆలయంలోని పెద్ద గోపురం.

★ ★ ★

రాజశ్రీ శివరాజ రామచంద్ర దబీరుశాయి - అపరంజి బంగారు కంటె స్వామివారికి 5 వరహాల బరువు - 525 శ్రీరంగరాయవరహాల ఖరీదు చేసింది సమర్పణ. ఇతర నైవేద్యాలలో.

ఈ శాసనంలోనే - ఈ నైవేద్యాలు - భానూజీపంతులుగారి నైవేద్యసేవ తర్వాత అని - అప్పటి రాజుల ప్రస్తావన ఆ శాసనంలో లేదు. రాజెవరో తెలియని స్థితి. అప్పటికి కొంత కాలంముందు శివాజీ కొంకణ తీరం ఆక్రమించి - 4 ఏండ్ల తర్వాత కర్నూలు నుంచి వెల్లూరు వరకు రాజ్యాన్ని వ్యాపింపచేశాడు. ఈ భానూజీ పంతులు మహారాష్ట్ర బ్రాహ్మణుడు. అప్పుడే మహారాష్ట్రులు కొండకు రావడం మొదలైంది. తిరుపతి తిరుమల ప్రాంతం కూడా శివాజీ అధీనంలోకి వస్తున్న రోజులు. మరాఠీ ఇక్కడ

వారికిరాదు కనుక తెలుగులో శాసనం చేయించారు. అప్పటినుండి తిరుమల ఆలయంలో మరాఠీ ప్రభావం మొదలై తర్వాత రెండు శతాబ్దాలలో దాదాపు పూర్తిగా వచ్చేసింది. ఆలయంలో అన్ని వ్యవహారాలూ, రికార్డులూ, మరాఠీలోనే (మోడీ భాష) – దీన్నే దేశస్థ మారాఠీ, అని తంజావూరు మరాఠీ అని అంటారు.

ఆర్కాటు నవాబు తిరుమల ఆలయం నుండి వచ్చే ఆదాయం కంపెనీ వారికి ధారాదత్తం చేశాడు. అప్పుడు ఆలయ వ్యవహారాలన్నీ ఈ మరాఠీ మోడీ భాషలోనే జరిగేవి. తర్వాత కంపెనీవారు ఆలయాన్ని పూర్తిగా వారి అధీనంలోకి తీసుకొన్నాక కూడా కొంత కాలం మరాఠీ భాషలోనే వ్యవహారం జరిగేది.

★ ★ ★

17వ శతాబ్దం చివరి భాగంలో పాత ధ్వజస్తంభం పద్మ పీఠంపైన మొదట్లో తెలుగు శాసనం ఒకటి కన్పిస్తుంది. శ్రీవేంకటేశ్వరునికి ప్రణామాలు చేస్తూ ఈ ధ్వజస్తంభ ఉభయ (సేవ) చేసిన రాజశ్రీ సిద్ధూరి రామాజీమాదర్సు పంతులు గురించి అందులో ఉంది.

అంటే, ఆ ధ్వజస్తంభాన్ని కొత్తగా ఆ రామాజీమాదర్సుపంతులు సమర్పించారు. ఆ శాసనాన్నే ప్రామాణికంగా తీసుకుంటే, ఆ ధ్వజస్తంభమే పుచ్చిపోయి శిథిలమైనప్పుడు 1982లో నేను తిరుమల–తిరుపతి కార్యనిర్వహణాధికారిగా ఉన్నప్పుడు, కొత్త ధ్వజస్తంభం ప్రతిష్ఠ చేసే మహాభాగ్యం నాకు కలిగింది. అంటే ఆ పాత ధ్వజస్తంభ ప్రతిష్ఠ జరిగి మూడు వందల సంవత్సరాలు పైగా గడిచింది (మహంతుల కాలంలో ధ్వజస్తంభం ఒరిగిందన్న సాకుతో ధ్వజస్తంభం కింద నిధులకోసం తవ్వారని ప్రచారం జరిగినా, ధ్వజస్తంభం మార్చినట్లు ఎక్కడా దాఖలాలు లేవు). మహంతుల కాలంలో ఆ పాత ధ్వజస్తంభానికి బంగారుపూత వేసిన తొడుగులు తగిలించే ఏర్పాటు చేశారు.

★ ★ ★

1982 ఈ పాత ధ్వజస్తంభం ఎందుకు మార్చాల్సి వచ్చింది, ఎలా మార్చగలిగాం అన్న విషయాలు ఒక ప్రత్యేక వ్యాసంలో నా 'నాహంకర్తా హరిఃకర్తా" (సర్వసంభవమ్) పుస్తకంలో విపులంగా రాయడం జరిగింది.

57. విజయనగర పతనం - తిరుమలకు గ్రహణం

పేరుకు సదాశివరాయలు రాజు కాని, అధికారం మాత్రం అతని బావమరిది అళియ రామరాజుదే. ప్రధానమంత్రిగా నైపుణ్యంతో మండలాధికారులందరినీ తన అధీనంలో ఉంచుకొని, విజయనగర రాజ్య రక్షణ కట్టుదిట్టం చేశాడు. ఆ కాలంలో బహమనీ సామ్రాజ్యం 5 భాగాలుగా విభజింపబడి, ఒకరితో ఒకరు కీచులాడుకునే పరిస్థితి. విజయ నగర సామ్రాజ్యం పటిష్ఠంగా ఉండటం, మంచి సైన్యం కలిగి ఉండటం వలన, అప్పుడప్పుడు సుల్తానులు వీరి సహాయం కోరడం, వీరు సహాయం చేయడం కూడా జరిగేది.

కాని, రామరాజు వారిని వారి దూతలను కొంత నిర్లక్ష్యంతో చూడడమేకాక, వారు కట్టించిన కొన్ని మసీదులను కూడా పడగొట్టించాడు. అలా వారికి రామరాజుపై కోపం. దెబ్బతీయడానికి సమయం కోసం వేచిఉండి, ఒకసారి నలుగురు సుల్తానులు కలిసి ఈ హిందూ సామ్రాజ్యాన్ని నాశనం చేయడానికి ఒకేసారి దండెత్తారు. అందరూ తమ సైన్యాలను బీజాపూరులో మోహరించి తళ్లికోటవైపు యుద్ధానికి బయలుదేరారు.

కృష్ణానది దాటుతున్న తురుష్కుల సైన్యాన్ని అడ్డుకోవడానికి తన తమ్ముని కొంత సైన్యంతో పంపి, మిగతా సైన్యమంతా తీసుకొని తాను ఇంకొక వైపు బయలుదేరాడు రామరాజు. విజయనగర రాజధానిలో కొంచెం కూడా సైన్యం మిగల్చలేదు. అప్పటికే రామరాజుకు 96 సంవత్సరాలు. అయినా యుద్ధానికి బయలుదేరి, బోయీలు తన సింహాసనం మోస్తుండగా చుట్టూ బంగారు నాణాలు, ఆభరణాలు దగ్గర పెట్టుకొని, బాగా యుద్ధంచేసిన తన సైనికులకు ప్రోత్సాహంగా బహుమానాలివ్వడానికి సిద్ధంగా ఉన్నాడు. గెలుస్తానన్న ధీమా ఎక్కువ. కాని చూస్తుండగానే 5000 మంది హిందూ సైనికులు మరణించారు. మహమ్మదీయ ఆశ్వికదళం వీరిపైకి దాడి చేసింది.

సింహాసనం నుండి దిగి పల్లకీలోకి ఎక్కుతున్న సమయంలో బెదిరిన ఒక ఏనుగును చూచి పల్లకీని వదిలేసి బోయీలు పారిపోయారు. అంతలోనే ముస్లిం సిపాయిలు పైనబడి ఇతని తల నరికేశారు. అంతే! హిందూ సైన్యం ఛిన్నాభిన్నమైంది.

తిరుమలరాయలు కొంత సైన్యంతో రాజధాని విజయనగరానికి పారిపోయి, అక్కడున్న ఖజానాను మూటకట్టుకొని పెనుగొండకు పారిపోతాడు. చరిత్రకారులు తిరుమలరాయలు తీసుకువెళ్లిన నిధి 550 ఏనుగులు మోశాయని, వారితో రాజు సదాశివరాయలనూ, రాజ్యసింహాసనాన్ని, ఆభరణాలు, రత్నాలు వజ్రాలు, అన్నీ తీసుకువెళ్లినట్లు చెప్తారు.

అలా 1565 జనవరి 23 నాడు ఈ విజయనగర హిందూ సామ్రాజ్య రాజధానిని సుల్తానులు రెండు రోజులలో చేరి సర్వనాశనం చేశారు. దేవాలయాలు ధ్వంసం చేశారు. విగ్రహాలు విరగ్గొట్టారు. రాజసౌధాలను నేలమట్టం చేశారు. వేలాది సామాన్య ప్రజలను చంపేశారు. చరిత్రలోనే అటువంటి లూటీ ఎప్పుడు జరగలేదట! సుల్తానుల వైపు ప్రతిసైనికుడూ ధనవంతుడైనాడు. ఆ విధ్వంసం చేస్తున్నప్పుడే కోడిగుడ్డంత వజ్రం ఆదిల్‌షాకు దొరికిందట.

అయిదు నెలల పాటు ఈ విధ్వంసకాండ జరిగింది. అలా మొదలైన ఆక్రమణ గోల్కొండ, బీజాపూరు సుల్తానుల అధీనంలోకి పూర్తిగా తెచ్చేసింది. 1566 నాటికి గోల్కొండ సైన్యాలు రాజమండ్రి వరకు చేరి, 1567 నాటికి ఆ ప్రదేశాన్ని ఆక్రమించాయి.

బీజాపూరు సైన్యాలు ఆదిల్‌షా ఆధ్వర్యంలో ధీర్వార్ బంకాపూరు ఆక్రమించి కొంకణ్ ప్రాంతమంతా అధీనంలోకి తెచ్చుకున్నాయి.

తర్వాత బెల్లంకొండ ఆక్రమించి, దృష్టిని పెనుగొండమీదకు మళ్లించారు.

రాజు పెనుగొండ వదిలి చంద్రగిరికి పారిపోయాడు. 1578 నాటికి పెనుగొండ గోల్కొండ సుల్తాన్ వశంలోకి వచ్చింది. తరువాత ముస్లిం సైన్యం అహోబిలం దాకా ఆక్రమించింది. దురదృష్టవశాత్తు అహోబిలం పాలించే మట్లనాయకుడు ముస్లింలతో కలిసిపోయి తన అధీనంలో ఉన్న ఖమ్మం, వినుకొండ, కొండవీడు, కచ్చర్లకోట దుర్గాలను వారికి అప్పజెప్పాడు.

1589 నాటికి గోల్కొండ మహమ్మద్‌కులీ కర్నూలు, కడపలను ఆక్రమించాడు. 1593 నాటికి బీజాపూరు సుల్తాను, మైసూరు, తంజావూరు, మదురైలో అక్కడి నాయక సామంతరాజులు తమ స్వతంత్ర ప్రతిపత్తి చాటుకొన్నారు.

ఈ మధ్యకాలంలో సదాశివరాయల మరణం, తిరుమల రాయలు పెనుగొండ రాజు కావడం, ఆయన తర్వాత అతని రెండవ కొడుకు రెండవ శ్రీరంగరాయలు రాజ్యానికి వచ్చి 1578 నాటికి రాజధానిని చంద్రగిరికి మార్చడం జరిగాయి. అతని తర్వాత అతని తమ్ముడు వెంకటరాయలు రాజ్యానికి వచ్చి 1614లో చనిపోయాడు. అతనికి సంతానం లేకపోవడంతో రాజ్యంలో అరాచకం మొదలైంది. కొంతకాలం రామరాయలు, ఆ తర్వాత వెంకటరాయలు, రామరాయలు, మాధవరాయలు, రంగరాయలు... అలా దక్షిణ భారతదేశమంతటా పాలించిన విజయనగర రాజుల ప్రాభవం చివరికి చిత్తూరు, వెల్లూరు, చెంగల్పట్టుకి, దక్షిణ ఆర్కాట్‌లో కొంత భాగానికి పరిమితమై, ఎప్పుడూ గోల్కొండ, బీజపూర్ సుల్తానులతో యుద్ధాలు చేస్తూ, సామంతులు మాట వినక, చివరకు ఢిల్లీ సుల్తాన్ షాజహాన్‌ని అతని కొడుకైన 'దక్కన్ వైస్రాయ్' ఔరంగజేబు ద్వారా ప్రాధేయపడే హేయమైన స్థితికి జారిపోయింది.

తిరుమల రాయలు కాలంలోనే సంపంగి ప్రాకారంలోని తిరుమల రాయ మండప నిర్మాణం జరిగింది. దీనినే ఊంజల్ మండపం అని కూడా అంటారు. మంచి శిల్ప కళా నైపుణ్యంతో పెద్ద పెద్ద స్తంభాలతో ఏనుగు తలపై గుర్రం, ఆ గుర్రంపై స్వారీ చేస్తున్న యోధుడు విగ్రహాలతో చాలా చాతుర్యంగా చెక్కిన శిల్పాలు ఈ నాటికీ చెక్కుచెదరకుండా ఉన్నాయి. ఈసారి తిరుమల ఆలయానికి వెళ్లినప్పుడు చూడవచ్చు. బ్రహ్మోత్సవాలలో స్వామి వారి ఉత్సవరుల ఆస్థానం ఈ తిరుమల రాయమండపంలోనే వైభవంగా జరుగుతుంది. ఆ తర్వాత ఒక శతాబ్దికాలం విజయనగర రాజ్యం ఛిన్నాభిన్నమై సుల్తానుల ఆక్రమణలోకి వచ్చి – చివరకు చంద్రగిరి మాత్రం మిగిలి – అది కూడా చిట్టచివరికి ఆర్కాటు నవాబుకు స్వాధీనమయింది.

అలా ఆ రాజకీయ అనిశ్చిత పరిస్థితుల ప్రభావం తిరుమల ఆలయం మీద కూడా పడింది. సదాశివరాయలు, రామరాజు, తిరుమల రాయల వంటి వారు ఇచ్చిన దేవదేయాలు, శిలాశాసనాలు వారు రాజులు కాకముందు, సామంతులు లేదా ప్రాంత అధికారులుగా వున్నప్పుడు చేసిన దేవదేయాలే. తళ్లికోట యుద్ధం తర్వాత శతాబ్దికాలంలో ఆలయంలో చెక్కబడిన శాసనాలు చాలా తక్కువే... ఒకవేళ

ఏవన్నావున్నా అవి జియ్యంగార్లు, ఇతర అధికారులు చేసిన శాసనాలే. అందులో రాజులపేర్లు గాని, వారి ప్రాభవ వర్ణనలు కానీ లేవు. ఎందుకంటే దేశానికి రాజెవరో నిశ్చయంగా తెలియని పరిస్థితి. ఆలయంలోని ఆచార్య పురుషులు, జియ్యంగార్లు లేదా ధనికులైన స్వామి భక్తులు చేసిన దేవదేయాలు వున్నాయి. అన్నీ తెలుగులో చెక్కబడినవి.

కొండపైన ఆలయంలో కాక, చాలా శాసనాలు, తిరుపతి గోవింద రాజుల ఆలయంలో చెక్కబడినవి... రాజకీయ అనిశ్చిత పరిస్థితుల ప్రభావంతో వీరి దృష్టి తిరుమల నుండి తిరుపతికి మారిందనవచ్చు. కాని ఈ రాజులు స్వామిభక్తులు కాదనటానికి లేదు. వెంకటపతి రాయలు, తిరుమల కొండ మీద తన పట్టాభిషేకం చేసుకొన్నాడు. చంద్రగిరిని రాజధానిగా చేసుకొని, తిరుమల తరచూ స్వామి దర్శనానికి వచ్చేవాడు. ఆ రోజుల్లో "శ్రీవేంకటేశ్వరాయ నమః" అని బంగారునాణాలు ముద్రించి, తనకు శ్రీనివాసుని మీద భక్తి ప్రకటించుకొన్నాడు.

ఈయన తిరుమల ఆలయ ప్రాకారంలో తనది, తన తండ్రి తిరుమల రాయనిది, తల్లి వెంగళాంబది విగ్రహాలు చెక్కించి పెట్టాడు.

రాజులు యుద్ధాలలో కొట్టుమిట్టాడుతున్నప్పుడు, గ్రామాల్లో కూడా అనిశ్చిత పరిస్థితులు, అభివృద్ధి మీద దృష్టి లేకపోవడం, నీటిపారుదల వనరులపై శ్రద్ధ చూపలేకపోవడం, పంటలు దెబ్బతినడం, దీనివలన తిరుమల ఆలయానికి ఆదాయం తగ్గడం, కొండపై నైవేద్యాలు తగ్గి యాత్రికులకు, భోజన వసతులు, ఇతర సదుపాయాలు అంతంత మాత్రం కావడంతో కొంత ఇబ్బంది కలిగేది. 1616 నాటికి పరిస్థితులు చాలా దెబ్బతింటే రామిరాజయ్య అవసరం (సంధి నైవేద్యం) గా 200 గంగాళాల ప్రసాద నైవేద్యానికి ఏర్పాట్లు జరిగాయి. స్థానత్తారులభాగాల నుండి కూడా రామానుజ కూటాలకు నైవేద్యం పంపడం మొదలైంది.

అప్పటికి ఒక అర్ధ శతాబ్దంగా తిరుపతిలోని రామానుజ కూటం - కొండకు వెళ్లే భక్తులకు రోజూ 2000 మందికి ఉచితంగా భోజనాలు పెట్టే స్థాయి నుండి, 1616 తర్వాత అన్నదానం జరిగేదో లేదో తెలియని పరిస్థితికి వచ్చింది. తర్వాత కాలంలో చేసిన ఉభయాలు, దేవదేయాలు, తిరుపతిలో జరిగాయి కాని కొండ మీద కాదు. తిరుపతి స్థానికులకు కొంత మేలు జరిగిందే కాని, కొండకు వెళ్లే యాత్రికులకు కాదేమోననిపిస్తుంది.

1606-1607 నాటికి, పూర్తి గ్రామాలు దేవదేయంగా ఇచ్చే సంప్రదాయం నిలిచిపోయింది. ఆ ప్రాంతంలో జరిగిన దేవదేయాలు - నీటి పారుదల అభివృద్ధికి, మరమ్మత్తులకు చేసినవే. ఆలయ స్థానత్తారులు, దాతలను, ఈ మరమ్మత్తులు చేయించమని కోరి వుండవచ్చు.

అంతకుముందు విజయనగర సామ్రాజ్యంలో చాలాచోట్ల, తిరుపతికి దూరంగా కూడా చాలా గ్రామాలు ఆలయ దేవదేయాలుగా ఉండేవి. రాను రాను దూర ప్రాంతాలలో వున్న దేవదేయ గ్రామాలనుండి, అనిశ్చిత పరిస్థితుల వలన, ఆలయానికి ఆదాయం రావడం లేదు. స్థానత్తారులు కూడా తిరుపతి, చంద్రగిరి లాంటి దగ్గర ప్రదేశాల మీద మాత్రం కొంత శ్రద్ధచూపగలిగేవారు. ఉన్న 200 గ్రామాలలో అలా చాలా గ్రామాల ఆదాయం పోయింది. దగ్గరున్న గ్రామాలు కూడా, తరచు జరుగుతున్న యుద్ధాలు, అలజడులు కారణంగా ఇతర ఖర్చులు పెరగడంతో, వ్యవసాయపు పెట్టుబడులు పడిపోయి, నీటివనరులు లేక పంటలు పాడై, పండేవి కావు. పండినా పరిపాలన లోపాలవల్ల, నిధులు సక్రమంగా ఆలయానికి చేరేవి కావు. ఈ శతాబ్ది మంతా దాదాపు ఇలాటి పరిస్థితే.

1665 సంవత్సరం నాటికి ఆ కొంచెం మిగిలిన విజయనగర రాజ్యం కూడా కష్టాల్లో పడింది. అది శ్రీరంగరాయలు పరిపాలిస్తున్న కాలం. రాజ్యంలో చాలా భాగం గోల్కొండ సుల్తానులకు, బీజాపూరు సుల్తానులకు అధీనమయింది. ఇతను పాలిస్తున్న రాజ్యభాగం కూడా 1656లో షాజహాను గోల్కొండ సైన్యాధికారి మీరు జుమ్లా అధీనంలోకి వచ్చింది. తర్వాత శ్రీరంగరాయలు కొంత కోలుకున్నా, మీరు జుమ్లా నుండి నెక్నామ్‌ఖానుకు అధికారం దక్కి అతను నవాబు అయినప్పుడు, అతను 40,000 సైన్యంతో దక్షిణానికి దండయాత్రకు వచ్చాడు. వారి వారి సైన్యాలున్న ఇంగ్లీషు, డచ్చివారు కూడా ఈ నెక్నామ్‌ఖానుకు నజరానాలు చెల్లించవలసి వచ్చింది. నెక్నామ్‌ఖాను ఏజంటుగా చిన్నంపల్లి మీర్జా 1668 కల్లా తిరుపతికి వచ్చి మకాం వేశాడు. ఈ లోపల శ్రీరంగరాయలు 1664/65 లో తిరుమలకు వచ్చి, తనను, తన రాజ్యాన్ని కాపాడమని శ్రీనివాసుణ్ణి వేడుకొన్నట్లు తెలుస్తుంది. అతను చేసిన 1665 నాటి శిలాశాసనమే విజయనగరం రాజులకు ఆలయంతో చివరి సంబంధం.

300 సంవత్సరాల సువర్ణ చరిత్ర అలా దీనంగా ముగిసింది.

బీజాపూరు, గోల్కొండ షియా ముస్లింల ప్రాభవం ఈ ప్రాంతంపై ఎంతో కాలం నిలువలేదు. ఔరంగజేబు చక్రవర్తి అయ్యాక దక్షిణ దేశం అంతా తన పూర్తి అధీనంలోకి తెచ్చుకోవాలన్న ప్రయత్నాలు చేశాడు. అతను కర్ణాటకను జయించినా, నిలుపుకోలేక పోయాడు. ఒకవైపు మరాఠాలు షాజీ నేతృత్వంలో బీజాపూరు నవాబుకు సహాయంగా నిలిస్తే, ఏకంగా తంజావూరులో మరాఠాలు తమ రాజ్యాన్నే స్థాపించారు. ఆ తర్వాత షాజీ కొడుకు శివాజీ పూర్తి కర్ణాటకను తన ప్రాభవంలోకి తెచ్చుకొనే ప్రయత్నం చేసి, ఔరంగజేబు ఆశలు అడియాశలు చేశాడు.

ఇలా ముస్లింలు, మరాఠాలు ఒకరినొకరు దెబ్బతీస్తున్న సమయంలో, నెమ్మదిగా ఇంగ్లీషువారు వారి ప్రాభవం పెంచుకొంటూ వచ్చారు.

ఇలా ఈ పరిణామాలన్నీ తిరుమల ఆలయం మీద ప్రభావం చూపాయి.

★ ★ ★

58. దేవుణ్ణి తిట్టిపోసిన మహాభక్తుడు!

ఎంత నాస్తికుడు కూడా తిట్టలేనంత ఘోరంగా ఆస్తికుడైన ఒక కవి (భక్తుడు) తిరుమల శ్రీనివాసుణ్ణి తిట్టిపోశాడు.

ఒక్కోసారి మహాభక్తులకు సయితం కష్టాలు వస్తే, దేవుణ్ణి తిట్టుకోవడం సహజం. కాని శ్రీనివాసుడి భక్తుడైన ఈ కవిపుంగవుడు (కూర్మనాథ కవి?) మాత్రం దేవుడికి కష్టాలు వస్తే దేవుడే కాపాడుకోలేకపోతున్నాడని బాధతో, ఆవేదనతో, ఆగ్రహంతో "అసమర్థదేవుడి" మీద తిట్టుకవిత్వం సృష్టించాడు.

అది కూడా శ్రీవేంకటేశ్వర స్వామి మీదే!

★ ★ ★

ఆ రోజుల్లో ఒక కవి తెలుగులో రాసిన 'వేంకటాచల విహార శతకం' గోల్కొండ నవాబులు వారి సైన్యాలు చేసిన విధ్వంసకాండను కళ్లకు కట్టినట్లు చూపిస్తుంది. సుల్తాను అబ్దుల్లా కుతుబ్ షా ఆశ్వికసైన్యం చేసిన విధ్వంసకాండను వివరిస్తుంది.

సీసపద్యాలు తేటగీత ముగింపుతో 98 మాత్రమే లభ్యమయ్యాయి. చివరి మకుటం 'శత్రుసంహార వేంకటాచలవిహార'తో అంతమయ్యే ఈ పద్యాలలో, ఆనాటి మానభంగాలు, హిందూదేవాలయాల నాశనం, విగ్రహాల విధ్వంసం, మారణహోమం, గ్రామాలకు, గ్రామాలు తగలబెట్టబడటం, ప్రజల ఇక్కట్లు... చెప్తూ... తిరుమల శ్రీనివాసుని నిందాస్తుతి చేస్తాయి.

గాయత్రిని వదిలి, ముస్లింల 'కర్తర' మంత్రాలు ఎలా చెప్పాలి? నామం పెట్టుకోకుండా ఎలా ఉండాలి? ఇంత అన్యాయం జరుగుతుంటే నువ్వేం చేస్తున్నావు? నాలాంటి బ్రాహ్మణుడు నీకు ఉన్న చక్రమే ఉంటే ఏం చేసేవాడో? ఎందుకు ఉదాసీనంగా ఉన్నావు స్వామీ - అని వాపోతాడు. చెవులు తమిళపాశురాలు వినాలి కానీ, ముస్లింల మంత్రాలు వినకూడదు కదా! - అంటూ ఆవేదన వ్యక్తం చేస్తాడు.

నెల్లూరు, పాలూరు, పెల్లకూరు, రావూరు, ఎలా ముస్లింల వశమయ్యాయో, నేలటూరు, తాళ్లపాక, మిన్నూరు, ఊటకూరు, మాముండూరు, కాళహస్తి ఎలా నాశనమయ్యాయో, ప్రతి దేవాలయం ఎలా విధ్వంసమయిందో, ప్రతి పుష్కరిణి మల మూత్రాలతో ఎలా మలినమయిందో, వేదపండితులు, అర్చకుల శిఖలు ఎలా పీకేశారో వర్ణిస్తాడు.

ఆవేదన, ఆవేశం, ఆగ్రహం పరవళ్లు తొక్కే ఆ సాహిత్యంలో ఒకచోట, "నీవద్దకు వచ్చి, కృష్ణదేవరాయలు ఇచ్చిన సొమ్ములు ఆ ముసల్మానులు తీసుకువెళ్లడం ఎలా చూడగలను? నీ హుండీలో వేసిన నాణాలు వారు కాజేయడం ఎలా సహించగలను?" అని రోదిస్తాడు.

అలా ముస్లిం సైన్యం అశ్వవాహనాలెక్కి గ్రామాల్లో వర్తకుల భార్యలను, కూతుళ్లను చెరచి, నిర్బంధంగా బలవంతంగా వారి ధనాన్ని కొల్లగొడుతున్నప్పుడు "నీ సోదరుడు గోవిందరాజులు తిరుపతిలో నిద్రపోతున్నాడా?" అని ప్రశ్నించాడు.

"గోవిందరాజుల ఆయుధాలు మొక్కబోయాయా? ఆలయానికి సొమ్ములేక చక్రాన్ని కుదువపెట్టాడేమో! వయస్సు మళ్లిన తాను యుద్ధం చేయలేనని ఊరుకొన్నాడా? జీతాలు లేక పని మానుకొన్న ఆలయ ఉద్యోగుల సహాయం లేదని ఆగిపోయాడా?" అని వెటకారంగా అంటూనే గోవిందరాజస్వామిని కూడా నిందిస్తాడు.

"ఆలయాల్లోని కంచు రాగి పాత్రలను ఫిరంగుల గుండ్లుగానూ, ఆలయాల్లోని సాలగ్రామాలను బుల్లెట్లుగానూ వాడుతున్నారు. దేవాలయాల్లో అమ్మవార్లు తమ ఆభరణాలను గత కొద్దిరోజులుగా వేసుకోవడంలేదు. ముస్లింలకు భయపడేకదా? ఆ తురుష్కులను తరిమెయ్యలేవా?

"రక్తం, మద్యం తాగిన మైకంతో ఈ ముస్లిం నాయకులు జియ్యంగార్లను కొడితే వారు పారిపోవడం ఎలా చూడటం? అర్చకులు పారిపోతున్నారు. తేలుకుట్టినా అరవలేని పరిస్థితి ఆలయపారుపత్తేదారుది. ఆడవాళ్లు దాక్కొంటున్నారు, ఆళ్వారులు పరుగులు తీస్తున్నారు. ఆలయాల్లో అందరినీ బూతులు తిడుతూ చిత్రహింస చేస్తుంటే ఎలా చూడటం? చేతకాని వానిలా ఉండిపోయిన గోవిందరాజులను ఏమనగలం?"

హిందూ ఆలయాలలో తురుష్కుల దోపిడి ఎలా సాగిందో దర్పణం పట్టే పద్యాల్లో... "యవనులు గర్భగృహాల్లోకి వచ్చి, నీవొంటిపైని, నీ నాంచారుల వొంటిపైని ఆభరణాలు

వలుచుకుపోతుంటే ఎలా ఊరికే ఉన్నావయ్యా?" అని తిరుపతి గోవిందరాజుల గుడిపైన, తిరుచానూరు అమ్మవారి గుడిపైన జరిగిన దాడులను ప్రస్తావిస్తాడు.

ఉద్రేకం, ఏమీ చేయలేని నిస్సహాయత, నమ్ముకున్న దేవుడు కూడా నిస్సహాయుడైపోయాడు అన్న బెంగ, బాధ కలగలసిన కవిత్వంలో ఆ కవి ఇంకా ఇలా స్వామి వారిని నిలదీశాడు:

"నిన్ను వడ్డికాసులవాడి వంటారే! నీకు మొక్కుకున్న దాంట్లో పైసా కూడా వదిలిపెట్టవే! తిన్న పళ్లాలు కూడా తోమనివాడవు (ఓడుకుండ గురించి – అన్నమయ్య 'తోమని పళ్లాలవాడు' అంటాడే ఆ సందర్భం). ఇలా పిసినారిలా డబ్బంతా కూడబెట్టి, ఈ తురకలకిస్తే, భక్తులు సహిస్తారా? తిరుపతికి వచ్చి, నీ వెయ్యికాళ్ల మండపాలు ఆక్రమించి నీ భక్తులను, నీ ఆలయాలనూ కొల్లగొడుతూంటే, ఆ తురకలను తన్ని తరిమి వేయాల్సిన బాధ్యత నీదికాదా? నీ ఆలయాలను బాబయ్య (ముస్లిం అధికారి) గోరీలు చేస్తుంటే, గర్భగృహాల్లో చెత్తవేస్తుంటే, చూస్తూ వూరుకొంటావా?

"యవన కాలాంతకుల బారి నుండి జీర్ణ కర్ణాట లక్ష్మిని ఉద్ధరించలేవా? మఠాల్లో కమండలాలు లేవు. యవనుల బూతుమాటలే తప్ప, వేదమంత్రాలు లేవు. ఎలా భరిస్తున్నావయ్యా? వీరు వచ్చి వరాహ పుష్కరిణిలో రక్తసిక్తమైన ఆయుధాలు కడుగుకుంటుంటే ఎలా చూస్తూ ఊరుకొన్నావు? ఊరుకోవడం బాగుందా? వందల వేల గోవులను చంపుతుంటే చూస్తూ ఎలా ఉన్నావయ్యా? గోవులను కాపాడిన కృష్ణుడవు కదా? ద్రౌపది మానాన్ని కాపాడిన నీవు వేల స్త్రీల మానభంగం జరుగుతుంటే ఎలా ఊరుకోగలిగావు?

"సిద్ధవట్టంలో కామాక్షి అమ్మ ముఖాన్ని చెక్కేశారే! సిద్ధలింగుని గర్భగృహంనుండి పీకి పారేశారే! చెన్నకేశవుని పెన్నలో పారేశారే! ఒక్క ఒంటిమిట్ట రఘునాథుని తప్ప అందరు దేవుళ్లనూ ధ్వంసం చేశారే!!

"రామేశ్వరంలో స్వామిని ఇసుకలో పాతేశారే! జంబుకేశ్వరంలో, చిదంబరంలో, శ్రీరంగంలో... ఇన్ని అత్యాచారాలు జరుగుతుంటే కొండదిగి రావేమయ్యా? తురకలను చంపడం నీవల్ల కాదా? అంత చేతకానివాడివైపోయావా?

"మంగళగిరి పానకాలస్వామి పానకం తాగడంలో, అహోబిల నారసింహుడు లక్ష్మీ విలాసంలో, పురుషోత్తముడు ప్రసాదాలు ఆరగించడంలో, ధర్మపురి దేవుడు

ఆధ్యాత్మ చింతనలో మునిగితేలుతున్నారు. వీరందరు కూడా ఇస్లాం మతాన్ని స్వీకరించేశారా? వారంటే ఉత్తరాదివారు. దక్షిణాన ముస్లింరాజ్యంలో ఉన్న - సర్వశక్తిమంతుడివి అని నీ భక్తులంతా నమ్ముతున్న - నువ్వుకూడా ఏమీ చేయలేవా?

"కావేరి రంగడి ప్రసాద వైభవం, కంచి వరదప్ప గరుడసేవ, పెనుగొండ రామభద్రుని వైవిధ్యం, గండికోట మాధవుని గాంభీర్యం, కడప వేంకటేశ్వరుని గొప్పదనం, కాళహస్తీశ్వరుని ప్రాశస్త్యం, ఉదయగిరి రఘువీరుని సౌభాగ్యం, శ్రీశైల మల్లికార్జునుని మహిమ - అన్నీపోయాయి. మిగిలింది నీవొక్కడవే! ఈనాటికీ నీ ఆదాయం కాని, ప్రసాదాలు కాని, వైభవం కాని అలానే ఉన్నాయి... ఇలాగే చూస్తూ ఊరుకున్నావంటే, ఆ ఫకీర్లు నీ నైవేద్యాల్ని కూడా కాజేస్తారు, నీ ఆభరణాలు, హుండీలు కొల్లగొడతారు.

"ఇప్పటికైనా కళ్లు తెరవ్వయ్యా స్వామీ! లే, లేచి, ఆ తురుష్కులను నాశనం చెయ్యి..." (ఇలా సాగుతుంది)

చివరి చివరి పద్యాల్లో ఇంకా ఘాటుగా రాస్తాడు:

"...ఇంకెంతో సేపులేదు.

...తురుష్కులు తిరుపతి చేరారు.

...ఊరిని, గుడులను కొల్లగొడుతున్నారు.

...గర్భగృహాల్లో చెత్తచెదారాలు వేస్తున్నారు.

...అర్చకులను హింసిస్తున్నారు.

...జియ్యంగార్లను చావబాదుతున్నారు.

...అయినా ఇంకా నిద్రపోతున్నావా స్వామీ...?"

ఇంత జరిగాక, ఈ కవి స్వామి వారికి క్షమాపణ చెప్పుకొంటాడు.

"నిన్ను ఏమేమో అన్నాను, చేతకానివాడివన్నాను, నిర్దయుడవన్నాను, ఇంకెన్నో అన్నాను. ఇక్కడ జరుగుతున్న హింసాకాండ, హిందువులకు జరుగుతున్న మారణకాండ, ఆలయాల్లో జరుగుతున్న రాక్షసకాండ చూడలేక నీ సహాయం కోసం అలా అన్నాను. నీ సంస్కృతీసంప్రదాయాలు రక్షించాల్సిన బాధ్యత నీదని చెప్పడానికే చేశాను. నీ లీలలు మా కెలా తెలుస్తాయి? నా తప్పులు క్షమించు స్వామీ!" అంటూ పూర్తిచేస్తాడు శతకాన్ని.

ఈ శతకం విశేషానికి దర్పణం పట్టే కొన్ని పద్యాలు చూద్దాం:

సీ॥ వడిగుళ్లు సొచ్చి, దేవుళ్ల బద్దలు చేసి
దట్టించి తేజీలు గట్టునప్పుడు
జిగురుపాలకటంచు చిగురించు రావిమ్రాకులు
నజ్జనజ్జుగా కొట్టునప్పుడు
గురుసార్వభౌముల గోడు పోసుక పట్టె
నామములు మొదలంట నాకునపుడు
గద్దించి వెనవైదికపు బాపనయ్యల
పిల్లజుట్లూడంగ బెరకునపుడు

సెక్కెమా నీకు దురకల జక్కుసేయ
విన్నవించితి నా వెఱ్ఱివిన్నపంబు
పరగమా చిత్తమిదె నాదు భాగ్యమౌర
శత్రుసంహార వేంకటాచల విహార!

సీ॥ పొట్టెెల్లగతి బట్టి బోడిసన్న్యాసుల
ఢీయని తాకులాడించునొకడు
సోమయాజుల బ్రహ్మసూత్రముల్ ద్రెంచి
సింగాణివిండ్లకు నల్లెగట్టునొకడు
ఖూబ్ ఖోడాయంచు గుడికీలుగుఱ్ఱము
నెక్కి థేయని తంటెత్తునొకడు
పైకాలుగొమ్మని జల్మిగోమటివారి
చెలువ పైబడి బూతుసేయు నొకడు

యవనసమ్మర్ద దుర్దినంబైన దిగువ
తిరుపతిని జూడుమిటువంటి తరిని
నిదుర పోవుచున్నాడు మీయన్న లేవలేక
శత్రుసంహార వేంకటాచలవిహార!

సీ॥ మామిడి క్రింద సోమరిపోతు శ్రీభాష్య
కారులకేల సంగరము గొదువ
అలమేలు మంగ సొమ్ములు పెట్టియలు కాచు
కొనియుండుటేచాలు హనుమనికి
ఠీవికి బింకమంటి విరుల్పమర్పించి
తెరుగాటు కరిగెను-గురవ నంబి
చెంచు మితారితో బంచ బాణక్రీడ
లోలుడయ్యెను కప్పడాల నృహరి

నీకు మది కోపమింతయు లేకపోయె
బోయ గాకేమి తొండమాభూమిపాలు
దున్న నింతకు దురకల మన్ని కొనడె
శత్రుసంహార వేంకటాచల విహార!

ఈ కవి తన వివరాలను తన శతకంలో ఎక్కడా ఇవ్వలేదు. నిశ్చయంగా చెప్పడానికి ఆధారాలు లేవు.

కాని విద్వాన్ వేదం వేంకటకృష్ణ శర్మగారు తమ 'శతకవాఙ్మయ సర్వస్వము' అనే పుస్తకంలో, ఈ "శత్రు సంహార శతకము లేదా వేంకటాచల విహారశతకము" రచించినది, 18వ శతాబ్దపు గోగులపాటి కూర్మనాథకవి అని నిర్ణయించారు.

ఈ శతకంలో గోల్కొండ అబ్దుల్లా కుతుబ్‌షా చేసిన అత్యాచారాలు కళ్లకు కట్టినట్లు వర్ణించబడ్డాయి. ఆలయ విధ్వంసం, విగ్రహ నాశనం, హిందువుల ఆత్మగౌరవాన్ని మనఃస్థైర్యాన్ని పెద్ద ఎత్తున దెబ్బతీశాయి.

తిరుపతి గోవిందరాజుల గుడిని, విగ్రహంతో సహా ధ్వంసం చేశారు. మిగతా గుడులు, అచ్యుత రాయల గుడి గ్రామంతో సహా తుడిచిపెట్టుకుపోయాయి. తిరుచానూరు అమ్మవారి గుడి విగ్రహంతో సహా నాశనం అయింది.

ఈ మారణకాండ అంతా 1656-1668 మధ్యకాలంలో జరిగి ఉండాలి.

★ ★ ★

59. సైనిక, రాజకీయ కేంద్రం తిరుపతి

కర్ణాటక ప్రాంతం గోల్కొండ నవాబుల పాలనలో ఉన్నప్పుడు, తిరుపతి కేంద్రస్థానంగా వారి పరిపాలన జరిగేది. మొదట తిరుపతిలో చిన్నపల్లి మీర్జా అనే అతను దక్కను నవాబు తరఫున అధికారం చలాయించేవాడు. అతని దగ్గర, ఆ కాలంలో దక్కను నవాబుకు చాలా సన్నిహితులు, నమ్మకస్తులైన అధికారులుగా గోల్కొండలో అక్కన్న, మాదన్న ఉండేవారు.

తిరుపతిని సామంతరాజధానిగా చేసి, ఈ తీరప్రాంతాల అధికారులందరూ ఈ తిరుపతి అధికారి మీర్జా అధీనంలో ఉండి పనిచేసేటట్లు ఏర్పాటు జరిగింది. మీర్జాను ఆ ప్రాంతపు గవర్నరుగా భావించవచ్చు.

ఆ కాలంలో ఈస్టిండియా కంపెనీవారు మద్రాసులో వారి కార్యక్రమాలు ముమ్మరం చేసి, దక్షిణాదిన వ్యాపార విస్తరణ చేయాలన్న తలంపుతో, తమ ప్రతినిధిని తిరుపతిలో చిన్నపల్లి మీర్జా (గవర్నరు) ను కలవడానికి పంపుతారు...

ఈ విషయాల్లో అంత అధికారం లేని మీర్జా, ఆ ప్రతినిధిని గోల్కొండకు వెళ్లి నవాబు నెక్నామ్‌ఖానుని కలవమని ఆదేశిస్తాడు. నెక్నామ్ ఖానుని కలిసి తిరుపతి తిరిగి వచ్చేటప్పటికి తిరుపతిలో అక్కన్న అధికార పర్యటనలో ఉంటాడు.

ఈ అక్కన్నను ఆ ఆంగ్లేయాధికారి కలిసి వ్యవహారం చేసినట్లు రికార్డు వుంది.

అక్కన్న వారం రోజులు కొండమీద వున్నట్లు, స్వామివారి సేవ చేసినట్లు, కొన్ని దేవదేయాలు చేసినట్లు శాసనాలున్నాయి.

తర్వాత 1681లో అక్కన్నమాదన్నలిద్దరు తిరుపతికి వచ్చి చాలా రోజులున్నట్లు, అప్పుడు స్వామి దర్శనానికి కొండకు వెళ్లి దేవదేయాలు చేసినట్లు శాసనాలున్నాయి. ఆ కాలంలో ఈ శాసనాలు తెలుగు భాషలో అందునా గ్రామీణభాషలో ఉండటం విశేషం. ఇతర శాసనాలలో ఉన్నట్లు రాజుగారి ప్రసక్తి గాని, ప్రశస్తి గాని లేవు.

ఎందుకంటే ఆ ప్రాంతానికి నిజమైన రాజు ఎవరో తెలియదు. ఆ ప్రాంతం గోల్కొండ నవాబుల కింద ఉన్నా, గోల్కొండ, ఢిల్లీ సంబంధాల దృష్ట్యా - రాజు ప్రసక్తి రాలేదు.

చేసిన దేవదేయం శుద్ధాన్న అలంకారం కోసరమే. అంటే, అన్నము, పెసరపప్పు, పెరుగు స్వామివారికి, అమ్మవారికి పాయసము, పచ్చడి, దోశపడి. ఈ శాసనంలో ప్రసాదాలు ఎవరెవరికి భాగాలుగా పంచిపెట్టాలో స్పష్టంగా దేవదేయం చేసిన దాతలే నిర్ణయం చేశారు. అదివరకు లాగా స్థానత్తారులకు, పెద్ద అధికారులకు పెద్ద భాగాలు తీసేశారు. ఆలయంలో నిజంగా కష్టపడి పనిచేసేవారికి నైవేద్యంలో భాగమిచ్చారు. వంటకోసం వంటచెరకు కొట్టి తెచ్చేవారికి (సింగముఠై), పనిముఠై (ఆలయం ప్రజాపనులు), ఇద్దరు జియ్యంగార్లు, స్థానాలవారు, పడికావలి వుత్తర పారుపత్తేదారు, అధ్యాపకంవారు, దేశాయిలకు ఇచ్చి గోష్ఠికి వచ్చిన యాత్రికులకు వినియోగం చేయడానికి, వీరితోపాటు స్థలశ్రీవైష్ణవులకు కొంత వినియోగం చేశారు.

ప్రసాద వితరణలో పాత పద్ధతుల స్థానే, ఈ కొత్త పద్ధతి ఈ అక్కన్నమాదన్నల శుద్ధాన్న సంధితో మొదలైంది. ఈ దేవదేయం అదివరకులాగ స్థానత్తారులకు అందజేయకుండా, కొత్తగా ఆలయంలో నియోగింపబడిన స్థానాల వారికి (Managers of Tirumala Tirupati temples) ఇచ్చారు. ఈ దేవదేయం ధనం రూపంలో కాకుండా బంగారు కంటె రూపంలో - ఈ కంటెను కూడా ఆలయంలో అధికారులకు ఇవ్వకుండా, ఒక కుమ్రపాకం తిమ్మన్న అయ్యవారు అనే ఆయన అధీనంలో వుంచి, ఆయన ఈ నైవేద్యాలు చేయడానికి కావలసిన సరుకులు ఆలయానికి ఇచ్చేట్లు ఏర్పాటు చేశారు. ఇచ్చిన సామానులతో దేవదేయ సేవ చేయించే బాధ్యత స్థానాలవారిది. అలా సంవత్సరంలో ప్రతిరోజూ నైవేద్యం చేసే సేవ దేవదేయంది.

ఈ కంటె 25 వరహాల బరువు - 525 శ్రీరంగరాజనగ విలువ కలిగిందిట. దాతపేరు 'రాజశ్రీ శివరాజ రామచంద్ర ఎడమలేరు దబిర్యా, శ్రీవత్సగోత్రం, ఆశ్వలాయన సూత్రం, ఋక్ శాఖీయులు అని.

ఈ నైవేద్య ప్రసాదం, మహారాజా శ్రీ సుద్ధ భానూజి పంతులుగారు చేసిన దేవదేయ నైవేద్యం అయిన వెంటనే చేయాలని కూడా శాసనంలో వుంది. ఈ శాసనాన్ని బట్టి తెలిసేది, పూర్వపు స్థానత్తారులు స్థానాలవారుగా మారారని, పన్నెండుమంది స్థానత్తారుల బదులు, ఇప్పుడు నలుగురే స్థానాలవారున్నారని, ఆ పన్నెండుమంది, కొంతకాలం క్రింద ఆరుగురై, ఈ శాసనం నాటికి నలుగురైనారని తెలుస్తుంది. ఈ కొత్త స్థానాల వారందరూ తెలుగువారు.

ఈ కాలపు శాసనాలలో ఆలయంలో తెలుగువారి ప్రాబల్యం పెరిగినట్లు తెలుస్తుంది. స్వస్తిశ్రీ అనికాక - శ్రీవేంకటేశ శుభమస్తు - అని శాసనం మొదలుకావడం, నిర్వాహకులు - అంటే స్థానత్తారులు కాకుండా దాతలే ప్రసాదవితరణ బాధ్యత కూడా తీసుకుని, ఆలయంలో శరీరకష్టం చేసేవారికి నైవేద్యంలో భాగాలు కల్పించడం, స్థానత్తారులు, స్థానాలవార్లై, వారికి నామమాత్ర నైవేద్య భాగం ఇవ్వడం, దేశాంతరులకు ప్రసాదంలో భాగం లభించడం, పెరియ కోయిల్ కెల్వి ఇలమేకొయిల్ కెల్విగా పిలువబడే జియ్యర్లు, పెద్ద జియ్యంగారు చిన్న జియ్యంగార్లుగా పిలువబడటం, ఉత్తర పారాపత్యం అనే కొత్త అధికారి ఆలయంలోకి రావడం, దాతకు ఇవ్వబడే నాలుగవ వంతు పోయి, నామమాత్ర భాగం దాతకు రావడం, ఆలయంలో పనిచేసే అధ్యాపకం వారికి, శ్రీవైష్ణవులకు ప్రసాదంలో భాగం పంచడం. పూర్వం ఉండే తిరునిన్ర ఉడయార్ల (ఆలయ లేఖకులు) కి ప్రసాదంలో భాగస్థులుగా గాని, స్థానాలవారుగా కాని లేకుండా పోవడం వంటి చాలా మార్పులు ప్రసాద వితరణలో జరిగాయి.

నైవేద్యాన్ని పిలిచే విధానమే ఈ శాసనాలలో మారిపోయింది. పురాతన కాలం నుండి, అన్న నైవేద్యాలకు 'తిరుప్పొనకం' అని, 'సంది తిరుప్పోనకం' అని పేరు. గత ఆరు శతాబ్దాలుగా వాడుతున్న పదాలు ఇవి. ఆ పేర్లు మార్చి, ఈ శాసనంలో 'అవసరం' అనే పదం వాడారు. 'అవసు' అంటే సంస్కృతంలో 'అన్నం' అని అర్థం. తెలుగులో అదే 'అవసరం' అయింది.

అళియ రామరాజు కాలంలో చేసిన నైవేద్య దేవదేయాలు ఈ కాలం నాటికి నిలిచిపోయి, ఆలయంలో పనిచేసే వారికి చాలామందికి భోజనానికి ఇబ్బందిగా ఉండడంతో, ఆ అవసరాలు తీర్చడానికి ఈ 'అవసర నైవేద్యాలను' ప్రవేశపెట్టి - ఆలయంలో పనిచేసే అందరికీ వారివారి అవసరాలను బట్టి, ప్రసాదం అందేట్లు చేయడం జరిగింది.

★ ★ ★

అలా గోల్కొండ నవాబులు తిరుపతి కేంద్రంగా 1688 వరకు పాలించారు- ఔరంగజేబు వారిని ఓడించి, వారి రాజ్యాన్ని నాశనం చేసేవరకూ.

అదే రోజుల్లో ఈస్టిండియా కంపెనీ వారు మద్రాసు నుండి ఒక దూతను తిరుపతిలో గల గోల్కొండ వైస్రాయ్ వద్దకు పంపారు. అతను అక్కడ సంప్రదింపుల తరువాత గోల్కొండలో నెక్నామ్‌ఖానుతోనూ, మంత్రి మాదన్నతోనూ సంప్రదింపులు

జరిపాడు. అంతా జరిగాక, నెక్నామ్‌ఖాన్ ఈస్టిండియా ప్రతినిధిని, "వెళ్లి, అక్కన్నతో కూడా చర్చించండి" అని పంపించాడు. ఆ ప్రతినిధి తిరుపతి వచ్చి మకాం చేశాడు.

అక్కన్న సమయం ఇచ్చాక, ఈస్టిండియా ప్రతినిధి ఆయనతో తమ వ్యాపార అవసరాల గురించి చర్చించాడు. గోల్కొండ నవాబుల నుంచి తాము ఎలాంటి సహకారం ఆశిస్తున్నారో వివరించాడు.

ఈ ప్రతినిధి చేసిన అభ్యర్థనలలో మంచిచెడులను, లాభనష్టాలను అక్కన్న బేరీజు వేసుకునే దాకా ఆ ప్రతినిధి తిరుపతిలోనే వుండి, ఆయనకు వివరణలిస్తూ వచ్చాడు.

ఒక్క ఈస్టిండియా కంపెనీ ప్రతినిధే కాదు, పొరుగు రాజ్యాల నుండి ఎవరు గోల్కొండ నవాబులతో రాజకీయ వ్యాపార లావాదేవీలు ఏం జరపాల్సి వచ్చినా తిరుపతికి వచ్చి అక్కన్నతో కూడా సంప్రదింపులు జరిపేవారట. ఒక్కమాటలో చెప్పాలంటే- ఆ కాలంలో తిరుపతి కేవలం ఆధ్యాత్మిక కేంద్రంగానే కాక, సైనిక రాజకీయ కేంద్రంగా కూడా వెలిగింది.

అదే కాలంలో దేశంలోని పశ్చిమ భాగం మహారాష్ట్రలో కొత్త హిందూ రాజ్యస్థాపనకు పునాదులు మొదలైనాయి. తండ్రి షాజీ భోంస్లే నుండి సంస్థానాన్ని సంపాదించుకొన్న శివాజీ, బీజాపూరు, సుల్తాను ప్రాంతంలోని కొన్ని భాగాలపై దాడులు మొదలుపెట్టి - 1674 నాటికి స్వతంత్ర రాజుగా ప్రకటించుకొన్నాడు.

గోల్కొండ నవాబుతో చేతులు కలిపి, శివాజీ, బీజాపూరు దక్షిణ మండలాలను జయించి పెడతానని ఒప్పందానికొచ్చి, బీజాపూరుపై దాడులుచేశాడు. అలా శివాజీ చిత్తూరు ప్రాంతాలకు దండయాత్రపై వస్తాడు. కల్లూరు కోన ద్వారా తిరుపతి, కాళహస్తి, కాంచీపురం ఆక్రమిస్తూ వెల్లూరు కోట ముట్టడిచేసి వెల్లూరు, ఆర్నీ, జింజీలు గెలుచుకొన్నాడు.

గోల్కొండ సుల్తాను పిలుపుతో వెనుతిరిగి వెళ్తాడు. వెళ్తూ వెళ్తూ కొంత సైన్యంతో శాంతాజీని ఉంచి వెళ్లాడు. తంజావూరు వెంకాజీ, ఈ శాంతాజీని ఓడించి, తర్వాత శివాజీతో ఒప్పందానికొస్తాడు. ఈ కాలంలో వెంకాజీ తిరుమల కొండపైకి వెళ్లాడా? ఆలయాన్ని కొల్లగొట్టాడా - అన్న విషయంపై ఎటువంటి ఆధారాలు లేవు. శివాజీ మరణం తర్వాత శివాజీ కొడుకు శంభాజీ రాజ్యానికి రాజయ్యాడు. అప్పటి నుండీ చాలా నాటకీయ రాజకీయ పరిణామాల తర్వాత శంభాజీ కొడుకు సోహంజీ

తంజావూరు, మైసూర్, తిరుచురాపల్లికి రాజయ్యాడు. ఆర్కాటు నవాబు రాజ్యం కూడా దక్కను సుబేదారీలోకి వచ్చింది.

1740లో రఘోజీ భోన్స్‌లే తిరుపతికివచ్చి వేంకటేశ్వరుని దర్శనం చేసుకొని స్వామికి కానుకలు సమర్పించుకొన్నాడు.

1) రూ. 33,000 ఖరీదుచేసే ముత్యాలహారం - రూబీ పతకంతో.
2) రూ. 28,000 ఖరీదు చేసే పచ్చల పతకంతో ఉన్న ముత్యాలహారం.
3) రూ. 28,000 ఖరీదు చేసే 17 పేటల ముత్యాలహారం ప్రతిపేటకు 20 ముత్యాలు.
4) ఒక కలికితురాయి, కిరీటానికి పెట్టడానికి - నవరత్నాలు పొదిగినది. 8,500 రూపాయలు.
5) 5 పేటల ముత్యాలహారం - ప్రతిపేటకు 20 ముత్యాలు - రూబీలు - వజ్రాలు పొదిగిన పతకంతో ఖరీదు రూ. 45,000.

ఈ ఖరీదులు కట్టింది - 20వ శతాబ్దం మొదటి భాగంలో. ఈ ఆభరణాలన్నీ ఒక 'రఘోజీవారి పెట్టె' అనే పెట్టెలో ఇప్పటికీ భద్రంగా ఆలయంలో ఉన్నాయి. వాటిని స్వామివారికి ప్రత్యేక ఉత్సవాలలో వాడుతుంటారు.

ఈ కాలంలో దక్కను కర్ణాటకలో ఎన్నో యుద్ధాలు, రాజకీయ ఎత్తుగడలు, హత్యలు జరిగాయి. హైదరాబాద్ నిజాము, కర్ణాటక నవాబుల మధ్య ఎప్పుడూ యుద్ధాలే... ఈ యుద్ధాల్లో ఇంగ్లీషువారు, ఫ్రెంచివారు వారికి వీరికి మద్దతులిచ్చి పురికొల్పడం - మళ్లీ ఇంగ్లీషువారికి హైదర్ అలీ అతని కొడుకు టిప్పుసుల్తానుకు మధ్య గొడవలు - వీటన్నిటికీ మధ్య మరాఠాల మెరుపుదాడులు...

ఇలా అనిశ్చిత పరిస్థితులు 1800 సంవత్సరం వరకూ కొనసాగుతూనే ఉన్నాయి.

★ ★ ★

ఆసక్తికరమైన ఒక విషయమేమిటంటే, 1740లో రఘోజీ భోన్స్‌లే వచ్చినప్పట్నుంచీ ఆలయంలో మరాఠాల ప్రభావం బాగా పెరిగింది. ఆలయ నిర్వహణలో ఇతను పాలనసంస్కరణలు తీసుకొచ్చాడు. అప్పట్నుంచీ తిరుమల ఆలయంలో రికార్డులన్నీ 'మోడి' (దేశస్థ మరాఠీ) భాషలోకి మార్చటం ఆరంభమయింది. 'పేష్కార్, పారుపత్తేదారు' వంటి పదప్రయోగాలన్నీ మోడి భాషలోనుంచి వచ్చినవే.

అప్పట్నుంచి కొన్ని దశాబ్దాలపాటు ఆలయం తరఫున ఉత్తరప్రత్యుత్తరాలు కూడా 'మోడీ' భాషలోనే జరిగాయి. అయితే ఈ 'మోడీ' లిపి ఇప్పుడు అందుబాటులో లేదు. అందువల్ల అప్పటి తిరుమల చరిత్రని తర్వాత చరిత్రకారులు పూర్తిగా అర్థం చేసుకునే అవకాశం లేకుండా పోయింది.

1980లో నేను టి.టి.డి. ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా వుండగా ఈ అంశం నా దృష్టికి వచ్చింది. అప్పుడు నేను అతికష్టం మీద 'మోడీ' లిపి తెలిసిన ఒక రిటైర్డ్ ప్రభుత్వోద్యోగిని మద్రాసు నుంచి తీసుకువచ్చి, అతనికి వసతి కల్పించి, దేవస్థానంలో 'మోడీ' భాషలోని రికార్డులన్నింటినీ ఇంగ్లీషులోకి తర్జుమా చేయించే కార్యక్రమం ప్రారంభించాను. అలా మొత్తం 'మోడీ' రికార్డుల తర్జుమా 1986 దాకా నడిచింది.

ఆ రికార్డులను పరిశీలించి, అధ్యయనం చేసే కార్యక్రమాన్ని ఇప్పటికైనా టి.టి.డి. చేపడితే బాగుంటుంది.

★ ★ ★

60. తిరుమల గుడిపై తురుష్కుల దాడి జరగలేదు!

తిరుమల కొండమీది శ్రీనివాసుడి ఆలయాన్ని, మరాఠా సైన్యాలనుంచి స్వాధీనం చేసుకోవాలని ఉరుకులు పరుగుల మీద ఈస్టిండియా కంపెనీ సైన్యాలు మద్రాసు నుంచి తిరుపతికి వచ్చాయి.

సైన్యం పెద్దదే. కాని కొండ ఎక్కడానికి అర్హత ఉన్న హిందూ సైనికుల్ని మాత్రమే ఏరి, కొండమీదకి పంపి యుద్ధం చేయమన్నారు అధికారులు. (యుద్ధం చేయడానికి సెంటిమెంట్?) "అలాగే" అని కొండెక్కిన సైనికులు మరాఠా సైనికుల చేతుల్లో చావుదెబ్బ తిన్నారు!

మరో సందర్భంలో హైదర్ అలీ తిరుపతి చుట్టుపక్కల సంస్థానాల మీద దండెత్తి గెలుచుకున్నా, తిరుమల కొండమీద ఆలయాన్ని ఆక్రమించే ప్రయత్నం చేయలేదు. పైగా ఆలయ ఆదాయాన్ని గానీ, ఆ వ్యవస్థని గానీ ముట్టుకోలేదు! లేదా?

ఆ మాటకొస్తే, దేశంలో అనేక ఆలయాల్ని ధ్వంసం చేసిన చరిత్ర గల ఏ ముస్లిం పాలకుడూ తిరుమల ఆలయం మీద మాత్రం ఒక్కసారి కూడా దాడి చేయలేదు!

★ ★ ★

తిరుపతి ప్రాంతం ఆర్కాటు నవాబు అధీనంలోకి రావడంతో శ్రీవారి ఆలయం కూడా ఆ నవాబు ఆధ్వర్యంలోకే వచ్చింది. దాదాపు సంవత్సరానికి రెండు లక్షల ఆదాయం వస్తున్న దేవాలయాన్ని నాశనం చేయడానికి - కనీసం ముట్టుకోవడానికి ముస్లింలుగాని, ఇంగ్లీషువారుకాని, ఫ్రెంచివారుకాని ప్రయత్నం చేయలేదు. కాని ఆ ఆలయం అధీనంలోకి తీసుకోవడానికి మాత్రం ప్రతివారూ ఏదో ఒకప్పుడు గట్టి ప్రయత్నమే చేశారు.

మొదట ముస్లింల దృష్టి ఈ ఆలయంపై పడినప్పుడు – తిరుపతి నుండి కొండకు వెళ్లి ఆలయం మీద దాడిచెయ్యాలని సంకల్పంతో ఉన్నప్పుడు – స్థానికులు ఈ ఆలయం ఆదాయం ఎంత గొప్పదో చెప్పి, బంగారు గుడ్లు పెట్టే బాతులా వర్ణించి, దానిపై దాడిచేసినందువల్ల వారే నష్టపోతారనీ, కార్యక్రమాలు జరుగనిస్తే సంవత్సరానికి ఎంత లేదన్నా 2 లక్షల రూపాయలు అనాయాసంగా వస్తాయి అన్న విషయం వారికి అర్థమయ్యేట్లు చేసినట్లుంది.

అదీకాక – పైనున్నది వరాహస్వామి అని తెలిపి, ముస్లింలకు కొంత ఏహ్యాభావం కల్గించినట్లు చెప్పుకుంటారు. ముస్లిం నవాబులు వారికి కావల్సిన ఆదాయం ఆలయం నుండి తప్పకుండా వచ్చే విధంగా ఆలయ నిర్వహణను వేలంవేసి, ఒక ప్రతినిధికి అప్పగించే (రెంటరు) పద్ధతి మొదలుపెట్టారు. ఇంకొకరి ఆధ్వర్యంలోకి ఆలయం వెళ్లకుండా శ్రీవైష్ణవులు ఈ నిర్వహణ బాధ్యత తీసుకొనేట్లు, నవాబుకు ప్రతి సంవత్సరం రెండు లక్షల రూపాయలు అందచేసేట్లు ఒప్పందం కుదిరింది.

అలా ఆర్కాటు నవాబుకు ప్రతి సంవత్సరం తిరుమల ఆలయం నుండి రెండు లక్షల రూపాయలు అందుతుండేవి. ఈ ఆర్కాటు నవాబుకి తిరుచురాపల్లి చందా సాహెబు, అతని కొడుకు రాజా సాహెబులతో వైరం. ఎప్పుడూ యుద్ధాలే. వాటితో ఈ నవాబు ఖజానా ఖాళీ కావడంతో ఆయన ఇంగ్లీషువారి సహాయం తీసుకోవడం మొదలుపెట్టారు. ఆ సహాయంతో అధికారంలో స్థిరపడటం జరిగింది. సహాయంచేసిన ఇంగ్లీషువారికి అధికారం నిలబెట్టినందుకు ఇవ్వాల్సిన రుసుం ఇవ్వలేక, అతని అధీనంలో ఉన్న కొన్ని జిల్లాలతోపాటు తిరుమల ఆలయ ఆదాయాన్ని కూడా వారికి రాసిచ్చేశాడు. అలా 1748 నుండి ఆలయఆదాయం ఈస్టిండియా కంపెనీ వారి అధికారంలోకి వచ్చింది. అదివరకులాగే ఆలయబాధ్యతలు ఏజెంటు నిర్వహించేటట్లు, ప్రతి సంవత్సరం కంపెనీ వారికి రెండు లక్షలు ఆ ఏజెంటు అందజేసేట్లు కొనసాగింది.

1751లో డూప్లే భార్య మాడ్ డూప్లే వారి అమలోదార్ (అధికారి) రాజగోపాల పండిట్‌ను ఆలయ ఏజంటు దగ్గరకు పంపి, ఫ్రెంచివారికి ఆలయం అప్పగించవలసినదిగా వర్తమానం పంపారట. అప్పటి ఇంగ్లీషు వారి తరఫున ఏజెంటుగా ఉన్న వాసుదేవాచారి ఫ్రెంచివారి అభ్యర్థనను తిరస్కరించి, అతనిని పంపించివేశాడట. ఇంగ్లీషువారు, ఆలయరక్షణకు కొంచెం సైన్యాన్ని కరకంబాడిలో ఉంచేవారు. ఏదైనా, ఇంగ్లీషువారు కాని, ఫ్రెంచివారు కాని, నవాబులు కాని,

హిందువులనే వారి ప్రతినిధులుగా కొండకు పంపేవారు కాని, తమ తరఫున ఆ కాలంలో కొండ ఎక్కడానికి అర్హులు కాని జాతులవారిని, కులాలవారిని కొండకూ ఎప్పుడూ పంపలేదట.

ఈ తగాదాల కారణంగా తిరుమలమీద దాడికి మురారీ రావు అనే అతను తయారైతే అతన్ని ఆపటానికి 1753లో నరసింగరావు అనే అతను సిద్ధమయ్యాడు.

ఈ సమయంలో పేష్వాలు, కర్ణాటకలో తమ 4వ భాగం (భౌత్) పన్ను వసూలు విషయాలు చూడటానికి ఇద్దరు మరాఠాలను - రాఘవాచారి, బాలకృష్ణశాస్త్రి - అనేవారిని పంపారట. వారు కరకంబాడి ద్వారా తిరుపతి చేరుకొన్నారు. వారిని ఆలయ బాధ్యతలు చూస్తున్న ప్రతినిధి కంపెనీవారి సైన్యంతో అడ్డుకొని యుద్ధం చేశాడు. ఆ యుద్ధంలో తిరుపతిలో రాఘవాచారి చనిపోయాడు. ఒక మరాఠా సైన్యాధికారి బల్వంతరావు కొండెక్కే ప్రయత్నం చేస్తుంటే అతన్ని అతని సైన్యాన్ని అడ్డగించారట. కాని అతను “నేనూ నా సైన్యం స్వామివారిని సేవించడానికి వెళ్తున్నాం. యుద్ధానికి కాదు” అన్నాడు. ఆలయ ఏజంటు అతని సైన్యాన్ని క్రిందనే ఉంచి, అతనిని కొంతమంది అంగరక్షకులతో మాత్రమే పైకి వెళ్లడానికి అనుమతించాడట. తన సైన్యానికి - ఆ తిరుపతి ప్రాంతంలో ఏమీ ఇబ్బందులు కల్గించవద్దని ఆదేశాలిచ్చి, అక్కడే వారిని ఉంచి, తానుమాత్రం స్వామివారి దర్శనానికి కొండకు వెళ్లాడట. అది జరిగింది 1757లో.

ఈ మధ్యకాలంలో అంటే 1753 ప్రాంతంలో తిరుమల కొండను, ఆలయాన్ని కొల్లగొట్టడానికి ఇంకొక ప్రయత్నం జరిగింది. ఆర్కాటు నవాబుతో యుద్ధంలో ఓడి ఛిన్నా భిన్నమైన తిరుచురాపల్లి రాజాసాహెబు సైన్యం. బతుక తెరువు లేక మహమ్మద్ కమాల్ అనే సైన్యాధికారి ఆధ్వర్యంలో ఒక సైన్యపు గుంపుగా తయారై, గ్రామాలమీద పడి దోచుకొని బతకడం మొదలైంది. అలా అలా వీరు బలవంతులై నెల్లూరు ప్రాంతం కొల్లగొట్టి - 1753లో తిరుపతిపైకి దాడికి బయలుదేరారు. ఈ విషయం తెలిసి, మద్రాసునుండి కంపెనీవారు తిరుపతికి కొంత సైన్యం పంపి, కమాల్‌ని అడ్డుకొన్నారు. కమాల్ ఎక్కివస్తున్న ఏనుగును చంపి, కమాల్‌ను బందీచేసి తర్వాత చంపివేశారు. అలా ఆ దాడిని కంపెనీవారు తప్పించారు.

ఆ తర్వాత మళ్లీ 1756లో ఆర్కాటు నవాబు సోదరుడు నజీబుల్లా, నవాబును ఎదిరించి నవాబు కోటను ఒక దానిని స్వాధీనం చేసుకొని, ధనం కోసం తిరుమల

ఆలయం కొల్లగొట్టడానికి ఆగష్టు 1757లో ప్రయత్నంచేశాడు. విషయం తెలిసిన ఇంగ్లీషు కంపెనీవారు మద్రాసు నుండి వెంటనే సైన్యాన్ని పంపడంతో, వారిని ఎదుర్కోలేక ఈ నజీబుల్లా పారిపోయాడట. కాని కొండకు వచ్చే యాత్రికులను దారిలోనే అడ్డుకొని, దోచుకొని పంపించివేశాడట. సెప్టెంబరు, అక్టోబరు బ్రహ్మోత్సవాలకు పెద్ద సంఖ్యలో యాత్రికులు వచ్చే రోజులు. ఆ నవాబుకు, ఇంగ్లీషు వారికి ఆదాయం రాకుండా చేయడానికి ఆ సంవత్సరం యాత్రికులు పోకుండా చేయడానికి అతను సర్వప్రయత్నాలూ చేశాడట.

ఈ మధ్యకాలంలోనే పేష్వా బాలాజీరావు, తన కమాండరు గోపాలరావు ఆధ్వర్యంలో ఒక పెద్ద మరాతా సైన్యాన్ని పంపాడు. ఆ సైన్యం మొదట కడప జిల్లాలో ప్రవేశించి, గ్రామాలు కొల్లగొట్టింది, ఆ తర్వాత కల్లూరు కోన ద్వారా చిత్తూరు జిల్లాలో ప్రవేశించి కొండమీద ఆలయం చేజిక్కించుకోవాలని 1759లో ప్రయత్నం చేశాడు. ఫలితంగా మార్చి నెలలో ఆలయాన్ని స్వాధీనం చేసుకొన్నారు. వారి ఉద్దేశ్యం ఏప్రిల్ నెలలో జరిగే బ్రహ్మోత్సవాల ఆదాయం తీసుకోవడం.

కాని, పేష్వా బాలాజీరావు ఇబ్బందులలో పడటంవల్ల, ఈ గోపాలరావు పంపిన సైన్యాన్ని వెంటనే వాపసు పిలిపించుకొన్నాడు. గోపాలరావు చాలా కొద్ది సైన్యాన్ని కొండపై నారాయణ శాస్త్రి అధీనంలో ఉంచి, తాను మిగతా సైన్యంతో బాలాజీరావుకు సహాయానికి వెళ్లాడు. ఈ విషయం తెలిసి ఆర్కాట్ నవాబు తరఫున చంద్రగిరి కోట సైన్యాధికారి అబ్దుల్ వహబి తన సైన్యాన్ని పంపి, నారాయణ శాస్త్రి అధీనంలోని మరాతా సైన్యాన్నుండి మళ్లీ ఆలయాన్ని స్వాధీనం చేసుకొన్నాడు. ఈ వహాబుకి తానే ఆలయ ఆదాయం తీసుకోవాలన్న వాంఛ ఉన్నా, ఇంగ్లీషు కంపెనీవారికి భయపడి, జరిగిన విషయం మద్రాసు కంపెనీవారికి తెలియచేశాడు. తాను రక్షించిన ఆలయ ఆదాయం తనకే ఇప్పించమని కంపెనీ వారిని వేడుకున్నాడు. అతని అభ్యర్ధనను కంపెనీవారు తిరస్కరించి, అప్పటిదాకా కంపెనీ తరఫున ఉన్న ఏజెంటునే మళ్లీ నియమించారు.

ఈ మధ్యన వహాబుచేత ఓడించబడిన నారాయణ శాస్త్రి, తిరుమల నుండి తన మిగిలిన సైన్యంతో పారిపోయి కరకంబాడి చేరుకొని, వారి సహాయం తీసుకొని మళ్లీ ఆగష్టుకల్లా ఆలయాన్ని తన స్వాధీనంలోకి తెచ్చుకొంటాడు. ఈ మరాతాల

నుండి ఆలయాన్ని మళ్లీ స్వాధీనం చేసుకునేందుకు మద్రాసు నుండి కంపెనీవారు 200 మంది సైనికులను 15 మంది ఇంగ్లీషు అధికారులతో సహా తిరుపతి పంపారు.

తిరుపతి వచ్చాక, ఆ సైన్యంలో మొత్తం 80 మందిని మాత్రమే కొండ ఎక్కడానికి అర్హత ఉన్న హిందూ సైనికులుగా గుర్తించి – ఆ 80 మందినే కొండపైకి పంపారు. ఆ సైనికులలో చాలా మంది ఆలయంలోను, ఆలయం బయట యుద్ధంలో చనిపోయారు. చనిపోయిన వారిలో ఇరుపక్షాలవారూ ఉన్నారు. బతికి పారిపోయిన కంపెనీ సిపాయిలు క్రిందకు చేరుకొన్నారు. క్రింద మిగతా సైన్యంతో ఉన్న ఆంగ్ల కమాండరు మేజరు కల్లాడ్ ఆగ్రహించి, మరాఠాలకు సహాయం చేసిన కరకంబాడి సైనిక స్థావరానికి వెళ్లి, మొత్తం కాల్చివేశాడు. అక్కడి పాలెగారును చంపివేశాడు. ఆ తర్వాత మళ్లీ సైన్యాన్ని కూడతీసుకొని తిరుమల ఆలయంమీద దండయాత్ర చేశాడు. తమ స్థావరం కరకంబాడిలో నాశనమైన విషయం తెలిసిన నారాయణశాస్త్రి, మరాఠా సైన్యం నిస్పృహతో ఆలయం వదిలి పారిపోయారు.

అలా ఇంగ్లీషు కంపెనీవారు మళ్లీ ఆలయాన్ని స్వాధీనం చేసుకొని తమ ఏజెంటుకు ఆలయ నిర్వహణ బాధ్యతలు అప్పగించారు.

ఇంగ్లీషు కంపెనీవారికి అభ్యర్థన పంపి తిరస్కరింపబడిన వహాబు చంద్రగిరి కోటను ఆక్రమించి, ఇంగ్లీషువారిపై అక్కసుతో అదనుకోసం వేచివున్నాడు. ఎలాగైనా ఆలయ ఆదాయం తనకే చెందాలన్న ఆకాంక్షతో నిరీక్షిస్తున్నాడు. అక్టోబరు 1758లో ఫ్రెంచి కమాండరు కల్నల్ బుస్సీ హైదరాబాదు నుండి వారి సైన్యాధికారి కౌంటుడి లిల్లీని తీసుకొని మద్రాసు ఇంగ్లీషు కంపెనీపై దండయాత్రచేయడానికి బయల్దేరి దారిలో తిరుపతిలో ఆగాడు. తిరుపతిలో ఉన్న ఇంగ్లీషువారి ఆలయ ఏజెంటుని (రెంటరు) బంధించి, ఆలయ నిధులను తనకు అప్పగించమని బలవంతం చేశాడు. ఆర్కాట నవాబు సోదరు లిద్దరూ, చంద్రగిరి వహాబు, నెల్లూరు మహమ్మదాలీ ఈ బుస్సీతో చేతులు కలిపి అతని వెంట బయలుదేరుతారు. కాని బుస్సీ ధ్యాసంతా మద్రాసు ఆంగ్లేయులను ఓడించడానికే. కొండ మీద ఆలయంపై అతనికి ఆసక్తిలేదు. ఈ విషయం తెలియగానే నవాబు చంద్రగిరికి తిరిగి వచ్చాడు.

1763లో తిరుపతిలో ఇంకొక పెద్ద యుద్ధం జరగాల్సింది. దక్కన్ సుబేదారు నిజాం ఆలీ, కర్ణాటక నవాబు మహమ్మద్ అలీపై దండయాత్రకు వచ్చాడు. కర్ణాటక

నవాబు ఇంగ్లీషువారి సాయం కోరాడు. రెండు సైన్యాలు తిరుపతి బయట తారసపడ్డాయి. బ్రిటిషువారి సైన్యాలు కర్ణాటక నవాబుకు సాయం వస్తున్నాయన్న విషయం తెలిసిన నిజాం అలీ, రాత్రికి రాత్రి నిజాం సైన్యాలు తీసుకుని కాళహస్తి మీదుగా నెల్లూరుకు పారిపోయాడు.

రెండవ మైసూరు యుద్ధంలో హైదర్ అలీ కర్ణాటక పై దండెత్తి - చిత్తూరు కోటను జయించి ఆక్రమించాడు. చిత్తూరు పాలెగారు, కాళహస్తి, కార్వేటినగరం, వేంకటగిరి జమీందారులు హైదరాలీకి అండగా నిలిచారు. 1780లో చంద్రగిరికోటని అధీనంలో ఉంచుకొన్న అబ్దుల్ వహాబుకూడా ఆ కోటను హైదర్ అలీకి స్వాధీనం చేస్తాడు. హైదరాలీ కొండకు వెళ్లి ఆలయాన్ని స్వాధీనంచేసుకొనేందుకు అది మంచి అవకాశం. కాని హైదర్ అలీ దేవాలయం మీద దాడికి ఇష్టపడలేదు.

చరిత్రకారులందరూ ఈ విషయంలో ఏకాభిప్రాయం వ్యక్తంచేశారు. చరిత్రకారుడు విల్క్స్ తన పుస్తకంలో "ఈ హైదరాలీ సగం కంటే ఎక్కువ హిందువుగా చెప్పుకోవాలి. దేవాలయాన్ని ముట్టుకొనడానికి, దేవాలయం సొమ్ము ముట్టుకోవడానికి కూడా ఇష్టపడలేదు. తను ఆలయాన్ని అధీనంలోకి తీసుకొని సంవత్సరానికి 2 లక్షల రూపాయల ఆదాయం సంపాదించగలిగినా, ఆలయాన్ని ఆలయ వ్యవస్థను, ఆలయ ఆదాయాన్ని ఎలా ఉందో అలానే కొనసాగించేలా చూశాడు. హైదర్అలీకి ఆరోజుల్లో ఆలయ ఆదాయం వచ్చేదే. అయినా దాని జోలికిపోలేదు" అని వ్రాశాడు.

డా.ఎస్.కె. అయ్యంగారు కూడా వారి 'History of Tirupati' లో ఈ విషయాన్ని ధ్రువీకరించారు. "ఈ హైదరాలీ ఒక్కడే ఆ ప్రాంతానికి వచ్చిన ముస్లింలందరిలోకి విలక్షణుడు - మతసామరస్యానికి ప్రతీక".

శ్రీ వి.ఎన్. శ్రీనివాసరావు గారు కూడా తన పుస్తకం, 'Tirupati Sri Venkateswara Balaji' లో ఈ అభిప్రాయంతో ఏకీభవించాడు. "హైదరాలీ ఆలయ విషయాల్లో జోక్యం చేసుకోకపోవడం, ఆసక్తి చూపకపోవడం శ్లాఘనీయం" అంటూ ఆయన అలా ఎందుకు చేశాడో ఇంకొన్ని వివరాలు ఇచ్చాడు.

హైదరాలీ తరఫున తిరుమల ఆలయ విషయాలను అనికాల నర్సయ్య అనే ఆయన రెండు సంవత్సరాల పాటు- అంటే 1782 నుండి 1784 వరకు చూసేవారనీ. దానికి ఆధారం - హైదరాలీ నియమించిన 'అమలుదారుల' చిట్టాలో ఈ అనికాల

నర్సయ్య పేరుకూడా ఉందని ఆయన రాశారు. ఇంకొకచోట "ప్లవనామసంవత్సరం నుండి శుభక్రోత సంవత్సరం వరకు (1781-83) వరకు హైదరు తరఫున అనికాల నర్సయ్య ఆలయ వ్యవహారాలు చూసేవాడు" (Mackenzie Vol.XXV P-76 as June 10) అని వుంది.

దీనివలన తెలిసేది - హైదరు అలీ ఆలయంపై దాడిచేసి నాశనం చెయ్యకుండా, ఇతర ముస్లింలలాగా విగ్రహ నాశకుడుగా ప్రవర్తించకపోయినా, అతని అమలుదారు ద్వారా ఆలయ ఆదాయాలు దాదాపు లక్షరూపాయల దాకా ప్రతి సంవత్సరం పొంది ఉండవచ్చున్న అభిప్రాయాన్ని సూచించారు.

★ ★ ★

61. కొండ ఎక్కాలంటే, పన్ను కట్టాలి!

ఇప్పుడంటే, కొండకి నడిచివెళ్లే వాళ్ల సామాన్లను కొండపైకి చేరవేయడానికి ఉచిత రవాణా సదుపాయం, కొండమీద ఉచిత దర్శన సదుపాయం, కొండమీద ఎక్కడ్నుంచి ఎక్కడైనా తిరగడానికి ఉచితబస్సు సదుపాయం, తలనీలాల సమర్పణకు రుసుము లేని విధానం, ఉచిత భోజన సదుపాయం... ఇన్నిరకాల సదుపాయాలు భక్తులకు లభిస్తున్నాయి.

కాని ఒకప్పుడు భక్తుల్ని తిరుమలకి కొండకి "రండి, రండి" అని ఎక్కడెక్కడి ప్రాంతాలనుంచీ పిలిపించి, కొండ ఎక్కడానికి కూడా పన్ను వసూలు చేసేవారు!

★ ★ ★

తిరుమల వేంకటేశ్వర స్వామి ఆలయం 18వ శతాబ్దంలో ఆర్కాటు నవాబు అధీనంలోకి వచ్చింది. తిరుమల ఆలయం నుండి మిగులు నిధులు నవాబు వసూలు చేసుకోవడానికి 'రెంటర్' విధానం ప్రవేశపెట్టారు. అందరికంటే ఎక్కువ ధనం ఇచ్చినవారికి ఏటా ఆలయ పరిపాలన అప్పగించేవారు. అతన్ని 'రెంటర్' అని పిలిచేవారు. కిస్తు (రెంటు) ఇచ్చేవాడు కాబట్టి రెంటర్ అని కంపెనీ వారి హయాంలో పిలవడం మొదలయింది.

అతను ఆలయం నుండి ఎంత ఆదాయమన్నా సంపాదించుకోవచ్చు. నవాబుకి మాత్రం సంవత్సరానికి 'ఇంత' అని చెల్లించాలి. ఇలా మొదలైన రెంటర్ విధానం గురించి ఆనందరంగన్ పిళ్ళై అనే ఆయన తన డైరీలో చాలా వివరాలు రాశాడు. తరువాత కాలంలో మెకన్జీ రిపోర్టులో కొన్ని వివరాలు, తరువాత ఆర్కాటు జిల్లా కలెక్టరు స్ట్రాటన్ తయారుచేసిన రిపోర్టు, ఆ తర్వాత 1820 ప్రాంతంలో అప్పటి కలెక్టరు గ్రీమ్ తయారుచేసిన రిపోర్టుల ద్వారా చాలా ఆసక్తికర విషయాలు తెలుస్తాయి (ఇప్పటికీ చిత్తూరులో ఉన్న గ్రీమ్స్ పేట ఈయన పేరుతోనే వచ్చింది).

1750-51లో ఆలయం శ్రీనివాసాచారి అనే రెంటర్ నుండి వాసుదేవాచారి అనే రెంటర్‌కు అప్పగించబడినట్లు తెలుస్తోంది. ఆర్కాటు నవాబుకు ఆ సంవత్సరపు శిస్తు (రెంటు) చెల్లించకుండా ఆలయం వదలి శ్రీనివాసాచారి పారిపోయాడట. అప్పుడు వాసుదేవాచారికి పాత బాకీల కింద లక్ష పగోడాలు, సంవత్సరానికి రెంటు కింద 47,000 పగోడాలు చెల్లించే విధంగా ఒప్పందం అయింది. అప్పటి రాజకీయ అనిశ్చిత పరిస్థితులలో రాత పూర్వక పత్రాల ఏర్పాటు చేసుకోలేదు. ఆ తర్వాత కూడా దాదాపు 50 సంవత్సరాలు ఈ 'రెంటర్' ద్వారా ఆలయ నిర్వహణ వ్యవస్థ కొనసాగింది. ఈ రెంటర్ నుండి వచ్చే ఆదాయాన్ని ఈస్టిండియా కంపెనీవారికి రాసిచ్చాడు ఆ ఆర్కాటు నవాబు. కాని చంద్రగిరిలో ఉన్న ఆర్కాటు నవాబు తమ్ముడు, కంపెనీ వారికి ఆదాయం సరిగ్గా ఇవ్వకపోవటంతో, ఆ తర్వాత ఫ్రెంచి సైన్యాలు, మరాఠాదాడుల నేపథ్యంలో, నెమ్మదిగా కంపెనీవారు తిరుమల ఆలయం విషయంలో శ్రద్ధ చూపడం మొదలుపెట్టారు. రెంటర్ నుండి ఆదాయం సక్రమంగా రాబట్టడానికి ఒక తహసీల్దారు - కృష్ణాజీపంత్‌ని ఆలయంలో నియమించారు.

దొరికిన ఆధారాలను బట్టి రెంటర్‌లు, ఆలయ ఆదాయం పెంచడానికి చాలా ప్రయత్నాలు చేశారు. దేశదేశాలకు గోసాయిలను, బైరాగులను, ఉదాశీలను పంపి కానుకలను ఆలయం తరఫున వసూలు చేసే ఏర్పాట్లు చేయడం - వీరి ద్వారా ఆలయానికి ఆయా ప్రాంతాల నుండి యాత్రికుల గుంపులను తెచ్చే ఏర్పాటు చేయడం జరిగింది.

మెకన్జీ మాన్యుస్క్రిప్టు (రాత) లో ఆ రోజుల్లో ఆలయానికి భక్తులు ఎక్కడెక్కడి నుండి వచ్చేవారో వివరంగా చెప్పబడింది.

ఉత్తరదేశంలోని - 1. కాశి, 2. గయ, 3. ప్రయాగ, 4. హరిద్వార్, 5. కాశ్మీర్, 6. ఉజ్జయిని, 7. బాబయోల (?), 8. అయోధ్య, 9. జగన్నాథ్ ప్రాంతాలనుంచి.

దక్షిణ దేశం లోని 1 ఆర్కాటు, 2. తిరునెల్వేలి, 3. మదురై, 4. రామేశ్వరం, 5. మల్లేయాల్, (మలయాళు), 6. అనంతశయనం (తిరువనంతపురం) ప్రాంతాలనుంచి...

తూర్పు దేశంలోని 1. చెన్నపట్నం, మద్రాసు 2. కాళశ్రీ (కాళహస్తి) 3. నెల్లూరు 4. బందరు (మచిలీపట్నం) 5. రాజమండ్రి 6. సామర్లకోట, ప్రాంతాలనుంచి...

పశ్చిమ దేశంలోని 1. శ్రీరంగపట్టణం 2. చెదనూరు 3. ఉడిపి 4. సుబ్రమణ్య 5. గోవా 6. గోకర్ణం 7. ఇక్కేలి 8. గుత్తి 9. అదోని 10. హరిహర 11. బళ్లారి ప్రాంతాలనుంచి... భక్తులు వచ్చేవారు.

ఇలా హిందువులు నివసించే అన్ని ప్రదేశాలనుంచీ 1. కన్నడులు 2. గుజురులు (గుజరాతీలు), 3. మహూర్వాడ 4. మహారాష్ట్ర 5. సౌరాష్ట్ర, 6. కొంకణ 7. మల్లెయాళి (మలయాళీలు) వచ్చేవారని మెకన్జీ రాస్తూ - ఆయా ప్రాంతాలనుంచి యాత్రికులు గుంపులుగా వచ్చేవారనీ, లేదా బ్రాహ్మణుల ద్వారా, గోసాయీల ద్వారా, బైరాగుల ద్వారా లేదా ఉదాశీల ద్వారా కానుకలు పంపేవారనీ చెప్పారు. (వారి వారి హోదాలను, ఇచ్చిన కానుకలను బట్టి వారందరికి ఆలయ మర్యాదలు చేసేవారట). ముసల్మానులు (మ్లేచ్ఛులు), ఇంగ్లీషు వారు కూడా ఈ దేవుడికి మొక్కులు మొక్కుకొని కానుకలు వేల రూపాయల్లో పంపేవారని ప్రత్యేకంగా మెకన్జీ రాశారు.

ఈ ప్రాంతంలో ప్రయాణాలు ఇబ్బంది లేకుండా జరిగితే ఆలయ ఆదాయం బాగా వుంటుందనీ, యాత్రికులకు దారిలో ఇబ్బందులు కలిగితే ఆలయ ఆదాయం పడిపోయేదనీ రాశారు.

ఈయన తాను సేకరించిన వివరాల్లో 1700 సంవత్సరం నుంచి 1800 సంవత్సరం వరకు ఆలయ 'అమల్‌దారులు' (రెంటర్లు) నియమించిన మేనేజర్లు ఏ సంవత్సరంలో ఎవరెవరున్నారో అలా 28 మంది అమలుదారుల వివరాలు కూడా ఇచ్చారు. అందులో 1700 నుండి 1744 వరకూ ఆర్కాటు నవాబు తరఫున దావూద్‌ఖాను, సాదుల్లా ఖాను, సర్దార్ అలీ కొండ కింద నుండే వ్యవహారాలు చూసేవారట. ఆ తర్వాత హిందువులను అమలుదారులుగా నియమించేవారట. ఇందులో 34 సంవత్సరాలు - పలు దఫాలుగా ఒకసారి 18 సంవత్సరాలు, ఒకసారి 12 సంవత్సరాలు - ఇలా శ్రీనివాసాచారి అనే ఆయన అమలుదారుగా ఉండేవారని తెలుస్తోంది. ఈ అమలుదారులకు నెలకు 100 రూపాయల జీతమే కాకుండా, ఆలయానికి వచ్చే ఆదాయంలో 5% వాటా ఇచ్చే వారని ఆర్కాటు జిల్లా కలెక్టరు రిపోర్టులో తెలుస్తోంది. ఆలయ ఆదాయం పెంచడానికి ప్రోత్సాహకంగా ఇలా ఆదాయంలో భాగం ఇచ్చేవారు.

అమల్‌దారు బాధ్యతలను ఇప్పటి కార్య నిర్వహణాధికారి బాధ్యతలు అని అనుకోవచ్చు. అతను రెంటర్ తరఫున పనిచేసేవారు. రెంటర్‌కు ఈనాటి పాలకమండలి అధికారాలు (ప్రభుత్వ జోక్యం లేకుండా) వుంటాయనుకోవచ్చు.

ఈ కాలంలో ఆదాయం పెంచడానికి చేసిన కార్యక్రమాలు:

1. ఆర్జిత సేవలకు రుసుములు పెంచడం
2. గోసాయీలను, బైరాగులను, ఇతరులను వివిధ ప్రాంతాలకు నియమించి బ్రహ్మోత్సవాలకు మూడు–నాలుగు నెలల ముందే ఆలయ పతాకాలు ఇచ్చి, కానుకల సేకరణకు, ఆయా ప్రాంతాల నుండి యాత్రికుల గుంపులను ఉత్సవాలకు తిరుమలకు తేవడానికి ఏర్పాటు
3. కొండ ఎక్కే ప్రతి యాత్రికునిపై – యాత్రిక పన్ను మనిషికి అయిదు కాసులు – కొండ ఎక్కబోయే ముందు వసూలు చేసేవారు
4. పుష్కరిణిలో స్నానం చేసే వారికి సంకల్పాలు, తర్పణాలు నిర్వహించడానికి పురోహితుల నిర్వహణలో కాంట్రాక్టు
5. కపిలతీర్థంలో పితృకర్మలు చేయించడానికి పురోహితుల నిర్వహణ కాంట్రాక్టు
6. కపిలతీర్థంలో తలనీలాలు ఇచ్చే కాంట్రాక్టు 'హజింగూట'
7. అలాగే కొండపైన కూడా తలనీలాలు ఇచ్చే ఏర్పాటు మొదలుపెట్టి దానికొక కాంట్రాక్టు
8. ఎక్కువ కానుకలు చెల్లించే యాత్రికులకు ప్రత్యేక సదుపాయాలు, ప్రత్యేకదర్శనం, బహుమానాలు
9. 'వర్తన' – స్వామి వారి అలంకారానికి ఇచ్చిన నగలు, వాహనాలు, గుర్రాలు ఇతర అన్ని బహుమానాల విలువకు సరిగ్గా నగదు దేవస్థానానికి చెల్లించడం
10. నైవేద్యాలు చేయించాలంటే ప్రత్యేక రుసుం
11. ఆ మంత్రణ ఉత్సవాలు
12. ప్రత్యేక వాహన సేవలకు రుసుం
13. ఊకాయ పచ్చడి సేవ (తక్కువ రుసుం – పేద యాత్రికులు కూడా సేవ చేయడానికి వీలుగా
14. నైవేద్యాలు – అన్న ప్రసాదాలు, పడిప్రసాదాలు యాత్రికులకు అమ్మడం
15. స్వామివారికి అలంకరించిన వస్త్రాలు, లేదా ప్రత్యేక ప్రసాదాల విక్రయం

16. వగపడి - భక్ష్య నైవేద్యాల విక్రయం

17. పొగాకు, గంజాయి తోటల్ని కొండపై పెంచి, ఆదాయం రాబట్టుకోవడం (ముంతూరు బుగుడ్డి)

18. టంకుబుడ్డి - దుకాణదారులనుండి వసూలు చేసే రుసుం

19. నామాల అంగడి - రుసుం

ఇలా ఎక్కడ వీలయితే అక్కడ యాత్రికుల నుండి, వారిపై ఆధారపడే వర్తకులు, క్షురకులు, బ్రాహ్మణ పురోహితుల నుండి రకరకాల రుసుములు ప్రవేశపెట్టారు. ఇవన్నీ ముసల్మానుల అధీనంలోకి ఆలయం వచ్చిన తర్వాత వారు రెంటర్లకు ఆలయపాలన బాధ్యతలను వేలం వేసిన తర్వాతే ప్రవేశపెట్టబడినవి. ప్రతి రెంటరూ ఆదాయం పెంచడానికి కొత్త కొత్త రుసుములు వేయడం జరిగింది. కొండ మీద దొరికే ఎర్రచందనంతో చేసిన బొమ్మలమీద కూడా రుసుం వసూలు చేసేవారు.

ఇవన్నీ ఆర్కాటు కలెక్టరు స్ట్రాటను తన నివేదికలో పొందుపరచి 1820లో - కొండకు వెళ్లే యాత్రికులపై పన్నులు వేయడం సబబు కాదని, వాటిని ఎత్తివేయాలని కంపెనీ ప్రభుత్వానికి సిఫార్సు చేశారు.

★ ★ ★

62. శ్రీనివాసుణ్ణి 'తాకట్టుపెట్టిన' నవాబు

జీతాలివ్వటం లేదని సైన్యం పని చేయటానికి తిరస్కరించారు.

దానికి పరిష్కారం - తిరుమల వేంకటేశ్వరుణ్ణి ఈస్టిండియా కంపెనీకి 'కుదువ పెట్టడమా?'

అలా చేసి కొత్త చరిత్ర సృష్టించుకున్నాడు ఆర్కాటు (కుర్ర) నవాబు!

★ ★ ★

18వ శతాబ్దం మొదటిభాగంలో తిరుపతి ప్రాంతంలో పరిస్థితులు తెలుసు కోవాలంటే, ఇంగ్లీషువారు తయారుచేసిన 'కంట్రీ కరస్పాండెన్స్' - ఒక ఆధారం. ఆ కాలంలో అధికారులు, దేశంలో పలుప్రదేశాల్లో పనిచేస్తున్నప్పుడు, ఒక కార్యాలయానికి, మరొక కార్యాలయానికీ మధ్య జరిగిన ఉత్తర ప్రత్యుత్తరాల ఆధారంగా ఏమి జరిగివుంటుందో ఊహించి తెలుసుకోవడానికి అవకాశం ఉంది....

ఆ కాలంలో ఒక వైపు ఆర్కాటు నవాబు, కంపెనీవారికి అతనితో సంబంధాలు, రెండవవైపు ఆర్కాటు నవాబుకు తిరుమల ఆలయానికి సంబంధించిన లావాదేవీలు, ఇచ్చి పుచ్చుకోవడాలు, మధ్యలో మరాఠీల దండయాత్రలు, ఆలయం స్వాధీనం చేసుకోవడానికి వారి ప్రయత్నాలు... ఇలా కొన్ని విషయాలు ఆ ప్రత్యుత్తరాల ద్వారా తెలుస్తాయి.

అలాంటిదే ఒక తిరుమల ఆలయానికి సంబంధించిన వ్యవహారంలో ఏం జరిగిందో చూద్దాం:

ఆర్కాటుకు దగ్గరలో ఉన్న 'కొడగంటి'లో ఈస్టిండియా కంపెనీ తరఫున పనిచేసే ఉద్యోగి - రావినూతల ఆడియప్ప.

1740 సంవత్సరం మే 18వ తారీఖున అతను రాసిన ఉత్తరం ప్రకారం - మరాఠాల నాయకుడు బాజీరావు తల్లి, బాజీరావు భార్య శ్రీవేంకటేశ్వరుని దర్శనం

చేసుకోవటానికి తిరుపతి వచ్చారు. వారిని సాదరంగా ఆహ్వానించి, దర్శనం ఏర్పాట్లు చేయడానికి ఆర్కాటు నుండి కృష్ణాజీపంతులు అనే ఆయన తిరుపతికి వెళ్లాడు.

ఇదే రావినూతల ఆడియప్ప ఇంగ్లీషువారికి ఇంకొక ఉత్తరం 1740 సెప్టెంబరు 27 తారీఖున రాశాడు. అది చెన్నపట్నంలో అక్టోబరు 1న అందింది. ఆ ఉత్తరం సారాంశం - తిరుపతి ఆలయం (అంటే తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామిఆలయం) నిధులను ఆర్కాటు నవాబు పూర్తిగా రాబట్టుకొంటున్నాడనీ, అలా వస్తున్న ఆలయ ఆదాయం నుండి మరాఠాల వకీళ్లకు 50 వేల రూపాయలు ముట్టచెప్పమని నవాబు ఆదేశించాడనీ, అలా చేయడానికి కారణం మరాఠా వారి ఒత్తిడికి తట్టుకోలేక, వారు అడిగిన నగదు తాను నేరుగా ఇవ్వలేక నవాబు తనకు ఆలయం నుండి వస్తున్న నిధుల నుండి మరాఠాలకు ఆ డబ్బు ఇవ్వమన్నాడనీ...

అలా వకీళ్లకు ఇచ్చిన డబ్బులోనుంచి 20 వేల రూపాయలు తిరుమల దేవాలయంలో, దేవదేయాలకు దానం చేయమని వకీళ్లను బాజీరావు (మరాఠాల నాయకుడు) ఆదేశించాడనీ, అందుకే ఆ వకీళ్లు ఆలయానికి ఆ ధనం దానంగా ఇచ్చారనీ తెలుపుతూ దానికి కారణం కూడా సూచించాడు. అంతకు కొన్ని నెలల ముందు, అంటే మే 18న బాజీరావు భార్య, తల్లి స్వామివారి దర్శనానికి వచ్చినప్పుడు వారు చేయదలచుకొన్న దేవదేయాలే అయి వుండవచ్చు అని కూడా రాశాడు.

ఈ ఉత్తరాల ద్వారా ఆ రోజుల్లో నవాబు సప్దర్ అలీ ఎంత క్లిష్ట పరిస్థితులలో ఉన్నాడో తెలుస్తుంది.

ఇంకో ఉత్తరంలో ఉన్న విషయం :

"మరాఠాల తరఫున వకీళ్లు నవాబును చాలా డబ్బు ఇవ్వమని బలవంతం చేశారు. మరాఠాలంటే గిట్టక పోయినా, వారు చేసిన అవమానాలు భరించలేక పోయినా, నవాబు, ఈ వకీళ్లను సాదరంగా ఆహ్వానించాల్సి వచ్చింది. వారి ఖర్చులకు కొంత సొమ్ము నవాబు ఇచ్చాడు. అంతేకాక మరాఠా నాయకులకు ఒక లక్ష రూపాయలు ఇవ్వడానికి ఒప్పందం చేసుకొన్నాడు. అలా చేసిన ఒప్పందం తీర్చడానికే ఆలయ నిధుల నుండి తనకు రావల్సిన డబ్బు నుండి 50,000 రూపాయలు మరాఠాల వకీళ్లకు ఇవ్వమన్నాడు... ఆ డబ్బు వసూలు చేసుకురమ్మని, మరాఠా వకీళ్లు వాళ్ల మనుషులను తిరుపతి పంపగా, వాళ్లకి ఆ ధనం అందచేయడం జరిగింది. ఆ ధనం నుంచే వకీళ్ల ఆదేశాల ప్రకారం వారి మనుషులు 20,000 రూపాయలు దేవదేయదానాలు ఆలయానికి చేశారు. మిగిలిన ముప్పైవేలతో వకీళ్ల మనుషులు

తిరిగి వెళ్లారు. మరాఠాలకు నవాబు ఇస్తానన్న మిగతా 50 వేలు, ఇచ్చాడో లేదో నాకు తెలియదు" అని ఈ ఆడియప్ప ఆంగ్లేయులకి ఉత్తరం ద్వారా సమాచారం అందచేశాడు...

అప్పటి పరిస్థితులకు అద్దం పట్టి ఇంకో లేఖ కూడా వుంది.

1740, జూలై 9వ తారీఖున ఫోర్టు సెయింటు జార్జి అధ్యక్షుడు (ప్రెసిడెంటు ఎఫ్.ఎస్.జి) బొంబాయికి రాసిన ఉత్తరం: "మరాఠాలకు నవాబు ఇస్తానన్న డబ్బులో ఇంకా చాలా ఇవ్వాల్సి ఉంది. వాళ్ల వకీళ్లు కూడా ఈ పెద్ద మొత్తం కోసం చాలా ఒత్తిడి చేస్తున్నారు. ఘట్టాసింగు, రఘూజీ గార్ల నాయకత్వంలో 40,000 మరాఠా సైన్యం ఇప్పటికే ఈ ప్రాంతంలో ఉన్న మరాఠాలు, ఇంకా 20,000 సైన్యాన్ని సిద్ధాజీ నాయకత్వంలో ఇక్కడకు పంపారు. ఈ సైన్యాలన్నీ ఇప్పటి మైసూరు ప్రాంతంలో ఉండి డబ్బులు వసూళ్లు చేస్తున్నారు. వారు ఇంకా కొంత దక్షిణానికి చొచ్చుకువెళ్లి ఆ తర్వాతే తిరిగి ఉత్తరానికి ప్రయాణమవవచ్చు అని తెలుస్తోంది. ఈ రాజ్యం ప్రాంతం అంతా, పరిపాలన లేక, ప్రభుత్వం ప్రజలను రక్షించడానికి, తమను సంరక్షించు కోవడానికి లేదా సైన్యం లేక అరాచక పరిస్థితులలో వుంది... నవాబు చనిపోయాడు. అతని కొడుకు ఇప్పుడు నవాబు అయ్యాడు. నవాబు బతికి ఉన్నప్పుడు, ఇప్పుడు కూడా వారి సైన్యానికి జీతాలు ఇవ్వలేకపోవడంతో సైనికులు, పాత బాకీలు తీరిస్తేకాని పనిచేయమని నిరాకరిస్తున్నారు..."

ఇటువంటి పరిస్థితులలో నవాబు కొడుకు చనిపోయాడు. ఈస్టిండియా కంపెనీవారు, నవాబు రెండవ కొడుకుతో ఒప్పందానికొచ్చారు. ధనసహాయం, సైన్య సహాయం చేయడానికి ఒప్పుకొని - దానికి ప్రతిఫలంగా తిరుమల ఆలయనిధులు ఈస్టిండియా కంపెనీకి ప్రతి సంవత్సరం ఇవ్వాలనీ, రాయలసీమ జిల్లాలు ఇంగ్లీషు కంపెనీ వారి పరం చేయాలన్నది ఒప్పందం. నవాబు చేసేది లేక, చేతకాక, ఇంగ్లీషువారి షరతులకు ఒప్పుకొన్నాడు.

ఒక రకంగా చెప్పాలంటే, ఆ కుర్రనవాబు తన అవసరాల కోసం తిరుమల వేంకటేశ్వరుణ్ణి ఈస్టిండియా కంపెనీకి 'కుదువ' పెట్టాడు.

అలా తిరుమల ఆలయం ఆదాయం అప్పటినుండి ఆర్కాటు నవాబు ద్వారా ఇంగ్లీషు కంపెనీవారికి చేరేది.

★ ★ ★

63. ఆనంద రంగపిళ్ళై డైరీ

18వ శతాబ్దంలో తిరుపతి ప్రాంతంలో ఆనంద రంగపిళ్ళై అనే ఆయన ఉండేవాడు. పుదుచ్చేరిలో వున్న సంపన్నకుటుంబీకుడు; ఫ్రెంచి గవర్నరుకు ముఖ్య దుబాషీ. అంటే ఛీఫ్ సెక్రెటరీగా పనిచేయటంవల్ల చాలా పలుకుబడిగలవాడు. ఆంగ్లేయుల కంపెనీలో కూడా కొంత పలుకుబడి కలిగిన అధికారి. ఆయన రాసిన డైరీలు దొరికాయి. 'డోడ్‌మెల్' అనే ఇంగ్లీషు పరిశోధకుడు ఈ డైరీలు పరిశీలించి, తర్వాతి కాలంలో వాటిని ముద్రించాడు. ఆ డైరీలలో తిరుపతికి, తిరుమలకు సంబంధించిన ప్రస్తావనలు అక్కడక్కడ ఉన్నాయి. వాటినుంచి, ఆనాటి ఆలయ పరిస్థితులు కొంత అవగాహనకు వస్తాయి.

ఆయన రాతలు ఆధారంగా - 1743 సంవత్సరంలో నిజాం దక్షిణదేశ దండయాత్ర సందర్భంగా, మరాఠా సైన్యాలు తిరుపతి చేరిన ప్రస్తావన వుంది. 20,000 సైన్యంలో మరాఠా సైన్యాధిపతులు రాజా చంద్రసేను, రాజా నింబిలి సియుదోసి తిరుపతికి వచ్చారట... ఆ కాలంలో తిరుపతి కేంద్రంగా కొంత పరిపాలన సౌలభ్యం వుండేది. తిరుమల ఆలయంలో, రాజకీయకల్లోలాల ప్రభావం లేకుండా పూజావిధానాలు కొనసాగుతుండేవి.

అతని డైరీలో తిరుపతి గురించి ఇంకొక వార్త - 1746కు సంబంధించింది- కార్వేటి నగరం జమీందారు బొమ్మరాజు పాలయం రాజా నరసింగ పంపిన బహుమానాల గురించి ప్రస్తావన. బహుమతులతో పాటు, తిరుమలస్వామి వారి ప్రసాదం కూడా పంపారనీ... తనను తిరుపతి వచ్చి స్వామివారి దర్శనం చేసుకొమ్మని ఆహ్వానించారని రంగపిళ్ళై రాసుకున్నాడు.

అదే సంవత్సరం అక్టోబరులో ఇంకొక విషయం రాశాడు. కార్వేటి నగరం రాజుకు వైద్యం చేయడానికి 'ఆర్ముగ పందారం' అనే వైద్యుడు కార్వేటి నగరం వెళ్లాడని, తర్వాత అతను దైవ దర్శనానికి తిరుపతి, కాళహస్తి వెళ్లి వచ్చాడని, అదే రోజుల్లో పాండిచ్చేరి నుంచి ఒక షావుకారు (బ్యాంకరు) తిరుపతికి యాత్రకు వచ్చాడని..

ఇంకొక విషయం. ముత్యాల నాయక్ అనే కంపెనీ దుబాసీ (అనువాదకుడు) హైదరాబాదు నవాబు దగ్గరకు వెళ్లి తిరిగి తిరుపతి గుండా వస్తున్నప్పుడు, దారిలో దొంగలు అతనిపై దాడి చేసి, అతని వస్తువులు, నిజాం ఇచ్చిన బహుమతులతో సహా దొంగిలించే ప్రయత్నం చేశారట... దీనిని బట్టి తెలిసేది, ఆ రోజుల్లో దక్షిణాది నుండి ఉత్తరానికి హైదరాబాదు వైపు వెళ్లాలంటే తిరుపతి ద్వారానే వెళ్లాలన్నట్లు, ఆ రహదారి తిరుపతి మీదుగానే ఉన్నట్లు తెలుస్తుంది.

ఇంకొక విషయం ఏప్రిల్ 1748 లో ఒక సాధుసన్యాసి, తిరుపతి నుండి 300 పగోడాల ధనంతో కడ్డలూరు దగ్గర తిరువెండిపురంలో వైఖాసి ఉత్సవాలు చేయడానికి వెళ్లాడు.

1749 సంవత్సరం అక్టోబరు మూడవ తారీఖున అతను డైరీలో రాసిన విషయం ఇంకా ఆసక్తికరంగా ఉంది:

అప్పటి తిరుపతి/తిరుమల ఆలయాల అమలుదారు (రెంటర్) శ్రీనివాసాచారి అనే అతను, ఆర్కాటు నవాబుకు కట్టాల్సిన ఆలయం తరఫు సొమ్ము కట్టలేదు. బాకీ పడ్డాడు. ఏం చేయాలో తోచక బాధ్యతలు వదిలి పారిపోయాట్ట. అతని స్థానంలో ఆలయ అమలుదారుగా ఇంకొక వాసుదేవాచారి అనే ఆయనను నియమించారు. 1749 వరకు పాత బాకీల కింద ఒక లక్ష పగోడాలు, అప్పటినుండి సంవత్సరానికి 47,000 పగోడాలు అద్దెతో మూడు సంవత్సరాలపాటు తిరుమల ఆలయం అతనికి లీజుకిచ్చేందుకు చేశారు. మొదట ఆర్కాటు నవాబు నియమించిన అమలుదారు శ్రీనివాసాచారి అయి వుండాలి. ఆలయ ఆదాయాన్ని ఇంగ్లీషు వారికి ఇవ్వాల్సి వచ్చినస్థితిలో, నవాబు పరిపాలన బలహీనపడిన సందర్భంగా, శ్రీనివాసాచారి కట్టాల్సిన సొమ్ము చెల్లించలేదో, లేదా పరిస్థితులు బాగాలేక, యుద్ధాల వలన యాత్రికులు సరిగా రాక ఆదాయం తగ్గిపోవడం వలననో, లేదా కట్టాల్సిన సొమ్ము ఆదాయానికన్నా ఎక్కువకావడంతోనో, బాకీపడడం జరిగింది... ఆ సమయంలో ఇంగ్లీషువారు తమ ఆదాయాన్ని రక్షించుకోవడానికి కొత్త అమలుదారును నియమించారని తెలుస్తూంది.

అప్పటిదే ఇంకొక విషయం - దూమల్లి కృష్ణాజీ పండిట్ గురించి: ఈయన నవాబు సాదత్-ఉల్లా-ఖాన్ గారి దివాను. ఈయన గోల్కొండ వ్యాపారులనే తెలుగు బ్రాహ్మణుడు. నిజాముకు చాలా సన్నిహితుడు, నమ్మకస్తుడు. అన్వరు-ఉల్లా-ఖాన్ నవాబు చనిపోయాక, తిరుమలలో బ్రహ్మోత్సవాలకని ఈ కృష్ణాజీ పండిట్ తిరుపతికి

వచ్చాడు. అలా వచ్చినప్పుడు శ్రీనివాసాచారికి అమలుదారీ మంజూరు చేయడం జరిగిందని, ఆర్కాటు నవాబు నుండి ఈయన - కర్పూరం, గంధం, పునుగు లాంటి సుగంధ ద్రవ్యాలు ఇవ్వమని అధికారికంగా అడిగి తీసుకొని ఆలయానికి సమర్పించాడని... తన ద్వారా (డైరీ రాసిన ఆనంద రంగ పిళ్ళై ద్వారా) వారి సైన్యం ఉడైయారుపాలెంలో బస చేస్తుండగా అక్కడికి వచ్చి, అక్కడ ఈయన చనిపోయాడనీ... ఆ డైరీ వెల్లడిస్తోంది.

పైన చెప్పిన దాన్ని బట్టి మనకు తెలిసేది - ఆర్కాటు నవాబు, తిరుపతి ఆదాయాల విషయంలో ప్రత్యేక అధికారులకు బాధ్యతలు అప్పగించాడు. నవాబు చనిపోగానే, ఆలయం పాత లీజు రద్దుచేసి, కొత్త లీజు తయారుచేశారనీ– అలా మళ్ళీ వచ్చిన అమలుదారు శ్రీనివాసాచారి బాకీ పడడంతో కొత్త అమలుదారుని నియమించారని తెలుస్తోంది. పాత బాకీలు వదలకుండా కొత్త లీజు అమలుచేయడంతో ఆ లీజు మూడు సంవత్సరాలకు ఇచ్చే అలవాటున్నట్లు తెలుస్తుంది. అంటే ఆలయంలో వచ్చిన ఆదాయంతో నిమిత్తం లేకుండా, అమలుదారు సంవత్సరానికింత ఇవ్వాలని ముందే నిర్ణయం చేసి, అలా ఆ అమలుదారు మూడు సంవత్సరాలు ఆలయ ఆదాయాలు అనుభవించే అవకాశం వున్నట్లు తెలుస్తోంది.

ఈ కృష్ణాజీ పండిట్ నిజాం నవాబు తరఫున, ఆర్కాటు నవాబు దగ్గర పని చేయడానికి వచ్చాడు. గోల్కొండ నవాబుతో పోరాటంలో ఆర్కాట్ నవాబు ఓడినప్పుడు ఇస్తానని వాగ్దానం చేసిన సొమ్ముని ఆర్కాటు నవాబు నుండి రాబట్టుకోవడానికి చేసిన వ్యవస్థే ఈ కృష్ణాజీ పండిట్.

ఆనందరంగ పిళ్ళై డైరీలు పరిశీలన చేసి, ఎడిట్ చేసి 'డోడ్‌వెల్' ఈ విషయాలపై విశ్లేషణ చేస్తూ చెప్పిందేమిటంటే–

"తిరుపతి ఆలయాల ఆదాయం - తిరుమలలో మూడు బ్రహ్మోత్సవాలలో యాత్రికుల నుండి వచ్చిన రాబడి 45000 పగోడాల పైన 52,000 రూపాయలు... ఇలా పారిపోయిన శ్రీనివాసాచారినే మళ్ళీ తర్వాతకాలంలో కంపెనీవారు తమ తరఫున తిరుమల ఆలయ అమలుదారుగా నియమించారు".

ఈ సందర్భంగా ఇంకొక విషయం కూడా విశ్లేషణకు వచ్చింది. తిరుమల ఆలయ ఆదాయం రెండు రకాలు... ఒకటి - తిరుమల దేవాలయంలో యాత్రికులు ప్రతిరోజూ, లేదా ఉత్సవాల్లో ఇచ్చిన కొప్పెర కానుకలు. రెండవ ఆదాయం -

ఆలయానికి ఉన్న దేవదేయ గ్రామాలు, భూములపై వచ్చిన ఆదాయం - 45,000 పగోడాలు, దేవదేయ గ్రామాల భూముల ఆదాయం అని, 52,000 రూపాయల ఆదాయం యాత్రికుల కానుకలని తెలుస్తూంది. ఆర్కాటు నవాబు అమలుదారులను, నియమిస్తున్నప్పుడే ఈ రెండు రకాల ఆదాయాల విషయం నిర్ణయం చేసేవాడని తెలుస్తుంది. ఆలయాన్ని సాంప్రదాయికంగా నడిపితే ఇబ్బందులుండవు, గొడవలు కావు. కనుక, శ్రీవైష్ణవులనే అమలుదారులుగా నియమించడం జరిగేదని తెలుస్తూంది. ఇందులో గడబిడలకు తావులేకుండా, భూములు, గ్రామాల ఆదాయం 'పగోడాల' లెక్కలు, యాత్రికుల నుండి వచ్చే ఆదాయం రూపాయల లెక్కలు వేరువేరుగా చేయడం జరిగింది.

ఈ లెక్కల ప్రకారం ఆ రోజుల్లో తిరుమల దేవాలయ ఆదాయం సంవత్సరానికి రెండున్నర లక్షల రూపాయలుగా నిర్ణయించబడింది. అది కట్టలేకే శ్రీనివాసాచారి పారిపోయింది!

★ ★ ★

64. స్వామి 'చేజారిన' వందలాది గ్రామాలు

తిరుమల దేవుడికి ఆదాయాన్ని తెచ్చిపెట్టే - దేవదేయ గ్రామాలు నాలుగువందలకు పైగా ఉండేవి. వాటిమీద సంపూర్ణ హక్కులు దేవుడివి (ఆలయ యాజమాన్యానివి) మాత్రమే.

ఇప్పుడా గ్రామాలమీద హక్కులూ ఆయనకి (యాజమాన్యానికి) లేవు. వాటిమీద వచ్చే ఆదాయాలలో వాటాలూ రావు.

అనేక రాజులు, రాజ్యవ్యవస్థలోని అధికారులు తిరుమల శ్రీనివాసుడి మీద భక్తితో సమర్పించిన ఆ దేవదేయ గ్రామాలు ఆలయ యాజమాన్య నియంత్రణలోంచి ఎలా జారిపోయాయి? ఎవరి చేతుల్లోకి వెళ్లిపోయాయి?

★ ★ ★

ఆనందరంగ పిళ్లై డైరీ ప్రకారం - తిరుమల ఆదాయాన్ని ఆర్కాటు (కుర్ర) నవాబు ఈస్టిండియా కంపెనీకి కట్టబెట్టాడని చెప్పుకున్నాం.

ఇలా, ఎంతోకాలం నుంచి ఆలయానికి దేవదేయాలుగా వచ్చిన గ్రామాలు, వాటి ఆదాయంపై జరుపబడే ఉత్సవాలలో నైవేద్యాలు, ఇతర ఆలయసౌకర్యాలను ఆలయ అధికార్లకు, పాలెగాళ్లకు, జమీందార్లకు ఎందుకు ఇచ్చారన్నది పెద్ద ప్రశ్న. ఒకవేళ ఆ గ్రామాలనుంచి ఆదాయాలు ఆగిపోయాయని అలా చేశారా?

లేదే!

అమలుదార్లు (రెంటర్లు) నవాబుకు, అటు తర్వాత ఈస్టిండియా కంపెనీవారికి కడుతున్న ధనంలో, ఒక భాగం ఆలయంలో, ఉత్సవాలలో యాత్రికుల నుండి వచ్చింది. రెండవభాగం - తిరుమల దేవాలయ దేవదేయ గ్రామాలనుంచి వచ్చినది. మరి దేవదేయ గ్రామాల ఆదాయాన్ని ఆలయానికి ఇవ్వకుండా, మొత్తం అమలుదారు, నవాబు,

కంపెనీ, పంచుకొంటే ఆ ఆదాయంతో జరిగే ఉత్సవాలు అమలుదార్ల కాలంలో ఆగిపోయాయా? అలా లేదు! ఉత్సవాలు జరుగుతూనే ఉన్నాయి...

వీటన్నిటినీ పరిశీలిస్తే ఒకటనిపిస్తుంది. ఒకసారి అమలుదారు (రెంటరు) పద్ధతి ఆలయంలో ప్రవేశపెట్టాక, అమలుదారుకు ఆలయాన్ని మూడు సంవత్సరాల కోసం ఇచ్చినా, ఆలయం నుండి, ఆలయం ఆస్తులు (గ్రామాల) నుండి, ఎంత ఎక్కువ వసూలు చేయగలిగితే అంత చేయాలన్నది అమలుదారు ఉద్దేశ్యం. దానికి నవాబు అండదండలు తప్పక ఉంటాయి. ఎందుకంటే, దీనివలన నవాబు ఆదాయం పెరిగే అవకాశం ఉంది కనుక..

అమలుదారు ప్రయత్నం అంతా ఆలయంలో ఖర్చులు తగ్గించడానికి, ఆదాయం పెంచడానికేనని మనం చెప్పుకొన్నాం.. కర్ణాటకయుద్ధాలు మొదలయిన కాలంలో ఆలయానికి ఉన్న దేవదేయాలనుండి, రావలసినంత ఆదాయం రాజకీయ అనిశ్చిత పరిస్థితుల వల్ల రావడం లేదని. తిరుమలకు దూరంగా రాజ్యంలో ఉన్న గ్రామాలనుంచే గాక, తిరుపతి మండలంలోని గ్రామాలనుంచి కూడా ఆదాయం సరిగా రావడంలేదన్న విషయమూ మనం గమనించాం.

అలా ఆదాయం రాకపోవడానికి కారణాలు ఆలోచిస్తే, పంటలు సరిగ్గా పండకపోయి ఉండాలి; నీటి వనరులు పాడైపోయి నీరు పంటలకు సరిగ్గా అందకపోయివుండాలి; నీటి వనరులు కొత్తగా అభివృద్ధి చేయకున్నా, ఉన్న వాటికి ప్రతి ఏటా చేసే మరమ్మత్తులు కూడా జరపకుండా ఉండి ఉండాలి. కరవు, క్షామం వచ్చి ఉండాలి. లేదా పంటలు సరిగ్గా పండినా రైతులు రాజుకో, ఆలయానికో ఇవ్వవలసిన మేలవరం భాగం సక్రమంగా ఇవ్వకుండా ఉండిఉండాలి. లేదా గ్రామాధికారులకు రైతులు ఇచ్చినా, వారు ఆలయాలకు ఆ సొమ్ము చెల్లించకుండా, మధ్యలో మింగేసి ఉండాలి. అలా ఎందుకు ఆలయాలకు వారు సొమ్ము పంపలేదని, అడిగే రాజుగాని, వారి తరఫు వ్యవస్థ గాని దెబ్బతిని ఉండాలి; ఆలయం తరఫున గ్రామాలకు వెళ్ళి, వసూలు చేసే సౌలభ్యాలు లేకపోయి ఉండాలి. ఉన్నా- వారి మాటని గ్రామాధికారులు రాజ్యాధికారులు లెక్క చేయకుండా ఉండి ఉండాలి.... ఇలా ఏ ఒక్క విషయంలో లోపం ఉన్నా, ఆదాయానికి ఇబ్బందే. కారణాలు ఎక్కువైన కొద్దీ మరీ ఇబ్బంది...

పూర్వం విజయనగర రాజులు, దేవదేయాలు చేసింది భక్తితో. వారికి వచ్చే పన్నులు కూడా మాఫీ చేసింది ఆలయానికి ఎక్కువ నిధులు రావాలని. వారి

గ్రామాధికారులే గ్రామాల్లో దేవదేయాల లెక్కలు చూసి ప్రతి సంవత్సరం, దేవాలయానికి వారి గ్రామం తరఫున సొమ్ము పంపడమేకాక, ఆ పంపిన సంగతి అధికారుల ద్వారా రాజుకు వర్తమానం వెళ్లేది. రాజన్నా, రాజశాసనం అన్నా, వాటిని అమలు పరిచే అధికారులన్నా అందరికీ గౌరవమూ, భయమూ ఉండేవి. ఏమాత్రం పొరపాటు జరిగినా, శిక్షలు కఠినం. అందుకే రైతులనుండి, గ్రామాధికారుల నుండి, రాజ్యాధికారుల నుండి ఆలయ అధికారుల వరకు వారివారి కర్తవ్యపాలన సక్రమంగా చేసేవారు.

అటువంటి పాలనవ్యవస్థ, కర్ణాటకయుద్ధాలతో దక్షిణాదిన దెబ్బతింది. రాజులు దెబ్బ తిన్నారు. రాజ్యాలు ఛిన్నాభిన్నమయ్యాయి. ఎప్పుడూ యుద్ధాలే. ఒకవైపు కర్ణాటక నవాబులు, ఇంకొకవైపు దక్కను సుల్తానులు, మధ్యమధ్య నేరుగా ఢిల్లీ సుల్తానులు, వీరికి తోడు మరాఠా దండులు – వీరు చాలాదన్నట్లు ఒకవైపు ఇంగ్లీషు కంపెనీవారు. ఇంకొకవైపు ఫ్రెంచివారు. ఎవరు ఎవరితో కలిసి యుద్ధం చేస్తున్నారో చెప్పలేని పరిస్థితి. రాజ్యాధికారులకు, గ్రామాధికారులకు, రైతులకు, ఎవరికి కప్పం కట్టాలా అన్నది ఒక సమస్య. ఇబ్బందులు వచ్చినా ఎవరు పరిష్కరించాలో తెలియని అయోమయస్థితి... రాజుగారికి కట్టవలసిన వాటికే దిక్కులేదు– ఇక దేవుడి మాన్యాలకు కట్టకపోతే పట్టించుకొనే నాథుడు కరవైనాడు.

అటువంటి పరిస్థితులలో ఆలయబాధ్యతలు అమలుదారుకు ఆర్కాటు నవాబు ద్వారా సంక్రమించాయి. ఆలయంలో పూజలు, ఉత్సవాలు, నైవేద్యాలు, జీతాలు, నైవేద్యాలలో భాగాలు. యాత్రికుల అవసరాలు అన్నీ జరగాలి కదా... ఆలయానికి తరతరాలుగా వచ్చిన ధనం, బంగారం, ఇతరాలన్నీ ఆదాయం పెంచడానికని నీటివనరుల కోసం దేవదేయ గ్రామాలపై, దేవదేయ భూములపై ఖర్చు చేసేవారు. కనుక మూలధనం రూపంలో ఆలయంలో ఎక్కువ నిధులు ఉండే అవకాశం లేదు. ఆలయ అధికారులు, స్థానత్తారులు, అర్చకులు, జియ్యంగార్లు, ఆచార్యపురుషులు, ఇతర బైరాగులు, గొల్ల మిరాశీలు, అన్నమయ్య వంశీకులు, మిరాశీదారులు, ఇతరులు అందరూ నైవేద్యాల కోసమే దేవదేయాలను, తర్వాతికాలంలో గ్రామాల దేవదేయాలను చేసేవారు. దాదాపు 40 గ్రామాలు అలా దేవాలయ అధికారులు చేసిన దేవదేయాలే.

అమలుదార్లు అధికారంలోకి వచ్చాక, ఆలయగ్రామాల ఆదాయం విషయంలో ప్రత్యేకశ్రద్ధ తీసుకొని ఉండాలి. తమ కాంట్రాక్టు, మూడు సంవత్సరాలకు కాబట్టి, తాము పెద్ద ఎత్తున, పెట్టుబడులు పెట్టే పరిస్థితి లేదు. ఆలయం సిబ్బంది మీద

ఎక్కువ ఖర్చు పెట్టగలిగిన స్థితి లేదు. ఏదో విధంగా గ్రామాలనుండి వచ్చే ఆదాయం నికరంగా ఉండాలి, వీలైనంత ఎక్కువగా ఉండాలి. అందుకే ఆ గ్రామాలను, ఆయా అధికారులకే అప్పగించి, వారు వసూళ్లు చేసుకొని, ఆలయం నుండి వారికి రావల్సినది తీసుకొని, అమలుదారుకు కొంత ఇచ్చేటట్లు ఒప్పందాలు చేసుకొని ఆయా గ్రామాల బాధ్యత, జియ్యంగార్లకు, అర్చకులకు, ఆచార్యపురుషులకు, ఇతరులకు ఇచ్చివేశారు. ఇచ్చిన గ్రామాల సంఖ్య చూస్తే, అది, వారు చేసిన దేవదేయాల బట్టే అన్న విషయం అర్థం చేసుకోవచ్చు.

మిగతా గ్రామాలు అన్నీ కాళహస్తి, కార్వేటి నగరం, మట్ల జమీందార్లు, లేదా పెద్దపెద్ద పాలెగాళ్లు, మామండూరు, తిరుపతి, కరకంబాడి, నాగపట్ల వారి ప్రాంత గ్రామాలు. పరిపాలన సౌలభ్యం కోసం, నికర ఆదాయం కోసం, వారి వారి పరిధుల్లో ఉన్న దేవదేయ గ్రామాల పరిరక్షణ, ఆదాయవ్యవస్థ, ఆయా జమీందార్లకు, పాలెగాళ్లకే అప్పగించబడి, అమల్దారు వారితో ఏ గ్రామానికి ఎంత ఇవ్వాలో ఒప్పందానికి వచ్చి ఉండాలి.

తరతరాల నుండి, ఈ జమీందారులు, పాలెగాళ్లు, తిరుమల శ్రీవేంకటేశ్వరుని భక్తులే. కనుక దైవభక్తి ఒకవైపు ఉన్నా, ఆర్థికంగా అనువుగా ఉండటంతో, ఈ వ్యవస్థ అటు అమలుదారుకి, ఇటు వీరికి ఆచరణయోగ్యంగా తోచి ఉండవచ్చు. దీనికి నవాబుకు అభ్యంతరం ఉండటానికి అవకాశం లేదు. ఎటొచ్చీ ఆలయానికే కొంత రావల్సిన ఆదాయానికి గండి.. కాని అసలు ఆదాయం రాకుండా ఉండటం కంటే ఇది మేలుకదా?

అయినా అడిగేదెవరు? ఎవరైనా అడగగలిగితే, జియ్యర్లు, అర్చకులు, ఆచార్య పురుషులు, ఇతర మిరాశీదార్లు. వారికి వారివారి గ్రామాలు ముట్టాయి కదా! నష్టమొచ్చినా, లాభమొచ్చినా బాధ్యత వీరిదే. ఇంకెవరినీ అనే పరిస్థితిలో వారు లేరు.

అలా ఆలయంలో స్వామివారికి ఆనాటికి ఉన్న 187 గ్రామాలు ఇతరుల అధీనంలోకి వెళ్లాయి. ఇంకా చాలా గ్రామాలు తిరుపతికి దూరంగా ఉన్న ప్రాంతాల్లో, అటు తమిళదేశం, కన్నడదేశం, ఆంధ్రదేశంలో ఉన్న గ్రామాల ప్రసక్తే లేదు. దాదాపు దూరంగా ఉన్న 200 గ్రామాల నుండి ఆదాయం రాకపోగా ఆలయ యాజమాన్యం చేతులనుండి గ్రామాలూ, భూములూ జారిపోయాయి.

ఈ పరిస్థితులను ఆసరాగా తీసుకొని ఈస్టిండియా కంపెనీవారు 1801 లో ఆలయ పరిపాలన నేరుగా చేయాలని సంకల్పించినప్పుడు - 187 గ్రామాలు కంపెనీ

పరం చేసుకొన్నారు. ఆలయానికి వచ్చేది, ఎవరి అధీనంలో ఉన్నాయో వారికి వచ్చేదీ - అన్నీ జప్తు చేసి గ్రామాలన్నీ ప్రభుత్వ పరం చేశారు. దేవదేయాలు రద్దుచేసి, వాటిని జిరాయితీ భూములు/గ్రామాలుగా పరిగణించారు. దానితో ఆదాయాలు, ఆ ఆదాయాలతో చేసే ఉత్సవాల నైవేద్యాలు - ఆ నైవేద్యాల భాగాలతో బతికే ఆలయాధికారులు, రామానుజకూటాలు, నందనవనాలు - అన్నీ రద్దయిపోయాయి. తిరుమల వైభవానికి, ఆలయం చేస్తున్న హిందూధర్మ పరిరక్షణకు బలమైన దెబ్బ తగిలింది. దిగదుడుపుగా ఒక చిన్న మొత్తం 'తస్దీక్' (కాంపెన్సేషను) ఇచ్చినట్లు చూపించారు.

★ ★ ★

పెద్దకానుక తెచ్చారా! మంచి దర్శనం ఇస్తారు

కర్ణాటకయుద్ధాల్లో ఆర్కాటు నవాబు 1748లో తిరుమల వేంకటేశ్వర ఆలయం ఆదాయం ఈస్టిండియాకు ఇచ్చిందని చెప్పుకొన్నాం. ఆదాయమైతే కంపెనీకి వచ్చేదికాని, ఆలయ వ్యవహారాలు - అంటే ఆలయం మేనేజ్ చేయడానికి ప్రతినిధిని నియమించడం, సంవత్సరానికి ఎంత రుసుం చెల్లించాలి వగైరా విషయాలు ఆర్కాటు నవాబు తరపున మొదట మహమ్మదాలి, ఆ తర్వాత అతని కొడుకు చూసేవారు. వీరిద్దరూ చనిపోయిన తర్వాత మహమ్మదాలీ రెండవ కొడుకుతో కంపెనీవారు జులై 1801లో ఒక ఒప్పందానికొచ్చారు. కర్ణాటక ప్రాంతమంతా కంపెనీపాలనకు వచ్చేట్లు, వచ్చే ఆదాయంలో 5వ భాగం ఈ రెండవ కొడుకు అజీద్-ఉల్-ఉమరాకు కంపెనీ ఇచ్చేటట్లు.

అలా కర్ణాటక రాజ్యపరిపాలనంతా కంపెనీ వారికి సంక్రమించింది. దాంతోపాటు ఆలయాలు, వాటి పరిపాలన, ఆలయగ్రామాలు, భూములు, వాటికిచ్చిన శిస్తు మాఫీలు అన్నీ కంపెనీవారి అధీనమయినాయి.

అంతవరకు - అంటే 7వ శతాబ్దం నుండి 18వ శతాబ్దం వరకూ రాజులూ, సామంతులూ, మంత్రులూ సైన్యాధిపతులూ, ఇతరభక్తులూ అందరూ దేవాలయాలకు ఇచ్చిన దేవదేయ గ్రామాలు, భూములు, అన్నీ కంపెనీ పరమైనాయి. ఈ దేవదేయ భూములకు ఆయా కాలాల హిందూరాజులు, వారిచ్చిన దేవదేయాలకే కాక, దేవాలయాలకు ఎవరు భూములూ, గ్రామాలూ దానం చేసినా, ఆ భూములపై పన్నులు ఇతర శిస్తులు మాఫీ చేసి అలా వచ్చిన ఆదాయాన్ని కూడా దేవాలయాలకు అందేట్లు చూసే ఏర్పాటు జరిగింది.

కాని కంపెనీ వారి పాలనలో మామూలు ప్రభుత్వగ్రామాలకూ, దేవదేయ గ్రామాలకు, స్తోత్రీయగ్రామాలకూ, ఏమీ తేడా చూపలేదు. ఆలయాల్లో అర్చకులూ, వేదపండితులూ, జియ్యంగార్లూ, ఆచార్యపురుషులూ, కవులూ, జ్యోతిష్కులు, సంగీతకారులు, ఇతర కళాకారులకు కూడా రాజులు స్తోత్రీయాలు, ఈనాములు, గ్రామాలు, భూములు ఇచ్చే సంప్రదాయం వున్నా కంపెనీవారు వీటినేమీ లెక్క చేయకుండా దక్షిణ భారతదేశంలో ఆలయవ్యవస్థకు, ప్రాచీన వేదశాస్త్ర, సాహిత్య, సాంస్కృతిక కళావ్యవస్థకు పెద్ద దెబ్బకొట్టారు. ఒక్క దెబ్బతో ఈ గ్రామాల భూముల ఆదాయంతో నడపబడే దేవాలయాలూ, అర్చకుల, దేవాలయం సిబ్బంది జీతభత్యాలూ, స్థాపించబడిన ఉత్సవాలు, నైవేద్యాలూ, ఇతరవైభవాలూ అన్నీ ఆపివేసే పరిస్థితి ఏర్పడింది. అలా ప్రతిరోజూ జరిగే నైవేద్యవితరణ ఆగిపోవడంతో, ఆ ప్రసాదాలమీద ఆధారపడే అర్చకులు, మిరాశీదార్లు, ఆస్థానపురుషులు, వాగ్గేయకారులు, ఆలయ ధర్మకర్తలు, ఆలయ సిబ్బంది అందరికీ తినడానికి భుక్తికి కూడా లేకుండా పోయింది. వాటిమీద ఆధారపడే ధర్మశాలలు, నందనవనాలు, అన్నసత్రాలు, రామానుజకూటాలు అన్నీ మూతపడే పరిస్థితి వచ్చింది. చాలా వైభవంగా ఇంతవరకూ నడిచే దేవాలయాలలో దీపం పెట్టి నైవేద్యం చేయడానికి కూడా అవకాశం లేని పరిస్థితి ఏర్పడింది.

తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ విషయానికొస్తే - ఆలయ రికార్డుల ప్రకారం ఆలయానికి 187 గ్రామాలుండేవి... ఇవన్నీ దేవదేయాలుగా వచ్చినవి. విజయనగర సామ్రాజ్యపతనం తర్వాతకాలంలో మనకే శిలాశాసనాలూ దొరకలేదు. ఆలయం రికార్డులూ లేవు. కంపెనీవారు ఆలయాన్ని 1801లో తీసుకోవడానికి పూర్వం 50 సంవత్సరాల కాలంలో, ఈ దేవదేయ భూములు, గ్రామాలు కొన్ని ఆలయ అర్చకులకు, కొన్ని జియ్యంగార్లకు, కొన్ని ఆచార్యపురుషులకు, గొల్లమిరాశీకి, వేదపండితులకు, ఆలయ సిబ్బందికి కొంత తక్కువ ఆదాయానికి ఇచ్చినట్లు తెలుస్తోంది. ఈ విషయాలు మెకంజీ తయారుచేసిన తిరుపతి కైఫియత్‌లో చాలా విపులంగా ఇవ్వబడ్డాయి. ఉదాహరణకు నాగపట్ల పాలెగారుకి 34 గ్రామాలు ఇస్తే, జియ్యంగార్లకు (పెద్ద, చిన్న) రెండేసి గ్రామాలు వెళ్లాయి.

లభ్యమైన సమాచరం బట్టి ఒక్క గ్రామమే ఆలయం అధీనంలో ఉన్నట్లు ఉంది.

పాలెగార్లకు, జమీందార్లకు కూడా ఈ గ్రామాలు ఇచ్చింది. ఎందుకంటే గ్రామాల్లో ఉన్న ఆలయాల రక్షణకు, తిరుపతికి రక్షకులు కావాలంటే పంపటానికి.

తిరుపతి కాలిబాటలో మామండూరుమిట్ట అని ఉంది. మామండూరుపా లేగారు ఇక్కడ రక్షకభటులకు పెట్టేవాడు. ఈ మామండూరుమిట్ట అన్నది 7వ మైలు దగ్గర 1980లో నేను ఇ.ఒ గా ఉన్నప్పుడు 18 అడుగుల ప్రసన్నఆంజనేయస్వామి విగ్రహం కట్టించిన చోటు.

శ్రీ వి.యన్. శ్రీనివాసరావుగారి పుస్తకంలో ఒక ఆసక్తికరమైన విషయం ఉంది:

30 సంవత్సరాలు పాటు తిరుమల ఆలయంలో అమలుదారుగా పనిచేసి (1744 నుండి 1781 మధ్యకాలంలో శ్రీనివాసాచారి అనే ఆయన తిరుచానూరులో భూమి తీసుకుని దాన్ని స్తోత్రీయం చేసి, 26 స్థలాలుగా చేసి 26 మంది బ్రాహ్మణులకు పంచిపెట్టాడట. అది 1755లో జరిగి ఉండాలి. తర్వాత 1778లో మహమ్మదాలీ దగ్గర రెవెన్యూమంత్రిగా పనిచేసిన రాజా బీరబవరాయజీ తమ అధీనంలోని గ్రామాల్లో 'కావిలీ' (ఒక రకమైన పన్ను) వసూలుచేసి 26 ఇళ్లు కట్టించి బ్రాహ్మణులకు ఇచ్చాడట.

మనం అదివరకు చూసినదాన్ని బట్టి – తిరుచానూరులో మొదట శుకాచారి 108 ఇళ్లు కట్టించినట్లు పురాణంలో ఉంది. తర్వాత కాలంలో తిరుచానూరు సభ – కొండపై దేవస్థానం వ్యవహారాలు చూసేదని, దానిలో 108 మంది శ్రీవైష్ణవులు ఉండేవారనీ, అందులోంచే తరువాతకాలంలో ముగ్గురు స్థానత్తారులుగా ధర్మకర్తల మండలిలో ఉండేవారని కూడా చూశాం.

మహమ్మదీయుల దండయాత్ర కాలంలో తిరుచానూరులోని 108 ఇండ్లలో 26 తగ్గి ఉండవచ్చు. వీటిని పూరించడానికి ఆ అగ్రహారం తయారుచేయించి ఉండవచ్చని చరిత్రకారుల ఉద్దేశ్యం.

సవాల్ - జవాబు పట్టీ

ఈస్టిండియా కంపెనీ వారు తిరుమల శ్రీవేంకటేశ్వరుని ఆలయాన్ని 1801లో అధీనం చేసుకొన్న వెంటనే ఒక కైంకర్యం పట్టీ తయారు చేయించారు. అందులో ఆలయంలో ఎవరెవరు పనిచేస్తున్నారు, వంశపారంపర్య మిరాశీదార్లు ఎవరు, దేవాలయ సిబ్బందిగా ఎవరెవరు, ఎందరు, వారికి అందుతున్న జీతభత్యాలు ఎంత, ప్రసాదంలో భాగాలు ఎంత, వారి ఉద్యోగాలు ఎప్పుడు మొదలయ్యాయి, ఎవరి అధికారంతో వారు పనులలో చేరారు, ఒక్కొక్కరి పని ఏమిటి, బాధ్యత ఏమిటి... ఇలా పూర్తిగా తెలియచెప్పే మస్టరు తయారుచేయించారు.

1820-21 సంవత్సరంలో మళ్లీ ఇటువంటి సర్వే చేయించారు.

ఇదేకాక 1819 ఆగస్టు 14న ఒక పైమాయిష్ ఖాతా తయారుచేయించారు. ఈ దేవాలయసంస్థ కింద పనిచేస్తున్న దేవాలయాలకు - ఒక్కొక్క దేవాలయంలో ఉన్న విగ్రహాలు, వాటి వివరాలు, ఆలయం అధీనంలో ఉన్న ఆలయ భవనాలు, ఇతరభవనాలు, కొలతలతో సహా ఆయా గ్రామాల కరణాల దస్కత్‌తో తయారుచేయించారు. తిరుమల, తిరుపతి, తిరుచానూరులో ఉండే వారి అధీనంలో ఉన్న అన్నింటికీ, వాటిమీద ఆనాటి ఆలయం శిరస్తదారు అలబ్దు గోవిందరావు సంతకంతో తయారుచేయించారు.

ఒక దిట్టం పుస్తకాన్ని కూడా తయారుచేయించారు. ప్రతి ఆలయంలోని ప్రతి విగ్రహానికి ఏ రకమైన పూజలు, ఏ వేళల్లో జరుగుతాయి. ఒక్కొక్క పూజకు కావల్సిన సామాన్లు ఏమిటి, ఎవరు వీటిని కొంటారు, ఎవరిద్వారా సరఫరా చేస్తారు... ఇలా రోజువారీ కాకుండా వారంవారం, నెలవారీ సంవత్సరంలో ప్రత్యేకంగా జరిగే పూజల విషయంలో కూడా ఇటువంటి వివరాలన్నీ సేకరించి, ఒక పుస్తకరూపంలో తయారుచేయించారు... ఆ దిట్టం పుస్తకమే అప్పటినుండి ఇప్పటివరకూ అమలులో ఉంది.

ఆ పుస్తకంలో, ఏ యే మతాల వారికి, ఆయా స్వామీజీలు తిరుమల వచ్చినప్పుడు ఎటువంటి మర్యాదలు ఎలా జరుగుతాయన్న వివరాలు కూడా ఉన్నాయి.

ఈ రెండూ కాక ఇంకొక ముఖ్యమైన సర్వే చేయించారు. దీనికోసం ప్రత్యేక విచారణ చేయించి ఆలయానికి సంబంధించిన ఆస్తులు, ఆదాయం, వ్యయవివరాలు, ప్రతిరోజు చేసే నైవేద్యాలూ, వాటి వివరాలూ, వాటికయ్యే ఖర్చులూ, రోజువారీ, ఇంకా ప్రత్యేక ఉత్సవాలకు; ఎటువంటి పూజలు, సేవలు చేయాలి, ఎవరు ఎందుకు ఎలా చెయ్యాలి, ఎంత ఖర్చు, ఎవరి ఆదేశంతో చేస్తున్నారు, వాటికి దేవదేయాలు ఉన్నాయా? ఆలయసిబ్బంది, వారి ఉద్యోగవివరాలు, వారి మీద పెట్టే ఖర్చు, వారు చేయాల్సిన విధులు... ఇవికాక ప్రతి ఆలయంలో ప్రతి విగ్రహానికి, ప్రతి సేవ ఎలా మొదలైంది, ఎవరు మొదలుపెట్టారు, ఎన్ని దేవాలయాలు, ఎక్కడెక్కడ ఉన్నాయి, వాటి వివరాలు... ఇలాంటివన్నీ సేకరించడానికి ఒక ప్రత్యేక ప్రశ్నపత్రం తయారుచేయించి, ఆలయ అధికారుల కందరికీ ఆ ప్రశ్నలు ఇచ్చి వారివారి పరిధిలో మొత్తం సమాచారం ఇస్తూ సమాధానాలు తయారుచేయాలని ఆదేశాలు ఇచ్చి, ఒక్క

సంవత్సరకాలంలో ఆ ప్రశ్నలన్నింటికీ సమాధానాలు సేకరించి, ఒక సవాల్–జవాబ్‌ల పట్టీ తయారుచేయించారు.

తిరుమల వేంకటేశ్వర ఆలయం, తిరుచానూరు, తిరుపతి ఆలయాల విషయంలో 14 విషయాల మీద ప్రశ్నపత్రాలు తయారుచేశారు.

1) ప్రతి ఆలయంలో చేసే సేవ (ధర్మ) కు ఖర్చు కంపెనీ వారు (ఆలయం నిధులనుండే) భరిస్తున్నారా?

2) లేకపోతే ఏదైనా దేవదేయం ఉందా? ఆ దేవదేయం నుండి ఆదాయం ప్రైవేటువారి నుండా, ఆలయ అధికారులనుండా, జమీందారులు, పాలెగార్ల నుండా?

3) ఈ ఆదాయాలు ఎవరు ఎలా వసూలు చేస్తున్నారు?

4) ఈ వసూళ్లకు ఆలయం తరఫున ఉద్యోగులున్నారా, ఉంటే ఎంతమంది?

5) ఈ విషయంలో మార్పులకు అవకాశం ఉందా? ఖర్చు తగ్గించవచ్చా, ఆదాయం పెంచవచ్చా?

6) ఒక్కొక్క ఆలయం విషయంలో – దాన్ని రాతితో కట్టారా? సున్నంతో కట్టారా, చెక్కతో కట్టారా? ప్రాకారాలు, మండపాలు, గర్భగృహాలు, కళ్యాణ మంటపాలు – వివరాలతో సహా.

7) ఆలయంలో ఎన్నిరకాల ఉద్యోగులున్నారు? వారి విధులు ఏమిటి? బాధ్యతలు ఏమిటి? ఎవరి కింద పనిచేస్తున్నారు? వారికి ఇచ్చే జీతాలు ఇతరసదుపాయాల వివరాలు– రోజుకు ఎన్నిరకాల పూజలు, అవి ఎంతెంత సేపు జరుగుతాయి– వివరాలు.

8) సకాలానికి కాని, సక్రమంగా కాని సేవ చేయకపోతే ఏ శిక్ష, ఎవరు విధిస్తారు?

9) వాటి ఆదాయం వ్యయం వివరాలు.

10) ప్రభుత్వం తరఫున కొంతమంది ఆలయంలో పని చేస్తున్నారు. వారిపై క్రమశిక్షణ చర్యలు ఎవరు తీసుకుంటారు? వారు ఆలయ అధికారి ఆజ్ఞలు పాలిస్తున్నారా?

దేవదేయాలు చేసిన వారి సేవలు సక్రమంగా జరుగుతున్నాయా? ఆ సేవలో సామాన్ల దొంగతనాలు జరుగుతున్నాయా, సక్రమవినియోగం జరుగుతుందా? – అవి ఆలయం దాకా వస్తున్నాయా? వచ్చినా వినియోగం అవుతున్నాయా?

11) ప్రతి దేవాలయానికి వచ్చే ఆదాయం దానికి నిర్దేశింపబడిన సేవకే వినియోగం అవుతుందా? అలా వచ్చిన ఆదాయంలో ఆలయ అధికారులకు చెల్లింపులు ఏమైనా చేస్తున్నారా? చేస్తే ఎవరి ఆజ్ఞ మీద?

12) ఆ దేవదేయం చేసిన రోజుల్లో, ఎవరి అధికారంలో ఆలయం ఉండేది, ఎవరి ఆజ్ఞమీద ఈ సేవ మొదలైంది. ఖర్చుల విషయంలో ఆదేశాలిచ్చిందెవరు? ఇప్పుడు ఆ ప్రకారమే సేవలు జరుగుతున్నాయా?

13) ధర్మం గాని, దేవదేయంకు సంబంధించిన ఆస్తులుగాని ఆలయం అధీనంలో ఉన్నాయా? ధర్మం చేసిన వారు కాని, వారి వారసుల అధీనంలో ఉన్నాయా? లేదా ఇతరుల అధీనంలో ఉన్నాయా?

ఈ సేవాదారులకు పడి తరంలో (ప్రసాదంలో) భాగం ఉందా? ఉంటే ఇప్పుడెవరు అనుభవిస్తున్నారు?

14. ఇప్పుడు ఏవన్నా ఆలయాలు కానీ, సత్రాలు కాని, అన్నసత్రాలు కాని, ఎవరి అధీనంలో లేకుండా ఉన్నాయా? - పూర్తి వివరాలు.

ఈ ప్రశ్నపత్రం 1818-19 సంవత్సరంలో ఆలయ అధికారులకు ఇవ్వబడింది. ఇవికాక వీటికి అనుబంధంగా ఇంకొక 14 ప్రశ్నలు కూడా చేర్చి ఇవ్వబడింది.

1819 ఆగస్టు 14వ తారీఖునాటికి జవాబులతో సహా తిరుపతి తహసీల్దారు ఆఫీసులో శిరస్తదారు అలబ్దు గోవిందరావు తయారుచేయించాడు.. ఆయా శాఖలకు, విభాగాలకు లేదా వ్యవస్థలకు చెందిన వ్యక్తులందరి నుంచీ సమాచారం సేకరించి, పొందుపరచి లెక్క వారీగా ప్రశ్నలు, సమాధానాలు పూర్తి వివరాలతో తయారుచేయడం జరిగింది.

ఇప్పటికీ దేవస్థానంలో ఏ విషయంపై నిర్ణయం తీసుకోవాలన్నా ఆ సవాల్ జవాబ్ పట్టీని నిర్ణాయకంగా భావిస్తారు.

పై మూడు రకాలు సర్వే కాకుండా, నాలుగవ రికార్డు 'బ్రూసుకోడు' అనే పేరుతో ఆలయనిర్వహణ, పరిపాలనపద్ధతిపై ఒక నిర్ణాయకపత్రం కూడా తయారుచేశాడు.

ఈ సర్వేల వల్ల తెలియవచ్చిన విషయం... ఈ ఆలయాల ఆదాయాన్ని వసూళ్లు చేయడానికి దేవస్థానం సిబ్బందిని నియమించలేదు.

గ్రామాల్లో ప్రతినిధుల ద్వారా విరాళాలు వసూలు చేసే సంప్రదాయం ఉండేది. ఆలయం తరఫున ఒకరికి అలా ఏజెంట్ల ద్వారా వసూలుచేసే అధికారాలు జారీచేసే వారట. ఆ సంవత్సరం మాతబారు షేక్ సాహెబు అనే ఆయన చాలామంది ఏజెంట్ల ద్వారా ఆలయానికి భక్తుల విరాళాలు సేకరించేవారట. అవి కూడా సేవలకని, ప్రసాదాల కని మిగతావి భక్తుల కోరికలను బట్టి వసూలు చేసుకొచ్చేవారట. ఆ వసూలుదారులు ఖర్చులు పోను మిగతాది ఆలయంలో జమ చేసేవారట. తర్వాతికాలంలో అంటే మహంతులకాలంలో మహంతులే గోశాయిలను నేరుగా నియమించి, వారికి అధికార పత్రాలు ఇచ్చి, వేరే వేరే ప్రాంతాలలో రాజ్యాలలో భక్తులనుండి సేవలకు రుసుము, విరాళాలు సేకరించేవారట.

తిరుమలకు వచ్చిన యాత్రికులు నేరుగా దేవాలయం కార్యాలయంలో కాని లేదా హుండీలో వారి కానుకలకు చెల్లించేవారు.

బంగారు వాకిలిలో పారెపత్తేదారు నిలబడి యాత్రికులనుండి వాకబు చేసి, పెద్దమొత్తాలు తెచ్చినవారిని కూర్చుండ చేసి, వారినుండి కానుక తీసుకుని, లెక్కపెట్టి, గుడ్డలో మూటగట్టి, దానికి సీలువేసి, ఆ మూట ఆ యాత్రికునికే ఇచ్చి, వాని వెంట ఒక నౌఖరును పంపి ఆ యాత్రికునికి దర్శనం బాగా అయ్యేట్టు చూసి, యాత్రికుని ద్వారా భగవంతుని ముందుండే - అంటే స్నపనమందిరంలోని కానుకల గంగాళంలో ఆ కానుక మూట వేసేట్లు చూస్తారట. ఆ యాత్రికునికి ప్రసాదం, ఇతరమర్యాదలు (ఇచ్చిన కానుకను బట్టి) చేసేవారట.

ఆ రోజుల్లో ఉదయం 8 గంటలకు ఆలయ తలుపులు జియ్యంగారు, అర్చకులు, గొల్ల, ఆలయ అధికారి పారెపత్తెదారు సమక్షంలో తీసి - ఇప్పటిలాగే సుప్రభాతంలో జరుగుతున్నట్టు లోపల దీపాలు సరిదిద్దడం, శుద్ధి చేయడం - భోగశ్రీనివాసుని శయనమంటపం నుండి గర్భగృహంలోకి తీసుకెళ్లడం ఆ తర్వాత ప్రాతఃకాలపూజ, తోమాల, అర్చన నైవేద్యంతో సహా పూజ చేసి 10 గంటలకు దర్శనం మొదలు పెట్టేవారట. 10 నుండి 12 గంటల వరకూ దర్శనం, తర్వాత మధ్యాహ్నపూజ.

దర్శనం పూర్తవగానే స్వామివారి ముందు ఉంచిన కానుకల గంగాళం, బంగారు వాకిలి బైట ఉన్న రంగమంటపానికి జియ్యంగారు, పారెపత్తెదారుల సమక్షంలో కాపలా దారులదారు గొల్లలచేత తెప్పించేవారు.

కట్టిన మూటలు అన్నీ ఆలయ జమ పుస్తకాలలో ఖాతాలు రాసి, మిగతా కానుకలన్నీ కూడా గుడ్డలలో మూటలు గట్టి వాటన్నిటికీ జియ్యంగారుది, పారెపత్తేదారుది, సీళ్లువేస్తారు. అదికాక ఆర్జితసేవలకు (ముందుగానే సేవకింత అని రుసుము చెల్లించి చేసుకునే సేవలు) వచ్చిన ఆదాయం విడిగా లెక్కరాసి ఆ ఖాతాలపై జియ్యంగారు, గుమాస్తా, పారెపత్తేదారు సంతకాలు చేస్తారు. ఈ కట్టిన మూటల హుండీని ఆలయంలో బంగారువాకిలి లోపల ఉన్న స్నపనమండపంలో భద్రతా అరలలో దాచి సీళ్లు వేసి కాపలాదార్లకు అప్పగించేవారు.

తర్వాత రాత్రి మళ్లీ 8 గంటలకు ఆలయానికి ఉదయంలాగే అందరూ వెళ్లి 9 గంటల వరకూ రాత్రిపూజ పూర్తిచేసి, 9 గంటలకు భక్తులకు దర్శనానికి వదిలేవారట. రాత్రి 10 తర్వాత ఏకాంతసేవో - పవ్వళింపు సేవో చేసేవారు. ఉదయంలాగే వచ్చిన కానుకలు రాత్రి కూడా మూటలు కట్టి లోపల తలుపులు అర్చకులు వేస్తే, బయట బంగారువాకిలి దగ్గర పారెపత్తేదారు, జియ్యంగారు తాళాలు వేసి, సీళ్లు వేసేవారట.

ప్రస్తుతం జరుగుతున్నట్టే అన్ని సేవలూ జియ్యంగారు కాని అతని ప్రతినిధిగా ఏకాంగి కాని ఉండి చేయాలి. పూజకు వాడే ప్రతి పదార్థం జియ్యంగారి ద్వారానే - హారతితో సహా - అర్చకునికి అందుతుంది. అర్చకుడు కైంకర్యం చేసి ఆ పదార్థాలు వినియోగిస్తున్నప్పుడు జియ్యంగారు లేదా ఆయన ప్రతినిధి అక్కడే ఉండాలి.

ఉగ్రాణంలో పనిచేసే నౌకరు ఆలయం బైటకు వెళ్లి యాత్రికులు కొట్టిన కొబ్బరిచిప్పలు, తమలపాకులు, వక్కలు పోగుచేసి అక్కడికక్కడే ధరకు వర్తకులకు వేలంలో అమ్మి, ఆ డబ్బు సర్కారుకు జమ చేస్తారు.

★ ★ ★

65. స్వామివారి వంటిమీద నగలే మిగిలాయి!

రాజకుమారి సమవాయి మూలవరులకు ప్రత్యామ్నాయమూర్తిగా రోజూ భోగాలందుకోవడానికి భోగశ్రీనివాసుని ప్రతిష్ఠ చేసిన 966 సంవత్సరం నుండి ఇప్పటిదాకా అంటే- 1801 సంవత్సరంలో ఈస్టిండియా కంపెనీవారు ఆలయాన్ని అమల్దార్లనుండి సొంత పరిపాలనలోకి తీసుకొన్నప్పటి వరకు, ఎందరో రాజులు, చక్రవర్తులు, సామంతులు, సైన్యాధికారులు, వ్యాపారులు, స్థానికులు, ధనికులు, ఎన్నో నగలు స్వామి వారి అలంకారానికి దానాలుగా, కానుకలుగా ఇచ్చారు కదా!

ఎందరో భక్తులు - అజ్ఞాతభక్తులుగా, హుండీలో నిలువుదోపిడులు చేసి, ముడుపులు కట్టి, స్వామివారికి నగలు, బంగారు నాణాలు ఇచ్చారు కదా! ఎందరో రాజులు కనకాభిషేకాలుగా వేలకొలది నాణాలు, కాసులు కానుకగా ఇచ్చారుకదా!

అందరూ ఇచ్చినవాటికి శిలాశాసనాలు చెక్కించకపోయినా, చెక్కిన శాసనాలలో ఇచ్చిన నగలు, నాణ్యాలూ, వజ్రాలూ, ఆభరణాలు లెక్క చూసినా ఎంత బంగారం ఉండాలి? ఎన్ని ఆభరణాలు ఉండాలి? అవన్నీ ఉన్నాయా? లేకపోతే ఏమయినాయి? కృష్ణదేవరాయలు, అచ్యుతరాయలు, సదాశివరాయలు... ఇలా ఎందరో విజయనగర రాజులు ఇచ్చినవన్నీ ఏమయినాయి? ఉన్నాయా?!

...ఈ ప్రశ్నలకు సమాధానాలు కావాలంటే ఆలయం ఆదాయాలు ఎలా ఖర్చు పెట్టేవారో తెలుసుకుంటే కాని అప్పటి పరిస్థితులు తెలుసుకోలేం.

స్వామివారి ఆలయంలో వచ్చే బంగారం, నగలు, ఆభరణాలు- రకరకాలు. మొక్కులు తీర్చుకోవడానికి ఇచ్చే నగలు దాదాపుగా అన్నీ హుండీలో వేసేవే. స్వామివారి మూలవిగ్రహానికి కాని, ఇతర ఆలయంలోని బేరాలు (ఇతరమూర్తులకు) కాని ప్రత్యేకంగా అలంకారం చేయడానికి నగ ఇస్తామని మొక్కుకుంటే తప్ప- రత్నాలహారాలు, ముత్యాలహారాలు, బంగారు గొలుసులు పథకాలతో సహా కృష్ణదేవరాయలు, అచ్యుత రాయలు, తిమ్మరుసు వంటి వారు ప్రత్యేకంగా స్వామివారి

అలంకారానికి చేయించినవన్నీ ఆలయ భద్రతా భోషాణాల్లో ఉండేవి. ఈ నగలుకూడా రెండురకాలు - స్వామివార్ల నిత్యకైంకర్యానికి వాడేవి, స్వామివారి ప్రత్యేక అలంకారానికి - అంటే ఉత్సవసమయాల్లో, విశేష దినాలలో విశేష అలంకారాలకు వాడేవి.

స్వామివారి నిత్యకైంకర్యానికి వాడే నగలు, ఇతర బంగారు పాత్రల వంటివి అర్చక మిరాశీదారుల అధీనంలో ఆలయంలోనే ఉండేవి. వాటి జవాబుదారీ ఆలయ అర్చక మిరాశీదారులది. ప్రతి సంవత్సరం బ్రహ్మోత్సవాల తర్వాత మిరాశీదారులు వంతులు మారినప్పుడు ఆలయ అధికారుల సమక్షంలో లెక్కలు చూసి, పాతవంతుదారు, కొత్తవంతుదార్లకు అందజేసి, అందరి సంతకాలతో రికార్డు తయారుచేస్తారు. మామూలు తరుగులు కాక, రాళ్లుపోయినా, నగ పోయినా, వాటి బాధ్యత అర్చకులదే. వారికి ఆలయం నుండి వచ్చే ఆదాయం నుండి మినహాయింపు చేస్తారు.

ఇవికాక విశేష అలంకారానికి వాడే నగలు. ఇవి మూలవరులవి కావచ్చు, ఉత్సవవరులవి కావచ్చు లేదా ఇతరమూర్తులవి కావచ్చు. ఈ నగలన్నీ ఆలయ అధికారులు, అర్చక మిరాశీదారుల, జియ్యంగార్ల సంయుక్త సంరక్షణలో ఆలయంలోనే భద్రతా అలమారులలో ఉంచేవారు. ఈ ముగ్గురి సమక్షంలోనే ఈ అలమారులు తెరిచేవారు. ఏ నగ అందులో నుండి తీసినా, అందులో కొత్తగా పెట్టినా, అందరి సమక్షంలో, ఆయా ఖాతా పుస్తకాలలో అందరి సాక్షిసంతకాలతో ఈ లావాదేవీలు జరిగేవి. ప్రత్యేక ఉత్సవాలలో విశేష అలంకారంగా వాటిని తీసి ఇవ్వడం, ఉత్సవం అయింతర్వాత వాటిని మళ్లీ భద్రంగా అలమారులకు చేర్చడం జరిగేది. ఉత్సవ సమయంలో వాడుతున్నంత సేపూ వాటి బాధ్యత అర్చక మిరాశీదారులదే.

కొంతకాలం వాడిన తర్వాత ఈ నగలు విరిగి పోవచ్చు, రాళ్లు ఊడిపోవచ్చు, అరిగి పాడయిపోవచ్చు. అప్పుడేం చేస్తారు?

కందాడై రామానుజ అయ్యంగారు గురించి చెప్పుకొన్నప్పుడు చూశాం కదా. ఆయన ప్రసాదాలు అమ్మిన డబ్బుతో ప్రతి సంవత్సరం 3000 వరహాలు ఆదా చేసి, ఆలయంలోని స్వామివారి ఆభరణాలకు మరమ్మత్తులు చేయించేవారు. దానికి రాజుగారి ప్రత్యేక అనుమతి కూడా ఉందని, అలా చేసేటప్పుడు, మరమ్మత్తులన్నీ, ఆలయ అధికారుల, జియ్యంగార్ల సమక్షంలోనే జరగాలని కూడా రాజు శాసనం చేసినట్లు చూశాం.

అలా దాతలు ఇచ్చిన విరాళాలతోగాని, స్థానత్తారులు ఆలయ నిధులనుండి ఖర్చుపెట్టి కాని, స్వామివారి నిత్య, విశేష అలంకారాలకు వాడే అన్ని ఆభరణాలు, మరమ్మత్తులు కావల్సినప్పుడు చేయించే సంప్రదాయం ఉండేది. ఇక మరమత్తు చేసినా, నగ వాడటానికి పనికి రాని పరిస్థితి ఏర్పడితే, ఈ ఆలయం లెక్కల నుండి తీసివేసి ఆలయ ఖజానాకు అటువంటి నగలు పంపే ఏర్పాటు ఉండేది.

మరి ఇతర బంగారు నాణాలు, ఆభరణాలు, హుండీలో వచ్చిన నగల విషయం ఏమిటి?

స్వామివారి వాడకానికి పనికిరాని కొత్తనగలను, దాతలు నేరుగా ఆలయాధికారుల కిచ్చినా, హుండీలో వేసినా, అవన్నీ హుజూరు వారి ట్రెజరీకి జమచేయబడతాయి. అలా స్వామివారికి వాడే నగలు ఒక లాగ, వాడకానికి పనికి రాని నగలకు ఒకలాగ విడగొట్టే పద్ధతి ఆలయంలో మొదటి నుండి ఉంది.

ఆ కాలంలో బంగారు నాణేలు, పగోడాలు, పణాలు, నర్పణాలు, వరహాలు, ప్రత్యేక బంగారు నాణాలు, బంగారు అచ్చులు, ఆర్థిక లావాదేవీలలో చలామణిలో ఉండేవి. చాలామంది దాతలు బంగారు నాణాలే కాక, నగలు కూడా దేవదేయం చేసి, వాటి మీద వచ్చిన ఆదాయంలో ఆచంద్రార్కం, సేవలో నైవేద్యాలో చేయాలని ఆలయానికిచ్చారు కదా! ఆలయ ట్రెజరీలో ఆ నగకానీ, బంగారు నాణేలు కాని వుంచేస్తే దానిమీద ఆదాయం ఏం వస్తుంది? దాతలు చెప్పిన సేవలు, నైవేద్యాలు కైంకర్యాలు ఎలా జరుగుతాయి?

ఆ కాలంవరకూ (19వ శతాబ్దం వరకూ) ఆలయనిధులను వడ్డీలకు ఇచ్చి ఆదాయాలు సంపాదించిన దాఖలాలు లేవు. అందుకే ఆలయంలో స్వామివారికి అలంకారం కోసం వాడని, పనికిరాని, నగలన్నీ బంగారం, ఇతర విలువైన రాళ్ళు గాని, వెండికాని, నగదు రూపంలో మార్చి, ఆ నగదును దేవస్థాన దేవదేయ గ్రామాలలో భూములకు నీటిపారుదలకు, కొత్త భూములు సాగులోకి తేవడానికి పెట్టుబడులుగా పెట్టి, వాటివలన వచ్చిన ఎక్కువ ఆదాయాన్ని ప్రతి సంవత్సరం దాత కోరిన సౌకర్యాలకు వాడే వ్యవస్థ ఉండేది. ఒకానొక సందర్భంలో దేవస్థానానికి 400 గ్రామాలు దేవదేయాలుగా ఉండేవి. అవే కంపెనీ వారి కాలానికి 187 అయి, అవి కూడా ఆలయ అధీనంలో కాక ఇతరుల అధీనంలోకి వెళ్లినట్లు చూశాం.

కృష్ణదేవరాయలు 30,000 బంగారు నాణాలను ఆనందనిలయ విమానానికి బంగారుపూతకు ఇచ్చినట్లు, ఇతరదాతలు బంగారం గాని, నగలుకాని ఏదైనా ప్రత్యేక

కార్యక్రమానికి ఇస్తే - ఆ బంగారాన్ని దానికే వాడేవారు. మనకు దొరుకుతున్న ఆధారాలను బట్టి, వాడని నగలు కరిగించి బంగారంగా చేసి అమ్మేవారా లేదా, నగలు గానే అమ్మేవారా అన్న విషయం స్పష్టంగా లేదు.

అమలుదార్లు ఆలయ రంగంలోకి దిగాక ఆలయానికి వచ్చే ఆదాయంలో- హుండీలో పడిన నగలు, బంగారం, ఇతర విలువైనవన్నీ ఆలయ ఆదాయం కింద అమలుదారు ఖాతాలోకే వచ్చేవి. స్వామివారి అలంకారానికి ప్రత్యేకంగా ఇచ్చిన నగలు తప్ప - అంతకుముందు, అంటే విజయనగర రాజుల పాలన 18వ శతాబ్దం మధ్యవరకు - ఎలా వచ్చినా ఆదాయం ఆలయానికే దక్కేది. తర్వాత కూడా ఆచంద్రార్కం చేసే సేవల దేవదేయ విషయం ప్రత్యేకం. అమలుదార్లు వచ్చాక, యాత్రికులకు, భక్తులకు, ఈ సేవలు ఆచంద్రార్కం జరగాలని దేవదేయం చేసినా, అలా వీరు జరుపుతారన్న నమ్మకం లేదు. అందుకే అక్కన్న/ మాదన్నల కాలంలో చూశాం. కృష్ణపండిత్ చేసిన దేవదేయం - బంగారు కంటెని ఆలయానికి ఇవ్వకుండా, శాసనం చెక్కించి, ఒక మధ్యవర్తికి బంగారు కంటెను ఇచ్చి, దానిపై వచ్చిన ఆదాయంతో ప్రతిరోజూ కాని, సేవకు కాని నైవేద్యానికి కావల్సిన సరకులు ఆలయానికి మధ్యవర్తి ఇచ్చేలా ఏర్పాటు చేయడం జరిగింది.

అమలుదార్లు వచ్చాక, భక్తులకు, దాతలకు తెలిసిపోయింది - హుండీలో వేసిన సొమ్ములు, విడిగా ఇచ్చిన సొమ్ములనీ, అక్కడి నుండి ఖజానాకు అమలుదారు ద్వారా నవాబుకో, ఇంగ్లీషు వారికో చెందుతాయి కాని, ఆలయానికి మిగలవు - అని. స్వామివారి అలంకారానికిచ్చినవి మాత్రం ఆలయంలో భద్రంగా ఉంటాయన్న విషయం కూడా ప్రచారమయింది. అందుకే దాతలు ప్రత్యేకంగా స్వామివారి/ ఉత్సవాల అలంకారానికి నిర్దేశించి నగలు ఇవ్వటం ప్రారంభించారు.

అలా నగలు ఆలయానికి అలంకారానికి ఇచ్చి అక్కడే ఉంచేస్తే, మరి అమలుదారు కేమిటి? నవాబు కేమిటి? కంపెనీవారికేమిటి? అలా వదిలేస్తే ఎవ్వరూ నగలు, హుండీలో వేయకుండా అందరూ స్వామివారి అలంకారానికి అని చెప్పి ఇవ్వవచ్చు కదా! అలా చేస్తే అందులో మనకు ఆదా లేదు కదా అని తెలిసి 'వర్తన' పథకం మొదలు పెట్టారు.

ఎవరైనా స్వామివారి అలంకారం కోసం ప్రత్యేకంగా ఆలయానికి నగ/ ఆభరణం ఇస్తే, స్వామివారి అలంకారం కోసం దాన్ని ఆలయంలోనే ఉంచి వినియోగం

చేయాలంటే, ఆ దాత, ఆ నగ విలువ ఎంత ఉంటుందో అంత సొమ్ము 'వర్తన' (అదొక రకమైన పన్ను) రూపంలో ఆలయానికి కట్టాలి. అలా కడ్తేనే స్వామివారి అలంకారానికి వినియోగం చేస్తారు; లేకపోతే ఆ నగ ట్రెజరీకి వెళ్లి ఆలయ ఆదాయంలోకి వెళ్తుంది. అలా 'వర్తన'తో తమకు నగ రాకపోయినా నష్టం లేకుండా చూసుకొన్నారు అమలుదార్లు.

అప్పుడు మొదలైన ఈ 'వర్తన' వ్యవస్థ, 1980 వరకూ – అంటే కంపెనీ వారి కాలంలో, మహంతుల కాలంలో, తర్వాత ప్రభుత్వం నియమించిన ధర్మకర్తల మండళ్ల కాలంలో కూడా ఆచరణలో ఉండేది. నేను కార్యనిర్వాహణాధికారిగా ఉన్నప్పుడు చిక్కమగుళూరు, కర్ణాటక నుండి నాగరాజారావు అనే పేద కుటుంబీకుడికి స్వామివారు కలలో కనబడి కోరిన కోరిక ప్రకారం స్తోమతలేకపోయినా, కుటుంబమంతా ఒక్కపూట తిండిమాని కష్టపడి 16½ సంవత్సరాలు కూడపెట్టి 108 బంగారు కాసుల హారం స్వామివారికి సమర్పణ చేసి, ఆ నగ అలంకారం చూసి తరించాలన్న స్వామివారి ఆదేశం ప్రకారం ఆ నగతో కొండకు వచ్చినప్పుడు, వారికి 'వర్తన' కట్టే శక్తి లేదని తెలిసినప్పుడు, భగవత్ప్రేరణతో ఈ 'వర్తన' విధానాన్ని రద్దు చేయించే అదృష్టం నాకు భగవంతుడు కల్గించాడు. భగంతునిపై భక్తిని వ్యాపారంగా వాడుకొనే సంప్రదాయాన్ని తొలగించే భాగ్యం నాకు కలిగింది (ఈ సంఘటన వెనుక కథ వివరాలన్నీ 'నాహంకర్తా...' పుస్తకంలో రాశాను).

దీన్ని బట్టి మనం తెలుసుకొనేది – ఆలయానికి వచ్చిన బంగారం / ఆభరణాలు, వినియోగానికి పనికిరాని కొత్త, పాత ఆభరణాలన్నీ ఆలయ ఆదాయంలోకి జమకట్టబడి, అమలుదార్ల, నవాబుల, ఇంగ్లీషు కంపెనీదార్ల ఖాతాల్లోకి వెళ్లిపోయాయి. స్వామివారికి వాడే నిత్య / విశేష అలంకార ఆభరణాలు మాత్రమే మిగిలాయి.

నవాబులకు ముందుకాలంలో ఆదాయంగా వచ్చిన సొమ్ము అంతా దేవదేయం భూములు / గ్రామాలలో నీటి పారుదలకు, కొత్త భూములు సాగు చేయించడానికి, భూమి మరమ్మత్తులకు వినియోగంచేసి, ఆలయ వార్షిక ఆదాయం పెంచడానికి పెట్టుబడులుగా ఖర్చు చేయబడ్డాయి.

అంటే ఆలయభూములు / గ్రామాలను కంపెనీ వారు జప్తుచేసినప్పుడు, భూములు వాటిమీద ఆదాయాలే కాదు, అంతకు ముందు కాలాల వరకూ, నగదు, నగలు / బంగారం రూపంలో వచ్చిన ఆదాయం అంతా భూముల ఆదాయం పెంచే

పెట్టుబడులుగా వాడారు. కనుక ఆ మూలధనం అంతా పోయింది. ఆలయానికి మిగిలినది – స్వామివారికి రోజూ అలంకారానికి వాడే నగలు, విశేష అలంకారానికి ఆలయంలో భద్రపరచిన నగలు, వర్తన కట్టి, ఆలయానికి స్వామి అలంకారానికని భక్తులు ఇచ్చిన నగలు మాత్రమే.

మిగతా ఆస్తులు, ఆదాయాలు, అన్నీ పోయాయి. వాటితో వాటిపై ఆధారపడిన ఉత్సవాలు, నైవేద్యాలు, ఆ నైవేద్యాలు భాగాలపై ఆధారపడిన ఉచిత రామానుజకూటాలు, సత్రాలు, ఆలయ అధికారులకు వచ్చే ఆదాయాలు అన్నీ పోయాయి. ఆలయ పరిపాలన, కట్టడాల సంరక్షణ బాధ్యతలు, ఆలయంలో నిర్వహించే అధికారులకు ఇవ్వాల్సిన వేతనాల బాధ్యత, ఉత్సవాలు, సేవలు చేయించాల్సిన బాధ్యతలు మాత్రం మిగిలాయి.

★ ★ ★

66. ఈస్టిండియా కంపెనీ - హిందూమతపు 'దయ్యం'

"**హిం**దూవ్యవస్థని నిలబెడుతున్న బ్రాహ్మణులను అణగద్రొక్కి, ఆలయవ్యవస్థను నిర్వీర్యం చేసి పారేస్తే, మతం ఆధారంగా హిందువులు బ్రిటిషువారి (ఈస్టిండియా కంపెనీ) మీద తిరుగుబాటు చేసే శక్తిని కోల్పోతారు... తిరుమల ఆలయం విషయంలో ఇప్పటివరకూ చేసింది చాలదు... ఇంకా చేయాలి... హిందూమతం అనే దయ్యానికి వున్న ఆయువు పట్లన్నిటినీ దెబ్బతీయాలి..."

ఇవన్నీ తిరుమలపై అజమాయిషీ చలాయిస్తున్న బ్రిటిషు అధికారి 1831 ఆగస్టులో కంపెనీ ఉన్నతాధికారుల కోసం రాసిన భావాలు.

★ ★ ★

19 వ శతాబ్దం మొదటి రోజుల్లో ఈస్టిండియావారి పరిపాలనలో లేదా వారి అధీనంలో లేదా వారి వ్యాపార పరిధిలో వున్న ప్రాంతాలు - బ్రిటిష్, విదేశీయ ఇండియా, చైనా, ఆస్ట్రేలియాల విషయాలకు సంబంధించి ఒక ఏషియాటిక్ జర్నల్ (పత్రిక) నెలవారీ వార్తా రిజిస్టరు - లండన్‌లో ప్రచురింపబడేది.

1831 మే-ఆగస్టుకు చెందిన ఈ పత్రికలో ఒక ఆసక్తికరమైన వ్యాసం తిరుమల ఆలయం గురించి ప్రచురించబడింది. రాసినది ఒక ఆంగ్ల రెవెన్యూ అధికారి అని తెలుస్తోంది. తిరుపతి అంతా కూడా అతని అధీనంలో వుండేదిట. ఆలయంతో నేరుగా సంబంధం లేకపోయినా తాలూకా రికార్డుల ద్వారా ఆలయవిషయాలు అతనికి పూర్తిగా తెలిసే అవకాశం వుంది. చాలా పరిశోధనచేసి ఆనాటి విషయాలు కళ్లకు కట్టినట్లు వర్ణించాడు. ఆనాటి ఆంగ్లేయులలో హిందూమతం పైనా, విగ్రహారాధన పైనా, ఆలయ వ్యవస్థపైనా వుండే దురభిప్రాయాలకు ఈయన దూరమేమీ కాదు. మన్రో లాగా ఆలయాల మీదా హిందూమతం మీదా ఈయనకు గౌరవం ఉన్నట్లుగా కనపడదు - కాని ఆనాటి ఆలయానికి సంబంధించిన విషయాలు, పరిస్థితులకు అద్దం పట్టేట్లు ఉంటుంది ఈయన వ్యాసం.

ఈ వ్యాసాన్ని మద్రాసులో ఉన్న రికార్డు ఆఫీసునుంచి సేకరించి టి.కె.టి. వీరరాఘవాచారిగారు తమ 'హిస్టరీ ఆఫ్ తిరుపతి' గ్రంథంలో అపెండిక్సుగా పొందుపరచారు. దాని స్వేచ్ఛానువాదం యిలా వుంది...

"ఈ (తిరుమల) ఆలయంలో ఇండియా నలుమూలల నుండి వచ్చే విష్ణుభక్తుల కానుకలు విశేషం... రాజులు వారంతట వారొచ్చినా కానుకలు తెస్తారు. కాని వారి ప్రతినిధుల ద్వారా కూడా ఆలయానికి కానుకలు పంపే సంప్రదాయం ఉంది. రాజులు, జమీందారులే కాక, చాలా పేద గ్రామీణులు కూడా వారికి ఏమీ లేకపోయినా, ఉన్నదాంట్లో తృణమో, పణమో, రాగి నాణెమో, వెండి నాణెమో ముడుపుగా పెట్టి, పసుపుతో చేసిన అక్షింతలు దానికి మూటకట్టి, తడిసినా పాడవని కొవ్వొత్తి కాగితంలో చుట్టి, పెద్దముడుపుగా తయారుచేస్తారు. ఇదంతా ఎందుకంటే... కొండమీద విగ్రహానికి బొమ్మరాజు జమీందారీలోని నారాయణవనంలో ఆకాశరాజు కూతురిపై ప్రేమ పెల్లుబికి, పెండ్లి ఖర్చులకు డబ్బులేక కుబేరుని (ఇండియన్ ఫ్లుటస్) దగ్గర అప్పు చేశాడు. ఈ దేవుడు అలా తీసుకొన్న అప్పు కింద ప్రతి సంవత్సరం తన ఆదాయాన్ని పాతూరు, స్వర్ణముఖి నదుల మధ్యభాగాన్ని పరిపాలించే రాజుకు చెల్లించాలని నియమం పెట్టారు.

ఈ దేవునిపై భక్తితో వేలాది భక్తులు ప్రతి సంవత్సరం ఈ కళ్యాణవార్షికోత్సవాలకు (బ్రహ్మోత్సవాలకు) తండోపతండాలుగా వస్తారు. సంవత్సరానికి వచ్చే ఆదాయంలో మూడు వంతులు ఈ తొమ్మిది రోజుల బ్రహ్మోత్సవాలలోనే వస్తాయి.

గుడికి సంబంధించిన బ్రాహ్మణులు, ఈ వచ్చిన ఆదాయం గుడిలోని పూజలకు, స్వామివారి ఉత్సవాలకు వాడాలంటారు. అలా వాడేవారు కూడా. కాని ముసల్మానులు ఈ స్వామివారి ఆదాయాన్ని తమ సొంతం చేసుకోవడం మొదలుపెట్టారు...

మనకు (ఇంగ్లీషువారికి) ఫ్రెంచివారితో జరిగిన మొదటి యుద్ధంలో ఈ ప్రాంతంలో ఈ ఆలయం నుండి వచ్చిన ఆదాయమే మొదటి విజయంగా భావించవచ్చు (ఆర్కాటు నవాబు ఇంగ్లీషువారికి తిరుమల

ఆదాయాన్ని ధారాదత్తం చేశారు. ఆ విషయం ప్రస్తావిస్తున్నాడు. కాని ఇది న్యాయంగా వచ్చిన ఆదాయమా అన్న విషయం వివాదాంశమే...)

ఇలా స్వామివారికి ఇచ్చే కానుకలను కామ్యకర్మగా భావించవచ్చు. ఇచ్చే కానుకలు ఏ వస్తువైనా కావచ్చు. ఏ రూపంలోనైనా కావచ్చు. బంగారు, వెండిముద్దలు, అన్నిరకాల నాణాలు, రూపాయల సంచులు, రాగి డబ్బులు, మసాలా దినుసులు, ఇంగువ, తలనీలాలు (చిన్నప్పటి మొక్కులు)... అందమైన భామలు తమ తల్లిదండ్రులు తమ చిన్నప్పుడు వెండ్రుకలు ఇస్తామని మొక్కుకుంటే అది ఎన్నేళ్ల తర్వాత అయినా ఈ కన్యలు ఇవ్వాల్సి వస్తోంది. కుంటివాడు-వెండికాళ్లు, గుడ్డివాడు - బంగారంతో కాని వెండితోకాని చేసిన కన్నును... ఇలా ఇచ్చుకుంటూ వెళ్తారు. హిందూమతంలో వీరికున్న మూఢనమ్మకాలకు ఇదొక నిదర్శనం.

ఒక అందమైన భామ తన వొంటిపైన ధగధగా మెరుస్తున్న నగలన్నీ వొలిచి, బంగారు జలతారుచీర విప్పి, ఈ రాతి విగ్రహం ముందు చినిగిన వస్త్రాలు కట్టుకొని తాను విప్పినవన్నీ హుండీలో వేసి నిలువుదోపిడి ఇవ్వడం వింత కాదా?

తన శిశువుకున్న కాలి అందెలు, చేతి గాజులు విప్పి హుండీలో వేసి, ఈ రాతి విగ్రహం తన పైనా, తన శిశువుపైనా అనుగ్రహం చేస్తుందని నమ్మడం, తాను ఈ పని చేయడానికి ఆనందంగా వందల మైళ్లు ఎంతో ప్రయాసలకులోనై రావడం వింతకాదా?... ఈ యాత్ర తప్ప ఆమె జీవితంలో తన ఊరి బయటకే వచ్చి వుండకపోవచ్చు...!

ఇటువంటి మొక్కులు కొడుకు పుట్టాలనో, పుట్టిన కొడుకు ఆరోగ్యంగా వుండాలనో, తన శత్రువును జయించడానికో లేదా శత్రువుతో సామరస్యం రావడానికో, వ్యాపారం వృద్ధి కావాలనో, ఆరోగ్యం కుదుటపడాలనో, కూతురికో, కొడుకుకో పెండ్లి కావాలనో... యిలా ఎవరికైనా కావచ్చు. తీర్చేది ఆ తిరుపతి దేవుడే అని మొక్కుకొని తిరుపతికి బయలుదేరుతారు, మంచి జ్ఞానం కల పండితులు. ఏ విషయం తెలియని పామరులు కూడా ఈ తిరుపతి దేవుని విషయంలో గుడ్డినమ్మకం కలవారే.

ఇలా మొక్కుకొన్న వారే ఈ కానుకలు తేవాలని లేదు... వారి బంధువుల ద్వారా, స్నేహితుల ద్వారా, వకీళ్ల ద్వారా పంపే సంప్రదాయం వుంది. అన్నిటికీ మించి 'గోశాయి'ల ద్వారా పంపించేది అందరూ అవలంబించే విధానం.

ఈ 'గోశాయిలు' ఆలయ ఉద్యోగుల లాంటి వారు... ఆలయం అటువంటివారిని చాలామందిని నియమిస్తుంది. బ్రహ్మోత్సవాలకు కొన్ని నెలలముందు, వారందరిని దేశం నలుమూలలకూ ఆలయం అధికారులు పంపుతారు. వారు వెళ్లాల్సిన ప్రాంతం చేరాక, వారితో తెచ్చిన ఆలయ పతాకాన్ని ఎగురవేసి ఆలయంవారు ఇచ్చిన అధికారపత్రాన్ని అందరూ చూచేట్లు ప్రదర్శిస్తారు. ఈ పతాకం చుట్టూ – హిందూ విగ్రహారాధకులు చేరి భజనలు చేస్తూ ఆ గోశాయిలకు వారివారి కానుకలను భగవంతునికి అర్పించమని ఇస్తారు. సొంతంగా రాదలచుకొన్నవారు ఆ గోశాయిలతో కలిసి తిరుమలకు వస్తారు.

ఇలా గ్రామగ్రామాలు తిరిగి ఈ గోశాయిలు – కానుకలు, జనాన్ని ప్రోగు చేసుకొని తిరుమలకు తిరుగు ప్రయాణమవుతారు (గ్రుడ్డివాడు ఇంకొక గుడ్డివాడిని తీసుకువెళ్లినట్లు). వీరందరూ వార్షిక వివాహ ఉత్సవాల (బ్రహ్మోత్సవాలు) సమయానికి కొండకు చేరుతారు....

ఈ గోశాయిలకు భక్తులు ఇచ్చిన కానుకలు దొంగిలించే సంప్రదాయం లేదు. వారికి తృణమో పణమో భక్తుల నుండి ముడుతోంది. దారి ఖర్చులు వగైరా ఆలయం భరిస్తుంది... యాత్రికులు ఈ గోశాయిల ద్వారా రావడానికే ఆసక్తి చూపుతారు. అలా వస్తే, వసతికి, భోజనానికి, దర్శనానికి ఇబ్బందులుండవు. అన్ని విషయాలు ఈ గోశాయిలే చూసుకొని భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తారు. అలా తిరుమలకు వస్తున్నప్పుడు, "గోవిందా గోవిందా" అని అరుచుకొంటూ వస్తారు. కొందరు "అలమె–మంగూ" అని కూడా అరుస్తుంటారు.

నేను (ఆంగ్ల రచయిత) తిరుపతికి ప్రయాణం చేస్తున్నప్పుడు, ఎన్నో గుంపుల యాత్రికులను ఇలా భక్తితో గోవిందనామం చెప్తూ రావడం చూశాను. దారంతా ఎంతో సందడి. ఏదో ఆటవికుల హడావుడి అనిపించింది.

వీరు ఇచ్చే కానుకలు ఎక్కడోగాని వెయ్యి రూపాయలపైన వుండవు. ఈ దేవుడు వీరు ఇచ్చిన కానుకలను బట్టి అనుగ్రహం చేస్తున్నడానిపిస్తుంది. 100 రూపాయలిచ్చిన వాడికి ఒక సన్నటి వస్త్రం, 100 నుండి 500 రూపాయల వరకు పువ్వులద్దిన పట్టు వస్త్రం, 1000 రూపాయలైతే మంచి శాలువా... ఇలా కానుకను బట్టి అనుగ్రహం.

ఆలయానికి ఇంకొక ఆదాయం 'వర్తన'. విగ్రహానికి అలంకరణ కోసం ఇచ్చే ఆభరణాలు, వస్త్రాలు, వగైరాలను విగ్రహానికి అలంకరించాలంటే ఆ కానుక ఇచ్చే ఆసామి దాని విలువ ఎంతో అంత నగదు రూపంలో ఆలయాధికారులకు కట్టాలి. దానినే వర్తన అంటారు. అలా వర్తన కడితే ఆ నగలు ఆలయంలోనే స్వామికి అలంకారానికి వుంచుతారు. లేకపోతే ఆ నగలన్నీ ప్రభుత్వ ఖజానాకు చేరతాయి. వర్తన ధనం ప్రభుత్వం (కంపెనీ) కి చెందుతుంది.

(ఈ వర్తన రుసుము నేను దేవస్థానాల కార్యనిర్వహణాధికారిగా వున్నప్పుడు 1978-82 ప్రాంతం వరకు అమలులో వుండేది. 1980లో చిక్కగుళూరు ప్రాంతం నాగరాజారావు కాసులహారం స్వామివారికి కానుకగా 16 సంవత్సరాలు కుటుంబమంతా ఒక పూట ఉపవాసం చేసి అలా పొదుపు చేసిన ధనంతో 108 కాసుల లక్ష్మీహారం స్వామివారి ఆజ్ఞానుసారం స్వామివారికి శుక్రవారం అభిషేకసమయంలో అలంకరణ చేయాల్సిన సందర్భంలో ఈ వర్తనను రద్దుచేయడమైనది. ఈ సంఘటన వివరంగా 'నాహం కర్తాహరిః కర్తా' (సర్వ సంభవామ్) అనే నా తిరుమల అనుభవాల పుస్తకంలో ఇవ్వబడింది).

పైన చెప్పిన రెండురకాల ఆదాయాలు కాకుండా, మూడో రకం ఆదాయం ఆర్జికం (ఆర్జితం) సేవల నుండి వచ్చే ఆదాయం. అది మూడు విధానాలు : 1. అభిషేకం, 2. నేవేదూం (నైవేద్యం), 3. వాహనం.

ప్రతి శుక్రవారం స్వామివారికి జరిగే తిరుమంజన స్నానకార్యక్రమమే అభిషేకం. పునుగునూనె, కర్పూరం, గంధం, ఇతర సుగంధ ద్రవ్యాలతో చేసే అభిషేకం. ఇది భక్తులు, భగవంతునిమీద భక్తితో మాత్రమే చూడగలిగింది కాదు. కానుకలు సమర్పించితేనే సాధ్యం. అదీ

బ్రహ్మోత్సవాల సమయంలోనైతే చెప్పనవసరం లేదు. ఈ సేవ చూడాలంటే ముక్కుపిండి డబ్బు వసూలు చేస్తారు. అదివరకు ఇంకా ఎక్కువగా ఉన్నా, ఈ మధ్య దాన్ని తగ్గించి 50 రూపాయలు చేశారు... స్వామివారిని సుగంధాలతో మర్దన చేసి, కర్పూర వస్త్రంతో శుభ్రంగా తుడిచి తర్వాత అలంకారం చేసేది పూలకాబు లేదా పోర్లంగి సేవ (పూలంగి సేవ) అంటారు. పూర్తిగా స్వామివారికి పుష్పాల అంగీతో అలంకారం చేస్తారు. ఇవి ప్రతి గురువారం సాయంత్రం చేసేవి. ఈ కార్యక్రమాన్ని చూడాలంటే భక్తుడు 60 రూపాయలు చెల్లించాలి. తర్వాత 'శుక' అలంకారసేవ (తోమాలసేవ). ఇది ప్రతిరోజూ జరిగేది. దీనిని చూడాలంటే 12 రూపాయలు రుసుము చెల్లించాలి. నాల్గవది - సహస్ర నామార్చన, స్వామివారికి వెయ్యినామాలతో తులసీపూజ. చూడడానికి 5 రూపాయల రుసుం చెల్లించాలి. ఆ తర్వాత 'మున్సూస్' సేవ (ఏకాంత సేవ) - స్వామివారిని నిద్రపుచ్చే ఈ సేవ చూడాలంటే 12 రూపాయల రుసుం చెల్లించాలి.

ఇవి కాక నైవేద్యానికొద్దాం. ఇందులో మొదటిది అన్నెదూము (అన్ననైవేద్యం). ఈ రకం నైవేద్యంలో పూర్మనం (పరమాన్నం), పూలకాయరం (పులియోదరం లేదా పులిహోర), మూడవది ముద్గ్రము (పొంగలి), నాల్గవది 'దుద్పుడవము' (దద్ధ్యోదనము).

వీటిని విడివిడిగానూ, కొన్నింటిని, అన్నింటిని కలిపి నైవేద్యంగా పెట్టవచ్చు. ఒక్కొక్క దానికి ఆరు రూపాయల రుసుము చెల్లించాలి - అదీ భక్తుడు చేయిస్తే. సర్కారు ద్వారా చేయిస్తే 16 రూపాయలు కట్టాల్సి ఉంటుంది.

ఆ తర్వాత 'భుగ్చ' నైవేదూము, (భక్ష్యనైవేద్యం) సర్కారు ద్వారా చేయిస్తే 20 నుండి 28 రూపాయలు చెల్లించాలి.

మూడవది 'మలమవైదూమ్' (మహానైవేద్యం - దాన్నే 'తీరుపూవర' (తిరుప్పావడ) అని కూడా అంటారు. ఇందులో 1000 నుండి 2000 వేల శేర్ల అన్నం వండి సర్కారువారు భక్తుని తరఫున స్వామివారికి ఈ అన్నపు రాశి నైవేద్యం పెడతారు. సేవకు భక్తుడు 100 నుండి 200 పగోడాలు చెల్లించాల్సి ఉంటుంది.

నాల్గవది – 'అముంతనరూమూచ' (అమంత్రణోత్సవము) ఇవి మంత్రాలతో కాక అలంకారాలతో చేసే రోజూ సేవలు. వీటికి రుసుము తక్కువే అనుకోవచ్చు – 65 రూపాయలే.

అయిదవది – 'ఊ కైపడచడి' సేవ – ఊకాయ చెట్టు (తిరుమలలో దొరికే చెట్టు కాయలతో చేసేది) దీని రుసుం నాలుగు రూపాయలు.

ఇవన్నీ పోతే మిగిలినవి వాహనసేవలు. ఇవి 12 రకాల వాహనాలున్నాయి. ప్రతి వాహనానికి హిందూపురాణాల్లో రకరకాల కథలున్నాయి. విష్ణుమూర్తికి సేవ చేసిన జంతువులు, పక్షుల మీద స్వామివారి ఉత్సవవిగ్రహాన్ని వేంచేపు చేసి చూసి తరించే సేవ (ఇక్కడ ఈ ఆంగ్ల వ్యాసకర్త మూలవరుల గురించి అసభ్యంగా రాశాడు.... లోపల ఉన్న రాతివిగ్రహం బద్ధకస్థుడవడం వల్ల తాను బయటకు రాలేక లోహంతో చేసిన విగ్రహాన్ని బయటకు పంపుతాడు అని రాశాడు.)

కల్పవృక్ష వాహనం, ఆన్దోలిక (పల్లకి) వాహనం, శేషవాహనం, సరో (సర్వ) భూపాల వాహనం, సూర్యప్రభా వాహనం, అద్ద అరం (అద్దాల మండపం), ఆండోల వాహనం (ఇంకొక రకం పల్లకీ), గుడువాహనం (గరుడ వాహనం). చంద్రప్రభ, హనుమంత వాహనం, సింహ వాహనం, బాల (చిన్న) శేషవాహనం... ఈ వాహన సేవ చేయాలంటే భక్తుడు 40 రూపాయలు చెల్లించాలి.

ఇలా ఏ సేవ చేయాలన్నా భక్తుడు కట్టే రుసుం ఆదాయం అంతా సర్కారుదే (కంపెనీదే). దేవాలయానికివ్వరు. కంపెనీ (సర్కారు వారు) ఆలయంలో జీతభత్యాలు ఇచ్చి ఉద్యోగులను నియమిస్తారు. సేవలకు కావల్సిన సరంజామా, సరకులు ఇస్తారు. వచ్చిన ఆదాయం అంతా తీసేసుకొంటారు... చాలామంది పూజారులుగా బ్రాహ్మణులను, భూముల మీద వచ్చే ఆదాయంతో సర్కారువారే పోషిస్తారు. గత పది సంవత్సరాల కాలంలో ఈ సేవల ద్వారా కానుకల ద్వారా ఈ ఆలయం తరఫున కంపెనీ వారికొచ్చే ఆదాయాలు చూస్తుంటే ఇది ఎంత లాభసాటి బేరమో తెలుస్తుంది.

ఈ ఆలయ వ్యవహారాలన్నీ చూసేది తహశీల్దారు. కంపెనీ అధికారి – సరకుల సరఫరా, సిబ్బంది జీతాల బట్వాడా, ఆలయకార్యక్రమాలు

సక్రమంగా జరిగేట్టు చూడడం, యాత్రికులకు కావల్సిన సదుపాయాలు చూడటం ఇతని బాధ్యత. అంటే ఇప్పటి టైమ్ నిర్వహణాధికారి లాగా - ఇతను ఆలయానికే కాక తాలూకాకి కూడా తహశీల్దారు. ఇతను జిల్లా కలెక్టరు కింద పనిచేసేవాడు. కలెక్టరు కంపెనీ ఆంగ్ల అధికారి. తహసీల్దారు తర్వాత అధికారి శిరస్తదారు. సాధారణంగా స్థానికుడు ఆదాయం, వ్యయం లెక్కలే కాకుండా, తహశీల్దారుకి అన్ని విషయాల్లో సహాయకారి. ఇతని కింద నలుగురు గుమాస్తాలు (స్థానిక లేఖకులు). వీరు కాక ఒక రైసగు పోలీసు గుమాస్తా. అతనికి సహాయంగా 'గొల్ల' ఒకడు, వీరు కాక నౌకర్లు - పంఖాలు తుడవటానికి, దీపాలు వెలిగించడానికి - వీరుకాక 20 మంది బంట్రోతులు - తహశీల్దారు కచేరీ పనులకు, వారి పర్యవేక్షణకు ఇద్దరు దఫేదార్లు బ్రహోత్సవాల సమయంలో కొంత తాత్కాలిక అదనపు సిబ్బందిని తీసుకోవడానికి అవకాశం ఉంది. దాదాపు 25 మంది పట్వారీలు, 5 'హిపుకురక్కులు'- వీరు తిరుపతి దారుల్లో వేచి వుండి, ధనికులైన యాత్రికుల సమాచారం తహశీల్దారుకు అందచేస్తారు. వారికి ప్రత్యేక సదుపాయాలు, వారు ఇచ్చే కానుకలను మధ్యస్థులు కొట్టుకు పోకుండా చూచే బాధ్యతా, అదే కాక యాత్రికులపై దాడులు కాని, వారిలో వారికి కొట్లాటలు జరగకుండా చూడటం కూడా వీరి బాధ్యత. ఇతర తాత్కాలిక సిబ్బందితో దొంగతనాలు జరుగకుండా, యాత్రికులను ఎవరూ మోసం చేయకుండా, వారి కానుకలు మోసం చేసిపట్టుకెళ్లకుండా చూసే బాధ్యత కూడా వీరిదే.

వీరే కాక స్థానిక సైనికాధికారి ఆధ్వర్యంలో కొంత సైనికదళం కూడా కొండమీద ఉండేది.

ఆలయానికి అనుబంధంగా ఒక ఉగ్రానము, ధాన్యాగారము ఉన్నాయి. దేవాలయంలో కావల్సిన సామానులు అన్నీ సరఫరా చేయడానికి ఉంటుంది. దీని బాధ్యత జియ్యంగారు చూస్తారు. అతనికి ఒకరిద్దరు ఏకాంగులు సహాయకులుగా పూజాసమయంలో సహాయం కోసం ఉంటారు. వారు కాక ఒక గుమాస్తా, యల్లపుగారు (ధాన్యం కొలిచేవాడు), ముగ్గురు బంట్రోతులు, గంధం తీసేవాడు, పూలవాడు, పునుగు జవ్వాది సుగంధాలవాడు, పొట్టు, పోట-వంటవాళ్లు, వంట

చెరకు అందించేవాడు, ఒక గొల్ల, ఒక ఊడ్చేవాడు, దీపాలు వెలిగించే 'మొసలి' - ఈ భండారంలో అన్ని సామానులు తగిన సమయానికి కావల్సినంత ఉండేట్లు చూసే బాధ్యత తహశీల్దారుది. దాని పద్దులు, వాడకం విషయాలు చూచేది జియ్యంగారు, వారి గుమాస్తా. ఆలయంలో ఎంత కావాలో ఏమి కావాలో, అడిగేది పారెపత్తేదారు - ఆలయానికి కావల్సినవే కాక ఇతర సిబ్బందికి కావల్సిన రోజువారి బత్తెంకూడా ఈ పారెపత్తేదారే సరఫరా చేస్తాడు. ఆలయంలో పనిచేసే అందరూ ఈ పారెపత్తేదారు అధీనంలోనే పనిచేస్తారు. వచ్చిన కానుకలు లెఖ్ఖ వేయడం, అందరు ఆలయ సిబ్బందినీ బయటకు వెళ్లేటప్పుడు తనిఖీలు చేయడం, వచ్చిన కానుకలు, ముల్లెలు, మూటలు కట్టించి కింద తిరుపతిలో తహశీల్దారు ఆఫీసుకు తరలించడం. ధాన్యం, పప్పు, ఉప్పులు, ఇతర తినుబండారాలకు కావలసిన పదార్థాలు భక్తులు ఇచ్చినవి లెఖ్ఖ కట్టడం ఈ పారెపత్తేదారు బాధ్యత.

బంగారు వాకిలి నుండి భక్తులను దేవుని విగ్రహం దగ్గరకు దర్శనానికి వదులుతారు. విగ్రహం ముందు గదిలో అంటే శయనమండపంలో రెండు పెద్ద పాత్రలు - ఒకటి గంగాళం, రెండవది పెద్దకప్పు - ఉంటాయి.

గంగాళంలో కానుకలు వేసి వేరే ఇంకొక ద్వారం నుండి బయటకి వెళ్తారు (ఈ ఇంకొక ద్వారం, ఎక్కడ ఉందో వివరాలు లేవు. ఈ ద్వారం స్నపనమండపంలో ఉండి వుండాలి. తర్వాత కాలంలో మూసివేసి ఉండాలనిపిస్తుంది. కాని అలా భావించడానికి రికార్డు కాని, శాసనాలు కానీ లేవు. బంగారు వాకిలి నుండి లోపలికి వెళ్లిన యాత్రికులు ఇంకొక ద్వారం నుండి బయటకు వెళ్తారు అని కచ్చితంగా రాశారు. అంటే బంగారు వాకిలి నుండే (ఇప్పుడు జరుగుతున్నట్లు) తిరిగి బయటికి వెళ్లేవారు కారని తెలుస్తోంది).

దర్శనం అయిన తర్వాత సాయంత్రం ఈ గంగాళాల వద్ద కాపలా ఉన్న వారందరినీ (ఏ కానుకలూ కొట్టేయలేదని నిర్ధారణకు) క్షుణ్ణంగా పరిశీలించి, కానుకలన్నీ మూటలు కట్టి, వాటికి ముందుగా ఆలయపు సీళ్లు వేసి తర్వాత జియ్యంగారి సీళ్లు వేసి, కింద తిరుపతి

గోవిందరాజుపేటలోని తహశీల్దారు కార్యాలయానికి పంపుతారు. నెలాఖరున ఈ మూటలన్నీ మా (సర్కారువారి రెవెన్యూ - ఈ వ్యాసం రాసిన అధికారి కచేరీ అధికారి) కచేరీకి పంపుతారు. ఈ కచేరీలో వాటన్నిటనీ మూటలు విప్పి, కానుకలు వేరుచేసి, బంగారం, నగలు, వెండి, ఆభరణాలు, నాణాలు, ఇతర విలువైన వస్తువులు విడిగా తీసి, మిగిలినవి, వెంట్రుకలు, వస్త్రాలు, ఇతరములు అక్కడి కక్కడే వేలం వేసి డబ్బు చేసుకొని సర్కారు ఖజానాలో జమచేస్తారు.

బ్రహ్మోత్సవాల కాలంలో మాత్రం, కలెక్టరు ఈ పరకామణి సమయంలో ప్రత్యక్షంగా కాని, అతని ప్రతినిధిని గాని ఉంచి పరకామణి జరిపించాలని విధి. విశేషంగా కానుకలు వస్తాయి కాబట్టి, విపరీతంగా భక్తులు వస్తారు కాబట్టి, సర్కారు ధనం కాజేయకుండా ఏర్పాట్లు చేయాలి కాబట్టి, ఇటువంటి నిబంధన. ఈ బ్రహ్మోత్సవాల సమయంలో ఈ కార్యక్రమం చూసే బాధ్యత నాదే. చంద్రగిరి నుండి తిరుపతి వచ్చేవాడిని. ఇక్కడ సగటున ప్రతిసంవత్సర ఆదాయం 87 వేల రూపాయలు - ఖర్చులన్నీ పోగా దాన్ని సర్కారు తమ ఖజానాలో జమచేసుకొనేవారు.

1822 సంవత్సరం మొత్తం ఆదాయం (ఖర్చులు తీయకుండా) 1 లక్షా 42 వేల చిల్లర. ఖర్చులు 20 వేల వరకు ఇందులో తగ్గిస్తే, మిగతాది నికర ఆదాయం సర్కారుకి. అదే 1820లో ఆదాయం 1,02,000 రూపాయలు.

ఈ వ్యాసం చదువుతున్న మీరు కంపెనీ వారి ఈ మతపరమైన ఆధ్యాత్మిక పరమైన 'దోపిడీ' గురించి అన్యథా భావించవచ్చు. అలా అనిపించడం న్యాయమన్నట్లుగా అనిపించవచ్చు. ఇటువంటి అన్యాయ, అవినీతి కార్యానికి సర్కారు మీద భగవంతుని ఆగ్రహ దృష్టి పడుతుందని భావించవచ్చు. కాని అది నిజం కాదు.

అసలు విషయం - ఈ ఆలయం ఆదాయాలను న్యాయంగా, చట్టపరంగా అదివరకు ముసల్మాను రాజులు (ప్రభుత్వం) అనుభవించేవారు. ఎందుకంటే యుద్ధాల్లో రక్తం ధారపోసి సంపాదించింది కనుక. కంపెనీ విషయంలోనూ అంతే - కొరమాండల్ సముద్ర తీరప్రాంతంలోని మన వ్యాపారమంతా దెబ్బతీయకుండా మనం చేసిన

యుద్ధాలు, మన సైనికులు అర్పించిన అసువులూ, వాటికి మనకు వచ్చిన మొదటి ఆదాయంగా ఈ ఆలయనిధుల గురించి ఆలోచించాలి. అదే ప్రతి సంవత్సరం మనం చేసిన బలిదానాల పెట్టుబడికి వచ్చే ఆదాయం లేదా ప్రతిఫలం.

అలా అని ఆలయ ఆదాయాలు, ఆస్తుల వ్యవహార బాధ్యత వారికే వదిలేద్దామంటే - ఎన్నో గ్రామాల ఆదాయం, ఎన్నో భూములపై వచ్చే శిస్తులు పోవడం - దేవదేయాలకు, శిస్తుల మాఫీలు- ఇవన్నీ సర్కారుకి నష్టమే కదా... ఇంకోవిధంగా ఆలోచిస్తే - చాలావరకు భూములు, గ్రామాలు బ్రాహ్మణుల ఈనాములుగా ఉన్నాయి. వారి శాస్త్రం ప్రకారం వారు నాగలి పట్టి వ్యవసాయం చేసే హక్కులేని వారు. మిగతా కులాలవారు వీరికి దాదాపు దాసులవంటివారు. కష్టం రైతులది, ఫలం బ్రాహ్మణులది. మధ్యలో నష్టం సర్కారుది. ఇటువంటి వ్యవస్థను మార్పు చేయడానికే, దేవస్థానం భూమిలో గ్రామాలన్నీ కంపనీ ప్రభుత్వం పరం చేసుకొంది. ఆలయాలకు నష్ట పరిహారంగా 'తస్దీక్' (అలవెన్స్) ఇచ్చాం కదా? అలా ఇతరుల కష్టార్జితాన్ని అన్యాయంగా అనుభవిస్తున్న బ్రాహ్మణుల నుండి భూములు, గ్రామాలు తీసుకొని వాటిని ఇతర కులాలవారికి పంచినట్లే కదా - అంటే నిజంగా వ్యవసాయం చేసేవారికిచ్చినట్లే కదా! బ్రాహ్మణులు దెబ్బతిన్నా ఇతరులు బాగుపడ్డారు కదా!. సరే, ఇలా జరిగినప్పుడు ప్రభుత్వ ఆదాయం కూడా బాగానే పెరిగింది కదా! ఇవన్నీ వ్యవసాయ రంగంలో పెట్టుబడులు పెంచడానికి పనికి వస్తాయి కదా!

మన కంపనీ మనుగడ అంత పటిష్ఠంగా లేదు. ఇవాళ కాకపోతే రేపైనా హిందువులు ఈ మన విధానాల మీద దండెత్తుతారు. చరిత్రలో మనం చూశాం; మతపరమైన విషయాల్లో ప్రజలు ఎంతవరకైనా తెగిస్తారని. అలా జరిగేలోపు వారి వ్యవస్థను బలహీనపరచాల్సిన బాధ్యత మనది కదా!.

మనం ఇప్పుడు చేసిందేమిటి? దేశంలో ఉన్న అన్ని ఆలయాల ఆదాయాలు పోగొట్టి ఆలయ వ్యవస్థను దెబ్బతినేట్లు చేశాం. ఆలయాలలో ఆధిపత్యం, దానివల్ల సమాజంమీద పట్టు ఉన్న బ్రాహ్మణుల ఆదాయాలు

పోగొట్టి, వారిని బలహీనపరచి, సమాజంలో వారి పట్టు పోయేలా చేశాం. దాంతో ఈ తెలివిగల బ్రాహ్మణులు గత్యంతరం లేక, మన సర్కారు కచేరీలలో గుమాస్తాలుగా, ఇతర ఉద్యోగులుగా తయారై, మన చెప్పుచేతలలో ఉంటారు. వారిలో కొందరు మన సైన్యంలో చేరుతున్నారు కూడా. వారికి అడుక్కు తిని బతికే అలవాటు లేదు కనుక ఏదో కొలువులో చేరాలి. మన కొలువులోనే చేర్చుకుంటే సరి. దీంతో మతపరంగా ప్రజలను రెచ్చగొట్టే బ్రాహ్మణులుగాని, వారికి ఆదాయం ఇచ్చే ఆలయ వ్యవస్థలు లేకుండా పోతాయి. మతాన్ని ఆధారంగా చేసుకొని మనపై హిందువులు తిరుగుబాటు చేసే ప్రమాదం తొలిగించాం.

తిరుపతి ఆలయం విషయంలోనూ అంతే... కంపనీ అధీనంలోకి వచ్చిన తర్వాత ప్రతి సంవత్సరం ఆదాయం తగ్గేట్లు చూస్తున్నాం. వచ్చిన ఆదాయం కూడా వారికి దక్కకుండా సర్కారుకే చెందేట్లు చూస్తున్నాం. ఇలా కొన్ని సంవత్సరాలు జరిగితే తిరుపతి ఆదాయం పూర్తిగా పడిపోయి, ఆలయ వ్యవస్థ కుప్పకూలి పోతుంది. హిందువులను ఉత్తేజపరచగల స్థోమతగల ఈ ఆలయం నిర్వీర్యం అవుతుంది. అలానే దేశంలోని ఇతర ముఖ్యమైన ఆలయాల విషయం కూడా. అవన్నీ తిరుపతిలా కాదు. ఇప్పటికే దెబ్బతిని పోయి ఉన్నాయి.

అయినా ఈ హిందూమతమనే దయ్యానికి ఇంకా చాలా ఆయువుపట్లు అలానే ఉన్నాయి. నెమ్మదిగా వాటినీ దెబ్బతీయాలి.

నాకు కొండకు వెళ్లి పరిశీలించే అవకాశం లేదు. తిరుపతి ఆలయంలోకి వెళ్లి వ్యవహారాలు చూచే బాధ్యత నాది కాదు. కాని తిరుపతి తహశీల్దారు కార్యాలయం నా అధీనంలో ఉంది. రెవెన్యూ వ్యవహారాలన్నీ నా చేతుల్లో ఉన్నాయి. దేవస్థానం రికార్డులన్నీ నా పరిశీలనకు వస్తాయి. అన్నీ క్షుణ్ణంగా పరిశీలించి, నేను రాసిన విషయాలు, నాకు తెలిసినంత వరకు నిజాలు. స్థానికులను సంప్రదించాను కాని వారికి ఈ విషయపరిజ్ఞానమే సరిగా లేదు. లేదా మనం అడిగినప్పుడు ఏమీ తెలియనట్టు నటిస్తారు. కనుక నా పరిధిలో వచ్చిన రికార్డులు, ఇతరసమాచారం ఆధారంగా నిజమని నమ్మినదే రాశాను...."

...ఇలా ఈ వ్యాసాన్ని బట్టి మనం ఆంగ్లేయుల ఆంతర్యాన్ని గమనించవచ్చు. హిందూ సమాజానికి ఆ రోజుల్లో నాయకత్వం వహిస్తున్న బ్రాహ్మణులను దెబ్బతీసి, ఆర్థిక దారిద్ర్యానికి గురిచేసి, కంపెనీ సేవకులుగా చేయడం, ఆలయాల ఆదాయాలను, వ్యవస్థను నిర్వీర్యం చేయడం, హిందూసమాజంలోనే కులాల, వర్గభేదాలు సృష్టించి, ఐకమత్యం లేకుండా బలహీనపరచడం, భూములూ, గ్రామాలూ దేవదేయం నుండి తీసివేసి వాటి మూలంగా ఆలయాల్లో జరిగే ఉత్సవాలు, వైభవం లేకుండా చేసి, నెమ్మదిగా ఆలయ వ్యవస్థను మరుగునపడేట్లు చేయడం, తస్దీక్ అని నామమాత్ర నష్టపరిహారం ఇచ్చినా ఆలయ ఆదాయాలు కొల్లగొట్టి. భక్తుల నుండి ఆలయాలను నెమ్మదిగా దూరం చేయడం... వగైరా ఆలోచనలు చేశారు బ్రిటిషువారు. ఇటువంటి నికృష్ట ఆలోచనతోనే తిరుమల ఆలయానికి చెందిన అన్ని గ్రామాలను స్వాధీనం ఆంగ్లేయులు చేసికొని, 10 బ్రహ్మోత్సవాలు మానేసి ఒకటికి కుదించి, ఉత్సవాలు, నైవేద్యాలకు నిధులు లేకుండా చేసి, కొండమీద యాత్రికులకు సదుపాయాలు చేసే అన్నసత్రాలు, రామానుజకూటాలు, మఠాలకు ఆదాయం లేకుండా చేయడం, తిరుమల ఆలయానికి వచ్చే ఆదాయం సంవత్సరం సంవత్సరం తగ్గేట్లు చూచి, అలా వచ్చింది కూడా సర్కారు ఖజానాకే తరలించడం. రోజూ స్వామివారికి వాడే నగలు తప్ప మిగతా నగలన్నీ సర్కారు ఖజానాకు తరలించి, రోజూ కానుకలుగా వచ్చే నగలను కూడా సర్కారు పరం చేసుకోవడం. అలా విజయనగర, ఇతరరాజులు ఇచ్చిన కానుకలు ఆభరణాలు మొత్తం ఈ కాలంలోనే ప్రభుత్వపరం చేయటం జరిగిందని తెలుస్తోంది. రోజూ స్వామివారికి వాడే నగలు మాత్రమే మిగిలాయి.

తర్వాత 1843 నాటికి కంపెనీవారు మహంతులకు ఆలయాన్ని అప్పగించినప్పుడు, ఆలయనిధులు దాదాపు 40 లక్షల రూపాయల మేరకు ప్రభుత్వం సొంతం చేసుకొన్నట్లు ఆధారాలున్నాయి.

ఇన్నయినా, తిరుమల విషయంలో వారి ఎత్తుగడలు పారలేదనే చెప్పాలి. ఆదాయం పెరుగుతూనే వచ్చింది. భక్తుల సంఖ్య పెరుగుతూనే వచ్చింది. వైభవం తగ్గకపోగా బాగా పెరిగింది.

★ ★ ★

67. కంపెనీ వదిలేసిన 'బంగారు బాతులు'!

దాదాపు 40 సంవత్సరాల పైచిలుకు కాలం - 1801-1843 మధ్య కాలంలో - తిరుమల-తిరుపతి ఆలయాలు ఈస్టిండియా కంపెనీవారిచే నేరుగా నిర్వహింపబడ్డాయి. ప్రతిరోజూ ఎంతో ఆదాయం వచ్చే ఈ ఆలయ బ్రహ్మోత్సవాల 9 రోజులలోనే లక్షలాది రూపాయల ఆదాయం వచ్చే ఈ ఆలయాల యాజమాన్యాన్ని, కంపెనీ వారు అకస్మాత్తుగా వదిలేశారు. వదిలేసి, మహంతులకు అప్పగించారు.

ఎందుకు? ఎందుకలా చేశారు?

★ ★ ★

కంపెనీ వారి పాలనలో ఆలయాల భూములు ప్రభుత్వపరం చేసుకుని, ఆలయాలను నిర్వీర్యం చేసే కార్యక్రమం, ఆలయాలు, మతపరమైన విషయాలలో నాయకత్వం వహిస్తున్న హిందూసమాజంలోని బ్రాహ్మణులను ఆర్థికంగా బాగా దెబ్బ తీయటానికి వారి ఈనాములు, దేవదేయాలు రద్దు చేయడం, అప్పటి దాకా దేవదేయ భూములపై పన్నులు రద్దు చేసే విధానాన్ని తీసివేసి రైతులపై, ఆలయాల ఆదాయాలపై దెబ్బతీయడం, ఆలయ వైభవం తగ్గించడానికి వివిధ ఉత్సవాలు తీసివేయడం, భూములపై వచ్చే ఆదాయాలు పోయాయని నైవేద్యాలు తగ్గించేసి, వాటి ఆసరాతో నడపబడే అన్నసత్రాలూ, రామానుజకూటాలూ మూతబడేట్లు చేసి, అప్పటివరకూ వున్న యాత్రికుల సౌకర్యాలకు గండి కొట్టడం... ఇలా హిందూమతాన్ని, సమాజాన్ని నిర్వీర్యం చేసే కార్యక్రమాలు జరిగాయి. ఫలితం - కంపెనీ విషయాలపై హిందువులలో వ్యతిరేకత పెరుగుతూ వచ్చింది. సమానత్వం పేరుతో ముస్లింల మతపరమైన సంస్థల విషయంలోనూ ఇలానే వ్యవహరించినందువలన, దేశంలోని ముస్లింల నుండి కూడా కంపెనీకి వ్యతిరేకత మొదలైంది.

ఈ విషయం గమనించిన కొందరు కంపెనీ అధికారులే, కంపెనీ బోర్డుకు రహస్యంగా నివేదికలు పంపడం మొదలు పెట్టారు. ఇలా 1833 ఫిబ్రవరి 20 వ

తారీఖున మొదటి నివేదిక కంపెనీ బోర్డు ఆఫ్ డైరెక్టర్స్‌కు, ఇండియాలోని గవర్నర్ జనరల్‌కి పంపబడింది.

దాని సారాంశం: "ఇండియా దేశంలోని, అన్ని మతపరసంస్థల విషయంలో, కంపెనీ వారి జోక్యం ఉండరాదనీ, మతపరసంస్థలు వారివారి అధీనంలోనే ఉండాలి... ఆంగ్ల అధికారులు మత వర్గ సంస్థల యాజమాన్యం విషయాలలో అసలు వేలు పెట్టరాదు... వారివారి సంప్రదాయం, ఉత్సవాలు, పూజాది వ్యవహారాల విషయంలో స్థానికులే నిర్ణయాలు చేయాలిగాని, ఆంగ్లేయులు జోక్యం చేయరాదు... ఆలయాల్లో పనిచేసే అర్చకులు, పండితులు, అధికారుల మీద ఆంగ్లేయుల పెత్తనం ఉండరాదు... ఆలయ ఆదాయవ్యయాలలో కూడా ఆంగ్లేయుల ప్రమేయం మంచిదికాదు...

ఈ అన్ని విషయాలూ స్థానికులే నిర్వహించాలి, కంపెనీ ఆంగ్లేయుల ప్రత్యక్ష సంబంధం శ్రేయస్కరం కాదు..."

ఈ విషయాలు గవర్నరు జనరల్, కౌన్సిలు ద్వారా లండన్‌లోని కంపెనీ యాజమాన్యమైన డైరక్టర్ల బోర్డు దృష్టికి వెళ్లింది... అలా చాలా విన్నపాలు ఒకటి తర్వాత ఒకటి లండన్ చేరాయి.

పరిణామం – అక్టోబర్ 18వ తారీఖు 1837లో డైరెక్టర్ల బోర్డు గవర్నర్ జనరల్‌కి ఇచ్చిన ఆదేశాలు. దానిలో అదివరకు 'థాకరే' అనే ఆంగ్ల అధికారి రాసిన నివేదిక కూడా చర్చించబడింది. థాకరే ఉద్దేశ్యం:

"హిందూదేశంలో (ఇండియా) మన (ఆంగ్లేయుల) విజయాలకు ముఖ్యకారణం – 'మన మతపరవిషయాలలో జోక్యం లేకుండా' ఉండడమే. ఇది ఇతర ఐరోపా దేశాలు పాటించని కారణంగా, వారికి స్థానికుల మద్దతు లభించలేదు. పోర్చుగీసు వారి విషయం తీసుకోండి... వారు ఆలోచనారహితంగా, క్రైస్తవమతానికి స్థానికుల మతమార్పిడి విషయాల్లో పట్టుదలతో పనిచేయడం. దానివలననే వారు రాజ్యవిస్తరణ చేయలేక పోయారు. అధికారం దక్కిన చోట కూడా దాన్ని నిలుపుకోలేకపోయారు. మనం (ఆంగ్లేయులం) ఈ మధ్య కాలం వరకూ మతపరవిషయాల్లో తటస్థంగా ఉండటం వల్ల రాజ్య విస్తరణ, అధికారం చలాయించగల్గుతున్నాం. తెలివితక్కువ, ఆలోచనారహిత, నిర్ణయాలు తీసుకుని, వున్న అధికారం పోగొట్టుకోవాల్సిన అగత్యం మనకేమిటి? ఇక్కడ మన అధికారం నాలుగు కాలాలపాటు చెల్లాలంటే మనం ముందు పాటించిన స్థానిక మత విషయాలకు దూరంగా ఉండే సంప్రదాయం పాటించాలి.

ప్రస్తుతం మనం అవలంబిస్తున్న స్థానిక మత విధ్వంసకార్యక్రమాలు ఆపకపోతే మన చేతిలోని రాతితో మన పళ్లే ఊడగొట్టుకునే పరిస్థితి ఏర్పడుతుంది...

అదే అధికార పత్రంలో ఇంకొక ఆంగ్ల అధికారి సర్ థామస్ మన్రో, అంతకుముందు పంపిన ఇంకొక నివేదిక కూడా చర్చించబడింది. ఆయన రాసింది:

"మొదటి నుండీ కంపెనీవారి విధానం స్థానికుల మతపరమైన విషయాలలో, వారి సంస్థల యాజమాన్య విషయాల్లో జోక్యం చేసుకోకుండా తటస్థంగా ఉండటం. ఈ విధానమే కొనసాగించాల్సిన అవసరం ఉంది. దేశంలో అల్లకల్లోలాలు లేకుండా శాంతి భద్రతలు కాపాడటానికి, మనకు ఈ దేశం నుండి వస్తున్న ఆదాయాలు భద్రంగా ఉండటానికి, దేశప్రగతికి, ఇండియన్ల విషయంలో మతమార్పిడి విధానాలు పాటించే విషయంలో కూడా కంపెనీ తటస్థంగా ఉండటం శ్రేయస్కరం.

"ఈ దేశంలో ముఖ్యంగా పరిపాలన చేసేవారు కొద్దిమంది. పాలింపబడేవారు చాలా మంది. ఈ పాలించేవారు ప్రజలకన్న భిన్న జాతివారు, భిన్నమతం వారు. అటువంటి పరిస్థితుల్లో చాలా సున్నితమైన మతపరవిషయాలలో జోక్యం తగని పని... ప్రజలను రెచ్చగొట్టే విధానాలు అనర్థదాయకం. ప్రజల వ్యతిరేకమనోభావాలు నివురు గప్పిన నిప్పులాంటివి. ఎప్పుడు వెల్లువలా పైకి వస్తాయో చెప్పలేం. ఈ మధ్య, వెల్లూరులో జరిగిన సంఘటనతో ప్రారంభమై, మన చేతులు దాటే పరిస్థితులు రావడానికి ఈ మతవిషయాలు కారణాలు కావచ్చు. ఇలా జరిగిన సంఘటన సరిదిద్దుకోవడానికి మన 'మిషనరీ కలెక్టర్లకు' వందల సంవత్సరాలు పట్టవచ్చు. మనకు సైన్యం వుంది, అధికారం ఉంది అని ప్రజల వ్యతిరేకతను అణచి వేయగలిగినా, అది తాత్కాలికమే. అది ప్రజలకు పాలకులకు మధ్య అపనమ్మకం పెరగడానికి కారణభూతమౌతుంది. అలా జరిగినప్పుడు ఆ ప్రాంతానికీ, మనకు కూడా క్షేమం కాదు.

"పైన చెప్పిన కారణాల వల్ల, మనం విధించిన 'యాత్రికులపై పన్నులను' ఎత్తివేయాలి. అలానే ఆలయపరిపాలన వదిలివేయాలి. ఆలయనిధులు మనం ముట్టుకోరాదు. హిందువుల ఆలయ ఆదాయాలు, నిధులు వారి వారి సంస్థల బాగోగులకే వదలాలి కాని ప్రభుత్వం తీసుకోరాదు. వెంటనే ఆలయాల పరిపాలనబాధ్యతలు స్థానికులకే అప్పగించాలి. ఆంగ్ల అధికారులు ఈ విషయాల్లో జోక్యం చేసుకోరాదని గట్టి ఉత్తర్వులు జారీ చేయాలి."

ఫలితంగా – మద్రాసు, బొంబాయి, ప్రెసిడెన్సీల (కంపెనీ అధికారంలో ఉన్న ప్రాంతాల) విషయంలో కంపెనీ యాజమాన్యం పైన చర్చించిన కారణాల దృష్ట్యా,

మతపర విషయాలలో ఆంగ్లపరిపాలకులు జోక్యం చేయరాదనీ, అన్ని మతసంస్థలు, వాటి ఆదాయాలు, వ్యవహారాలు వెంటనే స్థానికులకు అప్పచెప్పాలనీ, ప్రభుత్వానికి, మత సంస్థలకు ఎటువంటి సంబంధం ఉండకూడదని నిర్ణయం చేయబడిందని ఆదేశాలు జారీ చేశారు.

అలా అని కంపెనీ వారి పాలనలో ఆలయానికి మంచేమీ జరగలేదని భావించరాదు. అనేకశతాబ్దాలుగా ఆలయంలో పాలన జరుగుతున్నా, ఎంతోమంది యాత్రికులు అన్ని దేశాల నుండి వస్తున్నా, ఎన్నో దేవదేయాలు, నగలు, కానుకలు వస్తున్నా, ఎంతో ఖర్చు ఉత్సవాలకూ, నైవేద్యాలకూ జరుగుతున్నా... పరిపాలన విషయంలో అంతవరకు నిర్దిష్టత లేదు.

కంపెనీ అధికారులు ఆలయంలో ఆదాయం - ఖర్చులు వ్యవహారంలో పటిష్ఠమైన వ్యవస్థ తయారుచేశారు. 'బ్రూసుకోడు' అనే దానిని ప్రవేశపెట్టి ఆలయపాలన వ్యవహారంలో అనుసరించవలసిన మూలసూత్రాలు ధ్రువీకరించారు. సవాల్-జవాబ్ పట్టీ తయారుచేసి, ఆలయసిబ్బంది, ఉత్సవాలు, రోజువారీ కార్యక్రమాలు జరగవలసిన, సమయం, చేయవలసిన కార్యక్రమాలు, అందుకు ఎవరెవరికి ఏమి బాధ్యతలు, ఆలయం ఏ సేవకు, ఏ మేరకు ఖర్చుపెట్టాలి, అన్న విషయనిర్ణయం (అది వరకు జరిగేదే) చేసి, ఖర్చులు తగ్గించి క్రమబద్ధం చేశారు. దిట్టం తయారుచేసి, ప్రతి సేవకు, ప్రతి ఉత్సవానికి ఏమేమి వస్తువులు సరఫరా చేయాలి, ఏయే స్వాములు, మఠాధిపతులు వచ్చినప్పుడు, ఏమేమి మర్యాదలు చేయాలన్నది విపులంగా క్రోడీకరించి, ఆలయ పరిపాలనవిధానం లోనూ, సంప్రదాయ పరిరక్షణపద్ధతులతోనూ, పూజాకార్యక్రమాల విషయంలో చేసే ఏర్పాట్ల విషయంలోనూ అస్పష్టతను తొలగించి ఒక నిర్దిష్టతను ప్రవేశపెట్టారు. ఆ పద్ధతులే ఆ సవాల్-జవాబ్ పట్టీ. ఆ దిట్టం ఆధారంగానే ఈనాటికి ఆలయంలో కార్యక్రమాలన్నీ జరుగుతున్నాయి. అంటే - ఎంత స్పష్టతతో పరిపాలన సంస్కరణలు చేశారో తెలుసుకోవచ్చు.

ఆ ఆదేశాల మేరకే మద్రాసులోని కంపెనీ ప్రభుత్వం - ఒక శుభముహూర్తాన తిరుమల-తిరుపతి ఆలయాలను కూడా స్థానికులకు అప్పగించే నిర్ణయం చేసినట్లు నార్త్ ఆర్కాట్ జిల్లా కలెక్టర్‌కి తెలియజేసింది.

★ ★ ★

68. కంపెనీ వదిలితే బాధ్యత ఎవరికివ్వాలి?

మతపరమైన విషయాలలో ఆంగ్లేయుల జోక్యం ఉండరాదని ఈస్టిండియా కంపెనీ తీసుకున్న నిర్ణయానికి అనుగుణంగా నార్త్ ఆర్కాటు జిల్లా కలెక్టరు 'గోలింటామ్' అనే ఆయన మద్రాసు రెవెన్యూ బోర్డు కార్యదర్శి 'బౌడిల్లాను'కు తిరుమల ఆలయనిర్వహణ అధికారాలను హాథీరాంజీ మఠం మహంతుకు అప్పగించాలని సిఫార్సు చేశాడు.

అందులో ఇంకొన్ని ఆసక్తికరమైన విషయాలు కూడా ఉన్నాయి. మొదట 'జిగ్లవు' అనే జిల్లా కలెక్టరు ఒక నివేదిక పంపాడు... ఆలయంలోని వంశపారంపర్య అర్చకులకు పాలనవిషయాలలో ఉత్సాహం లేదు, ఆ సమర్థతా లేదు. ఇతర వైష్ణవులు, జియ్యంగార్లు, వారి వారి తగాదాల్లో వారున్నారు. ఏ ఒక్కరికి అధికారం కట్టబెట్టినా పరస్పరవిరోధాలు వస్తాయి. కనుక ఒక ఏడుగురు సభ్యులతో ఒక కమిటీకి ఈ నిర్వహణ బాధ్యతలు అప్పగించాలి. అందులో సభ్యులు ఒక జియ్యంగారు, ఒక అర్చకుడు, ఇతర వైష్ణవులు. ఇదికాక వారిపై మంచి పలుకుబడి, పేరు ప్రఖ్యాతులు కలిగిన ధార్మికులైన, నీతిమంతుల పెద్దల సభ ఒకటి ఏర్పాటు చేయాలి. దానిలో కార్వేటి నగరం జమీందారు, కాళహస్తి జమీందారులను గౌరవ అతిథులుగా పిలవాలి అన్న సూచన చేశారు.

ఆ సూచన ఆచరణయోగ్యంగా లేదని మద్రాసు రెవెన్యూ బోర్డు తిరస్కరించి కలెక్టరును మళ్లీ కొత్తగా నివేదిక పంపమని ఆదేశించింది. అప్పటికి జిగ్లవు కలెక్టరుగా బదిలీకాగా, కొత్తగా వచ్చిన కలెక్టరు, మొదట కార్వేటినగరం జమీందారు, మైసూరు మహారాజు, వెంకటగిరి జమీందారుల పర్యవేక్షణలో జియ్యంగారు, మహంతులు ధర్మకర్తలుగా ఒక వ్యవస్థ చేయడానికి ప్రయత్నించాడు. కార్వేటి నగరం జమీందారు ఒప్పుకున్నా, మైసూరు మహారాజు, వెంకటగిరి రాజా సమ్మతం చూపలేదు. కార్వేటి నగరం జమీందారీ దివాలా పరిస్థితులలో ఉందని దానిపై వ్యతిరేకత వుంది. కలెక్టరు ముగ్గురితో - అంటే మహంతు, ఆ ప్రాంతపు కార్వేటి నగరం జమీందారు,

ఆలయంలోని జియ్యంగారు - ఈ ముగ్గురికి బాధ్యత అప్పగించాలని మొదట అనుకొన్నారు. దానికి మహంతు ఒప్పుకోలేదనీ, అందువలన మహంతుకు మాత్రమే ఈ పెత్తనం ఇవ్వాలని నిర్ణయించారు.

దానికి ఆయన చూపిన కారణాలు - పరిపాలన బాధ్యత ముగ్గురికి అప్పచెప్తే, మధ్యలో విభేదాలు వచ్చే అవకాశం వుంది. అందుకే ఒక్కరికి ఇస్తే బాగుంటుంది. హాథీరాంజీ మఠంవారు స్థానికులు కాదు కనుక స్థానికుల నుండి పెద్ద మద్దతు వారికి వచ్చే అవకాశం లేదు. ఆ మఠానికి హాథీరాంజీ అనే మొదటి మహంతు వలన చాలా పెద్ద పేరుంది. ఆయన భక్తుడు, అయినా, ఆలయవ్యవహారాల్లో వారికి ఇంతవరకు, ఎటువంటి సంబంధం లేదు. సంబంధం ఉన్న వైష్ణవులు - వడగలై, తెంగలై అని రెండు వర్గాలుగా చీలిపోయి, వారిలో వారికి విభేదాలు ఏర్పడ్డాయి. జియ్యంగారు కూడా ఒక వర్గానికి చెందినవాడు. మహంతు కూడా వైష్ణవుడే కానీ, ఉత్తరభారతానికి చెందినవాడు. ఆలయ అభివృద్ధి ఆకాంక్షించేవాడు. అన్నీ పరిత్యజించిన సన్న్యాసి. మఠం సంప్రదాయం ప్రకారం - వంశపారంపర్యం కాదు - తర్వాత మహంతుని ఇప్పటి మహంతు ఎంపిక చేస్తారు.

...ఇలా కలెక్టరు పంపిన ప్రతిపాదనలను బోర్డు వారు ఆమోదించారు, గవర్నరు జనరల్ ముద్ర పడింది. అధికారికంగా అమలు పరచడానికి కలెక్టరుకు ఆదేశాలు వచ్చాయి.

అప్పటి మహంతును తిరుమల-తిరుపతి ఆలయాలకు విచారణకర్త (ధర్మకర్త) గా నియమిస్తూ, ఆలయాలూ, ఆస్తులూ, ఆదాయాలూ వారి అధీనం చేశారు. గత 40 సంవత్సరాలకు పైగా కంపెనీ వారు ప్రభుత్వపరం చేసుకొన్న లక్షలకొద్దీ తిరుమల ఆలయ ఆదాయాలు మాత్రం మహంతులకు అప్పగించలేదు. కాని ముందు ముందు ప్రతి సంవత్సరం ఖర్చులు పోనూ మిగిలే ఆలయ ఆదాయ యాజమాన్య బాధ్యతని మహంతుకు అప్పగించే నిర్ణయం కంపెనీ చేసింది. అలా వచ్చిన నిధులు మహంతులు ఆలయ అభివృద్ధికి, స్వామివారి సేవలకు, నైవేద్యాలకు, యాత్రికుల సదుపాయాలకే వాడాలి కాని, తమ మఠానికి కాని, తమ సొంత ఖర్చులకు కాని వాడరాదని నిబంధన చేశారు. అప్పటి వరకూ ఆలయంలో జరుగుతున్న పూజావిధానం, సంప్రదాయాలు పాటించాల్సిన బాధ్యత కూడా మహంతుకే అప్పగించబడింది. ఇవన్నీ ఒక పత్రంలో పొందు పరచి ఒక ముచ్చలిక (అగ్రిమెంటు) మహంతు నుండి కంపెనీ వారు

తీసుకున్నారు. అప్పగించిన ఆలయం ఆస్తులు, ఆభరణాలు, నిధులు, ఇతరసామగ్రి అంతా జాబితాలు తయారు చేసి ఇచ్చి పుచ్చుకునే పత్రాలు తయారు చేయించి, తిరుపతి తహసీల్దారు మహంతుకు ఆలయపరిపాలన అప్పగించారు.

ఈ ఇచ్చిపుచ్చుకున్న పత్రాలు మహంతుల మఠం రికార్డులలో ఉండాలి. జియ్యంగారి అధికారం విషయంలో, మిరాశీల విషయంలో, అలాగే అర్చకుల, ఆచార్య పురుషుల అధికార బాధ్యతలు, వారికి అందే బహుమానాలు, గౌరవమర్యాదల విషయంలో, ఇతర ఆచార్య పురుషుల, మిరాశీలు, గొల్ల, కైకోల, అన్నమయ్య ఇతర పారంపర్య మిరాశీల విషయంలో మహంతు జోక్యం చేసుకోరాదనీ, ఆ సంప్రదాయాలు అలాగే అమలు జరగాలనీ.. ఆలయంలో కంపెనీవారి పాలనలో "సవాల్-జవాబ్ పట్టీ" దిట్టం ఆధారంగా జరిగే సేవలూ, వాటికి ఖర్చు పెట్టాల్సిన నిధులూ, వాటికోసం అవసరమైన సామానులు అందించటం, వగైరా సేవల బాధ్యత మహంతుది. ఆలయ సిబ్బంది జీతభత్యాల బాధ్యత వారిదే.

ఆలయకార్యక్రమాలకు మొదట్లో మహంతుకు నిధుల కొరత ఉండేది... రోజూ వచ్చిన ఆదాయంతోనే ఆలయం నడపాలి. కంపెనీ వారు నిధులివ్వలేదు. హాథీరామ్‌జీ మఠానికి నిధుల్లేవు. వచ్చే ఆదాయంలో చాలా వరకూ బ్రహ్మోత్సవాలకు ఖర్చు, పెట్టుబడిగా పెట్టాల్సిన అవసరం. ఎంత మొత్తుకొన్నా కంపెనీవారు నిధులివ్వక, చివరకు జరగని పరిస్థితుల్లో 5000 రూపాయలను మహంతుకు మంజూరీ చేశారు. అంటే ఆ అయిదు వేలు కూడా పెట్టుబడి పెట్టలేని పరిస్థితులలో అప్పటి హాథీరాంజీ మఠం వుండేదని తెలుసుకోవాలి. ఒక సంవత్సరం అలా ఆర్థిక ఇబ్బందులతో మహంతు కాలక్షేపం చేసినా మొదటి బ్రహ్మోత్సవకాలం పూర్తి అయ్యేప్పటికి, నిధుల కొరత తీరిపోయింది. అప్పటికే సంవత్సరానికి ఆదాయం లక్షకు పైన, ఖర్చు రూ. 30,000 లోపు. అంటే సంవత్సరానికి కనీస పక్షం 70,000 రూపాయలు మిగులు నిధులు ఉండేవన్న మాట.

అలా మొదలైన మహంతుల పాలన మొదటి ఇద్దరు మహంతుల కాలంలో ఒడిదుడుకులు లేకుండా సాఫీగానే జరిగిందని చెప్పవచ్చు. మొదటినుండి, మహంతులకు ఆలయం అప్పగించే విషయంలో, జియ్యంగార్లకు, అర్చకులకు, ఆచార్యపురుషులకు, ఇతర శ్రీవైష్ణవులకు ఇష్టం లేకపోయినా, వారిలో ఐకమత్యం లేని కారణంగా, వడగలై, తెంగలై వివాదాలు పరాకాష్ఠకు చేరిన కారణంగా, కంపెనీ

వారిని వ్యతిరేకించే ధైర్యం లేకపోవడం వలన, వారు చేయగలిగింది లేక వారి బాధ్యతలు నిర్వహిస్తూ మిన్నకున్నారు.

హాథీరాంజీ మహరాజ్

కొండమీద ఉన్న మఠాల్లో ఒకటైన ఉత్తరభారతానికి చెందిన హాథీరాంజీ మఠానికే ఆలయ పాలన ఇవ్వాలని ఆర్కాటు జిల్లా కలెక్టరు సిఫార్సు చేశాక, అలా హాథీరాంజీ మఠం స్థాపించాక, ఆ పరంపరలో వచ్చిన 12వ మహంతు సేవాదాసును కంపెనీవారు విచారణకర్తగా నియమించడం జరిగింది.

ఈ హాథీరాంజీ మహంతు ఎవరు? ఉత్తరభారతం నుండి వచ్చి ఇలా తిరుమలలో మఠస్థాపన చేయడం ఎందుకు జరిగింది...? అంత ప్రాముఖ్యం ఈ మఠానికి రావడానికి కారణం? హాథీరాంజీ బాబా కథ తెలియాలి. రకరకాల కథలు ప్రచారంలో ఉన్నాయి.

ఈ మధ్యకాలంలో అంటే 2010 సంవత్సరంలో హాథీరాంజీ మఠంవారు "మహంతులను బాలాజీ సేవ నుండి దూరం చేయడానికి జరిగిన కుట్ర" అనే పుస్తకాన్ని హిందీలో ముద్రించి విడుదల చేశారు. మఠానికి చాలా కావలసిన విద్యార్థి ప్రసాద్ మిశ్రా అనే ఆయన ఈ గ్రంథాన్ని రచించారు. అందులో హాథీరాంజీ జీవితచరిత్ర విపులంగా ఇవ్వబడింది.

రాజస్థాన్‌లో నాగోర్ జిల్లాలోని ఒక గ్రామంలోని వైష్ణవ బ్రాహ్మణకుటుంబంలో ఈ హాథీరాంజీ బాబా జన్మించినట్లు తెలుస్తోంది. వీరి తల్లిదండ్రులకు సంతానం లేక తీర్థయాత్రలకు బయలుదేరి వేంకటాచలానికి వచ్చి, స్వామి అనుగ్రహంతో కల్గిన సంతానమే ఈ హాథీరాంజీ బాబా. చిన్నతనంలోనే తల్లిదండ్రులు మరణించగా, ఈయన ఆలోచనంతా తిరుమల బాలాజీ పైనే లగ్నం అయి, ఆయన దర్శనానికి బయలుదేరాడు. దారిలో కాశీలో 'అనుభవానందు' అనే గురువుగారి శుశ్రూష చేసి కొంత శాస్త్రజ్ఞానం సంపాదించి, గురువుగారి ఆశీర్వచనంతో బాలాజీ దర్శనానికి బైరాగిగా వచ్చాడు.

అలా బైరాగిగా తిరుమల చేరిన ఈయన పట్ల అక్కడ అర్చకులుగాని, ఆలయాధికారులు కాని పెద్దగా ఆదరం చూపలేదట. రోజూ మూడుసార్లు స్వామి పుష్కరిణీ స్నానం, స్వామి వారి దర్శనం చేసుకుంటూ కాలం గడుపుతున్న బైరాగి,

ఆలయ అధికార్లను ఆలయంలో ఏదైనా నౌకరీ ఇప్పిస్తే స్వామివారి సేవలో కాలం గడుపుతానని చేసిన అభ్యర్థనను వారు మన్నించలేదు.

"భారీకాయం వుంది కదా నీకు. స్వామివారి నైవేద్యాలు తయారు చేయడానికి అడవినుండి వంటచెరకు తీసుకువచ్చే పని చెయ్యి" అని అప్పచెప్పారు. అదే భాగ్యమని, అదే భగవత్సేవ – అని ఆ కార్యక్రమంలోనే నిమగ్నమయ్యాడు ఈ బైరాగి... ఏ పని చేస్తున్నా అందులోనే భగవంతుని స్మరణ, అదే భగవత్సేవగా భావించే అతనిపై భగవంతునికి అనుగ్రహం కల్గుతుంది. ఒక వృద్ధబ్రాహ్మణుని వేషంలో ఆ బైరాగికి కన్పడి, స్వామి తపస్సు చేయమని సూచించాడు. అలా కొంతకాలం తపస్సు చేసిన బైరాగి తనకు భగవసాక్షాత్కారం కాకపోవడంతో నిరుత్సాహి అయితే, మరల ఆ వృద్ధబ్రాహ్మణుని వేషంలో భగవంతుడు ప్రత్యక్షమై, బైరాగిని పరీక్షించి చివరకు తానే భగవంతుడినని– దివ్యదృష్టినిచ్చి తన నిజరూపదర్శనం చేయించాడు. ఎప్పుడు కావాలంటే అప్పుడు భగవంతుని సాక్షాత్కారం అవుతుందని చెప్పి ఆ వృద్ధబ్రాహ్మణుడు అదృశ్యమయ్యాడట.

అలా భగవంతునితో మొదలైన సంబంధం వల్ల బైరాగితో అతని ఇంట్లో రోజూ ఏకాంతంలో భగవంతుడు ఇష్టగోష్ఠి జరిపేవాడనీ, అతనితో పాచికలు ఆడేవాడనీ కథలు ప్రచారంలోకి వచ్చాయి. ఈ విషయం ఆ కాలంనాటి యాదవరాజులు (చంద్రగిరి) వరకూ వెళ్లి అతని దర్శనానికి ఆ రాజు రావడం, ఇతనికి శిష్యుడవడం కూడా జరిగింది. అప్పటినుండి ఈ బైరాగికి తిరుమలలో గౌరవం, ఆలయంలో మనుగడ పెరిగాయి. ఉత్తరదేశ యాత్రికులకు సదుపాయాలకోసం ఈ బైరాగి, ఒక బైరాగి ఆశ్రమం ప్రారంభించాడు. తర్వాతకాలంలో అదే ఒక మఠంగా రూపుదిద్దుకొంది. శ్రీనివాసుని అంతరంగభక్తునిగా చాలాపేరు ప్రఖ్యాతులు వచ్చాయి. ఈ పరిణామాలు ఆనాటి అర్చకులకు, ఆలయ అధికారులకు అంతగా నచ్చకపోయినా, యాదవరాజు అభిమానం ఉంది కనుక చేయగలిగింది లేక మిన్నకున్నారు.

ఈ బైరాగి మాహాత్మ్యం ప్రజలకి తెలియడానికి భగవంతుడే ఒక లీల చేశాడని ఒక కథ ప్రచారంలో ఉంది. బైరాగి ఆశ్రమంలో పాచికలాడడానికి వచ్చిన శ్రీనివాసుడు, తన 'కంఠాభరణాన్ని' బైరాగి దగ్గరే వదలి అంతర్ధానమైపోతాడు. రాత్రివేళ ఆలయం తలుపులు మూసివేసిన సందర్భంలో ఆ ఆభరణాన్ని చూసిన బైరాగి, స్వామి వదలి వెళ్లాడని తెలిసి, ఉదయం ఆలయం తెరువగానే స్వామికి సమర్పించాలన్న ఉద్దేశ్యంతో చేతిలో ఆభరణంతో ఆలయప్రవేశం చేస్తాడు.

ఉదయం స్వామివారి కంఠాభరణం పోయిందని తెలుసుకొన్న అర్చకులు, ఆలయాధికారులకు ఆ విషయం తెలియచేస్తారు. ఆభరణం కోసం వెతుకుడు ప్రారంభం అవుతుంది. చేతిలో ఆభరణంతో ఆలయంలోకి వస్తున్న బైరాగిని పట్టుకుని ప్రశ్నిస్తే, భగవంతుడే తన ఆశ్రమంలో రాత్రి ఈ నగ వదలి వెళ్లాడని, దాన్ని భగవంతునికి అందచేయడానికే తాను ఆలయానికి వస్తున్నానని ఆయన చెప్పాడు. ఆ మాటల్ని ఆలయ అధికారులు నమ్మక అతన్ని బంధించి, రాజుకు విషయం తెలియజేశారు. రాజు కూడా ఏమి చేయాలో తోచక బైరాగిని కారాగారంలోనే ఉంచి, "నీకు భగవంతుని సాక్షాత్కారం రోజూ అవుతుందన్నావు కనుక, మానవమాత్రులు చేయలేని పని నీకు అప్పచెపుతాం. ఆ భగవంతుని అనుగ్రహంతో చేసి చూపించ"మని పరీక్ష పెట్టాడు. కారాగృహంలో గది నిండుగా చెరకుగడలు నింపి, వాటిని తెల్లారేప్పటికి వినియోగం చేసి పిప్పి చేయమని ఆదేశించి, కారాగృహం తాళం వేసి సీళ్లు వేసి వెళ్లిపోయారు.

ఈ బైరాగికి ఏం చేయాలో తోచక, ఇదంతా భగవంతుని లీలగా భావించి, తను మటుకు భగవంతుని ధ్యానంలో లీనమైపోతాడు. భక్తవత్సలుడైన శ్రీనివాసుడు, ఏనుగు రూపంలో ఆ గదిలో ప్రవేశించి, అంత చెరకునూ పూర్తిగా పీల్చి పిప్పి చేసి అంతర్ధానమౌతాడు. లోపల ఏనుగు చెరకు తినడం చూసిన సైనికులు, రాజుకు ఆ విషయం తెల్పుతారు. వేసిన తాళాలు, సీళ్లు వేసినట్లు ఉన్నాయి. లోపలికి ఏనుగు ఎలా వెళ్లింది? చెరకంతా పిప్పి ఎలా అయింది? ఆ ఏనుగు బయటికి ఎలా వెళ్లింది? ఆ ఏనుగు ఇప్పుడు ఎక్కడ ఉంది?

ఈ ప్రశ్నలకు సమాధానాలు తెలియని రాజు, శ్రీనివాసుడే ఈ బైరాగికి ఏనుగు రూపంలో వచ్చి అనుగ్రహం చేశాడని నిశ్చయానికొచ్చి, బైరాగి కాళ్లపై పడి క్షమాపణ కోరాడు. ఆ బైరాగి రామభక్తుడు కనుక భగవంతుని దర్శనం ఏనుగు రూపంలో జరిగింది కనుక ఆయనకు అప్పటినుండి హాథీ (ఏనుగు) రాంజీ అని పేరు వచ్చిందట. ఉత్తరభారతం నుండి వచ్చే భక్తులకు హాథీరాంజీ బాబాగా ప్రసిద్ధిలోకి వచ్చాడు. అలా ఆయన 'హాథీరాంజీబాబా'గా, ఆయన మఠం హాథీరాంజీ మఠంగా ప్రసిద్ధి చెందారు.

ఈయన గురించి ఇంకొక కథ కూడా ప్రసిద్ధిలో వుంది. అతను భగవంతుని ఏకాంతభక్తుడే, కాని, తనకు ప్రతిరాత్రి భగవద్దర్శనం అవుతుందని కానీ, రోజూ భగవంతుడు తనతో పాచికలు ఆడుతాడని కానీ.. తనకు మహిమలున్నాయని కానీ ఇతరులకు ప్రదర్శించేవాడుకాదు. అలా చేయడం ఆయనకు ఇష్టం ఉండేది కాదట.

ఈయన పేరు ప్రఖ్యాతులు కాశీ దాకా వెళ్లి ఆ కాలంలో హఠయోగిగా ప్రసిద్ధి చెంది, అష్టసిద్ధులు సంపాదించిన ఒక యోగి దృష్టికి వచ్చి, తన మహిమలతో ఈ హాథీరాంజీని ఓడించాలన్న సంకల్పంతో ఆయన తిరుమలకు వచ్చాడట. తన మహిమలెన్నో చూపిన ఆయనతో పోటీకి రావడానికి హాథీరాంజీ బాబా సమ్మతించలేదట. సాధన ప్రదర్శించడానికి కాదు. అయినా సాధనలో భాగంగా లభ్యమైన సిద్ధుల్ని, మహిమల్ని ప్రజలకు చూపించి – పేరుప్రఖ్యాతులు, ధనార్జన సాధనకు ప్రతిబంధకాలని నిరూపించి, ఆనాటి యాదవరాజుకు, పోటీకి వచ్చిన హఠయోగికి, హాథీరాంజీ కనువిప్పు కలిగించాడట.

అలా స్వామివారి అనుగ్రహానికి నోచుకున్న హాథీరాంజీ బాబా సమాధి పాపనాశనం వెళ్లేదారిలో ఉంది. బైరాగులకు తిరుమలలో ఆశ్రయం కల్పించడానికి మొదలైన ఈ బైరాగుల మఠం, రానురాను విజయనగర రాజుల ఆదరణతో కొండమీద ఒక ముఖ్యమైన నందనవనంగా తయారయి, పెద్ద అన్నసత్రంగా స్థిరపడింది. ఈ హాథీరాంజీ మఠానికి 1843 లో తిరుమల ఆలయాల పరిపాలన బాధ్యతలు వచ్చేవరకు పేరు ప్రఖ్యాతులే తప్ప, ఆస్తిపాస్తులు ఉండేవికావు. హాథీరాంజీ తర్వాత 12 తరాల మహంతులు ఈ మఠం వ్యవహారాలు చూస్తూ వచ్చారు. యాత్రికులకు సదుపాయాలు చేయడం, ముఖ్యంగా ఉత్తరభారతయాత్రికుల అవసరాలు తీర్చడంలో వీరి కార్యక్రమాలు సాగేవి. ముఖ్యంగా దేశంలోని ఏ బైరాగి తిరుమల వచ్చి సాధన చేసుకోవాలన్నా వసతి, భోజనసదుపాయాలు చేయడం కర్తవ్యంగా పెట్టుకొన్న మఠం ఇది. యాత్రికులు, దాతలు ఇచ్చే విరాళాలతోనే నడపబడే ఈ మఠం వారికి ఇష్టదైవం 'ఆంజనేయస్వామి'. రాములవారికి హనుమంతుడు సేవ చేసినట్లు మహంతులు శ్రీనివాసుని సేవ చేయాలన్నది వీరి ఆశయం.

వీరి నిస్స్వార్థసేవ కంపెనీ అధికారుల దృష్టికి వచ్చి, స్థానికులకు మతసంస్థల పరిపాలన బాధ్యత అప్పచెప్పాలన్న నిర్ణయం కంపెనీ చేసినప్పుడు, స్థానికులు కాకపోయినా మఠం చాలా కాలంగా స్థానికంగా ఉంది కనుక, స్థానికులతో ఇబ్బందులు రాకుండా వుండటానికి, ఆలయ ఆధిపత్యాన్ని వీరికిచ్చారు.

90 సంవత్సరాల పరిపాలనలో ఆలయ అభివృద్ధికి మహంతులు చాలా తోడ్పడ్డారు. 1843లో లక్ష రూపాయల ఆదాయం కల్గిన తిరుమల ఆలయాల ఆదాయం 1907-08 సంవత్సరానికి రూ. 3,87,406 కు పెరిగింది. అప్పటివరకూ ఆలయం పూర్తి బాధ్యతలు, ఖర్చులు పోనూ మిగులు నిధుల వినియోగం బాధ్యత మహంతులదే.

1880 ప్రాంతం నుండి మహంతుల పాలనకు వ్యతిరేకత మొదలైంది. ఆలయనిధుల మళ్లింపు, దుర్వినియోగం, అధికారదుర్వినియోగం, ఆలయనిధుల్ని మఠం అభివృద్ధికి, మఠం ఆస్తుల పెంపకానికి వాడుతున్నారన్న ఆరోపణలు వచ్చి, మహంతు భగవానుదాసుకు జైలు శిక్ష పడింది. తర్వాత కాలంలో మహంతులకు ఆలయంలోని ఆర్థికవ్యవహారాల్లో స్వతంత్రప్రతిపత్తి తీసేసి, ఆ బాధ్యతలు కోర్టువారు నియమించిన ట్రెజరీ అధికారికి, వారి క్రింద పనిచేసే సహాయ ట్రెజరీ అధికార్లకు ఉండేట్లు చేయడం జరిగింది. అది 1907-08 సంవత్సరంలో. ఆ తర్వాత ఆలయ ఆదాయం ప్రతి సంవత్సరం పెరిగి రూ. 3 లక్షల నుండి, 1923-24 సంవత్సరకాలానికి 16,35,517 రూపాయలకు (అంటే 15 సంవత్సరాల కాలంలో) చేరుకుంది.

★ ★ ★

69. ధ్వజస్తంభం కింద గుప్తనిధులు! జైలుకెళ్లిన మహంతు

1843లో కంపెనీ వారి నుండి ఆలయపాలన మహంతు సేవాదాసుకూ, తర్వాత 1860లో అతని శిష్యుడు ధర్మదాసుకూ దక్కాక, ధర్మదాసు శిష్యుడు మహంతు భగవాన్‌దాసు 1880లో తిరుమల ఆలయానికి విచారణకర్త (ధర్మకర్త) గా వచ్చాడు.

1843 నుండి 1880 వరకూ ఆలయానికి వచ్చే మిగుల నిధుల వినియోగం తిరుమల–తిరుపతి గ్రామాల అభివృద్ధికి, కొండపై మలేరియా వ్యాధి నిర్మూలనకీ, యాత్రికుల సదుపాయాలకు వినియోగింపబడి, మహంతులకు మంచి పేరు తెచ్చింది. అంతేకాక, ఆలయ ఆదాయం కూడా పెరిగి, కొంత మూలధనం కూడా నిలువ చేయగలిగారు. ఆలయ నిర్వహణను మహంతులు నిస్స్వార్థంగానే చేశారని చెప్పవచ్చు.

మహంతు భగవానుదాసు రంగప్రవేశంతో ఆలయనిధుల నిర్వహణ విషయంలో వివాదాలు తలెత్తాయి. అప్పటికే 'బైరాగుల' మఠంగా చాలా తక్కువ ఆదాయంతో ఆధ్యాత్మిక చింతన, సాధనే ధ్యేయంగా హాథీరాంజీ మహంతుచే స్థాపించబడిన మఠం, పరంపరగా సాధకులు మఠాధికారులై మఠం పేరు ప్రతిష్ఠలు ఆధ్యాత్మికరంగంలో వృద్ధి చెందేట్లు చేశారు. మొదటినుండీ ఈ మఠానికి ఆర్థికంగా పెద్ద మనుగడ లేదు. దాని విషయంలో మహంతులు కూడా దృష్టి సారించలేదు. ఒకసారి తిరుమల ఆలయం పరిపాలన, దానితో వచ్చిన అధికారం, యాత్రికుల నుండి పెరిగిన గౌరవప్రతిష్ఠలు, అవేమీ కాక ముఖ్యంగా ఆలయం మిగుల నిధులపై అధికారం, ఆలయంలో సేవలూ, దర్శనాలూ చేయించడంలో తమకు లభించిన ప్రత్యేక అధికారాలూ తర్వాత వచ్చిన మహంతుల మనస్తత్త్వంలో మార్పులు తెచ్చినట్లు భావించవచ్చు. ధర్మకర్త (విచారణకర్త) లుగా మొదలైన వారు రానురాను ఆలయం వారి సొంతం అనే విశ్వాసం, ఆలయనిధులపై వారికి సర్వహక్కులూ ఉన్నాయన్న భావన, వాటితో తాము ఏదైనా చేయవచ్చు అన్న ధీమా వారిలో వచ్చినట్లు కన్పిస్తుంది.

అదీకాక ఆనాటి ఆంగ్లేయపాలకులు మతసంస్థల విషయంలో దూరంగా ఉండడం, కంపెనీ పాలన నుండి, ఇంగ్లండు ప్రభుత్వపు రాజు రాణీల రాచరిక పరిపాలనలోకి వచ్చినా, ఈ వలసరాజ్యవిషయంలో విక్టోరియా మహారాణి మాత్రం తాము, తమ అధికారులూ, మతపరమైన విషయాలలో కాని, మతసంస్థల విషయంలోకాని జోక్యం చేసుకొనేది లేదని పునరుద్ఘాటన చేయడం, ఆ నిర్ణయం మేరకు ఆంగ్లపాలకులు జిల్లా కలెక్టరు పరిధిలోనూ, మద్రాసు ప్రభుత్వపరిధిలోనూ, ఎవరినుండి ఎటువంటి అభ్యర్థనలు వచ్చినా, మతపరవిషయాలలో జోక్యం చేసుకోకపోవడం మహంతులకు కొండంత శక్తినిచ్చినట్లుంది. కాని 1863లో ఈ మతసంస్థల శాసనం సరిగ్గా తయారుచేయని కారణంగా, మతపరవిషయాల్లో కోర్టుకు వెళ్లే విషయంలో చాలా సానుకూలం జరిగింది. పరస్పరవిభేదాలు కోర్టులో లావాదేవీలుగా మారాయి. అలా 1864లో మొదటి కేసు తిరుమల ఆలయవ్యవహారాల్లో చిత్తూరు జిల్లా కోర్టులో మొదలై, అప్పటినుండి మహంతులకు - ఆలయంలోని ఇతరవర్గాల వారికి హోరాహోరి పోరాటంగా మారి, ఆలయప్రతిష్ఠ దెబ్బతినే వరకూ వెళ్లింది...

రెండవ మహంతు ధర్మదాసు విషయంలో, కోర్టు, మహంతు సొంత నిధుల నుండి తిరుమల ఆలయానికి 2,25,457 రూపాయల 14 అణాలు వాపసు కట్టవలసినదిగా ఆదేశాలు కూడా జారీ చేసింది.

ఆ తర్వాత వచ్చిన భగవానుదాసు విషయం సరే సరి.. అతనిపై ఆరోపణలు వెల్లువెత్తాయి. ధ్వజస్తంభం తీసి మళ్లీ సరిగ్గా పెడతామన్న నెపంతో, ధ్వజస్తంభం కింద ఉన్న నిధులు కాజేశాడనీ (ఆ నిధులు, పూర్వరాజులు ధ్వజస్తంభం ప్రతిష్ఠ సమయంలో ధ్వజస్తంభ కింద పాతిపెట్టారని గొప్ప నమ్మకం), దాదాపు ఆలయనిధులు 15 లక్షల దాకా కాజేశాడని ఇంకో ఆరోపణ.

మహంతులపై ఈ కేసులు ఎందుకు వచ్చాయి అనేందుకు, వారి పరిపాలన సంబంధిత విషయాలు కొన్ని పరిశీలించాల్సి ఉంది.

స్వామివారి సేవకులు, భక్తులుగా మొదలైన మహంతులు 'పాలకులు'గా తయారయ్యారు. యాదవరాజు కట్టించిన సౌధానికి తమ మఠం మకాం (ఇప్పటి తిరుమలలో వున్న స్వామివారి ఆలయానికి ఆగ్నేయంగా ఎత్తుగా వున్న భవనం)

మార్చారు. వచ్చిన భక్తులందరూ ముందు స్వామివారి ప్రతినిధి మహంతుల దర్శనం చేసుకొని, పాద కానుకలు సమర్పించి, వారి ఆశీర్వచనంతో ఆలయంలో స్వామివారి దర్శనానికి వెళ్లే సంప్రదాయానికి నాంది పల్కారు. అదీ ముఖ్యంగా, ఎక్కువ కానుకలు సమర్పించలిగిన రాజులు, రాణులు, జమీందారులు, ధనికుల విషయంలో... వారికి ప్రత్యేక అతిథి సౌకర్యాలు, ఆలయమర్యాదలు, ప్రత్యేకదర్శనాలూ, ఆలయ ఆశీర్వచనాలూ జరిగేవి.

అప్పటివరకూ ఆంగ్లేయులూ, ఇతరపాశ్చాత్యులూ, ఇతరమతాలవారూ కొండకు వచ్చే సంప్రదాయం లేదు. సర్ థామస్ మన్రో విషయంలో చూశాం కదా... కొండ ఎక్కవద్దని స్వామివారే ఆజ్ఞాపించినట్లు విన్నాం.. మహంతు భగవానుదాసు గారి హయాంలో, తోటయాత్రికుల బంగళా (టి.బి – చంద్రగిరి మెట్లు ఎక్కగానే ఉన్న తోటలో) ప్రత్యేకంగా యూరోపియన్ అధికారుల బస కోసం నిర్మింపబడింది. కొండకు హైందవేతరులు వచ్చే సంప్రదాయానికి నాంది పలికింది.. ఇవన్నీ ఒక ఎత్తు అయితే, ఆలయనిధుల వినియోగం విషయంలో కొంత విచ్చలవిడితనం మొదలైంది అని ఆరోపణ. ఆలయం మిగుల నిధుల నుండి మద్రాసు ఘోషా ఆస్పత్రికి నిధుల మంజూరు, తిరుపతి, వెల్లూర్లలో ఆంగ్ల విద్యాబోధన గల పాఠశాలల నిర్వహణను దేవస్థానం చేపట్టడం. ఇతర సంస్థలకు నిధులు మంజూరు చేయడం – ఇందులో మతపరసంస్థల కన్నా ఇతరసంస్థలు ఎక్కువ కావడం చాలా విమర్శలకు దారి తీసింది.

ఇంతేకాక కార్వేటి నగరం జమీందారుకు రూ. 5 లక్షలు, కాళహస్తి జమీందారుకు రూ. 5 లక్షలూ, ఇతరులకు ఒక లక్ష రూపాయలూ, వారి ఆస్తులూ, జమీందారీ భూములూ తనఖా పెట్టుకుని అప్పులు ఇవ్వడం, తిరుపతిలో ఒక వైద్యశాల ఏర్పాటు... ఇలా కొంతవరకు తమ పరపతి పెంచుకోవడానికి చేసినట్లు కన్పిస్తుంది. కొన్ని సేవల విషయంలో చాలా దూరదృష్టితో వ్యవహరించినట్లు కన్పించినా, నిధులు ఖర్చు పెట్టే విషయంలో కొంత స్వార్థమున్నట్లు తెలుస్తోంది... కొండపై చెరువులు బాగు చేయడం, సత్రాల నిర్మాణం, పైపుల ద్వారా నీటి సరఫరాలపై ఖర్చు వగైరాలు, యాత్రికుల కోసం చేసిన మంచి ఖర్చులైనా, నిధులు కాజేశారన్న ఆరోపణలు రావడం మొదలైనాయి... ఈ విషయాలు నచ్చని జియ్యంగార్లు, శ్రీవైష్ణవులు, జిల్లా న్యాయస్థానాలకు అర్జీలు పంపడం, వాటిపై సమగ్రపరిశీలన చేసి, నమ్మకద్రోహం, నిధుల దుర్వినియోగం, అధికార దుర్వినియోగం, విశ్వాసఘాతుకం నేరాలు

రుజువైనాయని మహంతు భగవాను దాసుకు జిల్లా కోర్టు మూడు సంవత్సరాల కారాగార శిక్ష విధించి, అందులో మొదటి నెల మామూలు కారాగారశిక్షగానూ, తర్వాతికాలం కఠినశిక్షగానూ పరిగణిస్తూ తీర్పు ఇచ్చింది.

ఈ తీర్పుపై మహంతు మద్రాసు హైకోర్టులో అప్పీలుకు వెళ్తే 1890 లో - ముఖ్య న్యాయాధికారి జి. హెచ్. కాలిన్సు, న్యాయాధికారి ముత్తుస్వామి అయ్యర్లు- మహంతు నేరం చేసినట్లు ఖరారు చేస్తూ, కారాగారశిక్షను మూడు సంవత్సరాల నుండి 18 నెలల మామూలు కారాగారశిక్షగా తగ్గించారు.

మహంతును తిరుచినాపల్లి కేంద్రకారాగారంలో బందీగా వుంచారు. ఆరోగ్య కారణాల వల్ల 'మెర్సీ' (దయచూపమని) అభ్యర్థన చేసినా, తర్వాత వైస్రాయి, గవర్నరు జనరల్, కౌన్సిలుకు అప్పీలు చేసినా మహంతు అభ్యర్థన తిరస్కరించబడింది.

మహంతు తన వాదనలో ఇతర మహంతుల వలె కాక, తాను కొంత కొత్త పంథాలో పోయినా, తాను బైరాగిననీ, స్వార్థంతో చేయలేదనీ, తానేమైనా సంపాదించినా, అది తనకు రాదనీ, తన మఠానికీ ఆ తర్వాత వచ్చే మహంతులకు చెందుతుందనీ, తన మీద, తన మఠం మీద అక్కసుతో అయ్యంగార్ బ్రాహ్మణులు, ఆలయఅర్చకులూ, ఇతర ఆలయ అధికారులు పన్నిన కుట్ర అనీ వాదించినా, క్షుణ్ణంగా అన్నీ పరిశీలించిన న్యాయస్థానాలు మహంతును నేరస్తునిగానే పరిగణించాయి.

ఆ తర్వాత వచ్చిన మహంతు రామ్‌కిషోర్‌దాస్. అతని మీద కూడా 50 వేల రూపాయలు దేవస్థానం నిధులు కాజేశాదని, అందుకు అతనిని ఆలయవిచారణకర్త పదవి నుండి తొలగించాలని కోర్టు ముందు దాఖలైన ఫిర్యాదుపై విచారణ పూర్తి అయ్యేలోపే ఆ మహంతు హత్యకు గురయ్యాడు. ఆలయభూములు లీజుకిచ్చే విషయంలో రైతుల నుండి లంచాలు, 50 వేల రూపాయల వరకూ తీసుకొన్నాడని ఇతనిపై వచ్చిన ఆరోపణలు. అవన్నీ అతని మరణంతో మూతపడ్డాయి. ఎందుకంటే, అతనే లేడు కాబట్టి అతను విచారణకర్తగా చేసిన నేరాలకు శిక్ష ఇచ్చే అవకాశం లేదు. కాని అప్పటికి ఇంకొక కేసు కూడా మహంతుపై ఉంది. మహంతులు అధికారదుర్వినియోగం చేస్తున్న కారణంగా- 'విచారణకర్త'గా మహంతుకున్న అధికారాల విషయంలో మార్పులు తేవాలన్న విషయం కోర్టు ముందు విచారణ జరిగింది.

అప్పటినుండి తిరుమల ఆలయంలోని మహంతుల పాలనపై కోర్టువారు ప్రత్యేక శ్రద్ధ చూపడం మొదలుపెట్టారు. ఒక్క మహంతుకే ఇటువంటి మతపరసంస్థ యాజమాన్యం కట్టబెట్టడం సమంజసమా అన్న విషయంపై కూలంకషంగా విచారణ జరిగింది.

1898లో ఉత్తర ఆర్కాటు జిల్లా ప్రధాన న్యాయస్థానం, ఇరుపక్షాలను – అంటే ఒక వైపు విచారణ కర్త మహంతును, ఇంకొకవైపు జియ్యంగార్లు, శ్రీవైష్ణవులు, తిరుమలలోని ఇతర మఠాలవారిని విచారించి, ఆలయనిధుల వినియోగవిషయంలో ఒక ప్రత్యేకమైన పథకాన్ని రూపొందించి – ఆ పథకం అమలు చేయడానికి ఐదుగురు సభ్యులతో, ఒక సంఘాన్ని నియమించాలని ఆదేశించింది. ఆ సంఘనిర్ణయాలకు మహంతు కట్టుబడి ఉండాలని నిర్ణయం చేశారు.

ఈ నిర్ణయంపై మద్రాసు హైకోర్టులో మహంతులు వేసిన అప్పీలు విచారణ జరిగింది. నిధుల దుర్వినియోగం అరికట్టాల్సిన అవసరాన్ని హైకోర్టు గుర్తిస్తూ, ఐదుగురు సభ్యులు (వేతనాలు లేకుండా, పూర్తిగా ఈ కార్యక్రమం చూడకుండా) అప్పుడప్పుడూ విషయ పరిశీలన చేస్తూ పనిచేయడం సాధ్యంకాని పని – అని నిర్ణయం చేసి, మహంతుతో పాటు ఇంకొక 'అదనపు ధర్మకర్త'ను దేవదేయనిధుల నుండి నెలసరి వేతనం మీద (నాలుగువందల రూపాయలకు తక్కువ కాకుండా, 500 రూపాయలు మించకుండా) నియమించాలని నిర్ణయం చేశారు. ఈ బాధ్యత అతను పూర్తిగా ఆలయంలో ఉండి నిర్వహించే విధంగా చేయాలని నిర్ణయం చేశారు. ఇదికాక, విచారణకర్తను బర్తరఫ్ చేయడానికి (తాత్కాలికంగా తీసివేయడానికి) అవకాశం కల్పిస్తూ ఆదేశాలిచ్చారు.

ఈ హైకోర్టు నిర్ణయంపై మహంతు లండన్‌లోని ప్రీవీ కౌన్సిల్‌కు అప్పీలుకు వెళ్లాడు. ఈ న్యాయస్థానాల నిర్ణయాలు, మతపరవిషయాలలో జోక్యం చేసుకోవడం అవుతుందనీ, 1843లో మహంతులకు ఈ దేవాలయాలపై అధికారాలూ ఇచ్చినప్పుడు సర్వహక్కులు ఇచ్చారనీ, మహంతులొక్కరికే అధికారం ఉండాలని నిర్ణయం చేశారనీ, ఇప్పుడు మహంతుల అధికారం నిర్వీర్యం చేయడానికి ప్రయత్నం జరుగుతోందనీ.. నిధులు దుర్వినియోగం జరగకుండా వుండడానికి ఎటువంటి ప్రణాళిక పెట్టినా మహంతు సిద్ధమే కాని, ఆలయంపై పెత్తనం తనకొక్కడికే వుండాలి తప్ప, ఇతరులకు ఇవ్వడం సమంజసం కాదని వాదన.

మహంతుల వాదాన్ని ప్రీవీ కౌన్సిల్ వారు ఆమోదిస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పుకు కొన్ని మార్పులు చేశారు. ఇంకొక అదనపు ధర్మకర్తకు బదులు, ఆలయనిధుల నిర్వహణకు, జిల్లా కోర్టువారు ఒక గణాంక (Treasurer) అధికారిని నెలసరి వేతనంపై నియమించాలి. ఆలయ ఆదాయం, ఖర్చులు, పద్దులు తయారు చేసే బాధ్యత అంతా ఈ అధికారిది. ఈయన ఆలయంలో పనిచేసినా ఒక రకంగా స్వతంత్ర ప్రతిపత్తి కల్గినవాడు. కోర్టువారు నియమించే వాడు కాబట్టి, వారికే జవాబుదారీ, వారి అధీనంలో పనిచేస్తాడు. మహంతుకు అతనిని కట్టడి చేసే అధికారం కాని, తీసివేసే అధికారం కాని లేదు. వీరి పనితీరు, బాధ్యతలు, కర్తవ్యాల విషయంలో జిల్లా కోర్టు ప్రత్యేకంగా ఒక పథకం తయారుచేయాలని కూడా ఆదేశాలు ఇచ్చింది. అలా దేవస్థానాలలో ఆదాయవ్యయాల క్రమబద్ధీకరణకు జిల్లా కోర్టు ఒక పథకం రూపొందించింది (1907). దానిపై మళ్లీ మహంతు హైకోర్టులో అప్పీలు చేశాడు.

హైకోర్టు బెంచి 1908లో ఆలయ ఆర్థికవ్యవహారాలు ఎలా నడపాలన్న విషయంలో నిర్ణయం చేస్తూ ఒక పథకాన్ని నిర్దేశించారు.

విచారణ కర్త (మహంతు) ఒక్కడికే ధర్మకర్తగా వ్యవహరించే అధికారమున్నా, ఆ అధికారం దుర్వినియోగం కాకుండా ఈ పథకంలో కట్టుదిట్టం చేశారు. చాలా ఆసక్తికరమైన విషయాలున్నాయి.

ఇకముందు - హాథీరాంజీ మఠం ఆఫీసుకు, దేవస్థానాల కార్యాలయానికి సంబంధాలు తక్కువ అవుతాయి. కానుకలు, ఆభరణాలు, ఇతర ఆదాయాలు పరకామణితో సహా, మఠంలో జరిగేవి - ఇక ముందు ఆలయం నుండి కింద దేవస్థానం ఆఫీసుకు మఠానికి సంబంధం లేకుండా వెళ్తాయి. ట్రెజరర్ కింద దేవస్థానం కార్యాలయంలో పనిచేసే అతనికి సహాయంగా కొండమీద ఆలయంలో సహాయ ట్రజరర్ పనిచేస్తారు. ఆలయానికి వచ్చే ఆదాయవ్యయాలు వీరి ఆధ్వర్యంలోనే జరుగుతాయి. పరకామణి సమయంలో విచారణకర్త (మహంతు కూడా) ఉంటాడు.

నగలు, కానుకలు, మఠానికి వెళ్లటానికి వీల్లేదు, ఆలయంలోనే ఉండాలి. జిల్లా కోర్టు అనుమతి లేకుండా ఆలయం ఆస్తులు కొనడంగాని, అమ్మడంగాని మహంతు చేయరాదు.

ఆలయానికి కావల్సిన ధాన్యం, పప్పులు, ఇతర సామానులు మహంతు కొన్నప్పటికీ, తన ఇష్టమొచ్చినట్లు కొనడానికి అధికారం లేదు. వేలం వేసి ఆలయానికి నష్టం రాకుండా అందరికీ తెలిసేట్లు నిర్ణయాలు, కొనుగోళ్లు జరగాలి.

ఆలయ అధికారులు మఠంలో గాని, మఠం అధికార్లు ఆలయంలో కాని పని చేయడానికి వీల్లేదు.

బ్రహ్మోత్సవాలలో పరకామణి లేదు. వచ్చిన కానుకలు మూటలు కట్టి, క్రింద దేవస్థానం కార్యాలయానికి పంపి, ఆ తర్వాత పరకామణి చెయ్యాలి. అదివరకులా మఠంలో హుండీ మూటలు ఉంచడానికి వీల్లేదు.

ఆర్జితం, ఇతరసేవల విషయం కూడా మహంతు సేవాదార్లకు రుసుం రశీదులు ఇచ్చేటప్పుడు మూడు రసీదులు తయారుచేయాలి, ఒకటి సేవాదారుకు, రెండవది ట్రెజరీకి, మూడవది మహంతు దగ్గర వుండేది. రశీదు లేనిదే ఏ సేవా ఆలయంలో చేయరాదు.

విచారణకర్తకు (మహంతు) 5000 రూపాయల వరకు చిల్లర ఖర్చు పెట్టడానికి మూలధనంగా ఇస్తారు. మిగతా అన్ని ఖర్చులూ దేవస్థానకార్యాలయం ద్వారానే జరుగుతాయి.

భూములనుండి, ఇతర ఆస్తుల నుండి వచ్చే ఆదాయాలను మహంతు వసూలు చేయడానికి లేదు. ఇదంతా తహశీల్దారు వసూలు చేసి ట్రెజరీకి జమ చేయాలి.

ఈ స్కీముతో ఆర్థికంగా మహంతుకు కోరలు పీకేసినట్లు అయింది.

ఇలా 1890 నుండి 1908 వరకూ ఈ ఆర్థికసంస్కరణల తగాదా జరుగుతున్న సమయంలో, మహంతు భగవాన్ దాసు పరమపదించారు. ఆ తర్వాత చాలా కొద్దికాలం మహవీర్ దాసు, రాంకిషోర్ దాసు మహంతులుగా ఉండి, 1900 సంవత్సం నాటికి మహంతు ప్రయాగదాసుజీ విచారణకర్త అయ్యారు.

1908 సంవత్సరంలో ఈ స్కీము (పథకం) అమలునాటికి మహంతు ప్రయాగదాసు విచారణకర్తగా ఉన్నారు. విచారణకర్తగా పనిచేసిన అందరు మహంతుల కంటే మహంతు ప్రయాగదాసుకు మంచి పేరు ప్రతిష్ఠలు వచ్చాయి. ఆలయ అభివృద్ధికి

చాలా పాటుపడ్డాడు. కొండకు ఎక్కే మెట్లు బాగుచేయించాడు, గోపురాలకు మరమ్మత్తులు చేయించారు. యాత్రికుల సదుపాయాలకు ఎంతో కృషి చేశాడు. ఆనందనిలయ గోపురంపై బంగారు మలాము మళ్లీ పూయించాడు. ఆలయంలోని శిలాశాసనాలపై సమగ్రపరిశీలన చేయించి, వాటిని దేవస్థానంచే ప్రచురింపజేశాడు. అన్నమయ్య సంకీర్తన భాండాగారం నుండి రాగిరేకులు బయటపడింది ఈయన కాలంలోనే. ఇన్ని మంచి పనులు జరగడానికి ఒక రకంగా, కొత్తగా ప్రవేశపెట్టబడిన ఆర్థికవిధానం కారణం కావచ్చు. ఇతరవిధంగా ఆలయం మిగుల నిధులు ఖర్చు చేసే అధికారాలు మహంతుకు పోయాయి. తానొక్కడే నిర్ణయం తీసుకొనే వీలు లేదు. మిగులు నిధులు ఆలయ అభివృద్ధికి మాత్రమే ఖర్చు చేయాలి. ఈయన కాలంలోనే ఆలయం, మహంతుల నుండి ప్రభుత్వం నియమించిన ధర్మకర్తల అధీనంలోకి 1933లో వచ్చింది.

★ ★ ★

70. 1933 నాడున్న నగలకే జవాబుదారీ!

మహంతు ప్రయాగదాసుజీ 1900 వ సంవత్సరంలో ఆలయానికి ఆఖరి విచారణకర్తగా పదవిలోకి వచ్చాడు. మహంతు భగవాన్‌దాస్ కాలంలో మొదలైన వ్యతిరేకత పెరిగి పెరిగి, ఫలితంగా 1907-08 నాటికి మహంతులు ఆలయ ఆదాయ వ్యవహారాల విషయంలో అధికారాలు దాదాపు కోల్పోయారు.

ప్రతి రోజూ హుండీ కానుకల మూటలు మహంతుల మఠానికి వచ్చేవి. వాటిపై ఆధిపత్యం ఆలయంలోనూ, పరకామణి విషయంలోనూ మహంతుకే ఉండేది. ఆలయ అధికారులకు, మఠంలో పనిచేసే వారికి తేడా లేకుండా అందరూ మహంతు అధీనంలో ఉండేవారు. అవన్నీ మారిపోయి చాలావరకూ అధికారాలు - కోర్టువారు నియమించిన ట్రెజరరుకు లభించాయి. పేరుకే ట్రెజరరు. మహంతు అధీనంలో లేని ఇతను, నిజానికి కోర్టు వారి అధీనంలో మహంతును నిర్దేశించడానికి చేసిన ఏర్పాటు. ఆస్తులు కొనాలన్నా, అమ్మాలన్నా చివరికి, కౌలుకు ఇవ్వాలన్నా మహంతుకు అధికారాలు పోయాయి. ఆలయానికి కావల్సిన అన్ని పదార్థాలూ కొనే అధికారం మహంతుకు ఉన్నప్పటికీ, అదివరకులా కాదు. అందరికీ తెలిసేట్లు టెండర్లు పిలిచి నిర్ణయాలు తీసుకోవాలి. తమకు ఇష్టం వచ్చిన విధంగా కాదు. అలా ఆలయనిధులు దుర్వినియోగం చేయడానికి మఠానికి గాని, ఇతరత్రాకాని మళ్లించడానికి అవకాశం లేకుండా కట్టుదిట్టమైన ఏర్పాటు జరిగింది. ఆలయానికి నష్టంవచ్చే కార్యక్రమాలు ఏ మాత్రం మహంతు తలపెట్టినా దానిని కోర్టుకు తెలిపే అధికారం ట్రెజరరుకు వుంది.

అప్పటిదాకా స్వతంత్రంగా, తన ఇష్టం వచ్చినట్లు ఆలయనిధులపై అధికారం చలాయిస్తున్న మహంతుకు 1907-08 నుండి ఇబ్బందులు మొదలయినాయి.

దీనికంతటికీ ముఖ్యకారణం - ఆలయ అధికారం చలాయిస్తూ హాథీరాంజీ మఠంవారు ఆలయం కన్నా ఎక్కువ ఆస్తులు సంపాదించడం.

మిశ్రాజీ రాసిన పుస్తకంలో హాథీరాంజీ మఠం ఆస్తుల వివరాలు ఇచ్చారు:

తిరుపతి మఠం భవనం - దాదాపు (1700) ఎకరాల భూమి - మందిరాలు.

తిరుమల మఠం భవనం - అంగడులు, జాబాలీ తీర్థ ఆంజనేయస్వామి ఆలయం - చాలా ఎకరాల భూములు. ముగ్గుబావి దగ్గర ఆంజనేయస్వామి మందిరం- భూములు.

ఆదోని (ఎ.పి.) మందిరం - భూములు.

కర్ణాటక - మహంతు లేఅవుట్‌లో పెద్ద బంగళా - చాలా భూమి.

గుల్బర్గా, సుగూరు గ్రామంలో - ఆలయం - భూములు.

మహారాష్ట్ర - ఆ రోజుల్లో బొంబాయి, ప్రెసిడెన్సీలో మందిరాలు, భూములు, బంగళాలు, తోటలు; నాశిక్ జిల్లాలో మందిరాలు, భూములు - భూలేశ్వరు మందిరం, సత్యనారాయణ మందిరం;

పన్నేర్ బాలాజీ - మందిరం భూములు.

తమిళనాడు రావల్గాంలో - విశాలమైన భూములు (disputed).

మద్రాసులో - ఆలయాలు, భూములు; సోలింగరులో ఆలయాలు - భూములు; వెల్లూరులో మందిరం - భవనాలు; పాకంలో మఠానికి విశాలమైన భూములు; కంచిలో మందిరం-భూములు; విరుదాచలంలో మందిరం-భవనాలు; చెంగల్పట్టు, వాలాజీ పోలూరు, పెరుంబుదూర్లలో విశాలమైన భూములు; తంజావూరులో - ఆలయం-భూములు; ఊటీలో - మహంతుల బంగళా, చాలా భూములు.

ఇవన్నీ స్థిరాస్తులు. చరాస్తుల విషయం ప్రస్తావన లేదు.

మఠానికి ఇన్ని ఆస్తులు ఎలా వచ్చాయి? మహంతు ఆదాయమల్లా పాద కానుకే. వీటితోనే వచ్చాయా? దాతలిచ్చినవా? ఆలయానికా - మఠానికా?- అనుమానాలకు తావు కన్పిస్తోంది.

1907-08 సంవత్సరాలనుండి ఒక రకంగా ట్రెజరరుకూ, మహంతుకూ ఎప్పుడూ వివాదమే. ఆర్కాటు కోర్టులో ఎప్పుడూ విచారణలే. ఆలయ ఆదాయానికి మహంతు గండి కొట్టడానికి ప్రయత్నం చేస్తున్నారని మహంతు మనుషులు, ముఖ్యంగా

ప్రయాగదాసు సోదరుడు, అతని అనుచరులూ, సేవలు చేయిస్తామనీ, బాగా దర్శనం చేయిస్తామనీ, ఆలయమర్యాదలు చేయిస్తామనీ యాత్రికుల నుండి భారీ వసూళ్లు చేస్తున్నారని ఆరోపణ... మహంతుల మనుషులు ఆర్జితం సేవా టిక్కెట్లు అమ్మకుండా, యాత్రికులనుండి డబ్బులు వసూలు చేసి, ఆలయంలో దబాయించి సేవలు అనధికారికంగా, చేయిస్తున్నారన్న అభియోగం... హుండీలో వేస్తే కానుకలు, సర్కారుకు పోతాయి. కనుక మఠంలోనే సమర్పించమని యాత్రికులను ప్రోద్బలం చేస్తున్నారన్న నేరారోపణ... ఆలయంలో పలకని దేవుడు, మఠంలో మహంతు రూపంలో పలికే దేవుడు... మీ కానుకలు నేరుగా 'పలికే దేవుడికే' సమర్పించమని ప్రచారం చేసి, యాత్రికులను మోసం చేస్తున్నారని ఆరోపణ... ఆలయ ఆభరణాలు కరిగించి వేస్తున్నారనీ, హుండీలో కానుకులుగా వచ్చిన బంగారం, వెండి, ఆభరణాలు వేలం వేయటంలో వజ్రాలు, ఖరీదైన రాళ్ల విషయంలో గోల్‌మాల్ జరుగుతోందని ఆరోపణ... ఫలితంగా ఇలా ఆలయానికి రావల్సిన ఆదాయం మహంతు కొల్లగొడ్తున్నాడని ఎప్పుడూ ఆరోపణలే!

ఇవికాక పప్పుదినుసులు, రోజువారీ సామానులు, ఇతరాల కొనుగోళ్లలో అవకతవకలు... కోర్టు వారు నిర్దేశించిన నిబంధనలు పాటించడం లేదని, ఆశ్రితపక్షపాతం, వ్యాపారులతో కుమ్మక్కై ఆలయానికి నష్టం కల్గిస్తున్నారన్న అభియోగం.

వీటన్నిటి దృష్ట్యా ఒక మహంతునే విచారణకర్త (ధర్మకర్త) గా ఉంచేకన్నా ఇతరులు కొంతమందిని ధర్మకర్తలను చేయాలన్న ప్రతిపాదన వచ్చింది. అలా చేసేవరకూ కోర్టు విధించిన ట్రెజరరును కూడా ధర్మకర్తగా పరిగణించాలని సూచన. అదివరకు ప్రీవీ కౌన్సిలు వారు కోర్టు ద్వారా ప్రవేశపెట్టిన పథకంలో మార్పులు చేయడానికి ఎవరైనా మద్రాసు హైకోర్టులో అభ్యర్థనలు చేసుకోవచ్చన్న విషయం దృష్ట్యా, కొందరు భక్తులు, ఆలయ అధికారులు, స్థానికులు హైకోర్టులో మహంతుకు వ్యతిరేకంగా అభ్యర్థనలు దాఖలు చేశారు.

ఇలాంటి పరిస్థితుల్లో 1922లో మద్రాసు ప్రభుత్వ శాసనమండలిలో దేవాదేయ-ధర్మాదాయ సంస్కరణలు చేయడానికి (Madras, Hindu Religion Endowment bill) ప్రవేశపెట్టడం జరిగింది. దానిని మహంతు వ్యతిరేకించి కోర్టుకు వెళ్లడం. తర్వాత 1925 సెక్రెటరీ ఆఫ్ స్టేట్స్‌కు దరఖాస్తు చేయడం జరిగింది. మళ్లా ఆంగ్లప్రభుత్వం మతపర విషయాల్లో జోక్యం చేసుకుంటున్నట్లవుతుందని, అది ప్రభుత్వవిధానాలకు వ్యతిరేకం కనుక అటువంటి శాసనం చేయరాదని అభ్యర్థన చేశాడు.

ఈ బిల్లులో ఆలయాల నిర్వహణకు కమిటీలు వెయ్యాలనీ, వాటికి ఆలయనిధులు, వినియోగవిషయంలో సర్వహక్కులూ యివ్వాలనీ ప్రతిపాదించబడింది. శాసనమండలి ఆమోదం పొందినా ఈ బిల్లు, గవర్నరు ఆమోదం లేక రకరకాల అడ్డంకులను ఎదుర్కుంది. రెండేళ్లకు పైగా శాసనమండలి సెలెక్టు కమిటీ తర్జనభర్జనలు చేసి తర్వాత సభ ఆమోదం లభించినా, మహంతుల అర్జీల ప్రభావం వలన, ఆంగ్లేయులు ఈ మతపరమైన విషయంలో అతి జాగ్రత్తచూపి, వైస్రాయి, గవర్నరు జనరలు ఆమోదం లేకపోవడం వలన, 1933 వరకు అమలుజరగడానికి అవకాశం రాలేదు. ఆలయానికిగాని, కొన్ని ఆలయాలకు కలిపిగాని పరిపాలన కమిటీలు వేయడానికి అవకాశం కల్గిస్తూ, ఇటువంటి కమిటీలన్నీ దేవదేయం బోర్డువారి అధీనంలో పనిచేస్తాయనీ, ఆ బోర్డు దేవదేయ శాఖగా పనిచేస్తుందనీ ప్రభుత్వం నిర్ణయించింది. కాని దాని ఖర్చు ప్రభుత్వం భరించదు. ఆ బోర్డు అధీనంలోకి వచ్చిన అన్ని ఆలయాల ఆదాయం నుండి కొంత శాతం పరిపాలన ఖర్చులకు వినియోగం చేయబడుతుంది. కొన్ని మఠాలు, కొన్ని ప్రత్యేక ఆలయాలూ ఈ శాఖ పరిధిలోకి రావు.

ఆ కాలంలోనే, అధికారంలో ఉన్న రాజకీయ పార్టీ, వారి రాజకీయ ఉపయోగాలకు ఈ కమిటీలను, ఆలయాలపై అధికారాలను వాడుకోవడానికి అవకాశం ఉందన్న వాదన వచ్చింది. తర్వాతి కాలంలో నిజమైంది. దేవదేయశాఖ విస్తరించిపోయి, దేవాలయాల నిధులు ఆ శాఖ ఖర్చులకు ఎక్కువగా ఉపయోగించే అవకాశం ఉందన్న వాదమూ కొంతవరకు నిజమనే చెప్పాలి. రాను రాను, జీతాలు తీసుకుని, ప్రభుత్వాధీనంలో పనిచేసే వారి పెత్తనం పెరగడానికి అవకాశం ఉందన్న ఆరోపణా తర్వాతి కాలంలో నిజమైంది.

మహంతు ఈ శాసనం రాకుండా చూడటానికీ, వచ్చినా అది తిరుమల ఆలయాలకు వర్తించకుండా చూడడానికీ చేసిన అన్ని ప్రయత్నాలూ విఫలమయ్యాయి. చివరకు 1933లో మహంతుల పాలన రద్దై, దేవదేయం బోర్డు అధీనంలో తిరుమల–తిరుపతి దేవస్థానాలకు ఒక పాలకమండలిని ప్రభుత్వం నియమించే ప్రక్రియ మొదలైంది. 90 సంవత్సరాల మహంతుల ఏకచ్ఛత్రాధిపత్యం దృష్ట్యా, కొంత పరిపాలనసౌలభ్యం దృష్ట్యా, కొత్త పాలకమండలిని నియమించినప్పుడు, దీనికి మొదటి అధ్యక్షునిగా మహంతు ప్రయాగదాస్‌జీనే నియమించడం జరిగింది.

అంటే ఒక్క ధర్మకర్త అధీనం నుండి ఈ తిరుమల ఆలయాలు, బహుధర్మకర్తల పాలనలోకి వచ్చాయన్నమాట.

మహంతుల పాలన ఈ రకంగా ముగింపు జరగడానికి ముందు, ఒక ఆసక్తికరమైన విషయం గమనించాలి. 1927లో మహంతు ప్రయాగదాసు స్వామివారికి (మూల విగ్రహానికి) ఒక కొత్త కిరీటం (బంగారంతో వజ్రాలు, ఇతర విలువైన రాళ్లతో) చేయించాలని సంకల్పం చేశారు. దానిని తయారు చేయడానికి అప్పుడు వాడుకలో ఉన్న కిరీటాన్ని కరిగించి, ఆ బంగారంతో ఇంకా కొంత బంగారం వేసి, దేవస్థానం ట్రెజరీలో ఉన్న వజ్రవైడూర్యాలతో కొత్త కిరీటం చేయాలన్నది ప్రతిపాదన. దేవస్థానం రికార్డులలో, అప్పటి వరకు మిగిలిన విజయనగరపు కాలంనాటి నగ ఆ ఒక్క కిరీటమే. మిగతా ఆభరణాలన్నీ మహంతుల ముందు కాలంలోనైనా, తర్వాత మహంతుల కాలంలోనైనా, మాయమైపోవడానికి ఆస్కారం వుంది.. ప్రతిరోజూ స్వామివారికి అలంకరించే నగలను ఆ సంవత్సరపు వంతుదార్లైన అర్చక మిరాసీదార్ల ఆధ్వర్యంలో ఉంచుతారు. కనుక ఆ నగలకు ఎవరి పాలనలోనూ ఢోకా లేదు. కాని ఆ నగలు విరిగిపోయినా, ఉపయోగించడానికి వీలులేకపోయినా, వాటిని దేవస్థానం ట్రెజరీకి పంపే సంప్రదాయం 1800 ముందు కాలం నుండీ వుండేది. 1800 నుండి 1843వ సంవత్సరం వరకూ అటువంటి ఆభరణాలు, హుండీలో వచ్చిన ఆభరణాలతో సహా కంపెనీ ప్రభుత్వం వారి ఖాతాలో జమ చేసుకునే పద్ధతి మొదలైంది.

1843లో కంపెనీవారు మహంతుకు అందజేసిన ఆభరణాలకు మాత్రమే మహంతుల బాధ్యత వుంది. దేవస్థానంలో రోజూ అలంకరణకు మిరాసీ అర్చకుల అధీనంలోనివి, విశేష ఉత్సవాల సమయంలో అలంకరణకు వాడే ఆభరణాలు ఆలయ అధికారుల అధీనంలో ఉన్నంత వరకూ మాత్రమే మహంతులకు ఇచ్చిఉండాలి. ఆలయం మిగులు నిధులు మహంతులకు కంపెనీవారు స్వాధీనం చేయలేదు. ఆలయం బయటకు - అంటే తహసీలు ఆఫీసుకు చేరిన హుండీ ఆభరణాలు కానీ, వాడుకలో ఉండి, పాడయిపోయి, ట్రెజరీకి వాపసు చేసిన ఆభరణాల విషయం కానీ, ప్రస్తావనలేదు. కంపెనీవారు వాటిని వేలం వేసో లేదో కరిగించో మిగుల నిధులలో కలపడం జరిగిందా - లేక ప్రభుత్వం స్వాధీనం చేసుకొందా అన్న విషయం స్పష్టంగా లేదు.

మహంతులకు కంపెనీవారు ఆలయం అధీనం చేసినప్పుడు ఇచ్చిన ఆస్తులు, ఆభరణాలు వివరాలు తెల్పే 'ఇచ్చి పుచ్చుకునే' పత్రాలు ఆర్కాటు జిల్లా రికార్డులలో గానీ, మహంతుల కార్యాలయంలో కానీ ఉండాలి. కాని అవి ఇప్పుడు అందుబాటులో ఉన్నట్లు లేవు. మహంతుల కాలంలో 1843 నుండి దాదాపు 1907-08 సంవత్సరం

వరకూ, ఏకైకధర్మకర్తగా మహంతులదే అధికారం. ఆభరణాల విషయంలోనూ, ఆలయం మిగులు నిధుల విషయంలో బాధ్యత వారిదే. ఆలయ అధికారులనుండి, అర్చకులు, జియ్యంగార్ల నుండి, ఆచార్యపురుషుల నుండి నిధుల నిర్వహణలో మహంతులపై చాలా ఫిర్యాదులుండేవి. మహంతు భగవానుదాసు జైలు శిక్ష వరకూ, ఆ తర్వాత ఆలయనిధులు, ఆభరణాలను కోర్టువారు నియమించిన ట్రెజరీ అధికారి ప్రత్యేకపరిధిలోకి తెస్తూ 1907-08 లో పాలన సంస్కరణ జరిగేవరకూ వచ్చింది.

ఒక రకంగా ఆలయం నగల విషయంలో కానీ, నిధుల విషయంకాని, రికార్డులు సక్రమంగా ఆలయంలో ఉన్నాయని కచ్చితంగా చెప్పే అవకాశం ఆ సంవత్సరం నుండే ఉంది.

1927లో స్వామివారి కిరీటం (కృష్ణదేవరాయలు బహూకరించినది) పాడైపోయి, అలంకరించడానికి ఇబ్బందులు వచ్చిన కారణంగా, కొత్త కిరీటం చేయాలని మహంతు సంకల్పం చేశారు. ఆ నిర్ణయాన్ని అమలుచేస్తూ పాత (కృష్ణదేవరాయల నాటి) కిరీటాన్ని మహంతులు కరిగించారు. కరిగించగా వచ్చిన బంగారానికి, ఆలయం ట్రెజరీలో ఉన్న కొత్త బంగారం కలిపి కొత్త కిరీటం చేయడానికి పని ప్రారంభించారు. కాని అప్పటికే మహంతుల పాలనపై వ్యతిరేకత, కొత్త పరిపాలన సంస్కరణలు తెచ్చే చట్టం రూపొందడం, కొత్త పాలకమండలి వచ్చే అవకాశం అధికం కావడంతో, మహంతుకు ఈ కొత్త కిరీటం విషయంలో ముందుకు వెళ్లే ధైర్యం చాలక పని ఆపి, తయారీలో ఉన్న కొత్త కిరీటం, బంగారం, వజ్రాలు, విలువైన రాళ్లు - అన్నీ అలానే దేవాలయం ట్రెజరీలోనే ఉంచేశాడట. అంతవరకూ ఆ కాలంలో మహంతుల వద్ద పని చేసిన శ్రీ సాధు సుబ్రమణ్య శాస్త్రిగారు ఈ విషయాన్ని తమ గ్రంథంలో స్పష్టం చేశారు. కిరీటం తయారుచేయించే బాధ్యతని ఆయనకే అప్పచెప్పారుట. అప్పటికే ట్రెజరీ రికార్డులు సక్రమంగా అమలుచేసే విధానం ఉంది కాబట్టి, అప్పటి నగలు సురక్షితంగా భావించవచ్చు.

ఎందరు మహారాజులు, రాణులు, ముఖ్యమంత్రులు, జమీందారులు, ప్రముఖ మంత్రులు, సామంతులు, సైన్యాధికారులూ, వర్తకులు, ఇతర ధనికులు ఇచ్చిన బంగారం, రాళ్ల నగలు, ఇతర ఆభరణాలను, మరాఠీల పరిపాలన, ముస్లిం పరిపాలన, తర్వాత కంపెనీవారి నేరుపాలన, కొద్దిగా మహంతుల పాలన కాలంలో అంటే దాదాపు 200 సంవత్సరాల అనిశ్చిత రాజకీయపరిస్థితులలో, అప్పటి పాలకులు, నిర్వాహకులు కొల్లగొట్టి వుండాలి.

1801లో కంపెనీవారు ఆలయపరిపాలన స్వయంగా నిర్వహించడానికి నిర్ణయం తీసుకొని స్వాధీనం చేసుకొన్నప్పుడు, ఒక సర్వే చేసినట్లు చూశాం. ఆలయం ఆస్తుల వివరాలు, ఆదాయవ్యయాల వివరాలు, ఆలయ సిబ్బంది వివరాలతో పాటు ఆలయ ఆభరణాల వివరాలు కూడా సేకరించారు. సవాల్ జవాబు పట్టీ, దిట్టంలాంటివి పుస్తకాలుగా ప్రచురించినా, ఆలయ ఆభరణాల వివరాలు మాత్రం వారు సేకరించినవి మనకు లభ్యంగా లేవు. ఆ కాలంలో ట్రెజరీలోనూ, ఆలయంలో పారెపత్తేదారు అధీనంలోనూ, అర్చక మిరాశీదారుల అధీనంలోనూ ఏ యే నగలుండేవో స్పష్టంగా తెలియడానికి ఆ వివరాలు దొరికితే బాగుండేది. ఈ విషయంలో కొంత పరిశోధన జరపవలసిన అవసరం ఎంతైనా ఉంది.

ఈ మధ్య కాలంలో - అంటే 2010 సంవత్సరంలో కృష్ణదేవరాయల 600 సంవత్సరాల ఉత్సవాల సందర్భంగా, ఆయన దేవస్థానానికి ఇచ్చిన నగల విషయం పెద్ద దుమారంగా మారి, దేశవ్యాప్తంగా చర్చకు వచ్చి, దేవస్థానంలో పెద్ద గోల్‌మాల్ జరిగి ఆభరణాలు మాయమయినాయన్న అభియోగం పెద్ద ఎత్తున వచ్చింది. దానికి ఇంకా రెండు కారణాలు. ఒకటి, అంతకు కొద్ది రోజుల ముందు స్వామివారి ముద్ర గల యాత్రికులకు అమ్మే బంగారు డాలర్లు 300 పోయాయన్న వార్త. రెండవది, తిరుమల-తిరుపతి దేవస్థానాల యాజమాన్యంలోనే ఉన్న తిరుపతి కోదండరామస్వామి వారి ఆలయంలో స్వామి వారి సమర్పణకు తన అధీనంలో ఉన్న ఆభరణాన్ని అర్చకుడు కుదువబెట్టి డబ్బు వాడుకొన్నాడన్న వార్త. ఈ విషయాల పూర్వాపరాలు, నిజానిజాలు తర్వాత పరిశీలిద్దాం.

1933 నాటికి విచారణకర్తగా మహంతు బాధ్యతలను మద్రాసు ప్రభుత్వం నియమించిన ధర్మకర్తల మండలికి అప్పగించినప్పుడు, ఏ ఆస్తిపాస్తులు దేవస్థానానికి వున్నాయో, ఆభరణాలు కొత్త ధర్మకర్తమండలికి అప్పగించారో - వాటికి మాత్రమే దేవస్థానం ధర్మకర్తల మండలిది పూర్తి బాధ్యత అవుతుంది.

★ ★ ★

71. తిరుమలలో బ్రిటిష కుతంత్రం

మహంతుల యాజమాన్యం గురించి చదివినవాళ్లందరికీ ఒక సందేహం రావచ్చు.

1843లో ఈస్టిండియా కంపెనీ ఈ ఆలయాల నిర్వహణని పోయిపోయి ఎక్కడో ఉత్తర హిందూస్థానం నుంచి వచ్చిన మహంతులకే ఎందుకు అప్పగించింది?

శ్రీనివాసుడి ఆలయంలో మొదట్నుంచీ వైఖానసుల సారథ్యంలో వైష్ణవ పూజావిధానమే సాగుతోంది. అయినప్పుడు కొండమీద వున్న అహోబిల మఠం, వానమామలై మఠం, పరకాల మఠం వంటి శ్రీవైష్ణవమఠాలకు గానీ, ఉత్తరాది మఠం, వ్యాసరాయ మఠం, మంత్రాలయ రాఘవేంద్రమఠం వంటి వైష్ణవమఠాలకు గానీ ఈ ఆలయాన్ని అప్పగించటమే అర్థవంతంగా వుంటుంది కదా! కనీసం శృంగేరి, కంచి పీఠాల శంకర మఠాలున్నాయి కనుక వారికైనా అప్పగించవచ్చు కదా!

అలా చేయకుండా, ఉత్తరాదినుంచి భక్తులుగా వచ్చి, మఠం పెట్టుకున్న మహంతులకే కంపెనీ ఈ బాధ్యతని ఎందుకు అప్పగించింది?

బ్రిటిష పాలకుల కుత్సితరాజకీయాలకు అద్దం పడుతుంది ఈ పరిణామం.

★ ★ ★

కంపెనీ వారి పాలనలో ఆలయపరిపాలన జిల్లా పరిపాలన పంథాలోనే జరిగింది. అదృష్టవశాత్తూ వారు ఆలయపూజల విషయంలో వేలు పెట్టలేదు. వైఖానసులతో పూజలు, జియ్యంగార్ల పర్యవేక్షణ, ఆచార్యపురుషుల సంప్రదాయ పరిరక్షణ విషయాల్లో జోక్యం చేసుకోలేదు. కాని ఆర్థికపరమైన అన్ని విషయాలలోనూ చాలా నిశితంగా విశ్లేషించి, ఆదాయం అధికం చేసి, ఖర్చు తక్కువ చేసే ప్రయత్నాలన్నీ చేశారు.

దేవదేయాలు, వాటి నుండి రాబడుల విషయంలో శ్రద్ధ చూపారేగాని, ఆ నిధులు ఆలయానికి చెందేట్లు చూడడంలో శ్రద్ధ చూపకపోగా, ఏదో ఒక కారణంగా ఆలయంలో జరిపే ప్రత్యేక ఉత్సవాలన్నీ ఒకటొకటిగా తీసివేశారు. ఆలయభూములకు, ఇతర

రైతుల భూములకు శిస్తుల విషయంలో, పన్నుల విషయంలో అంతవరకూ శతాబ్దాలుగా వస్తున్న మాఫీని రద్దు చేసి, వాటిని దాదాపు ప్రభుత్వభూములుగా పరిగణించారు. ఆలయం అధీనంలోనూ లేదా ఆలయం తరపున ఆలయ మిరాసీదార్ల, జియ్యంగార్ల, స్థానత్తార్ల అధీనంలోనూ వున్న 450 పైగా గ్రామాలను ప్రభుత్వపరం చేసుకున్నారు. మిరాసీదార్ల, ఇతర ఆలయ అధికారుల అధీనంలోకి వెళ్లిన భూములు వారికీ మిగలలేదు, ఆలయానికీ తిరిగి రాలేదు. పిట్టపోరు పిట్టపోరు పిల్లి తీర్చిన రీతిలో ఈస్టిండియా కంపెనీ స్వాధీనం చేసుకొన్నది.

పది బ్రహ్మోత్సవాల నుండి ప్రతి సంవత్సరం ఒక్క బ్రహ్మోత్సవం చేయడంతో సరిపెట్టారు. సంవత్సరానికి ఒకప్పుడు 475 ఉత్సవాలు జరిగే పరిస్థితి నుంచి, శాస్త్రప్రకారం విధిగా జరుపవలసిన సేవలకే పరిమితం చేశారు. రాజులు, దాతలు స్వామి వారి వైభవం కోసం ప్రవేశపెట్టిన ఉత్సవాలు నెమ్మదిగా తీసివేశారు. ఏ ఉత్సవమైనా దేవదేయభూములనుండి వచ్చే ఆదాయంతో కాకుండా రోజూ వచ్చే యాత్రికుల ఆర్జితంగా రాబడివస్తేనే ఉత్సవాలు చేయడం. అలా ఉత్సవాలు జరగకపోతే, దాతలు ఉత్సవాల సమయంలో చేసే నైవేద్యాలూ లేవు.

ఆ ఖర్చులు మిగిలినట్లే కదా! మిగిలేది ఆలయానికి కాదు, కంపెనీవారికి. అర్చకులు, జియ్యంగార్లు, ఆస్థానపురుషులు అందరికీ ఆదాయాలు భూములనుండి పోయాయి. ప్రసాదాలు తగ్గిపోవడంతో, వారి భాగాలు తగ్గిపోయాయి. ఉత్సవాలు కొన్ని జరిగినా పూర్వవైభవం అంతగా కనిపించేది కాదు. ఎందుకంటే, ఖర్చు దిట్టం పుస్తకం ప్రకారమే. హుండీ ఆర్జిత ఆదాయాలు పెరిగినా మొత్తం మూటలు గట్టి, తహసీల్దారు కార్యాలయానికి తరలించి పరకామణి అక్కడే చేసి, సర్కారుకి అంతా జమ చేసేవారు. ఆలయాభివృద్ధికి ప్రత్యేకంగా ఇవ్వాల్సిందేకాని, ఆలయ ఆదాయాన్ని బట్టి ఖర్చు పెట్టుకునే వెసులుబాటు లేదు. ఇలా 1801లో మొదలైన కంపెనీ ఆధిపత్యం ఆలయం మీద 1843 వరకూ కొనసాగింది. ఆలయనిధులు ప్రభుత్వం దగ్గర 40 లక్షల రూపాయల వరకు వున్నట్టు అంచనా.

ఈ ఆలయ నిధుల్ని కంపెనీ ఉంచేసుకుంది. ఆలయపాలనబాధ్యతలు మహంతులకు ఇచ్చినప్పుడు ఈ సొమ్ము ఇవ్వలేదు. ఆలయం హుండీలలో వచ్చిన నగల విషయం ప్రసక్తే లేదు.

సవాల్-జవాబు పట్టీలో అన్నీవున్నా స్వామి వారికి వాడే నగల విషయం పూర్తి వివరాలు లేవు. విజయనగర రాజులు ఇచ్చిన నగలు లెక్క చెప్పి మహంతులకు ఇచ్చారో లేదో తెలియరావటం లేదు. స్వామివారికి అలంకరించినవి, అర్చకుల (మిరాసీదార్ల) అధీనంలో ఉన్న అప్పటి అలంకార నగలు తప్ప - స్వామివారికి వేయదగినవి కాని, రోజూ వేయనివాటి జాబితా ఉన్నట్లు లేదు.

మహంతుకు ఇచ్చినవి తప్పకుండా వివరాలు తయారుచేసి వుండాలి. కాని అదివరకు ఉన్న నగలన్నీ మహంతులకు ఇచ్చారా అన్న విషయం ఖండితంగా చెప్పగలిగే పరిస్థితులు లేవు. ఆ కాలానికి వాడుతున్న నగలు మాత్రమే మహంతులకు ఇచ్చి వుంటారని ఊహించాలి.

ఆలయం సొమ్ము 40 లక్షల రూపాయల విషయంలో చాలాకాలం తర్జనభర్జనలు జరిగాయి. 20వ శతాబ్దంలో కూడా మద్రాసు శాసనసభలో అప్పటి నెల్లూరు నుండి సభ్యుడైన ఎ.ఎస్. కృష్ణారావు ఆంగ్లప్రభుత్వం ఆ నిధుల్ని ఆలయానికి తిరిగి తేవాలని చాలా రభస చేసి వాదించారు. ఆంగ్లప్రభుత్వం సరిగ్గా సమాధానాలు చెప్పకుండా కాలయాపన చేసి, చివరకు అటువంటి నిధుల వివరాలేమీ ప్రభుత్వం వద్ద లేవనీ, ఏదైనా జరిగినా అది ప్రభుత్వం తరఫున జరగలేదనీ, కంపెనీ తరఫున జరిగిందేమో కూడా నిర్ధారణ లేదని వట్టిచేతులు చూపించారు.

1801 నుండి 1843 వరకూ కంపెనీ తహశీల్దారు ఆఫీసులో పరిపాలన వివరాలే కాని, ఆలయంలో కానుకలుగా వచ్చిన ఆభరణాల సంగతులు లేవు. కాగితాల రికార్డులు వచ్చాయి కనుక, శిలాశాసనాలు కనుమరుగయినాయి.

ఇంత ఆదాయం ప్రతి సంవత్సరం వచ్చే తిరుమల వేంకటేశ్వరుని ఆలయాన్ని కంపెనీవారు ఎందుకు వదిలిపెట్టారు? బలవత్తరకారణాలు లేకపోతే అలా చేసి ఉండేవారు కాదు కదా?

చరిత్రకారులు చెప్పే ఒక కారణం - ఇండియాలో ఈస్టిండియా కంపెనీ ఆఫీసర్ల పనితీరు లండనులోని ఆ కంపెనీ డైరెక్టర్ల కోర్టు (బోర్డు) కు నచ్చలేదని. విగ్రహారాధన నిరసించేవారి మతసంప్రదాయాలకు విరుద్ధంగా వారి అధికారులు హిందూదేశంలో విగ్రహారాధన ప్రధానంగా జరిగే ఆలయాలనే పాలించటం నచ్చలేదట. దాని ప్రభావం వల్లనే వారి మతగురువుల నుండి విమర్శలు. ఆంగ్లేయులు, ఇతర ఐరోపా దేశీయులు వాణిజ్యం కోసమే కాక, వారితోపాటు వారి మతప్రచారకులు కూడా చాలామంది

హిందూదేశం వచ్చారు. వారి క్రైస్తవమతాన్ని ప్రోత్సహించే బదులు, మత మార్పిడులు చేయించి హిందువులను క్రైస్తవులుగా మార్చే బదులు, వారే హిందూ దేవాలయాలు నిర్వహించడం హిందూమతాన్ని ప్రోత్సహించినట్లవుతుంది కదా..? అందుకని కంపెనీ మేనేజిమెంట్ వారు హిందూదేశంలో మతపరమయిన సంస్థల జోలికి పోరాదనీ, కంపెనీవారి అధీనంలో వున్న మతసంస్థలన్నింటినీ సంబంధిత మతనాయకులకే ఇచ్చి వేయాలనీ ఆదేశాలు జారీ చేయడం జరిగింది.

దీనికి ఇంకొక కారణం కూడా చెబుతారు. వ్యాపారరీత్యా ఆంగ్లప్రభుత్వ ఆదేశాల మేర హిందూదేశం వచ్చిన కంపెనీ - స్థానిక రాజకీయ కీచులాటలలో తల దూర్చడం అంత సమంజసం కాదేమోనన్న వాదన ఉండనే ఉంది. కాని ఫ్రెంచివారు, పోర్చుగీసు, ఇతర ఐరోపా దేశీయులు కూడా అలాగే వచ్చి, వారి సంరక్షణ కోసమని సైన్యాలు పెంచి తమ వ్యాపకాలు విస్తరించుకుంటున్న సమయం అది.

అలా చేయకపోతే ఆంగ్లేయులకు మనుగడ లేని పరిస్థితి... అలా ఒక రాజుకు సహాయం చేసి, ఇంకొక రాజును ఓడించి, మధ్యలో ఆర్థికలబ్ధి పొందడంతో మొదలయిన ఈ ప్రక్రియ నెమ్మదిగా కొంత భూభాగాన్ని పరిపాలించే వరకూ వచ్చింది. వేలాదిమైళ్ల దూరం నుండి వచ్చి చాలా అల్పసంఖ్యలో ఉండి రాజ్యం చేయాలంటే, స్థానికుల మద్దతు కావాలి. మద్దతు లేకపోయినా, పూర్తి వ్యతిరేకత ఉంటే పాలన చేయడం కష్టం.

హిందువులు చాలావరకు ఆధ్యాత్మికచింతన కలవారు, తమ సంస్కృతి, మతం, ఆచారవ్యవహారాల మీద గట్టి నమ్మకం ఉన్నవారు. వారి ఆత్మగౌరవం ముస్లింల దండయాత్రలతో, ఆలయాలు నాశనం చేయబడటంతో, విగ్రహాల ధ్వంసంతో చాలా దెబ్బతిని ఉంది. ఆర్థిక స్తోమత లేక రాజుల మధ్య ఐకమత్యం లేక, సైనికబలం లేక, ప్రతిఘటించడం చేతకాక కాలం గడుపుతున్నారు.

రాజ్యవిస్తరణ జరగాలన్నా, అల్పసంఖ్యాకులతో రాజ్యం ఏలాలన్న నిర్ణయానికి వచ్చి కంపెనీ వ్యవహారాలు బాగా నడపాలన్నా, కొత్త కొత్త ప్రాంతాలపై ఆధిపత్యం పొందాలన్నా ఆలయ మతపరవ్యవహారాలలో నేరుగా తల దూర్చడం మంచిదికాదన్న నిర్ణయానికి ఆంగ్లప్రభుత్వమే వచ్చి, కంపెనీవారికి ఆదేశాలు జారీ చేశారనీ, అందుకనే కంపెనీ వారు దేవాలయాల పరిపాలనను, స్థానికుల చేతికి అప్పగించివేయడానికి ఆదేశాలు జారీ చేశారని తెలుస్తోంది. విక్టోరియా రాణిపాలన తొలిరోజుల్లో అంటే 1842-43లో ఈ ఆదేశాలు జారీచేయబడ్డాయి

అందులో భాగంగానే కొండమీద వేంకటేశ్వర ఆలయం, వరాహస్వామి ఆలయం, తిరుపతిలో గోవిందరాజస్వామి ఆలయం, కపిలేశ్వర ఆలయం, రామాలయం, తిరుచానూరు అమ్మవారి ఆలయం - అన్నింటినీ హాథీరాంజీ మఠం మహంతు శ్రీ సేవాదాసుకు 21.4.1843న అప్పగించడం జరిగింది. కంపెనీ, హాథీరాంజీ మఠాల మధ్య ఒక ఒప్పందం (ముచ్చిలక) రాసుకున్నారు. దాని ప్రకారం హాథీరాంజీ మఠం మహంతు సేవాదాసుజీ ఈ ఆలయాల పరిపాలనబాధ్యతలన్నీ 'విచారణకర్త'గా నిర్వహిస్తారనీ- వారికీ అధికారం వారసత్వపు హక్కుతో కంపెనీవారు ఇస్తున్నారనీ, విచారణకర్తగా ఆలయంలో రోజూ జరిగే కార్యక్రమాల పరిరక్షణ వారి బాధ్యత అని చెప్పి, వారికి కంపెనీవారు మూలనిధులు ఏమి ఇచ్చేది లేదని తేల్చారు.

మూలధనం ఏమీ లేకుండా ఇన్ని ఆలయాలు నడపడం ఎలా అని మహంతు ఎంత మొత్తుకున్నా కంపెనీవారు వినక, చివరకు 5000 రూపాయలు మాత్రం మంజూరు చేశారు... ఆలయం మిగులు నిధుల్ని 40 లక్షల రూపాయల వరకు కంపెనీవారు వుంచేసుకున్నారు.

ఈ మహంతుల పాలన దాదాపు 90 సంవత్సరాలు సాగింది. 1843 నుండి 1933 వరకు ఆరుగురు మహంతులు విచారణకర్తలుగా వ్యవహరించారు.

ఎంతోమంది ఉండగా ఈ హాథీరాంజీ మఠం మహంతునే ఎందుకు విచారణకర్తగా ఎంపిక చేశారన్నది రికార్డులలో ఎక్కడా వివరంగా లేదు. స్థానికంగా బలంలేని వారికి ఆలయబాధ్యత అప్పగిస్తే కంపెనీకి ఇబ్బందులు లేకపోవచ్చు. పేరున్న మంచి ఉత్తరాది మఠానికిస్తే బాగుంటుందన్న ఆలోచన వచ్చివుండాలి. హాథీరాంజీ బాబాకు మంచి భక్తునిగా పేరు. వారితోనే వేంకటేశ్వరస్వామి పాచికలాడేవారని ప్రసిద్ధి. స్వామి అనుగ్రహం సంపూర్ణంగా ఉన్న మహంతు ఆయన. ఆయన పేరు ప్రతిష్ఠలతోనే హాథీరాంజీ మఠం నడుస్తోంది. ఇంకొక ఉత్తరాదిమఠం ఉన్నా వారికి ఇంత ప్రసిద్ధి లేదు. అలా ఆలోచించి, కంపెనీకి అనుకూలంగా ఉండి, చెప్పుచేతలలో ఉండే సావకాశం ఉన్న మంచి పేరున్న మఠానికి ఇస్తే వ్యతిరేకత ఉండకపోవచ్చు అన్న దురాలోచనతో కంపెనీవారు చేసినట్లు కన్పిస్తోంది.

కాని ఈ మార్పు వలన ఆలయానికి మంచి జరిగింది. ప్రతి సంవత్సరం ఆలయంలో ఖర్చులు పోగా మిగిలే నిధులను కంపెనీ పరం చేసుకొనేది పోయి, ఆలయానికే చెందేట్లు ఒక పథకం ప్రకారం, మహంతులు దాన్ని వినియోగించే అవకాశం దక్కింది.

ఆలయంలోని శాసనాల ప్రకారం మొదటి ముగ్గురి మహంతుల విషయంలో కొన్ని వివరాలున్నాయి.

మొదటి మహంతు విచారణకర్త సేవాదాస్‌జీ స్వామి పుష్కరిణిని బాగు చేయించాడట.

స్వామి పుష్కరిణిలో చాలా తీర్థాలున్నాయి: వరాహ, శ్రీనివాస, మార్కండేయ, అగ్ని, యమ, అగస్త్య, వశిష్ఠ, వరుణ, వాయు, కుబేర, గాలవ, సరస్వతీ అనే ప్రసిద్ధ తీర్థాలున్నాయంటారు. ఆ కాలంలో అవన్నీ చిన్న చిన్న బావుల్లా ఉండేవి. ఈ మహంతు అందులో రెండు ముఖ్యమైన తీర్థాలను కలిపి గట్టుకట్టి, చుట్టూ మెట్లకు మరమ్మత్తులు చేయించాడట. అలా పెద్దదైన సరస్సులో తెప్పఉత్సవం మళ్లీ మొదలు పెట్టించాడట. సంస్కృత భాషలోని ఈ శాసనం తెలుగులిపిలో చెక్కబడింది.

తరువాత విచారణకర్త శ్రీమహంతు ధర్మదాసు. ఈయన తిరుమలకొండ కింద కపిలతీర్థంలో మెట్లు బాగు చేయించాడు. తూర్పు, పడమర మంటపాలు కట్టించాడు. 10.2.1865 నాటి శాసనంలో తెలుగు సీసమాలిక పద్యంలో ఈయన చేసిన పనులు చెక్కబడ్డాయి.

వేంకటేశ్వరుని ఆలయానికి తిరుమలలో మహాద్వారం వద్ద పడికావడికి గోపురం కట్టించాడు. పక్కన మండపాలు కూడా కట్టించాడు (11.9.1878).

చివరి విచారణకర్త మహంతు ప్రయాగదాస్‌జీ కాలంలో ఆయన సోదరుడు రామలక్ష్మణదాసు విమానంమీద బంగారు కలశాలను పునఃస్థాపితం చేశాడు (30.9.1908).

రథాలు, నగలు, స్వర్ణకవచాలు, కిరీటాలు వగైరా ఏవేవి, ఏయే మహంతుల కాలంలో సమకూరాయో - ఆలయంలో చాలాకాలం పనిచేసి పదవీవిరమణ చేసిన తర్వాత, నల్లాన్ గోపాలాచారి అనే ఆయన విపులంగా రాశాడు.

1900 సంవత్సరంలో అప్పటి మహంతు ప్రయాగదాసు తిరుచానూరు అమ్మవారికి విమానం కట్టించి బంగారు కలశాలు ప్రతిష్ఠ చేశాడు. (మొత్తం విమానానికి బంగారు పూత పూసిన కలశాల ప్రతిష్ఠ 1982 లో నేను ఇ.ఓ.గా ఉన్నప్పుడు జరిగిన పనుల్లో ఒకటి).

ధ్వజస్తంభ ప్రతిష్ఠ చేయించాడు.

కపిలేశ్వర ఆలయం పునర్నిర్మించి పునఃప్రతిష్ఠ చేశాడు.

తిరుపతిలో యాత్రికుల కోసం మొదటి సత్రం (రైల్వేస్టేషన్ దగ్గర) కట్టించింది ఇతనే.

దేవస్థానం నిధులు 5 లక్షల రూపాయలు బొంబాయి డెవలప్‌మెంట్ లోనులో పెట్టుబడి పెట్టాడు - సంవత్సరానికి 54 వేల వడ్డీ వచ్చేట్టు.

ఉత్సవరుల అమ్మవార్లకు బంగారు బిళ్ల, జలత్రాడు - 14 వేల రూపాయలతో మద్రాసులో పి అండ్ క్యు సన్స్ దగ్గర కొన్నారట. ఇద్దరు అమ్మవార్లున్నా ఒక్క జలతాడే కొన్నారట.

1930 ప్రాంతంలో గద్వాల మహారాణి బంగారు నాణాలు, ఆభరణాలు, నగదు వేంకటేశ్వరునికి కానుకలుగా సమర్పించిందట. వీటన్నిటితో రాళ్ల కిరీటం మలయప్ప స్వామికి ఈ మహంతు చేయించాడట.

సాధు సుబ్రహ్మణ్య శాస్త్రి గారి ద్వారా ఆలయంలోని శిలాశాసనాల పరిశీలన పని మొదలు పెట్టించింది ఈ మహంతే. ఈ మహంతు దగ్గరే శాస్త్రిగారు పి.ఎ.గా ఉండేవారు. ఆయన్ను ఎపిగ్రాఫిస్ట్‌గా ప్రత్యేక శిక్షణకు పంపించి, శిలాశాసనాలు పరిశోధన జరిపించారు. ఇవన్నీ అప్పటి ప్రభుత్వం ఎపిగ్రాఫిస్ట్ హెచ్. కృష్ణస్వామితో డా॥ ఎఫ్.డబ్ల్యు. థాంసన్ ఆఫ్ ఇండియా లైబ్రరీ, లండన్ తో తిరుమల వచ్చి, ఈ శాసనాలు పరిశీలించి, పరిశోధనలు చేయించాలని సలహా ఇచ్చారు. మహంతు - ప్రభుత్వం వారినే వారి ఎపిగ్రాఫిస్ట్‌ని పంపమన్నప్పుడు, వారు దేవస్థాన ఉద్యోగికి శిక్షణ ఇస్తామన్నారు. సుబ్రహ్మణ్యశాస్త్రిగారిని శిక్షణకు పంపి ఈ కార్యక్రమం చేయించారు. ప్రభుత్వ అధికారులతో పాటు Practical Training కి తంజావూరు, తిరుచిరాపల్లి, మధుర, దెందులూరు, తణుకు, విజయవాడ, నెల్లూరు, శ్రీకాళహస్తి ఆలయాల శిలాశాసనాలు పరిశీలనలో శిక్షణ ఇప్పించారు.

★ ★ ★

72. వెంగమాంబ పట్టుకున్న పీతాంబరం చెప్పిన రహస్యం

తరిగొండ వెంగమాంబ.

మహాభక్తురాలు. స్వామివారి అనుగ్రహం సంపూర్ణంగా గల ధన్యజీవి.

ఈమె జననం వాయల్పాడు దగ్గర 'తరిగొండ' గ్రామం. అది నరసింహక్షేత్రం. చిన్నప్పటి నుండే వేంకటేశ్వరుని యందు అచంచలమైన భక్తి. ఆయనే తన భర్తగా భావించి వివాహమొద్దని నిరాకరిస్తుంది. కాని తల్లిదండ్రుల బలవంతంతో వేంకటాచలపతి అనే అతనితో వివాహం జరుగుతుంది. ఆమె భక్తి చూసి, ఒక మహాపండితుడు సుబ్రహ్మణ్యశాస్త్రి ఆమెకు మంత్రోపదేశం చేస్తాడు. చిన్నప్పుడే, అంటే కాపురానికి వెళ్లకుండానే భర్త మరణిస్తే, విధవరాలవుతుంది.

ఆనాటి సమాజపరిస్థితుల దృష్ట్యా, ఆమెకు విధవాసంస్కారాలు చేయాలని ప్రయత్నిస్తారు. ఆమె వ్యతిరేకిస్తుంది. బలవంతాన జుట్టు తీసేస్తే వెంటనే అంత జుట్టూ మరలా వచ్చిందట!!

నరసింహస్వామి ఆలయానికి వెళ్తే, అర్చకుడు అవమానం చేస్తాడు. జుట్టు పట్టుకుని బయటికి తోస్తాడు. ఊరు వదలి తిరుమలకు బయలుదేరుతుంది.

కొండదారిలో స్వామి ప్రత్యక్షమై ఆమెను వ్యూహలక్ష్మి ఉపాసన చేయమని ఆదేశిస్తాడు. తిరుమలలో ఉండడానికి వసతి లేక, తినడానికి భోజనం లేకపోయినా, భగవంతుని యందు భక్తివిశ్వాసాలతో వ్యూహలక్ష్మి ఉపాసన చేస్తూఉంటుంది వెంగమాంబ. భగవత్ప్రేరణతో, అప్పటి హాథీరాంజీ మఠం మహంతు– ఆమెకు ఉండడానికి ఒక గుడిసె ఏర్పాటుచేసి, మఠంలో రోజూ ఆహారం పెట్టే ఏర్పాటుచేస్తాడు.

ఆ గుడిసె చుట్టూ ఉన్న ప్రదేశం శుభ్రం చేసి, తులసితోట పెంచి, రోజూ స్వామివారి కైంకర్యానికి ఆలయానికి తులసి తీసుకువెళ్లేది.

ఆమె భక్తిశ్రద్ధలు, ఉపాసనక్రమం చూసి, ఆనాటి అన్నమయ్య వారసులు, తమ ఇంటికి తీసుకువెళ్లి ఆశ్రయమిస్తారు. అక్కడే ఆమె తులసితోట పెంచి రోజూ ఆలయానికి హారతి, తులసి తీసుకువెళ్లేది.

పక్కనే వుండే అక్కా రామదీక్షితులు అనే ఆలయ అర్చకునికి ఈమె నచ్చలేదు. విధవైనా సంప్రదాయం పాటించకుండా ముత్తయిదువులా అలంకరించుకోవడం, ఆలయానికి రోజూ హారతి తేవడం, తులసిని పూజకు తేవడం సహించలేక ఆమెను నిందించేవాడు. ఎంతవరకు ఆమెను హింసించేవాడంటే- వారింట్లో తిన్న ఎంగిలి విస్తళ్లు పక్కనే వున్న ఆమె లోగిలి తులసితోటలో వేసేవాడు.

ఆమె సహించి సర్దుకుపోయేది. ఒకనాడు అతను పారేసిన ఎంగిలి విస్తరాకులు ధ్యానంలో కూర్చుని వున్న వెంగమాంబపై పడ్డాయట.

ఆమె ధ్యానం భంగమై, కళ్లు తెరిచి, ఆ దీక్షితుని కోపంతో చూచిందట. అంతే దీక్షితులు, అతని కుటుంబసభ్యులు ఒకరి తర్వాత ఒకరు, కొద్దికాలంలోనే అకాలమరణం పొందారట. వంశంలో ఒక్క చిన్నపిల్లవాడు తప్ప అందరూ అంతరించారు. చేసిన తప్పు తెలుసుకుని, ఆ బాలుడు వెంగమాంబ కాళ్లపై పడ్డాడట. “మీ వంశంలో తరానికి ఒక్కడే వుంటాడు, కాని వంశం నాశనం కాదు” అని ధైర్యం చెబుతుంది.

ఆమె మహిమలు తిరుమలవాసులకు, తిరుమల వచ్చే యాత్రికులకు తెలిసి, ఆమె దర్శనార్థం వచ్చే జనం పెరిగిపోయారు.

అప్పటికే ఆమె సాధనమార్గంలో పురోగమించి యోగసిద్ధులు పొందింది. రచనా వ్యాసంగం మొదలుపెట్టి ఎన్నో ఆధ్యాత్మికరచనలు చేయసాగింది.

ఆ కాలంలో ఒక అద్వైతపీఠాధిపతి తిరుమల వచ్చినప్పుడు, ఈమె విషయం కొందరు ఆయనకు ఫిర్యాదు చేయడం జరిగింది. సంప్రదాయవిరుద్ధంగా ప్రవర్తిస్తూ విధవరాలైనా మహాభక్తురాలుగా చలామణి అవుతోందని విని, ఆమెను నిగ్రహించి మందలించడానికి ఆమెను పిలిపిస్తారు పీఠాధిపతి. అక్కడకి వచ్చిన ఆమె పీఠాధిపతికి అందరి వలె మొక్కి నమస్కారాలు చేయలేదు. పీఠాధిపతికి కోపం వచ్చి, ఆమె “ధిక్కారానికి కారణమేమి”టని ప్రశ్నిస్తాడు. ఆమె – “మీరు ఒక్కసారి ఆ ఆసనం నుండి లేచి నిలబడండి. ఆ ఆసనానికి నేను నమస్కరిస్తా”నంటుంది. “అలాగే” అని

పీఠాధిపతి నిలబడతాడు. ఆమె ఆసనానికి నమస్కరించడంతో ఆ ఆసనం దగ్ధమయిపోవడం జరుగుతుంది.

ఆమె తపశ్శక్తి, యోగశక్తి తెలుసుకొన్న పీఠాధిపతి సమాధానం చెంది, ఆమె భక్తిశ్రద్ధలను కొనియాడి, ఆమెను తిరస్కరించక గౌరవాభిమానాలతో ఆదరించాలని అందరికీ బోధించాడు. అయినా ఆనాటి అర్చకులు, ఇతర ఆలయ అధికారులు సంతృప్తిచెందక ఆమెను అవమానించడం జరుగుతూనే ఉంది. కించబడిన ఆమె ఆలయానికి పోవడం కూడా మానివేసి తన ఇంట్లోనే స్వామివారిని సేవిస్తూ ధ్యానంలో నిమగ్నురాలై తన రచనాప్రాసంగాలు సాగిస్తుండేది.

ఒక బ్రహ్మోత్సవాల కాలంలో స్వామివారి రథం మాడవీథులలో ఊరేగిస్తుంటే, ఒక చోట ఆగిపోయిందట. ఎంత ప్రయత్నించినా కదలలేదు. ఎవరికీ కారణం తెలియదు. రథం ఆగింది వెంగమాంబ నివాసం ముందు.

ఆమెకు చేసిన అపచారం వల్లనే జరిగిందని భావించి, ఆలయ అర్చకులు, అధికారులు, ఆమెను దేవునికి హారతి చేసి, రథం కదిలేట్టు చేయమని ప్రార్థించారు. "నేను హారతి చేస్తే భగవంతుడు కరుణిస్తాడంటే, కావల్సిందేమి"టని ఆమె హారతి చేసిందట. రథం కదిలింది.

ఆమెకు ఆనాటినుండి ఆలయంలో గౌరవమర్యాదలు పెరిగాయి. రాత్రి ఏకాంతసేవలో ఆమెకు ముత్యాలహారతి చేసే భాగ్యం మొదలైంది. ఆమె దశావతారాల వెండిపళ్లెంలో (చుట్టూ ముత్యాలు పొదిగినది) భోగశ్రీనివాసునికి శయనమందిరంలో రాత్రి ఏకాంతసేవ జరిగేటప్పుడు ఈ ముత్యాలహారతి ఇచ్చేది. 1890లో ప్రచురింపబడిన కైంకర్యపట్టికలో ఈ వెంగమాంబ ముత్యాలహారతి ప్రసక్తి ఉంది. ఈనాటికీ ఏకాంతసేవలో స్వామివారికి వెంగమాంబ ముత్యాలహారతి, అన్నమయ్య జోలపాట (అన్నమయ్య వంశీకులు పాడతారు) సంప్రదాయం కొనసాగుతూనే ఉంది.

రాత్రివేళ ఆమె సేవలు అందుకోడానికి ఆమె ఇంటికి స్వామివారు స్వయంగా వెళ్లేవారట. ఒకనాడు ఆలయం తలుపులు తెరిచేటప్పటికి, స్వామివారి పీతాంబరవస్త్రం పీలికలై ఉందట. కారణం తెలియని అర్చకులు ఆశ్చర్యపోయారట. ఆ పీతాంబరం భాగాలు వెంగమాంబ ఇంట్లో ఉన్నాయన్న వార్త విని ఆలయాధికారులు అక్కడికి చేరారు. స్వామివారు ఆమెను అనుగ్రహించి వెళ్లిపోతున్నప్పుడు, ఇంకొంతసేపు ఉండమని ఆమె ప్రార్థించి పీతాంబరం పట్టుకుందట. కొంతభాగం ఆమె చేతుల్లోనే ఉండిపోయింది.

ఆమె తనకు అంతరంగికభక్తురాలన్న విషయం ప్రకటించడానికి స్వామివారు చేసిన లీల ఇది. మహాత్ములు మహిమలు చెప్పరు- చూపరు. అదే కోవకు చెందినది ఈ వెంగమాంబ.

ఇలా ఆమె మహిమలు తెలిసి, తిరుమల వచ్చిన యాత్రికులు స్వామివారి దర్శనంతో పాటు ఈమె దర్శనానికీ రావడం మొదలుపెట్టారు.

తన సాధనకు అంతరాయాలు ఈ యాత్రికుల వల్ల కలగడం ఆమెకు బాధగా తయారయింది. స్వామినే దారి చూపమని ప్రార్థిస్తుంది.

"నీవు తుంబుర తీర్థానికి వెళ్లి, నీ సాధన కొనసాగించు, అక్కడ ఓ గుహనుండి ఎప్పుడు కావాలంటే అప్పుడు నా సన్నిధికి చేరుకొనే యోగశక్తి నీకిస్తున్నా"నని భగవంతుడు వరం ఇచ్చాడట.

అలా తుంబురతీర్థంలో 10 సంవత్సరాలు కఠోరతపస్సు చేసిందావిడ. రాత్రి పూట ప్రతిరోజూ ఈమె స్వామివారి సన్నిధికి వస్తుందన్న వార్త ఎవరూ చూడకపోయినా జనంలోకి పాకిపోయింది. నిజానిజాలు తెలుకోవాలని, హాథీరాంజీ మహంతు రాత్రిపూట ఆలయం మూసేటప్పుడు తాను ఆలయంలోనే వుండిపోయి చూస్తూ ఉన్నాడట. స్వామివారి పాదాల దగ్గర నుండి తేజోరూపంలో వేంగమాంబ ఆలయంలోకి రావడం గమనించాడట. అప్పటినుండీ ఆమెకు అన్ని ఆలయమర్యాదలూ అందడం మొదలైంది. తపస్సు పూర్తి చేసుకొని తిరుమల తిరిగి వచ్చిన ఆమె స్వామివారి సేవ, స్వామివారి మహిమలను రచనల ద్వారా కొనసాగింది. తన జీవితం తిరుమలలోనే ఉత్తరమాడ వీథి అవతల చాలించింది. ఆమె సమాధిని తిరుమల స్కూలుతోట ఆవరణలో ఇప్పటికీ చూడవచ్చు.

ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు గారు నాలుగు సంవత్సరాల క్రితం కొంతమంది అభిమానులతో కలిసి తిరుమల వెళ్లినప్పుడు వెంగమాంబ సమాధిని దర్శించి పరవశించిపోయారు. అయితే ఆమె మాహాత్మ్యాన్ని, ఆధ్యాత్మికశక్తిని వెలుగులోకి తీసుకురాకపోవడం పట్ల ఆయన చాలా బాధ పడ్డారు. ఆయన ఇదే విషయాన్ని అప్పటి టి.టి.డి. ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శ్రీ కె.వి. రమణాచారి దృష్టికి తీసుకువచ్చారు. కార్యదీక్షా దక్షుడైన రమణాచారి వెంటనే తరిగొండ వెంగమాంబ ప్రాజెక్టుని ప్రారంభించారు.

అలా తి.తి.దే. వారు ఆమె రచనలను ఈ మధ్యకాలంలో శ్రద్ధతో వెలుగులోకి తెచ్చి, వాటిని ప్రజలకు అందుబాటులోకి తేవడానికి తరిగొండ వెంగమాంబ ప్రాజెక్టు ద్వారా కార్యక్రమాలు చేస్తున్నారు. నరసింహజయంతి నాడు ఆమె జయంతిని, శ్రావణశుద్ధ నవమినాడు ఆమె వర్ధంతిని వైభవంగా చేస్తారు. ఈమె జీవితకాలం 18వ శతాబ్దం రెండవ భాగంనుండి 19వ శతాబ్దం మధ్యభాగం వరకు అని చెప్పవచ్చు.

ఆమె రచనలు లిఖించడానికి ఎనిమిది మంది లేఖకులు ఉండేవారట.

ఆమె రచనలు:

ఆమె రెండు శతకాలు (నారసింహశతకము, కృష్ణశతకము) రచించింది. 9 యక్షగానాలు, 4 ద్విపద కావ్యాలు, 2 పద్యకావ్యాలు, అవికాక ఆధ్యాత్మికతత్త్వాలు, కీర్తనలు రచించింది. అందులో వేంకటాచల మాహాత్మ్యము అనే పద్యకావ్యం కూడా ఉంది.

ఈసారి తిరుమల వెళ్లినప్పుడు ఆ మహాభక్తురాలి సమాధి చూసి తరించండి.

★ ★ ★

73. స్వామి అలంకారాన్ని వర్ణించిన అంధభక్తుడు

అనుకోకుండా 1981లో బ్రహ్మోత్సవాల ముందు ఒక రోజున బళ్లారి నుంచి ఝూళి కృష్ణమూర్తి ఆచారి (ప్రఖ్యాత పౌరాణికుడు), తిరుచానూరు రాఘవేంద్రాచారితో కలిసివచ్చి నన్ను కలిశారు. అప్పుడు నేను తిరుమల-తిరుపతి దేవస్థానాల కార్యనిర్వహణాధికారిగా వుండేవాడిని. కృష్ణమూర్తి ఆచారి 'శ్రీనివాస దాసరు అన్నదానం ట్రస్టు'కు అధ్యక్షులు, రాఘవేంద్రాచారి కార్యదర్శి. వచ్చిన విషయం - బ్రహ్మోత్సవాలలో 10 రోజులూ అన్నదానం చేయడానికి పెద్ద వసతి కావాలి!

బ్రహ్మోత్సవాలలో తిరుమలలో ఎంత వసతి ఉన్నా చాలదు. లక్షలమంది వస్తారు. వారందరికీ వసతి చూపించడం దేవస్థానానికి అసంభవం. యాత్రికులే అనుకుంటే, వేలసంఖ్యలో దేవస్థానం ఉద్యోగులూ, పోలీసులూ, హోంగార్డులూ, ప్రవచనాలు చేసే పండితులూ, స్వచ్ఛందసేవకులూ, సంగీతకళాకారులూ, భజనబృందాలూ, కోలాటం వేసేవారు... ఇలా ప్రతివారూ అవసరమే. వీరందరూ బ్రహ్మోత్సవాల బందోబస్తుకి, కార్యక్రమాలలో పాల్గొనటానికి వచ్చేవారు. వీరందరూ తాము ఆలయ అతిథుల మనుకుంటారు. వీరందరికీ వసతి చూపించాల్సిన బాధ్యత దేవస్థానందే... అటువంటిది ఈ స్వచ్ఛందసంస్థలు అన్నదానాలు చేస్తామని, పాలుపంచుతామని, పండ్లు ఇస్తామని మొదలుపెడితే వాళ్లకి (దేవస్థానం దృష్టిలో) సదుపాయాలు కల్పించడం అంత ప్రాధాన్యం గల అంశం కాదు. అదే వారికి చెప్పాను.

కాని, ఈ శ్రీనివాస దాసరు అన్నదానం ట్రస్టు ఎలా మొదలయింది, ఎందుకు మొదలయింది, ఎవరు మొదలుపెట్టారో... ఆ కథంతా విన్నాక, చాలా ఇబ్బందయినా, వారికి వసతి చూపెట్టకుండా వుండలేకపోయాను.

అప్పటికి ఎన్నో దశాబ్దాలుగా, దాదాపు 80/90 సంవత్సరాలనుండీ ఈ అన్నదాన కార్యక్రమం జరుగుతోందనీ, ముఖ్యంగా సాంప్రదాయికంగా దేవతార్చనలు చేసి,

శుచిగా, మడిగా భోజనం చేయదలచిన వారి సౌకర్యార్థం మొదలైందనీ, 'అన్నదానం ట్రస్టు' అని పేరు వున్నా, అక్కడ బ్రహ్మోత్సవాలు జరిగినన్ని రోజులూ ప్రతిపూటా జ్ఞానకార్యాలు, భజనలూ, హోమాలు... ఇలా సాంప్రదాయిక ఆధ్యాత్మికకార్యక్రమాలు చేపట్టి, ప్రతిరోజూ పూజానైవేద్యాలు చేసి, ఆ నైవేద్యాన్నే అన్నదానం చేస్తారనీ, ఎంతో ఉదాత్తమైన ఆశయాలతో చాలాకాలం క్రితం శ్రీనివాసదాసరు ప్రారంభించిన కార్యక్రమం ఇది అని అంటూ... వాళ్లు ఆయన కథ చెప్పారు.

★ ★ ★

1880 ప్రాంతంలో బళ్లారి జిల్లాలోని చిన్నపల్లె – కోఊరులో ఒక మధ్వబ్రాహ్మణ కుటుంబంలో పుట్టిన 'పుట్టుగుడ్డి' బాలుడు ఈ శ్రీనివాసదాసుడు. వారి కులదైవం శ్రీనివాసుడి పేరే ఆ అంధశిశువుకు పెట్టారు... చిన్నప్పటినుండి తిరుపతి వేంకటేశ్వరుడంటే శ్రీనివాసునికి అపరిమితమైన భక్తి. ఏడుకొండలవాడి పేరు చెప్తేనే కేరింతలు కొట్టేవాడట. చిన్నప్పటి నుండి భక్తులతో భజనలు, సంకీర్తనలూ, శులాదులు పాడుతుండేవాడు. దాసుల కీర్తనలు ఆలపించి పరవశుడైపోతూండేవాడు... అలా శ్రీనివాసుడు అందరి దృష్టిలో శ్రీనివాసదాసుడుగా మారిపోయాడు.

గుడ్డివాడైనా రోజూ 'శ్రీదేవి-భూదేవి' సమేత శ్రీనివాసుని పూజ చేసి నైవేద్యం చేసిగాని భోంచేసేవాడు కాదు. తీర్థయాత్రలంటే చాలాయిష్టం. కన్యాకుమారి నుండి నేపాల్ దాకా పుణ్యక్షేత్రాలు తిరిగి 1902 నాటికి తిరుపతి క్షేత్రానికి చేరాడు.

ప్రతిరోజూ తిరుచానూరులో పద్మావతీ అమ్మవారి 'దర్శనం' చేసుకొని తిరుమల కొండకి బయలుదేరేవాడు. స్వామివారి 'దర్శనం' చేసుకొని ఆలయంలో ప్రసాదం తీసుకొనేవాడు. ఆ రోజుల్లో సంప్రదాయబద్ధంగా పూజ చేసుకొనే అలవాటున్న భక్తులకు, ఆలయంలో ప్రసాదం కొనుక్కొని తినడంలో చాలా ఇబ్బందులు వుండేవి. కొన్నిరోజులు ప్రసాదం దొరికేది కాదు. దొరికినా, కావలసినవి, కావలసినంత దొరికేవి కావు.

ఈ శ్రీనివాసదాసు అటువంటి యాత్రికుల సౌకర్యార్థం కొండమీద ఒక సత్రంలో అన్నదానానికి ఏర్పాట్లు చేయసాగాడు. తిరుమలలోనే వుండి మూడు పూటలా స్వామివారి 'దర్శనం' చేసుకొంటూ, స్వామికి రోజూ పూలూ, పళ్లూ నైవేద్యానికి ఆలయానికి తీసుకువెళ్తూ, సత్రంలో వంటలు చేయించి, స్వామికి అక్కడ నుంచే నైవేద్యం చేసి, భక్తులకు అన్నదానం చేస్తూ వుండేవాడట. అలా చేసి చేసి కొంత కాలానికి ఈ శ్రీనివాసదాసు 'అన్నదానం శ్రీనివాసదాసు'గా ప్రసిద్ధికి వచ్చాడు.

ఈయన పుట్టు గుడ్డివాడుకదా! ఆలయానికి రోజూ మూడుసార్లు 'దర్శనానికి' వెళ్లడమేమిటి? లోపలికి వెళ్లి ఏం చూడగలుగుతాడు? చూడలేకపోతే అలా వెళ్లడం ఎందుకు?....

ఈ సందేహాలు చాలమందికి ఆ రోజుల్లో కూడా వచ్చేవట. ఆలయంలోని అర్చకులకు కూడా ఇదే సందేహం. "రోజుకు మూడు పూటలా దర్శనానికి వస్తాడు ఈ గుడ్డి మనిషి. స్వామివారి సన్నిధిలో ఏదో అనుభూతి పొందినట్లు ఆనందోద్రేకాలు ప్రదర్శిస్తాడు. ఇతనేమి చూస్తున్నాడు? ఏమిటిదంతా?" అని అర్చకులను సందేహం వెంటాడేది. ఒకనాడు ఉండబట్ట లేక శ్రీనివాసదాసుణ్ణే అడిగేశారు.

"స్వామీ, శ్రీనివాసదాసూ! మీరేమో అంధులు. అందునా పుట్టుకతోనే. ఏమీ కనపడదు గదా! ప్రతిరోజూ ఇంత ప్రయాసతో ఆలయానికి రావడం దేనికి?" అని సానుభూతితో అడిగారట.

దానికి శ్రీనివాసదాసు మందహాసంతో "ఓ అర్చకస్వామీ! నాకు లౌకికవిషయాలు కనపడకపోవడం నిజమే... గుడ్డివాడినే... కాని స్వామి వారి ముందు నేను గుడ్డివాడిని కాను. స్వామి వారే నాకు దర్శనం చేయిస్తారు. అడిగారు కనుక చెప్తున్నాను... గర్భగృహంలో మూలవరులకు, అనంత కళ్యాణగుణపరిపూర్ణుడైన ఆ స్వామికి మీరు చేసిన అలంకారం అంతా నాకు స్పష్టంగా కనిపిస్తోంది. ఏ ఆభరణాలు ఎలా అలంకారం చేశారో, ఏ రంగు పీతాంబరాలు ఎలా కట్టారో, ఏ యే పుష్పాలతో ఎలా అలంకారం చేశారో అన్నీ నాకు 'కళ్లకు కట్టినట్లు' కన్పడుతున్నాయి..." అంటూ ఒక్కొక్క ఆభరణం గురించి, ఇతర వస్త్ర, పుష్ప అలంకారాల గురించి, మూలవరులే కాక, గర్భాలయంలోని ఇతర 'బేరాలు' (విగ్రహాలు) ఎక్కడ వుంచారు, ఎలా అలంకరించారు, పూజలు చేస్తున్నప్పుడు ఎలా చేస్తారు... అంతా పూస గుచ్చినట్లు చెప్పాడట.

దానికి సంభ్రమాశ్చర్యాలలో మునిగిపోయిన అర్చకస్వాములు భయపడిపోయారు. వెంటనే శ్రీనివాసదాసుకి పాదాభివందనం చేసి, తాము అలా ప్రశ్న అడిగినందుకు క్షమాపణ కోరారట. అంతటితో ఆగక, "స్వామివారి అనుగ్రహానికి ఇంతగా నోచుకొన్న మీరు సామాన్యులు కారు, ఏ తపస్సంపన్నులో, సిద్ధపురుషులో అయి వుంటారు" అని అర్చక స్వాములన్నారట.

దానికి శ్రీనివాసదాసు సమాధానం: "మీరు స్వామివారి ఆంతరంగికసేవకులు. మీకు తెలియనిది కాదు. కాని అడిగారు కనుక, నాకు తెలిసిన నా జన్మవృత్తాంతం చెబుతాను... నాకు బాహ్యదృష్టి లేదు... కాని స్వామి అనుగ్రహంతో అంతరంగజ్ఞానదృష్టి ప్రాప్తమయింది. ఈ సిద్ధి ఈనాటిది కాదు. మా గురువుల ద్వారా స్వామి అనుగ్రహం చేశారు..." అంటూ తన పూర్వజన్మవృత్తాంతం జ్ఞాపకం చేసుకొని స్వామి సన్నిధిలోనే అర్చకులకు చెప్పారట.

"మీ అందరికి శ్రీవ్యాసరాయ తీర్థుల గురించి తెలుసుగదా... అదృష్టవశాత్తూ, ఆయన వైఖానసుడు కాకపోయినా ఈ ఆలయంలో స్వామివారి అర్చనాది కైంకర్యం చేసే అదృష్టాన్ని ఆయనకు స్వామి కలుగచేశారు. చరిత్ర చూస్తే అలా ఆయన స్వామివారి సేవ 12 సంవత్సరాలు చేసినట్లుగా తెలుస్తుంది. ఆ కాలంలో వారికి సేవ చేసే పరిచారకులలో ఒకడు గురువుగారి పూజానైవేద్యాలకు ఏర్పాటు చేసేవాడు...

"ఒకనాడు వ్యాసతీర్థులు ఆహ్నికం ముగించుకొని, పూజానైవేద్యాల అనంతరం, భిక్షకు కూర్చున్నారు... ఈ పరిచారకుడే ఆ రోజు గురువుగారి సేవలో వున్నాడు. గురువుగారి భోజనంలో ఒక వెంట్రుక వచ్చింది. అలాంటి భోజనానికి విముఖులైన వ్యాసతీర్థులు - 'నీకు కండ్లు లేవా? వున్నా కనపడవా?' అని ఆ శిష్యపరిచారకుని తీవ్రంగా మందలించారు.

"వ్యాసతీర్థులు మహాతపస్వి. శ్రీకృష్ణ దేవరాయలను కుజయోగం నుండి రక్షించడానికి, ఆ గ్రహకూటమినాడు తాను రాజై, దుష్టగ్రహప్రభావం తనపైకి తీసుకొని, రాజును రక్షించి, మరల ఆయన్ని పట్టాభిషిక్తుడిని చేసిన తపోధనుడు. విజయనగర సామ్రాజ్యరక్షణకై హంపిలో తుంగభద్రా తీరంలో ఒక ఆంజనేయస్వామిని ప్రతిష్ఠ చేయ సంకల్పించాడు. ప్రతిష్ఠించిన ప్రతిసారీ ఆంజనేయస్వామి పీఠం వదిలి పారిపోయేవాడట. కొన్నిసార్లు చూసి, ఆంజనేయస్వామిని ప్రార్థించి మూలమంత్రంతో ఒక పెద్ద యంత్రం తయారుచేసి, ఆంజనేయస్వామి వారిని ఆ యంత్రం మధ్య ప్రతిష్ఠించి, ప్రతిష్ఠించిన ఆలయంలో మారుతి స్థిరంగా వుండేటట్లు చేసిన మంత్రశక్తి కలవారు... ఇప్పటికీ 'యంత్రోద్ధారక హనుమ'ను హంపిలో చూడవచ్చు... అంత్యజుని దేహంతో జన్మించిన కనకదాసుని గుర్తించి, కనకదాసు ఎంతటి జ్ఞానియో, భక్తుడో లోకానికి చాటి, తన ఇతర బ్రాహ్మణపండిత శిష్యులకు కనువిప్పు కల్గించిన సంస్కర్త. ఈయనను ప్రహ్లాద అవతారంగా భావిస్తారు. ఈయనే తర్వాత రాఘవేంద్రస్వామి (మంత్రాలయ) గా ఇంకో అవతారం చేశారని భక్తుల ప్రగాఢ విశ్వాసం.

“ఆయనకు ఆ తపస్సాధన వలన ‘వాక్శుద్ధి’ వుంది. నోటినుండి అసత్యం రాదు. ఆయన చెప్పినది జరిగి తీరుతుంది. అంటే భగవదిచ్ఛ తెలిసి మాట్లాడేవాడని అర్థం. భగవదాదేశంగా వారి నోటినుండి ‘గుడ్డివాడవా? కళ్లువున్నా కనపడవా?’ అన్న మాటలు వచ్చాక అవి సత్యం కావాలికదా! అంతే, ఆ పరిచారకుడు గుడ్డివాడైనాడు. అంటే వ్యాసరాయల పల్కులు శాపంగా తమ ప్రభావం చూపించాయి.

“ఆ పరిచారకుడు స్వతహాగా సాత్త్వికుడు, గురుభక్తి, హరిభక్తి కలవాడు. అతని ప్రారబ్ధం అలా వుండటంతో ఆనాడు ఆ విపరీతం జరిగింది. దానికి కుమిలిపోతూ, చేసిన తప్పుకు పశ్చాత్తాపంతో చింతిస్తూ, గురువుగారిని మరవక, పరిచారకవృత్తి నుండి తొలగింపబడ్డా, గురుభక్తి తగ్గక, హరిగురుస్మరణలోనే కాలం వెళ్లబుచ్చేవాడు.

“కొంతకాలానికి వ్యాసతీర్థులకు ఆ శిష్యునిపై దయ కలిగి శిష్యుని కలలో కనపడి, ‘నాయనా, నీకు కేవలం బాహ్యదృష్టి కావాలా లేక అంతరంగజ్ఞానదృష్టి కావాలా?’ అని ప్రశ్నించారు. దానికి ఆ గుడ్డివాడైన పరిచారకుడు– ‘స్వామీ కేవలం బాహ్యమైన కండ్ల చూపు నాకు వద్దే వద్దు. జ్ఞానపూర్వకమైన అంతరంగదృష్టిని ప్రసాదించు స్వామీ’ అని ప్రార్థేయపడ్డాడు. ‘ఈ జన్మలో ఈ ప్రారబ్ధం అనుభవించాల్సిందే– నీవడిగిన ఆంతరంగిక జ్ఞానదృష్టి కొంతకాలం తర్వాత నీకు వచ్చే మానవజన్మలో కలుగుతుంది. గుడ్డివాడిగా పుట్టినా, భగవద్భక్తుడవై, అంతరంగ జ్ఞానదృష్టితో సాధన చేసి, భగవత్సాక్షాత్కారం పొంది జన్మ ధన్యం చేసుకొంటావు. ఆ జన్మలో నీకు ఈ పూర్వజన్మజ్ఞానం కూడా వుండి సన్మార్గంలో సాధన చేసి, స్వామివారి భక్తులసేవలో తరిస్తావు’ అని ఆశీర్వదించి గురువు వ్యాసతీర్థులు అంతర్ధానమైనారు.

“ఆ పరిచారకుడనే నేను. ఈ జన్మలో శ్రీనివాసదాసునిగా పుట్టి, నా యోగ్యతానుసారం భగవంతుని, ఆయన భక్తులనూ సేవిస్తూ నా సాధన కొనసాగిస్తున్నాను” అని అర్చకులతో శ్రీనివాసదాసు చెప్పారట.

అలా అతనికి బాహ్యదృష్టి లేకపోవడం ఒకరకంగా సాధన చేసుకోవడానికి అవకాశాలు పెంచి, వరంగా సంక్రమించింది. కొండ ఎక్కాలన్నా, ఆలయానికి వెళ్లాలన్నా, లోపల స్వామిదర్శనం చేసుకోవాలన్నా ఎటువంటి ఇబ్బందులూ కలిగేవికావట. మనిషిని చూడకపోయినా, హస్తరేఖలు కనపడకపోయినా, తన దగ్గరకు వచ్చిన భక్తులకు చేతులు స్పృశించి వారి భవిష్యత్తు చెప్పేవారట. కొండకు కోరికలతో వచ్చేవారు, వారి అన్నదాన సత్రంలో భోంచేసి, వారి ఆశీర్వాదం, మంత్రాక్షతలు

తీసుకొంటే, వారి అభీష్టాలు తీరేవట. సంతానప్రాప్తి కలిగేదట. అది అంతా హరిగురువుల అనుగ్రహం గానే శ్రీనివాసదాసు భావించేవారట.

అన్నదానంతోపాటు, జ్ఞానకార్యానికి ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చేవాడు శ్రీనివాసదాసు. పెద్దపెద్ద ఉత్సవాలలో, ముఖ్యంగా తిరుమల బ్రహ్మోత్సవాలలో ఉదయం నుండి సాయంత్రం వరకూ ప్రతిరోజూ పండితులచే ప్రవచనాలు, వైష్ణవహోమాలు చేయిస్తూ భక్తులను జ్ఞానకార్యంలో ముంచెత్తేవారు. ఇవికాక దాసభజనలు, సంకీర్తనలు చేయించేవారు. బ్రహ్మోత్సవాలలో ఈ భక్తులందరూ నిరంతరజ్ఞానకార్యంలో నిమగ్నులై, స్వామివారు వాహనోత్సవాలలో మాడవీథులకు వచ్చినప్పుడు మాత్రం దర్శనం చేసుకొని తరించేవారు.

ప్రాచీనకాలంలో బ్రహ్మోత్సవాల సమయంలో స్వామి వాహనసేవలకై ఆలయం బయటకు వచ్చినప్పుడు ఆలయం మూసేసేవారట. బ్రహ్మాది దేవతలు స్వయంగా పాల్గొనే ఈ ఉత్సవాలలో, గర్భాలయం నుండి స్వామి ఉత్సవవిగ్రహాలలో విశేష సన్నిధానంతో వుండి స్వయంగా ఊరేగుతారని నమ్మకం. తర్వాతి కాలంలో, బయట వాహన ఉత్సవం మలయప్పస్వామికి శ్రీదేవి భూదేవులకు జరుగుతున్నా, లోపల దర్శనానికి భక్తులను వదిలే సంప్రదాయం మొదలైంది.

ఈ శ్రీనివాసదాసుని భక్తులకు స్వామే బయటకు స్వయంగా ఊరేగింపుగా వస్తారన్న ప్రగాఢ విశ్వాసం. ఈ కార్యక్రమాలు చేయడానికి వీరికి ఒక ప్రత్యేకప్రదేశం వుండేదికాదు. మొదట్లో తిరుమల పూలతోటలలో చేసేవారు. కాని బ్రహ్మోత్సవాలలో వర్షం తరచుగా వస్తుంది కాబట్టి చాలా ఇబ్బందులు కల్గేవి. తర్వాత శ్రీరామలక్ష్మణదాసు సత్రంలోనూ, స్వామి హాథీరాంజీ మఠంలోనూ ఈ జ్ఞానసత్రాలు, అన్నసంతర్పణలు చేస్తూ వుండేవారు. తర్వాత తర్వాత, ఈ కార్యక్రమాలు బ్రహ్మోత్సవాలలో మాత్రం తిరుమలలో చేస్తూ, మిగతా రోజుల్లో దేశం అంతా ఏర్పాటుచేస్తూ శ్రీనివాసతత్త్వాన్ని ప్రచారం చేస్తూ వచ్చారు.

దాసులవారి బళ్లారి జిల్లా పర్యటనలో జరిగిన ఒక సంఘటన బహుళ ప్రచారంలో ఉంది. బళ్లారిజిల్లా కెంచినగడ్డ గ్రామానికి పర్యటనలో భాగంగా శ్రీనివాసదాసులు రావడం జరిగింది. అప్పటికే దాసులవారి ఆధ్యాత్మికచింతన, జ్ఞానప్రచారం, అన్నసంతర్పణలు భక్తులకు తెలిసి, వారికి ఎక్కడికి వెళ్తే అక్కడ మంచి ఆదరస్వాగతం అందుతుండేది. అలానే ఈ గ్రామపెద్దలు కూడా దాసులవారికి ఆహ్వానం పలికి

కావల్సిన అన్ని సదుపాయాలు చేశారు. ఈ గ్రామం తుంగభద్రాతీరంలో ఉంది. నదికి అవతలితీరంలో శ్రీ వసుధేంద్ర తీర్థుల బృందావనం వుంది. వీరు శ్రీమంత్రాలయ రాఘవేంద్ర స్వామివారి పరంపరలో ప్రసిద్ధులైన యతివర్యులు. ఆ నదీతీరంలో స్వర్గస్థులై బృందావనగతులైనారు.

దాసులవారికి నది దాటి శ్రీ వసుధేంద్ర తీర్థుల బృందావనం వద్ద మూడు దినాలు రాత్రులు గడిపి సేవ చేయాలన్న సంకల్పం కలిగి, ఊరి పెద్దలకు తమ కోరిక తెలియచేశారు. వెంటనే గ్రామస్థులు అన్ని ఏర్పాట్లు చేయడం, దాసులవారు, గ్రామస్థుల సహితంగా నదిని దాటి అవతలిగట్టుకు స్వామి బృందావనం చేరడం జరిగింది. దాటడానికి పెద్ద కష్టమేమీ కాలేదు. ఎండాకాలం కనుక నదిలో నీరు లేదు. చిన్నపాయగా కొంచెం నీరు ప్రవహిస్తోంది.

ఆ నది పాయలో స్నానాదులు ముగించి, ఆహ్నికం ముగించుకుని, స్వామివారి బృందావనం ముందు పూజాదికాలు నిర్వర్తించి బృందావనాంతర్గత స్వామికి హస్తోదకం ఇచ్చి, దాసులవారు, ఆయనతో వచ్చిన శిష్యబృందం తీర్థప్రసాదాలు పూర్తి చేశారు. అందరూ భుక్తాయాసంతో విశ్రాంతి తీసుకొంటుంటే దాసులవారు బృందావనం ముందు ధ్యానంలోకి వెళ్లారట. దాసులవారు ఎవరితోనో మాట్లాడుతున్నట్లు శిష్యులకు మాటలు వినపడుతున్నాయట...

మాటలు స్పష్టంగా వినపడటం లేదు కాని, దాసులు ఎవరితోనో మాట్లాడు తున్నారన్న సంగతి అందరికీ తెలిసింది. కొద్దిసేపటికి దాసులవారు మాట్లాడటం ఆపి, శిష్యులందరినీ వెంటనే బయలుదేరి నది దాటి వారి గ్రామానికి వెళ్లమని ఆదేశించారు. శిష్యులు ఏమి జరిగిందో తెలియక, తమ వలన ఏమైనా పొరపాటు జరిగిందేమోనని దాసులవారినడిగారు: "స్వామీ, మూడు రోజులు సేవ చేయాలన్నది గదా సంకల్పం. ఇంకా ఒక్కరోజైనా పూర్తి కాలేదు. ఎందుకు తిరిగివెళ్లమని అంటున్నారు? మా వల్ల లోపమేమైనా జరుగలేదు కదా?"

కాని దాసులవారు అదేమీ వినిపించుకోకుండా, అందరినీ హడావుడి చేసి, సామాన్లు తీసుకొని నదిని దాటించేశారు. వారు నదిని దాటారో లేదో, తుంగభద్రానది ఒక్కసారిగా వరదనీటితో ఉరకలు వేస్తూ, ఉద్ధృతంగా ప్రవహించడం మొదలుపెట్టింది. అందరికీ ఆశ్చర్యం!. దాసులవారికి ఈ విషయం ఎలా తెలిసింది? భయభ్రాంతులైన గ్రామస్థులు దాసులవారిని ఆ విషయమే అడిగారుట. దానికి దాసులవారి సమాధానం–

"వసుధేంద్ర తీర్థులు బృందావనంలో నుండి నాతో మాట్లాడినది అదే. వరద ముంచుకు వస్తోంది. అందరూ వెంటనే నదిని దాటి అవతలగట్టుకు సురక్షితంగా వెళ్లండి - అని స్వామి ఆజ్ఞాపించారు."

అందుకే దాసులవారు గ్రామస్థులందరినీ ఉన్న పళంగా తొందరపెట్టి నదిని దాటించారు. దాసులవారి మహిమకు ఆ ప్రాంతం వారంతా ఆశ్చర్యపోయారు.

ఇలా ఈ శ్రీనివాసదాసరు బాహ్యదృష్టి లేకపోయినా, జ్ఞానదృష్టితో తన జీవితంలో నిష్ఠతో విధినిషేధాలు పాటిస్తూ, సంప్రదాయజీవనం గడుపుతూ, సంచారం చేస్తూ, జ్ఞానకార్యాలు నిర్వహిస్తూ, అన్నదానాలు జరుపుతూ, బ్రహ్మోత్సవాల సమయానికి తిరుమల చేరుకుని, విశేషంగా ఆ తొమ్మిది రోజులూ, జ్ఞానకార్యాలు, చేస్తూ ఆధ్యాత్మిక అకామ్యకర్మలు యజ్ఞయాగాల రూపంలో చేస్తూ, అందులో పాల్గొన్న ఆస్తికులకు అన్నదానం చేస్తూ, 1941లో పరమపదం చేరారు.

దాసులవారి శిష్యులు అప్పటినుండి శ్రీనివాస దాసరు అన్నదానసమాజం స్థాపించి, ప్రతి సంవత్సరం బ్రహ్మోత్సవాలలో శ్రీనివాస దాసరు చేసిన విధంగానే ఆధ్యాత్మిక కార్యక్రమాలూ, జ్ఞానకార్యాలూ, అన్నదానాలూ చేస్తున్నారు.

★ ★ ★

ఈ విషయం కార్యనిర్వహణాధికారిగా వున్న నా దృష్టికి తెచ్చారు. దానికి ముఖ్య కారణం... తిరుమల మాస్టరు ప్లాను అమలు జరపడంలో భాగంగా తిరుమల మాడ వీధులలోని అన్నిమఠాలు, సత్రాలు, ఇతర వసతిగృహాలను తీసివేయడం. ప్రతి సంవత్సరం ఈ శ్రీనివాసదాసరు అన్నదానసమాజం వారు కార్యక్రమాలు చేస్తున్న సత్రాన్ని కూడా పడగొట్టేశాం. ఈ కార్యక్రమాలు జరగడానికి పెద్దసత్రం కావాలి. ఇతరులవి ఏవీ లేవు కనుక తిరుమల దేవస్థానం వారు వారి సత్రమేదైనా ఇవ్వాలని వీరి అభ్యర్థన. అలా ఇవ్వకపోతే ఇన్ని దశాబ్దాలుగా జరుగుతున్న ఈ ఆధ్యాత్మిక కార్యక్రమం ఆగిపోవాల్సి వస్తుంది. కనుక సహాయం చెయ్యాలని కోరుతున్నారు.

వీరు చెప్పిందంతా విన్నాక, కాదని అనలేకపోయాను. పశ్చిమ మాడవీధులలో వున్న దేవస్థానం వారి పెద్ద వసంతమండపాన్ని 1980లో వారికి బ్రహ్మోత్సవాల సమయంలో 9 రోజుల కోసం ఇవ్వడం జరిగింది. అప్పటి నుండీ ప్రతి సంవత్సరం బ్రహ్మోత్సవాలలో ఈ వసంతమండపాన్ని ఈ కార్యక్రమానికి ఇవ్వడం జరుగుతూ

వచ్చింది. ఇటీవల పాత వసంతమండపం పడగొట్టి కొత్త మండపం కట్టాలన్న ప్రతిపాదన వచ్చినప్పుడు, శ్రీనివాస దాసరు అన్నదానం ట్రస్టు సభ్యులందరూ అప్పటి కార్యనిర్వహణాధికారి ఎ.పి.వి.ఎన్. శర్మ గారికి విషయం వివరించారు. కొత్త వసంతమండపం కట్టడానికి దాదాపు 50 లక్షల రూపాయలు విరాళంగా వారు ఇచ్చేటట్లూ, ప్రతి సంవత్సరం బ్రహ్మోత్సవాల సమయంలో వారికి ఆ వసంత మండపాన్ని ట్రస్టు కార్యక్రమాలకు ఇచ్చేటట్లు శ్రీ శర్మ పాలకమండలిలో తీర్మానం చేయించి, సానుకూలం చేశారు.

★ ★ ★

74. మలుపులు తిరుగుతూ వచ్చిన ఆలయ చట్టాలు

తిరుమల ఆలయచరిత్ర అంతా - చేతులు మారుతూ వచ్చిన 'ఆదాయం మీద ఆధిపత్యం'గా కనిపిస్తుంది.

చరిత్రపరంగా మనకు తెలిసిన తిరుమల క్షేత్రం ఉనికి వేల సంవత్సరాల క్రితం నాటిది. శ్రీనివాసుడి గురించి ప్రచారం చేసేవాళ్లు చేస్తూవచ్చారు. విశ్వసించిన భక్తులు వచ్చి దర్శించుకొంటూ వున్నారు. సంపన్నులైన రాజులు, జమీందారులు కానుకలు భారీగా సమర్పించుకొంటూ వచ్చారు. భక్తితో సేవలు ప్రవేశపెట్టి సేవించే వాళ్లు సేవిస్తూ వచ్చారు.

కాని, ఆలయనిర్వహణ ఎవరి చేతిలో వుంటే వాళ్లు (అధికశాతం) ఈ క్షేత్రాన్ని ఆదాయాన్ని తెచ్చిపెట్టే కేంద్రంగానే చూశారని చరిత్ర చెబుతోంది. అయితే, మొదటిసారిగా ఈ క్షేత్రనిర్వహణను క్రమబద్ధం చేయటం కోసం ఒక చట్టపరమైన విధానరూపకల్పన జరిగింది మాత్రం 1932-33లో. అది కూడా ఒకరకంగా ఆలయనిధుల వినియోగం చట్టబద్ధం చేయడానికేనా అనిపిస్తూ వుంటుంది.

తిరుమల చరిత్రలో అది ఒక పెద్ద మలుపు.

★ ★ ★

దాదాపు 90 సంవత్సరాల మహంతుల పాలన 1933లో అంతమయిందని చెప్పుకొన్నాం. ఈస్టిండియా కంపెనీ పాలనకు ముందు వున్న ఆలయ పాలనవ్యవస్థ గురించి అదివరకే చర్చించాం. వెయ్యి సంవత్సరాల క్రితం తిరుచానూరు శ్రీవైష్ణవసభ (108 మంది) తో మొదలైన వ్యవస్థ పలు మార్పులు చెంది, చాలాకాలం 12 మంది స్థానత్తారులకు, అటుతర్వాత ఆరుగురికి, తర్వాత నలుగురు స్థానికులకు కుదించబడి ఆర్కాటు నవాబుల కాలానికి రెంటరు/అమలుదార్ల పర్యవేక్షణకు వచ్చి, కంపెనీవారి కాలంలో తిరుపతి తహశీల్దారు, ఆర్కాటు కలెక్టర్ల పాలనలోకి వచ్చి, తర్వాత హాథీరాంజీ

మహంతు ఒక్కడే విచారణకర్తగా వ్యవహరిస్తే, 1907 నాటికి మహంతు అధికారాలు కుదించబడి, న్యాయస్థానం అధీనంలో నేరుగా పనిచేసే ఒక కోశాధికారి సహాయంతో మహంతుపాలన 1933 వరకూ జరిగినట్లు చూశాం.

తిరుమల-తిరుపతి దేవస్థానాల చట్టం - 1932/33లో ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో అమలులోకి రావడం, దాని కారణంగా ఏడుగురు సభ్యులు గల పాలకమండలిని, కార్యనిర్వాహణాధికారిగా ఒక 'కమిషనరు' అనే అధికారిని నియమించడం జరిగింది. మొదటి పాలకమండలికి అదివరకు దాకా విచారణకర్తగా వ్యవహరించిన హాథీరాంజీమఠం మహంతు ప్రయాగదాసునే నియమించడం జరిగింది. అలా ఒక్కరి పర్యవేక్షణ నుండి పాలకమండలి ఆధ్వర్యంలోకి ఆలయవ్యవహారాలు తేవడం జరిగింది - ఈ మార్పు ముఖ్య వుద్దేశ్యం - ఆనాటి ప్రభుత్వం తిరుమల ఆలయనిధుల వినియోగం గురించే. వీలయితే మతసంబంధం కాని వ్యవహారాల (సెక్యులర్) కు నిధుల్ని మళ్లించాలన్నట్లు తెలుస్తుంది. ఎందుకంటే ఆ చట్టంలో, ఈ ఆలయానికి నిధులు ఎలా, ఎవరు, ఎందుకు ఇస్తున్నారు, వారి అభిలాష ప్రకారం ఖర్చు పెట్టాలన్న విషయం ఆనాటి పాలకులకు వున్నట్లు కన్పడదు. ఆలయభూములు, వాటినుండి వచ్చే ఆదాయం విషయాలలోనూ ఇదే ధోరణి.

ఆర్కాటు నవాబుల లాంటి ముస్లిం పాలకులను తృప్తి పరచడానికి ఆలయనిధులు పెంచాలని ప్రారంభించిన 'రుసుము చెల్లించి దర్శనాలు, ఉత్సవాలు చేయించే విధానం' ఆపాలన్న ఆలోచన, ఈ ప్రజాప్రభుత్వపాలకులకు రాలేదు. దురదృష్టవశాత్తు, అవే పద్ధతులను ఈ పాలకమండళ్లు కూడా కొనసాగించాయి... రానురాను, ఇలా ఆదాయం పెంచుకోవడం ఒక సంప్రదాయంగా రూపొందింది. చివరికి, ఇష్టమొచ్చినట్లు పెంచుకుంటూ పోవటమే జరుగుతూ వస్తోంది. ఈనాటి అన్ని ఆలయాల ముఖ్య వుద్దేశ్యం కూడా ఇదే అయి కూర్చుంది. తర్వాత వచ్చిన అన్ని దేవాలయ పరిపాలనచట్టాలు, ఈ విషయం పైనే ముఖ్యంగా దృష్టి పెట్టే దౌర్భాగ్యస్థితి నెలకొంది.

మనకు అందుబాటులో వున్న 9వ శతాబ్దం నుండి ఈనాటి వరకు గల రికార్డులు, శాసనాలు పరిశీలిస్తే, దాతలు, గ్రామాలు, భూములు, నగలు, ధనం, ఇతరాలు ఆలయానికి ప్రత్యేకంగా సేవలు చేయడానికి, చాలావరకు ఆచంద్రార్కం వారి తరఫున సేవలు కొనసాగించడానికి చేసినవే. ఆలయంలో దీపాలు వెలిగించడానికి గాని, నైవేద్యాలు చేయించడానికి గానీ, ఉత్సవాలు నిర్వహించడానికి గాని వారిచ్చిన మడిమాన్యాలు తప్పకుండా వారు సూచించిన కార్యక్రమాల కోసమే వినియోగించాల్సిన

బాధ్యత ఆలయ పాలకులదే అన్న ధ్యాస, స్పృహ, స్ఫూర్తి చట్టాలలో కాని, వాటి అమలులో కాని కన్పించకుండా పోయాయి.

ఈ చట్టం ప్రకారం పరిపాలన బాధ్యతలన్నీ ఆ ఏడుగురు పాలకవర్గసభ్యులకు, కమీషనరుకు ఇవ్వబడ్డాయి. ప్రభుత్వం నియమించే వారికి ఎటువంటి అర్హత వుండాలి అన్న ప్రసక్తి లేదు. ప్రభుత్వం తన ఇష్టప్రకారం ఎవరినైనా వేయవచ్చు. దాదాపు పది శతాబ్దాలు, ఆలయపాలకుల ఎంపిక కొన్ని నియమనిబంధలన ప్రకారం జరుగుతూ వచ్చేది. కాని ఈ చట్టంతో ఆ సంప్రదాయానికి తిలోదకాలిచ్చినట్లు అయింది (శోచనీయమైన విషయం ఏమిటంటే ఇప్పటిదాకా అదే పద్ధతి కొనసాగుతోంది. ఆలయ సంప్రదాయాలు, ఆచారవ్యవహారాలు తెలిసి, ఆలయనిధులు, ఇతిహాస పురాణచరిత్రలు తెలిసిన వారికే స్థానం కల్పించే పద్ధతి పూర్తిగా పోయి, ఈ వైష్ణవాలయ పాలకమండలిలో ఒక్క వైష్ణవునికి కూడా చోటు కల్గించని దయనీయస్థితిని ఇప్పుడు చూస్తున్నాం.)

మొదటిచట్టంలో రెండు సలహామండళ్ల ఏర్పాటుకి అవకాశం కల్పించారు. ఒకటి జియ్యంగారు, మిరాశీదార్లు, అర్చకులు, ఆచార్యపురుషులు సభ్యులుగా గలది. ఆలయ సంప్రదాయ/పూజావిధానం/మతపరమైన విషయాలలో పాలకమండలికి సలహాలివ్వడానికి, దేవస్థానం గ్రామాల్లో భూములు వ్యవసాయం చేస్తున్న రైతుల విషయాలు చూడటానికి రెండవ మండలి. ఇది పేరుకే వుండేది. రైతువారీ విషయాలన్నీ ఆ రోజుల్లో ఎస్టేటు భూముల చట్టం కిందకు వచ్చేవి.

మొదట్లో, పాలకమండలి సభ్యులకు ఆలయ విషయపరిజ్ఞానం లేదు కనుక, మొదటి సలహామండలే ఒక రకంగా ఆలయపరిపాలన సాగించేది. ఈ సభ్యులందరికీ ఆలయ ఆదాయాలలో మిరాశీదార్లుగా భాగాలుండేవి కనుక, ఒక రకంగా వీరందరూ నిష్పక్షపాతంగా నిర్ణయాలు చేసే అవకాశం తక్కువ.

ఈ చట్టంలో లొసుగులున్నాయని 1951లో కొత్త చట్టం తేవడం జరిగింది. అంతకుముందు చట్టం తిరుమల–తిరుపతి దేవస్థానాలకు ప్రత్యేక చట్టంగా వున్నా, ఆ విధానాన్ని మార్చి రాష్ట్రదేవదేయ చట్టంలో ఈ తిరుమల ఆలయాలను భాగంగా చేశారు. ఆ చట్టంలో రెండు సెక్షన్లు మాత్రమే తిరుమల ఆలయాలకు సంబంధించినవి. 80వ సెక్షను ప్రకారం తిరుమల–తిరుపతి దేవస్థానాల పాలకమండలిని ఏడుగురు సభ్యులనుండి ఐదుగురు సభ్యులకు కుదించడం జరిగింది. వారిని రాష్ట్రప్రభుత్వమే నియమిస్తుంది. 'కమీషనరు'ను, కార్యనిర్వహణాధికారిగా (ఎగ్జిక్యూటివ్ అధికారి) మార్చారు. పాలకమండలికి ఐదు సంవత్సరాల కాలపరిమితి నిచ్చారు. ఇందులో

కార్యనిర్వహణాధికారి బాధ్యతలు స్పష్టంగా విశదీకరించారు. 1) ఆలయ ఆస్తుల నిర్వహణ, ఆలయ పరిపాలన బాధ్యతలు, 2) ఆలయ రికార్డులు, నిధులు, నగలు ఆస్తుల పరిరక్షణ, 3) ఆలయ ఆదాయవ్యయాలు చూడటం, 4) విపరీత లేదా అత్యవసర పరిస్థితులలో ఆలయనిధులు ఖర్చుపెట్టి, కార్యక్రమాలు, అవసరమైన పనులు చేపట్టి చేయించడం (సంవత్సరపు బడ్జెట్టులో లేకపోయినా), తర్వాత ఈ ఖర్చు విషయం పాలకమండలి దృష్టికి తెచ్చి వారి ఆమోదం పొందడం.

ఈ చట్టంలో రాష్ట్ర దేవదేయశాఖ కమిషనరుకు అప్పీలు అధికారాలు ఇచ్చి, ఏ విషయంలో వివాదం వచ్చినా పరిష్కరించే అధికారాలు కూడా ఆయనకు ఇవ్వడం జరిగింది. అంటే అంతకుముందున్నట్లు కాకుండా తి.తి.దేవస్థానాల పాలకమండలిని, కార్యనిర్వహణాధికారిని, దేవదేయ కమిషనరు అజమాయిషీలోకి - అంటే ఒక రకంగా ప్రభుత్వ పరిధిలోకి తెచ్చారు.

ఈ చట్టంలోని ముఖ్య విశేషం - ఆలయనిధుల్ని ఏయే అంశాలపై ఖర్చు పెట్టాలన్నది 85వ సెక్షన్‌లో విపులంగా ఇవ్వటం. ప్రత్యేకంగా -

1. ఆలయ పరిపాలన, మరమ్మత్తులు
2. ఆలయం నడిపే విద్యాసంస్థలు
3. యాత్రికుల కోసం ఆలయం నడిపే వైద్యశాలలు
4. అన్నిరకాల యాత్రికులకోసం వసతి గృహాలు, సత్రాలు, అతిథిగృహాల నిర్మాణం
5. నీటి సరఫరా, పారిశుద్ధ్యం అవసరాలకు
6. దేవస్థానంలోని పశువుల సంరక్షణకు పశువుల ఆస్పత్రి కోసం
7. ప్రభుత్వ అనుమతితో, దేవస్థానానికి అవసరమైన భూముల సేకరణ/కొనుగోలు
8. దేవస్థానం/యాత్రికుల సౌకర్యార్థం రహదారులు, విద్యుదీకరణ
9. ఆలయంలోని పూజావిధానాలు/ఆగమవిషయాల ఆచరణ సానుకూలం చేయడానికి అర్చకుల శిక్షణకు, అధ్యాపకులు, వేదపారాయణదారుల తయారీకి
10. ప్రభుత్వ అనుమతితో ఇంకే ఇతరకార్యక్రమానికైనా... దేవస్థానం నిధులు ఖర్చు పెట్టవచ్చు

ఈ చట్టంలో ప్రభుత్వానికి విస్తృత అధికారాలిస్తూ, దేవస్థానపాలకమండలి పరిధిని నిర్దిష్టం చేశారు.

మళ్లీ ఈ చట్టాన్ని రద్దుచేసి, 1966లో కొత్త (17) వ చట్టాన్ని 'హిందూ దేవాలయ, దేవదేయ చట్టం'గా రూపొందించడం జరిగింది. అందులో రాష్ట్రంలోని అన్ని ఆలయాలతోపాటు తిరుమల ఆలయాలు కూడా చేర్చి, 14వ చాప్టరులో తిరుమల-తిరుపతి ఆలయ ప్రస్తావన చేశారు.

ఈ కొత్త చట్టంలో ప్రభుత్వం నియమించే పాలకమండలి సంఖ్యను 11మందికి పెంచారు. అందులో ముగ్గురు రాష్ట్ర శాసనమండలి సభ్యులు, ఒక షెడ్యూలు కులాల సభ్యుడు, ఒక మహిళాసభ్యురాలు వుండాలని నిర్ణయం చేస్తూ, ఈ పాలకమండలి కాలపరిమితిని మూడు సంవత్సరాలకు తగ్గించారు (అదివరకు ఐదు ఏళ్లు వుండేది). ప్రభుత్వం తి.తి.దేవస్థానాల పరిపాలన నిర్వహణకు ఒక కార్యనిర్వహణాధికారిని నియమించే వెసులుబాటు, దానితోపాటు ఆలయనిర్వహణకు ప్రత్యేకంగా ఒక ఉపకార్య నిర్వహణాధికారిని కూడా నియమించడానికి అవకాశం కల్పించారు. ఈ చట్టంతో పాలకమండలి అధికారాలేమిటి, కార్యనిర్వహణాధికారి అధికారాలేమిటన్నది స్పష్టం చేశారు.

ఈ చట్టంలో దేవస్థానం నిధుల వినియోగం విషయంలో అదివరకు చట్టంలో కంటే కొంత స్పష్టత తెస్తూ, హిందూధర్మప్రచారానికి పెద్దపీట వేశారు. పాతచట్టంలోని అన్ని అంశాలూ అలాగే వుంచుతూ, కొన్ని కొత్త అంశాలు జోడించారు. ధర్మప్రచారం, సంస్కృత, ఇతర దేశభాషల అభివృద్ధికి అని చెప్తూ, ప్రభుత్వ అనుమతితో మతపరమైన విద్యాపరమైన, సామాజిక, ధార్మిక కార్యక్రమాలకు ఖర్చుపెట్టవచ్చు- అంటూ దేవస్థానం నిధుల్ని విస్తృతంగా (ప్రభుత్వ ఆదేశాలతో) ఖర్చు పెట్టడానికి అవకాశం కల్పించారు.

వేంకటేశ్వర విశ్వవిద్యాలయానికి ప్రతి సంవత్సరం రెండున్నర లక్షలకు తక్కువ కాకుండా విరాళంగా నిధులు ఇవ్వాలని నిర్దేశించారు.

'హిందూధర్మ ప్రతిష్ఠాన'మనే సంస్థను స్థాపించి, దానికి కావల్సిన మూలనిధులు సమకూర్చాలనీ, ప్రతి సంవత్సరం ఈ సంస్థకు లక్షరూపాయలకు తక్కువ కాకుండా నిర్వహణ నిధులు సమకూర్చాలనీ సూచిస్తూ- ఈ సంస్థ కార్యకలాపాల వివరణ కూడా ఇచ్చారు.

1. హిందూధర్మ పరిరక్షణ, ప్రచారం, ధర్మాచార్యులను, ధర్మప్రచారకులను ఇతర కార్యకర్తలను తయారు చేయడానికి శిక్షణ.

2. ధర్మప్రచారానికి కావల్సిన సాహిత్యం తయారు చేయడానికి, ముద్రించడానికి, భక్తులకు అందుబాటులో వుండేట్లు ఏర్పాటు చేయడానికి,

3. ధర్మప్రచారానికి కావల్సిన శిక్షణసంస్థల స్థాపనకు, వాటి నిర్వహణకు,

4. పై చెప్పిన కార్యక్రమాల నిర్వహణకు సంబంధించిన ఇతర ఖర్చైనా.

ఈ చట్టంలో తెచ్చిన మార్పుల వలననే తిరుమల-తిరుపతి దేవస్థానాలు చాలా అభివృద్ధి కార్యక్రమాల్ని చేపట్టే అవకాశం కల్గింది.

కాని ఈ చట్టం తిరుమల-తిరుపతి దేవస్థానాలను కూడా రాష్ట్రంలోని ఇతర చిన్నాపెద్ద దేవాలయాలతోపాటు ప్రభుత్వ/దేవదేయశాఖ అధీనంలోకి పూర్తిగా తెచ్చి, పరిపాలనా సౌలభ్యాన్ని తక్కువ చేసింది.

మనకు దేవస్థానం చరిత్రలో 9వ శతాబ్దం నుండి భక్తులు ఇచ్చిన దేవదేయాలు, కానుకలు, చాలావరకు వారు మొక్కుకొని స్వామివారికి ప్రత్యేకసేవ కోసమో, ఉత్సవం కోసమో, నైవేద్యం కోసమో చేసినవి. చాలామందికి ఆచంద్రార్కం తాము ఇచ్చిన నిధులతో స్వామివారికి తాము కోరిన ప్రత్యేకసేవ చేయించాలన్నది ఆకాంక్ష. అలాంటి భక్తుల మనోభీష్టం నెరవేర్చటమే ఆలయపాలకుల కర్తవ్యం అన్న సంగతి ఎప్పటికీ మరచిపోకూడదు. భక్తుల విశ్వాసభావాలను గౌరవిస్తేనే, భక్తి నిలుస్తుంది, భక్తులు వుంటారు.

ఇలాంటి ఆలోచనలు నన్ను వెంటాడినప్పుడు నేను వాటిని 1979లో అప్పటి ముఖ్యమంత్రి డాక్టర్ చెన్నారెడ్డిగారి దృష్టికి తీసుకువెళ్లాను. ఆయనకు అప్పటికే తిరుమల-తిరుపతి దేవస్థానాల ఉనికి, రక్షణ పట్ల కొన్ని నిర్దిష్టమైన అభిప్రాయాలు వున్నాయి. పైగా అదే మూసలో ఆలోచించే ఐఏఎస్ అధికారి రమేశన్‌గారు రెవెన్యూ శాఖ కార్యదర్శిగానూ, మరో ఐఏఎస్ అధికారి (అదివరకు తిరుమల-తిరుపతి దేవస్థానాల కార్యనిర్వహణాధికారిగా పనిచేసిన) చంద్రమౌళిరెడ్డిగారు దేవదేయశాఖ కమిషనరుగానూ వున్నారు.

ఫలితంగా 1979లో తిరుమల-తిరుపతి దేవస్థానాల చరిత్ర మరో మలుపు తిరిగింది.

★ ★ ★

75. ఆ చట్టం ఒక చరిత్రాత్మక ఘట్టం

తిరుమల చరిత్రలో 1979 నాటి చట్టం తెచ్చిన మలుపు చాలా కీలకం. ఆ మలుపునకు నేను ప్రత్యక్షసాక్షిని. అందులో కొంతవరకు పాత్రధారిని కూడా.

★ ★ ★

ఇతర విషయాలు ఎలా ఉన్నప్పటికీ, ఆధ్యాత్మికంగా మాత్రం ముఖ్యమంత్రి డాక్టర్ చెన్నారెడ్డికి హిందూధర్మం, హిందూ ఆలయవ్యవస్థ పట్ల విశేషమైన గౌరవం, విశ్వాసం వుండేవి.

అందుకే తిరుమల-తిరుపతి దేవస్థానాల విషయంలో సమగ్రమైన, సుస్థిరమైన చట్టం తీసుకువచ్చి, ఆలయ పాలనమండలికి విధాననిర్ణయాల విషయంలో వీలైనంత స్వతంత్రప్రతిపత్తిని కల్పించాలని ఆయన భావించారు.

ఆయన ఈ నిర్ణయం తీసుకునే నాటికి తిరుమల దేవస్థానానికి పాలకమండలి లేదు. పాలకమండలి స్థానంలో ముగ్గురు సభ్యుల సాధికార కమిటీ పనిచేస్తోంది. పాలనమండలిని నియమించాలని డాక్టర్ చెన్నారెడ్డిమీద రాజకీయంగా వత్తిళ్లు వచ్చినా, ఆయన "కొత్తచట్టం వచ్చాక చేద్దాం" అంటూ వాయిదా వేస్తూ వచ్చారు. కొత్తచట్టాన్ని వీలైనంత త్వరగా రూపొందించే బాధ్యతని సాధికార కమిటీకే ముఖ్యమంత్రి అప్పగించారు.

ఆ కమిటీకి అప్పటి రెవెన్యూ కార్యదర్శి డాక్టర్ రమేశన్ అధ్యక్షులు. దేవదేయశాఖ కమీషనర్ శ్రీ చంద్రమౌళిరెడ్డి ఒక సభ్యుడు. తిరుమల-తిరుపతి దేవస్థానాల ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా నేను ఆ కమిటీలో సభ్యకార్యదర్శిని.

డాక్టర్ రమేశన్‌గారికి చట్టాలు తయారుచేయడంలో చాలా అనుభవం. ఆయన అప్పటికే 'తిరుమల టెంపుల్' అని ఇంగ్లీషులో తిరుమల ఆలయ సమగ్రచరిత్రను రచించడం పూర్తిచేశారు. ఆలయవిషయంలో చారిత్రిక, పౌరాణిక పరిజ్ఞానం బాగా

వున్నవారు. అంతకుముందు ఆర్కియాలజీ శాఖ, ఆర్కైవ్స్ శాఖలలో పనిచేయటం వలన శిలాశాసనాలు, ఆలయ ఆగమ విషయపరిజ్ఞానం కలవారు. పైగా మంచి సంప్రదాయకుటుంబం నుంచి వచ్చారు. శ్రీవేంకటేశ్వరుడే వారి కులదైవం. స్వామివారి సేవ దొరకడం మహద్భాగ్యంగా భావించినవారు. అందుకే కొత్త చట్టం తయారుచేయడం భగవదాజ్ఞగా భావించి, చాలా చిత్తశుద్ధితో, తన ఆధ్యాత్మిక, పరిపాలన, చారిత్రిక అనుభవాల్ని రంగరించి చట్టం తయారుచేశారు.

ఆయనకు దేవదేయ కమిషనరు శ్రీ చంద్రమౌళిరెడ్డి సహకరించారు. ఆయన తిరుమల ఆలయ పరిపాలనవిషయాల్లో మంచిపేరు తెచ్చుకున్న కార్యనిర్వహణాధికారి. వారిది తిరుపతి దగ్గర తొండవాడ గ్రామం (అగస్త్యేశ్వర ఆలయం వున్న ఊరు. వారి కుటుంబమే ఈ ఆలయానికి వంశపారంపర్యంగా ధర్మకర్తలు). దాదాపు మూడు సంవత్సరాలు తిరుమల-తిరుపతి దేవస్థానాల కార్యనిర్వహణాధికారిగా ఆయనకు అనుభవం వుంది. ఆపైన దేవదేయ కమీషనరుగా ఆలయ పాలనవిషయాలలో మంచిఅనుభవం గడించారు. మూడవ వాడిని నేను. పరిపాలన విషయంలోనూ, ఆధ్యాత్మిక, ఆలయ పాలనవిషయాలలో వారితో పోలిస్తే నాకు అనుభవం చాలా తక్కువ. వారిద్దరికీ సహాయం చేయడమే నేను చేయగలిగింది.

ఈ చట్టంలో ఆలయ పరిపాలనబాధ్యతలు ఐదుగురు సభ్యులు గల చిన్న మేనేజిమెంట్ కమిటీ చేతిలో వుంటాయి. అందులో పాలకమండలి అధ్యక్షులు, దేవదేయ కమిషనరు, ఇద్దరు పాలకమండలి సభ్యులు వుంటారు. కార్యనిర్వహణాధికారి సభ్య కార్యదర్శి.

ఈ చట్టం ప్రకారం - కార్యనిర్వహణాధికారి అదివరకు జిల్లా కలెక్టరుగా పనిచేసిన వాడై వుండాలన్న నిబంధన (పాలనానుభవం వున్నవాడై ఉండాలని) పెట్టారు. అది వరకు కార్యనిర్వహణాధికారులకు త్వరగా బదిలీలు జరుగుతున్న దృష్ట్యా - ప్రతి కార్యనిర్వహణాధికారి కనీసం మూడు సంవత్సరాలైనా దేవస్థానంలో పనిచేయాలని, అంతకన్నా ముందుగా అతనిని బదిలీ చేయరాదని నిబంధన కూడా పెట్టారు. వందలకోట్ల రూపాయల లావాదేవీ లుంటాయి కనుక దేవస్థానంలో ఒక ఫైనాన్షియల్ సలహాదారు, ఒక చీఫ్ అక్కౌంట్స్ ఆఫీసర్ వుండాలని నిబంధన తెచ్చారు.

కొత్త చట్టం ప్రకారం - హిందూధర్మ ప్రతిష్ఠానానికి ప్రాముఖ్యం పెంచి, దానికి అనుబంధంగా 'శ్రీవేంకటేశ్వర శిష్టాచార విద్యాసంస్థ'ను ఏర్పాటుచేశారు. ఈ చట్టం వేద, శాస్త్ర పరిరక్షణ, పరిశోధనలకు చాలా ప్రాముఖ్యం ఇచ్చింది. చట్టం ద్వారా

మొట్టమొదటిసారి, హిందూమతం, ధర్మం, సంస్కృతి పరిరక్షణ, ప్రచారం కోసం ఆలయనిధులు (ముఖ్యంగా) ఖర్చు చేయాలని నిర్ణయం చేశారు. ఆలయపాలన, యాత్రికుల సదుపాయాలు, రవాణా, త్రాగునీరు, విద్య, వైద్యం మొదలయిన విషయాలలో ఆలయబాధ్యతలు అదివరకు లాగానే కొనసాగించారు.

1978-82లో నేను తి.తి.దే. కార్యనిర్వహణాధికారిగా పనిచేసినప్పుడు, ఈ కొత్త చట్టం వల్లనే ఎన్నో కార్యక్రమాలు చేయడానికి సానుకూలమైంది.

ధర్మప్రచారానికి ఆ రోజుల్లో ఎన్నో కార్యక్రమాలు - ముఖ్యంగా వేదరక్షణ, వేదపారాయణ, శాస్త్రరక్షణ, కుమార అధ్యాపకపథకాలు, పౌరాణిక పాఠశాలలు, పాఠశాలలో పురాణపరీక్షలు, వేలకొలదీ పుస్తకప్రచురణలు, అన్నమాచార్య ప్రాజెక్టు, దాస సాహిత్యప్రాజెక్టు, ఆళ్వారు ప్రాజెక్టు (స్కీం ఆమోదించబడినా తర్వాత అమలు జరిగింది), భాగవతం ప్రాజెక్టు, 'ఎయిడ్ టు అథర్' పథకం, వేదిక్ లైబ్రరీ ప్రాజెక్టు, గ్రామగ్రామాన భజన మండళ్ల ప్రాజెక్టు, ఆలయాలకు మైక్‌సెట్లు ఇచ్చే ప్రాజెక్టు, కొండమీద నిత్యాన్నదాన పథకం, వికలాంగుల ప్రాజెక్టు... ఇలా ఎన్నో చేయడానికి సానుకూలత దొరికింది.

నేను కార్యనిర్వహణాధికారిగావున్న సమయంలో నాకు కల్గిన అనుభూతులు, అనుభవాలు, యాత్రికులకు కొంతమందికి జరిగిన అద్భుతాలతోపాటు, పాలనా సంస్కరణలు, చేసిన కార్యక్రమాలు కూడా నా పుస్తకం 'నాహంకర్తా హరిఃకర్తాః' (సర్వసంభవమ్)లో చాలా వివరంగా రాశాను.

1987లో ఎన్.టి. రామారావుగారు ముఖ్యమంత్రిగా వుండగా, తిరుమల-తిరుపతి దేవస్థానాల ఈ చట్టంలో కూడా మళ్లీ మార్పులు తెచ్చారు. ఈ సవరణల ముఖ్యవుద్దేశ్యం - మిరాశీలు ఎత్తివేయడం. మిరాశీలంటే వంశపారంపర్యంగా వచ్చే హక్కుదారులు. చాలా దేవస్థానాల్లో అర్చకులంతా మిరాశీదారులే - తిరుమల ఆలయంతో సహా. తిరుమలలో అర్చకులే కాక ఆచార్యపురుషులు, గమేకార్లు (పోటు/వంట) గొల్లవారు, అన్నమయ్య వంశీకులు, పురాణం చెప్పేవారు, సాలె వారు... ఇలా చాలా రకాల మిరాశీలు వుండేవి. ఈ మిరాశీలన్నీ రద్దు చేయటమే ఈ కొత్త చట్టం ముఖ్యవుద్దేశ్యం.

తిరిగి 1990 లో మరో చట్టం ద్వారా మార్పులు తెచ్చారు. మేనేజ్‌మెంటు కమిటీలో అదివరకు ఐదుగురు సభ్యులే వుండేవారు. అందులో ముగ్గురు అధికారులు, ఇద్దరు పాలకమండలి అనధికారసభ్యులు. ఈ ఇద్దరు సభ్యులసంఖ్యను -

ఈ మార్పులలో అయిదుకి పెంచడం జరిగింది. అంటే కమిటీలో మొత్తం ఎనిమిదిమంది సభ్యులైనారు. అనధికార సభ్యులు మొత్తం 10మంది పాలకమండలిలో వుంటారు. మొదటి సంవత్సరం ఐదుగురు మేనేజ్‌మెంటు సభ్యులుగా వుండి, రెండవ సంవత్సరం మిగతా ఐదుగురు మేనేజ్‌మెంటు సభ్యులుగా వుంటారు. మొత్తం పాలకమండలి కాలం 2 సంవత్సరాలు. జాయింటు కార్యనిర్వహణాధికారులు కొండపైన /క్రింద కూడా ప్రభుత్వంచే నియమించబడతారు. వారు అదివరకు ఏ జిల్లాలోనైనా సంయుక్త కలెక్టరు హోదాలో పనిచేసి వుండాలి.

ఈ మార్పులలో అప్పటిదాకా వున్న 'హిందూధర్మరక్షణ సంస్థ' పేరును 'ధర్మ ప్రచార పరిషత్'గా మార్చారు. – 'హిందూ' అన్న పదాన్ని తొలగించారు.

1979 నుండి వచ్చిన చట్టాల్లో తిరుమల ఆలయంతో సహా అన్ని ఆలయాల సంవత్సర ఆదాయంలో 5 శాతం ప్రభుత్వ కామన్ గుడ్ ఫండ్‌కి చెల్లించాలని నిబంధన వుంది. ఆలయాలు నేరుగా ఇతర ఆలయాలకు గాని, ఆధ్యాత్మికసంస్థలకు కాని సహాయం చేయకుండా, ప్రభుత్వం ద్వారా ఈ దానాలు ఇచ్చే ఏర్పాటుకు శ్రీకారం చుట్టబడింది.

2008లో దేవదేయ–ధర్మాదాయ చట్టంలో కొన్ని మార్పులు తెచ్చారు. అందులో ముఖ్యమైనది రాష్ట్రస్థాయిలో ఒక ధార్మికపరిషత్తుని స్థాపించడం. అందులో సమాజంలో అన్నివర్గాల ధార్మికులకు సభ్యత్వం కల్గించడానికి అవకాశం కల్పించడం. దేవాదాయ శాఖ అధికారులు ఈ సంస్థ సలహాల మేరకు పనిచేసే అవకాశం అందులో కల్పించబడింది.

తర్వాత చేసిన మార్పులలో పాలకమండలి సభ్యుల సంఖ్యను 11 నుండి 15 కు పెంచడం జరిగింది.

తిరుమల–తిరుపతి దేవస్థానాల పాలకమండళ్లు మీడియాలో పెద్ద చర్చనీయాంశ మయినాయి. రాజకీయనాయకులకు, శాసనసభ్యులకు ప్రత్యేకంగా ముగ్గురికి సభ్యత్వం ఇవ్వాలని చట్టంలోనే వుంది. అంటే మిగతా సభ్యులు పేరున్న ధార్మికులయి వుండాలన్నది చట్టం స్ఫూర్తి.

కాని, రానురాను అధికారపక్షం ఆ సభ్యత్వాలను కూడా – ఎన్నికలలో ఓడిపోయిన వారికి, పార్టీలు మారి వచ్చిన వారికీ ఇవ్వడం జరుగుతూండటంతో – సభ్యుల ఎంపిక ఆలయ అభివృద్ధి దృష్టిలో పెట్టుకొని కాక, రాజకీయలబ్ధి కోసం చేస్తున్నారన్న భావన భక్తులలో కలుగుతోంది.

పాలకమండలి కాలపరిమితి మొదట 5 సంవత్సరాలతో మొదలై రానురాను రెండు సంవత్సరాలకు పరిమితమయింది. కార్యనిర్వహణాధికారి కూడా మూడు సంవత్సరాలన్నా ఈ పదవిలో వుండాలని చట్టంలో వున్నా, ఈ నిబంధన అమలు జరగడం లేదు. రెండు సంవత్సరాల లోపే కార్యనిర్వహణాధికారులు మారుతున్నారు. వీరందరూ దేవస్థానం బయట నుండి వచ్చేవారు. తిరుమల-తిరుపతి దేవస్థానం గురించి తెలుసుకోవడానికే కొన్ని నెలలు పడుతుంది. అవగాహన చేసుకొని, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలన్న ప్రయత్నం జరిగేలోపే, పాలకమండలి మార్పులు, కార్యనిర్వహణాధికారి మార్పు...! దీనితో నిలకడగా పాలన జరిగే అవకాశం లేకుండాపోయింది.

ప్రతిపాలకమండలీ కొత్తగా రావడం, కొత్త పథకాలకోసం ప్రయత్నం చేయడం, వాటిని ఆచరణలోకి తెచ్చే అవకాశం లేకుండా వారి పదవీకాలం పూర్తవడం జరుగుతోంది. కాలపరిమితి 2 సంవత్సరాలు మించకపోవడంతో, ఎవ్వరికీ దూరదృష్టితో - వచ్చే 10/20 సంవత్సరాల అవసరాల దృష్ట్యా కార్యక్రమాలు చేపట్టే ఉద్దేశ్యాలు కాని, అమలుచేసే ఉత్సాహం కాని లేకుండా పోతున్నాయి. ముఖ్యంగా ధర్మరక్షణ/ధర్మప్రచారం విషయంలో హిందూ సమాజమంతా నాయకత్వం కోసం తిరుమల-తిరుపతి దేవస్థానాలవైపు చూస్తోంది. మత మార్పిడులు అరికట్టడంలో తిరుమల-తిరుపతి దేవస్థానాలు ముఖ్యపాత్ర వహించి, హిందూమతప్రచారకులను, మఠాధిపతులు, పీఠాధిపతులు, ఇతర స్వచ్ఛందసంస్థలను కలుపుకొని కార్యాచరణ ప్రణాళిక వేసి, కార్యక్రమాలు చేయాలని హిందువులు కాంక్షిస్తున్నారు.

పాలకమండలి సభ్యులు, కార్యనిర్వహణాధికారులు, దేవాలయ అధికారులు అందరూ సమర్థులే. కాని వ్యవస్థ అస్తవ్యస్తమై ఒక ప్రణాళికకు కట్టుబడి కొంతకాలమైనా నిబద్ధతతో కార్యక్రమాలు జరపడానికి అవకాశంలేని స్థితి. నేను పదవీవిరమణ చేశాక ఏడు సంవత్సరాలపాటు తిరుమల-తిరుపతి దేవస్థానాలకు సలహాదారుగా వుండడం జరిగింది. ఆ సమయంలో 4 కొత్త పాలకమండళ్లు, వరుసగా ఐదుగురు కార్యనిర్వహణాధికారులతో నేన పనిచేయాల్సి వచ్చింది. అందరూ మంచివారే, సమర్థులే. కాని విషయం అవగాహన చేసుకొని, చేద్దామన్న సంకల్పానికొచ్చేటప్పటికి పాలకమండలి మారటమో, లేదా కార్యనిర్వహణాధికారి బదిలీ కావటమో జరిగేది. కథ మళ్లీ మొదటికి వచ్చేది. చాలా బాధాకరమైన, నిరుత్సాహం కల్గించే పరిస్థితి.

గత 50 ఏళ్ల తిరుమల దేవస్థానాల చరిత్ర చూస్తే కొన్ని కొన్ని సమయాల్లో కార్యక్రమాలు చాలా బాగా జరిగినట్లు అనిపిస్తుంది. చెలికాని అన్నారావుగారు దశాబ్దాల కాలం ఆలయంలో పనిచేశారు. అందులో చాలా సంవత్సరాలు కార్యనిర్వహణాధికారిగానూ, రెండుసార్లు పాలకమండలి అధ్యక్షులుగానూ పనిచేశారు. ఆలయ అభివృద్ధికి ఎంతో కృషి చేసి మంచి ఫలితాలుసాధించారు. తర్వాత అందరు రెండు సంవత్సరాలు, లేదా అంతకన్నా తక్కువకాలం కాని పనిచేయడం జరిగింది.

అంత పెద్ద సంస్థ - 37 విభాగాలు, 10వేలమంది సిబ్బంది - 2000 కోట్లపైన బడ్జెట్టు - రోజూ లక్షలమంది యాత్రికులు, వేలమంది విఐపిలు - కొండకు క్రిందకు తిరగడాలు, ప్రతి నిర్ణయానికి రాజకీయాలు– ఆపైన మీడియాతో యుద్ధాలు... ఊపిరి సలపని పని వ్యవహారం. రోజుకు 17 గంటలు పనిచేస్తే రొటీను పని చేయగలం. కొత్తగా యింకేమన్నా చేయాలంటే ఎంత కష్టమో ఆలోచించాలి. మొదటి ఒకటి రెండు సంవత్సరాలు పని అర్థం చేసుకోవడం, అధికారులను అంచనా వేయడానికే సరిపోతుంది.

ఎంత సమర్థునికైనా ఆ సంస్థలో పనిచేసి సాధించాలంటే, మూడు నాలుగు సంవత్సరాలు వుండగలిగితేనే... నా సూచన - పాలక మండళ్లు, కార్యనిర్వహణాధికారి కాలపరిమితి 5 సంవత్సరాలుగా నిర్ణయించడం. పాలకమండళ్లను ఒక్కసారిగా మార్చకుండా, ప్రతి సంవత్సరం పాలక మండలిలోని 5వ వంతు సీనియరు సభ్యులను పంపించి కొత్తవారిని నియమించడం చేస్తే - పరిపాలనలో నిలకడ వచ్చి కార్యక్రమాలు క్రమపద్ధతిలో ఆటంకాలు లేకుండా జరిగే అవకాశం ఉంటుంది. ఇది చాలా అవసరం. రెండు సంవత్సరాలైనా బోర్డు సభ్యుడుగా పనిచేసినవానికే పాలకమండలి అధ్యక్షపదవి ఇచ్చినట్లయితే, ఆలయ విషయపరిజ్ఞానం కలవారు అధ్యక్షులై తగు నిర్ణయాలు తీసుకొనే వెసులుబాటు కలుగుతుంది.

ఇంతే కాకుండా ప్రభుత్వం ఇటువంటి ప్రపంచప్రఖ్యాతి గల దేవస్థానానికి పాలకమండలిని నియమిస్తున్నప్పుడు, స్థానిక రాజకీయాల దృష్టితో మాత్రమే చూడక వివిధరంగాలలో నిష్ణాతులను ఆలయపాలన, ఆధ్యాత్మికధార్మిక చింతనపరులను ప్రత్యేకంగా ఎంపిక చేయడం ఎంతైనా అవసరం. పాలకమండలి సభ్యులకు, కొత్తగా నియమింపబడిన సీనియరు అధికారులకు ఆలయ ఆచారవ్యవహారాలు, సంప్రదాయాలు, ఆలయచరిత్ర, పౌరాణిక విశిష్టత, అదివరకు తీసుకున్న కీలకనిర్ణయాలు, వాటిని అమలుచేశారా? చెయ్యకపోతే ఎందుకు జరుగలేదు, ఇప్పుడు

అమలులో వున్న పథకాలు, వెంటనే దృష్టి పెట్టవలసిన అంశాల గురించి ఒక అవగాహన కార్యక్రమం నిర్వహించాలి. మాస్టరు ప్లాన్/వెయ్యి కాళ్ల మండపం వివాదన విషయంలో నా అధ్యక్షతన నియమింపబడిన త్రిసభ్య కమిటీ చేసిన ముఖ్యమైన సూచనల్లో ఇదొకటి. చిత్తశుద్ధితో అమలుచేస్తే బాగుంటుంది.

పాలకమండళ్లు శ్రద్ధ వహించాల్సిన ఇంకొక విషయం... పాలకమండలి సమావేశాల్లో, పరిశీలన చేయకుండా, అప్పటికప్పుడు ఎవరో సభ్యుడు ప్రవేశపెట్టిన అంశంపైనో, లేదా చర్చలో భాగంగా వచ్చిన ఏ విషయంపైన కూడా అదే పాలకమండలిలో నిర్ణయాలు తీసుకోరాదు. ఇంతపెద్ద సంస్థ, భక్తుల నమ్మకాలతో, వేలసంవత్సరాల సంప్రదాయాలతో, ఆచారవ్యవహారాలతో ముడిపడినదని మరిచిపోయి తొందరపడి నిర్ణయాలు చేస్తే వివాదాలకు దారితీసే అవకాశం వుందన్న విషయం ఎప్పుడూ విస్మరించరాదు. 'Arising' విషయాలుగా – పరిశీలన చేయబడ్డ ఎజండాలో చేర్చబడ్డ విషయాలపై ఎటువంటి నిర్ణయాలు చేయరాదు. అటువంటి విషయాలు పరిశీలించి రాబోయే సమావేశంలో నిర్ణయానికి పెట్టమని తీర్మానాలు చేయవచ్చు. కాని హడావుడిగా నిర్ణయాలు చేయరాదు. ...అదివరకు వివాదాలకు దారితీసిన చాలా నిర్ణయాలు ఇలా చేసినవే.

తిరుమల-తిరుపతి దేవస్థాన పాలకమండళ్లు ప్రతినెలా సమావేశం జరుపుతున్నా ప్రతి సమావేశంలో 150 నుండి రెండు వందల అంశాలు చర్చకు వస్తాయి. ఇందులో చాలావరకు ఆలయసిబ్బందికి సంబంధించినవి. కొనుగోళ్లకు, కాంట్రాక్ట్‌లకు సంబంధించినవి. వీటి ధ్యాసలో పడి ఇతర ముఖ్యమైన విషయాలు చర్చించడానికి తగిన సమయం చాలదు. ఈ విషయాలు దృష్టిలో వుంచుకొనే 1979 చట్టంలో ఐదుగురు సభ్యులతో మేనేజ్‌మెంటు కమిటీని ఏర్పాటు చేసింది. రొటీను విషయాలు ఈ కమిటీ చూసుకోగలిగితే, పాలకమండలిలో కీలకవిధానవిషయాలపై సమగ్రచర్చకు అవకాశం వుంటుంది. ఇప్పుడు అమలులో వున్న చట్టంలో కూడా ఇటువంటి కమిటీ వుండాలని వుంది. చట్టంలో వున్నా, కొన్ని సంవత్సరాలుగా ఇది అమలుజరగడం లేదు. ఈ విధానం అమలు పర్చాల్సిన అవసరం వుంది.

★ ★ ★

76. తిరుమల మిరాశీలు

దాదాపు వెయ్యి సంవత్సరాల చరిత్ర గల మిరాశీ విధానం... అంటే వంశపారంపర్యంగా ఆలయంలో కైంకర్యాలు చేసే సంప్రదాయాన్ని, రాష్ట్రప్రభుత్వం ఒక్క చట్టంతో రద్దు చేసింది.

చల్లా కొండయ్య గారి అధ్యయనంతో మొదలై, దేవాదాయ ధర్మాదాయ చట్టంలో మార్పులు, శ్రీ ఎన్టీఆర్ (నందమూరి తారక రామారావు) గారి కాలంలో చట్టమై 1996 లో సుప్రీంకోర్టు తీర్పుతో అన్నిరకాల మిరాశీలు, తిరుమల తిరుపతి దేవస్థానాలలోనే కాక, రాష్ట్రంలోని అన్ని దేవాలయాలలో రద్దు చేయబడ్డాయి. సరైన ప్రత్యామ్నాయం ఆలోచించకుండా లేదా అన్ని కోణాల్లో విషయపరిశీలన జరగకుండా అప్పుడప్పుడూ ప్రభుత్వంలో, న్యాయస్థానాల్లో నిర్ణయాలు జరగడం చూస్తూనే వుంటాం... ఎందుకు చేశారంటే కారణాలు లేకపోలేదు... మరి నిర్ణయాల వల్ల మంచి జరిగిందా అంటే, లేదని చెప్పడానికీ లేదు. అంతా మంచే జరిగిందా అంటే- అలా అనీ చెప్పటానికీ లేదు.

★ ★ ★

తిరుమల ఆలయంలో అర్చనా పద్ధతి వైఖానస ఆగమానికి సంబంధించినది. పురాణకాలంలోనే తను ప్రార్థించే గోపాలకృష్ణుని ఆదేశంతో వైఖానస ముని తిరుమలకు వచ్చి, భూమిలో ఉన్న శ్రీనివాస విగ్రహాన్ని బయటకు తీసి, ప్రతిష్ఠించి, పూజాదికాలు మొదలుపెట్టాడు. అతని పూజాసంప్రదాయమే తర్వాతికాలంలో వైఖానస ఆగమంగా ప్రసిద్ధికి వచ్చింది. ఆనాటినుండి ఈనాటి వరకూ వైఖానస ఆగమమే ఆచరణలోవుంది. క్రీ.శ. 7/8 శతాబ్దం నాటి శిలాశాసనాల ఆధారంగా ఆనాటికే తిరుమల కొండపై పూజాదికాలు జరిగేవని తెలుస్తోంది. ఆ తర్వాత రాజకుమారి సమవాయి, యామునాచార్యులు, తర్వాత తిరుమల నంబి, రామానుజులు, అనంతాచార్యులు-

అంటే 10, 11, 12 శతాబ్దాలలో అదే పద్ధతి కొనసాగుతూ వచ్చింది. వైఖానస ఆగమ పద్ధతి ఆలయంలో జరుగుతున్నా, ఆ అర్చకులు వంశపారంపర్యంగా ఆరాధన చేసే వారా అన్న విషయం స్పష్టంగా తెలియదు. కాని, యామనాచార్యులు, తిరుమల నంబి, రామానుజులు, అనంతాచార్యుల వంటి శ్రీవైష్ణవులు తిరుమల ఆలయంతో ఎంతో సంబంధాలు పెంచుకొన్నా, వారు పాంచరాత్రులైనా, వారికి ఆనాటి పాలకుల దగ్గర మంచి పలుకుబడి వున్నా, ఏనాడూ వారు వైఖానస ఆగమం బదులు, తాము ఆచరించే పాంచరాత్ర ఆగమం ఆలయంలో ప్రవేశపెట్టడానికి ప్రయత్నం చేయలేదు.

సంప్రదాయం ప్రకారం వైఖానస ముని తన కల్పసూత్ర విధానాన్ని నలుగురు శిష్యులకు - భృగు, అత్రి, మరీచి, కాశ్యప ఋషులకు బోధించారని వైఖానసుల నమ్మకం. తర్వాత కాలంలో భృగువు 'అధికార' విధానం, మరీచి 'సంహిత' కశ్యపులు 'కాండ', అత్రి 'తంత్ర' విధానాలుగా గురువులు చెప్పిన 'కల్పసూత్ర'ను విస్తారం చేసినట్లు చెప్తారు. మొత్తం వారు రచించిన 10 గ్రంథాలు వైఖానస ఆగమంగా ప్రసిద్ధికి వచ్చాయి. ఆ గ్రంథాల్లో అంశాలు:

1. ఆలయ నిర్మాణం
2. విగ్రహ నిర్మాణం
3. విమాన నిర్మాణం
4. విగ్రహ ప్రతిష్ఠ
5. అర్చన
6. స్నపన అభిషేకం
7. బ్రహ్మోత్సవం
8. ప్రాయశ్చిత్తం
9. జ్ఞాన భాగం
10. యోగ (భక్తిమార్గం)

రామానుజుల కాలంలో ఈ వంశ పారంపర్య విధానం ఆలయంలోకి వచ్చినట్లు భావించవచ్చు. దానికి ఆధారం అనంతాచార్యుడు రచించిన 'వేంకటేశ్వర ఇతిహాసమాల'. వైఖానస అర్చకులకు కూడా సమాశ్రయణం చేయించి ఆలయంలో వంశపారంపర్య అర్చకులుగా కొనసాగించే ఏర్పాటు చేసినట్లు, అనంతాచార్యులు తన గ్రంథంలో వ్రాశారు. కాని దీనిని వైఖానసులు ఒప్పుకుంటారా అన్నది సందేహం...

ఒక కారణం - వైఖానస సంప్రదాయంలో పుట్టుకతోనే వైఖానసులుగా పుట్టాలి. పూజావిధానం తనయుడు తండ్రి దగ్గర నేర్చుకోవాలి. తండ్రే గురువు. వేరే గురువుల విద్యా సంప్రదాయంకాని, దీక్షగానీ లేదు కనుక, అంతకుముందు నుండే ఆలయంలో అర్చకులుగా పనిచేస్తూ వుండే వైఖానసుల పిల్లలే, తర్వాత అర్చకులుగా పనిచేస్తూ వుండి వుండాలి. పాంచరాత్రంలో లాగా శ్రీరామానుజులు సమాశ్రయణం చేసే సంప్రదాయం వైఖానసంలో వున్నట్లు వైఖానసులు ఒప్పుకోరు. కనుక ఇప్పటి తిరుమల వైఖానసులు, తమ పరంపర శ్రీరామానుజుల ముందుకాలం నుండే అనాదిగా, అంటే వైఖానసుల కాలం నుండే అవిచ్ఛిన్నంగా వస్తోందని నమ్ముతారు. దానికి చరిత్రలో ఆధారాలు కన్పడవు. 1000 సంవత్సరాల ఈ అవిచ్ఛిన్న చరిత్ర వుండి ఉండవచ్చని అందరి చరిత్రకారుల అభిప్రాయం. ఈనాటి మిరాశీ కుటుంబాల వంశచరిత్రలు/ వంశవృక్షాలు పురాతనాలే అయినా 1000 సంవత్సరాల వెనక్కు వెళ్లేంత పురాతనాలు కావు.

ఒకే అర్చక కుటుంబంతో మొదలైన ఈ సంప్రదాయం, కొంత కాలానికి రెండు కుటుంబాలై, ఆ తర్వాతి కాలంలో నాలుగు కుటుంబాలుగా విస్తరించి, మిరాశీల రద్దు కాలానికి ఆ నాలుగు కుటుంబాలే వంశ పారంపర్యంగా అర్చకత్వం చేస్తూ వచ్చారు. అర్చక విధానాలను నిర్దేశించేది 'అర్చన' భాగం.

తిరుమల ఆలయంలో అనాదిగా అర్చకులు వైఖానసులైనా, జియ్యంగార్లు, పరిచారకులు, వేదపారాయణదారులు, ఆస్థాన పురుషులు, పౌరాణికులు మాత్రం వైఖానసులు కారు. దాదాపు అందరూ (వేదపారాయణులు తప్ప) పాంచరాత్రులే. ఈ పాంచరాత్రులకు, గర్భగృహప్రవేశపు హక్కు వున్న జియ్యంగార్లతో సహా ఎవ్వరికీ స్వామివారి విగ్రహాన్ని తాకే హక్కు లేదు. ఆ హక్కు ఒక్క వైఖానసులకే. ఈ పాంచరాత్రుల సహాయంతో ఆలయంలో పూజలు చేసే సంప్రదాయం యామునాచార్యుల కాలం నుండి మొదలై తర్వాత తిరుమల నంబి, శ్రీరామానుజులు, శ్రీ అనంతాచార్యుల కాలంలో వేళ్లూని - కందాడై ఆచార్యుల కాలానికి సంప్రదాయంగా స్థిరపడిపోయినాయి. అలా వచ్చిన వాట్లో, జియ్యంగార్లు (వంశపారంపర్యం కాకపోయినా - అంటే చిన జియ్యరు నుండి పెద్ద జియ్యంగారుగా అవడం), ఆస్థాన పురుషులు కూడా మిరాశీలుగా గుర్తించబడ్డారు. అవి కాక ఆలయంలో ఆలయ గొల్ల, తర్వాతికాలంలో అన్నమయ్య వంశం వారు, నైవేద్యాలు తయారు చేసేవారు (పోటుమిరాశీ) కూడా వంశపారంపర్య మిరాశీదారులై - ఆ మిరాశీలకు హక్కు దార్లైనారు.

ఒక రకంగా ఈ విధానం క్రీ.శ. 966 సమవాయి శాసనంతో ఖరారు అయినట్టు భావించవచ్చు. ఎందుకంటే ఆలయ పూజావిధానం ఎలా జరిగేదో స్పష్టంగా తెలియవచ్చేది ఆ శాసనంతోటే. నాలుగు నాళీల మొదటి నైవేద్యం ఈనాటికీ జరగడం గమనించవచ్చు. అర్చకుల భుక్తికి ఈ నైవేద్యంలో చాలా భాగం వాడబడేది ఆ రోజుల్లో. తర్వాతకాలాల్లో దేవాదాయాలతోపాటు అర్చకులకు, ఇతర మిరాశీ దారులకు, ముఖ్యంగా జియ్యంగార్లకు, ఆస్థాన పురుషులకు భూములు ఈనాములుగా ఇచ్చే సంప్రదాయం మొదలైంది...

తిరుమల ఆలయ వైఖానస అర్చకులు– కౌశిక, భరద్వాజ అనే రెండు గోత్రాల వారు. వంశ పారంపర్యం అంటే ఒక్క కుటుంబం వారే వుండి వుండాలి కదా అన్న అనుమానికి తావుంది. దీనికి చరిత్రకారుల, శాస్త్రకారుల ఉద్దేశ్యం... ఆలయంలో ఒకే కుటుంబం (ఒకే గోత్రంవారు) అర్చకులుగా వుంటే, వారి కుటుంబంలో ఎప్పుడన్నా మైల వస్తే – ఆలయంలో అర్చనకు భంగం కలిగే అవకాశం ఉంటుంది. అందుకే రెండు గోత్రాల వారు (బంధువులు కాని) రెండు వేర్వేరు కుటుంబాల వారు మిరాశీదార్లుగా తిరుమల ఆలయంలో వుండటం మనం చూస్తాం.

కౌశిక గోత్రం వారి కుటుంబాలు – పెద్దింటివారు, తిరుపతమ్మగారి కుటుంబం. భరద్వాజ గోత్రం వారి కుటుంబాలు – పైడిపల్లివారు, గొల్లపల్లి వారు, మొదట్లో రెండు కుటుంబాలు మాత్రం వుండే ఈ మిరాశీ అర్చకులు తర్వాత నాలుగు కుటుంబాలయ్యాయి. తర్వాత వారివారి సంతతి రావడంతో, కుటుంబాలు నాలుగే అయినా నేను దేవస్థానాల కార్యనిర్వహణాధికారిగా వున్నప్పుడు రెండు కుటుంబాల్లో ఒక్కొక్కవంతు దారు, మూడవ కుటుంబంలో నలుగురు వంతుదార్లు, నాల్గవ కుటుంబంలో ఎనిమిది మంది వాటాదార్లు వుండేవారు. శతాబ్దాలుగా ఈ నాలుగు కుటుంబాలు ఆలయంలోని అర్చకత్వ బాధ్యతలు నిర్వహిస్తూ వచ్చాయి. మూడు నాలుగు వందల సంవత్సరాల పూర్వం ఈ నాలుగు కుటుంబాలు ఒక ఒప్పందానికి వచ్చాయి – ఒక్క కుటుంబం ఒక్కొక్క సంవత్సరం ఆలయ అర్చక బాధ్యతలు నిర్వహించేటట్లు...! ఈ వంతు సాంవత్సరిక బ్రహ్మోత్సవం తర్వాత మొదలై, మరుసటి సంవత్సరం బ్రహ్మోత్సవాలు పూర్తి అయ్యే వరకూ వుంటుంది. బ్రహ్మోత్సవాల సమయంలో అన్ని కుటుంబాల వారు వంతుదారుకు సహాయంగా వచ్చి, కార్యక్రమ నిర్వహణకు తోడ్పడతారు.

ఆలయ అధికారులు సేవలకు కావల్సిన పూజా నైవేద్య సామగ్రులు అందించేటట్లు, జియ్యంగార్లు వాటిని పరీక్షించి అర్చకులకు అందచేసేటట్లు, అర్చకులు వాటిని ఉపయోగించి, సేవలు జరిగేటట్లు ఏర్పాట్లు చేయబడిన ఆలయ వ్యవస్థలో, ఈ మిరాశీ అర్చకులు, మిగతా రెండు సంస్థల లాగా, ఒక స్వతంత్రప్రతిపత్తి గల వ్యవస్థ. ఈ మూడు సంస్థల కార్యకర్తలు లేకుండా ఆలయంలో ఏ సేవా/కైంకర్యం జరగడానికి వీలులేనట్లు కట్టుదిట్టం చేశారు. ఆలయ సంప్రదాయ, ఆలయ ఆస్తుల పరిరక్షణ కోసం ఈ వ్యవస్థలు ఏర్పాటు చేశారు.

కొన్ని శతాబ్దాలుగా, (ముఖ్యంగా విజయనగర రాజుల పాలనలో మొదలై) ఆలయంలో ఆర్జిత సేవలు, విశేష పూజలూ చాలా ఎక్కువ కావడం వలన, వంతు మిరాశీ అర్చక కుటుంబ సభ్యులు మాత్రమే కైంకర్యం చేయడానికి సరిపోరు కనుక, ప్రాతఃకాలంలోనే ఆలయం తెరిచి, రాత్రివరకూ దర్శనం కొనసాగించడం, రోజుకు వంద నైవేద్యాల దాకా పెట్టే అవసరం కల్గడం వలన, వంతు మిరాశీ దారులు, ఆలయంలో అర్చనాదికాలు చేయడానికి కొందరు వైఖానసులను (మొదట తమ బంధువులతో మొదలై) సహాయకులుగా తీసుకోవడం మొదలైంది. వీరిని గుమాస్తా అర్చకులుగా పిలుస్తారు. వీరికి వారివారి గ్రామాల్లో దేవాలయాలుంటాయి. కొండకు వచ్చి, రెండు నెలలు గుమాస్తాగా కైంకర్యం చేసి వెళ్లేవారు. వీరికి వసతి, భోజనం, జీతబత్తేలు వంతు దారు ఇచ్చేవారు.

కొండమీద కుటుంబంతో వుండే అవకాశం లేదు కనుక రెండు నెలలకు ఒకసారి వీరిని మారుస్తూండటం జరిగేది. వీరేకాక, విశేష సమయాల్లో, అలంకారాలకూ, విశేష పూజలకు, బ్రహ్మోత్సవాలు, వసంతోత్సవాలు, పవిత్రోత్సవాలు, పుష్పయాగం, ఫలయాగం వంటి మహోత్సవాలకు ప్రత్యేకంగా నిష్ణాతులైన వైఖానస ఆగమ పండితులను పిలిపించే సంప్రదాయం మొదలైంది. అలా సొంతంగా కైంకర్యం చేసే పద్ధతి నుండి నెమ్మది నెమ్మదిగా గుమాస్తాలు, ఇతర వైఖానస ఆగమ పండితులచే కార్యక్రమాలు జరిపిస్తూ, వంతుదారులు ఈ కార్యక్రమాలు పర్యవేక్షణ చేసే గుత్తేదారులుగా పనిచేస్తున్నారన్న భావన వ్యాప్తి చెందింది. కొన్ని కుటుంబాలలో వంతు నాలుగు సంవత్సరాలకీ రాక, ఎనిమిది సంవత్సరాలకో, పదహారు సంవత్సరాలకో వస్తుండటంతో, వీరిలో చాలామంది ఇతర వ్యాపకాలు చూచుకొని, వంతు వచ్చిన సంవత్సరం మాత్రం మిరాశీ వంతు అర్చకులుగా వ్యవహరించడం - అలాకూడా పూర్తిగా వుండలేకపోతే, వారి తరఫున కార్యక్రమాల పర్యవేక్షణ చేయడానికి ఒక

ముఖ్య గుమాస్తాను నియమించి కార్యక్రమాలు చేపట్టే పరిస్థితి వచ్చింది. రానురాను కొందరి విషయంలో వారు అర్చక మిరాశీదారులనే కంటే మిరాశీ అర్చక గుత్తేదారులన్న భావన కల్గే పరిస్థితి ఏర్పడింది.

తరతరాలుగా ఆలయాన్ని నమ్ముకున్న ఈ అర్చక మిరాశీదారులు, శతాబ్దాలుగా ఆదాయం సక్రమంగా వున్నా లేక పోయినా, తమ బాధ్యతలు భక్తితో కైంకర్యంగా నిర్వహించేవారు. అంతేకాక, స్వామివారి నిత్యకైంకర్యానికి వాడే అలంకార ఆభరణాల బాధ్యత వీరిదే. బ్రహ్మోత్సవాలలో ఇతర ఉత్సవాలలో, విశేష ఆభరణాలు అలంకారానికి ఇస్తే, వాటి బాధ్యత వీరిదే... ఆలయం బయట ఉత్సవరులను తిరువీథి ఉత్సవాలకు తీసుకువెళ్తే, అప్పుడు కూడా ఆభరణాల బాధ్యత వీరిదే... ఆభరణాలలో రాళ్లు పోయినా, ముక్కలు విరిగిపోయినా, బాధ్యత వీరిదే. మామూలు తరుగులు పోగా, పైన ఏ నష్టం వచ్చినా, భరించాల్సింది వీరే. బ్రహ్మోత్సవాల తర్వాత ఒకరివంతు పూర్తి కాగానే, ఆలయ అధికారులకు అన్ని నగలూ లెఖ్ఖలు చూపి అప్పగిస్తే, వారు తరువాత వంతు దారులకు ఈ నగలు అప్పగించే సంప్రదాయం నడిచేది.

విజయనగర రాజుల కాలంలో విశేష నైవేద్యాలతో ప్రసాదంలో భాగంగా ఈ మిరాశీదారులకు మంచి ఆదాయాలుండేవి. అంతేకాక వారికి ఈనాములుగా భక్తుల నుండి కానుకలే కాక, భూములు, గ్రామాలు కూడా వచ్చే వెసులుబాటు వుండేది. తర్వాత ఆర్కాటు నవాబు కాలానికి, ఆదాయాలు తగ్గిపోయి, ఆలయ గ్రామాలు వీరికి భాగంగా ఇచ్చి, ఆ వచ్చే ఆదాయంతో బతికే పరిస్థితి ఏర్పడింది. ఇంగ్లీషు కంపెనీ పాలనలో ఆ గ్రామాలు కూడా పోయి, నైవేద్యాలు తగ్గిపోయి, భుక్తికి గడవడమే కష్టమయిన పరిస్థితులు వచ్చాయి. తర్వాత మహంతుల కాలంలో, పరిస్థితులు కొంచెం మెరుగుపడినా, వారికి పెద్దగా ఆదాయాలు వచ్చేవని చెప్పలేం. ఈ పరిస్థితులు దాదాపు 20వ శతాబ్దం మధ్య కాలం వరకూ కొనసాగాయి. ఆలయంలో మరల ఆర్జిత సేవలు పెరగడం, ముఖ్యంగా ఎప్పుడో ఒకరోజు జరిగే కళ్యాణాలు ప్రతిరోజు పెద్దసంఖ్యలో జరగడం మొదలయ్యాక, మిరాశీదారుల ఆదాయాలలో గణనీయంగా మార్పు మొదలయింది. ప్రతి కళ్యాణోత్సవానికి వారి భాగం ప్రసాదాలు రావడం, వాటిని ఆలయంలోనే అమ్ముకొని సొమ్ముచేసుకోవడంతో మొదలైంది. కళ్యాణోత్సవాల సంఖ్య పెరగడంతో అలా వారికి వచ్చేభాగం పెరుగుతూ వచ్చింది. అది చివరికి, నేరుగా వారు నైవేద్యం పెట్టినా పెట్టకపోయినా, అన్ని గంగాళాల పడిభక్ష్యాలలోనూ వారికి

భాగాలు ఇవ్వాలని డిమాండు చేసేస్థాయికి చేరింది. కళ్యాణానికి ఒక్క హోమం చేసినా, వారికొచ్చే హోమశేషం అన్ని కళ్యాణాలకూ రావాలన్న వాదంతో ఆలయానికీ, వీరికీ తగాదా మొదలై, కేసుల రూపంలో న్యాయస్థానాలకు చేరాయి.

నైవేద్యాలకు మాత్రమేకాక, ఆర్జితాలకు, భక్తులకు ప్రసాదంగా లడ్డూలు అమ్మకానికి ఆలయం నిర్ణయం చేసినప్పుడు, ఆలయం నైవేద్యం చేసిన ప్రసాదం అమ్మకం లడ్డూలతో కలిపి వాటిని ప్రసాదంగా విక్రయించాలని సంకల్పించినప్పుడు – (వారు నైవేద్యం నేరుగా పెట్టినా పెట్టకపోయినా) అది ప్రసాదం కనుక వారికి వారి భాగం రావాలని మిరాశీ అర్చకులు న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో... ఆలయ పాలకులకు, ఈ మిరాశీ అర్చకులకు విభేదాలు పరాకాష్ఠకు వచ్చి, తిరుపతి కింది న్యాయస్థానాల నుండి ఎన్నో కేసులు సుప్రీంకోర్టు వరకూ వెళ్లాయి. ఆలయ అధికారుల వాదం – "మీరు ప్రత్యేకంగా సేవ చేయని హోమాలకు, హోమశేషంగా పూర్తి హోమద్రవ్యాలు ఎందుకు ఇవ్వాలి? నేరుగా నైవేద్యం చేయని లడ్డూలకు, ఇతర గంగాళాల అన్నప్రసాదానికి, మీకు భాగం ఎందుకు ఇవ్వాలి?"

"మీరు చేయకపోతే, బాధ్యత మీది. మేము చేయడానికి సిద్ధం. అన్ని లడ్డూలు నైవేద్యం చేయడానికి మేము సిద్ధం, ప్రతి కళ్యాణానికి ఎందరు గృహస్థులు వుంటే అన్ని హోమాలు చేయడానికి మేం సిద్ధం. మీకు వీలుకాదని మానేస్తే, మా భాగాలు మేం ఎందుకు వదులుకోవాలి?" అని మిరాశీదారుల వాదం...

"లక్షల లడ్డూలు నేరుగా నైవేద్యం చేయాలంటే, గంటలు పడుతుంది. దర్శనానికి అంతరాయం. ఒక్క హోమం బదులు– 25/30 హోమాలు చెయ్యాలంటే స్థలం లేదు. చేసేది ఒక్క హోమమే కదా! మీరు చేసిన దానికి ప్రతిఫలం ఇస్తాం–" అని దేవస్థానం ప్రతివాదం.

నాలుగు కుటుంబాల మిరాశీ అర్చకులు కలిసి న్యాయస్థానాల్లో కేసులు నడిపేవారు. డా. చెన్నారెడ్డిగారు ముఖ్యమంత్రిగా వున్న సమయంలో శ్రీ రమేశన్ దేవాదాయ శాఖ కార్యదర్శి. అన్నారావుగారి అధ్యక్షతన వున్న తి.తి.దే. పాలకమండలిని రద్దుచేసి, ముగ్గురు సభ్యులతో ఒక సాధికారిక కమిటీని రమేశన్ గారి అధ్యక్షతన తిరుమల తిరుపతి దేవస్థానాలకు నియమించడం జరిగింది. అది వరకు దేవస్థానాల కార్యనిర్వహణాధికారిగా చేసి, అప్పుడు దేవాదాయ కమీషనరుగా వున్న చంద్రమౌళిరెడ్డిగారు ఒక సభ్యుడు. నేను అప్పుడు తి.తి.దే. కార్యనిర్వహణాధికారిగా

వుండేవాడిని. నేను మూడో సభ్యుడిని, ఆ సాధికారిక కమిటీకి కార్యదర్శిని. ఆ రోజుల్లో మిరాశీదార్లకు దేవస్థానానికి వున్న తగాదాలన్నీ క్షుణ్ణంగా పరిశీలించి, ఒక ఒప్పందానికి రావడం మంచిదని, దేవస్థానానికీ అర్చకులకు సత్సంబంధాలుండాలి గాని, ఇలా కోర్టు లావాదేవీల్లో వుండరాదన్న భావనతో - విస్తృత చర్చలు జరిపి - ప్రభుత్వ సమ్మతితో ఒక ఒప్పందానికి రావడం జరిగింది. అది 1979-80లో...

తర్వాత కొద్ది సంవత్సరాలకే ఎన్టీఆర్ (తెలుగుదేశం పార్టీ) అధికారంలోకి రావడం, వారు వంశపారంపర్య నియామకాలనన్నింటినీ రద్దు చేయడానికి చట్టాలు తేవడంతో, ఆలయాలలో పనిచేసే అర్చకులు, ఇతర మిరాశీలన్నీ రద్దయినాయి. దేవదాయ ధర్మాదాయ సంస్థలకు ప్రత్యేక చట్టం (విశ్రాంత న్యాయమూర్తి చల్లా కొండయ్య కమీషన్ నివేదిక ప్రాతిపదికగా) తేవడం, దానిని, మిరాశీదారులు న్యాయస్థానాల్లో వ్యతిరేకించడం జరిగింది. చివరకు 1996 లో సుప్రీంకోర్టు తీర్పుతో ఈ మిరాశీ వ్యవస్థకు శాశ్వతంగా తెరపడింది.

తిరుమల తిరుపతి దేవస్థానంలో ఈ మిరాశీ రద్దుకు గురి అయినవారు, ఆలయ వైఖానస అర్చకులు, ఆలయ ఆస్థాన పురుషులు, ఆలయ గొల్ల, కళ్యాణ కట్ట క్షురకులు, నైవేద్యాలు తయారుచేసే పోటు మిరాశీదారులు. మిరాశీదారులు కాకపోయినా జియ్యంగార్లను ఆలయ ప్రసాదాలలో భాగంతీసుకొంటున్నారు కనుక మిరాశీలుగా పరిగణించి వారికీ - ఆలయ ప్రసాదాలలో వచ్చే భాగం రద్దు చేశారు.

శ్రీ రమణదీక్షితుల వంటి వారు, మిరాశీలు రద్దు అయినాక కూడా ఆలయ ఉద్యోగి అర్చకులుగా కొనసాగటానికి సిద్ధపడ్డారు. 1987లో మిరాశీ వ్యవస్థని రద్దుచేస్తూ ఎన్టీఆర్ ప్రభుత్వం తీసుకొచ్చిన చట్టాన్ని 2007లో రాజశేఖర్‌రెడ్డి గారి ప్రభుత్వం సవరించింది. వంశపారంపర్య అర్చకత్వాన్ని ఒక బాధ్యతగా ఈ చట్టం పేర్కొంది. అప్పుడు ఆలయ అర్చకులుగా మిరాశీదార్ల కుటుంబసభ్యుల్లో అర్హత కల్గిన వారిని ఉద్యోగ అర్చకులుగా తీసుకోవాలని నిర్ణయించడంతో, కొందరు ఆలయంలో అర్చకులుగా చేరారు. మిరాశీలు రద్దయినప్పుడు అప్పటి గుమాస్తాలుగా పనిచేసే తాత్కాలిక అర్చకులందరినీ, ఆలయ అర్చకులుగా వేతనాలపై ఉద్యోగాలు ఇవ్వడం జరిగింది. అటువంటి అర్చక ఉద్యోగులకు మిరాశీదార్లుగా అర్చకవుద్యోగాలకు వచ్చినవారికీ తేడా చూపించే విధానం కూడా 2007 లో మొదలైంది. పాత మిరాశీ వ్యవస్థ ద్వారా వచ్చిన ఉద్యోగులకు ఎక్కువ జీతాలు ఇవ్వడం, ఆ తర్వాత రోశయ్యగారు

ముఖ్యమంత్రిగా వున్నప్పుడు వారికి మరికొన్ని ప్రత్యేక సదుపాయాలు ఇవ్వడంతో - ఆలయంలో కొంత అనిశ్చిత పరిస్థితులు నెలకొన్నాయి. మిరాశీ అర్చకులు తమ మిరాశీలను పునరుద్ధరించినట్లు భావిస్తుంటే- ఆలయ పాలకులు వారిని ఆలయ ఉద్యోగులుగానే పరిగణించే పరిస్థితి నెలకొంది. ఈ అర్చకులకు, అదివరకు గుమాస్తాలుగా చేసి అర్చకులుగా నియమింపబడిన వారికి, విధులు ఒక్కటైనా జీతభత్యాలలో, ఇతర వసతులలో తేడా ఎలా చూపుతారన్న ప్రశ్న ఎదురైంది. ఈ విషయంలో ఇప్పటికీ స్పష్టత లేదు.

గతంలో అర్చక మిరాశీదారులు విగ్రహాలకు వాడే నిత్య అలంకార ఆభరణాల బాధ్యత వహించేవారు. ఇప్పుడు ఆ బాధ్యతలని ఆలయ ఉద్యోగులైన అర్చకులు, ఆలయ అధికారులు వహించాలి... ఈ విషయంలో పూర్వం వుండే విధానాన్నే అనుసరిస్తున్నా, ముందుముందు కాలంలో కొన్ని ఇబ్బందులు వచ్చే అవకాశం వుంది. మిరాశీలున్నప్పుడు ఆలయ సంప్రదాయాలు, పూజల విషయాల్లో మిరాశీ అర్చకులకు కొంత స్వతంత్ర ప్రతిపత్తి ఉండేది. వారి ఆమోదం లేకుండా కొత్త సంప్రదాయాలు ప్రవేశపెట్టే అలవాటు లేదు. కాని ఇప్పుడు ఈ అర్చకులు (ఆలయ ఉద్యోగులు) స్వతంత్రంగా వ్యవహరించే అవకాశం లేదు. ఆగమ సలహామండలి ఆమోదం తీసుకోవాలి. కాని, ఆ సలహా మండలి సభ్యులను నియమించే అధికారాలు దేవస్థాన పాలకమండలివే. జియ్యంగార్ల సలహా తీసుకోవాలి. కాని జియ్యంగార్లు కూడా వారి స్వతంత్ర ప్రతిపత్తి కోల్పోయి, దేవస్థానం వారు ఇచ్చే ఆర్థిక సహాయంతో కార్యక్రమాలు చేసే పరిస్థితి వుంది. ఆచార్య పురుషుల విషయానికొస్తే, వారందరూ నామమాత్ర ఆచార్య పురుషులే కాని, దేవస్థానాన్ని నిర్దేశించగల పాండిత్య ప్రతిభ కలవారు కారు. వారు కొన్ని దశాబ్దాల క్రితమే ఆలయ నిర్వహణలో పట్టు కోల్పోయారు.

అలా, వెయ్యి సంవత్సరాలు మిరాశీ అర్చక వ్యవస్థ, జియ్యంగార్ల వ్యవస్థ, ఆలయ పాలక వ్యవస్థలనే మూడు స్వతంత్ర ప్రతిపత్తి గల వ్యవస్థలు, సంయుక్తంగా ఆలయ సంపద, సంప్రదాయ, పూజా విధానాలను సమర్థంగా నిర్వహించిన పరిస్థితి నుండి మొత్తం అధికారాలను రాజకీయ నాయకులు నియమించిన పాలకమండలి/ అధికారులకు కట్టబెట్టడం జరిగింది. అది ఎంతవరకు సఫలమవుతుందో కాలమే నిర్ణయించాలి.

★ ★ ★

జియ్యంగార్ల విషయం వేరేచోట విపులంగా చర్చించటం జరిగింది. ప్రస్తుతం సంవత్సరానికి కోటి రూపాయల దాకా ఇద్దరు జియ్యంగార్లకు వారు ఆలయంలో కార్యక్రమాలు చేయడానికి తి.తి.దేవస్థానం వారు ధనసహాయం చేస్తున్నారు. తిరుమల తిరుపతి ఆలయాలలో కైంకర్యం చేసేటప్పుడు జియ్యంగారి ప్రతినిధి తప్పని సరిగా ఉండాలి. పూజాకార్యక్రమాలే కాదు. హుండీల లెక్కింపు (పరకామణి) లాంటి ఇతర విషయాలలో కూడా జియ్యంగారి ప్రతినిధులు వుండే సంప్రదాయం వుంది. మఠాల నిర్వహణ, ఆలయ కార్యక్రమాలకు దాదాపు 40 మంది ఏకాంగులు గుమాస్తాలను జియ్యంగార్లు నియమించి పోషించాలి. మిరాశీలు రద్దయ్యాక, రెండు సంవత్సరాల కాలం జియ్యంగార్లు చాలా కష్టాలు పడ్డారు. ఆలయం నుండి వచ్చే ఆదాయం పోయి, ఇతర ఆదాయాలు లేక, కైంకర్యం వదలలేక కొందరు భక్తుల ఆదరణతో అతికష్టంమీద కార్యక్రమాలు నడిపారు. ఆలయ అవసరాలు, జియ్యంగార్ల పరిస్థితి చూసి సంవత్సరానికి రు. 50 లక్షలతో ప్రారంభించి ఈనాటికి కోటి రూపాయలదాకా పాలకమండలి జియ్యంగార్లకు సంవత్సరానికిస్తోంది. దాని పర్యవసానం - ఎవరు ఒప్పుకొన్నా, ఒప్పుకోకపోయినా - జియ్యంగార్లు స్వతంత్రప్రతిపత్తి కోల్పోయి, ఆలయ పాలకుల దయాదాక్షిణ్యాలపై ఆధారపడే దుఃస్థితి వచ్చింది.

ఆచార్య పురుషుల విషయం వేరే చోట సమగ్రంగా చర్చించాం. ఆలయ సంప్రదాయ రక్షణే కాక, అనాదిగా ధర్మప్రచార కార్యక్రమాలు చేసే ఈ వ్యవస్థ కొన్ని దశాబ్దాల క్రితమే - ముఖ్యంగా ఈనాములు రద్దయిన తర్వాత నిర్వీర్యమైపోయింది... స్వతంత్రంగా బతకాలని వీరికి గ్రామాలు, భూములు మాన్యాలుగా ఇవ్వబడ్డాయి. భూములు పోయి, ఆదాయాలు లేక కొంతమంది నెమ్మదిగా వేరే వ్యాపకాలకు వెళ్లిపోగా, కొందరు నామమాత్రంగా ఆలయ మర్యాదల కోసం పోలేక మిగిలిపోయారు. ఆశించిన బాధ్యతలు నిర్వహించే పరిస్థితిలో లేరు.

పోటు మిరాశీదారులు... నేవైద్యాల తయారీ కోసం మొదలైన ఈ వ్యవస్థ, ఒకరకంగా అందరు మిరాశీదారుల కన్నా బలమైన వ్యవస్థగా రూపుదిద్దుకుంది. కారణం వారికి అన్నప్రసాదాలు, పడిప్రసాదాలలో ఎక్కువ భాగం వుండటం. ప్రసాదాలు పెరిగే కొద్దీ వీరి ప్రాభవం పెరిగింది. మిరాశీలు రద్దయినాక - పోటు మిరాశీలు పోయి, వారి దగ్గర పని చేసే/ప్రసాదం తయారుచేసే బ్రాహ్మణులందరూ ఆలయంలో ఉద్యోగులైనారు... కావల్సినన్ని లడ్డూలు ఇతర ప్రసాదాలు వీరితో చేయించుకోలేక, గుత్తేదారులను కూడా ఏర్పాటు చేసింది దేవస్థానం. కొంత ప్రసాదం ఆలయ ఉద్యోగంలో

వున్నవారి ద్వారా, చాలా ఎక్కువ ప్రసాదం గుత్తేదారు నియమించిన బ్రాహ్మణుల ద్వారా ఇప్పుడు తయారవుతోంది. వంశపారంపర్యపు హక్కు లేదు.

ప్రసాదంలో వాటాలు లేవు.

ముందు నిర్ణయించిన ప్రకారం చెల్లింపులు జరుగుతాయి.

కళ్యాణ కట్ట మిరాశీలు - మిరాశీలు రద్దయ్యాక, అంతవరకూ పనిచేస్తున్న క్షురకులు, ఆలయ ఉద్యోగులుగా నియమింపబడ్డారు. ఇప్పుడు అలా పని చేస్తున్న ఉద్యోగ క్షురకులు, వీరు కాక కాంట్రాక్టు పద్ధతిపై పనిచేస్తున్న మరికొందరూ, వీరేకాక, స్వచ్ఛంద సేవకులుగా పనిచేసే మరికొందరు ఈ కళ్యాణకట్ట కార్యక్రమంలో వున్నారు.

గొల్ల మిరాశీ రద్దయి, ఆలయ ఉద్యోగులుగా అదే కుటుంబం వారు కొనసాగుతున్నారు.

అన్నమయ్య మిరాశీ... సుప్రభాతంలో, ఏకాంత సేవలో సంగీతసేవ, కళ్యాణోత్సవాలలో కన్యాదాన సేవ చేసే ఈ అన్నమయ్య వంశీకుల మిరాశీ కూడా రద్దయింది. ఇప్పటికీ వారి వంశీకులనే ఈ కార్యక్రమాలకు దేవస్థానం ఉద్యోగులుగా నియమించి వాడుతున్నారు. సంగీత విద్వాంసుల పిల్లలు విద్వాంసులు అవుతారన్న గ్యారంటీ లేదు కదా! వీరికి సంగీతజ్ఞానం బాగా వున్నంతకాలం, ఈ అవకాశం నిలబెట్టుకోగలరు.

ఇవికాక, ఆలయంలో సహస్ర నామార్చన జరిగేటప్పుడు నామాలు చెప్పడానికి, విశేష దినాల్లో పురాణం చెప్పడానికి, బ్రహ్మోత్సవాలలో గొడుగులు తెచ్చేందుకు వున్న మిరాశీలు లాంటివి కూడా రద్దయినాయి.

తిరుమల ఆలయంలో మిరాశీ వ్యవస్థ గురించి ప్రత్యేకంగా ఆలయ మిరాశీ అర్చక వ్యవస్థ, జియ్యంగార్ల గురించి, ఈ మధ్యకాలంలో అమెరికాలో నివసిస్తున్న డాక్టర్ శ్రీధర బసవరాజుగారు ప్రత్యేక అధ్యయనం చేసి, ఒక గ్రంథం రచించారు. కొద్దికాలంలో అది ప్రచురితమై ఆసక్తిగల పాఠకులకు అందుబాటులోకి రాగలదని ఆశిద్దాం.

★ ★ ★

77. 700 ఏళ్లు గోడ వెనక దాక్కున్న దేవుడు

అకస్మాత్తుగా ఒకసారి నా దృష్టి తిరుపతి గోవిందరాజస్వామి గుడిలో ఖాళీగా ఉన్న ఒక గర్భాలయంమీద పడింది.

సింహద్వారానికి, ప్రధానగోపురానికి ఎదురుగా ఉండే గుడిలో ఖాళీ గర్భాలయం ఏమిటి? (గోవిందరాజ ఆలయం కుడిప్రక్కగా వుంది.)

1978-82 కాలంలో నేను టి.టి.డి. ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా వున్నప్పుడు ఈ గుడికి వెళ్తే అక్కడ ఖాళీ గర్భాలయం ఎందుకుంది - అన్న కుతూహలం కొద్దీ అర్చకుల్ని పిలిచి అడిగాను. ఎవరూ నాకు సంతృప్తికరమైన సమాధానం ఇవ్వలేదు.

ఆ గర్భాలయంలో పరిశీలనగా చూస్తుంటే, నాకెందుకో గుడి లోపల వెనక గోడ కొంచెం ముందుకి జరిపి కట్టిందిగా అనిపించింది. బహుశా ఈగోడ వెనకాల ఏదన్నా గది వుందేమో! అందులో ఏవైనా అమూల్యమైనవి దాచివున్నాయేమో! ఒకవేళ విగ్రహాలు ఏవైనా వుండి వుంటే...? అప్పుడే నాకు సాధు సుబ్రహ్మణ్యశాస్త్రిగారి పుస్తకంలో చదివిన పార్థసారథి కోవెల విషయం స్ఫురణకు వచ్చింది.

★ ★ ★

అసలు ఇది గోవిందరాజస్వామి గుడి కాదు. ముఖద్వారానికి ఎదురుగా ఉండటంవల్ల ఇది మొదట పార్థసారథి ఆలయం. దానికి ఉత్తరం దిక్కున తర్వాత గోవిందరాజస్వామి ప్రతిష్ఠ జరిగిఉండాలి. శాసనాలలో క్రీ.శ. 13వ శతాబ్దం ముందరే కాని తరువాతి కాలంలో 'పార్థసారథి స్వామి' ఆలయం ప్రసక్తే రాలేదని సాధు సుబ్రహ్మణ్య శాస్త్రిగారి పుస్తకంలో వుంది. 13వ శతాబ్దం నుండీ శ్రీగోవిందరాజస్వామి వారి ప్రస్తావనే కాని, పార్థసారథి స్వామి ప్రస్తావన ఎక్కడా కనపడలేదంటారు. రామానుజుల కాలంలో గోవిందరాజస్వామి ప్రతిష్ఠ జరిగి ఉండవచ్చుని, అప్పటికి పార్థసారథి స్వామి ఆలయంలో

పూజవిధులు జరుగుతూ వుండి వుండాలనీ, లేకపోతే గోవిందరాజస్వామి విగ్రహాన్ని ముఖద్వారానికి ఎదురుగా ఉన్న ఈ కోవెలలోనే ప్రతిష్ఠ చేసి ఉండేవారని భావిస్తారు. 13వ శతాబ్దానికి ముందు పార్థసారథి స్వామి ఆలయం మూసివేసి ఉండవచ్చని ఆయన భావించారు.

సాధు సుబ్రహ్మణ్యశాస్త్రిగారి పుస్తకంలో (పు. 151) లో తిరుపతి నరసింహతీర్థం పశ్చిమవైపు చెరువుగట్టుపై 8 అడుగుల పైబడ్డ నీలరాయి గోవిందరాజస్వామి విగ్రహం ఉందని, అది రామానుజులు ప్రతిష్ఠ చేసిన గోవిందరాజస్వామి విగ్రహంకావచ్చని, ముస్లిం దండయాత్రల్లో విగ్రహాన్ని కొంత విచ్ఛిన్నం చేశారనీ, అది పూజకు పనికిరాదు కనుక దాన్ని ఈ చెరువు గట్టుకుచేర్చి ఉంటారని ఉంది. అది ఆయన భావన. అది ఎప్పుడు జరిగిందో ఇదమిత్థంగా చెప్పటానికి ఆధారాలు లేవు.

ఇప్పుడు గోవిందరాజస్వామి ఆలయంలో పూజలందుకుంటున్న విగ్రహం ఆ తర్వాత చేయించినదైనా అయి ఉండాలి. లేదా శాస్త్రిగారి అభిప్రాయం ప్రకారం కుళొత్తుంగచోళుడు సముద్రంలో పారవేయించిన విగ్రహాన్ని చిదంబర సముద్రతీరం నుండి తెప్పించి ఇక్కడ ప్రతిష్ఠించి ఉండవచ్చు. కాని దానికి తగిన ఆధారాలు లేవని ఆయనే చెప్పారు.

పార్థసారథి స్వామి ఉత్సవవిగ్రహం ఇప్పుడు గోవిందరాజస్వామి ఆలయంలో ఉంది. అంటే ఆ కాలంలో ఉత్సవవిగ్రహాలను భద్రత కోసం చిదంబరం నుంచి బయటికి తీసుకొనివచ్చి అర్చకులు పారిపోయి తిరుపతి వచ్చారు. రామానుజుల కాలంలో ఆ ఉత్సవ విగ్రహాలకు చిదంబరంలోని మూలవిగ్రహంలా విగ్రహం చేయించి (గోవిందరాజు) పార్థసారథి ఆలయం ఉత్తరం వైపు ఆలయం కట్టించి, అందులో గోవిందరాజుల విగ్రహప్రతిష్ఠ చేసినట్లు ఆధారాలున్నాయి. పార్థసారథి ఆలయం ఆ రోజుల్లో ప్రధాన ఆలయం కనుక ముస్లింల బారినుండి సంరక్షించడానికి, ప్రతిష్ఠించిన రాతివిగ్రహాలు తీసుకొని వెళ్లలేరు కనుక, పార్థసారథి స్వామి ఆలయ గర్భగృహద్వారానికి గోడ కప్పి మూసివేసి ఉంటారు. అలా మూసివేయలేదు కనుక గోవిందరాజస్వామి విగ్రహాన్ని ముస్లింలు ఛిన్నం చేయగలిగారు అని నాకు తోచింది.

★ ★ ★

పండితులతో చర్చించాక నాకెందుకో ఆ గోడ కొట్టించి లోపల ఏమి ఉన్నాయో చూడాలనీ, ఒక వేళ అందులో ఛిన్నమైన విగ్రహాలు ఉంటే – వాటిని తీసేసి కొత్త

విగ్రహాలు చేయించి పునఃప్రతిష్ఠ చేస్తే బాగుంటుందని అనిపించింది. ఎందుకంటే, గోవిందరాజస్వామి ఆలయం మహాద్వారం ఎదురుగా పాడుపడి మూసివేసిన గుడిని ఏడు శతాబ్దాలుగా అలా వదిలేయడం మంచిదిగా నాకు తోచలేదు. ఆగమపండితులతో, అర్చకులతో చర్చించితే - ఇదమిత్థంగా ఏమీ చెప్పలేకపోయారు.

నాకు అధికారం ఉన్నప్పుడు గోడ కొట్టించి చూడటానికి నేను ఎవర్నీ సంప్రదించ నవసరం లేదు. కాని ఆగమనియమాలు చాలా సున్నితమైనవి.

ఏ మతంలోనైనా ఇది చాలా సున్నితమైన అంశం. వాళ్ల వాళ్ల సంప్రదాయాలకి అనుగుణంగా ఆలయనిర్మాణాలు జరుగుతాయి. హిందూసంప్రదాయంలో ఆలయనిర్మాణం విషయంలో చాలా శాస్త్రబద్ధమైన నియమాన్ని పాటించటం అనాదిగా జరుగుతోంది. మన ఋషులు, మునులు వేదాలనుంచి సంగ్రహించిన జ్ఞానంతో వివిధ ఆగమాలు తయారుచేసి, నియమనిబంధనలను నిర్దేశిస్తూ, చాలా కట్టడి చేశారు. ప్రతిష్ఠించదల్చుకున్న దేవతను బట్టి పాటించవలసిన పద్ధతులు, ప్రమాణాలు ప్రవేశపెట్టారు. ఇవే ఆగమాలుగా ఇప్పటికీ వాడుకలో ఉన్నాయి.

వైష్ణవ ఆలయాల విషయంలో చూస్తే - శ్రీవైష్ణవం విషయంలో 'పాంచరాత్ర, వైఖానస' అనే రెండు రకాల ఆగమవిధానాలు అమల్లో వున్నాయి. వైష్ణవులు (మధ్వులు) మధ్వాచార్య క్రోడీకరించిన తంత్రసారాన్ని ప్రమాణంగా స్వీకరిస్తారు.

శైవుల విషయంలో శైవాగమం ప్రామాణికంగా తీసుకోబడుతోంది. అలాగే శాక్తేయం కూడా.

ఆలయనిర్మాణానికి ఎలాంటి స్థలాన్ని, ఎలాంటి ప్రాంతంలో ఎంపిక చేయాలో, ప్రతిష్ఠించదల్చిన విగ్రహం ప్రమాణాన్నిబట్టి గర్భగృహం, విమానపరిమాణాలు, ప్రాకారాలు, ద్వారాల సంఖ్య, మండపాల తీరు, మండపాల వినియోగం తీరు, నైవేద్యానికి అవసరమైన పోటు (వంటశాల) ... వగైరా విషయాలన్నింటినీ ఆగమాలు స్పష్టంగా నిర్దేశిస్తున్నాయి.

ఆగమపండితుల కంటే ఆలయాలను కట్టి విగ్రహాలను తయారుచేసే స్థపతులకు ఇవన్నీ బాగా తెలుసు. శిల్పకళాశాలల్లో ఈ విషయాలను ప్రత్యేకశ్రద్ధతో బోధిస్తారు.

ఆలయనిర్మాణం జరిగి, విగ్రహప్రతిష్ఠలు ఎలా చేయాలీ, ఏయే పూజావిధానం పాటించాలీ, ఆ తరువాత నిత్యనైమిత్తిక సేవలు ఎలా జరగాలీ, మంత్ర సహిత

ఉత్సవాలు, అమంత్రణోత్సవాలు ఎలా చేయాలీ, ఆలయం లోపల సేవలు ఎలా జరగాలీ, ఆలయాల బయట ఉత్సవాలు చేసేటప్పుడు పాటించాల్సిన నియమాలు ఏమిటి... ఇవన్నీ ఆగమపండితులు మాత్రమే చెప్పగలరు. ఆగమ నియమాలను ఆచరించేది అర్చకులు. ఎలాంటి సందేహాలు వచ్చినా అర్చకులు, ఆలయ పాలకమండలి సంప్రదించాల్సింది ఈ ఆగమ పండితుల్నీ, ఆచార్యపురుషుల్నీ మాత్రమే. ప్రతి ఆలయంలో ఏదో ఒక ఆగమం మాత్రమే పాటించటం జరుగుతుంది. తిరుమల ఆలయాల విషయంలో పూర్తిగా అలా కాదు. పూజావిధానం అంతా వైఖానస ఆగమం ప్రకారమే వుంటుంది. కాని యామునాచార్యులు, తిరుమల నంబి, రామానుజాచార్యుల కాలంనుండి, ఆలయ పూజావిధానాల్లో, ఆచార వ్యవహారాల్లో కొన్ని పాంచరాత్రపద్ధతులు పాటిస్తూ రావటం గురించి ఇదివరకే చెప్పుకున్నాం.

ఈ నేపథ్యంలో - గోవిందరాజ స్వామి ఆలయప్రాంగణంలో ఖాళీగావున్న గర్భగృహాన్ని చూసినప్పుడు గోడ కొట్టించి చూద్దామని నాకు అనిపించినా, పైన చెప్పిన ఆగమనియమాలు, ఆగమపండితుల ప్రతిస్పందనల స్థాయి... నా మనస్సులో మెదిలాయి. ఏదో చేద్దామని సాహసం చేసి కందిరీగల తుట్టెను కదుపుతున్నానా అన్న భయం ఒకవైపు, అయినా చేసి చూసి తీరాలన్న ఆరాటం మరోవైపు, నన్ను వెంటాడాయి. అందుకే ముందుగా స్థపతుల్ని పిలిపించి బయటనుంచీ, లోపలనుంచీ గర్భగృహం కొలతలు తీయించాను. ఖాళీగావున్నది గర్భగృహమేనా అన్నది తేల్చమన్నాను.

వాళ్లు బయటా లోపలా అంతా పరీక్షించాక చెప్పిందేమిటంటే- బయటనుంచి వున్న కొలతల ప్రకారం అది గర్భగృహం అయివుండాలి. కాని లోపల కొలతల ప్రకారం చూస్తే, పరిమాణం తగ్గింది. అంటే, గర్భగృహంలో మనకంటికి కనిపిస్తున్న గోడకి వెనకాల ఇంకో గది వుండివుండాలి గదా!

ఈ ఆలయం రామానుజాచార్యుల వారికంటే ముందే వున్నప్పటికీ, ఆయన కాలంలో గోవిందరాజు విగ్రహప్రతిష్ఠ జరిగివున్నప్పటికీ, ఆయన వారి సంప్రదాయమైన పాంచరాత్ర పూజావిధానాన్ని కాక, తిరుమల కొండమీద చేసినట్లే వైఖానస విధానం ప్రవేశపెట్టారు. అలా అర్చకులు కూడా వైఖానసవిధానాన్ని పాటించేవారే వచ్చారు. కాని మత పెద్దలైన జియ్యంగార్లు మాత్రం పాంచరాత్రవిధానానికి చెందినవారు.

ఇవన్నీ దృష్టిలో ఉంచుకునే జియ్యంగార్లు, అర్చకులు, ఆగమ సలహాదార్లు, స్థపతులు... అందర్నీ నేను సంప్రదించటం జరిగింది.

ఆ కాలంలో ఎందుకు మూశారో? తెరిస్తే ఏమి అనర్థమో? ఏడువందల ఏళ్లుగా తెరవంది ఇప్పుడు ఎందుకు తెరవడం? తొందరపడుతున్నామేమో! ఏదో బలమైన కారణం లేకుండా ఆ కాలంలో ఆలయం మూసేవారా? ఇలా శాస్త్రవిషయం, ఆగమవిషయం తప్పించి ఇతర నమ్మకాలపైన, 700 సంవత్సరాలు మూసివేసిన సంప్రదాయం పైన వాళ్ల సూచనలు...

నేను అడిగింది:

"ఆగమం ఈ విషయంలో ఏం చెప్తుంది? గోడ కొట్టించి గర్భాలయంలో ఏముందో చూడటం ఆగమవిరుద్ధమా?"

"లోపల ఛిన్నమైన విగ్రహాలు ఉంటే, ఆగమం ప్రకారం వాటిని తొలగించి కొత్త విగ్రహాలు ప్రతిష్ఠ చేయించవచ్చా?"

"లోపల విగ్రహాలు బాగున్నట్టయితే – ఆ విగ్రహాలకు మళ్లీ పూజలు మొదలుపెట్టవచ్చా? పెట్టాలంటే సంప్రోక్షణ చేయటానికి ఆగమం ఒప్పుకుంటుందా?"

ఇలా ఎంతో పెద్ద ఆలయాన్ని, అందులో ఇంకా ఎన్నో ఆలయాలు గల ఈ ప్రాంగణంలో ముఖద్వారానికి ఎదురుగా ఉన్న ప్రధానఆలయాన్ని ఇలా మూసిపెట్టి ఉండటానికి ఆగమం ఒప్పుకుంటుందా?

ఆగమ అభ్యంతరాలు ఏమీ లేవని, గోడ కొట్టించి లోపలి పరిస్థితులు చూశాక, ఆగమశాస్త్రబద్ధంగానే కార్యక్రమం చేపట్టవచ్చునీ, అర్చకులు/ఆగమపండితులూ సలహా ఇచ్చారు. కాని 700 సంవత్సరాల తర్వాత చేస్తున్నాం, తొందరపడవద్దనీ, అయినా అలా పూజాపునస్కారాలు లేని గర్భాలయం ఆలయమహాద్వారానికి ముందు ఉండటం మాత్రం మంచిది కాదనే అనిపిస్తోందనీ వ్యాఖ్యానించారు. "మీరు కార్యనిర్వహణాధికారి కనుక – మీకు ఎలా ఉచితమని తోస్తే, అలా చేయండి" అని కూడా సలహా ఇచ్చారు. నాకెందుకో గోడ కొట్టించి, ఏదైనా చేసి ఆలయానికి పూర్వవైభవం తేవాలనిపించింది.

అలా నేనక్కడే నిలబడి జాగ్రత్తగా గోడలు కొట్టించి, రాయి రాయి తీసి చూశాం. ఎంతోసేపు పట్టలేదు. 2 గంటలలో మొత్తం అడ్డంగావున్న ద్వారాన్ని మూసివేసిన గోడ తీసేశాం.

లోపల శ్రీపార్థసారథి స్వామి, రుక్మిణీసత్యభామలతో ఉన్నారు. విగ్రహాలను స్థపతులతో, అర్చకులతో చాలా నిశితంగా పరీక్ష జరిపించాం. మూడు విగ్రహాలూ

చెక్కుచెదరక చాలా బాగున్నాయని తేలింది. ఆగమపండితులు, స్థపతులు, అర్చకులు ఆ విగ్రహాలు పూజకు పనికి వస్తాయని, శాస్త్రంలో చెప్పినట్లు పునఃప్రతిష్ఠ, అష్టబంధనం, సంప్రోక్షణం చేయించాలనీ అన్నారు.

మహావైభవంగా చేయించాం.

★ ★ ★

ఈనాడు మీరు గోవిందరాజస్వామి ఆలయ ముఖద్వారం ముందు లోపలికి వెళ్లగానే చూసే స్వామే ఈ పార్థసారథి. రుక్మిణీసత్యభామలతో వుంటారు. చాలా అందమైన విగ్రహాలు.

నా ఉద్దేశ్యం ముస్లిం దండయాత్రకు వెరసి, విగ్రహాలను వారు పాడు చేయకుండా ఉండటానికి వీలుగా గర్భాలయంలో గోడతో ఆ రోజుల్లో మూసేసి వుంటారు...

అలా 700 సంవత్సరాల తర్వాత ఇలా స్వామివారిని వెలికి తెచ్చి, పూజాపునస్కారాలు మరల ప్రారంభించే భాగ్యం నాకు కల్గడం ఏనాడో నేను చేసుకున్న పుణ్యం!!

★ ★ ★

78. క్రిమినల్ కేసులు పెట్టించిన కళ్యాణ వేంకటేశ్వరుడు!

ఒక్కోసారి మంచిపనులు చేయాలంటే కూడా చట్టాన్ని ఉల్లంఘించాల్సి రావచ్చు.

అదే జరిగింది శ్రీనివాసమంగాపురం ఆలయ పునరుద్ధరణ విషయంలో.

పాడుబడిన ఆలయంలా ఉండిపోయి, ప్రభుత్వాలు పట్టించుకోక, పురావస్తుశాఖ 'అతిభద్రత' మధ్య పొట్టురాలిపోతున్న ఈ ఆలయాన్ని పునరుద్ధరించాలని 1980లో నేను ప్రయత్నం చేసినప్పుడు - పురావస్తుశాఖ నాకు నోటీసులు పంపింది. నామీద క్రిమినల్ కేసులు పెట్టింది.

కాని, చరిత్రపరంగా చూసినా, ఇతిహాసపరంగా చూసినా శ్రీనివాసమంగాపురం ఆలయం తిరుమల క్షేత్రంలాగా నిత్యసేవలతో వైభవోపేతంగా అలరారి తీరాల్సిన క్షేత్రమే!

★ ★ ★

చంద్రగిరికి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ కళ్యాణ శ్రీనివాసుని ఆలయం శ్రీనివాస మంగాపురం గ్రామంలో - చంద్రగిరి నుండి తిరుమల కొండకు కాలిబాటలో ఉంది.

పురాణభాగంలో చెప్పుకొన్నాం. నారాయణవనంలో ఆకాశరాజు పుత్రిక పద్మావతిదేవిని పెండ్లి చేసుకొని శ్రీనివాసుడు మామగారిచ్చిన సారెలు, నూతన వధువుతో కొండకు బయలుదేరి, దారిలో అగస్త్యముని ఆశ్రమానికి వచ్చాడనీ. తాను పెండ్లి అయ్యాక ఆరునెలలు కొండకు వెళ్లనని సంకల్పం చేసుకొన్నాక, అక్కడే భార్య పద్మావతీదేవితో గడిపాడనీ ఇతిహాసం. ఇప్పటికీ దానికి కొద్దిదూరంలో అగస్త్యముని ప్రతిష్ఠ చేశాడని చెప్పుకొనే అగస్త్యేశ్వరాలయం తొండవాడలో ఉంది.

పెద్ద ప్రాకారం లోపల ఐదడుగుల ఎత్తైన రాతిపునాది రాళ్లపైన అందంగా మల్చబడిన సుందరమైన ఆలయం ఈ శ్రీనివాసమంగాపురం ఆలయం. చాలా విశాలమైన ఆస్థాన మండపం. చాలా ఎత్తైన ద్వారాలు. కొండమీద ఉన్నట్లే స్నపనమండపం, ఆ లోపల శయనమండపం, ఆ లోపల గర్భాలయం. ఇక్కడి శ్రీనివాసుని విగ్రహం కూడా కొండమీద శ్రీనివాసుడంత పెద్దదే.

ఈనాడు మనం ఈ శ్రీనివాస మంగాపురం వెళ్తే - నిత్యకళ్యాణంతో వైభవంగా కొండమీద శ్రీనివాసునిఆలయంలో ఉన్నట్లున్న భక్తిభావం కల్గించేలా ఉంటుంది ఆలయం. విగ్రహం కూడా చాలా సుందరంగా, గంభీరంగా ఉండి, భక్తులకు కొండమీద స్వామిని చూస్తున్నప్పుడు కలిగే భక్తి ఉద్రేకం కల్గిస్తుంది.

నేను తిరుమల-తిరుపతి దేవస్థానాల కార్యనిర్వహణాధికారిగా 1978లో తిరుపతి వెళ్లినప్పుడు ఆలయపరిస్థితి వేరు. తిరుమల-తిరుపతి దేవస్థానాలు ఈ ఆలయాన్ని తీసుకుని పునరుద్ధరించాలని సంకల్పం చేసినా, ఈ ఆలయం ప్రాచీనకట్టడ సంరక్షణ చట్టం కింద కేంద్ర పురావస్తు శాఖ అధీనంలో ఉండేది. బయట ప్రాకారం కొంత శిథిలమై ఉండేది. ముఖద్వార గోపురం ఉందికాని, ఆ గోపురానికి 20 అడుగుల ఎత్తు రెండు తలుపులు ఉండేవని గుర్తులేగాని, తలుపులు ఉండేవికావు. చుట్టుపక్కల కొంచెం దూరంలో గ్రామం. ఆలయ ఆవరణ పెద్దది కావడంతో తలుపులు లేకపోవడంతో, ప్రాకారమంతా పశువుల సందడే!

ఆలయ పూజావిధానం చూద్దామంటే..

అంతకుముందు 20 సంవత్సరాల క్రితం ఈ దేవాలయం పాడుబడి దీపధూప నైవేద్యాలు లేకుండా ఉండేదట. ఆ కాలంలో ఒక మధ్వబ్రాహ్మణుడు వయస్సు పండినా ఈ స్వామివారికి కైంకర్యం చేయాలని ప్రేరణ కలిగి, తన తాహతుకు తగినట్లే రోజూ పూజానైవేద్యాలు తన ఖర్చుతోనే చేసేవాడు. సంతానం లేని కారణంగా, ఒక స్మార్తబ్రాహ్మణ బాలుని చేరదీసి, రాఘవేంద్రాచారి అని నామకరణం చేసి, అతనికి అర్చనపద్ధతులు బోధించి, అతనిని మధ్వసంప్రదాయబద్ధంగా పెంచి, తర్వాత ఈ ఆలయంలో తనతోపాటు స్వామివారి కైంకర్యం చేయించేవాడు.

ఈ సుందరరాజస్వామి తణుకు వాస్తవ్యుడని ఆయనకు కలలో స్వామి కనపడింది ఆషాఢ శుద్ధ సప్తమి నాడు కనుక, "స్వప్న సాక్షాత్కార వైభవం ప్రారంభించి, రెండేళ్ల

తర్వాత నిలిచిపోయిందని మద్రాసులోని చరిత్రకారుడు, సుప్రసిద్ధ సంగీత విమర్శకులు, వి.ఎ.కె. రంగారావు నాకు వివరంగా తెలిపారు. 1967 సంవత్సరంలో తొండవాడ మొగిలి సుందరరామిరెడ్డి గారి ప్రోత్సాహంతో ఈ వైభవోత్సవాలు మరలా ప్రారంభించబడినాయి. వాటిని ఇప్పటికీ 'సాక్షాత్కారవైభవం'గా ప్రతి సంవత్సరం జరుపుతారు. ఇలా పునఃప్రారంభానికి నాంది పల్కింది రంగారావు గారే. రంగారావుగారి తల్లి రావు సరస్వతీదేవి గారు, వారి స్నేహితులతో కలిసి స్వామివారికి, వెండి కటారి, భుజకీర్తులు, మొలతాడు వంటి కొన్ని నగలు చేయించే కైంకర్యం చేశారు. ఈ ఉత్సవం నాడు ఈ రంగారావుగారు ఆలయంలో నాట్యసేవ చేస్తారు. ఇప్పటికీ ఆ సంప్రదాయం కొనసాగుతూనే ఉంది.

శ్రీనివాసమంగాపురం, చుట్టుపక్కల గ్రామాలు తిరుమల-తిరుపతి దేవస్థానానికి అర్జీలు పెట్టి, ఈ దేవాలయ పూజాబాధ్యతలు 1967 లో వారు తీసుకొనేట్టు నిర్ణయం చేయించారు. అలా కొంతకాలం ఈ మధ్వ అర్చకులకే రోజువారీ పూజకోసం కొంత నిధులు ఏర్పాటుచేయడం, దేవాలయంలో కొంత విద్యుదీకరణ మటుకు జరిగింది. అక్కడ ఎటువంటి మార్పు చేయాలన్నా పాడు పడినవి బాగుచేయాలన్నా పురావస్తుశాఖ వారికి విన్నవించాలి, వారే చేయాలి, ఇంకెవరూ చేయడానికి లేదు. ఆ శాఖ తరఫున వారు చేసిందీ, చేయగలిగిందీ ఒక కాపలాదారుని నియమించడమే. ఆ కాపలాదారు జీతం చెల్లించడమే వారు చేయగలిగిన అభ్యుదయ కార్యక్రమం. 20 సంవత్సరాల నుండీ అంతే. వారు చెయ్యరు, ఇంకొకరిని చెయ్యనివ్వరు.

"మీరు ఎలా చెయ్యమంటే అలా చేస్తా"మన్నా వినరు. "మేం డబ్బులిస్తాం మీరు చేయించ"మన్నా పట్టించుకోరు. పురాతనమైనవి, ఏమీ చేయకుండా ఇంకా పురాతనం చేయడమే కర్తవ్యమన్నట్లుంటుంది వారి వ్యవహారం. వారి అధికారి హైదరాబాదులో ఉంటారు. పాపం, అతనికి పురావస్తుశాసనం అమలుచేసే అధికారాలు వున్నాయి కాని, తమ శాఖ అధీనంలోకి వచ్చిన పురాతన కట్టడాల సంరక్షణకు కాపలాదారుల్ని నియమించడానికి తప్ప ఇంకెటువంటి సంరక్షణ కార్యక్రమానికీ నిధులుండేవి కావు. ఏది చెయ్యాలన్నా కొత్తదనం కనపడకుండా, పాతదనం చెడకుండా వీలయినంతవరకు ఆ కట్టడంలో ప్రాచీనకాలంలో వాడిన పదార్థాలే వాడి పనులు చేయాలని శాసనం.

అలా చేయడానికి కావల్సిన నైపుణ్యం గాని, ఆర్థికవనరులు కాని లేవు. దానితో వారి అధీనంలో ఉన్న కట్టడాలు ఇంకా శిథిలమవటమే కాని ఉపయోగకరంగా సంరక్షించుకునే అవకాశాలు తక్కువయ్యాయి. ఈ శ్రీనివాసమంగాపురం దేవాలయం విషయంలోనూ అదే జరిగింది. ఎవరైనా తెగించి ఏమైనా చేద్దామంటే, ఆ చట్టంలో చాలా కట్టుదిట్టమైన నిబంధనలు, ఎవరినైనా జైలుకు పంపగల అధికారాలిచ్చారు వారికి.

నేను ఏదో చేయాలన్న తహతహతో, వారి అధికారులతో ఎన్నోసార్లు మాట్లాడాను. నేనూ ఐఏఎస్‌నే కదా. పెద్ద అధికారంలోనే ఉన్నాను. అదివరకు ఒక జిల్లాకు కలెక్టరు చేసిన వాడిని. హైదరాబాదులో పని కాకపోతే, ఢిల్లీ దాకా వెళ్లాను. పాపం... వాళ్లు కాదనరు, కాని ఏమీ చెయ్యరు. “దేవస్థానం నుంచి ఎంత నిధులు కావాలన్నా ఇస్తాం. ప్రాకారం బాగు చేయించండి, మహాద్వారానికి తలుపులు పెట్టించండి. శిథిలమవుతున్న ఆలయభాగాలు బాగు చేయించండి. లోపల పూలు, తులసి పెంచుకునే అవకాశం కల్పించండి” అన్న నా మొర ఆలకించేవారే గాని, ఆచరణ కావడం లేదు.

అలా రెండు సంవత్సరాలు గడిచాయి. ఈ లోపల పూజావ్యవహారాల్లో, మాకు చేతనయింది చేశాం. కొండమీదిలాగే అన్ని సేవలూ, కైంకర్యాలు జరగాలనీ, అప్పటి దాకా అర్చకత్వం చేస్తున్న (పెద్దాయన చనిపోయారు) రాఘవేంద్రాచారిని దేవస్థానం అర్చకునిగా నియమించి, అక్కడే కైంకర్యం ఏర్పాటు చేసి, అతనికి సహాయంగా ఇంకో వైఖానస అర్చకుని అక్కడ నియమించి, నైవేద్యానికి అలంకారాలకు కావలసిన ఏర్పాట్లన్నీ చేయడం జరిగింది.. తిరుపతి నుండి, తిరుచానూరు నుండి, తిరుమల నుండి బస్సు సౌకర్యం కల్పించడం, శ్రీనివాసమంగాపురానికి పక్కనే రైలు మార్గం ఉంది కనుక, రైల్వేవారితో మాట్లాడి, ఒక రైల్వేస్టేషను మంజూరు చేయించి, అన్ని రైళ్లూ అక్కడ ఆగే సదుపాయం చేయడం జరిగింది.

కొండమీద పశ్చిమ మాడవీథిలో వేదపాఠశాలని దేవస్థానం నడిపేది. తిరుమలలో రోజూ విశేషమే. ఆలయంలోనే కాదు, బయట కూడా. మఠాల్లో, సత్రాల్లో కళ్యాణమండపాల్లో అందరి కంటే చాలా బిజీగా వేద పాఠశాల ఉపాధ్యాయులు వుంటారు. ఎవరికి వేద ఆశీర్వచనం చేయాలన్నా వెళ్లటం, ఒక పనస చెప్పడం, సంభావనలు తీసుకోవడం, పిల్లలకు నేర్పాలి కనుక వారినీ తీసుకుపోవడం, వేదం వచ్చినా రాకపోయినా పిల్లలకు సంభావనలు ఎలా దొరుకుతాయో బాగా నేర్చుకునే పరిస్థితి. అందుకు ఎవ్వరికీ ఇష్టం లేకపోయినా చంద్రగిరి సబ్-కలెక్టరు బంగళా

ఆఫీసులు వున్నచోట, ఊరికి దూరంగా ఆశ్రమంలాగా వున్న చోటికి ఈ వేదపాఠశాలని మార్పించాను. తిరుమలలోని మా పాత హుజూరు ఆఫీసుని సబ్-కలెక్టరుకు ఆఫీసుగా, దేవస్థానం బంగళా ఒకటి సబ్-కలెక్టరుకు ఇల్లుగా ఇచ్చి, వారి ఆఫీసు బంగళా దేవస్థానం తీసుకొని, ఈ వేదపాఠశాలను అక్కడకు మార్పించాను. ఈ వేద పాఠశాల శ్రీనివాసమంగాపురానికి కొద్ది దూరమే. ప్రతిరోజూ వేదపాఠశాల విద్యార్థులూ, ఉపాధ్యాయులూ తప్పనిసరిగా ఆలయానికి వచ్చి వేదం చదివే ఏర్పాటుచేశాను.

1443లో దేవరాయ మహారాజు తిరుమల గుడిలో వేదపారాయణం ప్రవేశ పెట్టినప్పుడు, శ్రీనివాసమంగాపురం గ్రామం పారాయణ దార్ల పోషణకు సగం గ్రామం దేవదేయం చేశాడు. అందుకే వేదపాఠశాల అక్కడ పెట్టాలనిపించింది.

ఇన్ని చేసినా ప్రాకారం శుభ్రంగా ఉంచడం కుదరడం లేదు. ఊళ్లోని బర్రెలు, గొర్రెలే కాదు, పందులూ-కుక్కలూ యథేచ్ఛగా విహారం చేస్తూండేవి. ఏం చేయాలో తెలియక, మళ్లీ ఒకసారి ఢిల్లీ, హైదరాబాదులతో మాట్లాడి, ఏమైనా జరుగు తుందేమోనని ఒక నెల రోజులు ఎదురుచూసి, ఇంకేమీ వారినుండి కాదని నిర్ధారించుకొని, రహస్యంగా దేవస్థానం ఇంజినీరింగ్ విభాగాన్ని ఆలయానికి వెళ్లి ఏమేం చెయ్యాలో, ఏమేం కావాలో అవన్నీ ఒకటి లేదా రెండు రోజులలో పని పూర్తి చేయాలంటే ఏమేం చర్యలు తీసుకోవాలో అన్నిటినీ సిద్ధం చేసి నాకు చెప్పమని, ఆదేశాలిచ్చాను. రెండునెలల తర్వాత వారు సిద్ధమని చెప్పినప్పుడు, ఒక శనివారం మధ్యాహ్నం పనులు చేయమని ఇంజినీర్లకు పురమాయించాను.

ముందుగానే తిరుపతిలో తయారుచేసిన 20 అడుగుల పొడవుగల దేవాలయ సంప్రదాయబద్ధంగా తయారుచేయబడిన చెక్క తలుపులూ, వాటిని అమర్చడానికి కావలసిన క్రేనులూ, ప్రాకారం బాగు చేయడానికి కావాల్సిన అన్ని సరంజామాలు తీసుకొని ఆలయానికి వచ్చారు. పాపం కాపలాదారు ఏం చేస్తాడు? తన ధర్మంగా చెయ్యొద్దని చెప్పాడు. వారి అధికార్లకు టెలిఫోన్ చేశాడు, టెలిగ్రాములు పంపాడు.

సోమవారం పొద్దున్నకల్లా మా ఇంజినీరింగ్ విభాగం పనులన్నీ పూర్తిచేశారు. వారికి ముందుగానే నేను చెప్పాను. నిపుణులను సంప్రదించి, పురావస్తుశాఖ నిబంధనల్లో ఎలా చేయాలని వుందో అదేవిధంగా అటువంటి పురాతన కట్టడ సామగ్రినే వాడి, కొత్తగా కనపడకుండా వీలయినంత పాతగా కనపడేటట్లు చేయాలని...

★ ★ ★

ఢిల్లీ నుంచి పురావస్తుశాఖ డైరక్టరు జనరల్ (ఆయనా ఐఎఎస్ అధికారి), హైదారాబాదు అధికార్లు నాతో మాట్లాడటానికి ప్రయత్నం చేస్తే, నేను కొండమీద దేవాలయంలో ఉన్నాననీ, తరువాత మాట్లాడతాననీ సమాధానం పంపాను.

సోమవారం నేనే వారితో మాట్లాడి జరిగిన విషయమంతా చెప్పాను. వారికి పరిస్థితులు అర్థమయినా, వారి అధికారాన్ని కాదని చేసినందుకు నాకు షోకాజు నోటీసు ఇవ్వటం మాత్రమే కాక, నా మీద క్రిమినల్ చర్య తీసుకోవాలని ప్రభుత్వానికి లేఖ పంపి, కోర్టులో కేసు వేశారు. తిరుమల-తిరుపతి దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఐఏఎస్ ఆఫీసరే అయినా, మిగతా ఐఏఎస్‌ల్లాగా మాత్రమే కాదు, ఢిల్లీ నుండి హైదరాబాదు వరకు ఎవరితోనైనా మాట్లాడే పరిచయాలుంటాయి. మంచిపని కోసం వాటినెప్పుడైనా వాడుకోవచ్చు. అవే వాడుకొని ఇబ్బంది లేకుండా బయటపడ్డాను.

శ్రీనివాసమంగాపురం లోపలి ప్రాకారంలో పూదోట, తులసితోట, చుట్టూ కావల్సినంత విద్యుత్ దీపాలకాంతి, ఆలయం లోపల స్వామివారి సేవలకు యాగశాలతో సహా కావల్సిన అన్ని సదుపాయాలు చేసి, రోజూ స్వామివారి కళ్యాణానికి, ప్రతి సంవత్సరం స్వామి వారి బ్రహ్మోత్సవాలకు ఏర్పాటు చేసి నా యోగ్యతానుసారం సేవ చేశాను. ఆషాఢమాసంలో శుక్లపక్ష సప్తమినాడు జరుగుతుండే స్వామివారికి సాక్షాత్కార వైభవోత్సవం ఘనంగా జరిగేట్లు చూశాం. ఆ రోజునే ప్రముఖ సంగీత, సాహిత్య విమర్శకుడు, నాట్యాచారి (మద్రాసు) వి.ఎ.కె. రంగారావుగారు తన వంతు సేవగా స్వయంగా నాట్యంచేసి, నృత్యసేవ చేసే సంప్రదాయం మొదలుపెట్టారు. ఇప్పటికీ ప్రతి సంవత్సరం ఆయన ఈ సేవ చేస్తూనే వున్నారు... ఈ ఆలయం అభివృద్ధిలోకి రావడానికి 1960/70 దశకాల్లో శ్రీ మొగిలి సుందరామిరెడ్డి, శ్రీ కేశవ పట్టాభి రామిరెడ్డి గార్ల ప్రోత్సాహంతో శ్రీ వి.ఎ.కె. రంగారావు గారు, వారి తల్లి రావు సరస్వతీదేవిగార్లు చేసిన సేవ ప్రస్తుతించవలసినది.

అర్చకులు శ్రీ సుందరరాజస్వామి, వారి కుమారుడు శ్రీరాఘవేంద్రాచారులను ప్రత్యేకంగా అభినందించాలి. చిల్లిగవ్వ ఆదాయం లేని రోజుల్లో స్వామివారి ఆజ్ఞగా తణుకు నుండి వచ్చి, రాత్రింబవళ్ల అర్చకులుగా వీరు చేసిన సేవ అభినందనీయం.

1979 లో నేను చూసిన కళ్యాణ వేంకటేశ్వర ఆలయాన్ని ఇప్పటి వైభవంతో పోల్చుకుంటే ఎంతో అనుభూతి, ఆనందం కలుగుతాయి.

★ ★ ★

79. అతి వివాదాస్పద ఘట్టం: వెయ్యి కాళ్ల మండపం కూల్చివేత

తిరుమల ఆలయచరిత్రలో అత్యంత వివాదాస్పదమైనది - చారిత్రాత్మకమైన వెయ్యి కాళ్ల మండపం కూల్చివేత!

జాగ్రత్తగా పరిశీలిస్తే ఒక విషయం అర్థమవుతుంది. తిరుమల ఆలయనిర్మాణం జరిగినప్పుడు కొండని తవ్వి, 'లోయ'లా తయారుచేయటం జరిగింది.

ఆ లోయలోనే ఆలయం, ఆలయానికి ఎదురుగా తూర్పువైపున (లోయవాలులో) వెయ్యి స్తంభాల మంటపం నిర్మించడం జరిగింది.

శతాబ్దాల చరిత్ర, అపురూపమైన శిల్పకళ ఉట్టిపడే నిర్మాణచాతుర్యం గల వెయ్యి స్తంభాలు కలిగిన ఈ మంటపాన్ని ఒక్క కలం పోటుతో దేవస్థానం బోర్డు కూల్చివేసింది!

ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ అజయ్ కల్లంను, ట్రస్టు బోర్డును, ప్రభుత్వాన్ని దోషిగా ఎత్తి చూపిస్తూ కొందరు హిందూమతాధిపతులు, రాజకీయవాదులు ఉవ్వెత్తున నిరసనలు గుప్పించారు. ఒక మతాధిపతి ఏకంగా ప్రజాఉద్యమాన్ని నడపడానికి సిద్ధపడ్డారు. ప్రకటన కూడా చేసేశారు.

తిరుమలక్షేత్రంలో ఈ పురాతన మండపం కూల్చివేత దోషమా? అయితే దోషి ఎవరు?

★ ★ ★

ఈ రోజుల్లో తిరుమల ఆలయానికి వెళ్తే, ఆలయం నుండి దాదాపు 300 పైగా గజాలకు దూరం వరకు ఆలయానికి ముందు, విశాలమైన ఖాళీ ప్రదేశం కనిపిస్తుంది. ఆలయమహాద్వారానికి ఎదురుగా ఖాళీ ప్రదేశం తర్వాత పెద్ద ఎక్కుడు - 20 అడుగుల

ఎత్తుగా కొండను కొట్టి, మెట్లు కట్టినట్లు స్పష్టంగా తెలుస్తుంది. మెట్లు ఎక్కగానే భక్తులు దీపాలు వెలిగించడానికి అఖండం, దాని పక్కనే కొబ్బరికాయలు భక్తులే కొట్టుకోవడానికి సౌకర్యం, కొబ్బరి చిప్పలు వేయడానికి ఒక హుండీ... వాటిని దాటంగానే 'బేది ఆంజనేయస్వామి' వారి ఆలయం కనిపిస్తాయి. ఈ కొండని కొట్టిన ప్రక్రియ, దక్షిణాన వున్న హాథీరాంజీ మఠం నుండి ఇప్పుడు చాలావరకు (మూడువంతులకు పైగా) పడగొట్టబడిన పెద్ద జియ్యంగారి మఠం వెనుక కొత్తగా కట్టిన వాహనమండపం దాకా జరిగిందని తెలుస్తోంది. నాలుగు మాడవీథులలో చూస్తే మనకర్థమయ్యేది- ఆ వీథుల చుట్టూ కొండ వుండేదని. కొండకు మధ్యన లోతట్టులో ఆలయనిర్మాణం, ఆ తర్వాత ఆలయం చుట్టూ నాలుగు మాడవీథులు వచ్చాయని గమనించవచ్చు. ఆలయానికి ఈశాన్యంగా వున్న పుష్కరిణీతీర్థాలు - చాలా ప్రాచీనకాలం నుండి ఈ లోతట్టులో వున్నవే.

ఆలయం ముందు భాగం విశాల ఖాళీస్థలంగా చేయబడటం ఈ మధ్యకాలంలోనే - అంటే 2004 సంవత్సరంలో జరిగింది. 2004కు పూర్వం ఆలయానికి ముందువున్న తూర్పు మాడవీథి 35 అడుగుల వెడల్పు మాత్రమే. అంటే ఇప్పుడు వున్న గొల్లమండపం వరకూ వుండేది. మాడవీథిలోనే ఎత్తైన మెట్లు, ఆ మెట్లు ఎక్కితే గొల్లమండపం సన్నిధి వీథి, కొండపై వున్నట్లు వుండేవి. అది ఇప్పుడు గొల్లమండపం చూస్తే తెలుస్తుంది. దాదాపు 10 అడుగుల ఎత్తు పైన ఈ మండపం చుట్టూ కొండను తవ్వేయడంతో, ఈ మండపానికి ఎక్కి వెళ్లే అవకాశం లేనట్లు కనిపిస్తుంది. అదివరకు ఈ గొల్లమండపం దగ్గరే అఖండం, కొబ్బరికాయలు కొట్టే సదుపాయాలు వుండేవి. ఈ మండపంలో పాలు, పెరుగు అమ్మే వాళ్లు కూర్చునేవారు.

నేను కార్యనిర్వహణాధికారిగా వెళ్లేటప్పటికి (1978), ఆలయం ముందువున్న మెట్లెక్కగానే ఒక సన్నటి (6 అడుగుల వెడల్పు గల) సన్నిధి వీథి, వీథికి ఉత్తరం వైపున కొన్ని సత్రాలు, మఠాలు, వాటి వరండాలలో క్రిక్కిరిసిన దుకాణాలు వుండేవి. దక్షిణం వైపు అంతా వెయ్యి కాళ్ల మండపం, దానికి సన్నిధి వీథికి మధ్య క్రిక్కిరిసిన దుకాణాలు వుండేవి. ఈ సన్నిధి వీథి దాదాపు 300 గజాలు పొడవు - అంటే బేది ఆంజనేయస్వామి వారి (పాడుబడిన) గుడి వరకూ వుండేది. యాత్రికులకు నడవడం కూడా కష్టంగా వుండేది. మాస్టరు ప్లానులో భాగంగానే ఈ సన్నటి సన్నిధివీథిని ఇరువైపులా కొట్టివేసి ఆరు అడుగుల దారిని 100 అడుగులకు పెంచి, వాటితోపాటు అన్ని దుకాణాలను కూడా వెనక్కి జరపడం, అందులో భాగంగానే వెయ్యి కాళ్ల

మండపంలోని కొంత భాగం తీసివేయడం చేశాం. అది 1981-82 మాట. అప్పుడే కొత్తగా బేడి ఆంజనేయస్వామి ఆలయం కూడా కట్టడం జరిగింది (ఇదంతా విపులంగా నా పుస్తకం 'నాహం కర్తా హరిఃకర్తా' లో చర్చించాను).

ఆలయానికి ఆగ్నేయంగా మెట్లమీద వెయ్యి కాళ్ల మండపం వైభవంగా వుండేది. మంచి శిల్పకళానైపుణ్యం గల కొన్ని స్తంభాలు ప్రతి పది అడుగులకు ఒకటి చొప్పున వుండి, వాటిపైన కట్టిన మండపం అది. ఆ రోజుల్లో ఈ వెయ్యి కాళ్ల మండపంలో కొంతభాగం ఆర్జితసేవల టిక్కెట్లు అమ్మడానికి, లడ్డూలు అమ్మడానికి, బ్యాంకు వారి కౌంటర్లకి, ఇంకొంత భాగం నేనున్నప్పుడు ఆరంభించిన ఆలయం మ్యూజియానికి, ఈ వెయ్యి కాళ్ల మండపం లోపలి భాగంలో సదస్సుల కోసం, ఇంకొక పక్కన పోలీసు స్టేషనుకి, ఇంకొంత భాగం మరుగుదొడ్లకి వినియోగిస్తూ ఉండేవాళ్లు.

ఈ వెయ్యి కాళ్ల మండపం ఒక పెద్ద దీర్ఘ చతురస్రాకారపు రాతిమండపం. దీనికి ఆలయానికి మధ్య తూర్పుమాడ వీథి ఉంది. 310 అడుగుల పొడవు, 134 అడుగుల వెడల్పు గల వెయ్యి కాళ్ల మండపం పైకప్పు అంతా ఒకే ఎత్తులో వుండేది. ఈ మండపంలో రెండు స్తంభాలమధ్య 6 అడుగుల నుండి 8 అడుగుల వరకు దూరం వుండేది. భూమి ఏటవాలుగా వుండటం వలన లోపలి ఎత్తు తూర్పు కొసన 9 అడుగులుగా వుండి, ఆలయంవైపు మెట్ల దగ్గరకు వచ్చేటప్పటికి 11½ అడుగులుగా వుండేది.

★ ★ ★

ఈ వెయ్యి కాళ్ల మండపంలో కొన్ని కాళ్లను నేను ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా వుండగానే తీసేశాం.

జరిగిందేమిటంటే- నేను ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా వున్నప్పుడు (1978-82) ఆలయం బయట భక్తులందరూ ఉచితంగా కళ్యాణోత్సవం తిలకించేలా చేయడం కోసం ఆస్థాన మండపం కట్టాలనుకోవడం, సన్నిధివీథి వెడల్పు చేయడం కోసం అప్పటికే ఓ 100 కాళ్లను 1972లోనే కోల్పోయి వున్న భగ్నమండపంలో - మరి కొన్ని కాళ్లను నేను తీయించి వేయడం జరిగింది.

కాని 2004లో మొత్తం మండపం కూల్చివేసి, నేలంతా చదును చేయడంతో కొందరు మతాధిపతుల నుంచి నిరసనజ్వాలలు ఉవ్వెత్తున లేచాయి. త్రిదండి శ్రీమన్నారాయణ జియ్యరు మండపం కూల్చివేతని వ్యతిరేకిస్తూ విమర్శలు చేసి,

ప్రభుత్వవైఖరిని తూర్పారపట్టారు. వారం రోజుల్లోగా వెయ్యి కాళ్లలో తానూ, తన శిష్యులు విశాఖపట్నం నుంచి తిరుమల దాకా యాత్ర చేసి, దారి పొడవునా గ్రామప్రజల్ని చైతన్యపరచి, తిరుమలలో బృహత్ ధర్నా చేస్తామని హెచ్చరించారు. వాతావరణం చాలా ఉద్రేకపూరితంగా మారిపోయింది.

ఆ నేపథ్యంలో, ప్రభుత్వం ఈ సమస్యపై నా అధ్యక్షతన ఒక త్రిసభ్య కమిటీని ఏర్పాటుచేసింది.

ప్రభుత్వవైఖరిని ఎండగడుతున్న జియ్యర్‌గారి, వారి వాదాన్ని వ్యతిరేకిస్తున్న విశాఖ స్వరూపానందేంద్ర సరస్వతీస్వామి, తదితర మఠాధిపతులందరికీ రకరకాలుగా నచ్చజెప్పి, త్రిసభ్య కమిటీకి ఒక అవకాశం ఇచ్చి చూడవలసిందిగా అర్థించాను. వాళ్లంతా అంగీకరించాక, ఈ మండపం పుట్టుపూర్వోత్తరాలను వెలికితీయడం, వాస్తవపరిస్థితిని, పరిష్కారమార్గాలను ప్రభుత్వం ముందు వుంచడం అనే బృహత్‌కార్యాన్ని తలకెత్తుకున్నాను.

★ ★ ★

ఆలయం బయట కళ్యాణోత్సవం చేయాలనే సంకల్పం మొదట 1972లో మొదలయింది. అప్పటి ఆగమ సలహాదారు శ్రీ అప్పికట్ల జగన్నాథాచార్యులు, పెద్ద జియ్యంగారు, ప్రధాన అర్చక మిరాశీదారు శ్రీ ఎ.ఎస్. నారాయణ దీక్షితులను ఆగమ నిపుణుల కమిటీగా తీసుకుని, వారితో చర్చలు జరిపినప్పుడు, ఆలయం బయట కళ్యాణోత్సవం జరపటానికి ఆగమ అభ్యంతరం లేదనీ, కాని వెయ్యి కాళ్ల మండపంలో చేయడానికి అభ్యంతరం వుందనీ తెలిపారు. కారణం అది 'భగ్నమండపం'. కొంత భాగం శిథిలమవడమో, కొట్టి వేయబడటమో జరిగింది కనుక. ఆపైన అందులో కొంత భాగంలో మూత్రశాలలూ, దేవాలయ ఆఫీసులూ, ఒక పోలీసు ఠాణా నడుస్తూండటం వలన అభ్యంతరం అనీ, కళ్యాణాల కోసం ప్రత్యేకంగా కొత్త నిర్మాణం చేపడితే అభ్యంతరాలు వుండవనీ సూచించారు... అందుకే నేను 1980లో పెద్ద ఆస్థానమండపం నిర్మాణం చేపట్టింది. నేను బదిలీకాగానే ఆస్థానమండపంలో కింద సెల్లార్లో గదులుగా కట్టి, వ్యాపారాలకు అద్దెకి ఇవ్వడంతో– ఆగమ సలహాదారులకు అది అభ్యంతరంగా తోచి, ఆస్థానమండపానికి కళ్యాణాలు మార్చడానికి వ్యతిరేకించారు.

మళ్లీ 1992లో దేవస్థానం బోర్డువారు (తీర్మానం నం.332) జూలై 23వ తారీఖున ఆలయం వెనుక – అంటే పశ్చిమాన 10 కోట్ల వ్యయంతో కళ్యాణమండపం

కట్టాలని తీర్మానించారు. చెప్పిన కారణాలు పాతవే... వేలమంది కళ్యాణాలు కావాలనుకుంటున్నా, ఆలయం లోపలి కళ్యాణోత్సవప్రదేశంలో స్థలాభావం వలన అవకాశం కుదరడం లేదు. కనుక ఆలయం బయట ప్రత్యేకంగా వైభవంగా వుండే కళ్యాణమండపం నిర్మాణం చేయాలన్నది సంకల్పం. దానికి ఆగమపండితుల ఆమోదం వుంది. అర్చకులు జియ్యంగార్లు కూడా సానుకూలత చూపారు. కారణాలు తెలియవు కాని, ఆ పాలకమండలి తీర్మానం అమలులోకి రాలేదు.

మళ్లీ 1997లో ఈ విషయం చర్చకు వచ్చి, దేవస్థానం పాలకమండలి ఫిబ్రవరి 26 తారీఖున నం. 1062 తీర్మానంలో రాంబగీచా దగ్గర - అంటే పుష్కరిణికి ఎదురుగా ఆలయానికి బయట ఈశాన్యప్రాంతంలో స్వామివారి కళ్యాణోత్సవాలు చేయడానికి ప్రత్యేక భవననిర్మాణం చేయాలని నిర్ణయించారు. ఆలయానికి ఈశాన్యంగా తూర్పుమాడవీథికి. రామబగీచా అతిథిగృహాలకి మధ్యన ఈ నిర్మాణం చేపట్టాలని కూడా తీర్మానం చేశారు. ఈ తీర్మానంలో 1992లో చేసిన తీర్మానాన్ని దృష్టిలో వుంచుకొని, ఆలయం వెనుక బ్రహ్మాండమైన కళ్యాణమంటపం - అది వరకు తీర్మానించినట్లు కట్టాలి, కాని ఆ నిర్మాణం ఆలస్యం అవుతుంది కనుక, వెంటనే కళ్యాణాలు బయటకు తేవడానికి వీలుగా - రాంబగీచాలో తాత్కాలిక షెడ్డుని అందంగా త్వరగా నిర్మాణం చేయాలనీ, ఈ షెడ్డు (కళ్యాణమండపం) నిర్మాణం పూర్తి కాగానే ఆలయప్రాకారం లోపలినుండి కళ్యాణాలు అక్కడికి మార్చాలనీ కూడా తీర్మానించారు. అప్పుడు ఖాళీ చేసిన ఈ షెడ్డు యాత్రికులకు వెయిటింగు హాలుగా ఉపయోగించవచ్చు అని కూడా నిర్ణయించారు.

ఈ తీర్మానాన్ని అమలు చేయడానికి, ప్లానులు తయారుచేసి, 1997 మార్చి 8వ తారీఖున పాలకమండలి ఆమోదం తీసుకొన్నారు. ఆ తర్వాత ఈ విషయంపై ఆగమ సలహాదారులతో చర్చించి వారి ఆమోదం తీసుకొన్నారు. శ్రీ మాడంబాకం శ్రీనివాస భట్టాచార్యులు గారు అప్పటి ఆలయ వైఖానస ఆగమ సలహాదారు. 1998 సెప్టెంబరు 25న ఆయన లిఖితపూర్వకంగా, ఈ కొత్తగా కట్టిన మండపంలో 'హోమం'తో కూడిన కళ్యాణాలు చేయవచ్చని. అక్కడే యాగశాల వుంది కనుక ఔపోసనాగ్నిని వేంచేపు చేసి కళ్యాణం జరపడానికి ఎటువంటి అభ్యంతరంలేదని, ఇది 'ఉత్తమపక్ష' నిర్ణయం కిందికి వస్తుందని చెప్తూ, ఈ సలహా ఆగమసమ్మతమనీ, ఎటువంటి అభ్యంతరాలూ వుండవనీ, ఈ నిర్ణయాన్ని ఎవరి ముందైనా సమర్థించి ఒప్పించడానికి కావల్సిన ఆగమప్రమాణాలు చూపించడానికి తాను సిద్ధమనీ కూడా పాలకమండలికి సిఫార్సు చేశారు.

అలా అందరి (ముఖ్యంగా ఆగమ సలహాదారులు, అర్చకుల) ఆమోదంతో కట్టిన కొత్త కళ్యాణోత్సవ మండపం రూ. 80 లక్షల ఖర్చుతో తాత్కాలికమండపంగా తయారయింది. ఆ రోజుల్లో నేను 1980లో మొదలుపెట్టిన మాస్టరు ప్లాను పూర్తిగా అమలుకాలేదు. మాడవీథుల్లో ఇంకా కొన్ని ఇళ్లు దేవస్థానం అధీనంలో కాక, ఇతరుల అధీనంలో ఉన్నాయి. కోర్టులో కేసులు దీనికి కారణం. అలా ఈ కొత్తగా కట్టిన కళ్యాణ మండపం పక్కన కూడా కొన్ని పాత నిర్మాణాలు ప్రైవేటు వ్యక్తుల చేతులలో వున్నాయి. భూసేకరణకార్యక్రమం పూర్తి కాకపోవడం వలన కళ్యాణోత్సవాలను ఆలయం నుండి తరలించడాన్ని, ఈ మండపం పక్కన వున్న ఇళ్లు ఆలయస్వాధీనం అయ్యాక చెయ్యవచ్చని సూచించారు. అంతవరకు ఎటువంటి అభ్యంతరాలూ చెప్పకుండా, ఆగమసమ్మతమేనని ఎన్నోసార్లు చెప్పిన ప్రధాన అర్చకులు డా. రమణదీక్షితులు ఆలయంలోనే సంపంగి ప్రాకారంలో పశ్చిమభాగంలో కొన్ని మార్పులు చేస్తే ఆలయంపోటు విస్తరణ, కళ్యాణమండపం కొంత పెంచే అవకాశం వుంది కనుక అలా చేస్తే బాగుంటుందని సూచన చేశారు. ఈ సందర్భంలో ఇంకో విషయం - అంటే ఆలయంలో లడ్డూల తయారీ విషయం గురించి తెలుసుకోవాలి. లడ్డూలు కావలసినన్ని సరఫరా చేయలేకపోవడం వలన కళ్యాణాలతో పాటు లడ్డూల తయారీని కూడా బయటకు తేవాలన్న ప్రతిపాదన కూడా చర్చలలో వుండేది (ఈ లడ్డూల తయారీ విషయం ప్రత్యేకంగా తర్వాత చర్చిద్దాం).

అలా అప్పుడు తాత్కాలికంగా కళ్యాణోత్సవాలు ఆలయం బయటకు తేకుండా, సంపంగి ప్రాకారంలోనే కొంత మార్పులు చేసి సరిపెట్టారు. ఆలయం లోపల వున్న ఉగ్రానం (store) ను ఆలయం బయటకు మార్చి, కన్వేయర్ బెల్ట్ ద్వారా ప్రతిరోజూ సరకులు ఆలయం ప్రాకారం పైనుండి లోపలికి పంపించే ఏర్పాటుతో, లోపల కొంత ప్రదేశం ఖాళీ కావడం, దానితో తాత్కాలికంగా లడ్డూల తయారీని కొంత పెంచి, కళ్యాణోత్సవాలు కొన్ని పెంచగలగడంతో, కళ్యాణోత్సవాలను ఆలయం బయటకు తెచ్చే కార్యక్రమం వాయిదా పడింది. దాంతో రూ. 80 లక్షలతో కట్టిన కళ్యాణమండపం కొన్ని సంవత్సరాలు ఖాళీగా వుండిపోయింది.

అనాదిగా ఆలయంలోని ఆగమ, సంప్రదాయ విషయాల ప్రస్తావన వచ్చి, కొత్తగా నిర్ణయాలు చేయాలంటే, ఆలయ ఆగమపండితులు, ఆచార్యపురుషులు, జియ్యంగార్లు, అర్చక మిరాశీదార్లు, ఆలయ పాలనాధికారులు కలిసి నిర్ణయాలు తీసుకొనేవారు. క్రమంగా ఆచార్యపురుషుల వ్యవస్థ బలహీనమై, వారిలో ఆగమాది విషయాలలో పాండిత్యప్రతిభ కలవారు తగ్గిపోవడం వల్లనూ, అర్చకులు ఆలయ అర్చనాది

పూజావిధానాలు మాత్రమే తెలిసి, ఆగమ శాస్త్రం విషయంలో ప్రావీణ్యం లేని వాళ్లవుతున్న కారణంగానూ, జియ్యంగార్లు వైఖానసులు కాక పాంచరాత్రులు కావడం వలనా, కొన్ని దశాబ్దాలుగా ఆగమవిషయాలలో సలహాలు ఇవ్వడానికి ఆలయానికి ఒక ఆగమ సలహాదారుగా వైఖానస ఆగమంలో నిష్ణాతుడైన పండితుడు ఉండేవాడు. నేను కార్యనిర్వహణాధికారిగా వుండగా, శ్రీ అప్పికట్ల జగన్నాథాచార్యులు ఆగమ సలహాదారుగా వుండేవారు. ఆయన అప్పటికే 15 సంవత్సరాల నుండీ ఆగమ సలహాదారుగా వున్నారు. 1972లో కళ్యాణోత్సవాలు ఆలయం బయట చేయవచ్చని సలహా ఇచ్చింది ఆయనే. తర్వాత నేను కార్యనిర్వహణాధికారిగా వుండగానే ఆయన బయట ప్రత్యేకంగా కట్టిన వసతిలో 'కళ్యాణాలు' చేయవచ్చని సలహా ఇచ్చారు... ఆ తర్వాత, అంటే వారు పరమపదం చేరాక, అప్పటివరకు అర్చక మిరాశీదారుల దగ్గర అర్చక గుమాస్తాగా చేరి, పాండిత్యప్రతిభతో ఎదిగిన శ్రీ మాడంబాకం శ్రీనివాస భట్టాచారి ఆగమ సలహాదారుగా నియమింపబడ్డారు. ఆయన సూచన మేరకే ఆలయం బయట కళ్యాణాలకని వైభవోత్సవమండపం (ఇప్పటి షెడ్డు) తాత్కాలికంగా కట్టబడింది. ఈ నిర్ణయాలను ఆగమ సలహాదారు సూచనతో చేసినా జియ్యంగార్ల, అర్చకుల ఆమోదం వుండేది. వారిని కూడా సంప్రదించి, వారికి అభ్యంతరాలు లేకపోతేనే, కార్యక్రమాలు చేసే సంప్రదాయం నడుస్తూ వస్తోంది.

అలా అందరి ఆమోదంతో, ఆగమ అభ్యంతరాలు లేక, ఆగమ పండిత, అర్చక, జియ్యంగార్ల సమ్మతంతో నిర్ణయాలు తీసుకునే (మూడు నాలుగు దశాబ్దాలుగా వస్తున్న) విధానంలో 2002-2004 ప్రాంతంలో కొంత మార్పు సంభవించింది. దానికొక కారణం- ఒక్క ఆగమ సలహాదారుగా వున్న వ్యవస్థ 'ఆగమ సలహామండలి'గా రూపుదిద్దుకోవడం కావచ్చు. మొదట ఇద్దరు సభ్యులు, తరువాత ముగ్గురు సభ్యులు+ప్రధాన అర్చకులతో మొదలై, తర్వాత ఐదుగురు సభ్యులతో ఆగమ సలహామండలి ఏర్పాటు జరిగింది. అందులో అదివరకు సలహాదారుగా వున్న మాడంబాకం ఆచారి, అంతకు పూర్వం ఆలయ సలహాదారు అయిన శ్రీ అప్పికట్ల జగన్నాథాచారి గారి కుమారుడు శ్రీ దేశికాచార్యులు, ముగ్గురు ప్రధాన అర్చకులు- శ్రీ రమణ దీక్షితులు, శ్రీమాన్ కేశవాచార్యులు, శ్రీమాన్ వెంకటకృష్ణ భట్టాచార్యులు...

వీరందరూ కళ్యాణోత్సవం ఆలయం బయటకు మార్చే విషయంలో చర్చించారు. కళ్యాణాన్ని బయట వైభవోత్సవమండపానికి మార్చవచ్చని నలుగురు సభ్యులు తీర్మానం చేశారు. శ్రీ దేశికాచార్యులు అభ్యంతరం చెప్పడం జరిగింది. అంతకుముందు 20

సంవత్సరాలుగా అభ్యంతరాలు తెలపని ప్రధాన అర్చకులు - 1998లో కొంత అభ్యంతరం సూచించినా, ఆలయం లోపల సర్దుకొని లడ్లు, కళ్యాణాలకు కొంత ఎక్కువ స్థలం కేటాయించి, అప్పటికి మార్పును వాయిదా వేసిన ఆయన - ఈ కమిటీ సమావేశంలో మాత్రం అభ్యంతరాలు తెలపక తమ ఆమోదం తెలిపారు.

2002 సంవత్సరానికి వచ్చే సరికి ఆగమ సలహామండలిని ఏడుగురు సభ్యులకు పెంచడం జరిగింది. 26-12-2002 నాడు జరిగిన ఆలయ ఆగమ సలహామండలి కార్యనిర్వహణాధికారి ఆధ్వర్యంలో జరిగింది. ఐదుగురు ఆగమ సలహామండలి సభ్యులు హాజరయిన ఈ సమావేశంలో శ్రీ మాడంబాకం శ్రీనివాస భట్టాచారి, ప్రధాన అర్చకులు శ్రీ రమణ దీక్షితులు, శ్రీ దేశికాచార్యులు కూడా పాల్గొన్నారు. వీరందరితో పాటు, దేవస్థానం స్థపతులు, ఇంజినీరింగు అధికారులు, ఇతర సంయుక్త కార్యనిర్వహణాధికారి తదితర అధికారులు కూడా వున్నారు. గత 30 సంవత్సరాలుగా ఆగమ/ఇతర అభ్యంతరాలు లేని "ఆలయం బయట కళ్యాణాలు చేసే" విషయంలో అప్పటివరకు దానికోసం ఖర్చు చేసిన రూ. 80 లక్షల రూపాయలు విషయాన్ని వదిలేసి, ఆగమ అభ్యంతరం వున్నదన్న కారణంగా (కళ్యాణోత్సవాలు ప్రాకారం దాటకూడదన్న వాదనతో) మొదటిసారి మహాప్రాకారం కట్టాలన్న ఆలోచనకు ఆ సమావేశం శ్రీకారం చుట్టింది.

★ ★ ★

మహా ప్రాకారం కథ

అలా అర్చకులకు, ఆగమ సలహామండలిలో ఒకరిద్దరికి వచ్చిన ఆలోచనే 'మహా ప్రాకారం'. ఎటువంటి వివాదం లేకుండా సంప్రదాయవిరుద్ధం కాకుండా, ఆగమ సమ్మతంగా ఇంకొక ప్రాకారం నిర్మిస్తే, ఆ ప్రాకారం గోడల లోపల కళ్యాణాలు చేయవచ్చు. వేలమందికి కళ్యాణంలో పాల్గొనే అవకాశం ఇవ్వవచ్చు. లక్షల లడ్డూలు తయారు చేయవచ్చు. ఇదంతా ఆలయప్రాకారం లోపల జరుగుతుంది కనుక, వివాదాలకు తావు వుండదు. ఈ సలహానే అప్పటి పాలకమండలికి, కార్యనిర్వహణాధికారికి ఇవ్వడం... ఇది వారికి బాగా నచ్చడం... కార్యరూపంలో పెట్టడానికి నిశ్చయించటం జరిగింది.

ఆ సమయంలో శ్రీ అజయ్ కల్లాం (2013లో ముఖ్యమంత్రికి ముఖ్య కార్యదర్శి) కార్యనిర్వహణాధికారి. తెలివైనవాడు. కార్యదక్షునిగా మంచి పేరున్నవాడు, సౌమ్యుడు.

తన చేతనయినంత సేవ చేయాలన్న తహతహ కలవాడు. నిర్ణయాలు తీసుకొనే సామర్థ్యం కలవాడు. ఒకసారి తను ఆలోచించి నిర్ణయం తీసుకొన్నాక, ఎన్ని ఒడుదొడుకులు వచ్చినా, సాధించాలన్న పట్టుదల కలవాడు.

ఇన్ని దశాబ్దాలలో ఎన్నోసార్లు చర్చించడం, ఎంతో ఖర్చు పెట్టడం జరిగినా, కార్యసాఫల్యం కాకపోయిన దృష్ట్యా ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం ఈ మహాప్రాకారంతో దొరుకుతుందని నమ్మి కార్యరంగంలోకి దిగాడు.

కాని ఇంకో ప్రాకారం కట్టాలంటే స్థలం కావాలి. ఆలయం వెనుకవైపు స్థలానికి ఇబ్బంది లేదు. ఇప్పటికే మాస్టరు ప్లాను పనుల్లో చాలావరకు భూమి ప్రైవేటు వ్యక్తులు, సంస్థలనుండి ఆలయానికి సంక్రమించింది. ఉత్తర, దక్షిణాలలో పెద్దస్థలం లేదుకాని, మాడవీధులున్నాయి కనుక, ఏదో విధంగా ప్రాకారం ఏర్పాటు చేయవచ్చు. కాని స్వామి పుష్కరిణితో కొంచెం ఇబ్బంది. పుష్కరిణి దక్షిణభాగం మెట్లు, ఆగ్నేయం మూల కొంత పుష్కరిణి నీటిభాగం పైన కొత్త ప్రాకారం గోడ వస్తుంది. ఉన్న ఇబ్బంది అంతా ఆలయం తూర్పువైపున తూర్పుమాడవీధి ప్రాకారం లోపలికి పోతుంది. ఈశాన్యంలో ఊంజల్ మండపం తీసివేయాలి. ఆలయం వెనుక భాగంలో కొత్త ప్రాకారంలోకి వచ్చేటట్లు కళ్యాణమండపం పోటు కట్టడమా? లేక, ఆలయం ముందు వెయ్యి కాళ్ల మండపం, ఇతర ప్రైవేటు కట్టడాలు, పెద్దజియ్యంగారి మఠం, బేది ఆంజనేయస్వామి ఆలయం దాకా కొట్టేసి, ఆలయం ముందు స్థలం చదును చేసి, కొత్త ప్రాకారం గోడ కట్టి, ఆ ప్రాకారానికి ఇప్పటి ప్రాకారానికి మధ్య కొత్తపోటు/ కళ్యాణ మంటపాలు కట్టడమా?– ఈ ఆలోచన బాగానే వుందన్న నిర్ణయానికి వచ్చారు.

ఇంక చెయ్యాల్సింది – ఆలయం ముందున్న కట్టడాల్ని కొట్టేసి ఖాళీ జాగా తయారుచేయడం. ఆలయం ముందు దాదాపు 16 మెట్లతో ఎత్తైన ప్రదేశం, ఆపైన గొల్లమండపం, సన్నిధివీధి వున్నాయి. 1982లో సన్నిధి వీధి బాగా వెడల్పు (100 అడుగుల పైన బేది ఆంజనేయస్వామి ఆలయం దాకా) చేసినా, రెండు వైపులా దుకాణాలు, దుకాణాల వెనుక దక్షిణం వైపు పాత వెయ్యి కాళ్ల మండపం... ఉత్తరం వైపు రకరకాల సత్రాలు, మఠాలు– చివరగా బేది ఆంజనేయ స్వామి ఆలయానికి పక్కన పెద్ద జియ్యంగారి పెద్ద మఠం వున్నాయి. విశాలమైన స్థలం కావాలంటే పెద్ద జియ్యంగారి మఠంలో సగం పైన కొట్టేయ్యాలి. మిగతా కట్టడాల యజమానులతో మాట్లాడి ఒప్పించాలి. దుకాణదారులకు ప్రత్యామ్నాయంగా మంచి చోట దుకాణాలు చూపెట్టాలి.

ఆలయంతో సత్సంబంధాలు వుండి, ఒక రకంగా ఆలయం పైనే (ఆదాయం కోసం) ఆధారపడే పెద్ద జియ్యంగారు దేవుడి అవసరానికని మఠం కొట్టడానికి ఒప్పుకున్నారు. సగం మఠం అక్కడే వుంచి (ప్రాచీనకాలం నుండి అక్కడే వుంది కనుక బేది ఆంజనేయుని ముందు వుందన్న సంప్రదాయం దెబ్బతినకుండా) వేరే చోట మాడవీథిలో ఆలయానికి దగ్గరగా ఇంకొక మఠం భవనాన్ని దేవస్థానం వారు కొత్తగా కట్టించేటట్లు ఒప్పందం జరిగింది. దుకాణదార్లకు మంచిచోట వేరే దుకాణాలు, వున్నవాటి కంటే పెద్దవి ఇచ్చేలా, వారిని ఒప్పించడం జరిగింది. మిగతా మఠాల, సత్రాల విషయంలో కూడా ఇబ్బంది లేకుండా ఒప్పందాలు కుదిరాయి.

ఇక మిగిలింది వెయ్యి కాళ్ల మండపం... 12 అడుగుల ఎత్తు గల కొండ ప్రదేశాన్ని తవ్వి, చదును చేయడం. 1972 నాటికే వెయ్యి కాళ్ల మంటపం భగ్నమండపంగా గుర్తించబడింది కదా! అంటే అప్పటికే మండపంలో ఒకవైపు దాదాపు 100 స్తంభాల వరకు శిథిలమైపోయింది. 1982లో (నేను కార్యనిర్వహణాధికారిగా వుండగా) సన్నిధి వీథిని ఆరు అడుగుల నుండి 100 అడుగుల వెడల్పు చేయడానికి, దాదాపు 200 స్తంభాల వరకూ తీసేయడం జరిగింది. ఆ తీసేసిన మండపాల భాగంలో మూత్రశాలలు, పోలీసు స్టేషను, బ్యాంకు శాఖలు, ఇతర విక్రయశాలలు వుండటంతో, వాటిని తీసివేయడానికి అభ్యంతరాలు ఏమీ రాలేదు. అదీకాక తీసివేసిన భాగంలో శిల్పచాతుర్యం గల స్తంభాలు లేకపోవడం, కొన్ని అది వరకే విరిగిపోయి శిథిలావస్థలో వుండటంతో ఎవ్వరూ పట్టించుకోలేదు.

వెయ్యి కాళ్ల మంటపం దేవస్థానాల అధీనంలో వున్నప్పటికీ, ఆలయం బయట ఒక నిర్దుష్టమైన శిల్పచాతుర్యంతో 12 అడుగుల కొండచరియపై చూడడానికి చాలా సుందరంగా వుండే ఈ ప్రాచీన చారిత్రాత్మక కట్టడాన్ని కొట్టి వేయడానికి ఆలయ అధికారులకు అంత ధైర్యం చాలలేదు. ఆ పాలకమండలిలో/ఇతర అధికారస్థాయిలో చర్చలు జరిగాయి. అప్పటికే ఆలయం చేపట్టిన ఈ అభివృద్ధి కార్యక్రమాల విషయంపై మీడియాలోనూ, భక్తులలోనూ చర్చ మొదలైంది. మహాప్రాకారం అవసరమా? నాల్గవ ప్రాకారం కట్టడం ఆలయసమ్మతమా? చారిత్రాత్మక వెయ్యి కాళ్ల మండపం కొట్టి - ప్రాకారం కట్టాల్సిన అవసరం ఉందా? ఇలా.

శ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ చిన జియ్యర్‌గారు ఆలయంలో అభివృద్ధి పేరుతో తీసుకొంటున్న నిర్ణయాలపై బహిరంగంగానే అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆలయ

పాలకులు ఆయనతో సంప్రదింపులు కూడా జరిపి, చేపట్టదలచుకున్న కార్యక్రమాలు వివరించారు. అయినప్పటికీ ఆయనకు సమాధానం కల్గినట్లు లేదు. ముఖ్యంగా పెద్ద జియ్యంగారి మఠం కొట్టే విషయంలో చాలా వ్యతిరేకత. పెద్ద జియ్యంగారు ఈ విషయంలో ఒప్పుకొన్నా, అది ఆలయ అధికారుల బలవంతంపై జరిగిందని చిన జియ్యర్‌గారి అభిప్రాయం.

సుప్రీంకోర్టు మిరాశీలు రద్దు చేస్తూ ఇచ్చిన తీర్పు ఆచరణలో పెట్టినప్పుడు, జియ్యంగార్లకు ఆలయం నుండి వచ్చే ప్రసాదాల భాగాలు (అదే వారి ముఖ్య ఆదాయం) మిరాశీలుగా వస్తున్నాయి కనుక, అవి కూడా రద్దయినట్లు నిర్ణయించి, రెండు జియ్యంగార్ల మఠాలకూ ఆదాయం లేకుండా చేశారు. నిజంగా జియ్యంగార్ల మఠాలు మిరాశీలు కావు. వంశపారంపర్యంగా ఇతర మిరాశీదార్ల లాగా కాదు... జియ్యంగార్లు సన్న్యాసులు. చిన్న జియ్యంగారిని, పెద్ద జియ్యంగారు ఎంపిక చేస్తారు. ఆలయం కూడా ఆమోదం తెల్పాలి. పెద్ద జియ్యంగారు పరమపదం చేరితే, చిన్న జియ్యంగారు పెద్ద జియ్యంగారుగా పదవికి వచ్చి, ఇంకొకరిని చిన్న జియ్యంగారుగా నియమిస్తారు... వారికింద ఎంతో మంది ఏకాంగులు వుంటారు. తిరుమల–తిరుపతి దేవస్థానాల అధీనంలో వున్న అన్ని దేవాలయాలలో ఏ సన్నిధిలో ఏ సేవ చేయాలన్నా, ఏ ఉత్సవరులకు ఏ ఉత్సవం చేయాలన్నా, జియ్యంగారుకాని, అతని ప్రతినిధి గాని లేకుండా సేవ జరిగే అవకాశం లేదు. ఆలయం మూసిన తర్వాత ఆలయం తాళాలు పరిరక్షించేది ఈ జియ్యంగార్లే. ఆలయం తలుపులు తీయాలన్నా, ఆలయాన్ని రాత్రిపూట మూసివేయాలన్నా వీరు దగ్గరుండి సీళ్లు వేయాలి. హుండీ లెక్కింపు పరకామణి విషయమైనా, ఆలయ ఆభరణాల భద్రత విషయాలైనా– అన్నింటిలోనూ ఈయన లేకుండా కార్యక్రమం జరగదు. ఆలయానికి కొన్ని శతాబ్దాలుగా ఒక ధర్మకర్తగా వ్యవహరిస్తూ వచ్చిన వ్యవస్థ ఇది. ఈ రెండు మఠాల నిర్వహణ/ఏకాంగుల పోషణ విషయంలో చాలా ఖర్చు వుంటుంది. అందుకే దాదాపు అర్చకులతో సమానంగా వీరికి కూడా ఆలయనైవేద్యాలలో పెద్ద భాగం వస్తుండేది. వారి భాగాన్ని విక్రయించుకొని, ఆ ఆదాయంతో మఠాల నిర్వహణ జరుపుతుంటారు.

మిరాశీల రద్దుతో, వీరినీ మిరాశీదార్లుగా పరిగణించి నైవేద్యప్రసాదంలో భాగాలు ఆపివేశారు. దానితో వారి బాధ్యతలు, ఖర్చులు మిగిలాయికాని, ఆదాయం లేకుండా పోయింది. కొంతకాలం శిష్యుల, అభిమానుల ఆదరణతో కాలక్షేపం జరిగినా, ఆలయపాలక వర్గానికి, వీరి బాధ్యతలు, పరిస్థితులు అవగాహనకు వచ్చి, క్రమంగా

ఆలయ నిధుల నుండి మఠాల నిర్వహణకు సొమ్ము మంజూరు చేసే విధానం మొదలైంది.

రామానుజుల కాలం నుండి, ఎవ్వరికీ భయపడక, ఎవరి సహాయసహకారాలు అర్థించక, స్వతంత్రప్రతిపత్తితో వ్యవహరించి, ఆలయంలో అర్చన, పూజాది విషయాలలో లోపం లేకుండా, యాత్రికులు చేసిన దేవదేయాలతో వారు కోరుకున్న కైంకర్యాలు, సక్రమంగా జరిగేట్టు చూడాల్సిన బాధ్యత వీరిది. ఆలయపాలకులకు గాని, అర్చకులకు గాని సమాధానం చెప్పాల్సిన అవసరం లేక, భక్తుల సంప్రదాయ పరిరక్షణ స్వతంత్రంగా చేయడానికి స్థాపించబడిన ఈ వ్యవస్థ, ఆర్థికస్వాతంత్ర్యం కోల్పోయి, ఒక రకంగా ఆలయపాలకుల దయాదాక్షిణ్యాల మీద ఆధారపడే దుఃస్థితికి వచ్చింది.

అందుకే పెద్ద జియ్యంగారి మఠం కొట్టడానికి పెద్ద జియ్యంగారు ఒప్పుకోక తప్పలేదన్న ఉద్దేశాన్ని శ్రీమన్నారాయణ చిన జియ్యర్ వ్యక్తం చేశారు.

వెయ్యి కాళ్ల మండపం చారిత్రాత్మక కట్టడం మాత్రమే కాదని, స్వామివారి నివేదనలు చేయడానికి కట్టిన మతపరమైన కట్టడమనీ, అటువంటి శిల్పనైపుణ్యం గల పురాతన, ఆధ్యాత్మిక కట్టడాన్ని కొట్టడం సమంజసం కాదని, శ్రీమన్నారాయణ చినజియ్యంగారు తమ అభిప్రాయాల్ని, దేవస్థానాల విధానాలకు వ్యతిరేకతని బహిరంగంగా వ్యక్తం చేయడం ఆరంభించారు.

దానితోపాటు ఆయన ఆలయ పూజావిధానాలలో కూడా చాలా లోపాలు జరుగుతున్నాయని, సంప్రదాయాలకు విరుద్ధంగా కార్యక్రమాలు జరుగుతున్నాయని అభిప్రాయం వ్యక్తం చేశారు. దానికొక కారణం కూడ వుంది (తర్వాత నేను త్రిసభ్య కమిటీ అధ్యక్షునిగా పరిశీలించినప్పుడు తెలిసింది)...ఆలయ అర్చనాది విషయాలలో లోపాలు ఏమైనా జరుగుతున్నాయా అన్న విషయం 'ప్రశ్న' ద్వారా పరిశీలించే శాస్త్రీయ ప్రక్రియ కేరళలో ఆచరణలో వుంది. ఈ శాస్త్రం తెలిసిన నిష్ణాతులైన పండితులు శాస్త్రానుసారంగా కొంత మంత్రప్రక్రియ చేసి ప్రశ్నలు - సమాధానాలు చెప్పి, ఆలయంలో జరిగే కార్యక్రమాలలోని లోపాలు ఆలయపాలకుల దృష్టికి తెస్తారు. ఆ లోపాలు సరిదిద్దే కార్యక్రమం ఆలయపాలకులు చేపడతారు... తిరుమల శ్రీవారి ఆలయవిషయంలో కూడా అప్పటి పాలకులు, కేరళ నుండి పండితులను తిరుమలకు రప్పించి ఈ ప్రశ్న ప్రక్రియ జరిపించారు... ఆ ప్రక్రియ చూడటానికి, అందులో

భాగం పంచుకొని సూచన లివ్వడానికి శ్రీమన్నారాయణ రామానుజ చినజియ్యరు గారికి కూడా ఆహ్వానం పంపితే వారు కూడా పాల్గొనడంతో, ఆ సమయంలో బయటపడిన లోపాల గురించీ ఆయనకు తెలిసే అవకాశం కలిగింది.

ఇలా ఒకవైపు విమర్శలు, వాటికి సమాధానాలు, వాటిపై చర్చలు, మొదట బహిరంగంగా కాకుండా తర్వాత బహిరంగంగా జరుగుతుండగా, ఆలయపాలకులు, అధికారులు, తాము చేయదలచిన కార్యక్రమం ఆచరణలో పెట్టడం ప్రారంభించారు. ఒకసారి శ్రీమన్నారాయణ చిన జియ్యర్ బహిరంగంగా విమర్శలు చేస్తున్నా, పట్టించుకోకుండా ఆలయ అధికారులు కొట్టడాలు నిర్వహిస్తూండటంతో, విమర్శలు తీవ్రం అయ్యాయి. దానికి మీడియాలో పెద్దగా ప్రచారం మొదలుకావడంతో ఆలయప్రణాళికను సమర్థిస్తూ వ్యాఖ్యలు చేసే ఇంకో వర్గం ఏర్పడింది. కంచి స్వామీజీ, విశాఖ స్వరూపానందేంద్ర స్వామీజీ ఆలయనిర్ణయాలు సమర్థిస్తూ బరిలోకి దిగారు.

వైఖానస ఆగమం పాటించే తిరుమల ఆలయవిషయాలలో పాంచరాత్ర ఆగమం పాటించే శ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ చిన జియ్యర్ జోక్యం చేసుకోవడం తగదనీ, తిరుమలలోని జియ్యంగారి మఠాలపై ఆధిపత్యం చలాయించి, తిరుమల ఆలయ విషయాలలో తమ ప్రాపకం పెంచుకోవడానికే ఈ విమర్శలు చేస్తున్నారనీ వారు వాదించారు.

ఇలా మఠాధిపతులు బాహాటంగా విమర్శనాస్త్రాలు వేసుకుంటుంటే మీడియా ఊరుకుంటుందా? అగ్నిలో ఆజ్యం పోసినట్లు పెద్ద గాలివాన...! రోజుకొక కొత్త విషయం చర్చనీయాంశం. వైఖానస ఆగమవిషయాలపై అందరూ చర్చించుకోవడమే. అద్వైతులైనా, ద్వైతులైనా, శైవులైనా, వైష్ణవులైనా, పాంచరాత్రులైనా... అందరికీ శ్రీనివాసుడే దైవం... ఎవరి ఉద్దేశం వారిది. వారు విషయం తెలిసినా, తెలియకపోయినా బాహాటంగా చెప్పడం, చర్చించడం... ఆ రోజుల్లో ఇంకో విషయమేమీ లేదు. అందరికీ తిరుమల విషయాలే.

అలా చర్చకు వచ్చిన విషయాల్లో వివాదాస్పదాల్లో ముఖ్యమైనవి:

1. ఇప్పుడు తిరుమల ఆలయంలో ఎన్ని ప్రాకారాలున్నాయి? రెండు అని కొందరు; మూడు అని కొందరు.

2. ఇంకొక ప్రాకారం నాల్గవదయితే అది ఆగమసమ్మతమా?

3. స్వామివారి కళ్యాణాలు (హోమంతో) ఆలయం బయట చేయడానికి ఆగమం ఒప్పుకుంటుందా?

4. ఆలయం బయట చేసిన లడ్డూలు నైవేద్యానికి పనికి వస్తాయా?

5. అసలు ఇంకొక ప్రాకారం అవసరమా?

6. మహా ప్రాకారం అన్నివైపులా సమానంగా వుండాలా?

7. మహాప్రాకారం గోడ – పుష్కరిణి గుండా వెళ్లవచ్చా? అది ఆగమసమ్మతమా?

8. దర్శనానికి వెళ్లే యాత్రికుల క్యూ ప్రాకారం గోడ కిందినుంచి వెళ్లటం ఆగమ సమ్మతమా?

9. వెయ్యి కాళ్ల మండపం చారిత్రిక కట్టడమా? ఆధ్యాత్మిక కట్టడమా?

10. అటువంటి శిల్పచాతుర్యం వున్న ప్రాచీన–చారిత్రాత్మక కట్టడం, మన సంస్కృతికి చిహ్నామైనదాన్ని కొట్టడం సమంజసమా? అలా కొట్టవలసిన అవసరం వుందా?

11. ఆలయం ముందు వున్న గొల్లమండపం చారిత్రాత్మక కట్టడమా? దాన్ని అక్కడ నుండి తీసి వేరొక చోటికి తరలించాల్సిన అవసరం ఏమిటి? దానికీ, గొల్లవారికీ సంబంధం ఏమిటి?

12. ఈ గొల్లమండపం దెబ్బతిన్నదా? అక్కడ వుండటం యాత్రికులకు ప్రమాదమా?

13. మహాప్రాకారం కోసం ఇప్పుడున్న ప్రాచీన వూంజల్ మండపం కొట్టివేయడం సమంజసమా?

14. ఇప్పుడు చేస్తున్న కొట్టడాలూ, కట్టడాలూ వాస్తుసమ్మతమా?

15. ఆగమపండితులు ఒక్కోసారి ఒక్కో అభిప్రాయం ఎందుకు చెబుతున్నారు? వారు స్వతంత్రంగా వారి భావాలు వ్యక్తం చేస్తున్నారా? సమయానుకూలంగా సమాధానాలు చెప్తున్నారా? ఆగమం తెలిసి చెపుతున్నారా?

16. ఈ విషయంలో నిజంగా ఆగమం ఏమి చెబుతుంది?

17. ఆలయ పాలకమండళ్లు చర్చించి, ఆలోచించి, అవగాహనతో నిర్ణయాలు చేస్తున్నారా?

18. చారిత్రాత్మక కట్టడాల పరిరక్షణ విషయంలో ఆలయం బాధ్యత ఏమిటి? ప్రభుత్వం బాధ్యత ఏమిటి?

19. తిరుమల ఆలయంలో ప్రాచీనకాలం నుండి పూజావిధానంలో నిర్దుష్టమైన విశిష్టత వుంది కదా! భక్తుల రద్దీ దృష్ట్యా పూజావిధానాలు సడలింపు చేయడంగాని, నిర్లక్ష్యం చేయడంగాని జరుగుతోందా?

20. ప్రభుత్వాలు నియమించిన పాలకమండళ్లు ప్రభుత్వం కోసం, రాజకీయాల కోసం పని చేస్తున్నాయా? లేక ఆలయ అభివృద్ధికి, సంప్రదాయపరిరక్షణకు, ధర్మ ప్రచారానికి పని చేస్తున్నాయా?

21. ఈ విషయాల్లో పీఠాధిపతులు, మఠాధిపతుల పాత్ర ఏమిటి?

22. భవిష్యత్తులో వివాదాస్పదవిషయాలపై నిర్ణయాలు తీసుకోవాలంటే చేపట్టపలసిన జాగ్రత్త లేమిటి?

ఇలా కూలంకషంగా ఆలయానికి సంబంధించిన అన్ని విషయాలూ చర్చకు వచ్చి, ప్రతి విషయంలోనూ సానుకూలంగా, ప్రతికూలంగా చెప్పే రెండు వర్గాలుగా భక్తులు చీలి పోయారా అన్న భావం ప్రచారమయింది.

ఆలయపాలకుల నిర్ణయాలు సమర్థించే వర్గం - దానిని వ్యతిరేకించే, శ్రీమన్నారాయణ చిన జియ్యరు గారిని సమర్థించే వర్గం...!

ఇలా చర్చలు జరుగుతూనే వున్నాయి. ఆలయపాలక మండలి, అధికారులు వెయ్యి కాళ్ల మండపం దెబ్బతినకుండా ఊడదీసి, పుష్కరిణికి వెనుక భాగాన పునర్నిర్మించాలని నిర్ణయం చేయడమే కాక, అమలు కూడా చేయసాగారు. దాన్ని వ్యతిరేకిస్తున్న శ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ చిన జియ్యర్‌గారు చర్చాస్థాయి నుండి వివాదాన్ని ఆందోళన స్థాయికి తీసుకువెళ్లారు. అయినా ఆలయ అధికారులు కట్టడాలు కూల్చివేయడమే కాక, ఆలా ఖాళీ అయిన స్థలం ఆలయానికి 12 అడుగులు ఎత్తుగా ఉండటంతో, ఆ కొండను తవ్వి, ఆలయసమతలానికి వుండేలా చదును చేశారు.

అప్పటికి శ్రీ త్రిదండి చిన్న జియ్యర్‌గారి ఆందోళన తారస్థాయికి చేరి, రాస్తా రోకో దాకా రావడంతో, తాను ఆమరణ నిరాహారదీక్ష చేస్తానని చిన్న జియ్యర్‌గారు ప్రకటించడంతో రాష్ట్రప్రభుత్వం - ఈ విషయంలో జోక్యం చేసుకొని ప్రభుత్వం తరఫున తవ్విన కొండను మళ్లీ పూడ్చి, అదివరకున్న చోటనే యథాతథంగా వెయ్యి కాళ్ల మండపం పునర్నిర్మించాలని మెమో. 24406/Ends-111/A1/2004 ద్వారా 2004 ఆగస్టు 9వ తారీఖున ఉత్తర్వులు జారీ చేశారు.

అదే సమయంలో కొంత భాగం హాథీరాంజీ మఠంది పోతూండటంతో, దాన్ని ముట్టుకోరాదని ఆ మఠంవారు, గొల్లమండపం ముట్టుకోరాదని కొందరూ, పెద్ద జియ్యంగారి మఠం ముట్టుకోరాదని మరికొందరు, మహాప్రాకారం కట్టకూడదని, కొట్టడాలు చేయకూడదని... ఇలా ప్రజా సంబంధిత వ్యాజ్యాలు రాష్ట్ర హైకోర్టులో ఆరు కేసులుగా దాఖలు అయ్యాయి.

అలా చిలికి చిలికి గాలివానగా మారి పరిస్థితులు చేజారిపోతున్నాయన్న తరుణంలో ఏకపక్షనిర్ణయం సమంజసం కాదేమో అన్న భావానికి అప్పటి ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి వచ్చారు. ఫలితంగా ఈ విషయాలన్నీ కూలంకషంగా చర్చించి, వీలయినంత వరకూ అందరికీ ఆమోదయోగ్యమైన, సంప్రదాయవిరుద్ధం కాని, ఆగమసమ్మతమైన పరిష్కారాలు కనుగొనడానికి ఒక త్రిసభ్య కమిటీని నియమిస్తూ 2004 అక్టోబరు 19 వ తారీఖున G.O. Ms. No. 830 ద్వారా ఆదేశాలు జారీ చేశారు.

ఆ త్రిసభ్య కమిటీకి అధ్యక్షునిగా నన్ను నియమించడంతో, ఈ విషయంలో నాకూ ఒక పాత్రని శ్రీనివాసుడు కల్పించినట్లయింది. రిటైర్డ్ ఐఏఎస్ అధికారులు శ్రీ చెంగప్ప, శ్రీ వై. చక్రధరరావు కూడా ఈ కమిటీలో సభ్యులుగా నియమితులయ్యారు.

★ ★ ★

80. త్రిసభ్య కమిటీలో కమిటీలు

అలా ఈ వెయ్యి కాళ్ల మండపం చరిత్రని విచారించాల్సిన అవసరం మా కమిటీకి ఏర్పడింది. అయితే ఈ విషయంలో మాకున్న సాంకేతికపరిజ్ఞానం ఎంత?

అందుకని ముందుగా మాకు పూర్తి వివరాలు ఇవ్వటానికి నేను ఒక ప్రత్యేక కమిటీని- పురావస్తు శాఖ నిపుణులు, శాసనాలు పరిశీలించగలిగిన (Epigiophiots) వారిలో ఒక నిపుణుల సంఘాన్ని ఏడుగురు సభ్యులతో నియమించడం జరిగింది. అప్పటి సాలార్ జంగ్ మ్యూజియం సంచాలకుడు (పూర్వ తిరుమల-తిరుపతి దేవస్థానాల మ్యూజియం అధికారి) డాక్టర్ ఎ.కె.వి.యస్. రెడ్డి, విశ్రాంత పురావస్తు శాఖ సంచాలకులు డాక్టర్ వి.వి. కృష్ణ శాస్త్రి, ప్రభుత్వంలో శాసనాల విభాగం ఉపసంచాలకులు డాక్టర్ పి.వి. పరబ్రహ్మశాస్త్రి, చరిత్ర/ఎపిగ్రఫీ ప్రొఫెసర్ శ్రీ ఎస్.ఎస్. రామచంద్రమూర్తి, ప్రసిద్ధ స్థపతి, ఆలయభవనాల కాల నిర్ణయం చేయడంలో నిపుణులు, 'నిధి' పురావస్తు శాఖోపాధ్యాయులు డాక్టర్ ఇ. శివనాగిరెడ్డి, సాలార్‌జంగ్ మ్యూజియం ఉప క్యూరేటరు వీరేందర్, తిరుమల-తిరుపతి దేవస్థానాల సలహాదారు శ్రీ పెరుమాళ్ స్థపతి- ఈ కమిటీలో సభ్యులు. ఆలయంలోని అన్ని శాసనాలు పరిశీలించడం, వెయ్యి కాళ్ల మండపం, ఇతర ఆలయాల కట్టడాలు పరిశీలించి తమ అభిప్రాయాలు తెలియజేయటం వారి బాధ్యత.

ఒక ఆగమసదస్సుని కూడా నిర్వహించాలి. దానికి వైఖానస పండితులందరినీ ఆహ్వానించాలి. అందులో ఈ మండపం కూల్చివేతకు అనుకూలంగా, ప్రతికూలంగా వాదించేవాళ్లు తమ తమ వాదాల్ని సమర్థించే శాస్త్ర ఆధారాలను తీసుకురావాలి. కళ్యాణాలను ఆలయం బయట చేయవచ్చా, బయట వంటశాలలో చేసిన లడ్డూలు నైవేద్యానికి పనికొస్తాయా, మహాప్రాకారం ఆగమసమ్మతమా? ఇలాంటి పలు ఆగమ సంబంధిత అంశాలపై ఈ సదస్సులో నిర్ణయాలు జరాగాల్సి ఉంది. ఈ సదస్సుకి మా తరఫున న్యాయనిర్ణేతలుగా ఈ వివాదమునకు సంబంధంలేని నలుగురు

ఉద్దండపండితుల్ని నియోగించాలి. అందుకోసం రాష్ట్రీయ సంస్కృత విద్యాపీఠ్ పూర్వ ఉపకులపతి డా॥ ప్రహ్లాదాచారి, ఇప్పటి ఉపకులపతి డా॥ గోవిందన్, సంస్కృత విద్యాపీఠంలోని ఆగమశాఖాధ్యక్షులు ప్రొ. కె.వి. కృష్ణమాచార్యులు, మద్రాసు మైలాపూర్ సంస్కృత కళాశాల ప్రిన్సిపాల్ డా.ఆర్. కృష్ణశాస్త్రిని నియోగించాం. వీళ్లు నలుగురూ వైఖానస, ద్వైత, అద్వైత, విశిష్టాద్వైత విద్వాంసులు. ఆ సదస్సు ఒక బృహత్కార్యంగా జరిగింది.

ఇదిలా వుండగా, ఆలయ భద్రతావ్యవహారాలు, ఆలయ కట్టడాలు, కొత్త ప్రాకారం నిర్మాణంలో పాటించాల్సిన భద్రతాంశాలు, వగైరాలను క్షుణ్ణంగా పరిశీలించి సలహాలివ్వటానికి తిరుమల-తిరుపతి దేవస్థానాల భద్రతాసలహాదారు డాక్టరు సుబ్రహ్మణ్యం అధ్యక్షతన ఒక సమావేశం ఏర్పాటు చేశాం. సీనియర్ పోలీసు అధికారులు గతంలో దేవస్థానంలో విజిలెన్స్ ఆఫీసర్లుగా పనిచేసిన ఐపిఎస్ అధికార్లు, తదితర భద్రతానిపుణులతో ఈ సమావేశం నిర్వహించాం.

ఆలయంలోని పోటు (వంటశాల), ఇతర కట్టడాల తాలూకు సాధకబాధకాలను చర్చించి సిఫార్సులు చేయటానికి ప్రభుత్వంలో పూర్వపు ఇంజినీర్-ఇన్-చీఫ్ డాక్టర్ రాఘవన్ అధ్యక్షతన ఒక కమిటీని వేశాం.

ఇలా అన్ని కోణాలలోనూ వెయ్యి కాళ్ల మండపం, కొత్త ప్రాకారం నిర్మాణాల విషయాన్ని కూలంకషంగా చర్చించటం జరిగింది.

ఇందులో నిపుణుల కమిటీల నివేదికలలో బయటపడిన విషయం ఏమిటంటే-

ఆలయంలో వగపడిలోని ఉత్తరం గోడమీద 1464లో చెక్కించబడిన (157 TT) శాసనం ఆలయం ముందున్న మండపానికి సంబంధించినది. ఆనాటి ఆలయాధికారి (స్థానత్తారు) చెక్కించిన ఈ శాసనం ప్రకారం సాళువ ఎర్రకంపదేవ కుమారుడు సాళువ మల్లయ్య దేవ మహారాయ ఈ వెయ్యి కాళ్ల మండపం కట్టించి, అందులో ఉత్సవస్వామివారిని వేంచేపు చేసి, తిరుప్పొనకం, ఒక అప్ప పడి, పాయసం, ఇతరనైవేద్యాలు చేయడానికి చేసిన దేవదేయం. ఈ ఉత్సవం ధ్వజారోహణ నాడు (క్షీరాబ్ధి ద్వాదశి అయి వుండాలి) చేయాలి. ఆ మండపం వెయ్యి కాళ్ల మండపం అయి వుండవచ్చు అని చరిత్రకారులు టికెటి వీరరాఘవాచార్య అభిప్రాయం.

రెండవ శాసనం 1482 నాటిది (248 TT). ఆలయంలోని రెండవ ప్రాకారంలో గోడ మీద చెక్కించబడిన 'దుర్గసముద్ర' గ్రామం దేవదేయం గురించి. శ్రీ సాళువ

నరసింహ చేసినది. ఆ ఆదాయం నుండి ఈ మండపం కట్టబడి వుండాలన్నది ఇంకొక అభిప్రాయం. సాధు సుబ్రహ్మణ్య శాస్త్రి, రమేశన్ గార్లు ఈ వెయ్యి కాళ్ల మండపం సాళువ నరసింహ చేత కట్టబడిందని భావిస్తారు.

కాని నిపుణుల కమిటీ నివేదిక ప్రకారం – ఈ రెండు శాసనాలూ వెయ్యి కాళ్ల మండపానికి సంబంధించినవి కావని, మొదటి శాసనం ఆలయంలోని తిరుమల మండపం దగ్గర వున్న గరుడమండపానికి సంబంధించినదని, ఆ పనులు రెండు దఫాలుగా జరగడంతో రెండు శాసనాలు వచ్చాయనీ, ఆ రెంటికీ ఈ వెయ్యి కాళ్ల మండపంతో సంబంధం లేదనీ, ఆలయం బయట కట్టబడిన ఈ వెయ్యి కాళ్ల మండపం కట్టిందెవరో ఇదమిత్థంగా చెప్పే శాసనాలు లేవనీ, శిల్పకళ, చెక్కడాలలోని గజకేసరి, పరుగెత్తే గుర్రాలు, పెద్ద ధ్వజస్తంభాలు విజయనగర కాలపు కట్టడంగా కన్పిస్తుందని తెలుస్తోంది. ఈ కట్టడం చారిత్రాత్మకం, భద్రపరచవలసినది కాని, ఈ మండపంలోకి స్వామివారిని తెచ్చి పూర్వం నైవేద్యాలు చేసే వారనడానికి ఆధారాలు లేవన్నట్లు కమిటీ సభ్యులు తేల్చారు.

ఆగమవిషయాలు పరిశీలించిన ఆగమనిపుణుల సంఘం ఈ విషయంలో వైఖానస ఆగమం ప్రకారం ఆలయం బయట కూడా మంటపాలు, మహామంటపాలు కట్టే సంప్రదాయం వుందని, ఈ వెయ్యి కాళ్ల మంటపం శిలాశాసనాలకు సంబంధించినది కావచ్చునీ ఒక అభిప్రాయానికి వచ్చారు. పురావస్తు శాఖ శాసనాల నిపుణుల సంఘం మాత్రం ఇటువంటి విషయం నిర్ధారించడానికి తగు ఆధారాలు కన్పించడం లేదన్నారు.

ఈ నిపుణుల సంఘాల ఉద్దేశాలు, ఇతర ఆలయ రికార్డులు, ఈ విషయంలో ఆచార్యపురుషుల, మఠాధిపతుల, భక్తుల భావాలు అన్నీ పరిశీలించి మా త్రిసభ్య కమిటీ ఈ వెయ్యి కాళ్ల మండపం విషయంలో చేసిన నిర్ధారణలు ఈ విధంగా ఉన్నాయి:

1. మనకు అందుబాటులో ఉన్న ఆధారాలను బట్టి, 1462, 1482 లో చెక్కించిన రెండు శిలాశాసనాలలో ప్రస్తావించబడిన మండపాలు, ఈ వెయ్యి కాళ్ల మండపం అని ఇదమిత్థంగా చెప్పడానికి అవకాశం లేదు.

2. అలా నిర్ణయించలేనప్పుడు ఇది స్వామివారి సేవలకు వినియోగింపబడే ఆధ్యాత్మిక కట్టడమా కాదా అన్నది చెప్పడం కష్టం.

3. ఆగమసదస్సు పరిశీలన దృష్ట్యా ఆలయానికి బయట కూడా వైఖానస ఆగమ సంప్రదాయంలో మండపాలు కట్టే సావకాశం వుంది. ఈ వెయ్యి కాళ్ల మండపం ఆలయానికి ముందు ఈశాన్యంలో వుంది. కాని స్వామిని ఆ మండపానికి తెచ్చారని చెప్పడానికి నిశ్చయమైన ఆధారాలు లేవు.

4. ఈ వెయ్యి కాళ్ల మండపం అక్కడనుండి తొలగించి, వేరే చోటకు మార్చవచ్చని, పురావస్తు శాఖ నుండి, తిరుమల-తిరుపతి దేవస్థానాలు వారు అనుమతి తీసుకోవడం అది వరకే జరిగింది. దీనికి ఆగమపండితుల ఆమోదం కూడా వుంది. ఇది కళానైపుణ్యం గల చారిత్రాత్మక కట్టడం కనుక దీనిని భావితరాలకు అందేలా చూడాలి.

5. ప్రస్తుతం ఈ మండపం అక్కడనుండి తొలగించబడింది.

6. ఇప్పుడు నిర్ణయించవలసిన విషయం - కూలగొట్టబడిన మండపాన్ని తిరుమల-తిరుపతి దేవస్థానాల పాలకమండలి నిర్ణయం ప్రకారం పుష్కరిణి వెనకాల పునర్నిర్మించాలా? లేక ముందు ప్రభుత్వం ఆదేశించినట్లు యథాతథంగా అదివరకు వున్న చోట, వున్నట్లే పునర్నిర్మించాలా? అది కూడా అది వరకు తవ్విన కొండ ప్రదేశాన్ని అదివరకున్న ఎత్తుకు మళ్లీ పూడ్చి దానిపైన మళ్లా కట్టాలా?

7. ఈ ఆలయం ముందు వున్న ప్రదేశం చాలా విలువైనది; ఆలయ సదుపాయాలకు చాలా కీలకమైనది. దాన్ని యాత్రికుల సౌకర్యార్థం, ఆలయ అవసరాలకు సద్వినియోగం చేయాలి. అలా అని పురావస్తు చారిత్రాత్మక కట్టడాన్ని నిర్లక్ష్యం చేయవచ్చునా?

8. ఈ రెండు విషయాలూ సమన్వయం చేస్తూ, అందరికీ ఆమోదయోగ్యమైన పరిష్కారం ఏమైనా వుందా?

9. ఆలయం బయట కళ్యాణోత్సవాలు జరపడం ఆగమసమ్మతమే అని ఆగమసదస్సు నిర్ణయించింది. ఆలయం బయట చేసిన లడ్డూల్ని నైవేద్యంగా బయట ఉత్సవవరులకు పెట్టవచ్చునని కూడా సదస్సు నిర్ధారించింది.

...ఈ విషయాల పైనే మా త్రిసభ్య కమిటీ దృష్టి పెట్టింది. అందరు మఠాధిపతులు, పీఠాధిపతులు, ఆగమపండితులు, చరిత్ర నిపుణులు, దేశవిదేశాల్లోని

సామాన్యభక్తులు - అందరి అభిప్రాయాలు విస్తృతంగా సేకరించి, విస్తారంగా చర్చలు జరిపాం.

అందరిచ్చిన సూచనలు పరిశీలించి, మా త్రిసభ్య కమిటీ ఇలా సిఫార్సు చేసింది: **"ఆలయానికి ఎదురుగా వున్న ఖాళీ స్థలాన్ని (వెయ్యి కాళ్ల మండపం కొట్టిందే కాకుండా ఇతర కట్టడాలు తీసేసిన స్థలం అంతా) ఒక మహామండప నిర్మాణానికి వినియోగించాలి. ఇది మన సంస్కృతీసంప్రదాయాలకు నిలయమై, వెయ్యి కాళ్ల మండప పూర్వవైభవాన్ని తలపించేదిగా ఉండాలి. వెయ్యి కాళ్ల మండపంలోని పాత స్తంభాలను (శిల్పచాతుర్యం కలవి) వీలైనంత వరకు ఈ మహామండపంలో వాడాలి. వాటిని బరువు మోసే వాటిలా వాడలేకపోతే, అలంకారికంగానైనా వాడాలి. అలా వాడుతూ, కొత్తగా వచ్చిన ఆధునిక విజ్ఞానం ఉపయోగించి 15,000 మంది దాకా యాత్రికులు/భక్తులు సావకాశంగా కూర్చుని, కార్యక్రమాలు చూసి ఆనందించే విధంగా చేయాలి.**

ఈ మహామండపానికి చుట్టూ స్తంభాలుంటాయి కాని, మండపం మధ్యలో స్తంభాలుండకుండా, ఎవరు ఏ మూల కూర్చున్నా కార్యక్రమాలు చూడగలిగేటట్లు నిర్మాణం జరగాలి. దక్షిణం వైపు - అంటే హాథీరాంజీ మఠం వైపు కార్యక్రమాలు జరపడానికి వీలుగా స్టేజీల ఏర్పాటు, ఆ స్టేజీల వెనుక భాగమంతా వెయ్యి కాళ్ల మండపాన్ని జ్ఞాపకం చేసేలా వెయ్యికాళ్ల మండపంలో తీసేసిన మంచి స్తంభాలతో మండపాలు కట్టాలి. అలాగే బేది ఆంజనేయస్వామి ఆలయానికి ఎదురుగుండా కూడా పాత వెయ్యి కాళ్ల మండపం తాలూకు స్తంభాల్ని ఉంచాలి.

స్వామివారి ఆర్జితసేవలన్నీ (ఇప్పుడు గుడి లోపల చాలా తక్కువమంది మాత్రమే రుసుము చెల్లించి చేసేవి, చూసేవి- కళ్యాణోత్సవంతో సహా) ఈ మండపంలో ఉదయం నుంచి సాయంత్రం వరకూ జరగాలి. రుసుము చెల్లించే వాళ్లే కాకుండా, సామాన్య భక్తులు సయితం పదివేల మంది దాకా స్వామివారి అన్ని సేవల్నీ ఉచితంగానే చూసి ఆనందించేలా ఏర్పాటు చేయాలి." ...ఇవే కాక మిగతా విషయాలు ఎన్నో పరిశీలన చేసి సూచనలిచ్చాం.

★ ★ ★

మా త్రిసభ్య కమిటీ నివేదికని ప్రభుత్వానికి అందించాం. ప్రభుత్వం దాన్ని అంగీకరించిందన్నారు. తిరుమల-తిరుపతి దేవస్థానాలు ఆమోదించాయన్నారు. హైకోర్టులో వున్న ఆరుకేసులు మా నివేదిక దృష్ట్యా మూసివేయబడ్డాయి. తారస్థాయికి చేరుకొన్న ఇరువర్గాల ఆవేశాలూ చల్లబడ్డాయి.

★ ★ ★

81. ఆగమ సదస్సు

2004 డిసెంబరు 3-4 తేదీల్లో తిరుపతిలో జరిగిన ఆగమ సదస్సుకి రెండు వర్గాలకు చెందిన ఆగమ పండితులను, తిరుమల ఆలయ ప్రధాన అర్చకులు, జియ్యంగార్లనే కాక, ఆలయ స్థపతులను, తమిళనాడు నుండి ప్రముఖ ఆలయ నిర్మాణ శాస్త్ర నిపుణులను కూడా ఆహ్వానించడం జరిగింది. ఎవరు ఏమి సలహాలిచ్చినా, ఆచరణలో పెట్టాల్సింది ఆలయ అధికారులు. కనుక తిరుమల ఆలయం యాజమాన్యం తరపున కార్యనిర్వహణాధికారిని, ఇద్దరు సంయుక్త కార్యనిర్వహణాధికారులను ఆలయ కట్టడాల వ్యవహారాలు పర్యవేక్షించే దేవస్థానాల చీఫ్ ఇంజినీరు, సంబంధిత అధికార్లను కూడా ఈ సదస్సుకు పిలవడం జరిగింది.

సదస్సుకు ముందురోజు- అంటే డిసెంబరు 2వ తేదీన, మా కమిటి సభ్యులం ప్రత్యేకంగా మేము ఆహ్వానించిన నిపుణుల (సంస్కృత పండితులు) నలుగురితో ప్రత్యేకంగా చర్చలు జరిపి, వివాద విషయాలు, వాటికి ఆగమసంబంధం, త్రిసభ్య కమిటీ నిర్ణయించాల్సిన విషయాలు, అవి ఆగమ ఆమోదమా కావా, ఇతర అనుబంధ విషయాలు, ఇరువర్గాల వాదనలు, వారు సమర్పించే శాస్త్ర ఆధారాలు- అవి మాత్రమే కాక, వైఖానస ఆగమానికి సంబంధించిన ఇతర విషయాల మీద రెండు వర్గాల వాదాలు విన్నాక, క్షుణ్ణంగా పరిశీలించి, భవిష్యత్తులో ఈ విషయాలపై ఇంకెటువంటి అనుమానాలకు తావు లేకుండా ఈ విషయాలన్నిటికీ ఆగమ సంబంధిత తుది అభిప్రాయాలపై ఏ నిర్ణయాలు ప్రభుత్వ, దేవస్థానం తీసుకోవాలో, సూచనలు చేయడానికి అనుకూలం చేయమని కోరాం.

పేరుకు సభ నా అధ్యక్షతన జరిగినా, సమస్యలు, వివరణలు, శాస్త్ర ఆధారాలు, సంబంధిత విషయాల ఇరువర్గాల నుండి రాబట్టుకొనే అవకాశం నలుగురు నిపుణులకు (పూర్వసంస్కృత విద్యాపీఠ వైస్‌ఛాన్స్‌లర్ శ్రీ ప్రహ్లాదాచారి నేతృత్వంలో) వదిలేశాం.

ఇంతేకాదు. అప్పటివరకూ వివాదంలోకి లాగబడిన అన్ని విషయాలపై, అన్ని వర్గాలనుండి వచ్చిన విమర్శలు, ప్రతిపాదనలు, సూచనలు, శాస్త్ర, ఆగమ, ఆధారాలు అన్నీ క్రోడీకరించి, మేము సదస్సుకు ఆహ్వానించిన అందరికీ సరఫరా చేసి, ఆ విషయాలపై వారు అభిప్రాయాలు సదస్సులో వ్యక్తం చేయమని ప్రార్థించాం.

ఆగమ సదస్సు మొత్తం ఆడియో, వీడియో రికార్డింగ్ చేసి భద్రపరచి, తర్వాత వాటిని త్రిసభ్యకమిటీ రిపోర్టుకు జతపరిచి ప్రభుత్వానికి, దేవస్థానానికి అందచేశాం. ముందు ముందు కాలంలో ఈ విషయాలలో ఎటువంటి సందేహం వచ్చినా, వాటికి సమాధానాలు ఇందులో వుండేట్లు చూశాం.

జరిగిన చర్చ అంతా తిరుమల ఆలయంలో ఆచరణలో వున్న వైఖానస ఆగమం గురించే. ఇతర ఆగమ ప్రసంగానికి ఈ సదస్సులో తావు ఇవ్వలేదు.

నిపుణుల కమిటీ వారి రిపోర్టు త్రిసభ్యకమిటీకి ఇచ్చేటప్పుడు, దేవస్థానాల కార్యనిర్వహణాధికారి, వారి అధికారుల సమక్షంలో ఏర్పాటు చేసి, నిపుణుల వారు రిపోర్టులో ఇచ్చిన విషయాలు, ఏఏ ప్రమాణాలతో, ఏ ఏ ఆధారాలతో ఇచ్చారో అందరి అవగాహనకు వచ్చేటట్లు ఏర్పాటు చేశాం. ఎందుకంటే ఈ వివాద విషయాలు హైకోర్టులో చాలా మంది వేసిన కేసులలోని అంశాలు. వీటిపై ఆగమ ప్రమాణాలు కోర్టు ముందు చూపడానికి ఈ ప్రక్రియ దోహదకారి అయింది. కార్యనిర్వహణాధికారి సూచన మేరకు దేవస్థానం ఆలయ సలహాదారులు, అర్చకులు, స్థపతులతో కూడా నిపుణుల కమిటీ వారి అభిప్రాయాలు చర్చించి ఇంకొక అవకాశం కూడా కల్పించినట్లు చేశాం.

ఇలా అన్నివిషయాలలో మళ్లీ మళ్లీ చర్చలు పునః పరిశీలన చేసి, ఫిబ్రవరి 9వ తేదీన (సదస్సు తర్వాత నెలరోజులకు) నిపుణులు వారి రిపోర్టు ఇచ్చారు.

వారి ఆగమ నిర్ణయాలు సంక్షిప్తంగా ఇలా వున్నాయి:

1. తిరుమలలో స్వామివారి కల్యాణోత్సవాలు, హోమంతో సహా, ఆలయ ప్రాకారం బయట చేయడం ఆగమ సమ్మతమే. ఆగమ విరుద్ధం కాదు. (అన్ని ప్రమాణాలు, ఆధారాలు నిపుణుల కమిటీ విపులంగా ఇచ్చారు).

2. నైవేద్యాలు రెండు రకాలు – స్వామివారికి ఆలయంలో పూర్తిగా నివేదన చేసే నైవేద్యాలు, ఆర్జితసేవల కోసం లేదా ప్రసాదంగా వితరణ/అమ్మకాల కోసం

చేసేవి. ఆగమం మొదటిరకం నైవేద్య విషయాల విషయమే చెప్తుంది. ఆగమంలో ఆర్జిత నైవేద్యాలు ఇలా చెయ్యాలని కాని చెయ్యకూడదని కాని ప్రస్తావన లేదు. ఆగమ సదస్సులో సభ్యులందరూ ఆలయం బయట వంటశాలలో (సంప్రదాయ బద్ధంగా ఆగమ సమ్మతంగా కట్టిన వంటశాల) తయారుచేసిన పిండివంటలు ఆర్జితనైవేద్యంగా పనికివస్తుందన్నారు. ఈవిషయంలో నిపుణులు కూడా ఏకీభవించి వారి సమ్మతి తెల్పారు. ఆ వంటశాల నిర్మాణంలో నైవేద్యాల తయారీలో సంప్రదాయం తప్పక పాటించాలని కూడా సూచించారు.

3. ఆలయానికి ఎన్ని ప్రాకారాలుండాలి, సరిసంఖ్యలో వుండాలా బేసి సంఖ్యలో వుండాలా అన్న విషయంలో నిపుణుల కమిటీ ఆగమప్రకారం ఏడో ప్రాకారం దాకా వుండవచ్చు అనీ, అవి 1 నుండి 7 లోపల ఎన్నైనా కావచ్చని, అంటే సరిసంఖ్యలోనే వుండాలి లేదా బేసిసంఖ్యలోనే వుండాలన్న నిబంధన ఏమీలేదని తేల్చి చెప్పారు. అంటే తిరుమలలో ఇంకొక ప్రాకారం కట్టాలంటే ఆగమ అభ్యంతరాలు లేవన్నారు.

4. వెయ్యికాళ్ల మంటపం గురించి తీర్మానిస్తూ, అది ఆగమ సమ్మతంలోనే కట్టిన కట్టడం అని- ఇటువంటి మండపాలు- ఆలయం బయటనూ కట్టవచ్చు, ఆలయప్రాకారంలోనూ కట్టవచ్చు అనీ తేల్చారు. ...ఇలా ఇంకా అనేక విషయాల మీద స్పష్టమైన వివరణలు ఇచ్చారు.

★ ★ ★

అలాగే ఇది వరకు చెప్పినట్లు మా త్రిసభ్యకమిటీ నియమించిన ఇతర నిపుణుల కమిటీలనుండి కూడా వివాద విషయాలన్నిటిపై, వారి పరిధిలో సమగ్ర నివేదికలు తయారుచేయించి, వాటిని మా ముగ్గురితోనే కాక, ఆలయ ముఖ్య అధికారులతో కూడా చర్చించడం జరిగింది. పురావస్తు శాఖా నిపుణులు, స్థపతుల, శాసన పరిశీలనా నిపుణుల నివేదిక, కట్టడాలకు సంబంధించి, స్థపతులు ఇంజనీరులు, సలహాదారు రాఘవన్‌గారి అధ్యక్షతన ఇంజనీర్ల సంఘ నివేదిక, భద్రతావిషయాల గురించి దేవాదాయ సలహాదారు పూర్వ, దేశ భద్రతా సంచాలకులు, శ్రీ సుబ్రహ్మణ్యం గారి అధ్యక్షతన జరిగిన నిపుణుల సంఘం నివేదిక ప్రత్యేకంగా తయారుచేయించాం.

ఈ పై నిపుణులందరూ చేసిన సూచనల్లో, మా త్రిసభ్య కమిటీ దేశంలోని ముఖ్యమైన మఠాధిపతులు, పీఠాధికారులతో చర్చించి, వారి అభిప్రాయాలు కూడా

సేకరించాం. వారందరిలో కొందరిని మేము ప్రత్యేకంగా కలిసి చర్చించినా, వారి వారి భావాలు వ్యక్తం చేయడానికి రాతపూర్వకంగా అందరి దగ్గరనుండి నివేదికలు తెప్పించాం.

ఇవి మాత్రమే కాక, అదివరకు చెప్పినట్లు దక్షిణాది రాష్ట్రాలలో విస్తృతంగా మా పర్యటన వివరాలు తెలిపి, సాధారణ భక్తులు, ఎవరైనా ఈ వివాదాస్పద విషయాలపై వారివారి భావాలు వ్యక్తం చేయడానికి అవకాశం కల్పించాం. ఇలా అన్ని వర్గాల నుండి సేకరించిన నివేదికలు, అభిప్రాయాలు, భావాలను, మా త్రిసభ్యకమిటీ నిశితంగా పరిశీలించి, చర్చించి, అన్ని వివాదాస్పద విషయాలపై ఏకగ్రీవ నిర్ణయాలను పొందుపరుస్తూ మా నివేదిక తయారుచేశాం. అలా మేం మా రిపోర్టులో ప్రభుత్వానికి, తిరుమల తిరుపతి దేవస్థానాలకు చేసిన కొన్ని ముఖ్యమైన సూచనలు ఇలా వున్నాయి.

1. తిరుమలలో స్వామివారి ఆర్జిత కళ్యాణ ఉత్సవాల హోమంతో సహా ఆలయ ప్రాకారం బయట చేయడానికి, వైఖానస ఆగమ సమ్మతం ఉంది. ఎటువంటి ఆగమ అభ్యంతరాలకూ తావులేదు. ఈ కళ్యాణోత్సవాలు, మా కమిటీవారు సూచించిన ఆలయం ముందు మహామండపం కట్టి, అందులో చేయవచ్చు.

2. మలయప్పస్వామి వారికి (ఉత్సవరులకు) చేసే అన్ని ఆర్జితసేవలు, ఉత్సవాలు, కళ్యాణోత్సవంతో సహా ఆలయం బయట జరపవచ్చు. (ఒక్క పవిత్రోత్సవం మాత్రం ఆలయంలో జరపాలి.)

3. ఇంకా ఎక్కువ భక్తులకు సౌకర్యంగా వుండటానికి ఇప్పుడు ఆలయంలో రోజూ చేస్తున్న స్వామివారి కళ్యాణోత్సవాలు, ఇతర ఆర్జిత సేవలన్నీ ఆలయం బయట ఈ కార్యక్రమాల కోసం అదివరకే కట్టిన వైభవోత్సవ మండపాలు వెంటనే జరిపించడం ప్రారంభించాలి. ఇలా చేయబోయేముందు, మా కమిటీ సూచించిన చిన్నచిన్న మార్పులు, చేర్పులు, ఆ వైభవోత్సవమండపానికి చేయాలి.

4. ఇప్పుడు కళ్యాణోత్సవంలో చాలా సమయం గృహస్తులచే సంకల్పం చేయించడానికే సరిపోతున్న దృష్ట్యా దీన్ని ఎక్కువమంది పురోహితులతో తక్కువ సమయంలో చేయించడానికి ఏర్పాట్లు చేయాలి. అలాసంకల్పాలు చేయిస్తున్నప్పుడు సంకల్పం చేసే గృహస్తు తప్ప ఇతరులకు వ్యాపకం లేని కారణంగా లౌకిక చర్చలు చేసే అవకాశం ఉంది. కనుక సంకల్పాలు

జరుగుతున్న సమయంలో వేదఘోష్టి, భక్తి సంగీతం, నాదస్వరం వంటి కార్యక్రమాలతో గృహస్తుల ధ్యాస ఆధ్యాత్మిక విషయాలపై వుండేట్లు చేయాలి.

5. ఆలయం ముందు వున్న ఖాళీ స్థలంలో, ఒక మహామంటపం నిర్మాణం చేయాలి. దానికి వాస్తు సంబంధంగా ఎలా వుండాలో, చూపే పద్ధతిలో వుండటానికి మా కమిటీ చేసిన సూచనల ప్రకారం ఆ మహామండపం కట్టాలి. మధ్యలో స్తంభాలే లేకుండా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి, దాదాపు 15 వేలమంది ఎండైనా, వానైనా ఇబ్బందిలేకుండా స్వామివారి సేవలు, ఇతర ఆధ్యాత్మిక కార్యక్రమాలు వీక్షించే అవకాశం వుండేట్లు ఈ మహామండప నిర్మాణం జరగాలి. బేడి ఆంజనేయస్వామి ఆలయం వైపు నుండి చూస్తే, అది పూర్వ వెయ్యికాళ్ల మండపంలా వుండాలి. స్వామివారికి సేవలు- కళ్యాణాలు, బ్రహ్మోత్సవాలు, వసంతోత్సవాలు, వాహనసేవలు, పూజాదులు, వగైరా అన్ని సేవలు చేయడానికి నిర్మించబడే ప్రదేశాలు, పూర్వ వెయ్యికాళ్ల మండపంలోని శిల్పకళానైపుణ్యం గల స్తంభాలతో కార్యక్రమాలు చూసే 15వేల మంది భక్తులకు, కార్యక్రమం వెయ్యికాళ్ల మండపంలో జరుగుతున్న భావన అనుభూతి తెచ్చేలా వుండాలి. ఆలయం ముందు నిలబడి చూసినా, ఈ మండపం పూర్వవెయ్యికాళ్ల మండపం చూస్తున్న అనుభూతి కల్గించేలా వుండాలి.

(వాస్తు ప్రకారం ఐదడుగుల ఎత్తుపైన ఈ మహామండప నిర్మాణం చేయాలని మేం సూచించడం వలన దాదాపు పదిమెట్లు ఎక్కి ఈ మండపంలోకి వెళ్లాలి కనుక, బ్రహ్మోత్సవాలలో ఇతర స్వామి వారి వాహనసేవలు జరిగేటప్పుడు - మెట్లపై నుండి, మండపంలో నిల్చొని, ఇప్పటి ఖాళీ ప్రదేశం నుండి స్వామివారి వాహన సేవను దర్శించే వెసులుబాటుని, అలాగే కొనసాగించే అవకాశం ఉంది. ఈ మహామండపం వలన ఎండ నుండి, వాననుండి భక్తులకు రక్షణ వుంటుంది. అన్ని సేవలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు, ఏ ఇబ్బంది లేకుండా సేవాదారులూ, రుసుము లేకుండా సామాన్య భక్తులూ చూడవచ్చు. కార్యక్రమాలు లేనప్పుడు (రాత్రివేళల్లో) వేలమంది యాత్రికులు విశ్రాంతి తీసుకొనే సావకాశం వుంటుంది.)

6. రోజంతా- అంటే ఉదయం నుండి, సాయంత్రం వరకు ఉత్సవరులకు చేసే అన్ని సేవలూ, అర్జిత సేవా టిక్కెట్టు కొన్నా, కొనకపోయినా చూసి ఆనందించే

అవకాశం కల్పించాలన్న ఉద్దేశ్యంతోనే మా కమిటీ ఈ మహామండప నిర్మాణాన్ని సూచించింది. రుసుము కట్టి సేవాదార్లుగా సేవ చేయించేవాళ్లకే కాక, సామాన్య యాత్రికులు ఉచితంగా స్వామివారి అన్ని సేవలూ చూసే భాగ్యం- దాదాపు 10 వేలమందికి కల్గించవచ్చు. ఇదేకాక, స్థలాభావం వలన ఆర్జిత సేవా టిక్కెట్టు దొరకక పోవడమనే ఇబ్బందిలేదు. లోపల మూలవరుల దర్శనానికి సంతృప్తి కల్గించలేకపోయినా, ప్రతి భక్తునికీ స్వామివారి సేవలు చూసే భాగ్యం కల్గించవచ్చు. ప్రతి భక్తునికీ స్వామివారి కళ్యాణ అక్షింతలు అందించే ఏర్పాటు చేయవచ్చు. అందుకే ఈ మహామండప సూచన.

(శ్రీశ్రీశ్రీ శ్రీమన్నారాయణ చినజియ్యరుగారు వెయ్యికాళ్ల మండపం యథాతథంగా పునర్నిర్మించాలని ఆందోళన చేపట్టినా, నేను ఈ మహామండప ప్రతిపాదనలో, అది నిర్మించేటప్పుడు యథాతథంగా కాకపోయినా, వెయ్యికాళ్ల మండప వైభవం కన్పడేటట్లు ఎలా చేయవచ్చో చెప్పినప్పుడు, చాలా పెద్ద మనస్సుతో ఆయన తన పట్టుదల వదలి భక్తుల సౌకర్యం కోసం మా ప్రతిపాదనకి ఆమోదం తెలిపారు.)

7. మహాప్రాకారం కట్టడానికి ఆగమ అభ్యంతరాలు లేకపోయినా, ఉత్తరప్రాకారం గోడ పుష్కరిణీ గుండా వెళ్లటం - దక్షిణప్రాకారం గోడ క్రింద నుండి భక్తుల క్యూ తీసుకువెళ్లడం ఆగమ సమ్మతం కాకపోవడంతో, సర్వదర్శనం భక్తులకు ఇంకొక నాలుగు ఫర్లాంగుల దూరం లైన్ పెరిగే ప్రమాదం వుంది. అదీకాక బ్రహ్మోత్సవాలు, వాహన సేవలకు ప్రాకారం/మహాద్వారం ముందు తగినంత స్థలం లేకుండా పోయే ప్రమాదం ఉంది. అయినా మహాప్రాకారం అవసరం కళ్యాణోత్సవాలకోసం, ఎక్కువ లడ్డూలు తయారు చేయడానికి పోటు (వంటశాల పెద్దది చేయడం) కోసం కదా!... మహాప్రాకారం అవసరం లేకుండా ఈ రెండు సమస్యలు పరిష్కారం అయితే, ఇంక ఈ కొత్త ప్రాకారం అవసరం ఏమిటి? కళ్యాణాలు బయట హోమంతో చేయడానికి ఆగమ అభ్యంతరాలు లేవని తేలింది. (ఇంక మిగిలింది లడ్డూ తయారీ విషయం.)

8. ఆగమ సదస్సు ఈ ఆలయం నైవేద్యం విషయం కూలంకషంగా చర్చించింది. మూలవరులకు ఆలయంలో చేసే నైవేద్యం విషయమే ఆగమంలో ప్రస్తావన వుంది. ఆర్జిత నైవేద్యం గురించి గుళ్లోనే చేయాలని గాని, బయట చేయకూడదని

గాని ఆగమ విధి, నిషేదాలు లేవని ఆగమ సదస్సు నిపుణులు నిర్ధారణ చేయడం జరిగింది. ఆలయంలో మూలవరులకు చేసే ఏ నైవేద్యమైనా, ఆలయ ప్రాకారంలోని పోటులోనే చెయ్యాలి. మూలవరులకు/వుత్సవరులకు చేసే ఏ అన్న నైవేద్యమైనా ఆలయం లోపలే (అంటే ప్రాకారం లోపల) చేయడం సమంజసం. ఉత్సవరులకు చేసే నైవేద్యాలకు మూలవరులకు చేసే నైవేద్యాల పవిత్రత వుంటుంది. భక్ష్యనైవేద్యాలు (పడిపోటు) అంటే అన్ననైవేద్యాలు కాని లడ్డు, వడ, జిలేబి, దోశ ఇత్యాది పడి నైవేద్యాలు శుచిగా, సంప్రదాయంగా ఆలయ ప్రాకారం బయట ప్రత్యేకంగా ఇందుకోసం కట్టిన పోటులో సంప్రదాయ బ్రాహ్మణులు (ఆలయంలో చేసే లాంటి వారు) చేస్తే ఉత్సవరులకు ఆలయం బయట నైవేద్యానికి పనికివస్తాయి. ఇలా ఉత్సవవరులకు అన్ని ఆర్జిత సేవలలో ఆలయ ప్రాకారం బయట నైవేద్యం చేసిన లడ్డూలు/ఇతర భక్ష్యాలు, ఆర్జిత నైవేద్యంగా వినియోగం చేయవచ్చు అన్నది ఆగమ నిపుణుల నిర్ణయం. దీన్నే మా నివేదికలోకీ మేం సూచించాం. దానికి అందరు మఠాధిపతుల, పీఠాధిపతుల అంగీకారం వుంది.

అలా ఇంకొక పెద్ద సంప్రదాయ పోటు బయట కట్టి, లక్షలలో లడ్డూలు తయారుచేసి, ఆర్జిత సేవలలో ఉత్సవ మలయప్ప స్వామికి నివేదన చేసి భక్తులకు ఆర్జిత నైవేద్యంగా అందించవచ్చు. దీనితో ఇంకొక మహా ప్రాకారం కట్టే అవసరం లేకుండాపోయింది.

ఆలయానికి ఆగ్నేయంగా అంటే ఇప్పుడు నాదనీరాజనం స్టేజి వున్న ప్రదేశంలో ఈ పడిపోటు కట్టాలని మా త్రిసభ్య కమిటీ సూచించింది. ఆర్జిత సేవామండపం వెయ్యికాళ్ల మండప స్తంభాలతో ఈ పోటుకు ముందు కట్టి, నైవేద్యాలు చేయడానికి సానుకూలం చేయవచ్చు. అంటే సేవా మండపాలకు వెనుక పడిపోటు, ముందు భక్తుల సందర్శనా ప్రదేశం, పోటు వెనుక కొండ కాబట్టి, సంప్రదాయానికి భంగం కలుగకుండా చూడవచ్చు. వాస్తుపరంగా ఆమోదయోగ్యం.

9. భద్రతా నిపుణుల సూచనలు దృష్టిలో వుంచుకొని, ఈ మహామండపానికి ఆలయ తూర్పుప్రాకారం/మహాద్వారాల మధ్య 100 అడుగుల ఖాళీ వదలాలని సలహా ఇచ్చాం. ఆలయం లోపల పెద్ద ఎత్తున వంటశాలలు నడిపి వందలకొద్దీ

పొయ్యిలతో మంటలు రోజంతా పెట్టడం, యాత్రికుల భద్రత దృష్ట్యా ఆలయం మండపాలు, నిర్మాణాల భద్రత దృష్ట్యా మంచిది కాదన్న భద్రతా సలహామండలి సూచన ఆమోదించి పడిపోటు బయటకు తరలించి, ఆలయంలో మూలవరులకు చేసే అన్న భక్ష్యనైవేద్యాలకు మాత్రమే ఆలయంలోపల వంటలు జరగాలని సూచించాం. భద్రతామండలి సూచించిన ఇంకొక కారణం- వందలమంది వంటవాళ్లు ప్రతిరోజూ ఎన్నోసార్లు ఆలయం లోనికి వెళ్లడం/బయటకు రావడం- లక్షలకొద్దీ లడ్డూల కోసం అవసరమైన సరుకులు ఆలయంలోనికి తీసుకువెళ్లడం (ప్రాకారం గోడపైనుండి కన్వేయర్ ద్వారా తీసుకెళ్లినా) భద్రతా లోపాలు జరగడానికి అవకాశం అవుతుందన్న వాదాన్ని అంగీకరించాం.

10. ఆలయంలో నేరుగా మూలవరులకు నైవేద్యానికి వినియోగించే కొద్దిపాటి అన్ని నైవేద్యాలు, కట్టెల పొయ్యి పైనే చేయించి, దానికి గ్యాసు వాడరాదని సూచిస్తూ- ఇతర ఆర్జిత నైవేద్యాలు ఆలయం బయట చేసేవి గ్యాసుపొయ్యిల మీద చేయవచ్చని సూచించాం.

11. అప్పటివరకు ఆచరణలో వున్న పెద్ద కళ్యాణాలు, ప్రత్యేక కళ్యాణాలు (తేడా అల్లా ప్రసాదాల విషయంలోనే) అనే వ్యత్యాసాన్ని తొలగించి, ఒకే కళ్యాణోత్సవం అందరికీ అమలుచేయాలని సూచించాం. మిరాశీలు రద్దుకావడంతో ఇలా రెండు రకాల కళ్యాణాలు చేసే అవసరం ఇక లేదని సూచించాం. (ఈ విషయాలు విపులంగా నా ఇంకొక పుస్తకం 'నాహంకర్తాహరిఃకర్తా (సర్వసంభవమ్) లో వివరించాను.)

12. సంపంగి ప్రాకారం ఉత్తర, పశ్చిమ మండపాలన్నిటిలో వున్న పడిపోటు (వంటశాల) వెంటనే మూసివేసి, ఆలయం బయట మేము సూచించిన ఆగ్నేయం మూలకు తరలించాలి.

13. వెయ్యికాళ్ల మండపం గురించి ఆగమ/ఆగమేతర విషయాలు చర్చించి, మా నిర్ణయాలు తెలిపాం. ఎలా వున్న వెయ్యికాళ్లమండపం పూర్వస్థానే అలాగే పునర్నిర్మించే బదులు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి, యాత్రికులకు సౌకర్యంగా వుండేట్లూ, పూర్వ వెయ్యికాళ్ల మండప వైభవం కన్పడేటట్లు, ఒక మహామండపం ఎలా కట్టాలో సూచించాం.

14. ఇప్పుడు సాయంత్రం వేళలో సహస్ర దీపాలంకార సేవకు వాడే ఊంజల్ సేవామండపం పడకొట్టకూడదని సూచించాం.

15. తూర్పు మాడావీథిని ఇప్పుడున్న 35 అడుగుల నుండి 100 అడుగులు వెడల్పు చేయాలని సూచించి, గొల్లమండపం దెబ్బతినకుండా కొత్త ప్రణాళికతో ఎలా సమన్వయం చేయాలో సూచించాం.

మా త్రిసభ్య కమిటీకి పరిశీలించమని ఇచ్చిన అన్ని విషయాలలోనూ సూచనలు చేయడం జరిగింది. తిరుమల మాస్టరు ప్లాను విషయంలో 1975లో జరిగిన చర్చలు, సూచనలు ఆధారంగా చేసుకొని, రాబోయే 20 సంవత్సరాల అవసరాలు దృష్టిలో ఉంచుకొని ఇంకొక సదస్సు సంబంధిత నిపుణులతో చర్చలు జరిపి, ఒక సమగ్ర ప్రణాళిక తయారుచేసి, పాలకమండలి ప్రభుత్వ ఆమోదం తెల్పాలని, అలా ఆమోదించిన ప్రణాళికను మార్చే హక్కు దేవస్థానం పాలకమండలికి వుండకూడదని సూచించాం.

16. మిరాశీ వ్యవస్థను సుప్రీంకోర్టు రద్దు చేసిన కారణంగానూ, జియ్యంగార్లని కూడా మిరాశీదార్లుగా పరిగణించిన కారణంగా రామానుజుల కాలంనుండి ఆచరణలో వున్న పాలకులు/అర్చకులు/జియ్యంగార్ల మీద ఆధారపడే ముక్కోణపు పాలనావ్యవస్థ దెబ్బతినిపోయింది. దీనితో రకరకాల కొత్త సమస్యలు వచ్చే ప్రమాదం వుంది. ఆలయ నగల సంరక్షణ విషయంలో, అర్చకులు ఆలయ సిబ్బంది కావడంతో క్రమశిక్షణ/సంప్రదాయ పరిరక్షణ సంబంధిత ఇబ్బందులు, జియ్యంగార్లు స్వతంత్రప్రతిపత్తి కోల్పోయి, ఆలయ పాలక మండలి దయాదాక్షిణ్యాలపై ఆధారపడటంతో, అటు అర్చకుల స్వతంత్రప్రతిపత్తి జియ్యంగార్ల స్వతంత్రప్రతిపత్తి పోయి, ఆలయ పాలకమండలి సర్వాధికారులు కావడంతో తలెత్తే పలు సమస్యలు చర్చించి, తగు నిర్ణయాలు ప్రభుత్వం తీసుకోవాల్సిన అవసరం ఉందని సూచించాం.

ఇవికాక, స్వామివారి సేవా సమయ విషయాలు, త్రికాల పూజా నైవేద్యాలు, అంగ ప్రదక్షిణ, వ్యాస రాయలు గురించి సంపంగి ప్రాకారంలోని శాసనం పునరుద్ధరించే విషయాలు తిరుమలలో చారిత్రక/ఆధ్యాత్మిక కట్టడాల పరిరక్షణ విషయంలో, శాసనాల పునఃపరిశీలన విషయయంలో, తిరుమలలో వున్న మఠాల నిర్వహణ విషయంలో సూచనలు చేశాం. కొండమీద రాజకీయ కార్యకలాపాలు

జరుపకూడదని, ఆర్భాటంగా, అట్టహాసంగా చేసే వివాహాలు కొండమీద జరగరాదని, ...ఇలాంటి ఇతర భద్రతా సంబంధిత సూచనలు మా నివేదికలో పొందుపరిచాం.

మా త్రిసభ్య కమిటీ నివేదిక ప్రభుత్వానికి అందించాం. ప్రభుత్వం దాన్ని అంగీకరించిందన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానాలు ఆమోదించాయన్నారు. హైకోర్టులో ఉన్న ఆరు కేసులు మా నివేదిక దృష్ట్యా మూసివేయబడ్డాయి. తారాస్థాయికి చేరుకొన్న ఇరువర్గాల ఆవేశాలు చల్లబడ్డాయి.

కాని కష్టపడి, ఎందరినో సంప్రదించి తయారుచేసిన ఆ నివేదిక... నివేదిక గానే మిగిలిపోయిందనిపిస్తోంది. పాలకమండలి సభ్యులు, కార్యనిర్వహణాధికారులు, ఎందరు చదివారో తెలియదు. కాని చేసిన సూచనలు ఆమోదించారన్నారే కాని, ఆచరణలోకి రాలేదు. కొండమీద ఆలయం ముందు వెయ్యికాళ్ల మండపం ప్రత్యామ్నాయంగా ఒక కట్టడం దేవస్థానం పాలకమండలి కట్టడానికి ఆమోదించారు. గత మూడు నాలుగు సంవత్సరాలుగా నెమ్మదిగా పని నడుస్తోంది. ప్రసాదు గారి రిపోర్టు ఆధారంగా పని చేస్తున్నామన్నారు. ఆ కొత్తగా కడ్తున్న కట్టడం, మేం సూచించినది కాదు. ఆ స్థలంలో కాదు, మేము ప్రతిపాదించిన మహామండపమూ కాదు. శ్రీమన్నారాయణ చినజియ్యరుగారు కావాలన్న వెయ్యి కాళ్లమండపమూ కాదు. అది ఎవరి ఆలోచనో ఎందుకు చేసిన నిర్ణయమో... పాలకమండలి మా రిపోర్టు సరిగ్గా చదివినా/అర్థం చేసుకొన్నా ఈ కట్టడం చేపట్టే అవకాశం లేదు. ఒకసారి కట్టడం పూర్తి అయితే అందరికీ కనువిప్పు కలుగవచ్చు. ఇది మళ్లీ కొత్త వివాదానికి దారి తీయకూడదని శ్రీనివాసునికి నా ప్రార్థన.

పాలనా మండలి సమావేశాలలో ముందుగా పరిశీలించి నిర్ణయానికి వచ్చిన విషయాలు చర్చించి నిర్ణయాలు తీసుకోవాలి గాని, పరిశీలన జరుగకుండా ఎవరైనా సభ్యుడు లేవనెత్తిన అంశంపై నిర్ణయాలు అప్పుడే తీసుకొనే సంప్రదాయం ఆపివేయాలి. కోట్లాది భక్తుల నమ్మకాలతో పెనవేసుకొన్న సంస్థ... ఆచితూచి నిర్ణయాలు తీసుకోవాలి. తొందరపడి ఆలోచించకుండా, హడావుడిగా నిర్ణయాలు తీసుకొంటే రకరకాల సమస్యలు వచ్చే అవకాశం వుంది. ఏ కొత్త విషయమైనా ఏ సభ్యుడైనా తప్పకుండా సమావేశంలో ప్రవేశపెట్టవచ్చు. దానిపై చర్చ జరగవచ్చు. కాని అందరికీ ఆలోచించుకోవడానికి అవకాశం ఇవ్వాలి. పూర్వాపరాలు పరిశీలించే అవకాశం దేవస్థానాల అధికారులకు ఇవ్వాలి. అప్పుడే నిర్ణయించకుండా, పరిశీలించి, వచ్చే సమావేశానికి సాధక బాధకాలు

వివరిస్తూ, ఆ విషయాన్ని నిర్ణయానికి తీసుకురావాలని తీర్మానించాలే కాని... తొందరపడి నిర్ణయాలు చేయరాదు. చూశాం కదా– 2009లో ప్రతిపాదించిన అనంత స్వర్ణమయం పథకం... పరిశీలన చేయకుండా తొందరపడి నిర్ణయాలు చేస్తే , అలాగే వివాదాలకి దారితీస్తాయి. ముందుముందున్న పాలకమండళ్లు నిర్ణయాలు చేసేటప్పుడు ఈ విషయం జ్ఞప్తికి వుంచుకోవాలి.

★ ★ ★

82. దోచుకున్న వాళ్లు 'అలా బాగుపడ్డారు!'

"**తి**రుమల శ్రీనివాసుడి ఆలయాన్ని అంటిపెట్టుకుని ఏదో ఒక ఉద్యోగంలో చేరిపోతే, కనీసం దళారీతనం చేస్తే బాగా దోచుకోవచ్చు" అనుకునే వాళ్లు మెకన్జీ నివేదికలు చదువుకోవడం మంచిది.

దోచుకునేవాళ్లకి మొదట్లో ఆ ఉద్దేశ్యం లేకపోయినా, సంపాదించుకుంటున్న ఇతరుల్ని చూసి "వాళ్లనేమీ చేయని దేవుడు నన్ను మాత్రం ఏం చేస్తాడు?" అనుకుంటూ అక్రమార్జనకు పాల్పడేవాళ్లు, ప్రలోభాలకి లొంగిపోయి భక్తుల్ని, ఆలయనిధుల్నీ కాజేయాలని చూసేవాళ్లు రెండు వందల శతాబ్దాల క్రితం కూడా వున్నారట.

శ్రీవారికి వచ్చే ఆదాయం, కానుకలు చూస్తే "దోచుకుపోదాం" అనే వెంపర్లాట కలిగి, వాళ్లు ఎలా మూటలు కట్టుకుపోగలిగారో, అలా పోతే ఏం జరిగిందో, వాళ్ల కుటుంబాలు ఎలా 'బాగుపడ్డాయో' మెకన్జీ నివేదికలు వెల్లడిస్తున్నాయి.

★ ★ ★

ఈస్టిండియా కంపెనీ తరఫున ఆనాటి కంపెనీ సీనియర్ అధికారి మెకన్జీ రాసిన రచనల్లో తిరుపతి, అప్పటి రాజకీయపరిస్థితులు, కంపెనీ వారికి, ఆర్కాటు నవాబుకు, ఇతర కీలకవ్యవస్థలకు, మరాఠీలకు, దక్కను నవాబులకు, ఫ్రెంచివారికీ మధ్య సంబంధాలు చాలా విపులంగా రికార్డు అయి ఉన్నాయి.

ఈ నివేదికలలో ప్రాచీనకాలం నుండి తిరుపతి – ముఖ్యంగా తిరుమల ఆలయ విషయాలు కూడా చర్చకు వస్తాయి. తిరుమల ఆలయం కింద 19వ శతాబ్ది మొదలు నాటికి తూర్పున శ్రీకాళహస్తి, ఉత్తరాన వేంకటగిరి, రాయచోటి వరకూ, దక్షిణాన నారాయణ వనం, కార్వేటి నగరం, పశ్చిమాన పూర్తి చంద్రగిరి తాలూకా, వాయల్పాడు తాలూకా, నాగపట్ల దేవరకొండ వరకూ గ్రామాలన్నీ విస్తరించుకొని ఉన్నాయి.

ఆ రోజుల్లో ఆలయం ఆర్కాటు నవాబు అధీనంలోకి వచ్చిన తీరు, రెంటర్లు, అమలుదార్లను నియమించిన విధానం, వారి పనితీరు కూడా ఈ నివేదికలలో వివరంగా చెప్పబడింది. వాటి ప్రకారం - ఆలయానికి ఎన్నో గ్రామాలు దేవదేయంగా ఉన్నాయి. అవి ఆలయం ప్రత్యక్షపాలనలో కాకుండా, ఆలయ అధికారులూ, పాలెగాళ్లు, జమీందారుల చేతుల్లో వున్న వివరాలు, ఆలయంలో ఎవరెవరు, ఏయే సంవత్సరాల్లో రెంటర్లుగా, అమలుదార్లుగా ఉన్నారో ఆ వివరాలు, ఏ సంవత్సరానికి ఎంత ఆదాయం వచ్చిందీ తెలిపే వివరాలు సహా ఉన్నాయి.

ఈ ఆలయ అధికారులు - పాలెగాళ్ల పరిధిలోని, జమీందారీల్లోని ఆలయగ్రామాల్లో విచారణలు జరిపి, ఇనాందారులను తొలగించడం గురించి, అందులో కొంత రైతువారీ హక్కులు ఇచ్చిన విషయం గురించీ తెలుపుతూ, "అధికారులూ, జమీందార్లు, పాలెగాళ్లు బాగుపడ్డారు కానీ, ఆలయం దెబ్బతిని పోయింది" అంటాడు మెకన్జీ.

ఏయే గ్రామాలు, భూములు (ఆలయానికి చెందినవి) ఎవరెవరికిచ్చారో, ఎందుకు ఇచ్చారో, కంపెనీవారు అందులో 18 గ్రామాలు ఎలా తీసుకున్నారో వివరాలు కూడా వున్నాయి.

ఆ రోజుల్లో భారతదేశం అన్ని ప్రాంతాలనుండీ యాత్రికులు తిరుమలకు ఎలా వచ్చేవారో, బ్రాహ్మణులు, గోసాయిలు, భక్తుల గుంపులను తీసుకొని, రాలేని ఇతర భక్తుల కానుకలను తీసుకుని కొండకు ఎలా వచ్చేవారో, భక్తితో ఆ కానుకల్ని ఎలా ఆలయానికి సమర్పించేవారో కూడా మెకంజీ వివరించాడు.

వచ్చిన యాత్రికులను సరిగ్గా ఆదరంగా చూసి, ఇబ్బందులు కలుగకుండా మర్యాద చేస్తే, సంవత్సరాదాయంలో 20,000 నుండి 30,000 పగోడాల ధనం అధికంగా ఆలయానికి వచ్చేదని చెప్పాడు. యాత్రికులు వచ్చే ప్రాంతంలో లేదా తిరుపతి పరిసరాల్లో రాజకీయ అలజడులు కాని, అనిశ్చితపరిస్థితులు కానీ వుంటే, ఆలయ ఆదాయం అలాంటి సమయాల్లో బాగా దెబ్బతినేది.

మెకన్జీ నివేదికల్ని సమగ్రంగా అధ్యయనం చేస్తే మనకి తెలిసే విషయాలు ఏమిటంటే-

"...కలియుగం ప్రారంభమైన నాటినుంచి 1800 సంవత్సరం వరకూ ఆలయంలో పూజలూ, సేవలూ క్రమం తప్పకుండా, సక్రమంగా జరుగుతూ వచ్చాయి.

కాని అమలుదార్లు, రెంటర్లు వచ్చిన తరువాత జరిగే నైవేద్యాలలో నాణ్యత తగ్గిపోతూ వచ్చింది. కారణం– అమలుదార్లు ఆలయ ఆదాయనిర్వహణలో చేసిన దేవద్రోహం. వాళ్లు సొంత ఆదాయాన్ని పెంచుకోవడం కోసం ఆలయనిధుల్ని ఖర్చుపెట్టకుండా కాజేసేవారు... నైవేద్యాల వాస్తవపరిమాణం తగ్గించి, ఎక్కువగా ఖర్చు పెట్టినట్లు లెక్కలు చూపించి, మిగతాది మింగేసేవారు. నవాబుకి, ఈస్టిండియా కంపెనీకి ముడుపులు కట్టాలని యాత్రికుల్ని పీడించేవారు.

"వాళ్లు బాగుపడ్డారా? 'దేవద్రోహం' చేసి దేవుడి సొమ్ము కాజేసినవాళ్లూ, దేవుడి పేరుమీద దోచుకున్న వాళ్లూ ఎంత బాగుపడ్డారంటే– అలాంటివాళ్ల కుటుంబాలు 'నిర్వంశం' (వారసులు పుట్టకుండా) అయిపోయాయి. అలా దోచుకున్నవాళ్లు ఆ దోచుకున్నదాన్ని అనుభవించే అవకాశం లేకుండా, మానసిక అశాంతికి గురై, అకాలమరణం చెందారు. ఇలాంటి అకాల మరణాలు ఏటా రెండో మూడో జరుగుతూనే వున్నాయి.

"అయినా ఈ వాస్తవాన్ని గ్రహించలేని వాళ్లు ఇక్కడ ఏదో రకంగా దేవుడి పేరు మీద సంపాదించుకుని మూటలు కట్టుకుపోవచ్చని వస్తూంటారు. లేదా, వచ్చిన తరువాత దోచుకుపోవాలని ప్రలోభపడతారు. దేవుడి సంపద అలాంటి ఆకర్షణ కలిగిస్తుంది. అలా ఆర్జించిన వాళ్లు ఒక్క నాణాన్ని కూడా తమతోపాటు కొండ నుంచి తీసుకుపోలేరు. ఒకవేళ తీసుకువెళ్లినా సుఖంగా అనుభవించలేరు. ఇలాంటి వాళ్లు అనేకమంది నాకు కనిపిస్తున్నారు.

"ఇందుకు విరుద్ధంగా తిరుమల శ్రీనివాసుణ్ణి భక్తితో కొలిచి, నీతినిజాయితీలతో సేవించిన వాళ్లు సుఖపడతారని కూడా అనేకమంది జీవితాలు నిరూపిస్తున్నాయి..."

– ఇలా సాగుతాయి మెకన్జీ నివేదికలు. ఆలయసేవలు, అధికారుల వైఖరి, ఆభరణాల పరిస్థితి వగైరా అనేక అంశాలని మెకన్జీ నిశితంగా అధ్యయనం చేశాడనిపిస్తుంది.

ఆ నివేదికల ప్రకారం–

"...విజయనగర రాజుల కాలంతో పోలిస్తే నైవేద్యాలలో వాసి, రాశి తగ్గిపోయాయి. ఈ 1800 సంవత్సరం నాటికి 1/64 వంతుకి ఈ క్షీణత కనిపిస్తోంది. కొండకి వచ్చిన యాత్రికులు చాలా అవస్థలు పడుతున్నారు...

“అలాగని బాగా పనిచేసినవాళ్లు లేకపోలేదు. ఉదాహరణకి 1795 సంవత్సరంలో రెంటరుగా కొల్లుస్వామి శెట్టి అనే ఆయన నవాబు దగ్గర తిరుమల ఆలయాన్ని లీజుకి తీసుకున్నాడు. చాలా నీతిమంతమైన సేవ చేశాడు. శ్రీవారి సేవలలో ఎక్కడా రాజీ పడకుండా నాణ్యత కాపాడాడు. భక్తులకు అసౌకర్యం కలగకుండా చూశాడు.

“మళ్లీ తరువాతి కాలంలో– విజయనగర రాజుల కాలంలో వున్న సేవలకిచ్చే సరకుని/ఖర్చుని – ఆయా అమలుదార్లు తగ్గించివేస్తూ వచ్చారు. విజయనగర రాజుల పాలన చివరి దశకి వచ్చేనాటికి, ఈ ఖర్చుని మూడువంతులకి తగ్గించారు... తరువాత ముసల్మానుల పాలన కాలంలో ఇది ఆరవవంతుకి, ఏడవ వంతుకి తగ్గిపోయింది...

(1700 నుంచి 1800 సంవత్సరాల వరకూ అమలుదార్ల వివరాలన్నీ ఈ నివేదికల్లో వున్నాయి.)

“1786–87 కాలంలో తాళ్లపాక తిరువేంగడాచార్యులు అమలుదారుగా వున్నారు. అప్పుడే ఆలయంలో దొంగలు పడి, స్వామివారి 32 విలువైన నగలని అపహరించారు... ఆసక్తికరమైన విషయమేమంటే– ఈ అమలుదార్లలో మొదటి ముగ్గురూ ముసల్మానులే – దావూద్ ఖాన్, సాదుల్లా ఖాన్, సర్దార్ అలీ. ఆ తరువాత శతాబ్దం చివరి వరకూ 28 మంది అమలుదార్లుగా వచ్చారు, వెళ్లారు. వీళ్లల్లో దీర్ఘకాలం పాటు వున్న వ్యక్తి మాత్రం శ్రీనివాసాచారి ఒక్కరే...”

కాని ఏ కాలంలోనూ ఆలయ అర్చకుల అర్చనవిధానంలోకాని, రామానుజులు ప్రవేశపెట్టిన ఏకాంగి/జియ్యంగార్ల వ్యవస్థలో కాని, ఆచార్యపురుషుల వ్యవస్థలో గాని ఎటువంటి మార్పు తీసుకురావడానికి ఎటువంటి ప్రయత్నమూ జరగలేదు. ఆదాయ/వ్యయాల మీదనే పాలకుల ధ్యాస. ...సంప్రదాయం సురక్షితంగా వున్నంతకాలమే వారికి ఆదాయం వుంటుంది అన్న సంగతి వారందరికీ బాగా అర్థమయింది.

అలా అమలుదార్ల జమానాలో కూడా ఆలయంలో కొన్ని అభివృద్ధి పనులు జరిగాయి. రామానుజుల కాలంలో స్వామివారికి సమర్పింపబడిన చక్రం, శంఖాలలో శంఖానికి కొంత మరమ్మత్తులు అవసరం కల్గినట్లు ఉంది. మొదట వెంకటరామ దీక్షితులు అనే అర్చకుడు 400 పగోడాల బరువు కలిగిన శంఖాన్ని బహూకరించాడు. కొంత కాలానికి అది బాగు చేయాల్సిన అవసరం కలిగితే దానికి ఇంకొక 100 పగోడాల భారం బంగారం కలిపి మొత్తం 500 పగోడాల బరువు గల బంగారు

శంఖాన్ని శ్రీనివాస దీక్షితులు అనే అర్చకులు తయారుచేయించి, 1800 సంవత్సరంలో స్వామివారికి సమర్పించారు.

10 బంగారు పిడులలో అమర్చబడిన నెమలి కన్నుల గుత్తులు ఎవరో బహూకరించినట్లు రికార్డు అయింది.

శ్రీదేవి, భూదేవీ సమేత శ్రీనివాసుడికి ఒక రథాన్ని కొండ మీద 400 రూపాయలతో చేయించి ఆత్మారామపంతులు, నరహరిపంతులు అనేవారు రథోత్సవము చేయటానికి ఏర్పాట్లు చేశారు.

ఈ మెకన్జీ రిపోర్టు రెండో భాగంలో ఆనాటి తిరుమలలో (1800 సంవత్సరంలో) పరిస్థితులు వివరంగా రాయబడి ఉన్నాయి... "ఆలయానికి చుట్టూ నాలుగు మాడ వీథులుండేవి, కాని వీథుల్లో అక్కడక్కడా ఇళ్లు ఉండేవి. కొండమీద చాలాతక్కువ జనాభా వుండేవారు. అందులో చాలామంది అడవిలో బతికే యానాది వాళ్లు. అడవి పందులు, పాములు, తేళ్లు... ఈ మాడవీథులలో యథేచ్ఛగా తిరిగేవి. కొండకు వచ్చిన యాత్రికులను- ఆలయాన్ని వదలి దూరంగా కొండలు, లోయలు, అడవిలో గుహల్లోకి వెళ్లవద్దని వారించేవారు.

"ఆ అడవుల్లో ఆ రోజుల్లో దాదాపు లక్షమంది యానాదులు నివాసం వుండేవారు. అడవులలో నుండి తేనె, చందనం, ఎర్రచందనం, మూలికలు, ఉసిరిక, కందమూలాలు వంటివి తెచ్చి తిరుమలలో అమ్ముకొని జీవించేవారు. ఈ కొండల్లో ఎన్నో గుహలున్నాయి. అవి మానవమాత్రులు చొరబడలేని ప్రదేశాలు... ఈ గుహల్లో ఒక గుహలో పెద్ద దారి వుండి, ఆ దారి అహోబిలం, శ్రీశైలం దాకా వుంటుందంటారు. దీన్ని గురించి నిర్ధారణగా ఎవరికీ తెలియదు. ఎందుకంటే ఆ గుహ చాలా పెద్దది. పొడుగైనది. అన్వేషకులు ఎంతదూరం వెళ్లినా దాని కొస దొరకలేదు..."

ఆ రిపోర్టుల్లో నాగపట్ల నాయక్ విషయం ప్రత్యేకప్రస్తావనగా వుంది. "ఈ నాగపట్ల నాయక్ కొండమీద వున్న అన్ని తీర్థాలు దర్శించాలన్న సంకల్పంతో కొంతమంది బ్రాహ్మణులతో, తన సైన్యంతో కలసి బయలుదేరాడు. కొన్ని ప్రదేశాలు దర్శించాక, వాళ్లని ఒక ప్రదేశంలో దేవసైన్యాలు అడ్డగించి, వారిని ముందుకు పోనీకుండా ఆపాయి. అయినప్పటికీ దేవసైన్యాన్ని నిగ్రహించి ముందుకు పోవాలని యత్నించి, ఈ నాయకుని సైన్యం అంతా చనిపోయారట! ఈ కథ బాగా ప్రచారంలో

వుండి, ఆ రోజుల్లో యాత్రికులు అన్ని తీర్థాలకు వెళ్లే అవకాశం లేదనీ, భగవంతునికి అది సమ్మతం కాకపోవచ్చునీ, ఆలయ సిబ్బంది వారించేవారు..."

"ఆలయానికి చుట్టూ కూడా, మాడవీథులతో కలిపి, అడవి పందులు తిరుగాడుతుంటాయి. అవి ఎవ్వరికీ హాని చేయవు- వాటి జోలికి పోతే తప్ప. యాత్రికులను ఏమీచేసేవి కావు. ఎవరైనా వాటిని కొట్టడానికి కాని, చంపడానికి కాని తలపెడితే, వారిని కోరలతో చీల్చి వేసేవి. అంతేకాని ఒంటరిగా తిరిగినా ఎవ్వరికీ వాటంతట అవి హాని చేసేవికావు.

"యాత్రికులకు, స్థానికులకు పాములు, తేళ్లు తిరుగాడుతూ కన్పించేవి. కాని అవి ఎవరినీ కరిచేవికావు, కుట్టేవికావు. ఎవరైనా వాటికి హాని తలపెట్టినప్పుడు అవి కాటు వేసినా, ఆ పాము కాని, తేలు కాని కరిచిన వ్యక్తిని వెంటనే ఆలయంలోకి తీసుకువెళ్లి, స్వామి వారి తీర్థం అతనికిచ్చి, కుట్టిన ప్రదేశంలో 'స్వామితీర్థం'తో రుద్దితే- విషం ఎక్కకుండా అతను బతికేవాడు. ఇదంతా భగవంతుని అనుగ్రహం వలననే జరుగుతోందని అందరి నమ్మకం..."

ఆ రోజుల్లో ఆలయ పారెపత్తేదారు ఆలయానికి ముఖ్య అధికారి అనుకోవచ్చు - ఆలయంలో పూజలు సక్రమంగా జరుగుతున్నాయా లేదా? కావల్సిన సరంజామా సక్రమంగా అన్ని సేవలకు అందుతూందా లేదా? అర్చకులు, జియ్యంగార్లు, అన్ని సేవలకు అందుబాటులో వున్నారా లేదా? సంప్రదాయవిరుద్ధం కాకుండా సకాలంలో ఆలయంలో పూజావిధానం కొనసాగుతుందా లేదా? ఆలయంలో హుండీని సక్రమంగా మూటలు కడుతున్నారా లేదా? ఆలయానికి, సేవలకు రావల్సిన వసూళ్లు సక్రమంగా వస్తున్నాయా లేదా? ఆలయనిధులు మధ్యలో ఎవరన్నా కాజేసే అవకాశం వుందా? ...ఈ బాధ్యతలన్నీ రోజువారీ వ్యవహారంగా చూడాల్సింది ఈ పారెపత్తేదారే.

ఆ రోజుల్లో సాధారణంగా ఈ పదవిలో బ్రాహ్మణులనే నియమించేవారు. ఆలయానికి వచ్చే ధనికయాత్రికులు, ముఖ్యమైన భక్తులు అంటే రాజులు, సామంతులు, మంత్రులు, మఠాధిపతులు, పీఠాధిపతుల వంటి వారు వచ్చినప్పుడు జరగవలసిన ఆలయమర్యాదలు సక్రమంగా జరిపించాల్సిన బాధ్యత కూడా ఈ అధికారిదే.

ఇతరభక్తులను కూడా సాదరంగా ఆహ్వానించడం, అందరికీ స్వామివారి దర్శనం విషయంలో సంతృప్తికలిగేలా చేసి, ఆలయ ఆదాయ అభివృద్ధికి తోడ్పడటం కూడా ఇతని కర్తవ్యమే!

అందుకే ఆ రోజుల్లో - 1800 నాటికి - ఈ ఉద్యోగపు విలువను గుర్తించి మంచి అధికారిని ఎంచి పారెపత్తేదారుగా నియోగించేవారు. ఎందుకంటే, ఇతని పని తీరుపైనే ఆలయం ఆదాయం ఆధారపడి వుండేది.

★ ★ ★

ఈ వ్యాసం 1800 సంవత్సరానికి సంబంధించిన ఈస్టిండియా చరిత్రలో భాగంగా వుండాలి. కాని కావాలనే ప్రస్తుత పరిస్థితులు చర్చించే సందర్భంలో చేర్చడం- ఆలయ అధికారులు, ఉద్యోగులు, అర్చకులు, ఇతర పాలకవర్గ సభ్యులు, ఒక ఆంగ్ల అధికారి ఆలయ విషయాలు, దేవుని సొమ్ము అపహరించిన వాడెవడూ బాగుపడరని రాయడాన్ని గమనించి... బాధ్యతలు నిర్వహించాలని.. ప్రస్తుత భాగంలో చేర్చాను.

83. అన్నదాన పథకంలో తప్పు జరిగింది

తిరుమల-తిరుపతి దేవస్థానాల చరిత్రలో నేను ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా వున్నప్పుడు ఒక 'తప్పు' చేశానని ఇప్పుడు బాగా అనిపిస్తోంది.

తిరుమల క్షేత్రంలో కొలువైవున్న కలియుగ దైవం శ్రీనివాసుణ్ణి దర్శించుకోవటం కోసం వందల, వేల కిలోమీటర్ల దూరం నుంచి ఎంతో ఆర్తితో, భక్తితో వచ్చే భక్తులకి కొండమీద శ్రీనివాసుడి పేరుమీద అన్న ప్రసాదం ఉచితంగా లభిస్తే ఎంతటి పరమానందాన్ని వాళ్లు పొందుతారు! అది చేయాలనుకున్నాను. చేశాను.

కాని, చివరికి జరిగిందేమిటి?

హోటల్ భోజనంలాగా ఉల్లిపాయ సాంబారుతో భోజనం పెడుతున్నాం! 'నిత్యాన్నదాన పథకం' కింద నేను ఆశించింది వేరు. తిరుమల వంటి పుణ్యక్షేత్రంలో ఎలాంటి అన్నప్రసాదం వితరణ జరగటం వాంఛనీయమో శాస్త్రాలు స్పష్టంచేస్తున్నాయి.

★ ★ ★

మన బుద్ధులు మనం తిన్న ఆహారం మీదే ఆధారపడతాయన్నది శాస్త్రం. తినేది సాత్త్విక ఆహారం అయితే సాత్త్విక బుద్ధులు, అదే - రాజస పదార్థాలో, తామస భోజనమో అయితే వాటికి తగ్గ ఆలోచనలు వస్తాయి. అంతేకాదు, వంటచేసేవాని మానసిక పరిస్థితి ప్రభావం, అతను తయారుచేసినవి తిన్నవారి భావాలపై ఉంటుందట.

మన పౌరాణికులు ఈ విషయంలో ఒక కథ చెప్తుంటారు. ఒక సాత్త్వికుడైన పీఠాధిపతి ఉండేవాడట. మంచి నిష్ఠాపరుడు, శాస్త్రపండితుడు. ఒకనాడు ఆయనకు ఒక సంపన్న గృహస్థుని ఇంట్లో భిక్ష జరిగింది. పూజా నైవేద్యాలు జరిగాయి. స్వామివారి భిక్షాభోజనం జరిగింది. ఇతరగృహస్థుల, అతిథుల భోజనాలు జరిగేటప్పుడు, స్వామివారు పీఠం కట్టివేసే సమయంలో స్వామివారి దృష్టి ఒక మంచి రజతపాత్రపై

పడింది. తన అభిషేకతీర్థం వుంచుకోవడానికి అటువంటి పాత్ర చాలా అవసరం. గృహస్థుని అడిగితే యిచ్చేవాడే. కానీ గృహస్థు చాలా ధనవంతుడు. అతనికి ఈ పాత్ర వుంటే ఎంత, పోతే ఎంత? 'చెప్పేదేవిటిలే' – అని తన ఇతర పూజాసామగ్రితో పాటు ఆ రజతపాత్రని కూడా మూటకట్టేశాడట.

కొద్దిసేపటికి స్వామివారు యింకో ఊరికి సంచారంగా వెళ్లే సందర్భం వచ్చింది. వెళ్లబోయే సమయానికి స్వామివారికి మనస్సులో ఏదో అలజడి...! రజతపాత్ర విషయంలో తను చేసినది తప్పుకదా? అది దొంగతనం అవుతుంది కదా? తనకు అటువంటి బుద్ధి ఎలా కలిగింది? తన సాధనలో ఏం లోపం జరిగింది – అని ఆలోచించి, గృహస్థుని పిలిపించి, తను ఆ పూట భిక్షలో తిన్న పదార్థాలు వండిన వంటవానిని పిలిపించమంటాడు.

వంటవాడిని ప్రశ్నిస్తాడు స్వామి. తెలుసుకొన్నదేమిటంటే ఆ వంటవానికి చెయ్యివాటుతనం వుందనీ, వంటకు వెళ్లినచోట, సామాన్లు, గిన్నెలు కాజేసే అలవాటు అతనికి వుందనీ తెలిసింది.

వాడు చేసిన వంట తినే తనకు ఇటువంటి దుర్బుద్ధి పుట్టిందని నిర్ధారించుకొని, గృహస్థునికి ఆ పాత్రని వాపసు యిచ్చి, వచ్చిన భక్తులకు తన ఉదాహరణ చెప్పి, ఆహారవిషయాల్లో జాగరూకులై ఉండాలని బోధిస్తాడు. నిష్ఠగల పండితులు స్వయంపాకం చేసుకోవడానికి కారణం ఇదే.

అందుకే పురాణంలో శ్రీనివాసుడు తనకు నైవేద్యం వండే వంటవారు వేదం చదివిన వారయి ఉండాలనీ, వేదాధ్యయనం చేస్తూ వంట చేయాలని చెప్తాడు.

పూర్వం సంప్రదాయకుటుంబాల్లో స్త్రీలు వంటలు చేసేటప్పుడు స్తోత్రాలు కాని, నామసంకీర్తన కానీ చేసే సంప్రదాయం ఉండేది. ఈ రోజుల్లో కూడా ధార్మికస్త్రీలు అలా వంటచేయడం చూస్తాం. అలా కాకపోతే ఏ విష్ణుసహస్రనామమో, త్యాగరాజ కీర్తనలో భక్తి సంగీతమో రికార్డు వింటూ వంట చేసే సందర్భాలున్నాయి. మనం భోజనం చేయడం ఒక యజ్ఞం వంటిది. అన్నగతప్రాణులం. తిన్న అన్నం నుంచే అన్ని ఆలోచనలూ వస్తాయి. అందుకే భోంచేసేప్పుడు గోవిందనామస్మరణ చేస్తూ భోజనం చెయ్యాలంటారు పెద్దలు.

అన్నశుద్ధి కోసమే భగవంతునికి నివేదన చేయాలి. అన్నంలోని దోషాల్ని భగవంతుడు తొలగిస్తాడు. సారరూపంలో తీసుకొని శుద్ధి చేసి మనకు భోజనం యోగ్యం చేస్తాడు. అందుకే భగవంతునికి నివేదన చేయనిదేదీ తినకూడదని శాస్త్రం.

సాధనలో యిది ఒక ముఖ్య భాగం. ఇంత శుద్ధి చేసిన భోజనం చేసినా తినేవాడికి పంచశూనదోషాలు వస్తాయని శాస్త్రం. నైవేద్యం పెట్టిన పదార్థాలలో దోషాలు పోతాయి. కాని వండడానికి, తయారుచేయడానికి, తరిగినప్పుడు, దంచినప్పుడు, వేయించినప్పుడు, ఉడకబెట్టినప్పుడు ఎంతో జీవహింస జరిగితేనే వంట సాధ్యం. అలాంటి హింసల వలన వచ్చేవే పంచశూనపాపాలు. అవి పోవాలంటే ప్రతిరోజూ 'వైశ్వదేవ' హోమంచేసి పాపనివారణ చేసుకోవాలి. అంటే నైవేద్యం పెట్టిన భోజనం తిన్నా, వైశ్వదేవం చేయని భోజనం చేస్తే ఎన్నో పాపాలు, దోషాలు అంటుతాయని శాస్త్రం.

సాధకులు ఈ విషయంలో జాగ్రత్తగా వుండాలి. తీర్థయాత్రకు వెళ్ళేదే పాపపరిహారానికి. తిరుమల శ్రీనివాసుని ఉనికే కలియుగంలో జీవుల పాపప్రక్షాళన కోసం. ఎక్కడో చేసిన పాపాల ప్రక్షాళనకు తిరుమల వచ్చి, ఆ పాపప్రక్షాళన చేసుకొని, వెళ్లాల్సిన మనం – తిరుమలలోనే పాపాలు చేసి, మళ్లీ సంచి నింపుకొని వస్తున్నామా?

క్షేత్రంలో పాపం చేస్తే మామూలుగా వచ్చే పాపం కన్నా విపరీతంగా పాపం వస్తుందని శాస్త్రం.

క్షేత్రంలో అయినా ప్రసాదాన్ని మాత్రమే భోజనం చేయగలగాలి. ఇతరపదార్థాలు, అంటే నైవేద్యం పెట్టని, ప్రసాదంకాని భోజనం తినరాదు... ముఖ్యంగా శాస్త్రంలో నిషేధింపబడిన పదార్థాలు తినరాదు.

కొండకు వెళ్లినా, అక్కడ వుండేది రెండు రోజులైనా, ఆ రెండురోజులు కూడా జిహ్వను చంపుకోలేక – ఉల్లిపాయ పెసరట్టు కావాలి, గుత్తివంకాయ కూర కావాలి, ములక్కాడ పులుసు కావాలి అనుకుంటే, వీటికోసం మయూర హోటలుకో, అన్నపూర్ణకో... యింకో హోటలుకో వెతుక్కొని వెతుక్కొని వెళ్లి మరీ తినాలి. ఉల్లిపాయ, వంకాయ, వెల్లుల్లి, మునక్కాడ వగైరాలను తామసపదార్థాలుగా ఎంచి, వాటిని సాధకులు తినరాదని శాస్త్రమే వాటిని నిషిద్ధపదార్థాలుగా నిర్ణయించింది.

పవిత్రంగా కొండకు వెళ్లినప్పుడయినా ఈ నిషిద్ధపదార్థాలు రెండు రోజులైనా లేకుండా గడపలేమా? దేవస్థానం వారు ఈ నిషిద్ధపదార్థాల్ని వాళ్ల వంటశాలలో వాడకూడదు. నిజానికి వాటి వినియోగాన్ని కొండమీద పూర్తిగా నిషేధించవచ్చు.

ఈ విషయం తెలిస్తే చాలామంది పాటించడానికి సిద్ధం. కొండమీద అందరికీ ప్రసాదం కావల్సినంత లభ్యమయితే, ఇంక హోటళ్లతో పని వుండదు. నిషిద్ధం తినే అవసరమూ ఉండదు.

పూర్వకాలంలో ముఖ్యంగా విజయనగరకాలం వరకూ రాజులూ, ధార్మికులూ చేసిన ధర్మాదాయాలవలన కొండకు వచ్చిన యాత్రికుల కందరికీ స్వామి నైవేద్యమే భోజనంగా దొరికేది. తిరుమలలో రామానుజకూటాలు, మఠాలు, అన్నసత్రాలు - వీటన్నిటికీ దాతల భాగంగా దేవాలయంలో పెట్టిన నైవేద్యం యాత్రికులకు వితరణకు వచ్చేది. ఏ కారణం చేతనైనా అందరికీ సరిపోను లేకపోతే, నిషిద్ధంకాని పదార్థాలు ఆయా సత్రాలలో వండి, వాటిని కూడా భగవంతునికి నివేదించి, దేవాలయం నుండి వచ్చిన ప్రసాదం, ఇక్కడ నైవేద్యం చేసిన ప్రసాదం కలిపినది భోజనంగా దొరికేది.

తర్వాత కాలంలో ముఖ్యంగా ఈస్ట్ ఇండియా కంపెనీ అధీనంలోకి ఆలయం వచ్చినప్పుడు, దేవదేయగ్రామాలు జప్తుచేసి, ఆదాయం లేకుండా చేయడంతో, ఆ ఆదాయంతో చేయాల్సిన నైవేద్యాలు అన్నీ ఆగిపోయాయి, రోజుకు నూరుసార్లు పైగా, వందల గంగాళాలు నైవేద్యం చేసే పరిస్థితి నుండి, రోజుకి మూడుసార్లు - అదీ "ఇంత నైవేద్యం మాత్రం" అని ఒక కట్టడిగా దిట్టం చేసి- అంతే నైవేద్యం - పెట్టడం, నైవేద్యం పెట్టిన ప్రసాదాన్ని ఆలయంలో మిరాశీదారులు, జియ్యంగార్లు, ఇతర వాటాదార్లకు ఇచ్చి, ఆలయం తరపున నైవేద్యం యాత్రికులకు అమ్మే సంప్రదాయం మొదలైంది. అలా అయినా, నైవేద్యమే తినాలన్న పట్టుదల కలవారికి నైవేద్యం ఖరీదుకైనా దొరికేది. అందుకే ఆ రోజుల్లో కళ్యాణోత్సవాలు చేసిన వారికి బుట్టలు, బుట్టలు నైవేద్యాలు ఇచ్చేవారు. అంటే కుటుంబానికీ, బంధువులందరికీ భోజనంగా సరిపడే నైవేద్యం ఇచ్చేవారు.

మిగతావారు వారివారి సంప్రదాయాలు ఆచరించే మఠాల్లో నైవేద్యాలు స్వీకరించేవారు. ఆ రోజుల్లో అన్ని సత్రాలలో కూడా భగవంతునికి నివేదన చేసిన భోజనమే పెట్టేవారు. శాస్త్రం ప్రకారం అన్నం అమ్మటం మహాపాపం. కాని, ఈనాడు... పరిస్థితి వేరు. దేవస్థానాల్లోనే ఈ పాపం ఎక్కువగా జరుగుతున్నట్టనిపిస్తుంది.

నేను తిరుమల-తిరుపతి దేవస్థానాల కార్యనిర్వహణాధికారిగా వున్నప్పుడు యాత్రికులందరికీ ఉచితభోజనం కొండమీద పెట్టాలన్న ఆలోచన వచ్చింది. ...కొండమీద భోజనవిక్రయం జరుగరాదన్న ప్రతిపాదన, వచ్చిన యాత్రికులకు కావల్సిన భోజన సదుపాయాలన్నీ - ఫలహారం, పాలు, ఇతరపానీయాలతో సహా - దేవస్థానమే ఉచితంగా సమృద్ధిగా సరఫరా చేయాలన్న నా ప్రతిపాదన, "ఆదర్శవంతమైనా, ఆచరణయోగ్యం కాదేమో" అన్న అభిప్రాయం పాలకమండలి వ్యక్తం చేసింది.

వెంటనే అమలు చేయలేకపోయినా దశలవారీగా అమలు చేయడానికి ప్రయత్నించాలన్న ఆలోచన అందరిలో కల్గింది. దాని ఫలితమే కొండమీద ప్రవేశపెట్టిన ఉచిత అన్నదాన పథకం.

ఆలయంలో స్వామికి అన్ని రకాల అన్నాలు, భక్ష్యాలు నివేదన చేసే సంప్రదాయం మొదటి నుండీ వుంది. దోసె, వడ, అప్పం, జిలేబీ, ఇడ్లీ వగైరాలు... అన్ననైవేద్యం సంగతి సరేసరి – పులిహోర, ఉప్పు పొంగలి, దధ్యోదనం, చక్కెరపొంగలి, కదంబం – ఇలా ఎన్నో రకాలు.. వీటిని చాలా పెద్ద ఎత్తున, తయారుచేయించి, ప్రసాదవితరణ చేయవచ్చు. కాని అప్పటి మిరాశీ సంప్రదాయం ప్రకారం నైవేద్యం పెట్టిన దాంట్లో దాదాపు సగభాగం వండిన పోటు మిరాశీదారులకు, నైవేద్యం పెట్టిన అర్చక మిరాశీదార్లకు, ఇతర జియ్యంగార్లు, ఆచార్యపురుషులు, గొల్ల, తదితర మిరాశీదార్లకు పంపకం అయ్యేది. మిగిలినది మాత్రమే ఆలయం వంతు. ఎన్నో గంగాళాలు నిజంగా స్వామి సన్నిధికి తీసుకువెళ్లి – నైవేద్యం జరుగకపోయినా – భాగాలు ఇవ్వాల్సిన అవసరం – మిరాశీ హక్కులవల్ల ఉండేది.

అంటే యాత్రికుల అవసరాలు మొత్తం ఈ నైవేద్యంతో తీర్చాలంటే – మామూలు దానికయ్యే ఖర్చుకంటే రెండింతలు అయ్యే పరిస్థితి ఉండేది. పైగా మిరాశీదార్లు వారి భాగంగా వచ్చి, వారు ఆలయంలో అమ్ముకొనటానికి అవకాశమున్న నైవేద్యంలోని వారి భాగాన్ని ఉచితంగా యాత్రికులకు పంచడానికి వీలుగా ఆలయానికి అమ్మాలని కోరినా, వారు ఒప్పుకోకపోవడంతో ఆలయంలో నైవేద్యాల పెంపు ఆచరణ యోగ్యమనిపించలేదు.

ఈ పరిస్థితి లడ్డూల విషయంలో కూడా వచ్చింది. వచ్చిన ప్రతియాత్రికుడికి లడ్డూ ప్రసాదం ఉచితంగా యివ్వాలని (ఒక లడ్డూ) అన్నది నా ఆలోచన. ఆలయంలో చేసిన లడ్డూలు సగం మాత్రమే ఆలయానికుంటాయి. సన్నిధిలో నైవేద్యం చేసిన లడ్డూలు – పోటులోని ఇతర లడ్డూలలో కలిపితే అదీ ప్రసాదమే. అందుకు ఆ ఆలయంలో నైవేద్యం చేసిన లడ్డూలు, బయట ఆలయంలో వంటచేసే వంట బ్రాహ్మణులతో బయట చేయించి వాటిలో కలిపితే అది కూడా నైవేద్యమే కదా? అలా చేయించి, ఉచితంగా యాత్రికులకు ఇవ్వడం మొదలుపెట్టాము.

అలాగే ఆలయాల్లో చేసేలాంటి అన్ని నైవేద్యాలనూ, బయట నిష్ఠతో ఆలయంలో లాగే చేయించి, ఆలయంలో నైవేద్యం చేయించిన ప్రసాదం వీటితో కలిపితే – అదీ

ప్రసాదమే కదా! ఇలా కొండమీద పలుచోట్ల చేయించి ఆలయం నుండి ప్రసాదం తెప్పించి వాటితో కలిపి భక్తులకు వితరణ చేయవచ్చుకదా!

ఇలాంటి ఆలోచనతో మొదలుపెట్టినదే తిరుమల-తిరుపతి దేవస్థానాల ఉచిత అన్నదాన పథకం. పాలకమండలి ఉద్దేశాలు తెలుసుకున్నాక, ఈ పథకానికి నిధులు ఎలా సమకూర్చాలన్నది పెద్ద సమస్య. ఆలయనిధుల నుంచి మొదలుపెట్టామంటే, అది కొంత కాలమే నడవవచ్చు. కావల్సినన్ని నిధులు వుండే అవకాశం లేదు. యాత్రికుల సంఖ్య పెరిగే కొద్దీ ఖర్చు మరీ ఎక్కువ అవుతుంది. అంతేకాదు, భోజనపదార్థాల ధరలు పెరిగే కొద్దీ, ఖర్చు పెరిగే అవకాశం ఇంకా ఎక్కువ. అంత ఖర్చు నిరంతరంగా పెట్టడానికి ఏ పాలకమండలీ ఒప్పుకోదు.

కాబట్టి దాతలను భాగస్వాములుగా చేస్తేనే ఈ కార్యక్రమం సక్రమంగా, నిర్విఘ్నంగా జరుగుతుంది. ఇది నా ఆలోచన.

తిరుమల దేవస్థానానికి మంచి పథకం వేస్తే దాతలకు కొదువ లేదు. కాని ఇటువంటి పెద్ద పథకం దాతలతో సంప్రదించి చేస్తేనే బాగుంటుందని, వచ్చిన భక్తులు కొందరితో చర్చించాను. అన్నదానం ఎక్కడ చేసినా చాలా పుణ్యం. అదే క్షేత్రంలో చేస్తే విశేషపుణ్యం. తిరుమల వంటి కలియుగవైకుంఠంలో చేస్తే చెప్పలేనంత మహాపుణ్యం. చాలామంది విరాళాలు ఇవ్వడానికి ఆసక్తిచూపారు. వాళ్ల విరాళాల్ని ఫిక్సెడ్ డిపాజిట్ చేసి, వాటిమీద వచ్చే వడ్డీతో ఈ పథకాన్ని నడపాలి. ఆ రోజుల్లో (1980 ప్రాంతంలో) రోజుకు వెయ్యిమంది భక్తులకు భోజనం పెట్టాలంటే రూ. 16.50 లక్షలు మూలధనం ఉండాలి. అంటే, అటువంటి రూ. 16.50 లక్షల విరాళం ఇచ్చేదాతలు 365 మంది ఉంటే ప్రతిరోజూ 1000 మందికి అన్నదానం చేయవచ్చు. మూలధనం పెరిగినకొద్దీ, రోజూ ఇంకా ఎక్కువమంది యాత్రికులకు భోజనం పెట్టవచ్చు.

ఈ పథకం విషయంలో విశేషశ్రద్ధ చూపిన భక్తుడు, అనంతపురంలో నూనె వ్యాపారి ఎల్.వి. రామయ్య. తాను మొదటివిరాళంగా తన రూ. 16.50 లక్షలు ఇవ్వటమే కాకుండా, దేశంలోని ఇతరదాతలను తానే ప్రత్యేకంగా కలుసుకొని దాదాపు 50 మందిని ఒప్పించడం జరిగింది.

పథకం మొదలు పెట్టాలంటే వండి వడ్డించే ఏర్పాటు చేయాలి కదా! ఒకేసారి రెండు వేలమంది కూర్చుని భోంచేసే భోజనశాల, కావల్సినంతమందికి ఆలస్యం కాకుండా వండి వార్చడానికి తగ్గ వంటశాల, కట్టెపొయ్యిలు కాకుండా పరిశుభ్రంగా నవీనపద్ధతులతో ఆవిరితో వంటలు తయారుచేసే ఆధునిక వంట యంత్రాలు కావాలి. వీటన్నిటికీ ఏర్పాట్లు చేయడానికి అయ్యంగారు అని కాఫీ బోర్డులో పలుహోటళ్లు నడుపుతున్న ఒక వ్యక్తికి అప్పగించాం. ఆయన్ని దేశంలో పెద్ద పెద్ద హోటళ్లున్న ఉడిపి, ధర్మస్థల లాంటి యాత్రాస్థలాలకు పంపి - తిరుమలకు సరిపడే పథకం తయారుచేశాం.

కొత్తగా కట్టిస్తున్న కళ్యాణకట్ట కెదురుగుండా పెద్ద ఉచితభోజనశాల, వంటశాల దేశంలోని అధునాతన వంటపరికరాలతో ఏర్పాటుచేశాం. చపాతీలు చేయడానికి మెషిన్లు, ఒకేసారి వందల, వేల కొద్దీ ఇడ్లీలు చేసే మెషిన్లు, వందల దోసెలు చేసే ప్రక్రియ- పెద్ద పెద్ద స్టీలు గంగాళాల్లో ఒకేసారి వేలమందికి సరిపడే సాంబారు, రసాలు చేసే ఆధునిక ఆవిరి గంగాళాలు, పెద్ద పెద్ద గుండిగల ద్వారా ఆవిరి నేరుగా పంపించి, కొద్ది నిమిషాల్లోనే వేలమందికి అన్నం వండగల గుండిగల వరుసలు, వేడినీళ్లతో, మనుషులు ముట్టుకోకుండా పాత్రలు శుభ్రం చేసే పరికరాలు వగైరాలను, జర్మనీవారితో సంప్రదించి లడ్డూలు తయారుచేసే పరికరాలను తెప్పించే ఏర్పాటు చేశాం.

రోజుకి 10 వేలమందికి 2 గంటల్లో భోజనం వండి వడ్డించగల సామర్థ్యం గల వంటశాల, భోజనశాల, దానికి కావల్సిన సిబ్బందిని ఏర్పాటుచేశాం.

ఈ విషయంలో నాకు చాలా సహకరించిన ఎల్.వి. రామయ్య గారికి ఒక ప్రగాఢమైన కోరిక- యాత్రికులకు విస్తళ్లు వేసి కూర్చోబెట్టి సలక్షణంగా భోజనం పెట్టాలేకాని, అన్నం, పులిహోర, దధ్యోదనం ప్యాకెట్లుగా ఇవ్వడమో, లేదా ఆకుల్లో వేసి చేతికివ్వడమో చేయకూడదు. సొంతంగా వారంతట వారు వడ్డించుకొనే ఏర్పాటు కూడా వద్దు. మర్యాదగా కూర్చోపెట్టి సలక్షణంగా వడ్డించి భోజనం పెట్టాలని...

కాని ఆయనకు, నాకు ఆలోచనలో తేడా వచ్చింది ఒక్కచోటే. వచ్చిన వారందరికీ దేవాలయంలో ఏయే ప్రసాదాలు చేసిపెడతామో, వాటినే ఇక్కడ కూడా చేసి, ప్రసాదంతో కలిపి పెట్టాలన్నది నా ఆకాంక్ష. ఇళ్లల్లో లాగా వండి, సాంబారు, రసం, కూరలు,

పెరుగు (మజ్జిగ) తో పెట్టాలన్నది ఆయన కోరిక. దీనిమీద చాలా తర్జనభర్జనలు జరిగాయి. ఇప్పుడనిపిస్తుంది - నేను ఒప్పుకొని ఉండాల్సింది కాదు. ఏదో ఒక బలహీనక్షణంలో ఆయన చెప్పినదానికి ఒప్పుకోవడం జరిగింది (ఆ రోజుల్లో శాస్త్రం గురించి నాకు తెలియకపోవడం కూడా ఒక కారణం కావచ్చు). ఇప్పటికీ నన్ను నేను ఈ విషయంలో క్షమించుకోలేను!

హోటలులో పెట్టే భోజనానికి, ఈ భోజనానికి తేడా ఏమిటి? ఆయన వాదాలు - ఎప్పటినుండో అన్నదానానికి పేరుప్రతిష్ఠలున్న ఉడిపిలోనూ, ధర్మస్థలాల్లోనూ ఇలాగే తెల్లఅన్నం, ఇతరపదార్థాలతో పెడుతున్నారు కదా! వారికి ఇంట్లో భోజనం చేసినట్లు 'హోమ్లీ ఫీలింగు' కలిగేట్లు యాత్రికులకు చేయాలి. అలా ఇక్కడ ఎందుకు చేయకూడదు అన్నది ఆయన వాదం.

చివరికి యాత్రికులకు ఇది భోజనం అయిందే కాని, ప్రసాదం అన్న భావన రావడం లేదు. ప్రసాదం తెచ్చి ఇందులో కలిపినా, ప్రసాదంగా వారు భావించడం లేదు. దేవస్థానంవారు దేవుడి డబ్బుతో (భక్తులిచ్చిందే అనుకోండి) పెడుతున్నారు కనుక- ప్రసాదంగా భావించే భక్తులు లేకపోలేదు.

కాని నేను మొదలుపెట్టిన ఉద్దేశ్యం వేరు, చివరివరకు చేసింది వేరు.

నా మొదటి ఉద్దేశం - తిరుమల కొండమీద 5, 6 చోట్ల ఇలా పెద్ద వంటశాలలు, భోజనశాలలు నిర్మించి, అక్కడ ఆలయం లోపల చేసే అన్నప్రసాదాలు చేయించి, ఆలయం నుండి తెచ్చిన నైవేద్యప్రసాదాన్ని కలిపి, వచ్చిన యాత్రికులకందరికీ ఉదయం నుండి రాత్రి వరకు కావల్సినంత తినడానికి ఏర్పాటుచేయాలి. వాటినే విస్తళ్లల్లో వేడివేడిగా వడ్డించి, గోవిందనామస్మరణతో కైంకర్యం చేయాలి. ఈ వంటశాలలో వండిన పదార్థాలను తిరుమలలో క్యూ కాంప్లెక్సులలోనూ, రిసెప్షన్ల దగ్గర, సత్రాలల్లోనూ ఎవరికి కావల్సిన ప్రసాదం పొట్లాలుగా ఉచితంగా సరఫరా చేయాలి. నెమ్మదిగా కొండమీద హోటళ్లన్నింటి లైసెన్సులూ రద్దు చేసి, వాటిని మూయించి వేసి, అందరికీ కావల్సిన భోజనసదుపాయాలు ఉచితంగా దేవస్థానం వారే చేయాలి.

యాత్రికులకు కావల్సిన పాలు, ఇతర అవసరాలైన కాఫీ, టీలు (నిషిద్ధాలా?) పానకాల లాంటి పానీయాలు కూడా ఉచితంగా సరఫరా చేయాలని నా సంకల్పం.

దీనికి కావల్సిన నిధులు తప్పకుండా దాతలనుండి వస్తాయని నా నమ్మకం.

అదేవిధంగా లడ్డూల విషయంలో - వచ్చిన ప్రతి యాత్రికుడికి ఒక ప్రసాదం లడ్డూని ఉచితంగా దేవస్థానమే ఇవ్వాలనీ, కొండమీద ప్రసాదం అమ్మే సంప్రదాయాన్ని రద్దు చేయాలని నా కోరిక. దానికి దాతలు ముందుకు వచ్చి నిధులు తప్పక సమకూరుస్తారన్నది నా నమ్మకం. ఎక్కువ విరాళాలు వస్తే, ఒక లడ్డూ బదులు, రెండు లడ్డూలు ఇవ్వవచ్చు. ఈ ఏర్పాట్లు జరిగే వరకూ, వచ్చిన ప్రతి భక్తునికి ఒక చిన్న లడ్డూ ఉచిత ప్రసాదంగా ఇవ్వాలని సంకల్పించి, అది మొదలు పెట్టాను. గత 30 సంవత్సరాలుగా ఈ చిన్న లడ్డూ యాత్రికులకు ఉచితంగా లభించడం జరుగుతోంది కాని, మిగతా విషయాలు అమలు జరుగలేదు.

ఏకాదశి విషయం ఇక్కడ చెప్పాలి. శాస్త్రం అన్ని వర్ణాలవారికీ ఏకాదశీవ్రతం తప్పనిసరి అని శాసించింది. ఏకాదశి ఆచరించడం విధి. మనకిష్టమయితే చేసే వ్రతం కాదు, ఎక్కడున్నా చేయాలి. పురాణంలోనే ఇదివరకు చూశాం. స్వామి పుష్కరిణీస్నానం, ఏకాదశీవ్రతం, గురువు అనుగ్రహం చాలా దుర్లభం అని..

ఏకాదశీవ్రతం అంటే ఆ రోజు నిర్జల ఉపవాసం చేయాలి. పిల్లలు, వృద్ధులు, ఆరోగ్యకారణాలవల్ల అశక్తులు, ద్రవపదార్థాలు తీసుకోవచ్చన్నారు. మరీకాని పరిస్థితులలో ఉడికించని పదార్థం - పండ్లు వంటివి - తీసుకోవడం అధమపక్షం. ఈ వ్రతం ఎప్పుడు ఎక్కడ వున్నా చేయాలి. చేసినవారికి ఎంత పుణ్యమో, చేయనివారికి అంత పాపమూ చెప్పారు. యాత్రాస్థలంలో - అందునా తిరుమల వంటి దివ్యక్షేత్రంలో ఏకాదశీ వ్రత ఆచరణ అత్యంతపుణ్యప్రదం. కొండమీద ఏకాదశినాడు ఉండి వ్రతం ఆచరించకపోతే. అంధతమస్సు అనే ఘోరనరకప్రాప్తి అన్నారు.

మీరు చేయలేని పరిస్థితో, లేక కారణాంతరం వల్ల చేయదలచుకోకపోతే, ఏకాదశినాడు కొండకు వెళ్లకండి. వెళ్తేమాత్రం ఏకాదశీవ్రతం ఆచరించడానికి తగు ప్రయత్నం చేయండి. ఏకాదశి ఉపవాసం ఎంత ముఖ్యమైనదో, ద్వాదశిపారాయణం అంతే ముఖ్యం. అంబరీషుని కథ భాగవతంలో చదివాం కదా! ఏకాదశీవ్రతం శ్రద్ధతో చేసిన అంబరీషునికి ఎంత పుణ్యం అంటే దుర్వాసుడంతటి వాడిని ముల్లోకాలు తిప్పించి మూడుకోట్ల తీర్థాల నీరు తాగించింది సుదర్శనచక్రం. కనుక కొండమీద యాత్రకు వెళ్లినప్పుడు భోజనవిషయంలో విధినిషేధాలు పాటించాలి. నిషిద్ధపదార్థాలు

తినరాదు. దేవస్థానాలు ఈ విషయంలో శ్రద్ధ తీసుకొని, కొండపైన - ముఖ్యంగా దేవస్థానాల పరిధిలోని భోజనశాలలో - నిషిద్ధపదార్థాలు వినియోగించటం నిలిపివేయాలి. ఈ విషయంలో దేవస్థానంవారు శ్రద్ధ వహించి నిషిద్ధ పదార్థాలు ఎవరూ వాడకుండా చూడాలి.

యాత్రకు వెళ్లేది పాపక్షయం కోసం, పుణ్యం సంపాదించడంకోసం. పాపం మూటగట్టుకోడానికి కాదు కదా!

★ ★ ★

84. ఏటా మూడు లక్షల కిలోలు వస్తున్నాయ్!

ఏటా మూడు లక్షల కిలోలకు పైగా 'సమర్పణ' జరుగుతోంది తిరుమలలో.

ఇదంతా లక్షలాది భక్తులు సమర్పించేదే.

కాని ఇది బంగారం కాదు, వెండి అంతకన్నా కాదు.

భక్తులు అప్పటిదాకా రోజూ రకరకాల నూనెలు, క్రీములు రాసి రాసి, అందంగా పెంచి పోషిస్తున్న శిరోజాల్ని తిరుమల శ్రీనివాసుడికి 'సమర్పణ' చేసి, 'గుండు'తో బయటికి వస్తుంటారు. ఆ సమర్పణే ఇలా లక్షల కిలోల్లో తూగుతోంది.

విచిత్రమేమిటంటే- "మేమెందుకు ఈ వృత్తిని చేయకూడదు?" అంటూ మహిళా క్షురకులు ముందుకు వస్తే దేవస్థానయాజమాన్యం తెల్లబోయింది. అప్పుడు నన్ను సలహా అడిగారు. "ఏం చేద్దాం? సమగ్రంగా పరిశీలించి సిఫార్సు చేయండి" అని దేవస్థానం బోర్డు నన్ను కోరింది. రెండు మాసాల గడువు కూడా ఇచ్చింది.

నేను విస్తృతంగా అధ్యయనం చేశాను.

కాని నా నివేదికతో పని లేకుండానే...!!

★ ★ ★

తిరుమలలో స్వామివారికి మొక్కుకొనే మొక్కులలో ఒక ముఖ్యమైనది తలనీలాల సమర్పణ. రోజూ వేలాది భక్తులు తలనీలాలు సమర్పిస్తారు. తిరుమల-తిరుపతి దేవస్థానాలలో వున్న దాదాపు 40 పాలన విభాగాల్లో కళ్యాణకట్ట ఒక పెద్ద విభాగం. వందల కొద్దీ క్షురకులు మూడు విడతలుగా, 8 గంటలకు ఒక గుంపు చొప్పున, రోజులో 24 గంటలూ ఈ 'ముండన' కార్యక్రమంలో నిమగ్నమయే వుంటారు. ఆలయంలో ఇప్పటి క్షురకుల సంఖ్య సుమారు 700.

2010లో ఆ జుట్టు అమ్మకం వల్ల వచ్చిన ఆదాయం రూ. 150 కోట్లకు పైనే వుంటుంది. ఇప్పుడు స్వామివారికి ఒక్క సంవత్సరంలోనే మూడు లక్షల కిలోలకు పైగా జుట్టు వస్తోంది. ఈ విభాగం పర్యవేక్షణ చేయడానికి ఒక డిప్యూటీ కార్యనిర్వహణాధికారి, ఇంకెందరో అధికారులు మూడు షిఫ్టులలో పనిచేస్తారు. వీరుకాక వచ్చిన జుట్టు అమ్మకాలు చూడటానికి ప్రత్యేకంగా ఒక ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు, అతని విభాగం వున్నారు.

మనం తిరుమలలోనే కాదు... ఇంకా కాశీ, ప్రయాగ, బదరీ లాంటి పుణ్యక్షేత్రాలలో, గంగానదీసమీపాన, యాత్రికులు, గృహస్థులు తలనీలాలు సమర్పించటం చూస్తూంటాం.

తిరుమలలో స్వామివారి మీద భక్తితో తమ సౌందర్యచిహ్నమైన జుట్టును స్వామికి సమర్పించి శరణాగతి అవటానికి కారణాలు రకరకాలు. మనం కష్టంలో ఉన్నప్పుడో, ఏదో కావల్సింది కాకపోవటం వల్లనో, స్వామిని ఆ కోరిక తీర్చమని వేడుకున్నప్పుడో, స్వామికి జుట్టు ఇస్తామని మొక్కుకుంటాం. అదొక రకమైన సమర్పణ. మానవునిగా పుట్టిన వారికి జరిగే సంస్కారాలలో 'ముండన' సంస్కారం ఒకటి. పుట్టిన బిడ్డకు, మగపిల్లవాడైనా, ఆడపిల్లయినా, మొదటిసారి జుట్టును తిరుమల లాంటి ఒక తీర్థస్థలంలో తీయడం ఒకరకమైన సంస్కారం.

తీర్థయాత్రలకు బయలుదేరేటప్పుడు గుండు చేయించుకోవడం ఒక సంస్కారం. తీర్థస్థలాల్లో పితృకార్యం చేసేటప్పుడు ఇలా గుండు చేయించుకోవడం ఒక నియమం.

ఈ 'ముండన', కేశఖండన విషయంలో శాస్త్రం ఏం చెబుతోంది? మన హిందూమతంలోనేనా, ఇతర మతాల్లో కూడా ఇటువంటి సంప్రదాయాలున్నాయా? ఆడవారు ముండన చేయించుకోవచ్చా? తిరుమలలో ఈ సంప్రదాయం ఎప్పటి నుండి వుంది?

ప్రాచీననాగరికతలలో 'కేశా'లకు ఒక రకమైన ఆధ్యాత్మికశక్తిని ఆపాదించే సంప్రదాయం వుండేది. ఒక వయస్సు వచ్చిన తర్వాత, ఆధ్యాత్మికవిషయాలలోకి ప్రవేశం జరిపేటప్పుడు, 'కేశఖండన' సంప్రదాయం చాలా మతాల్లో, చాలా నాగరికతల్లో చూస్తాం. భగవంతునితో సంబంధాన్ని అనుసంధానం చేసుకొనే సందర్భాలలో 'జుట్టు' తీసే సంప్రదాయం వుంది. సిరియన్లు, ఫోనియన్లు, ప్రాచీన గ్రీకు, రోమన్, ఈజిప్షియన్ నాగరికతల్లో కూడా ఈ సంప్రదాయం ప్రస్ఫుటంగా కనిపిస్తుంది.

మన దేశంలో వేదకాలం నుండీ 'కేశఖండన' – ఆధ్యాత్మిక, మతపర సందర్భాలలో ప్రత్యేకంగా చెప్పబడినది. చాతుర్మాస్యం మొదలుపెడుతున్నప్పుడు, అగ్నిష్టోమం చేస్తున్నప్పుడు ముండన చేసే అవసరం వుండేది. యజ్ఞం చేసేటప్పుడు, పితృకార్యం చేయబోయే ముందు, తీర్థయాత్రకు వెళ్లేటప్పుడు, తీర్థవిధి పెట్టేటప్పుడు విధిగా ముండన చేయించుకోవాలని శాస్త్రం చెబుతోంది. దేవతర్పణం, ఋషితర్పణం, పితృతర్పణం చేసేటప్పుడు తప్పక ముండన చేయాలన్నది శాస్త్రం.

మహాబలిపురంలో (చెన్నై దగ్గర) 7వ శతాబ్దంలో చెక్కిన శిల్పాలలో – ఒక భక్తుడు గుండు చేయించుకొని అమ్మవారికి జుట్టు ఇచ్చే సన్నివేశం చూపే శిల్పం వుంది. అంటే, ఆ నాటికే ఈ సంప్రదాయం వుండేది. అలాగే వాక్పతి అనే 8వ శతాబ్దపు 'కనౌజు' రాజ్యపు కవి, 'వింధ్యవాసిని' ఆలయంలో అమ్మవారికి భక్తులు ముండన చేసుకొని కేశసమర్పణ చేసే సంప్రదాయం వుందని తన రచనల్లో ప్రస్తావించాడు.

యాత్రకు వెళ్లినప్పుడు, పూర్వకాలంలో పుణ్యతీర్థాలలో 'తీర్థవిధి' తప్పక పెట్టేవారు. అలాంటప్పుడు ముందుగా ఈ ముండనకార్యక్రమం జరగాల్సిందే.

11వ శతాబ్దంలో అప్పటి మహోన్నతమైన 'సోమనాథ్' దేవాలయంలో 300 మంది క్షురకులు, యాత్రికులకు ఈ సేవ అందించడానికి వుండేవారని చరిత్ర చెబుతోంది.

మంత్ర, తంత్ర శాస్త్రసంప్రదాయం పాటించేవారు పూర్తి ముండనం చేసుకునే సంప్రదాయం లేదు. పిలక (శిఖ) తప్పక వుండాలన్నది నియమం. నాథపంథీలు, మహానిర్యాణతంత్రం అనుసరించేవారు ఈ శిఖలో – మానవజన్మలో మనం చేసిన కర్మఫలం నిబిడీకృతం అవుతుందని నమ్మి, ఆధ్యాత్మికసాధనక్రమంలో ఈ శిఖను అగ్నికి ఆహుతిగా ఇచ్చే సంప్రదాయం వుంది.

తీర్థయాత్రలలో 'ముండన' చేయించుకోవడం 'విధి' అని పద్మపురాణం, స్కాందపురాణం చెప్తుంటే, 'తీర్థ కల్పతరువు'లో ఈ విషయప్రస్తావనే లేదు.

'తీర్థచింతామణి', 'తీర్థప్రకాశిక'లలో తల్లి, తండ్రి పోయినవారు, ప్రయాగలో ఈ ముండనం చేసుకొన్నాకనే, పితృకార్యం చెయ్యాలని స్మృతి సముచ్చయంలో చెప్పబడింది.

యాజ్ఞవల్క్యుడి 'మితాక్షర'లో ఒక శ్లోకం ఈ విషయంలో ప్రత్యేకంగా చెప్తుంది–

"గంగాతీరంలో వున్నప్పుడు, భాస్కరక్షేత్రంలో వున్నప్పుడు, తండ్రిపోయినప్పుడు, తల్లి పోయినప్పుడు, గురువు చనిపోయినప్పుడు, యజ్ఞాలు చేయడానికి వైదిక అగ్నిని ఆవాహన చేస్తున్నప్పుడు, సోమయజ్ఞం చేస్తున్నప్పుడు... ఈ ఏడు సందర్భాలలో విధిగా ముండనం చేసుకోవాలి."

తీర్థచింతామణి, తీర్థప్రకాశిక గ్రంథాలు రెండింటిలో తీర్థయాత్రలలో కురుక్షేత్రం, విశాల (ఉజ్జయిని/బదరీ), విరజ (ఒరిస్సాలోని ఒక నది), గయాక్షేత్రాలు తప్ప మిగతా అన్ని క్షేత్రాలు, తీర్థాల్లో తప్పక మగవారు ముండన చేసుకోవాలి అని వుంది. శాస్త్రకర్మలు ఆచరించేవారు మాత్రం పూర్తి ముండన చేయించుకోక, శిఖను వుంచుకోవాలి.

ఆడవారి విషయంలో, ముత్తయిదువులు గుండు చేయించుకోవడం నిషిద్ధం. వాళ్లు తీర్థక్షేత్రంలో రెండు వేళ్ల మందం జుట్టు కత్తిరించుకొంటే సరిపోతుంది. 'వృద్ధహరిత' కూడా ఇదే విషయం రూఢి చేస్తుంది. ఆపస్తంభ, అంగీరస, పరాశరస్మృతులు కూడా ముత్తయిదువులు రెండు వేళ్లమందం మాత్రం జుట్టు కత్తిరించుకోవచ్చనీ, వితంతువులు మాత్రం పూర్తి ముండనం చేయించుకోవాలని స్పష్టం చేస్తున్నాయి.

శాస్త్రం ఈ విషయంలో చాలా విపులంగా చెబుతుంది. ముండనం వేరు, క్షవరం వేరు. మీసం, గడ్డం, తలపై జుట్టు, చంకలలో జుట్టు, ఎవరు, ఎప్పుడు, ఎక్కడ ఎలా తీసుకోవాలి అన్నది స్పష్టంగా చెప్పబడి వుంది.

'తీర్థేందుశేఖర' అనే గ్రంథం మాత్రం ఈ ముండనం – 'విధి' కాదు, కామ్యకర్మ అంటుంది. అంటే ఏదైనా కోరికతో మొక్కుకొనేది, లేదా 'వ్రతం' కాని హోమం కాని, ఫలాపేక్షతో చేస్తున్నప్పుడు – చేయాల్సిందిగా చెప్తుంది.

మనిషి చేసిన పాపాలు, అతని జుట్టులో కేంద్రీకృతమౌతాయని 'మదన పారిజాతం', 'ప్రాయశ్చిత్త సముచ్చయం' చెబుతాయి. అందుకు చేసిన పాపానికి ప్రాయశ్చిత్తంగా పుణ్యకర్మ చేయాలంటే పాపాలకు నిలయమైన జుట్టును ముందు వదిలించుకొని, పుణ్యసంపాదనకు పాటుపడాలి. బౌద్ధాయనసూత్రం – ఆడవారు ముండనం చేయించుకోవడం 'నిషేధం' అని చెప్తుంది.

బ్రాహ్మణులు, రాజులు 'పంచమహాపాతకాలు' చేస్తే వారికి 'శిఖతో' సహా ముండనం చేయడం శిక్షగా పరాశరస్మృతి చెప్తుంది.

ఇలా 'ముండన' లేదా 'కేశఖండన' సంస్కారం శాస్త్రసమ్మతమైన తీర్థవిధి గాను, కామ్యకర్మ చేసేటప్పుడు విధిగానూ శాస్త్రసమ్మతం అని తెలుస్తుంది. అందుకే ఈలియట్-డాసన్ తమ 'హిస్టరీ ఆఫ్ ఇండియా' మొదటి సంపుటంలో సోమనాథ్ దేవాలయం గురించి చెబుతూ, ఈ కేశసమర్పణ ఒక పెద్ద కార్యక్రమంగా వుండేదని, దానికోసం 300మంది క్షురకులు 11వ శతాబ్దంలో ఆలయంలో పనిచేసేవారని వివరించాడు.

అయితే ఇది తిరుమల ఆలయంలో ఎప్పుడు మొదలైంది అన్నది నిర్ధారణగా తెలియరాదు. ఎందుకంటే, ప్రాచీనసాహిత్యంలో కాని, శిలాశాసనాల్లో కాని, ఈ విషయ ప్రస్తావన రాలేదు.

పురాణకాలం నుంచీ కపిలతీర్థంలో, కొండమీద పాపనాశనతీర్థంలో 'తీర్థవిధి' పెట్టే ప్రస్తావన వుంది. అలా చేసేటప్పుడు 'గృహస్థు' విధిగా ముండనం చేసుకోవాలి. అయితే ఇటీవలి శతాబ్దాలలో 'కామ్యకర్మగాను', భగవంతునికి సమర్పణబుద్ధితోనూ, ఒక ఆధ్యాత్మికచింతనతోనూ, లేదా 'పాపాల నిలయమైన జుట్టును వదలి' శుద్ధిగా భగవద్దర్శనానికి వెళ్లే వుద్దేశ్యంతోనూ తిరుమలలో ఈ ముండనాని యాత్రికులు చాలా భక్తిశ్రద్ధలతో చేస్తున్నారు.

చారిత్రకవిషయంగా చూస్తే మనకు దొరికిన ఆధారాలను బట్టి 18వ శతాబ్దంలో, రెంటర్లు, అమలుదార్లు వసూళ్లు చేసే పన్నులలో ఒకటి 'హజన్ గూటా'... అంటే క్షురకుల నుండి వసూలు చేసే శిస్తు. అంటే ఆ రోజుల్లో కొండకు వచ్చే యాత్రికులకు ముండనం చేసే కార్యక్రమాన్ని గుత్తకు (contract) ఇచ్చి, ఆ క్షురకుల నుండి అమల్దారు వసూలు చేసే రుసుం ఉండేది. అది కొండ క్రింద తిరుపతిలోను, తర్వాతి కాలంలో కొండమీద కూడా ఆచరణకు వచ్చింది. దానివలన ఆ కాలంలో ఈ 'ముండనం' ప్రాచుర్యంలో వుండేదని తెలుస్తుంది.

1831లో అప్పటి ఆర్కాట్ జిల్లా కలెక్టరు ఏషియాటిక్ జర్నల్, మే-ఆగస్టు సంచికలో ప్రచురించిన వ్యాసంలో, తిరుమల కొండమీద ఈ జుట్టు ఇచ్చే సంప్రదాయప్రస్తావన ఉంది. ఆయన మాటల్లో...

"కానుకలు భగవంతునికి రకరకాలుగా భక్తులు సమర్పిస్తారు. బంగారం, వెండి ముద్దలు, అన్ని రకాల నాణేలు, రూపాయల సంచులు, రాగి డబ్బులు, ఇంగువ,

దినుసులు వగైరా. ఇవే కాకుండా తలనుండి కత్తిరించిన జుట్టు, అదీ రకరకాలు, చిన్నప్పటినుండి పెంచి ఇక్కడ మొదటిసారి ఇచ్చినది, కోరికకోరి ముడుపుకట్టి, అప్పటి నుండి పెంచి, తిరుమలకు వచ్చి గుండు చేసుకొని ఇచ్చే జుట్టు, తల్లిదండ్రులు మొక్కుకుంటే, అందమైన కన్యలు కొండకు వచ్చి, పొడవైన అందమైన జుట్టును తీసివేసి భగవంతునికి కానుకగా సమర్పించే జుట్టు... ఇలా రకరకాల కారణాలతో ఇచ్చిన జుట్టు...."

అంటే 1831 నాటికే ఈ సంప్రదాయం ఆచరణలో వుండేదని తెలుస్తోంది. అంతకుముందు కాలంలో ఎప్పుడు మొదలయిందో మనకు స్పష్టంగా తెలియదు. కళ్యాణ కట్టలో తలనీలాలు సమర్పించి, స్వామి పుష్కరిణిస్నానం చేసి వరాహదర్శనం, ఆ తర్వాత శ్రీవేంకటేశ్వర దర్శనంతో తీర్థయాత్ర పరిపూర్ణం అవుతుందని భక్తుల ప్రగాఢవిశ్వాసం.

★ ★ ★

2007-2008 లో నేను తిరుమల-తిరుపతి దేవస్థానాల సలహాదారుగా వున్నప్పుడు, ఒక సమస్య దేవస్థానంలో వచ్చింది. కొంతమంది మహిళలు తమను కూడా ఆలయంలో క్షురకులుగా నియమించాలని మొదటి వినతిపత్రాన్ని అధ్యక్షులకు, కార్యనిర్వహణాధికారికి సమర్పించడం, దాన్ని మీడియా విశ్లేషించడంతో, ఈ విషయం చర్చనీయాంశమైంది. చాలామంది మహిళలు ఆధునికకాలంలో, సౌందర్యశాలలు (Beauty Parlours) నడుపుతున్నారు, అందులో కేశసౌందర్యపోషణలో భాగంగా కేశఖండనం కూడా చేయడం జరుగుతోంది. అలాగే దేవుడికి జుట్టు ఇచ్చే మహిళా భక్తులు చాలామంది ప్రతిరోజూ వుంటున్నారు, వారికి మగవారు ముండనం చేయడం కన్నా ఆడక్షురకులు చేస్తే బాగుంటుంది అని వాదం. కొన్ని ఆధునిక మహిళా సమాజాలు కూడా చర్చలోకి దిగి ఈ విషయాన్ని సమర్థించాయి.

ఆలయంలో, అప్పటివరకూ ఆడవారు క్షవరం, ముండన చేసే సంప్రదాయం లేదు. హిందూమతంలో కాని, ఇతర దేవాలయాల్లో కాని, దేశంలో ఎక్కడా ఇటువంటి 'ఆడక్షురకుల' విషయం ఉన్నట్లు లేదు. ఇది ఆగమసమ్మతమా? శాస్త్రసమ్మతమా? సంప్రదాయవిరుద్ధమా? ఈ విషయాలు పాలకమండలిలో చర్చకు వచ్చి, ఈ విషయంపై క్షుణ్ణంగా పరిశీలన చేసి, రెండు నెలల్లో నా సూచనలు ఇవ్వవలసినదిగా - ఆలయ సలహాదారుని కాబట్టి - నన్ను అడిగారు.

నేను శాస్త్రపండితులతోనూ, ఆగమపండితులతోనూ విస్తృతచర్చలు చేశాను. శాస్త్రంలో ఎక్కడా ఇటువంటి ప్రస్తావన సమర్థిస్తూ కాని, విరోధిస్తూ కాని చెప్పిన సందర్భాలు లేవని పండితులు చెప్పారు. ఎందుకైనా మంచిదని నేను కొందరు మఠాధిపతులు, పీఠాధిపతులను సంప్రదించడంలో దాదాపు నెలరోజులు గడిచింది. మఠాధిపతులు, పీఠాధిపతులు - శాస్త్రం మహిళల విషయంలో స్పష్టంగా ఎక్కడా చెప్పక పోయినా, తిరుమల వంటి ఆలయంలో ఇటువంటి సంప్రదాయం ప్రవేశపెట్టడం ఉచితం కాదన్న అభిప్రాయం వ్యక్తం చేశారు. ఆధారాలు కానీ, శాస్త్ర ప్రమాణాలు కాని వారు ఏమీ ఇవ్వలేకపోయారు.

నేను రిపోర్టు తయారుచేద్దామనుకుంటుండగానే, నాకు ఇచ్చిన రెండు నెలల గడువులో, ఇంకా ఒక నెలరోజులుండగానే,ఈ విషయం పాలకమండలిలో మరోసారి చర్చకు రావడం. (కొందరు మహిళాక్షురకులు తెచ్చిన ఒత్తిడి వలన) పాలకమండలి మహిళాక్షురకులను నియమించాలని నిర్ణయం తీసుకోవడంతో, "ఇంక మీరు రిపోర్టు ఇవ్వనక్కరలేదు" అని (రాతపూర్వకంగా కాక మాటవరసగా) నాకు సందేశం వచ్చింది.

అలా తిరుమల ఆలయంలో మహిళాక్షురకుల నియామకం ఒక కొత్త సంప్రదాయానికి దారితీసింది.

★ ★ ★

తిరుమల కొండ మీద యాత్రికులు తలనీలాలు సమర్పించే విషయం శాస్త్రపరంగా, ప్రమాణసహితంగా చర్చించుకున్నాం..

2010-11 సంవత్సరాల లెక్కలను బట్టి సంవత్సరంలో మొత్తం కోటిన్నర మంది తలనీలాలు ఇవ్వడం జరిగింది. సగటున రోజుకు 850 కిలోల నుండి ఒక టన్ను దాకా తలనీలాల సమర్పణ జరిగిందంటే అది ఎంత పెద్ద కార్యక్రమమో ఊహించవచ్చు. సంవత్సరానికి ఈ తలనీలాల విక్రయం ద్వారా రూ. 150 కోట్లకు పైగా దేవాలయానికి ఆదాయం వస్తుంది.

దేవస్థానం వారు తిరుమలలో రెండు పెద్ద కళ్యాణ కట్టలను 4 పెద్ద హాల్సుతో, ఒక్కొక్క హాలులో 50 మంది క్షురకులతో నిర్వహిస్తున్నారు. అవికాక కొండమీదే యాత్రికుల సౌకర్యార్థం 16 మినీ కళ్యాణకట్టలు, ఒక్కొక్క దాంట్లో 25 నుండి 30 మంది క్షురకులతో నిర్వహిస్తున్నారు. చాలా చోట్ల రోజంతా - 24 గంటలూ, యాత్రికులకు ఉచితంగా తలనీలాలు తీసే కార్యక్రమం జరుగుతోంది. ఇవికాక తిరుచానూరు, కపిలతీర్థాలలో కూడా తలనీలాలివ్వడానికి సౌకర్యం చేశారు.

ఈ కార్యక్రమం నిర్వహించడానికి దాదాపు 324 మంది క్షురకులు శాశ్వత ఉద్యోగులుగానూ, 323 మంది మగ క్షురకులు, 58 మంది మహిళాక్షురకులు దేవస్థానంలో పనిచేస్తున్నారు. అన్ని కళ్యాణ కట్టలలో తలనీలాలు తీసే కార్యక్రమం యాత్రికులకు ఉచితంగానే జరుగుతుంది. కాటేజీకి క్షురకుడు వచ్చి తలనీలాలు తీయాలంటే మాత్రమే 10 రూపాయలు రుసుము చెల్లించాలి.

యాత్రికులకు చక్కని సదుపాయాలు, శుభ్రంగా వుండే విశాలమైన హాలుల్లో, గాలి, వెలుతురు, వేడినీళ్లు, ప్రతివారికి ప్రత్యేకమైన బ్లేడు (ఒకరికి వాడినది ఇంకొకరి వాడకుండా), డెట్టాలు వంటి సౌకర్యాలతో దేవస్థానం ఏర్పాటు చేసింది.

తలనీలాలకు మార్కెట్లులో మంచి గిరాకీ వుంది. ఇండియాలోనే కాక ఇతరదేశాలు, ముఖ్యంగా పొడుగాటి జుట్టైతే ఫ్రాన్సు, ఇటలీ, బ్రెజిల్ వంటి దేశాల్లో, చిన్న జుట్టుకు చైనా, దక్షిణకొరియా వంటి దేశాల్లో గిరాకీ వున్నట్లు తెలుస్తుంది. మనదేశంలో దాదాపు 48 కంపెనీలు ఈ తలనీలాల వ్యాపారంలో వున్నాయి. దేశంలో దొరికే జుట్టులో దాదాపు 80 శాతం కన్నా ఎక్కువ, తిరుమల-తిరుపతి దేవస్థానాల ద్వారానే దొరుకుతుంది.

కొద్ది సంవత్సరాల క్రితం వరకు దేవస్థానం ఈ జుట్టు విషయంలో అంత శ్రద్ధ చూపలేదు. కాని, విదేశీ గిరాకీ పెరిగి జుట్టు ఖరీదు పెరగడంతో వార్షికంగా దానిపై ఆదాయం కోట్లలో రావడంతో, దేవస్థానం వారు ఈ విషయంలో శ్రద్ధ తీసుకుని, జుట్టు కత్తిరించే విధానంలోనూ, శుభ్రపరిచే విధానంలోనూ, జుట్టు పొడుగును బట్టి వేర్వేరుగా 5 గ్రేడులుగా చేయించి ఆరబెట్టి, విడివిడిగా 30 కిలోల మూటలుగా కట్టించు కొనేవారికి కావల్సిన రీతిలో ఏర్పాట్లు చేయడం వలన రెండు మూడు సంవత్సరాలలో ఏడాదికి రూ. 70 కోట్ల నుండి ఆదాయం రెట్టింపై ఇప్పుడు రూ. 150 కోట్లు దాటింది. Internet లో E. sale - ఎలక్ట్రానిక్ అమ్మకం చేయడంతో - వేలంలో వ్యాపారులు కుమ్మక్కయ్యే అవకాశం లేకుండా పోయింది.

2010 సంవత్సరం జనవరి నుండి డిసెంబరు వరకు 1,00,34,374 మంది యాత్రికులు తలనీలాలిచ్చారు. 2011 జూన్ 4 ఒక్కరోజునే 57,792 మంది తలనీలాలిచ్చి రికార్డు సృష్టించారు.

దేవస్థానానికి ఈ కార్యక్రమం అమలుచేయడానికి దాదాపు 15 కోట్ల దాకా ఖర్చు అవుతుంది.

★ ★ ★

85. తిరుమల ఆలయంలో బూతుబొమ్మలు!

తిరుమల ఆలయంలో మూలవిరాట్ శ్రీనివాసుడి విగ్రహం మాత్రమేకాక, అందాలు ఒలికించే అపూర్వమైన శిల్పకళ కూడా వుంది. ఆలయం లోపల మండపాలలో చాలాచోట్ల ఇది కనిపిస్తుంది.

పామరుల భాషలో 'బూతుబొమ్మలు'గా చెప్పబడే శృంగార శిల్పాలు కూడా తిరుమల ఆలయంలో దర్శనమిస్తాయి. "శ్రీనివాసుడి ఆలయంలో బూతుబొమ్మలా?" అని పెదిమ విరిచే పామరులకి ఈ శృంగారశిల్పాలు ఆలయాల్లో చోటు చేసుకోవడంలో గల అంతరార్థం తెలిసుండకపోవచ్చు.

దేవాలయం ఏదైనా ఆధ్యాత్మిక చింతనను ప్రోత్సహించే ధ్యానమందిరమే. తిప్ప సముద్రంలో వున్నా తిరుమలలో వున్నా దేవాలయం దేవాలయమే!

శ్రీనివాసుణ్ణి భజిస్తూ సాహిత్యవ్యాసంగం చేసినా, కీర్తనలు రచించి సంగీతస్వరంలో గానం చేసినా, గజ్జె కట్టి అభినయిస్తూ నృత్యరూపంలో ఆరాధించినా... అన్నింటి లక్ష్యం మనలోని 'ఆత్మ' పరమాత్మని చేరుకోవటమే. మరి తిరుమల ఆలయంలో శృంగారశిల్పాలు ఏం చెబుతున్నాయి?

★ ★ ★

సాహిత్యపరంగా శ్రీనివాసుడి గురించి 'తొల్కాప్పియమ్', 'శిలప్పదిగారం' వంటి ప్రాచీన తమిళసాహిత్యం నుంచి ఇటీవలి శతాబ్దాల్లో వచ్చిన శతకాల వరకూ అన్నిరకాల భక్తిసాహిత్యం ఒకటే పరమార్థం కోసం భక్తులలోని తపనకు అద్దం పట్టాయి.

ప్రాచీనకాలం నుండి పండితులనూ, పామరులనూ, వాగ్గేయకారులనూ తిరుమల స్వామి విశేషంగా ఆకర్షించి, వారు వారివారి భాషల్లో ఎన్నో రచనలు స్వామిమీద రచించడానికీ, సంకీర్తనలు రచించి పాడడానికీ, లేదా, చాలామంది రచయితలు వారు చేసిన రచనలు, స్వామి వారిమీద భక్తితో అంకితం చేయడానికి కారణమయ్యాడు.

ఈ రచనల్లో చాలాభాగం పురాణగాథలను ఆధారంగా చేసుకొనే వున్నా, ఆ రచయిత కాలంనాటి తిరుమల-తిరుపతి పరిస్థితులను, సామాజిక, సాంఘిక, ఆధ్యాత్మిక పరిస్థితులను ఈ రచనలు ప్రతిబింబిచాయి.

ఆళ్వారుల సాహిత్యం తర్వాత, తమిళ సాహిత్యంలో చెప్పదగినది కంబ రామాయణం. ఇది 9వ శతాబ్దం నాటిదా, 12వ శతాబ్దానిదా అన్న చర్చ వుంది. వాల్మీకి రామాయణంలో వేంకటాచల ప్రసక్తి లేదు. కాని కంబరామాయణం కిష్కింధకాండలో రాములవారు సీతాన్వేషణకై లంకకు వెళ్తూ దారిలో వేంకటాచలానికి సుగ్రీవ, హనుమ, జాంబవంతాది వానరవీరులతో వచ్చిన విషయం, అక్కడ తపస్సు చేసుకుంటున్న పుణ్యాత్ములు, ఋషిమౌనుల దర్శనం, వేంకటాచల వైభవ వర్ణనలు విపులంగా వున్నాయి. వ్యాసులవారి రెండు పురాణాలలో రాములవారు వేంకటాచలానికి వచ్చిన విశేషం, స్వామి పుష్కరిణికి నైరుతిదిశలో (ఇప్పుడు ఆలయం వున్నచోట) బస చేసిన విధానం, కొందరు వానర నాయకులకు ఒక గుహలో వైకుంఠదర్శనం, నారాయణ దర్శనం జరిగిన విషయం విపులంగా చెప్పబడింది. వాటి ఆధారంగా ఈ కంబరామాయణంలో వేంకటాచల ప్రస్తావన వుంది.

తర్వాత కంచి వాస్తవ్యుడైన వేంకటాధ్వరి వ్రాసిన సంస్కృత 'విశ్వగుణాదర్శ చంపు' కావ్యం ముఖ్యంగా పుణ్యక్షేత్రాల వివరణ ఇస్తుంది. ఇందులో విశ్వావసువు, 'క్రిసాను'ల సంభాషణలో – వైకుంఠంలో వుండేదానికన్నా, శ్రీమన్నారాయణునికి ఈ తిరువేంకటాచలం కొండమీద వుండటమే ఇష్టం అనీ, అందుకే ప్రత్యేకంగా ఈ ప్రదేశాన్ని ఎంచుకొని, వైకుంఠాన్ని వదిలి ఇక్కడ వుంటున్నాడనీ, శ్రీకృష్ణుడే స్వయంగా ఈ కొండమీద వున్నాడనీ, ఎన్నో విశేషమైన గుహలూ, తీర్థాలూ వున్నాయనీ, రాములవారు నివసించిన గుహ కూడా వుందనీ... ఇలా ఎన్నో విషయాలు ఆలయం గురించి, కొండమాహాత్మ్యం గురించి ఈ చంపూ రామాయణం చెబుతుంది.

శ్రీకృష్ణదేవరాయలు రచించిన 'ఆముక్తమాల్యద' గురించి చెప్పాలి. ఆయన ఏడుసార్లు కొండకువచ్చి చేసిన విశేష దేవదేయాలు, శ్రీనివాసుని దాసులుగా ఆలయంలో భార్యలతో కలిసి ఎలా విగ్రహాలుగా వుండిపోయాడో చూశాం. విజయవాడ దగ్గర శ్రీకాకుళంలో 1516లో ఆయన ఆంధ్ర మహావిష్ణువు దర్శనం చేసినప్పుడు ఆయనకి నిద్రలో మహావిష్ణువు కలలోకి వచ్చి, "ఒక రచన చేసి, తిరుమల వేంకటేశ్వరునికి అంకితం ఇవ్వమ"ని ప్రేరణ చేశాడట. అలానే రంగనాథస్వామి, ఆండాళ్ కథను 'ఆముక్తమాల్యద'గా రచించి శ్రీనివాసునికి అంకితం చేశారు. పురాణగాథలు, ఆనాటి

వైష్ణవమతం నమ్మకాలు, సామాజిక ఆధ్యాత్మిక ఆలోచనా విధానాల ప్రస్తావన వుంది. అందుకే ఈయనను 'శ్రీవేంకటగిరి వల్లభసేనా పరతంత్రరాయ'గా నంది తిమ్మన తన 'పారిజాతాపహరణం'లో వర్ణిస్తాడు. తెనాలి రామకృష్ణుడు తన 'ఘటికాచల మాహాత్మ్యం'లో స్వామివారి శేషాచలం, తీర్థాలు, గుహల గురించి ప్రస్తావించాడు.

చింతపల్లి ఛాయాపతి తాను రచించిన 'రాఘవాభ్యుదయం' శ్రీవేంకటేశ్వరునికి అంకితం చేశారు. ఈయన తెలంగాణలోని దేవరకొండ వెలమల ఆస్థానంలో వుండేవారు.

తర్వాత తిరుమల దేవస్థానం వారి ప్రాచ్య పరిశోధన సంస్థవారు - 17/18 శతాబ్దాలలో శ్రీనివాసుని మీద రచించబడిన 19 శతకాల వ్రాతప్రతులు పరిశీలించి ప్రచురించారు. వాటిలో ముఖ్యమైనవి - వేంకటాచల విహారశతకము, వేంకటాచలధామ తారావళి, పంకజాత భావందేశ శతకము, శ్రీవేంకటేశ్వర పంచకము, వేంకటాచలపతి శతకము (ఈ చివరి శతకంలో రచయితకు స్వామివారి శంఖచక్రాలు కలలో కనబడి, పులికాపు సేవ, ప్రసాదం పొందినట్లు అనుభవం. అదే పద్యరూపంలో బయటకు వచ్చింది). ఇక వేంకటనాగాధ్యక్ష శతకంలో అంతా నిందాస్తుతి. "స్వామివారికి కాసులు వసూలు చేసుకోవడంతోటే సరిపోయింది. భక్తుల కోరికలు తీర్చడానికి సమయం లేదు" అంటూనే అనుగ్రహించమని స్వామివారి పాదాలపై పడతాడు కవి. 'వేంకటేశ్వర కళ్యాణం' అంతా భవిష్యోత్తరపురాణం ఆధారంగా వివరించిన శతకం.

తరిగొండ వేంగమాంబ శతకాలు, యక్షగానాలు, ద్విపదకావ్యాలు, పద్యకావ్యాలు రచించిన మహాభక్తురాలు, వేంకటాచలమాహాత్మ్యం అనే పద్యకావ్యం రచించింది. ఎర్రాప్రెగడ వ్రాసిన నరసింహపురాణంలో నారసింహుడే శ్రీవేంకటేశ్వరుడుగా తిరుమలలో వున్నట్లు ప్రస్తావన వుంది. చదలవాడ మల్లయ్య కవి వ్రాసిన 'విప్రనారాయణ చరిత్ర'లో స్వామివారి ప్రస్తావన వుంది.

తాళ్లపాక అన్నమాచార్య, పెద తిరుమలయ, చిన తిరుమలాచార్యులు సంకీర్తన విషయాలు ప్రత్యేకంగా చెప్పుకొన్నాం. పెద్దతిరుమలాచార్య రచించిన 'శ్రీవేంకటేశ్వర ప్రబాస్తలీ' అనే కావ్యంలో సుప్రభాత సేవా ప్రాముఖ్యం గురించి ప్రస్తావించారు. ఇందులో ఒక ఆసక్తికర విషయం - విజయనగర రాజుల గురించి చెప్తూ, కృష్ణదేవరాయల కంటే అచ్యుతరాయలు, సదాశివరాయలు స్వామివారికి విశేషంగా సేవ చేశారని ప్రస్తావించాడు. కొందరు చరిత్రకారుల అభిప్రాయం కూడా అదే.

దేవమారి వేంకటాచార్య రచించిన 'శ్రీపాదరేణు మాహాత్మ్యం' గురించి చెప్పుకోవాలి. ఇతను తాళ్లపాక అన్నమాచార్య మనుమడు. కూతురు తిరుమలాంబ కొడుకు. స్వామివారి శ్రీపాదరేణువుకు ఎంత మహిమ వుందో వివరిస్తాడు. ధన్వంతరీ రూప శ్రీనివాసుని శ్రీపాదరేణువును భక్తితో తీసుకొంటే అన్ని అనర్థాలూ ముఖ్యంగా మూగత్వం, చెవిటితనం, తెలివితక్కువతనం, నత్తిలాంటివి పోతాయని చెప్తాడు. తన తాత అన్నమాచార్యులు 'సంకీర్తనాచార్యులు'గా కావడానికి కారణం స్వామివారి శ్రీపాదరేణువే కారణం అంటారు.

16వ శతాబ్దపు కాకమాని మూర్తి కవి తాను రచించిన 'రాజవాహనవిజయం' స్వామివారికి అంకితం చేస్తూ, ఈ తిరుమల అప్ప - తిమ్మప్పగా భక్తుల అభీష్టాలు ఎలా తీరుస్తున్నాడో, ఆయన బ్రహ్మోత్సవాలకు కటకం నుండి, కళ్యాణం నుండి, ఢిల్లీ నుండి కూడా భక్తులు ఎలా వస్తారో చెప్తాడు.

ఆ కాలంలో కొండవీడు గవర్నరు సిద్ధరాజు తిమ్మరాజు రచించిన 'పరమయోగి విలాసం' మంగళగిరి నరసింహస్వామికి అంకితం ఇచ్చాడు. అందులో ఒక సీసపద్యంలో తిరుమల వేంకటేశ్వరుని కటివరదహస్తాల వివరణ వుంది, ధరించిన నగలు శంఖచక్రాలు, స్వామివారి అనుగ్రహం పొందాలంటే ఆయన పాదాలు ఆశ్రయించాలని సూచించాడు.

తరిగొప్పుల మల్లన్న వ్రాసిన 'చంద్రభాను విజయచరితం'లో తిరుమల యాత్రకు వెళ్లే కోట్లాది భక్తులు ఎలా భక్త్యావేశంతో వెళ్తారో, ఎలా పొర్లుదండాలు (అంగప్రదక్షిణలు) చేస్తారో, కొండెక్కడానికి ఎన్ని అవస్థలు పడతారో వివరించాడు. పింగళి సూరన తన 'కళాపూర్ణోదయం' కావ్యంలో తిరుమల 16వ శతాబ్దంలో ఎలా వుండేదో, నారదుని శిష్యుడు కొండమీద మూడురోజులు మూడు రాత్రులు గడిపిన అనుభవాలు ఏమిటో కళ్లకు కట్టినట్లు వర్ణించాడు.

శ్రేష్ఠలూరి వేంకటార్యులు రచించిన 'శ్రీనివాసవిలాస సేవధి' పురాణాల నాధారంగా చేసుకొని వ్రాసిన కృతి. తొండమాను చక్రవర్తి గాథ, అప్పటి కాలంలో చేయించిన వాహనాలు - వాటి ప్రాశస్త్యం విపులంగా చెప్పబడటమే కాకుండా, స్వామి పుష్కరిణిలో వున్న తీర్థాల విశేషం కూడా వివరిస్తారు.

గణపవరపు వేంకట కవి వ్రాసిన 'వేంకటేశ్వర విలాసా'న్ని స్వామికే అంకితం ఇచ్చారు. చెల్లపల్లి నరసకవి కూడా 'వేంకటేశ్వర విలాసం' అని స్వామివారి వివాహం

ఒక చెంచుస్త్రీతో జరిగిన గాథ ఆధారంగా రచన చేశాడు. 17వ శతాబ్దంలో కృష్ణకవి, 19/20వ శతాబ్దంలో తిరుపతి వేంకటకవులు తమ ఎన్నో రచనలను స్వామివారికి అంకితం చేశారు.

మా పూర్వికులలో ఒకరైన పత్రి రమణప్ప కవి - 18వ శతాబ్ద కాలంనాటివాడు. స్వామివారికి మహాభక్తుడు. శ్రీనివాసుణ్ణి మనసావాచా కర్మణా విశ్వసించి, ఆరాధించి, తన ఆరాధన అంతా శతకాల రూపంలో గ్రంథస్థం చేశాడు. ఈయన రెండు శతకాలను రచించాడు. 'శ్రీవేంకటేశ్వర శతకం', 'విష్ణు సర్వోత్తమ శతకం' పేర్లతో ఆ రెండు శతకాలూ ప్రాచుర్యంలోకి వచ్చాయి. వాటిని ఆయన శ్రీనివాసులకే అంకితమిచ్చాడు. వీటిలో 'శ్రీవేంకటేశ్వర శతకా'న్ని తిరుమల-తిరుపతి దేవస్థానాలు ప్రచురించటం జరిగింది.

అనంతాచార్యుల వేంకటేశ్వర ఇతహాసమాల, కూర్మనాథ కవుల గురించి అదివరకే చర్చించాం. ...ఇలా ఇంకా అనేకమంది శ్రీనివాసుడిని సాహిత్య రూపంలో సేవించారు.

సంగీతంలోనూ సేవ

సంగీతం ద్వారా శ్రీనివాసుణ్ణి ఆరాధించిన వారిలో ప్రతి ఒక్కరూ చరిత్రలో సుస్థిరమైన ప్రతిష్ఠను పొందినవారే.

శ్రీవాదిరాజులు సంస్కృతంలోనూ కన్నడంలోనూ వ్రాసిన సంకీర్తనలలోనూ, ముఖ్యంగా ఆయన తీర్థప్రబంధ గ్రంథంలో తిరుమల యాత్ర విషయాల ప్రస్తావన- అంతా శ్రీనివాసుణ్ణి కొలవటమే. ఈయన కీర్తనలు దాససాహిత్యానికి నాంది. తర్వాత శ్రీపాదరాయల వారి సంకీర్తనలు. అటుతర్వాత శ్రీవ్యాసరాయల వారి రచనలు.

ఆ కాలంలోనే తిరుమలలో అన్నమాచార్య స్వామివారి కొలువులో సంకీర్తనాచార్యులుగా చేరి, రోజుకొక కొత్త సంకీర్తన రచించి, ఆయనే స్వామివారి ముందు పాడేవాడట. అతని మనవడు రచించిన గ్రంథంలో ఆయన 32,000 సంకీర్తనలు రచించినట్లు చెప్పారు కాని, సంకీర్తన భాండాగారం నుండి బయటకు తీసిన రాగిరేకులలో మాత్రం అన్నమయ్య రాసిన అన్ని సంకీర్తనలు లేవు. స్వామివారి పురాణగాథలు, ఉత్సవాలు, నైవేద్యాలు, సేవలు, క్షేత్రమహిమ, కళ్యాణం, గుణగణాలన్నీ సంకీర్తనల్లో పొందుపరిచారు శ్రీ అన్నమాచార్యులువారు. పండితులకు, పామరులకు, జానపదులకు, చిన్నవాళ్లకు, పెద్దలకు, అమ్మలక్కలకు - ఎవరికి కావల్సిన రీతిలో వారికి సంస్కృతంలో, తెలుగులో, ఆధ్యాత్మిక, శృంగార, జానపద కీర్తనలు రచించారు.

ప్రతి భక్తుడు పాడుకొనే విధంగా దంపుడు పాటలు, వెన్నెలపాటలు, జాజర పాటలు-తందనాన పాటలు ఇలా ఎన్నో రకాల సంకీర్తనలు చేసి స్వామివారి మాహాత్మ్యం వేనోళ్ల చాటి చరితార్థుడయ్యాడు.

ఆయన లాగానే, ఆయన కొడుకు పెద తిరుమలాచార్య, మనుమడు చిన తిరుమలాచార్యులు కూడా స్వామివారి మీద ఎన్నో సంకీర్తనలు చేసి, వాటిని పాడి శ్రీనివాసుని మహిమని గ్రామగ్రామానికి తీసుకువెళ్లిన ఘనత ఈ తాళ్లపాక వంశానిదే. వీరి సంకీర్తనలను ప్రచారంలోకి తేవడానికే 1979లో నేను కార్యనిర్వహణాధికారిగా వున్నప్పుడు 'అన్నమాచార్య ప్రాజెక్టు'ని ప్రారంభించే భాగ్యం శ్రీనివాసుడు నాకు కల్పించాడు.

తాళ్లపాక అన్నమయ్య సమకాలీనుడే శ్రీపురందర దాసు. కన్నడంలో వేల సంకీర్తనలు చేసి, శాస్త్రసారాన్ని పామరులకు అందుబాటులోకి సంకీర్తనలుగా చేసినవాడు. తిరుమల వచ్చి, అన్నమయ్యను కలిసినట్లు ఆధారాలున్నాయి. తిరుమల శ్రీనివాసుని మీద ఎన్నో సంకీర్తనలు చేశారు. ఈనాటికీ చాలా సంకీర్తనలు బహుళ ప్రచారంలో ఉన్నాయి. 'నంబిదెనిన్న పాదవ వేంకటరమణ' - 'బారయ్య వెంకటరమణ-బక్తలమనికె' - 'ధనియనొడిదను వెంకటను' - లాంటి కీర్తనలు భక్తుల మదిలో నాటుకొనిపోయాయి.

ఇందాక ప్రస్తావన చేసిన వ్యాసరాయలు శ్రీపురందరదాసులకు గురువులు. ఈయన శ్రీనివాసుని మీద కీర్తనలు వ్రాశారు. వీరందరూ కన్నడ భాషలో, దాసపంథాకు పునాదులు వేసి, తర్వాత తరాల్లో వందలాది దాసులు సంకీర్తనలు రచించడానికి బాటలు వేశారు. ఈ దాసుల మకుటం విఠలుడైనా, ఈ దాసులు ముఖ్యంగా రాసిన సంకీర్తనలన్నీ తిరుమల శ్రీనివాసుని మీదే, తర్వాత పరంపరలో విజయదాసులు, గోపాలదాసులు, జగన్నాథ దాసులు, కనకదాసులు, శ్రీనివాస దాసులు, విజయవిఠల నుండి 20వ శతాబ్దంలో గురుగోవింద విఠల దాసుల వరకు, ఈ దాస పరంపర అవిఘ్నంగా సాగి, వేలాది కీర్తనలు శ్రీనివాసునిపై రాయబడి, సంకీర్తన యజ్ఞంగా సాగింది. శ్రీనివాసుని మీద యీ దాసులందరూ రచించిన కీర్తనల బహుళ ప్రచారానికే 'దాససాహిత్య ప్రాజెక్టు'ని ప్రారంభించే భాగ్యం కూడా భగవంతుడు నాకు కల్పించాడు.

తెలుగు సంగీత సాహిత్యవాగ్గేయకారుల్లో ముఖ్యులు శ్రీత్యాగరాజస్వామి. నాలుగువేల సంకీర్తనలు రచించిన మహాభక్తుడు. కాని ఇప్పుడు మనకు లభ్యమయ్యేవి

700 మాత్రమే. "వేంకటేశ్వర నిన్ను సేవింపను పదివేల కన్నులు కావలెను" అన్న కీర్తన, "తెరతీయగరాదా", "నాలోని తిరుపతి వేంకటరమణ, మత్సరమను" - కీర్తనలు భావగర్భితాలు, భక్తితో పరవశించి వ్రాసినవి.

ముత్తుస్వామి దీక్షితరు సంస్కృతంలో చాలా సంకీర్తనలు చేశారు. ఈయన వ్రాసిన వాటిలో శ్రీనివాసుని మీద వ్రాసిన ఐదు పాటలు ప్రసిద్ధాలు. అందులో కొన్ని తెలుగు సంకీర్తనలు. ఆ తర్వాత శ్యామశాస్త్రిగారు తిరుమల శ్రీనివాసునిపై ఒక సంకీర్తన రాశాడని చెప్తారుకాని, అది లభ్యంగా లేదు. ఆయన కొడుకు సుబ్బరాయశాస్త్రి కూడా శ్రీనివాసునిపై సంకీర్తన రచించారు. త్యాగరాజు గారి శిష్యుడు వీణకుప్పయ్య కూడా శ్రీనివాసునిపై సంకీర్తనలు చాలా రచించాడు.

తర్వాత కాలంలో పట్నం సుబ్రహ్మణ్యఅయ్యరు, ఆయన శిష్యులు శ్రీనివాస అయ్యంగారు - వేంకటేశునిపై కొన్ని కీర్తనలు వ్రాశారు. వీరందరూ తమిళులైనా, కర్ణాటక సంగీత ప్రభావితులై తెలుగులో సంకీర్తనలు రచించి, గానం చేసి ధన్యులయ్యారు.

20వ శతాబ్దంలో నారాయణస్వామినాయుడు, మంగళంపల్లి బాలమురళీకృష్ణ లాంటి వాగ్గేయకారులు శ్రీనివాసునిపై సంకీర్తనలు రచించి, గానం చేశారు. ఇంకా ప్రచారంలోకి రాని అనే సాహితీవేత్తలు, సంగీత కళాకారులు, భక్తితత్త్వాన్ని జీర్ణించుకుని, శ్రీనివాసుణ్ణి ఆరాధించారు.

★ ★ ★

అయితే, ఈ భక్తితత్త్వానికి ఆలయగోపురాలమీద, ప్రాకారాలమీద బూతు బొమ్మలకీ ఏమిటి సంబంధం - అని ప్రశ్నించుకునే ముందు, తిరుమల ఆలయంలో శిల్పకళ ఏముందో చూద్దాం.

దక్షిణ భారతంలోని పలు ప్రాచీన దేవాలయాలలో మాదిరిగా తిరుమల ఆలయంలో కూడా మంచి శిల్పచాతుర్యం గల కళాఖండాలు ఎన్నో వున్నాయి. ఆలయాల్లో పూజలు సేవలు అందుకునే విగ్రహాలే కాకుండా ఆలయ స్తంభాలమీద, ఆలయం గోడలమీద, గోపురాల మీద, విమానం మీద ఎన్నో శిల్పాలున్నాయి. పూజలందుకునే ధ్రువబేరం (మూల వరులే) కాక, రాతివిగ్రహాలు యోగ నరసింహ, వరదరాజస్వామి, పోటులో శ్రీమహాలక్ష్మి... ఇలా ఎన్నో విగ్రహాలున్నాయి.

పోటులో వున్నది శ్రీమహాలక్ష్మి విగ్రహం. ఈ మధ్యకాలంలో అక్కడ దేవస్థానంవారు వకుళాదేవి అని బోర్డు పెట్టారు. పురాణకాలం నుండీ అన్నపోటుకు అభిమాని శ్రీమహాలక్ష్మి, పడిపోటుకు అభిమాని భూదేవి (సంపంగిప్రాకారంలోనిది పడిపోటు). విమానప్రాకారంలోని అన్ననైవేద్యాలు పోటులో వున్న విగ్రహం, తిరుచానూరులోని పద్మావతీదేవి ఆలయంలోని విగ్రహంలాగే వుంటుంది. ఈ రెండు విగ్రహాలూ శ్రీమహాలక్ష్మివే. వకుళమాతది ఆ విగ్రహం అనటానికి ఎటువంటి ఆధారాలూ లేవు.

అలానే బంగారువాకిలిలోని ద్వారపాలకుల విషయంలో కూడా. అందమైన ద్వారపాలక విగ్రహాలు రెండూ (రాతివికావు) జయవిజయులని పైన బోర్డులు ఈ మధ్యనే పెట్టారు. ఈ ఆలయంలో పాటించే వైఖానస ఆగమ పద్ధతిలో ఆ బంగారువాకిలి వద్ద జయవిజయుల విగ్రహాలు వుండటానికి వీలులేదు... ద్వారపాలకులు అంటే సనకసనందులను అడ్డుకుని శాపం పొందిన ద్వారపాలకులే ప్రఖ్యాతులు కనుక అలా బోర్డులు పెట్టినట్లుంది (ఈవిషయం దేవస్థానంవారు పరిశీలించాల్సిన అవసరం వుంది.)

ఆలయంలో శిలావిగ్రహాలు కాకుండా చాలా లోహవిగ్రహాలు కూడా వున్నాయి. ప్రతివిగ్రహం మంచి శిల్పచాతుర్యం కలదే.

సంపంగి ప్రాకారంలో నైరుతి దిక్కున వున్న కళ్యాణ మండపం ఒక అద్భుత కళాఖండం. అలానే ఇతర మండపాలలో కూడా శిలాపుష్పాల సౌందర్యం, జంతువులు, పక్షుల బొమ్మలు, రాజులు, ఇతర ప్రముఖుల శిల్పాలు, వివిధ దేవతల శిల్పాలు కనిపిస్తాయి. పురాణాల నుండి సంఘటనలు సూచించే ఎన్నో శిల్పాలున్నాయి. పూతనవధ, గోపీ వస్త్రాపహరణం, శ్రీమహావిష్ణువు ఆదిమూర్తిగా, ఆదిశేషుడు, హనుమ, గరుడ శిల్పాలు చాలాచోట్ల కనిపిస్తాయి.

ఇవికాక ప్రతిమా మండపంలో కృష్ణదేవరాయలు, చిన్నాదేవి, తిరుమలదేవుల (అతని ఇద్దరు దేవేరులు) కంచు విగ్రహాలు ఆ కాలపు శిల్పకళానైపుణ్యానికి మచ్చుతునకలు. ఆ విగ్రహాల కిరీటాలు, ధరించిన నగలు, నడుముకున్న వడ్డాణాలు, రాణుల చీరల సౌందర్యం అపూర్వం. ఇవికాక తిరుమలరాయలు, అతని భార్య కాంస్యవిగ్రహాలు, వెంకట రాయల కాంస్యవిగ్రహం, తోడరమల్లు, అతని భార్య, తల్లుల విగ్రహాలు కూడా మంచి శిల్పచాతుర్యాన్ని సూచిస్తాయి. అశోకవనంలో సీత,

హనుమంతునిపై స్వారీ చేస్తున్న శ్రీమహావిష్ణువు, బాలకృష్ణుడు వెన్నదొంగిలించడం వంటి ఎన్నో శిల్పాలున్నాయి.

ధ్వజస్తంభం, బలిపీఠం పైన కూడా చాలామంచి శిల్పాలున్నాయి. కాళియమర్దన కృష్ణ, మత్స్యావతారం, చతుర్భుజ వేణుగోపాల, గజేంద్రమోక్షం, వేంకటేశ్వర కళ్యాణం, మోహిని, గరుడ వాహనుడైన విష్ణువు, గండభేరుండం, సూర్య, నరసింహ, సంజీవ పర్వతం తెస్తున్న ఆంజనేయస్వామి, హథీరాంజీతో శ్రీనివాసుడు పాచికలాడటం, శ్రీరామ పట్టాభిషేకం, వరాహస్వామి, కోదండరాముడు, నరసింహ, త్రివిక్రమ, శేషశాయి, సుదర్శన, మింథాన, కామధేను... ఇలా వందలకొద్దీ శిల్పాలు ఈ ఆలయంలో చూడవచ్చు.

ఇతర హిందూదేవాలయాల్లో లాగే, ప్రతిమా మంటపంలో కొన్ని శృంగారశిల్పాలు కూడా వున్నాయి. ఒక శిల్పంలో యువతీయువకులు శృంగారంలో మునిగి కామ తృప్తి పొందుతూంటారు. ప్రక్కనే ఒక యోగి ఒంటికాలిపై నిలబడి తపస్సులో నిమగ్నమైపోయి వుంటాడు. ఇలాంటివే మరికొన్ని శృంగార శిల్పాలు, విపరీత కామకలాపాల దృశ్యాలు శిల్పాల రూపంలో కనిపిస్తాయి. వాటి పక్కనే మోక్షగాముల భక్తి పారవశ్యమూ కనిపిస్తుంది. ఆలయాల్లో ఈ బూతుబొమ్మలేమిటని చాలామందికి సందేహం కలగడానికి అవకాశం ఉంది. మన ఆర్షధర్మంలో 'కామం' కూడా ఒక పురుషార్థమే.

'విష్ణుధర్మోత్తర' ఆగమంలో ఈ విషయంపై ప్రత్యేక చర్చ వున్నది. ఇటువంటి శృంగార చిత్రాలు, శిల్పాలు ఇళ్లల్లో వుండకూడదని, కాని ఆలయాల్లో వుండవచ్చని, రాజదర్బారుల లాంటి సామూహిక ప్రదేశాల్లో వుండవచ్చనీ ఆగమం చెప్తోంది.

దీని వెనుక ఉన్న కారణం... మానవుడి మనస్సులో శృంగార ఆలోచనలు వుండే అవకాశం ఎక్కువ. కామాన్ని జయించడం సాధనలో ఒక ముఖ్య భాగం. కనుక ఇటువంటి విషయాలు ధైర్యంగా ఎదుర్కొని వాటిపై పట్టు సాధించాలేకాని, దాచుకొని వాటికి బానిసలు కావడం వలన ప్రయోజనం వుండదు. ఆ ఆలోచనలు గెలవాలంటే వాటిని ధైర్యంగా చూడాలి, ఆలోచించాలి, మనస్సును సమాధాన పరచి, ఆ ఆలోచనలు అధిగమించాలి. గౌతమబుద్ధుడు ఇచ్చిన ఉపదేశం కూడా ఇదే.

అలా ఆలయాల్లో ఇటువంటి శృంగారదృశ్యాలు చూసినా మనస్సును నిగ్రహించుకోగలిగిన వాడే 'ధీరుడు'. అలా మనస్సును ప్రోత్సహించి, ప్రేరేపించి, ఆలోచింప చేసి నిశ్చలత్వం సంపాదించడానికి ఆలయం కంటే అనువైన ప్రదేశముండదు.

మానవనైజంలో వున్న కామాన్ని జయించాలంటే, చాటుమాటుగా ఆలోచించి దిగజారడాన్ని మన సిద్ధాంతం శ్లాఘించదు... ఆధునిక మానసిక శాస్త్రం సూచించేదే మన ప్రాచీనశాస్త్రం చెప్పింది. ఈ విషయాలు ముఖాముఖిగా విశ్లేషించి బలహీనతలు దాటాలన్న ఉద్దేశ్యంతోనే, మన ఆలయాల్లో శృంగారశిల్పాలు, బూతుబొమ్మలు. ఏహ్యాభావం కల్గించడానికి అన్ని రకాల విపరీత శృంగార దృశ్యాల ప్రదర్శన చేయడం జరుగుతుంది.

ప్రత్యేకంగా హిందూ ఆలయాల్లో ఈ శృంగారశిల్ప ప్రదర్శన చూసిన భక్తునికి భగవంతుని సాన్నిధ్యంలో తన మానసిక బలహీనతలు, తను చేసిన తప్పులు గుర్తుకు రావాలి. ఆ విషయాలపై ఆలోచనలో పడాలి, నెమ్మదిగా బలహీనతలను తొలగించుకునే ప్రయత్నం జరగాలి.. ఈ విషయాలు భక్తులకు అర్థమయ్యేట్టు చెప్పే సంప్రదాయం లోపించడం వల్ల, ఈ విషయాలు ఈ తరం వారికి కొంత ఎబ్బెట్టుగా వున్నట్లనిపిస్తుంది... అందుకే సాధారణ, అసాధారణ లైంగిక విషయాలు కన్పిస్తాయి.

★ ★ ★

86. తిరుమలేశుడి ఆభరణాలు భద్రమేనా?

"తిరుమల శ్రీనివాసుడికి సంబంధించిన డాలర్లు గోవిందా, గోవింద!"

"తిరుమల క్షేత్రంలో రాముడి నగలు తాకట్టు పెట్టిన అర్చకుడు!"

"శ్రీకృష్ణదేవరాయలు ఏడుసార్లు వచ్చి ఇచ్చిన నగలన్నీ ఏమైపోయాయి తిరుమలేశా?"

...ఇలాంటి శీర్షికలతో పత్రికలలో, టెలివిజన్ ఛానళ్లలో తిరుమలకు వచ్చి భక్తులు సమర్పించే ఆభరణాలకు భద్రత లేదని భయాందోళనలు కలిగించే వార్తలు, కథనాలు ఇటీవల విరివిగా వచ్చాయి.

ఏ విశ్వాసంతో భక్తులు హుండీలో కానుకలు వేస్తున్నారో, లేదా రికార్డు పూర్వకంగా నగలు, నగదూ సమర్పిస్తున్నారో, స్వామివారికి ఆభరణాలు తయారుచేయించి ఇస్తున్నారో ఆ విశ్వాసాన్ని దెబ్బతీసేందుకు, ఈ వార్తలు, కథనాలు కారణమయ్యే పరిస్థితి ఏర్పడినప్పుడు- నిజానిజాలు వెలికితీసే ఒక ప్రక్రియలో నేను కూడా ఒక పాత్ర నిర్వహించాల్సి వచ్చింది.

విస్తృతంగా, లోతుగా ఈ అంశాన్ని అధ్యయనం చేస్తే బయటపడిన విషయాలను తెలుసుకునే హక్కు ప్రతి భక్తుడికీ వుంది.

★ ★ ★

2006 లో ఆలయంలో 300 డాలర్లు మాయమయిన సంఘటన బయటపడ్డాక, అందులో 'డాలరు' శేషాద్రి హస్తం వుందన్న ఆరోపణలు మొదలైనాయి. ఇవి అప్పటికే పదవీవిరమణ చేసి, మళ్లా ప్రత్యేకాధికారిగా నియమించబడి ఆలయంలో పనిచేస్తున్న శేషాద్రిని పదవి నుండి తొలగించాలన్న ఆందోళనకు దారితీశాయి.

ఆలయంలో స్వామివారి చిత్రంతో గల డాలర్ల అమ్మకాలు ఏనాటినుండో దేవస్థానంలో జరుగుతున్నాయి. మొదట మొదట ఈ డాలర్లను, గోవిందరాజు స్వామి ఆలయంలోని టంకశాలలో చేసేవారు. నేను కార్యనిర్వహణాధికారిగా వున్నప్పుడు బంగారునగలు కరిగించడం, వాటిని స్వామివారి నాణాలు (డాలర్లు) గానూ, బంగారు ముద్దలుగానూ చేయడంలో అవకతవకలు జరుగుతున్నాయన్న అనుమానాలు నా దృష్టికి వచ్చి, రిజర్వ్‌బ్యాంక్ వారితో సంప్రదించి, ఒక ఒప్పందం కుదుర్చుకున్నాం. చారిత్రక/ ఇతర విశిష్టత లేని రాళ్లనగలు, హుండీలో వచ్చిన ఆభరణాలు రిజర్వ్‌బ్యాంక్‌కు పంపితే, వారే వాటిని కరిగించి, వచ్చిన బంగారానికి సమానంగా స్వామివారి బంగారు డాలర్లు దేవస్థానానికి ఇచ్చేటట్లు, తరుగులు, కరిగింపు, ముద్రణ ఖర్చులను రిజర్వ్‌బ్యాంకు నిబంధనల ప్రకారం దేవస్థానం చెల్లించేటట్లు ఒప్పందం కుదిరింది. స్వచ్ఛమైన ఈ బంగారం డాలర్లకు భక్తులనుండి చాలా గిరాకీ వుండేది... వీటిని దేవాలయం ట్రెజరీలో వుంచి, ఆలయానికి, ఇతర విక్రయశాలలకు అమ్మకానికి పంపేవారు. అలా ఆలయంలోపల ఒక విక్రయకేంద్రం వుంది. 'డాలరు శేషాద్రి' అధీనంలో డాలర్ల అమ్మకం జరిగేది. ఎన్నో ఏళ్లు శేషాద్రి ఈ కార్యక్రమం చేసినా, డాలర్లు పోవడం, తరుగు రావడం, అమ్మిన డబ్బు జమ కాకపోవడం వంటి సంఘటనలు ఎప్పుడూ జరగలేదు.

ట్రెజరీ నుండి ఆలయానికి వేల డాలర్లు అమ్మకానికి వస్తాయి. అలా వచ్చిన డాలర్లు పారెపత్తేదారు శేషాద్రి అధీనంలో వుంటాయి. కొన్ని రోజులకవసరమైన డాలర్లను శేషాద్రి డాలర్లు అమ్మే కౌంటరు షరాఫ్‌లకు అందజేసి, అలా ఎన్ని అంద చేశాడో పేష్కారు ఆఫీసుకు తెలియచేస్తాడు. తనకు వచ్చిన డాలర్లు షరాఫులకిచ్చి, ఆ లెఖ్ఖ చూపడం వరకే పారెపత్తెదారు (శేషాద్రి) బాధ్యత. షరాఫు డాలర్లు అమ్మి తర్వాత పేష్కారు ఆఫీసులో ఖరీదు జమకట్టి, లెక్కలు చూపాలి... పారెపత్తేదారునుండి తాను తీసుకున్న డాలర్ల లెక్క చెప్పాల్సిన బాధ్యత షరాఫ్‌ది... ఇది అమలులో ఉన్న విధానం.

2006 లో డాలర్లు మాయమయిన కేసు పూర్వపరాలు సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జగన్నాథరావుగారి విచారణా నివేదికలో చాలా విశదంగా ఇవ్వబడ్డాయి. ఆ దర్యాప్తు నివేదిక ప్రకారం- వెంకటాచలపతి అనే షరాఫ్‌కు శేషాద్రి 2006 జూన్ 6 నాడు ఈ డాలర్లు అప్పగించాడు. తర్వాత 2006 జూలై 31 న శేషాద్రి పదవీ విరమణ చేసి తన దగ్గర వున్న మొత్తం డాలర్లను గురురాజుకు అప్పగించాడు. తర్వాత తనిఖీలలో తేలిన విషయం- షరాఫు దగ్గర వుండాల్సిన డాలర్లలో 300 డాలర్లు

తక్కువ పడ్డాయి... 2006 నవంబరు 5 న- అంటే, డాలర్లు తీసుకున్న 5 నెలల తర్వాత - షరాఫు వెంకటాచలపతి తనకు శేషాద్రి 300 డాలర్లు ఇవ్వలేదని ఫిర్యాదు చేశాడు. అప్పటికే శేషాద్రి పదవీవిరమణ చేసి నాలుగు నెలలయింది. శేషాద్రిని ప్రశ్నిస్తే- తాను డాలర్లు ఇచ్చినట్లున్న రశీదులు, డాలర్లు ముట్టినట్లు వెంకటాచలపతి వ్రాసిచ్చిన రశీదులు చూపించి, ఆ తరుగుకు, తనకేమీ సంబంధం లేదని చెప్పడంతో, కార్యనిర్వహణాధికారి అప్పటి చీఫ్ విజిలెన్స్ అధికారి హరిరావు IPS ద్వారా విచారణ జరిపించారు. ఆ సమయానికి శేషాద్రి మళ్లీ ఆలయంలో నియమింపబడటంతో అప్పుడే పోయిన డాలర్ల కథ మళ్లా బయటకు వచ్చింది. శాసనసభలో ప్రశ్నలు రావడం, రాష్ట్రప్రభుత్వం సిబిసిఐడి ద్వారా విచారణకు ఆదేశాలివ్వడం జరిగింది. దేవస్థానం వారి దర్యాప్తులోనూ, సిబిసిఐడి వారి దర్యాప్తులోనూ వెంకటాచలపతిని దోషిగా నిరూపిస్తూ ఆధారాలు చూపించబడ్డాయి. వెంకటాచలపతి ఇంట్లో కొన్ని డాలర్లను కూడా పోలీసులు స్వాధీనం చేసుకోవడంతో, వెంకటాచలపతి తానే కాజేసినట్లు ఒప్పుకున్నాడు (ఇవన్నీ జస్టిస్ జగన్నాథరావు విచారణ నివేదికలోని అంశాలు.)

శేషాద్రి నిర్దోషిగా తేలినా ఆలయంలోని అధికారుల వర్గవైషమ్యాల వలన, ఈ విషయం పెద్ద వివాదాస్పదమై, డిప్యూటీ కార్యనిర్వహణాధికారిలోను, పేష్కారులోను పర్యవేక్షణ లోపం వుందనీ, అన్ని డాలర్లను శేషాద్రి- వెంకటాచలపతికి ఎందుకిచ్చాడనీ.. వీరందరిమీద చర్యలు తీసుకోవాలని ఆందోళన మొదలైంది. వివాదం మీడియాలో చిలికిచిలికి గాలివాన కావడం, ప్రతిరోజూ దీనిపై చర్చలూ, కథనాలూ ప్రసారాలు కావడంతో - డాలర్లే కాదు, అసలు స్వామివారి నగలు, హుండీలో వేసిన ఆభరణాల భద్రతపై కూడా భక్తులకు అనుమానాలు కల్గేట్లు వ్యాఖ్యానాలు రాసాగాయి. దాంతో ప్రభుత్వం - ఆలయంలో డాలర్లేకాక, ఆభరణాలు, ఇతర హుండీ కానుకలు భద్రమేనా, ఆచరణలో వున్న పరిపాలనవిధానాలు సక్రమంగా వున్నాయా లేదా అన్న విషయం క్షుణ్ణంగా పరిశీలించి నివేదిక ఇవ్వాలని జస్టిస్ జగన్నాథరావు (విశ్రాంత సుప్రీంకోర్టు న్యాయమూర్తి) గారిని విచారణా సంఘంగా నియమించడం జరిగింది...

ఆయన దాదాపు సంవత్సరం పైగా అన్ని విషయాలూ పరిశీలించి, సమగ్ర నివేదిక అందచేశారు. ఇది జరుగుతున్న సమయంలో ఇంకొక సంఘటన సంచలనం సృష్టించింది. తిరుమల తిరుపతి దేవాలయాల యాజమాన్యంలో వున్న తిరుపతిలోని శ్రీకోదండరామ స్వామి వారి ఆలయంలోని ప్రధాన అర్చకుడు వెంకటరమణ దీక్షితులు స్వామి వారి 12 నగలు - ఒక్కొక్కటి 100 గ్రాములు బరువైనవి - 8 లక్షల

రూపాయలకు అంగడిలో తాకట్టు పెట్టిన విషయం సాంవత్సరిక తనిఖీలలో బయటపడింది. ఇది పెద్ద సంచలనానికి దారితీసి, మీడియాలో చాలా తీవ్రమైన చర్చలు జరిగి, ఆ చర్చలలో డాలరు శేషాద్రి విషయం కూడా చర్చకు వచ్చి, అతనిమీద, ఇతర పై అధికారులు వాసుదేవన్ (పేష్కారు), ప్రభాకరరెడ్డి (Dy EO) ల మీద చర్య తీసుకోవాలని కొన్ని వర్గాల నుంచి వత్తిడి వచ్చింది. కాని అప్పటికే న్యాయమూర్తి జగన్నాథరావుగారు తమ నివేదిక సమర్పించడం జరిగిపోయింది. ఆలయంలో వర్గ తగాదాల వలన ఆ రిపోర్టు బహిర్గతం కాలేదు... ఈ వర్గ వైషమ్యాలు ఎంతవరకూ వెళ్లాయంటే- అదివరకే వచ్చివున్న చీఫ్ విజిలెన్స్ అధికారి రిపోర్టు, సిబిసిఐడి రిపోర్టు, న్యాయమూర్తి జగన్నాథరావుగారి రిపోర్టులను పక్కన పెట్టి, అప్పటి ముఖ్య విజిలెన్సు అధికారితో హడావుడిగా రెండురోజుల్లో ఇంకొక రిపోర్టు చేయించి, వీరిని దోషులుగా చూపించి, పదవుల నుండి తాత్కాలికంగా కార్యనిర్వహణాధికారి తొలగించడం, దానికి దేవస్థాన ఉద్యోగ సంఘాలు నిరసనలు, సమ్మెలు జరపటం, రెండు రోజులలో పాలకమండలి ప్రత్యేక సమావేశంలో కార్యనిర్వహణాధికారి చేసిన సస్పెన్షన్ ఉత్తర్వులను ఉపసంహరించడం జరిగాయి.

ఈ గడబిడ చాలదన్నట్లు- అవే రోజులలో ఇంకొక దురదృష్టకర పరిణామం జరిగింది. రాష్ట్రప్రభుత్వం శ్రీకృష్ణదేవరాయల 500 సంవత్సర వేడుకలు ఆధికారికంగా జరిపింది. వాటిని తిరుపతిలో దేవస్థానం వారు కూడా పెద్దఎత్తున నిర్వహిస్తున్న సమయంలో, ఏడుసార్లు శ్రీకృష్ణదేవరాయలు తిరుమల ఆలయానికి వచ్చి, పెద్దఎత్తున కానుకలుగా శ్రీనివాసునికిచ్చిన నగలను "ఆలయ ప్రదర్శనశాలలో యాత్రికులు చూడడానికి ప్రదర్శిస్తారా?" అని మీడియావారు అడిగినప్పుడు, ఆలయ అధికారులు అనాలోచితంగా "తప్పకుండా ప్రదర్శిస్తాం" అని వాగ్దానం చేయడం జరిగింది. కాని, తర్వాత ఆరా తీసి చూసుకున్నాక "కృష్ణదేవరాయలు ఇచ్చిన నగలు ఇప్పుడు దేవస్థానం రికార్డుల్లో లేవు" అని ప్రకటించడంతో పెద్ద దుమారం లేచింది. ఈ విషయం పరిశీలించడానికి ప్రభుత్వం పురావస్తు శాఖ అధికారులతో ఒక సంఘాన్ని నియమించి, ఆలయంలోని ఆభరణాలు తనిఖీ చేసి శిలాశాసనాల్లో చెక్కబడిన వివరాలు గల కృష్ణదేవరాయలు ఇచ్చిన ఆభరణాలను, ఆలయంలోను, ట్రెజరీలోను ఉన్న ఆభరణాలను పరిశీలించి నిర్ధారణ చేయవలసిందిగా ఆదేశించారు... ఒక డిప్యూటీ డైరెక్టరు (విజయకుమార్) ముగ్గురు సహాయ సంచాలకులతో కూడిన ఈ కమిటీ అన్ని నగలు పరిశీలించి, కృష్ణదేవరాయలు ఇచ్చినట్లు చెప్పబడిన ఆభరణాలు ఇప్పుడు ఆలయంలో లేవని నిర్ధారించారు. అక్కడ్నుంచి మీడియాలో ఎన్నో చర్చలు, కథలు

ప్రచారం జరిగాయి. ఆలయంలో ఆభరణాలకు భద్రత లేదనీ, హుండీలోని నిధులకు, ఆభరణాలకు దోపిడి జరుగుతోందనీ, బంగారు డాలర్లు మాయమవుతున్నాయనీ, స్వామివారి సొమ్ముల్ని అర్చకులు తాకట్టు పెడుతున్నారనీ, ఎంతో విలువైన కృష్ణదేవరాయలిచ్చిన ఎన్నో నగలు మాయమయినాయనీ, ఇతర రాజులు, జమీందారులు, భక్తులిచ్చిన నగల విషయం కూడా ఇంతే కావచ్చనీ, ఇప్పుడు భక్తులు హుండీలో వేసే నగలు కూడా దుర్వినియోగం అయ్యే అవకాశాలే ఎక్కువ వుంటాయనీ... ఇలా దేశమంతటా ప్రచారం జరిగి, తిరుమల తిరుపతి దేవస్థానాల పరిపాలనా వ్యవస్థపై భక్తులకు నమ్మకం సడలిపోయే పరిస్థితి వచ్చింది.

ఈ ఆరోపణలలో నిజం వుందా?

నాలుగు సంవత్సరాలు కార్య నిర్వహణాధికారిగా, ఎన్నో సందర్భాలలో ఎన్నో కమిటీలకు అధ్యక్షుడుగా, దేవస్థానాల సలహాదారుగా ఆరు సంవత్సరాలు, ధార్మిక సలహామండలి అధ్యక్షుడుగా 3 సంవత్సరాలు దేవస్థాన వ్యవహారాలతో సన్నిహిత సంబంధం నాకువుంది. ఆలయ పరిపాలనావ్యవస్థ చాలా కట్టుదిట్టమైనది. హుండీలో పడిన నిధులు, ఆభరణాలు, స్వామివారికి వినియోగించే నగలు, ఇతర విలువైన వస్తువులు అన్నీ సక్రమంగా దేవస్థానం వద్ద వున్నాయి. ఏదైనా పొరపాటు జరిగితే వ్యక్తి లోపం వలన (షరాఫు కాజేయడం, అర్చకుడు తాకట్టు పెట్టడం) జరిగినా, తనిఖీలలో విషయం బయటపడక తప్పదు. వారిపై చర్యలు తప్పవు.

న్యాయమూర్తి జగన్నాథరావుగారు ఇచ్చిన నివేదికలో - పాలనావ్యవస్థ కట్టుదిట్టంగా వుందనీ, అన్ని నగలూ, ఆభరణాలూ, ఇతరాలూ భద్రంగానే వున్నాయనీ, వ్యక్తులు దోషులు కావచ్చు కాని వ్యవస్థ పటిష్ఠమేననీ చెప్పినా, ఆ నివేదికను ఒక సంవత్సర కాలం పాటు గోప్యంగా వుంచి, ఆలయ ప్రతిష్ఠకు మచ్చ తెచ్చారు. కారణం- ఆ రిపోర్టు కొందరికి నచ్చకపోవటమే...!

ఇదంతా జరుగుతున్నప్పుడు, నేను దేవస్థానాల సలహాదారుగా, ధార్మిక మండలి అధ్యక్షుడుగా వున్నాను. సీనియరు అధికారులతో, పాలకమండలి సభ్యులతో ఈ విషయాలు చర్చించే అవకాశం వుండేది. న్యాయమూర్తి జగన్నాథరావుగారి నివేదిక బయటపెట్టాలని ప్రభుత్వానికి నేను చేసిన విన్నపాలు పట్టించుకొన్నవారు లేరు... సుప్రీంకోర్టు న్యాయమూర్తి జగన్నాథరావు గారిచ్చిన నివేదిక సరిగా వాడలేని దౌర్భాగ్యస్థితి అది. బయట రోజు రోజుకీ విపరీతమవుతున్న విమర్శలు...

దిగజారుతున్న దేవస్థానాల పరపతి... సామాన్యయాత్రికులలో పెరుగుతున్న అనుమానభూతాలు..!!

ఏదో ఒకటి చేసి, నిజాలు భక్తులకు తెలిపే ప్రక్రియ మొదలుపెట్టి, ఆలయప్రతిష్ఠ, ఆలయంపై భక్తులకు వుండాల్సిన నమ్మకం పునరుద్ధరించాల్సిన అవసరంపై నేను జస్టిస్ జగన్నాథరావుగారితో, మా ధార్మిక సలహామండలి సభ్యులు శ్రీ పొత్తూరి వేంకటేశ్వరరావుగారితో చర్చించడం జరిగింది. ఆలయ పాలనావిధానంపై భక్తుల విశ్వాసాన్ని పునరుద్ధరించే నమ్మకమైన ప్రక్రియ మొదలుపెట్టాలి...

ఆలోచించి, సమాజంలో పేరుప్రఖ్యాతులు గల వివిధ రంగాలలో నిష్ణాతులైన భక్తులను ఒక కమిటీగా ఏర్పాటుచేసి, ఆలయంలోని ఆభరణాలను, రికార్డులు, హుండీ పరకామణి విధానాలు, వాడుకలో ఉన్న నియమ నిబంధనలు క్షుణ్ణంగా పరిశీలించి వాస్తవాలు ప్రజలముందుకు తెచ్చి, బయట జరుగుతున్న దుష్ప్రచారానికి అడ్డుకట్ట వేయాలన్నదే ఈ ప్రక్రియ ధ్యేయం. కార్యనిర్వహణాధికారి, పాలకమండలితో చర్చించి విశ్రాంత సుప్రీంకోర్టు న్యాయమూర్తి (మనరాష్ట్రంవాడు కాదు) వాధ్వా గారి అధ్యక్షతన ఒక కమిటీని నియమించడం జరిగింది. అందులో ఒక పూర్వ కార్యనిర్వహణాధికారి విశ్రాంత ఐఏఎస్ అధికారి శ్రీ వేంకటపతిరాజు, ఒక విశ్రాంత ఐపిఎస్ అధికారి ఆర్.ప్రభాకరరావు, ఒక ప్రఖ్యాత పాత్రికేయుడు శ్రీ పొత్తూరి వేంకటేశ్వరరావు వున్నారు. ఈ కమిటీకి నన్ను సమన్వయకర్తగా నియమించారు. మేమందరం న్యాయమూర్తి జగన్నాథరావుగారిని సంప్రదించాం. స్వామివారి ఆలయంలో నిత్యఅలంకారానికి, విశేష అలంకారాలకు వాడే నగలు, భద్రతా అరలలోని నగలు పరిశీలించడం, వాటిని వాడినప్పుడు భద్రపరచినప్పుడు, భద్రతా అరలో నుండి తీసినప్పుడు, మళ్లీ పెట్టేటప్పుడు ఎటువంటి జాగ్రత్తలు తీసుకొంటారు? ఎవరెవరు దీనికి బాధ్యులు? మరమ్మత్తులు ఎలా చేస్తారు? తరుగులు, విరుగులు ఎలా నిర్ధారిస్తారు? హుండీలో వచ్చిన అన్ని వస్తువులు వెండి/బంగారం, ఇతరాలు - ఎలా లెక్క కడతారు? ఎలా భద్రపరుస్తారు, ఎలా వేలం వేస్తారు? ఇప్పుడు అనుసరిస్తున్న విధానాలు సరిపోతాయా? కొత్తగా ఏమైనా చేయాలా? ఏయే నగల రక్షణకు ఎవరు బాధ్యులు? వీటి రక్షణకు ఎటువంటి భద్రతాఏర్పాట్లు వున్నాయి? రికార్డులు ఎలా తయారు చేస్తున్నారు? వచ్చిన ఆభరణాలు, నగలకి ఎలా విలువ కడతారు? కొన్నింటిని వేలం వేసేటట్లయితే, పారదర్శకత వుందా? ...ఇంకా కట్టుదిట్టం చేయాలంటే ఏం మార్పులు చేయాలి? ...ఇలాంటి అంశాలపై మా కమిటీ కూలంకషంగా అధ్యయనం చేపట్టింది.

ఈ వాధ్వా కమిటీ సమావేశాలు, వివిధ కార్యాలయాలకు వెళ్లి చేస్తున్న తనిఖీలు, పరిశీలించిన విషయాల వివరాలు సమన్వయం చేయడం- అన్నీ ఎప్పటికప్పుడు మీడియా ద్వారా ప్రజలకు సమాచారం అందేటట్లు కమిటీ సమన్వయకర్తగా నేను చేశాను. దీని ఉద్దేశ్యం - భక్తులలో, ప్రజలలో, మీడియాలో ఉత్సుకత పెరగాలనీ, అన్ని విషయాలపై కూలంకషంగా పారదర్శకతతో పరిశీలన జరుగుతోందనీ, నిజాలు తప్పక బయటకు వస్తాయనీ ప్రజలకు తెలియాలని.

మొత్తం 12 సార్లు - ఒక్కోసారి రెండుమూడు రోజులకు తక్కువ కాకుండా కమిటీ సమావేశాలు జరిపింది. సంబంధిత అన్ని కార్యాలయాలలో గంటల తరబడి, రికార్డులు, ఫైళ్లు, ఆభరణాలు, ట్రెజరీలోని భద్రతా గదులు, పరకామణి విధానం, తిరువాభరణం రిజిస్టర్లు, తిరువాభరణం భద్రతా బీరువాలు (ఆలయంలో స్నపన మండపంలో బంగారు వాకిలిలోంచి వెళ్లాలి), పాత రికార్డుల పరిశీలనకు రికార్డు రూం, పరకామణి, తర్వాత, బ్యాంకులు తీసుకోని వివిధ దేశాలకు చెందిన నాణాల మూటలు... అన్నీ క్షుణ్ణంగా పరిశీలించడమైంది.

ఈ పరిశీలనలో ముఖ్యంగా తేలింది ఏమిటంటే, ఆలయంలో తిరువాభరణం (స్వామివారి నిత్య అలంకారానికి, విశేష అలంకారాలకు ఉపయోగించే నగలు) నగలు కాని, వాడకానికి ఉపయుక్తం కాక ట్రెజరీకి పంపిన నగలుకాని, హుండీలో భక్తులు వేసిన నగలు, పురావస్తు లేదా చారిత్రక విలువ లేకపోయినా, ఆలయాల్లో వాడకానికి ఉపయుక్తం కాకపోయినా, వాటిని సొమ్ము చేయడానికి తీసుకొనే చర్యలు కానీ- ఎటువంటి అవకతవకలు జరగడానికి ఆస్కారం లేని చాలా కట్టుదిట్టమైన వ్యవస్థ పరిధిలో వున్నాయి. ఈ వ్యవస్థ ఇప్పటిది కాదు, దశాబ్దాలుగా అమలులోవుంది... 1907 సంవత్సరంలో మహంతుల కాలంలో ప్రత్యేక కోశాధికారిని ఏర్పాటు చేసి, కోర్టువారి అధీనంలో పకడ్బందీగా ఎలా చేయాలో నియమనిబంధనలు తయారుచేసి, అమలులో పెట్టే విధానం మొదలైంది... తర్వాత తర్వాత ఆ విధానం ఇంకా పటిష్ఠంగా చేస్తూ వచ్చారు. ఆభరణంలోంచి చిన్నరాయి రాలినా, చిన్న ముక్క విరిగినా, ఏదయినా మరమ్మత్తు వచ్చినా, ఎప్పటికప్పుడు ప్రతి చిన్నవిషయం కూడా రికార్డులలో భద్రపరచి, విరిగిన ముక్కలకు కూడా లెక్కలు కట్టి మూల్లెలు కట్టి, భద్రపరిచే విధానం అమలు జరుగుతోంది. ప్రతి నగకు ప్రత్యేక గుర్తింపు నంబరు ఇచ్చి, నగ వివరాలు, (ఎంత బరువు, ఎన్ని రాళ్లు, ఏ రకం రాళ్లు, నగ ఆకారం ఇత్యాదులన్నీ) తిరువాభరణం రిజిస్టర్లలో భద్రపరచడం, నగని వాడకానికి బయటకు తీసినా, బయటకు తీసినది

మళ్లీ లోపల పెట్టినా, పరిశీలన చేసే విధానం, ఎటువంటి మార్పులు చేసినా - ఆ తేదీ, మార్పులు చేసిన వారి వివరాలతో సహా రికార్డు చేయబడుతోంది.

1933 సంవత్సరంలో మహంతుల నుండి ప్రత్యేక పాలకమండలి అజమాయిషీలోకి ఆలయం వచ్చినప్పుడు ఏమేమి నగలున్నాయో, అన్నిటి వివరాలూ ఉండటమే కాక, ట్రెజరీకి వాపసు పంపిన నగల వివరాలు కూడా పొందుపరచడం జరిగింది. ఈ కమిటీ ట్రెజరీ రికార్డులో అలాంటి వివరాలను కూడా పరిశీలించి, సమన్వయం చేయడం జరిగింది. ఇంకొకటి మాకు అర్థమయింది- ఈ విధానాలు 1933 ముందు రోజులలో కూడా అమలులో వుండేవని.

చివరికి కమిటీ వారు తేల్చింది - 1933 సంవత్సరంలో మహంతుల నుండి ఏయే ఆభరణాలు, ఆస్తులు, ఇతర విలువైన వస్తువులు ఆలయానికి సంక్రమించాయో వాటికే ఆ తర్వాత పాలకులు బాధ్యులు.

ఆ ఆభరణాలు అన్నీ లెఖ్ఖ ప్రకారం వున్నాయనీ, ఎటువంటి అవకతవకలకూ, కాజేయడానికీ ఆస్కారం లేదనీ, వ్యవస్థ చాలా కట్టుదిట్టంగా వుందనీ, ఎవరైనా ఆలయ ఉద్యోగి కాని, అర్చకుడు కాని కక్కుర్తి పడితే, వెంటనే విషయం బయటకు తెలుస్తుందనీ, అతనిని బాధ్యుణ్ణి చేసి, ఏ కొద్ది నష్టమైనా రాబట్టుకునే సానుకూలం వుందనీ కమిటీ నిర్ధారించింది.

పోయిన డాలర్ల విషయంలోకానీ, కోదండరామస్వామి వారి అర్చకుడు నగలు తాకట్టు పెట్టిన విషయంలోకానీ వ్యవస్థ లోపం కంటే, బాధ్యత అప్పగించబడిన అధికారి లోపం వల్లనే జరిగింది. అవి కూడా ఆలయం తనిఖీలలో బయటపడిన విషయాలే. చర్యలు తీసుకొని నష్టానికి బాధ్యులైన వారినుంచి కూడా రాబట్టే వెసులుబాటు వుందని కమిటీ నిర్ధారణ చేసుకుంది.

వీలైన ప్రతిచోటా నిఘా కెమెరాలు ఏర్పాట్లు చేశారు. వీటిని 24 గంటలూ ప్రత్యేకంగా పరిశీలించడానికి వ్యవస్థ వుంది. ఏమూల ఏం జరిగినా, అది కెమెరాల ద్వారా రికార్డు చేసే సానుకూలం వుంది... సాంకేతిక ప్రగతి దృష్టిలో పెట్టుకుని ఇంకా ఏం మార్పులు చేయవచ్చో కమిటీ వారు సూచించారు.

ఇవన్నీ ఆలయంలో భద్రంగా వుండటం ఒక ఎత్తు- కాని భద్రంగా వున్నాయన్న విషయం ప్రజలకు తెలియటం మరో ఎత్తు. అందుకే విలువైన నగలను ప్రజలు చూడటానికి వీలుగా భద్రతా ప్రదర్శనశాలలో ఏర్పాటు చేయాలని కమిటీ సూచించింది.

స్వామివారి అలంకారానికి (నిత్య/విశేష) వాడే తిరువాభరణం నగలు- పెద్దవి, ఖరీదైనవి- అన్ని నగలనూ ఈ కమిటీవారు నూటికినూరుశాతం పరీక్షించారు. మిగతా చిన్ననగలు దాదాపు 80 శాతం పరీక్షించారు. మిగతావి కూడా రిజిస్టరులో నంబర్లను, అలమార్లలో నగలను, అక్కడక్కడా ప్రతి సభ్యుడు పరిశీలించి, అన్నీ సక్రమంగా వున్నాయన్న నిర్ధారణకు వచ్చారు.

క్రింద హుజూరు ఆఫీసులో ట్రెజరీ విభాగాన్ని ఒక భద్రతావిభాగంగా గుర్తించి ప్రత్యేక కట్టడాలు కట్టిస్తే బాగుంటుందని సూచించారు. తీవ్రవాదులు, ఆటంకవాదులు దాడులు జరపడానికి అవకాశమున్న ఈ రోజులలో, వారికి ఉపలభ్యంగా వున్న మందుగుండు పేలుడు సామానుల దృష్ట్యా, దుర్భేద్యమైన ఏర్పాట్లు చేయవలసిన ఆవశ్యకత గుర్తించారు. పరకామణి జరిగినప్పుడే, రొక్కం అంతా ఆలయం నుండే బ్యాంకువారు తీసుకువెళ్తారు. రిజర్వుబ్యాంకు నుండి వచ్చిన బంగారు నిల్వలను కూడా బ్యాంకు లాకర్ల లోనే ఆలయం వారు పెడుతున్నారు. అయినా పరకామణి జరిగాక, కరిగించడానికి పంపేదాకా లేదా వేలం వేసేదాకా ట్రెజరీలోనే బంగారం, వెండి, రాళ్లనగలు భద్రపర్చాల్సిన దృష్ట్యా ఈ భద్రతాచర్యలు చేపట్టాలని సూచన చేశారు.

ఇంకొక ఆసక్తికర విషయం బయటకు వచ్చింది... ట్రెజరీలో వందలకొద్దీ నాణాలు మూటలు కట్టి వున్నాయి... వివరాలు అడిగితే, తెలిసింది... మన దేశ నాణాలు అన్నీ విలువ ప్రకారం విడదీసి, తూకం వేసి బ్యాంకులకు అమ్మే ఏర్పాటు వుంది... కాని అటువంటి వ్యవస్థ ఇతర దేశాల నాణాల విషయంలో లేదు. వాటిని తీసుకోవడానికి ఏ బ్యాంకు సిద్ధంగా లేదు. మన దేశ నాణాలు కరిగించకూడదన్న నిబంధన వుంది. అది ఇతర దేశాల నాణాల విషయంలో వర్తిస్తుందా? ఎవ్వరూ కొనని ఈ నాణాల్ని ఏం చేయాలో తెలియక, చాలా కాలంగా హుండీలో పడుతున్న అలాంటి ఇతర దేశాల నాణాల్ని బస్తాలుగా కట్టి పెడితే, వాటితో గదులు నిండిపోయాయి.

ఇండోనేషియా, నేపాల్, సింగపూరు, మలేషియా, ఇంగ్లండు, అమెరికా, సౌతాఫ్రికా, మారిషస్, వెస్టిండియా, ఫ్రాన్స్, నైజీరియా దేశాల నాణాలు వివిధ రకాలున్నాయి. వాటిని విడగొట్టే సామర్థ్యం కాని, అమ్మివేసే వెసులుబాటు కానీ లేదు. కమిటీ తరఫున సమన్వయకర్తగా నేను రిజర్వుబ్యాంకు గవర్నరు దువ్వూరి సుబ్బారావుగారితో మాట్లాడి, ఈ విషయం పరిష్కారానికి మార్గం చూపమన్నాను.

ఆయన సూచించిన అధికారులతో నేను చర్చలు జరిపాను. కాని ఆశ్చర్యం ఏమిటంటే, ఈ విషయంపై వాళ్లకి కూడా ఏం చేయాలో తెలియని పరిస్థితి... ఇటువంటి సమస్య వాళ్లకి ఇదివరకెప్పుడూ రాలేదు. చివరికి, వాళ్లు నిర్ధారించింది - మన దేశ నాణాల్ని కరిగించరాదని చట్టం వుంది. కాని అది ఇతర దేశాల నాణాలకు వర్తించదు. కనుక లోహపు ధరకు, ఎవరైనా కొనుక్కోదలిస్తే, వాళ్లకి అమ్మివేయవచ్చు అన్నారు. దేశంలో చాలామంది, నాణాలు సేకరించేవారున్నారు. వారు నాణాలు విడివిడిగా వేరు చేస్తే కొద్దిమొత్తంలో కొనడానికి సిద్ధమే కాని, వేరు చేయని వివిధ దేశాల నాణాలు పెద్దమొత్తంలో కొనుగోలు చేయలేరు. నాణాలు వేరు వేరు దేశాలవి, వేరువేరు ఖరీదులవి. విడగొట్టాలంటే చాలాకష్టం. చాలా ఖర్చుతో కూడిన పని... అందుకే మెటల్ ఖరీదుకు వాటిని అమ్మివేయమని సలహా ఇవ్వడం జరిగింది.

కృష్ణదేవరాయలు, ఇతర విజయనగర రాజులు, శాసనాలలో చెక్కించబడిన ఇతర దాతలు చేసిన దానాలలో విపులీకరించిన నగలు ఇప్పుడున్నాయా, లేకపోతే ఏమైనాయన్న విషయం ప్రత్యేకంగా కమిటీ చర్చించింది. దీనికి సంబంధించి, శాసనాలు, చారిత్రక ప్రచురణలు, తిరుమల ఆలయచరిత్రకు సంబంధించిన గ్రంథాలు కూడా ఈ కమిటీ పరిశీలనకు వచ్చాయి. ఆలయ రికార్డులలో 1933 సంవత్సరంలో మహంతుల నుండి పాలకమండళ్లకు ఇవ్వబడిన ఆభరణాలు, ఆస్తులు ఇత్యాది విషయాలు వివరంగావున్నాయి. అవన్నీ ఇప్పటికీ క్షేమంగా వున్నాయి.

అంతకుముందు కాలంలో జరిగిన విషయాలు పరిశీలించడానికి రికార్డులు లేవు... తెలిసిన చరిత్రను బట్టి తెలియవచ్చేది - చాలావరకు విజయనగర రాజుల కాలంలో ఆలయానికి దానాలుగా వచ్చిన నగలు (శాసనాల ద్వారా విదితమవుతున్నవి) 1933 కి పూర్వమే మాయమైవుండాలి. ఈస్టిండియా కంపెనీ వారి పాలనలోనూ, అంతకుముందు, ఆర్కాటు నవాబుల కాలంలోనూ, ఈ విలువైన నగలు అప్పటి పాలకుల వశం అయి వుండటానికి చాలా అవకాశాలు వున్నాయి. మహంతులకు ఆలయ పాలన అప్పగించినప్పుడు, ఆర్కాటుజిల్లా కలెక్టరు రికార్డులు తయారుచేసి వుంటారు. ఆ వివరాలు ఆర్కాటు జిల్లా రికార్డులలోగాని, మహంతుల మఠంలోకాని ఉండటానికి అవకాశంవుంది... మహంతులకు ఏమేమి సంక్రమించాయో, వాటిని బట్టి తెలియవచ్చు. ఇది ప్రత్యేకంగా పరిశోధన జరపాల్సిన అంశం.

సాధు సుబ్రహ్మణ్యశాస్త్రిగారి గ్రంథ సమాచారం ప్రకారం - చివరి మహంతు ప్రయాగదాసు గారి కాలంలో 1928-29 లో కృష్ణదేవరాయలిచ్చినది అని చెప్పబడే

బంగారు కిరీటాన్ని కరిగించారు. కొత్త కిరీటం నిర్మించాలన్న సంకల్పం విరమించి, కరిగించిన బంగారం ట్రెజరీలోనే వుంచేశారు – అదే నిజమయితే, ఆఖరుగా మిగిలిన ఆ కిరీటం కూడా కరిగించబడింది!

★ ★ ★

...నాకు ఈ తిరుమల చరితామృతం రాయాలన్న కోరిక కలగడానికి కారణం కూడా ఒకరకంగా ఈ కృష్ణదేవరాయల నగల వివాదమే. ఆలయంలోని పాలకులకు, సీనియరు అధికారులకు కూడా తిరుమల చరిత్ర సరిగ్గా తెలియదు. తెలిస్తే ఈ వివాదం వచ్చేదేకాదు... ఆలయం సిబ్బందికి, పాలకులకు, అధికారులకు, ప్రభుత్వంలో పని చేసేవారికి, పత్రికల వారికి... ఇలా చాలామందికి ప్రసిద్ధ ఆలయచరిత్ర తెలియదు.. చరిత్రపై చాలా సమగ్రంగా చర్చించి రచించిన పుస్తకాలు చాలా వున్నాయి. కాని అవి పరిశోధనగ్రంథాలుగా వుండి సామాన్యులకు అందుబాటులో లేవు.

ఈ నా శీర్షిక చదివాకనైనా స్వామివారి భక్తులు తెలుసుకోవాలి – ఈ ఆలయ పరిపాలనా వ్యవస్థ చాలా కట్టుదిట్టమైంది. మనం స్వామివారికిచ్చిన నగలూ, కానుకలూ మీడియాల్లో వ్రాసినట్లు స్వాహా కావడం లేదు. ప్రపంచంలోకెల్లా తిరుమల దేవాలయ సంస్థ ఒక విశిష్టమైనది. వ్యక్తుల బలహీనతల వల్ల జరిగిన ఒకటిరెండు చిన్నచిన్న విషయాల్ని భూతద్దంలో పదేపదే చూపి, మహోన్నతమైన ఈ వ్యవస్థపై నమ్మకం పోగొట్టేందుకు కారకులవుతున్న వారు నమ్మకపోయినా, వాస్తవాలను భక్తులు తెలుసుకొంటే చాలు.

★ ★ ★

87. శ్రీనివాసుడు ధనికుల దేవుడు!

ఈ తిరుమల యాత్ర చేసే సామాన్య భక్తులకి తరచుగా కొండమీద కనిపించే దృశ్యం – "వి.ఐ.పి. వచ్చారు. అందుకే క్యూ కదలటం లేదు".

ఎవరా వి.ఐ.పి.?

పక్కనున్నవాళ్లు చెబుతారు – 'కింగ్ ఫిషర్' విజయమాల్యా వచ్చారనో, ఐశ్వర్యారాయ్, అభిషేక్‌బచ్చన్ వచ్చారనో, రజనీకాంత్ ప్రొద్దుట్నుంచీ గుళ్లోనే వున్నాడనో, సచిన్ టెండూల్కర్ కోసం క్యూ నిలిపేశారనో, ఇంకెవరో రాజకీయ ప్రముఖుడొచ్చాడనో, అంబానీ కుటుంబం అభిషేకం చేసుకుంటున్నారనో...!

ఇది విని క్యూలో వున్న భక్తులందరికీ ఆవేదన, ఆగ్రహం పెల్లుబుకుతుంటాయి.

అక్కడ్నుంచి "దేవుడు కూడా డబ్బు గలవాళ్లనే ముందు చూస్తాడు" అని ఒకడు, "కాదు కాదు, దేవుణ్ణి ఇలా డబ్బు గల వాళ్లకి, అధికారం వున్నవాళ్లకి అప్పగించేసి దేవస్థానం వాళ్లు పాపం సంపాదించుకుంటున్నారు" అని మరొకళ్లు. ...ఇలా పుంఖానుపుంఖాలుగా వ్యాఖ్యానాలు చేస్తుంటారు. ఆ క్షణంలో – గంటల తరబడి క్యూలో నిరీక్షిస్తున్న వాళ్లకి ఈ వ్యాఖ్యానాలు "నిజమే" అనిపించవచ్చు.

నిజం ఏమిటి? శ్రీనివాసుడు డబ్బు, పలుకుబడి గల వారినే ఎక్కువ అనుగ్రహిస్తాడా?

తన విగ్రహం ఎదురుగా ఎవరు ఎక్కువసేపు కూర్చొని, నిల్చొని తనకేసి చూసి కన్నీళ్లు కారుస్తారో వాళ్ల పాపాల్ని తుడిచేసి, మోక్షాన్ని ప్రసాదిస్తాడా?

అసలు శ్రీనివాసుడి దివ్యతత్త్వం ఏమిటి?

భగవంతుడికి 'సమ' అని పేరు. అందరినీ సమంగా చూసేవాడు కనుక 'సమ' అని పేరు. ధనికుడా, పేదవాడా, బ్రాహ్మణుడా, చండాలుడా, అధికారం కలవాడా,

సామాన్యుడా అన్న భావన ఆయనకు లేదు. ఆయనకు కావల్సిందల్లా భక్తి. ఎవరు ఎంత భక్తి చేస్తే అంత అనుగ్రహం చేస్తాడు. నీవు ఎంత ఆయనకు సమర్పణ చేశావన్నది ఆయనకు లెక్కకాదు. నీవిచ్చినది తృణమో, పణమో - ఎంత భక్తితో ఇచ్చావన్నది ముఖ్యం.

మరి ధనికుల దేవుడని పేరెందుకువచ్చింది?... చెప్పేవారు చాలా కారణాలు చెప్తారు.

19వ శతాబ్దం వరకూ చరిత్ర కూడా ఇలాంటి భావం ప్రచారంలోకి రావటానికి కారణమైంది. పూర్వకాలంలో రాజులు, మంత్రులు, ఇతర ముఖ్యులు తిరుమల ఆలయానికి దర్శనానికి బయల్దేరే ముందు తమ ప్రతినిధుల్ని అన్ని ఏర్పాట్లు చేయడానికి తిరుపతి, తిరుమల పంపేవారట. వారికి, వసతి, భోజనం, దర్శనం, గౌరవ మర్యాదలు, వారివారి హోదాలకు తగ్గట్టు, వారు నివేదించబోయే కానుకలకు తగ్గట్లు ఆలయ అధికారులు ఏర్పాట్లు చేసేవారట.

రెంటర్లు, అమల్దార్ల కాలంలో సరేసరి. వారి ఆశయమే వీలైనంత సొమ్ము సంపాదించడం కదా? అందుకే కొంతమంది ఆలయ సిబ్బంది కొండక్రింద నుండే, యాత్రికుల గుంపులలో కలిసిపోయి, ఎవరు గొప్పవారో, ఎవరు ధనికులో, ఎవరు ఆలయంలో ఎక్కువ సొమ్ము ఖర్చు చేయగల సమర్థులో, ఎవరు మొక్కులు తీర్చుకోవడానికి పెద్ద పెద్ద ముడుపుల (ధనం, నగల) తో వస్తున్నారో ఆరాతీసి, ముందుగానే ఆలయ అధికారులకు సమాచారం అందేట్లుచూసి, వారికి సకల మర్యాదలు, వారి హోదాకు తగ్గట్టు ఏర్పాట్లు చేయడం జరిగేవి.

కంపెనీ వారి ప్రత్యక్ష పాలన సమయంలో కూడా ఈ పద్ధతులు కొనసాగేవని 'ఏషియాటిక్ జర్నల్' అనే పత్రికలో ఆనాడు (May-August 1831) రచించి, ముద్రించబడిన వ్యాసంలో తెలుస్తోంది.

కంపెనీ బ్రిటిషు అధికారి (జిల్లా కలెక్టరు) రాసిన వ్యాసంలో "దేశం నలుమూలల నుండి, రాజులూ, సామంతులూ, ధనికులూ, పేదలూ ఈ ఆలయానికి వస్తారు. రాజులు తాము రాలేకపోతే, తమ వకీళ్లను ముడుపులిచ్చి పంపుతారు. తమ ప్రతినిధులను, తమ కానుకలు ఆలయంలో స్వామికి నివేదించడానికి పంపేవారు. వీరేకాక, చుట్టాలద్వారా, స్నేహితులద్వారా కూడా కానుకలు పంపే సంప్రదాయం ఉంది. గోసాయిల ద్వారా పంపే సంప్రదాయం కూడా అప్పటికే మొదలయింది.

బ్రహ్మోత్సవాలకు కొన్ని నెలల ముందే ఆలయం గోసాయిలను (అంటే ఆలయమే నియమించిన సన్న్యాసులను కాషాయాలతో, ఆలయ ధ్వజంతో, అధికార పత్రాలతో దేశదేశాలకు) పంపుతుంది. వారు తిరుమలవచ్చే యాత్రికులనే కాక, భక్తులు సమర్పించదలచుకొన్న కానుకలను, ముడుపులను కూడా పోగుచేసి, వారి తరఫున ఆలయంలో సమర్పించే వెసులుబాటు ఆలయం చేసింది. ఇలా గోసాయిలతో వచ్చిన యాత్రికులకు వసతి, భోజన, ఉచిత దర్శనం ఏర్పాట్లను ఆలయం వారే చేస్తారు".

ఆ జిల్లా కలెక్టరు, ఈ గోసాయిలు భక్తుల కానుకలు, ముడుపులు మధ్యలో కాజేయకుండా, సక్రమంగా ఆలయానికి అందేట్లు భక్తితో పనిచేసేవారని రాశాడు.

స్వామికి వచ్చే కానుకల గురించి చెబుతూ– "1000 రూపాయలు ఇచ్చేవారికి 'స్వామి' వారు మంచి బహుమానాలు ఇస్తారు. 500 వారికి అంతకంటె తక్కువ బహుమానాలు. అలానే వారిచ్చిన సొమ్మును బట్టి బహుమానం విలువ తగ్గుతూ వుంటుంది. స్వామివారికి నగకాని, దుస్తులుకాని వేయాలంటే 'వర్తన' కడితేనే ఆ స్వామికి వాటిని సమర్పించేది".

అభిషేకాన్ని గురించి చెబుతూ –"ఉత్సవదినాల్లో ఈ సేవ చేయడానికి 60 రూపాయలు వసూలు చేసేవారు. పూలంగిసేవతో స్వామివారి పూల అలంకారం చూడాలంటే 12 రూపాయల రుసుం చెల్లించాలి. సహస్రనామార్చనకి 5 రూపాయలు, ఏకాంత సేవకు 12 రూపాయలు రుసుం. అలాగే నైవేద్యాలవిషయంలో, ఆలయం వారు తయారుచేస్తే ఒక రేటు, ఆలయబ్రాహ్మణులతో యాత్రికులు తయారుచేయించి నైవేద్యానికిస్తే ఒక రేటూ. ఒక్కొక్క రకం ప్రసాదానికి ఒక్కొక్క ధర. 65 రూపాయల తిరుప్పావడ నుండి, సామాన్య పేదవారు చేసే 4 రూపాయల ఊకాయ్‌పచ్చడి నైవేద్యం వరకు ఎవరి ఆర్థిక స్థితిని బట్టి వారు చేయగలిగేట్లు ఏర్పాట్లు చేశారు. అలాగే వాహన సేవల రేట్లు అమల్లో వున్నాయి".

ఇలా అధికారం వున్నవారికి, అధికారం లేకపోతే ధనం వుండి సేవలకు రుసుం చెల్లించగల్గిన వాళ్లకు ఈ తిరుమల ఆలయంలో తరతరాల నుండి, వారి కానుకలకు హోదాకు తగిన దర్శనమర్యాదలు జరుగుతుండేవి.

రాజా రఘోత్తమరావు తిరుమల యాత్రకు రావాలంటే, ఆనాటి గోల్కొండ నవాబు దగ్గర వున్న కంపెనీ వారి ప్రతినిధి లార్డు క్లైవు ఉత్తర ఆర్కాటు నవాబుకు ప్రత్యేకంగా సిఫార్సు ఉత్తరం వ్రాసి మరీ పంపాడు. ఈ రఘోత్తమరావు మరాఠీ నాయకుడు.

మంచి ధనికుడు, అధికారం పలుకుబడి కలవాడు. ఆయన తన కుటుంబంతో యాత్రకు తిరుమలకు బయలుదేరినప్పుడు–

ఆయనకు సక్రమంగా దర్శనం జరిగేలా చూడాలని లార్డు క్లైవు ఆర్కాటు నవాబుకు వుత్తరం వ్రాస్తూ కొన్ని సంగతులు ఆ వుత్తరంలో ప్రస్తావించాడు: "ఇతర యాత్రికులను చూసినట్లు, నిర్లక్ష్యంగా చూడకండి. ఈయన (రఘోత్తమరావు) ఆలయానికి, స్వామికి ఇచ్చిన దానధర్మాలు, ఆలయానికే చెందేట్లు చూడాలి. మధ్యవర్తులుగాని, అధికారులు కాని, నవాబు తరఫు వారు కాని, ఆ ధనం కాజేయకుండా చూడాలి".

ఈయన స్వామి వారికి సమర్పించడానికి, అలంకరించడానికి తెచ్చిన నగలు, వస్త్రాలపై 'వర్తన' వసూలు చేయవద్దని కూడా ప్రత్యేకంగా చెప్పాడు.

ఈయనకు ఆలయ మర్యాదలు ఇచ్చి, మంచి దర్శనం చేయించి, ప్రసాద, ఆశీర్వచనాలు ఇప్పించి, అతనికి, అతని కుటుంబానికి తృప్తిగా యాత్ర జరిగేట్లు చూడాల్సిన బాధ్యత ఆర్కాటు నవాబుదే అని చెప్తూ పెద్ద సిఫార్సు లేఖ వ్రాశాడు.

1803లో నారాయణరావు నుండి దొరికిన మరాఠా మెమాయిర్సులో, ధనికుల దర్శనం /సామాన్యుల దర్శనంలో తేడాలు విపులంగా రాశారు. "దర్శనానికి వచ్చిన యాత్రికులందరిని రంగమండపంలో వుంచుతారు. సర్కారు నౌకరులు తీసుకొచ్చిన ధనికులను ముందు దర్శనానికి వదిలి, వాళ్లందరూ ఇవ్వవలసిన కానుకలు ఇచ్చిన తర్వాత, రంగ మండపంలో కూర్చోబెట్టిన సామాన్య యాత్రికులను దర్శనానికి పంపేవారు. యాత్రికులు డబ్బులిస్తే, వారు సూచించిన వాహనంపై స్వామిని వేంచేపు చేసి దర్శనం చేయించేవారు. ఇంకా ఎక్కువ డబ్బు యిస్తే, స్వామివారిని ఊరేగింపుగా మాడా వీధుల్లో ఉత్సవం కూడా చేస్తారు".

ఏమీ ఇవ్వలేని పేదవారికి కూడా దర్శనం చేయిస్తారు. తిరుపతి, తిరుమల స్థానికులు ఈ సేవలు చూడడానికి కాని, దర్శనానికి కాని డబ్బు ఇచ్చేవారు కాదు. వారిని "వుండూరు వాళ్లు" అంటారు. వాళ్లకది హక్కు. ఈ రుసుములు బయట నుండి వచ్చిన యాత్రికుల నుండే వసూలు చేసేవారు.

కొండ ఎక్కడానికి యాత్రికులు రుసుం చెల్లించేది మొదట్లో లేదు. కాని రెంటర్లు, అమలుదార్లు వచ్చి, ఆర్కాటు నవాబు సంరక్షణలో ఆలయం వున్నప్పుడు, ప్రతి యాత్రికునిపైనా యాత్రిక పన్ను వేసేవారు. బ్రాహ్మణులు, యోగులు, సన్యాసులు, బైరాగులు, గోసాయిలు, దాసరుల దగ్గర ఈ రుసుం వసూలు చేసేవారు కాదు.

తర్వాత కంపెనీవారి కాలంలో ఆనాటి కలెక్టరు స్ట్రాటన్ అన్న ఆయన ప్రభుత్వానికి సిఫార్సు చేసి, ఈ పన్ను రద్దు చేయించాడు.

...ఈ నేపథ్యం వల్ల మన తాతల కాలంనుంచీ మనలో 'శ్రీనివాసుడు ధనికుల దేవుడు' అన్న భావం నాటుకుపోయి వుండవచ్చు.

కాని శ్రీనివాసుడు - అంటే సాక్షాత్తు నారాయణుడికి మనుషులు సృష్టించిన నగలు, నగదు కావాలా? అఖ్ఖర్లేకపోతే 'వడ్డీకాసులవాడు' అని పేరెందుకు వచ్చింది అని కొందరు వాదిస్తారు. "పెళ్లి చేసుకోవడం కోసం అప్పు చేశాడు కదా? అదే మన దగ్గర గుంజుతున్నాడు" అనుకుంటారు భక్తులు. కాని పురాణాలు ఏం చెబుతున్నాయి?

పద్మావతీదేవిని పెళ్లి చేసుకోవాలని కుబేరుడి వద్దనుండి చక్రవడ్డీకి 14 లక్షల రామటెంకీలు అప్పుగా తీసుకొన్నాడు. భక్తులిచ్చిన కానుకల నుండి అప్పు తీర్చివేస్తానని కుబేరుడికి పత్రం రాసిచ్చాడు కదా! దానికి బ్రహ్మదేవులు, పరమేశ్వరుడు, అశ్వత్థవృక్షం సాక్షులని కూడా పురాణం చెప్పిందికదా..! మరి అప్పు తీర్చాలి కదా! అందుకే ఆయనకు ఎక్కువ కానుకలు ఇచ్చేవారంటే ప్రీతి అని చెప్పవచ్చు అన్నది వాదం. పురాణ కథ వాస్తవమైనా, ఇది లోక విడంబన కోసం, కలికాలం యుగధర్మం చూపించడానికే అన్నది అర్థం చేసుకోవాలి.

కుబేరుని మాటలలోనే మనకు తెలుస్తుంది. మొదట అప్పు అడిగినప్పుడు, స్వామితో "స్వామీ, ఇదేమి కోరిక, అంతా నీదేకదా! నీ సొమ్మును కాపాడే బాధ్యత నాకు అప్పగించా"వంటాడు. స్వామి - శ్రీపతి/లక్ష్మీపతి. అంతా ఆయనదే. ఆయనకు మనమిచ్చే దాని అవసరం లేదు. ఆయనకు లక్ష్మీదేవి అవసరం కూడా లేదు. సర్వ స్వతంత్రుడు, సర్వశక్తిమంతుడు. అందరూ అతని అధీనులు. అతనికి సమానులే లేరు. ఇక ఆయనకంటే అధికుల ప్రసక్తి ఎక్కడ? స్వ రమణుడు. ఎవ్వరి అవసరం లేకుండానే ఆయన మనుగడ. అటువంటి స్వామికి మనమిచ్చే కానుకలెందుకు కావాలి? ...ఎందుకంటే ఆయన దయామయుడు, కరుణాసముద్రుడు. మనకు అనుగ్రహం చేయడానికి మనచేత సమర్పణ చేయించుకుంటాడు. ఏదిచ్చినా భక్తితో, త్యాగబుద్ధితో ఇవ్వాలి. ఎవరి శక్తికొలది వారు ఇవ్వాలి. దాన్నిబట్టి అనుగ్రహం చేస్తాడు.

మన కర్మను బట్టి మనకు ఫలం. అలా మన కర్మలకు ఫలం ఇచ్చేవాడు శ్రీనివాసుడు. కర్మ మూడు రకాలు, మానసిక, వాచిక, కాయిక కర్మలు. అన్ని రకాల కర్మలకూ ఫలం ఉంటుంది. సత్కర్మకు పుణ్యం, దుష్కర్మకు పాపం. ఈ కర్మఫలం

భగవంతుడు సుఖదుఃఖాల రూపంలో ఇస్తాడు. సామాన్యంగా మనం అనుకుంటాం, ఈ పాపపుణ్యాలు బ్యాంకు ఖాతాల్లాంటివని. చాలామంది పాపాలు చేసి, వాటిని ధార్మిక కార్యక్రమాలతోనో, దానాలతోనే కడిగివేసుకోవచ్చని, కొంత స్వామి హుండీలో వేస్తే పాప ప్రక్షాళన అయిపోతుందనీ అనుకుంటారు.

మన శాస్త్రం నిర్దిష్టంగా చెప్తోంది. పాపకర్మకు పాపఫలమే, పుణ్యకర్మకు పుణ్యఫలమే. విడివిడిగా రెండూ అనుభవించాల్సిందే. పుణ్యం చేసి పాపం ఖాతా తగ్గించుకోలేం. పాపానికి దుఃఖం. పుణ్యానికి సుఖం. ఈ విషయంలో భగవంతుడు అందరినీ సమంగానే చూస్తాడు. అలా అయితే ఇంక భగవంతుడెందుకు? భక్తి ఎందుకు? దీనికి సమాధానం. స్వస్వరూప భగవత్ దర్శనంతో 'సంచిత' - అంటే ఎన్నో జన్మలుగా మనం సంపాదించి మూటలు కట్టి అనుభవించాల్సిన కర్మఫలం దగ్ధమవుతుందిట. ముందుజన్మలలో చేయబోయే పాపాలను మూటలు గట్టే కర్మగ్రంథులు కూడా దగ్ధమై- 'ఆగామి' కర్మఫలం కూడా ఉండదు. మిగిలేది ప్రారబ్ధమే.

ప్రారబ్ధం అనుభవించి తీరాల్సిందే. ప్రారబ్ధం ఇప్పుడు మనం అనుభవిస్తున్న కర్మఫలం. దానిని అర్థం చేసుకోవడానికి బ్రహ్మసూత్రాల్లో ఒక ఉదాహరణ ఇచ్చారు. రైతు పంట కోసి, నూర్చి, బస్తాల్లో నింపుతాడు. క్రిందటి ఏటి పంట, ఈనాటి పంట అన్ని బస్తాలూ 'సంచిత' మైతే, అతను అనుభవించడానికి ఒక బస్తా విప్పి అందులో రోజుకు కొంత అనుభవిస్తాడు అదీ. ఆ విప్పిన బస్తా 'ప్రారబ్ధం' అనుకోవచ్చు. ఈ మధ్యనే బస్తా విప్పితే ఇంకా బస్తా అంతా అనుభవించాలి. వేలజన్మలలో. చాలాకాలం కింద విప్పితే మిగిలిన కొన్ని జన్మల్లో అనుభవించాలి. ఒక బస్తాలో కొన్ని వందల/ వేల జన్మలకు సరిపడే కర్మఫలం ఉండవచ్చు. ప్రస్తుతజన్మలో పుట్టటం కర్మఫలం అనుభవించడానికే... ఖర్చుపెట్టడానికి తెచ్చిన కర్మఫలం ఈ జన్మలో ఖర్చుపెట్టే లోపల, కోట్లజన్మలెత్తినా క్షయం చేయలేనంత కర్మఫలం మళ్లీ మూటలు కడతాడా జీవి.

శాస్త్రం ప్రకారం చాలా ధర్మిష్ఠి, నిష్పాపరుడు, సాత్త్వికుడు, భగవద్భక్తుడు- సర్వసమర్పణ బుద్ధి కలవాడైనా ఆ జీవి ప్రతిరోజూ కనీసం పది జన్మలెత్తినా ఖర్చు పెట్టలేనంత కర్మఫలం సంపాదించి మూటలు కడతాడట. సామాన్యులం - మన సంగతి చెప్పనక్కరలేదు. ఇలా అయితే జన్మలనెత్తి కర్మఫలం అనుభవించి క్షయం చేయడం మన శక్తికి మించిన పని. భగవంతుని అనుగ్రహంతోనే ఇది సాధ్యం. భగవంతుని మహత్త్వజ్ఞానంతో వచ్చినభక్తితో సర్వసమర్పణ చేసి, దాసోహబుద్ధితో

కర్మచేస్తే, ఏదో ఒక నాటికి భగవదనుగ్రహం తప్పక కల్గుతుంది. అనుగ్రహంతో సంచిత/ఆగాములు పోతాయి ఇది శాస్త్రం.

తిరుమల కొండమీద సాక్షాత్తూ మోక్షాన్నిచ్చే వాసుదేవ నారాయణుడే శ్రీనివాసునిగా నిల్చుని ఉన్నాడు. వచ్చి దర్శనం చేసుకొన్నవారికి లేదా తను దర్శనమిచ్చినవారికి పాపప్రక్షాళన చేస్తానని సంకల్పం చేసి బ్రహ్మదేవునికి మాటిచ్చాడు. కలియుగాంతం వరకూ తిరుమలలో స్వామి వుండేది భక్తులను అనుగ్రహించి వారి పాపాలను ప్రక్షాళన చేయడానికే. పాపకర్మలుంటేనే గదా దుఃఖం. దుఃఖం లేకుండా వుండాలంటే పాపాలు పోవాలి.

యాత్ర చేయాల్సింది భక్తితో. చేసిన పాపాలకు పశ్చాత్తాపంతో గోవిందనామ స్మరణ చేస్తూ కొండకు రావాలి. మనం భగవంతుని, ఎంతసేపు చూశామన్నది, మనం ఎంత భగవంతుని హుండీలో వేశామన్నది కాదు ముఖ్యం. ఎంతటి భక్తితో వేశాం, ఎంతటి ఆర్తితో దర్శనం చేసుకొన్నాం! చేసిన పాపాలకు పశ్చాత్తాపం ఉందా? ప్రాయశ్చిత్తం చేసుకుందామనే యాత్ర చేస్తున్నామా? - అన్నది ముఖ్యం.

అనవసర ఆలోచనలతో, అంతులేని కోరికలతో, భగవంతుని ముందు లక్షలు ఖర్చు పెట్టి, గంటసేపు కూర్చుని అభిషేకం చూసినంత మాత్రాన అతను గొప్పభక్తుడైపోతాడనీ, లఘుదర్శనంలో గుంపులో తోయబడి, ఒక్క కనురెప్ప పాటుకాలం మాత్రమే దూరంనుండి భగవంతుని చూసిన భక్తుని కన్నా అతను గొప్ప అనీ అనుకోవడం పొరపాటు. ఇక్కడ మనం భగవంతుని చూశామన్న దానికంటే భగవంతుని కరుణాదృష్టి మనపై పడిందా అన్నది ముఖ్యం.

ఒక్కక్షణం భగవంతుని దృష్టి మనపై పడితే చాలు, సర్వపాపనాశనం కావడానికి. ఆ శక్తి భగవంతుని దృష్టికి వుంది. ఇది అర్థం చేసుకోవాలంటే తొండమానుడు, కుమ్మరి భీమల జీవితాలే నిదర్శనం. అదివరకే చెప్పుకొన్నాం, ఆలయం కట్టించి, బ్రహ్మోత్సవాలు, ఇతర సేవలు ఆరంభించి ఎన్నోవాహనాలు, నైవేద్యాలు ఏర్పాటుచేసి, స్వయంగా శ్రీనివాసుడికి ప్రతిరోజూ బంగారుపూలతో అర్చన చేసే తొండమాను చక్రవర్తి కన్నా, తన గుడిసెలో మట్టిపూలతో, ఆర్తితో, భక్తితో అర్చన చేసే కురువరపునంబి కుమ్మరదాసుడైన భీముని భక్తికి భగవంతుడు ప్రాధాన్యం ఇచ్చి, భీమునికి వెంటనే మోక్షాన్నిచ్చి చక్రవర్తికి 'నీకీ జన్మలో మోక్షం లే'దన్నాడు. "నీ కర్మ వచ్చే జన్మలో పూర్తవుతుంది. వచ్చేజన్మలోనే నీకు మోక్షం. అదీ సాయుజ్యం కాదు,

సారూప్యమే"నని చెప్పాడు భగవంతుడు. ఈ సంఘటన జాగ్రత్తగా అర్థం చేసుకుంటే శ్రీనివాసుడు ఎవరి పక్షమో తెలుస్తోంది. ధనవంతుని పక్షమా/పేదవాని పక్షమా? రెండూ కాదన్నది అర్థమవుతుంది. భక్తుని పక్షం, ఎవరు భక్తి కలిగివుంటే వారి పక్షం.

ఈ శాస్త్ర సూక్ష్మం తెలుసుకొంటే తిరుమలలో ఎలా దర్శనం అయింది అన్న బాధ ఉండదు. వచ్చిన చిక్కల్లా దర్శనంతోనే. ఈ మధ్యకాలంలో లక్షలలో జనం రోజూ వస్తూండటంతో సావకాశంగా భగవంతుని సన్నిధానంలో నిలబడి తృప్తిగా చూసే అవకాశం లేకుండా పోయింది. మనకి అవకాశం లేదనే బాధకన్నా కొందరికి అటువంటి అవకాశం వుందన్న బాధ ఎక్కువ. ఎవ్వరికీ లేకపోతే చిక్కేలేదు.

అందరికీ కులశేఖర పడి దాకా వెళ్లి స్వామి వారి దగ్గరగా కొంచెంసేపు స్తిమితంగా నిలబడి, వీలైతే కూర్చొని దర్శనం చేసుకోవాలని వుంటుంది. కాని ఈ రోజుల్లో జయవిజయుల్ని దాటి బంగారువాకిలి గుండా లోపలికి వెళ్లి కులశేఖరపడి దగ్గర వుండి దర్శనం చేసుకునే భాగ్యం చాలా కొద్దిమందికే. ఉదయం సుప్రభాతసేవ టిక్కెట్లు కొన్నవారికీ, ఆ తర్వాత తోమాలసేవ టిక్కెట్లు కొన్నవారికీ, అటుతర్వాత అర్చన టిక్కెట్లు కొన్నవారికీ... ఇవికాక అభిషేకం, సహస్ర కలశాభిషేకం, అష్టదళపద్మసేవ, తిరుప్పావడ సేవలు చేసినవారికి మాత్రమే ఈ అవకాశం...

అందులోనూ ముఖ్యంగా అభిషేకం, అర్చన, తోమాల, అష్టదళ పద్మసేవ చేసే వారికి, సేవ జరిగినప్పుడు స్వామివారి ఎదుట అరగంటో, ముప్పావుగంటో సేవ జరుగుతున్నప్పుడు... కూర్చొని చూసే అవకాశం ఉంది. అదే సహస్రకలశాభిషేకం, తిరుప్పావడ సేవాదారులు, అరగంటో, గంటో కూర్చున్నా, అది బంగారువాకిలిలోనే కాని లోపలకాదు. కాని సేవ తర్వాత లోపలికి వెళ్లి స్వామివారి దర్శనం చేసుకొనే అవకాశం ఉంది.

ఈ సేవలన్నీ ఆలయంలో నేరుగా మూలవరులకే. అది వరకు ఈ సేవ జరిగేప్పుడు భక్తులను బంగారువాకిలిలో గరుడాళ్వార్ దాకా కూర్చోపెట్టి చేసేవారు కనుక దాదాపు 250, 300 మందికి ఒక్కొక్క సేవలో పాల్గొనే అవకాశం ఉండేది. సామాన్యభక్తులకు సమయం చాలడంలేదని, పోయిన సంవత్సరం నుండీ, ఈ సేవాదార్లను స్నపన మండపం శయన మండపంలో కూర్చోపెట్టి, సేవ జరిగేటప్పుడు బంగారువాకిలి దాకా లైను నడపడం (మహాలఘుదర్శనం) మొదలుపెట్టారు. దీనితో కూర్చొని సేవ చూసేవారి సంఖ్య ఒక్కో సేవకి 100 మందికి పరిమితం అయింది.

అలా చేయడం వలన అదివరకు కూర్చొని చూసేవారు 150/200మంది తగ్గిపోయినా, లైనులో వచ్చిన దర్శనం చేసుకొనేవారు ఆ సమయంలో 2000 నుండి మూడువేల వరకూ పెరిగింది. భక్తులను తేవడం కూర్చోబెట్టడం, దానికోసం లోపల లైన్లు బల్లలు, బారికేడ్లు, తాళ్లు అమర్చడంలో కాలంవృథా అవుతోందని వారంలో సగంరోజులు ఈ సేవలను కూడా సర్కారు సేవ చేసి, ధర్మదర్శనానికి సానుకూలం చేశారు. చాలాకాలం నుండి మధ్యాహ్నం అర్చన, సాయంకాలం తోమాలఅర్చన, సర్కారు సేవ చేసి ధర్మదర్శనం నడుపుతున్నారు.

ఐశ్వర్యారాయ్, రజనీకాంత్, టెండూల్కర్... వీళ్లు వి.ఐ.పి.లా?

ఈ ఆర్జిత సేవలు కాక ధర్మదర్శనం మొదలు పెట్టేముందు ఉదయం సాయంత్రం కొంతమంది ప్రముఖులకు ప్రత్యేకంగా దర్శనం ఏర్పాటుచేస్తారు. దీన్నే వి.ఐ.పి బ్రేకు దర్శనం అంటారు.

సాధారణంగా దేశ పరిపాలకులు, కేంద్రం, రాష్ట్రంనుండి వచ్చేవారు - అంటే రాష్ట్రపతి, ప్రధాని, కేంద్రమంత్రులు, రాష్ట్రమంత్రులు, సీనియరు అధికారులు, జడ్జీలు, పార్లమెంటు, శాసనసభ సభ్యులు వంటి వారికి ఈ అవకాశం. వారుకాక కార్యనిర్వహణాధికారి - దేవస్థానానికి సహాయకారులుగా ఉండేవారికి, మఠాధిపతులు, పీఠాధిపతులు, వివిధ రకాల దేవస్థానాల అభివృద్ధి సంక్షేమకార్యక్రమాలకు పెద్దమొత్తంలో విరాళాలు ఇచ్చిన దాతలకు ప్రత్యేక దర్శనభాగ్యం కల్గించే అవకాశం ఉంది.

ఎలాచూసినా, ఇలా ప్రత్యేకంగా కులశేఖరపడి దాకా - అంటే స్వామివారి దగ్గర దాకా వెళ్లి దర్శనం చేసుకొనేవారు రోజుకు అన్నిసేవలు, ప్రత్యేక దర్శనాలతో సహా రెండువేలమంది దాకా ఉంటారు. వీరిని నియంత్రించడానికి సెలవుదినాల్లో, పర్వదినాల్లో పండుగ దినాల్లో యాత్రికుల రద్దీ ఎక్కువగా ఉంటుంది కనుక ఉదయం, సాయంత్రం కాకుండా ఒక్క ఉదయానికే బ్రేకు దర్శనం కుదించారు. ఇలా దర్శనానికి ప్రత్యేకంగా వచ్చే వారందరూ కూడా డబ్బు చెల్లించే దర్శనం చేసుకోవాలి. కనుక అధికారులు మాత్రమే కాదు, వీరందరూ కూడా ధనికుల కింద లెక్క. అందులోనూ ఆర్జితసేవకు రుసుం చెల్లించేవారు వి.ఐ.పి.లుగా వస్తే అసలుకి రెండింతలు రుసుము చెల్లించాలి. బ్రేకుదర్శనం విషయాలలోనూ అంతే. ప్రతిభక్తుడు 500 రూపాయలు రుసుము చెల్లించాలి.

ఇలా దర్శనం చేసుకొనే ప్రముఖులలో చాలామంది దేవస్థానం వారి రకరకాల పథకాలు, అన్నదానం, ఆరోగ్యదానం, నగల సమర్పణ, వేద రక్షణ, సంక్షేమ కార్యక్రమాలు, విద్యాకార్యక్రమాలు... ఇటువంటి పథకాలలో లక్షల రూపాయలు విరాళంగా ఇచ్చిన వారున్నారు. వారికి ప్రతి సంవత్సరం వారుకోరుకున్న ఒక్కరోజున దర్శనం ఏర్పాటు చేసే వెసులుబాటు దేవస్థానంవారు కలగచేశారు.

ఈ మధ్యకాలంలో ఈ అవకాశం సామాన్యభక్తులకు అందుబాటులో ఉండాలని, పలుచోట్ల స్వామివారి సేవా కౌంటర్లలో ముందుగా రిజర్వేషను చేసుకొనే అవకాశం కొంతవరకు, అలా దొరకని వారికి సేవకు ఒక రోజుముందు కొన్ని టిక్కెట్లు, తిరుమలలో ఎవరు ముందు వస్తేవారికి ఏర్పాటు, అదీకాక ఇంకా మిగిలిన ఖాళీలలో చాలామటుకు యాత్రికులకు లాటరీ పద్ధతిలో అవకాశం కల్పించే ఏర్పాటు. ...ఇలా చాలా వరకు సామాన్యభక్తులకు సావకాశం కల్పించడానికి దేవస్థానం ప్రయత్నాలు చేస్తూనే ఉంది.

అయినా దేవస్థానం మీద విమర్శలు, ఫిర్యాదులు వస్తూనేఉన్నాయి. చివరి నిమిషంలో వచ్చే వి.ఐ.పి.లకు, ఇతర ప్రముఖులకు వెసులుబాటు చేయాలికదా! అవి కార్యనిర్వహణాధికారి, లేదా జాయింటు కార్యనిర్వహణాధికారి పరిధిలో జరుగుతాయి. వారికి ఇటువంటి వెసులుబాటు ఎందుకివ్వాలి అన్నది విమర్శ. దీని విషయంలో చాలా చర్చ జరుగుతోంది. హైకోర్టులో ప్రజా సంబంధిత వ్యాజ్యాలుకూడా వేయడం జరిగింది.

ఈ చర్చలకు కొంత ముఖ్యకారణం మీడియా. దేశంలో ఉన్న చాలా ప్రసారమాధ్యమాలకు తిరుమల తిరుపతిలో విలేఖరులున్నారు. టి.వి.ఛానల్స్ వారి ఎన్నో కెమెరాలు తిరుమలలో ఏమి జరిగినా చూపడానిసి సిద్ధం. మంచి చూపిస్తే ఆకర్షణ తక్కువ. లోపం జరిగిందనో, ఎవరికైనా ఇబ్బంది కల్గిందనో చూపిస్తే జనం ఆసక్తితో చూస్తారు. అందుకని ప్రతి విషయాన్ని అతిశయింపచేసి చూపించాలని ప్రయత్నం. ఇందులో ఒక ఛానల్ వాళ్లకు ఇంకొక ఛానల్‌తో పోటీ. చివరకు దెబ్బతినేది తిరుమల తిరుపతి దేవస్థానాల పరపతి. లక్షలమందికి మించి వెసులుబాటు చేసినది వార్త కాదు, ఒక్కరికి ఇబ్బంది కల్గినా వార్తే...!

వీరందరికీ ఎవరైనా వి.ఐ.పి. వస్తుంటే ఎక్కడలేని ఆసక్తి. ఎవరు వి.ఐ.పి. అన్న పదానికి ఒక నిర్దిష్టమైన నిర్వచనం లేకపోవడంతో కొంత దేవస్థానం సీనియరు

అధికారులు వారి విచక్షణ ఉపయోగించి దర్శనానికి ఏర్పాటు చెయ్యాలి. కొంతమంది రాజకీయ ప్రముఖుల విషయంలో ఇబ్బంది లేదు. వీరందరినీ మీడియావారు ప్రోటోకాల్ వి.ఐ.పి.లుగా గుర్తిస్తారు. కాని సమస్య – వారితో వచ్చే వారి పరివారంతో. అంతకంటే ఇబ్బంది సినిమా ప్రముఖులు, పెద్దపెద్ద వ్యాపారవేత్తలు వచ్చినప్పుడే.

అంబానీ వచ్చినా, విజయమాల్యా వచ్చినా, అమితాభ్ బచ్చన్ వచ్చినా, ఐశ్వర్యారాయ్ వచ్చినా... రజనీకాంత్ వచ్చినా, టెండూల్కర్ వచ్చినా ఇలాంటి పేరున్న వాళ్లెవరు వచ్చినా అన్ని ఛానళ్ల కెమెరాలు దేవాలయం ముందే ఉండి, వారిని ప్రతిక్షణం అనుసరిస్తూ తిరుమలలో దేవస్థానం వారి ప్రతిచర్యను నిశితంగా విమర్శించడం పరిపాటి అయింది. వారి దర్శనాన్ని సామాన్య భక్తుని దర్శనంతో పోల్చి, “వీరందరూ వి.ఐ.పిలా? వీరికి ప్రత్యేక దర్శనాలా?” అన్న విమర్శ చేస్తుంటారు. వీరు ప్రత్యేకులు కాకపోతే మీడియా వారంతా వారి వెనుక ఎందుకు వస్తున్నట్లు? గంటలతరబడి వారికేం జరుగుతుందో తెలుసుకోవడానికి వారు పాటు పడడం ఎందుకు? రాజకీయ నాయకులే వి.ఐ.పి.లా? దేవస్థానం కూడా ఆ ప్రోటోకాల్‌నే పాటించాలా?

ఈ ఛానళ్ల, ఇతర మీడియా ఉన్నతాధికారులూ, వారి పెట్టుబడిదార్లు ఆలయానికి వచ్చినప్పుడు వారిని వి.ఐ.పిలుగా దర్శనాలు చేయించాలన్న తపన వీళ్లకి లేకుండా వుందా? ప్రజాదరణ విశేషంగా పొందినవారూ, దేవస్థానానికి వివిధ పథకాల్లో విరాళాలు భారీగా అందించినవారూ వి.ఐ.పి.లు కారా?... ఈ విషయంలో దేవస్థానం వారు ఒక స్పష్టమైన నిర్ణయం తీసుకొని ప్రోటోకాల్ వారే కాకుండా దేవస్థానం తరఫున “ఫలానావారు వి.ఐ.పి.లు” అని ప్రకటన చేయాలి. అధికారుల సొంత విచక్షణాధికారంతో చేసినట్టుగా కనబడటం సమంజసం కాదు.

ఈ ఆలయంలో ధనికులకు, ఇతర ప్రముఖులకు ప్రత్యేక సదుపాయాలు, దర్శనాలు ఇప్పటివి కావు. గత వెయ్యి సంవత్సరాలుగా వస్తున్నవే.

ఇది ఆర్కాటు నవాబు కాలంలో, ఇంగ్లీషు వారి పాలనలో పరాకాష్ఠకు చేరుకుంది. అన్ని శతాబ్దాలలోనూ అధికారం వున్న వాళ్లు ఎప్పుడూ వి.ఐ.పి.లే. ఆలయానికి నిధులిచ్చేవారూ, దేవాదాయాలు చేసేవారూ ఆలయానికి వి.ఐ.పిలే. ఆర్జిత సేవలకు రుసుంకట్టేవారికి, వారు ఆలయానికి ఇచ్చిన ధనాన్ని బట్టి ఆలయ మర్యాదలు చేయడం మొదటి నుండీ ఈ ఆలయంలో ఉంది. సమాజంలో, ధనికులు, పేదలు వ్యత్యాసం వున్నంతవరకూ, పలుకుబడి, అధికారం వున్నవారు – లేనివారూ అన్న వివక్ష

వున్నంతవరకూ ఈ తారతమ్యం ఆలయంలో వుండే అవకాశం వుంది. ఒకవేళ 'వి.ఐ.పి.' లనబడే వర్గమే లేకుండా టి.టి.డి వారు నిబంధనలు రూపొందించినా, 'శాత్తుమొరై' దర్శనం కోసం వచ్చే శ్రీవైష్ణవులు ముఖ్యులవుతారు. ఇంకా టి.టి.డి. చైర్మన్, ట్రస్టుబోర్డు సభ్యులూ ముఖ్యులవుతారు. ఆస్థానం జరిగేటప్పుడు చోటు చేసుకొనే సర్కారుహారతి, ఇతర మర్యాదల కారణంగా వరుసగా ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, జాయింట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, ఇంకా ఇతర అధికారులు, వలంటీర్లు ముఖ్యులవుతారు. అప్పుడు కూడా సామాన్య భక్తులకు వచ్చే ప్రశ్న- వీళ్లంతా వి.ఐ.పి.లా?

అందుకే అనవసరమైన రాద్ధాంతాలు లేకుండా చేయాలంటే, ఎవరు 'వి.ఐ.పి.'లు? అన్న విషయంపై టి.టి.డి.కి ఒక స్పష్టత ఉండాలి. స్పష్టమైన నిర్వచనమిచ్చి, దాన్ని బహిరంగంగా ప్రకటించాలి. కేవలం అధికార్ల విచక్షణాధికారాన్ని బట్టి 'వి.ఐ.పి.'లను నిర్వచించే విధానానికి స్వస్తి పలకాలి. మన ప్రజాస్వామిక వ్యవస్థలో 'వి.ఐ.పి.'లు లేకుండా ఎలాగూ చేయలేం. కనీసం స్పష్టమైన నిర్వచనమిచ్చి, ఆ విధానాన్నైనా పాటిస్తే, విమర్శలు ఇంతలా ఉండవు. అసలు సమస్య నిజమైన 'వి.ఐ.పి.' లతో కన్నా 'వి.ఐ.పి.'ల సిఫార్సు లేఖలతో వచ్చే వాళ్లతోనూ, 'వి.ఐ.పి.'ల వందిమాగధులతోనే. వాళ్లను కూడా 'వి.ఐ.పి.'లు గానే పరిగణించడం వల్లనే ఈ గొడవలన్నీ వస్తున్నాయి.

అంతకంటే ముఖ్యంగా ఆలోచించాల్సింది సామాన్యభక్తునికి తిరుమల యాత్ర చేసినప్పుడు తృప్తికలిగేలా ఎలా చెయ్యాలో ఆలోచించడం. నేను త్రిసభ్యకమిటీకి అధ్యక్షుడుగా వెయ్యికాళ్లమంటపం, మాస్టరు ప్లాను విషయాలను అధ్యయనం చేస్తున్నప్పుడు ఈ విషయంపై చాలా చర్చజరిగింది. ధనికులు అందరూ తృప్తిగా దర్శనం చేసుకొని వెళ్తున్నారా అంటే అదీ లేదు. స్వామి వారి సేవలకు డబ్బులు కట్టి చూద్దామన్నా అందరికీ అవకాశం లేదు. ఎందుకంటే – స్థలాభావం వలన మూలవర్లకు జరిగే సేవలకంటే అర్థం వుంది. అక్కడ 100 మంది కంటే ఎక్కువ పట్టరుకాబట్టి. కాని ఇతర సేవలకు డబ్బు కట్టినా కట్టకపోయినా అందరూ చూసి తరించే వ్యవస్థ రావాలి.

దాన్ని దృష్టిలో వుంచుకొనే నేను కార్యనిర్వహణాధికారిగా వున్నప్పుడు ఆలయం బయట 'సహస్రదీపాలంకారసేవ' మొదలుపెట్టింది. టిక్కెట్టు కొన్నవారూ చూస్తారు. కొనలేని భక్తులూ చూసి ఆనందిస్తారు. వెయ్యికాళ్ల మండపం కూలకొట్టినప్పుడు, ఆలోచించి ఒక మహామండపం (చుట్టూ తెరిచి పైకప్పు మాత్రమే వుండేది) ఆలయం

ముందు కట్టాలని సూచించాం. అది వెయ్యికాళ్ల మండపంలా అన్పించేలా ఎలా కట్టాలో కూడా చాలా సూచనలు చేశాం. ఉత్సవరులకు ఇప్పుడు గుడిలోపల, బయట వైభవ మండపం హాలులో జరుగుతున్న అన్ని సేవలూ వుదయం నుండి సాయంత్రం వరకు భక్తులందరి సమక్షంలో ఆలయం బయట జరగాలని సూచించాం. 5000 మంది టిక్కెట్లు కొని చూడవచ్చు. 10,000 మంది ఇతర భక్తులు పైసా కట్టకుండా చూడవచ్చు.

ఆలయం లోపల మూలవరులను ఒక్క క్షణం కూడా చూడలేని సామాన్య భక్తులు డబ్బుకట్టకపోయినా రోజంతా ధనికులలాగా స్వామివారి సేవలన్నీ యిప్పుడు సహస్రదీపాలంకార సేవ చూసినట్లే చూసి తరించి తృప్తిగా తిరుమల యాత్ర సఫలం చేసుకోవచ్చు. అప్పుడు శ్రీనివాసుడు ధనికుల దేవుడన్న భావనపోయి, భక్తుల దేవుడన్న విశ్వాసం కలిగే పరిస్థితి ఏర్పడుతుంది.

★ ★ ★

88. హనీమూన్‌కి తిరుమల!

ఆమధ్య ఒక వివాహం సందర్భంగా వధువు తండ్రి నన్ను అడిగారు.

"అమ్మాయిని, అల్లుణ్ణి పెళ్లయ్యాక తిరుమల కొండమీద మూడు నిద్రలు చేయించి, అక్కడ్నుంచి ఊటీ పంపిద్దామనుకుంటున్నాను. కొంచెం మీరు కాటేజీలకు సిఫార్సు చేయాలి!"

నాకు బాధ కలిగింది. ఆ మిత్రుణ్ణి కూర్చోబెట్టి నాకు తెలిసిన విషయాలన్నీ చెప్పాను.

★ ★ ★

పురాణాల్లో తీర్థయాత్ర ఎలా చేయాలో చాలా విపులంగా చెప్పారు. కుమారస్వామికి పరమశివుడు చెప్పినా, మార్కండేయునికి నారద, గరుత్మంతులు చెప్పినా, శుద్ధ అన్న బ్రాహ్మణునికి అగస్త్యుల వారు చెప్పినా, బ్రహ్మదేవులు దేవతలకు చెప్పినా, రుద్రుని అవతారమైన శుకమహర్షి తాను వేంకటాచల యాత్ర ఎలా చేశాడో పురాణం వివరించినా... అందరూ కర్మభూమిగానే ఆ క్షేత్రాన్ని చూశారు.

ఎందరో మహాత్ములు, దేవతలు, రాజులు, చక్రవర్తులు, ధనికులు ఎలా యాత్రలు చేశారో పురాణాల్లో చాలా సందర్భాలలో విపులంగా చెప్పబడింది... వీరుకాక, పాప ప్రక్షాళనకు ప్రాయశ్చిత్తంతో వచ్చిన పాపులు ఎంతమందో ఈ తిరుమల క్షేత్రానికి. వీరందరూ, ఎలా వచ్చిందీ, ఎలా సాధన చేసిందీ స్వామివారి అనుగ్రహానికి అర్హత సంపాదించడానికి, ఎటువంటి కఠోరతపస్సు చేసిందీ ఎన్నో గాథల్లో విన్నాం.

కాని ప్రాపంచిక సుఖాలు అనుభవించడానికి ఇక్కడికి వచ్చిన భక్తుల సందర్భాలు లేవు. ఇది ఒక దివ్యక్షేత్రం. పర్యాటక స్థలం కాదు గదా!

శుకులు, అగస్త్యుల వంటి మునీశ్వరులు, ఆ పర్వతాన్ని భగవంతుని రూపంగా చూశారని చెప్పుకొన్నాం. పవిత్రమైన ఆ కొండపై నివసిస్తే శక్తి లేక పాపాలు చేస్తామేమోనని కొండకింద నివాసమున్నట్లు పురాణం చెబుతుంది.

అదంతా పురాణకాలంలో అనుకుంటే చరిత్రలో చూశాం - ఎందరో మహారాజులు, చక్రవర్తులు, మంత్రులు, సామంతులు, సేనాధిపతులు, భక్తులు ఆర్తితో, భక్తితో స్వామికి కానుకలతో వచ్చి, ఎన్నో కష్టాలకోర్చి, కొండ ఎక్కి, స్వామివారి దర్శనం కోసం తపనతో కష్టపడ్డారని.

తీర్థయాత్రకు బయలుదేరేవారు, దీక్ష తీసుకోవడం మన హిందూ సంప్రదాయం. కొండకు దర్శనానికి వెళ్దామన్న సంకల్పం చేశాక, పూర్వం మన పెద్దలు, క్షురకర్మ చేసుకోవడం ఆపి, వేంకటాచలంలోనే జుట్టు సమర్పించడానికి పెంచేవారు.

తాము ధనవంతులైనా, తమ డబ్బుతో సుఖంగా యాత్రకు ఖర్చుపెట్టగలవారైనా, యాత్రకోసం అహం చంపుకొని, పసుపుబట్టలు కట్టుకొని, వీధుల్లో బిచ్చమెత్తి, ఆ వచ్చిన ధనంతో కొండకు వచ్చే వాళ్లని చాలామందిని చిన్నతనంలో చూసేవాళ్లం.

ఇప్పటికీ, ఎంతోమంది ఐశ్వర్యవంతులు, కొండకు వెళ్లడానికి కార్లు, బస్సులు, విమానాలు ఉన్నా, వాటిల్లో వెళ్లే సుఖంకన్నా, తమ గ్రామాలనుండి, పట్టణాలనుండి కాలినడకన తిరుమల క్షేత్రానికి పసుపుబట్టలతో దీక్షగా గుంపులుగుంపులుగా వెళ్తుండటం చూస్తుంటాం.

యాత్రకు వెళ్తామని సంకల్పం చేసినవారు ఆనాటినుండి సంసారసుఖం వదిలేసి, ఒక్క పొద్దు భోజనం చేసి, పక్కమీద పడుకోకుండా, నేలపై పడుకొని, కాళ్లకు చెప్పులు కూడా తొడగని వారిని ఈనాటికీ ఎంతోమందిని చూడగలం.

చాలామంది భక్తులు కొండ ఎక్కేటప్పుడు చెప్పులు ధరించకుండా, కొండమీద కూడా చెప్పులతో నడవకుండా ఉండటం చూస్తుంటాం. రామానుజుల వారు చేసిన సంస్కరణలలో విధించిన నిషేధాలలో - కొండపై చెప్పులు వేసుకోకూడదని, కొండమీద పుష్పాలు ధరించరాదని, స్వామివారి ప్రసాదమే భుజించాలని, ఏదైనా

కారణాన, కావలసినంత ప్రసాదం లభించకపోతే, నిషిద్ధపదార్థాలు కాకుండా తమ కోసం వండుకొని స్వామివారికి తామే నివేదన చేసి, లేదా వారివద్దనున్న స్వామివారి ప్రసాదాన్ని ఆ వండిన పదార్థంలో కలిపి, దానిని నైవేద్యంగా స్వీకరించాలని వుంది.

ఎండైనా, వానైనా ఆ కొండలరాయుడే దిక్కు అనుకుని యాత్రకు వచ్చినప్పుడు, తీర్థాల్లో స్నానం చేయడం ఒక విధిగా మన పురాణాలు చెప్తున్నా, ఎంతమంది ఆచరిస్తున్నాం? పైగా వేడినీళ్లు లేందే స్నానం చెయ్యలేం. కొండమీద కూడా ఒకటి రెండురోజులు చన్నీళ్ల స్నానం (తీర్థస్నానం సంగతి వదిలేయండి) చేయడం కష్టమయింది.

స్వామివారికి అర్చన చేసే వైఖానస అర్చకుల విషయంలో ఒక నిబంధన ఉంది. పూర్వం ఆలయంసిబ్బంది కొంతమంది, అర్చకులు, ఆచార్యపురుషులు కొండపైనే నివాసముండేవారు. మిగతా భక్తులందరూ సాయంత్రానికి కొండ దిగేవారు. కొండమీద సంసారసుఖాలు అనుభవించరాదన్నది నియమం. అందుకే మిరాశీదార్లు, ఇతర అర్చక గుమాస్తాలు ఇతర కొండమీద నివసించే ఆలయసిబ్బంది, కొండమీద కుటుంబాలతో ఉండే సంప్రదాయం లేదు... అర్చకుల విషయంలో కొండమీద రెండునెలలు బ్రహ్మచర్యం పాటిస్తూ అర్చకత్వవిధులు నిర్వర్తిస్తూ, తర్వాత తమ గ్రామానికి వెళ్లేవారు. వారి స్థానంలో ఇంకొక అర్చకత్వబృందం కర్తవ్యాలు నిర్వర్తించేవారు. ఇదే సంప్రదాయం అన్న ప్రసాదాలు, పడి (భక్ష్యాలు) చేసే వంటబ్రాహ్మణుల విషయంలోనూ ఉండేది. పురాణంలో చెప్పినదయితే, వేదం చదివిన బ్రాహ్మణులచే వండబడిన పదార్థాలు తనకు నైవేద్యంగా పెట్టాలని బ్రహ్మకు శ్రీనివాసుడు చేసిన ఆజ్ఞ. తొండమానునికి అవే ఆదేశాలిచ్చి, అతను అమలు చేసేటట్లు వ్యవస్థ చేస్తారు బ్రహ్మదేవులు.

20వ శతాబ్ది మొదటివరకూ కొండపైన ఉన్న అతిథిగృహాల్లో, వసతిగృహాల్లో మంచాలు కూడా వుండేవికావు. క్షేత్రంలో మంచంమీద పడుకోరాదని, అది అపరాధమని, దేవుని సన్నిధిలో కటిక నేలపై పడుకునేవారు. వారందరికీ సుఖం అనుభవించే స్తోమత లేకకాదు, వచ్చింది సుఖం అనుభవించడానికి కాదు - స్వామివారి యాత్ర ఒక తపస్సు, దీక్ష - వీలయినన్ని ఐహికసుఖాలకు దూరంగా ఉండి సాధన చేయాలన్న నియమం, పాటిద్దామన్న పట్టుదల. చాలామందిని నిష్ఠగల భక్తులు, కొండమీద మలమూత్రవిసర్జన కూడా పాపంగా భావించి అలానే నిగ్రహంతో స్వామి

దర్శనం చేసుకువెళ్లేవారని విన్నాం. కాళ్లతో కొండను తాకడం ఇష్టంలేక మోకాళ్లపై కొండకు వచ్చి వెళ్లిన మహాభక్తుల విషయం మనకు చరిత్ర చెబుతుంది.

అన్ని కష్టాలు మనం పడనక్కరలేదు... ఎలాగూ పడలేం కూడా! ఎందుకంటే, ప్రాపంచిక సుఖాలకు చాలా అలవాటుపడిపోయాం గనుక. పాతకాలంలో ఎన్నో సుఖోపయోగ వస్తువులుగా భావించబడినవి ఈనాడు కనీస సౌకర్యాలుగా భావింపబడుతున్నాయి.

పంచాగ్నుల మధ్య తపస్సు శుకులలా చేయక్కరలేదు – నిరాహారంగా క్షేత్రదర్శనం చేయనక్కరలేదు. కనీస అవసరాలు వదలనక్కరలేదు. కాని భోగ విషయాలు విడిచిపెట్టక పోతే ఈ యాత్ర ఎందుకు? క్షేత్రదర్శనం ఎందుకు? అది సాధన అవుతుందా?

ఈనాడు కొండమీద పరిస్థితులు గమనించాల్సిన అవసరం ఉంది. నారాయణ వనంలో పద్మావతీ దేవిని పెళ్లి చేసుకొన్న శ్రీనివాసుడు, పెండ్లిఅయ్యాక ఆరునెలలు కొండెక్కనని సంకల్పం చేసి, అగస్త్యుల వారి ఆశ్రమంలో కళ్యాణమంగాపురంలో ఉండిపోయిన విషయం పురాణభాగంలో చూశాం. దానికొక సంకేతం ఉంది. కొండ ప్రణయవిహారాలకు నిలయం కాకూడదు. ఈనాడు మనం చేస్తున్నదేమిటి?

కొండమీదే పెళ్లిళ్లు... చరిత్రలో గత నలభై, యాభై సంవత్సరాల క్రితం వరకు పెళ్లిళ్లు చేసే సంప్రదాయమే లేదు. కొండమీద కల్యాణం స్వామివారికే కాని, ఇతరులు కొండపై కళ్యాణాలు చేసుకొనే స్థలం కాదు అది... స్వామి వారిని దర్శనం చేసుకొనేవారు, దానికోసమే కొండకు రావాలి కాని, ఎవరి పెళ్లో చూడ్డానికో, చేయించడానికో కొండకు వచ్చి, వచ్చాం కదా అని దర్శనం చేసుకోవడం కాదు. అందుకే గతంలో దేవస్థానం వారు, కళ్యాణమంటపాలు కట్టించింది తిరుచానూరులో సరే, కొత్త వధూవరులు స్వామివారి ఆశీర్వాదానికి అనుగ్రహానికి పెళ్లయిన వెంటనే కొండకు దర్శనానికి వస్తున్నారనుకొని సమాధాన పడవచ్చు. కాని హనీమూన్‌కని కొండకి రావడం క్షమించరాని పాపం!

నేను కార్యనిర్వహణాధికారిగా ఉన్నప్పుడు, కొండమీద పెళ్లిళ్లు నిషేధించడానికి ప్రయత్నం చేశాను. కాని సాధ్యం కాలేదు. ధర్మకర్తల మండలిలో కొందరు సభ్యులు, "మన వాళ్లలో కొండమీద పెళ్లి చేస్తాం అని మొక్కుకునేవాళ్లున్నారు. వారి మొక్కు

తీరేదెలా?" అని ప్రశ్నించాడు. అందుకు మనం పెళ్లిళ్లు నిషేధించకుండా పెళ్లి చేద్దామనుకునేవారికి అన్ని సౌకర్యాలూ తిరుచానూరులో కల్పిద్దాం అన్నాను. అలా తిరుమలలో పెళ్లిళ్లకని ప్రత్యేక సదుపాయాలు చేయకుండా వుందామన్న నిర్ణయం తీసుకొన్నాం. ఎవరైనా అలా మొక్కుకొని పెళ్లి చేయాల్సి వస్తే, వాళ్ల కుటుంబాలవారు (పదిహేనుమందో, ఇరవై మందో) వచ్చి, చేసుకొని మిగతా బంధుమిత్రులకు విందులు వినోదాలు వారి వూళ్లల్లో చేసుకోమన్నాం. అలా కొంతకాలం, మఠాలలో, సత్రాలలో, కాటేజీలలోనే మొక్కుకున్నవారు పెళ్లిళ్లు చేయడం జరిగేది.

అటుతర్వాత లాభసాటిగా ఉందని, మఠాలలోనే కళ్యాణమండపాలలో ఉండే సదుపాయాలన్నీ ఏర్పాటుచేసి, దర్శనంతో సహా కాంట్రాక్టు తీసుకొని అన్ని ఏర్పాట్లూ చేసే సంప్రదాయం మొదలైంది. పలుకుబడిగలవారు పెళ్లిళ్లు చేస్తే జరిగే విషయం చెప్పనక్కరలేదు. పెళ్లికి పెద్దఎత్తున ఏర్పాట్లు కావాలి. చాలామందికి వసతి కల్పించాలి. పెళ్లికి వచ్చే చాలామంది వి.ఐ.పి.లకు ఏర్పాట్లు, భక్తులకు ఇబ్బంది లేకుండా చేయగలమా? పెళ్లిళ్లు చేసుకొనేవారు, చేసేవారూ భక్తులు కారా? అన్నది ఒక వాదం. కాని, స్వామివారి కోసమే కొండకు రావాలన్నది తిరుమల యాత్ర వెనుక గల స్ఫూర్తి.

నేను పదవీవిరమణ చేశాక, దాదాపు ఆరు సంవత్సరాలు తిరుమల తిరుపతి దేవస్థానాల సలహాదారుగా వుండడం జరిగింది.. అప్పుడూ ఈ పెళ్లిళ్లు చేసే సంప్రదాయాన్ని నెమ్మదిగా తగ్గిద్దామని సలహా ఇచ్చాను. పాలకవర్గాల్ని ఒప్పించడం నాకు చేతకాలేదు.

ఇతర లౌకిక విషయాల సంగతి సరేసరి. కొండమీద మొదటి వి.ఐ.పి. అతిథిగృహం కట్టే ఘనత నాకే దక్కింది. కట్టడం అయితే నేనుగాని, ఆ ఆలోచన చేసింది నాముందు ఉన్న కార్యనిర్వహణాధికారి శ్రీ రాజగోపాలరాజు. కారణం సమర్థించతగినదే. అప్పటివరకూ ప్రత్యేకమైన కాటేజీలని ఉండేవి. వాటిలో మిగతా కాటేజీలకన్నా కొంచెం సదుపాయాలు ఎక్కువ. అవి కూడా ఎన్నో ఉండేవికాదు. ప్రధానమంత్రో, రాష్ట్రపతో లేదా ముఖ్యమంత్రి, గవర్నరులు కొండకు వస్తే, వారికి వారితో వచ్చే పరివారానికీ – ఈ అన్ని కాటేజీలు ఇచ్చేసేవారు. ఈ కాటేజీలు కట్టడానికి డబ్బు ఇచ్చిన దాతలకు చాలా ఇబ్బంది. అదీకాక, భద్రత, ఇతర సదుపాయాలు చేయాలంటే, ఎన్నో కాటేజీలలో చేయాలికనుక ఇబ్బంది. వి.ఐ.పి.లు రాక మానరు.

వారికీ, వారితో వచ్చేవారికీ సదుపాయాలు చేయక తప్పదు. అందుకని, అన్ని సౌకర్యాలు కలిగి అందరినీ ఒకేచోట ఉంచి, యాత్రికులకు ఇబ్బంది లేకుండా చేయాలని పద్మావతీ అతిథిగృహం కట్టడం జరిగింది. దాని కథ అంతా విపులంగా 'నాహం కర్తా హరిః కర్తా' లో రాశాను. అసెంబ్లీలో గొడవ - వి.ఐ.పి.ల కోసం దేవస్థానం డబ్బు తగలేస్తోందని. అందుకని అది కూడా దాతల పథకంలోకి వెళ్లింది.

ఆ అతిథిగృహం కూడా సదుపాయాలు అన్నీవున్నా... భోగాలకోసం ఏర్పాట్లు చేయలేదు. పెద్దలు వచ్చినప్పుడు వారికోసం వచ్చే వారు చాలామంది ఉంటారు. అందరికీ సానుకూలంగా ఉండేటట్లు విశాలంగా ఏర్పాట్లు చేశాం కాని, వి.ఐ.పి.లు రానప్పుడు ఆ అతిథిగృహంలో వుండటం ఒక స్టేటస్ సింబల్‌గా తయారయ్యింది. రాష్ట్రపతి ఉన్న గదిలో వున్నాం, ఇందిరాగాంధీ ఉన్న గదిలో ఉన్నాం. అందులో ఉంటే మనం కూడా ప్రధానమంత్రో, రాష్ట్రపతో- అన్నట్లు తయారయింది. అలా మొదలయింది... నెమ్మదిగా ధనికులు దేవస్థానాలకు విరాళాలిచ్చి, వారే స్వయంగా నిర్మాణాలు చేపట్టి, అందులోని అన్ని అవసరాలు సమకూర్చే బాధ్యత కూడా వారే తీసుకొని, వాటిని సక్రమంగా నిర్వహించడానికి వారి సిబ్బందినే నియమించే సంప్రదాయం మొదలైంది.

రెండుమూడు లక్షల విరాళాలతో కనీస సదుపాయాలతో కట్టే అతిథిగృహాల స్థానంలో రెండుస్టార్‌ల, ఐదుస్టార్‌ల విలాసగృహాలు కట్టడం, వాటిని నిర్వహించడానికి ప్రత్యేకసిబ్బంది వారివారి కంపెనీలద్వారా ఏర్పాటుచేయడం - వారికి, వారి తరఫున వచ్చే వారికి అన్ని సదుపాయాలు ఏర్పాటుకు అవకాశం.. ఒకరిని మించి ఒకరు ఇంకా బాగుండే అతిథిగృహాలు కట్టాలన్న పోటీపడి కట్టే సంప్రదాయం వచ్చేసింది. కోటి రూపాయలు విరాళమిచ్చి అతిథిగృహాలు కట్టే నిర్ణయాలు చేస్తున్నాం. అలా డబ్బు ఇవ్వగల వాళ్లు చాలామంది పలుకుబడికలవాళ్లే కదా!.. ఇంతా చేస్తే అందులో మూడో నాలుగో గదులు.. మహావుంటే ఎనిమిదిమంది, పదిమంది ఉండవచ్చు- దేవస్థానం డబ్బు ఖర్చుపెట్టకపోయినా, విలువైన స్థలం కొండమీద కేటాయించాల్సి వస్తుంది. కష్టపడి పెంచిన చెట్లు కొట్టి ఈ కట్టడాలు కట్టాల్సివస్తుంది. వీటికి కావల్సిన రోడ్డు, నీటి, విద్యుత్తు, మురుగుసౌకర్యాలకు ఏర్పాట్లు దేవస్థానం చేయాల్సిందే కదా. ఇదే స్థలం సామాన్యభక్తుల అవసరాలకోసం నిర్మాణం చేస్తే, వందల మందిని తృప్తిపరచవచ్చు.

40 ఏళ్ల క్రితం కొండమీద ఏసిలకు అవసరమే ఉండేదికాదు. చెట్లు కొట్టడాలు, విపరీతంగా నిర్మాణాలు వచ్చాక ఏసిల అవసరం పెరిగింది. కొండమీద ఇప్పుడు ప్రతివారికీ ఏసి రూములు కావాలి... ఇటువంటి కార్పొరేటు అతిథిగృహాలు వందలకొద్దీ కొండమీద వెలశాయి.

నేను వేయికాళ్ల మండపం, మాస్టరుప్లాను విషయంలో ప్రభుత్వం నియమించిన త్రిసభ్య కమిటీ అధ్యక్షుడుగా ఉన్నప్పుడు విషయం కూలంకషంగా చర్చించి ఇటువంటి అతిథిగృహాల నిర్మాణం ఆపివేయాలని, వీలయినంతవరకు కొండమీద కొత్తకట్టడాల విషయంలో నిషేధం విధించి, వచ్చే 20, 30 ఏళ్ల అవసరాల దృష్ట్యా కొండమీద ఎటువంటి సదుపాయాలు చేయాలి, కొండకింద తిరుపతిలో ఎటువంటి సౌకర్యాలు చేయాలన్నది ఒక మాస్టర్‌ప్లానును నిపుణులతో చర్చించి, ఆ తర్వాతే వారి సూచనల మేరకు కట్టడాలు చేపట్టాలని సూచన చేయడం జరగింది.

కాని ఆ సూచనలు చదివిన వారు తక్కువ. ఆచరించినవారు లేరు. నన్ను దేవస్థానానికి సలహాదారుగా నియమించినప్పుడు మళ్లీ సలహాలిచ్చి, ఈ విషయంలో కొత్తఅతిథి గృహాలు కట్టకుండా ఆంక్ష విధించాలని అప్పటి కార్యనిర్వహణాధికారి ఎ.పి.వి.ఎన్.శర్మగారికి సూచించడం జరిగింది. ఆయన విషయం అర్థం చేసుకొని పాలకమండలిలో చర్చకు పెట్టినప్పుడు, పాలకమండలినుండి వ్యతిరేకత చాలా వచ్చింది. 50 లక్షలు, కోటి రూపాయలు దానంగా ఇచ్చి, వారే కట్టిస్తామన్నా మనం అనుకూలం చేయకపోతే మేము పాలకమండలి సభ్యులుగా ఎందుకు, అధ్యక్షులుగా ఎందుకు? ససేమిరా కాదని, ఆయనను, ఆయనకు సలహా ఇచ్చిన నన్ను నిష్ఠురంగా విమర్శ చేసే దాకా వచ్చింది.

ఇటువంటి సదుపాయాలు మంచి మంచి భక్తుల అలవాట్లను కూడా పాడుచేస్తాయి. సౌకర్యాలు ఉండాలి - అవసరం కాని భోగలాలసత్వం కొండమీద ఉండరాదు. దానికి ప్రోత్సాహం చూపరాదు. ఈ భోగాలకు అవకాశం ఉంది కనుక విలాసం కోసం కొండకు వచ్చే వారి సంఖ్య పెరుగుతోంది. భక్తితో వచ్చే వాళ్లకు కూడా వారి దృష్టి భోగాలవైపు మళ్లించే సందర్భం...

వైకుంఠం క్యూ-కాంప్లెక్సుకి 1980లో నేను కార్యనిర్వహణాధికారిగా ఉన్నప్పుడు పథకం తయారుచేశాం. యాత్రికులు కొండకి వచ్చేది, దర్శనానికి.. ఇతర అవసరాలు

తీర్చుకోవడానికి కాని భోగించడానికి కాదు అన్నది జ్ఞప్తిలో ఉంచుకోవాలి. వారు కొండకు రాగానే కాలకృత్యాలు తీర్చుకోవడానికి, వారి సామానులు భద్రపరచు కోవడానికి, మరుసటి రోజు సేవ చేయాలంటే కొంచెం విశ్రాంతికి.. ఈ అవసరాలన్నీ క్యూ-కాంప్లెక్సులోనే కల్గించితే వేరే వసతి తీసుకొనే అవసరమే ఉండదు గదా! అలానే అన్ని సదుపాయాలు ఉండే విధంగా ఆ కాంప్లెక్సు కట్టించాం. ఇటువంటి కట్టడాల విషయంలో చాలా అనుభవం ఉన్న అప్పటి దేవస్థానం అధ్యక్షులు విజయాస్టూడియో అధిపతి నాగిరెడ్డిగారు చాలా శ్రద్ధ తీసుకొన్నారు.

ఇప్పటికీ తిరుమలలో వేలాది భక్తులు రోడ్లమీద పడుకోవడం (వసతిలేక) చూస్తాం! అదే సమయంలో నూరుమందికి సరిపోయే గదిలో విలాసవస్తువులతో ఇద్దరు ముగ్గురు గడిపే అతిథిగృహాలు ఎన్నో ఉండటం చూస్తున్నాం. దేవస్థానం పాలకమండలి ఈ విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించి నిర్మాణాల విషయంలో నిర్దుష్టమైన ప్రణాళిక ఏర్పాటు చేయాలి.

కొత్తగావచ్చిన సాంకేతికనైపుణ్యం (టెక్నాలజీ) సహాయంతో అసలు దర్శనం కోసం వేచివుండే అవసరమే లేకుండా, వేలిముద్ర, కంటిముద్రల ఆధారంగా వారికి కేటాయించిన సమయంలో వచ్చి దర్శనం చేసుకొనే ఏర్పాట్లకు అవకాశం ఉన్న ఈ రోజుల్లో - కొండమీద ఇంకా వసతికోసం కట్టడాలే అక్కరలేదనిపిస్తుంది.

మరీ కాదనుకుంటే, కొండమీద పలుచోట్ల, వచ్చిన యాత్రికులకు, కాలకృత్యాలు తీర్చుకోవడానికీ, స్నానాలు చేయడానికీ, సామాన్లు భద్ర పరచుకొనే లాకర్లు - రోడ్డు మీద పడుకొనే అవసరం లేకుండా పెద్దపెద్ద హాళ్లు కట్టిస్తే సరిపోతుంది. ఎంతమంది వచ్చినా ఒక్క అరగంటలో వారి అవసరాలు తీర్చుకొని దర్శనానికి వెళ్లే వెసులుబాటు చేయాలి.

కొండమీద కార్ల వాడకంలో కూడా కొంత నియంత్రణ చేయాలి. కొండమీద నిర్ధారించిన నాలుగయిదు ప్రాంతాల్లో ఒక్కొక్క చోట వందలకొద్దీ కార్లు నిలపడానికి పెద్దఎత్తున సదుపాయం చేయాలి. నేను కార్యనిర్వహణాధికారిగా ఉన్నప్పుడు ప్రారంభించిన ఉచితబస్సులు, అప్పుడు దళారుల నుండి, కూలివారి బారినుండి, సామానులు, యాత్రికులు మోయనవసరం లేకుండా ఉండడానికి చేసిన ఏర్పాట్లు - ఇతర టాక్సీలు, ఆటోలు కొండమీద నిషేధించి, ఈ బస్సుల ద్వారా కొండమీద

ఎక్కడకు వెళ్లాలన్నా దేవస్థానం ఉచితంగా చేసిన ఏర్పాటు - ఆ బస్సుల సంఖ్య ఇప్పుడు పెరిగింది.. వాటిని ఇంకా పెంచి, కొండమీద ఇతర వాహనాలు తిరిగే అవకాశం లేకుండా, ఎవరుఎక్కడకు ప్రయాణం చేయాలన్నా ఈ ఉచితబస్సులే వాడే ఏర్పాటు చేయాల్సిన అవసరం కన్పిస్తోంది. వాహనకాలుష్యం తగ్గించవచ్చు. రోడ్డునిండా ఉన్న యాత్రికులకు ప్రమాదాలు కలుగకుండా ఇబ్బంది లేకుండా చేయవచ్చు. శబ్దకాలుష్యం తగ్గించి యాత్రికులు ప్రశాంతంగా భగవంతుణ్ణి ధ్యానం చేసే ఏర్పాటు చేయవచ్చు.

తిరుమల వస్తూనే యాత్రికునికి ఒక ఆధ్యాత్మిక స్థలానికి వచ్చామన్న భావన కల్గించాలి. ఇతర పట్టణాలకు, ఇక్కడికీ ఏ విషయంలోనూ తేడా లేకపోతే యాత్రికునికి మనశ్శాంతి ఎక్కడ?! దివ్యక్షేత్రానికి వచ్చామన్న భావన ఎక్కడ?!

★ ★ ★

89. వేదాలు బ్రాహ్మణుల కోసమా? సమాజం కోసమా?

పద్మవిభూషణుడు శ్రీ ఉప్పులూరి గణపతిశాస్త్రిగారు చాలా ప్రసిద్ధి చెందిన వేద పండితుడు. నేను తిరుమల తిరుపతి దేవస్థానాల కార్యనిర్వహణాధికారిగా ఉన్నప్పుడే ఆయనను దేవస్థానాల ఆస్థానపండితుడుగా నియమించడం జరిగింది. అప్పటికే ఆయనకు దాదాపు 94 సంవత్సరాల వయసు.

స్వాధ్యాయం చేసి, వేద పారాయణం (క్రమాంతం) ఆ తర్వాత ఘనాపాఠులవడం ఒక ఎత్తు... అంటే, వారి వారి వేదశాఖలు, ప్రాచీన కాలం నుండి వచ్చే సంప్రదాయానుసారం, గురువుల వద్దనుండి ముఖతః రొట్టు వేసి వల్లించి నేర్చుకోవడం ఒక పరంపరగా వేల సంవత్సరాల నుండీ వస్తోంది. ఈ వేదాలకు వ్రాతప్రతులుండేవి కావు. స్వరం దెబ్బతినకుండా, తప్పులు లేకుండా సంహితను క్రమపద్ధతిలో ఘన పద్ధతిలో వల్లె వేసే ప్రక్రియ, సంహితలో తప్పులు రాకుండా వుండటానికి, మన ప్రాచీనులు అవలంబించిన విధానం నడుస్తోంది. ఇలా 8 సంవత్సరాలు కష్టపడి క్రమం, 12 సంవత్సరాలు నేర్చుకుని ఘనాపాఠులు అయినా వేదం వల్లె వేయడం వస్తుందేకాని, వారికి వేదార్థం తెలియదు. ఈ మధ్య కాలం వరకూ, ఈ వేద పండితులకు వేదమంతా కంఠస్థమయినా చాలామందికి చదవడం, వ్రాయడం వచ్చేవి కాదు. వేదార్థం తెలియాలంటే షడంగాలు అధ్యయనం చేయాలి. న్యాయం, వ్యాకరణం, మీమాంస, తర్కం ఇలా శాస్త్ర అధ్యయనం చేసిన వారికే వేదార్థం తెలుస్తుంది. అదీ ఏ ఒక్క శాస్త్రమో చదివినా అర్థం చేసుకొనే అవకాశం లేదు.

శ్రీ ఉప్పులూరి గణపతి శాస్త్రి గారు నాకు చెప్పినది - తాను 48 సంవత్సరాలు వేదం/శాస్త్ర అధ్యయనం చేస్తూనే గడిపితే గాని వేదార్థం తెలిసే అవకాశం రాలేదన్నారు. అలాంటి అవకాశం ఎంతమందికి దొరుకుతుంది. వారి కుటుంబంలో, వారి సహోదరులు లౌకిక ఉద్యోగాలలో న్యాయమూర్తులుగా, ఇతర ఉద్యోగాలకు వెళ్తే, ఈయనకు వారి తల్లిదండ్రులు ప్రోత్సాహం చేసి, 48 సంవత్సరాలు అధ్యయనానికి

ఆర్థికసహాయం అందించి పోషించారు కనుక ఆయనకు అవకాశం కల్గింది. అలాంటి అవకాశం పూర్వకాలంలో రాజులూ, జమీందారులూ పండితులకు కల్గించి, పోషించి, మడులు, మాన్యాలు ఇచ్చి, ఆర్థికంగా ఎటువంటి ఇబ్బంది లేకుండా అధ్యయనం పైనే ధ్యాస వుండేట్లు ఏర్పాట్లు చేసేవారు. దానికి ముఖ్య కారణం ఈ వేద/శాస్త్ర పండితులు, ఆధ్యాత్మిక చింతనతో, తమ బాగోగులు పట్టించుకోక, సమాజశ్రేయస్సు కోసం యజ్ఞ యాగాదులు చేస్తూ, జప తపాలతో 'సర్వేజనాః సుఖినోభవంతు' అన్న అకామ్యకర్మ చేస్తూ, దేశం సుభిక్షంగా వుండాలన్న ఏకైకదీక్షతో జీవితకాలం దేవతలను, భగవంతుని ప్రార్థిస్తూ, కాలం గడిపేవారు.

వారి లౌకిక అవసరాలు తీర్చడం సమాజం బాధ్యత... వేదాలలో ఎన్నో ప్రక్రియలు... సమాజశ్రేయస్సుకు, రాజు క్షేమానికి, దేశం సుభిక్షంగా వుండటానికి, అకాలవర్షాలు లేకుండా సకాల వర్షాలతో దేశం సస్యశ్యామలంగా వుండటానికి వున్నాయి. ఇవి కాక, మానవుని ఏ కోరిక తీరాలన్నా వేదాలలో విధానాలు వున్నాయి. శాస్త్రం చెప్పిన రీతిలో యోగ్యులైనవారు నిష్ఠతో కర్మ చేసినట్లయితే ఫలితం నిశ్చయం... కామ్యకర్మలు- అంటే శత్రునాశనానికో, సంతానప్రాప్తికో, ధనధాన్యాలకో, ఆరోగ్యం కోసమో, రాజ్యకాంక్షతోనో, పదవీకాంక్షతోనో, ఇంకేదైనా సరే కోరిక తీర్చుకోవడానికి శాస్త్రంలో విధివిధానాలు సూచించారు... అలా సమాజానికి, సామాన్య ప్రజానీకానికి సుఖశాంతులు కలగచేయడానికి, కోరికలు తీర్చడానికి మన ఋషిమునులు మంత్రద్రష్టలై వేదాలనుండి ఈ ప్రక్రియలు చేసే విధానాలను నిర్దుష్టంగా ఏర్పాటు చేసి, వాటిని సక్రమంగా జరిపే బాధ్యత, ఈ శాస్త్ర, వేద పండితులకు అప్పగించారు. ఇతర ధ్యాస లేకుండా, సమాజానికి మేలు చేసే కార్యక్రమాలు చేయడమే ఈ పండితుల ప్రథమ కర్తవ్యం.

★ ★ ★

ఈ రోజుల్లో సామాన్యంగా వేదాలు ఎందుకున్నాయని ప్రశ్నిస్తే, సామాన్యులు చెప్పేది- సభలలోనూ, పుణ్యకార్యక్రమాలలోనూ వేద ఆశీర్వాదం చేయడానికని, లేదా ఆలయాల్లో వేద పండితులు వారి భుక్తికోసం, తిరుమల తిరుపతి దేవస్థానాల ఆర్థిక సహాయంతో కొన్ని గంటలు వేద పారాయణం చేయడానికనీ... ఈ వేదాలన్నీ వేద పండితుల (బ్రాహ్మణుల) బ్రతుకుతెరువు కోసమన్న అభిప్రాయం చాలామందిలో వుంది... కొన్ని జిల్లాలలో, ముఖ్యంగా ఉభయగోదావరి జిల్లాల్లో, కృష్ణా, గుంటూరు జిల్లాల్లో సంవత్సరానికి ఒకసారి వేదాభిమానులు వేద సభలు చేసి, వేద పండితులకు సత్కారం

చేసే సంప్రదాయం వుంది. ఆ సమయంలో ఘనాపాఠులు, క్రమాపాఠులు, వేద పనసలు వల్లించడం, చివరగా వారికి సంభావనలతో సత్కరించటం జరుగుతుంది. అసలు వేదాలు ఏమిటి, వాటి సంరక్షణ అవసరం ఏమిటి, అవి సమాజానికి అవసరమా అన్న విషయాలలో చాలామందికి అవగాహన లేకపోవడమూ, రాను రాను వేదపండితులకు సమాజం నుండి ఆదరణ తక్కువై సంభావనలకై ఎదురు చూసే దౌర్భాగ్యం కలగటమూ, ఈ వేదాలు - వల్లెవేసిన పండితుల బ్రతుకుతెరువుకు మాత్రమే అన్న భావన జనంలో నాటుకుపోవడానికి కారణమయ్యాయి.

★ ★ ★

గతంలో విషయాల అవగాహన గల రాజులు, చక్రవర్తులు, సమాజంలోని ధనికులు, ఈ పండితులకు గ్రామాలు, భూములు, మడులు, మాన్యాలు ఇచ్చి, ఆర్థికంగా ఇంకే ఇతర వ్యాపకంలోకి వెళ్లే అవసరం లేకుండా వీరికి సమాజం తరఫున ఏర్పాటు చేశారు. ఉదాహరణకు కాకతీయుల పాలనలో చూడండి, వేద పండితులను శాస్త్రపండితులను ఎంతో ఆదరించే ఈ రాజులు, దేశానికి మహమ్మదీయుల దాడితో ప్రమాదం వచ్చినప్పుడు ఈ పండితులందరినీ గోదావరిలో పడవలలో సప్తగోదావరీ ప్రాంతాలకు తరలించి, వారికి ఎన్నో అగ్రహారాలు ఇచ్చి, సంప్రదాయ రక్షణ చేసినందు వలనే, మన రాష్ట్రంలో వేదం నిలవడానికి ఆస్కారమయింది. తూర్పుగోదావరిలో అమలాపురం, రాజోలు ప్రాంతాలు ఆ రోజుల్లో తేలికగా చేరడానికి అనువైన ప్రదేశాలు కావు. దాడుల నుంచి సురక్షితం. అందుకే వేద రక్షణ, వేద పురుషుల రక్షణ ముఖ్య బాధ్యతగా గుర్తించిన రాజులు, ఈ పండితుల నందరినీ, గోదావరి డెల్టా ప్రాంతాలకు తరలించి రక్షించారు.

రాజులు పోయారు, జమీందార్లు పోయారు. వేయి సంవత్సరాల కాలంలో ఇతర మతస్థులు, పాలకులు చేయలేనిది, స్వాతంత్రం వచ్చాక మన ప్రజాపాలకులు, దీన్ని మతపరమైన అంశంగా పరిగణించి, శ్రద్ధ తీసుకోకపోవడంతో, ఆదరణ నశించి ఈ వేద, శాస్త్ర విధివిధానాలు అధ్యయనానికి మాత్రం నియమితమై, ప్రజలతో వున్న సంబంధం క్షీణించడానికి దోహదకారి అయింది. అదేకాకుండా హిందూ ఆలయ పాలన కూడా దేవాదాయ చట్టం ద్వారా ప్రభుత్వ అధీనంలోకి రావడం... అంతగా అవగాహన లేని రాజకీయనాయకులు, అధికారుల అధీనంలో, ఆలయాలకు ఆదాయమే ప్రధానం, యాత్రికుల సౌకర్యం మాత్రమే ముఖ్య ఆశయాలుగా నిలిచి వేదరక్షణ, సంప్రదాయ రక్షణ, హిందూ మత సంరక్షణ, మతాంతరీకరణలు నిలుపుదల

చేసే విషయాలపై, ఆలయ పాలకులకు నిర్దిష్టమైన బాధ్యత వున్నదన్న స్పృహ కల్గించక పోవడంతో, ఈ వ్యవస్థకు పెద్ద దెబ్బ తగిలింది. అదే సమయంలో, ఈనాములు తీసివేయడం, దున్నేవాడిదే భూమి అని టెనెన్సీ విధానాలు రావడంతో, ఎంతో కాలంగా ఈనాములు, మాన్యాలపై ఆధారపడే ఈ వేద శాస్త్ర పండితులు నిరాధారులై వంశంలో సంప్రదాయంగా వస్తున్న వేదశాస్త్ర అధ్యయనాలు వదలి ఇతర వ్యాపకాలపై బ్రతుకుతెరువుకు బయలుదేరే పరిస్థితి వచ్చింది. ఇంకా కొందరు ఈ వేదాన్ని శాస్త్రాన్ని నమ్ముకుని, వంశ సంప్రదాయం వదలలేనివారు వేద సభలు, ఇతరులిచ్చే సంభావనల మీద బతికే దయనీయ స్థితి వచ్చింది.

1979 లో నేను కార్యనిర్వహణాధికారిగా తిరుమల తిరుపతి దేవస్థానంలో వున్నప్పటి పరిస్థితీ అదే. ఒకనాడు నాకు కంచి కామకోటి పీఠాధిపతి శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతీ స్వాముల వారినుండి తమను కలవమని వర్తమానం వచ్చింది. అప్పుడు ఆయన సంచారంలో మహారాష్ట్రలోని సతారాలో వున్నారు. వెంటనే బయలుదేరి వారిని కలవడానికి వెళ్లాను. అప్పటికే వారు 40 రోజులుగా మౌనవ్రతంలో వుండటం, అది ఇంకా 5 రోజులు కొనసాగాలన్నది వారి సంకల్పమైనా, అనుగ్రహం చేసి, నాతో దాదాపు 6 గంటలు సాయంత్రం 5 గంటల నుండి రాత్రి 11 గంటల వరకు నిర్విరామంగా చర్చించి చేసిన సూచనలు - ముఖ్యంగా, వేద రక్షణ, శాస్త్రరక్షణ, ధర్మరక్షణ పైనే. ఆయన చేసిన సూచనల మేరకే, తిరుమల తిరుపతి దేవస్థానాలలో నేను వేద రక్షణ పథకాలు, శాస్త్ర రక్షణ పథకాలు. హిందూ ధర్మ రక్షణ సంస్థ వంటివి ప్రారంభించడం జరిగింది. దక్షిణాది రాష్ట్రాలలోని వేద పండితుల నందరినీ... క్రమాంతం చేసిన వారిని, ఘనాంతం చేసిన వారిని, తిరుమల దేవస్థానాల తరఫున వారి వారి గ్రామాలలోనే, వారు కోరిన ఆలయాలలో వేద పండితులుగా నియమించి, ప్రతి నెలా వారికి దేవస్థానం తరఫున సంభావన లివ్వడం, దీనితో వారికి భుక్తికి లోపం లేకుండా శ్రీనివాసుని అనుగ్రహం కల్గించడం - ఇది వేద పారాయణ పథకంగా ప్రవేశపెట్టి, దాదాపు 378 వేద పండితులకు వివిధ ఆలయాల్లో ప్రతిరోజూ 8 గంటల వేద పారాయణ లోకక్షేమం కోసం చేసే ఏర్పాటు చేశాం.

బ్రతుకుతెరువు లేదని వారి పిల్లల్ని వేదశాస్త్ర పఠనం నుండి లౌకిక విద్యకు పంపకుండా, వేదపాఠశాలలన్నింటిలో ఉచితంగా విద్యార్థులకు అవకాశం కల్పించి, విద్య పూర్తి చేసి, బయటకు వచ్చేవారందరికీ దేవస్థానం తరఫున ఉపాధి కల్పిస్తామన్న హామీ ఇచ్చి, చాలామంది వేదం చదవడానికి ప్రోత్సాహం చేశాం. దేవస్థానాల

పాఠశాలలోనేకాక, వేద సభలు, ఇతర మఠాలు, వేద పాఠశాలలు ఏర్పాటు చేస్తే, ఆయా సంస్థలకు ధనసహాయం దేవస్థానాల నుండి అందేటట్లు చేసి, ఆ పథకం సక్రమంగా అమలు జరగడానికి దేవస్థానాల తరఫున ప్రతి సంవత్సరం వేద సభలు, పరీక్షలు నిర్ణయించి – ఆ పరీక్షల ఫలితాలను బట్టి వారికిచ్చే ధన సహాయం కొనసాగించే వ్యవస్థ ఏర్పాటు చేయడం కూడా జరిగింది. ఇలా చేసేటప్పుడు సంస్థలకే కాక, వేదం కాని శాస్త్రంకాని గురుకుల పద్ధతిలో గురువుల ద్వారా లేదా ఇంట్లోనే తండ్రి తన పిల్లలకు విద్య నేర్పినా, వారికి కుమార అధ్యాపక పథకం రూపంలో, గురువుగారికి, శిష్యులకు కూడా ఆర్థిక సహాయం అందేట్లు దేవస్థానాల తరఫున ఏర్పాటు చేశాం. గురువుగారు తమ శిష్యులను ప్రతి సంవత్సరం తిరుమల సభలకు తెచ్చి పరీక్షలో వారి శిష్యులు ఉత్తీర్ణులైతేనే వారికి రాబోయే సంవత్సరానికి ధన సహాయం పొడిగించబడేది.

ఈ పథకాలే కాక, వేదం చదివిన పండితులు, శాస్త్రం అభ్యసించదలిస్తే, వారుకోరిన, నిష్ణాతులైన గురువులు ఎక్కడ వున్నా అక్కడే శిక్షణ ఇవ్వడానికి గురువుకు, విద్యార్థికి – ఇద్దరికీ ఉపకార వేతనాలు అందేటట్లు శాస్త్రరక్షణపథకం ప్రవేశపెట్టాం. ఈ పథకాలు సక్రమంగా ఆచరణలోకి తేవడానికి శ్రీ ఉప్పులూరి గణపతి శాస్త్రిగారిని తిరుమల తిరుపతి దేవస్థానాల వేద సలహాదారుగా నియమించి, వారి సూచనల ననుసరించి కార్యక్రమాలు కొనసాగించాం. ఈ పథకాల పర్యవేక్షణకు కొందరు సీనియరు పండితులను పర్యవేక్షకులుగా, పరీక్షాధికారులుగా నియమించడం కూడా జరిగింది. మన రాష్ట్రంలోనే కాక, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలలో ఈనాడు ఎన్నో వందలమంది పండితులు వున్నారంటే, ఆనాడు దేవస్థానాలు ప్రారంభించిన పథకాల చలవే. తర్వాత తర్వాత దేవస్థానాలు ఈ విషయంలో ఇంకా శ్రద్ధ పెంచి, ఉపకార వేతనాలు పెంచి, ఈ కార్యక్రమాలు ఇంకా ఎక్కువగా చేయాలన్న సంకల్పంతో తిరుమల తిరుపతి దేవస్థానాలు ఈ మధ్యకాలంలో ఒక వేదవిశ్వవిద్యాలయం ప్రారంభించి కార్యక్రమాల అభివృద్ధికి పాటు పడుతున్నది.

కాని మొదటి నుండి కేంద్రంచేపట్టిన పథకాలు, అంటే రాష్ట్రీయ సంస్కృత విద్యాపీఠాల ద్వారా చేసిన కృషి అంతా తర్కం, న్యాయం, మీమాంస, వ్యాకరణం – వేదాంతాల లాంటి విషయాలు, అద్వైత, విశిష్టాద్వైత, ద్వైత సంబంధిత వేదాంత విషయాలలో పండితులను తయారుచేయడం, పరిశోధనలు చేయడమేగాని, వేదాల్లో చెప్పిన ఇతర అంశాలు – ఆయుర్వేద, గణితం, ఖగోళశాస్త్రం, అస్త్ర, భౌతిక, రసాయన

శాస్త్రాలపై శ్రద్ధ వహించిన దాఖలాలు కనిపించటం లేదు. అందరూ చెప్పుకొనేది, ఎంతవరకూ నిజమో ఇదమిత్థంగా తెలియని విషయం - మన వేద శాస్త్రాల విషయంలో, జర్మనీలో చాలా పరిశోధనలు జరుగుతున్నాయని.

మన శాస్త్రాల్లో, వేదాల్లో, పారమార్థిక విషయాలల్లోనే కాక, లౌకిక విషయాల్లో కూడా, మన పూర్వీకులు చాలా పురోభివృద్ధి సాధించారని, ఈనాటి శాస్త్రపరిజ్ఞానం కన్నా చాలా విషయాల్లో ముందంజ వేశారనీ, ఈ శాస్త్రపరిజ్ఞానం శాస్త్రాలలో నిక్షిప్తంగా వున్నా, వాటిను అనుసంధానం చేసి, ఉపయుక్తం చేసుకోవడానికి అదివరకు తెలిసిన పరిజ్ఞానం, మనం కోల్పోయామన్నమాట వింటూంటాం. శాస్త్రంలో చెప్పిన చాలా విషయాలు మంత్రశక్తితో జరిపే అస్త్రప్రయోగాలుకాని, చాలా సందర్భాలలో ప్రసంగానికి వచ్చిన వైమానిక పరిజ్ఞానం విషయంగాని, గౌతమ మహర్షి లాంటి వారు, శాస్త్ర పరిజ్ఞానంతో మూడు గంటలలో పంటలు పండించి వచ్చిన ధాన్యంతో వేలాదిమందికి వడ్డించేవారనీ, ఉప్పునీళ్లు మంచినీళ్లుగా మార్చే ప్రక్రియ శాస్త్రంలో వుందనీ, లోహ విజ్ఞానంలో మన వాళ్లు చాలా ముందంజ వేశారనీ, భరద్వాజాది మునులు రచించిన గ్రంథాలలో ఎన్నో రకాల లోహాల (ఇప్పటి శాస్త్రజ్ఞుల ఊహలకందనివి), గురించి ప్రస్తుతించడం జరిగిందని విన్నాం... ఇవన్నీ నిజాలా? ఆ గ్రంథాల రచయితల ఊహా కల్పితాలా? శాస్త్రంపై నమ్మకం గలవారు, ఆధారాలున్నా లేకపోయినా నమ్ముతారు. నమ్మనివారి సంఖ్య చాలా పెరుగుతోంది. ఆధారాలు చూపిస్తే కాని, విషయాన్ని ఒప్పుకొనే అవకాశం లేని ప్రస్తుత పరిస్థితులు. కొన్ని విషయాలు అతీంద్రియాలు... నమ్మకం కలగాలంటే, చేసి చూపించి, నిరూపించి శాస్త్రజ్ఞులను ఒప్పిస్తే గాని ఉపయోగం లేదు. అలా అని ఏంచేయకుండా వూరుకుంటే, రానురాను పరిస్థితులు ఇంకా దిగజారవచ్చు. నిజమా, కాదా అన్నది నిర్ధారణ చేయడానికైనా కొంత పరిశోధన జరగాలి కదా!

ఢిల్లీలో కుతుబ్ మినార్ దగ్గర వున్న అశోక స్తంభం (ఇనుప స్తంభం) మనకు ప్రత్యక్ష నిదర్శనం. వేల సంవత్సరాలు తుప్పు పట్టని ఈ స్తంభంలో వాడిన లోహం ఈ కాలం శాస్త్రజ్ఞుల అవగాహనలో లేదు. కట్టు కథ అనటానికి వీలులేదు. ఎందుకంటే, అందరికీ ప్రత్యక్షంగా ఆ శిలాస్తంభం కనపడుతూ వుంది కనుక. అలాగే శాస్త్రాలలో ప్రస్తావించబడిన మిగతా లోహాల విషయంలో కూడా కావచ్చు గదా! అలానే భరద్వాజ వైమానిక శాస్త్రం - ఆ విమానాల తయారీకి వాడబడిన లోహాల వివరాల గురించి... అక్కడక్కడా ఈ విషయంలో ఆసక్తి గలవారు కొంత పరిశోధనప్రయత్నం చేస్తున్నా,

తగిన వనరులు, వ్యవస్థాగత అనుకూలం లేని కారణంగా ఆశించిన ప్రగతి లభించడం లేదు.

నేను దేవస్థానాల కార్యనిర్వహణాధికారిగా వున్నప్పుడు ఈ విషయంపై పెద్ద ఎత్తున చర్చలు జరిపించాను. ముఖ్యంగా రామకృష్ణ మఠం శ్రీరంగనాథానంద స్వామిగారు, వరల్డ్ టీచర్స్ ట్రస్టు అధ్యక్షులు శ్రీ ఎక్కిరాల కృష్ణమాచార్యులుగారు ఈ విషయంలో చాలా శ్రద్ధ చూపారు. తరువాత కొంత మంది శాస్త్రజ్ఞులతో ISKCON నిపుణులతో కూడా చర్చించడం జరిగింది. ఈ విషయాలపై ఏం చేయాలన్నా సంస్థాగత సదుపాయాలు చేయాలన్నది అందరి అభిప్రాయం. వేదాలు, శాస్త్రాలు, సంబంధింత గ్రంథాలు, ఉపనిషత్తులు, పురాణాలు, రసాయనిక, భౌతిక, వైద్య, వృక్ష, మూలికా సంబంధ శాస్త్రగ్రంథాలు ఇత్యాదులన్నీ ఒక్కచోట లభ్యమయ్యేటట్లు ఒక శాస్త్రగ్రంథాలయం అవసరం. దీనితోపాటు పరిశోధనకు అవసరమయ్యే ఆధునిక గ్రంథాలు, పరికరాలు, ఏర్పాటుచేసి, పరిశోధకులు పరిశోధన జరపడానికి కావల్సిన వనరులు ఏర్పాటుచేసి, పరిశోధన చేయదలచుకున్న విషయాలు నిర్ణయించడానికి శాస్త్రపండితులు, ఆధునిక శాస్త్రజ్ఞులతో నిపుణుల సంఘాలు ఏర్పాటుచేసి, సమాజానికి ఉపయోగపడే 10 విషయాలపై ప్రత్యేకంగా పరిశోధన ప్రాజెక్టులు అమలు చేయాలని తీర్మానించి, పాలకమండలి ఆమోదం కూడా తీసుకుని తిరుపతి పద్మావతీ అతిథి గృహం పక్కన 10 ఎకరాల స్థలం కేటాయించి, ఈ పరిశోధన గ్రంథాలయం, ప్రయోగశాల నిర్మాణానికి పునాది కూడా వేయించాను.

ఆ శంకుస్థాపనకు స్వామి రంగనాథానంద, శ్రీ ఎక్కిరాల కృష్ణమాచార్యులు కూడా వచ్చారు. వారి ఆధ్వర్యంలోనే ఈ ప్రయోగశాల ఆశయాలు, అవకాశాలు, అవసరాల విషయంలో ఒక ప్రాజెక్టు రిపోర్టు కూడా తయారు చేయడం జరిగింది. ఇప్పటి వేద విశ్వవిద్యాలయం ఉపకులపతి శ్రీ సుదర్శన శర్మ ఈ విభాగంలో చేరిన మొదటి ఉద్యోగి. ఇలా ఏదో చేయాలన్న ప్రయత్నంలో వుండగా నాకు తిరుమల, తిరుపతి దేవస్థానాల నుండి బదిలీ అవడం... ఈ పథకం మరుగున పడిపోవడం జరిగింది. కాని నేనప్పుడే భవన నిర్మాణం చేపట్టడం వలన భవనం మాత్రం పూర్తయింది. అదీ నేను దేవస్థానం వదిలిన ఏడు సంవత్సరాల తర్వాత. తర్వాత వచ్చిన వారికి, చాలా కాలం గడిచినందున, ఈ భవనం ఎందుకు ప్రారంభించామో, ఏ ఆశయసాధనకు మొదలుపెట్టామో తెలిసినట్లు లేదు. నాకు తెలిసినంత వరకు దాదాపు నిర్మాణాలు పూర్తి అయ్యాక పదేళ్లు ఆ భవనాలు ఖాళీగా వుంచేశారు. నేను

ఒకటి రెండు సార్లు కార్యనిర్వహణాధికార్లకు చెప్పినా, ఎందుకో పని జరగలేదు. ఉద్యోగంలో చేరిన రెండు సంవత్సరాలకు సుదర్శనశర్మ గారికి సంస్కృత విద్యాపీఠంలో అధ్యాపకుడి ఉద్యోగం రావడంతో ఆయనా వెళ్లిపోయారు. ఈ ప్రాజెక్టు రిపోర్టు తయారుచేయడంలో పూర్తిగా సహకరించిన రఘునాథాచార్య, తర్వాత విద్యాపీఠానికి కులపతి కావడంతో తర్వాత తిరుమల దేవస్థానాలలో కొలువుకు చేరినా, ఈ కార్యక్రమం ముందుకు తీసుకెళ్లే అవకాశం కలుగలేదు. అప్పటి పి.ఆర్.ఓ రావుల సూర్యనారాయణ మూర్తి కూడా పదవీవిరమణ చేసి, రాజమండ్రి వెళ్లిపోయారు. దేవస్థానాల తరఫున స్వామి రంగనాథానంద గారిని కాని, ఎక్కిరాల కృష్ణమాచార్యులను గాని ఎవ్వరూ సంప్రదించలేదు. అలా ఆ కార్యక్రమంతో సంబంధం వున్న వారందరూ దేవస్థానానికి దూరమవడంతో, ఈ పథకానికి కార్యరూపం రాలేదు. తర్వాత ఆ భవనాల్లో 'శ్వేత'- తిరుమల దేవస్థానాల ఉద్యోగుల శిక్షణకేంద్రం దాస సాహిత్య ప్రాజెక్టు, భాగవతం ప్రాజెక్టుల నిర్వహణకు వినియోగించడం మొదలుపెట్టారు. ఇప్పటి దాకా అలానే జరుగుతోంది.

నేను దేవస్థానాల కార్యనిర్వహణాధికారిగా వెళ్లిన కొత్తలో, వేదాల విషయంలో, యజ్ఞయాగాదులు, వాటి ఫలితాల విషయంలో నాకు అంత అవగాహన కాని, కార్యనిర్వహణాధికారికి వుండవలసిన నమ్మకంగాని వుండేదికాదు. కాని, శ్రీ ఉప్పులూరి గణపతిశాస్త్రిగారితో ఈ విషయాలు చర్చించే అవకాశం కల్గడం... కొండమీద తీవ్రనీటి ఎద్దడి వచ్చి, దిక్కుతోచని పరిస్థితులలో శ్రీ గణపతి శాస్త్రిగారి దగ్గరకు వెళ్తే ఆయన సలహా ఇచ్చి, నా చేత తిరుమలలో వరుణయాగం చేయించడం, ఫలితంగా మేఘాలు లేకుండా కుంభవృష్టి పడి గోగర్భం డామ్ రాత్రికి రాత్రి నిండడం... నాకు ఈ ప్రక్రియలపై విశ్వాసాన్ని పెంచాయి. ఈ విషయాలు విపులంగా నా పుస్తకం 'నాహం కర్తా హరిఃకర్తా' (సర్వసంభవామ్‌లో) వివరించాను. ఇటువంటి ఘటనలు... ఉప్పులూరి వారు నాకు చెప్పిన విషయాలపై గట్టి నమ్మకం కలుగజేశాయి... ఆయన నాకు చెప్పింది, "మోక్షాన్నే ఇవ్వగల వేదాలు, శాస్త్రాలు, మానవుని లౌకిక కోర్కెలు తీర్చలేవా? విశ్వాసంతో శాస్త్రంలో చెప్పిన రీతిలో యోగ్యులైనవారు కర్మ చేస్తే, ఆ కర్మకు శాస్త్రంలో చెప్పిన ఫలం తప్పక లభిస్తుంది... మానవుని ప్రతి కోరికనూ తీర్చే ఉపాయం వేదాల్లో, శాస్త్రాల్లో వుంది."

నేను చేసిన ప్రయత్నం అంతా, సమాజానికి పనికొచ్చే కొన్ని సౌలభ్యాలన్నా వేదాల ద్వారా అందించి, వేదాలపై ప్రజలకు నమ్మకం పెంచాలని...! ఆ భాగ్యం పూర్తిగా కలుగలేదు.

ఐఏఎస్ అధికారిగా నేను పదవీవిరమణ చేసినా, అప్పటి ముఖ్యమంత్రి శ్రీ చంద్రబాబునాయుడు ఇంకో నాలుగు సంవత్సరాలు, డా. మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల సంస్థలోనే నన్ను కొనసాగించడం, తర్వాత నన్ను తిరుమల తిరుపతి దేవస్థానాల సలహాదారుగా రాజశేఖరరెడ్డిగారి కాలంలో నియమించడం జరిగింది. గుంటూరులో ఏదో ధర్మరక్షణ పనిమీద వెళ్లినప్పుడు శ్యామలానగర్‌లో అమ్మవారి ఆలయం కొత్తగా కట్టారని, అక్కడ సంప్రదాయంగా హోమాలు వగైరా చేస్తారని విని చూడటానికి వెళ్లాను. అక్కడ ఆమంచి సుధాకరశాస్త్రిగారితో పరిచయం అయింది. కోటి రూపాయల వ్యయంతో ఆలయం కట్టించిందీ ఆయనే. మంచి జ్యోతిష్కుడు, నాడీగ్రంథాల పరిచయం గలవాడు. శాస్త్ర విషయాలు అధ్యయనం చేసినవాడు. ఆయుర్వేదంలో మంచి ప్రవేశం వుంది. కాల సర్పదోషం మీద పరిశోధన చేసి పిహెచ్.డి. సంపాదించాడు. ఆంగ్లంలో మంచి ప్రావీణ్యం... కంప్యూటర్ వాడకంలో నిష్ణాతుడు. ఇలా ప్రాచీన శాస్త్ర పరిజ్ఞానంతో పాటు ఆధునిక విద్యాజ్ఞానమూ వుండడంతో, ప్రాచీన విజ్ఞానాన్ని ఆధునిక పరిజ్ఞానంతో సమన్వయం చేయగల సామర్థ్యం సంపాదించాడు. జ్యోతిషం, యజ్ఞయాగాదులలో ప్రావీణ్యం, నాడీశాస్త్రం తెలియడంతో ఆయనను కలసి సలహాలు తీసుకోవడానికి చాలామంది ధనికులు, రాజకీయ నాయకులు, సినిమావాళ్లు రావడంతో అలా సంపాదించిన దానితో కోటి రూపాయలు పెట్టి అమ్మవారికి శ్యామలానగర్‌లో పెద్దగుడి కట్టించి, పక్కనే తనకొక ఇల్లు కట్టుకొని కాలక్షేపం చేస్తున్నారు.

ఎంత బిజీగా వున్నా శాస్త్రగ్రంథాల అధ్యయనం మానలేదు. అలా నిశితంగా గ్రంథాలు పరిశీలిస్తుంటే, మన పూర్వీకుల విమానశాస్త్ర విజ్ఞానం గురించి ఆసక్తి కలిగింది. ఎన్నో గ్రంథాలు, ముఖ్యంగా భరద్వాజ మహర్షి రచించిన విమానకల్పం లాంటివి చాలా ఆకర్షించాయి. అలా అధ్యయనం చేసి తానే ఒక భారతీయ విమానశాస్త్రం అన్న పరిశోధనగ్రంథాన్ని రచించి, ప్రచురించారు. దానికి శాస్త్రజ్ఞుల నుండి, పండితుల నుండి మంచి ఆదరణ లభించింది.

ఇలా అధ్యయనం చేస్తున్న రోజుల్లో, ప్రత్యేకంగా విమానశాస్త్ర అధ్యయనంలో, శాస్త్రగ్రంథాల్లో, ఆ రోజుల్లో వారు వాడిన లోహాలు, చాలా తేలిక గలవి, విపరీతమైన వేడి తట్టుకొనగలవి, స్వచ్ఛమైనవి రకరకాల లోహాల ప్రసక్తి వచ్చినప్పుడు, ఈయన ఆ విషయాలపై గ్రంథాలు సేకరించి, ఆ రోజుల్లో ఎలా అటువంటి లోహాలు తయారుచేసేవారో, ఏయే రసాయనాలు, పసరులూ వాడేవారో అన్న విషయాల మీద

చాలా ఆసక్తితో పరిశోధనలు మొదలుపెట్టాడు. అలా మొదలైన వ్యాపకం, ఆయన ఇతర వ్యవహారాలు తగ్గించుకొని ఇంట్లోనే చిన్నపాటి రసాయనశాల స్థాపించుకొని, సొంత డబ్బు ఖర్చు పెట్టుకొని పరిశోధనలు ప్రారంభించి, తెలిసిన శాస్త్రజ్ఞుల దృష్టిలో ఫలితాలు చూపిస్తూ చాలా కృషి చేశారు. అలా దాదాపు 10 సంవత్సరాలు, లక్షల సొంత ధనం ఖర్చు పెట్టి పరిశోధనలు గుంటూరులో వుంటూనే సాగించాడు.

తనకు పరిచయాలున్న శాస్త్రవేత్తలతో సంప్రదించి, పరిశోధనలలో వచ్చిన లోహాలు పరీక్షలకు పంపి తంటాలు పడేవారు. ఒకవైపు ఖర్చు, రెండవవైపు ఆలస్యం. శాస్త్రజ్ఞులు అంత అందుబాటులో వుండరు. పరిశోధనలో సాధించినవి శాస్త్రపరంగా విశ్లేషించడానికి ఇబ్బందులు, ఇవన్నీ తట్టుకుంటూ, కేంద్రశాస్త్రీయ విభాగం నుండి ఒక ప్రాజెక్టు కూడా సంపాదించారు. ఆ ప్రాజెక్టు ఇచ్చేటప్పుడు, ఈయన ఒక ప్రభుత్వ శాస్త్రీయ సంస్థతోనూ, ఇంకొక మద్రాసు ఐఐటి లోహ విభాగంతోనూ భాగస్వాములుగా పనిచేయాలన్న నిబంధన వుంది. రకరకాల ఇబ్బందులు వచ్చినా, ఆ ప్రాజెక్టు పూర్తిచేసి, ఆశాజనకమైన ఫలితాలు రప్పించారు. దీనితో కొంత ఆత్మస్థైర్యం పెరిగి, తన వంతు కృషి చేస్తూ, ప్రభుత్వ శాస్త్రీయ విభాగం నుండి ఇంకొక ప్రాజెక్టు సాధించగలిగారు. కాని అందరికీ ఒక పెద్ద ఇబ్బంది. ఈయనుండేది గుంటూరులో. చేస్తున్న పరిశోధన ఆయన ఇంట్లోనే. శాస్త్రజ్ఞులకు అక్కడకు వెళ్లటానికి అంత వెసులుబాటు కాని, వ్యవధికాని లేవు. దాంతో హైదరాబాదులో ఈ కార్యక్రమాలు చేస్తే అందరికీ సానుకూలం... అంతేకాక, హైదరాబాదులో చాలా శాస్త్రప్రయోగశాలలు, పరిశోధన సంస్థలు, రక్షణశాఖకు సంబంధించిన ప్రయోగశాలలు వున్నాయి, కనుక, ఎప్పటికప్పుడు శాంపిల్స్ పరీక్ష చేసుకోవచ్చు, శాస్త్రజ్ఞుల సలహాలు తీసుకోవచ్చు అన్న ఆలోచన వచ్చింది.

తను ఇంతవరకు తన సంపాదనతో, ఆలయం ఖర్చులు భరించడం, కుటుంబ పోషణ చేసుకోవడం, ఈ పరిశోధనలు ఇతర వ్యాపకాలతో పాటూ చేసుకుంటూ వుండటం, ఈ పరిశోధనలపై చాలా ఆసక్తి, ఏదో కనిపెట్టగలమన్న తహతహ వున్నా, తన మకాం హైదరాబాదుకు మార్చాలంటే, ప్రాజెక్టులో ఆర్థిక వనరులు ఏమీ చూపించలేదు. తన ఆలయం, కుటుంబం ఖర్చులు ఎలా భరించాలి, ఈ పరిశోధనలో పూర్తిగా పడితే, తన ఆదాయం వుండకపోగా ఖర్చులు పెరిగే అవకాశం... మంజూరు అయిన ప్రాజెక్టులో ఆర్థికంగా వెసులుబాటు లేదు. పైగా కొత్త ప్రాజెక్టులు వస్తాయన్న నమ్మకం లేదు. కాని తాను 10 సంవత్సరాలు చేసిన శ్రమ, ఇప్పుడు కార్యరూపం

దాల్చి, ఫలితాలు వస్తుండటమే కాక, శాస్త్రజ్ఞులు తన పరిశోధనలను, ఆసక్తితో ఆదరించడం మొదలుపెట్టారు. తనలో వున్న విషయం పరిజ్ఞానం, శాస్త్ర పరిచయంతో ఎన్నో కొత్తలోహాలు తక్కువ ఖర్చుతో, సంప్రదాయ శాస్త్ర పద్ధతులలో తయారు చేయవచ్చన్న నమ్మకం కుదిరింది. తన కార్యక్రమాలు అన్నీ వదిలేసి వెళ్లాలా? వెళ్తే ఎలా? సందిగ్ధ పరిస్థితి.

★ ★ ★

ఆమంచి సుధాకరశాస్త్రి గారితో నాకు అదివరకు పరిచయం లేదు. గుంటూరులో ఆయన ఆలయం చూడటానికి వెళ్లినప్పుడు, కాకతాళీయంగా ఆయన హాబీగా చాలా కాలంగా చేస్తున్న పరిశోధనల గురించి వివరించడం, కొన్ని పరికరాలు కొనుక్కొనే సావకాశం వుంటే ఎంతైనా చేయడానికి అవకాశం వుందనీ, తన స్తోమతకు మించి ఈ విషయాలపై తన సొంత డబ్బు 10 లక్షలకు పైగా ఖర్చు చేయడం జరిగిందనీ... కొత్త పరిశోధనశాలకు పెట్టుబడులు పెట్టే తాహతు తనకు లేదని, కాని ఎవరైనా పెట్టుబడికి సహాయం చేస్తే తప్పక మంచి ఫలితాలు సాధించి, మన ప్రాచీన శాస్త్రాలపై ప్రజలకు నమ్మకం కల్గించవచ్చనీ చెప్పారు. ఆయన తపన నాకు అర్థమయింది.

నేను తిరుమల తిరుపతి దేవస్థానాల సలహాదారుగా వుండటంతో, ఈ విషయాలు పరిశీలించి, సహాయం చెయ్యవలసిందిగా దేవస్థానం వారికి సూచించాను.

హైదరాబాదులో తిరుమల తిరుపతి దేవస్థానాలకు బేగంపేట విమానాశ్రయం అవతలివైపు ఏడున్నర ఎకరాల స్థలంలో, చాలా భవనాలు– అందులో వేదాంతవర్ధనీ కళాశాల వుంది. ఆ స్థలం, భవనాలు నేను కార్యనిర్వహణాధికారిగా వుండగానే, రామకృష్ణ మఠం నుండి 12 లక్షలకు కొని, హనుమాన్ దేవాలయం వరండాలో నడుపుతున్న వేదాంతవర్ధనీ కళాశాలను, అక్కడకు మార్చడం జరిగింది (ఈ వివరాలు 'నాహంకర్తా'లో ఒక పూర్తి వ్యాసంలో విపులంగా రాశాను) అక్కడ ఖాళీ భవనాలు వుంటే ఈ కార్యక్రమం కొనసాగించడానికి దేవస్థానం వారు వెసులుబాటు చేయవచ్చు. టిటిడి కార్యనిర్వహణాధికారి శ్రీ ఐ.వై.ఆర్. కృష్ణారావు గారికి విషయం వివరిస్తే, ఆయన చాలా పెద్ద మనస్సుతో వెంటనే ఆమోదం తెలిపి, ఆ భవన సముదాయంలో ఖాళీగా వున్న రెండు భవనాలు మాత్రమే కాక, ఎన్నో ఏళ్లుగా ఖాళీగా పడివున్న మూడు వసతిగృహాలు, పాడుపడి వ్యర్థ పదార్థాలతో నిండిన ఒక షెడ్డును కూడా బాగు చేయించి ఇస్తామన్నారు.

తిరుమల దేవస్థానం వారి ఉత్సాహం చూసి, శాస్త్రిగారు, స్వామి ఆదేశంగా భావించి, తన వ్యాపకాలన్నీ వదలి హైదరాబాదు రావడానికి సిద్ధమయ్యారు. కొందరు ఐఏఎస్ అధికారులు, కొందరు ఐపిఎస్. అధికారులు, కొందరు పారిశ్రామికులు, శాస్త్రజ్ఞులతో శ్రీమహర్షి వేదవిజ్ఞాన సంస్థ (SRIVT) ప్రారంభమై, వీరందరూ పాలనమండలిలో సభ్యులుగానూ, అందులో దేవస్థానాల కార్యనిర్వహణాధికారి, అధ్యక్షులు కూడా సభ్యులుగా ట్రస్టు ప్రారంభమయింది. అందులో నలుగురు పూర్వ తిరుమల కార్యనిర్వహణాధికారులు కూడా సభ్యులు. దీనికి అధ్యక్షుడిని నేను. ప్రముఖ శాస్త్రవిజ్ఞాన రక్షణ సంస్థల సంచాలకులు, (DMRL, DRDL, IICT వంటివి), మద్రాసు ఐఐటి, హైదరాబాదు విశ్వవిద్యాలయాల సభ్యత్వంతో ఒక శాస్త్రజ్ఞుల కమిటీ, పూర్వ (విశ్రాంత సంచాలకులు) ప్రముఖ శాస్త్రవేత్త డా. రాఘవన్ గారి అధ్యక్షతన ఏర్పాటు చేయడం జరిగింది.

గత మూడు సంవత్సరాలుగా ఈ వ్యవస్థ దేవస్థానాల కాలేజీ ఆవరణలో పని ప్రారంభించి, గణనీయ ప్రగతిని సాధించిందని చెప్పాలి. నానో రాగి, నానో టంగ్స్టన్, నానో సత్తు లాంటి పదార్థాలు కనుగొనటం జరిగింది. సంప్రదాయ విధానాలతో, ఆకు పసరులు, పుటాలతో చాలా తక్కువ ఖర్చుతో ఈ పదార్థాలను తయారు చేయవచ్చని నిరూపించడం జరిగింది. కొద్దికొద్దిగా కాకుండా, ఎక్కువ మోతాదులో కూడా, నాణ్యత చెడకుండా ఈ లోహాలు తయారుచేయవచ్చని నిరూపించడం జరిగింది. స్వచ్ఛతలోనూ, నాణ్యతలోనూ, ఉత్పత్తి ఖర్చులలోనూ ప్రపంచంలోని ఇతర సంస్థలన్నిటితో పోటీ పడగల సామర్థ్యం తేవచ్చునన్నది నిర్ధారణకు వచ్చింది. ఈ సంస్థ చేసిన పరిశోధనలు, తయారుచేసిన లోహాలు, ఎప్పటికప్పుడు శాస్త్రజ్ఞులు, వారివారి పరిశోధనాశాలలో పరీక్షించి, నిర్ధారణ చేయడం... ఈ సంస్థ చేసిన కృషికి, కేంద్రప్రభుత్వ శాస్త్ర విభాగం వారు "Best Innovation award" దేశ స్థాయిలో ఇచ్చి, సంస్థ సంచాలకులు డా॥ ఆమంచి బాల సుధాకరశాస్త్రి గారిని సత్కరించారు.

కాలేజీ ఆవరణలో దాదాపు ఒక ఎకరంలో వనమూలికలు, ఔషధాలు పెంచి, కావల్సిన ఆకులు, పసరులు ఇక్కడే ఉత్పత్తి చేసుకొనే ఏర్పాటు జరిగింది. మరమ్మతులు చేసిన షెడ్డులో, ఒక ప్రయోగశాల, ఉత్పత్తిశాల ఏర్పాటుచేసి, ప్రయోగాలకు కావల్సిన ఉత్పత్తులు జరుగుతున్నాయి.

టిటిడి వారు నిధులివ్వాలని, హైదరాబాద్‌లోని ప్రముఖ శాస్త్రవేత్తలతో ఒక కమిటీని నియమించారు. ఈ సంస్థ కార్యకలాపాలు సమీక్షించి, అవసరాలు నిర్ధారించి, దేవస్థానం ఎటువంటి సహాయం చేస్తే బాగుంటుందో సూచనలిచ్చింది ఈ కమిటీ. కాని వారి సలహాల ప్రకారం దేవస్థానాల నుండి నిధులు రాలేదు. వసతులు మాత్రం దేవస్థానం వారు పూర్తిగా కల్పించారు. శాస్త్ర పండితులు, శాస్త్రజ్ఞుల నెల జీతాలకు, ఆఫీసు ఖర్చులకు, పరిశోధన ఖర్చులకు, దాతల మీదనే ఆధారపడే సందర్భం ఇంతవరకు నడిచింది. కొందరు దాతలు ముఖ్యంగా, ఎన్.సి.సి అధ్యక్షులు విశ్వేశ్వరరావు గారి ధనసహాయంతో నడిచింది.

ఈ సంస్థ తయారుచేసిన పదార్థాలు, తాగునీటి పరిశుభ్రత (చాలా తక్కువ ఖర్చుతో), సౌరశక్తి ఉత్పత్తి చాలా తక్కువ ఖర్చుతో, నాణ్యమైన వ్యవసాయానికి కావల్సిన ఎరువులు తక్కువ ఖర్చుతో తయారుచేయగల అవకాశాల మీద ఇప్పుడు పరిశోధనలు జరుగుతున్నాయి. సాధించిన విజయాలు పేటెంట్లుగా మార్చాలన్నా నిధుల కొరత (పేటెంట్లు రిజిస్టరు చేయాలంటే చాలా ఖర్చవుతోంది).

నేను మొదటనే సూచించినట్లు, ప్రైవేటు సంస్థగా దీనిని నడిపే కన్నా, తిరుమల తిరుపతి దేవస్థానాల సంస్థగా కొంత స్వతంత్ర ప్రతిపత్తి కల్గిస్తూ, ఏర్పాటు చేసి రెండు మూడు సంవత్సరాలు నిధులకు ఇబ్బంది లేకుండా, కావల్సిన, పరికరాలు కొనుగోలుకు సావకాశం చేసి, ప్రోత్సాహం చేస్తే, ఈ సంస్థ పెద్ద ఎత్తున పరిశోధనలు చేసి, ఫలితాలతో ఆదాయం పెంచి, దేవస్థానం పెట్టిన పెట్టుబడులు తిరిగి వాపసు ఇవ్వడమే కాక, పెద్దఎత్తున రాయల్టీల ద్వారా ఆదాయం కూడా తేగల సామర్థ్యం కన్పిస్తోంది. లేదా, ఈ సంస్థను దేవస్థానాల వేదవిశ్వవిద్యాలయ అనుబంధ సంస్థగా గుర్తించి, వేద విశ్వవిద్యాలయం వేద, శాస్త్ర పండితులు, SRIVT శాస్త్రజ్ఞులు, పండితుల సమన్వయంతో కార్యక్రమాలు జరిపి మంచి ఫలితాలు సాధించవచ్చు. (ఈ వ్యాసం రాసే సమయానికి - మే, 2013 - దేవస్థానాల కార్యనిర్వహణాధికారి శ్రీ ఎల్.వి. సుబ్రహ్మణ్యం, విశ్వవిద్యాలయం ఉపకులపతి, రాష్ట్రవిద్యాశాఖ ముఖ్య కార్యదర్శి శ్రీ గోపాల్‌గార్లు ఇద్దరికీ ఈ వేదవిజ్ఞానం విషయంలో మంచి పరిజ్ఞానం, నమ్మకం వున్న వ్యక్తులు కావడం వలన, తప్పక ఈ కార్యక్రమానికి ప్రోత్సాహం, ఒక దిశానిర్దేశనం జరగవచ్చని ఆశించవచ్చు.)

అంతకన్నా ఎక్కువగా- ఇప్పటికే మన శాస్త్రాలలో, వేదాలలో మన ప్రాచీనులు సాధించిన ప్రగతి కట్టుకథలు కావనీ.. సమాజానికి ఉపయోగపడే, సామాన్యుని జీవితాన్ని సుఖమయం చేయడానికి అవసరమయిన ప్రక్రియలు మన శాస్త్రాలలో వున్నాయనీ, దూరమైన ఈ పరిజ్ఞానాన్ని పరిశోధనలతో మరలా సాధించవ్చచని, శాస్త్రజ్ఞులు కూడా ఈ విషయాలపై శ్రద్ధతో దృష్టి సారించాల్సిన అవసరం వుందనీ తేలింది. ఈ ప్రయోగాలు అందుబాటులోకి వస్తే అవి సర్వమానవాళికీ ఉపయోగ పడతాయి. అందుకే - వేదాల ప్రయోజనం - సార్వజనీనం, సామాజిక సంక్షేమం.

★ ★ ★

90. వెయ్యేళ్లలో చేయలేనిది అరవయ్యేళ్లల్లో చేశాం. ఎంతధర్మం!

సెక్రటేరియట్‌లో ముఖ్యమంత్రి ఆఫీసు దగ్గర పత్రికా విలేఖరుల సమావేశంలో ముఖ్యమంత్రి ప్రకటనకు రంగం సిద్ధమైంది. తిరుపతి నుండి వచ్చే విమానం ఆలస్యం కావడంతో తిరుపతి దేవస్థానాల పాలకమండలి అధ్యక్షులు కరుణాకరరెడ్డిగారు రావడం ఆలస్యం అయింది. విలేఖరులు కొంచెం రెస్ట్‌లెస్ అవడం చూసి, ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి గారు సమావేశం మొదలుపెట్టాలని ఆదేశించి, దేవస్థానాల సలహాదారుగా వున్న నన్ను ప్రభుత్వం ఆనాడు విడుదల చేస్తున్న ఉత్తర్వుల గురించి మాట్లాడమన్నారు.

ఒక విధంగా ఈ ఉత్తర్వులు ఇవ్వడానికి కొంత ప్రయత్నం చేసింది నేనే. అంతకుముందు నెలక్రితం నేను తిరుమల తిరుపతి దేవస్థానాలలో నిర్వహించిన 'ధార్మిక సదస్సు' (మఠాధిపతుల, పీఠాధిపతుల, ఇతర హిందూ మతసంస్థల సమావేశాలు) లో చేసిన తీర్మానం ఆధారంగా ప్రభుత్వం ఈ ఉత్తర్వులు జారీ చేస్తోంది.

ఈ ఉత్తర్వులు ఒక రకంగా చరిత్రాత్మకమైనవే. ప్రపంచంలో ఇతర దేశాల్లో ఆయా దేశాల్లోని అల్పవర్గీయులకు రక్షణ కల్పించడానికి ఆదేశాలు జారీ చేస్తారు... మన సంగతి వేరు. అల్పవర్గీయుల నుండి మెజారిటీ వారిని రక్షించడానికి మన ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేస్తోంది. పెద్దపెద్ద హిందూ దేవాలయాల పరిధిలో అన్యమత ప్రచారాన్ని నిషేధిస్తూ ఇస్తున్న ఆదేశాలు ఇవి. తిరుమలలో అన్యమత ప్రచారం జరుగుతున్నదనీ పాలకమండలి చేతకాని తనంతో, ప్రభుత్వం ఆశీస్సులతో ఇటువంటి కార్యక్రమాలు జరుగుతున్నాయనీ హిందూ మత సంస్థలు చేస్తున్న విమర్శల దృష్ట్యా ప్రభుత్వం ఈ నిర్ణయం చేసింది.

★ ★ ★

ఈ దౌర్భాగ్యస్థితి హిందూ మతానికి ఇప్పుడు రావడానికి కారణాలేమిటి? మనం వెయ్యి సంవత్సరాల పాటు దాదాపు అన్యమతస్థుల పాలనలో వున్నా, ఆ పాలకులు చేయలేనిది, స్వాతంత్ర్యం వచ్చాక మన పాలకులు ఎలా చేశారు?

★ ★ ★

హిందూ మతం, మతం కాదనేవారు చాలామంది వున్నారు. అందులో నిజం లేకపోలేదు. ఎందుకంటే మనం హిందూమతం వారని భావించే వారిలో నిజంగా, వివిధ 'మత' విశ్వాసాలు గలవారున్నారు. వేదాల ఆధారంగా, వేదాలను నమ్ముతూ, వాడుకలోకి వచ్చిన కొన్ని ఆధ్యాత్మిక విశ్వాస పరంపరలు అద్వైతంగా, విశిష్టాద్వైతంగా, ద్వైతంగా, శాక్తేయంగా, శైవంగా, గాణాపత్యంగా... ఇలా విస్తరించాయి. తరచి చూస్తే, ప్రతి భావ పరంపర ఒక ప్రత్యేక మతమే అనిపిస్తుంది... ఇవికాక జైన, బౌద్ధ, సిక్కు మతాలు లాంటివి కూడా కాలక్రమేణా ఈ మూసలోంచి వచ్చినవే.

భగవంతుని అస్తిత్వాన్ని నమ్మే విశ్వాసాలు, నమ్మనివి అన్నీ కలిపి దాదాపు విభిన్న భావ పరంపరల ప్రస్తావన వేదవ్యాసుల వారి బ్రహ్మసూత్రాలలో చర్చించబడటం మనం చూస్తాం. నాస్తికత్వం కూడా ఒక మతం లాంటిదే... కమ్యూనిజం లాగా భగవంతుడున్నాడా? ఉంటే ఎలావుంటాడు? అతనెవరు? అతని గుణగణా లెటువంటివి? అందరికంటే గొప్పవాడా? అయితే మనకేమిటి? మనకూ భగవంతునికి సంబంధం ఏమిటి? సృష్టి చేసింది ఎవరు? ప్రకృతికి భగవంతునికి సంబంధం ఏమిటి? జీవులలో వ్యత్యాసం వుందా? పునర్జన్మ వుందా? జీవిత గమ్యం ఏమిటి?... ఇలాంటి ప్రశ్నలకు సమాధానాలు అన్ని సమాజాల్లో, ఎప్పుడో ఒకప్పుడు విచారణ జరిగి, ఏదో ఒక ప్రవక్త తన ఆలోచనాశక్తితోనో, అనుభవజ్ఞానంతోనో, ఒక భావపరంపరకు నాంది పలకడం, ఆ భావ పరంపరను నమ్మేవారు, ఆచరించేవారు, ఒక ప్రత్యేక మతంగా రూపుదిద్దుకోవడం జరిగింది. సృష్టి మొదలైనాక, ఈ విషయంలో నిశితంగా పరిశీలిస్తే ముఖ్యంగా అన్ని పరంపరలు వేద వ్యాసుల వారు క్రోడీకరించిన 21 సిద్ధాంతాల్లో ఏదో ఒకటిగా నిర్ధారించవచ్చు. సృష్టికర్త భగవంతుని చేరడానికి వేర్వేరు మతాల వారు అవలంబించే వేర్వేరు మార్గాలు... అన్నీ చివరికి చేరేది ఒక్కరినే. భగవంతుడొక్కడే.. కాని వివిధ మతాలవారు, వివిధ నామాలతో, ఒక్కడైన ఆయననే పొందుతారని భావించేవారు. నమ్మేవారూ చాలా మంది వున్నారు. ఎవరి మతం వారు పాటించవచ్చుకదా? ఈ మతాల మధ్య తగాదాలేంటి, యుద్ధాలేంటి? ఈ మారణహోమాలెందుకు?

ప్రపంచ దేశాల్లోని చాలా మత సంప్రదాయాల్లో వారు వారు ఉద్ధరింపబడటానికి ప్రయత్నం చేయడం సరే. అది అలా వుంచి... 'ఇతరులను' ఉద్ధారం చేయాలనే ఆకాంక్షలు ఎక్కువ కావడంతోనే ఈ ఘర్షణలన్నీ... దీని వెనుక తమ మత విశ్వాసాలు మాత్రమే కారణమా? ఇతరులను ఉద్ధారం చేయకపోతే మన ఉద్ధారం జరగదా?... బలవంతంగానో నయాన్నో, భయాన్నో, డబ్బిచ్చో, ఇతరాలిచ్చో, లాభపెట్టో, మభ్యపెట్టో అవతలవాడిని మతం మార్పిడి చేస్తే మన ఉద్ధారం జరుగుతుందా?...ఏమో!

మానవుడి మనుగడలో మత విశ్వాసాలకు, సామాజిక రాజకీయ ఆలోచనా ధోరణులకూ మొదటినుండి ముడిపడి వుండటం మనం గమనిస్తాం... 'నేను, నా కుటుంబం, నా ఊరు, నా దేశం లాగా నా మతం, దాన్ని ఆచరించేవాళ్లు నా వాళ్లు... ఆచరించనివారు ఇతరులు, వాళ్లు నా వాళ్లు కారు' అన్న భావన పెరగడం- 'నావాళ్ల' సంఖ్య ఎంత ఎక్కువ అయితే నాకూ నా వాళ్లకూ... అంత క్షేమం అనే అభద్రతా భావం, పాలకుడు నా మతం వాడైతే నా ఆలోచనా సరళికీ, దాని ఆచరణ విధానానికి అభద్రత లేదన్న భావం, ఆటంకాలుండవన్న ప్రగాఢ నమ్మకం... చరిత్ర పరిశీలిస్తే, చాలామంది పాలకులు ఈ కోవకు చెందిన వారే కావడంతో ఈ భావం ప్రతి మతం వారిలో గాఢంగా వేళ్లూనుకుపోవడం గమనిస్తాం.

విశాలదృక్పథం గల పాలకులు, వారి నమ్మకాలతో సంబంధం లేకుండా, ప్రజలు వారివారి నమ్మకాలను బట్టి, వారివారి సాధన జరుపుకునే వెసులుబాటు చేయడం, వారు చాలా గొప్ప పాలకులుగా చరిత్రలో నిలిచిపోవడం చూస్తాం... ప్రజలను నిర్దేశించడానికి, తమ మనుగడ క్షేమంగా ఉంచుకోవడానికీ చాలామంది పాలకులు మతాన్ని ఒక కీలక సాధనంగా వాడుకోవడం కన్పిస్తుంది.. రాచరికాల రోజుల్లో మతాన్ని రాజకీయానికి వాడుకునే పద్ధతులు ఒక రీతిగా వుంటే, ప్రజాస్వామ్య విధానాలు రావడంతో, రీతులు మారాయి కాని, మతాన్ని రాజకీయం కోసం ఉపయోగించకుండా వుండటం జరగలేదు. ఈ రోజుల్లో అది తారస్థాయికి చేరిందనవచ్చు.

★ ★ ★

ప్రాచీన కాలంగా హిందూ ధర్మం వేదమతంగా ప్రచారంలో వుంది. పండితులకూ, పామరులకూ ఆధ్యాత్మిక చింతన అలవడడానికి సమాజంలో బహుప్రక్రియలు అమలులో వుండేవి. వేదపండితులను, శాస్త్రజ్ఞానం గల బ్రాహ్మణులను రాజులు, సామంతులు, ఇతర ధనికులూ పోషించేవారు. లోక కల్యాణానికి, రాజ్య రక్షణకు,

సుఖశాంతులకు, దుర్భిక్ష నివారణకు, ఈ సంపన్నులందరూ క్రతువులూ, యజ్ఞాలూ నిరంతరం చేసేవారు... వేదధర్మంలో మూలస్తంభమైన 'కర్మసిద్ధాం'తాన్ని ప్రజలకు అర్థమయ్యేట్లు ప్రతిరోజూ ప్రతి దేవాలయంలో పండితులచే నిరంతర పురాణ ప్రవచనాలు జరిగేవి. భారత, భాగవత, రామాయణాలు, భగవద్గీత, ఉపనిషత్తులపై ఏడాదిపొడుగునా ప్రవచనాలు జరుగుతూండటంతో, శాస్త్రం అభ్యసించాల్సిన అవసరం లేకుండానే శాస్త్రజ్ఞానం, సామాన్యులకు అర్థమయ్యే అవకాశం వుండేది. ఇదికాక పాఠశాలల్లో, పెద్దబాలశిక్ష నుండి అన్ని తరగతులలో ప్రతి విద్యార్థికీ, ధర్మం, న్యాయం, నీతి బోధన శతకాల ద్వారా, సుభాషితాల ద్వారా, పురాణ ఘట్టాల ద్వారా పాఠ్యాంశాలుగా వుండి, పౌరులు ధార్మికులుగా తయారవడానికి అవకాశాలుండేవి. ఇవికాక, ఉమ్మడి కుటుంబాలలో, తాతలు, అమ్మమ్మలు, మిగిలిన పెద్దలు చెప్పే నీతికథలు, జరిపే ధార్మిక కార్యక్రమాల ద్వారా ప్రతి ఒక్కరికీ ప్రత్యేక ప్రయత్నం లేకుండానే, నీతి ధర్మం, సంస్కృతి, సంప్రదాయం అలవడే అవకాశాలుండేవి...

తురుష్కుల పాలనలో కాని, ఇంగ్లీషువారి పాలనలో కాని ఈ సత్సంప్రదాయాలు మార్చే ప్రయత్నాన్ని ప్రభుత్వాలు చేయలేదు. ఆలయాలు, సంస్కృతీ సంప్రదాయాలకూ, ధర్మాచరణకు, హిందూ ధర్మ పరిరక్షణకు నిలయాలుగా వుండి, తరతరాలుగా ఈ విధానాలు కొనసాగటానికి దోహదమయ్యాయి. ఈ విధానాలు చూసే, లార్డ్ మెకాలే వాపోయాడు. ఈ విధానాలు పాడు చేయలేక, ఉపాధికి వీలయిన ఆంగ్లబోధనా పద్ధతులు ప్రవేశపెట్టి, మధ్య తరగతి వారిలో కొంత మార్పు తేవడానికి ప్రయత్నించాడు.

ప్రాచీన కాలం నుండి హిందూ సమాజంలో, మఠాధిపతులు, పీఠాధిపతులు, సన్న్యాసులు ధర్మప్రచారం పరిరక్షణలలో ప్రధాన పాత్ర పోషించారు. చాలా ఆలయాలు వారి అధీనంలో వుండేవి. రాజులు, ధనికులు భూరి విరాళాలు, మడిమాన్యాలు ఇచ్చే ఆనవాయితీ వుండటమే కాక, అలా ఇచ్చిన భూములపై, గ్రామాలపై శిస్తుల మాఫీ కూడా వుండటంతో, దేవాలయాలకూ, మఠాలకూ పీఠాలకు మంచి ఆదాయాలు వుండేవి. ఎవరినీ ఆశ్రయించకుండా, ఇతరుల దయాదాక్షిణ్యాల మీద ఆధారపడకుండా, వీరు మతపరమైన ధార్మిక కార్యక్రమాలు చేయడానికి వీలయ్యేది... వేద పాఠశాలలు, శాస్త్రపాఠశాలలు స్థాపించి, పండితులను తయారుచేసి ధర్మపరిరక్షణకు నియోగించే సానుకూలం ఈ మఠాధిపతులకు, పీఠాధిపతులకుండేది. సమాజంలో మంచి గౌరవం, ఆదరణ, ఆచారవ్యవహారాలపై ఆధిపత్యం ఉండేది. రాజులూ, పేదలూ అన్న వివక్ష లేకుండా వీరి అభిప్రాయాలను ఆదరించేవారు... వారు కూడా సామాజిక శాంతి

భద్రతల కోసం, శత్రుసంహారం కోసం, రాజు, ప్రజల క్షేమంకోసం తమ వంతు ఆధ్యాత్మిక సహాయం చేస్తూ, సమాజంలో ఆస్తికత పెంచడానికి తోడ్పడేవారు.

విజయనగర రాజుల కాలం నాటి పరిస్థితులు అదివరకు చూశాం కదా! దేవాలయాలకు, మఠాలకు, పీఠాలకు వేద/శాస్త్ర పాఠశాలలకు ప్రత్యేకంగా శిస్తులన్నీ మాఫీలు చేయడమేకాక, ప్రభుత్వాధికారులే ఈ మాన్యాల నుండి రావల్సిన ఆదాయాన్ని వసూలు చేసి ఆయా సంస్థలకు పంపే ఏర్పాటు వుండేది. దేవుడి మాన్యాలు అంటే ప్రత్యేక గౌరవం వుండేది. ఎవరైనా మోసం చేస్తే రాజధిక్కారంగా పరిగణించి శిక్షించబడేవారు. అలా ప్రజలు, ప్రభువులు ధార్మికులై, ధర్మరక్షణ చేస్తూ, ఆ కార్యక్రమాలలో నిమగ్నులైన వారికందరికీ, మఠాధిపతులకు, పీఠాధిపతులకు, ధార్మిక సంస్థలకు, దేవాలయాలకు ప్రోత్సాహాన్నిస్తూ ధర్మాచరణకు, పరిరక్షణకు దోహదం చేశారు...

విజయనగర రాజ్యపతనం తర్వాత, ఈ పరిస్థితులలో కొంత మార్పులు వచ్చినా, కొన్ని దేవాలయాల ఆదాయాలు కొల్లగొట్టబడినా, ప్రజల ధార్మిక విధానాల్లో మార్పు లేకపోవడం వలన ధర్మప్రచారానికి హాని జరగలేదు. ఈస్టిండియా కంపెనీ పాలనలో చాలా పెద్ద మార్పులు జరిగాయి. ఆలయాల భూముల్ని - ముఖ్యంగా, తిరుమల తిరుపతి దేవస్థానాల్ని - ప్రభుత్వం స్వాధీనం చేసుకోవడం, బ్రాహ్మణులపై దెబ్బ తీయాలని, ఆలయాల మడి మాన్యాలపై, వేద శాస్త్ర పాఠశాల భూములపై మఠాల మాన్యాలపై, శిస్తు మాఫీ రద్దు చేయబడినా... ఆదాయాలు కొంత తగ్గాయే కాని, కార్యక్రమాలకు పెద్ద హాని జరుగలేదు. ప్రభుత్వ వైఖరి తెలుసుకున్న ధనికులు, ప్రజలూ, మత పరమైన ధార్మిక విషయాలలో కొంత ప్రత్యేక శ్రద్ధ చూపి ఈ సంస్థలను ఆ గడ్డుకాలంలో ఆదుకున్నారు.

19వ శతాబ్దంలో ఆంగ్ల పాలకులు (మొదట కంపెనీవారు, తర్వాత ఆంగ్లప్రభుత్వం) మత సంస్థల విషయంలో జోక్యం చేసుకోరాదన్న నిర్ణయంతో, ఈ సంస్థల మాన్యాలూ, ఆదాయాలూ వీరి అధీనంలోకి పూర్తిగా రావడం జరిగి, మతపర కార్యకలాపాలలో స్వేచ్ఛతో, హిందూ ధర్మ పరిరక్షణ, ప్రచార కార్యక్రమాలు మంచి ఊపందుకొన్నాయి. ఎవరి మతం వారు ఆచరించి, వారి వారి సాధన కొనసాగించే సంప్రదాయం మొదలైంది. మతాంతరీకరణ విషయంలో పెద్దఎత్తున ప్రయత్నాలు జరగలేదు. ప్రభుత్వం క్రైస్తవ సంస్థలకూ సహాయ సహకారాలందించినా, హిందూ మతానికి వ్యతిరేకులుగా ప్రవర్తించలేదు. ఆలయ ఆదాయాలు ఆలయ పరిపాలకుల

చేతుల్లోనే వుండేవి. మఠాల ఆదాయాలతో ధార్మిక కార్యక్రమాలు చేయడానికి మఠాధిపతులకు స్వేచ్ఛ వుండేది. ప్రజలు తమ కోరికలను బట్టి, దాన ధర్మాలు చేసుకొనే వెసులుబాటు వుండేది. వారి చేసిన దాన ధర్మాలు ప్రభుత్వపరం అవుతాయన్న భయం వుండేదికాదు.

ఈ పరిస్థితులు దాదాపు దేశానికి స్వాతంత్ర్యం వచ్చేవరకూ కొనసాగాయని చెప్పాలి. ఆ రోజుల్లో, చిన్నాపెద్దా రాజ్యాలు, జమీలు, 500 కు పైగా దేశంలో ఉండేవి. చాలా హిందూ రాజ్యాలు, కొన్ని ముస్లిం రాజుల పాలనలో వుండేవి. ఇవన్నీ ఒకరకంగా ఆంగ్లేయుల చెప్పుచేతల్లో నడిచేవి. ఆ శతాబ్ద కాలం ఒక రకంగా మతసామరస్యం నెలకొన్న కాలంగా చెప్పుకోవచ్చు. బలవంత మతాంతరీకరణలు కాని, మభ్యపెట్టి, మతం మార్పిడులు చేయడం కాని, ఒక మతం వారు, ఇంకొక మతంవారిపై దౌర్జన్యాలు చేయడంకాని అంతగా వుండేవికావు. ఎవ్వరి నమ్మకాలను వారు ఆచరించుకొనే స్వేచ్ఛ వున్న రోజులు అవి. ఇవ్వాళ రాజ్యాంగంలో Secularism అని మనం రాసుకున్న విధానం ఒక రకంగా నిజంగా అమలు జరిగింది ఆ రోజుల్లో...

మరి మనకు స్వాతంత్ర్యం వచ్చాక జరిగిందేమిటి? రాజ్యాంగంలో సెక్యులరిజమ్ విధానాన్ని అవలంబించాం. అంటే ప్రభుత్వం ఏ మతాన్నీ అధికారికంగా ఆమోదించదు. అన్ని మతాలు ప్రభుత్వదృష్టిలో సమానమే. ఎవరి మతం వారు యథేచ్ఛగా అవలంబించవచ్చు. అంతేకాదు, మత ప్రచారం చేసుకోవడానికి స్వేచ్ఛ కూడా వుంది. దానివలన తమ మతం గురించి ఇతర మతాల వారికి కూడా స్వేచ్ఛగా ప్రచారం చేసి మతాంతరీకరణ చేసుకోవచ్చు.

ఈ విధానం హిందూమతం మీద, సంస్కృతీ సంప్రదాయాల మీద పెద్ద దెబ్బ తీసింది. ఇప్పటివరకూ రాజులూ, జమీందారుల మీద, మఠాధిపతులు, పీఠాధిపతుల మీద, దేవాలయాల మీద ఆధారపడ్డ వ్యవస్థకు మొదట రాజు ఆదరణ కరువైంది. ఇంగ్లీషు ప్రభుత్వం వున్నా చిన్నాపెద్దా రాజ్యాలు, దేశంలో స్వాతంత్ర్యం వచ్చేనాటికి 500 పైగా వుండేవి. అవన్నీ స్వతంత్ర భారతదేశంలో కలిసిపోవడంతో, రాజుల అధికారాలు వాటితో ఆస్తులు, ఆదాయాలు పోవడంతో వారి ఆదరణపై ఆధారపడ్డ వారి మనుగడ ఇబ్బందిలో పడింది. కొత్త చట్టాలు- దున్నేవాడిదే భూమి అన్న భావనతో కౌలుదారీ చట్టాలు, భూ పరిమితి చట్టాలతో మఠాలు, పీఠాలు వారి అధీనంలో ప్రతి సంవత్సరం ఆదాయాన్నిచ్చే మాన్యాలు పోయాయి. కొన్ని రాష్ట్రాలలో దేవాలయాల పరిపాలన బాధ్యత ప్రభుత్వం చేపట్టడంతో నెమ్మదిగా ఆలయ ఆదాయవ్యయాలు,

ఆస్తుల సంరక్షణ, ఆదాయాలు పెంచడం, యాత్రికుల వసతులపై ధ్యాస పెరిగి - ధర్మప్రచారం, ధర్మరక్షణ, సంస్కృతీ పరిరక్షణలు చిన్న చూపునకు గురయ్యాయి. సనాతన ధర్మప్రచార, పరిరక్షణ కేంద్రాలుగా వుండే దేవాలయాలు ధనార్జన కేంద్రాలుగా, వ్యాపార సంస్థలుగా తయారయ్యాయి. ధార్మికులు ఆలయపాలకులుగా నియమింపబడే బదులు, అవి రాజకీయ నాయకుల ఆవాస కేంద్రాలుగా తయారయ్యాయి. మఠాధిపతులు, పీఠాధిపతులు వారివారి ఆదాయాలు ఇచ్చే గ్రామీణ భూములు పోయి, వారి శిష్యుల పాదసేవలు, భిక్షలపై వచ్చే ఆదాయంతో, లేదా వారి అధీనంలో వున్న కొన్ని ఆలయాల ఆదాయంపై ఆధారపడవలసి రావడం, దానితో రానురాను వారు ధనిక శిష్యులను మాత్రం ఉద్ధరించే కార్యక్రమాలు, వారివారి శిష్యులు ఇతర మతాలకు పోకుండా సంరక్షించుకోవడంతో సరిపోయింది. వారి ధర్మరక్షణ కొన్ని వర్గాల వారికే పరిమితం కావడం చూస్తాం.

ఆలయాల ఆస్తులు అక్రమ ఆక్రమణలకు గురికావడం, ప్రభుత్వ నిర్లక్ష్యం వలనో, దేవాదాయ అధికారుల అశ్రద్ధ లేక లాలూచీతనం వలననో దేవాలయాల భూములపై వచ్చే ఆదాయాలు గణనీయంగా పడిపోవడంతో ఎన్నో ఆలయాలలో అర్చకుల జీవనాధారాలు పోయి, ఆలయాలలో ధూపదీపనైవేద్యాలకు కూడా వెసులుబాటు లేకుండా పోయింది. దేవాదాయ శాఖ దృష్టంతా ఆదాయాలు వచ్చే ఆలయాల పైనే... వేలకొద్దీ ఆలయాలు జరుగుబాటులేక మూతబడి పోవడమో, లేదా ఆ ఆలయాలను నమ్ముకున్న అర్చకులు వాటిలో కొంత కైంకర్యం చేసి ఆలయం మూసి, ఇతర వ్యాపకాలకు పోవడమో జరుగుతూ వచ్చింది. అలా ఈ ఆలయాలు భక్తుల కోసం కాకుండా, ఆ వంశపారంపర్య అర్చకుల దయాధర్మాల మీద ఆధారపడటం మొదలైంది.

ప్రాచీనంగా ప్రతి ఆలయంలో పురాణ ప్రవచనాలు ప్రతి రోజూ జరిగి, గ్రామ ప్రజలకు, నీతి, న్యాయం, ధర్మం తెలిపే సంప్రదాయం వుండి ఆలయాలు ధర్మప్రచార కేంద్రాలుగా, ఆధ్యాత్మిక, సాంస్కృతిక కేంద్రాలుగా వుండేవి. అలాంటి సంప్రదాయాలు కనుమరుగవుతూ వచ్చాయి. దేవాదాయ శాఖ అధికారులకు ఆలయ ఆదాయాలు పెంచే బాధ్యతలు, యాత్రికుల సదుపాయాలు చూసే బాధ్యతలే కాని ధర్మప్రచార విషయంలో, సంస్కృతి పరిరక్షణ విషయంలో నిర్దిష్టమైన బాధ్యతలు అప్పగించబడలేదు. వారి పాత్ర ధర్మప్రచారం కంటే, దర్శనాలు, ప్రసాదాలకు పరిమితమైపోయింది. అటు ప్రభుత్వమూ పట్టించుకోక, ఆలయాలూ దృష్టి పెట్టక, మఠాధిపతుల ఆదరానికి

నోచుకోని (హిందూమతంలోని) చాలా వర్గాల వారికి కావల్సిన స్ఫూర్తి, ఉత్తేజం, మనశ్శాంతికి ఈ హిందూ మతంలో అవకాశం లేదేమో! అన్న భావన మొదలైంది. దానికి తోడు హిందూమతంలో వున్న కులవ్యవస్థ, అంటరానితనం లాంటి ఆచారాలు కొన్ని కులాలవారు దూరం కావడానికి ఆస్కారమయ్యాయి.

ముఖ్యంగా హిందూమతంలో కట్టుదిట్టమైన పరిపాలనవ్యవస్థ లేదు. మతసంస్థలలో, మతాధిపతులలో సంఘీభావం లేదు. ఒకరి నాయకత్వం మరొకరు ఒప్పుకొనే అవకాశం లేదు. విశ్వహిందూ పరిషత్తులాంటి సంస్థలు కొంత సంఘటిత కార్యక్రమాలు చేసి హిందువులందరినీ కలుపుకోవాలని ప్రయత్నం చేసినా, ఆదిలో రాజకీయాలకు అతీతంగా కార్యక్రమాలు జరిపినవారు, క్రమంగా ఒక రాజకీయ పార్టీకి మద్దతుదారులు కావడంతో ఇతరపార్టీల హిందువులు వీరికి దూరంగా వుండటం జరిగింది. అలా హిందూ ధార్మిక వ్యవస్థ, ఐకమత్యం లేక, సరైన నాయకత్వం లేక, ఆదాయాలు లేక, వున్న ఆదాయాల ధర్మప్రచారానికి, ధర్మరక్షణకు వాడే అవకాశం లేక... ఇతర మతాల వారికి పెద్దఎత్తున మతాంతరీకరణలు చేసి హిందువులను వారి మతంలోకి మార్చుకోవడానికి పెద్ద అవకాశాన్నిచ్చాయి.

మన పరిస్థితి ఇలా ఉంటే, ఇతర మతాల విషయాలు ఎలా వున్నాయో చూద్దాం. ప్రపంచంలోనే ఒక నిర్దిష్టమైన పరిపాలనవ్యవస్థలు గల మతాలు అవి. క్రైస్తవం, మహమ్మదీయం పెద్ద ఎత్తున నిధులు వారి వారి దేశాలలో సేకరించి, మతాంతరీకరణ కార్యకలాపాలకు వందల వేల కోట్లు మన దేశానికి పంపడం జరుగుతోంది. లక్షల మంది కార్యకర్తలను నియమించి, వేలకోట్లు ప్రచారానికి ఖర్చు పెట్టి, ఒక కట్టుదిట్టమైన పథకంతో గ్రామగ్రామాన కార్యకర్తలను నియమించి, వారికి ఆర్థిక ప్రోత్సాహాలు ఇతర వనరులను ఏర్పాటుచేసి పెద్దఎత్తున మతమార్పిడులు చేసే కార్యక్రమాలు ఒక ప్రణాళిక ప్రకారం జరుగుతోంది.

మతాంతరీకరణలు ఎందుకు జరుగుతున్నాయి? అరికట్టవలసిన బాధ్యత ఎవరిది? కార్యాచరణ ప్రణాళికబాధ్యత ఎవరిది? ఆలయందా? పీఠాధిపతులదా? దేవాదాయ శాఖదా? ఆలయాలు దేవాదాయ శాఖను పరిపాలిస్తున్న ప్రభుత్వానిదా?

మన దేశంలో శతాబ్దాల కాలం నుండి మన విద్యావిధానం, ఆలయ వ్యవస్థ, సంస్కృతీ పరిరక్షణ కార్యక్రమాలు - సంగీత, సాహిత్య, లలితకళలున్న మన ఆలయ వ్యవస్థ మీద, మన సనాతన గ్రంథాల మీద, లేదా మతపరమైన వ్యవస్థతో ముడిపడి

వున్నాయి. స్వాతంత్ర్యం రావడంతో సెక్యులరిజం పేరిట, బోధన వ్యవస్థలో, సాంస్కృతిక రంగంలో, సనాతన శాస్త్ర అధ్యయనం చేసే విధానాల్లో చాలా మార్పులు వచ్చి, అదివరకు ప్రజలకు న్యాయం, ధర్మం, నీతి నిజాయతీల పరిజ్ఞానం కలిగించే అంశాలన్నీ, మతపర విషయాలుగా భావించబడి దూరం చేయబడ్డాయి. ప్రాచీనకాలంగా సమాజంలో ధర్మం, న్యాయం నిలబెట్టిన రామాయణం, భారతం, భాగవతం లాంటివి, శతక సాహిత్యం మతపరమైన గ్రంథాలుగా ముద్రపడి విద్యావిధానంలో పాఠ్యాంశాలుగా తీసివేయబడ్డాయి. చిత్రమేమిటంటే, ఇండొనేషియా, మలేషియా, థాయిలాండ్ లాంటి దేశాలలో ఈ గ్రంథాలకు ఇచ్చిన ప్రాముఖ్యం మన దేశంలో లేకుండాపోయింది. దాని ఫలితమే ఈనాడు మనం మన సమాజంలో చూస్తున్న నైతిక ధార్మిక విలువల పతనానికి కారణం.

మఠాధిపతులు అందరూ కలిసి వచ్చే అవకాశం లేదు. ఆలయ ఆదాయాలు ధర్మప్రచారానికి అందడం లేదు. ఆలయ పరిపాలన రాజకీయ నాయకుల చేతుల్లోకి పోయింది, హిందూ ధర్మ రక్షణే ధ్యేయంగా పెట్టుకొన్న సంస్థలు కూడా మనుగడ సాధ్యం కాక రాజకీయ అనుబంధ సంస్థలుగా తయారు అయ్యాయి. మరి దీనికి పరిష్కారం... రాజకీయాలకు అతీతంగా హిందూ సమాజంలోని అన్ని వర్గాలవారూ, అద్వైత, విశిష్టాద్వైత, ద్వైత, శైవ, శాక్తేయ సంప్రదాయాలకు చెందిన వారందరికీ ఆమోదయోగ్యమైన సంస్థ ఈ హిందూ సమాజ ఉద్ధరణకు, మతమార్పిడులను అరికట్టడానికి నాయకత్వం వహించాలి. అలా అందరికీ ఆమోదయోగ్యమైన, ఆర్థిక నైతిక, ఇతిహాస స్తోమత గల సంస్థ ఈ దేశంలో తిరుమల తిరుపతి దేవస్థానాలు మాత్రమే. తి.తి.దేవస్థానాల వారు ఏం చేస్తున్నారు?

★ ★ ★

91. మతమార్పిడుల నిరోధం లక్ష్యమైన సదస్సుకి చుక్కెదురు!

హిందూ ధర్మానికి పెనుముప్పుగా పరిణమించిన మతమార్పిడులను నిరోధించటానికి దేశంలోని అన్ని పీఠాల, మఠాల అధిపతులు పాల్గొనేలా రూపొందించిన మూడవ ధార్మిక సదస్సుకి అన్ని ఏర్పాట్లూ పుర్తయ్యాయి.

కాని, చివరి నిమిషంలో "పైనుండి వచ్చిన ఆదేశాలు" అడ్డం పడ్డాయి. ఆ సదస్సు జరగలేదు. ఇంక జరగదేమో!

★ ★ ★

దక్షిణ భారతంలో హిందూ మతానికి ముప్పు వచ్చిన సందర్భాలలో శతాబ్దాలుగా తిరుమల-తిరుపతి దేవస్థానాలు చేపట్టిన కార్యక్రమాలు గురించి కొంత చెప్పుకున్నాం. ప్రాచీన కాలంలో ఈ దేవస్థానాలు చేపట్టిన కార్యక్రమాలన్నీ పండితులను, ఆచార్య పురుషులను, గోసాయిలను అన్ని ప్రాంతాలకూ పంపి శ్రీవైష్ణవ మతప్రచారం చేయడానికి... ఆ కార్యక్రమాలు ముఖ్యంగా ముస్లిం దండయాత్రలలో దేవాలయాల ధ్వంసం, మతమార్పిడులు- బలవంతంగానో ప్రలోభపెట్టే- జరిగిన సందర్భంలో జరిగాయి.

ఈస్టిండియా కంపెనీ వారి పాలనలో, తర్వాత ఆంగ్లేయుల రాచరిక పాలనలో, వారి మత ప్రచారానికి కొంత ప్రోత్సాహం చేయడం జరిగినా, బలవంతపు మతమార్పిడులు చేసే ప్రయత్నం జరగలేదనే చెప్పాలి. వారికి రాజ్యపాలన, వారి అధికార స్థిరత్వంపై దృష్టి వున్నందున, మత వ్యవహారంలో పెద్ద జోక్యం చేసుకోకుండా, ఎవరి మతం వారు ఆచరించడానికి, ప్రచారం చేసుకోవడానికి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం ఈ మత వ్యవహారాల్లో తటస్థ వైఖరి పాటించడం జరిగింది.

కాని స్వాతంత్ర్యం వచ్చాక దేశంలో పరిస్థితులు ఎలా మారాయో క్రిందటి వ్యాసంలో చూశాం. రాజ్యాలు పోయాయి, రాజులు పోయారు, జమీందారులు పోయారు. వాళ్లతో వారిచ్చే మతపరమైన ప్రోత్సాహాలు పోయాయి... ఇంకోవైపు కౌలుదారీ చట్టాలతో మఠాలు ఆర్థికంగా ఇబ్బందులలో పడ్డాయి. కొన్ని రాష్ట్రాలలో ముఖ్యంగా మన రాష్ట్రంలో ఆలయపాలన ఒక రకంగా ప్రభుత్వం చేతులలోకి వెళ్లింది. ఆదాయాలున్న ఆలయాలు బాగు పడ్డాయేమో గాని, ధర్మరక్షణ, ధర్మప్రచారం మరుగున పడిపోయాయి. ఆదాయం లేని దేవాలయాల్ని పట్టించుకున్న వాడేలేడు. ఇతర మతాల వారు ఒక పథకం ప్రకారం విదేశాల నుంచి వచ్చిన వేల కోట్లతో వారి మతప్రచారం, హిందూ మతం నుండి మత మార్పిడులు చేస్తుంటే- హిందూ మతం, మత సంస్థలు, నాయకత్వం లేక, ఐకమత్యంలేక, వనరులున్నా వాటిని వినియోగం సరిగ్గా లేక దిక్కు తోచని స్థితిలో వుండిపోయాయి. మంచి ప్రణాళికలతో కొన్ని మత సంస్థలు ముందుకొచ్చినా వాటి మనుగడ కోసం, రాజకీయ పార్టీలతో పొత్తు పెట్టుకోవడంతో మిగతా పార్టీల వారినుండి వ్యతిరేకత...ఇలా విచ్ఛిన్నమైన హిందూ సమాజంలో మతమార్పిడులు అరికట్టాలంటే ఎవరు బాధ్యులో తెలియని నిస్సహాయ అయోమయ పరిస్థితి నెలకొంది.

ఈనాటి హిందూ సమాజంలో అందరు హిందువులూ, అన్ని సంస్థలూ, ఆమోదించే ఏకైక సంస్థ తిరుమల తిరుపతి దేవస్థానాలే. తిరుమల శ్రీనివాసుడు అందరూ ఒప్పుకొనే సర్వోత్తమ దైవం. ఆయన నాయకత్వం అందరికీ ఆమోదయోగ్యమే. హిందూ ధర్మానికీ, మతానికీ గ్లాని కల్గినప్పుడు, అందరూ ఆశించేది - తిరుమల తిరుపతి దేవస్థానాలు నాయకత్వం వహించి, క్లిష్ట పరిస్థితులను ఎదిరించాలని! ఎన్నో శతాబ్దాలుగా అటువంటి సందర్భాలలో ఈ దేవస్థానాలు ప్రముఖ పాత్ర వహించి, ధర్మ పరిరక్షణకు ప్రయత్నాలు చేశాయి. ప్రాచీనకాలంలో శ్రీవైష్ణవ మతప్రచారంతో ఈ పని చేస్తే, స్వాతంత్ర్యం వచ్చాక, మారిన పరిస్థితుల దృష్ట్యా, తగినవిధంగా హిందూ మత ప్రచారానికి నాంది పల్కాయి. అంటే, ద్వైత, అద్వైత, విశిష్టాద్వైత, శైవ భేదం లేకుండా, అందరికీ ఆమోదయోగ్యమైన హిందూ ధర్మ పరిరక్షణ ధ్యేయంగా కార్యక్రమాలు చేపట్టారు.

మొదట - అంటే 20వ శతాబ్దం మధ్యకాలంలో, మత ప్రచార గ్రంథాల ప్రచురణలతో మొదలైన హిందూ ధర్మ పరిరక్షణలో, నేను తిరుమల తిరుపతి దేవస్థానాల కార్యనిర్వహణాధికారిగా వచ్చే సమయానికి పెద్ద ఎత్తున కార్యక్రమాలు చేపట్టాల్సిన అవసరం వచ్చింది. ఆ రోజుల్లో తమిళనాడులో మీనాక్షిపురంలో జరిగిన సామూహిక

మతమార్పిడుల దృష్ట్యా, ధర్మరక్షణకు తిరుమల తిరుపతి దేవస్థానాలు ఏం చేస్తున్నాయన్న ప్రశ్న భక్తుల దృష్టికి వచ్చింది. దానితో పెద్ద ఎత్తున ధర్మరక్షణ కార్యక్రమాలు చేపట్టడం జరిగింది.

అదే రోజుల్లో ధర్మరక్షణ కార్యాచరణ ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్, కర్నాటక, తమిళనాడు రాష్ట్రాలను పరిధిగా తీసుకొని ఆయా రాష్ట్రాల నుండి ప్రముఖ మతాధిపతులతో ఒక సలహా మండలిని ధర్మప్రచారానికి నియమించడం జరిగింది. ఆ మండలిలో ఆంధ్రప్రదేశ్ నుండి శ్రీశ్రీశ్రీ త్రిదండి రామానుజ నారాయణ పెద్దజియ్యరు స్వామి, కర్ణాటక నుండి శ్రీశ్రీశ్రీ విశ్వేశతీర్థ స్వామీజీ, పెజావరు మఠం, తమిళనాడు నుండి శ్రీశ్రీశ్రీ జయేంద్ర సరస్వతీ స్వామిజీ- మధుర అధీనం స్వామీజీలు ఉన్నారు. వీరు విశిష్టాద్వైత, ద్వైత, అద్వైత, శైవ పీఠాలకు అధిపతులు. వారి సలహాలతో హిందూ ధర్మ రక్షణ స్థాపించి విస్తృత కార్యక్రమాలు చేపట్టడం జరింది.

ప్రతి జిల్లాకు ఒక ధర్మప్రచారకుని నియమించి, వారి ద్వారా జిల్లాలో ప్రవచనాలు, భజనబృందాల స్థాపన, ఇతర దేవాలయాల సహాయంతో ధర్మప్రచార కార్యక్రమాలు చేపట్టడం మొదలైంది. తిరుపతి నుండి ప్రచార ప్రచురణలు అన్ని వర్గాల వారికి అంటే, చిన్నపిల్లలకు, విద్యార్థులకు, మహిళలకు, ముముక్షువులకు అందరికీ అందుబాటులో వుండేటట్లు వ్రాయించి, ముద్రించి, ఉచితంగా లేక తక్కువ ధరలకు సరఫరా చేసే కార్యక్రమాలు మొదలుపెట్టాం. దేవస్థానాల చరిత్రలో ధర్మప్రచార విషయంలో నేరుగా స్వామిజీలతో నిర్ణయాలు తీసుకొనే ప్రక్రియ ప్రప్రథమంగా మొదలయింది (నేను కార్యనిర్వహణాధికారిగా పదవి నుండి బదిలీపై వచ్చేసిన తర్వాత మళ్లీ ఈ ప్రక్రియ కొనసాగలేదు.)

అదే సమయంలో రాష్ట్రంలోని అన్ని జిల్లాలలో, ఒక ప్రచారకుని దేవస్థానాల ద్వారా నియమించి, వారి ద్వారా ధర్మప్రచార కార్యక్రమాలు చేయించడానికి నాంది జరిగింది. ఈ ధర్మరక్షణ సంస్థకు సహాయకార్యక్రమాలుగా, అన్నమాచార్య ప్రాజెక్టు, దాస సాహిత్యప్రాజెక్టు, ఆళ్వారు దివ్యప్రబంధం ప్రాజెక్టు - భాగవతం ప్రాజెక్టు, ప్రచురణ విభాగం, రచయితలకు వారి మతపరమైన గ్రంథాల ప్రచురణకు 'Aid to Authour' పథకం అన్ని ఆలయాలకు మైకుసెట్లు, కేసెట్లు, దేవస్థానాల ప్రచురణలు అందించే పథకాలు మొదలుపెట్టాం. శుక బ్రహ్మాశ్రమం పీఠాధిపతి శ్రీశ్రీ విద్యాప్రకాశానందగిరి స్వామివారి భగవద్గీత ఉపన్యాసాలు బహుళ ప్రచారంలోకి తేవడం, వాటి సీడీలు, వీడియోలు అందరికీ అందుబాటులో వుండేటట్లు చూడటం,

ఆంగ్లంలో స్వామి చిన్మయానంద గారి గీతోపన్యాసాలు బహుళ ప్రచారంలోకి తేవడం, పాఠశాల విద్యార్థులకు పురాణ పరీక్షల పథకం, ఉపాధ్యాయులకు వేసవి శిబిరాలు, కన్యాకుమారిలోని వివేకానంద కేంద్రంలో, ధర్మప్రచారకులకు శిక్షణ ఇచ్చే కార్యక్రమాలకు ప్రోత్సాహం లాంటి ఎన్నో కార్యక్రమాలు చేపట్టడం జరిగింది. ఆ రోజుల్లో విశ్వహిందూ పరిషత్తుతో కలిసి దేవస్థానాలు ఎన్నో ప్రచార కార్యక్రమాలు నిర్వహించింది (ఆ రోజుల్లో విశ్వహిందూ పరిషత్తు రాజకీయాలకు అతీతంగా ధర్మప్రచారం చేసేది. ఇప్పుడు పరిస్థితులు మారాయి.)

నలుగురు మఠాధిపతుల సలహామండలితో కార్యక్రమాలు చేపట్టినా, గ్రామస్థాయిలో కాని, జిల్లాస్థాయిలోకాని, ఇతర మతాల భక్తుల నుండి రావలసినంత సహాయసహకారాలు అందేవికావు... తర్వాత, తర్వాత జిల్లాలలోని ధర్మప్రచార కార్యక్రమాలు , కొన్ని ప్రవచనాలు, హరికథా, సంగీత కార్యక్రమాలకు పరిమితమై– అనుకొన్న ఫలితాలు సాధించలేకపోయాయి. ఆలయం నియమించిన ధర్మప్రచారకులు, దేవస్థానం అధికారులుగా మారి, ఉద్యోగులుగా కార్యక్రమాలు చేస్తున్నారేకాని, ఉద్యమకారులుగా చేయడం లేదనే విమర్శలు వెలువడ్డాయి.

మంచి ఆలోచనాశక్తి, కార్యదక్షత గల అధికారులు కార్యనిర్వహణాధికారులుగా వచ్చినా, పాలకమండళ్లు, అధ్యక్షుల ఉద్దేశ్యాలు ఆదర్శవంతమైనవి అయినా, ధర్మప్రచార విషయంలో హిందూ సమాజం ఆశించిన పరిధిలో తిరుమల తిరుపతి దేవస్థానాలు కార్యక్రమాలు చేపట్టి నాయకత్వం లేని, ఐకమత్యం లేని హిందూ సమాజాన్ని ఉత్తేజ పరచి దిశానిర్దేశం చేయలేకపోయింది. దానికి ముఖ్య కారణం... పాలకమండళ్లు కాని, కార్యనిర్వహణాధికారులు కాని, రెండు సంవత్సరాలు కూడా వారి పదవులలో వుండే పరిస్థితి లేకపోవడం. అధ్యక్షుడు మారినా, కార్యనిర్వహణాధికారి మారినా, పాలక మండళ్లు మారినా, ప్రభుత్వం మారినా, మంత్రులు మారినా... కార్యక్రమాలకు అంతరాయం కలిగేది. పాత పథకాలు నిర్లక్ష్యం చేసి, కొత్త పథకాలు ప్రారంభించడం, అవి ఊపందుకొనే లోపల బదిలీలు కావడం – షరా మామూలే... ధర్మప్రచారానికి అంతే సంగతులు.

కార్యక్రమాలు జరుగుతూనే వుంటాయి, ఖర్చవుతూనే ఉంటుంది. కాని ఒక ప్రణాళిక ప్రకారం ఆశించిన ఫలితాలు వచ్చేవరకూ కార్యక్రమాలు వడిదుడుకులు లేకుండా కొనసాగించే సావకాశం లేని దౌర్భాగ్యస్థితి... దానితోపాటు తిరుమల దేవస్థానాల కార్యక్రమాలకు దేవాదాయ శాఖ పరిధిలోని ఆలయాల కార్యక్రమాలకు

సమన్వయం లోపించడం కూడా జరిగేది. మఠాధిపతులను, పీఠాధిపతులను, ఇతర హిందూ మత సంస్థలను, కలుపుకొని, సమన్వయంతో కార్యక్రమాలు చేయడానికి తగిన అవకాశాలు గాని, వ్యవస్థ కాని లేని పరిస్థితి ఏర్పడింది. ఇదే ఆవేదన, నా తర్వాత వచ్చిన కార్యనిర్వహణాధికారులు, పాలకమండలి అధ్యక్షులు, దేవాదాయ మంత్రులకూ వుందని, వారితో చర్చించినపుడు నాకు తెలిసింది. నాకు కార్యనిర్వహణాధికారిగా అవకాశం వచ్చినా, హిందూ ధర్మరక్షణ సంస్థను పతిష్ఠం చేయగలిగినా, మతప్రచారం ఉద్యమరూపంలో చేయగలగడం కాని, మత మార్పిడులను అరికట్టగల వ్యవస్థాగత వెసులుబాటు చేయడంకాని జరగలేదన్న అసంతృప్తి అలానే మిగిలిపోయింది.

2005లో నన్ను తిరుమల తిరుపతి దేవస్థానాల సలహాదారుగా నియమించడంతో శ్రీనివాసుడు నాకు ఈ ధర్మప్రచారం విషయంలో ఇంకొక అవకాశం ఇచ్చాడేమోనన్న భావన వచ్చింది. చాలా పట్టుదలతో కార్యక్రమాలు చేపట్టడం జరిగింది. ఆనాటి పాలకమండలి అధ్యక్షులు శ్రీ సుబ్బరామిరెడ్డిగారు, తర్వాత కరుణాకరరెడ్డిగారు ఈ విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం, కార్యనిర్వహణాధికారులుగా ఉన్న ఎ.పి.వి.ఎన్. శర్మగారు, తర్వాత రమణాచారిగారు, అటు తర్వాత ఐవైఆర్ కృష్ణారావుగారు ఎంతో ఆసక్తితో, పట్టుదలతో కార్యక్రమాలు చేపట్టడంతో, ధర్మప్రచారకార్యక్రమాలు మంచి ఊపందుకొన్నాయి. ధర్మప్రచారానికి నిధులు సమృద్ధిగా సమకూర్చడంతో ఎన్నో కొత్త కార్యక్రమాలు రూపొందించి అమలు చేయడానికి అవకాశంకల్గింది.

అప్పుడు ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డిగారు. ఆయన క్రైస్తవుడు కాబట్టి, తిరుమలలో అన్యమత ప్రచారం జరుగుతున్నా, ఆలయ అధికారులు, పాలకవర్గం పట్టించుకోవడం లేదనీ, కావాలని ఏడుకొండలను కుదించి, తిరుమల ఆలయ పరిధిని రెండు కొండలు చేశారనీ, కొండమీదనే ఒక క్రైస్తవ చర్చి కట్టడానికి సన్నాహాలు చేస్తున్నారనీ, ఆలయ నిధులు ప్రభుత్వానికి మరలించే ప్రయత్నం చేస్తున్నారని చాలా పెద్ద ప్రచారం ప్రారంభమైంది. పెజావరు మఠాధిపతి, విశ్వహిందూ పరిషత్తులోని ముఖ్యనేత, శ్రీ విశ్వేశతీర్థస్వామీజీ, ఒక విషయ నిర్ధారణ కమిటీని నియమించి, తిరుమల తిరుపతిలలో విచారణలు మొదలుపెట్టారు. ఏదో ఒక అంశంపై ఆ కమిటీ సభ్యులు మీడియాకు చెప్పడం, దానిని దేవస్థానం వారు ఖండించడం మొదలైంది.

కొండమీద ఎవరో కరపత్రాలు పంచారనో, మోటరు సైకిలుపై శిలువ చిహ్నం వుందనో, పద్మావతీ విశ్వవిద్యాలయంలో ఏదో జరుగుతోందనో ఆరోపణలు...

అటువంటివేమీ లేవని దేవస్థానం ఖండన! ఏది ఎలాగున్నా, తిరుమల తిరుపతి దేవస్థానాలు పెద్ద చర్చనీయాంశమై, ఆలయ ప్రతిష్ఠ దెబ్బతినే పరిస్థితి! కొండమీద చర్చి కడుతున్నారన్న పెద్ద వదంతులు! ఈ పరిస్థితులలో ఆలయ సలహాదారుగా వున్న నేను దేవస్థానాల అధ్యక్షుడు కరుణాకరరెడ్డి గారితో చర్చించాను. "మతమార్పిడుల ప్రచారం ఎలావున్నా, హిందూ సమాజంలోని రెండు వర్గాలు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తూ, ఆలయ ప్రతిష్ఠకు దెబ్బ తగిలేలా జరుగుతోంది కదా... విమర్శలు చేసే వాళ్ళు, అన్యమత ప్రచారం జరుగుతోందని ఆరోపణలు చేస్తున్నారు. మన దేవస్థానం ఆశయం అలా జరగకూడదనే కదా? ఇలా బహిరంగంగా విమర్శలు చేసుకొనే బదులు, వారితో చర్చించి, అటువంటి సంఘటనలు జరగడం లేదని, కావాలంటే అటువంటివి జరగకుండా చూడటానికి అందరం కలిసి పనిచేయవచ్చు కదా? కావాలంటే పెజావరు స్వామీజీతో నేను మాట్లాడి విషయం పరిష్కారం చేస్తా"నన్నాను. లేకపోతే రాజకీయ ప్రయోజనాల కోసం ఈ సందర్భాన్ని వాడుకోవడానికి అవకాశం వుంటుందన్నాను. కరుణాకరరెడ్డిగారు దానికి ఒప్పుకోవడంతో, పెజావరు స్వామి వారితో చర్చించి, వారిని ఒప్పించి, దేవస్థానం వారితో ముఖాముఖి చర్చలు జరిపించి, విషయ పరిష్కారం చేయడం జరిగింది.

కారణాలు ఏమైనా, ఒక రకంగా, రాజశేఖరరెడ్డిగారు ముఖ్యమంత్రిగా వున్న కాలంలోనే తిరుమల తిరుపతి దేవస్థానాల ద్వారా ధర్మప్రచారం పెద్దఎత్తున జరిగిందని చెప్పాలి. కరుణాకరరెడ్డిగారు ఆలయ అధ్యక్షుడుగా వున్న రోజుల్లో ఎన్నో కొత్త ధర్మప్రచార పథకాలు ప్రారంభించగలిగాం. సలహాదారుగా నేను చేసిన ప్రతిపాదనలన్నీ ఆమోదించడమే కాక, చాలా చిత్తశుద్ధితో ఆచరించడానికి ప్రోత్సాహాన్నిచ్చారు. అదే సమయంలో మొదట ఎ.పి.వి.ఎన్.శర్మగారు, తర్వాత రమణాచారిగారు కార్యనిర్వహణాధికారిగా వుండి, ఎంతో ఉత్సాహంతో, పట్టుదలతో ధర్మరక్షణ కార్యక్రమాలు చేసి హిందూ సమాజంలో మంచి చైతన్యాన్ని తెచ్చారు.

గ్రామగ్రామాల్లో భజన మండళ్లు స్థాపించడం, తిరుమలలో అఖండ నామ సంకీర్తన, ఎన్నోసార్లు మెట్లోత్సవాలు పెట్టి, తిరుపతికి వేలాది భజనబృందాలను ఆహ్వానించడం, ఈ కార్యక్రమానికి ఒక నిర్దిష్టమైన రూపం తీసుకురావడానికి విశాఖజిల్లా 100 గ్రామాలలో భాగవతుల ఛారిటబుల్ ట్రస్టు (BCT) ద్వారా "ఊరూరా భజన మండళ్ల పథకం" Pilot Project నడపడం, హిందూ సమాజంలో పేద మధ్యతరగతి కుటుంబాల వాళ్లు, ఆర్భాటంగా పెళ్లిళ్లు చేయాల్సి వచ్చి అప్పుల

పాలవుతున్న దృష్ట్యా- "కళ్యాణమస్తు" కార్యక్రమాన్ని ప్రవేశపెట్టి శ్రీనివాసుని కృపతో ఖర్చు లేకుండా సామూహిక పెళ్లిళ్లు చేసే పథకం ప్రవేశపెట్టడం, ఆలయానికి వచ్చి కళ్యాణాలు చేసుకోలేని వారికి, వారి ఊళ్లోనే కళ్యాణాలు దేవస్థానం వారు చేసే కార్యక్రమం - కల్యాణోత్సవ కార్యక్రమం ప్రవేశపెట్టడం, దళితుల కోసం ప్రత్యేకంగా 'దళిత గోవిందం' కార్యక్రమం మొదలుపెట్టి దళితవాడలలో స్వామి కళ్యాణాలు చేసి, సామూహిక భోజనాలు చేసే కార్యక్రమం, గ్రామాల్లో దళితులను ఆలయ ప్రవేశం చేయించడం, అస్పృశ్యత నివారించే కార్యక్రమాలు పెద్దఎత్తున చేపట్టడం, ఇవికాక కౌశిక ద్వాదశినాడు దళిత వాడలలో రాష్ట్రమంతటా పురాణ ప్రవచన కళ్యాణ కార్యక్రమాలు చేయించడం - అలానే, గిరిజన ప్రాంతాల్లో గోవింద కళ్యాణాలు, ప్రసార రథాలతో భక్తిచైతన్యయాత్రలు, కారాగారాల్లో గీతగోవిందం, వేద పండితుల ఆరోగ్యరక్షణకి ఆయుష్మాన్‌భవ, వేదమాసోత్సవ కార్యక్రమాలు హరిజన, గిరిజనుల సంరక్షణలోవున్న, ఇతర ఆగమ ప్రకారం ప్రతిష్ఠ కాని - ఆలయాల నుండి పూజారుల్ని రప్పించి, ప్రత్యేకంగా అర్చనా పద్ధతులు నేర్పించడం... ఇలా ఎన్నో ఎన్నో కార్యక్రమాలు... ఇందులో చాలా కార్యక్రమాలు 'ధార్మిక సదస్సు'లో తీసుకొన్న నిర్ణయాల మేరకు అమలు చేయడం జరిగింది.

కరుణాకరరెడ్డి గారు పాలకమండలి అధ్యక్షులుగా వున్న రోజుల్లో, సలహాదారుగా నేను ఆయనతో ధర్మప్రచారం గురించి విస్తృత చర్చలు చేయడం జరిగింది. ఈ చర్చలన్నీ, ముఖ్యంగా దేవస్థానాల కార్యనిర్వహణాధికారి శర్మగారితో చర్చించాకే చేసేవాడిని... అనుభవంలో తెలిసింది - నెలజీతాలు తీసుకొనే దేవస్థానం ఉద్యోగులతో ధర్మప్రచార కార్యక్రమాలు సమర్థంగా చేయడం చాలా కష్టమని.. హిందూ సమాజంలోని, ఆధ్యాత్మిక సంస్థలన్నింటినీ కలుపుకుపోయి కార్యక్రమాలు చేస్తే తప్ప, ఉద్యమస్థాయిలో ధర్మప్రచారాన్ని తీసుకుపోవడం కష్టం. ముఖ్యంగా మఠాధిపతులు, పీఠాధిపతులు, ఇతర హిందూ ధార్మిక సంస్థలు అన్నీ కలిసి పని చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఈ మఠాలు, పీఠాలు, ఇతర సంస్థలు ఇంకే ఇతర నాయకత్వాన్ని ఆమోదించే అవకాశం లేదు.

అది వరకు విశ్వహిందూ పరిషత్తు లాంటి సంస్థలు చాలా ప్రయత్నం చేసినా, ఆ సంస్థలు రాజకీయ పార్టీలకు అనుబంధ సంస్థలుగా మారడం వలన, కొందరు మాత్రమే వారి నాయకత్వాన్ని ఆమోదించడం జరుగుతోంది. అందరూ ఆ సంస్థల నాయకత్వాన్ని ఆమోదించడానికి ముందుకు రావడం లేదన్నది స్పష్టంగా తెలుస్తోంది.

రాజకీయాలకు అతీతంగా, అన్ని హిందూ సంస్థలను, పీఠాలను ఒక త్రాటిమీదకు తేవాలంటే తిరుమల తిరుపతి దేవస్థానాలకు మాత్రమే అవకాశం వుంది. ఎందుకంటే అన్ని సంస్థలూ, హిందూ సమాజంలోని అన్నివర్గాల వారూ, తిరుమల తిరుపతి దేవస్థానాలు (అంటే శ్రీవేంకటేశ్వరుని) నాయకత్వం ఆమోదిస్తారు కనుక... అద్వైత, విశిష్టాద్వైత, ద్వైత, శైవ, శాక్తేయ సంప్రదాయాల వాళ్లందరూ అనాదిగా, తిరుమల శ్రీనివాసుని భక్తులే... కనుక హిందూ సమాజం సంఘటితం చేయడానికి ఒక్క తిరుమల దేవస్థానాల వారికే సాధ్యం.

దానితోపాటు, ఈ దేవస్థానాలను మంచి ఆర్థిక స్తోమత వుంది. కొంత వ్యవస్థాగత కట్టుదిట్టాలు చేయగలిగితే, ధర్మప్రచారానికి, మతమార్పిడుల సమస్య పరిష్కారం చెయ్యడానికి అవకాశం వుంది. గ్రామీణ స్థాయి నుండి, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయి వరకూ, తిరుమల దేవస్థానాల ఆధ్వర్యంలో అన్ని హిందూ సంస్థల ప్రతినిధులతో కార్యాచరణ సంఘాలు ఏర్పాటు చేసి, వాటికి తగిన ఆర్థిక, ప్రచార వనరులు అందేట్లు చూసి, ఒక నిర్దిష్టమైన కార్యాచరణ పథకం తయారుచేయాల్సిన అవసరాన్ని గుర్తించడం జరిగింది. కాని పైనుండి, ఒక్క తిరుమల తిరుపతి దేవస్థానాల పాలకమండలి నుండో, సలహాదారునుండో, లేదా ధర్మప్రచార పరిషత్తు నుండో మాత్రమే ప్రణాళికలు, ఆదేశాలు పంపితే జిల్లా, ఇంకా క్రిందిస్థాయిలో అన్ని సంస్థలూ నిండు మనసుతో పనిచేస్తాయన్న నమ్మకం ఉంటుందా?

ప్రభుత్వం నియమించిన పాలకమండలి, రాజకీయాలకు అతీతంగా పనిచేస్తుందన్న భరోసా అన్ని సంస్థలకు ఉండాలి. రాజకీయాలకు అతీతంగా హిందూమత సంరక్షణకు పనిచేసే అన్ని సంస్థలూ, పీఠాలూ, మఠాలు ఒక సదస్సుగా ఏర్పడి, కార్యాచరణ ప్రణాళికలు తయారుచేసి, కిందిస్థాయికి ఆదేశాలు పంపగలిగితే, జిల్లాస్థాయిలో కూడా ఈ సంస్థల ప్రతినిధులతో కార్యాచరణ సంఘాలు, ఏర్పరచ గలిగి, తిరుమల తిరుపతి దేవస్థానాల ఆర్థిక సహాయంతో, ఇవి పనిచేయగలిగితే.. సంఘటిత ధర్మప్రచారానికి సానుకూల ముంటుందని అనుకొన్నాం. నా సలహా మేరకు, దక్షిణ భారత పరిధిలో ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుండి పీఠాధిపతులు, మఠాధిపతులు, ఇతర హిందూ ప్రచార సంస్థల సభ్యులతో ఒక సదస్సు ఏర్పాటు చేయటానికి నిశ్చయించాం. రాజకీయ పార్టీలకు విభాగాలుగా వున్న అనుబంధ సంస్థలను నేరుగా ఈ సదస్సుకు ఆహ్వానించక ఆ సంస్థలతో సంబంధాలున్న కార్యకర్తలనూ, మఠాధిపతులనూ ఆహ్వానించడం జరిగింది. అలా

మొదటి ధార్మిక సదస్సుకు నాంది పలికాం. నన్ను ఈ సదస్సుకు సమన్వయకర్తగా నియమించారు.

ఈ సదస్సు జరగడానికి ముందు తి.తి.దేవస్థానంలోనే ధర్మప్రచార విభాగంలో కొన్ని వ్యవస్థాగతమైన మార్పులు చేయడానికి నిశ్చయించాం. హిందూమతంలో ప్రస్తుత పరిస్థితులు, మత మార్పిడులకు కారణాలు అరికట్టడానికి చేయవలసిన కార్యక్రమాలు, మన మతంలోని లొసుగులు, వాటిని సరిదిద్దటానికి తీసుకోవలసిన చర్యలు, తి.తి.దేవస్థానాల ధర్మప్రచారం సక్రమమైన మార్గంలో నడుస్తుందా? మార్పులు అవసరమైతే, తీసుకోవలసిన చర్యలు – ఇలాంటి విషయాలు క్షుణ్ణంగా పరిశీలించి, చర్చించి, తి.తి.దేవస్థానాలకు సలహాలివ్వటానికి తర్వాత హిందూ సంస్థల ధార్మిక సదస్సులో చర్చించాల్సిన అంశాలు, అక్కడ తీసుకున్న నిర్ణయాలను, తి.తి.దేవస్థానాలు అమలు చేయాలంటే, రూపొందించాల్సిన పథకాలూ, కార్యాచరణ ప్రణాళికలు తయారు చేయడానికి ఒక ధార్మిక కౌన్సిల్ ఏర్పాటు చేయడానికి నిర్ణయించి, నా అధ్యక్షతన ఈ ఆలోచనా/పరిశీలన సంఘాన్ని ఏర్పాటు చేశాం. అందులో నాతోపాటు, శ్రీ పొత్తూరి వేంకటేశ్వరరావు, అట్లూరి సుబ్బారావు, శ్రీ రవ్వా శ్రీహరి, కర్ణాటక నుండి శ్రీ పరిగి వసంతకుమారు, తమిళనాడు నుండి శ్రీ వేంకటాచలం తదితరులు... సభ్యులుగా వుండేవారు. తి.తి.దేవస్థానాల, అధ్యక్షులు, కార్యనిర్వాహాధికారులు ప్రత్యేక ఆహ్వానితులు. తి.తి.దేవస్థానాల హిందూ ధర్మ ప్రచార పరిషత్తు సంచాలకులే ఈ కౌన్సిల్‌కు కార్యదర్శి.

ఇలా విషయాలు కూలంకషంగా చర్చించి, కార్యాచరణ ప్రణాళికలు తయారుచేసి, మొదట ఆంధ్రప్రదేశ్‌లో విస్తృతంగా కార్యక్రమాలు చేపట్టడానికి నిర్ణయం చేసి, ప్రతి జిల్లాలో ధర్మప్రచారానికి జిల్లా సమితులను నియమించి, జిల్లాలోని అన్ని ధార్మిక సంస్థలూ ఈ సమితిలో అనుబంధంగా వుండేట్లు నిర్ణయం చేసి, తర్వాత మండలి స్థాయిలో కమిటీలు, గ్రామస్థాయిలో ఎన్నింటికి అవకాశం వుంటే అన్ని భజన మండళ్లు లేదా ఇతర ధార్మిక సంస్థల ఏర్పాటుకు దోహదం చేయడానికి ఒక కార్యాచరణ ప్రణాళిక తయారుచేశాం. ఆ ప్రణాళిక ఎలా పనిచేస్తుందో చూడటానికి విశాఖపట్నం భాగవతుల ట్రస్టీ శ్రీ పరమేశ్వరరావుగారి ద్వారా 100 గ్రామాలలో, పైలట్‌ప్రాజెక్టు నడిపి, భజన మండళ్లు, విద్యార్థినీ విద్యార్థులకు, ధార్మిక కార్యక్రమాలు, మండలస్థాయి, పోటీలు, జిల్లా స్థాయి పోటీలు, రాష్ట్రస్థాయి పోటీలు జరపాలని ప్రతిపాదించాం. ఈ పోటీలలో విజేతలుగా వచ్చిన వారికి, వారి వారి జిల్లాలలోని పెద్ద దేవాలయాల కార్యక్రమాల్లోనూ కొందరికి తిరుమల తిరుపతి దేవస్థానాలు,

అఖండ నామ సంకీర్తన, మెట్లోత్సవాల, బ్రహ్మోత్సవాలలోనూ పాలు పంచుకునే అవకాశం ఇచ్చి గ్రామస్థాయి నుండి రాష్ట్రస్థాయి వరకూ సంబంధ అనుబంధాలు వుండే వ్యవస్థకు నాంది పలికాం. ఈ విషయాలన్నీ కూలంకషంగా మొదటి మఠాధిపతుల, పీఠాధిపతుల, ధార్మిక సంస్థల హిందూ ధర్మ ప్రచార సదస్సులో చర్చించి తీర్మానాలు చేయించాం.

ఈ మొదటి సదస్సులో దాదాపు 60 మంది సభ్యులు పాల్గొనటం జరిగింది. అందులో విశిష్టాద్వైతానికి చెందిన శ్రీశ్రీమన్నారాయణ చినజియ్యరు, అహోబలం మఠాధిపతి, వానమామలై మఠాధిపతులతో సహా 14 మంది జియ్యర్లు, జియ్యంగార్లు, అద్వైతానికి సంబంధించిన కంచి శ్రీజయేంద్ర సరస్వతి, పుష్పగిరి, కొర్తాలం, ఏర్పేడు ఆశ్రయం శుకబ్రహ్మ ఆశ్రమం పీఠాధిపతులతో సహా దాదాపు 18 మంది పీఠాధిపతులు, ద్వైతానికి సంబంధించి, పెజావరు పీఠాధిపతి శ్రీ విశ్వేశతీర్థ స్వామీజీ, పలిమారు, అడమారు, భండారు కరీ, శ్రీమంత్రాలయ రాఘవేంద్రస్వామి పీఠాధిపతులతో సహా దాదాపు 10 మంది పీఠాల ప్రతినిధులుగా హాజరయ్యారు. రావడానికి అనివార్య కారణాల వలన అవకాశం లేని శృంగేరి పీఠాధిపతి, శ్రీ ఉత్తరాదిమఠ పీఠాధిపతులు వారు ప్రత్యేక ప్రతినిధులను పంపారు. వీరుకాక, ధర్మస్థల వీరేంద్రహెగ్గడే, ఆర్ట్ ఆఫ్ లివింగ్- శ్రీ రవిశంకరు స్వామీజీలు ఏర్పేడువ్యాసాశ్రమానికి సంబంధించిన వివిధ ఆశ్రమాల నుండి 8 మంది స్వామీజీలు, రామకృష్ణ మఠం, ISCON వారు, అర్చక పరిషత్తువారు లాంటి చాలా మత సంస్థలు వారి ప్రతినిధులను ఈ సదస్సుకు పంపడం జరిగింది.

ఈ సదస్సు ప్రతి సంవత్సరం నిర్వహించాలనీ, ఈ సదస్సులో తీసుకొనే నిర్ణయాలు అమలు చేయడానికి తి.తి.దేవస్థానాలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలనీ, ఈ సంస్థలు, కార్యకర్తలు జిల్లాస్థాయిలో, మండల స్థాయి, జిల్లా మండళ్లతో పూర్తిగా సహకరించి, వారివారి సిద్ధాంతపర విబేధాలు మరచి, సదస్సులో అందరూ ఆమోదించిన కార్యక్రమాలు, సమష్టిగా అమలు చేయడానికి నిశ్చయించారు. ఈ కార్యక్రమానికి కావల్సిన నిధులు, సంస్థాగత ఏర్పాట్లు, చేయడానికి తి.తి.దేవస్థానాలు సిద్ధమయ్యాయి. ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాలలో మొదటగా కార్యక్రమాలు మొదలు పెట్టడానికి, రెండవ సంవత్సరం కర్ణాటక, తమిళనాడుకు విస్తరించడానికి నిర్ణయం తీసుకోవడం.. తి.తి.దేవస్థానాల వారు, ఒక టీవీ ఛానల్ పెట్టాలనీ, మొదట తెలుగులో క్రమంగా తమిళం, కన్నడం, హిందీ... అటు తర్వాత దేశంలోని అన్ని భాషలలో ప్రసారం

చేయడానికి ఈ సదస్సు తీర్మానాలు చేయడం జరిగింది. ఈ సదస్సు తీర్మానం ఫలితమే శ్రీవేంకటేశ్వరభక్తి ఛానల్. అలాగే జిల్లా మండళ్లు, రాష్ట్ర ధర్మాదాయ దేవాదాయ సంబంధిత ఆలయాలతో సమన్వయ సహకారాలు పూర్తిగా వుండే పరిస్థితి కలిగింది... దానికి ఇంకొక ముఖ్యకారణం రాష్ట్ర దేవాదాయ శాఖ కార్యదర్శి, కమీషనరులు కూడా ప్రత్యేక ఆహ్వానితులుగా ఈ సదస్సులో పాల్గొనటం జరిగింది.

మొదటి ధార్మిక సదస్సు విజయవంతం కావటానికి అప్పటి కార్యనిర్వహణాధికారి ఎ.పి.వి.ఎన్. శర్మగారు, పాలకమండలి అధ్యక్షులు కరుణాకరరెడ్డిగార్ల పట్టుదల, ఈ కార్యక్రమంపై వారికున్న శ్రద్ధ, హిందూ సమాజాన్ని రాజకీయాలకు అతీతంగా సంఘటితం చేయాలన్న దీక్ష కారణాలు... ఈ సదస్సుతో హిందూ సమాజంలో పెద్ద ఉత్తేజం రావడమే కాక, సంఘటితంగా పనిచేయటానికి నాంది పల్కడం జరిగింది.

ఈ సదస్సు సమన్వయకర్తగా, ధార్మిక కౌన్సిలు అధ్యక్షునిగా, తి.తి.దేవస్థానాల సలహాదారుగా నేనే వున్నాను కాబట్టి, ఈ సదస్సు తీర్మానాలు కార్యరూపం చెందేట్లు దేవస్థానాల ద్వారా ఆచరణలోకి తెచ్చే సానుకూలత కలిగింది. జిల్లా కమిటీ నియామకంలో మాకు పూర్తి స్వేచ్ఛ లేకపోయినా, చాలామంది మంచి కార్యకర్తల్ని మేం సూచించినట్లు కమిటీలో నియమించడం జరిగింది. తి.తి.దేవస్థానాల వారు, ఈ జిల్లాల సభ్యులకు ప్రత్యేకంగా శిక్షణకార్యక్రమాలు జరిపి, దేవస్థానాల కార్యక్రమాలు వారి ద్వారానే జిల్లాల్లో జరిగేటట్లు చూసే సానుకూలం చేయడంతో, జిల్లాల్లో గ్రామాలలో కొత్త ఉత్సాహం మొదలయింది.

రెండవ సదస్సు ఈ నేపథ్యంలో జరిగింది. దానికి ఇంకొక 20 మంది కొత్త మఠాధిపతులు, ధార్మిక సంస్థలు హాజరు కావడంతో సమాజం మీద మొదటి సదస్సు ప్రభావం తెలిసివచ్చింది. బ్రహ్మాండంగా రెండవ సదస్సు జరిగింది. ఈ సదస్సులో రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ విభాగం అధికారులు, ప్రభుత్వం అజమాయిషీలకంటే ఒక ధార్మిక వ్యవస్థ యాజమాన్యంలో, సలహాలపై నడవాలనీ, దానికి శాసనపరమైన మార్పులు దేవాదాయ చట్టంలో తేవాలనీ తీర్మానించడంతో, ఆ సదస్సుకు హాజరైన ఐవి సుబ్బారావుగారు (దేవాదాయశాఖ ముఖ్య కార్యదర్శి... అదివరకు తి.తి.దేవస్థానాల కార్యనిర్వహణాధికారి) దేవాదాయ చట్టంలో ఈ మార్పులు జరిగేటట్లు చూశారు. అవేకాక ఆయన ఈ సదస్సు చేసిన ఇంకొక తీర్మానం కూడా అమలుపరుస్తూ ప్రభుత్వం ద్వారా ఆదేశాలు వచ్చేట్లు చేశారు. ఇతర మతాలవారు, పెద్దపెద్ద హిందూ దేవాలయాల ప్రాంతాలలో (తిరుమలలో సహా) వారి మత ప్రచార కార్యక్రమాలు చేపట్టడంతో

ఉద్రిక్తపరిస్థితులకు దారితీస్తున్న దృష్ట్యా– పెద్దపెద్ద దేవాలయాల పరిధిలో అన్యమత ప్రచారం నిషేధిస్తూ ఆదేశాలు ఇవ్వటం జరిగింది.

రెండవ సదస్సు నాటికి అధ్యక్షులు కరుణాకరరెడ్డిగారే అయినా, కార్యనిర్వహణాధికారి శర్మగారు బదిలీ కావడంతో, రమణాచారిగారు బాధ్యతలు స్వీకరించి ఆయన కూడా చాలా ఉత్సాహంతో కార్యక్రమాలు నిర్వహించి హిందూ ధర్మరక్షణకు, ప్రచారానికి కొత్త ఒరవడి కల్పించారు. మండలిస్థాయిలో ధార్మిక కమిటీల నియామకం – భజన కార్యక్రమాలు ముమ్మరం చేయడం... రథయాత్రలు, గోవింద కళ్యాణాలు, దళిత గోవిందం కార్యక్రమాలు, కౌశిక ద్వాదశిరోజున దళితవాడలలో కార్యక్రమాలు, అన్నమాచార్య 600 సంవత్సరాల ఉత్సవాలు, దాససాహిత్య భజనమండళ్లు, కళ్యాణాలు... ఇలా ఎన్నో కార్యక్రమాలను పట్టుదలతో అమలుచేశారు.

మూడో సదస్సు నాటికి దృష్టి దోషమో/రాజకీయ విష దృష్టో ఈ కార్యక్రమాలపై పడినట్లుగా జరిగింది. మూడో ధార్మిక సదస్సుకు కూడా నన్నే సమన్వయ కర్తగా వుండమన్నారు. మా ధార్మిక కౌన్సిల్ ఆధ్వర్యంలోనే మూడవ సదస్సుకు శ్రీకారం చుట్టాం. చాలామంది ఇతర మఠాధిపతులు, సంస్థల నుండి, ఉత్తర భారతం నుండి కూడా ఈ సదస్సులో పాల్గొనటానికి ఆహ్వానం పంపవలసినదిగా అభ్యర్థనలు చాలా వచ్చాయి. స్థలాభావం/చర్చా సానుకూలత దృష్ట్యా 90 మందికి పరిమితం చేసి, నాల్గవ సదస్సు నాటికి, 30/35 మందితో కేంద్ర సదస్సు నిర్వహించేటట్లు, అది కాక ప్రత్యేకంగా ఆంధ్రప్రదేశ్‌కు/కర్ణాటకకు/తమిళనాడుకు వారివారి సభ్యులతో మూడు సదస్సులు విడిగా నిర్వహించేటట్లు, నేను తి.తి.దేవస్థానాలను ఒప్పించడం జరిగింది. కార్యనిర్వహణాధికారి రమణాచారి గారే అయినా, అధ్యక్షునిలో మార్పు!. కరుణాకరరెడ్డి గారి స్థానంలో ఆదికేశవులు నాయుడుగారు వచ్చారు.

మూడవ సదస్సు అదివరకు లాగానే తిరుమల ఆస్థాన మండపంలో జరగాలని, ఏ తేదీల్లో జరగాలో నిర్ణయించాక అందరికీ నేనే ఆహ్వానపత్రాలు పంపడం, చాలామంది నుండి ఆమోదాలు తెలుపుతూ సమాధానాలు రావడం, సదస్సు ఏర్పాట్లన్నీ పూర్తి చేయడం జరిగాయి. ఇంకొక మూడు రోజుల్లో సదస్సు అనగా, నాకు దేవస్థానాల నుండి సదస్సును వాయిదా వేయవలసిందిగా సూచన వచ్చింది. ప్రత్యేకంగా కారణం చెప్పకపోగా, పాలకమండలి అధ్యక్షుల ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. రానున్న రాష్ట్రశాసన సభ ఎన్నికల దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకుంటున్నట్లు మఠాధిపతులకు, పీఠాధిపతులకూ తెల్పి, దేవస్థానాల తరఫున నన్ను సభ్యులందరికీ

తెలుపవలసిందిగా సూచన చేయడంతో, చేసేది లేక ఆఖరిక్షణంలో సదస్సు వాయిదా వేయాల్సి వచ్చింది.

ఎందుకు ఇలా జరిగిందోనన్న విషయంపై అందరిలో కొంత చర్చ జరిగింది. ఎందుకంటే, ఎన్నికలు ఇంకా రెండు నెలలు వుండగా, దానికీ, ఈ ధార్మిక సదస్సుకూ పెద్ద సంబంధం లేదు. ఎందుకంటే రాజకీయాలకు అతీతంగా చేస్తున్న కార్యక్రమం కనుక. కాని, రెండు కారణాలు ప్రచారంలోకి వచ్చాయి. ఒకటి, సదస్సుకు కొద్దిరోజుల పూర్వం, యోగ గురువు రాందేవ్ స్వామీజీ తిరుపతి వచ్చిన సందర్భంగా, పత్రికా విలేఖరుల ఇష్టాగోష్ఠిలో, తి.తి.దేవస్థానాల పాలకమండలిలో సారా కాంట్రాక్టర్లను వేయకూడదనీ, ముఖ్యంగా అధ్యక్షుడుగా అటువంటి వ్యక్తిని వేయడం సమంజసం కాదని వ్యాఖ్యానించడం పెద్ద సంచలన వార్త అయింది. అదీకాక తి.తి.దేవస్థానాల అధ్యక్ష పదవి, రాజకీయ పునరావాస కేంద్రం కాకూడదని కూడా అనటంతో, ఈ రెండు విషయాలు సూటిగా శ్రీ నాయుడిగారిని ఉద్దేశిస్తూ మాట్లాడారని భావించి, ఆదికేశవులు నాయుడుగారు, రాందేవ్ బాబాను విమర్శిస్తూ, పెద్ద పత్రికా సదస్సు పెట్టి మరీ ఖండించడంతో... ఈ విషయం దేశస్థాయిలో చర్చనీయాంశం అయింది. ఇలాంటి సమయంలో ఎందర్నో మఠాధిపతులు, పీఠాధిపతులను మనమే పిలిచి, వారిని పత్రికల వారు మళ్లీ కెలికి తిట్టించుకోవడం ఎందుకు అని అధ్యక్షులు నాయుడుగారు సదస్సు వాయిదా వేయించారన్నది ఒక ప్రచారం. రెండవది- నాయుడుగారికి సదస్సు చేయాల్సిన రోజే, పుట్టపర్తిలో పెద్దసభ జరిపే బాధ్యత వుంది కనుక ఈ సభ వాయిదా వెయ్యమన్నారన్నది ఇంకొక కారణం. రెండూ ప్రచారంలోకి వచ్చాయి. నాయుడుగారు మాత్రం నాతో "ఎన్నికల ముందు ఎందుకు చేయడం, తర్వాత చేద్దాం" అన్నారు. అలా మొదటి వాయిదా.

ఎన్నికల తర్వాత మళ్లీ తి.తి.దేవస్థానం వారితో ఈ సదస్సు పెట్టే ప్రసక్తి తెచ్చాను. అప్పటికి రమణాచారిగారు బదిలీ కాగా, ఐ.వై.ఆర్. కృష్ణారావుగారు కార్యనిర్వహణాధికారిగా బాధ్యతలు స్వీకరించారు. ఆయన కూడా చాలా ఉత్సాహంతో సదస్సు నిర్వహించడానికి సన్నద్ధమై నన్ను అందరికీ ఆహ్వానం పంపమన్నారు. అది వరకు అనుభవం దృష్ట్యా, ఆయనను, అధ్యక్షుల వారితో, రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రిగారితో రాష్ట్ర ముఖ్యమంత్రితో కూడా సంప్రదించి వారి అనుమతితో సదస్సు ఏర్పాటు చేస్తే బాగుంటుందన్నాను. ఎందుకంటే, క్రితంసారి చాలామంది మఠాధిపతులు సదస్సుకు బయలుదేరి దారిలో వుండగా సదస్సు వాయిదా పడటంతో, వారిని చిన్నచూపు చూశామన్న భావన వారిలో ఉంది. "ఈసారి ఎటువంటి పరిస్థితులలోనూ

వాయిదా వేయకూడదు. అందుకు ఈ విషయం వారందరి ఆమోదంతో చేయడం అందరికీ శ్రేయస్కరం" అనడంతో, కృష్ణారావుగారు మంత్రిగారినీ, ముఖ్యమంత్రి రోశయ్యగారినీ సంప్రదించి, వారి ఆమోదంతోనే ఒక తేదీ ఖరారు చేసి నాకు తెల్పడం, అందరికీ నేను ఆహ్వానాలు పంపడం జరిగింది. ఈ లోపల అధ్యక్షులు నాయుడుగారి పదవీకాలం పూర్తి కావడంతో ఒక సాధికారిక కమిటీ పాలక మండలిగా పనిచేయడం మొదలుపెట్టింది.

ఈ మూడవ సదస్సులో చర్చకు నేను పెట్టిన ముఖ్యాంశం -దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులు, ఆలయ పాలకమండళ్లు, ఇతర సిబ్బంది అందరికీ ధర్మప్రచారం ప్రధాన బాధ్యతగా చేయాలని... వీరందరూ భక్తులు ఇచ్చిన ఆలయ నిధుల నుండి వారి జీతభత్యాలు తీసుకొంటున్నప్పుడు- వారు ప్రభుత్వ అధికారులు కారు. ధర్మరక్షణ వారి ముఖ్య కర్తవ్యం. ఆలయాలు ధర్మప్రచారం సక్రమంగా చేసి, ఆయా ప్రాంతాల హిందువులకు ఆధ్యాత్మిక తృప్తిని కలిగిస్తే, మత మార్పిడులు ఎందుకుంటాయి? హిందూమతం నుండి మార్పిడులు జరుగుతుంటే దానికి ఎవరు బాధ్యులు? గ్రామంలో వుండే ఆలయ పాలకులు, అధికారులు తమ తమ ఆలయ పరిధిలోని హిందువుల సంరక్షణ బాధ్యత వహించి, మార్పిడులు జరుగుతుంటే, వాటిని అరికట్టే ప్రయత్నం వారు చేయాలి. వారికి కావల్సిన సహాయ సహకారాలు దేవాదాయ శాఖ, తిరుమల తిరుపతి దేవస్థానం, ధార్మిక సదస్సు... దాని సభ్యులు అందరూ చేయాలి. ఆలయనిధులలో సింహభాగం ధర్మప్రచారానికి, మతమార్పిడులు అరికట్టడానికి వాడాలి. ఆలయంలో ప్రతి అధికారి/అనధికారి బాధ్యతగా దీనిని గుర్తించి, ధర్మరక్షణకార్యకర్తలుగా వ్యవహరించాలన్న సారాంశంతో మూడవ సదస్సుకు ఆహ్వానాలు పంపాను. చాలా ఉత్సాహంతో మఠాధిపతులు, ఇతర సభ్యులు ఆమోదించి పెద్దసంఖ్యలో వస్తున్నామని వర్తమానాలు పంపారు.

కాని... షరా మామూలే.

సదస్సు ఇంకొక పదిరోజులు ఉందనగా, మళ్లీ కార్యనిర్వహణాధికారి కృష్ణారావుగారు సదస్సును వాయిదా వేయమని పైనుండి ఆదేశాలు వచ్చాయని తెలపడంతో, కారణం అడిగాను. తనకు తెలియదని సమాధానం! "మనం దేవాదాయ శాఖామంత్రిగారిని, ముఖ్యమంత్రిని సంప్రదించే కదా ఆహ్వానాలు పంపాం? వారిని అడగండి" అని ఆయనకు సూచించాను. మంత్రిగారు - ముఖ్యమంత్రితో చర్చించారట. పైనుండి ఆదేశాలు వచ్చాయి, సదస్సును వాయిదా వేయించమని చెప్పారట. మా

ధార్మిక కౌన్సిల్ సభ్యుడు పొత్తూరి గారిని ముఖ్యమంత్రి రోశయ్య గారితో మాట్లాడటానికి పంపాను. ముఖ్యమంత్రి నిస్సహాయంగా "పైనుండి ఆదేశాలు వచ్చాయి" అన్నారట.

ఎవరి ఆదేశాలు?
ఎందుకు ఇచ్చారు?

ఎవరికీ తెలియదు. ఈ దేశంలో హిందూ సమాజ దౌర్భాగ్య పరిస్థితి ఎలా వుంది అంటే తిరుమల తిరుపతి దేవస్థానాల వంటి మత పరమైన సంస్థ తమ మత పరిరక్షణకు ధార్మిక సదస్సు కూడా జరుపుకోలేని స్థితి! ఇది దేవస్థానాల బాధ్యత అన్న విషయం కూడా మరచి... ఇటువంటి ధార్మిక విషయాల్లో కూడా ప్రభుత్వం జోక్యం చేసుకోవడం ఎంతవరకూ సమంజసం? మతమార్పిడులు జరుగుతున్నాయంటే జరగవా మరి?

★ ★ ★

92. శరణాగతి-ముగింపు

తిరుమల చరితామృతం చదివిన వారికి కొన్ని సందర్భాలలో కొన్ని సంఘటనలు చదివినప్పుడు, మనస్సులో కొన్ని ప్రశ్నలు ఉదయించవచ్చు. కొందరికి వచ్చాయి కూడా.

ఎంత నిజమైనా, శ్రీనివాసుని ఆలయం, ఆదాయం, వాటిని కొందరు దోచేసిన సందర్భాలు అంత వివరంగా వ్రాయాలా? భక్తుల మనోభావాలు దెబ్బ తినవా? తన సొమ్ము తాము కాపాడుకోలేని అసమర్థుడా భగవంతుడు? అలా దోచేసిన వారిని ఆపలేకపోయాడా? లేదా వారిని శిక్షించలేడా? అటువంటి భగవంతుణ్ణి నమ్ముతున్నామా? ఆయనపై భారం వేస్తున్నామా? ఆయన సొమ్మునే రక్షించుకోలేని శ్రీనివాసుడు మనకేం చేయగలడు? ...ఇలా కొన్ని ప్రశ్నలు- కొందరికన్నా కలిగే అవకాశం వుంది.

అలానే తిరుమలలోని పరిస్థితుల గురించి చర్చించినప్పుడు, భగవంతుని సన్నిధిలో, భగవంతుని సేవకులుగా నియమింపబడినవారే భ్రష్టాచారానికి పాల్పడుతున్నారు. హుండీలోని వస్తువుల పరకామణి జరుగుతున్నప్పుడు కొంతకాలం క్రింద నోట్లోనో, మర్మావయవంలోనో బంగారం చొప్పించి పట్టుపడిన వాళ్లున్నారు కదా? ఈ మధ్య దేవస్థానం అధికారులే 300 రూపాయిల టిక్కెట్లు ఎక్కువ ఖరీదుకు అమ్మినట్లు చదివాం! పాస్‌లు ఇచ్చే ప్రక్రియలో, ఆలయ ప్రసాదాలకు సరకులు కొనే విషయంలో, ఇతర అభివృద్ధి పనులు నిర్వహించేటప్పుడు కూడా లంచాలు తీసుకుంటున్నారని కొన్ని సందర్భాలలో విన్నాం. వారికి భగవంతుడు ఆ అవకాశం ఎందుకు ఇచ్చాడు? అలాంటి వారిని అక్కడ ఎందుకు నియమించాడు?

ఉద్యోగులు సరే- మరి పాలకవర్గం? భక్తిలేనివారినో, లేదా రాజకీయ కారణాలతో ఈ ఆధ్యాత్మిక విషయాలలో అంత నమ్మకం లేనివారినో పాలకమండలిలో

నియమించడం ఏమిటి, కొన్ని సందర్భాలలో వారిలో కొందరు దర్శనం పాస్‌లు, టిక్కెట్లు నల్లబజారులో అమ్ముకోవడం ఏమిటి, అనర్హులు, భ్రష్టాచారులైన కొందరు ఉద్యోగుల విషయంలో వారు వత్తాసు తీసుకోవడం ఏమిటి? సంభారాల కొనుగోళ్లలో, కొన్ని కాంట్రాక్టులతో కొందరు దేవుని సొమ్ము అన్న భీతి లేకుండా కక్కుర్తి పడటం ఏమిటి- అలాంటి వారు చాలామంది పట్టుబడకుండా పోవడం ఏమిటి...లాంటి ఆలోచనలు భక్తులకు కలుగుతుంటాయి.

ఎంతో శ్రమపడి, మొక్కులు మొక్కి, ముడుపులు కట్టి కొండకి వస్తే, సామాన్యభక్తునికి మహా లఘుదర్శనం చేసి, దానిని కూడా మందలో తోసినట్లు క్షణం కూడా దర్శనం చేయనీయకుండా జయవిజయుల ముందునుంచే తోసేసి పంపడం ఏమిటి? బంగారువాకిలి దగ్గర మణిమండపం (ఘంటామండపం) లోకి రాకముందే క్యూలైన్ బాగా కుక్కేసి, అటూఇటూ ఆడ/మగ (వాలంటీర్లు) స్లాట్లను పెట్టి, అన్ని వైపుల నుండి తోస్తూ, పెద్దాచిన్నా, ఆడామగా తేడా లేకుండా ఆ తొయ్యడాలేమిటి? ఇదంతా ఆ భగవంతుని ముందు జరుగుతుంటే ఆ భగవంతుడు చూస్తున్నాడా? లేక కర్పూరనామం కళ్లు కప్పేస్తే, చూడనట్లు ఉండిపోతున్నాడా? మరి ఈ అధికారులను ఎందుకు మందలించడు? అక్కడ సాక్షాత్తూ భగవంతుడే నిల్చొని ఉన్నాడన్న నమ్మకంతో భక్తులు వెళ్తుంటే ఆయనెలా ఊరుకుంటున్నాడు?

అవన్నీసరే- దొంగతనం చేసో, దోపిడి చేసో, లంచాలు తీసుకునో, సమాజాన్ని మోసం చేసో నల్లధనం సంపాదించి, అన్యాయపు సొమ్మును తన కర్మఫలంలో భాగం ఇచ్చినట్లు భగవంతుని హుండీలో వేస్తుంటే ఆయనెలా సహిస్తున్నాడు? అటువంటి నికృష్టపు డబ్బుతో కిరీటాలు, ఆభరణాలు చేయిస్తే, అవి ఆయనెలా ధరిస్తున్నాడు?

ఆలయంలో భక్తులకు కొందరు అధికారులు, అర్చకులు చెయ్యి చాచడం ఏమిటి? ధనికులను ఇండ్లకు పిలిపించుకొని స్వామివారి గంధం, కర్పూరం, ప్రసాదాలిచ్చి బహుమానాలు, అర్చకులూ కొందరు పెద్ద అధికారులు తీసుకోవడం ఏమిటి? వైకుంఠంలో జరగాల్సిన పనులేనా... మరి తిరుమలను కలియుగ వైకుంఠం అంటారే!

అక్కడ దేవుడున్నాడా? వుంటే ఇలా ఎందుకు జరుగుతుంది. కృష్ణదేవరాయలు, ఇతర మహాభక్తులు ఇచ్చిన ఆభరణాలు శతాబ్దాల క్రితమే మాయమవడమేమిటి? ఆర్కాటు నవాబు, ఈస్టిండియా కంపెనీవారు హుండీని కొల్లగొట్టి భక్తులిచ్చిన కానుకలన్నీ తీసేసుకుంటుంటే, ఆ వడ్డీ కాసులవాడు ఏం చేస్తున్నాడు? ఎంతోమంది

భక్తులు, మొక్కుకొని వేయాల్సింది హుండీలో వేయకుండా వుంటే, వడ్డీతో సహా ముక్కు పిండి వసూలు చేసిన ఎన్నో సంఘటనలు భక్తులకు జరగ్గా విన్నాం కదా!

హిందూ దేవాలయాల్ని నాశనం చేస్తున్నప్పుడు ముసల్మానులను ఎందుకు నిగ్రహించలేదు? అమ్మవారి ఆలయం తిరుచానూరులో, తన అన్న గోవిందరాజుల ఆలయం తిరుపతిలో విగ్రహాలతో సహా నాశనం చేసిన దుర్మార్గులను ఎందుకు శిక్షించలేదు? తిరుపతి గోవిందరాజుల గుడిలో పార్థసారథి సన్నిధిలో గోడ వెనుక రుక్మిణీసత్యభామాసమేతంగా వందల సంవత్సరాలు ఎందుకు దాక్కున్నాడు? చేతకాకనా? ...ఇలా ఎక్కడలేని అనుమానానికి తావిచ్చే ప్రశ్నలు... సమాధానాలు లేవా?

★ ★ ★

ఈ ప్రశ్నలకు సమాధానాలు కావాలన్నా, భగవంతుని లీలలు అర్థం చేసుకోవాలన్నా, కొంత శాస్త్రజ్ఞానం కావాలి. శాస్త్రసూక్ష్మం తెలియకపోతే భగవంతుని విపరీతంగా అసమర్థుడనో, భక్తసులభుడు కాడనో, భక్తులకంటే అన్యాయం చేసేవాళ్లనే ఆదరించేవాడనో, లేదా కలికాలంలో ఆయన ప్రభావం సన్నగిల్లుతోందనో భావించి అంధతమస్సుకు వెళ్లే ప్రమాదం వుంది.

కనుక ఈ విషయాల్లో శాస్త్రం ఏం చెబుతోంది? పైన చెప్పినట్లు జీవులెందుకు ప్రవర్తిస్తారు? వారిని ఉపేక్ష చేస్తున్నాడన్న భావాన్ని భగవంతుడు ఎందుకు కలగజేస్తున్నాడు? భగవంతుని పాలనలో న్యాయం ధర్మం లేవా? ...అన్న ప్రశ్నలు ఈనాటివి కావు. యుగయుగాలుగా వస్తున్నవే? ఎన్నో సందర్భాలు రామాయణ, భారత, భాగవత పురాణాల్లో చూస్తాం. ఉపనిషత్తులు, వేదాల మాట సరేసరి... కాని అవి సామాన్యునికి అందుబాటులో లేవు కదా!

మానవుల సంగతెందుకు? దేవతల విషయంలో కూడా ఒక జన్మలో వారి ప్రవర్తన, ఇంకొక జన్మలో వారి ప్రవర్తనకు పోలిక లేకపోవడం చూస్తాం. దేవతల ఉపమానం ఎందుకు ఇస్తున్నామంటే రామాయణ/భారత భాగవతాల్లో అదే దేవతలు భగవంతుని విషయంలోనూ భక్తి ద్వేషాలు వ్యక్తం చేయడంలోనూ విభిన్నతను చూపిస్తారు. వారే మళ్లీ జన్మలెత్తారని దృఢంగా తెలుస్తుందనడంలో మనం అర్థం చేసుకోవడానికి అవకాశం ఎక్కువ. ఇది దైత్యుల విషయంలో కూడా అలాగే వున్నా, ఇప్పుడు ఆ ప్రసక్తి చేయడం లేదు.

లక్ష్మణుడుగా రామాయణంలో జన్మనెత్తిన శేషుని విషయమే తీసుకుందాం. లక్ష్మణుడుగా, భగవంతుడైన శ్రీరామునికి, మహాలక్ష్మి సీతాదేవికి చేసిన సేవ అనితర సాధ్యంగా వుందనిపిస్తుంది. ఆ జన్మలో ఎంత పుణ్యం సంపాదించాడు? మరి భారతంలో ఈయనే భగవంతుని అన్న బలరాముడుగా పుట్టి, క్రితంజన్మలో చేసిన పుణ్యం ఎంత నాశనం చేసుకున్నాడో? భగవంతునికి నమస్కారం చేసి లక్ష్మణుడుగా సంపాదించిన పుణ్యం భగవంతునిచే నమస్కారం చేయించుకొని నాశనం చేసుకొన్నాడు. భగవంతునితో (కృష్ణునితో) ఎన్నో సందర్భాలలో జగడమాడి, ద్వేషం చూపి, సంవత్సరాలకొద్దీ మాట్లాడక, (దుర్యోధనుని పట్ల) శిష్యవాత్సల్యంతో ఎంత పాపం చేశాడో, ఎంత పుణ్యం పోగొట్టుకొన్నాడో! ఇలా ఎందుకు జరిగిందంటే శాస్త్రం చెప్పే సమాధానం ప్రతి జీవికీ ఒక నిర్దిష్టమైన యోగ్యత వుంటుంది. పుణ్యం సంపాదించినా, పాపం సంపాదించినా, ఒక జన్మలో యోగ్యతను సంపాదిస్తే, ఇంకో జన్మలో (జన్మలలో) హెచ్చుతగ్గులు సరిపెట్టుకోవాలి. అదే జరిగింది శేషుని విషయంలో. వాలి సుగ్రీవులుగా తర్వాత కర్ణుడు, అర్జునులుగా వారివారి ప్రవర్తనను పరిశీలిస్తే తెలుస్తుంది.

పరమశివుని విషయం కూడా అంతే. అంతటి విష్ణుభక్తుడైన శివుడు అశ్వత్థామగా భారతంలో అలా ఎందుకు ప్రవర్తించాడు? దుర్యోధనుడిచ్చిన పాలు తాగడం/ పూర్వజన్మలలో చేసిన అపరాధాల వలన దుర్యోధనునితో స్నేహం, తొడలు విరిగిపడి వున్న నేస్తం దుర్యోధనుని కోరిక మేర అతని వంశం అభివృద్ధి చేయడానికి బ్రహ్మచారి అయినా నియోగపద్ధతిలో దుర్యోధనుని భార్యతో సాంగత్యానికి ఒప్పుకొంటున్నట్లు మాట ఇచ్చాడు కదా? దుర్యోధనునికి ఇచ్చిన మాట ప్రకారం 'పాపం' అని తలచకుండా అధర్మంగా, అన్యాయంగా, నిద్రలోవున్న ఉపపాండవుల తలలు నరికి చంపాడు కదా! పాండవనిర్వంశం చేయడానికి ఉత్తరగర్భంపై బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగిస్తాడు కదా! ఇటు వంటి ప్రవర్తన శివుని నుండి ఊహించలేం కదా!

అలాగే బృహస్పతి అవతారమైన ద్రోణుని విషయంలో... మహావిష్ణు భక్తులైన భీష్ముడు, కృపాచార్యులు అన్యాయమని తెలిసినా దుర్యోధనుని తరఫున యుద్ధం చేయడం ఏమిటి - పుణ్యం పోగొట్టుకోవడానికో, లేక పాపం సంపాదించడానికో తప్పితే. బ్రహ్మ వాయువులు, వారి పత్నులు తప్ప మిగతా జీవులందరికీ క్షణికమైన అసురావేశంతోనో, లేదా అజ్ఞానం వలననో ఇలా ప్రవర్తించే అవకాశం ఉందని శాస్త్రం చెబుతుంది. వీటన్నిటినీ అవకాశం దొరికితే వివరంగా ఇంకో శీర్షికలో చర్చిద్దాం. ఎవరి పాప పుణ్యాలు, వారివి... ఆ కర్మఫలం ఆధారంగానే ప్రవర్తనలు

మారుతుంటాయన్నది అర్థం చేసుకుంటే చాలు. అంతటి వారి విషయమే అలావుంటే మనమెంత? మన సాధన ఎంత?

సామూహికంగా పూజలు చేసి, భజనలు చేసి, యాత్రలు చేసినా, అందరికీ ఒకేలాగా పుణ్యం, పాపం రావు అన్నది శాస్త్రం. ఎంత భక్తితో చేశావు, ఎంతటి జ్ఞానంతో చేశావు, ఎంత అనుసంధానంతో చేశావన్నదాన్ని బట్టి, పుణ్యం. అలానే పాపకర్మ విషయంలో కూడా. ప్రజాస్వామ్యయుగం వచ్చాక, అందరూ సమానమనీ, జీవులందరూ మోక్షయోగ్యులనీ, అందరూ భగవత్స్వరూపులనీ, భగవంతునికీ జీవునికీ తేడా లేదనీ, ఏకమని చెబుతుంటారు. శాస్త్రం త్రివిధ జీవుల గురించి నిష్కర్షగా చెబుతుంది. సాత్త్విక,రాజస, తామస జీవులు- స్వభావసిద్ధంగా ఆ జీవులు ఆ కోవకు చెందినవారే.

ఈ విషయంలో సందేహాలు రావడానికి ఇంకొక కారణం ఈ జీవులనందరినీ భగవంతుడే సృష్టించాడని వాదించే వారున్నారు. అలా భగవంతుడే సృష్టిస్తే కొందరిని సాత్త్వికులుగానూ, కొందరిని రాజసులుగానూ, తామసులుగాను ఎందుకు సృష్టిస్తాడు? అందరినీ సమానంగా సృష్టించాలి కదా? లేకపోతే ఆయనకు పక్షపాత బుద్ధి అన్న నైర్గుణ్యవైషమ్య దోషాలున్నట్లు అవుతుంది కదా. భగవంతుడు ఈ జీవులను సృష్టించలేదని కృష్ణుడుగా ఆయనే గీతలో అర్జునుడికి చెప్పారు కదా, 'నీవు నేనూ అనాదిగా వున్నాం' అని.

...అలా భగవంతుడూ జీవుడూ అనాదిగా వున్నారు. భగవంతునికి పూర్వజన్మ జ్ఞానం వుంది. జీవులకు లేదు. దీనితో స్పష్టం అయ్యే ఇంకొక అంశం - భగవంతుడూ, జీవుడూ ఒక్కడు కాదని, వేరువేరని. అలాగే జీవుల విషయంలో కూడా. సాత్త్విక జీవులు, రాజసజీవులు, తామసజీవులు వేరు వేరు. ఆ విభాగమే కాదు, ఒక జీవికీ, ఇంకొక జీవికీ భేదం వుందని కూడా శాస్త్రం చెబుతుంది. అందుకే రకరకాల మోక్షాలు, లోకాలు, స్వర్గాలూ, నరకాలు...

అంటే ఎవరి సాధనను బట్టి వారికి మోక్షమో, నరకమో/తిరిగి తిరిగి పుట్టి అనుభవించడమో! అందరూ సమానమై, అందరికీ ఒకే రకమైన మోక్షమయితే, సాధన చేయడం ఎందుకూ? వేదాలలో చెప్పిన విధినిషేధాలూ పాటించడం ఎందుకూ? సారూప్య, సామీప్య, సాలోక్యాది మోక్షాలెందుకూ? అంధతమస్సు లాంటి తిరిగి రాలేని నరకాలెందుకూ...? ఇవన్నీ జీవులకే కాని జడానికి, కాదు. కనుక జీవులకు, జడానికి

తేడా వుందని, ఒక జడానికి ఇంకొక జడానికి భేదముందని జ్ఞానం రావాలి. అంటే జీవికి, జీవికి భేదం, జీవికి, జడానికి భేదం- జడానికి, జడానికి భేదం - జీవికి, భగవంతునికీ భేదం - జడానికి, భగవంతునికీ భేదం... జీవి భగవంతుడు కాదు. కాని జీవిలో భగవంతుడుంటాడు. జడం భగవంతుడు కాదు - జడంలో భగవంతుడుంటాడు అన్న జ్ఞానం శాస్త్రం ద్వారా తెలుసుకోవాలి.

అలాగే శాస్త్రం వివిధ జీవులలో తారతమ్యం చెబుతోంది. బ్రహ్మదేవుని వాయుదేవుల, గరుడ, శేష, రుద్రుల ఇంద్రాది దేవతల సాధన మనం చేయగలమా? మనలో కూడా అందరి భక్తి సమానం కాదు. అందరి సాధనా సమానం కాదు. మన స్వరూప యోగ్యతను బట్టి మన సాధన, మన సాధన బట్టే మనం పొందే మోక్షమో, నరకమో... యోగ్యతలు వేరు కనుక, మోక్ష నరకాలలో కూడా మన సాధనను బట్టి సుఖదుఃఖాలు... అంటే మోక్షంలో పొందే సుఖంలోను, దైత్యులు, తామసులు నరకాల్లో పొందే దుఃఖంలోనూ వారివారి యోగ్యతానుసారం హెచ్చుతగ్గుల తారతమ్యం వుందని శాస్త్రం చెబుతుంది.

భగవంతుడు నిరాకారుడూ, నిర్గుణుడూ అనేవారు కొందరు. వాళ్లే మళ్లీ ఆయననే కరుణించమని, అనుగ్రహించమని వేడుకొంటారు. అనంతకళ్యాణ గుణపరిపూర్ణుడు అంటారు. సర్వేశ్వరుడు, సర్వాధారుడు, సర్వస్వతంత్రుడు... ఇలా భగవంతుని గురించి ఎన్నో విశేషణాలు చెప్తారు. అవన్నీ గుణాలు కావా? మరి భగవంతుడు నిర్గుణుడు అని ఎందుకంటారు? ఆయనలో దుర్గుణాలు లేవు. అంతకంటే ముఖ్యంగా జీవులను సంసారబంధంలో కట్టిపడేసే సత్త్వ, రజస్, తమో గుణాలు భగవంతునికి వర్తించవు. మనలాగా ఆయన వాటికి బద్ధుడు కాదు. అందుకే ఆయనను నిర్గుణుడు అనేది. అంతేకాని ఆయనకు గుణాలే లేవని కాదు. ఆ సద్గుణాలన్నీ ఆయనలో లేకపోతే ఆయనను కొలిచేవారెవరు?

మరి భగవంతుడు నిరాకారుడా? అయితే మనం ఆరాధించే భగవద్రూపాల విషయమేమిటి? ఆయన సర్వాంతర్యామి. అన్ని రూపాలూ ఆయనవే. అన్ని నామాలూ ఆయనవే. కనుక ఈ ఇదమిత్థమైన రూపమొక్కటే ఆయనది అని చెప్పటానికి వీలుకాదు. అన్ని రూపాలూ ఆయనవే కనుక ఒక రకంగా నిరాకారుడు.

నేనే భగవంతుడిని అనడానికి, నాలో భగవంతుడున్నాడనటానికి చాలా వ్యత్యాసం వుంది. జీవులకూ భగవంతునికీ చైతన్యం ఒకటిగా వున్నట్లనిపించినా, ఎంతో భేదం

ఉంది. అందరిలో వున్న చైతన్యాన్ని దృష్టిలో వుంచుకుని, 'అందరూ భగవద్రూపాలే, నేనే పరబ్రహ్మ'ను అనే తత్త్వం బహుళప్రచారంలో వుంది. అజ్ఞానినైన నాకూ, భగవంతునికీ సామ్యం ఎలా? నేనే భగవంతుడినైతే, నాకు అజ్ఞానం ఎందుకు వచ్చింది? భగవంతుని ఆరాధించడం అంటే నన్ను నేను ఆరాధించడం కాదా? మరి మోక్షంలో జీవి భగవంతుడవుతాడు (భగవంతునిలో ఐక్యం అవుతాడు) అని కొందరు నమ్మే తత్త్వం వుందికదా! అంటే మోక్షంలో అందరూ సమానమని వారి అర్థం. మరి ఎవరి యోగ్యత/సాధన బట్టి వారికి వేరు వేరు మోక్షప్రాప్తి అని శాస్త్రం చెబుతోంది. కొందరికి, సాలోక్యం, ఇంకొందరికి సారూప్యం, మరికొందరికి సామీప్యం... ఇలా కొందరు తామసులకు అంధతమస్సు. అంటే మోక్షంలో కూడా యోగ్యతానుసారం తారతమ్యం ఒప్పుకోవాలి. అటువంటప్పుడు భగవంతునిలో ఐక్యం ఎలా?

శాస్త్రం-మోక్షం గురించి చెప్పేదేమిటి...? జన్మరాహిత్యమే మోక్షం. జన్మలెందుకు వస్తాయి? కర్మఫలం అనుభవించి క్షయం కావడానికి... అంటే కర్మఫలం వున్నంతవరకూ జన్మరాహిత్యం కాదు. శాస్త్రం "జీవి మానవజన్మ ఎత్తినప్పుడు 14 సంవత్సరాల తర్వాత, ప్రతిరోజూ పది జన్మలెత్తినా క్షయం చేయలేనంత కర్మఫలాన్ని సంపాదిస్తాడు" అని చెప్తుంది. ఈ సంపాదన మానవజన్మలోనే.. మిగతా అన్నిరకాల జన్మలూ - పశు, పక్షి, క్రిమి, కీటకాది 84 లక్షల యోనులూ కర్మఫలం అనుభవించి క్షయం చేయడానికే...

మానవ దేహం సాధన పరికరం... కర్మఫలం సంపాదించడం, క్షయం చేయడం రెండూ జరుగుతాయి ఈ జన్మలో. కాని క్షయం చేసే దానికన్నా సంపాదించే కర్మఫలం చాలా ఎక్కువ. రోజుకు పది జన్మలెత్తినా ఖర్చుపెట్టలేనంత అన్నది మనలాంటి వారికి కాదు- నిష్ఠాగరిష్ఠులై, విధినిషేధాలు పాటించి, నిరంతరం భగవద్ధ్యానంలో వుండే వారి విషయం. మనలాంటివారు ప్రతిరోజూ వందల, వేల జన్మలెత్తినా క్షయం చేయలేనంత కర్మఫలం సంపాదించి మూటలు కట్టి ముందుముందు అనుభవించడానికి జన్మలెత్తాలి.

మరి జీవికి పూర్తిగా కర్మనాశం ఎప్పుడు? మోక్షమెప్పుడు? అంటే తన ప్రయత్నంతో జీవి పూర్తిగా కర్మనాశం చేయలేడు. క్షయం చేయడానికి కొంతకర్మఫలంతో జన్మనెత్తి అది క్షయం చేసేలోపల, ఎన్నోరెట్లు కర్మఫలం సంపాదించి మూటలు కడతాడు. భగవదనుగ్రహంతోనే అది సాధ్యం అని చెప్తుంది శాస్త్రం. భగవంతుని అర్చించి,

నిరంతరం దాసోహ భావంతో, చేసిన కర్మఫలం భగవంతునికి 'శ్రీకృష్ణార్పణమస్తు' అని సర్వ సమర్పణ బుద్ధితో (సత్కర్మలు మాత్రమే- చెడుపనులు చేసి కృష్ణార్పణం చేయరాదు) సమర్పిస్తూ, శాస్త్రంలో చెప్పిన విధి నిషేధాలు పాటిస్తూ, భగవదనుగ్రహం సంపాదించడానికి సాధన చేయాలి. మన సాధనతో ప్రసన్నుడైన భగవంతుడు, ఏదోనాడు కరుణించి మనకు బింబ పరోక్షదర్శనం ఇస్తాడు. ఆయన కరుణాదృష్టి పడి అనాదిగా మనం సంపాదించిన 'సంచిత' కర్మఫలం మూటలు అగ్నిలో పడిన దూది మూటల లాగా దగ్ధమవుతాయి. అంతేకాదు, ముందు మనం చేయబోయే కర్మఫలం మనకు అంటకుండా 'ఆగామి' కర్మగ్రంథులు కూడా భస్మమవుతాయి. మిగిలింది 'ప్రారబ్ధం'. దీన్ని మాత్రం జీవి అనుభవించాల్సిందే.. పాతవి పోయాయి, కొత్తవిరావు... వున్న ప్రారబ్ధం కొన్ని జన్మలలో అనుభవించి జన్మరాహిత్యం పొంది, మోక్షప్రాప్తి కలుగుతుంది అని శాస్త్రం. జీవి చేసే కర్మకూ, భగవంతునికీ ఏమి సంబంధం? మంత్రాలయ శ్రీరాఘవేంద్రస్వామి తన ప్రాతఃసంకల్ప గద్యంలో భగవంతుని గురించి ఈ విశేషణాలతో చెప్తారు... 'సర్వకర్మకర్త్రా, సర్వకర్మకారయిత్రా, సర్వకర్మ స్వామినా, సర్వకర్మ సమర్పకేణ, సర్వకర్మఫలభోక్త్రా, సర్వకర్మభోజయిత్రా, సర్వకర్మ ప్రేరకేణ, సర్వకర్మోత్బోధకేన, సర్వకర్మశుద్ధిప్రదేన, సర్వకర్మ సిద్ధిప్రదేన, సర్వకర్మ నిష్ఠేన, సర్వకర్మసాక్షిణా..."

మనం పూర్వజన్మలలో సంపాదించిన కర్మఫలాన్ని బట్టి భగవంతుడు మనలోవుండి తత్త్వాభిమాన దేవతల ద్వారా, ముఖ్యంగా వాయుదేవుని ద్వారా మనచే కర్మలు చేయిస్తాడు.

ఇదంతా చెప్పడానికి కారణం... ఎవరు ఏ కర్మ చేసినా, పుణ్యమైనా, పాపమైనా, మనం అదివరకు చేసి సంపాదించిన కర్మఫలమే... ఎంతో పుణ్యం సంపాదిస్తే శ్రీనివాసుని దర్శనం... ఇంకెంతో పుణ్యం చేస్తేనే ఆయనకు సేవ చేసే భాగ్యం... ఆయనతో సంబంధంవున్న అందరూ, పాలకమండలి సభ్యులు కాని, ఇతర అధికారులు కాని, కొండమీద వాసం చేసే అదృష్టమున్న ప్రతివారూ జ్ఞప్తిలో వుంచుకోవల్సినది... ఎన్నో జన్మల పుణ్యఫలం వలన మనకు ఈ భాగ్యం కలిగింది. దానిని సద్వినియోగం చేసుకొంటున్నామా లేదా? పుణ్యం ఖర్చుపెట్టి, పాపం సంపాదిస్తున్నామా? మన కర్మఫలాన్ని బట్టి మనం ఇప్పుడు తప్పులు చేస్తున్నామని సర్దుకుపోవడానికి శాస్త్రం ఒప్పుకోదు. మానవునికి విచక్షణజ్ఞానం భగవంతుడిచ్చాడు. తప్పు చెయ్యకుండా వుండడానికి మనవంతు ప్రయత్నం చేయాలి. ఇతరచోట్ల పాపకర్మ చేసిన ఫలంకంటే

పుణ్యక్షేత్రంలో చేసిన పాపకర్మఫలం చాలా రెట్లు ఎక్కువ. పుణ్యం విషయంలోనూ అంతే...

శ్రీనివాసుడు అఖిలాండ బ్రహ్మాండనాయకుడు. 14 భువనాలకు స్వామి. బ్రహ్మాండంలో మనం నివసించే భూమి ఒక చిన్న భాగం. అందులో నివసించే జీవులందరికీ ప్రభువు ఆయనే. ఏ దేశంలోవారైనా, ఏ మతంవారైనా, ఏ కులంవారైనా ఈ భగవంతుని అధీనులే... వారి వారి కర్మఫలాన్ని బట్టి ఆయా ప్రదేశాలలో, ఆయా సంప్రదాయాల్లో పుట్టివారి సాధన చేస్తున్నారు. హిందువులైనా, ఆంగ్లేయులైనా, క్రైస్తవులైనా, మహమ్మదీయులైనా... ఎవరుదేవుని సొమ్ము తిన్నా తగ్గ ఫలం అనుభవించాల్సిందే. వారి పుణ్యం క్షయం చేయడానికో లేదా అసురులైన మ్లేచ్ఛులకు వారి పాపం పండించి అంధ తమస్సుకు పంపడానికో భగవంతుడు చేసే లీల ఇది. ఇది 'కలి' కాలం... భగవంతుడే 'కలి'కి ఈ కాలంలో తన ప్రభావం పెంచి అసుర శక్తులు పెరగడానికి అవకాశం ఇచ్చాడు. ముందు ముందు రోజుల్లో కలి ప్రభావం ఇంకా ఎక్కువగా వుంటుంది. ఎందుకంటే మనమిప్పుడు కలియుగం ప్రథమపాదంలోనే కదా ఉంది!

కలికాలంలో మాత్రమే ఇటువంటి ఘటనలు జరుగుతాయి, అంతకుముందు యుగాల్లో జరగలేదనుకోవడానికి లేదు. సాత్త్వికశక్తులకూ అసురశక్తులకూ నిరంతరం నడిచే ఘర్షణ ఇది. దేవద్రోహం అసురశక్తుల ప్రవృత్తి... సాక్షాత్తూ భగవంతుని భార్య భూదేవిని అపహరించిన హిరణ్యాక్షుని గురించి విన్నాం. భగవంతుడుని నమ్మి భక్తి చేసిన కొడుకునే చంపే ప్రయత్నం చేసిన హిరణ్యకశ్యపుని చూశాం. భగవంతుడైన రాముని భార్యను అపహరించిన రావణుని కథ తెలుసు... భగవంతుని యందు ద్వేషం, మాత్సర్యం చూపిన శిశుపాలుని, దుర్యోధనుని, జరాసంధుని చూశాం. ఇలా ఎన్నో సందర్భాలలో భగవంతుణ్ణి నిస్సహాయుడుగానో, లేదా చేతకానివానిలాగానో అర్థం చేసుకునే ప్రమాదం వుంది. అసురులే ఎందుకు? భగవద్భక్తులు కూడా ఈ అసురుల ఆవేశంతో ప్రవర్తిస్తుంటారు. భగవంతుని వక్షఃస్థలంపై కాలితో తన్నిన భృగుబుషిని చూశాం కదా! ఇలాంటివి ఎన్నైనా చెప్పవచ్చు. చివరికి ఏమైందో ముఖ్యం. అది భగవంతుని చేతకాని తనమూ కాదు, శక్తిలోపమూ కాదు.

ఆయన సర్వశక్తిమంతుడు, సర్వజ్ఞుడు. వీరందరి చేతా వారివారి కర్మఫలానుసారం ఆయా కర్మలు చేయించేది ఆయనే. ఇవన్నీ అసురమోహనార్థం భగవంతుడు చేసే లీలలు-భగవంతుడిని చేతకాని వాడని, అసమర్థుడని, తన డబ్బే తాను

కాపాడుకోలేనివాడని, తన సంస్థానంలోనే అన్యాయాలు, అక్రమాలు జరుగుతున్నా అరికట్టలేనివాడని...తామసులు, అసురులు భావించి వారి సాధన చేసి అంధతమస్సుకు వెళ్లటానికే ఇవన్నీ జరుగుతున్నప్పుడు చూసి బాధ పడటం సాత్త్వికుల లక్షణం. ఆయా కాలాల్లో అటువంటి వ్యథకు లోనుకావడం వారి ప్రారబ్ధం...

అలా శాస్త్రం కొంచెం అర్థం చేసుకొని భగవంతుని లీలలను శాస్త్ర సమన్వయం చేసుకొని, ఎందుకు జరగుతోందో, తెలుసుకొని భగవంతుని లీలలుగా గుర్తించకపోతే, భగవంతుని విపరీతంగా అర్థం చేసుకొన్నట్లే- అంధతమస్సు అనే నరకానికి వెళ్లటానికి సిద్ధమవుతున్నట్లే. తస్మాత్ జాగ్రత్త!

తిరుమలలో ఈనాటి పరిస్థితులు కూడా శాస్త్ర జ్ఞానంతో అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తే పెద్ద ఇబ్బందులుండవు. అలా అని, వ్యక్తిగత లోపాలనూ, వ్యవస్థాగత లోపాలను ఎత్తి చూపకూడదని కాదు.. ఏ భక్తునికి ఇబ్బంది కల్గినా, అన్యాయం జరిగినా, అది వారి ప్రారబ్ధమని సర్దిచెప్పి సమర్థించుకోవాలని నా ఉద్దేశం కాదు. ఆ భక్తుని ప్రారబ్ధం వల్ల జరిగినా, చేసిన వాడికి, వాడిపై వారికి భక్తునికి ఇబ్బంది కల్గించిన దాని ఫలితం రాకపోదు. దూర్వాసుడంతటివాడికే భక్తుడైన అంబరీషుని పట్ల ద్రోహం తలపెడితే ఏం జరిగిందో చూశాం కదా! దేవస్థానం పాలకవర్గం, అధికారులూ, సిబ్బంది, వారి విధులు, భక్తుల సేవగా చేయాలి, చేసేట్లు వ్యవస్థను సరిదిద్దాలి. భక్తులు కూడా, దేవస్థానం వారి ఇబ్బందులు తెలుసుకోవాలి. రోజు 40 లేదా 45 వేల మందికైతే లోపలి దాకా అంటే, కులశేఖరపడి దాగా తీసుకువెళ్లి, కొంత ఇబ్బందితో దర్శనం చేయించవచ్చు. అదే 70వేలో, 80 వేలో వస్తే... లఘుదర్శనంతో తృప్తి పడాల్సిందే. లేదా రోజుకి 40 వేలకు మించి కొండకు వచ్చే ప్రసక్తిలేకుండా (ముందుగా ఏర్పాట్లు చేసి), కొండకు దర్శనానికి అనుమతి వున్నవాళ్లనే పంపి, వచ్చినవారందరికీ, తృప్తిగా దర్శనం చేయించవచ్చు. ఈ నిర్ణయాలు కష్టమైనా, ఇవాళ కాకపోయినా రేపైనా తీసుకోవల్సిందే.

లేదా అందరినీ జయవిజయుల గుమ్మం బయటనుండి పంపకుండా లోపలికి తీసుకువెళ్లి లోపలనుండే బయటకు వచ్చే ఏర్పాటు చేయడానికి అవకాశాల కోసం వెంటనే ప్రయత్నం చేయాలి... లోపల ఇంకో రెండు ద్వారాలు తెరవడానికి ఆగమసమ్మతమా కాదా అన్నది యోచించే ప్రక్రియ మొదలుపెట్టాలి. విఐపిలను బ్రేకుదర్శనంలో లోపలకు పంపుతున్నారు, సామాన్యయాత్రికులను బయటినుండే చూపించి పంపుతున్నారన్న వాదానికి పైప్రయత్నంతో సమాధానం పొందవచ్చు.

పండితులూ, సలహాదారులు ఒక్కోసారి ఒక్కోమాట ఆగమం పేరుతో చెప్తున్నారన్న ఆరోపణలున్నందున వెయ్యికాళ్ల మండపానికి సంబంధించిన వివాద సమయంలో చేసినట్లు, ఆగమ సదస్సులో ఈ విషయం కూడా చర్చించి, నిజంగా ఆగమం ఏం చెబుతోందో నిర్ధారించి నిర్ణయాలు తీసుకోవాలి.

ఇక విఐపి దర్శనాల విషయం - ఆలయం దృష్టిలో విఐపిలు అసలుండాలా? అందరూ దేవుని ముందు సమానులే కదా! కొందరికి ప్రత్యేకం ఎందుకు అని భావిస్తే అలా నిర్ణయం చేసే ధైర్యం చేయాలి. కాని అది చాలా ప్రమాదకరమైన వాదం... ఎంతవరకూ వెళ్తుందో తెలియదు. శాస్త్రం, సంప్రదాయం, ఆలయ అవసరాలు, మర్యాదలూ కాపాడాలి కదా! మఠాధిపతులకు, పీఠాధిపతులకు, ప్రోటోకాలువారికి, ప్రత్యేకం ఎందుకు? వారేమైనా విఐపిలా? ధర్మప్రచారానికి ఆలయ పథకాలకు భూరి విరాళాలు ఇచ్చిన వారు విఐపిలు కారా? మరి దేవుని ముందు డబ్బు ఇచ్చినవాడికీ, పేదవాడికి సమానం కదా! అంతటితో ఆగుతుందా? శాత్తుమొరలో వైష్ణవులను ముందు దర్శనానికి ఎందుకు పంపాలి? అర్చకులూ, జియ్యంగార్లు ఏకాంగులే గర్భగృహంలోకి ఎందుకు పోవాలి? వారి ప్రత్యేకత ఏమిటి? దేవుని ముందు అందరూ సమానమే కదా! ఇలా చర్చలు, వాదాలు సాగిసాగి, చివరికి అది ఆలయం, దేవాలయం కాకుండా ఇంకేమో అయ్యే ప్రమాదం ఉంది.

దేవుణ్ని దశాబ్దాలుగా అర్చించి, ప్రత్యక్షంగా ముట్టుకొని సేవ చేసే భాగ్యం గల అర్చకుల పుణ్యం ముందు, మన పుణ్యం ఎంతో ఆలోచించాలి. అలాంటి అవకాశం భగవంతుడు వాళ్లకెందుకిచ్చాడో శాస్త్రం తెలుసుకొని అర్థం చేసుకోవాలి. ప్రధాన అర్చకుడు డా॥ రమణదీక్షితులుకి దాదాపు ముప్పై ఏళ్లకు పైగా స్వామివారిని తాకే, సేవ చేసే భాగ్యం వుంది. మిరాశీలు పోయినా, ఇతర మిరాశీ అర్చకులు స్వామివారి కొలువు వదలి వెళ్లినా, జీతం ఇస్తారో, ఇవ్వరో కూడా తెలియని పరిస్థితులలో కూడా స్వామివారి కొలువును వదలక చేశాడాయన. అలానే స్వామివారి సన్నిధిలో పనిచేసే శేషాద్రి విషయంలో. అది వారు చేసుకొన్న పుణ్యం. నాకు ఆ అవకాశం లేదని నేనేడిస్తే నా అవివేకం. అజ్ఞానం. శాస్త్రజ్ఞానం లేకపోవడమే.

అధికారుల విషయానికొస్తే, ఎవరి పుణ్యం వారిది... అన్నారావుగారికున్న పుణ్యం ఆయనకు అవకాశాలిచ్చింది... నేచేసిన పుణ్యం మేరకు నాకు అవకాశం... అలానే ఎవరి విషయంలోనైనా... మాత్సర్యాలకు తావులేదు. మన పుణ్యం పెంచుకోవడమే మనం చేయాల్సింది. ఎంత పుణ్యం చేయకపోతే దేవస్థానం ఉద్యోగులకు ఎన్నో

దశాబ్దాలు భగవంతుని సేవాభాగ్యం లభిస్తోంది! జీవితంలో వారితో సమానంగా మనకూ దర్శనాలు కావాలంటే, పుణ్యం సంపాదించి అలాంటి భాగ్యం సంపాదించాలి.

దర్శనం విషయానికొస్తే – ప్రత్యేక దర్శనం, విఐపి దర్శనం, చాలా ధనం వెచ్చించి సేవాటిక్కెట్లు కొని దర్శనం చేసిన వారికి ఎక్కువ భగవదనుగ్రహం, దూరం నుండి చూసినవాడికి పేదవాడికి, లేదా బయటి నుండే, ఇబ్బందులు పడలేక నమస్కారం పెట్టిపోయిన వాడికీ భగవదనుగ్రహం తక్కువ అన్నది శాస్త్రసమ్మతం కాదు. 'తిరుమల లీలామృతం'లో తొండమానుడు, కుమ్మరి భీముల కథ చెప్పుకొన్నాం కదా... కొండకేరాక, ఇంట్లోనే మట్టిపూలతో పూజ చేస్తున్న కుమ్మరిభీమునిపై, బంగారుపూలతో కొండపైన స్వయంగా పూజ చేసిన తొండమానుని కంటే ఎక్కువ అనుగ్రహం చూపాడు భగవంతుడు శ్రీనివాసుడు.

అధికారంతోనో, విఐపిగానో డబ్బు పెట్టి వెళ్లి దగ్గరగా దర్శనం చేసుకొన్నవాడు తను సంపాదించిన పుణ్యం ఎక్కువ ఖర్చు చేస్తున్నాడేకాని, దానితో కొత్త పుణ్యం ఎక్కువ సంపాదిస్తున్నాడా అన్నది ఆలోచించాల్సిన విషయమే! భగవదనుగ్రహం కోసం కొండకు వెళ్తాం. మనం చేసుకొనే దర్శనంతోనే భగవదనుగ్రహం కల్గుతుందన్నది సామాన్య భావన. కాని అసలు దర్శనభాగ్యం– భగవంతుని కరుణాదృష్టి మనపైన పడటం జరగాలి కదా! ఆ కొండంతా సాలగ్రామమే, భగవంతుని సన్నిధానమే. ఎందరో భక్తులకు పురాణ కాలం నుండి కొండమీద అనేక ప్రదేశాల్లో దర్శనభాగ్యం కలగచేశాడన్నది చూశాం. ఈ తిరుమల యాత్రలో భగవంతుని యందు ఎంత భక్తిచేశాం అన్నది ముఖ్యం...

ఎంత దగ్గరగా చూశాం? ఎంత ఖర్చుపెట్టి చూశాం? ఎన్ని సేవలు చేశాం? ఇవన్నీ మన పరిమిత పరిజ్ఞానంతో తృప్తిపడడానికి పనికొచ్చే విషయాలు. తిరుమల యాత్రచేస్తామని సంకల్పం చేస్తే కూడా పుణ్యమే అన్న పురాణ వాక్యం మరవరాదు. శ్రద్ధాభక్తులతో స్వామి పుష్కరిణిలో స్నానంచేసి స్వామివారి మహిమలు, పురాణాల నుంచి చదివో లేక 'తిరుమల లీలామృతం' పారాయణ చేసో, స్వామివారి ధ్యాసలోనే గడిపి, సాయంత్రం సహస్ర దీపాలంకార సేవలు, స్వామివారి ఉయ్యాల వైభవం చూసి, స్వామితో నాలుగు మాడవీథులలో తిరువీథి ఉత్సవంలో పాల్గొని, ఈ మధ్యకాలంలో మొదలుపెట్టిన పుష్కరిణి హారతి (సరస్వతీహారతి) దర్శించితే.. నా ఉద్దేశ్యంలో...వారినీ వీరినీ ఆశ్రయించి, విఐపిగా దర్శనానికి వెళ్లివచ్చిన వారికంటే ఎక్కువ భగవదనుగ్రహం కలుగుతుంది. భక్తి చేయడం మన వంతు.. అనుగ్రహించడం భగవంతుని వంతు.

ఏప్రిల్ నెల (2013) లో 'స్వాతి' సంపాదకులు బలరాంగారు చెప్పిన మాట– "అనుకోకుండా పాలకమండలి అధ్యక్షులు బాపిరాజుగారు నుండి గురువారం టెలిఫోను వచ్చింది. 'రేపు అభిషేకంలో వస్త్రసేవ చేసే అవకాశం వుంది. వచ్చేయండి' అని. స్వామి పిలుపుగా భావించి వెళ్లి అభిషేకదర్శనం, వస్త్ర సమర్పణ చేసుకొచ్చానండి"

తాను తన 'స్వాతి' వారపత్రికలో 'తిరుమల లీలామృతం', 'తిరుమల చరితామృతం' ప్రచురించే సేవ చేస్తున్నందుకే స్వామివారి నుండి అనుకోకుండా పిలుపు వచ్చిందేమో! అలా ఈ స్వామి చరితామృతం ప్రచురించడం ద్వారా ఆయన ఎంత పుణ్యం సంపాదించారో? లక్షల మందికి చదివి తెలుసుకొనే అవకాశం కల్పించడమే స్వామివారికి ఎనలేని సేవ చేసిన పుణ్యం. ఈ చరిత్ర కొత్తగా నేను రాసినదేమీ లేదు. 'స్వాతి' ఆధ్యాత్మిక పత్రిక కాకపోయినా, అదివరకెన్నడూ ఏ శీర్షికా ఇంతకాలం ప్రచురించిన దాఖలా లేకపోయినా, రెండు సంవత్సరాలు (108 వారాలు) ఈ శీర్షిక నడపడం, బలరాంగారు ఏజన్మలో చేసిన పుణ్యమో!

★ ★ ★

తిరుమల తిరుపతి దేవస్థానాల కార్యనిర్వహణాధికారిగా నేను చవిచూసిన వింత అనుభవాల సమాహారం 'సర్వసంభవామ్' (నాహంకర్తా) ను, ఐఏఎస్ అధికారిగా వివిధ దశలలో నేను చూసిన రాజకీయ – పరిపాలన విశేషాల పుస్తకం 'అసలేం జరిగిందంటే'ను, పురాణాలలో శ్రీనివాసుని గాథల కూర్పు 'తిరుమల లీలామృతం'ను, ఈ యుగంలో తిరుమల ఆలయ చరిత్ర కథనాలు కూర్పు– 'తిరుమల చరితామృతం'ను తనదైన శైలిలో మెరుగులు దిద్ది, పఠనాసక్తి పెంచేలా చేసిన ఆత్మీయుడు, 'ఆంధ్రప్రదేశ్' పత్రిక సంపాదకుడు గుండు వల్లీశ్వర్‌కి ప్రత్యేక ధన్యవాదాలు.

★ ★ ★

ఈ 'తిరుమల చరితామృతం' భక్తులకు అందజేసే భాగ్యం భగవంతుడు నాకు కల్పించాడు. నేను చరిత్రకారుడిని కాదు. సొంతంగా రాసిన విషయాలు తక్కువ. ఇతరుల గ్రంథాల నుండి, శిలాశాసనాల నుండి, తిరుమల తిరుపతి దేవస్థానాల కార్యనిర్వహణాధికారిగా నాలుగు సంవత్సరాలు, అటు తర్వాత పాతికేళ్లకు పదవీ విరమణ చేశాక, త్రిసభ్య కమిటీ (వెయ్యికాళ్ల మండపం) అధ్యక్షునిగా ఆరు నెలలు దేవస్థానాల సలహాదారుగా ఆరు సంవత్సరాలు, ధార్మిక కౌన్సిలు అధ్యక్షుడుగా మూడు సంవత్సరాలు, రెండు ధార్మిక సదస్సుల సమన్వయకర్తగా, ఎందరో మఠాధిపతుల,

పీఠాధిపతుల నుండి, ఆలయ అధికారుల నుండి, అర్చకుల నుండి, ఆచార్య పురుషుల నుండి, ఆగమ సలహాదారులనుండి, పండితుల నుండి నేను తెలుసుకొన్న విషయాలు సామాన్య భక్తులకు అందుబాటులోకి తేవటానికి చేసిన ప్రయత్నం ఇది. ఇందులో తప్పులు నావి. విషయమంతా చరిత్రకారులది. అనుగ్రహం చేయడం మా గురువుల ద్వారా భగవంతునిది.

నాహం కర్తా హరిః కర్తా
తద్పూజా కర్మ చాఖిలమ్
తథాపి మత్కృతా పూజా
త్వత్ప్రసాదేన నా అన్యథా!

'శ్రీకృష్ణార్పణమస్తు'

ఇట్లు
శ్రీ శ్రీనివాసదాసుడు
ప్రసాద్

ఇలాంటి రచన ఇదొక్కటే...

కలియుగంలో తిరుమల ఉనికి ప్రపంచానికి తెలిసిన నాటి నుంచి ఈనాటి వరకూ ఈ ఆలయ సంస్కృతి, సంప్రదాయాలు, పరిపాలన, రాజకీయాల ప్రభావం, భక్తుల అవసరాలు వగైరా విభిన్న కోణాలలో తిరుమల ఆలయ చరిత్రని మన కళ్లముందు ఆవిష్కరింపజేసే ఏకైక రచన 'తిరుమల చరితామృతం'.

రచయిత శ్రీ పి.వి.ఆర్.కె. ప్రసాద్ ఒక ఐఏఎస్ అధికారిగా భువనగిరి సబ్‌కలెక్టర్ స్థాయి నుండి ప్రధానమంత్రికి మీడియా సలహాదారు స్థాయి వరకూ - ఖమ్మం జిల్లా కలెక్టర్, ముఖ్యమంత్రి కార్యదర్శి, టిటిడి ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, ఎక్సైజ్ కమీషనర్, విశాఖ పోర్టు ఛైర్మన్, ఉన్నత విద్యాశాఖ కమీషనర్, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి హోదాలో ఎంసిఆర్ మానవ వనరుల అభివృద్ధి సంస్థ డైరక్టర్ జనరల్ వంటి అనేక కీలక పదవులలో తనదంటూ ఒక ప్రత్యేక ముద్ర వేసిన వ్యక్తి.

అయితే, తిరుమల-తిరుపతి దేవస్థానాలతో శ్రీ ప్రసాద్‌కి గల అనుబంధం మాత్రం సుదీర్ఘమైంది. 1978-82 కాలంలో తిరుమల-తిరుపతి దేవస్థానాల ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా ఆయన సాధించిన అసాధారణ అభివృద్ధి ఇప్పటికీ తిరుమలలో ప్రతి చోటా ఏదో ఒక రూపంలో కనిపిస్తూనే ఉంటుంది. ఆయన శ్రీకారం చుట్టిన నిత్యాన్నదాన పథకం, అన్నమాచార్య ప్రాజెక్టు, దాస సాహిత్యప్రాజెక్టు, పుష్పయాగం వంటి అనేక కార్యక్రమాల పరిమళాలను తిరుమలేశుడి భక్తులు ఎప్పటికీ ఆస్వాదిస్తూనే ఉంటారు.

బహుశా ఆ కారణం వల్ల కావచ్చు- 2005లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆయన్ని తిరుమల-తిరుపతి దేవస్థానాల సలహాదారుగా నియమించింది. ఆరేళ్లపాటు ఆయన ఆ బాధ్యత నిర్వహించినా, ఇంచుమించు అదే కాలంలో - వెయ్యికాళ్ల మండపం వివాదం మీద ప్రభుత్వం ఏర్పాటుచేసిన కమిటీకి ఛైర్మన్‌గా, టిటిడిలోని ధార్మిక కౌన్సిల్ ఛైర్మన్‌గా, తిరుమల నగల వివాదం ఏర్పడినప్పుడు ఏర్పాటైన వాధ్వా కమిటీకి సమన్వయకర్తగా, 'నాదనీరాజం' కమిటీకి ఛైర్మన్‌గా...

...ఇలా వివిధ సందర్భాలలో విభిన్న కమిటీల ద్వారా తిరుమల ఆలయానికి సంబంధించిన అనేక అంశాలను క్షుణ్ణంగా అధ్యయనం చేసే అవకాశం శ్రీ ప్రసాద్‌కి లభించింది. ఈ అవకాశమే ఆయన 'తిరుమల చరితామృతం' రచించేందుకు దారి తీసింది.

ఎమెస్కో బుక్స్

రూ. 400/-

EBM075

ISBN 978-93-90091-30-0

9 789390 091300